మాసపత్రిక

శ్రీ రామకృష్ణ ప్రభ -2015

సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి.కనుక తమవంతుగా భక్తి,జ్ఞాన ప్రచారార్ధం **శ్రీ రామ కృష్ణ మఠ్** వారు వెబ్ సైట్ ద్వారా ఉచితంగా విలువైన గ్రంధాలను ఆన్ లైన్ ద్వారా eBOOK(PDF) రూపంలో అందిస్తున్నారు. వారు చేస్తున్న జ్ఞాన యజ్ఞానికి సాయి రామ్ కూడా తమవంతుగా సహాయం చేసే కార్యక్రమంలో భాగంగా వారి గ్రంధాలను సాయి రామ్ ద్వారా కూడా అందచేస్తున్నాము, ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం చేసిన ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in), మైక్రోసాఫ్ట్ సైట్ (http://www.microsoft.com) వారికి కూడా మేము ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇంట్లో ఆధ్యాత్మిక గ్రంధాలయం ఉండాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) **శ్రీ రామ కృష్ణ మఠ్** వారి వెబ్ సైట్: http://rkmath.org
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము.

గమనిక: భక్తి,జ్ఞాన ప్రచారార్ధం **ఉచితంగా eBook** రూపంలో **శ్రీ రామ కృష్ణ మఠ్** వెబ్ సైట్ వారు అందించటం జరిగింది. ఈ గ్రంధముపై వ్యాపార,ముద్రణ హక్కులు వారికి గలవు,కనుక వారిని సంప్రదించగలరు.

SaiRealAttitudeManagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయి నాథ పాద సమర్పణమస్తు *

శ్రీ రామ కృష్ణ మఠ్ వారి వెబ్ సైట్:

http://rkmath.org



అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఓజసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

జనవరి 2015

వెల: ₹10



సుబోధ

భక్తుడు: మనస్సులో వ్యథనొందుతూ సంసారాన్ని త్యజించడమా? లేక సంసారంలోనే ఉంటూ భగవచ్చింతన చేయడమా? ఏది సరైనది?

శ్రీరామకృష్ణులు: మనస్సులో వ్యథనొందుతూ సంసారాన్ని త్యజించేవారు హీనశ్రేణికి చెందినవారు. సంసారంలో ఉంటూనే నిష్కామంగా కర్మలు చేయాలి.

భక్తుడు: నా మనస్సు ఒక్కోసారి ఉన్నత స్థితిలో ఉంటుంది. మళ్ళీ అంతలోనే అది దిగజారి పోతుందెందుకని?

శ్రీరామకృష్ణులు: సంసారంలో ఉన్నప్పుడు అలాగే అవుతుంది. గృహస్థుని మనస్సు ఒక్కోసారి ఉన్నత స్థితిలో ఉంటుంది. మళ్ళీ నిమ్నస్థాయికి దిగిపోతుంది. అతడు ఒక్కోసారి అత్యంత భక్తిని కలిగి ఉంటాడు. మరోసారి, ఆ భక్తి తగ్గుముఖం పడుతుంది. అతడు కామినీ కాంచనాల నడుమ నివసించవలసి ఉంటుంది కదా! అందుకే అలా అవుతుంది. గృహస్థు ఒక్కోసారి భగవచ్చింతన చేస్తాడు. భగవన్నామాన్ని ఉచ్చరిస్తాడు. మళ్ళీ, ఒక్కోసారి మనస్సును కామినీ కాంచనాలపై లగ్నం చేస్తాడు. ఈగలాగ అన్నమాట. ఈగ ఒక్కసారి మిఠాయి మీద వాలుతుంది. మరోసారి కుళ్ళిన పండు మీద వాలుతుంది.

నిజమైన త్యాగికి భగవంతుడు తప్ప అన్యమైనదేదీ రుచించదు. లౌకిక సంభాషణలు జరిగే చోటు నుండి అతడు లేచి వెళ్ళిపోతాడు. అతడు కేవలం భగవత్ప్రసంగాలు మాత్రమే వింటాడు. తేనెటీగలు కేవలం పువ్వుల మీదనే వాలుతాయి, మకరందాన్ని గ్రోలుతాయి. వాటికి వేరేదీ రుచించదు.

లౌకిక ప్రసంగాలను వదిలిపెట్టు. భగవత్ప్రసంగాలు తప్ప అన్యవిషయాలు ఏవీ మాట్లాడవద్దు. భగవంతుడొక్కడే సత్యం. తక్కినదంతా మూన్నాళ్ళ ముచ్చటే! ఈ సంసార జంజాటాల మధ్య ఉంటే భగవచ్చింతన వీలుపడదు. కొంతకాలం ఏకాంతవాసం అవసరం. ❖

శ్రీరామకృష్ణ ప్రభ
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాదు-500 029
ఫోన్: 040-27667799, సెల్: 8801849494
E-mail : sriramakrishnaprabha@gmail.com

నిర్వాహక సంపాదకులు: స్వామి జ్ఞానదానంద   సంపాదకులు: స్వామి పరిజ్ఞేయానంద

సురభి

సురేంద్రసేన్ అనే యువకుడు స్వామి వివేకానందుని ప్రబోధాలకు ఆకర్షితుడై ఆయన వెంటే ఉంటూ ఉండేవాడు. అతడు తనకు మంత్రదీక్ష ఇవ్వమని స్వామీజీని కోరాడు. అప్పుడు స్వామీజీ, 'శ్రీరామకృష్ణులు నేను నీకు గురువును కాననీ, నాకన్నా శక్తిమంతులు సరైన సమయంలో నీకు దీక్ష ఇవ్వగలరనీ తెలిపారు' అని చెప్పారు. ఆ యువకుడు స్వామీజీని మించిన శక్తిమంతులు ఇంకెవరు ఉండగలరని భావించాడు.

ఆ తరువాత కొద్ది రోజులకే అతనికి స్వప్నంలో ఒక దేవత ప్రత్యక్షమై మంత్రం ఉపదేశించినట్లు తోచింది. స్వామీజీకి ఆ స్వప్నం గురించి చెప్పాడు. ఆయన అది నిజమేననీ, ఆ మంత్రాన్ని అనుష్ఠిస్తూ ఉంటే సర్వం సిద్ధించగలదనీ తెలిపారు. అయితే ఆ యువకునికి స్వామీజీ మాటల పట్ల విశ్వాసం కలగలేదు. అందుకని, ఆయననే తనకు ఉపదేశం చెయ్యవలసినదని పదే పదే అడగసాగాడు.

అంతట స్వామీజీ ఇలా అన్నారు : "ఆ మంత్రాన్నే జపిస్తూ ఉండు. కొద్దికాలంలోనే ఆ మంత్రం ఉపదేశించిన దేవత భౌతిక రూపాన్ని కూడా చూడగలవు. ఆమె బగళాదేవి అవతారం. ఈసారి సరస్వతీదేవి రూపంలో ఏతెంచింది. బాహ్యానికి పరమ ప్రశాంతంగా కనిపించే ఆమెను ఆంతర్యానికి వెడితే నీవు చూసి తట్టుకోలేవు".

అయితే ఆ యువకుడి మనసుకు ఇవేవీ పట్టలేదు. అందుచే ఆ మంత్రాన్ని విస్మరించాడు. తరువాత కొద్దికాలానికే అతనికి జయరామ్‌బాటీ వెళ్ళే అవకాశం లభించింది. అతను అక్కడికి వెళ్ళి, మాతృదేవిని కలిశాడు. అప్పుడు అమ్మ అతనితో 'నీకు ఏమి కావాలన్నా సంకోచించక, నిర్భయంగా అడుగు! నీ కోరిక తీరగలదు' అని అన్నారు.

అంతట ఆ యువకుడు, 'నాకు ఏది మంచి అయితే దానినే ప్రదానం చెయ్యమని' అడిగాడు. శారదామాత మర్నాడు ఉదయం రమ్మనమని చెప్పారు. ఆ మరునాటి ఉదయమే వెళ్ళిన అతనికి అమ్మ ఓ మంత్రం ఉపదేశించారు. ఆ మంత్రాన్ని విన్న తక్షణం అతనికి తన స్వప్నం గుర్తుకు వచ్చి, ఆ దేవత మరెవరో కాదు, ఈ తల్లే అనే సంగతి అర్థమైంది. అంతేకాక స్వామీజీ తనతో అమ్మను కలలోనే కాక భౌతికంగా కూడా చూడగలవని చెప్పిన సంగతి కూడా గుర్తుకు వచ్చింది. ❖

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

సంపుటం: 72 సంచిక: 1 జనవరి 2015

యం జజ్ఞౌ కేవలం సమ్యక్ శ్రీదక్షిణేశ్వరేశ్వరః ।
విచార్యతే కిమస్మాభిస్తస్య గౌరవలాఘవే ॥
తతోऽద్య వాదసందేహౌ త్యక్త్వా జన్మతిథౌ ప్రభోః ।
భజ శివం నరేంద్రం తం తథా కృతార్థతాం వ్రజ ॥

ఎవరినైతే సాక్షాత్తూ దక్షిణేశ్వరేశ్వరుడైన భగవాన్ శ్రీరామకృష్ణులు శ్లాఘించారో, అలాంటి మహనీయుని మాహాత్మ్యాన్నీ, సూక్ష్మత్వాన్నీ చర్చించడానికి మనమెంతటివారం! అందువల్ల వాదాలను, సందేహాలను విడిచిపెట్టి శివావతారుడైన నరేంద్రుణ్ణి ఆయన జన్మతిథినాడు ఆరాధించి కృతార్థులమవుదాం. *('శ్రీ వివేకానంద రహస్య దశకం' నుండి)*

సూక్తి సౌరభం

అన్యస్మాత్ లబ్ధపదః ప్రాయో
నీచోపి దుఃసహో భవతి ।
రవిరపి న దహతి తా దృక్
యాదృక్ దహతి వాలుకా నికరః ॥

"అల్పుడు ఎవర్నో పట్టుకొని పదవి సంపాదిస్తాడు. ఇక అతడికి పట్టపగ్గాలుండవు. సూర్యకాంతిని భరించవచ్చు. కానీ ఆ సూర్యకాంతి వల్ల వేడెక్కిన ఇసుకపై కాలు పెట్టడం కూడా కష్టమే"

ధాత్రి జనుల కెల్ల తగ నెరిగించెద
నొనర హరు నెరంగు నుపము యొకటి
మనసు చెదర నీక మహిమతో జూచుటే!
విశ్వదాభిరామ వినుర వేమ!

"ఓ వేమా! భువిజనులందరూ తరించేందుకు సులభమైన ఒక ఉపాయాన్ని తెలియ పరుస్తున్నాను. ఎవరి మనస్సు స్థిరంగా, నిర్మలంగా ఉంటుందో వారు తప్పక భగవంతుణ్ణి కనుగొనగలరు."



శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి



ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'కి ధన దానం చేసి ప్రోత్సహించాల్సిందిగా కోరుతున్నాం. దాతల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు......	రూ.	10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజ పోషకులు............	రూ.	5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు.................	రూ.	1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

దాత పేరు ఊరు	రూ.
రాజ పోషకులు : శ్రీ జె.వి. రమణారావు, విజినిగిరి, విజయనగరం జిల్లా (యోగాచార్య కీ॥శే॥ రాపర్తి రామారావుగారి జ్ఞాపకార్థం)	5,006
రాజ పోషకులు : శ్రీ ఎస్.వి. ప్రసాద్, ఐ.ఎ.ఎస్ (రిటైర్డ్), బంజారా హిల్స్, హైదరాబాద్	5,000
పోషకులు : శ్రీమతి టి. విజయలక్ష్మి, పెనుగొండ, ప.గో.జిల్లా (భర్త కీ॥శే॥ టి. రాజేశ్వరరెడ్డి గారి జ్ఞాపకార్థం)	3,000
పోషకులు : శ్రీ పోల వీరేశలింగం, జగదీష్‌నగర్ కాలనీ, సికింద్రాబాదు (భార్య కీ॥శే॥ పోల రాజమణెమ్మ గారి జ్ఞాపకార్థం)	2,100
పోషకులు : శ్రీమతి పి. మహాలక్ష్మి, ఎస్.వి.కాలనీ, సరూర్ నగర్, హైదరాబాద్ (భర్త కీ॥శే॥ పి. ప్రభాకరరావుగారి జ్ఞాపకార్థం)	2,000
పోషకులు : శ్రీ పాశం దినేష్ నిశ్చల్, కె.ఆర్.ఎమ్. కాలనీ, విశాఖపట్నం (కీ॥శే॥ పాశం సంతోష్ నిశ్చల్‌గారి జ్ఞాపకార్థం)	1,116
పోషకులు : శ్రీమతి సత్తి లక్ష్మీకాంతం, అనపర్తి, తూర్పు గోదావరి జిల్లా	1,116
పోషకులు : శ్రీ కోడూరి సూర్యనారాయణమూర్తి & శ్రీమతి అచ్యుతాంబ, విఘ్నేశ్వర నగర్, కాకినాడ	1,116
పోషకులు : శ్రీమతి చందా ప్రమీలా ఆనందయ్య, సిద్ధిపేట, మెదక్ జిల్లా	1,000

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

యువతరానికి 'శ్రీరామకృష్ణ ప్రభ'ను మరింత చేరువ చేయాలని సంకల్పించాం. రాష్ట్రంలోని వివిధ పాఠశాలలు/ కళాశాలలు/ గ్రంథాలయాలకు పత్రికను పంపించడానికి మీ సహాయాన్ని కోరుతున్నాం. ఈ కానుక పథకం క్రింద చందా చెల్లించిన దాత పేరున (మీరు సూచించిన లేదా మేము ఎంపిక చేసిన) విద్యాసంస్థకు పత్రికను పంపుతాం. కానుక చందా రూ.1,500/- అంతకన్నా ఎక్కువ ఇచ్చిన దాత పేరు, విద్యాసంస్థ పేరు పత్రికలో ప్రచురిస్తాం.

దాత పేరు	విద్యాసంస్థ
శ్రీ జి. డోకారెడ్డి, కృష్ణారెడ్డి నగర్, కర్నూలు (కీ॥శే॥ ఈశ్వరమ్మ, లక్ష్మిరెడ్డి గార్ల జ్ఞాపకార్థం)	కర్నూలు జిల్లాలోని మూడు పాఠశాలలకు ఆరు సంవత్సరాలకు పత్రికను స్పాన్సర్ చేశారు.
శ్రీ పి. నాగరాజు, నరసాపురం, కర్నూలు జిల్లా (కీ॥శే॥ పి. నారాయణ గారి జ్ఞాపకార్థం)	శ్రీకాకుళం జిల్లా, వజ్రపుకొత్తూరు మండలంలోని రెండు పాఠశాలలకు పత్రికను స్పాన్సర్ చేశారు.
శ్రీ పబ్బతి ప్రభాకర్‌రావు, కూకట్‌పల్లి, హైదరాబాదు	పది పాఠశాలలకు ఒక సంవత్సరానికి పత్రికను స్పాన్సర్ చేశారు.
శ్రీమతి హెచ్.టి.అరుణ, గణేశ్‌నగర్, కరీంనగర్ (కీ॥శే॥ గుజ్జల లక్ష్మయ్యగారి జ్ఞాపకార్థం)	జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ఖాజీపేట, కడప జిల్లా

ముఖచిత్రం: కన్యాకుమారిలో సాగర ద్వీప శిలపై ధ్యానమగ్నుడైన స్వామి వివేకానంద. చిత్రకారుడు - మణియన్ సెల్వమ్, చెన్నై

చందా వివరాలు		భారతదేశంలో	విదేశాలకు
విడి ప్రతి	:	₹ 10	-
సంవత్సర చందా	:	₹ 100	₹ 1,500
మూడు సంవత్సరాలకు	:	₹ 280	₹ 4,500
ఐదు సంవత్సరాలకు	:	₹ 450	₹ 7,500
ఇరవై సంవత్సరాలకు	:	₹ 1,500	₹ 22,000

గమనిక: డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో Ramakrishna Math, Hyderabad అని వ్రాయాలి.

పంపవలసిన చిరునామా: Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.

చందాను ఆన్‌లైన్ http://rkmath.org/srkp ద్వారా చెల్లించవచ్చు.

केनरा बैंक
Canara Bank

With Best compliments from :

Circle Office, 3-5-879, 'Ruby House', Himayatnagar, Hyderabad-500 029

కెనరాబ్యాంక్ వారు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 1,000 విద్యాసంస్థలకు ఒక సంవత్సరానికి స్పాన్సర్ చేశారు.

లోపలి పేజీల్లో...

6 సంపాదకీయం
శ్రేయస్సునిచ్చే కల్పతరువు

8 గోరుముద్ద
తత్త్వమసి

9 వెలుగుల కేతనం సంక్రాంతి

10 పలికెడిది భాగవతం
ఈశ్వర వశము విశ్వము

12 మన సంస్కృతి
మన సంగీత కళ

13 దివ్యశక్తి ప్రభావం

15 నాటికి నాడే నా చదువు

16 పరిప్రశ్న

17 రామకృష్ణ భక్తి సూత్రాలు

18 విషయతృష్ణ ఉపశమనం

19 మతసామరస్యం పరిమళించినవేళ...

20 రక్షించేది ఎవరు?

21 ధీరవాణి
శ్రేయోమార్గం!

22 ప్రేమామృత మూర్తి స్వామీజీ

24 ఏకాగ్రతా సాధన!

26 ఎర్రచీర పైట చెరగు!

27 యువవాణి
యుగానికొక్కడు!

28 ఆ జ్ఞాపకాల తీరంలో...

30 మనసుంటేనే మనిషి!

31 వినడమూ విజ్ఞతే!

32 జీవనోద్యానంలో మానవతా పరిమళాలు
ఖాళీ చేతులతో ఎలా పంపాలి? / అవినీతికి ఆరంభం

33 ముందుకు సాగిపో!

35 వికాస మంత్రాలు

36 భగవద్గీత - సద్గుణ సుధ
సుఖదుఃఖాల బాటలో జీవనయాత్ర

37 జీవన వేదం - స్వామీజీ కథల సారం
వారసత్వ సిద్ధాంతం / సాక్షాత్తూ దేవత

38 బొమ్మల కథ
ప్రశాంత చిత్తంలో పరమానందం

41 మహాపురుషుని సాన్నిధ్య స్మృతులు

ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు. - సంపాదకులు

ప్రియ పాఠకులారా!

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు మీద చిరునామాకు పైన మీ చందా నంబరు, కుడి వైపున మీ చందా గడువు ముగిసే నెల ఉంటాయి. మీ చందా గడువు పూర్తయ్యే నెలకు ముందుగానే సొమ్మును చెల్లించి చందాను పునరుద్ధరించుకోండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారిన పక్షంలో 7వ తేదీ లోగా మాకు తెలియపరచినట్లయితే, వచ్చే నెల సంచిక నుండి మీ కొత్త చిరునామాకు పంపబడును.
- ప్రతీ నెల 26 లేదా 27వ తేదీల్లో పత్రిక పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపుగా చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ.... - సర్క్యులేషన్ మేనేజర్

KCP CEMENT
CONCRETE CEMENT
Since 1958

With Best Compliments From
CHAIRMAN & MANAGING DIRECTOR
THE KCP LIMITED
KCP కంపెనీ వారు "శ్రీరామకృష్ణ ప్రభ" మాసపత్రికను
1000 గ్రంథాలయాలకు స్పాన్సర్ చేశారు

KCP Sreshtaa CEMENT
THE NEW GENERATION CEMENT

Cement Marketing Division : Plot No. 10, Gayatri Hills, MP & MLA's Colony, Road No. 10 C, Jubilee Hills, HYDERABAD - 500033.
Tel : 040-2325 3503 to 505, Fax : 2325 3500, Cell : +91 99895 97775 / 9866305145, E-mail : ramakrishna.k@kcp.co.in
Registered Office : No. 2, Dr.P.V.Cherian Crescent, Egmore, CHENNAI - 600 008. Tel : 044 66772668, Fax: 044 66772620, CIN L65991TN1941PLC001128

సంపాదకీయం

భగవాన్ శ్రీరామకృష్ణుల జీవితాన్ని అధ్యయనం చేసిన భక్తుల స్మృతిపథంలో చిరస్థాయిగా నిలచిపోయే విశేషదినం - 1886 జనవరి 1వ తేదీ. కలకత్తాలోని కాశీపూర్ ఉద్యానగృహంలో శ్రీరామకృష్ణులు 'కల్పతరువు'గా భక్తుల మనోభీష్టాలను నెరవేర్చిన శుభదినం. అందుకే భక్తులు తమ అభీష్టాలను నెరవేర్చమని జనవరి 1న శ్రీరామకృష్ణులను ప్రార్థించడం ఓ సంప్రదాయంగా మారింది.



శ్రేయస్సునిచ్చే కల్పతరువు

అయితే, 'నిజంగా శ్రీరామకృష్ణులు జనవరి 1న భక్తులు కోరిన కోరికల్ని తీర్చినట్లయితే, ఆ రోజున రామకృష్ణ మఠ కేంద్రాలన్నీ జనసందోహంతో కిటకిటలాడాలి కదా? కానీ భక్తుల రద్దీ ఉండదే!' అని చాలామందికి సందేహం రావచ్చు. బహుశా, భవిష్యత్తులో లక్షలకొద్దీ జనం వస్తే, ప్రత్యేక రక్షణ బలగాల అవసరం ఉంటుందని ఊహించిన శ్రీరామకృష్ణులు అలాంటి పరిస్థితి రాకుండా జాగ్రత్తపడ్డారేమో!

ప్రాపంచిక సిరులు కాదు... పారమార్థిక సిరులు: 1886 జనవరి 1న కాశీపూర్ ఉద్యానంలో ఉన్న భక్తుల వద్దకు శ్రీరామకృష్ణులే స్వయంగా వెళ్ళి, 'మీ అందరిలో ఆత్మోద్దీపన మవుగాక!' అని ఆశీర్వదించారు. అంతేగానీ, 'మీరందరూ సిరిసంపదలతో తులతూగుదురుగాక!' అని గానీ; 'మీరందరూ భోగభాగ్యాలతో జీవింతురుగాక!' అని గానీ దీవించలేదు. అలా సంపదలు కావాలని కోరిన ఉపేంద్రనాథ్ లాంటి భక్తుల కోర్కెలను కూడా తీర్చారు. కానీ శ్రీరామకృష్ణులు ముఖ్యంగా భక్తులు ప్రాపంచిక సిరులతో గాక, పారమార్థిక సిరులతో తులతూగాలని ఆశించారు; తాత్కాలిక ఆనందం గాక, శాశ్వతానందం పొందాలని తపించారు; విషయ సుఖాలను అనుభవించడం గాక, అమరత్వాన్నిచ్చే అమృతాన్ని గ్రోలాలని కాంక్షించారు.

'భోగాలను కాదు, భగవంతుణ్ణి కోరుకోండి' అని అంటే మనలో ఎంతమందిమి నిజంగా భగవంతుణ్ణే కోరుకుంటాం? ఇహలోక సుఖాలు వద్దు, పరలోక సుఖాలనే ప్రసాదించమంటూ ఎంతమందిమి ప్రార్థిస్తాం? 'ఆధ్యాత్మిక చింతన చేయండి, ప్రాపంచిక చింతలను వదలండి' అని బోధించిన మహాత్ముల దరిదాపులకు కూడా జనం రారని శ్రీరామకృష్ణులకు బాగా తెలుసు. అందుకే ఆయన చేయి విరిగి కష్టపడుతున్నట్లు, గొంతు వ్రణంతో బాధపడుతున్నట్లు నటించేవారు. అలా చేయడం వల్ల 'ఈయనే ఇన్ని బాధలు పడుతున్నారు. ఇక మన బాధల్ని ఏం తీరుస్తారు!' అని వచ్చిన భక్తులు తిరిగి వెళ్ళిపోతారనేవారు. ఈ విధంగా చేయడం వల్ల ప్రాపంచిక కోరికలతో వచ్చిన భక్తులు కాకుండా కేవలం పరమాత్ముణ్ణి పొందాలనుకునే నిజమైన భక్తులు మాత్రమే తన దగ్గరకు వస్తారన్నది ఆయన భావన.

యోగసహాయకుడు: కష్టాలు లేకుండా జీవితం సుఖంగా సాగిపోవాలనుకోవడం మానవ స్వభావం. కానీ ప్రాపంచిక ఆనందాన్ని కోరుకునేవాడు పారమార్థిక ఆనందాన్ని పొందలేడు. పారమార్థిక ఆనందాన్ని కోరుకునేవాడు ప్రాపంచిక జీవితంలో ఆనందాన్ని పొందలేడు. అందుకే కబీర్‌దాస్ భగవంతుణ్ణే కోరుకున్నవారికి ఈ ప్రపంచంలో కష్టాలూ, కన్నీళ్ళూ తప్పవని గుర్తుచేస్తూ...

సుఖియా సబ్ సంసార్ హై, ఖాయే ఔర్ సోయే ।
దుఃఖియా దాస్ కబీర్ హై, జాగే ఔర్ రోయే ॥

'తిని, నిద్రపోయేవాడికి (ప్రాపంచికుడికి) ఈ ప్రపంచం సుఖదాయకమే! కానీ భగవంతుని కోసం నిద్రపోకుండా ఏడ్చే ఈ కబీర్‌దాస్‌కి (పారమార్థికుడికి) మాత్రం దుఃఖ కారకమే!' అని అంటాడు.

మరి కల్పతరువైన శ్రీరామకృష్ణులను ఆశ్రయిస్తే భక్తుల కష్టాలను తొలగించరా? కోరికలను నెరవేర్చరా? అనే సందేహం కలుగుతుంది. ఆయన భక్తుల కష్టాలను తొలగిస్తారు, కోరిన కోర్కెలను తీరుస్తారు. కానీ, పిల్లవాడు ఏడుస్తున్నాడు కదా అని అడిగినవన్నీ తండ్రి ఇస్తే, ఆ పిల్లవాడు ఎన్నటికీ ప్రయోజకుడు కాలేడు. అలాగే, భక్తులు కోరినవన్నీ ఇస్తూ ఉంటే ప్రాపంచిక సుఖాలను వదలి, పారమార్థికోన్నతిని సాధించలేరని

శ్రీరామకృష్ణులకు తెలుసు. అందుకే అడిగినవన్నీ ఇవ్వకుండా, అవసరమైనవే ఇచ్చి భక్తుల ఆధ్యాత్మికోన్నతికి తోడ్పడే యోగసహాయకులు శ్రీరామకృష్ణులు. అందుకే స్వామి వివేకానంద **'జృంభిత యుగ ఈశ్వర జగదీశ్వర యోగసహాయ్ -** ఆధ్యాత్మిక మార్గంలో సహాయమందించడానికి ఆధునిక యుగంలో అవతరించిన జగదీశ్వరుడవు నీవు' అని స్తుతించారు.

కోరికల్ని త్రుంచే కల్పతరువు: మన పురాణాల్లో వర్ణించిన కల్పతరువుకీ, ఈ ఆధునిక కల్పతరువుకీ మధ్య ఒక ముఖ్యమైన తేడా ఉంది. పురాతన కల్పతరువును ఆశ్రయిస్తే మన కోరికలను తీరుస్తుంది. ఈ ఆధునిక కల్పతరువు (శ్రీరామకృష్ణుల)ను ఆశ్రయిస్తే మన కోరికల్ని త్రుంచుతుంది.

మన దుఃఖానికి కారణం కోరికలే. కాబట్టి మనస్సు లోని కోరికలను త్రుంచివేయగలిగినవాడే నిజమైన సుఖవంతుడు. అందుకే భగవాన్ శ్రీకృష్ణుడు నిజమైన సుఖవంతుడెవరో వివరిస్తూ...

శక్నోతీ హైవ యః సోఢుం ప్రాక్ శరీర విమోక్షణాత్ ।
కామక్రోధోద్భవం వేగం స యుక్తః స సుఖీ నరః ॥ *(గీత.5-23)*

'ఈ శరీరాన్ని త్యజించక ముందే కామక్రోధాల వేగాన్ని సహించగలిగినవాడే యోగి. అతడే నిజమైన సుఖవంతుడు' అని తెలిపాడు.

అందుకే శ్రీరామకృష్ణులు తనను ఆశ్రయించిన భక్తులు తాత్కాలిక సుఖం కాకుండా, శాశ్వత సుఖం పొందాలని ఆకాంక్షించేవారు. అందుకు ఆటంకాలైన కామక్రోధాలు, లోభమోహాలు, అసూయాహంకారాలను తొలగించి భక్తులకు పరిపూర్ణతను ప్రసాదించేవారు. శ్రీరామకృష్ణులను ఆశ్రయించి పరిపూర్ణతను సాధించిన కొంతమంది భక్తుల గురించి తెలుసుకుందాం:

నరేంద్రుడు (స్వామి వివేకానంద) ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పుడు శ్రీరామకృష్ణుల వద్దకు వెళ్ళి తన కష్టాలను తీర్చమని వేడుకున్నాడు. అందుకు ఆయన, జగన్మాతను ప్రార్థించమని సూచించారు. ప్రాపంచిక సిరులను అడగడం కోసం వెళ్ళిన నరేంద్రుడు పారమార్థిక సిరులైన భక్తి జ్ఞాన వైరాగ్యాలను కోరుకునేలా లీలను ప్రదర్శించారు శ్రీరామకృష్ణులు. ఆ తరువాత కుటుంబ కనీస అవసరాలకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా ఉండేలా నరేంద్రుణ్ణి ఆశీర్వదించారు.

మహాపండితులు, సాధకులైన వైష్ణవచరణ్, గౌరీ పండితుడు, పద్మలోచన్, నారాయణశాస్త్రి లాంటి వారు శ్రీరామకృష్ణులను ఆశ్రయించిన తరువాత భగవద్దర్శనానికి అవరోధంగా నిలచిన వారిలోని పాండిత్యాహంకారం తొలగింది. పారమార్థిక అనుభూతులను పొంది, తమ జీవితాలను సార్థకం చేసుకున్నారు.

శ్రీరామకృష్ణులకు చికిత్స చేసిన డాక్టర్ మహేంద్రలాల్ సర్కార్‌కు దైవభక్తి లేశమైనా లేదు. శ్రీరామకృష్ణులను అందరూ భగవదవతారంగా భావించి పూజిస్తుంటే, అతడు మాత్రం శ్రీరామకృష్ణులను ఒక సాధారణ పూజారిగానే భావించేవాడు. అందుకే అతడు శ్రీరామకృష్ణుల్ని ఏకవచనంతో సంబోధించేవాడు. శ్రీరామకృష్ణులకు చికిత్స చేస్తున్నప్పుడు ఏర్పడిన పరిచయం వల్ల డాక్టర్, శ్రీరామకృష్ణుల పట్ల ఆకర్షితుడయ్యాడు. 'ఇతరులెవ్వరూ ఆయనతో మాట్లాడవద్దు, ఆయనకు విశ్రాంతి అవసరం' అని అందరినీ వారిస్తూ డాక్టర్ మాత్రం గంటల కొద్దీ శ్రీరామకృష్ణులతో మాట్లాడేవాడు. 'మీతో మాట్లాడుతుంటే నాకు అపరిమితమైన ఆనందం కలుగుతుంది' అని డాక్టర్ తన అనుభూతిని వ్యక్తపరిచేవాడు. శ్రీరామకృష్ణుని సాన్నిధ్యం లౌకిక భావాలున్న వ్యక్తిలో కూడా అలౌకికానందాన్ని కలిగించింది.

గిరీశ్ చంద్ర ఘోష్ ప్రాపంచిక సుఖాల మత్తులో మునిగితేలేవాడు. అలాంటి వ్యక్తి శ్రీరామకృష్ణులను ఆశ్రయించగానే అతడిలోని కామ క్రోధ మోహాలు పూర్తిగా తొలగిపోయాయి. ఒక మహాపాపిని పరిపూర్ణ వ్యక్తిగా మలచారు శ్రీరామకృష్ణులు. ఒకసారి ఓ భక్తుడు స్వామి వివేకానందను దర్శించుకోవాలని బేలూరు మఠానికి బయలు దేరుతుండగా గిరీశ్ చంద్ర ఘోష్ అతనితో – 'శ్రీరామకృష్ణులు, స్వామీజీని మహోన్నతునిగా తీర్చిదిద్దడంలో గొప్పేముంది? ఈ భూమండలంపై నేను చేయని పాపమంటూ లేదు. అలాంటి నన్ను పవిత్రునిగా మలచిన శ్రీరామకృష్ణుల మాహాత్మ్యాన్ని గుర్తించు' అని చెప్పారు.

శ్రీరామకృష్ణుల తాంత్రిక గురువైన భైరవీ బ్రాహ్మణి శ్రీరామకృష్ణులు ఎవరితోనైనా సన్నిహితంగా మాట్లాడినా, మర్యాద చూపినా, చివరికి శారదామాతతో మాట్లాడినా అసూయతో రగిలిపోయేది. బ్రాహ్మణిలో పొడసూపిన ఈ దుర్గుణాన్ని తొలగించి ఆమెకు పరిపూర్ణతను ప్రసాదించారు శ్రీరామకృష్ణులు.

శ్రీరామకృష్ణుల అద్వైతగురువైన తోతాపురి ఒకసారి శ్రీరామకృష్ణులతో ఆధ్యాత్మిక చర్చలు జరుపుతున్నప్పుడు అక్కడికి ఒక తోటమాలి వచ్చి, హుక్కాను అంటించుకోవడానికి పక్కనే ఉన్న ధుని నుండి నిప్పుకణికను తీసుకున్నాడు. అది గమనించిన తోతాపురి అతణ్ణి కొట్టడానికి వెళ్ళాడు. అప్పుడు శ్రీరామకృష్ణులు 'సర్వం బ్రహ్మమయం అనే అనుభూతిని పొందిన మీరు అదంతా మరచిపోయి ఆ తోటమాలిని కొట్టబోయారు' అని నవ్వుతూ అన్నారు. ఆ మాటలు విన్న తోతాపురి తన తప్పును గ్రహించి 'క్రోధం నన్ను ఆవరించింది. ఈ క్షణం నుండి దాన్ని విడిచివేస్తాను' అని సంకల్పించుకున్నాడు.

ఇలా ఆధునిక కల్పతరువైన శ్రీరామకృష్ణులను ఆశ్రయించిన పండితులు, పామరులు, ధనికులు, పేదలు, పతితుల ప్రాపంచిక వాసనలు సమూలంగా నాశనమై పరిపూర్ణతను పొందారు. అందుకే మనం కూడా 'శ్రీరామకృష్ణా! ఓ కల్పతరువా! శ్రేయమునిచ్చేటి వరదాతవు నీవే!' అంటూ శ్రీరామకృష్ణులను ఆశ్రయిద్దాం. మనలోని ప్రాపంచిక వాంఛల్ని త్రుంచి, పరిపూర్ణతను ప్రసాదించమని ప్రార్థిద్దాం. ❖

భగవంతుణ్ణి ఏమి అడగాలి? భగవంతుణ్ణి ఐహిక విషయాల కోసం ప్రార్థించక ఆయన యందు నిర్హేతుక భక్తి కలిగేలా, ఆయన మాయకు ఆకర్షింపబడకుండేటట్లుగా కటాక్షించమని ప్రార్థించాలి. - శ్రీరామకృష్ణులు

గోరుముద్ద - స్వామి సుప్రియానంద

తత్త్వమసి

మనం ఆలోచించాల్సిన ముఖ్యమైన మూడు అంశాలు. ఒకటి – మనకు కనిపించే ఈ ప్రపంచం; రెండు – కనిపించకుండా ఎక్కడో ఉన్నాడని భావించే దేవుడు; మూడు – ఈ రెండింటితో సంబంధం పెట్టుకొనే మనం.

ఎన్ని తెలివితేటలున్నా తెలుసుకోవలసింది, తేల్చుకోవలసింది ఈ మూడింటిని గురించే! ఈ రహస్యం అర్థమైతే అంతా అర్థమైనట్టే. మరి దీని గురించి కొంచెం ఆలోచిద్దామా!

దేవుడు ఎప్పుడూ హాయిగా, ఆనందంగా ఉంటాడు. ఆయన సచ్చిదానంద చైతన్య స్వరూపుడు. ఇక ప్రపంచం మాటకొస్తే, అదొక జడ పదార్థం. 'ఓ తాజ్‌మహల్! నువ్వు ఎంత అందంగా ఉన్నావో తెలుసా?' అన్న మాటలకు అది ఉలకదు, పలకదు.

ఒకరు పరిపూర్ణ చైతన్యం, మరొకరు జడం. వీరిద్దరికీ లేదు సమస్య. ఎటొచ్చీ జడ, చైతన్యాల మధ్య ఊగిసలాడుతున్న మనబోటి వాళ్ళకే ఈ సమస్య!

ఈ జటిల సమస్యను ఛేదించడానికే మన ప్రాచీనులైన మహర్షులెంతగానో పరిశోధనలు చేశారు. వారి పరిశోధనల ఫలితంగా మనకు నాలుగు వేదాల నుండి నాలుగు మహావాక్యాలు లభించాయి. ఒక్కొక్క వేదం యొక్క సారమే ఒక్కొక్క మహావాక్యమని చెబుతారు పెద్దలు.

ఆ మహావాక్యాలు:

1. ప్రజ్ఞానం బ్రహ్మ – చైతన్యమే బ్రహ్మం
(ఐతరేయోపనిషత్తు – ఋగ్వేదము).
2. అహం బ్రహ్మాస్మి – నేనే బ్రహ్మం
(బృహదారణ్యకోపనిషత్తు–యజుర్వేదము).
3. తత్త్వమసి – బ్రహ్మమే నీవు
(ఛాందోగ్యోపనిషత్తు – సామవేదము).
4. అయమాత్మా బ్రహ్మ – ఆత్మయే బ్రహ్మం
(మాండూక్యోపనిషత్తు – అధర్వణవేదము).

ఈ నాలుగు మహావాక్యాలూ వేరైనప్పటికీ ఒకే భావాన్ని వ్యక్తపరుస్తున్నాయి. కానీ మానవుడి బుద్ధికి ఒక్కసారిగా అద్వైత భావం పట్టుబడడం కష్టం. నరేంద్రుడు (స్వామి వివేకానంద) అంతటి వాడు, శ్రీరామకృష్ణులతో 'నేను విశ్వనాథ్‌దత్త గారి అబ్బాయిని' అని మొరాయించిన సంగతి మనందరికీ తెలిసిందే!

ఇక్కడ మనం ఒక ముఖ్య విషయం గుర్తుంచుకోవాలి. 'అహం బ్రహ్మాస్మి – నేనే బ్రహ్మం' అని అనుకుంటే సరిపోదు. ఇతరులు కూడా 'తత్త్వమసి – బ్రహ్మమే నీవు' అన్న జ్ఞానం మనలో కలగాలి.

ఈ మహావాక్యాలను తెలుసుకుని వాటి అర్థాన్ని మననం చేస్తూ సర్వాత్మ భావాన్ని స్వానుభవానికి తెచ్చుకోవడానికి ప్రయత్నించాలి. అదే అన్ని సమస్యలకూ పరిష్కారం, మానవ జీవిత పరమార్థం కూడా. అఖండమైన మన ఆత్మ స్వరూపాన్ని సర్వత్రా చూడగలిగితే అంతకు మించిన ఆనందం వేరే ఏముంటుంది? ❖

సంక్రాంతి శుభాకాంక్షలు

'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు, రచయితలకు, రచయిత్రులకు, ఏజెంట్లకు, దాతలకు, శ్రేయోభిలాషులకు మా హృదయపూర్వక సంక్రాంతి శుభాకాంక్షలు.

- సంపాదకులు

వెలుగుల కేతనం సంక్రాంతి

– డాక్టర్ అపర్ణా శ్రీనివాస్

పండుగలు, పర్వదినాలు జాతి జీవనానికి కొత్త దీప్తినిస్తూ, సామాజిక చైతన్యానికీ, సమష్టి కార్యాచరణకూ ప్రతీకలుగా నిలుస్తాయి. భారతదేశంలో మన పండుగలన్నీ సాధారణంగా చాంద్రమానం ప్రకారం తిథిని అనుసరిస్తూ జరుపుకొనేవి. అయితే సంక్రాంతి పండుగ విశేషం ఏమిటంటే, ఇది సూర్య గమనాన్ని అనుసరిస్తూ జరుపుకొనే పండుగ. సూర్యుడు ఒక రాశి నుండి మరో రాశిలో ప్రవేశించడాన్ని సంక్రమణం అని అంటాం. అలా సూర్యుడు మకరరాశిలో ప్రవేశించినప్పుడు, దానినే 'మకర సంక్రమణం' అనీ, 'సంక్రాంతి' అనీ వ్యవహరిస్తాం. ఈ మకర సంక్రమణానికి అధిక ప్రాధాన్యం ఉంది. ఎందుచేతనంటే, ఈ సంక్రమణంలో సూర్యుడు ఉత్తరదిశకు అభిముఖుడై ఉన్నందున ఉత్తరాయణం ఆరంభం అవుతుంది. దానితో పగటికాల వ్యవధి క్రమంగా పెరుగుతూ పోయి చీకటి తగ్గుతుంది. అందుకే సంక్రాంతిని శుభసూచకంగా, వెలుగుల కేతనంగా పరిగణిస్తారు.

ఉత్తరాయణం జ్ఞానమార్గమై ఉన్నందు వల్లే కురుక్షేత్ర యుద్ధంలో భీష్ముడు అంపశయ్యపై దాని కోసం నిరీక్షించాడు. ఈ మకర సంక్రమణం ఆరంభం కాగానే చేసే జప, దాన, ధ్యానాలు విశేష ఫలితాలను ఇస్తాయని పెద్దలు చెబుతారు. మకరం అంటే మొసలి. అది పట్టుకుంటే వదలదు (గజేంద్రుని పాట్లు మనకు తెలిసినవే). అలాగే మోహమనే మొసలి మానవుణ్ణి పట్టుకుని వదలదు. ఆధ్యాత్మికంగా అడుగుని ముందుకు పడనీయదు. అందువల్ల ఈ మోహం నుండి తప్పించుకునేందుకు జప, దాన, ధ్యానాలు చెప్పబడ్డాయి.

సూర్యుడు కేంద్రమైన ఈ వెలుగుల పర్వం ప్రస్తావనలో భాగంగా ఆ ప్రత్యక్షదైవాన్ని గురించి కొంత తెలుసుకుందాం. యుగయుగాలుగా మానవాళికి వెలుగును నియమంగా అందిస్తూ ఉన్న సూర్యుణ్ణి 'సూర్య ఆత్మా జగతస్తస్థుషశ్చ – సూర్యుడే ఈ చరాచర జీవరాశులన్నింటికీ ఆత్మయై వెలయువాడు' అని ఋగ్వేదం ప్రస్తుతించింది. సూర్య నారాయణుడు అన్ని పదార్థాలలో ఆత్మస్వరూపుడై, వాటికి ప్రాణశక్తిని అందిస్తూ, ప్రపంచంలోని జీవరాశులన్నింటినీ పోషిస్తూ, జీవుల ఆరోగ్యానికీ, పెరుగుదలకూ కారణభూతుడై నిలుస్తాడు. అందుకే కొత్త బియ్యంతో పొంగలి చేసి కృతజ్ఞతాపూర్వకంగా సూర్యభగవానునికి నివేదన చేస్తారు.

భోగి పండుగ నాడు వైష్ణవాలయాల్లో గోదాకల్యాణం నిర్వహిస్తారు. భోగి అంటేనే భోగం. ఆ భోగం పరమాత్మానుభవమే. దాన్ని పొందేందుకు గోదాదేవి శ్రేష్ఠమైన వ్రతం ఆచరించింది, అదే తిరుప్పావై. తిరుప్పావైని సూర్యుడు ధనూరాశిలో ప్రవేశించగానే (ధనుర్మాసం) మొదలుపెట్టి భోగి నాటితో పూర్తిచేసి, వ్రతఫలితంగా ఆ శ్రీరంగనాథుణ్ణే చేపట్టింది గోదాదేవి. ఈ తిరుప్పావైలో గోదాదేవి రోజుకొక పాశురం (భక్తిభావంతో కూడిన గేయం) చొప్పున ముప్పై పాశురాలలో ఆ వ్రత నియమాలను తెలుపుతూ, భాగవతులందరినీ సంఘటితం చేస్తూ, భగవత్ప్రాప్తికి భక్తి, జ్ఞాన, కర్మమార్గాల ఆవశ్యకతను వివరిస్తూ, అనన్య శరణాగతి ప్రాధాన్యాన్ని నొక్కి వక్కాణిస్తుంది. ఆధ్యాత్మికత అనేది లోక ప్రవృత్తికి విరుద్ధం కాదనీ, సమన్వయాన్ని సత్సాంగత్యం ద్వారా చేకూరిస్తే, భగవత్ప్రాప్తి సులభసాధ్యమని ఋజువు చేసి చూపించింది గోదాదేవి.

ఈ పాశురాలలో శ్రవణ, మనన, నిదిధ్యాసనాల ఆవశ్యకత కనిపిస్తుంది. అంతేకాక ఉపనిషద్వాక్యాలతో సరిపోలే ఉపమానాలు ఎన్నో ఉదాహరణలుగా కనిపిస్తాయి. మంత్రాన్ని తల్లిగా, ఆచార్యుని తండ్రిగా భావిస్తూ, వాటి మీద విశ్వాసం ఉంచి, భగవద్దర్శనానికి ఆటంకాలుగా, ద్వారబంధాలుగా నిలిచే అహంకార మమకారాలను, అనన్య శరణాగతితో తొలగించుకోవాలనే అంతరార్థం ఈ పాశురాలలో కనిపిస్తుంది. ఆశ్రయించనివారికి అందనివాడు, ఆశ్రయించేవారికి అందేవాడు అయిన ఆ పరమాత్ముని తత్త్వరహస్యం వర్ణనాతీతమై, 'అది ఇట్టిది' అని చెప్పే వీలులేనిది. అయితే ప్రయత్నం చేత, శరణాగతి చేత, భక్తి చేత, నియమనిష్ఠలతో ఆ శ్రీరంగనాథుని (పరమాత్మను) సొంతం చేసుకుంది గోదాదేవి. అందుకే నాటి నుండి నేటి వరకు, ప్రతీ భోగి పండుగ నాడు గోదాకల్యాణం జరుగుతూనే ఉంది. మనకు స్ఫూర్తిదాయకంగా ఎప్పటికీ నిలిచే ఉంటుంది.

(మిగతా 14వ పేజీలో...)

తన విధులను బాగుగా నిర్వర్తించుచూ, చేయరాని పనుల జోలికి పోకుండా జాగ్రత్త వహిస్తూ, ధర్మాచారములను శ్రద్ధతో ఆచరిస్తున్నవాడే నిజమైన ఆర్యుడని పెద్దలందురు. – రామాయణం

ఈశ్వర వశము విశ్వము

– స్వామి జ్ఞానదానంద

విదురునితో కలసి వనాలకు వెళ్ళిన గాంధారి, ధృతరాష్ట్రుల జాడ తెలియక యుధిష్ఠిరుడు చింతాక్రాంతుడయ్యాడు. కళ్ళు కనిపించని ధృతరాష్ట్రుడికి లోక వ్యవహారాలన్నీ కళ్ళకు కట్టినట్లు వివరించే సంజయుడు కూడా, వారి నిశ్శబ్ద నిష్క్రమణను పసిగట్టలేకపోయాడు. అందుకే పాండవాగ్రజుడు ఎంత బతిమాలినా, ఆ ముగ్గురి వివరాలూ చెప్పలేక ఆయన బావురుమన్నాడు. అలాంటి బాధాకర సమయంలో నారదుడు అక్కడికి విచ్చేశాడు. సోదరులతో కలసి ధర్మరాజు వారికి సాదర సత్కారాలతో స్వాగతం పలికాడు. అనంతరం ఆ అజాతశత్రువు, బ్రహ్మమానస పుత్రుడితో 'నారద మహర్షీ! మా తల్లితండ్రుల ఆచూకీ తెలియడం లేదు; వాళ్ళు ఇల్లు వదిలి ఎక్కడికి వెళ్ళిపోయారో? వారికి ఎవరు దిక్కు? ఎన్ని కష్టాలు పడుతున్నారో?' అని ఆవేదన పడ్డాడు.

అప్పుడు ఆ దేవర్షి ధర్మరాజును ఊరడిస్తూ, ఆందోళన పడవద్దని అభయమిస్తూ, **'ఈశ్వర వశంబు విశ్వంబు; ఈశ్వరుండు భూతంబుల నొకటితో నొకటి జేర్చు, నెడవాపు...'** అంటూ ఈ సృష్టి యావత్తూ ఎలా భగవంతుడి స్వాధీనమై ఉందో ఉద్ఘాటించాడు. ఈ విశ్వమంతా ఈశ్వరాధీనం; పరమేశ్వరుడే ప్రాణులను ఒకరితో ఒకరిని కలుపుతూ విడదీస్తూ ఉంటాడు. ముక్కుతాళ్ళు పొడిచి, మెడకు పలుపులు తగిలించి, పగ్గాలు చేత పట్టుకొని, కర్షకుడు ఎద్దులను తిప్పినట్లుగా భగవంతుడు కర్తవ్యాకర్తవ్యాలను బోధించి, ప్రాణులను ఇచ్ఛారీతిలో తిప్పుతుంటాడు. క్రీడాకారుని ఇష్టానుసారం పాచికలూ, బంతులూ తదితరమైన ఆటవస్తువులు కలుస్తూ విడిపోతూ ఉన్నట్లు భగవంతుని ఇచ్ఛానుసారం ప్రాణులకు సంయోగవియోగాలు ప్రాప్తిస్తూవుంటాయి' అని హితవు పలికాడు.

ఈశ్వరుని క్రీడాసాధనాలం! : ఈ సందర్భాన్ని నేపథ్యంగా చేసుకొని నారదుడు మానవుని పరిమితమైన స్వాతంత్ర్యాన్ని గుర్తుచేస్తూ, భగవంతుడి అనంతశక్తిని ఆవిష్కరిస్తున్నాడు. జీవితంలో ఎన్నో సమయాల్లో మనం చాలా స్వతంత్రుల మనుకుంటూ ప్రవర్తిస్తూ ఉంటాం; అన్నీ మన కనుసన్నల్లోనే కదులుతున్నాయని అహంకరిస్తూ ఉంటాం. కానీ అది మన అవివేకమేననీ, చరాచర సృష్టిని నిర్మించి, భరించి, హరించేది ఆ పరమాత్మ ఒక్కడేనని నారద మునీంద్రుడు పునరుద్ఘాటిస్తున్నాడు. అయితే నిత్యజీవితంలో మన మనస్సు అంత త్వరగా ఈ సత్యాన్ని అంగీకరించదు. మనం సాధించామనుకుంటున్న విజయాలు, మనం సమకూర్చు కుంటున్న విలాసాలు, మన ఆదేశాలతో సాగుతున్న వ్యవహారాలు ఆభిజాత్యపు అంచుల దాకా తీసుకువెళతాయి; మన వశం కానిదేముందని విర్రవీగేలా చేస్తాయి.

భారతదేశంలో పారిశ్రామిక విప్లవానికి శ్రీకారం చుట్టిన వంశానికి వారసుడైన ఓ యువకుడు పూర్తిగా విలాసవంతమైన జీవితాన్ని గడిపేవాడు. ప్రపంచంలోనే ప్రముఖ శ్రీమంతుల్లో ఒకటైన తమ కుటుంబానికి ఏ విషయంలోనూ ఎదురు లేదనుకునేవాడు. విదేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయంలో చదువుకుంటూ, భగవంతుడు, ఆధ్యాత్మిక జీవనం వంటి విషయాలపై అంతగా ఆసక్తి చూపకపోయేవాడు. ఒక రోజు అతడు విద్యాలయంలో ఉండగా, విమానప్రమాదంలో తన తల్లితండ్రులు, ఒక్కగానొక్క సోదరి దుర్మరణం పాలయ్యారన్న దుర్వార్త అందింది. "ఆ చీకటిరోజును నా జీవితంలో ఎన్నటికీ మరచిపోలేను. ఆ భగవంతుడి సంకల్పం ముందు మన ప్రణాళికలు ఎంత అల్పమైనవో తెలిసి ఆ రోజున నా దర్పమంతా పటాపంచలైంది; ఒకప్పుడు ఇన్ని కోట్లకు అధిపతులం కదా! ఏదైనా మా వశం కావలసిందే అనుకునేవాణ్ణి! కానీ అమ్మ, నాన్న, చెల్లి ఇక రారు! ఈ లోకంలో నా వారంటూ ఇక ఎవరూ లేరు అని తెలిశాక అంతా శూన్యమైపోయింది. వారసత్వంగా

తన వంశం మిగిల్చిన వేల కోట్లు ఇస్తున్న ఆనందం కన్నా, రక్తసంబంధీకులు ఒక్కరూ మిగలని ఒంటరితనం ఇప్పటికీ నా మనస్సును తొలిచివేస్తోంది" అంటూ ఆ యువకుడు ధర్మకర్త భావనతో ఓ వైపు పారిశ్రామికవేత్తగా ఎదుగుతూనే, మరోవైపు పూర్తిగా ఆధ్యాత్మిక మార్గానికి మరలాడు. ఇక్కడ నారదమహర్షి కూడా యుధిష్ఠిరుడితో **'ఈశ్వరుని క్రీడాసాధనంబులైన జీవులకు సంయోగ వియోగంబు లగుచుండు...'** అన్నాడు. ఇలా అందరమూ నిమిత్తమాత్రులమే తప్ప, ఏ నిర్ణయాధికారమూ మనకు లేదని తెలుసుకోవాలి.

స్వతంత్రేచ్ఛ స్వల్పమే..! : భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంసతో వైద్యనాథ్ అనే భక్తుడు మనుషులకున్న స్వతంత్రేచ్ఛ (ఫ్రీ-విల్) గురించి మాట్లాడుతూ 'ఒక వ్యక్తి తన ఇచ్ఛ మేరకు మంచైనా, చెడైనా చేయగలడని అంటారు. అది నిజమా? వాస్తవానికి మనం ఏది చేయడానికైనా స్వతంత్రులమా?' అని ప్రశ్నిస్తాడు. అప్పుడు వారు 'నాయనా! సమస్తం భగవంతుడి ఇచ్ఛ మీదనే ఆధారపడి ఉంది. అంతా ఆయన లీలే! ఆయనే చిన్న - పెద్ద, బలవంతులు - దుర్బలురు, మంచి - చెడు, నీతిమంతులు - అవినీతిపరులు... ఇలా పరస్పర విరుద్ధమైన వస్తువులన్నింటినీ సృష్టించారు. ఇదంతా ఆయన మాయ. ఆయన ఆడుతున్న ఆట. మనకు ఉన్న స్వతంత్రేచ్ఛ స్వల్పమే!' అంటూ ఓ ఉదాహరణ చెప్పారు.

మెడకు పలుపుతాడు వేసి పెరట్లో గుంజకు కట్టేసిన లేగదూడ ఎంత వరకు స్వేచ్ఛగా తిరగగలుగుతుంది? కేవలం ఆ తాడు ఎంత వరకు ఉందో అంత వరకే దానికి స్వతంత్రం. దూరంగా ఎక్కడికో వెళ్ళాలంటే, కట్టినవాడు వచ్చి, ఆ పలుపుతాడును వదులు చేయాలి. అలాగే మనిషి కూడా! సంపూర్ణమైన స్వతంత్రేచ్ఛ ఎవరికీ లేదు' అన్నారు.

ఈ మాత్రమే స్వతంత్రులమైన మనం ఎన్నోసార్లు భారాన్ని మనమే మోస్తున్నట్లూ, మనపైనే ఎందరో ఆధారపడి జీవిస్తున్నట్లూ అపోహపడుతూ ఉంటాం. కానీ, పరోక్షంగా పరమాత్మ చేయూత లేకపోతే మనం పరోపకారం చేయడానికి కూడా అవకాశం లేదు. అదే భావనతో ఆ దేవర్షి, ధర్మరాజుతో - **'అజగరంబుచేత మ్రింగంబడిన మానవుడన్యుల రక్షింప లేని తెరంగున, పంచభూతమయంబై కాలకర్మ గుణాధీనంబైన దేహము పరుల రక్షింప సమర్థంబు కాదు...'** అంటూ 'కొండచిలువ పట్టుకున్న మనుష్యుడు ఇంకో మనుష్యునికి సహాయం చేయలేనట్లే, పాంచభౌతికమై, కాలకర్మాధీనమై, సంసార పంకంలో కూరుకుపోయిన దేహం పరులను కాపాడలేదు. చేతులున్న ప్రాణులకు చేతులు లేని చతుష్పాద జంతువులూ, కాళ్ళుండి కదలగల ప్రాణులకు కాళ్ళులేని తృణాదులూ ఆహారమవు తున్నాయి. చేతులున్న ప్రాణులతోనూ, చేతులు లేని ప్రాణులతోనూ నిండిన ఈ విశ్వమంతా ఈశ్వర స్వరూపంగా భావించు! ఆయన కంటే అన్యం లేదు' అన్నాడు.

భోక్తా తానే! భోజ్యమూ తానే!: బ్రహ్మాండ నాయకుడైన భగవంతుడిపై భారం వేయడమంటే, మనిషి తనపై తాను ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవడం కాదు. ఉదాహరణకు అత్యంత ఆధునిక పరిజ్ఞానంతో రూపొందించే ఉపగ్రహ ప్రయోగనౌకలను అంతరిక్షంలోకి ప్రయోగించే ముందు శాస్త్రవేత్తలు తిరుమల వేంకటేశ్వరుడిని దర్శించుకొని, ఆశీస్సులు అర్థిస్తారు. అంటే తమ పరిశోధనలు, ప్రయోగాలపై నమ్మకం లేక కాదు; కానీ మానవ ప్రయత్నానికి, మానవాతీతశక్తి కూడా సహకరించాలన్న భావనతోనే ఈ ఆనవాయితీని పాటిస్తారు. సమస్తలోకాలనూ పరిపాలించే పరమాత్ముడి ప్రాపకం లేకపోతే, ఎవరూ పరిపూర్ణతను సాధించలేరు. ఆ సత్యాన్నే సూత్రీకరిస్తూ 'ముండకోపనిషత్తు' *(2.2.10)*

న తత్ర సూర్యో భాతి న చన్ద్రతారకం
నేమా విద్యుతో భాన్తి కుతోఽయమగ్నిః ।
తమేవ భాన్త మనుభాతి సర్వం
తస్య భాసా సర్వమిదం విభాతి ॥

'ఆ పరమాత్మను సూర్యుడు గాని, చంద్రుడు గాని, నక్షత్రాలు గాని ప్రకాశింప చేయలేవు. ఇక అగ్ని మాట చెప్పడమెందుకు? స్వయంజ్యోతి అయిన ఆ పరమాత్మ ప్రకాశం వల్లే ఈ సర్వం విరాజిల్లుతోంద'ని స్పష్టం చేస్తోంది.

అయితే అజ్ఞానులు, అర్ధజ్ఞానులు మాత్రమే నానా వాదనలతో దైవాన్ని ధిక్కరిస్తూ ఉంటారు. అల్పమైన తమ అస్తిత్వాన్ని అజరామరంగా భావిస్తూ ఉంటారు. నిజానికి తన మాయా విశేషం చేత పరాత్పరుడు బహురూపాలు ధరించి తానే భోక్తయై, భోజ్యమై - లోపలా, వెలుపలా అంతటా తానై వ్యాపించి ఉన్నాడు. ఆయనను మించి ఈ లోకంలో అన్యమైనది ఏదీ లేదు!

అజ్ఞానమూలమే వ్యాకులత! : ధర్మరాజును మరింత ఊరడిస్తూ, ఆ త్రిలోకసంచారి **'నా వారు ఏమయ్యెదరో, యెట్లు వర్తింతురో, యని వగవం పని లేదు. అజ్ఞానమూలం బగు స్నేహంబున నైన మనోవ్యాకులత్వంబు పరిహరింపుము'** అన్నాడు. మనవారని అనుకున్న వారిని బాంధవ్యంతో, బాధ్యతతో చూసుకోవడం వేరు; వారిపై వెర్రి వ్యామోహాన్ని పెంచుకోవడం వేరు! వారి విషయంలో మన లోపం లేకుండా కర్తవ్యాన్ని నిర్వర్తించాలి; ఆనక పరిస్థితులనూ, పరిణామాలనూ ఆ పరమాత్మకు విడిచిపెట్టాలి. అప్పుడు అయినవారి తాలూకు రుణాలను తామరతంపరగా పెంచకుండా, ఆయనే రుణ విముక్తి కలిగిస్తాడు. అవివేకంతో వీరందరిపై అనురాగాన్ని పెంచుకోవద్దన్న హితబోధతో నారదబ్రహ్మ, యుధిష్ఠిరుడిని సాంత్వనపరచాడు. ధృతరాష్ట్రుడు, గాంధారి, విదురుడు హిమాలయాలకు చేరుకున్నారనీ, అక్కడే వారు తమ శేషజీవితాన్ని గడిపి కైవల్యాన్ని పొందుతారనీ వివరించాడు. ❖

మనస్సును భగవంతుని మీద నిలుపు. ఇల్లు, కుటుంబం కొద్ది కాలమే ఉండేవి. చెట్టే శాశ్వతం; ఒకటి, రెండు పక్కు చెట్టు నుండి రాలిపోయినంత మాత్రాన విచారపడడమెందుకు? - *శ్రీరామకృష్ణులు*

ప్రాచీన, మధ్యయుగాలనాటి

మన సంస్కృతి

- స్వామి హర్షానంద

"ఒక వ్యక్తి తనను తాను అసహ్యించుకొంటున్నట్లయితే అదే పతనానికి హేతువు. పూర్వీకుల చరిత్రను అవమాన కరంగా భావిస్తే, ఆ జాతి అంతానికి చేరుకున్నట్లే!" అంటారు స్వామి వివేకానంద. గత వైభవాన్ని మర్చిపోయినంత కాలం మనమూ, మన దేశం స్తబ్ధతలో మునిగిపోతాం. అందుకే, మన ప్రాచీన సంస్కృతి గురించి తెలుసుకోవాలి. గడచిపోయిన సంగతులు తెలుసుకొంటూ, భవిష్యత్ మహత్కార్యాల సాధన వైపు నడవాలి. మన ప్రాచీన భారతీయ సంస్కృతిని గుర్తు చేసేందుకు చేస్తున్న ప్రయత్నమే ఈ వ్యాసాల పరంపర. సుప్రసిద్ధ రచయిత, బెంగుళూరు రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి హర్షానంద మహరాజ్ మధ్యయుగాల కాలం దాకా విలసిల్లిన మన సంస్కృతిని 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు 2014 ఫిబ్రవరి సంచిక నుండి వివరిస్తున్నారు.

మన సంగీత కళ

చిత్రలేఖనం కనులకు ఆహ్లాదాన్ని కలిగిస్తే సంగీతం హృదయాన్ని పులకరింప చేస్తుంది. నైతిక, ఆధ్యాత్మిక విలువలను సంగీతం చక్కగా ప్రకటించగలదు. సంగీతం హృదయగ్లానిని తొలగించడమే కాక సాధకునికి భగవదైక్యాన్ని ప్రసాదించగలదు. అందువల్లే ఋషులు సంగీతాన్ని 'నాదయోగం' అనీ, భగవంతుణ్ణి 'నాదబ్రహ్మం' అనీ పిలిచారు. సంగీతం ఎప్పుడూ మతం, ఆధ్యాత్మికతలతో ముడిపడి ఉండేది.

వేదపఠనంలో ప్రాథమికమైన ఉదాత్త, అనుదాత్త, స్వరిత స్వరాలు భారతీయ సంగీతానికి పునాదులు. ఈ మూడు స్వరాలే సామవేదంలోని సప్తస్వరాలుగా అభివృద్ధి చెందాయి. అవి - కృష్ట, ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ, మంద్ర, అతిస్వరాలు. ఈ స్వరాలే ఆధునిక భారతీయ సంగీతంలోని షడ్జ (స), రిషభ (రి), గాంధార (గ), మధ్యమ (మ), పంచమ (ప), దైవత (ద), నిషాదాలు (ని). అందుచేత సామవేదాన్ని భారతీయ సంగీతానికి నాందిగా భావిస్తారు. ప్రారంభదశలో సంగీతాన్ని నృత్యంలో భాగంగా భావించేవారు. నృత్యం, సంగీతం, నటనలను కలిపి - నాట్య శాస్త్రంగా పిలిచేవారు. భరతుని నాట్యశాస్త్రం (క్రీ.శ. 100) ఈ కళకు ప్రామాణిక గ్రంథం. మమ్మాత - సంగీతరత్నమాల (క్రీ.శ. 1100), సారంగధరుని సంగీతరత్నాకర (క్రీ.శ. 1260), విద్యారణ్యుని సంగీతసార (క్రీ.శ. 1380), దామోదర విరచిత సంగీతదర్పణం (క్రీ.శ. 1380), రామయామాత్య తోడరమల్లుని స్వరమేళ కళానిధి (క్రీ.శ. 1600) - ఇతర ప్రామాణిక గ్రంథాలు. భారతీయ సంగీతంలో స, ప ప్రాథమిక స్వరాలు. మిగిలిన రి, గ, మ, ద, ని రెండేసి స్వరాలుగా మొత్తం 12 స్వరాలు. ఒక్కొక్కసారి 16 స్వరాలు కూడా వర్ణించబడినవి. వాడుకలో 12 స్వరాలు సరిపడతాయి.



ఈ స్వరాల కలయికతో రాగాలు ఏర్పడతాయి. సప్తస్వరాలు ఉన్న రాగాలను 'మేళకర్త' లేక 'జనకరాగాలు' అంటారు. వీటి నుంచి వచ్చిన రాగాలను 'జన్యరాగాలు' అంటారు. వెంకటమఖి (క్రీ.శ. 1600) తన బృహత్‌గ్రంథం 'చతుర్దండి ప్రకాశిక' (సంస్కృతశ్లోక గ్రంథంలో) 72 జనకరాగాలను 2 కూటములుగా విభజించారు. ఆ గ్రంథంలో అనేక ప్రామాణిక విషయాలను ప్రస్తావించి, సంగీత కళాకారులకు ఈనాటికీ మార్గదర్శిగా నిలిచారు. జన్యరాగాలకు అంతు లేదు. ప్రతిభగల సంగీతకారులు ఇప్పటికీ కొత్త రాగాలను సృష్టిస్తున్నారు.

ప్రేమ, ద్వేషం, సున్నితత్వం, దుఃఖం, నిరాశ, కరుణ, ఆనందం లాంటి భావాలను వ్యక్తీకరించడానికి వివిధ రాగాలు తోడ్పడతాయి. రోజులోని సమయాన్ని బట్టి అంటే రాత్రి, పగటి విభాగాలు రాగనిర్దేశం చేయడం భారతీయ సంగీత ప్రత్యేకత. మాయామాళవ గౌళ (భైరవ) లాంటి రాగాలను ప్రాతఃకాలంలోనే ఆలపిస్తారు. కల్యాణి రాగం (యమన్) రాత్రివేళలకు పరిమితం. రోజులోని ఆ వాతావరణం స్వరం శక్తిని పెంచి, భావ ప్రకటనను సుసాధ్యం చేస్తుంది.

పాశ్చాత్య సంగీతానికి స్వరమేళనం (సింఫొనీ) కేంద్రస్థానమైతే, భారతీయ సంగీతానికి 'శ్రుతి' (తంబురా లాంటి శబ్దం), రాగం (స్వరం), తాళం (నిర్దేశించబడిన), లయ (ఒకే వేగంతో తాళం) - భారతీయ సంగీతానికి ప్రాణం. మొత్తం 35 రకాలైన తాళాలు కనిపెట్టబడ్డాయి.

భారతీయ సంగీతమంతా ఒకటే అయినప్పటికీ పర్షియన్ ప్రభావంతో అది ఉత్తరాది, దక్షిణాది (కర్ణాటక) సంగీత శాఖలుగా రూపొందింది. ఉత్తరాది సంగీతం వివిధ ఘరానాలుగా (సంప్రదాయాలుగా) ప్రాచుర్యంలో ఉంది.

(మిగతా 14వ పేజీలో...)

దివ్యశక్తి ప్రభావం



– స్వామి నిర్వాణానంద

స్వామి బ్రహ్మానంద (రాజా మహరాజ్) దివ్యసన్నిధిలో, దివ్యస్పర్శతో మానవుల దుఃఖాలు పటాపంచలయ్యేవి. అజ్ఞానం తొలగి పోయేది. బ్రహ్మజ్ఞాని అయిన రాజా మహరాజ్ దివ్యశక్తి ప్రభావం అర్థం చేసుకోవడానికి నేను (స్వామి నిర్వాణానంద) మహరాజ్ సేవకునిగా ఉన్నప్పుడు జరిగిన సంఘటనలలో రెండింటిని వివరిస్తున్నాను.

అది 1918వ సంవత్సరం. రాజా మహరాజ్ బాగ్‌బజార్‌లోని బలరామ్‌బోస్ ఇంట్లో బస చేసి ఉన్నారు. అప్పుడే మధ్యాహ్న భోజనం ముగించి, విశ్రాంతికి ఉపక్రమించనున్నారు. ఆ సమయంలో మహరాజ్ దర్శనార్థం ఒక పదిహేనేళ్ళ బాలిక, తన సోదరునితో సహా వచ్చింది. అప్పుడు అక్కడ మహరాజ్ సహాయకునిగా ఉన్న నేను 'ఇది మహరాజ్ విశ్రాంతి తీసుకునే సమయం. ఇప్పుడు మహరాజ్‌తో మాట్లాడడం కుదరదు' అని నిరాకరించాను. కానీ ఆమె పదే పదే అనుమతి అభ్యర్థిస్తూ 'మహరాజ్‌కు ప్రణామం చేసుకొని వెళ్ళిపోతాను' అంటూ విలపించనారంభించింది. ఆమె ఆర్తిని చూసి అనుమతించక తప్పలేదు.

ఆ అమ్మాయి ఎంతో సంతోషంగా మహరాజ్‌ను దర్శించడానికి వెళ్ళి, మహరాజ్ పాదాలపై పడి విలపించ నారంభించింది. మహరాజ్ భావావస్థలోకి వెళ్ళి నిశ్శబ్దంగా, స్థాణువులా కూర్చుండిపోయారు. కొద్దిసేపటి తర్వాత "లే అమ్మా! నా తల్లి! ఏమైందో చెప్పు" అంటూ ఓదార్చారు. ఆ అమ్మాయి ఇంకా ఏడుస్తూ కొద్దిసేపటివరకు ఏమీ మాట్లాడలేక స్తబ్ధుగా ఉండిపోయింది. ఆ తరువాత తేరుకుని గదిలోని శ్రీరామకృష్ణుల ఛాయాచిత్రం వైపు చూపిస్తూ "ఆయన మిమ్మల్ని కలవమన్నారు" అంది. మహరాజ్ స్పందిస్తూ, "నా అమ్మవు కదూ! ఏమి జరిగిందో చెప్పు తల్లీ" అన్నారు.

అప్పుడు ఆమె "నాకు పధ్నాలుగేళ్ళ వయస్సులో వివాహం జరిగింది. పెళ్ళైన రెండు వారాలకే భర్త మరణించాడు. అలా నా భవిష్యత్తు అంధకారం కాగా తీవ్రమైన విషాదంలో మునిగిపోయాను. అలా ఒక సంవత్సరం గడచిపోయింది. ఒకరోజు రాత్రి శ్రీరామకృష్ణులు కలలో కనిపించి 'దుఃఖించవద్దు. బాగ్‌బజార్‌లో నా రాఖాల్ ఉంటున్నాడు. అతని వద్దకు వెళ్ళు. అతను నీకు సహాయం చేస్తాడు' అన్నారు" అని తన కథను వివరించింది.

ఆమెకు రాఖాల్ ఎవరో తెలియదు. కలకత్తాలోని తన నివాసానికి ఎంతో దూరంలో ఉన్న బాగ్‌బజార్‌కు ఎలా వెళ్ళాలో కూడా తెలియదు. చివరకు అత్తమామల అనుమతి తీసుకొని, సోదరుని సహాయంతో బాగ్‌బజార్ వెళ్ళి వాకబు చేయగా రాజా మహరాజ్ 'ఉద్బోధన్'లో ఉన్నట్లు తెలిసింది.

అప్పుడు ఆ అమ్మాయి రాజా మహరాజ్‌ను దర్శించి దాదాపు రెండు గంటలు సంభాషించింది. మహరాజ్ ఆ అమ్మాయికి మంత్రదీక్ష ప్రసాదించారు. అప్పటి నుండి ఆ అమ్మాయి తరచుగా మహరాజ్‌ను కలవ డానికి రాసాగింది. ఇలా కొన్నాళ్ళు అయిన తరువాత ఆమె చాలా కాలం కనిపించలేదు.

అది 1942వ సంవత్సరం. ఒక సన్న్యాసిని తన శిష్యురాలితో సహా బేలూరు మఠానికి వచ్చింది. మొదట నేను ఆమెను గుర్తించలేదు. ఇరవై నాలుగేళ్ళ క్రితం జరిగిన సంఘటనను ఆమె గుర్తు చేసింది. అప్పుడు నేను ఆమెను గుర్తించి, 'ఇన్ని సంవత్సరాలు ఎక్కడ ఉన్నార'ని అడిగాను. "గురుదేవుల సూచన మేరకు కాశీ, బద్రీనాథ్, హరిద్వార్‌లలో ఆధ్యాత్మిక సాధనలు అభ్యసించాను. ప్రస్తుతం కాళీఘాట్‌లో శిష్యురాళ్ళతో కలిసి ఉంటున్నాను" అని ఆమె తెలిపింది. ఆమె ముఖవర్చస్సును చూసి, ఎంతో ఆధ్యాత్మిక పరిణతి సాధించినట్లుగా గ్రహించాను.

మూడు సంవత్సరాల తర్వాత ఆ సన్న్యాసిని శిష్యురాలు నన్ను చూడడానికి వచ్చింది. ఆ సన్న్యాసిని గురించి అడిగినప్పుడు ఆమె శిష్యురాలు నాతో "ఒకనాటి ఉదయం ఆమె పంచాంగాన్ని తెప్పించుకొని దగ్గరలోని ఒక శుభ ముహూర్తాన్ని చూసిపెట్టుకున్నారు. ఆ ప్రత్యేక దినాన మమ్మల్ని అందరినీ పిలిచి నిరంతరం ప్రార్థన, జప, ధ్యానాదులతో గడపమని చెప్పి, శ్రీరామకృష్ణులు, శారదామాత, రాఖాల్ మహరాజ్‌లను స్మరిస్తూ శరీరాన్ని విడిచారు" అని ఆ సన్న్యాసిని పరమపదించిన

సాధుపురుషులు తీర్థక్షేత్రములవంటివారు. తీర్థక్షేత్రాలను దర్శించడం వల్ల కలిగే ఫలం కాల క్రమంలో లభిస్తుంది. కానీ సాధుపురుషుల సందర్శనం వెంటనే ఫలితాన్నిస్తుంది. - వాయుపురాణం

విషయాన్ని తెలిపింది. ఆ సన్న్యాసిని ఈ లోకాన్ని ఎలా విడిచిపెట్టిందో తెలుసుకొని ఆశ్చర్యచకితుడనయ్యాను.

దేవేంద్రనాథ్ బోస్ (దేవేన్) అనే భక్తుడు శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష శిష్యులతో ఎంతో సన్నిహితంగా మెలిగేవాడు. ప్రత్యేకించి స్వామి అఖండానంద మహరాజ్‌తో ఎంతో సన్నిహితంగా ఉండేవాడు. దేవేన్ శ్రీరామకృష్ణుల మహాసమాధి అనంతరం సాధువుల వద్దకు రావడం మానేశాడు.

ఒకరోజు అనుకోకుండా దేవేన్‌బాబు, స్వామి అఖండానంద మహరాజ్‌కు కనిపించడంతో వారు అతనిని మఠానికి తీసుకొని వచ్చారు. ఆ సమయంలో రాజా మహరాజ్ కూడా అక్కడే ఉండడంతో వారు చాలా కాలం తరువాత కలసిన దేవేన్ మీద ఎంతో ఆదరణ చూపించారు. కానీ అక్కడ స్వామీజీలందరూ దేవేన్ వేషభాషలు, నడవడిక మారిపోవడం గమనించకపోలేదు.

కొద్దిరోజుల తరువాత దేవేన్, రాజా మహరాజ్ దర్శనార్థం వచ్చాడు. అప్పుడు మహరాజ్ గది బయట ఉన్న సహాయకుడు వేచి ఉండమని చెప్పినప్పటికీ, విచలిత మనస్కుడైన దేవేన్‌బాబు గది బయట స్థిమితంగా కూర్చొనలేక గదిలోకి వెళ్ళాడు. అతని గురించి విన్న మహరాజ్ మెల్లగా అతనిని సమీపించి, అతని ఛాతీని పలుమార్లు స్పృశిస్తూ 'ఏమైంది దేవేన్? గురుదేవులను జ్ఞాపకం చేసుకో! అంతా సర్దుకుంటుందిలే!' అన్నారు.

వెనువెంటనే దేవేన్‌లో గొప్ప మార్పు కనిపించింది. మహరాజ్ పాదాలపై పడి "మహరాజ్! ఇప్పుడు నాలో విషయాసక్తి పూర్తిగా నశించింది. నేనెంత అధఃపాతానికి పడిపోయానో ఇప్పుడే తెలిసి వచ్చింది. మీ కృపాదృష్టి, ఆశీర్వాదబలం నన్ను మళ్ళీ మనిషిగా మలచాయి. ఇక నాకు ఏ బాధలూ లేవు" అని అన్నాడు.

అప్పటి నుండి మళ్ళీ దేవేన్ మఠానికి రాకపోకలు కొనసాగించాడు. 'స్వామి బ్రహ్మానంద ఆధ్యాత్మిక బోధనలు' అనే పుస్తకానికి పరిచయం వ్రాస్తూ దేవేన్ పేర్కొన్న ఈ మాటలు ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి:

"గురుదేవుల ఆధ్యాత్మిక పుత్రులైన రాజా మహరాజ్ ఆధ్యాత్మిక శక్తి అన్ని దిక్కులకూ వ్యాపించేది. ఆయన సాంగత్యాన్ని పొందినవారు గొప్ప ఆధ్యాత్మిక లక్షణాలను సంతరించుకుంటారు. ఆహా! అనంతశక్తి, దివ్యతేజస్సు ఆ మానవదేహంలో ఎలా నిబిడీకృతమయ్యాయో ఎవరికి తెలుసు?". ❖

తెలుగుసేత : బ్రహ్మచారి శ్యామ్

(తిథి ప్రకారం జనవరి 22వ తేదీన శ్రీరామకృష్ణ పరమహంస సన్న్యాస శిష్యులైన స్వామి బ్రహ్మానంద మహరాజ్ జయంతి)

(...9వ పేజీ తరువాయి)

వెలుగుల కేతనం

సంక్రాంతి పండుగ ప్రధానంగా ప్రకృతితో, జనజీవనంతో, వ్యవసాయ కార్యకలాపాలతో ముడిపడిన పండుగ. వ్యవసాయం ప్రధానవృత్తి అయిన మన దేశంలో సంక్రాంతి పండుగ ఆనందాల పంటే, ఎందుచేతనంటే కష్టపడి సాగు చేసిన ధాన్యలక్ష్మి ఇంటికి వచ్చేది ఈ తరుణంలోనే. ఇంక సంక్రాంతి అంటే మనోహరమైన రంగవల్లులతో, ముంగిళ్ళు కళకళ లాడుతున్న దృశ్యం కళ్ళ ముందు మెదులుతుంది. పల్లెల్లో సందడి అయితే చూసి తీరవలసిందే కానీ చెప్పడానికి సాధ్యం కానిది. ఆవుపేడతో చేసి, పువ్వులతో సుందరంగా అలంకరించిన గొబ్బిళ్ళు, తెల్లవారుజాము నుండి హరినామ సంకీర్తనలతో అలౌకికానందాన్ని కలగజేసే హరిదాసులూ, 'అంబ పలుకు జగదంబ పలుకు' అంటూ డమరుకాన్ని వాయించే బుడబుక్కల వాళ్ళు, 'అయ్యవారికి దండం పెట్టు, అమ్మగారికి దండం పెట్టు' అంటూ డూ డూ బసవన్నలతో చిత్ర విన్యాసాలు చేయించే గంగిరెద్దులవాళ్ళు – ఇలా ఈ శోభ అంతా కన్నుల పండుగ చేసేది ఈ సంక్రాంతి సమయంలోనే.

కనుమ పండుగ ప్రధానంగా రైతుల పండుగ. ఈనాడు మనకు పాలిచ్చి పోషించే పశువులను సుందరంగా అలంకరించి కృతజ్ఞతాపూర్వకంగా పూజిస్తారు. పాడిపంటలను, పశుసంపదను లక్ష్మీస్వరూపంగా అర్చించడమే ఈ పండుగ ప్రత్యేకత. ఇన్ని విధాలుగా ప్రత్యేకతలను సంతరించుకున్న సంక్రాంతి పండుగ అందరికీ ఆధ్యాత్మిక బలాన్ని ఇచ్చేది కావాలని ఆశిద్దాం. ❖ **(జనవరి 15వ తేదీ గురువారం 'సంక్రాంతి')**

(...12వ పేజీ తరువాయి)

మన సంగీత కళ

సంగీత కచ్చేరీలన్నీ గాత్ర సంగీతకారునికే ప్రాధాన్యమిస్తాయి. దక్షిణాది సంప్రదాయ సంగీతంలో గాత్ర సంగీతానికి తోడ్పాటుగా వయొలిన్, మృదంగం లాంటి ప్రక్క వాద్యాలుంటాయి. శ్రుతి పలుకుతూ తంబురా ఎప్పుడూ ఉంటుంది. కొన్నిసార్లు ఘటం, కంజీర, మోర్సింగ్ లాంటి వాద్యాలు కూడా ఉంటాయి.

ఉత్తర భారత సంగీతంలో గాత్రానికి తోడ్పాటుగా తబలా, హార్మోనియం ఉంటాయి. ఒక్కొక్కసారి తంత్రీ వాద్యాలైన సారంగి, దిల్‌రుబాలను వాడతారు. తంబురా స్థానం తప్పదు. గాత్రమే కాక భారతీయ సంగీతంలో ప్రక్కవాద్యాలది ప్రత్యేకస్థానం. వేదవాఙ్మయంలో కూడా వీణ (వంద తంత్రులతో), ధనుర్వీణ, దుందుభి (ఢంకా), ఆడంబర లాంటి వాటిని ప్రస్తావించారు. పాశ్చాత్య దేశాల నుంచి వచ్చిన వయొలిన్ ధనుర్వీణను పోలి ఉండడం విశేషం. బాన్సురీ, వేణువు, సితార్, సరోద్, గోటువాద్యం, పక్వాజ్, ఖోల్, క్లారినెట్, నాదస్వరం, షెహనాయిలు కూడా కాలక్రమేణా వాడుకలోకి వచ్చాయి. ❖ **అనువాదం: డాక్టర్ పి.వి.రెడ్డి**

నాటికి నాడే నా చదువు
మాట లాడుచును మరచేటి చదువు॥
ఎనయ నీతని ఎరుగుటకే పో
వెనకవారు చదివిన చదువు
మనసున నీతని మరచుట కేపో
పనివడి యిప్పటి ప్రౌఢలచదువు
తెలిసి యితనినే తెలియుటకే పో
తొలుత కృతయుగాదుల చదువు
కలిగిన యీతని కాదననే పో
కలియుగంబులో కలిగిన చదువు
పరమని వేంకటపతి కనుటకే పో
దొరలగు బ్రహ్మాదుల చదువు
సిరుల నితని మరచెడి కొరకేపో
విరసపు జీవుల విద్యల చదువు॥

నాటికి నాడే నా చదువు

– శ్రీమతి బి.కృష్ణకుమారి

పారలౌకిక విజ్ఞానంలోనే కాదు, ప్రాపంచిక విశ్లేషణలో కూడా ఆ ప్రసన్నమూర్తి ప్రియభక్తుడు తన పద ప్రాభవాన్ని చాటుకున్నాడు. ఆధునికయుగంలో అర్థం లేకుండా తీస్తున్న పరుగు పరోక్షంగా మనల్ని ఆ పరమాత్మకు దూరం చేస్తోంది. ఉదాహరణకు పరంధాముడే పరమావధిగా సాగిన నాటి చదువులకూ, విశ్వేశ్వరుడినే విస్మరింపచేసే నేటి చదువులకూ ఆకాశానికీ, అగాధానికీ మధ్య ఉన్నంత వ్యత్యాసముంది.

ఈ భేదాన్నే భాగవతోత్తముడైన అన్నమాచార్యులు **'నాటికి నాడే నా చదువు'** అన్న కీర్తనలో అర్థవంతంగా అక్షరబద్ధం చేశారు. పుస్తకాల్లోంచి ఏవో నాలుగు అక్షరం ముక్కలు పుక్కిటపట్టి, పరీక్షల పేరుతో కాగితాలపై పుక్కిలించి పడేసి పట్టభద్రులమవుతూ ఉన్నాం. ఆ అహంకారంతో అన్నిటా మనకు మనమే ప్రజ్ఞావంతులం అనుకుంటూ, తుదకు ఆ దేవదేవుడి ఉనికిని కూడా ధిక్కరిస్తూ ఉన్నాం. అణకువను పెంచిన నాటి చదువరులకూ, అహంకారాన్ని ప్రదర్శించే నేటి చదువరులకూ మధ్య ఎంత వ్యత్యాసముందో విశ్లేషిస్తూ, ఏది విలువైన విద్యో వేంకటేశ్వరుడి విశేషభక్తుడు విన్నవిస్తూ ఉన్నాడు. ఈ పరంపరగా స్వామి వివేకానంద కూడా ఓ సందర్భంలో "కేవలం బాహ్య ప్రపంచాన్ని అధ్యయనం చేయడమే విద్య కాదు; బాహ్యప్రకృతి కన్నా, అగ్నిపర్వత విస్ఫోటనం కన్నా లక్షల రెట్లు శక్తిమంతమైన మనిషి అంతఃప్రవృత్తిని అర్థం చేసుకోవడమే అసలైన విద్య" అంటారు.

మాటలాడుచూ మరచేటి చదువు!

ఈ రోజుల్లో వీధి బడి నుంచి విశ్వవిద్యాలయం స్థాయి వరకు మనం అభ్యసిస్తున్న విద్య అధికశాతం భౌతిక ప్రపంచానికి పనికివచ్చేదే తప్ప, ఆంతరంగిక చైతన్యాన్ని మేల్కొలిపేది కాదు. ఈ చదువుతో జీవితంలోని సమస్యలకూ, సంఘర్షణలకూ శాశ్వత పరిష్కారాలు లభించే అవకాశమే లేదు. కేవలం అప్పటి బతుకు అవసరాలను తీరుస్తూ, మాటలతో మైమరపింపజేస్తూ మనల్ని భ్రమల్లో ముంచేస్తుంది. అదే భావంతో అన్నమాచార్యులు తమ సంకీర్తనకు శ్రీకారం చుడుతూ...

నాటికి నాడే నా చదువు; మాట లాడుచును మరచేటి చదువు అంటున్నారు. చాలా మటుకు చిలకపలుకుల్లాంటి ఈ ప్రాపంచిక చదువులు సృజనాత్మకతను హరించి వేసి, మనల్ని మూసబొమ్మలుగా తయారుచేస్తున్నాయి. రాక్షసేంద్రుడైన హిరణ్యకశిపుడు తన కుమారుడు ప్రహ్లాదుడిని చండామార్కుల వద్ద విద్యాభ్యాసం చేయమని పంపుతాడు. కానీ ఆ గరుడగమనుడి ఊసే లేకుండా గురువులు చెప్పే శాస్త్రాలు ఆ బాలభక్తుడికి రుచించలేదు. అందుకే తోటి మిత్రులతో...

చెప్పరొక చదువు మంచిది
చెప్పెడి తగులములు చెవులు చిందర కొనగా
నెప్పుడు మనయెడ నొజ్జలు
చెప్పెద నొక చదువు వినుడు చిత్తము లలరన్! 'మిత్రులారా! గురువులు మనకు మంచి చదువు ఒక్కటీ చెప్పడం లేదు. చెవులు చిల్లులు పడేలాగా సంసారభోగ విషయాలే ఎప్పుడూ చెబుతున్నారు. మీ మనస్సుకు నచ్చే ఒక మంచి చదువు నేను చెబుతాను' అంటూ విష్ణుకథను వినిపిస్తాడు. దురదృష్టవశాత్తూ ఈ కలియుగంలో మన చదువులు కూడా ఆ చండామార్కుల గురుకులంలో లాగే సాగిపోతున్నాయి.

ఈతని ఎరుగుటకే వెనకటి చదువు...

ఏది చదివితే ఇంక ఏమీ చదవాల్సిన అవసరం లేదో, అదే అసలైన చదువు. ఆనాటి విద్యాభ్యాసమంతా ఆ దిశలోనే

(మిగతా 34వ పేజీలో...)

పొట్టకూటి చదువు నాకెందుకు? దానికి బదులు భగవత్సాక్షాత్కారానికి తోడ్పడే, ఆత్మవికాసాన్ని కలిగించే, శాశ్వతానందాన్ని ఒసంగే జ్ఞానాన్ని నేను సముపార్జించగోరతాను. - శ్రీరామకృష్ణులు

పరిప్రశ్న

– స్వామి భూతేశానంద

(రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు)

రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు - స్వామి భూతేశానందజీ మహరాజ్ (1901-1998) భక్తుల ఆధ్యాత్మిక సందేహాలకు సరళమైన రీతిలో ఇచ్చిన సమాధానాలను 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకుల ప్రయోజనార్థం 2013 జూలై సంచిక నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

భక్తుడు: జపధ్యానాలు అభ్యసిస్తున్నప్పటికీ మనస్సు ఆకర్షణలకు లోనవుతోంది. ఈ స్థితిని అధిగమించడానికి ఏం చేయాలి?

స్వామీజీ: నడుస్తున్న పిల్లవాడు కిందపడితే ఏం చేస్తాడు? మరలా లేచి నడవడానికి ప్రయత్నిస్తాడు. అంతేగానీ కిందపడినవాడు అలాగే ఉంటే జీవితంలో నడవడం సాధ్యమవదు కదా! సాధకుడు కూడా ఇదే పద్ధతిని అనుసరించాలి. సాధన ప్రారంభంలో మనస్సు ఊగిసలాడడం సర్వసాధారణం. జపధ్యానాలను క్రమం తప్పకుండా అభ్యసిస్తూ ఉంటే మనస్సుకు నిశ్చలత్వం చేకూరుతుంది. అప్పుడు బాహ్య విషయాలు సాధకుణ్ణి ఆకర్షించలేవు. మనస్సు ఆకర్షణలకు లోనవుతోందని నిరుత్సాహపడి సాధన నిలిపివేస్తే, ఆధ్యాత్మిక ప్రగతి ఎన్నటికీ సాధ్యం కాదు.

భక్తుడు: ఎన్నో మంచి విషయాలను వింటాం, చదువుతాం. కానీ వెంటనే మరచిపోతున్నాం. సద్విషయాలు, సదాలోచనలు మనస్సులో స్థిరంగా ఉండాలంటే ఏం చేయాలి?

స్వామీజీ: శ్రీరామకృష్ణులు 'పశువులు తిన్న గ్రాసాన్ని, ఒక చోట తీరిగ్గా కూర్చొని నెమరువేస్తాయి. అలాగే మీరు కూడా విన్న భగవద్విషయాలను మననం చేస్తూవుండాలి. అప్పుడే ఆ విషయాలు మనస్సులో స్థిరంగా నిలచిపోతాయి' అని చెప్పేవారు.

శ్రవణం – సద్విషయాలను వినడం; మననం– విన్న సద్భావాలను తరచూ గుర్తు చేసుకోవడం. శ్రవణం, మననం అభ్యసిస్తూ ఉంటే కాలక్రమంలో మనస్సు పరిశుద్ధమై భగవద్ధ్యానంలో నిమగ్నమవుతుంది. అలా మనస్సును భగవంతునిపై ఏకాగ్రం చేయడం ద్వారా ఆనందానుభూతి కలుగుతుంది. దానినే 'నిదిధ్యాసనం' అంటారు. శ్రవణం, మననం, నిదిధ్యాసనాలను అభ్యసిస్తే ఆధ్యాత్మిక జీవితంలో పురోగతి తప్పక సాధ్యమవుతుంది.

భక్తుడు: ఈ రోజుల్లో సమాధిస్థితిని చాలామంది పొందుతున్నారు. ఒక్కసారి సమాధిస్థితి పొందిన సాధకుడు మరలా సాధారణ స్థితికి రావడం సాధ్యమా?

స్వామీజీ: ఈ రోజుల్లో చాలామందికి సమాధిస్థితులు కలుగుతున్నాయని తరచూ వింటున్నాం. ముఖ్యంగా శ్రీరామకృష్ణ కథామృతం చదివినవారు 'సమాధి' అనే మాటను తరచూ వాడడం చూస్తుంటాం. శ్రీరామకృష్ణులు తరచూ సమాధిస్థితులను పొందుతుండేవారు. ఆయన జీవిత చరిత్ర చదివినవారు సమాధిస్థితిని పొందడం చాలా సులభమైన విషయంగా భావిస్తారు.

నిజానికి సమాధిస్థితిని పొందడం మనం అనుకున్నంత సులభమైన విషయం కాదు. సమాధిస్థితికి చేరడానికి ముందు ఎన్నో అవస్థలను అధిగమించాలి. ఎంతో సాధన చేయాలి. శ్రీరామకృష్ణుల అద్వైతగురువైన తోతాపురికి నలభై ఏళ్ళ కఠోరసాధనతో నిర్వికల్ప సమాధిస్థితి సాధ్యమైంది. అదే శ్రీరామకృష్ణులు ఒక్కరోజులోనే ఆ అనుభూతిని పొందగలిగారు. దీన్నిబట్టి శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మికశక్తి ఎంత మహోన్నతమైనదో తెలుస్తుంది.

సమాధిస్థితికి వెళ్ళిన ప్రతి ఒక్కరూ సాధారణ స్థితికి తిరిగి రాలేరు. అలా వచ్చారంటే వారు అవతారపురుషులై ఉండాలి. 'కేవలం అవతారపురుషులు మాత్రమే నిర్వికల్ప సమాధిస్థితి నుండి సాధారణ స్థితికి తిరిగి రాగలరు' అని శ్రీరామకృష్ణులు ఉద్ఘాటించారు. ❖

పండుగలు - పర్వదినాలు

జనవరి - 2015

01	గురువారం	: కల్పతరు దినోత్సవం, వైకుంఠ ఏకాదశి
04	ఆదివారం	: స్వామి తురీయానంద జయంతి
12	సోమవారం	: స్వామి వివేకానంద జయంతి (తిథి ప్రకారం) జాతీయ యువజన దినోత్సవం
15	గురువారం	: సంక్రాంతి
16	శుక్రవారం	: ఏకాదశి
22	గురువారం	: స్వామి బ్రహ్మానంద జయంతి
23	శుక్రవారం	: స్వామి త్రిగుణాతీతానంద జయంతి
24	శనివారం	: సరస్వతీ పూజ
30	శుక్రవారం	: ఏకాదశి

ఫిబ్రవరి - 2015

03	మంగళవారం	: స్వామి అద్భుతానంద జయంతి
15	ఆదివారం	: ఏకాదశి
17	మంగళవారం	: మహాశివరాత్రి
20	శుక్రవారం	: భగవాన్ శ్రీరామకృష్ణుల జయంతి (తిథి ప్రకారం)



రామకృష్ణ భక్తి సూత్రాలు

– స్వామి యతీశానంద

నారద భక్తి సూత్రాలు, శాండిల్య భక్తి సూత్రాలు భక్తియోగానికి సంబంధించిన ప్రామాణిక గ్రంథాలు. అయితే ఆధునిక తరంలో భగవదన్వేషకులకు అనువైన రీతిలో భక్తితత్త్వాన్ని బోధించారు శ్రీరామకృష్ణులు. ఈ నేపథ్యంలో 'శ్రీరామకృష్ణ కథామృతం' నుండి కొన్ని ఉపదేశాలను 'రామకృష్ణ భక్తి సూత్రాలు'గా సులభరీతిలో వివరించే ప్రయత్నం చేస్తున్నాం.

బౌద్ధగ్రంథాలు పాళీ భాషలో, బైబిల్ హీబ్రూలో, ఖురాన్ అరబ్బీ భాషలో రచించబడ్డాయి. అలాగే శ్రీరామకృష్ణుల ఉపదేశాలు వారి మాతృభాష బెంగాలీలో ఆవిష్కృతమయ్యాయి. అవతార పురుషుని ముఖతః వెలువడిన ఆ అమృతోపదేశాలను యథాతథంగా ఉట్టంకిస్తూ వ్యాఖ్యానిస్తున్నాం. మహాశక్తిమంతమైన ఆ బోధనలను మననం చేసుకుంటూ కృతార్థులమవుదాం.

**తాఁర్ విషయ్ కే విచార్ కొరె
బుఝ్బే? తాఁర్ పాదపద్మే భక్తి జాతే
హోయ్, తాఇ సకలేర్ కొరా ఉచిత్.**

తర్కించి ఆయనను గురించి
తెలుసుకొనగలవా? ఆయన పదసరోజాల
పట్ల ఎలా భక్తి కలుగుతుందో
ఆ ప్రయత్నం చేయడం సముచితం.

శ్రీరామకృష్ణ ఉవాచ: 'నీవు పూర్ణబ్రహ్మము' అని అర్జునుడు, శ్రీకృష్ణుణ్ణి స్తుతించసాగాడు. 'నేను పూర్ణబ్రహ్మమా, కాదా అన్నది చూద్దువుగాని రా!' అన్నాడు కృష్ణుడు. ఒక ప్రక్కకు తీసుకొని వెళ్ళి, 'అక్కడ ఏమి కనపడుతున్నది' అని ప్రశ్నించాడు. 'ఒక పెద్ద వృక్షం. దానికి అల్లనేరేడు పండ్ల వంటి నల్లని పళ్ళు గుత్తులు గుత్తులుగా వేళ్ళాడుతున్నాయి' అన్నాడు పార్థుడు. 'మరి కొంచెం దగ్గరకు వెళ్ళి చూడు! అవి పండ్ల గుత్తులు కావు. అసంఖ్యాకమైన కృష్ణులు' అన్నాడు. అంటే అర్థం పూర్ణబ్రహ్మరూపమైన కృష్ణుడి నుండే అసంఖ్యాకమైన అవతారాలు వచ్చాయని.

పరమాత్ముని అనంత మహత్తు గురించి తెలుసుకొనవలసిన అగత్యం ఏమిటి? ఆయన గుణాలను కోటి సంవత్సరాలు ఆలోచించినా, ఏమీ తెలుసుకొనలేము. భగవంతుణ్ణి తర్కం ద్వారా ఎవరు తెలుసుకొనగలరు?

మనకు ఉండవలసినది భక్తి. ఆయన అనంత ఐశ్వర్యం గురించి తెలుసుకోవడం అనవసరం. నా దాహం తీరడానికి ఒక చెంబు నీరు చాలు. ఈ భూమిపై ఎంత జలం ఉన్నదనే విషయంతో ప్రయోజనమేమిటి?

పూర్తిగా ఎవరు తెలుసుకొనగలరు? ఎంత అవసరమో అదే చాలు! ఒక చెంబు నీరు చాలు. బావిలో ఉన్న నీరంతా తోడి ఏమి చేసుకుంటాను? ఒక చీమ పంచదార కుప్ప దగ్గరకు వెళ్ళింది. ఒకటి, రెండు కణాలు తింటేనే దాని కడుపు నిండిపోతుంది. పూర్తి కుప్ప అవసరం లేదే!

ఆయన ఇది అనీ, అది కాదనీ గట్టిగా చెప్పలేము. మనిషికి ఉండేది ఒక చటాకు (50 గ్రాములు) తెలివి. దానితో భగవంతుని స్వరూపం తెలుసుకుంటాడా?

ఒక శేరు సామర్థ్యం ఉన్న కుండలో పది శేర్ల పాలు పడతాయా? ఒక ఉప్పుబొమ్మ సముద్రపు లోతు తెలుసుకునేందుకు దిగింది. అంతే! కరిగి, నీటిలో కలిసిపోయింది.

భగవంతుడివి నానారూపాలు, నానా లీలలు. మనకు ఉండవలసినది భక్తి! తోటలో ఎన్ని చెట్లున్నాయి? ఒక్కొక్క చెట్టుకు ఎన్ని కొమ్మలున్నాయి? ఇదంతా ఎందుకు? పండ్లు తినడానికి వచ్చావు. తిని వెళ్ళిపో! ఆయన పట్ల భక్తి పెంపొందించుకోవడమే ఈ మానవ జన్మ లక్ష్యం.

వ్యాఖ్య: భగవద్విషయం అనగా ఆయన లీల, సృష్టికార్యం, స్వరూపం, శక్తి – వీటినే చర్చిస్తాం. జీవులు ఆయన సృష్టి కనుక సృష్టికర్తను సంపూర్ణంగా తెలిసికొనలేము. అలాకాక, జీవి ఆయన అంశం అంటే, అంశం పూర్ణాన్ని కొలవజాలదు. ఆయన అనంత కార్యాలను సామాన్య జీవి ఎలా తెలిసికొనగలదు. ప్రతి ఇసుక రేణువునూ, ధూళికణాన్నీ ఆయన ప్రత్యేకంగా సృష్టించాడు.

కాబట్టి శ్రీరామకృష్ణులు ఏ మార్గం ద్వారా మనిషి ఆనందం, శాంతి, సాక్షాత్కారం పొందగలరో చెప్పారు. అది సులభమైన మార్గం. భగవంతుని పాదపద్మాలపై భక్తి కలిగి ఉండడం సముచితం అన్నారు. చీమ నోరు ఒక్క పంచదార కణంతో నిండిపోతే, ఇక మొత్తం కుప్పను తీసికొనివెళ్ళగలదా? ఆ విధంగానే, భగవంతుని కృపాసాగరంలో ఒక్క బిందువుతో మనిషి కృతార్థుడు కాగలడు. మనిషి పురుష యత్నం, భగవదనుగ్రహాలతో జ్ఞానం పొందితే ఈ జన్మే కాదు ఇక అన్ని జన్మలూ అంతం అవుతాయని (ఇక జన్మ ఉండదని) ఉప్పుబొమ్మ దృష్టాంతం ద్వారా శ్రీరామకృష్ణులు తెలియజెప్పారు. అప్పుడిక భగవంతుడి గురించి తర్కించి తెలుసుకొనేందుకు మిగిలి ఉండడు కదా! తర్కం యొక్క ఆవశ్యకత కూడా కనపడదు. మనిషి శరణాగతుడై, ఆయన దర్శనం కోసం ప్రార్థిస్తే దర్శనానంతరం అన్ని బంధనాలూ, దుఃఖాలూ నాశనం అవుతాయి. చీకటి గదిలోకి దీపం తేగానే చీకటి మటుమాయమైనట్లు బంధనాలు తొలగిపోతాయి. ❖ **అనువాదం: డాక్టర్ కమల జయరావు**

ఎవరి యందు బ్రహ్మచైతన్యం పరిపక్వమగునో వారు మాత్రమే పరబ్రహ్మైక్యమును పొందుదురు. కానీ తర్కవితర్కాలు చేయువారు ఎన్నటికీ ఆ పరమపదమును పొందజాలరు. – అపరోక్షానుభూతి

విషయతృష్ణ ఉపశమనం

- మంత్రవాది మహేశ్వర్

ఒక ఉద్యానం. ఒక పిల్లవాడు మరికొందరు పిల్లలతో కేరింతలు కొడుతూ ఆడుకుంటున్నాడు. కాస్త దూరంగా కూర్చొని ఉన్న ఆ పిల్లవాడి తల్లి దృష్టి వాడి మీదే ఉంది. పడిపోతే దెబ్బలేమైనా తగులుతాయేమోనన్న ఓ రకమైన ఆదుర్దా కూడా ఆమెలో లేకపోలేదు. ఆ పిల్లవాడు మాత్రం ఆటల్లో మునిగిపోయి, తల్లి తనను గమనిస్తుందనే విషయాన్ని మరచిపోయాడు. కానీ ఆ తల్లి దృష్టి అంతా ఆ పిల్లవాడి మీదే!

జగన్మాత కూడా ఆ తల్లి లాంటిదే. మనందరినీ జీవితంలో మంచీ చెడుల ఆట ఆడుకోవడానికి ఈ ప్రపంచానికి పంపింది. ఈ భౌతిక ప్రపంచంలో మనమంతా విచక్షణతోనో, విచక్షణ రహితంగానో ఆడుతూనే ఉంటాం. ఎప్పుడైతే పిల్లవాడు ఆట ఇక చాలనుకుంటాడో అప్పుడు తల్లి వద్దకు వెళతాడు. అలాగే, మనలో ఎప్పుడైతే ఈ భౌతిక విషయాల పట్ల ఆసక్తి సన్నగిల్లుతుందో అప్పుడు భగవంతునివైపు మరలుతాం.



ప్రపంచంలో ఉంటూనే ప్రాపంచిక విషయాల పట్ల ఆసక్తి లేకుండా జీవించడానికి మనలో వైరాగ్యభావన కలగాలి. ఉదాహరణకు కుటుంబ సభ్యులతో కలిసి మంచి రుచికరమైన ఆహారం తీసుకుంటూ ఉండవచ్చు. అయితే అది అంత ఆనందాన్ని ఇవ్వకపోవచ్చు. అందుకు కారణం మన ధ్యాస దాని మీద లేకపోవడమే!

అలాంటి మానసిక స్థితి కలగడానికి బాహ్య ప్రపంచంతో ఎలాంటి సంబంధమూ లేదు. అసలైన వైరాగ్యం అంతర్గతంగా కలగాలి.

'వైరాగ్యభావం తెచ్చుకోవాలి' అని అనుకుని ఏ అడవులకో, నిర్మానుష్య ప్రదేశాలకో వెళితే భోగభాగ్యాల నుంచీ, ఇంద్రియసుఖాల నుంచీ దూరంగా ఉండడం భౌతికంగా జరగవచ్చు. కానీ సుఖాలను పొందలేకపోతున్నాం, భోగాలను అనుభవించలేకపోతున్నామనే ఆలోచనలు మరింతగా ముసురుకుంటాయి. ఆ పరిస్థితులే వస్తే అటూ ఇటూ కాని డోలాయమానస్థితి ఏర్పడుతుంది.

అందుకే భగవాన్ శ్రీకృష్ణుడు విషయాలకు దూరంగా ఉన్నంత మాత్రాన విషయాసక్తి అంత సులభంగా తొలగదు అంటూ...

విషయా వినివర్తన్తే నిరాహారస్య దేహినః ।
రసవర్జం రసోఽప్యస్య పరం దృష్ట్వా నివర్తతే॥

(భగవద్గీత 2-59)

'ఇంద్రియాల ద్వారా విషయాలను గ్రహించని సాధకుడి నుండి విషయాలు దూరమవుతాయి. కానీ విషయతృష్ణ ఉపశమించదు. ఆత్మసాక్షాత్కారమైతే విషయ తృష్ణ తొలగిపోతుంది' అని వివరించాడు.

విషయాల నుండి భౌతికంగా దూరమైనంత మాత్రాన మనస్సు నుండి విషయాసక్తి వెంటనే తొలగిపోదు. అయితే ఈ పరిపక్వత లోపించినప్పుడు మనలో విషయతృష్ణ తొలగిపోయిందనే భావన మెరుపులా మెరిసి మాయమయ్యే సందర్భాలు ఏర్పడుతుంటాయి. మళ్ళీ యథార్థస్థితి కొనసాగుతుంది. అలాంటి స్థితి నుండి బయటపడాలంటే మనలో ఆధ్యాత్మిక చింతన పెరగాలి.

ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవడానికి పవిత్ర గ్రంథాలు, మహానుభావుల జీవిత గాథలు, ప్రవచనాలు మనకు మార్గదర్శకం అవుతాయి; మనశ్శాంతికీ, మనుషుల నడవడికకూ ఎంతగానో దోహదపడతాయి. అప్పుడు మనలో వైరాగ్యస్థితి బలపడి, క్రమంగా విషయతృష్ణ ఉపశమిస్తుంది. ❖



మతసామరస్యం పరిమళించిన వేళ...

– 'భారతరత్న' అబ్దుల్ కలామ్

ఒకసారి నన్ను (అబ్దుల్‌కలామ్) రాజ్‌కోట్‌కు చెందిన బిషప్ రెవరెండ్ ఫాదర్ గ్రెగరీ తమ కళాశాలను ప్రారంభించేందుకు ఆహ్వానించారు. ఆ కార్యక్రమానికి నేను ముఖ్య అతిథిగా వెళ్ళినప్పుడు ఫాదర్, నన్ను తన ఇంటికి తీసుకువెళ్ళారు. నేను ఆ ఇంటిలో అడుగుపెట్టగానే నాకొక తీర్థక్షేత్రంలో అడుగుపెడుతున్న భావన కలిగింది. అన్ని మతాలనూ, అన్ని సంప్రదాయాలనూ గౌరవించే ఒక ప్రార్థనామందిరం ఆ ఇంట్లో కనిపించింది. ఫాదర్ కుటుంబసభ్యులు అన్ని మతాలనూ ఆదరిస్తారని తెలిసి ఆనందాశ్చర్యాలు కలిగాయి. ఫాదర్ గ్రెగరీ ఆ మందిరం ప్రాధాన్యాన్ని నాకు వివరిస్తూ ఉండగానే, అక్కడికి దగ్గరలో ఉన్న స్వామి నారాయణ్ దేవాలయం నుంచి నాకు ఆహ్వానం వచ్చింది. నేను ఆ మందిరానికి వెళుతున్నానని ఫాదర్ గ్రెగరీకి చెప్పగానే ఆయన కూడా నాతో పాటు అక్కడికి వస్తానన్నారు.

మేము స్వామి నారాయణ్ దేవాలయానికి వెళ్ళి, అక్కడ గర్భగుడిలో సుప్రతిష్ఠితుడై ఉన్న శ్రీకృష్ణభగవానుని ప్రతిమను చూశాము. మాతో బాటు మా మిత్రుడు వై.ఎస్. రాజన్ కూడా అక్కడే ఉన్నారు. ఆలయ పూజారులు మా నుదుట తిలకం దిద్ది మమ్మల్ని లోనికి ఆహ్వానించారు. అక్కడ మేము ముగ్గురం (ఫాదర్ గ్రెగరీ, అబ్దుల్ కలామ్, వై.ఎస్. రాజన్‌లు) మూడు మతాలకు ప్రతినిధులుగా శ్రీకృష్ణభగవానుడి విగ్రహం ముందు నిలబడి ప్రణామాలు అర్పించాం. అది మరపురాని అద్భుత దృశ్యం. మన భారతదేశంలో వివిధ మతాల మధ్య అల్లుకున్న అనుబంధం ఎలాంటిదో, అది ఎంతటి ఆధ్యాత్మిక అనుభూతిని ప్రసాదిస్తుందో ఆ దృశ్యం నిరూపిస్తుంది.

వేదపండితుడి విలువైన మాటలు : ఒకసారి నేను బెంగుళూరులో ఓ సభకు ముఖ్య అతిథిగా వెళుతూ నా మిత్రుడికి ఆ సంగతి చెప్పి, పిల్లలతో మాట్లాడడానికి ఏవైనా సూచనలిమ్మని అడిగాను. అతడు నాకు సూచనలు ఏవీ ఇవ్వలేదు; కానీ కళ్ళుమూసుకొని నాలుగు మాటలు వినిపిస్తూ, "నువ్వు మాట్లాడినప్పుడు సత్యమే మాట్లాడు! నువ్వు చేసిన వాగ్దానాన్ని నెరవేర్చు. నీ మీద పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకో! నీ చేతుల్ని హింసకు దూరంగా ఉంచు! అక్రమమైనదాన్ని అందుకోకుండా చాచిన చేతుల్ని వెనక్కి తీసుకో!

ఎదుటి మనిషిని సంతోష పెట్టడం కన్నా మించిన సాధన లేదు. ఈ సృష్టి అంతా భగవంతుడి కుటుంబమే! ఎవరు ఆయన సృష్టించిన వాటి హితం కోరతారో, వాటికి హితం చేకూరుస్తారో అతడే భగవంతుడికి అత్యంత ప్రీతిపాత్రుడు."

నా మిత్రుడు ఈ వాక్యాల్ని పిల్లలతో చెప్పించమంటూ, ఇవి మహమ్మద్ ప్రవచనాలని గుర్తుచేశాడు. ఆ మిత్రుడు ఎవరో కాదు, ప్రముఖ వాగ్గేయకారుడు ముత్తుస్వామి దీక్షితార్ వంశానికి చెందిన వేదపండితుడు. నాకు కూడా స్ఫురించని ఖురాన్ సూక్తుల్ని ఓ సద్బ్రాహ్మణుడు గుర్తుచేయడం ఆనందాన్ని కలిగించింది. ఇటువంటి విశాలభావన ఒక్క భారతదేశంలోనే సాధ్యమనిపిస్తుంది. మన దేశంలో వర్ధిల్లిన బహుళ సంస్కృతుల వల్ల మనుషులు తమ మతాల్ని దాటి ఎదుటి మతాల్లో మంచిని కూడా మెచ్చుకోగలిగే స్థితికి ఎదుగుతారు.

నిజానికి ప్రతి మతంలోనూ రెండు భాగాలుంటాయి. ఒకటి మతబోధన; రెండవది ఆధ్యాత్మిక అంతర్దృష్టి. ప్రేమతో, సామరస్యంతో, దయతో కూడుకున్న ఆధ్యాత్మిక దర్శనం మన జీవిత లక్ష్యాలతో కలగలసిపోవాలి. మతాలు ఆధ్యాత్మిక శక్తిగా ఎదగడమంటే ఏమిటో అరవిందాశ్రమానికి చెందిన శ్రీమాత మాటల్లో చెప్పాలంటే, "నేను ఏ దేశానికీ చెందను. ఏ నాగరకతకూ చెందను. నాకొక సమాజం కానీ, నాకంటూ ఒక జాతి గానీ లేవు. నేను భగవంతుడి మనిషిని. నేను ఆయన ప్రతినిధిగానే ఈ లోకంలో జీవించాలి. ఆయన సూచించిన మార్గంలో నడవాలి." ❖ సేకరణ: ఎమ్.రాంబాబు

హైందవ మతంలో వైష్ణవ, శాక్తేయ, వేదాంతాది సంప్రదాయాలను; మహమ్మదీయ, క్రైస్తవ మతాలను అవలంబించి సాధన చేశాను. ఏ మార్గమైనా ఒకే గమ్యాన్ని చేరుస్తుందని కనుగొన్నాను. – శ్రీరామకృష్ణులు

రక్షించేది ఎవరు?

– శ్రీమతి భమిడిపాటి బాలాత్రిపురసుందరి

భగవంతుడు స్వయంగా రక్షిస్తుంటే... వాళ్ళనూ, వీళ్ళనూ పిలిచి రక్షించమని అడగడం జ్ఞానవంతుడు చెయ్యవలసిన పని కాదు. యోగి అయినవాడికి బంధాలు ఉండవు. వాటిని పట్టించుకోడు. రాగద్వేషాలు వదిలేసి, భగవంతుణ్ణి ధ్యానిస్తూ సర్వ బాధ్యతలూ ఆయన మీదే పెట్టి జీవిస్తాడు.

"రక్షకులు లేని వారల రక్షించెదననుచు చక్రి రాజై యుండన్
రక్షింపుమనుచు నొక నరునక్షము ప్రార్థింపనేల నాత్మజునకున్"

ఒక పండితుడు రాజు దగ్గరకు వెళ్ళి, "నేను పురాణాలు బాగా చదివాను. వాటిలో ప్రశ్నలు వేస్తే అన్నింటికీ జవాబివ్వగలను. ప్రశ్నలు వేసి, నాకు దక్షిణ ఇప్పించండి!" అన్నాడు. రాజు మాత్రం పండితుణ్ణి మరొకసారి చదువుకుని రమ్మన్నాడు. రెండోసారి మళ్ళీ వచ్చాడు పండితుడు. ఇంకా చదువుకుని రమ్మన్నాడు రాజు.



అన్నిసార్లు ఎందుకు వెనక్కి పంపిస్తున్నాడో తెలియని పండితుడు ఈసారి దీక్షగా చదవాలని అనుకొని, మళ్ళీ పారాయణ మొదలెట్టాడు. ఆ పండితుడికి అప్పుడు అర్థమైంది. "భగవంతుడే 'నేను రక్షిస్తాను' అని చెబుతుంటే, నేను వెళ్ళి ఒక మానవ మాత్రుణ్ణి రక్షించమని అడుగుతున్నానేంటి!" అని తెలుసుకున్నాడు. పురాణాలను మరింత లోతుగా తెలుసుకుని, వాటి గురించి పదిమందికీ తెలియజెప్పడం ప్రారంభించాడు. ఎంతోమంది వచ్చి పురాణం విని వెళుతున్నారు. వాళ్ళందరూ భక్తి మార్గంలో నడుస్తూ, ఇంకా కొంతమందిని ఆ మార్గంలోకి ఆహ్వానిస్తున్నారు. భక్తులే ఆ పండితుడికి అన్ని సదుపాయాలూ కల్పించారు. వసతితో పాటు, వంటావార్పు అక్కడే జరిగి భక్తులకి కూడా ప్రసాదం అందుతోంది. పండితుడు మాత్రం పురాణ ప్రవచనం చేస్తూ, భక్తిలో మునిగి జీవిస్తున్నాడు.

ఒక రోజు రాజు తన పరిచారకుణ్ణి పిలిచి, తన దగ్గరకు వచ్చి వెళ్ళిన పండితుడు ఏం చేస్తున్నాడో చూసి రమ్మన్నాడు. అతడు వెళ్ళి పండితుణ్ణి చూసి వచ్చాడు. అతని దగ్గరకు వచ్చి పోతున్న భక్తుల రాకపోకల్ని మహారాజుకు చెప్పాడు. అప్పుడు మహారాజు స్వయంగా ఆ పండితుడి దగ్గరకు వెళ్ళి సాష్టాంగ నమస్కారం చేసి, "మీకు ఏం కావాలో అడగండి. ఇస్తాను!" అన్నాడు. అది విని పండితుడు "అయ్యో! భగవంతుణ్ణి నమ్ముకుంటే అవసరమైనవి అవే వస్తాయి. నాకు ఏం కావాలో భగవంతుడికే తెలుసు!" అని బదులిచ్చాడు.

భగవంతుడు ఒక గొప్ప శిల్పి. సూర్యుడు ఎంత ఎత్తులో ఉంటే మనిషికి బాధ కలుగదో అంత ఎత్తులో పెట్టి, వెలుగును ప్రసాదిస్తున్నాడు. చంద్రుడు దగ్గరైతే సముద్రాలు పొంగుతాయని లెక్కలు కట్టి, అదే దూరంలో పెట్టాడు. రుచికరమైన గుజ్జును లోపలపెట్టి, అది కలుషితం అవకుండా పైన తొక్కను పెట్టి, అరటిపండు వంటి ఆహారపదార్థాల్ని ఎన్నింటినో సృష్టించాడు. ఈ విశాల ప్రపంచంలో ఎవరికి ఏది కావాలో, ఎంతెంత కావాలో అడగకుండానే సమకూరుస్తున్నాడు. అలా ఈ విశ్వమంతా వ్యాపించిన ఆ సర్వేశ్వరుడి మీద మనకు భక్తిభావం ఎంత ఉండాలి?

'నర్తకీ' అనేది మాయ. ఆ శబ్దాన్ని గనక తిరగేస్తే 'కీర్తన' అవుతుంది. భగవంతుణ్ణి కీర్తన చేస్తే, దానికి లోబడి నర్తకి తన ఆటలు ఆపి ఊరుకుంటుంది. ప్రతిరోజూ ఒక గంట అయినా భగవంతుణ్ణి ధ్యానించడమో, కీర్తించడమో, పూజించడమో, భగవత్కథలను వినడమో చేస్తే మన జీవితం ధన్యమవుతుంది. లేకపోతే 'పుట్టుట గిట్టుట కొరకే' అన్నట్టు పుడుతూ, చస్తూ ఉంటాం. అందుకే, మళ్ళీ మళ్ళీ ఈ బాధలు అనుభవిస్తూ ఉండక, ఉత్తమ సంస్కారంతో జీవితాన్ని ధన్యత పరచుకోవాలి.

భగవంతుణ్ణి ఏ కాలంలోనూ ధ్యానించక ప్రపంచ విషయాల్లోనే మునిగిపోతే యమకింకరులు వచ్చి తీసుకెళ్ళేటప్పుడు, 'అయ్యో! పుణ్యం చెయ్యలేకపోయాను' అని బాధ పడితే ప్రయోజనం ఏముంటుంది? కనుక, ముందుగానే మేల్కొని సదా మన యోగక్షేమాల్ని చూస్తున్నవాణ్ణి తలచుకోవడం అలవాటు చేసుకోవాలి. ❖

ధీరవాణి

- స్వామి వివేకానంద

శ్రేయోమార్గం!

చరిత్ర మనకు ఏం తెలుపుతోంది? అర్హమైనది ఏది ఉంటే అదే నిలుస్తుంది. శీలం కంటే సుస్థిరంగా నిలవగలిగింది ఏముంటుంది? ఎవరు తమ జీవితంలో శీలాన్ని అధికంగా ప్రకాశింపచేస్తారో, వారే విజయాన్ని సాధిస్తారు.

నా గురుదేవులు తనువు చాలించిన తర్వాత అనామకులమైన, నిర్ధనులమైన మమ్మల్ని మొగ్గలోనే తుంచివెయ్యాలని బలవత్తరమైన సంఘాలెన్నో మాకు వ్యతిరేకంగా నిలిచాయి. కానీ శ్రీరామకృష్ణులు మాకు ఒక గొప్ప వరాన్ని ప్రసాదించారు. అది ఏమంటే కేవలం మాటలాడడమే గాక పారమార్థిక జీవితాన్ని సాగించడానికై ఆజన్మాంతం ప్రయత్నించాలనే ఆకాంక్ష కలిగి ఉండడం.

కావలసింది జనసంఖ్య కాదు, శక్తిసామర్థ్యాలు కాదు, సంపద కాదు, పాండిత్యం కాదు, మిగిలినవేవీ కాదు. కావలసినది – పవిత్రత, ఆచరణయుక్తమైన జీవితం. ఒక్కమాటలో చెప్పాలంటే అనుభూమి లేక సాక్షాత్కారం. ప్రతి దేశంలో ఇలాంటి ధీరాత్ములు, బంధవిముక్తులు, బ్రహ్మానుభవాన్ని పొందినవారు; సిరిసంపదలు, అధికారం, పేరు ప్రతిష్ఠలతో సహా దేన్నైనా లక్ష్యపెట్టనివారు పది పన్నెండుమంది ఉంటే చాలు... వారు ప్రపంచాన్ని ఉర్రూతలూగిస్తారు.

నాకు ఎంత ప్రతిఘటన ఎదురైతే, అంత అధికశక్తి నాలో ప్రకటనమవుతుంది. రాజాధిరాజులు నా వాహనాలను లాగారు. నన్ను పూజించారు. మతాచార్యులు, లోకులు ఒక్కుమ్మడిగా నన్ను దూషించారు. ఐతేనేం? భగవంతుడు వారందరినీ ఆశీర్వదించుగాక! వారంతా ఆత్మస్వరూపాలే కదా! నా శక్తి సామర్థ్యాలు క్రమవికాసం చెందడానికి వారంతా నాకు సహాయభూతులు కాలేదా?

యావజ్జీవితం చేసిన కృషి ఫలితంగా – కనీసం ఒక్క జీవి ఐనా భౌతికబంధాలను తెంచుకొని, ముక్తుడైతే మన విధిని మనం నిర్వర్తించినవాళ్ళమవుతాం.

నిస్సందేహంగా నేను భారతదేశాన్ని ప్రేమిస్తున్నాను. కానీ నానాటికీ నా దృష్టి వికాసమొందుతూ ఉంది. భారతదేశమేమిటి, ఇంగ్లండ్ ఏమిటి, అమెరికా ఏమిటి? అజ్ఞానులు ఎవరిని మానవుడంటున్నారో ఆ భగవంతుని దాసులం మనం. చెట్టుపాదులో నీరు పోసినవాడు చెట్టుకంతా నీరుపోసినవాడవడం లేదా?

సాంఘికంగా గానీ, రాజకీయంగా గానీ, ఆధ్యాత్మికంగా గానీ – నేనూ, నా సోదరుడు ఒకటే అని గ్రహించడమే సకల శ్రేయస్సుకూ ఏకైక మార్గం. అన్ని దేశాలకూ, ప్రజలకూ ఇదే ధర్మాన్ని (సత్యాన్ని) నేను చెబుతున్నాను. ప్రాచ్యుల కన్నా పాశ్చాత్యులే దీన్ని మరింత శీఘ్రంగా గ్రహిస్తారు. ఈ ఆశయాన్ని ప్రతిపాదించడంలో, కొందరు ప్రాచ్యులు తమ శక్తినంతా ధారపోసి అలసిపోయారు.

పేరుప్రతిష్ఠల మీది కాంక్షనూ, ఇతరులపై అధికారం చలాయించాలనే కోరికనూ వదలివేసి మనం పనిచేద్దాం గాక! కామ, క్రోధ, లోభాలనే మూడు విధాలైన బంధనాల నుండి మనం ముక్తులమవుదాం గాక! సత్యం మనతోనే ఉంటుంది. ❖

సత్యాన్ని వీడకుంటే మీలో దివ్యశక్తి సమకూరుతుందని దృఢంగా విశ్వసించండి. గౌరవహాని కలుగుతుందనిగానీ, అనుకూలురతో ఘర్షణ ఎదురవుతుందనిగానీ జంకవద్దు. - స్వామి వివేకానంద

ప్రేమామృత మూ

నేను (బ్రహ్మచారి జ్ఞాన్ మహరాజ్) 'ఉద్బోధన్' బెంగాలీ మాసపత్రిక ప్రచురణ మొదలైన నాటి నుండి చదువుతున్నాను. స్వామీజీ నాలుగు యోగాలు కూడా చదివాను. ఒకసారి బలరామ్ మందిరంలో రామకృష్ణ మిషన్ వారి సాప్తాహిక సమావేశానికి వెళ్ళడం జరిగింది. అక్కడ బ్రహ్మానంద, శారదానంద స్వామీజీలను దర్శించాను. వారి దృఢ శరీరాలను చూసి ముచ్చటపడ్డాను. నా దేహం కూడా వస్తాదు దేహం లాగా ఉండేది.

1901వ సంవత్సరంలో మా వాళ్ళు నాకు వివాహం చేయాలని నిశ్చయించారు. నాకు అది గుదిబండగా తోచింది. సన్న్యాసం స్వీకరించాలన్నది నా గట్టి సంకల్పం. కనుక, నిశ్చితార్థం నాడు ఇల్లు వదలి పారిపోయాను. మాయావతిలోని అద్వైతాశ్రమానికి బయల్దేరాను. మా వాళ్ళకు తెలియకూడదని, తిన్నగా కాక ఈ రైలు ఆ రైలు ఎక్కి, తనక్‌పూర్ చేరాను. అక్కడ నుండి మాయావతికి 60 మైళ్ళు కాలినడకన వెళ్ళి ఆశ్రమానికి చేరుకున్నాను. స్వామి స్వరూపానందజీ భగవద్గీత, దేవీ మాహాత్మ్యం వివరించేవారు.

స్వామి వివేకానంద 1901 జనవరి 1న మాయావతికి వచ్చారు. నేను ఇల్లు వదిలిన తర్వాత, మా తండ్రిగారు స్వామీజీని కలుసుకొని, నా వివాహం గురించి చెప్పారట. స్వామీజీ నాతో నవ్వుతూ, 'చెప్పు, చెప్పు! పిల్ల నచ్చలేదా? లేక వారు ఇస్తామన్న కట్న కానుకలు సరిపోలేదా?' అని వేళాకోళం చేశారు. స్వామీజీ హాస్యప్రియులు. నా దృఢకాయం చూసి, 'భేష్! సాధారణంగా బెంగాలీల శరీరాలు బలిష్ఠంగా ఉండవు' అని అభినందించారు. స్వామీజీ మాయావతిలో గడిపిన పక్షం రోజులూ వాన కానీ, మంచు కానీ కురిసేవి. ఆ కారణంగా ఆయన వాహ్యాళికి వెళ్ళలేక పోయేవారు.

స్వామీజీ రాక పూర్వం నేను అందరితో (శ్రీమతి సేవియర్, తదితర మహిళలతో) కలసి భోజనానికి కూర్చొనేవాణ్ణి. బ్రహ్మచారి అందరితో కలవడం స్వామీజీకి నచ్చలేదు. నన్ను కింద అంతస్తులో విడిగా భోజనం చేయమన్నారు. ఆశ్రమంలో పనిచేసేవారు సన్న్యాసులను 'స్వామీజీ' అని, నన్ను 'బాబూ' అని పిలిచేవారు. 'బాబు అని కాదు.. 'మహరాజ్' అని పిలవండి!' అని స్వామీజీ వారికి చెప్పారు.

శ్రీమతి సేవియర్ అభ్యర్థన మేరకు స్వామీజీ ఒకనాడు ఉపన్యసించారు. ఆపై ఆయన ఉపన్యసించగా నేను వినడం జరగలేదు, అరగంట సేపు మాట్లాడారు. పది పన్నెండు మంది శ్రోతలమే ఉన్నాం. కానీ పెద్ద సభలో ఉపన్యసిస్తున్నట్లు మాట్లాడారు ఆయన. ఎంత ఉద్వేగంతో, ఉత్తేజంతో మాట్లాడారో! ఆ హిమాలయ పర్వత ప్రాంతంలో నీరవం చెల్లాచెదురై, అన్ని దిక్కులా ఆయన కంఠస్వరం ప్రతిధ్వనించింది. ఆయన ఆంగ్ల ఉచ్చారణ ఎంత బాగుందో!

అప్పుడప్పుడు స్తోత్రాలు వల్లించేవారు. మరి కొన్నిసార్లు పచార్లు చేస్తూ పాటలు పాడేవారు. పాశ్చాత్య ఖండంలో నిరంతర ఉపన్యాసాల మూలంగా తన గొంతు బొంగురు పోయిందని

చెప్పారు. భగవద్గీత, దేవీ మాహాత్మ్యం, తదితర స్తోత్రాలు కంఠస్థం చేయమని నాకు చెప్పారు. ఆయన మాయావతి చేరిననాడు, అచ్చటి కొండప్రాంత జనులు ఆయనకు సుదీర్ఘ హారతి ఇచ్చారు. 'అయ్యబాబోయ్! పిశాచాలు సైతం ఇంతసేపు నిలబడలేవు. ఒక మానవమాత్రుడి సంగతి చెప్పాలా' అన్నారు స్వామీజీ! అప్పటికి కానీ వారు హారతినివ్వడం విరమించలేదు!

ఒకనాడు స్వామీజీ గుర్రపు స్వారీకి బయలుదేరారు. వర్షం కురుస్తున్నది. ఆయన తిరిగి రాగానే, నేను గుర్రపు పగ్గాలు పట్టుకొని, ఆయన తలపై గొడుగు విప్పి పట్టుకున్నాను. ఆయన సంతసించి, 'అదీ! ఇటువంటి బలం, శక్తి నాకు ఇష్టం' అన్నారు.

స్వామీజీ గది కిటికీ నుండి హిమాలయాలపై ఉండే మంచు కనపడేది. ఆ దృశ్యం ఆయనకు ఆహ్లాదం కలిగించేది. 'చూడు! ఆ దృశ్యం ఎంత బాగున్నదో! ఏదైనా శివస్తోత్రం తెలుసా?' అని, తానే శివాపరాధ క్షమాపణ స్తోత్రంలోని 'గాత్రం భస్మసితం...' అనే చరణం వల్లించారు. అలా వల్లిస్తూ బాహ్యస్మృతి కోల్పోయారు. నిశ్చలంగా ఉండిపోయారు.

మాయావతిలో స్వామీజీతో గడిపిన సమయం ఎంతో ఆనందంగా గడచిపోయింది. ఆయన మాయావతి వదలి వెళ్ళిపోతున్నప్పుడు నేను ఖిన్నుడనయ్యాను. ఆయన, ఆయన తోటి ప్రయాణికులతో పాటు కొన్ని మైళ్ళు నడచాను. ఆయన

ర్తి స్వామీజీ

– బ్రహ్మచారి జ్ఞాన్

మేనాలో పయనించారు. నేను దాని పక్కనే నడుస్తున్నాను. అప్పుడు స్వామీజీ "నువ్వు నాతో రావడానికి వీల్లేదు. నేను ఇప్పుడు బేలూరు మఠానికి పోవడం లేదు. సన్న్యాసం కోరుకుంటున్నావు కదా, మరి నా ఆజ్ఞను శిరసావహిస్తావా? నీవు మాయావతికి తిరిగిపో! నేను బేలూరు మఠం చేరాక నిన్ను పిలిపించుకొంటాను" అన్నారు. నేను ఆవేదనతో వెనుదిరిగాను.

కొన్నాళ్ళ తరువాత బేలూరు మఠానికి వెళ్ళాను. స్వామీజీ ఆరోగ్యం బాగాలేని కారణంగా, ఆయన గదిలోకి ఎవ్వరూ ప్రవేశించే అనుమతి లేదు. స్వామి నిరంజనానంద గుమ్మం వద్ద కావలి. ఆయన ఎవరితోనో మాట్లాడుతుండగా, సందు చూసు కొని, ఆయన కాళ్ళ మధ్య నుండి దూరి లోనికి ప్రవేశించాను. బ్రహ్మానంద, శారదానంద స్వాములిద్దరూ గదిలో ఉన్నారు.

'మంచి కాపలదారువే' అని స్వామి నిరంజనానందను గేలి చేశారు. స్వామి వివేకానంద నన్ను గుర్తుపట్టి 'మాయావతిని వదలి ఎందుకు వచ్చావు? అని గద్దించారు. స్వామీజీ మాయావతి వచ్చినప్పుడు, బేలూరు మఠం మందిరంలో పెట్టడానికి ఒక పటం, శ్రీమతి సేవియర్‌ను కోరారు. అది పట్టుకొని వచ్చాను. కానీ ప్రయాణంలో దాని అద్దం పగిలిపోయింది. చీవాట్లు తప్పవని భయపడ్డాను కానీ పటం చూసిన సంతోషంలో ఆయన నన్ను ఏమీ అనలేదు.

నేను బేలూరు మఠం మందిరంలో పూజ చేయడం ప్రారంభించాను. స్వామీజీ నియమం తప్పకుండా ధ్యానానికి వచ్చేవారు. ఒకనాడు నేను కోరకుండానే నాకు మంత్రదీక్ష నిచ్చారు. స్వామి శివానంద నాకు ఒక జత కాషాయాంబరాలు ఇచ్చారు. అప్పటి నుండి నేను కాషాయం, గులాబీ, తెలుపు – ఇలా ఏ రంగు వస్త్రాలు దొరికితే, అవి ధరించేవాణ్ణి. స్వామి అద్వైతానంద నన్ను సరదాగా 'ఊసరవెల్లి' అని పిలిచేవారు. స్వామీజీ నన్ను పిలిచి, ఎల్లప్పుడూ కాషాయ వస్త్రాలే ధరించమన్నారు. కొంతకాలం తర్వాత స్వామి అచలానంద, నిశ్చయానందలిద్దరికీ సన్న్యాసం ప్రదానం చేశారు కానీ నన్ను నిత్యబ్రహ్మచారిగా ఉండమన్నారు.

కొంపా గూడు వదలి మఠంలో చేరడానికి వచ్చిన యువకులంటే స్వామీజీకి ఎంత ప్రేమో! ఒక పాశ్చాత్య భక్తుడు ఒక చక్కటి గాజు లోటాను స్వామీజీకి కానుకగా ఇచ్చాడు. అందులో బత్తాయి రసం తాగేవారు స్వామీజీ. ఒకనాడు ఒక శిష్యుడి చేతిలో అది పగిలిపోయింది. ఒక సాధువు ఆ యువకుణ్ణి గట్టిగా చీవాట్లు పెట్టారు. ఇది తెలిసి స్వామీజీ ఆ సాధువుతో, 'గురుదేవులు మాపై ప్రేమ కురిపించి మమ్మల్ని సొంతం చేసుకొన్నారు. అందరినీ వదలి మన పంచన చేరారు ఈ పిల్లలు. వారిని అంత తీవ్రంగా మందలించడం న్యాయమా? అలా చేస్తే వారు ఇక్కడ నిలవగలరా? గాజు పాత్ర జీవితం ఈ విధంగానే ముగుస్తుంది. దానికి మహమ్మారి, క్షయ రావు కదా?' అన్నారు. 'శ్రీరామకృష్ణ కొరకు సర్వం త్యజించిన వారికి నేను దాసుణ్ణి' అని అనేవారు స్వామీజీ.

ఒకసారి స్వామీజీ సేవకుడు ఒకరికి 104 డిగ్రీల జ్వరం వచ్చింది. 'మందిరం నుండి కొంచెం తీర్థోదకం పట్టుకురా నాయనా!' అని స్వామీజీ నన్ను పురమాయించారు. తీర్థోదకంతో జ్వరం నయమవుతుందా? అని నా మనసులో ఆలోచన రేగినది. నా మనోభావం పసిగట్టిన స్వామీజీ 'వద్దులే! నేనే వెళతాను' అని తానే తీర్థోదకం తెచ్చి, అతని చేత తాగించారు. వెంటనే జ్వరం తగ్గిపోయిందండి!

చివరి రోజుల్లో స్వామీజీ 'జయప్రభో, జయప్రభో' అని, 'మా, మా' అని తరచూ అనేవారు. ఆ గంభీర కంఠస్వరం మఠ ప్రాంగణం అంతటా ప్రతిధ్వనించేది! ❖

అనువాదం: డాక్టర్ కమల జయరావు

(రామకృష్ణ సంఘ ఆంగ్ల మాసపత్రిక - 'ప్రబుద్ధ భారత' 2013 మే సంచిక నుండి)

సూర్యుడు అంధకారాన్ని పారద్రోలినట్లు, మహావిష్ణువు దుర్మార్గులను హతమార్చినట్లు, నీ దివ్య ముఖారవిందాన్ని దర్శించిన వారి సర్వదుఃఖాలు నాశనమవుతాయి. – వివేకానంద పంచకమ్

ఏకాగ్రతా సాధన!

– స్వామి శితికంఠానంద

ఆ బాలుడికి విలువిద్య నేర్చుకోవాలని ఎంతో కోరిక. తగిన గురువుకై అన్వేషిస్తున్నాడు. కొంతమంది రాజకుమారులకు విలువిద్యను నేర్పిస్తున్న ఆ గురువు దగ్గరికి వెళ్ళి తననూ శిష్యుడిగా చేర్చుకోమంటాడు. ఆ గురువు నీవు నిషాదుడివి. రాజకుమారులతో పాటు నీకు విలువిద్యను నేర్పలేను అంటాడు. బాలుడు నిరాశ చెందుతాడు; అధైర్యపడడు. అడవిలోని తన రాజ్యానికి వస్తాడు. గురువు ప్రతిమని ప్రతిష్ఠించి విలువిద్యను నేర్చుకోవడం మొదలు పెడతాడు. ఉదయాన్నే లేచి గురువుకు దండవత్ సాష్టాంగ ప్రణామం చేసి విద్యను అభ్యసించడం మొదలుపెట్టేవాడు. కఠోర



పరిశ్రమతో, అకుంఠిత దీక్షతో, అనతికాలంలోనే విద్యను క్షుణ్ణంగా నేర్చుకుంటాడు. విద్యను ఎంత సమగ్రంగా నేర్చుకున్నాడంటే గురువు ప్రత్యక్షంగా బోధించిన వారికన్నా పరిపూర్ణంగా గ్రహిస్తాడు. కాలాంతరంలో గురువు వచ్చి 'నా దగ్గర విద్యనేర్చుకున్నట్లయితే గురుదక్షిణ ఇవ్వగలవా' అన్నప్పుడు..'గురువు అడిగితే ఇవ్వరాని దేముంటుంది' అని గురువు కోరిక మేరకు తాను అవిశ్రాంత పరిశ్రమతో నేర్చుకున్న విద్యనంతా బొటన వ్రేలిని దానమొసగటం ద్వారా గురువు చరణాల చెంత ధారపోస్తాడు. ఆ ధీరోధాత్తుడు ఎవరో...మీరు ఇప్పటికే గ్రహించి ఉంటారు! అవును..అతడే సూర్యచంద్రులు ఉన్నంతవరకూ తన పేరును సుస్థిరపరుచుకున్న మేరునగధీరుడు ఏకలవ్యుడు. కథ మనందరికీ తెలిసిందే. కానీ కథ ద్వారా మనం తెలుసుకోవాల్సింది చాలా ఉంది.

విగ్రహాన్ని ఏకలవ్యుడు ఎందుకు పెట్టుకోవాల్సి వచ్చింది? అసలు విద్య నేర్చుకోవడానికి గురువు అవసరమా? ఏకలవ్యుడికి గురువు ఉన్నట్లా? లేనట్లా? గురువు ఆయనకు ప్రత్యక్షంగా విద్యను నేర్పలేదు అని మనం భావిస్తాం. కానీ గురుదక్షిణను చెల్లించడం ద్వారా గురువు వలననే విద్యను నేర్చుకున్నానని ఏకలవ్యుడు ప్రకటించాడు. గురువు అంటే ఒక వ్యక్తియా? ఒక తత్త్వమా?

గురువంటే ఒక తత్త్వానికి, భావానికి ప్రతీక: గురువు నిజానికి ఒక తత్త్వం. కానీ ఏ తత్త్వమైనా వ్యక్తి ద్వారా ప్రకటితమవ్వాల్సిందే. ఆ వ్యక్తి రక్తమాంసాలలో వ్యక్తమవ్వాల్సిన పనిలేదు. విగ్రహంలో ప్రాణం లేకపోయినా రూపం ఉంది; రూపం తత్త్వాన్ని నిరంతరం గుర్తుకు తెస్తుంది. అది చాలు. అంటే మానవుడు మానవుడిగా ఉన్నంతవరకు తత్త్వంకూడా మానవ రూపంలో అభివ్యక్తమవ్వాల్సిందే. ప్రతిమ ఆసరాగా విద్యను నేర్చుకొని మనకు ఈ విషయాన్ని ఏకలవ్యుడు నిరూపణ చేశాడు. అహంకారాన్ని త్యజించి ఆత్మసమర్పణ చేసుకుంటేగానీ మనసును నిగ్రహించలేము. అవ్యక్త పరబ్రహ్మకు తనను తాను సమర్పించుకోవడం అంత తేలిక కాదు. రూపాన్ని అంటిపెట్టుకొని వ్యక్తమవుతున్న 'అహం'ను అరూపంలో అంత తొందరగా లయింపజేయలేము. అందుకే దైవాన్ని మానవరూపంలో ప్రతిష్ఠించుకొని, ఆత్మసమర్పణ చేసుకొని, అభిమాన తెరను తొలగించుకుంటే ఆ శరీరం ఇక శివుడే. ఆ మనసు ఇక నిర్మల సరోవరమే. ఆ మనసుకు ఇక అసాధ్యమైనదేదీ ఉండదు. ఈ లక్ష్యాన్ని సాధించడానికి మనమేర్పరచుకున్న వ్యవస్థయే గురుకుల వాసం, గురుభక్తితో జ్ఞానపుష్పాన్ని వికసింపజేసుకోవడం.

విద్యను గ్రహించడానికి మనకున్న పరికరం మనసు. మనసుకు వేదాంతంలో మూడు, నాలుగు నిర్వచనాలు ఉన్నాయి. సంకల్పవికల్పాత్మకం మనసు; రెండు ఆలోచనల సమాహారం మనసు; సుఖదుఃఖాలు, ఇష్టాయిష్టాలు; మంచిచెడులు..ఇలా పరస్పర విరుద్ధ ద్వయాల సమాహారం మనసు. 'నేను' అన్న మొదటి ఆలోచన లేదా అహంభావంతో ఏర్పడినది మనసు. ఈ 'అహం' మనిషికి అన్ని వయస్సుల్లో ఒకేరకంగా ఉండదు. 3 లేదా 4 సంవత్సరాల పిల్లల్లో అసలు ఉండదు. అప్పటికి అది పూర్తిగా ఏర్పడదు. 13, 14 సంవత్సరాలు వచ్చేసరికి స్పష్టంగా కనపడుతుంది. 21 సంవత్సరాలకు పూర్తిగా ఎదిగి ఉంటుంది. 13సంవత్సరాల నుండి 21సంవత్సరాల వరకు విద్యార్థిదశలో అత్యంత కీలకమైన సమయం. కౌమారం నుంచి విద్యార్థిలో ఈ అహం క్రమక్రమంగా పెరుగుతూ ఏకాగ్రతను తగ్గిస్తూంటుంది. యుక్తవయస్సు వచ్చేసరికి పూర్తిగా ఎదిగి మనోనిగ్రహానికి ఒక పెనుసవాలుగా తయారవుతుంది.

సత్త్వగుణంతో, దైవీసంపత్తితో పుట్టిన వారిలో నామమాత్రంగా ఉండి, భగవదారాధన లేకుండా పుట్టిన వారిలో ఈ అహంకార భూతం మహాశక్తితో విజృంభిస్తుంటుంది. హార్మోనుల ప్రభావం, బలమైన దేహం, ఇంద్రియ పటుత్వం వలన ఈ వయసులో మనిషి అహంభావం తారాస్థాయికి చేరి ఏకాగ్రతను ఛిన్నాభిన్నం చేస్తుంటుంది. ఈ పరిణామం తెలిసిన వారు కనుక మన పూర్వీకులు ఈ అహంకార రాక్షసిని సమర్థవంతంగా ఎదుర్కొని, జ్ఞాన సముపార్జన పరికరమైన మనసును జాగ్రత్తగా తీర్చిదిద్దుకొని, సమగ్రంగా విద్యను అభ్యసించడానికి కనుక్కొన్న మార్గమే గురుశుశ్రూష ద్వారా విద్యాభ్యాసం.

ఆధ్యాత్మిక జ్ఞానసంపన్నులైన వారికి సేవచేసుకొని ఆశీర్వాదాన్ని పొంది, అహంకారాన్ని చూర్ణంచేసుకొని, సంవిత్తును సాధించి, సులభంగా విద్యను అభ్యసించేవారు నాటి విద్యార్థులు. నేడు అలాంటి వెసులుబాటు లేదు కనుక మనిషికి వయసు పెరుగుతున్నకొద్దీ అభిమానం కూడా పెరుగుతూ ఏకాగ్రతను విచ్ఛిన్నం చేయడం వలన విద్యాభ్యాసం చాలా కష్టంతో కూడుకున్నదవుతున్నది. ఈ అస్మితను ప్రక్కనపెట్టడానికి ఇంకో మనిషికి శుశ్రూషచేయడాన్ని మించి సులభమైన మార్గమేమీ లేదు.

గురుసేవ, ఆశ్రమంలోని ఇతర సేవలను శ్రద్ధతో సమాచరించడం వలన విద్యార్థి చిత్తభూతం పూర్తిగా అణగిమణగి ఉండేది. పూర్తిగా మనసు విద్యార్థి అధీనంలో ఉండడం వలన, చదువు నిశ్శబ్ద గంగాప్రవాహంలా నిరాటంకంగా కొనసాగేది. నేటి కాలంలాగా లౌకిక జీవితపు ఆకర్షణలు ఏవీ విద్యార్థి ముందు ఉండేవి కావు. అందుకనే ప్రాచీన కాలంలో విద్యాభ్యాసం అంటే గురుకులవాసమే. అక్కడ పుస్తక జ్ఞానంతో పాటు గురువు జీవితం చూసి నేర్చుకొని, వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవడానికి కూడా అవకాశం ఉండేది. నేడు అలాంటి విద్యకు అవకాశం లేదు కనుక సరిగ్గా విద్య నేర్చుకునే వయసు వచ్చేవరకు విద్యార్థి అహంకృతి పూర్తిగా ఉబ్బి ఉంటుంది. ధారణ స్థాయి పూర్తిగా పడిపోయి ఉంటుంది.

ఏకలవ్యుడి ఏకాగ్రత రహస్యం: రోజూ ఉదయాన్నే లేచి గురువుకు ప్రణామం చేయడం ద్వారా ఏకాగ్రత నిరోధక మైన అహంకారాన్ని ప్రక్కన పెట్టడం సాధ్యమ య్యేది. పూర్తిగా తనను తాను అలా నిరంతరం సమర్పించుకోవడం ద్వారా మనోవిక్షేపాన్ని పూర్తిగా నిరోధించి తన లక్ష్యంపై దృష్టిని నిలపగలిగాడు ఏకలవ్యుడు. గురువు తన ముందు భౌతికంగా లేడు. కనుక గురువును శంకించడం, ఆయన గుణగణాలను ఎంచడం, దోషాలను తలచడం..తద్వారా విశ్వాసం సడలడం–ఇది ఏకలవ్యుడి విషయంలో జరగలేదు. అహంభావాన్ని సమర్థంగా తొలగించు కోగలిగాడు. భగవంతుడి చేతిలో పరిపూర్ణ పరికరం అయ్యాడు.



మనం కూడా దైవం చేతిలో పనిముట్లమే. కానీ అసంపూర్ణ పరికరాలం. ద్రోణాచార్యులు కురుపాండవులందరికీ విద్యనేర్పి నప్పటికీ అర్జునుడిలాగా ఎవరూ విద్యను నేర్చుకోలేకపోయారు. కారణం అర్జునుడికున్న గురుభక్తి, విశ్వాసం మిగతా వారికి లేక పోవడమే. కానీ ఎంత గొప్ప గురువైనా మానవరూపంలో మన ముందు ఉంటే మనకు ఏదో దోషం కనపడుతుంది. ఆ కారణం చేత మన విశ్వాసం సన్నగిల్లుతుంది. ఆత్మసమర్పణ పరిపూర్ణ మవదు. అహంకారం మిగిలి ఏకాగ్రత భగ్న మవుతూనే ఉంటుంది.

పెద్దలసేవ, భగవద్భజన, ధ్యానం లాంటి సత్త్వగుణాల్ని పెంపొందించే ప్రక్రియలు మచ్చుకైనా మనం విద్యార్థిలోకానికి పరిచయం చేయం కాబట్టి నేడు విద్యార్జన ఒక బృహత్ప్రయాస అయింది; ఒక ప్రహసనం అయింది. మనోరూప మహామాయ యువతను పూర్తిగా తన అధీనంలోనికి తెచ్చుకోకుండా ఉండడానికి నేటి మన వ్యవస్థలో అవరోధాలు సున్న. పూర్తిగా మనిషిని తన కైవసం చేసుకొని ఆడించడానికి మనసుకు అన్నివిధాల అనుకూలమైన వాతావరణాన్ని చక్కగా కల్పించాం. ఇది మన ప్రజ్ఞ!

పూర్వం ఎలా ఉండేది? : నేటి లాగా వేదకాలంలో తల్లితండ్రుల ఆర్థిక స్థాయి, సామాజిక స్థితిని బట్టి రకరకాల పాఠశాలలు లేవు. గురుకులాలలో రాజు కొడుకైనా, మిగతావారితో సమానంగా ఆశ్రమ దినచర్యలో పాల్గొని అన్ని సేవలు చేయాల్సి ఉండేది. ఎక్కడ కూడా తాను రాజుకొడుకునని, తాను మిగతా వారికన్నా ఉన్నతుడనన్న భావన రాకుండా ఆనాటి గురువులు చూసేవారు. అలాంటి అహంకృతి వచ్చినదంటే ఇక విద్య రాదని వారికి తెలుసు; సిరి, అధికారం ద్వారా ఉత్పన్నమయ్యే దర్పం, దంభం, అభిమానం విద్యార్థుల్లో ప్రవేశించకుండా వారిలో అహంభావాన్ని నిర్జింపజేసి, వినయశీలురుగా చేసి, చిత్త సంయమనాన్ని పెంపొందించి తర్వాత పాఠాలు బోధించేవారు.

నేటి మార్గం : మరి నేడు ప్రాచీన గురుకుల పద్ధతి లేదుకాబట్టి వీరిలో అహంకారాన్ని అణచి, వినయసంపదను పెంచడానికి వేరే మార్గమేదైనా ఉన్నదా? అంటే ఉంది. బాలబాలికలను, యువతను అనాథ శరణాలయాలకు, వృద్ధాశ్రమాలకు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న రోగులున్న ఆసుపత్రులకు, గుడ్డి బధిర పిల్లలున్న ఆవాసాలకు తీసుకువెళ్ళి అక్కడ వారికి కొంచెం సేవ చేయించాలి. ఎవరి శక్తికొలది వారు కొన్ని వస్తువులను తీసుకువెళ్ళి (వారికి కావలసినవి) వారికి ఇచ్చేటట్లు చూడాలి. ఈ విధంగా రోగుల రూపంలో, వృద్ధుల రూపంలో, వికలాంగుల రూపంలో ఉన్న దైవాలకు సేవచేసుకోవడం ద్వారా వారి అంతఃకరణం శుద్ధినొందుతుంది.

పూర్వకాలపు విద్యార్థులు గురుకులాలలో గురు శుశ్రూషతో ఎలా అహంకార రాహిత్యాన్ని పొంది ఏకాగ్రతను సాధించేవారో, అదేవిధమైన అవధానాన్ని నేటి విద్యార్థులు సాధిస్తే ప్రయోజకులవగలరు. కానీ బాలబాలికలు, యువత తల్లితండ్రుల నుంచి ఇలాంటి కార్యక్రమాలకు కొంత ప్రతికూలత ఎదురవుతుంది. వారిని ఒప్పించే బాధ్యత పాఠశాలల, కళాశాలల యాజ మాన్యాలదే. ఈ ప్రక్రియ విద్యార్థి హృదయవికాసానికి, చిత్త చాంచల్యనిరోధనానికి ఉపయోగపడుతుంది.

హృదయవికాసం కొరవడిన వ్యక్తి ప్రమాదంలో పడతాడు. చదువంటే ఒక నైపుణ్యాన్ని సంపాదించుకోవడమో, ఒక పట్టాను పొందడమో, లేదా కొద్దిపాటి సమాచారాన్ని బుర్రలో దట్టించు కోవడమో అనుకుంటే పొరపాటు. విద్యార్థి కేవలం బుద్ధిమీదనే దృష్టిపెడితే మోసపోతాడు. బుద్ధి మనిషిని సమర్థంగా పెడత్రోవ పట్టించగలదు. హృదయంలేని తెలివి అనర్థం. అది ఆత్మ వినాశకారి అవుతుంది.

అందుకే విద్యార్థి పైన తెలిపిన మార్గం ద్వారా ఏకాగ్రతను, హృదయవిశాలతను పెంపొందించుకొని, నిజమైన సాధికారతను సాధించాలి. అలా విద్యార్థి సమర్థ వ్యక్తిగా, సామాజిక బాధ్యతగల పౌరుడిగా ఎదిగిననాడే సమసమాజాన్ని నిర్మించగలం. ❖

మనస్సు నిర్మలమైన కొద్దీ దాన్ని నిగ్రహించడం సులభమవుతుంది. మనోనిగ్రహం వల్ల ఏకాగ్రత సాధ్యమవుతుంది. ఏకాగ్రత ఎంత అధికంగా ఉంటే అంత సమర్థంగా కార్యాన్ని నిర్వహించవచ్చు. - స్వామి వివేకానంద

ఎఱ్ఱచీర పైట చెరగు!

– శ్రీమతి సుధామూర్తి, ఇన్ఫోసిస్ ఫౌండేషన్

ఎవరైనా ఎఱ్ఱ చీర కట్టుకొని కనిపించినప్పుడల్లా నాకు మీరాయే గుర్తొస్తుంది. ఆమె జీవితాన్ని తలచుకున్నప్పుడల్లా, పేదరికం కొన్నిసార్లు మనుష్యుల్ని ఎంత నిస్సహాయుల్ని చేస్తుందో అనిపిస్తూ ఉంటుంది. ఓ స్వచ్ఛంద సంస్థ ఆహ్వానం మేరకు ఓ సారి 'మాతృత్వం'పై ప్రసంగించాల్సి వచ్చింది. మాతృత్వం ఒక సహజ లక్షణమనీ, తల్లి సామాజికంగా ఎన్ని కష్టనష్టాలనైనా ఓర్చుకుంటుంది కానీ బిడ్డను వదులుకోలేదనీ నా అనుభవంలోని కొన్ని ఉదంతాలను జోడిస్తూ మాట్లాడాను. మన సంస్కృతి మాతృత్వానికి గొప్ప స్థానం ఇచ్చిందనీ, కాలం ఎంత మారినా తల్లి త్యాగంలో మార్పు రాదనీ శ్లాఘించాను. అందరూ కరతాళధ్వనులతో అభినందనలు కురిపించారు. విషయాన్ని చక్కగా విశ్లేషించానని నేనూ సంతృప్తిపడ్డాను.

ప్రసంగం ముగిశాక, బయటకు వస్తూండగానే మీరా ఎదురైంది. ఆమె నాకు సుపరిచితురాలు. అంధురాలు. పైగా అంధుల పాఠశాలలో ఉపాధ్యాయురాలు కూడా! ఆ రోజు సభకు ఆమె కూడా హాజరైంది. ఆమెను తన పాఠశాల దగ్గర వదిలేసేందుకు నాతో పాటే కారులో రమ్మన్నాను.

కారులో కూర్చోగానే మీరా, 'మేడమ్! ఈ రోజు మాతృత్వంలోని ఒక కోణాన్నే స్పృశించారు. కానీ కొన్నిసార్లు పేదరికం పేగుబంధాన్ని కూడా బలహీనం చేస్తుందని మీకు తెలీదు' అంది. నాకు ఆశ్చర్యమేసి, 'నిజమా?' అన్నాను. 'ఓ అయిదేళ్ళ అమ్మాయుంది. కళ్ళు అంత బాగా కనిపించవు. తల్లితండ్రులిద్దరూ కూలీలే! ఆ అమ్మాయి తరచూ కళ్ళు కనిపించడం లేదని, అమ్మానాన్నల దగ్గర కన్నీళ్ళు పెడుతూ ఉండేది. కానీ కారణమేంటో వాళ్ళకు అర్థం కాకపోయేది. కూలీ డబ్బులు తిండికే అంతంత మాత్రంగా సరిపోయేవి. చివరకు తల్లితండ్రులు కొన్ని రోజులు పస్తులుండి ఆ డబ్బుతో పాపను డాక్టరు దగ్గరకు తీసుకువెళ్ళారు. పాప కళ్ళను పరీక్షించిన తరువాత డాక్టర్ ఆమెకు ఆపరేషన్ తప్పనిసరి అన్నాడు. కానీ దానికి ఎంతో ఖర్చవుతుందనీ, ఆపరేషన్ చేయించకపోతే అమ్మాయి పూర్తిగా అంధురాలవుతుందనీ తల్లితండ్రులకు చెప్పాడు. మిగతా పిల్లల పోషణతో రోజు గడవడమే గగనమవుతున్న ఆ కూలీ దంపతులకు ఆ అమ్మాయికి ఆపరేషన్ చేయించడం కష్టమే! వారిద్దరూ పాపను తీసుకొని బస్‌స్టాండ్ దాకా వచ్చారు.

అమ్మాయికి దుకాణంలో నుంచి ఓ బిస్కెట్ ప్యాకెట్ తెచ్చి ఇస్తూ, 'పాపా! బిస్కెట్లు తింటూ ఉండు. అయిదు నిమిషాల్లో తిరిగొస్తాము' అని చెప్పి వెళ్ళిపోయారు. ఎప్పుడూ అన్ని బిస్కెట్లు ఆ పాప ఒక్కతే తినలేదు! అందుకే ఆనందంతో బిస్కెట్లు తింటూ, ఆ మసకమసక చూపుతోనే తల్లి చిరిగిన ఎఱ్ఱరంగు పైట చెరగు చూసింది. అమ్మ చీర చూడడం అదే చివరిసారి అని ఆ పాపకు తెలీదు పాపం! బిస్కెట్లన్నీ అయిపోయాయి. సాయంత్రమవుతూ ఉంది. వాతావరణం చల్లబడుతూ ఉంది. పాప కళ్ళకు చీకటవుతున్నట్లు తెలుస్తూ ఉంది. ఇంకా అమ్మానాన్నలు రావడం లేదు. ఒంటరితనం ఓ వైపు, భయం మరో వైపు. అమ్మ ఎఱ్ఱచీర పైట చెరగు ఎప్పుడు కనిపిస్తుందా? అని దిక్కులు చూస్తూ ఏడవసాగింది. తిరిగి, తిరిగి అలసి ఎక్కడో నిద్దరపోయింది. రెండోరోజూ వెతికింది. తల్లితండ్రులు కనిపించలేదు.

ఓ దయార్ద్రహృదయుడు ఆ అమ్మాయిని చూశాడు. పరిస్థితిని అర్థం చేసుకొని అతనా అమ్మాయిని అంధుల పాఠశాలకు తీసుకెళ్ళాడు. అక్కడ చేర్పించాడు. ఆ అమ్మాయి ఎన్నో రోజులు తల్లితండ్రుల కోసం ఎదురుచూసింది. ఎక్కడ ఎఱ్ఱచీర కట్టుకున్న



స్త్రీ కనిపిస్తే అక్కడికి, అమ్మ అనుకొని పరుగెత్తేది. కానీ ఆమె అమ్మ కాదని తెలిసి బిక్కమొహం వేసుకొని వెనుతిరిగేది. ఎందుకు అమ్మ తనను వదిలివెళ్ళిందో తెలియక ఏడవని రోజు లేదు అంటూ ఉంటే ఒక్కసారి మీరా ముఖం చూశాను. కన్నీళ్ళు ధారాపాతంగా కురుస్తున్నాయి.

'ఇప్పుడు ఆ అమ్మాయి ఎక్కడుంది మీరా?' అని అడిగాను ఆసక్తిగా! మీరా ఎక్కిళ్ళు పెడుతూ 'మీ ముందున్నది ఆ అభాగ్యురాలే!' అంది. 'పేదరికం వల్ల ఒక బిస్కెట్ ప్యాకెట్‌తో నన్ను మోసం చేశారు. మాతృత్వాన్ని కూడా పేదరికం కబళించేస్తుంది. ఇప్పుడు చెప్పండి మేడమ్! ఆ ఎఱ్ఱచీర పైట నాకు ఎప్పుడు కనిపిస్తుంది?' అంది. ఆమెకు చెప్పేందుకు నా దగ్గర సమాధానం లేదు... కేవలం బరువెక్కిన హృదయం, సజలనయనాలు తప్ప! ❖

సేకరణ: జి. సతీష్

యువవాణి

- స్వామి పరిజ్ఞేయానంద

యుగానికొక్కడు!

కె. ప్రశాంత్, ఇంజినీరింగ్ విద్యార్థి, హైదరాబాదు

ప్రశ్న: రామకృష్ణ మఠంలో ఎంతో మంది స్వామీజీలు ఉన్నారు. కానీ ఎవ్వరూ స్వామి వివేకానందంతటి వక్తలు కాలేదు. స్వామీజీ అనుచరులైన మీరంతా ప్రపంచమంతా పర్యటించి ఆయనలాగ మహావక్తలుగా ప్రసిద్ధిచెందడానికి ఎందుకు ప్రయత్నించడం లేదు?

జవాబు: స్వామి వివేకానంద జీవిత చరిత్ర, ఉపన్యాసాలు చదివి స్ఫూర్తి పొందిన ఒక యువకుడు సన్న్యాసి జీవితం గడపాలని కలకత్తాలోని రామకృష్ణ మఠంలో చేరడానికి వెళ్ళాడు. ఆ విషయం తెలిసిన అతడి తల్లితండ్రులు అంతులేని దుఃఖంలో మునిగిపోయారు. కుమారుణ్ణి ఎలాగైనా ఒప్పించి తిరిగి ఇంటికి తీసుకురావాలని కలకత్తా బయలుదేరారు. అక్కడకు వెళ్ళి అతణ్ణి ఇంటికి తిరిగి రమ్మని ఎన్నో విధాల బ్రతిమాలారు, బలవంతపెట్టారు, బెదిరించారు.



ఇలా ఎన్ని విధాలుగా భయపెట్టినా, బలవంతం చేసినా అతడు తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. చివరికి, చేసేదేమీలేక అతడి తండ్రి "సరే! నువ్వు ఎంచుకున్న మార్గంలోనే వెళ్ళు. కానీ నువ్వు మాత్రం స్వామి వివేకానందంతటి గొప్పవాడివి కావాలి. అందుకు నువ్వు నాకు మాట ఇవ్వు" అని షరతు పెట్టాడు. అప్పుడు ఆ యువకుడు తండ్రితో "మీరు వ్యాపారస్థులు కదా! మీరు కూడా టాటా, బిర్లా అంతటి గొప్ప వ్యాపారవేత్త అవగలరా? అలా అయితే నేను మీతో తిరిగి వచ్చేస్తాను" అని షరతును విధించాడు. కుమారుడి మాటల్లోని మర్మాన్ని గ్రహించిన తండ్రి నోట మాట రాలేదు. తల్లితండ్రులు అతణ్ణి మనసారా ఆశీర్వదించి వెనుదిరిగారు.

సివిల్ ఇంజినీరింగ్ చదివే ప్రతి విద్యార్థీ మోక్షగుండం విశ్వేశ్వరయ్యలా అవుతాడా? కంప్యూటర్ సైన్స్ చదివిన ప్రతి విద్యార్థి బిల్‌గేట్స్‌లా అవుతాడా? బిజినెస్ మేనేజ్‌మెంట్ చదివిన ప్రతి విద్యార్థీ టాటా, బిర్లాలు అవుతారా? భౌతిక శాస్త్రం చదివిన ప్రతి విద్యార్థీ సి.వి.రామన్, ఐన్‌స్టీన్ అంతటి గొప్ప శాస్త్రవేత్తలవుతారా?...

అయితే, ప్రాపంచిక జీవితంలో ఏ రంగంలోనైనా అత్యున్నత ప్రతిభను సాధించాలనే తీవ్రమైన కోరిక గల వ్యక్తి, ఆయా రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించిన వ్యక్తిని ఆదర్శంగా తీసుకొని, అకుంఠిత దీక్షతో, దృఢ సంకల్పంతో ప్రయత్నిస్తే అత్యున్నత స్థితికి చేరుకోవచ్చు. కానీ ఆధ్యాత్మిక జీవితాన్ని ప్రాపంచిక దృష్టితో చూడడం సరికాదు. సన్న్యాస జీవిత లక్ష్యమే వేరు!

ఒకసారి రామకృష్ణ సంఘ 14వ సర్వాధ్యక్షులైన పూజ్య స్వామి గహనానందజీ మహరాజ్‌ను దర్శించుకోవడానికి ఓ బహుళజాతి సంస్థ చైర్మన్ వెళ్ళాడు. పూజ్య స్వామీజీని దర్శించుకుని మాటల సందర్భంలో అతడు "రామకృష్ణ సంఘంలో విద్యావంతులైన ఎంతోమంది యువకులు ఉన్నతోద్యోగాలను వదలుకొని సన్న్యాస జీవితాన్ని గడుపుతున్నారు. వారు ఏమి ఆశించి అన్నీ వదలి వచ్చారు?" అని తన సందేహాన్ని వ్యక్తం చేశాడు.

అందుకు పూజ్య స్వామీజీ "మీ సంస్థలో కొత్తగా చేరిన ఉద్యోగి జీవితంలో ఏమి కావాలనుకుంటాడు?" అని ప్రశ్నించారు. అప్పుడు అతడు 'ప్రతి ఉద్యోగీ పదోన్నతి పొందాలనీ, సంస్థ చైర్మన్ స్థాయికి ఎదగాలనీ ఆశిస్తాడు' అని ఉత్సాహంగా బదులిచ్చాడు. అప్పుడు పూజ్య స్వామీజీ "రామకృష్ణ సంఘంలో చేరినవారు సంఘ సర్వాధ్యక్షులు కావాలనే ఉద్దేశంతో చేరరు. వారి ధ్యేయం భగవత్సాక్షాత్కారమే! మీ సంస్థలో కొత్తగా చేరిన వ్యక్తికీ, రామకృష్ణ సంఘంలో చేరిన వ్యక్తికీ మధ్య ఉన్న తేడా అదే!" అని వివరించారు.

దీన్నిబట్టి అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే, సన్న్యాస జీవితం గడపాలనుకున్న వారు స్వామి వివేకానందలాగ గొప్ప వక్తగా పేరుగాంచాలనిగానీ, ఏదో ఉన్నత పదవుల్ని పొందాలనిగానీ ఆశించరు. అలాంటి ఆశలున్నవారెవ్వరూ సన్న్యాస జీవితంలోకి అడుగుపెట్టలేరు. ఒకవేళ అడుగుపెట్టినా ఆ జీవితాన్ని ఎంతోకాలం కొనసాగించలేరు.

అనంత సాగరంలో లయమవడమే నదులన్నిటి లక్ష్యం. అంతేగానీ, ఏ నదీ తానొక సాగరమై ఒక ప్రత్యేకతను ప్రకటించాలని అనుకోదు. అలాగే ఏ సన్న్యాసీ స్వామి వివేకానందలాగ ఓ మహావక్త అయి, తమ ప్రత్యేకతను

(మిగతా 42వ పేజీలో...)

మహాత్ముల బోధలను పూర్తిగా ఆచరించడం సాధ్యం కాకపోయినా, కొంతవరకైనా ఆచరించడానికి ప్రయత్నించు. సత్పురుషుల మార్గాన్ని అనుసరించేవారికి మేలేగానీ కీడు కలగదు. - మనుస్మృతి

ఆ జ్ఞాపకాల తీరంలో...

- బి. సైదులు

స్వామి వివేకానంద ఓ రోజు కలకత్తాలో శ్రీరామకృష్ణ పరమహంస భక్తుడైన బలరాంబోస్ ఇంటికి వెళతారు. గానంలో, వాద్యవిన్యాసంలో విశేష ప్రావీణ్యం ఉన్న స్వామీజీని అక్కడివారు ఏదైనా పాట పాడమని బలవంతపెడతారు. ఇంతలో స్వామీజీకి ఆ ఇంటికి దగ్గరలోనే ఉండే తన బాల్యస్నేహితుడు జగన్నాథ టాగూరు గుర్తొస్తాడు. వెంటనే పక్కనున్న వారితో "నా చిన్ననాటి స్నేహితుడు జగన్నాథ్ ఈ పక్క వీథిలోనే ఉంటాడు. అతను పఖ్వాజ్(మృదంగం లాంటి వాయిద్యం) చక్కగా వాయిస్తాడు. 'నరేన్ పిలుస్తున్నాడు' అని చెప్పి అతణ్ణి తీసుకొని రండి" అని చెబుతారు. జగన్నాథ్‌తో విషయం చెప్పగానే అతడు విస్మయానందాలకు లోనవుతాడు. 'నరేన్‌కి ఇంకా నేను గుర్తున్నానా?' అనుకుంటూ శరవేగంగా వస్తాడు.

జగన్నాథ్‌ని చూడగానే స్వామీజీ పాత నరేన్‌గా మారిపోతారు; చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకుంటూ పాతరోజుల్లోకి వెళ్ళిపోతారు. అయినా ఆ స్నేహితుడు స్వామీజీని సమీపించేందుకు సంశయిస్తూనే ఉంటాడు. అప్పుడు స్వామీజీ 'జగన్నాథ్ ఎందుకు అలా బిడియపడతావు; నేను చిన్నప్పటి నరేన్‌నే! రా! పక్కన కూర్చో!' అంటూ బాల్యమిత్రులను, ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటారు. తను విశ్వవిజేతగా దేశవిదేశాల్లో విఖ్యాతిగాంచినా, స్వామి వివేకానంద ఆత్మీయులు కలిసినప్పుడల్లా అమిత ఆదరణతో అక్కున చేర్చుకునేవారు. ఎలాంటి భేషజాలు, భుజకీర్తులు లేకుండా వాళ్ళతో కలిసిపోయేవారు. ఆయన స్థాయికి సరిపోమని, ఎంతోమంది వారికి సమీపంగా వచ్చేందుకు మొహమాట పడుతున్నా, తను మాత్రం అత్యంత చనువుతో దగ్గరయ్యేవారు; పాత జ్ఞాపకాలను నెమరువేసుకునేవారు. ఇలా మహానుభావులు బాహ్యంగా గంభీరంగా కనిపిస్తున్నా, మధురస్మృతుల్లోకి వెళుతూనే మనస్సు పూలపొట్లంలా అతి తేలికగా తూగిపోతుంది.

అంతరాలను దాటే ఆత్మీయత...: మనలో చాలా మంది ఒక స్థాయికి వచ్చాక, తమకు సరితూగే స్నేహితులను, బంధువులనే తప్ప సాధారణ స్థానాల్లో ఉన్న మిత్రులను, ఆత్మీయులను కలిసేందుకు ఇష్టపడరు. అంతస్తుల్లో, ఆర్భాటాల్లో సమఉజ్జీలనుకుంటున్న వారితోనే పరిచయాలు, పలకరింపులు కొనసాగిస్తూ ఉంటారు. శ్రీకృష్ణుడు, కుచేలుడు సాందీపుని ఆశ్రమంలో కలసి చదువుకునే రోజుల్లో ప్రాణమిత్రులయ్యారు. కాలగమనంలో శ్రీకృష్ణుడు ద్వారకానాథుడయ్యాడు; కుచేలుడు నిరుపేద బ్రాహ్మణుడిగానే మిగిలిపోయాడు. ఈ అంతరాలతో సంశయించి, కుచేలుడు ఎన్నడూ కృష్ణుడిని కలుసుకునేందుకు ప్రయత్నించలేదు. అయితే ఆకలి కష్టాలకు తాళలేక, అర్ధాంగి అభ్యర్థన మేరకు కుచేలుడు చివరికి ఓ రోజు ద్వారకకు వెళతాడు. ఆ క్షణంలో తన చిన్ననాటి స్నేహితుడిని చూసి శ్రీకృష్ణుడు ఆనందంతో స్పందించిన తీరుకు రుక్మిణీదేవి సహా అంతఃపుర కాంతలందరూ ఆశ్చర్యపోతారు. ఆప్తమిత్రుడిని తన ఆంతరంగిక మందిరంలోకి తీసుకువెళ్ళి ఆ నందనందనుడు స్వయంగా తానే అతిథి మర్యాదలు చేస్తాడు. తమ చిన్ననాటి జ్ఞాపకాలలో మునిగిపోతూ, **'మన మధ్యయనంబు చేయుచు నన్యోన్య స్నేహ వాత్సల్యంబులం చేయు కృత్యంబులు మరవవు కదా!'**

'మిత్రమా! మనం చదువుకున్న రోజుల్లో అన్యోన్య స్నేహవాత్సల్యాలతో మెలిగిన సందర్భాలను నీవు మరువలేదు కదా!' అని ఆనాటి అనుభూతులను నెమరువేసుకుంటాడు. స్నేహితుడి పరిస్థితిని అర్థం చేసుకొని అడగకుండానే, అష్టైశ్వర్యాలను ప్రసాదిస్తాడు. అదీ మహానుభావుల మనస్సంటే!

స్వార్థమెరుగని సఖ్యత....: ఈ యాంత్రిక జీవనంలో మన ప్రతీ చర్యా లాభనష్టాల అంచనాల మీద ఆధారపడి ఉంటోంది. ప్రయోజనం లేనిదే పలకరించటానికి కూడా మనస్సు పదిసార్లు ఆలోచిస్తోంది. ఆ క్షణానికి ఎవరు అవసరమో, వారినే ఆత్మీయులనుకునేంత సంకుచితమవుతోంది. అందుకే మనలో చాలా మందికి అంతస్తులు మారుతున్న కొద్దీ, అనుబంధాలూ మారిపోతూ ఉంటాయి. నిజానికి మనకు ఎలాంటి హోదాలు లేని రోజుల్లో, మనల్ని మనలా స్వీకరిస్తూ, మన బలాన్ని, బలహీనతల్ని సమంగా సహిస్తూ హృదయంలో పెట్టుకునే వారే ఆత్మీయులు. మనం నేలమీద నడిచేప్పుడు సహచరులై సాగినవారే

సన్నిహితులు కానీ, విమానమెక్కేప్పుడు వీడ్కోలు చెప్పేందుకు వచ్చేవారు కాదు. ఆ సత్యాన్ని గుర్తించినవాడు కనుకనే శ్రీకృష్ణుడు తను అంగరంగ వైభోగాల మధ్య జీవిస్తున్నా, కుచేలుడు తెచ్చిన అటుకులకు ఆకర్షితుడయ్యాడు. అరమరికలు లేకుండా ఆరగించాడు. స్నేహితుడి ఆ సహృదయానికి పొంగిపోతూ అంతరంగంలో కుచేలుడు 'నా మలిన శరీరాన్ని, చినిగిన బట్టల్ని చూసి శ్రీకృష్ణుడు మనస్సులోనైనా ఏవగించుకోలేదు. నా వద్ద నున్న అటుకులను ప్రీతితో ఆరగించాడ'ని పులకించిపోతూ, ***మలిన దేహుండును, జీర్ణాంబరుండునని చిత్తంబున హేయంబుగా పాటింపక నా చేనున్న అటుకులాదరంబున నారగించె...*** కదా! అనుకుంటాడు. స్వార్థమెరుగని ఇలాంటి సఖ్యత శోభాయమానంగా పదికాలాల పాటు నిలుస్తుంది. కాని మనలో చాలా మంది శ్రీమంతులైన స్నేహితులకే సన్నిహితంగా మెలుగుతారు కాని, జీవితంలో చితికిన చిరపరిచితులను చేరదీసేందుకు ప్రయత్నించరు.

స్మృతుల సాంత్వన...: ఎన్ని సిరిసంపదల మధ్య తులుతూగుతున్నా మనస్సులో ఎప్పుడో ఒకప్పుడు ఓ చిన్న వెలితి తొంగిచూస్తుంది. బతుకంతా భారంగా తోస్తుంది. అందుకే వాషింగ్టన్ ఇర్వింగ్ అనే రచయిత *'Sweet is the memory of distant friends! Like the mellow rays of the departing sun, it falls tenderly, yet sadly, on the heart* – వాలే సూర్యకిరణాల్లాంటివి ఆ సుదూర స్నేహితుల తీపి జ్ఞాపకాలు. అవి మంద్రంగానే మనస్సును తాకుతాయి; కాని మధురమైన బాధను కలిగిస్తాయి' అంటారు.

అందుకే ఇటీవల అన్ని రంగాల వారు తమ పాతమిత్రులతో, శ్రేయోభిలాషులతో ఏటా ఆత్మీయ సమాగమాలను ఏర్పాటు చేసుకొని తమ జ్ఞాపకాల పుటలను తిప్పి చూసుకుంటున్నారు. ఇలాంటి వేడుకలు ఆధునిక జీవితంలోని ఒత్తిళ్ళను దూరం చేసి, మనస్సుకు స్వస్థతనిస్తాయనడంలో సందేహం లేదు. అయితే ఈ సందోహాలు కేవలం మన మానసిక ఆలంబన కోసం కాకుండా, మనమిచ్చే సాంత్వనతో మరొకరి జీవితంలో వెలుగులు విరజిమ్మేలా ఉండాలి. ఆశించడంలో కన్నా అందించడంలో ఉన్న ఆనందాన్ని అనుభూతి చెందాలి. భగవాన్ రమణమహర్షికి బాల్యంలో విలచ్చేరి రంగనాథయ్యర్ అనే మిత్రుడు ఉండేవారు. చిన్నప్పుడు సాయంత్రం కాగానే రమణులు ఆయనతో కలిసి ఫుట్‌బాల్ ఆడడానికి వెళుతూ ఉండేవారు. ఆ పరిచయంతో ఆ మిత్రుడు ఒకసారి రమణులు ఉండే అరుణాచలానికి వచ్చారు. మహర్షి తనను గుర్తుపడతారో లేదోనని ఆయన సందేహించారు. కానీ భగవాన్ పరమప్రేమతో చిన్నప్పటిలా 'రంగా!' అంటూ పూర్వాశ్రమంలోలాగే పలకరించారు. తరువాత ఆ కుటుంబాన్ని మహర్షి ఎన్నో కష్టాల నుంచి గట్టెక్కించి, వారి జీవితాల్నే మార్చేశారు.

ఆనందానికి ఆశ్రయం...: కాలం ఎప్పుడూ ఒకేలా సాగిపోదు. 'మీరు! మీరు!' అంటూ గౌరవించే సమూహాలు పరిస్థితులు మారగానే పక్కకు తప్పుకోవచ్చు. కానీ 'ఏరా!' అనగలిగేంత చనువున్న సహృదయులు మనం ఏ స్థితిలో ఉన్నా ఒకేలా ప్రవర్తిస్తారు; ప్రతిస్పందిస్తారు. అందుకే జీవితం నల్లేరుపై నడకలా సాగిపోతున్న రోజుల్లో ఆ పాతపరిచయాలకు పాతరవేయకుండా, పదిలపరచుకుంటూ ఉండాలి. ఎప్పుడూ సమస్థాయి వ్యక్తులతోనే కాకుండా, మన మనుగడలో, మలుపులో తోడునడిచిన సామాన్యులతోనూ ఆదరంగా మెలగాలి. అనుభూతుల పరిమళాలను ఆస్వాదిస్తూ ఉండాలి. భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస తమ భక్తబృందంతో తమ బాల్యస్మృతులను, మిత్రులను తలచుకొని పరవశించిపోతూ,



ఓ కాగజ్ కి కస్తీ.. ఓ బారిష్ క పానీ

సుందర స్మృతులకు ఆలవాలమైన బాల్యంలోని నిర్మలత్వం, నిష్కాపట్యం మనిషి ఎదుగుతున్న కొద్దీ, వేసంగిలో వానచినుకుల్లా ఆవిరైపోతాయి. కానీ మానవ సంబంధాలను మధురజ్ఞాపకాలుగా మిగిల్చేవి మాత్రం ఆ సుగుణాలే! అందుకే ఓ భావకవి వసంతంలాంటి పసితనంలోని ఆ సరళత్వాన్నీ, సహజత్వాన్నీ తిరిగి ప్రసాదించమని కాలాన్ని కోరుతూ...

యే దౌలత్ భి లేలో యే షొరత్ భి లేలో
భలే ఛీన్‌లో ముఝ్‌సే మేరీ జవానీ
మగర్ ముఝ్‌కో లౌటా దే బచ్‌పన్ క సావన్
ఓ కాగజ్ కి కస్తీ ఓ బారిష్ క పానీ...

'ఈ సంపదల్నీ, యవ్వనాన్నీ, సమస్తాన్నీ తీసుకో! కానీ ఆ వానచినుకుల్ని, ఆ కాగితపు పడవల్ని నాకిచ్చేయ్!' అని అర్థిస్తాడు. ముసుగులు, లొసుగులు తెలియని పసిమనస్సులు, మళ్ళీ మనలో మరుమల్లె తోటల్లా మారాకు వేస్తే అంతకు మించిన స్మృతుల సంబరం మరోటి లేదు.

"నా చిన్ననాటి రోజులు మరువలేనివి. ఆనందంగా ఉన్న పావురం మాదిరి ఉండేవాణ్ణి; నేను సన్నిహితంగా మెలిగిన కొందరు ఇంకా నాకు గుర్తున్నారు" అంటూ వాళ్ళ పేర్లు చెప్పి మరీ, ఆ జ్ఞాపకాలను నెమరువేసుకునేవారు. ఒకసారి వారి చిన్ననాటి స్నేహితుడు శ్రీరామ్ దక్షిణేశ్వరంలో శ్రీరామకృష్ణులను చూసి 'ఓ! గదాధర్ పాఠశాలలో ఎలా ఉండేవాడో ఇక్కడ కూడా అలాగే ఉన్నాడు' అంటూ సంబరపడిపోయాడు.

అందుకే ఓ ఉర్దూ కవి 'ఉజాలే అప్నే యాదోంకో హమారే సాత్ రహనేదో, న జానే కిస్ గలీమే జిందగీకీ షామ్ హోజాయే –వెలుగులీనే ఆ మధురస్మృతులు మనతోనే ఉండనీ, ఏ మూల మలుపులో జీవనసంధ్యా సమయం ముగుస్తుందో!' అంటాడు. ❖

మిత్రులు చేసిన ఉపకారాన్నీ, సేవకులు చేసిన పరిచర్యలనూ ఎన్నడూ మరచిపోకూడదు. వారికి మంచి కానుకలనిచ్చి, మధుర వచనాలతో వారి మనస్సుకు ఆహ్లాదాన్ని కలిగించాలి. - హితోపదేశం

మనసుంటేనే మనిషి!

- స్వామి విమూర్తానంద

ఆ ఎనిమిది మంది కళాశాల విద్యార్థులకు సామాజిక స్పృహ ఎక్కువ. శ్రమదానం నుంచి రక్తదానం వరకు ఏ కార్యక్రమానికైనా ఎప్పుడూ వారే ముందుంటారు. పైగా వారాంతంలో ఒకరోజు కళాశాల వదిలేయగానే సామాజిక సేవా కార్యక్రమాల గురించి మాట్లాడుకుంటూ ఉంటారు. ముఖ్యంగా స్వామి వివేకానంద, మహాత్మాగాంధీ వంటి మహనీయుల జీవితాలు, బోధనలపై చర్చించుకుంటూ ఉంటారు. వీరికి కళాశాల అధ్యాపకురాలు శైలజ సూచనలు, సలహాలు ఇస్తూ ఉంటారు. ఓ వైపు పాఠాలు బోధిస్తూ, మరోవైపు తమకు సామాజిక అంశాలపై అవగాహన కలిగిస్తున్న శైలజగారంటే విద్యార్థులకు ఎంతో ఆరాధన!

ఒకరోజు సాయంత్రం ఆ ఎనిమిది మంది విద్యార్థులను శైలజ తమ సమావేశ మందిరంలోకి రమ్మని పిలిచారు. ఎప్పుడూ చిరునవ్వుతో సరదాగా పలకరించే శైలజ ఆ రోజు గంభీరంగా కనిపించడం అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది.

శైలజ రావడంతోనే తన చేతిలోని డీవీడీని, పక్కనే ఉన్న విద్యార్థి రమేశ్‌కి ఇస్తూ, ప్లే చేయమని చెప్పారు. అందరూ వీడియో ఏమై ఉంటుందా? అన్న ఆసక్తితో చూస్తూ ఉన్నారు. ట్రాఫిక్ సిగ్నల్ వద్ద తీసిన సన్నివేశాలతో కూడిన వీడియో అది! అందులో సన్నివేశాలు ఇలా సాగిపోతున్నాయి.... చెన్నై సమీపంలో వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే నాలుగు రోడ్ల కూడలి అది. అందరూ అమితవేగంతో వాహనాలపై దూసుకు పోతున్నారు. ఇంతలో రెడ్‌సిగ్నల్ పడింది. వాహన చోదకులు ఎక్కడివారక్కడే నిలిచిపోయారు. ఎప్పుడు గ్రీన్‌సిగ్నల్ పడుతుందా? అని నిరీక్షిస్తూ ఉన్నారు. ఇంతలో హఠాత్తుగా ఆటోలో నుంచి నలుగురు యువకులు దిగి, ముందు ద్విచక్రవాహనంపై వేచి ఉన్న ఓ యువకుడిపై దాడికి దిగారు. అనుకోని పరిణామంతో ఆ యువకుడు భయపడిపోయాడు. 'కాపాడండి! కాపాడండి!' అంటూ ఆర్తనాదాలు పెడుతూ ఉన్నాడు. అందరూ ప్రేక్షకుల్లా ఆ ఘటనను చూస్తున్నారే తప్ప ఒక్కరు కూడా స్పందించడం లేదు. ఆ యువకుడు ఎంత ప్రాధేయపడుతున్నా వినకుండా, ఆ నలుగురు దుండగులూ చేతిలో ఉన్న ఆయుధాలతో దాడి చేశారు. రక్తం కారేలా కొట్టారు. ఆ దాడికి తట్టుకోలేక అపస్మారక స్థితిలో ఆ యువకుడు కిందపడిపోయాడు. అంత రద్దీగా ఉండే ప్రదేశంలో ఒక్క వ్యక్తి కూడా సహాయం చేయడానికి ముందుకు రావడం లేదు. ఆ సంఘటనను వేడుకలా చూస్తూ కొందరు, హడావిడిగా జేబులో నుంచి సెల్‌ఫోన్ తీసి క్లిక్‌మనిపించే వాళ్ళు ఇంకొందరు, మనకెందుకు వచ్చిన గొడవంటూ ముఖాలు పక్కకు తిప్పుకున్నవారు ఇంకొందరు! చివరకు అక్కడ గ్రీన్‌సిగ్నల్ పడడంతో ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయారు.

శైలజ వీడియో ప్రదర్శనను నిలిపివేసి, ఎనిమిది మంది ముఖాల వైపు చూశారు. ఆ ప్రదర్శన చూసి, అందరూ ఆవేశంతో ఉడికిపోతున్నారు; ఉద్వేగంతో ఊగిపోతూ ఉన్నారు, ఒక్క సంగీత తప్ప! ఆమె నిదానంగా తన ల్యాప్‌టాప్ తీసి, ఏదో టైప్ చేసుకుంటూ ఉంది. శైలజ, ఆ ఏడుగురు మిత్రులు ఆమె వంక చూస్తూ, అసహనంతో 'ఏం సంగీతా! నువ్వూ ఆ సిగ్నల్ దగ్గర మనుష్యుల లాగా మారిపోయినట్లున్నావు; నీలో కొంచెం కూడా స్పందన కనిపించడం లేదు' అన్నారు.

'ఒక్క నిమిషం' అంటూ సంగీత తను టైప్ చేసిన ఇ-మెయిల్‌ను చదవసాగింది.

ప్రియమైన భాస్కర్!

నీ లాంటి విద్యాధికుడు పెద్ద ఉద్యోగి నా జీవితంలోకి రావడం నా అదృష్టం అనుకున్నాను. కానీ ఒక సంఘటన చూశాక, నీలాంటి మనస్సు లేని వ్యక్తితో, స్పందన లేని మనిషితో జీవించటం వృథా అనుకుంటున్నాను. 2014 జూలై 21న సిగ్నల్ దగ్గర ఒక యువకుడు గాయపడి సహాయం కోసం అర్థిస్తుంటే, నిర్లక్ష్యంగా వదిలివెళ్ళిపోతున్న వారిలో నువ్వూ ఒక్కడివైనందుకు, నాకు సిగ్గుగా ఉంది. సాటి మనిషిపైన దయలేని వ్యక్తితో జీవితాంతం కలిసి కొనసాగలేను. స్వామి వివేకానంద *"He who has no compassion for the suffering of his fellowmen is no human being* - ఇతరుల కష్టాలను చూసి స్పందించని వాడు మానవుడే కాదు" అంటారు. అందుకే నిశ్చితార్థం అయినా, నీతో వివాహబంధంలోకి అడుగు పెట్టదలచుకోలేదు. ఈ రూపంగానైనా నేను పరోక్షంగా, ఆ సంఘటనకు సానుభూతిని ప్రకటించి, నా నిరసన తెలిపిన దాన్నవుతాను. - ఇక సెలవు, సంగీత

మిత్రులకు ఆ మెయిల్ చదివి వినిపించాక సంగీత, వీడియోను మళ్ళీ ప్రదర్శించమని చెప్పి, సంఘటనాస్థలిలో చూసీ చూడనట్లు కారులో వెళ్ళిపోతున్న వ్యక్తిని చూపించి అతడే తాను పెళ్ళి చేసుకోవాలనుకున్న భాస్కర్ అని చెప్పింది. సాహసో పేతమైన సంగీత నిర్ణయానికి శైలజతో సహా అందరి కళ్ళలో అభినందనపూర్వకంగా కన్నీళ్ళు కురిశాయి. ❖

వినడమూ విజ్ఞతే!

- స్వామి రంగనాథానంద (రామకృష్ణసంఘం 13వ సర్వాధ్యక్షులు)

చాలా మంది వక్తలు తమ ప్రసంగాన్ని ఎదుటివారు శ్రద్ధతో వినాలని అనుకుంటారు. కానీ వారు మాత్రం ఇతరులు మాట్లాడేటప్పుడు వినేందుకు ఉత్సుకత చూపరు. తమ భావాలను, వాదనలను ఎదుటివారు వినాలని తప్ప, ఎదుటివారి ఆలోచనలనూ, అభిప్రాయాలనూ కొద్దిగానైనా విని ఆకళింపు చేసుకోవాలనే కనీస సంస్కారం కూడా వారిలో కనిపించదు.

ఇతరులను మన అభిప్రాయాల వైపు మార్చాలని మనం ఎలా తాపత్రయపడతామో, ఎదుటివారికీ అదే ఉత్సాహం ఉంటుందన్న విషయాన్ని మనం తరచూ మరచిపోతూ ఉంటాం. ఇది పరోక్షంగా వ్యక్తుల మధ్య సత్సంబంధాలను ఛిన్నాభిన్నం చేస్తుంది.

భావవ్యక్తీకరణ అన్న అంశం మనస్సులో మెదిలినప్పుడల్లా, వాల్టేర్ అనే ప్రముఖుని మాటలే గుర్తొస్తాయి. వారు, *'I may not believe a single word of what you say; but I shall defend with my life your right to say so* – నీవు చెప్పినదాంట్లో ఒక్క విషయాన్ని కూడా నేను అంగీకరించకపోవచ్చు. కానీ నీ అభిప్రాయాన్ని నిస్సంశయంగా వ్యక్తపరచే అవకాశాన్ని నీకిస్తాను'.

నేను నీ భావాల్ని వ్యక్తీకరించే అధికారాన్ని పూర్తిగా గౌరవిస్తాననడం ఎంత మంచి భావన. ఇంట్లో, కార్యాలయంలో, సమాజంలో ఎక్కడైనా కావచ్చు! ఎదుటివారి మాటల్ని శ్రద్ధగా ఆలకించడమూ విజ్ఞతలో భాగమే! ఈ ఒక్క సూత్రాన్ని మరచిపోకుండా మసలుకోగలిగితే ఎన్నో సమస్యలు సులువుగా పరిష్కారమవుతాయి.

ఆత్మన్యూనత వల్లే ఏకపక్ష పోకడ : అవతలి వాళ్ళను ఎలాగైనా ఒప్పించాలనుకోవడం, మాట్లాడే అవకాశం ఇవ్వకుండా మనమాటే నెగ్గాలనుకోవడం నిజానికి ఆత్మన్యూనతకు చిహ్నం. *The desire to influence other people must be accompanied by a willingness to listen patiently to them* - ఇతరులను ప్రభావితం చేయాలనుకున్నవారు ముందుగా ఎదుటివారి మాటల్ని సావధానంగా, సహనంతో వినడానికి ప్రాధాన్యం ఇస్తారు.

ఎదుటి వ్యక్తి భావ వ్యక్తీకరణకు స్వేచ్ఛనివ్వకుండా, వారు చెప్పేది పూర్తిగా వినకుండా, వారు మనకు దగ్గర కావాలనుకోవడం అవివేకం. అయితే చాలామంది ఈ విషయంలో చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారు. తమ గోలే తమదన్నట్లుగా ఏకపక్షంగా మాట్లాడుతూనే ఉంటారు. ప్రజాస్వామ్య సమాజంలో ప్రతి ఒక్కరికీ తమ భావాల్ని వ్యక్తపరచే హక్కు ఉందని అందరమూ గుర్తించాలి. ఒకరి అభిప్రాయాలను మరొకరం అంగీకరించలేకపోయినా, కనీసం విని ఆలోచించగలిగే విశాల దృక్పథాన్నైనా పెంచుకోగలగాలి. అయితే మనలో చాలామందికి ఎదుటివారి అభిప్రాయాల్లో దోషాలను పట్టడంలో, వాటిని ఖండించడంలో, ప్రతివాదనలను వినిపించడంలో ఉండే ఆసక్తి, వాటిలోని మంచిని స్వాగతించడంలో ఉండదు.

చెప్పే హక్కు అందరిదీ! : ఒకరి హక్కుల్ని మనం గౌరవించినప్పుడే, మన హక్కులకు కూడా పరిరక్షణ కలుగుతుంది. అభిప్రాయాల వ్యక్తీకరణకు కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. *Democracy needs a measure of tolerance of other people's views and ways* - ప్రజాస్వామ్య జీవనంలో సాటిమనిషి ఆలోచనలనూ, వారు అనుసరించే మార్గాలనూ సామరస్యంతో సహించడం కనీసధర్మం.

ప్రాథమికంగా పాఠశాలలు, కళాశాలల స్థాయి నుంచే బాలబాలికలను ఈ దిశలో తీర్చిదిద్దాలి. దురదృష్టవశాత్తూ మన బోధనావిధానంలో దీనికి ఏ మాత్రం ప్రాముఖ్యం ఇవ్వడం లేదు. అందుకే ఒక స్థాయికి వచ్చాక, యువతీ యువకులలో ఎదుటివారి అభిప్రాయాలనూ, విమర్శలనూ హుందాగా స్వీకరించే ఉదాత్త మనస్తత్త్వం కొరవడుతోంది. ఫలితంగానే అటు వృత్తి వ్యవహారాలలో, వ్యక్తిగత జీవితాల్లో వ్యక్తుల మధ్య సయోధ్య కుదరక అలజడులు చెలరేగుతున్నాయి. మన అభిప్రాయాలపై, భావనలపై మనకు పూర్తి విశ్వాసమున్నప్పుడు, ఎదుటివారు వాటిపై ఎలా స్పందించినా సరే విశాలహృదయంతో స్వీకరించగలుగుతాం. ❖ **సేకరణ: ఆర్. కృష్ణ**

ప్రతిదాన్నీ అవహేళన చేసే బుద్ధి ఈ జాతి రక్తంలోనికి చొచ్చుకొని పోయింది. ఈ భయంకర వ్యాధిని నిర్మూలించుకోండి. తమ దోషాలను ఇతరుల నెత్తిపై రుద్దేవారు బలహీనులు. - స్వామి వివేకానంద

ఖాళీ చేతులతో ఎలా పంపాలి?

ఒకసారి రణజిత్‌సింగ్ మహారాజు ఎక్కడికో వెళుతున్నారు. ఇంతలో ఒక రాయి వచ్చి ఆయనకు తగిలింది. సైనికులు నాలుగువైపులా పరికించి చూడగా ఒక వృద్ధురాలు కనబడింది. సైనికులామెను బంధించి రాజుగారి దగ్గరకు తీసుకొని వచ్చారు.

వృద్ధురాలు రాజు గారిని చూస్తూనే భయంతో వణికి పోయింది. "ప్రభూ! నా పిల్లవాడు నిన్నటి నుండి ఆకలితో ఉన్నాడు. ఇంట్లో తినడానికేమీ లేదు. అందుకే చెట్టు మీదకు రాళ్ళు విసురుతున్నాను. కనీసం కొన్ని రేగుపండ్లు రాలితే అవి తీసుకొని వెళ్ళి అతడికి తినిపించాలి అని! పొరపాటుగా అందులో ఒక రాయి వచ్చి తమరికి తగిలింది. నేను నిరపరాధిని. ప్రభూ! నన్ను క్షమించండి" అని అన్నది.

మహారాజు కొంతసేపు ఆలోచించి, తరువాత సైనికులతో 'ఈ వృద్ధురాలికి ధనమిచ్చి సగౌరవంగా సాగనంపండి' అన్నాడు.

ఇది విని ఉద్యోగులందరూ ఆశ్చర్యచకితులయ్యారు. చివరికి ఒకరు అడిగేశారు కూడా – 'మహారాజా! దండించవలసిన మనిషికి డబ్బిచ్చి పంపడమా?' అని.

'కదలలేని ఒక చెట్టే రాయి తగిలితే బదులుగా తియ్యటి పండ్లు ఇచ్చినప్పుడు పంజాబ్‌కు మహారాజునైన నేను ఆమెను ఖాళీ చేతులతో ఎలా పంపేయగలను?' అని రణజిత్‌సింగ్ అన్నారు. ❖

అవినీతికి ఆరంభం

ఒకసారి నౌశేరవా పాదుషా ఒక గ్రామ సమీపంలో మకాం పెట్టాడు. కబాబ్‌లోకి ఉప్పు లేదు. అతడు ఉప్పు కోసం ఒక సేవకుణ్ణి బజారుకు పంపాడు. ఆ సేవకుడు బయలుదేరుతుంటే నౌశేరవా, అతడితో "చూడు! ఉప్పుకు డబ్బు లిచ్చేయి. లేకపోతే మన దేశమే నాశనమైపోతుంది" అన్నాడు. ఇది విన్న సేవకుడికి చాలా ఆశ్చర్యమేసింది. అతడు వినయంగా "పాదుషా! ఒక్క పైసా విలువ చేసే ఉప్పుకు డబ్బీయకపోతే మన దేశమెందుకు నాశనమైపోతుంది?" అని అడిగాడు.

అందుకు పాదుషా ఇలా అన్నాడు: "రాజు గనక ఒక గుడ్డుని ఉచితంగా తీసుకుంటే, దాన్ని అవకాశంగా తీసుకొని సైనికులు వెయ్యి కోళ్ళను ఎత్తుకుపోవడానికి కూడా వెనుకాడరు. ఇవాళ నేను పైసా విలువ చేసే ఉప్పుకు డబ్బీయకపోతే, రేపు నా సైన్యం నా పేరు చెప్పుకుని ఎన్నో మణుగుల ఉప్పు తీసుకొని పోవచ్చు. అన్యాయం అనేది మొదట్లో చిన్నగా మొదలై, తరువాత బాగా పెరిగిపోతుంది. అందుకు కారణం అధికార దుర్వినియోగమే" అన్నాడు. ❖

అనువాదం: డాక్టర్ వై.సరోజా నిర్మల

(రామకృష్ణ సంఘం - హిందీ మాసపత్రిక 'వివేకజ్యోతి' నుండి)

కైలాస-మానస సరోవర తీర్థయాత్ర



భక్తులకు ఓ అపూర్వ అవకాశం

1. కైలాస-మానస సరోవర తీర్థయాత్ర
2. ముక్తినాథ్ తీర్థయాత్ర
3. శ్రీరామకృష్ణ గురుపీఠం - బేలూరు మఠ తీర్థయాత్ర
4. మణి మహేశ్ కైలాస్ & శక్తిపీఠ హిమాచల్ యాత్ర
5. కాశీ-పంచక్రోషి తీర్థయాత్ర
6. పంచ ద్వారక తీర్థయాత్ర
7. నర్మదా పరిక్రమ తీర్థయాత్ర
8. దక్షిణభారత తీర్థయాత్ర - తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లోన్ని అన్ని దేవాలయాలు.
9. అండమాన్ - నికోబార్ యాత్ర
10. శ్రీలంక తీర్థయాత్ర
11. మలేషియా - సింగపూర్ - థాయ్‌ల్యాండ్ - కాంబోడియా (అంకోర్‌వాట్) - ఇండోనేషియా యాత్ర

పూర్తి వివరాలకు సంప్రదించండి

శ్రీ రామకృష్ణ యాత్రా సర్వీసు®

ప్రధాన కార్యాలయం : కొత్త నెం. 120/1, పాత నెం. 216/1, రామకృష్ణ మఠం రోడ్, ఆర్.కె. మఠం ఎదురుగా, మైలాపూర్, చెన్నై - 600 004

ఫోన్:044-2461 6968, 2495 0095, సెల్: (0)94440 91428, (0)98427 11886 ఫ్యాక్స్: 044-2462 0631

Email : anandhan@srkyatra.com, Website: www.srkyatra.com

ఆధ్యాత్మిక సేవాపరాయణుడు : జి.యస్. ఆనందన్ సెల్ : (0)94431 44808

Advt.,

(1884 – 1967)

ముందుకు సాగిపో!

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ, ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్న్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ - వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్న్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం, ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

సార్‌గాచీ

*ప్రియమైన వివేక్!** 2-12-49

నువ్వు మమ్మల్ని అందర్నీ చాలా ప్రేమిస్తున్నావని తెలిసి నా ఆందోళన తొలగిపోయింది. ఇప్పుడు నేను వ్రాసే ప్రతి మాటనూ జాగ్రత్తగా తూచి వాడవలసిన పనిలేదని భావిస్తాను.

'పెద్దమనుషులు' అంటే నాకు విపరీత భయం. నేను బాహాటమైన మనిషిని. విషయాలను అణిచిపెట్టడంగానీ, దాచిపెట్టడంగానీ చెయ్యలేను. ఇది కొంతమంది పెద్ద మనుషులకు తలనొప్పి కలిగిస్తుంది. మరికొన్నిసార్లు నేను వ్రాసే ఉత్తరాలలో హాస్యాన్ని మిళితం చెయ్యడం వల్ల ఇబ్బందుల పాలవుతుంటాను. నేను సన్న్యాస వర్గంలో పెద్దవాడిని కావడం వల్ల నేను వ్రాసే 'గూఢమైన వేదాంతం' (వేదాంతపు పరాకాష్ఠ) 'బాహాటమైన భేదాంతం'గా మారుతోంది (తగాదాలకు మూలమవుతోంది). అది నా దురదృష్టం. జ్ఞానేంద్రియాలు ఐదు, కర్మేంద్రియాలు ఐదు, మనస్సు – మొత్తం పదకొండు సాధనాలు మనిషికి ఉన్నాయి. అవి అన్నీ వాటి పనులను అవి చెయ్యాలని మనం భావిస్తాం. ఈ పరికరాలన్నీ మన చేష్టలను జన్మజన్మలుగా నమోదు చేస్తాయి.

చూడు వివేక్! దూరం నుండి ప్రపంచాన్ని గమనించు. చెయ్యి చాచావో దాని అందం కనుమరుగవుతుంది. ఈ ప్రపంచంలో అంతా యాచకులే కనుక నీవు ఎవరినైనా ఏమైనా అడిగావనుకో – వారికి అది అసుఖంగా ఉంటుంది. ప్రపంచం చాలా వెలితిగా ఉన్న పెద్దకుండ. శాస్త్రాల్లో ఏనాడో చెప్పబడింది – 'ఆశించడమే దుఃఖానికి కారణం. ఆశించకపోవడమే సుఖానికి మార్గం.' స్వామీజీ కూడా 'నీ వద్ద తగినంత సంపద ఉంటే ఇచ్చెయ్! కానీ వెనుదిరిగి చూడకు' అని చెప్పారు.

కనుక ఇవ్వడానికే సిద్ధపడు! "ఇచ్చెయ్, ఇచ్చెయ్" – ఈ కేకలే మనం బాల్యం నుండీ వింటున్న శక్తిమంతమైన నినాదాలు. కానీ ఆకస్మికంగా అంతకన్నా పెద్ద శబ్దంతో "తీసుకో, తీసుకో! నీవు తీసుకోగలిగినంత తీసుకో!" అనే కేకలు విన్నాము. ఆశ్చర్యంతో అంతటా వెతికి వెతికి, చివరకు దక్షిణేశ్వరంలో ఉన్న 'దివ్యమైన ఖజానా' (శ్రీరామకృష్ణుల) వద్దకు వచ్చిపడ్డాం.

కానీ చూడు వివేక్! ప్రపంచంలో ఒక రకం మనుషులు ఉంటారు. వారిని 'ఆజన్మ యాచకులు' అని పిలుస్తారు. దాదాపు ఈ లోకంలో తొంభై తొమ్మిది శాతం మంది ఇదే కోవకు చెందుతారు. సన్న్యాసుల లాగానే వారు ఏమీ పొదుపు చెయ్యరు. నిద్ర లేవగానే జోలె పట్టుకొని యాచన ప్రారంభిస్తారు. వారికి తీసుకోవడమే తెలుసు. ఇవ్వడం వారెరుగరు! ఇచ్చేవారి ఘనతను వారెప్పుడూ కాపాడుతుంటారు. లేకపోతే ఇచ్చేవారికి ఎవరు ప్రాముఖ్యం ఇస్తారు చెప్పు?

భగవంతుడు ఈ ప్రపంచాన్ని సృష్టించి నవ్వుకున్నాడు. ఒకడు గుర్రమెక్కి స్వారీ చేస్తాడు. మరొకడు దానికి గడ్డి పెడతాడు. ఇది విధి విధానం. నువ్వు ఒక్కసారి దూరాన నిలబడి గమనించు. మనుషులు వీధుల వెంట ఉద్యోగాలకై పరిగెడుతుంటారు. యువకులు వారి వారి రంగాల్లో పనిచేస్తూ పరిగెడుతుంటారు. పిల్లలు వాళ్ళ ఇళ్ళ ప్రాంగణాల్లో పరుగులు తీస్తుంటారు. ఆఖరికి అప్పుడే పుట్టిన పసిబిడ్డ సైతం పొత్తిళ్ళలోనే పడుకొని కాళ్ళూ చేతులూ ఊపుతూ ఉంటుంది. వింతగా లేదూ! "మాయా రంగులరాట్నం" ఎక్కారు అందరూ. ఎవరూ ఖాళీగా లేరు. పూర్వ సంస్కారాల కొరడాదెబ్బలు మన వీపులపై ఛెళ్ళుమంటున్నాయి. మనిషి తన పూర్వకర్మ అనే బండిని భారంగా లాగుతూ సంతలో తిరుగుతున్న ఎద్దు సుమా! కానీ ఆ ఎద్దులో కూడా ఆత్మ ఉంది. కానీ ఆ విషయం దానికి తెలియదు. ఏనుగు, చీమ – రెండూ వేర్వేరు రూపాలు ధరించిన ఒకే జీవి అని తెలిసినవానికే ఇది అర్థమవుతుంది.

ప్రేమాశీస్సులతో
స్వామి ప్రేమేశానంద

తెలుగు సేత: కె. త్రివిక్రమరావు

(*వివేకానంద చౌదరి – ప్రస్తుత రామకృష్ణ సంఘ ఉపాధ్యక్షుల్లో ఒకరైన స్వామి ప్రభానంద మహారాజ్)

కోరికలు ఉన్నంత కాలం నిజమైన సుఖం లభించదు. యంత్రాలు ఎన్నడూ మనిషికి సుఖాన్ని ఇవ్వలేవు. మనస్సును నియంత్రించిన వ్యక్తిమాత్రమే సుఖాన్ని పొందగలడు. - *స్వామి వివేకానంద*

(...15వ పేజీ తరువాయి)

సాగిపోయి, నదులన్నీ సాగరంలో కలిసినట్లు, ప్రతి శాస్త్రానికీ పరమగమ్యం పరమాత్మే అయ్యాడు! ఆనాడు అంతరిక్షం నుంచి అణుపరీక్షల వరకు ఎన్ని పరిశోధనలు చేసినా, మన పూర్వీకుల అన్వేషణ లక్ష్యం మాత్రం ఆద్యంతరహితుడైన ఆ భగవంతుడే! కానీ నేడు ఏళ్ళ తరబడి మనం నేర్చుకుంటున్న పాఠాల, పోటీపడి సంపాదిస్తున్న పట్టాల పర్యవసానం మాత్రం స్వార్థం, సంకుచితం; సృష్టికర్తనే మరచిపోవడం! అందుకే,

ఎనయ నీతని ఎరుగుటకే పో, వెనకవారు చదివిన చదువు
మనసున నీతని మరచుట కేపో, పనివడి యిప్పటి ప్రౌఢల చదువు

అని పదకవితా పితామహుడు పునరుద్ఘాటిస్తున్నారు. 'ఎనయ' అంటే 'పరిశీలించగా' అని భావం. అయితే ఈ రోజుల్లో ఎందరో తల్లితండ్రులు తమకు తెలియకుండానే హిరణ్యకశిపులను తలపిస్తున్నారు; చదువు చెప్పేవారూ చండామార్కుల వారసులుగా మారిపోతున్నారు. అందుకే పసిపిల్లల పాఠాల్లో పేరుకైనా పురాణపురుషుడి ప్రస్తావన కనిపించడం లేదు. పైగా అలాంటి కథలను, కథనాలను పుక్కిటిపురాణాలుగా కొట్టి పడేస్తున్నారు. కానీ ప్రహ్లాదుడు

చక్రహస్తుని ప్రకటించు చదువు చదువు
కుంభినీధవు చెప్పెడి గురుడు గురుడు
హరి చేరుమనెడి తండ్రి తండ్రి

'చక్రధారి అయిన ఆ శ్రీమన్నారాయణుని విశదపరచే చదువే చదువు; గోవిందుని గురించి బోధించే గురువే గురువు; ఆ శ్రీహరిని చేరుకొమ్మని చెప్పే తండ్రే తండ్రి!' అంటూ ఘంటాపథంగా చెప్పాడు.

వ్యక్తి వికాసం నుంచి విముక్తి మార్గం వరకు మన సనాతన సారస్వతంలో లేని అంశం లేదు. అలా పురాణకథలు, ధార్మిక గ్రంథాల రూపంలో మన మహర్షులు మనకు అపురూపమైన జ్ఞాన భాండాగారాన్ని మిగిల్చి వెళ్ళారు.

ఈతని కాదనే... కలియుగపు చదువు

ఒకమారు భక్తులతో భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస "ఈ రోజుల్లో విద్యావంతులమనుకుంటున్న వారికి భగవంతుడు లేడనడం ఓ అలవాటుగా మారిపోయింది. చదువుకున్న ఓ పెద్దమనిషి ఉండేవాడు. అతను దేవుడు లేడని ఎప్పుడూ వాదిస్తూ ఉండేవాడు. ఒకసారి మేడపైకి వెళ్ళాలని మెట్లు ఎక్కుతూ ఉన్నాడు. రెండు మెట్లు ఎక్కగానే, ఆయాసపడుతూ, స్పృహతప్పి కిందపడిపోయాడు. అతడి బంధువులు ఆందోళనతో వైద్యుడి కోసం కబురు పంపారు. కానీ ఆ వైద్యుడు వచ్చేలోపే ఆ పెద్దమనిషి వైకుంఠయాత్ర చేసేశాడు. ఈ మాత్రం సత్తా ఉన్న మానవులు 'దేవుడు లేడు; దేవుడు లేడు' అంటూ అహంకరిస్తూ ఉంటారు" అన్నారు. అలాగే, 'ఏ జ్ఞానాన్ని పొందితే భగవంతుణ్ణి తెలుసుకోగలమో అదే అసలైన జ్ఞానం. ఇతర విద్యలన్నీ పూట గడవడానికి తప్ప, దేనికీ పనికిరావు' అనేవారు.

అయితే కలియుగంలో మన విద్యావ్యవస్థ చాలావరకు పొట్టపోసుకోవడానికే ఉపయోగపడుతుంది. అంతకు మించిన మానవలక్ష్యాన్ని నిర్దేశించడంలో విఫలమవుతుంది. ఫలితంగానే విద్యాధికులైన వ్యక్తులు కూడా మానసికంగా మరుగుజ్జు వృక్షాలుగా మిగిలిపోతున్నారు. దీనికి ప్రధాన కారణం – నేటి మన చదువుల్లో అంతర్యామిని అన్వేషించే అంశాలు మచ్చుకైనా లేకపోవడమే! కానీ పూర్వయుగాలలో ఏ శాస్త్రాధ్యయనమైనా సర్వేశ్వరుడి నుంచే శ్రీకారం చుట్టుకొనేది. అందుకే అన్నమాచార్యులు ఇక్కడ...

తెలిసి యితనినే తెలియుటకే పో, తొలుత కృతయుగాదుల చదువు
కలిగిన యీతని కాదననే పో, కలియుగంబులో కలిగిన చదువు

అంటున్నారు. మానవజన్మ లక్ష్యాన్ని తెలుసుకోకుండా, మిగతా ఎన్ని విద్యలు నేర్చుకుంటే మాత్రం ఏం ఫలితం ఉంటుంది!

వేంకటపతిని కనుటకే చదువు...

ఈ తరంలో పాలు తాగే వయసు నుంచి ప్రారంభించి దాదాపు పాతికేళ్ళకు పైగా పుస్తకాలతో కుస్తీ పడుతున్నాం. ఇన్ని పుస్తకాలు చదివి, ఏదో సాధించామని వెనక్కి తిరిగి చూసుకుంటే మన ఆత్మానందానికీ, ఆత్మాన్వేషణకూ అవసరమైంది ఒక్కటీ ఉండదు. పైగా మన మనస్సులోని సహజత్వం, సౌజన్యం స్థానాల్లో కృత్రిమత్వం, విద్వేషం వచ్చి చేరుతున్నాయి. ఇలాంటి దుస్థితిని నిరసిస్తూ యోగి వేమన...

చదివి చదివి కొంత చదువంగ చదువంగ
చదువు చదివి యింక చదువు చదివి
చదువు మర్మములను చదువు లేదయ్యెను
విశ్వదాభిరామ వినురవేమ! అంటారు.

అవును! ఎంత కాలం ఎన్ని చదువులు చదివినా, చదువులలోని మర్మమైన ఆత్మతత్త్వం తెలియకపోతే ఆ చదువులన్నీ నిరర్థకాలే కదా! అంటారు.

అందుకే బ్రహ్మాండనాయకుడి భక్తశిఖామణి తన జ్ఞాననేత్రంతో వీక్షించి,

పరమని వేంకటపతి కనుటకే పో, దొరలగు బ్రహ్మాదుల చదువు
సిరుల నితని మరచెడి కొరకేపో, విరసపు జీవుల విద్యల చదువు

'బ్రహ్మాదులందరూ ఆ వేంకటపతిని దర్శించేందుకే జ్ఞానాన్ని సముపార్జించారనీ, అయితే శ్రీకాంతుడైన ఆ శ్రీనివాసుణ్ణి మరచేందుకే ఈ విరసపు చదువులు వినియోగపడుతున్నాయ'నీ స్పష్టం చేస్తూ ముక్తాయింపు పలుకుతున్నారు. ❖



- స్వామి పార్థసఖానంద

అరివీరశూరత్వం

గుంపులో ఒకడిగా ఉండడం సులభం, కానీ ఒంటరి పోరాటానికే గుండె ధైర్యం కావాలి.

ప్రాపంచిక శూరత్వం ఉన్నవాడు ధైర్యాన్ని చావులో చూపిస్తాడు, ఆధ్యాత్మిక శూరత్వం ఉన్నవాడు ధైర్యాన్ని బ్రతకడంలో చూపిస్తాడు.

కండ బలాన్ని ప్రదర్శించగల ధీరత్వం కేవలం పశు ప్రవృత్తి. ధర్మాచరణలో చూపే ధీరత్వం దైవీసంపత్తి.

"ధైర్యం అంటే...
దేనికి భయపడకూడదో తెలుసుకోవడం!"



పది మందికి తెలిసేలా చేసే ఘనకార్యాన్ని, ఎవరికీ తెలియకుండా చేయగలగడమే నిజమైన ధీరత్వం.

నవ్వుల పువ్వులు

నవ్వు ఉచితంగా దొరికే మందు. నవ్వులే పూయని రోజు, వ్యర్థం అయిపోయినట్లే.

మనం ఆనందంగా ఉన్నప్పుడు జీవితం మనల్ని చూసి నవ్వుతుంది. మనం ఇతరుల్ని ఆనందంగా ఉంచినప్పుడు, జీవితం మనకు చేతులెత్తి నమస్కరిస్తుంది.

మనం ఏడిస్తే ఈ లోకం నవ్వుతుంది,
మనం నవ్వితే ఈ లోకం ఏడుస్తుంది.
అలాంటి లోకాన్ని ఎంత పట్టించుకోకుండా ఉంటే,
అంత ఆనందంగా ఉండగలం.

'నా బాధ మరొకరి నవ్వుకు కారణం కావచ్చు. కానీ నా నవ్వు మరొకరి బాధకు కారణం కాకూడదు' అని చార్లీ చాప్లిన్ మనతో కంటతడి పెట్టిస్తారు.

"అద్దం నాకు మంచి మిత్రుడు. ఎందుకంటే, నేను ఏడుస్తున్నప్పుడు అదెప్పుడూ నవ్వదు మరి!"

ఆలోచించాల్సిందే!

మనం వెయ్యేళ్ళ అభివృద్ధిని వందేళ్ళలోనే సాధించాం, మంచిదే! కానీ ఎన్నో వేల ఏళ్ళకు సమానం కాలేని వినాశనాన్ని ఈ వందేళ్ళలోనే చూశాం, మరి దాని సంగతేమిటి?

భగవద్గీత - సద్గుణ సుధ

- స్వామి పరిజ్ఞేయానంద

సుఖదుఃఖాల బాటలో జీవనయాత్ర

'ఈ జీవితం మూన్నాళ్ళ ముచ్చటే..., ఈ దేహం రాలిపోయేదే..., ఈ గూటిలోని చిలుక ఎగిరిపోయేదే...' అంటూ తత్త్వాలు పాడుకుంటూ తత్త్వసారాన్ని జీర్ణించుకోలేకపోతే మనం నిరాశావాదులుగా మారిపోయే ప్రమాదముంది. సోమరులుగా తయారయ్యే అవకాశముంది. కర్తవ్యాలను విస్మరించి పలాయనవాదులుగా పరిణమించే పరిస్థితి ఏర్పడుతుంది. అందుకే భగవాన్ శ్రీకృష్ణుడు 'ఈ దేహంలో ఉంటూనే దేహాతీతస్థితినీ; కర్మలు చేస్తూనే కర్మరాహిత్య స్థితినీ, సుఖదుః ఖాలను అనుభవిస్తూనే సుఖదుఃఖాతీత స్థితినీ పొందాలని' బోధించాడు.

సంసార సాగరం నుండి మోక్షతీరాన్ని చేర్చే సాధనమే ఈ దేహం. సంసార సాగరంలో పయనిస్తున్నప్పుడు ప్రచండ సూర్యతాపం లాంటి కష్టాలు కన్నీళ్ళు పెట్టించవచ్చు; చల్లని చంద్రకాంతిలాంటి సుఖాలు ఆహ్లాదాన్ని కలిగించవచ్చు; నల్లని మబ్బుల్లాంటి నిరాశానిస్పృహలు ఆవరించవచ్చు; ఆత్మ విశ్వాసమనే అనుకూల పవనాల సాయంతో ముందుకు సాగిపోవచ్చు; అవమానాల పెనుతుపాను చుట్టుముట్టవచ్చు; ప్రశంసల వెల్లువ ముంచెత్తవచ్చు. ఇలా మన జీవనయానంలో ఎదురయ్యే సుఖదుఃఖాలు, లాభనష్టాలు, జయాపజయాలు, మానావమానాల నుండి ఎవ్వరం తప్పించుకోలేం. కాబట్టి ఈ ద్వంద్వాలతో కూడిన బాటలో మన జీవనయాత్ర కొనసాగాల్సిందే!

సాధారణంగా మనమంతా సుఖాన్ని స్వాగతిస్తాం, దుఃఖాన్ని ద్వేషిస్తాం. సుఖం కావాలని కోరుకున్నామంటే వెంటనే దుఃఖం వచ్చి తీరుతుంది. అందుకే స్వామి వివేకానంద **'సుఖం, దుఃఖమనే కిరీటాన్ని ధరించి మనిషి ముందు ప్రత్యక్షమవుతుంది'** అని మనల్ని అప్రమత్తుల్ని చేశారు.

ఇంతకీ ఈ సుఖం, దుఃఖం అనే అనుభవం ఎలా కలుగుతుంది? వీటి బారి నుండి తప్పించుకునే మార్గమేమిటి? ఈ ప్రశ్నలకు సమాధానమిస్తూ శ్రీకృష్ణుడు...

మాత్రాస్పర్శాస్తు కౌన్తేయ శీతోష్ణ సుఖదుఃఖదాః ।
ఆగమాపాయినోఽనిత్యా స్తాం స్తితిక్షస్వ భారత ॥ *(గీత. 2-14)*

'అర్జునా! ఇంద్రియాలు, విషయాలతో సంయోగం చెందినప్పుడు శీతోష్ణాలు, సుఖదుఃఖాలు కలుగుతాయి. అవి వస్తూ, పోతూ ఉంటాయి గాని శాశ్వతంగా ఉండవు. వాటిని సహించాలి' అని పరిష్కారమార్గాన్ని చూపాడు.

మన దేహంలో ఉన్న ఇంద్రియాలు - చెవి, చర్మం, కన్ను, నాలుక, ముక్కు. అలాగే బయట ఉన్న విషయాలు - శబ్దం, స్పర్శ, రూపం, రుచి, వాసన. దేహంలోని పంచేంద్రియాలు, ప్రపంచంలోని పంచ విషయాలతో కలిసినప్పుడు సుఖదుఃఖాలు కలుగుతాయి. మనల్ని ఎవరైనా ప్రశంసిస్తే ఆ మాటలు మన చెవినపడి మనకు ఆనందాన్ని కలుగజేస్తాయి. అదే గనక ఎవరైనా మనల్ని విమర్శిస్తే అవి మనకు దుఃఖాన్ని కలుగజేస్తాయి. అలాగే సుందరమైన దృశ్యాన్ని చూసినప్పుడు ఆహ్లాదం కలుగుతుంది. వికృతరూపం చూస్తే వికారం కలుగుతుంది. ఇలా విషయాలతో ఇంద్రియాలు సంయోగం చెందడం ద్వారా కలిగే సుఖదుఃఖాలను మనం ప్రతినిత్యం అనుభవిస్తూనే ఉన్నాం.

విషయాలతో ఇంద్రియాలు సంయోగం చెందడం సహజం. అందువల్ల కలిగే సుఖదుఃఖాల నుండి తప్పించుకోలేం. అందుకే భగవానుడు 'ఇంద్రియ, విషయ సంయోగం ద్వారా కలిగే సుఖదుఃఖాలు తాత్కాలికమే! కాబట్టి తితిక్ష వహించమ'ని సూచించాడు. తితిక్ష అంటే 'మనకు కలిగిన కష్టానికి కలత చెందకుండా, ప్రతీకారభావం లేకుండా చిరునవ్వుతో సహించగలగడమే' అని 'వివేక చూడామణి'లో ఆదిశంకరులు నిర్వచించారు.

ఏదైనా కష్టం వస్తే భయపడి పారిపోయేవాడు అధముడు. కష్టాన్ని అనిష్టంగా, బాధపడుతూ సహించేవాడు మధ్యముడు. అలాకాకుండా జీవితంలో కష్టసుఖాలు సహజమేనని గ్రహించి సమబుద్ధితో సహించేవాడు ఉత్తముడు. అలాంటివాడే నిజమైన ధీరుడు. అందుకే శ్రీకృష్ణుడు **'సమ దుఃఖసుఖం ధీరం సోఽమృతత్వాయ కల్పతే** *(గీత. 2-15)* - సుఖదుఃఖాల పట్ల సమబుద్ధి కలిగిన ధీరుడే మోక్షానికి అర్హుడు' అని ఉద్ఘాటించాడు.

☞

జీవన వేదం

స్వామీజీ కథల సారం

వారసత్వ సిద్ధాంతం

పేద నిర్భాగ్యుల గురించి ఏదైనా ఒక దయగల పలుకు పలికి, దీనులను ఉద్ధరించే కార్యక్రమం ఏదైనా చేపడితే మన ఆధునిక విద్య మనకిచ్చిన గర్వం తగ్గడం నేను చాలాసార్లు గమనించాను. అంతేకాదు ఈ పేదవారి గురించి చాలా పైశాచికమైన, క్రూరమైన వ్యాఖ్యానాలను కొందరు ఆధునిక విద్యావంతులు చేయడం కూడా విన్నాను. ఆ రకమైన మొరటుదనం వారికి వారి పూర్వీకుల నుండి వారసత్వంగా లభించిన సంపద అయి ఉండవచ్చు. లేదా పాశ్చాత్య ప్రభావం చేత ఏర్పడిన వాచాలత్వం కావచ్చు. వారి జంతుస్థితికీ, నియంతృత్వానికీ పేదవారు బలై పోతున్నారు.

అమెరికాలో సర్వమత మహాసభకు అనేక మందితో పాటు నీగ్రోగా జన్మించిన ఒక ఆఫ్రికా యువకుడు కూడా వచ్చాడు. అతడొక అద్భుత ప్రసంగం చేశాడు. నాకు ముచ్చట వేసి అవకాశం లభించినప్పుడల్లా అతనితో కాసేపు మాట్లాడుతూ ఉండేవాణ్ణి. కానీ, అతనికి సంబంధించిన వివరాలేవీ నాకు తెలియరాలేదు. ఒకరోజు నేను ఇంగ్లాండులో కొందరు అమెరికన్లను కలుసుకోవడం తటస్థించింది. వారు చెప్పిన సమాచారం – ఈ కుర్రవాడు ఒక నీగ్రో నాయకుని కుమారుడు. వారి కుటుంబం ఆఫ్రికా నడిబొడ్డున నివసించేది.

ఒక రోజు మరొక నాయకునికి ఈ కుర్రవాని తండ్రిపై కోపం వచ్చి, తల్లితండ్రులిద్దరినీ చంపేసి వండుకు తినేశారట. ఈ కుర్రవానిని కూడా చంపి వండుకు తినమని తన మనుష్యులకు ఆదేశించాడట ఆ నాయకుడు. కానీ ఈ కుర్రవాడు ఎలాగో తప్పించుకొని, అనేక ఇక్కట్లకు గురై, అనేక వందలమైళ్ళు ప్రయాణించి చివరకు సముద్రం ఒడ్డుకు చేరాడట. అక్కడ అతడిని కొందరు అమెరికన్లు తమ నౌకలోకి ఎక్కించుకొని అమెరికా దేశానికి తీసుకువచ్చారట. ఆ కుర్రవాడే ఈ సర్వమత మహాసభలో ప్రసంగించిన ఆఫ్రికన్ యువకుడు.

ఇది విన్నాక ఇక మీరు చెప్పే వారసత్వ సిద్ధాంతాన్ని గురించి ఏ విధంగా ఆలోచించాలి నేను? ❖

సాక్షాత్తూ దేవత

మీలో కొంతమంది 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటు సమయంలో బ్రిటీషు వారికి ఎదురొడ్డి పోరాడిన ఆ స్త్రీ గురించి వినే ఉంటారు. ఆమె పేరు ఝాన్సీ లక్ష్మీబాయి. ఆమె తన సైన్యాన్ని ముందుండి నడుపుతూ, అధునాతనమైన ఫిరంగులు కలిగిన ఆంగ్లేయులను రెండు సంవత్సరాల పాటు తన రాజ్యం లోనికి చొరబడనీయకుండా పోరాడింది.

ఆ యుద్ధ సమయంలో తన ముగ్గురు కుమారులను కోల్పోయిన ఒక వ్యక్తి నాకు తెలుసు. తన కొడుకుల సంభాషణ వచ్చినప్పుడు అతడు చాలా ప్రశాంతంగా ఉండేవాడు. కానీ ఆ రాణి గురించిన ప్రస్తావన వచ్చినప్పుడు అతని కంఠస్వరం తీక్షణంగా మారిపోయేది. ఆమె సాక్షాత్తూ దేవత అనేవాడు. ఆమె మానవ మాత్రురాలు కాదు అనేది అతని భావన. ఆ వృద్ధ అనుభవశాలి తన జీవిత కాలంలో ఆమె లాంటి నాయకురాలిని చూడలేదనేవాడు.

అలాగే మరొకస్త్రీ – చాంద్ బీబీ లేదా చాంద్ సుల్తానా (క్రీ.శ. 1550–1599). భారతదేశంలో ప్రసిద్ధికెక్కిన స్త్రీ. మొఘల్ సైన్యాలు చొచ్చుకువస్తున్న తరుణంలో, ఆమె కవచధారియై ఆ సేనలతో పోరాడి వెనుకకు తరిమి వేయగలిగింది.

ఆమె సైనిక శక్తికీ, సాహసానికీ అబ్బురపడిన శత్రు పక్షవీరులు ఆమెను చాంద్ సుల్తానా అని కీర్తించారు. ❖ *తెలుగు సేత: కె. త్రివిక్రమరావు*

ఒకసారి సర్దార్ వల్లభాయ్ పటేల్ న్యాయస్థానంలో వ్యాజ్యం వాదిస్తుండగా ఒకతను వచ్చి ఆయనకు ఓ చీటీని ఇచ్చాడు. ఆ చీటీని చదివి, జేబులో పెట్టుకొని మరలా పటేల్ వాదన కొనసాగించారు. ఆ చీటీలో భార్య చనిపోయిన వార్త ఉంది. ఆ విషాదవార్త తెలిసినా కూడా చలించకుండా పటేల్ తన కర్తవ్యాన్ని పూర్తిచేసుకొని తరువాత ఇంటికి వెళ్ళి, చనిపోయిన తన భార్యకు అంతిమసంస్కారాలు చేశారు. అంటే ఆయనకు తన భార్య పట్ల ప్రేమ లేదని కాదు. జీవితంలో సుఖదుఃఖాలు సహజమేనని తెలిసి, కలత చెందకుండా సమబుద్ధితో వ్యవహరించిన ధీరుడు ఆయన.

అందుకే ఓ చైనా తత్త్వవేత్త **'జీవితంలో సుఖదుఃఖాలు అత్యంత సహజం. వాటిని నిరోధించడానికి ప్రయత్నించవద్దు. ఈ జీవన నదిలో వాటిని సహజంగా ప్రవహించేందుకు అనుమతించు'** అని అంటారు.

కాబట్టి సుఖాన్ని ఆహ్వానించడం గానీ, దుఃఖాన్ని తిరస్కరించడం గానీ చేయకుండా, సమబుద్ధితో వాటిని స్వీకరించి, ధీరులుగా ఎదగడానికి ప్రయత్నించాలి. అప్పుడే సుఖదుఃఖాల బాటలో సాగే మన జీవనయాత్ర సఫలమవుతుంది. జీవన పరమార్థం చేకూరుతుంది. ❖

ప్రశాంత చిత్తంలో పరమానందం

చిత్రకథ: సూర్యనారాయణన్ చిత్రాలు: వేంకట్ అనుసృజన: స్వామి జ్ఞానదానంద

1 కురు రాజ్యంలో మహంతి అనే సంపన్న బ్రాహ్మణుడు నివసిస్తూ ఉండేవాడు. ఆయన కుమార్తె మహంతియా అందాలరాశి. తేజస్వీ, అందగాడూ అయిన యుక్తమైన వరునకే ఆమెనిచ్చి వివాహం చేయాలని మహంతి సంకల్పం.




6
కొన్ని రోజులలోనే కౌశాంబి రాజు ఉదేనుడు, మహంతియా అందచందాలకు ముగ్ధుడై ఆమెను వివాహం చేసుకున్నాడు. కొంతకాలం గడిచింది.
మిత్రులారా! సంతోషకరమైన సంగతి! బుద్ధభగవానులు నేడు మన నగరానికి విచ్చేస్తున్నారు.
ఆయన్ని ఆహ్వానించిన పుణ్యాత్ములెవరు?
మన ఊళ్ళోని ధనికులే ఆయనను ఇక్కడకు ఆహ్వానించారు. ఇది మనకు ఒక వరప్రసాదం.
7
మహారాణీ! మునుపు మిమ్మల్ని అవమానించిన బుద్ధుడు మన నగరానికి వస్తున్నాడట!
అలాగా! నన్ను అవమానించిన అతని మీద కసి తీర్చుకునేందుకు సరైన తరుణం ఇదే!
8
మన వాళ్ళను బుద్ధుణ్ణి గేలి చేసి, అవమానించి ఊరినుంచే తరిమికొట్టేలా చెయ్యమను.
చిత్తం, మహారాణీ!
9
బుద్ధుడు, శిష్యుడైన ఆనందుడు వీధిలో నడుస్తూ వెళుతున్నప్పుడు, జనులు వారిని గేలి చేశారు.
ఈ మనిషిని చూడు! దుక్కలా ఉన్నాడు. సిగ్గు లేకుండా భిక్షమెత్తుతున్నాడు.
ఛీ, ఈతడూ మనిషేనా? ఇదీ ఒక బ్రతుకా?
10
బుద్ధుడు ప్రశాంతంగా వెళుతున్నాడు. కానీ ఆనందుడు ఆవేశపూరితుడయ్యాడు.
స్వామీ! నా గుండె మండిపోతోంది. నేను వెళ్ళి వారికి తగిన బుద్ధి చెప్పివస్తాను.
ఆనందా! వారి మాటలను నేను అక్కడే వదిలిపెట్టేశాను. నువ్వెందుకింకా మోసుకొస్తున్నావు, నాయనా?







రాతిలో మేకును కొట్టడం కష్టం. కానీ మట్టిలో సులువుగా దింపవచ్చును. అలాగే సాధుజనుల హితబోధ లౌకికుడి మనస్సున చొరదు, కానీ శ్రద్ధాభక్తులున్న ఆస్తికుడి హృదయంలో అతిసులభంగా నాటుకొంటుంది.

– శ్రీరామకృష్ణ పరమహంస



మహాపురుషుని సాన్నిధ్య స్మృతులు

– స్వామి అర్చనానంద

పూజ్య స్వామి రంగనాథానందజీ మహరాజ్ బయటకు గంభీరంగా కనిపించినా వారి హృదయం మాత్రం ప్రేమ, కరుణలతో నిండివుండేది. ఆయనకు ధనికుడు, పేదవాడని గానీ; పండితుడు, పామరుడని గానీ భేదబుద్ధి ఉండేది కాదు. భక్తుడైనా, పనివాడైనా; ఉన్నతాధికారైనా, చిరుద్యోగైనా అందరి పట్ల ఒకే విధమైన ప్రేమభావాన్ని వ్యక్తపరిచేవారు. అందరినీ ఒకే విధంగా ఆదరించేవారు, పరామర్శించేవారు.

ఒకసారి హైదరాబాద్ మఠంలో కొత్తగా చేరిన ఒక బ్రహ్మచారికి చర్మవ్యాధి సోకింది. అది అంటువ్యాధి కాబట్టి బయటకు వెళ్ళకుండా కొన్ని రోజులు గదిలోనే విశ్రాంతి తీసుకోమని వైద్యులు సూచించారు. ఈ విషయం తెలిసిన మహరాజ్ మాత్రం ప్రతిరోజూ ఆ బ్రహ్మచారి గదికి వెళ్ళి పరామర్శించేవారు. అలాగే రాయ్‌పూర్ ఆశ్రమం నుండి ఒక బ్రహ్మచారి హైదరాబాద్ వచ్చారు. అతడు నడుము నొప్పితో బాధపడుతుంటే మహరాజ్ అతడి గదికి వెళ్ళి నడుమునొప్పి పోవడం కోసం కొన్ని ఆసనాలను స్వయంగా వేసి చూపించి ప్రతిరోజూ ఆ ఆసనాలను వేస్తూ ఉంటే నడుమునొప్పి తగ్గిపోతుందని సూచించారు. రామకృష్ణ సంఘ ఉపాధ్యక్షులుగా ఉన్న పూజ్య స్వామీజీ కొత్తగా మఠంలో చేరిన బ్రహ్మచారుల పట్ల కూడా ఎంతో ప్రేమ ఆప్యాయతలను కనబరిచేవారు.

పూజ్య స్వామీజీ రామకృష్ణ సంఘ సర్వాధ్యక్షులైన తరువాత కలకత్తాలోని బేలూరు మఠం నుండి ప్రథమంగా హైదరాబాద్ విచ్చేశారు. అప్పుడు ఆయన్ని దర్శించుకోవడానికి శాస్త్రవేత్తలూ, పారిశ్రామికవేత్తలూ, రాజకీయవేత్తలూ, తత్త్వవేత్తలు, ఉన్నతాధికారులు, మఠాధిపతులు, భక్తులు వచ్చేవారు. స్వామీజీ అందరినీ ఆప్యాయంగా పలకరించేవారు, ప్రేమతో మాట్లాడేవారు. అదేవిధంగా ఆయన పేదవాళ్ళతోనూ, పనివాళ్ళతోనూ కూడా అంతే ప్రేమాప్యాయతలతో మాట్లాడేవారు, వారి యోగక్షేమాలను విచారించేవారు.

పూజ్య స్వామీజీ మఠ ప్రాంగణంలో ఒకరోజు ఉదయం నడుస్తూ ఉండగా తోటమాలి పరుగెత్తుకు వచ్చి ప్రణమిల్లాడు. మహరాజ్ అలాగే నిలబడి అతడితో ఐదు నిమిషాలు మాట్లాడారు. సుమారు ఇరవై ఏళ్ళ క్రితం అతడు తన కూతురి వివాహ పత్రికను స్వామీజీకి అందించి, మహరాజ్ ఆశీస్సులను కోరాడు. ఆ విషయాన్ని స్వామీజీ గుర్తు చేస్తూ 'అప్పుడు నీ కూతురికి వివాహం చేశావు కదా! ఆ అమ్మాయి ఎలా ఉంది? మిగతా పిల్లలంతా ఏం చేస్తున్నారు? నీ ఆరోగ్యం ఎలా ఉంది?' అని అడుగుతూ ఉంటే అతడికి నోటమాట రాలేదు. రామకృష్ణ సంఘ సర్వాధ్యక్షులైన పూజ్య స్వామీజీ, ఎన్నో ఏళ్ళ క్రితం జరిగిన సంఘటనను గుర్తుంచుకొని, అందరి క్షేమ సమాచారాలనూ అడిగి తెలుసుకోవడం అతణ్ణి ఆశ్చర్యానికి గురిచేసింది. స్వామీజీ ప్రేమకు కరిగిపోయిన అతడు ఆనందబాష్పాలతో అలాగే నిలబడిపోయాడు.

బేలూరు మఠంలో ప్రశిక్షణా కేంద్రంలోని బ్రహ్మచారులంతా పూజ్య స్వామీజీ దర్శనార్థం వచ్చేవారు. ఆ సమయంలో బ్రహ్మచారులు అడిగిన ప్రశ్నలకు స్వామీజీ సమాధానాలిచ్చేవారు. ఒక బ్రహ్మచారి 'మహరాజ్! ఎన్నో సంవత్సరాల నుండి జపధ్యానాలు చేస్తున్నప్పటికీ ఆధ్యాత్మికోన్నతి కలగలేదు' అని అడిగాడు. అప్పుడు స్వామీజీ గంభీర స్వరంతో "ఎన్నో జన్మల సంస్కారాలు పేరుకుపోయాయి. అవన్నీ కొన్ని సంవత్సరాలలో పోతాయా? పవిత్ర జీవనం గడుపుతూ, జపధ్యానాలను అభ్యసిస్తూ ఉంటే, మెల్లమెల్లగా సంస్కారాలన్నీ మాయమై పోతాయి. సహనం, శ్రద్ధలతో ఆధ్యాత్మిక సాధనలను చేస్తూ ఉంటే శ్రీరామకృష్ణుల దర్శనం తప్పక కలుగుతుంది. నీవు నీ వంతు సాధన చేస్తే గురుమహరాజ్ తన వంతు సహాయాన్ని అందిస్తారు. నిరుత్సాహంతో సాధనలను నిలిపివేయవద్దు" అని ప్రోత్సహించారు.

ఇంకొకసారి ఒక భక్తుడు 'మహరాజ్! నేను సాధారణ జీవితం గడపాలని కొన్ని వస్తువుల్ని త్యజించాను. ఇతరులు నన్ను ఎగతాళి చేస్తున్నారు. నేను ఏం చేయాలి?' అని అడిగాడు. అప్పుడు స్వామీజీ, "నీవు కూడా వాళ్ళలాగే మూర్ఖుడివి అయితే వాళ్ళతో వాగ్వాదం పెట్టుకో! నిజమైన సాధకుడివి అయితే ఇతరుల మాటలను పట్టించుకోవద్దు" అని బదులిచ్చారు. ❖

(స్వామి రంగనాథానందజీ మహరాజ్, హైదరాబాద్ రామకృష్ణ మఠ సంస్థాపకాధ్యక్షులు, రామకృష్ణ సంఘ 13వ సర్వాధ్యక్షులు)

సర్వజీవులయందూ సమబుద్ధి కలిగి, సర్వప్రాణులకూ అభయమిచ్చి సంచరించే ముని పుంగవుడు నిశ్చలంగా ఉంటాడు. అతడికి ఎవరివల్లా ఎలాంటి భయమూ ఉండదు. – మనుస్మృతి

హైదరాబాద్ రామకృష్ణ మఠం

నూతన ప్రచురణలు



మూర్తిత్రయం

పేజీలు : 104, వెల : రూ.10/-

(తపాలా ఖర్చులు రూ.25/- అదనం)

వికాస మంత్రాలు

పేజీలు : 216 వెల : రూ.60/-

(తపాలా ఖర్చులు రూ.30/- అదనం)

నారద భక్తి దర్శనం

పేజీలు : 304, వెల : రూ. 50/-

(తపాలా ఖర్చులు రూ.25/- అదనం)



విద్యార్థి నేస్తం

పేజీలు : 80, వెల : రూ.20/-

(తపాలా ఖర్చులు రూ.25/- అదనం)

అక్షయ టేబుల్ క్యాలెండర్ / Perpetual Table Calendar

వెల:రూ.200/- (తెలుగు, ఆంగ్ల భాషల్లో)

(తపాలా ఖర్చులు రూ.50/- అదనం)

ప్రతులకు : తెలుగు ప్రచురణ విభాగం
రామకృష్ణ మఠం, దోమలగూడ
హైదరాబాదు - 500 029
Phone : 040 - 27631149
e-mail:publication@rkmath.org

(...27వ పేజీ తరువాయి)

యుగానికొక్కడు!

నిరూపించుకోవాలని ఆశించరు. కానీ ఆయనలాగ ధ్యానసిద్ధుడనవ్వాలనీ, ఆత్మసాక్షాత్కారం పొంది విశ్వాత్మలో లయమైపోవాలనీ ఆశిస్తారు. అదే వారి జీవిత లక్ష్యం.

నిజానికి, భారతీయ సనాతన ధర్మాన్ని ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేస్తూ గొప్పవక్తలుగా పేరుగాంచిన రామకృష్ణ సంఘ సన్న్యాసులు ఎంతో మంది ఉన్నారు. అయితే, ఇక్కడ మనం గ్రహించాల్సింది స్వామి వివేకానంద కేవలం వక్త కాదు, యుగప్రవక్తని. అలాంటి ప్రవక్తలు యుగానికి ఒక్కరే అవతరిస్తారు.

మన చరిత్రలో ఎన్నటికీ ఒకే రాముడు, ఒకే కృష్ణుడు, ఒకే బుద్ధుడు, ఒకే రామకృష్ణుడు, ఒకే వివేకానంద... ఇలా అవతార పురుషులు ఒక్కరే ఉంటారు. ఈ అవతారపురుషులంతా మనలాగ పుట్టిన తరువాత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని సాధించడానికి ప్రయత్నించరు. వారు ఒక లక్ష్యం కోసం జన్మించి, అది పూర్తికాగానే అవతారాన్ని చాలిస్తారు. స్వామి వివేకానంద అవతారానికి కూడా ఓ లక్ష్యముంది. 'మీరంతా దివ్యస్వరూపులు. మీలో అంతర్నిహితంగా ఉన్న ఆ దివ్యత్వాన్ని అభివ్యక్తీకరించడమే జీవిత పరమార్థం' అని నిద్రాణావస్థలో ఉన్న మానవాళిని జాగృత పరచడానికి అవతరించిన యుగపురుషుడు స్వామీజీ.

ఆ యుగావతారుని ప్రబోధాలను ఆచరించి మనలోని దివ్యత్వాన్ని అనుభూతి చెందాలన్నదే ఆయన ఆకాంక్ష. అంతేగానీ తనలాగ మహావక్తలు కావాలని ఎన్నడూ బోధించలేదు. ❖

Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust
and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020
and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**

Vol.72-1, Sri Ramakrishna Prabha (Telugu Monthly) January 2015, Regd. with the Registrar of Newspaper for India Under No.1120/57. Postal Registration No. HD-1071/2013-15. Licensed to Post Under WPP : AP/CPMG/HC-13/WPP/2015-16. Date of Publication : 18 December 2014



త్రిసాగర సంగమ క్షేత్రం

స్వామి వివేకానంద పరివ్రాజక సన్న్యాసిగా భారతదేశమంతటా పర్యటిస్తూ త్రిసాగర (బంగాళాఖాతం, హిందూ మహాసముద్రం, అరేబియా సముద్రం) సంగమ క్షేత్రమైన కన్యాకుమారిని చేరారు. భారతదేశ దక్షిణాగ్ర ద్వీప శిల వద్దకు స్వామీజీ ఈదుకుంటూ వెళ్ళారు. ఆ ద్వీప శిలపై మూడు రోజుల పాటు (1892 డిసెంబర్ 24-26 లేదా 25-27 తేదీల్లో) భారతదేశ సమస్యల పరిష్కారం కోసం ధ్యానం చేశారు. గురుదేవులైన భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస ఆజ్ఞానుసారం అమెరికాలోని చికాగో నగరంలో జరగబోయే సర్వమత మహాసభల్లో పాల్గొనాలని సంకల్పించారు.

స్వామీజీ అనుచరుడు, వివేకానంద కేంద్ర సంస్థాపకుడు అయిన శ్రీ ఏక్‌నాథ్ రానడే అవిరామ కృషి ఫలితంగా సుమారు నాలుగు ఎకరాల విస్తీర్ణంగల ఈ ద్వీప శిలపై 'వివేకానంద రాక్ మెమోరియల్' రూపుదిద్దుకుంది. 'వివేకానంద కేంద్ర' సంస్థ నిర్మించిన ఈ స్మృతి కేంద్రాన్ని 1970 సెప్టెంబర్ 2వ తేదీన రామకృష్ణ మఠం, మిషన్‌ల 10వ సర్వాధ్యక్షులైన శ్రీమత్ స్వామి వీరేశ్వరానందజీ మహరాజ్ దివ్య సన్నిధిలో అప్పటి భారత రాష్ట్రపతి శ్రీ వి.వి.గిరి ప్రారంభించారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఈ వివేకానంద స్మృతి కేంద్రాన్ని ఏటా సుమారు ఇరవై లక్షల మంది పర్యాటకులు సందర్శిస్తున్నారు. ❖

With Best Compliments From

పక్యాల భాస్కర రావు, మేనేజింగ్ డైరక్టర్ & **పక్యాల గిరిజ**, డైరక్టర్

SVISS LABSS LIMITED

(Manufacturers of Active Pharmaceutical Ingredients and Intermediates)

Regd. Off. & Fact. : Plot No.88 & 89, Phase - II,
SIPCOT Industrial Complex, Ranipet - 632 403, Tamil Nadu.
Phone : 04172 - 244820, 651507, Tele Fax : 04172 - 244820
E-mail : rao@svisslabss.net Web Site : www.svisslabss.net

SVISS LABSS కంపెనీ వారు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 2,000 పాఠశాలలకు స్పాన్సర్ చేశారు.

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

ఫిబ్రవరి 2015

వెల: ₹10



భక్తుడు : మహాశయా! పరలోకం ఎలా ఉంటుంది?

శ్రీరామకృష్ణులు : మనిషి అజ్ఞానంలో ఉన్నంతవరకు, అంటే భగవంతుని ప్రాప్తించుకోనంత వరకు మళ్ళీ మళ్ళీ జన్మలు ఎత్తుతూనే ఉండాలి. కానీ జ్ఞానం చేకూరాక ఈ ప్రపంచానికి తిరిగి రానక్కరలేదు; మర్త్యలోకానికే కాదు, మరే లోకానికీ పోనక్కరలేదు.

కుమ్మరివాడు కుండలు ఎండబెడతాడు. వాటిలో కాల్చిన కుండలు, పచ్చి కుండలు ఉండడం గమనించి ఉంటారు. ఆవులు, మేకలు వాటి మీద నడచిపోతే కొన్ని కుండలు పగిలిపోతాయి. కాల్చిన కుండలు పగిలిపోతే వాటిని కుమ్మరి అవతల పారేస్తాడు, వాటితో ఏ ప్రయోజనమూ ఉండదు. కానీ పగిలిన పచ్చి కుండలను సేకరిస్తాడు; మట్టిముద్ద చేసి కుమ్మరి సారెలో పెట్టి మళ్ళీ దానితో కొత్త కుండలు తయారుచేస్తాడు. అదే విధంగా భగవద్దర్శనం కానంతవరకు కుమ్మరివాడి చేతిలో పడవలసిందే, అంటే ఈ లోకానికి మళ్ళీ మళ్ళీ రావలసిందే.

జ్ఞానికంటూ కొన్ని లక్షణాలు ఉన్నవి. జ్ఞాని ఎవరికీ హాని కలిగించడు, పిల్లవాడిలా అయిపోతాడు. ఇనుప కత్తి పరుసవేదిని తాకితే అది బంగారు కత్తిగా మారిపోతుంది. బంగారు కత్తితో ఖండించలేం. అదేవిధంగా జ్ఞానిలో క్రోధం, అహంకారం ఉన్నట్లు కనబడవచ్చు. కానీ వాటివల్ల ఎలాంటి హానీ ఉండదు.

చిన్న బిడ్డకు దేనిపట్లా అనురక్తి ఉండదు. ఇసుకతో ఇల్లు కడతాడు, ఎవరైనా ఆ ఇంటిని తాకితే చాలు ఏడ్వనారంభిస్తాడు. కాసేపట్లో అతడే దాన్ని పడగొడతాడు. ఈ నిమిషం దుస్తులపట్ల ఎంతో మోజు కలిగి ఉంటాడు; 'మా నాన్న కొని ఇచ్చాడు, ఎవరికీ ఇవ్వను' అంటాడు. మరునిమిషం ఒక బొమ్మను ఇస్తే, దుస్తులు వదలిపెట్టేస్తాడు.

విజ్ఞానం అంటే విశేష జ్ఞానం. కొందరు పాలను గురించి విని ఉంటారు, కొందరు పాలను చూసి ఉంటారు, మరికొందరు పాలను త్రాగి ఉంటారు. కేవలం విన్నవాడు అజ్ఞాని. చూసిన వ్యక్తి జ్ఞాని. త్రాగిన వ్యక్తే విజ్ఞాని. భగవంతునితో అత్యంత సన్నిహిత బంధువులా మాట్లాడటమే విజ్ఞానం. ❖

సుబోధ

శ్రీరామకృష్ణ ప్రభ
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాదు-500 029
ఫోన్: 040-27667799, సెల్: 8801849494
E-mail : sriramakrishnaprabha@gmail.com
నిర్వాహక సంపాదకులు: స్వామి జ్ఞానదానంద   సంపాదకులు: స్వామి పరిజ్ఞేయానంద

అమృతోత్సవాలు

విశాఖపట్నం రామకృష్ణ మిషన్ ఆశ్రమ 75 వసంతాలు పూర్తిచేసుకొన్న సందర్భంగా 2014 డిసెంబర్ 19,20,21 తేదీలలో అఖిలాంధ్ర భక్తసమ్మేళనాన్ని నిర్వహించింది.

మూడు రోజులపాటు జరిగిన ఈ సమ్మేళనాన్ని శ్రీమత్ స్వామి గౌతమానందజీ మహరాజ్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు.

రోజూ ఉదయం 6 గంటలకు శ్రీరామకృష్ణ సుప్రభాతం, అష్టోత్తర శతనామ పూజ, రామకృష్ణ కథామృత పఠనం, కీర్తనలు, ధ్యానంతో కార్యక్రమం ప్రారంభమయ్యేది.

భక్తసమ్మేళనంలో 70 మంది రామకృష్ణ మఠం స్వామీజీలు, శారదా మఠం మాతాజీలు; సుమారు 3,000 మంది భక్తులు; యువసమ్మేళనంలో 1,500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

స్వామీజీలు, మాతాజీలు, ఇతర వక్తల ప్రసంగాలు; వివిధ సమితుల నుండి వచ్చిన భక్త బృందాల భజనలు; సాంస్కృతిక కార్యక్రమాలు భక్తుల్ని ఆద్యంతం అలరించాయి. ఈ మూడు రోజులూ భక్తులు మూర్తిత్రయ భావధారలోమునిగి పునీతులయ్యారు. ❖

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

సంపుటం: 72 సంచిక: 2 ఫిబ్రవరి 2015

శ్రీ కంఠవేషే శివలీన చిత్తం
శ్రీమాతృ పాదార్పిత చిత్త పుష్పం
శ్రీశారదా పూజిత పాదపద్మం
శ్రీరామకృష్ణం శిరసా నమామి

శివుని వేషం ధరించినప్పుడు శివుని యందు లీనమైన చిత్తము కలవాడు; కాళీమాత పాదపద్మముల యందు చిత్తపుష్పాన్ని అర్పించినవాడు; శారదామాతచే ఆరాధింపబడినవాడు అయిన శ్రీరామకృష్ణులకు శిరస్సు వంచి నమస్కరించుచున్నాను.

(విష్ణుభట్ల విరచిత 'శ్రీరామకృష్ణ పరమహంస దశకం' నుండి)

సూక్తి సౌరభం

గుణదోషౌ బుధో గృహ్ణ
న్నిందుక్ష్వేలా వివేశ్వరః
శిరసా శ్లాఘతే పూర్వం
పరం కంఠే నియచ్ఛతి ॥

"ఇతరులలోని మంచిని ప్రకాశింపజేస్తూ, లోపాల్ని వెలిబుచ్చక పోవడం జ్ఞానుల లక్షణం. శివుడు చంద్రుణ్ణి నెత్తిన పెట్టుకుని ప్రదర్శించాడు. విషాన్ని కుత్తుకలోనే మరుగుపరచాడు."

కానివానితోడ గలసి మెలగుచున్న
గానివానిగానె కాంతు రవని
తాటిక్రింద పాలు ద్రాగిన చందమౌ
విశ్వదాభిరామ వినుర వేమ!

"ఓ వేమా! ఊరూపేరూలేని వ్యర్థునితో కలసి తిరిగినవాడిని వ్యర్థునిగానే అందరూ భావించెదరు. తాటిచెట్టు క్రింద పాలు త్రాగినా, కల్లు త్రాగినట్లే లోకులు తలంచెదరు కదా!"



శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి



ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'కి ధన దానం చేసి ప్రోత్సహించాల్సిందిగా కోరుతున్నాం. దాతల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు......	రూ.	10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజ పోషకులు...........	రూ.	5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు.................	రూ.	1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

	దాతపేరు / ఊరు	రూ.
మహారాజ పోషకులు :	శ్రీమతి కొప్పల అనిత, దోమల్‌గూడ, హైదరాబాద్ (కీ॥శే॥ కొండకల్ల అమరేందర్ రెడ్డి గారి జ్ఞాపకార్థం)	11,000
మహారాజ పోషకులు :	శ్రీ సి. వీర్రాజు, విద్యుత్‌నగర్, రామచంద్రాపురం, తూ.గో.జిల్లా (కీ॥శే॥ వేగుళ్ళ సుబ్బమ్మ, నారయ్య గార్ల జ్ఞాపకార్థం)	10,000
రాజ పోషకులు :	శ్రీ జి. కె. సుబ్రహ్మణ్యం, నక్కవారిపాలెం, విశాఖపట్నం (తల్లిదండ్రులు కీ॥శే॥ గట్టుపల్లి జాలయ్య, వెంకటసుబ్బమ్మ గార్ల జ్ఞాపకార్థం)	5,116
రాజ పోషకులు :	శ్రీ ఎస్. సత్యనారాయణ, కాకర్ల, అర్ధవీడు, ప్రకాశం జిల్లా	5,000
పోషకులు :	కుమారి ప్రియం శర్మ, బడేరాయ్‌పూర్‌రోడ్, కొల్‌కతా	1,116
పోషకులు :	శ్రీ కుర్రి రామ సుబ్బారావు, రాజ్‌భవన్, హైదరాబాద్ (తండ్రి కీ॥శే॥ కుర్రి వెంకటేశ్వర్లు గారి జ్ఞాపకార్థం)	1,116
పోషకులు :	శ్రీమతి ఎన్. సుజ్ఞాని దేవి, రాంనగర్, హైదరాబాద్	1,101
పోషకులు :	శ్రీ ఎస్. సుభాష్, మెళియాపుట్టి, శ్రీకాకుళం జిల్లా	1,011
పోషకులు :	శ్రీ ఎ. కామేశ్వరరావు, అతిథిదేవోభవ స్వచ్ఛంద సేవా సంస్థ, వడ్డాది, విశాఖపట్నం జిల్లా	1,000
పోషకులు :	శ్రీ సూర్య మెమోరియల్ ట్రస్టు, బాలాజీనగర్, మన్సురాబాద్, హైదరాబాద్	1,000
పోషకులు :	శ్రీ ఆర్. సాయి సూర్య శివప్రసాద్, వికాస్‌నగర్, గుంటూరు	1,000
పోషకులు :	శ్రీ ఎన్. సత్యనారాయణ, బౌద్ధనగర్, వారాసిగూడ, సికింద్రాబాద్ (భార్య కీ॥శే॥ ఎన్. కామేశ్వరి గారి జ్ఞాపకార్థం)	1,000
పోషకులు :	శ్రీ వన్నెబోయిన సాయిలు యాదవ్, శ్రీమతి వెంకటమ్మ (కీ॥శే॥ రామయ్య యాదవ్, మల్లమ్మ గార్ల జ్ఞాపకార్థం)	1,000

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

యువతరానికి 'శ్రీరామకృష్ణ ప్రభ'ను మరింత చేరువ చేయాలని సంకల్పించాం. రాష్ట్రంలోని వివిధ పాఠశాలలు/ కళాశాలలు/ గ్రంథాలయాలకు పత్రికను పంపించడానికి మీ సహాయాన్ని కోరుతున్నాం. ఈ కానుక పథకం క్రింద చందా చెల్లించిన దాత పేరున (మీరు సూచించిన లేదా మేము ఎంపిక చేసిన) విద్యాసంస్థకు పత్రికను పంపుతాం. కానుక చందా రూ.1,500/- అంతకన్నా ఎక్కువ ఇచ్చిన దాత పేరు, విద్యాసంస్థ పేరు పత్రికలో ప్రచురిస్తాం.

దాత పేరు	విద్యాసంస్థ
శ్రీ గంట్ల దేముడు & శ్రీమతి వరలక్ష్మి, విశాఖపట్నం (కీ॥శే॥ కొట్యాడ విజయ గారి జ్ఞాపకార్థం)	ఆంధ్రా విశ్వవిద్యాలయ ఉన్నత పాఠశాల, వాల్తేరు, విశాఖపట్నం
శ్రీమతి చందా ప్రమీలా ఆనందయ్య, సిద్ధిపేట, మెదక్ జిల్లా	జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, మనుగోలు, కొండపాక, మెదక్‌జిల్లా
శ్రీ పోల వీరేశలింగం, రసూల్‌పురా, సికింద్రాబాద్ (భార్య కీ॥శే॥పి.రాజమణెమ్మ గారి జ్ఞాపకార్థం)	శ్రీరామకృష్ణ ప్రభ మాసపత్రికను మూడు పాఠశాలలకు ఏడు సంవత్సరాలకు స్పాన్సర్ చేశారు.
శ్రీ పందిటి వేంకటేశ్వరరావు, కృష్ణలంక,విజయవాడ (కీ॥శే॥ పి.కృష్ణమూర్తి, బసవపున్నమ్మ గార్ల జ్ఞాపకార్థం)	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కూచెల్లపాడు, గుంటూరు జిల్లా
శ్రీ ఎమ్. మురళీకృష్ణ, సత్యనారాయణస్వామి కాలనీ, కె.పి.హెచ్.బి., హైదరాబాద్	జవహర్ నవోదయ విద్యాలయం, గోపనపల్లి, హైదరాబాద్
శ్రీ ఎమ్. రామకృష్ణ, సత్యనారాయణస్వామి కాలనీ, కె.పి.హెచ్.బి., హైదరాబాద్	శ్రీవిశ్వనాథస్వామి దేవాలయం, వసంత్‌నగర్, కూకట్‌పల్లి, హైదరాబాద్

ముఖచిత్ర వివరణ: శివుడు క్షీరసాగర మథనంలో ఉద్భవించిన హాలాహలాన్ని సేవిస్తే, పతితుల పాపాలను స్వీకరించారు శ్రీరామకృష్ణులు.

చందా వివరాలు		భారతదేశంలో	విదేశాలకు
విడి ప్రతి	:	₹ 10	-
సంవత్సర చందా	:	₹ 100	₹ 1,500
మూడు సంవత్సరాలకు	:	₹ 280	₹ 4,500
ఐదు సంవత్సరాలకు	:	₹ 450	₹ 7,500
ఇరవై సంవత్సరాలకు	:	₹ 1,500	₹ 22,000

గమనిక: డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో Ramakrishna Math, Hyderabad అని వ్రాయాలి.

పంపవలసిన చిరునామా: Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.

చందాను ఆన్‌లైన్ http://rkmath.org/srkp ద్వారా చెల్లించవచ్చు.

లోపలి పేజీల్లో...

6 సంపాదకీయం
పరమశివుని ప్రతిరూపం పరమహంస

8 గోరుముద్ద
ఒక్క అణా!

9 శివుడు లేని చోటెక్కడ?

10 పలికెడిది భాగవతం
కాలగతి వింతయై వచ్చె!

12 సాధనకు సూచనలు

13 మన సంస్కృతి
మన నాట్య సంప్రదాయాలు

15 నటనల భ్రమయకు నా మనసా!

16 పరిప్రశ్న

17 రామకృష్ణ భక్తి సూత్రాలు

18 'శివం' సత్యం... సుందరం

20 సాఫల్యతకు సాధనం!

21 ధీరవాణి
భావితరాలకు ప్రత్యక్ష నిదర్శనం

22 ఆయనే మార్గం! ఆయనే గమ్యం!!

24 త్రిభాషా సూత్రం!

26 చరిత్రకెక్కిన త్యాగం

27 యువవాణి
అవమానాల అంధకారంలో ఆశాకిరణాలు

28 వేళకు ముందే వసంతం

30 జీవనోద్యానంలో మానవతా పరిమళాలు
తల్లులకు ఆదర్శం / పాలు-రక్తం

33 ముందుకు సాగిపో!

35 మహాపురుషుని సాన్నిధ్య స్మృతులు

36 భగవద్గీత - సద్గుణ సుధ
నిత్యం విందాం ఈ గీతం!

37 జీవన వేదం - స్వామీజీ కథల సారం
కావాల్సింది కరుణే!/వదలకుండా పట్టుకొనేది!

38 బొమ్మల కథ
అన్నపూర్ణేశ్వరి ఆవిర్భావం

42 వికాస మంత్రాలు

ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు. - సంపాదకులు

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు మీద చిరునామాకు పైన మీ చందా నంబరు, కుడి వైపున మీ చందా గడువు ముగిసే నెల ఉంటాయి. మీ చందా గడువు పూర్తయ్యే నెలకు ముందుగానే సొమ్మును చెల్లించి చందాను పునరుద్ధరించుకోండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారిన పక్షంలో 7వ తేదీ లోగా మాకు తెలియపరచినట్లయితే, వచ్చే నెల సంచిక నుండి మీ కొత్త చిరునామాకు పంపబడును.
- ప్రతీ నెల 26 లేదా 27వ తేదీల్లో పత్రిక పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపుగా చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ.... - సర్క్యులేషన్ మేనేజర్

KCP CEMENT
CONCRETE CEMENT
Since 1958

With Best Compliments From
CHAIRMAN & MANAGING DIRECTOR
THE KCP LIMITED
KCP కంపెనీ వారు "శ్రీరామకృష్ణ ప్రభ" మాసపత్రికను
1000 గ్రంథాలయాలకు స్పాన్సర్ చేశారు

KCP Sreshtaa CEMENT
THE NEW GENERATION CEMENT

Cement Marketing Division : Plot No. 10, Gayatri Hills, MP & MLA's Colony, Road No. 10 C, Jubilee Hills, HYDERABAD - 500033.
Tel : 040-2325 3503 to 505, Fax : 2325 3500, Cell : +91 99895 97775 / 9866305145, E-mail : ramakrishna.k@kcp.co.in
Registered Office : No. 2, Dr.P.V.Cherian Crescent, Egmore, CHENNAI - 600 008. Tel : 044 66772668, Fax: 044 66772620, CIN L65991TN1941PLC001128

సంపాదకీయం

పరమశివుని ప్రతిరూపం పరమహంస

భగవాన్ శ్రీరామకృష్ణులను 'సర్వదేవదేవీ స్వరూపులు'గా ఆయన సన్న్యాస శిష్యులు, గృహస్థ భక్తులు ఆరాధించారు. నేటికీ అసంఖ్యాక భక్తులు ఆరాధిస్తూ ఉన్నారు. శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చిన భక్తులు - శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, మహావిష్ణువు, జగన్నాథుడు, శివుడు, దుర్గ, కాళి, రాధ, సీత, హనుమంతుడు, చైతన్య మహాప్రభు, గురునానక్, ఏసుక్రీస్తు, మహమ్మద్ ప్రవక్త... ఇలా తమ తమ ఇష్ట దైవాలను దర్శించారు. అయితే, ఒకే అవతారంలో ఇంతమంది దేవతామూర్తులు కొలువై ఉండడం అసంభవమనిపిస్తుంది. భగవంతునికి అసంభవ మనేది ఏముంటుంది? భగవంతుడు సంకల్పిస్తే ఒకే రూపంలో ముక్కోటి దేవతామూర్తులనూ, ముక్కోటి దేవతామూర్తుల్లో ఒకే రూపాన్నీ దర్శింపజేయగలడు.

శ్రీరామకృష్ణులు వివిధ మత సాధనలను అనుష్ఠించి ఆయా దేవతామూర్తులను ప్రత్యక్షం చేసుకొన్నారు. ఆయన దర్శించిన దేవతామూర్తులందరూ ఆయనలో ఐక్యమయ్యారు. అందువల్ల శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చిన భక్తులు తమ తమ ఇష్టదైవాలను ఆయనలో దర్శించారు. అందుకే స్వామి వివేకానంద ఆయనను అవతార వరిష్ఠునిగా స్తుతించారు.

శ్రీరామకృష్ణులలో శివుణ్ణి దర్శించిన భక్తుల గురించి; శివునిలో శ్రీరామకృష్ణులను దర్శించిన భక్తుల గురించి తెలుసుకుందాం:

- శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరంలో తమ గది వసారాలో పచార్లు చేస్తూ ఉండగా మథుర్‌నాథ్ ఆయనలో శివుణ్ణీ, కాళీమాతనూ దర్శించారు.
- వైకుంఠనాథ్ అనే భక్తుడు 'నేను పరమశివుణ్ణి ధ్యానిస్తున్నప్పుడు మిమ్మల్నే దర్శిస్తున్నాను. మీరు సాక్షాత్తూ ఆ పరమేశ్వరులే!' అని శ్రీరామకృష్ణులకు తెలిపాడు.
- స్వామి శివానంద (మహాపురుష్) మహరాజ్ కాశీ విశ్వనాథుణ్ణి దర్శిస్తూ ఉండగా కొంతసేపటికి కాశీ విశ్వనాథుడి స్థానంలో శ్రీరామకృష్ణులు ప్రత్యక్షమయ్యారు.
- శ్రీరామకృష్ణులు తన దేహాన్ని చూపుతూ 'ఇది స్వయం భూలింగం. అంతేకానీ శిల్పి రూపొందించిన విగ్రహం కాదు' అని స్వామి బ్రహ్మానంద(రాఖా)మహరాజ్‌తో అన్నారు.
- రామకృష్ణ సంఘ 11వ సర్వాధ్యక్షులైన పూజ్య స్వామి గంభీరానందజీ మహరాజ్ అమర్‌నాథ్ శివుణ్ణి దర్శించడానికి వెళ్ళినప్పుడు అక్కడ శివలింగం స్థానంలో శ్రీరామకృష్ణులను దర్శించి, భావపరవశులయ్యారు.

ఇలా ఎంతోమంది భక్తులు రామకృష్ణునిలో శివుణ్ణీ , శివునిలో రామకృష్ణులనూ దర్శించారు. అయితే, శ్రీరామకృష్ణుని రూపంలో శివునిలా నుదుటిపై త్రినేత్రం లేదు; గరళ(నీల)కంఠం లేదు; మెడలో సర్పం లేదు; చేతిలో త్రిశూలం లేదు, డమరుకం లేదు. అలాంటప్పుడు శ్రీరామకృష్ణులను శివునిగా ఎలా భావించగలం? అందుకు పరమహంస గుణవిశేషాలను విశ్లేషిస్తే పరమేశ్వరుని ప్రతిరూపమే పరమహంస అని అవగతమవుతుంది.

త్రినేత్రం... మనోనేత్రం: శివుడి త్రినేత్రం మానవుని అజ్ఞానాంధకారాన్ని పోగొట్టి జ్ఞానప్రకాశాన్నిస్తుంది. త్రినేత్రం జ్ఞానానికీ, సర్వజ్ఞత్వానికీ ప్రతీక. శ్రీరామకృష్ణ కథామృత రచయిత మహేంద్రనాథ్ గుప్త (మ) ఆంగ్ల విద్యనభ్యసించిన విద్యావంతుడు. పుస్తక జ్ఞానమే నిజమైన జ్ఞానమన్న అజ్ఞానంలో ఉన్న ఆధునికుడు. 'మ' శ్రీరామకృష్ణులను దర్శించినప్పుడు 'నీకు వివాహం అయిందా? పిల్లలున్నారా?' అని ప్రశ్నించారు. 'వివాహమైంది, ఒక కుమారుడున్నాడు' అని 'మ' బదులిచ్చాడు. 'నీ భార్య విద్యాశక్తా, అవిద్యాశక్తా?' అని శ్రీరామకృష్ణులు అడిగారు. అతడు వెంటనే 'ఆమె అజ్ఞాని' అని అన్నాడు. శ్రీరామకృష్ణులు 'అయితే నువ్వు మహాజ్ఞానివన్నమాట!' అని అన్నారు. అప్పుడు 'మ' తన అజ్ఞానానికి చింతించాడు.

అనంతర కాలంలో మహేంద్రనాథ్ 'భగవంతుణ్ణి తెలిపేదే నిజమైన జ్ఞానమనీ, మిగతాదంతా అజ్ఞానమేనన్న శ్రీరామకృష్ణుల బోధలు నాలోని అజ్ఞానాన్ని పటాపంచలు చేశాయి' అని తన స్మృతులను తెలిపారు. అలాగే శ్రీరామకృష్ణులు

ఎవరినైనా చూడగానే గాజుబీరువాలో ఉన్న వస్తువులను చూసినంత స్పష్టంగా వారి మనోభావాలను గ్రహించేవారు. వారి పూర్వజన్మలను కూడా విశదపరిచేవారు. ఇది వారి సర్వజ్ఞత్వానికి నిదర్శనం. ఇలా శ్రీరామకృష్ణులు తన మనోనేత్రంతో ఎంతో మంది భక్తుల అజ్ఞానాన్ని, అపోహలను, భ్రమలను పోగొట్టారు.

విషపానం... పాపహరణం: క్షీరసాగర మథనంలో ఉద్భవించిన హాలాహలాన్ని చూసి అందరూ భయపడి పారిపోతే శివుడు దాన్ని సేవించి అమరనాథుడయ్యాడు. అలాగే, సమాజంచే ఏవగించబడిన దీనుల, పతితుల పాపాలను స్వీకరించి దీననాథులయ్యారు శ్రీరామకృష్ణులు.

శ్రీరామకృష్ణులు గిరీష్ చంద్రఘోష్, నటి వినోదిని మొదలైన పతితుల్ని పావనుల్ని చేశారు. కాలాంతరంలో గిరీష్ చంద్రఘోష్ "నేను ఈ భూమ్మీద చేయని పాపమంటూ ఏదీ లేదు. నా పాపాలన్నీ శ్రీరామకృష్ణులు స్వీకరించి నన్ను పవిత్రుణ్ణి చేశారు. అందరూ పాపప్రక్షాళన కోసం గంగలో స్నానం చేస్తారు. కానీ నేను గంగలో స్నానం చేస్తే, గంగామాతే పవిత్రమయ్యేంత పునీతునిగా చేశారు శ్రీరామకృష్ణులు" అని గురుదేవుల అనంతకృపను వివరించాడు.

అలాగే పాండురోగంతో బాధపడుతున్న ఒక దీనుడు తన వ్యాధిని నయం చేయమంటూ శ్రీరామకృష్ణులను ప్రార్థించాడు. శ్రీరామకృష్ణులు అతడి దేహాన్ని స్పృశించగానే వ్యాధి నయమైంది. విషపానం చేయడం వల్ల శివుడి కంఠం నీలంగా మారితే, పతితుల పాపాలను స్వీకరించినందు వల్ల శ్రీరామకృష్ణుల కంఠంలో వ్రణం ఏర్పడింది. ఆయనే స్వయంగా 'నేను పతితుల పాపాలను స్వీకరించినందు వల్లే నాకీ గొంతులో వ్రణం ఏర్పడింది' అని అన్నారు.

పశు ప్రవృత్తి... అసురగుణ నివృత్తి: శివుడు సర్పభూషణుడు, చర్మాంబరధరుడిగా ప్రతీతి. శివుడు పాములనూ, పులి చర్మాన్నీ ధరించి, పశుప్రవృత్తి నిర్మూలనకు ప్రతీకగా నిలిచాడు. అలాగే శ్రీరామకృష్ణులు మనిషిలోని కామ క్రోధ మదాలనే అసురగుణాల నివృత్తికి నిదర్శనంగా నిలిచారు.

తర్కశాస్త్రంలో నిష్ణాతుడైన గౌరీపండితుడు ప్రతివాదితో వాదన ప్రారంభించే ముందు 'హా రే రే రే' అంటూ గర్జించేవాడు. అందువల్ల అతడితో వాదించడానికి పండితులు భయపడేవారు. ఒకసారి శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చిన అతడు అలాగే గంభీర స్వరంతో గర్జించాడు. అప్పుడు శ్రీరామకృష్ణులు అతడి కన్నా గంభీరంగా గర్జించారు. చివరికి అతడు శ్రీరామకృష్ణులలాగా గర్జించలేక తన ఓటమిని అంగీకరించాడు. ఆ విధంగా శ్రీరామకృష్ణులు అతడిలో ఉన్న మదాన్ని అణిచారు. అప్పటి నుండి గౌరీపండితుడు భగవద్ధ్యానంలో జీవితాన్ని గడిపాడు.

అలాగే 'హిందూ పేట్రియాట్' పత్రికా సంపాదకుడైన బాబూ కిష్టోదాస్‌పాల్; మహిమాచరణ్ చక్రవర్తి; ప్రతాప్‌చంద్ర హాజ్ర మొదలైనవారిలోని పాశ్చాత్యభావాల ప్రభావం, పాండిత్య అహంకారం, కీర్తికాంక్ష, కామ కాంచనాలనే అసురగుణాలను తొలగించి పరమాత్ముని వైపు పయనించేలా తీర్చిదిద్దారు.

త్రిశూలం... త్రిగుణాలు: శివుని చేతిలోని త్రిశూలం సత్త్వ రజ తమో గుణాలకూ; సృష్టి స్థితి లయాలకూ; దుర్జనులను సంహరించడానికీ ప్రతీక. మనిషిని బంధించేవి సత్త్వ రజ తమో గుణాలనే సంకెళ్ళు. తమోగుణం – ఇనుప సంకెల, రజోగుణం – వెండి సంకెల, సత్త్వగుణం – బంగారు సంకెల. ఏ సంకెలైనా బంధించేదే! అందుకే 'ముక్తిని పొందడానికి త్రిగుణాలకు అతీతం కావాలి' అని అన్నారు శ్రీరామకృష్ణులు.

దేవేంద్రనాథ్ టాగూర్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, బంకిమ్ చంద్ర ఛటర్జీ లాంటి మహా పండితులను, ప్రఖ్యాత సమాజ సేవకులను, ప్రసిద్ధ రచయితలను కలవడానికి వెళ్ళేవారు శ్రీరామకృష్ణులు.

దేవేంద్రనాథ్ టాగూర్ గురించి 'అతడు మంచివాడే కానీ అతడింకా బంధాల నుండి విముక్తుడు కాలేదు' అన్నారు. బంకిమ్ చంద్రతో 'భగవంతునిపై భక్తి లేకుండా సేవ చేస్తే పేరుప్రతిష్ఠల వైపు మనస్సు పరుగెడుతుంది' అని చెప్పారు. విద్యాసాగర్‌ను చూసి 'గ్రద్ద ఆకాశంలో ఎంత ఎత్తున ఎగురుతున్నప్పటికీ నేల మీద కుళ్ళిన కళేబరాలనే చూస్తుంది. అలాగే భగవద్భక్తి లేని పండితుడు ఎన్ని శాస్త్రాలు చదివినా అతడి మనస్సు కామ కాంచనాల పైనే ఉంటుంది' అని గుర్తుచేశారు.

అందుకే శ్రీరామకృష్ణులు "నేను సాధకుడననే భావన సత్త్వగుణ సంకెల; దీనులకు సహాయం చేస్తున్నాననే భావన రజోగుణ సంకెల; పండితుడైనప్పటికీ మనస్సులో కామ కాంచన వాసనలు తమోగుణ సంకెల. ఈ త్రిగుణాలకు బందీ కాకుండా జాగ్రత్త వహించాలి" అని హెచ్చరించారు.

మహేశ్వర సూత్రాలు... కథామృతం: డమరుకం భగవద్వాక్య శబ్దానికి ప్రతీక. శివుడు నృత్యం చేస్తూ డమరుకాన్ని పద్నాలుగు సార్లు మోగించినప్పుడు వెలువడిన పద్నాలుగు శబ్దాలనే 'మహేశ్వర సూత్రాలు' అంటారు. పాణిని మహర్షి చెవి దగ్గర శివుడు డమరుకాన్ని మోగించినప్పుడు మహర్షికి ఈ జ్ఞానం లభించింది.

పాణిని మహర్షికి శివుడి డమరుక నాదం నుండి 'మహేశ్వర సూత్రాలు' లభించినట్లు, శ్రీరామకృష్ణుల బోధలు విన్న మహేంద్ర నాథ్ ద్వారా 'శ్రీరామకృష్ణ కథామృతం' ఉద్భవించింది. మహేశ్వర సూత్రాలు భాషాశాస్త్రానికి ఆధారమైతే, తప్త జీవుల తాపాన్ని తీర్చేది కథామృతం. అమెరికాలో కథామృతం చదివి ప్రభావితమైన ఒక మహిళకు శ్రీరామకృష్ణులు దర్శనమిచ్చారు. అలాగే ఓ విదేశీ క్రైస్తవ మతస్థురాలు కథామృతం చదివి 'ఈ కథామృతానికి ముగింపు లేకుండా ఉంటే ఎంతో బాగుండేది' అని అభిప్రాయపడ్డారు. దీన్నిబట్టి కథామృత (డమరుకనాదం) ప్రభావం ఎంత దూరం వ్యాపించిందో అర్థమవుతుంది.

అందుకే, మనలో అజ్ఞానాన్ని అంతమొందించమనీ, అసురగుణాలను నివృత్తిచేయమనీ, త్రిగుణాలను త్రుంచమనీ, కథామృతపానంతో అమరత్వాన్ని ప్రసాదించమనీ పరమశివుని ప్రతిరూపమైన పరమహంసను ప్రార్థిద్దాం. ❖

ఓ దేవా! ఆధ్యాత్మిక సాధనలో మానవాళికి సహాయమొనర్చడానికి అవతరించిన అవతారమూర్తివి నీవు. మానవుల దుఃఖాలను తొలగించడానికి కరుణే రూపుదాల్చిన దైవం నీవు. - స్వామి వివేకానంద

గోరుముద్ద - స్వామి సుప్రియానంద

ఒక్క అణా!

పూర్వం ఒక రూపాయికి పదహారు అణాలు. ఒక అణాకు ఆరు పైసలు. అవతార వరిష్ఠులైన శ్రీరామకృష్ణులు 'నేను పదహారు అణాల సాధన చేశాను. మీరు భగవంతుని కోసం కనీసం ఒక్క అణా సాధన చేస్తే సరిపోతుంద'న్నారు. 'ఆ ఒక్క అణా సాధన ఏమై ఉంటుందబ్బా!' అని ఆలోచిస్తే శ్రీగురుదేవులు మనకందించిన అనేక సలహాలు, సూచనలు మన

మనస్సులో మెదులుతాయి. కానీ ఆ 'ఒక్క అణా సాధన' మాత్రం ఒక పట్టాన అంతు పట్టదు. అతిగా ఆలోచిస్తే తలనొప్పి!

భక్తుల తలనొప్పి భగవంతుడికీ తలనొప్పే! ఒకసారి శ్రీకృష్ణుడికి భరించలేని తలనొప్పి వచ్చింది. అది తగ్గడానికి ఆయనే ఒక ఔషధం కూడా సూచించారట. అదేమిటంటే శ్రీకృష్ణుడి అత్యంత గొప్ప భక్తుడి పాదధూళిని అంజనంగా చేసి ఆయన తలకు పట్టించాలట. ఇంకేముంది, అందరూ నారదుడి దగ్గరకు పరుగెత్తారు. ఎప్పుడూ 'నారాయణ, నారాయణ' అంటూ హరినామాన్ని జపించే భక్తాగ్రేసరుడైన నారదుడు తన పాదధూళిని ఇవ్వడానికి ఒప్పుకోలేదు. పైపెచ్చు 'నారాయణ, నారాయణ' అనడం ఆపుచేసి 'అపచారం, అపచారం' అంటూ అందరినీ తరిమికొట్టాడు. గొప్ప గొప్ప భక్తులందరూ 'అపచారం, అపచారం' అంటూ ఒకే పాట పాడారు.

చివరి ప్రయత్నంగా గోపికల దగ్గరకు వెళ్ళారు. విషయం తెలుసుకున్న గోపికలు ఆవేదన చెందారు. వారు కూడా భరించలేని శిరోవేదనకు గురైయ్యారు. అందరూ ఒక్కసారిగా ఎంత కావాలంటే అంత వారి పాదధూళిని తీసుకుపోయి శ్రీకృష్ణుడి తలకు పట్టించమన్నారు.

కాబట్టి అణాల బేరం, 'భలే మంచి బేరం' అని మురిసిపోకుండా భగవంతుని పట్ల గోపికలకున్న 'ప్రేమ భక్తి' మనలో కూడా కలగాలని ప్రార్థిద్దాం. మనకు ప్రియమైనవాళ్ళు ఏ కొంచెం బాధపడినా దాన్ని మన బాధగా భావించి బాధపడతాం. అలాగే, భగవంతుని పట్ల కూడా మనకు అలాంటి నిష్కల్మషమైన ప్రేమ కలిగిననాడు మనలో నిజమైన భక్తి చిగురించిందని అర్థం.

అందుకు పాండిత్యం ముఖ్యం కాదు, పరితపించే హృదయం కావాలి. అలాంటి పవిత్ర హృదయం ఉండడం వల్లనే అక్షరం ముక్క రాని లాటూ మహరాజ్ (స్వామి అద్భుతానంద)కు శ్రీరామకృష్ణులు అక్షర బ్రహ్మజ్ఞానాన్ని ప్రసాదించారు.

రండి, మనమూ శ్రీరామకృష్ణులను మనసా, వాచా, కర్మణా ప్రేమిద్దాం! వారి కృపకు పాత్రులమవుదాం! ❖

'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక చందాను
ఆన్‌లైన్ http://rkmath.org/srkp ద్వారా చెల్లించవచ్చును.

శివుడు లేని చోటెక్కడ ?

– మహేందర్ మెలుమూరి

భగవాన్ శ్రీరమణ మహర్షిని సందర్శించుకునేందుకు స్వదేశీయులే కాకుండా విదేశీయులు కూడా ఎందరో వచ్చేవారు. అయితే స్థానిక భక్తులు, సిబ్బంది ఆచారాల పేరుతో తమ వద్దకు వచ్చే విదేశీ భక్తులకు కఠిన నిబంధనలు విధిస్తే మహర్షి సహించకపోయేవారు. వేల మైళ్ళ దూరం నుంచి తమను దర్శించుకునేందుకు వచ్చిన వారి ఆర్తిని ఆయన అర్థం చేసుకునేవారు. ఇక్కడి ఆచారాలు తెలియక విదేశీయులు చేసే చిన్న చిన్న పొరపాట్లను పెద్దమనస్సుతో మన్నించేవారు.



ఒకసారి అమెరికా భక్తురాలు మహర్షిని దర్శించుకునేందుకు అరుణాచలం వచ్చారు. భారతీయ ఆచారాలు, సంప్రదాయాలు అంతగా తెలియని ఆ మహిళకు కుర్చీ మీదే తప్ప కింద కూర్చొనే అలవాటు లేదు. అయినా ఎలాగో అలా అవస్థలు పడుతూ శ్రీరమణుల సమక్షంలో కింద కూర్చొన్నారు. కానీ కాళ్ళు మడుచుకోవాలని తెలియక, అలాగే భగవాన్ కూర్చొనే సోఫా వైపునకు కాళ్ళు చాచారు. ఇంతలో ఆశ్రమ సిబ్బందిలో ఒకరు ఆ భక్తురాలితో 'అమ్మా! మహర్షి ముందు కాళ్ళు చాపి కూర్చొంటారా! మడుచుకోండి' అన్నారు.

ఇబ్బంది పడుతూనే ఆ మహిళ కాళ్ళు మడుచుకుంది. కానీ ఆమె అసౌకర్యానికి గురి కావడం రమణులు గమనించి, 'పాపం! వాళ్ళు కింద కూర్చోవడానికే కష్టపడుతూంటే, పైగా కాళ్ళు మడుచుకోవాలా! వాళ్ళకది ఎంతో ఇబ్బంది. అందుకే చాలా మంది ఇక్కడకు రావాలని మనస్సులో ఉన్నా, రాకుండా ఊరుకుంటున్నారు. అభ్యాసం లేనిదే కింద కూర్చోలేరు. ఏం చేస్తాం! నియమాల పేరుతో భక్తులను కష్టపెట్టకూడదు. మనమే సర్దుకుపోవాలి' అన్నారు.

ఆ భక్తుడు 'అలా అని కాదు! ఇక్కడి మర్యాద వాళ్ళకు తెలియదని చెప్పాను' అన్నాడు.

'ఓహో! అలాగా! అయితే వాళ్ళ వైపు కాళ్ళు చాపి కూర్చోవడం నాకూ మర్యాద కాదు. ఆ మాట నాకూ వర్తిస్తుంది కదా!' అని భగవాన్ వెంటనే కాళ్ళు మడుచుకున్నారు. భక్తులు ఎంత ప్రాధేయపడ్డా వినకుండా, వారు ఆ రోజంతా అలాగే కాళ్ళు మడుచుకునే కూర్చొన్నారు. అలా కాళ్ళు మడుచుకుంటే మహర్షికి ఎంత కష్టమో భక్తులకు తెలుసు. పది నిమిషాలు అలా కాళ్ళు మడుచుకుంటేనే, కీళ్ళ నొప్పులై మళ్ళీ అరగంట రుద్దితే కాని ఆ పట్లు విడవవు. ఆ అనుభవంతో ఆ రోజు సాయంత్రం వారంతా ప్రాధేయపడితే అప్పుడు శ్రీరమణులు కాళ్ళు చాపారు. ఆ తరువాత సందర్భోచితంగా అవ్వయ్యార్ అనే శివభక్తురాలి కథ చెబుతూ... "అవ్వయ్యార్ అనే వృద్ధురాలి భక్తికి మెచ్చి గణపతి ఆమెను సశరీరంగా కైలాసానికి తీసుకు వెళతాడు. అవ్వ కడు వృద్ధురాలు కావడంతో కాళ్ళు మడచి కూర్చోలేక శంకరుడి ముందు కాళ్ళు చాపి కూర్చొంటుంది. పరమేశ్వరుడి పక్కనే ఉన్న పార్వతికేమో మనస్సు చివుక్కుమంది. 'అలా కూర్చోవడం అపరాధం కదా!' అన్న భావంతో ఆమెకు ఒక్కసారి చెప్పి చూడమని పతిదేవుణ్ణి కోరింది.

'అమ్మో! ఆమె పరమ భక్తురాలు. ఆమెనేమీ అనకూడదు!' అని శివుడు సూచించాడు. అయినా పరమేశ్వరి ఆ అమర్యాదను ఎలా సహిస్తుంది? చెప్పమని చెలికత్తెకు చెప్పి చూసింది.

ఆ సఖి అవ్వను సమీపించి 'అవ్వా! అవ్వా! కాళ్ళు ఈశ్వరుని వైపునకు పెట్టకు' అంది. అప్పుడు ఆ వృద్ధురాలు 'అలాగా అమ్మా! ఈశ్వరుడు లేని చోటెక్కడో చెప్పు, కాళ్ళు అటు వైపు పెట్టుకుంటాను' అంటూ పక్కకు తిప్పుకుందట!. పరమేశ్వరుడూ ఆ వైపునకు తిరిగాడు. అటు తిప్పితే అటూ తిరిగాడు. ఎటు తిప్పితే అటు శంకరుడు తిరగాల్సి వచ్చింది. అలా తిరుగుతూ పరమేశ్వరుడు పార్వతి వైపు చూసి 'నేను చెబితే విన్నావు కాదు! ఆమె నన్ను ఎలా తిప్పుతున్నదో చూడు. అందుకే నేను నోరు మెదపకు అన్నాను. నేను భక్తుల వశమేనని నీకు తెలుసు కదా!' అంటాడు.

అప్పుడు పార్వతీదేవి 'అవ్వా! క్షమించు' అని ఆమెను ప్రార్థించిందట! అయినా శివుడు లేని చోటు ఈ విశ్వంలో ఎక్కడైనా ఉందా?" అన్నారు భగవాన్ శ్రీరమణ మహర్షి. అప్పటి నుంచి రమణాశ్రమంలో సిబ్బంది, భక్తులకు ఆంక్షలు పెట్టేటప్పుడు ఒకటికి పదిసార్లు ఆలోచించేవారట! ❖

మానవులకు అద్వైతభావం ఈశ్వరానుగ్రహం వల్ల మాత్రమే లభిస్తుంది. అది ఏ ఒక్కరిద్దరికో మాత్రమే సిద్ధిస్తుంది. సంసార భయం నుండి రక్షణ కలిగించేది ఆ అద్వైత భావమే! - అవధూతగీత

పలికెడిది భాగవతం

కాలగతి వింతయై వచ్చె!

– స్వామి జ్ఞానదానంద

కురువృద్ధుడైన ధృతరాష్ట్రుడు తన అర్ధాంగి గాంధారితో, తమ్ముడు విదురుడితో కలసి అరణ్యాలకు పయనమయ్యాడని నిర్ధారించుకున్న ధర్మరాజు ఒంటరిగా అంతఃపురంలో ఆసీనుడయ్యాడు. హఠాత్తుగా ఆయన ఆలోచనలు సామాజిక స్థితిగతుల పైకి మరలాయి. ఎందుకో? ఎక్కడ చూసినా పరిస్థితులు తారుమారవుతున్నట్లు తోచి, ఆ పాండవాగ్రజుడు పరమ

వ్యాకులత పడుతున్నాడు. ఇంతలో ఆయన మందిరంలోకి తమ్ముడు భీమసేనుడు వచ్చాడు. అప్పుడు ఆ ధర్మనందనుడు సోదరుడితో 'తమ్ముడూ! నీవు గమనించావా? కాలగమనంలో ఎంత మార్పు వచ్చిందో? పంటలు సకాలంలో పండడం లేదు. క్రోధం, లోభం, క్రౌర్యం, అసత్యం మితిమీరి ప్రజలు ప్రవర్తిస్తున్నారు. వ్యాపారాలలో మోసం చోటు చేసుకుంటోంది. స్నేహంలో ద్రోహం కనిపిస్తూ ఉంది. భార్యలు భర్తలను ద్వేషిస్తున్నారు. కొడుకులు కన్నతండ్రులపై కాలుదువ్వుతున్నారు' అని చెబుతూ...

గురుల శిష్యులు దూషించి కూడ రండ్రు
శాస్త్రమార్గము లెవ్వియు జరుగ వండ్రు
న్యాయపద్ధతి బుధులైన నడవరండ్రు
కాలగతి వింతయై వచ్చె కంటె నేడు!

'శిష్యులు గురువులను దూషిస్తున్నారు. శాస్త్రవిధులు కుంటుపడ్డాయి. విజ్ఞులు సైతం న్యాయమార్గాన్ని విడిచిపెట్టారు. కాలం ఎంత వింతగా మారిపోయింది!' అని మథనపడ్డాడు.

ధర్మరాజుకు ఆనాడు సమాజంలో కనిపించిన ఈ దుర్నిమిత్తాలు నేటికీ అప్పుడప్పుడూ దర్శనమిస్తూనే ఉన్నాయి. అయితే ఇలాంటి సంకేతాలు అశుభసూచకాలు. మనిషి తన మౌలికమైన ధర్మాన్ని మరచిపోయి, సాగిస్తున్న స్వార్థ స్వైరవిహారం చివరకు భస్మాసుర హస్తంలా తననే నాశనం చేస్తుందని గుర్తించాలి.

దారి తప్పిన ధర్మనిరతి... : మనిషి తన సహజమైన ప్రవృత్తిని విడిచి, కేవలం ఉదరపోషణార్థనకే పరిమితమై, ఉన్నత జీవనానికి ప్రయత్నించకపోవడం వలన సంభవిస్తున్న దుష్పరిణామాలివి! భగవంతుడి స్థానంలో భౌతికవాదం వచ్చి చేరడం వల్ల, నైతిక నియమాలు ఒక్కటొక్కటిగా సమాజం నుంచి కనుమరుగవుతూ ఉన్నాయి. ముఖ్యంగా నిత్యజీవితంలో అవకాశవాదులుగా మారిపోయి, పరిస్థితుల పేరుతో మనకు మనమే విలువల్ని సడలించుకుంటూ, సవరించుకుంటూ దిగజారిపోతూ ఉన్నాం. ఇలా స్వార్థం వల్ల లోభం పెరిగింది... లోభం వల్ల మోసం పెచ్చుమీరింది... ఇలా ద్రోహం, క్రోధం, క్రౌర్యం ఒక్కటొక్కటిగా విషవాయువుల్లా మన మనస్సుల్లో వ్యాపిస్తున్నాయి. అయితే స్వార్థాన్ని బీజదశలోనే నివారించుకోవాలన్న వివేకం మనలో కొరవడుతోంది. తత్ఫలితంగానే అది మనోక్షేత్రంలో విషయవాసనల విషవృక్షంగా వేళ్ళూనుకుంటోంది. చివరకు అది మన జీవితాన్ని మనకు తెలియకుండానే నరకకూపంగా మార్చేస్తుంది. అందుకే శ్రీకృష్ణభగవానుడు...

త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః ।
కామః క్రోధస్తథా లోభః తస్మాదేతత్త్రయం త్యజేత్ ॥ (గీత–16.21)'

'కామక్రోధలోభాలు నరకానికి మూడు ద్వారాలు. అవి ఆత్మవినాశ కారకాలు. వివేకవంతులు ఈ మూడింటినీ త్యజించవలెన'ని హితవు పలుకుతాడు.

అయితే, మన జీవనయానానికి ధర్మాన్నీ, న్యాయాన్నీ జత చేసినప్పుడు క్రోధం, లోభం వాటంతట అవే వీడిపోతాయి. ఈ రోజు మనం పడుతున్న సంఘర్షణలన్నిటికీ ప్రధాన కారణం అన్నింటినీ అధర్మమార్గంలో సొంతం చేసుకునేందుకు ప్రయత్నం చేస్తూ ఉండడమే. అయితే ధర్మం దారి తప్పితే ఎన్ని దుష్పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందో ధర్మరాజు తన

దార్శనికతతో ఆలోచించాడు. అందుకే ఆందోళన పడ్డాడు; కాలగతిని చూసి కలవరపడ్డాడు.

అధోదృష్టితో అధఃపతనం...: ఒకరోజు భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస గుర్రం బండిపై తమ గృహస్థ శిష్యులైన మహేంద్రనాథ్ గుప్తతో దక్షిణేశ్వరం నుంచి కలకత్తా వెళుతూ వీథిలోని జనులను పరిశీలిస్తూ ఉన్నారు. ఆయన తమ సూక్ష్మదృష్టితో మనుషుల మనసుల్లో ఏముందో చూడ గలిగేవారు. ఆ రోజు మహేంద్రనాథ్‌తో 'కాలం ఎంత విపరీతంగా మారిపోయింది. అందరి దృష్టీ నిమ్న వస్తువుల మీదే లగ్నమై ఉన్నట్లు కనిపిస్తోంది. ప్రతి ఒక్కరూ ఉదరపోషణార్థమే చింతన చేస్తున్నారు. ప్రతి వ్యక్తి మనస్సూ కామినీ కాంచనాలలో లీనమై ఉంది. ఏదో ఒకరిద్దరు మాత్రమే ఊర్ధ్వదృష్టి కలిగి, మనస్సును భగవంతుని మీద నిలిపినవారుగా కనిపిస్తున్నారు' అంటూ ఆవేదనపడ్డారు. ఆనాడు ద్వాపర యుగంలో ధర్మనందనుడి మనోమథనమే, ఆధునిక కాలంలో శ్రీరామకృష్ణులలో కూడా కనిపించింది. మరోవైపు మనకు పరంపరగా వస్తున్న శాస్త్ర మార్గాలనూ, మార్గదర్శక సూత్రాలనూ తృణీకరించడం వల్ల, మనస్సును అంతర్ముఖం గావించే సాధనలను విస్మరించడం వల్ల మనుషులు ఇంతగా బాహ్యప్రపంచం వైపు పరుగులు తీస్తున్నారు. పైగా అహంకారంతో, మిడిమిడి జ్ఞానంతో సనాతన ధర్మాన్నీ, ధార్మికవేత్తలనూ పరిహాసమాడుతూ, తమ వినాశనాన్ని తామే కొనితెచ్చుకుంటున్నారు. ఆ భావనతోనే పాండవాగ్రజుడు ఇక్కడ, **'గురుల శిష్యులు దూషించి కూడ రంద్రు...; శాస్త్రమార్గము లెవ్వియు జరుగవంద్రు'** అంటున్నాడు. అయితే ఈ విపరీత పోకడలకు వర్తమాన సమాజం ఎప్పటికప్పుడు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మూల్యం చెల్లిస్తూనే ఉంది. ఈ అనుభవాలతోనైనా మనం మేల్కొని పొరపాట్లను సవరించుకోకపోతే, భవిష్యత్ తరాలకు మార్గదర్శకులుగా నిలవలేక, అపఖ్యాతి పాలు కావాల్సి ఉంటుంది.

అన్నీ తెలిసినా 'అనైతికమే'...: సమాజంలో విజ్ఞత, వివేకం లేనివారే అడ్డదారులు తొక్కుతున్నారనుకుంటే పొరపాటే! అన్నీ తెలిసి కూడా అనైతికతనే తమ నైజంగా మార్చుకుంటున్నవారు ఎందరో ఉన్నారు. వాళ్ళ జ్ఞానాన్నీ, బుద్ధినీ కాపట్యంతో కుతంత్రాలకే పరిమితం చేస్తూ, తమ పబ్బం గడుపుకొంటారు. అందుకే యుధిష్ఠిరుడు ఇక్కడ **'న్యాయపద్ధతి బుధులైన నడవరంద్రు'** అంటున్నాడు. జ్ఞానం సంపాదించడానికి బుద్ధి ఉంటే సరిపోతుంది; సంపాదించిన జ్ఞానాన్ని, విజ్ఞానంగా ఆచరణలో పెట్టడానికి నిబద్ధత, ధైర్యం కావాలి. ఆ నిబద్ధతే చాలామందిలో లుప్తమవుతోంది.

దుర్యోధనుడికి ధర్మాలు, ధర్మసూక్ష్మాలు అన్నీ తెలుసు. కానీ వాటిని పాటించే నైతికబలం అతనిలో లేదు. అందుకే పెద్దలు జోక్యం చేసుకొని సరిదిద్దాలని చూసినప్పుడల్లా **'జానామి ధర్మం న చ మే ప్రవృత్తిః; జానామి అధర్మం న చ మే నివృత్తిః –** ధర్మమని తెలిసినా ఆచరించలేను; అధర్మమని తెలిసినా ఆచరించకుండా ఉండలేను' అని అనేవాడు.

కాలప్రవాహంలో కొన్నిసార్లు అధర్మమే రాజ్యమేలుతున్నట్లు కనిపిస్తూ ఉంటుంది; శేషప్ప కవి కూడా అదే బాధతో తన 'నరసింహ శతకం'లో...

అధిక విద్యావంతు లప్రయోజకులైరి పూర్ణశుంఠలు సభాపూజ్యులైరి
సత్యవంతులమాట జనవిరోధంబాయె దరువుబోతులమాట వాసికెక్కె
ధర్మవాసనపరుల్ దారిద్ర్య మొందిరి పరమలోభులు ధనప్రాప్తు లైరి
పుణ్యవంతులు రోగ భూత పీడితులైరి దుష్ట మానవులు వర్ధిష్ణులైరి
పక్షివాహన! మావంటి భిక్షుకులకు శక్తి లేదాయె, ఇక నీవె చాటు మాకు!

"మిక్కిలి జ్ఞానవంతులు కూడా నిష్ప్రయోజకు లవుతూ ఉన్నారు; పరమ మూర్ఖులైనవారు సభా మర్యాదల్ని పొందుతున్నారు. సత్యవంతుల మాట జనానికి రుచించడం లేదు. ప్రగల్భాలు పలికేవారి మాటే చెల్లుబాటవుతుంది. ధర్మానికి నిలబడేవారు కటిక దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారు. పిసినారులు భాగ్యవంతులవుతున్నారు. పుణ్యకార్యాలు చేసేవారు ఈతిబాధల పాలవుతున్నారు; దుర్జనులేమో సుభిక్షంగా ఉన్నారు, ఇక నీవే మాకు దిక్కు"ని నరహరికి విన్నవించుకున్నాడు.

అయితే, ఇలాంటి అనూహ్య పరిణామాలు కొన్నాళ్ళు మాత్రమే! మెరుపులు, మబ్బులు మధ్యలో వచ్చిపోయేవే! ఆకాశం మాత్రమే శాశ్వతం. అలాగే మంచికే ఎప్పుడూ మన్నిక.

సందిగ్ధకాలం...: కురుక్షేత్ర సంగ్రామంతో తన అవతార లక్ష్యం ముగిసి శ్రీకృష్ణుడు అర్జునుడితో కలసి ద్వారకానగరానికి తరలిపోయాడు. ఆ తరువాత కొన్ని నెలల నుంచి తనకు ఇలాంటి అశుభ సూచనలే కనిపిస్తున్నాయని ధర్మరాజు ఆందోళన పడుతూ ఉన్నాడు. భీమసేనుడితో "నా మనస్సంతా వ్యాకులంగా ఉంది; అన్నీ దుశ్శకునాలే తోస్తున్నాయి. వాసుదేవుడు దేహాన్ని చాలించాలని ఆలోచిస్తున్నాడేమోనని సందేహపడుతున్నాను. శుభరేఖలతో అలంకృతమైన వాసుదేవుని పాదపద్మాలను స్పృశించి పావనమయ్యే భాగ్యం ఇక ఈ భూదేవికి లేదేమోనని చింతిస్తున్నా"నన్నాడు.

భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస అవతార పరిసమాప్తి సమయంలో కూడా ప్రత్యక్ష శిష్యులు ఇదే రీతిలో కకావికలురయ్యారు. గురుదేవుల గొంతులో వ్రణం పుట్టి, అది క్యాన్సర్‌గా పరిణమించి, ఆ వ్యాధి నయమయ్యేది కాదని వైద్యులు నిర్ధారించాక స్వామి వివేకానంద తదితరులు ఖిన్నులైపోయారు. ఆ సందిగ్ధకాలాన్ని జీర్ణించుకోలేకపోయారు. శ్రీరామకృష్ణులు లేని తమ జీవితాల్ని ఊహించుకోలేకపోయారు. ఏ యుగంలోనైనా అవతారమూర్తిని గుర్తించి, వారి అంతేవాసులుగా మసలుకొని, వారి లక్ష్యానికి ఉపకరణాలుగా మారేవారు ధన్యులు! ❖

కాలగతిలో అనేక సుఖాలూ, దుఃఖాలూ కలుగుతూనే ఉన్నాయి. వాటిని చూసి మూఢులు మాత్రమే ఆనందిస్తారు, భయభీతులవుతారు. కానీ విజ్ఞులు పొంగరు, కుంగరు. – మహాభారతం

సాధనకు సూచనలు

– స్వామి అద్భుతానంద*

‘అభ్యాస యోగం’ మూలంగా కుసంస్కారాలు నశిస్తాయి. ఇన్నేళ్ళుగా పోగుపడినవి, తలచినంతనే పోతాయా? మీకు మనోబలం లేదు. కనుక అభ్యాసయోగం ఆవశ్యకం. నిరంతర వివేచనతో కుసంస్కారాలు పోతాయి. వివేకహీనుడు పశువుతో సమానం. సత్యాసత్యాలను వేరు చేసి, మాయాజాలం నుండి తప్పించుకొనడానికి వివేచన అవసరం.

గంగాతీరంలో జపధ్యానాలు చేస్తే, మనస్సు ఇష్టదైవంపై సులువుగా లగ్నమవుతుంది. మనస్సు, దేహం పవిత్రమవుతాయి. భగవంతుని అనుగ్రహం లేనిదే గంగాస్నానం, గంగాపానం, గంగ దగ్గర జీవనం సాధ్యం కావు.

ఉదయాస్తమయాలలో సాధన చేయాలి. శ్రద్ధతో ఇష్టదేవతా రూపాన్ని ధ్యానిస్తూ, నామజపం చేయాలి. జపధ్యానాల వల్ల ఇంద్రియనిగ్రహం కలిగి కామక్రోధాదులు అదుపులోకి వస్తాయి. సాధన లేనిదే ఏమీ చేకూరదు. అవతార పురుషులు, మహాత్ములు సాధన చేసి, దాని ప్రాముఖ్యాన్ని లోకానికి చూపించారు.

మనోనిగ్రహం కలవాడు దైవసమానుడు. మనస్సు నిరంతరం చంచలంగా ఉంటుంది. అభ్యాసంతో మనస్సును నియంత్రించగలమని శ్రీకృష్ణుడు, అర్జునుడికి తెలిపాడు. మనస్సు ఇంద్రియ విషయాల వైపు పరుగులిడిన ప్రతిసారీ దాన్ని పట్టి, వెనక్కు లాగాలి. ఈ విధంగా మనస్సును నిశ్చలం చేయవచ్చు. భగవంతుణ్ణి తప్ప మరి దేని గురించీ యోచింపకు; అప్పుడు అరిషడ్వర్గాలు వాటంతట అవే అదుపులోకి వస్తాయి. ఈ శత్రువులను జయించి, మనస్సు నిశ్చలమైతేనే భగవత్సాక్షాత్కారం.

మనస్సును అన్ని కోరికలూ వీడితే అది బ్రహ్మం వైపు మరలుతుంది. అప్పుడు అహంకారం పోతుంది. బ్రహ్మచర్యాన్ని పాటించనిదే సాక్షాత్కారం కాజాలదు. బ్రహ్మచర్యం అంటే బ్రహ్మశక్తి. బ్రహ్మచర్యంతో బుద్ధిబలం కలుగుతుంది. ఒక వ్యక్తిని చూసి, అతడి మాటలు వింటే చాలు ఆయన సాధన ఎలా చేస్తున్నాడన్నది చెప్పవచ్చు.

జపసాధన మూలంగా పరిపూర్ణత, సార్థకత లభిస్తాయి. నూనెధార లాగా ఎడతెగక జపం చేస్తే, ధ్యానం సులభమవుతుంది. ధ్యానమంటే ఏంటి? ‘నేను ఉన్నాను, ఇష్టదైవం ఉంది, మరేమీ లేదు’ – ఈ భావన. మనస్సు పవిత్రమైతే, ఈ భావం గట్టిగా వేళ్ళూనుకుంటుంది.

మృత్యువుకు సమయం, ప్రదేశంతో నిమిత్తం లేదు. కనుక ‘వృద్ధాప్యంలో సాధన చేస్తాను. ఇప్పుడు ఎందుకు’ అనడం అర్థరహితం. భగవంతుణ్ణి పూజించడానికీ, నామజపానికీ నిర్ణీత సమయమంటూ లేదు. ఎక్కడైనా, ఎప్పుడైనా, ఎట్టి పరిస్థితులలోనైనా చేయవచ్చు. దోషంలేదు. శుచిగా ఉంటే మనస్సు నిశ్చలమై, ఏకాగ్రత కుదురుతుంది. ఆధ్యాత్మిక జీవితంలో శుచి, అశుచి భేదం చూడాలి కానీ దానినే పట్టుకు వేలాడకూడదు.

నామస్మరణ అన్నిటి కన్నా ముఖ్యం. సాధన ఏకాంతంలో చేయాలి. ఎంత ఏకాంతం అయితే అంత మంచిది. పదిమందిలో చేస్తే అహంకారం ఎక్కువయ్యే ప్రమాదం ఉంది.

శ్రీమద్భాగవతంలో ‘ఉద్ధవగీత’ చాలా గొప్పది. త్యాగాన్ని గురించి బోధించే ఆ భాగం సాధకులకు మేలు చేస్తుంది. జపధ్యానాలను ఎల్లప్పుడూ చేయలేము. కనుక అలాంటి సమయంలో సద్గ్రంథ పఠనం చేయాలి. ఆధ్యాత్మిక చర్చలలో పాల్గొనాలి. మనస్సులో చెడు తలంపులు రానీయకు. వచ్చాయా సర్వనాశనమే!

మనస్సు ఒక క్షణం ఉల్లాసంగా ఉంటుంది, మరు క్షణం ఎలా ఉంటుందో చెప్పలేము. సదా చంచలమైన మనస్సును పట్టుకోవడం కష్టం. మనస్సుపై నియంత్రణకు నిరంతరం ధ్యానం చేయాలి. అప్పుడు మనస్సు పరుగు మొదలుపెట్టగానే సాధకునికి తెలుస్తుంది. దాన్ని పట్టి తెచ్చి, మరలా ధ్యానం అభ్యసించాలి. పదే పదే ఇలా చేయగా, మనస్సు నిశ్చలమై భగవంతునిపై ఏకాగ్రమై ఉంటుంది. ❖

(*తిథి ప్రకారం ఫిబ్రవరి 3వ తేదీన శ్రీరామకృష్ణ పరమహంస సన్న్యాస శిష్యులైన స్వామి అద్భుతానంద మహరాజ్ జయంతి)

"ఒక వ్యక్తి తనను తాను అసహ్యించుకొంటున్నట్లయితే అదే పతనానికి హేతువు. పూర్వీకుల చరిత్రను అవమానకరంగా భావిస్తే, ఆ జాతి అంతానికి చేరుకున్నట్లే!" అంటారు స్వామి వివేకానంద. గత వైభవాన్ని మర్చిపోయినంత కాలం మనమూ, మన దేశం స్తబ్ధతలో మునిగిపోతాం. అందుకే, మన ప్రాచీన సంస్కృతి గురించి తెలుసుకోవాలి. గడచిపోయిన సంగతులు తెలుసుకొంటూ, భవిష్యత్ మహత్కార్యాల సాధన వైపు నడవాలి. మన ప్రాచీన భారతీయ సంస్కృతిని గుర్తు చేసేందుకు చేస్తున్న ప్రయత్నమే ఈ వ్యాసాల పరంపర. సుప్రసిద్ధ రచయిత, బెంగుళూరు రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి హర్షానంద మహరాజ్ మధ్యయుగాల కాలం దాకా విలసిల్లిన మన సంస్కృతిని 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు 2014 ఫిబ్రవరి సంచిక నుండి వివరిస్తున్నారు.

మన నాట్య సంప్రదాయాలు

నాట్యము : సంగీతంలాగే నాట్యం కూడా మానవులు తమ ఆంతరంగిక భావప్రకటనకు సాధనంగా ఆచరించేవారు. ఉదాహరణకు ఇప్పటికీ పల్లెలలోని జానపదులు తమ నాట్యం ద్వారా ప్రకృతి దేవతలకు తమ భక్తిని వెల్లడిస్తూ ఉంటారు. అన్ని సమాజాలలోనూ ప్రతి సామాజిక కార్యక్రమానికీ దానికి తగిన నాట్యాలున్నాయి. భారతీయ నాట్యం ఆదిదంపతులైన శివ పార్వతుల నుండి ఆవిర్భవించినట్లు భావిస్తారు. గణపతి, కృష్ణుడు, పరివార దేవతలైన నంది, భృంగి, సరస్వతి - అందరూ నాట్యప్రియులే. సారంగదేవుని 'సంగీత రత్నాకరం'లో (క్రీ.శ. 1260) నాట్యమనేది నాట్యవేదమనీ, సాక్షాత్తు చతుర్ముఖ బ్రహ్మ ఈ విద్యను భరతమునికి నేర్పాడనీ, ఆయన కైలాసంలో శివుని సమక్షంలో నాట్యం చేసేవాడనీ పేర్కొన్నారు. బాణుడి కుమార్తె అయిన ఉషకు పార్వతీదేవి స్వయంగా లాస్యం (స్త్రీలకు అనువైనది) నేర్పిందని చెప్పారు. నాట్యశాస్త్రం ఈ విధంగా ప్రారంభమైంది.

వేదాలలో నాట్యం గురించి, అనేక వాద్యాల గురించి ఉంది. సింధులోయ త్రవ్వకాలలో (క్రీ.పూ. 3000) నాట్య భంగిమలలో ఉన్న ప్రతీకలు లభించాయి. రామాయణ-మహాభారతాలు కూడా నాట్యాన్ని ప్రస్తావించాయి. మౌర్యుల కాలం నుండి నాట్యానికి రాజాదరణ లభించి, వృద్ధి చెందింది. దేవదాసి సంప్రదాయంలో కొన్ని లోపాలు ఉన్నప్పటికీ అది నాట్యాభివృద్ధికి తోడ్పడింది. ప్రామాణిక నాట్యశాస్త్ర గ్రంథాలు - భరతముని నాట్యశాస్త్రం, నందికేశ్వరుని భరతార్ణవం, అభినయ దర్పణం.

భరతముని, నందికేశ్వరుడు నాట్యశాస్త్రానికి మూలపురుషులు. నాట్యశాస్త్రం ఇప్పుడు లభించడం లేదు. ఈ గ్రంథాలకు ముందే కొన్ని గ్రంథాలు ఉండి ఉండవచ్చు. అభినవగుప్తుని 'అభినయ భారతి' నాట్యశాస్త్రానికి వ్యాఖ్యాన గ్రంథం. కానీ ఇది పూర్తిగా లభ్యం కాలేదు.

హృదయగత భావవ్యక్తీకరణే నాట్యశాస్త్రానికి ఆధారం. నాట్యం అభినయంతోనూ, లయబద్ధమైన హస్తముద్రలతోనూ, భంగిమలతోనూ సాగుతుంది. సన్నివేశానికి తగిన దుస్తులు, ప్రక్కవాద్యాలు నాట్యాన్ని రక్తి కట్టిస్తాయి. నాట్యాంశాలను సాధారణంగా పురాణ, ఇతిహాసాల నుండి స్వీకరిస్తారు. ఇప్పటికీ ఆచరణలో ఉన్న ముఖ్యమైన నాట్యసంప్రదాయాలు:

భరతనాట్యం, కథక్, కథాకళి, కూచిపూడి, మణిపురి, ఒడిస్సీ, సాత్రియ, యక్షగానము.

భరతనాట్యం : భరతముని బోధించిన నాట్యశాస్త్రమే భరతనాట్యం. ఈ సంప్రదాయం దక్షిణ భారతదేశంలో విస్తరించి ఇప్పటికీ ప్రాముఖ్యం వహిస్తోంది. విజయనగర సామ్రాజ్య పతనం తరువాత భరతనాట్య కళాకారులు తంజావూరుకు తరలివెళ్ళి ఈ కళను అభివృద్ధి చేశారు.

'భరత' అనే పదాన్ని భ (భావము), ర (రసము), త (తాళము)ల సంకేతంగా చెప్పారు. ఈ నాట్యం మూడు శాఖలుగా - సదిర్ నాట్యం, భాగవతమేళా, కురువంజిగా విభాజితమైంది.

సదిర్ నాట్యాన్ని సాధారణంగా దేవదాసీలు చేస్తుంటారు.

భరతనాట్యం

కథక్

కథాకళి

కూచిపూడి

మణిపురి

ఒడిస్సీ

సాత్రియ

యక్షగానము

వీణావాదనతత్త్వం తెలుసుకున్నవారూ, శ్రుతిజాతులు తెలిసి విశారదులైనవారూ, తాళగతిభేద పారంగతులైనవారూ అనాయాసముగా మోక్షమార్గములో పయనింతురు. - యాజ్ఞవల్క్య స్మృతి

నేపథ్యంగా కర్ణాటక సంగీతం ఉంటుంది. పదగమనానికి ప్రాముఖ్యమిస్తూ మధురగీతాలు, కృష్ణుని జీవితగాథలను తెలియజేసే సంస్కృత శ్లోకాలు, తిల్లానాలతో (వాద్యాలతో శబ్దాలను అనుకరించే సంగీత విభావరి) సాగుతుంది.

భాగవతమేళాలు, మతపరమైన నృత్యనాటికలను దేవాలయాల్లో ప్రదర్శిస్తారు.

కురువంజి నాట్యంలో నర్తకి పరమాత్మను వెదికే జీవాత్మకు ప్రతీక. ఈ నాట్యాన్ని కూడా దేవాలయాల్లో చేస్తుంటారు.

కథక్: కథక్ నాట్యసంప్రదాయం రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లలో భగవదారాధనా నాట్యంగా ప్రారంభమైంది. కృష్ణభక్తులు భజనలు చేస్తూ కీర్తనల ద్వారా భావవ్యక్తీకరణ చేయడమే ఈ నాట్యానికి మూలం. శ్రీకృష్ణావతార ఘట్టాలనే ఎక్కువగా నర్తిస్తారు. జైపూర్ (రాజస్థాన్), లక్నో సంప్రదాయాలుగా కథక్ విస్తరించింది. సున్నితత్వం, వేగం జైపూర్ సంప్రదాయం అయితే నటన, దివ్యభావ ప్రకటన లక్నో సంప్రదాయం.

కథాకళి : కేరళలోని మలయాళీ సంప్రదాయ నృత్యం కథాకళి. పౌరాణికమైన జానపద నృత్యాల నుండి ఇది ఆవిర్భవించింది. ఇందులో కూత్తు, రామనాట్టం, కృష్ణనాట్టం అనే మూడు విభాగాలున్నాయి. కూత్తు కేరళ చాక్యార్ తెగకు సంబంధించిన నృత్యం. పౌరాణిక లేక చారిత్రక అంశాలతో దేవాలయాలలో ఉత్సవ సమయంలో ఈ నాట్యం ప్రదర్శితమయ్యేది. మిగిలిన రెండు విభాగాలు, శ్రీరామావతార పరంగా, శ్రీకృష్ణావతార పరంగా ఉండే ఒకే రకమైన నృత్యాలు.

కథాకళిలో మాట్లాడడం గాని, పాడడం గాని ఉండదు. భావవ్యక్తీకరణ కేవలం నటన ద్వారానే ఉంటుంది. నాట్యాంశాలు హైందవ పౌరాణికాలే. దుస్తుల రంగులు, ఆభరణాలు పాత్రోచితంగా – అంటే సాత్త్విక, రాజసిక, తామసిక పాత్రలకు అనుగుణంగా ఉంటాయి.

కథాకళి నృత్యాలను ఆరుబయట వెన్నెలలో ఎక్కువగా ప్రదర్శిస్తారు. నాట్యాంశ ప్రకటన, ప్రారంభ గీతాలు, వాద్యాలు మ్రోగించి, మొదట నటుని ప్రవేశాన్ని తెలియజేస్తూ కథావివరాలను నేపథ్యం నుండి వినిపిస్తూ నటన సాగిపోతుంది.

కూచిపూడి : కూచిపూడి ఆంధ్రుల నాట్యం. విజయనగర సామ్రాజ్యకాలంలో ఇది వృద్ధి చెందింది. కూచిపూడి సాత్త్వికంగా ఉంటూ, నటనకు ప్రాముఖ్యమిస్తుంది. 17వ శతాబ్దానికి చెందిన బ్రహ్మకల్పం, సిద్ధేంద్రయోగి విరచిత పారిజాతము, గొల్లభామలకు – బ్రాహ్మణ విద్వాంసునకు జరిగిన వేదాంత చర్చ 'గొల్లకలాపం'... ముఖ్యమైన కూచిపూడి నాట్యాంశాలు. దశావతారాలను కూడా ఎక్కువగా ప్రదర్శిస్తుంటారు. ❖ **అనువాదం: డాక్టర్ పి.వి.రెడ్డి**

SRI RAMAKRISHNA YATHRA SERVICES CHENNAI

కైలాస-మానస సరోవర తీర్థయాత్ర



భక్తులకు ఓ అపూర్వ అవకాశం

1. కైలాస-మానస సరోవర తీర్థయాత్ర
2. ముక్తినాథ్ తీర్థయాత్ర
3. శ్రీరామకృష్ణ గురుపీఠం - బేలూరు మఠ తీర్థయాత్ర
4. మణి మహేశ్ కైలాస్ & శక్తిపీఠ హిమాచల్ యాత్ర
5. కాశీ-పంచక్రోషి తీర్థయాత్ర
6. పంచ ద్వారక తీర్థయాత్ర
7. నర్మదా పరిక్రమ తీర్థయాత్ర
8. దక్షిణభారత తీర్థయాత్ర - తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లోని అన్ని దేవాలయాలు.
9. అండమాన్ - నికోబార్ యాత్ర
10. శ్రీలంక తీర్థయాత్ర
11. మలేషియా - సింగపూర్ - థాయ్‌ల్యాండ్ - కాంబోడియా (అంకోర్‌వాట్) - ఇండోనేషియా యాత్ర

పూర్తి వివరాలకు సంప్రతించండి

శ్రీ రామకృష్ణ యాత్రా సర్వీసు®

ప్రధాన కార్యాలయం : కొత్త నెం. 120/1, పాత నెం. 216/1, రామకృష్ణ మఠం రోడ్, ఆర్.కె. మఠం ఎదురుగా, మైలాపూర్, చెన్నై - 600 004

ఫోన్:044-2461 6968, 2495 0095, సెల్: (0)94440 91428, (0)98427 11886 ఫ్యాక్స్: 044-2462 0631

Email : anandhan@srkyatra.com, Website: www.srkyatra.com

ఆధ్యాత్మిక సేవాపరాయణుడు : జి.యస్. ఆనందన్ సెల్ : (0)94431 44808

Advt.,

అన్నమయ్య పదామృతం

నటనల భ్రమయకు నా మనసా!

– శ్రీమతి బి.కృష్ణకుమారి

నటనల భ్రమయకు నా మనసా
ఘటియించు హరియే కలవాడు ॥
ముంచిన జగమిది మోహినీ గజము
పొంచిన యాస పుట్టించే దిది
వంచనలు నిజము వలెనే వుండును
మంచులు మాయలే మరునాడు ॥
సరి సంసారము సంతల కూటమి
సొరిది పచారము చూపేదిది
గరిమ నెప్పుడు కలకల మనుచుండును
మరులగు విధమే మాపటికి ॥
కందువ దేహము గాని ముదియదిది
అందిన బహురూప మాడేదిది
యెదుదును శ్రీ వేంకటేశ్వరుడుండును
డిందుపడగ నిదె తెరమరగు ॥

మనసు చేసే మంత్రజాలం అంతా ఇంతా కాదు! తిరునాళ్ళలో తిరిగే పసిపిల్లాడిలా చూసిన దాన్నల్లా కావాలని మారాం చేస్తుంది; తీరా అందాక మూన్నాళ్ళ ముచ్చట తీర్చుకొని మరోదాని మీద మోజుపడుతుంది. ఒక్కోసారి కుంభాకార దర్పణంలా పెద్ద విషయాన్ని చిన్నదిగా చూపెడుతుంది, మరోసారి పుటాకార దర్పణంలా చిన్న విషయాన్ని పెద్దదిగా చూపిస్తుంది. పంచేంద్రియాలనే అశ్వాల చెప్పుచేతల్లో పిచ్చిగా పరుగులు తీసి, ప్రయాస పడుతుంది. అలాంటి మనసు మర్మమెరిగి, మాలిమి చేసుకొని, మనుగడ సాగించేవారే మహానుభావులు. ఆ కోవకు చెందిన అన్నమాచార్యులు, ప్రపంచం చేసే నానా నటనా విన్యాసాలకు మోసపోవద్దని మనసును హెచ్చరిస్తూ, **'నటనల భ్రమయకు నా మనసా'** అంటూ, శాశ్వతమైన వాడు ఆ సర్వేశ్వరు డొక్కడేననీ, ఆయననే ప్రాప్తించుకొమ్మనీ హితవు పలుకుతున్నారు.

భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస ఓ గృహస్థ భక్తుడితో "భగవంతుడి వైపు మరల్చవలసిన మనసును అల్పమైన సుఖాలకే పరిమితం చేస్తే మనిషి అమితమైన దుఃఖాలను ఎదుర్కోవాల్సి వస్తుంది" అంటారు. అదే రీతిలో పదకవితా పితామహుడు మనసును మోసాల్లో, మోహాల్లో చిక్కుకొనేటట్లుచేసే మాయాప్రపంచపు వలలో పడకుండా, ఆ వేంకటాచలపతిని శరణువేడుకొమ్మంటున్నాడు.

హరియే కలవాడు...

మనసు మన మాట అంత త్వరగా అంగీకరించదు. శాశ్వతసత్యాలు చెప్పినా సావధానంగా శిరసావహించదు. పైగా బాహ్యప్రపంచం చేసే వింత విన్యాసాలన్నింటికీ విపరీతంగా ఆకర్షితమవుతుంది. వాటిని విశ్వసించి వెంటపడి మరీ సాధించుకోవాలని చూస్తుంది. కాస్త ఆదమరిస్తే చాలు, పాదరసంలా పలు దిక్కులకు ప్రసరిస్తుంది. కానీ భౌతికప్రపంచం కన్నా, బాహ్యసుఖాల కన్నా ఉన్నతమైన ఆనందామృతం అంతరంగంలోనే ఉందని నచ్చచెప్పాలి. అది అంతర్యామి అయిన ఆ భగవంతుడి ప్రాపకంతోనే సాధ్యమవుతుందని అనునయించాలి.

అందుకే త్యాగరాజస్వామి కూడా **'మన వ్యాలకించరాదటే మర్మమెల్ల తెల్పెదనే మనసా!'** అంటారు. ఇలా మన మనవి విని మర్మాలన్నీ తెలుసుకొనేలా మనస్సుకు శిక్షణనివ్వాలి. అలా కాకుండా విచక్షణ మరచి మన బుద్ధి గనక మనస్సు చెప్పు చేతల్లోకి వెళితే దుష్పరిణామాలకు దారి తీయిస్తుంది. అందుకే అన్నమాచార్యులు కూడా నానా భ్రమల్లో పడవద్దని, ఆ శ్రీహరే సర్వశరణ్యుడని మనస్సుకు మార్గాంతరం చూపుతూ....
నటనల భ్రమయకు నా మనసా, ఘటియించు హరియే కలవాడు అని మనసుకు నచ్చచెబుతున్నాడు. 'ఘటియించు' అంటే ప్రాప్తించుకోమని భావం.

జగమే మోహినీగజము...

జగత్తు నానా విధాలుగా మనల్ని మోహింపజేస్తుంది. అయితే ఒక్కసారి మనం దానిపై అనాసక్తిని అలవరచుకుంటే, ఇక అది ఎన్నటికీ మనల్ని ప్రలోభపెట్టలేదు. అందుకే ముందు మనసు ఆ బహిర్ముఖ సంకల్పాల భ్రాంతిలో చిక్కుకోకుండా జాగ్రత్తపడాలి. ఉదాహరణకు శ్రీహరి మోహినీ అవతార ఘట్టంలో రాక్షసులు అమృతాన్ని తాగడం మరచిపోయి మోహిని అందాలకు పరవశులైపోయారు; అలాగే గజేంద్రమోక్ష సన్నివేశంలో

(మిగతా 34వ పేజీలో...)

ముఖము ముడతలు పడినది; జుట్టు నెరసిపోయినది; కళ్ళు, చెవులు పనిచేయడం లేదు; అవయవముల బిగిసడలినది. కానీ తృష్ణ మాత్రమే పరువము చెడకుండా ఉంది. – భర్తృహరి

పరిప్రశ్న

– స్వామి భూతేశానంద
(రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు)

రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు - స్వామి భూతేశానందజీ మహరాజ్ (1901-1998) భక్తుల ఆధ్యాత్మిక సందేహాలకు సరళమైన రీతిలో ఇచ్చిన సమాధానాలను 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకుల ప్రయోజనార్థం 2013 జూలై సంచిక నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

భక్తుడు: భగవంతుని పట్ల శరణాగతి భావాన్ని అలవరచుకోవడం ఎలా?

స్వామీజీ: శరణాగతి భావాన్ని అలవరచుకోవడానికి కూడా అభ్యాసం అవసరం. సాధకుడు ఎలాంటి శరణాగతి భావం అలవరచుకోవాలో చెబుతూ శ్రీరామకృష్ణులు 'మార్జాల, మర్కట కిశోరన్యాయాల' గురించి వివరించేవారు. పిల్ల కోతి, తల్లి కోతిని గట్టిగా పట్టుకొని ఉంటుంది. తల్లి కోతి ఒక కొమ్మ నుండి మరొక కొమ్మకు దూకుతున్నా, పిల్ల కోతి మాత్రం తల్లిని గట్టిగా పట్టుకొని ఉంటుంది. అలాగే భక్తునికి ఎన్ని కష్టాలు ఎదురైనా భగవంతుని యందు విశ్వాసం కోల్పోకుండా అతణ్ణే ఆశ్రయించి ఉండాలి. అప్పుడు పిల్లి తన కూనను సురక్షిత ప్రదేశానికి చేర్చినట్లు భగవంతుడు భక్తుడి యోగక్షేమాలను చూసుకుంటాడు.



జీవితంలో ఎలాంటి కష్టాలు కలిగినా భగవంతుని యందు విశ్వాసం కోల్పోకుండా ఉండడమే శరణాగతి. భగవంతుణ్ణి 'ఓ దేవా! నేను నిన్ను శరణువేడుతున్నాను. నువ్వు నన్ను ఎక్కడ, ఎలా ఉంచితే అక్కడ, అలా ఉంటాను' అని ప్రార్థించాలి.

శరణాగతిని ఎలా అభ్యసించాలో, అందుకు భగవంతుణ్ణి ఎలా ప్రార్థించాలో శ్రీరామకృష్ణులు మనకు నేర్పించారు. శ్రీరామకృష్ణులు కాళీమాతను ఇలా ప్రార్థించేవారు:

"ఓ మాతా! నేను నీ పాదపద్మాలను ఆశ్రయించాను. నాకీ భౌతిక సుఖాలు వద్దు; నేను పేరుప్రతిష్ఠలను కాంక్షించను; అష్టసిద్ధులను కోరను; నీ పాదపద్మాలపై శుద్ధ భక్తిని ప్రసాదించు; ప్రాపంచిక కోరికలూ, స్వార్థచింతన లేని పవిత్రమైన మనస్సును ప్రసాదించు. ఓ దేవీ! నీ భువన మోహన మాయ నుండి నన్ను రక్షించు; కామకాంచనాల దావాగ్ని నన్ను దహించకుండా కాపాడు. ఓ తల్లీ! ఈ ప్రపంచంలో నీవు తప్ప నాకు వేరెవరూ లేరు; నాకు పూజ ప్రార్థనలు, జప తపాల గురించి ఏమీ తెలియదు; నేను భక్తిహీనుణ్ణి, జ్ఞానశూన్యుణ్ణి. నా మీద కృపజూపి నీ పాదపద్మాలపై నిశ్చల భక్తిని ప్రసాదించు".

శరణాగతి భావాన్ని అలవరచుకోవడానికి మనం కూడా నిత్యం ఇలా భగవంతుణ్ణి ప్రార్థించడం అభ్యసించాలి. ఇది కూడా సాధనలో ఒక భాగమే!

భక్తుడు: నిత్యం మనం చేసే కార్యకలాపాలకూ, భగవంతుని కోసం చేసే పూజాది కార్యక్రమాలకూ మధ్య వ్యత్యాసం ఏమిటి?

స్వామీజీ: సాధన ప్రారంభంలో ప్రాపంచిక కార్యక్రమాలు, పారమార్థిక కార్యక్రమాలు వేర్వేరు అనే భావన కలుగుతుంది. కానీ సాధన చేస్తూ ఉంటే మనస్సు పరిశుద్ధమై ఉన్నత స్థితికి చేరుకుంటుంది. అప్పుడు మనం చేసే ప్రతి కార్యం భగవత్ సంబంధమైనదే అన్న భావన పెంపొందుతుంది.

భక్త రామ్‌ప్రసాద్ "జననీ! నేను పడుకున్నప్పుడు నీకు సాష్టాంగ ప్రణామాలు అర్పిస్తున్నట్లు, నేను నిద్రపోతున్నప్పుడు నిన్ను ధ్యానిస్తున్నట్లు, నేను భుజిస్తున్నప్పుడు నీకు నైవేద్యాన్ని అర్పిస్తున్నట్లు భావిస్తున్నాను" అని అంటూ కాళీమాత గురించి గానం చేసేవాడు.

'యత్ కరోమి జగన్మాతః తదేవ తవ పూజనమ్ – ఓ జగన్మాతా! నేను చేసే ప్రతీ కార్యం నీ పూజే!' అని భావిస్తూ కర్మలను ఆచరించాలి. అలా అభ్యసిస్తే మనం చేసే ప్రతి పనీ భగవత్ కార్యమే అవుతుంది. ❖

పండుగలు - పర్వదినాలు

ఫిబ్రవరి - 2015

03	మంగళవారం	స్వామి అద్భుతానంద జయంతి
15	ఆదివారం	ఏకాదశి
17	మంగళవారం	మహాశివరాత్రి
20	శుక్రవారం	భగవాన్ శ్రీరామకృష్ణుల జయంతి (తిథిప్రకారం)

మార్చి - 2015

01	ఆదివారం	ఏకాదశి
05	గురువారం	శ్రీచైతన్య జయంతి
10	మంగళవారం	స్వామి యోగానంద జయంతి
16	సోమవారం	ఏకాదశి
21	శనివారం	ఉగాది
28	శనివారం	శ్రీరామ నవమి
31	మంగళవారం	ఏకాదశి

నారద భక్తి సూత్రాలు, శాండిల్య భక్తి సూత్రాలు భక్తియోగానికి సంబంధించిన ప్రామాణిక గ్రంథాలు. అయితే ఆధునిక తరంలో భగవదన్వేషకులకు అనువైన రీతిలో భక్తితత్త్వాన్ని బోధించారు శ్రీరామకృష్ణులు. ఈ నేపథ్యంలో 'శ్రీరామకృష్ణ కథామృతం' నుండి కొన్ని ఉపదేశాలను 'రామకృష్ణ భక్తి సూత్రాలు'గా సులభరీతిలో వివరించే ప్రయత్నం చేస్తున్నాం.

బౌద్ధగ్రంథాలు పాళీ భాషలో, బైబిల్ హీబ్రూలో, ఖురాన్ అరబ్బీ భాషలో రచించబడ్డాయి. అలాగే శ్రీరామకృష్ణుల ఉపదేశాలు వారి మాతృభాష బెంగాలీలో ఆవిష్కృతమయ్యాయి. అవతార పురుషుని ముఖతః వెలువడిన ఆ అమృతోపదేశాలను యథాతథంగా ఉట్టంకిస్తూ వ్యాఖ్యానిస్తున్నాం. మహాశక్తిమంతమైన ఆ బోధనలను మననం చేసుకుంటూ కృతార్థులమవుదాం.



రామకృష్ణ భక్తి సూత్రాలు

– స్వామి యతీశానంద

ఈశ్వరే కిసే భక్తి హోయ్,
ఎఈ చేష్టా కొరో భక్తిలాభేర్
జోన్న్యఇ మానుష హోయే జన్మేఛో.

భగవంతుని పట్ల భక్తి ఎలా
కలుగునని ప్రయాసపడు. భక్తి లాభం
కొరకే మనిషివై జన్మించావు.

శ్రీరామకృష్ణ ఉవాచ: మానవ జీవిత ఉద్దేశం భగవల్లాభం. జ్ఞానం ద్వారా దేవుణ్ణి తెలుసుకొనడం కష్టం.

భగవంతుని ప్రేమించడమే జీవనోద్దేశం. ఆయన పాదపద్మాల పట్ల ఏ విధంగా భక్తి కలుగుతుందో, దేని మూలంగా ఆయనే 'నా వాడు' అనేటటువంటి ప్రేమ కలుగుతుందో – ఆ ప్రయత్నమే మేలు. సంసారాన్ని గమనిస్తున్నావా? మూణ్ణాళ్ళ ముచ్చట. అందులో ఏమీ లేదు.

తర్కం మూలంగా ఏం దొరకుతుంది? ఆయన కొరకు ఆవేదన చెందు, ఆయనను ప్రేమించడం నేర్చుకో. జ్ఞానమనేది పురుషుడు లాంటిది. ఇంటి ముందు గదుల్లోకే దానికి ప్రవేశం. భక్తి అనేది మహిళ – పూర్తిగా ఇంటి లోపలకు వెళ్ళగలదు. భగవత్సాధన కోసం మనిషిగా జన్మించావు. భగవంతుని పట్ల భక్తి ఎలా కలుగుతుందనే ప్రయత్నం చేయి.

మొట్టమొదట భగవత్సాక్షాత్కారం. దాని తర్వాతనే సృష్టి గురించి, ఇతర విషయాల గురించి చింతన. వాల్మీకి రామమంత్రాన్ని 'రామ, రామ' అని ఉచ్చరించలేక 'మరా', 'మరా' అని జపించాడు. 'మ' అనగా భగవంతుడు. 'రా' అనగా జగత్తు. ముందు భగవంతుడు, ఆ పైన జగత్తు. ఆ ఒక్కణ్ణి తెలుసుకుంటే సర్వం తెలుస్తుంది. 1 (ఒకటి) తర్వాత యాభై సున్నలు వ్రాస్తే, ఎంత పెద్ద సంఖ్యో! 1 లేకపోతే అన్నీ సున్నలే. ఒకటి ఉండబట్టే అనేకం. ముందు ఏకం, ఆపైన అనేకం; ముందు భగవంతుడు, తర్వాత జగత్తు. నీకు కావలసినది భగవద్దర్శనం. జగత్తు, సృష్టి, సైన్సు గీన్సు ఈ గొడవంతా ఎందుకు? ఈ లోకంలో మానవులు పుట్టింది భగవంతుని పొందడానికి. ఆ విషయం విస్మరించి నానా విషయాలపై మనస్సును పోనివ్వడం మంచిది కాదు.

వ్యాఖ్య: లక్ష్యం ఏమిటో తెలుసుకొంటే, దాన్ని పొందే ఉపాయం వెతకాలనే తపన జనిస్తుంది. కనుక భగవంతుని దర్శించే ఉపాయం ఏమిటన్నది ప్రశ్న. 'భగవంతుని పట్ల భక్తి ఎలా కలుగుతుందో ఆ ప్రయత్నం సలుపు' అన్నారు శ్రీరామకృష్ణులు. అప్పుడు భక్తియే భగవల్లాభానికి ఉపాయం అని తెలుస్తుంది. సాధారణ భాషలో చెప్తే, ఒక వస్తువు లేదా వ్యక్తి పట్ల ఆకర్షితం కావడమే భక్తి. భగవంతుని పట్ల ఇలాంటి ప్రేమనే శాస్త్రాలు భక్తిగా పేర్కొన్నాయి.

మానవ జన్మ అతి దుర్లభం. అలాంటి అరుదైన జన్మను వ్యర్థం చేయకుండా జాగ్రత్తపడమని శ్రీరామకృష్ణులు పదేపదే చెప్పారు. మానవ జీవితం భిన్నమైనదనీ, మిగతా జీవజన్మలు అన్నీ 'భోగజన్మలు' అనీ శాస్త్రాల కథనం. అంటే, పూర్వజన్మ కర్మఫలాలు అనుభవించడానికే ఆ పుట్టుకలు. మనిషికి వివేకముంది. కనుక ఒక పని చేయనూవచ్చు, చేయకుండా ఉండనూవచ్చు. నరజన్మలోనే భగవత్సాక్షాత్కారం సాధ్యమవుతుంది. భగవత్సాక్షాత్కారం కానంతవరకు జీవి మరల మరల పుట్టవలసినదే!

భగవత్సాక్షాత్కారమే మానవ జీవితోద్దేశం అని శ్రీరామకృష్ణులు మొదట్లోనే చెప్పారు. ఇప్పుడు భక్తి లాభం కొరకే మనిషివై జన్మించావు అంటున్నారు. ఈ రెండింటి మధ్య సాదృశం ఉందా? నిజానికి భగవత్సాక్షాత్కారమే లక్ష్యం. అందుకు ఉపాయం భక్తి. ❖

అనువాదం: డాక్టర్ కమల జయరావు

జంతువులలో నరజన్మ కలుగుట దుర్లభమైనది. అందులోనూ పురుషుడై పుట్టుట మరింత కష్టం. విద్వాంసుడగుట మరీ కష్టమైనది. ఆత్మానాత్మ వివేకం కలుగుట మరెంత కష్టమో! – వివేకచూడామణి

మన సంస్కృతిలో ఎన్నో దేవతామూర్తుల ఉపాసనలను వివరించారు. ఆధ్యాత్మిక ప్రగతికి, ఆధ్యాత్మిక ఉన్నతికి అనువైన సాధనలన్నింటిలో ఉపాసన అతి ముఖ్యమైనది. ఈశ్వర చైతన్యం జగత్తు అంతటా సర్వవ్యాపకంగా, పరమసత్యంగా నిలిచి ఉంది. ఆ పరబ్రహ్మన్నే శివునిగా, విష్ణువుగా, గణేశునిగా, శ్రీరామునిగా, శ్రీకృష్ణునిగా, కాళిగా, లక్ష్మిగా, సరస్వతిగా – ఇలా ఏ రూపంలోనైనా పూజించవచ్చు. ఈ రూపాలన్నీ ఒకే భగవంతుడి, ఒకే ఈశ్వరుడి అంశలే. ఉన్న తత్త్వం ఒక్కటే! దాన్ని అర్థం చేసుకునేందుకే వివిధములైన ఉపాసనా పద్ధతులు తెలుపబడ్డాయి. ఈ తత్త్వాన్ని మనం సులభంగా అర్థం చేసుకునేందుకు, హిందూ మతాన్ని కర్బూజా పండుతో పోల్చవచ్చు. ఆ పండును పై నుండి, బాహ్యంగా చూస్తే అనేక విభాగాలుగా కనిపిస్తుంది. కానీ లోపల చూస్తే ఏకమైన స్వరూపసారమే ఉంటుంది. మన ఆరాధనలో భాగంగా ముందుగా దీన్ని బాగా అవగతం చేసుకోవాలి.

శాశ్వత మంగళస్వరూపుడైనవాడు శివుడు. ఆయనకు రెండు తత్త్వాలున్నాయి 1.సకల భక్తానుగ్రహకారకమైన సగుణ సాకార స్వరూపం. 2. నిరాకారం, నిర్గుణం, నిరంజనం, జ్యోతిర్మయ స్వరూపమైన లింగాకారం. లింగం నిరాకారతత్త్వానికి చిహ్నం.

ముందుగా, మనం శివలింగావిర్భావ ఘటనను చూద్దాం. అది మాఘ బహుళ చతుర్దశి. దట్టమైన చీకట్లు అంతటా వ్యాపించి ఉన్న అర్ధరాత్రి సమయం. కాటుక లాంటి ఆ చీకటిరేయిలో, ఆ అర్ధరాత్రి సమయాన ఒక సన్నటి కాంతి రేఖ పుడమిపై పొడచూపింది. నెమ్మది నెమ్మదిగా ఆ తేజఃపుంజం పెరగనారంభించింది. నాలుగు దిక్కులనూ, భూమ్యాకాశాలనూ తన వెలుగుతో నింపుతూ, ఆ కాంతి పుంజం అనంత తేజోలింగమై నభస్సులో నిలిచింది. దివ్యమైన ఆ లింగావిర్భావాన్ని గాంచి సృష్టిలోని సమస్త జీవరాశులూ తన్మయం చెందాయి. బ్రహ్మ, విష్ణు, ఇంద్ర, వరుణాది దేవతలంతా 'హరహర మహాదేవ' అంటూ ఆ కాంతి లింగానికి ప్రణమిల్లారు. ఈ విధంగా శివలింగావిర్భావం జరిగిన ఆ దివ్యమైన మాఘ బహుళ చతుర్దశినే మహర్షులు 'మహాశివరాత్రి'గా కీర్తించారు.

మన పురాణాలలోని కథలు, కథనాలు అంతర్లీనంగా దార్శనికతను కలిగి ఉన్నాయి. అలాగే లింగోద్భవ ఘట్టం కూడా అత్యద్భుతమైన దార్శనిక సత్యాన్ని కలిగి ఉంది. మనోబుద్ధ్యహంకార చిత్తాలు మొదలుకొని పంచభూతాత్మకమైన ఈ సమస్త సృష్టీ జడమయమైనదే. అంతటా అలముకున్న తమస్సు జడమయమైన సృష్టికి సూచన. జీవుడు తనను తాను ఈ జడమయ సృష్టిలో ఒక భాగంగా ఊహించుకుంటూ, రాత్రివేళ నిద్ర ఆవరించినట్లుగా, అజ్ఞానంచే ఆవరించబడి ఉన్నాడు. అలాంటి నిశీథిలో, జీవుని చేతస్సులో కాంతిరేఖ వంటి వివేకం జాగృతమైనది. జీవుని బుద్ధిలో ప్రతిబింబించిన ఆ వివేకస్ఫూర్తి క్రమక్రమంగా వైరాగ్యం, శమదమాది షట్క సంపత్తులతో, ముముక్షుత్వమనే కాంతితో ఎల్లెడలా నిండి జ్ఞానలింగమై

ఆవిర్భవించి, 'అహం బ్రహ్మాస్మి' అనే స్ఫురణను కలిగించింది. జడమనే చీకటి తొలగి, జ్ఞానమనే లింగదర్శనం చేసుకోగలగడమే – 'మహాశివరాత్రి అంతరార్థం'.

సర్వాంతర్యామిని సర్వత్రా దర్శించలేం కనుక, సాధనలో భాగంగా ఒక చిహ్నంగా, లింగంగా ఆరాధిస్తాం. ఈ చిహ్నం మనకు ఆయనను సర్వదా స్ఫురింపచేస్తూ, మనస్సును ఏకాగ్రపరిచేందుకు సహాయపడుతుంది. లింగరూపంలో భక్తుడు భగవంతుని ఉనికిని అనుభవిస్తాడు. భక్తి, ధ్యానం తీవ్రతరమైనప్పుడు భక్తుని హృదయం భక్త్యావేశంతో, సంభ్రమాశ్చర్యాలతో, నిరతిశయ ప్రేమభావంతో నిండి, అహంకార నాశనానికీ, హృదయ పవిత్రతకూ దారి తీస్తుంది. ఆత్మసాక్షాత్కారానికి ఇది ఒక సులభమైన మార్గం.

శివుడు అభిషేక ప్రియుడు కనుక శివపూజలో విశేషంగా అభిషేకం, ధూపదీప నైవేద్యాలు ప్రాధాన్యం సంతరించుకుని ఉన్నాయి. బాహ్యమైన ఈ ఆరాధనను సక్రమంగా నిర్వర్తిస్తే, హృదయం శివుని దివ్యభావాలతో నిండిపోయి, తాత్కాలికంగా

'శివం' సత్యం...సుందరం

– డాక్టర్ అపర్ణా శ్రీనివాస్

దేహాన్నీ, పరిసరాలనూ మరచిపోతాము. ఆ సమయంలో అహంకారం తాత్కాలికంగా నశిస్తుంది. రుద్ర పారాయణంతో, పంచాక్షరీ మంత్రజపంతో మనస్సు సత్త్వంతో నిండి పరిశుద్ధమవుతుంది. అలాంటి సత్త్వంతో నిండిన మనస్సును ఆహారం నుండి (రజోగుణ ప్రధానం), నిద్ర నుండి (తమోగుణ ప్రధానం) మరల్చేందుకే ఉపవాసం, జాగరణ అనేవి నిర్దేశితమయ్యాయి. జాగరణ అంటే అజ్ఞానమనే నిద్రను వదిలి జ్ఞానాన్ని కలిగి ఉండడమే.

ఆ పరమశివుడు అష్టమూర్తి తత్త్వంగా వర్ణించబడ్డాడు. పంచభూతాలుగా, సూర్యచంద్రులుగా, జీవునిలో అంతర్యామిగా ఉండే యజ్ఞేశ్వరునిగా ఎనిమిది రూపాలను కలిగి ఉన్నాడు. శివార్చనలో ఆ ఎనిమిది పేర్లనూ ఈ విధంగా చెబుతారు –

శర్వాయ (భూమి), భవాయ (జలం),
రుద్రాయ (అగ్ని), ఉగ్రాయ (వాయువు), భీమాయ (ఆకాశం), పశుపతయే (జీవుడు), మహాదేవాయ (సోముడు), ఈశానాయ (సూర్యుడు). వీరంతా మనలోనూ, మన చుట్టూ ఉన్న విశ్వంలోనూ వ్యాపించి ఉన్నారు. లౌకికంగా ఈ అష్టమూర్తులు మనకు మోదాన్ని కలిగిస్తున్నా, పారమార్థికంగా ఈ ఉపాసన 'సర్వం శివమయమ్' అనే లక్ష్యసిద్ధికి దోహదపడుతుంది.

ఏకోదేవః సర్వభూతేషు గూఢః సర్వవ్యాపీ సర్వభూతాంతరాత్మా!
కర్మాధ్యక్షః సర్వభూతాధివాసః సాక్షీచేతా కేవలో నిర్గుణశ్చ ॥

నిర్వికారుడు, నిరాకారుడు, సర్వాంతర్యామి, సర్వస్వతంత్రుడు, సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు, జ్ఞానసంపూర్ణుడైన ఆ ఆద్యంతరహితుని ఆరాధనం మనం ఏ విధంగా చేయగలం? తడుపలేనివానికి అభిషేకాలను చేస్తూ, దిక్కులనే కప్పుకున్నవానికి వస్త్రాలనిస్తూ, వాసనాతీతునికి గంధం అలదుతూ, తానుగా వెలిగే వానికి దీపాన్ని చూపుతూ, ఆకలే ఎరుగని వానికి నైవేద్యమిడుతూ, లోకాలన్నింటినీ చుట్టు ముట్టేవానికి ప్రదక్షిణలు చేస్తూ ఉన్నాం. భగవంతుడు పరిపూర్ణుడు, ఆయన తత్త్వం మానవ మేధస్సుకు అందని విషయం. అయితే మేధస్సుకు ఉపాసన తోడైతే, ఈశ్వర కృప లభించి మార్గం సుగమం అవుతుంది. ఆ శివతత్త్వంతో మనస్సును అనుసంధానం చేసి, తన్మయం చెందేందుకే శివలింగానికి అభిషేకాలు, పూజాదికాలు నిర్వహిస్తాం. వాటిని ఏ విధంగా చేయాలో ఈ ప్రతీకాత్మక వివరణ ద్వారా చూద్దాం.

పూజా కార్యక్రమంలో, ఘంటానాదం బాహ్యశబ్దాలను నిరోధిస్తూ మనస్సును అంతర్ముఖం చేసేందుకు ఉపకరిస్తుంది. భగవంతుడు జ్యోతి స్వరూపుడై, స్వయం ప్రకాశితమైన కాంతితో సూర్యచంద్రాగ్నులను ప్రకాశింపచేస్తూ ఉన్నందున, మనలోని అంధకారాన్ని తొలగించి, బుద్ధిని ప్రకాశింపజేయమని ప్రార్థించడమే దీపారాధన ప్రాశస్త్యం. ధూపపరిమళం ఏ విధంగా సర్వత్రా వ్యాపిస్తుందో, ఆ విధంగా భగవంతుని అస్తిత్వం ఈ విశ్వమంతా నిండి ఉందని స్మరించుకునేందుకు ధూపం సహకరిస్తుంది. గంధపు చెక్కను కరుకు రాతిపై సాన పెడితేనే దివ్య పరిమళాల చందనం లభ్యమవుతుంది. జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా, సహనంతో ఉంటూ ప్రేమ పరిమళాలను వెదజల్లాలనే సందేశాన్ని చందనం మనకు తెలియ జేస్తుంది. అనాదిగా మనస్సులో పేరుకుపోయిన అహంకారాన్ని జ్ఞానాగ్నిలో వేస్తే బూడిదై చివరకు మిగిలేది స్వచ్ఛమైన ఉనికే! ఇదే శివుని విభూతి.

ఇంక శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన అభిషేకం గురించి చూద్దాం. సాధనలో మానవులకు పంచక్లేశాలు ఆటంకాలుగా నిలుస్తాయి. అవి అవిద్య (అజ్ఞానం), అస్మిత (అహంకారం), రాగం (కోరిక), ద్వేషం, అభినివేశం (లౌకిక జీవనంలో ఆనందం పొందాలనే తాపత్రయం). సాధకులైనవారు ఈ పంచక్లేశాలను తొలగించుకునేందుకు భక్తి, జ్ఞానం, నిష్కామకర్మ, వివేకం, వైరాగ్యమనే పంచామృతాలతో అభిషేకం చేయాలి. అలా చేయగలిగిననాడు జీవాత్మ, పరమాత్మ అనే భేదస్థితి తొలగి, ఏకస్వరూప సాక్షాత్కారం కలుగుతుంది. అయితే ముందుగా భౌతికమైన పదార్థాలతో చేసే అభిషేకాలు శివునిపై భక్తి, విశ్వాసాలను పెంపొందించి, చివరకు పరిశుద్ధ ప్రేమ ప్రవాహమనే శాశ్వత అభిషేకానికి దారి తీసేలా చేస్తాయి. ఈ విధంగా హృదయపద్మంలోని ఆత్మ లింగంపై శుద్ధప్రేమ అనే అభిషేకంతో ముంచెత్తినందునే, భక్త కన్నప్ప ఎంగిలినీటితో అభిషేకం చేసినా, ఆ అవ్యాజభక్తికి మురిసిపోయి భోళాశంకరుడు సాయుజ్యాన్ని అనుగ్రహించాడు.

ఈ విధంగా శివరాత్రి పర్వదినాన్ని భక్తి, విశ్వాస, జ్ఞానాలతో, అకుంఠిత దీక్షతో, ఆ సదాశివుణ్ణే మనస్సులో నిలుపుకొంటూ, సర్వుల ఎడల ఆ శంకరకృప వర్షించాలని ప్రార్థిద్దాం. ❖

ఆత్మను దర్శించిన మహాత్ములకు ఈ జగత్తంతా ఒక నందనవనం; చెట్లన్నీ కల్పవృక్షములు; ప్రవాహములన్నీ పావన గంగా జలములు; పృథ్వి అంతా వారణాసిగా కనిపిస్తాయి. – ధన్యాష్టకమ్

సాఫల్యతకు సాధనం!

– శ్రీమతి భమిడిపాటి బాలాత్రిపురసుందరి

మనిషి కుటుంబ బంధాలకు సులభంగా లొంగిపోతాడు. కొడుకు ఎంతటి దుర్మార్గుడైనా, 'అమ్మా! నాన్నా!' అని పిలవగానే అక్కున చేర్చుకుంటారు. 'వీడు పరమ దుర్మార్గుడు. వీణ్ణి దూరంగా ఉంచితే మిగిలిన పిల్లలు, బంధువర్గం, వంశం బాగుంటుంది' అనే ఆలోచన రాదు. బంధం అటువంటిది.

దుర్యోధనుడు జన్మించినప్పుడు మేఘాలు రక్తాన్ని వర్షించాయట. నక్కలు కూశాయట! అన్నివైపులా అపశకునాలే కనిపించాయి. విదురుని వంటి జ్ఞానులు ధృతరాష్ట్రునికి చెప్పారట... ఈ బాలుణ్ణి ఒక్కణ్ణీ వదిలేస్తే వంశం నిలబడుతుంది. ప్రజలు సుఖంగా ఉంటారని! ధృతరాష్ట్రుడు మాత్రం "వాడు నన్ను 'నాన్నా!' అని పిలవగానే నా హృదయం పులకరిస్తుంది. వాడి మాటకు ఎదురుచెప్పను!" అన్నాడట! చివరికి వృద్ధాప్యంలో వంశం నాశనమై, ధర్మరాజు పంచన చేరాడు ధృతరాష్ట్రుడు.

పెద్దలు ఎవరైనా ఇంటికి వస్తున్నారంటే ఎదురు వెళ్ళడం సంస్కారం. ఇంటి పెద్ద అవ్వొచ్చు, వృత్తిలో పెద్ద అవ్వొచ్చు. యోగి ఎవరైనా కావచ్చు... ఎదురెళ్ళి తీసుకువస్తాము. వచ్చే వ్యక్తి సద్గుణ సంపన్నుడు, సంస్కారవంతుడు, యోగి పుంగవుడు, ధర్మాత్ముడు అయినప్పుడు సామాన్యంగా కాక భక్తి భావంతో వినమ్రతతో ఎదురు వెళతాము.

శ్రీకృష్ణుడు పాండవులకు అర్ధరాజ్యం అడగడానికి ధృతరాష్ట్రుని ఇంటికి వస్తున్నాడని తెలిసి "సర్వానికి ప్రభువైనవాడు, శరణు అన్న వాళ్ళను రక్షించేవాడు, భక్తులకు కల్పవృక్షం వంటివాడు, అనంత శక్తి సంపన్నుడైన శ్రీకృష్ణుడు వస్తున్నాడు!" అనుకుంటూ బ్రాహ్మణ సమూహాలు వేదఘోషలతో ఎదురు వెళ్ళాయట.

వివేకవంతుడు తనను ఎవరైనా దూషించినప్పుడు తిరిగి దూషించడు.తన తప్పేమిటో తెలుసుకోవడానికి ప్రయత్నిస్తాడు. నిందలు పడినప్పుడు దాని నిజతత్త్వం గ్రహించడం సంస్కారవంతులు చేసే పని. అవమానపడినప్పుడు సహజంగా కోపం తెచ్చుకోవడం సామాన్యుడు చేసే పని. దుర్యోధనుడు నిండు సభలో విదురుణ్ణి "దాసీ పుత్రుడవైన నీకు పట్టెడన్నం పెడుతున్నాము. నా తిండి తిని నాకే ఎసరు పెడతావా? దాసీపుత్రుడవైన నీకు ఈ సభలో ఇంతటి ఉన్నత స్థానమా? ఎవడురా అక్కడ? వీణ్ణి బయటకు గెంటెయ్యి!" అంటాడు.

దుర్యోధనుడి పరుషవాక్కులు విన్న విదురుడు తిరిగి ఏమీ అనకుండా సహనం వహిస్తాడు. అప్పుడు 'ఇంత దుర్మార్గుని ఇంట చాలా కాలంగా తింటున్నావు. ఇంక చాలు. నువ్వు ఎక్కడికి వెళ్ళినా జీవించగలవు. వెళ్ళిపో!' అని స్వయంగా భగవంతుడే తనకు ఈ విధంగా తెలియజేశాడని భావించి తీర్థయాత్రలకు వెళ్ళిపోయాడు.

సాధనేష్వపి సర్వేషు తితీక్షోత్తమ సాధనమ్ ।
యత్ర విఘ్నాః ఫలాయంతే దైవికా అపి భౌతికాః ॥

'జీవితాన్ని సఫలం చేసుకోవడానికి సహనమే ఉత్తమ సాధనం. ఓర్పు వల్ల ఏ పనైనా విఘ్నం లేకుండా జరుగుతుంది'.

మహాత్ములు నిందను ఎందుకు సహిస్తారు? నిందించేవాడు ఎవర్ని నిందిస్తున్నాడో అతడికి తన పుణ్యాన్నిచ్చి అతడి పాపాన్ని పొందుతాడు. ఈ నిజాన్ని తెలుసుకోలేక తిరిగి కోపాన్ని ప్రదర్శిస్తాడు. దీని వల్ల ఆత్మ శక్తి క్షీణిస్తుంది.

క్షమావతామేవహి కార్యసిద్ధిః స్వరాజ్యలక్ష్మీ సుఖభోగ సిద్ధిః ।
క్షమావిహీనా నిపతంతి విఘ్నైః వాతైర్హతా పర్ణచయా ఇవద్రుమాత్ ॥

'క్షమించే గుణమున్నవాడు భూదేవితో సమానుడు. అతడి సర్వకార్యాలూ సిద్ధిస్తాయి. అది లేనివారికి అన్ని కార్యాల్లోనూ విఘ్నాలే కలిగి, చెట్టు నుండి రాలే ఆకులా పడిపోతాడు'.

మంచిలో మంచిని గుర్తించడం సామాన్యుల లక్షణం. ఆ విధంగా గుర్తించని వాళ్ళు కూడా ఉన్నారు. అది వాళ్ళ ప్రత్యేక లక్షణం. చెడులో కూడా మంచిని చూడడం వివేకవంతుల లక్షణం. ప్రతి పనిలోనూ మంచి చెడ్డలు రెండూ ఉంటాయి. ప్రతిస్పందన మాత్రం మన సహనం మీద ఆధారపడి ఉంటుంది. ❖

ధీరవాణి

- స్వామి వివేకానంద

భావితరాలకు ప్రత్యక్ష నిదర్శనం

శ్రీరామకృష్ణుల జీవితం ఒక దివ్యజ్యోతి, దాని అద్భుతతేజంలో హిందూమత పరావధి అంతా యథార్థరూపంలో అర్థం చేసుకోవచ్చు. శాస్త్రాలలో ప్రతిపాదించిన తత్త్వజ్ఞానాని కంతటికీ ఆయన ప్రత్యక్ష నిదర్శనం. ఋషులు, అవతార పురుషులు దేన్ని బోధింపనెంచారో ఆ తత్త్వాల నన్నింటినీ ఆయన తన జీవితంలో ప్రదర్శించారు. గ్రంథాలనేవి సిద్ధాంతాలు; శ్రీరామకృష్ణులు వాటి ఆచరణ, అనుభవం.

ఐదువేల సంవత్సరాల జాతీయ ఆధ్యాత్మిక జీవితాన్నంతా శ్రీరామకృష్ణులు తన యాభై ఒక్క సంవత్సరాల జీవితంలో జీవించి, భావితరాల వారికి తానొక ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచిపోయారు. ద్వైతం, విశిష్టాద్వైతం, అద్వైతం అనేవి ఆత్మవికాసానికి క్రమావస్థలు. ఈ అవస్థా సిద్ధాంతాన్ని శ్రీరామకృష్ణుల ద్వారా వ్యాఖ్యానించవచ్చు. శాస్త్రాలకు సామరస్యం కూర్చవచ్చు. మనం ఇతర మతాల పట్ల సహనం చూపడం మాత్రమే కాక, అన్యమతాలు కూడా మోక్షమార్గాలే అని మనఃపూర్వకంగా అంగీక రించాలనీ, సత్యమే అన్ని మతాలకూ ఆధారమనీ శ్రీరామకృష్ణుల సిద్ధాంతం తెలుపుతోంది.

సర్వమతాలనూ సమానంగా చూడడం అనే దానికి, అవసరమనిపిస్తే దేన్నైనా త్యాగం చెయ్యాలి. నేను జీవించినా లేక మరణించినా ముఖ్యంగా ఈ సర్వమత సమదర్శనమనే దాన్ని మరువవొద్దు. సర్వమత సహనం మాత్రమే కాదు. మతాలన్నీ మోక్షమార్గాలే అని మనస్ఫూర్తిగా అంగీకరించండి. ఇతరుల హక్కులను అణచివేయకుండా జాగ్రత్తపడాలి. మహత్తరమైన అనేక ఓడలు ఈ సుడిగుండంలో చిక్కుకుపోయాయి. దురభిమానం లేని, శుద్ధభక్తినే మనం ప్రదర్శించాలనే విషయాన్ని మరువవద్దు.

భారతదేశం ఎంతోకాలం బాధలకు లోనైంది. సనాతన ధర్మం ఎంతోకాలం కష్టాల పాలైంది. కానీ భగవంతుడు దయామయుడు. తన బిడ్డలను ఉద్ధరించడానికి ఆయన మరోసారి అవతరించాడు. బాగుపడడానికి అనాథలకు మరొక అవకాశం దక్కింది. శ్రీరామకృష్ణుని పాదాక్రాంతమైతేగానీ భారతదేశం ఉద్ధరింపబడదు. ఆయన జీవిత సందేశాలు దేశదేశాంతరాలలో వ్యాప్తి చెందాలి. హైందవ సంఘంలోని నరనరాలలోకి అవి పాకిపోవాలి. దీన్ని సాధించగలవారెవరు? శ్రీరామకృష్ణ ధ్వజాన్ని చేబూని, లోకవిముక్తికై ముందుకు ఉరికేవారెవ్వరు? పేరు ప్రతిష్ఠలనూ, భోగభాగ్యాలనూ, తుదకు ఐహిక ఆముష్మిక భోగాలను సైతం త్యజించి, దేశానికి దాపురించిన ఈ అధోగతిని అడ్డగించేవారెవరు? ఏ కొద్దిమంది యువకులో ఆత్మార్పణ గావించి, ఈ గండిలోకి దూకారు. కానీ వాళ్ళను వేళ్ళ మీద లెక్కించవచ్చు. అలాంటి వారు మనకు వేలమంది అవసరం. వారు వచ్చే తీరుతారు. ❖

శ్రీరామకృష్ణుల జీవిత చరిత్రను చదివినవారు 'భగవంతుడే సత్యం, మిగిలినదంతా అసత్యం' అని విశ్వసించకుండా ఉండలేరు. ఆయన జీవితం భగవంతుణ్ణి దర్శింపజేస్తుంది. -మహాత్మా గాంధీ

శ్రీరామకృష్ణులను అర్థం చేసుకోవడానికి ప్రపంచమంతటా వివిధ కోణాల నుండి అధ్యయనం చేస్తున్నారు. కనుక ఆయన అవతరణ వ్యర్థం కాలేదని తెలుస్తోంది. కానీ ఆయనను పూర్తిగా అవగాహన చేసుకోలేకపోతున్నాం. కారణం, మనం ఆ ఆధ్యాత్మిక గాంభీర్యాన్ని పొందలేదు. కనుక, భక్తులు కొంత ఆత్మపరిశీలన చేసుకోవడం అవసరం. ఇందు మూలంగా, మనం శ్రీరామకృష్ణుణ్ణి మన జీవితాల్లో ఎంత వరకు ప్రతిష్ఠించుకున్నామో తెలుస్తుంది. మనం గమ్యానికి ఎంత చేరువలో ఉన్నామో తెలుస్తుంది. బియ్యం చెరుగుతున్నప్పుడు, అడపాదడపా కొంచెం చేతిలోకి తీసుకొని, శుభ్రం అయినాయో లేదో చూస్తాం. ఆ విధంగానే మనం ఎంత

ఆయనే మార్గం! ఆయనే గమ్యం!!

– స్వామి భూతేశానంద (రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు)

శుద్ధత, స్వార్థరాహిత్యం, భక్తి అలవరచుకున్నామో మాటిమాటికీ పరీక్షించుకోవాలి. శ్రీరామకృష్ణుణ్ణి స్తోత్రాలతో స్తుతించడం కాదు. జీవితంలో వేసే ప్రతి అడుగూ ఆయనను ప్రతిబింబింప చేయాలి. మనం ఆయనను ఎంతగా ప్రేమిస్తే, మన నడవడిక అంతగా ప్రభావితమవుతుంది.

ఒక మనిషి నడవడిక చూసి, సంస్కారవంతుడో కాడో చెప్పగలం. కనుక శ్రీరామకృష్ణుని భక్తులు తమ ఆధ్యాత్మిక వంశపరంపరను మరువకూడదు, తప్పటడుగులు వేయరాదు. 'భగవంతుణ్ణి ఆశ్రయించినవారి కళ్ళకు గంతలు కట్టినా, క్రింద పడకుండా దౌడు తీయగలర'ని భాగవతం చెబుతోంది. 'పరుసవేదికి తాకించిన కత్తి బంగారం అవుతుంది. దాని రూపు కత్తి మాదిరే కానీ గాయపరచదు' అనేవారు శ్రీరామకృష్ణులు.

పరుసవేది మనల్ని కూడా మార్చగలదు. కానీ మనం బంగారంగా మారలేదంటే, మనం పరుసవేదిని తాకలేదన్న మాట. గోపికలు శ్రీకృష్ణుడి కొరకు వనమంతటా వెదకారు, కానీ ఆయన జాడ లేదు. ఆయన సౌరభం ముక్కుపుటాలకు తాకుతున్నది కనుక ఆయన ఈ త్రోవనే వెళ్ళి ఉంటారని ఒక గోపిక అంది. దీని తాత్పర్యం ఏమంటే, దైవస్పర్శ ఇసుమంత తగిలినా మన జీవితాలు శుద్ధమవుతాయి. ఇది లేనప్పుడు, మేము రామకృష్ణ భక్తులమని ఎంత ఎలుగెత్తి చాటినా, నిజానికి రామకృష్ణ జ్యోతి మనలో వెలగడం లేదన్నమాట.

శ్రీరామకృష్ణుని వంటి అవతార ఆగమనం ఎంతో అపురూపమైనది. ఆయన కృపాకటాక్షాన్ని పొందలేకపోతే, మనజన్మ వ్యర్థమైనట్లే కదా! శ్రీరామకృష్ణుడు చరిత్ర పుటల్లో ఇంకా మరుగైపోలేదు. ఆయన అద్భుత స్పర్శ మనకు ఇంకా ఎంతో స్పష్టంగా తెలుస్తోంది. అయినా మన జీవితాలు శుద్ధం కాలేదంటే, మన ఆధ్యాత్మికాన్వేషణ తీవ్రతరం కాలేదని అర్థం. లాంతరు దీపం క్రింద భాగం చీకటిగా ఉంటుంది, లాంతరు వెలుతురు దూరంగా ప్రకాశిస్తుంది! మనదేశంలో జన్మించిన శ్రీరామకృష్ణుల గురించి పాశ్చాత్యులు తెలుసుకొనే ప్రయత్నం చేస్తున్నారు. కానీ మనం ఆయన గురించి తెలుసుకోవడానికి ప్రయత్నించడం లేదు. మనది ఎంత దౌర్భాగ్యం! వైద్యుడు ఉన్నాడు, ఔషధాలు ఉన్నాయి. రోగి వైద్యుడి మాట పెడచెవిన పెట్టి, ఔషధం సేవించకపోతే, వ్యాధి నయమవుతుందా? శ్రీరామకృష్ణ తరంగాలు మన చుట్టూ లేచి పడుతున్నాయి.

ఆ అమృత సాగర తీరంలో కూర్చొని కూడా మనం దప్పికతో అలమటిస్తున్నాం.

జగద్రక్షకుడు వచ్చేది ఏ కొంతమంది కోసమో కాదు. ఆయన ప్రభావం ఎంతోదూరం పయనిస్తుంది, ఎంతో కాలం ఉంటుంది. 'శ్రీరామకృష్ణుడు మా వాడు' అంటే సరిపోదు, మనం ఆయన చేత ఎంతగా ప్రభావితమైనామని యోచించాలి. మన ప్రయత్నాలలో తీవ్రత కానీ, నిజాయతీ కానీ లేవు. ఏవో జపధ్యానాలు చేస్తాం తప్ప, ఆయనను హృదయపూర్వకంగా ఆహ్వానించడం లేదు. ఆయన బోధనానుసారం మన జీవితాలను మలుచుకోవాలి. మన హృదయాలు ఎంత పవిత్రంగా ఉన్నాయో పరిశీలించుకోకుండా, ఇతరులకు బోధించడానికీ, వారి జీవితాలను మార్చడానికీ పరుగులు పెడతాము. ఇతరుల దోషాలను లెక్కించే ముందు, మన దృష్టిని శుద్ధపరచుకోవాలి.

శ్రీరామకృష్ణుల పటానికి పూలమాలలు అలంకరిస్తాం, కానీ ఆయన బోధనలను ఆకళింపుచేసుకోము. చదవనే చదవని బోధనలను ఆచరణలో ఎలా పెట్టగలం చెప్పండి? ఇక రామకృష్ణుల భక్తులమని చెప్పే అర్హత మనకున్నదా? కథామృతం చదివే సమయం లేదని చాలామంది నాతో అంటారు. లోకంలో అన్ని పనులూ చక్కబెట్టడానికి సమయం ఉంటుంది కానీ మంచి ఆలోచనలతో స్ఫూర్తి పొందడానికి సమయం ఉండదు.

ఒక ఆసామి తనకు జ్ఞానం వలదనీ, శుద్ధభక్తి మాత్రమే కావాలనీ శ్రీరామకృష్ణులతో అన్నాడు. 'నీ ప్రియుణ్ణి గురించి నీకు ఏమీ తెలియకపోతే, నువ్వు ఆయనను ఎలా ప్రేమించగలవు?' అన్నారు శ్రీరామకృష్ణులు. శ్రీరామకృష్ణుల గురించి ఎంతో కొంత జ్ఞానం లేనిదే, ఆయన భక్తులం అవగలమా చెప్పండి. మనకు తెలిసినదల్లా ఆయన పేరు మాత్రమే. అది మన జీవితాలను ఎలా ప్రభావితం చేయగలదు? దీని గురించి మళ్ళీ మళ్ళీ లోతుగా ఆలోచించాల్సిన అవసరం ఉంది.

రామకృష్ణ కథామృతంలో ఇక్కడ కొన్ని పుటలు, అక్కడ కొన్ని పుటలు చదివామని చెబుతారు. సంసార బాధ్యతలను పక్కకు పెట్టలేరట. వీరికి సినిమాల గురించి, సినిమా తారల గురించి వివరంగా తెలుసు. కానీ, శ్రీరామకృష్ణుని గురించి ఏమీ తెలియదు! ఈ మాటలు వింటుంటే, నా హృదయం వేదనాభరితం అవుతుంది. 'ఒక చేతితో భగవంతుడి పదారవిందాలను గట్టిగా పట్టుకొని, రెండవ చేతితో లౌకిక వ్యవహారాలు చక్కబెట్టమ'ని శ్రీరామకృష్ణులు పలుమార్లు చెప్పారు. భగవంతుడినో లేదా వ్యవహారాలనో మాత్రమే పట్టుకొనమని చెప్పలేదన్నది గమనార్హం. అందరూ సన్న్యాసం స్వీకరించాలని చెప్పలేదు. సన్న్యాసం కావాలని వచ్చిన ఎందరినో... తల్లితండ్రులనూ, భార్యా పిల్లలనూ చూచుకోమని తరిమివేశారు కదా!

శ్రీరామకృష్ణుల జీవన ఆలంబనం - భగవంతుడు. 'నాకు అమ్మ తప్ప మరేమీ తెలియదు, నమ్మండి' అని పదేపదే అనేవారు. ఆయన జీవితాన్ని మలచినది ఈ దృఢ విశ్వాసమే. దీన్నే ఆయన లోకానికి ఒక నిదర్శనంగా చూపి, నిలబెట్టారు. ఆయన జీవించింది లోకకల్యాణం కోసం! సమాధి అవస్థ ఆయనను ముంచెత్తబోతున్న సమయంలో ఆయన, 'అమ్మా! నన్ను పూర్తిగా ముంచివేయకు తల్లీ! నేను భక్తులతో సంభాషించాలి' అని వేడుకొనేవారు. భక్తుల కోసం శరీర బాధలను భరించారు.

'నీవు పెద్ద మర్రిచెట్టులా ఎందరికో ఆశ్రయం ఇవ్వాలి. తుచ్ఛమైన సమాధి అవస్థను అభిలషించకు' అని నరేంద్రుణ్ణి చీవాట్లు పెట్టారు. భగవంతుణ్ణి మరచి, సంసారంలోని ఈతిబాధలతో సతమతమవుతున్నవారి కష్టాలను నిర్లక్ష్యం చేయడం ఆయన దృష్టిలో ఒక మహా పాతకం. 'ఈ దేహం ఎన్నడూ అశుద్ధం అవలేదు. అనేకమంది పాపుల భారాన్ని స్వీకరించినందుకే ఈ వ్యాధి వచ్చింది' అన్నారు.

శ్రీరామకృష్ణుల లాగా తన జీవితాన్ని లోకం ఎదుట ఒక సజీవ నిదర్శనంగా నిలబెట్టిన వ్యక్తి మరొకరు కనపడరు. మన శాస్త్రాల దృక్పథం ఎంతో విశాలమైనది అని అంటాము. కానీ మన నడుమ ఎన్ని భేదాభిప్రాయాలో, ఎన్ని మతకలహాలో! 'అన్ని మతాలూ ఆ ఒక్క భగవంతుణ్ణి చేర్చే మార్గాలు' అని నిరూపించారు శ్రీరామకృష్ణులు. ఎన్నో ఏళ్ళు తపస్సాధనలు చేయవలసిన అగత్యం ఆయనకు ఏముంది? కానీ, ఆయన లోకకల్యాణం కోసం తన శరీరంలోని ప్రతి నెత్తుటిబొట్టునూ వెచ్చించారు. ప్రాణాంతకమైన వ్యాధితో శరీరం జీర్ణమైనా, మిగిలిన జీవితకాలాన్ని మానవ శ్రేయస్సుకే వినియోగించారు.

బుద్ధుడు అవసాన దశలో పరుండి ఉండగా, అల్లంత దూరాన ఎవరో ఉపదేశం కొరకు వేచి ఉండడం చూశాడు. సమయం మించిపోయిందనీ, బుద్ధుడు పరినిర్వాణానికి సమాయత్తమవుతున్నాడనీ ఆయన శిష్యులు ఆగంతకునికి తెలిపారు. కానీ వారిని రప్పించమని ఆనందుడిని పురమాయించాడు బుద్ధుడు. ఆయన తన చివరి శ్వాసను మరొక జీవికై వెచ్చించదలచాడు. బుద్ధుని చివరి కాలానికీ, శ్రీరామకృష్ణుల చివరి దినాలకూ ఎంతో సామ్యమున్నది.

దురదృష్టమేమిటంటే, శ్రీరామకృష్ణ లీలానాటకాన్ని ఇంత సన్నిహితంగా చూసిన మనం, నిమ్మకు నీరెత్తినట్లున్నాం. ఇరుగు పొరుగు కష్టాలు మనకు పట్టవు. ఒక్క పూట తిండిలేక మలమలలాడుతున్న దైన్యం ఒక ప్రక్క, విలాసాలకు విచ్చలవిడిగా ధనం వెదజల్లగలిగే వెగటు పుట్టించే సంపద మరొక ప్రక్క - ఈ తీవ్ర తారతమ్యం పట్ల ఉదాసీనంగా ఉన్నాం. ఇక మనకు ఆధ్యాత్మిక పురోగతి ఎలా సాధ్యం? దేశప్రజల ఆర్తనాదాలకు స్పందించిన హృదయమున్న శ్రీరామకృష్ణుని దేశంలో ఈ ఔదాసీన్యం!

శ్రీరామకృష్ణులు సన్న్యాస గృహస్థులకూ, పేద ధనికులకూ, పండిత పామరులకూ ఉపయుక్తమైన ఒక విశ్వజనీన ఆదర్శాన్ని చూపించారు. శ్రీరామకృష్ణుల భక్తులమైన మనం ఆయన బోధనలను మన జీవితాలలో ఎంతవరకు ఆచరించగలుగుతున్నాం? ఆయన బోధనలను ఆకళింపుచేసుకునేందుకు ఎంత మందిమి ఉత్సుకతతో ప్రయత్నిస్తున్నాం? శ్రీరామకృష్ణ భక్తులుగా మనమంతా ఎప్పటికప్పుడు ఆత్మపరిశీలన చేసుకొని, ఆయనే మన మార్గం, ఆయనే మన గమ్యంగా విశ్వసించి ఆధ్యాత్మిక పథంలో పురోగమించడానికి ప్రయత్నించాలి. అదే మన లక్ష్యం కావాలి. ❖

అనువాదం: డాక్టర్ కమల జయరావు

నాస్తికత్వం ఉచ్ఛస్థితికి చేరిన సమయంలో, మానవాళి ఇంద్రియభోగాలలో పూర్తిగా మునిగిన సమయంలో ఆధ్యాత్మికజీవన ఔన్నత్యాన్ని చాటిన అవతారపురుషులు శ్రీరామకృష్ణులు - అరవిందయోగి

త్రిభాషా సూత్రం!

– స్వామి శితికంఠానంద

కొద్దిరోజుల క్రితం హైదరాబాద్ రామకృష్ణ మఠంలో ఉన్న వివేకానంద వాణీసంస్థకు ఒక వ్యక్తి వచ్చి 'స్వామీజీ! నేను కేబుల్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాను. నెలకు లక్షరూపాయలు సంపాదిస్తున్నాను. కానీ నాకు ఆంగ్లభాష రాదు. నేను ఏడవ తరగతి వరకు మాత్రమే చదువుకున్నాను. మా అమ్మాయి చదివే పాఠశాలలో అందరు తల్లిదండ్రులు కొద్దోగొప్పో ఆంగ్లంలో మాట్లాడుతున్నారు. కాబట్టి పదవ తరగతి చదివిన వారికే భాషా బోధన అన్న నిబంధనను కొంచెం సడలించి నాకు మీ వాణీ సంస్థలో ప్రవేశం ఇప్పించండి' అని అడిగాడు. అలానే పదోన్నతి కోసమని ఉద్యోగాలలో ఉన్నవారు; పిల్లలకు హోమ్‌వర్కులో సహాయం చేయటానికని గృహిణులు; పాఠశాలలలో విద్యార్థులకు పాఠాలు బాగా బోధించటానికని ఉపాధ్యాయులు; విదేశాలలో పుట్టి పెరుగుతున్న మనుమలు, మనవరాళ్ళతో సంభాషించటానికని నడివయస్సుపైబడిన వారు; అనువాదం చేసి జాతీయ, అంతర్జాతీయ వార్తలను ప్రాంతీయ భాషలలో అందించటానికని ఛానళ్లలో, దినపత్రికలలో పనిచేసే పాత్రికేయులు; వ్యాపార అభివృద్ధికి వ్యాపారంలో ఉన్నవారు; పోటీ పరీక్షలు రాయటానికి, మౌఖిక పరీక్షలను ఎదుర్కోవటానికి నిరుద్యోగులు; తరగతి గదిలో పాఠాలను బాగా అర్థంచేసుకోవడానికి విద్యార్థులు.. ఇలా ఒక వర్గమని కాదు, ఒక వయసు వారని కాదు..అందరూ నేడు ఆంగ్ల భాషను నేర్చుకునేందుకు ఆరాటపడుతున్నారు.

భాషావైవిధ్యం : భారతదేశం బహుభాషా దేశం. రాజ్యాంగం గుర్తించిన భాషలే 22. ఇంకా స్థానికంగా వివిధ జాతులు, తెగలవారు, గిరిజనులు మాట్లాడే లిపిలేని భాషలు...అన్నీ కలిపితే పదహారువందల పద్దెనిమిది భాషలున్నాయి. ప్రపంచంలో మరేదేశంలోనూ ఇంతటి భాషావైవిధ్యం లేదు. ప్రతివిషయంలోనూ వైవిధ్యంతో సుసంపన్నమైన, పరిపుష్టమైన ఈ దేశంలో ఇదొక వైవిధ్యం. ఇలా అనేక భాషలు గల దేశానికి ఒక ఉమ్మడి భాష కావల్సి వచ్చింది. మార్గాంతరం లేక, బ్రిటీష్ పాలకులు వదిలి వెళ్ళిన ఆంగ్లభాష ఉమ్మడి భాషగా అవతరించింది. ఇది యాదృచ్ఛికంగా జరిగిన పరిణామం.

ఇప్పుడు అంతర్జాలం (ఇంటర్‌నెట్) రావటం వలన ప్రపంచం ఒక గ్రామమయిపోయింది. ప్రపంచీకరణ నేపథ్యంలో దేశాల భౌగోళిక ఎల్లలు అప్రధానాలైనాయి. వ్యాపారం ప్రపంచాన్ని ఏకీకృతంచేసే శక్తిగా ఎదిగింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకునే ప్రక్రియలో కంప్యూటర్ లేని రంగంలేకుండా పోయింది. కంప్యూటర్ భాష ఆంగ్లం అయినందువలన, ఈ కంప్యూటర్లు ప్రతిరంగంలో అనివార్యమైనందున, అందరూ ఆంగ్లభాషను నేర్చుకోవాల్సి వస్తున్నది. ఈ పరిస్థితులలో ప్రపంచ ప్రజల మధ్య భావవ్యక్తీకరణకు, భావవినిమయానికి ఒక భాష అవసరమైంది. ముప్ఫైఐదు దేశాలకు పైగా మాట్లాడే ఆంగ్లభాష ఆ విధంగా, అందుబాటులో ఉన్న ఏకైక మార్గంగా ప్రపంచానికి అనుసంధాన(*lingua franca*)భాషయైనది. ఈ పరిణామం మంచిదా కాదా అన్న విషయంపై చర్చ అనవసరం. ఎందుకంటే ఇదొక అప్రయత్నపూర్వక, వ్యక్తి ప్రమేయం లేని పరిణామం కనుక. కానీ భారతీయులమైన మనం ఆంగ్లభాషలో మాట్లాడటం ఆధునికతకు, అభ్యుదయానికి సూచిక అనుకోవటం అవివేకం.

ప్రస్తుతం ప్రపంచాన్ని శాసిస్తున్నది రాజకీయాలు కాదు, సైనిక బలం కాదు. వ్యాపారమే ప్రస్తుతం ప్రపంచాన్ని శాసిస్తున్నది. వ్యావహారిక జీవితానికి సంబంధించిన విషయాలకు మాత్రం బాగానే ఉపయోగపడే ఆంగ్ల భాష నిజమైన అభ్యుదయానికీ, పారమార్థిక ప్రయోజనానికీ భారతీయ భాషలలాగా ఉపకరించదు. ఆంగ్లంలో ఇంద్రియపరమైన జీవితమే పరమోత్కృష్ట జీవనమని జీవితానికి అర్థం చెప్పే పుస్తకాలే ఎక్కువ. ఇప్పుడు ఈ భాషలో కూడా చాలా ఆధ్యాత్మిక గ్రంథాలు లభ్యమవుతున్నప్పటికీ, ఆంగ్లం భారతీయ భాషలలాగా పారమార్థికత మూలంగా ఉన్న భాష కాదు. భారతీయ భాషలన్నీ సంస్కృత భాషనుంచే ఉద్భవించినవి కాబట్టి వాటిలో ఆధ్యాత్మిక భావాలు మెండుగా ఉన్నాయి. ఆ విధంగా భారతీయ భాషలన్నీ దైవపరమైనవి. ఋషులు మాట్లాడిన భాషలు.

అనుకరణే మన పాలిటి శాపం: ఆధునిక జీవితానికి, ఉపాధికి అవసరమైన భాష అనుకుని ఆంగ్లం నేర్చుకోవటం మంచిదే. కానీ ఆ ప్రక్రియలో మాతృభాషను, మన ధార్మిక గ్రంథాలన్నీ వ్రాయబడిన సంస్కృతాన్ని పూర్తిగా విస్మరిస్తున్నాం. ఇది హర్షించదగ్గ పరిణామం కాదు. సంస్కృతం, సంస్కృతి కలిసి వెళతాయి అంటారు వివేకానంద. అలానే **'ఒక నాగరకతను రక్షించేది కేవలం వస్తుప్రపంచానికి, ద్రవ్యజగత్తుకు సంబంధించిన సమాచారం కాదు. సంస్కృతి (అంటే మనిషికి జీవిత పరమార్థాన్ని, పారమార్థికత ఔన్నత్యాన్ని తెలియజేసేది) నాగరకతను రక్షిస్తుంది. మరి సంస్కృతి ఎక్కడుంది? మన సంస్కృత పుస్తకాలలో'** అన్నారు వివేకానంద. అలానే ఈ ఆంగ్లభాషోపాసన ఉపాధికి ఊతంగా ఉపకరిస్తుందేమో కానీ ఆధ్యాత్మికతకు మాత్రం మనిషిని దూరం చేస్తుంది. అంటే ఆంగ్లం రాని వారంతా ఆధ్యాత్మికతలో ఆకాశానికి ఎదిగారని కాదు. ఆంగ్లభాషను నేర్చుకోవటం మీద పెట్టిన శ్రద్ధ, ఆసక్తి మాతృభాషపై కనబరచట్లేదు. కాబట్టి మనం సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా పతనమవుతున్న విషయాన్ని గుర్తించాలి. కేవలం ఆర్థిక ప్రయోజనాలే మనిషి మనుగడను నిర్దేశించకూడదు.

దారిద్ర్యం ఒక్కటే భారతదేశ సమస్య అని మనం భావిస్తున్నాం. అదే నిజమైతే మనకన్నా ఆర్థికంగా సుసంపన్నమైన దేశాలు ఎన్నో ఉన్నాయి. మరి వారికి మనకన్నా ఎక్కువ సమస్యలున్నాయి కదా! భారతదేశం, భారతీయ నాగరకత అన్ని నాగరకతలకన్నా అభివృద్ధిచెందిన నాగరకత అని మనం ముందు తెలుసుకోవాలి. సంస్కృతి హీనః పశుభిః సమానః అంటుంది శాస్త్రం. మనల్ని ఇప్పటికీ, ఎప్పటికీ ప్రపంచ జాతులలో వరిష్ఠంగా నిలపగలిగేది మన ఆధ్యాత్మిక జ్ఞానసంపద మాత్రమే. నిస్సారమైన ప్రాపంచిక జీవితం అంచులకి వెళ్ళి, విసిగి వేసారి, ఆధ్యాత్మికతకై పరితపిస్తున్న వివిధ జాతులకు, మనం మనకు వారసత్వంగా లభించిన ఈ జ్ఞానామృతాన్ని అందించగలిగితే అది జాతికి అద్భుతమైన ఆర్థిక ప్రయోజనాన్ని కూడా కలుగజేస్తుంది (మనం కావాలనుకుంటే).

ఇంద్రియతుల్య జీవితమే జీవితమనుకొని, అదే భావనతో జీవిస్తూ, రోజురోజుకూ పతనానికి దగ్గరవుతున్నారు పాశ్చాత్యులు. భారతీయ ధర్మం మాత్రమే వినాశం అంచుకు చేరుకుంటున్న ఈ నాగరకతలను రక్షించగలదు. ప్రపంచం భారతదేశం నుంచి సంస్కృతిపరంగా, ఆధ్యాత్మిక పరంగా చాలా ఆశిస్తున్నది. మానవాళిని పరిపూర్ణత దిశగా తీసుకువెళ్ళే క్రమంలో మనది బృహత్తర పాత్ర. ప్రాపంచిక జీవితంలో కోరుకున్నవన్నీ పొంది జీవితంలో అసంతృప్తిని, వెలితిని అనుభవిస్తున్న వారి సంఖ్య మనదేశంలోకన్నా పాశ్చాత్యదేశాలలోనే ఎక్కువగా ఉన్నది. వారంతా జీవితాన్ని పరిపూర్ణంగా అన్వేషించి, జీవన పరమార్థాన్ని తెలుసుకోవాలని, పారమార్థిక జ్ఞానానికై పరితపిస్తున్నారు. పాశ్చాత్యులు మన దేశంవైపు చూస్తున్న విషయం మనం మరచి పోకూడదు. వారు కోరుకుంటున్న ఈ విజ్ఞానాన్ని అందించి, మనదేశాన్ని అగ్రరాజ్యంగా నిలబెట్టాలంటే మనం సంస్కృతం, మాతృభాష, ఆంగ్లం..మూడింటిలోనూ ప్రవేశం కలిగి ఉండాలి.

ఈ పరిణామం అంత మంచిది కాదేమో!: నిజానికి ఒకటవ తరగతినుండి మాతృభాషకు బదులుగా ఆంగ్లభాషలో విద్యను బోధించటం అంటే మన సంస్కృతికి ఆయువుపట్టును త్రుంచివేయడమే. ఇది ఎంతటి దుష్పరిణామమో మనకు అర్థంకావటం లేదు. ఇంట్లోవారు, చుట్టు ప్రక్కలవారు, అందరూ ఆంగ్లంలో మాట్లాడితే అప్పుడు మనం ఆంగ్లంలో సంభాషిస్తూ, ఆంగ్లంలో ఆలోచించగలం. అప్పుడు భాషను అప్రయత్న పూర్వకంగా నేర్చుకోవచ్చును. కానీ మనం ఇప్పుడు వాడుక భాషగా తెలుగును ఉపయోగిస్తూ, పాఠ్యాంశాలను ఆంగ్లంలో చదవటం, బోధించటం వలన తెలుగులో ఆలోచిస్తూ ఆంగ్లంలో వ్రాయవలసి రావడంతో పిల్లలు స్పష్టంగా ఆలోచించలేకపోతున్నారు, వ్రాయలేక పోతున్నారు. విషయాన్ని స్పష్టంగా ఆలోచించటమే నేర్పలేనప్పుడు ఇక అది విద్య అవుతుందా? ఇలాంటి పరిస్థితులలో ఉత్తమ వ్యక్తులను తయారు చేయగలమా? మన విద్యార్థులకు ఇప్పుడు సగంశక్తి ఈ కొత్త భాషను నేర్చుకోవటంలోనే పోతున్నది. వారికిదొక పెద్ద ప్రయాసగా, మానసిక శక్తి దుర్వినియోగ ప్రక్రియగా పరిణమించింది. అలాకాకుండా కనీసం పదవ తరగతి వరకైనా మాతృభాషలో విద్యను బోధించి, మాతృభాషలో భావప్రకటన కౌశలాన్ని పెంపొందించి, ఇంటర్మీడియేట్ నుంచి కావలసిన భాషను ఎంచుకునే అవకాశం ఇవ్వడం ద్వారా విద్యార్థి మనసు చక్కగా ఆలోచించ గలుగుతుంది. ముందు మాతృభాషలో భావాలను స్పష్టంగా వ్యక్తంచేయడం నేర్పిన తర్వాత, అవే భావాల్ని ఆంగ్లంలో ఎలా వ్యక్తీకరించాలో తెలియజెప్పాలి.

నేటివరకూ ఆంగ్లం అంతగా అవసరం కాలేదు కాబట్టి, ఇంతకుముందు విద్యార్థులు పదవ తరగతి వరకూ ఇంగ్లీషు ఉన్నప్పటికీ కేవలం ఆంగ్లాన్ని ఒక ప్రత్యేక సబ్జెక్టుగా చదివారు తప్ప ఆ భాషలో భావప్రకటనకు అంతగా ప్రయత్నం చేయలేదు. ఆంగ్ల మాధ్యమంలో చదివితేనే ఆంగ్లం బాగా వస్తుందన్న అపోహతో నేటితరం ఆంగ్లమాధ్యమ పాఠశాలలకు ప్రాధాన్యాన్నిస్తున్నది. మాతృభాషలో మాట్లాడితే ఆంగ్లంరాదనీ, మాతృభాషలో మాట్లాడటం తిరోగమనానికి చిహ్నమనీ వీరు భావిస్తున్నారు. ఈ భావన సరికాదు. ఈ పరిణామం వలన మనసులో స్పష్టత కొరవడి, ఏ భాషలోనూ తమ ఆలోచనలను చక్కగా వ్యక్తం చేయలేకపోతున్నారు నేటి విద్యార్థులు. ఈ ప్రక్రియ పిల్లల భావవ్యక్తీకరణ సామర్థ్యానికి చేటుచేస్తున్నది; ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులను బాధకు గురిచేస్తున్నది. కనుక ప్రజలు, ప్రభుత్వం ప్రస్తుత భాషాప్రాధాన్యతలను ఒకసారి పునఃసమీక్షించుకొని, కనీస అవరోధ మార్గాన్ని *(path of least resistance)* ఎన్నుకొని విద్యార్థులు తమ సమయాన్ని, మానసిక శక్తులను చక్కగా ఉపయోగించుకునే విధానాన్ని రూపొందించుకోవాలి. విద్యార్థి తన మాతృభాష తెలుగును, శాస్త్రభాష సంస్కృతాన్ని, ఆంగ్లాన్ని.. మూడింటినీ సమపాళ్ళలో నేర్చుకొని, సంస్కృతి, ఆధ్యాత్మికత ఆధారంగా వ్యక్తిత్వాన్ని నిర్మించుకొని, నిజమైన భారతీయుడిగా తయారైనప్పుడు మాత్రమే భరతమాత విశ్వగురువవుతుంది. మరి ఈ త్రిభాషా సూత్రాన్ని పరిశీలిద్దామా!? ❖

భాష, జాతి యొక్క ప్రగతిని వివరించే ముఖ్య సాధనం. భావాల్ని ప్రకటించడానికి భాష సాధనం. భాషగానీ, కళగానీ, సంగీతంగానీ భావరహితమైతే నిష్ప్రయోజనం అవుతుంది. -స్వామి వివేకానంద

చరిత్రకెక్కిన త్యాగం

- శ్రీమతి సుధామూర్తి, ఇన్ఫోసిస్ ఫౌండేషన్

సాంకేతిక విద్య, సమాచార వ్యవస్థ వ్యామోహంలో ఈతరంలో చాలామంది చరిత్ర, చారిత్రక పురుషులు తదితర అంశాలపై అంతగా ఆసక్తి కనబరచడం లేదు. నేను ప్రొఫెసర్‌గా ఉన్నప్పుడు కంప్యూటర్ సైన్స్ విద్యార్థి రాజీవ్ కూడా ఈ తరహా యువకుడే! 'ఆ! ఏముంది మేడమ్! చనిపోయిన వాళ్ళ గురించి, సంఘటనల గురించి చెప్పే గతకాలపు సమాచారమేగా చరిత్ర అంటే! తారీఖులు, దస్తావేజులే కదా! అది ఈనాడు ఎవరికీ ఉపయోగం లేదు. శుద్ధ దండగ!' అనేవాడు. చరిత్రకు సంబంధించి రాజీవ్ అభిప్రాయాన్ని మార్చేందుకు మంచి అవకాశం కోసం చూస్తూ వచ్చాను.

ఒకసారి మా సంస్థ పని మీద బెంగుళూరుకు సమీపంలోని ఓ చిన్నపాటి పట్టణానికి వెళ్ళాల్సి వచ్చింది. నా వెంట రాజీవ్‌ను కూడా తీసుకువెళ్ళాను. దాని పక్కనే ఓ గ్రామముంది. నా పూర్వ విద్యార్థి ప్రకాశ్‌ది అదే గ్రామం. వాళ్ళ అమ్మానాన్న ఎప్పటి నుంచో నన్ను వాళ్ళ ఊరికి రమ్మని ఆహ్వానిస్తున్నారు. అందుకే నేరుగా వాళ్ళ ఇంటికే వెళ్ళాం. అతిథి సత్కారాలన్నీ పూర్తయ్యాక ప్రకాశ్ తల్లితండ్రులు మాదప్ప, పార్వతి పూలు, పళ్ళు, దీపం, కొబ్బరికాయలతో పూజకు బయలుదేరారు. గుడికి వెళుతున్నారేమోనని మేమూ బయలుదేరాం. అప్పుడు ఆ దంపతులు 'గుడికి కాదు; కానీ మా ఊరికి అది ఓ గుడి లాంటిదే! మా ఆరాధ్యదైవాన్ని అక్కడ కొలుస్తాం' అన్నారు. అందరం కలిసి ఊరి పొలిమేరల్లోకి వెళ్ళాం. అక్కడ ఓ శిలాఫలకాన్ని నీళ్ళతో కడిగి మాదప్ప, పార్వతి దంపతులు పూజ చేశారు. 'ఏమిటిదంతా? ఇక్కడెందుకు పూజ చేస్తున్నారు?' అని అడిగాడు రాజీవ్. అప్పుడు మాదప్ప మాట్లాడుతూ, 'సాహసానికి ప్రతీక ఈ శిలాఫలకం. గోపాల గొల్ల అనే ఆయన మా పూర్వీకుడు. ఈ శిలాఫలకంపై ఆయన వీరగాథను చెక్కించారు' అంటూ వివరించాడు.

అది ఏడువందల సంవత్సరాల క్రితం మాట. మన దేశం అప్పుడు పరాయిరాజుల పాలనలో ఉంది. ఆ ఊరిలో గోపాలుడు తల్లితండ్రులకు ఒక్కడే కొడుకు. తండ్రి చనిపోయాడు. పాతికేళ్ళకు పెళ్ళి చేసుకున్నాడు. భార్య గర్భవతి. రోజూ ఊరి పొలిమేరల్లో ఆవులు కాసుకుంటూ జీవించేవాడు. ఒక రోజు అతడు గోవుల్ని మేపుకుంటూ ఉండగా, హడావిడిగా గుర్రం మీద ఓ సైనికుడు వచ్చాడు. అక్కడికి వచ్చాక, గుర్రం దిగి అతడికి ఓ సిల్కు సంచిని ఇస్తూ, 'దీనిలో ముఖ్యమైన సమాచారం ఉంది. శత్రుసైనికులు నన్ను వెంబడిస్తూ ఉన్నారు. నదిని దాటి వెళ్ళి, ఆ వైపున ఉన్న మా సైన్యాధ్యక్షుడికి దీన్ని అందివ్వగలిగితే దేశాన్ని కాపాడినవాడివవుతావు. నిన్ను శత్రుసైనికులు అనుమానించరు' అంటూ గుర్రాన్ని దౌడు తీయించాడు. ఆ గోపాలుడికి ఏం చేయాలో తోచలేదు. కానీ అప్పుడప్పుడు శత్రుసైనికులు గ్రామంపై పడి పశువుల్ని ఎత్తుకు పోవడం తెలుసు. అందుకే మన సైనికుడిచ్చిన సంచిని ఆవల తీరానికి చేర్చి తన వంతు సాయమందించాలనుకున్నాడు. శత్రువుల చేతిలో ప్రాణహాని అని తెలిసినా, ఆ యువకుడు సాహసానికే పూనుకున్నాడు. ఆవుల్ని అక్కడ వదిలేసి, సైనికుడిచ్చిన సంచితో సహా నది వైపు పరుగెత్తాడు. గాయాల కోర్చి ముళ్ళబాట వెంట దౌడు తీశాడు. నదిలోకి దూకబోతుండగా, పక్కనున్న తుప్పల్లోంచి శత్రుసైనికులు బయటకు వచ్చి అతని మీద కత్తులతోనూ, బల్లాలతోనూ దాడి చేశారు. అతని దగ్గర ఒక కర్ర మాత్రమే ఉంది. అయినా ధైర్యంగా వాళ్ళతో యుద్ధం చేశాడు; తీవ్రంగా గాయాలపాలయ్యాడు. అయినా లెక్క చేయకుండా నదిలోకి దూకి ఈదుకుంటూ అవతలి ఒడ్డుకు చేరుకున్నాడు. తర్వాత కుంటుకుంటూ కొంత దూరం వెళ్ళాక, సైన్యాధ్యక్షుడు కనబడ్డాడు. అతనికి ఆ సంచిని అందించి,



పడిపోయి ప్రాణాలు వదిలాడు. అతను అందించిన సమాచారం మన సైనికుల యుద్ధ వ్యూహానికి అతి ముఖ్యమైంది. చివరకు యుద్ధంలో మన సైనికులే గెలిచారు.

గోవులను కాచుకునే యువకుడు ప్రాణాలొడ్డి ఇంత సాహసం చేశాడని తెలుసుకొని రాజు ఆశ్చర్యపోయాడు. స్వయంగా ఆయన గోపాలుడి ఇంటికి వెళ్ళి అతని ముసలి తల్లినీ, గర్భిణి అయిన అతని భార్యనూ ఓదార్చారు. 'అమ్మా! మీకు కలిగిన నష్టం తీర్చలేనిది. మనమందరం ప్రశాంతంగా జీవించడానికి గోపాలుడు చేసిన త్యాగం మరువరానిది' అన్నాడు. గోపాలుడు ప్రాణం విడిచిన స్థలాన్ని ఆమెకు దానం చేశాడు.

ఆ కథ ముగిస్తూ మాదప్ప 'ఆయన త్యాగానికి ప్రతీకగా సైన్యాధ్యక్షుడు ప్రతిష్ఠించిన శిలాఫలకం ఇది. ఏటా ఓ రోజు ఆయన వారసులంతా ఇక్కడికి వచ్చి గోపాలుడి స్మృతి సూచకంగా నివాళి అర్పిస్తారు. నేను, నా భార్య మాత్రం రోజూ వచ్చి ఆ మహానుభావుడి కోసం దీపం వెలిగిస్తాం' అన్నాడు. ఆ కథ వింటూ రాజీవ్ కన్నీళ్ళపర్యంతం కావడం మాకందరికీ ఆశ్చర్యం కలిగించింది. ❖ సేకరణ: జి. సతీష్



– స్వామి పరిజ్ఞేయానంద

అవమానాల అంధకారంలో ఆశాకిరణాలు

సిహెచ్. నిరంజన్, విద్యార్థి, మహబూబ్‌నగర్

ప్రశ్న: నేను పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాను. మా కుటుంబ వృత్తి నేపథ్యంలో నన్ను కొంతమంది నిరుత్సాహపరుస్తున్నారు. మరికొంతమంది అవమానకరంగా మాట్లాడుతున్నారు. అందువల్ల మనస్సు కలవరపడుతోంది. ఈ పరిస్థితులను ఎదుర్కోవడం ఎలా?

జవాబు: '*When the soul has wrestled with circumstance and struggled again and again then the soul comes out as a giant*-పరిస్థితులను ఎదుర్కొని పోరాడినప్పుడే మనలోని ఆత్మ శక్తిసంభరితమై బహిర్గతమవుతుంది' అంటారు స్వామి వివేకానంద.

ప్రతిఘటనలను ఎదుర్కొని ఎదిగేందుకు స్ఫూర్తి – రాళ్ళను సైతం ఛేదించుకొని ఎదిగే రావిచెట్టు; అవమానాలకు, నిరాదరణకు క్రుంగిపోకుండా ఉన్నతంగా ఎదగడానికి ఆదర్శం – అందరినీ అలరించే అందాల సీతాకోకచిలుకగా మారిన గొంగళిపురుగు.

కష్టాల కన్నీళ్ళలో తడిసి, అవమానాల పెనుగాలుల తాకిడికి నిలచి, నిరాశా వచనాల వెల్లువకు ఎదురొడ్డి జీవననావను తీరానికి చేర్చినవారే మహాత్ములుగా మన్ననలను అందుకుంటున్నారు. జీవితంలో ఎవరు ఏది సాధించాలన్నా ప్రతిఘటనల్ని ఎదుర్కోక తప్పదు. అందుకు మహాత్ముల జీవితాలే మనకు మార్గనిర్దేశం కావాలి. వారి స్ఫూర్తి వచనాలే మన జీవనబాటకు ఆశాజ్యోతిగా మారాలి.

మనల్ని ఎవరైనా నిరుత్సాహపరిచినా, అవమానించినా, నిందించినా, అవహేళన చేసినా మనస్సు కలత చెందుతుంది. అలాంటి పరిస్థితుల నుండి బయటపడడానికి మూడు విషయాలను గుర్తుంచుకోవాలని చైనా తత్త్వవేత్త తావో తెలిపాడు.

1. **మనల్ని నిరుత్సాహపరిచే మాటలను పట్టించుకోకుండా ఉండగలిగితే శక్తిమంతులం.**
2. **మనల్ని మనం అర్థంచేసుకోగలిగితే బుద్ధిమంతులం.**
3. **మనల్ని మనం జయించగలిగితే వివేకవంతులం.**

నిరుత్సాహకర మాటలకు ప్రభావితం కాకుండా ఉండడమెలాగో 'ప్రేయర్ ఆఫ్ ది ఫ్రాగ్' రచయిత ఆంటోనీ డీమెల్లో ఓ కథ చెప్పారు:

ఒకసారి కప్పల పరుగుపందెం జరిగింది. పోటీలో పాల్గొన్న కప్పలను మిగతా కప్పలన్నీ నిరుత్సాహపరచడం ప్రారంభించాయి. ఆ మాటలకు ప్రభావితమైన కప్పలు మానసికంగా బలహీనపడి పోటీలో ఓడిపోయాయి. కానీ ఒకే ఒక కప్ప పోటీలో గెలిచింది. అందుకు కారణమేమిటని విచారించినప్పుడు ఆ కప్పకు చెవుడు ఉందని తెలిసింది. అంటే ఇతరులు మనల్ని నిరుత్సాహ పరిచినప్పుడు మనం చెవిటివారిలా ప్రవర్తించాలి. అప్పుడే మన లక్ష్యాన్ని సాధించగలం.

మన కుటుంబవృత్తి ఏదైనప్పటికీ న్యాయబద్ధంగా జీవిస్తున్నప్పుడు ఇతరుల ఆక్షేపణలకు కలత చెందకూడదు. అలాంటి పరిస్థితుల్లో అబ్రహాం లింకన్ వ్యవహరించిన తీరు మనకు స్ఫూర్తిదాయకం. అబ్రహాం లింకన్ అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన తరువాత సభలో ఒక వ్యక్తి లేచి 'నువ్వు ఓ చర్మకారుడి కుమారుడివి. మీ నాన్న మా చెప్పులు కుట్టేవాడు. ఆ సంగతి మరచిపోకు' అని అవహేళన చేశాడు. సభలోని వారంతా ఘొల్లున నవ్వారు. కానీ లింకన్ ఏమాత్రం బాధపడకుండా 'నా తండ్రిని గుర్తుచేసినందుకు ధన్యవాదాలు. నా తండ్రే కాదు నేను కూడా మీ చెప్పులు కుట్టడానికి సిద్ధమే! అందుకు నేను సిగ్గుపడను' అని బదులిచ్చాడు. లింకన్ సమాధానాన్ని విని అందరూ ఆశ్చర్యపోయారు. అందుకే అబ్రహాం లింకన్ తన గుణసౌందర్యంతో నేటికీ ఆదర్శనీయుడిగా నిలిచారు.

అలాగే, మన లక్ష్యసాధన పట్ల అకుంఠితదీక్ష ఉంటే అవమానాలను కూడా ఆనందంగా స్వీకరించే మనోస్థైర్యం కలుగుతుంది. ఒకసారి మదన్‌మోహన్ మాలవ్య బెనారస్ హిందూ విశ్వవిద్యాలయ నిర్మాణం కోసం హైదరాబాద్ నిజాం వద్దకు వచ్చి విరాళం ఇమ్మని కోరారు. అందుకు నిజాం కోపంతో చెప్పును ఆయనపైకి విసిరాడు. మదన్‌మోహన్ చిరునవ్వుతో ఆ చెప్పును తీసుకొని వెళ్ళి వేలం వేయసాగారు. ఆ విషయం తెలిసిన నిజాం అవమానంగా భావించి అతనికి విరాళమిచ్చి పంపించాడు. ఆనాడు అవమానాలను ఆస్వాదించిన మాలవ్య ఈనాడు 'భారతరత్న'మై ప్రకాశిస్తున్నారు.

అయితే, ఇతరులు మనల్ని నిరుత్సాహపరిచినా, అవమాన పరిచినా పట్టించుకోకుండా ఉండగలగడం అనుకున్నంత సులభ మేమీ కాదు. కానీ వాటిని ఎంత త్వరగా మరచిపోగలిగితే అంత త్వరగా మన లక్ష్యసాధనలో మనస్సును ఏకాగ్రం చేయగలుగుతాం. నిరాశను పెంచే మాటల్ని నీటి మీద రాసిన రాతల్లా వెంటనే మరచిపోగలిగేవారు ఉత్తములు; ఇసుక మీద రాసిన రాతల్లా కొంతసేపటికి మరచిపోగలిగేవారు మధ్యములు; రాతి మీద రాసిన రాతల్లా ఎన్నటికీ మరచిపోనివారు అధములు.

అందువల్ల అవమానాల అంధకారం అలముకొన్నప్పుడు మహాత్ముల జీవితాలు మనకు ఆశాకిరణాలై దారి చూపుతాయి. 'ఏదీ సులభముగా సాధ్యపడదు లెమ్ము, ప్రతిఘటనలను ఎదుర్కొన్న సత్ఫలితం తథ్యం సుమ్మీ' అన్న మహాత్ముల స్ఫూర్తివచనాలు మనలో మనోస్థైర్యాన్ని నింపుతాయి. కాబట్టి మనోవ్యథను కలిగించే మాటలను మరచిపోయి, మహాత్ముల జీవితాల నుండి స్ఫూర్తిని పొందుతూ మన ప్రయత్నాన్ని కొనసాగిస్తే తప్పక సత్ఫలితాన్ని సాధించగలం. ❖

సమాజంలో ప్రతిఘటనలు, వేధింపులు, అవమానాలు అనివార్యాలు. కావున నీవు ధైర్యంగా, పవిత్రంగా, అచంచలమైన భగవద్విశ్వాసంతో నీ ఆశయ సాధనకు కృషిచేయి. – స్వామి వివేకానంద

వేళకు ముందే వసంతం

– బి. సైదులు

అంతర్జాతీయ స్థాయిలో పేరుప్రఖ్యాతులున్న ఓ భారతీయ ప్రకటన సంస్థ అధినేత ఇటీవల పత్రికా విలేకరుల ముఖాముఖిలో మాట్లాడుతూ సామాజిక పరిస్థితులపై విశ్లేషణాత్మకంగా చర్చించారు. ముఖ్యంగా నేటి యువతీయువకుల పోకడలను ప్రస్తావిస్తూ ఆయన 'మా తరంలోని యాభై ఏళ్ళ జీవితాన్ని నేటితరం ముప్పై ఏళ్ళ లోపే అనుభవించేస్తోంది. సంపదల నుంచి సుఖాల వరకు అన్నింటినీ ఎంత త్వరగా సొంతం చేసుకుంటే అంత అధికులమన్నట్లు ఆత్రుత పడుతోంది. మా యుక్తవయస్సుతో పోలిస్తే, ఈతరం పడుతున్న ఆరాటం అంతా ఇంతా కాదు! ప్రాపంచికంగా మనిషి అనుభవించే ఆనందాలన్నింటి కోసం, పట్టుమని పాతికేళ్ళు కూడా నిండకుండానే అర్రులు చాస్తున్న అబ్బాయిల్ని, అమ్మాయిల్ని చూస్తూంటే ఆశ్చర్యం కలుగుతోంది' అన్నారు. నేడు ఎంతో మంది యువతీయువకుల ధోరణిని గమనిస్తూ ఉంటే,ఆ పెద్దాయన పడిన ఆందోళన అర్థవంతమైందేననిపిస్తూ ఉంది. నిగ్రహం, నియంత్రణ కొరవడిన ఆలోచనలతో వేళకు ముందే వచ్చే వసంతంలా, కాలం కన్నా ముందే కూస్తున్న కోయిలల్లా, చాలా మంది వయస్సుకు మించిన వ్యామోహాలతో జీవితాల్ని ఛిన్నాభిన్నం చేసుకుంటున్నారు. ప్రపంచీకరణ ఫలితంగా, నాటితరం ఊహకైనా అందని రీతిలో, నవతరం ఉన్నతమైన జీతభత్యాలతో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవడం హర్షణీయం; అభినందనీయమే! కానీ తత్ఫమంగా లభిస్తున్న సామాజిక స్వేచ్ఛ, ఆర్థిక స్వాతంత్ర్యం, నిర్ణయాధికారాల వలన చాలామంది యువతీ యువకులు సంయమనం కోల్పోయి తప్పటడుగులు వేస్తున్నారు. వస్తువులు, వాహనాలు, ఆస్తులు, అంతస్తులు, భోగాలు, భాగ్యాలు అన్నీ మూడు పదుల వయస్సులోపే అనుభవించేశాక, *What next?* అన్న ప్రశ్నార్థక అసహనం ఆధునికతరం ముఖాల్లో అతిసాధారణమైపోయింది.

ఎందుకంత తొందర? : జీవితం దశల వారీగా సాగిపోతేనే అందం,ఆనందం. ఒక్కో అనుభూతికి, ఒక్కో అనుభవానికి ఒక్కో వయస్సుంటుంది. బాధ్యతలు తెలీని బాల్యం పరిమళాలు వెదజల్లే ప్రసూనంలా ప్రసన్నంగా విరబూయాలి; యవ్వనం యుక్తాయుక్త వివేకంతో, వికసిత వ్యక్తిత్వంతో భవిష్యత్తుకు మేలిమలుపులా, మేలుకొలుపులా విరాజిల్లాలి. అయితే దురదృష్టవశాత్తూ నేడు సమాజ పోకడలను చూస్తూంటే 'వేగం' వయస్సుకూ పెరిగిందనిపిస్తోంది. అందుకే చాలా మందికి మానసికంగా పదేళ్ళలోపే పదహారేళ్ళు వచ్చేస్తున్నాయి. తత్ఫలితంగానే వారి ఆలోచనలు సమాజ పరిమితులను అతిక్రమిస్తున్నాయి; అవాంఛనీయ పనులకు ప్రేరేపిస్తున్నాయి. అయితే ఈ పరిణామాలు, పశ్చాత్తాపాలు కాలక్రమంలో మన జీవన యవనికపై మరకలుగా మిగిలిపోతాయనడంలో సందేహం లేదు. అందుకే ఓ ఆంగ్లమేధావి *Make mistakes in haste and repent in leisure* అంటారు. నిజమే! ఉద్రేకంలో హడావిడిగా తప్పులు చేసుకుంటూ, ఆనక తీరిగ్గా వాటిని తలచుకుంటూ పశ్చాత్తాపంతో జీవితాంతం చింతిస్తూ ఉంటాం. అయితే యువప్రాయంలో జీవనవడి...వేడి స్తిమితంగా ఆలోచించనీయదు. ఈ సమయంలో మనస్సు బలహీన క్షణాలకు లొంగిపోతే నిరంతరం పరిసరాలు, పరిస్థితులు మనల్ని ప్రభావితం చేస్తూనే ఉంటాయి.

అభద్రత వల్లే ఆరాటం... : సరదాల నుంచి సౌకర్యాల కల్పన వరకు అన్నింటిలో నేడు యువతరం తీవ్రమైన ఒత్తిడికి గురవుతోంది. అయితే భవిష్యత్తుపై నమ్మకం లేనివారే వర్తమానంలోనే అన్నీ ఆర్జించాలని, అనుభవించాలని తాపత్రయపడుతూ ఉంటారు. అమితమైన ఆరాటం మన అభద్రతా భావాన్ని సూచిస్తుంది. వందకు పైగా చిత్రాలు తీసిన ప్రముఖ దర్శకుడిని ఓ విలేకరి 'మీరు ఇన్ని చిత్రాలను తీసినా, ఎందుకు స్థిరాస్తులు సంపాదించలేదు? ఎక్కువ దేశాలు తిరగలేదు? ఏ ఆడంబరాలకూ పోలేదు? ఈ రోజుల్లో రెండు మూడు చిత్రాలు తీసినవారు కూడా ఎన్నో ఆస్తులు కూడబెట్టుకుంటున్నారు! ఎంతో జీవితాన్ని అనుభవిస్తున్నారు కదా? అని ప్రశ్నించాడు. అప్పుడు ఆ దర్శకుడు 'మాకు ఇప్పటి వారిలా వృత్తిపై, ప్రతిభపై, జీవితంపై ఇంత అభద్రతాభావం లేదు. ఆవురావురుమంటూ అన్నింటినీ అనుభవించేయాలన్న ఆరాటమూ లేదు. ఇన్నాళ్ళు నడిచిన వాళ్ళం, ఇకముందు కూడా నడవకపోతామా అన్న సంపూర్ణమైన విశ్వాసం వల్ల రాబోయే రోజుల కోసం ఎక్కువ ఆందోళన పడకపోయేవాళ్ళం' అన్నారు. కానీ నేడు గతంతో పోలిస్తే యువత జీవనప్రమాణాలు ఎన్నో రెట్లు పెరిగినా, చాలామంది ముఖాల్లో అసంతృప్తి, మనస్సుల్లో అశాంతి తాండవిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం అభద్రతతో కూడిన ఆరాటం!

మసకేస్తున్న ముందుచూపు...: ఆర్థికపరమైన, సామాజికపరమైన ప్రణాళికలే అసలైన ప్రణాళికలని మనలో చాలా మంది భ్రమపడుతూ ఉంటారు. కానీ మానసికంగా మనల్ని మనం రాబోయేరోజుల కోసం సిద్ధం చేసుకోవడమే అసలైన

ముందుచూపు! అయితే బాధాకరంగా మనలో మానసికంగా ఆ ముందుచూపే మసకేస్తుంది. భౌతికపరమైన వస్తుసంపదల సమకూర్పులో మనం మానసికంగా ఎంత అలజడికి గురవుతున్నామో, ఆ పరుగు ఎక్కడికి దారితీయిస్తుందో ఆలోచించడం లేదు. అందుకే స్వామి వివేకానంద *Pleasures presents itself before man, wearing the crown of sorrow on its head. He who welcomes it must also welcome sorrow.* నిజమే! ప్రతి సుఖమూ, దుఃఖమనే ముళ్ళ కిరీటాన్ని తలపై పెట్టుకొని వస్తుంది. సుఖాలను ఆహ్వానిస్తే, దుఃఖాలకూ శిరసావహించాల్సిందే! కానీ యవ్వనంలో మనకంత విజ్ఞత ఉండదు! అందుకే ఎదిగీఎదగని వయస్సులోనే మనం

ఇన్ని సుఖాలకు, సౌకర్యాలకు అలవాటు పడితే, భవిష్యత్తులో అవి లేని సందర్భాలు సంభవిస్తే, వాటిని జీర్ణించుకొని, సర్దుకుపోగలమా? అని ప్రశ్నించుకోవడం లేదు. అందుకే అందివస్తున్న సుఖాలన్నింటికీ వేలంవెర్రిగా అర్రులు చాస్తున్నాం. అవి దక్కకపోతే, తీవ్రనిరాశతో వికృతరూపాలను దాలుస్తున్నాం. అయితే ఈ వైపరీత్యం మనల్ని ఎంతటి వికృతస్వభావులను చేస్తుందో అర్థం చేసుకోవడం లేదు! ఈ రోజుల్లో సమాజంలో జరుగుతున్న చాలా నేరాలకు, ఘోరాలకు యువతరం నేపథ్యంగా నిలవడమే దీనికి నిదర్శనం.

అదృష్టమా? దురదృష్టమా? : ఓ ప్రముఖ రచయిత పదహారేళ్ళ కొడుకుతో కలిసి భోజనం చేస్తున్నప్పుడు, ఆయన అర్ధాంగి కుమారుడితో సరదాగా 'నువ్వు చాలా అదృష్టవంతుడివిరా! మాకు నలభై ఏళ్ళ తరువాతగానీ మంచి ఇల్లు, సొంతకారు,విదేశీయానం సాధ్యపడలేదు. కానీ నీకు ఈ వయస్సులోనే వాటిని అనుభవించే అదృష్టం కలిగింది' అన్నారు. అప్పుడు ఆ రచయిత 'నాకు అలా ఏమీ అనిపించడం లేదు. పైగా వీడిని చూస్తే జాలేస్తుంది. పాపం! ఈ వయస్సులోనే ఇవన్నీ చూసేశాడు. జీవితంలో అంచెలంచెలుగా ఎదుగుతూ, కన్న కలల్ని ఒక్కటొక్కటిగా సఫలం చేసుకుంటూ, వాటిని అనుభవించే అదృష్టం మనకు కలిగింది. వీడికి అన్నీ యాదృచ్ఛికంగా ముందే అమరాయి. ఇక రాబోయే కాలమంతా వీడు '*What next?*' అని పరుగుతీయడం తప్పదు. ఇది అదృష్టమా? దురదృష్టమా?' అన్నారు. నేడు చాలామంది సంపన్న వర్గాల యువతీయువకులను చూస్తుంటే, ఆ రచయిత మాటలు అక్షరసత్యాలనిపిస్తు ఉంది. ఊహలు తెలియని వయస్సులోనే ఈ ప్రపంచంలోని సుఖాలన్నింటినీ ఆస్వాదించాక, వారికి రాబోయే రోజులపై ఆసక్తి, అనురక్తి ఉండదు. ఈ ప్రపంచంలోని ఏ ఆనందమూ అపురూపం అనిపించదు. మానసికమైన శూన్యం, వెలితి వెంటాడుతూ ఉంటాయి. అలా అని, ఆంతరంగిక ఆనందం కోసం అన్వేషించేంత ఆధ్యాత్మిక సంస్కారమూ అలవడదు. ఇలాంటి మానసిక వైక్లబ్యంతోనే చాలామంది శ్రీమంతుల యువసంతానం కార్యకలాపాలు వెర్రితలలు వేస్తూ ఉంటాయి.

వీరిని చూసి వారు... : సమాజంలోని సంపన్నవర్గాల యువతీయువకుల సుఖలాలస ప్రభావం గ్రామీణ, పట్టణ యువతరం పైనా పడుతోంది. ఇవి అనుభవించలేని దిగువ తరగతి యువతీయువకులు వీరిని చూసి, తామేదో కోల్పోయినట్లు ఆత్మన్యూనతతో బాధపడుతూంటారు. అవకాశాలు, అనుకూలతలు చూసుకొని, ఆ ఆకర్షణలతో, వారి పరిధిలో వారు, పై వర్గాలను అనుకరిస్తూ ఉంటారు. కానీ ఆ ఆకర్షణ, అనుకరణ ఎలాంటి దుష్పరిణామాలకు దారితీయిస్తుందో ఆలోచించరు. 'అభిజ్ఞానశాకుంతలం' రచిస్తూ, మహాకవి కాళిదాసు "మానవుడిని మురిపించే ఆ భ్రమలో మనస్సును చిక్కుకోనీయరాదు. ప్రతి మనిషిలోనూ మనసుంటుంది. అదే అంతఃకరణం. అందరిలో అది ముకుళిస్తుంది. కొందరిలో వికసిస్తుంది. దానినే వారు ప్రమాణంగా తీసుకుంటారు" అంటారు.

ఈనాడు కొంతమంది గ్రామీణ, పట్టణ ప్రాంతాల యువతీయువకులు తమ అంతఃకరణాన్ని ప్రమాణంగా తీసుకోవడం వల్లనే వివేకంతో జీవితాల్ని మలచుకుంటున్నారు. అల్పసుఖాలలో కాదు, అత్యున్నత లక్ష్యసాధనలో అధికస్థాయి వారితో పోటీపడుతున్నారు. ఆధునికులమనుకుంటున్న నగర యువతకు దీటుగా అంతర్జాతీయ స్థాయి సంస్థల్లో లక్షలాది జీతాలతో, లక్షణమైన జీవనంతో ఆదర్శంగా నిలుస్తున్నారు. ❖

ప్రతి సుఖమూ, దుఃఖమనే ముళ్ళ కిరీటాన్ని ధరించి మనిషి ముందు ప్రత్యక్షమవుతుంది. అందువల్ల సుఖాలను కోరుకొనేవారు, దుఃఖాలనూ అనుభవించాల్సిందే! - *స్వామి వివేకానంద*

జీవనోద్యానంలో
మానవతా పరిమళాలు

తల్లులకు ఆదర్శం

సంధి ప్రయత్నం విఫలమైన తరువాత పాండవులకు కనీసం అయిదు గ్రామాలిమ్మనే ప్రస్తావన తెచ్చాడు - దుర్యోధనుడితో శ్రీకృష్ణుడు. అందుకు దుర్యోధనుడు కాదు పొమ్మని వారికి సూది మొన మోపగలిగినంత స్థలమైనా ఇవ్వనన్నాడు. కృష్ణుడు వెనక్కి వెళుతూ కుంతీ మాతను కలిశాడు.

కృష్ణుడు చెప్పిన వృత్తాంతమంతా విని కుంతి నిరుత్సాహపడలేదు. ధీరవనిత లాగా ఆమె కృష్ణుడితో ఇలా అన్నది:

"ఓ కృష్ణా! క్షత్రియధర్మాన్ని అనుసరించి యుద్ధం చేయమని యుధిష్ఠిరునితో చెప్పు. యుద్ధం తప్పనిసరి. కాబట్టి మృత్యువును లెక్కచేయక అన్యాయాన్ని కూకటివేళ్ళతో పెల్లగించి పారేయమని చెప్పు. దేశగౌరవాన్ని నిలిపే ధర్మాన్ని రక్షించేందుకు పోరాడి, మరణించేందుకు అర్జునుడు, భీముడితో కూడా ఇలా చెప్పు - 'ధర్మం, కర్తవ్యం అనే బలిపీఠంపై ఆత్మత్యాగం చేసేందుకే పుత్రుడు కావాలని క్షత్రియస్త్రీ కోరుకుంటుంది. ఆ సమయమిప్పుడు వచ్చింది.

విదుల తన పుత్రుడు యుద్ధంలో ఓడిపోయి తల దాచుకునేందుకు తన దగ్గరకు వచ్చినప్పుడు ఆమె అతడిని ప్రోత్సహించి, తిరిగి యుద్ధభూమికి సాగనంపింది. అక్కడ అతడికి వీరగతి ప్రాప్తించినదని తెలుసుకొని అపరిమితానందం పొందింది. ఒక క్షత్రియమాతకు ఇంతకు మించిన ధర్మమేముంది? అన్యాయాలకు, అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడుతూ నా పుత్రులు మరణించినా నాకు ఇష్టమే. వారు పిరికివారుగా జీవించడం నేను సహించలేను".

కర్మయోగి కృష్ణుడు ఉత్సాహభరితమైన ఈ మాటలకు అమితంగా ప్రభావితుడయ్యాడు. ఈ మాటలు ఈనాటి తల్లులకు కూడా నిస్సందేహంగా మార్గదర్శకాలు. ❖

సభ్యత-సంస్కారం

ఒకసారి ఫ్రాన్స్‌రాజు నాలుగో హెన్రీ తన అంగరక్షకుడితో కలిసి ప్యారిస్‌లో సాధారణ జనం తిరుగాడే మార్గంలో నడుస్తున్నాడు. ఒక భిక్షగాడు తన తలపై ఉన్న టోపీ తీసి రాజుకు నమస్కరించాడు. జవాబుగా హెన్రీ కూడా తల వంచి ప్రత్యుత్తరమిచ్చాడు. ఇది చూసి అంగరక్షకుడు, హెన్రీతో "మహారాజా! మీరు సామ్రాట్టు. అతడు కేవలం భిక్షగాడు. అతడికి మీరు నమస్కరించడం ఏమీ బాగా లేదు" అన్నాడు.

అందుకు హెన్రీ "నేను ఒకవేళ తిరిగి అతడికి అభివాదం చేసి ఉండకపోతే 'నువ్వు ఫ్రాన్స్‌కి సామ్రాట్టువి. నీలో కనీసం ఆ భిక్షగాడికున్న సభ్యత, సంస్కారం కూడా లేవని నాలోని మానవత్వం నన్ను దూషిస్తుంది' అని బదులిచ్చాడు". ❖

పాలు-రక్తం

గురునానక్ ప్రజలకు ప్రవచనాలు చెబుతూ ఒక ఊరు చేరుకున్నారు. అక్కడ ఒక వడ్రంగి ఇంట్లో బస చేశారు. అతడి పేరు 'లాలో'. అదే గ్రామంలో 'మలిక్ భాగో' అనే ధనవంతుడు కూడా నివసిస్తున్నాడు. ఒకసారి భాగో తన గ్రామంలో ఉన్న వారందరికీ భోజనం ఏర్పాటు చేశాడు. అందరూ భోజనం చేసిన తరువాత పనివారిని పిలిచి, "మన గ్రామంలో భోజనం చెయ్యకుండా ఎవరూ లేరు కదా!" అని ప్రశ్నించాడు.



అందుకు పనివారు "వడ్రంగి లాలో ఇంట్లో ఒక సాధువున్నాడు. ఆయన మాత్రం రాలేదు" అని బదులిచ్చారు. "మీరు మా ఇంటికి భోజనానికి ఎందుకు రాలేదు?" అని గురునానక్‌ను ధనవంతుడైన భాగో ప్రశ్నించాడు. "ఇప్పుడు వచ్చానుగా" అన్నారు గురునానక్.

పనివారు ఆయన ఎదుట రకరకాలైన పక్వాన్నాలనుంచారు. అప్పుడు గురునానక్, వడ్రంగి లాలో ఇంటి నుండి కూడా భోజనం తీసుకొని రమ్మని వారితో చెప్పారు. ఆ ఇంటి నుండి రొట్టెలు వచ్చాయి. ధనికుడైన భాగో వడ్డించిన రొట్టెను తీసుకుని గురునానక్ గట్టిగా ఒత్తారు. అందులో నుండి రక్తం కారడం మొదలైంది. తదుపరి వడ్రంగి లాలో పంపిన రొట్టెను ఒత్తారు. అందులో నుండి పాలు కారడం మొదలైంది. ఇది చూసి అందరూ ఆశ్చర్యచకితులయ్యారు.

అప్పుడు నానక్ ఇలా చెప్పారు - "బీదవాళ్ళను భాగో దోపిడీ చేస్తాడు. అందుకే అతడి రొట్టెలో నుంచి పేదవారి రక్తం కారింది. కానీ లాలో న్యాయసమ్మతంగా సంపాదించాడు. అందువల్ల అతడి రొట్టెలో నుండి పాలు కారాయి." ఇది విని గురునానక్ కాళ్ళ మీద పడ్డాడు భాగో. తనను క్షమించమని వేడుకున్నాడు. "ఇక మీదట నేను కష్టపడి సంపాదించిన సొమ్ముతోనే తింటాను. ఇతరులను కష్టపెట్టను" అని మాట ఇచ్చాడు. ❖

అనువాదం: డాక్టర్ వై.సరోజా నిర్మల
(రామకృష్ణ సంఘం - హిందీ మాసపత్రిక 'వివేకజ్యోతి' నుండి)

RAMAKRISHNA MISSION

P.O. BELUR MATH, DIST. HOWRAH, WEST BENGAL - 711 202

ఫోన్ : 033- 2654 1144/1180, Email : rkmhq@belurmath.org Website: www. belurmath.org

రామకృష్ణ మిషన్ పాలక వర్గ సంగ్రహ నివేదిక 2013 - 2014

రామకృష్ణ మిషన్ 105వ వార్షిక సర్వసభ్య సమావేశం 2014 డిసెంబర్ 21 ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు బేలూరు మఠంలో జరిగింది.

భారత ప్రభుత్వం, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ సమాజ్ సేవక్ శిక్షణా మందిర్ (శారదాపీఠ్, బేలూర్)ను భారతదేశంలో మూడవ ఉత్తమ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా కేంద్రంగా గుర్తించింది. భారత్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, నరేంద్రపూర్ లోకశిక్షాపరిషత్ పర్యావరణాభివృద్ధికి చేసిన కృషికి గుర్తింపుగా 'బి.పి పొద్దార్ మెమోరియల్ అవార్డ్'ను ప్రదానం చేసింది.

భారత ప్రభుత్వం- కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ స్వామి వివేకానంద 150వ జయంత్యుత్సవాల ముగింపు వేడుకలను 2014 జనవరి 12న న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లోనూ; పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం 2014 జనవరి 10న కోల్‌కతా రెడ్ రోడ్డులోనూ నిర్వహించాయి. తమిళనాడు ముఖ్యమంత్రి తమిళనాడులోని తొమ్మిది విశ్వవిద్యాలయాల్లో స్వామి వివేకానంద పరిశోధనా కేంద్రాలను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు.

స్వామి వివేకానంద 150వ జయంత్యుత్సవాల సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో 8-10-2010 నుండి 30-06-2014 వరకు కొనసాగిన సేవా పథకాల నిమిత్తం 83.52 కోట్ల రూపాయలు వెచ్చించడం జరిగింది. ఈ నివేదిక వివరాలు చివరిలో పొందుపరచబడినవి.

ఈ సంవత్సరం డార్జిలింగ్‌లో (సోదరి నివేదిత దేహత్యాగం చేసిన ప్రదేశం) రాయ్‌విల్లాలోనూ; బంగ్లాదేశ్ చిట్టగాంగ్ ఉపశాఖగా దొర్లాలోనూ నూతన కేంద్రాలు ప్రారంభించబడ్డాయి.

విద్యారంగంలో అభివృద్ధి: త్రిపురా కేంద్రం నిర్వహిస్తున్న వృత్తివిద్యా కేంద్రం పారిశ్రామిక శిక్షణా కేంద్రంగా అభివృద్ధి చెందింది. ఒరిస్సాలోని కొఠార్ కేంద్రం కంప్యూటర్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించింది. ఢిల్లీ కేంద్రం విలువల విద్యా పథకాన్ని 'అవేకనింగ్' పేరున 50 సి.బి.ఎస్.ఇ. పాఠశాలల్లో నిర్వహించింది.

వైద్యరంగంలో అభివృద్ధి: లక్నో ఆసుపత్రిలో కార్డియాక్ ఓ.టి. కాంప్లెక్స్, అడ్వాన్స్‌డ్ ఫాకో ఎమల్సిఫికేషన్ యూనిట్, కోబ్లేటర్-2 సర్జరీ సిస్టమ్ - ఇ.ఎన్.టి, ఫైబరోప్టిక్ బ్రాంకోస్కోప్ విభాగాలు; ఇటానగర్ ఆసుపత్రిలో హెమోడయాల్సిస్ మెషీన్, యూ.జి.ఐ. వీడియో ఎండోస్కోపి, ఫోటోథెరపీ విభాగాలు ప్రారంభమయ్యాయి. కోల్‌కతా సేవాప్రతిష్ఠాన్ కేంద్రంలో 'స్వామి వివేకానంద డయాగ్నొస్టిక్, కార్డియాక్ కేర్ సెంటర్'కు శంకుస్థాపన జరిగింది.

గ్రామీణ అభివృద్ధి రంగంలో... రాంచీ మోరాబాడి కేంద్రం 181 చెరువులను త్రవ్వించింది. నరేంద్రపూర్ కేంద్రం సౌత్ 24 పరగణాలలో గోసబ; బాంకురాలో మత్‌గొడా గ్రామాల్లో వెనుకబడిన వర్గాల వారి నైపుణ్యాభివృద్ధి కోసం రెండు కళాశాలలను ప్రారంభించింది.

నూతన అభివృద్ధి పథకాల్లో కొన్ని... పురూలియా బాగ్దాలో కంప్యూటర్ శిక్షణా కేంద్రం; మాయావతిలో ఐదు అంతస్తుల ఆసుపత్రి భవనం; కూచ్‌బీహార్, నౌరా కేంద్రాల్లో వైద్యశాలలు ప్రారంభమయ్యాయి. ఆంట్‌పూర్ కేంద్రంలో నేత్రవైద్య అధునాతన పరికరాలను ఏర్పాటు చేశారు.

విదేశీశాఖలలో అభివృద్ధి కార్యక్రమాలు: సింగపూర్ ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖ సింగపూర్ కేంద్రం నిర్వహిస్తున్న శారదా కిండర్‌గార్డెన్‌కు '2013 ఉత్తమ బోధనా పురస్కారం'ను కిండర్‌గార్డెన్ ప్రిన్స్‌పాల్‌కు '2013 ఉత్తమ నాయక పురస్కారం'ను; ఫిజీ కేంద్రం చేసిన సమాజసేవకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 'ప్రవాసీ భారతీయ సమ్మాన్ పురస్కారం'ను ప్రదానం చేశాయి.

సహాయ, పునరావాస కార్యక్రమాలు: ఈ సంవత్సరంలో 10.86 కోట్ల రూపాయల వ్యయంతో రామకృష్ణ మఠం,మిషన్‌ల ఆధ్వర్యంలో దేశంలోని అనేక ప్రాంతాలలో చేపట్టిన విస్తృత సహాయ పునరావాస కార్యక్రమాల ద్వారా 1.20 లక్షల కుటుంబాలకు చెందిన 4.15 లక్షల మంది లబ్ధి పొందారు.

సంక్షేమ కార్యక్రమాలు: పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు మంజూరు చేయడం; వృద్ధులు, రోగులు, అనాథలకు (సుమారు 28.59 లక్షల మంది) 14.74 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందించబడినది.

వైద్యరంగంలో సేవలు: 166.71 కోట్ల రూపాయల వ్యయంతో 15 ఆసుపత్రులు, 111 వైద్యశాలలు, 59 సంచార వైద్యశాలలు, 1,255 మెడికల్ క్యాంపుల ద్వారా 83 లక్షల మందికి పైగా ప్రజలకు వైద్యసేవలు అందించడం జరిగింది.

విద్యారంగం: విద్యాసంస్థలలో కిండర్ గార్డెన్ నుండి యూనివర్సిటీ స్థాయి వరకు, వయోజన విద్య, శిక్షణ తరగతుల ద్వారా సుమారు 3.45 లక్షల మంది విద్యార్థుల విద్యాభ్యాసానికి 276.56 కోట్ల రూపాయలు వెచ్చించడం జరిగింది.

గ్రామీణ గిరిజన అభివృద్ధి పథకాలు: గ్రామీణ గిరిజనుల (30.73 లక్షల మంది) అభివృద్ధికై చేపట్టిన వివిధ పథకాల నిమిత్తం 52.45 కోట్ల రూపాయలు వినియోగించడం జరిగింది.

నిరంతరం అంకిత భావంతో మాకు సహాయ సహకారాలు అందిస్తున్న దాతలకూ, సభ్యులకూ, మిత్రులకూ, శ్రేయోభిలాషులకూ మా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనములు.

ధన్యవాదములతో...

స్వామి సుహితానంద
ప్రధాన కార్యదర్శి

రామకృష్ణ మిషన్
పి.ఓ. బేలూరు మఠం
హౌరా జిల్లా
పశ్చిమ బెంగాల్ – 711 202

స్వామి వివేకానంద 150వ జయంత్యుత్సవాల సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో 8-10-2010 నుండి 30-06-2014 వరకు చేపట్టిన వివిధ సేవా కార్యక్రమాల సంక్షిప్త నివేదిక:

1. గదాధర్ అభ్యుదయ ప్రకల్ప: (పిల్లల సంక్షేమ పథకం) 23 రాష్ట్రాలలో 174 శాఖల ద్వారా 18,100 మంది పిల్లలు లబ్ధి పొందారు. ఇందు నిమిత్తం 2,459.48 లక్షల రూపాయలు వెచ్చించడం జరిగింది.

2. వివేకానంద స్వస్థ్య పరిసేవా ప్రకల్ప: (తల్లి, పిల్లల ఆరోగ్యసేవా పథకం) 22 రాష్ట్రాలలో 126 శాఖల ద్వారా 13,500 మంది లబ్ధిపొందారు. ఇందు నిమిత్తం 1,689.29లక్షల రూపాయలు వెచ్చించడం జరిగింది.

3. శారదా పల్లి వికాస్ ప్రకల్ప (మహిళా సాధికారత): 8 రాష్ట్రాలలో 10 శాఖల ద్వారా 1,619 మంది మహిళలు లబ్ధిపొందారు. ఇందు నిమిత్తం 191.18 లక్షల రూపాయలు వెచ్చించడం జరిగింది.

4. స్వామి అఖండానంద సేవా ప్రకల్ప (దారిద్ర్య నిర్మూలన): 6 రాష్ట్రాలలో 10 శాఖల ద్వారా 1,135 మంది లబ్ధిపొందారు. ఇందు నిమిత్తం 191.10 లక్షల రూపాయలు వెచ్చించడం జరిగింది.

5. ప్రత్యేక సేవా కార్యక్రమాలు (తల్లితండ్రులకు, వృత్తి నిపుణులకు): 11 రాష్ట్రాలలో 18 శాఖల ద్వారా 3,350 మంది లబ్ధిపొందారు. ఇందు నిమిత్తం 79.24 లక్షల రూపాయలు వెచ్చించడం జరిగింది.

6. ప్రింట్ మీడియా పథకం: స్వామీజీ 'జీవితం –సందేశం' 12.68 లక్షల పుస్తకాలు 23 భాషలలోనూ; 17 వేరు వేరు శీర్షికలతో కూడిన 14 లక్షల పుస్తకాలు 10 భాషల్లోనూ; జర్మన్, ఝులూ భాషల్లో 0.04 లక్షల పుస్తకాలు ముద్రించడం జరిగినది. ఈ పుస్తకాల ముద్రణ నిమిత్తం 485.63 లక్షల రూపాయలను వెచ్చించడం జరిగింది.

7. యువతకు ప్రత్యేక కార్యక్రమాలు: 8 రాష్ట్రాలలో 10 యూత్ కౌన్సిలింగ్ సెల్స్ ప్రారంభించబడినవి. ఈ సదస్సుల్లో 4,860 మంది పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన రెండు యువసమ్మేళనాల్లో 19,000 మంది; ప్రాంతీయ స్థాయిలో నిర్వహించిన 5 యువసమ్మేళనాల్లో/ సదస్సుల్లో 11,594 మంది; రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన 14 యువసమ్మేళనాల్లో/ సదస్సుల్లో 58,324 మంది పాల్గొన్నారు. **విలువల ఆధారిత విద్యా కార్యక్రమాలు** – ఎ) 14 రాష్ట్రాలలో గల 397 యూనిట్లలో (నాన్–ఫార్మల్ టైపు) నిర్వహించిన సదస్సుల్లో 239 విద్యా సంస్థలకు చెందిన 17,654 మంది విద్యార్థులు; బి) 16 రాష్ట్రాలలో గల 2,692 యూనిట్లలో (క్లాస్‌రూమ్ బేస్డ్) నిర్వహించిన సదస్సుల్లో 767 పాఠశాలలకు చెందిన 1,20,870మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల నిమిత్తం 2,434.14 లక్షల రూపాయలు వెచ్చించడం జరిగింది.

8. ఎలక్ట్రానిక్ మీడియా పథకం: 'వ్యక్తిత్వ వికాసం', 'స్వామి వివేకానందుని దృష్టిలో విద్య'పై మల్టీమీడియా ఎఫెక్ట్స్‌తో ఆడియో డివిడి; స్వామి వివేకానంద బోధల ఆధారంగా 'భారతీయ మహిళ' ఒక డివిడి; డాక్యుమెంటరీ చలన చిత్రం ('ఎ పోయెట్', 'ఎ మేన్','ఎ మాంక్') రూపొందాయి. ఇందు నిమిత్తం 224.15 లక్షల రూపాయలు వెచ్చించడం జరిగింది.

9. సాంస్కృతిక కార్యక్రమాల పథకం: 13 రాష్ట్రస్థాయి సర్వమత సమ్మేళనాలు, 12 రాష్ట్రాలలో వివిధ మత విశ్వాసాలపై చర్చలు, 11 రాష్ట్రాలలో మత శాంతి సదస్సులు, 5 ఆదివాసీ మరియు గ్రామీణస్థాయి సాంస్కృతిక కార్యక్రమాలు, 14 రాష్ట్రాల్లో శాస్త్రీయ సంగీత కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాల నిమిత్తం 529.81 లక్షల రూపాయలు వెచ్చించడం జరిగింది.

పైన పేర్కొనబడిన 9 పథకాల నిమిత్తం 83.52 కోట్ల రూపాయలు వెచ్చించడం జరిగింది. ❖

(1884 – 1967)

ముందుకు సాగిపో!

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ, ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్న్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ - వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్న్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం, ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

సార్‌గాచీ,
22-1-1951

ప్రియమైన గౌర్!

నీవు వ్రాసిన లేఖలో నన్ను 'గొప్ప ఋషి' అని అభివర్ణించావు. ఈ విధమైన విచిత్ర సంబోధన ఆమోదయోగ్యం కాదు. నేను ఋషిని కాను. కేవలం 'అమ్మ బిడ్డను'. నీ హృదయం 'అమ్మబిడ్డలందరి' కోసం ద్రవిస్తే అప్పుడు నీకు స్వచ్ఛత చేకూరినట్లు భావించు.

మనమందరం రామకృష్ణ ఉద్యానంలో పువ్వులం. అందులో కొన్ని పూర్తిగా వికసించినవి, కొన్ని వికసించడానికి సిద్ధంగా ఉన్నవి. మనమందరం వికసిస్తాం. శ్రీరామకృష్ణుల వద్దకు వచ్చిన వారందరూ తప్పక గమ్యం చేరతారు. అయితే వారు కామకాంచనాలు, సోమరితనం మొదలైన వాటిని ఓడించి ముందుకు సాగాలి.

ఆతురత గల వ్యక్తులు వంటగదిలోకి తొంగి చూసి, అక్కడ ఉన్న అనేక వంటకాలను గమనించి "ఓహ్! ఎన్ని రకాల వంటకాలు! ఏమి సువాసనలు, ఎంత రమ్యంగా ఉన్నాయో" అని గుసగుసలాడుకుంటారు. మరికొందరు పదార్థాల పట్టిక (menu) చదివి ఊహించుకొని ఆనందిస్తారు. ఇది జీతం పుచ్చుకొనే వంటవాడు వండిన ఆహారం కాదు. అమ్మ చేతి వంట. ఋషులు, యోగుల కొరకు వండినవారు వారి ముఖాలను పరిశీలిస్తూ వడ్డిస్తారు. కానీ గౌరి, సీత, రాధ, విష్ణుప్రియ, శారదమ్మలుగా రూపుదాల్చిన ఆ జగన్మాత తన బిడ్డలందరికీ సమానంగానే వడ్డిస్తుంది.

జగన్మాత అపార కరుణాసింధువులో అందుబాటులో లేనిది ఏదీ ఉండదు. స్వచ్ఛమైన భక్తి, స్వచ్ఛమైన జ్ఞానం, జీవాత్మల స్వచ్ఛమైన సంధానం - ఇలా ఒక్క చుక్కకు కూడా కొరత ఉండదు. కాకపోతే కొంచెం ఓర్పుతో ఆగాలి. సరైన సమయం వచ్చేవరకు పళ్ళెం ముందుంచుకొని ఎదురు చూస్తూ ఉండాలి. నీ స్వధర్మాలను నిర్వర్తిస్తూ ఉండు, కానీ నీ స్థానాన్ని (భగవంతుడి పాదపద్మాలను) వీడకు. నీకు సమయం ఉన్నప్పుడల్లా 'పదార్థాల పట్టికను (శాస్త్రగ్రంథాలను)' చదువు.

అమ్మ వంటింట్లో అనేక రకాల పదార్థాలున్నాయి. అవన్నీ పూర్తి చెయ్యాలంటే ఒక జీవితకాలం సరిపోదు. నువ్వు సన్న్యాసుల గురించి, మహాపురుషుల గురించి చాలా చదివి ఉన్నావు గదా! వారంతా ఎన్ని ప్రతిజ్ఞలు చేశారో, ఎన్ని ఉపవాసాలు చేశారో, ధ్యానాలు, జపాలు, శాస్త్రగ్రంథ పఠనాలు... ఎన్నెన్ని చేశారో కదా! మనం అవన్నీ తలచుకుంటే భయపడతాం.

నువ్వు సహనాన్ని అలవరచుకోవాలి. 'తాం తితిక్షస్వ భారత - ఓ భరతా! ఓర్పుతో భరించు. వేరే మార్గం లేదు' అని అర్జునుడితో అన్నాడు శ్రీకృష్ణుడు. నీ కర్తవ్యాలను శ్రద్ధతో నిర్వర్తిస్తూ జగన్మాత కృప కోసం ఓర్పుతో వేచి ఉండు.

ప్రేమాశీస్సులతో
స్వామి ప్రేమేశానంద

తెలుగు సేత: *కె. త్రివిక్రమరావు*

(డా॥ గౌర్ పొద్దార్ గృహస్థ భక్తుడు. సార్‌గాచీ ఆశ్రమంలో వైద్యసేవలనందించారు.)

బ్రహ్మచర్యం వలన అద్భుతమైన సామర్థ్యం, సంకల్పశక్తి కలుగుతాయి. ఇంద్రియ నిగ్రహం వల్ల అద్భుతమైనశక్తి లభిస్తుంది. బ్రహ్మచర్యం లేనిదే ఎలాంటి ఆధ్యాత్మిక శక్తీ కలగదు. - స్వామి వివేకానంద

(...15వ పేజీ తరువాయి)

దాహార్తితో వచ్చిన గజరాజు, నీటిని త్రాగడంతోనే సరిపెట్టుకోక అత్యుత్సాహంతో సరోవరంలోకి దిగి మొసలి చేత చిత్రహింసల పాలయ్యాడు. మన మనసూ అంతే! సంబంధం లేనిది ఆశించి భంగపడుతుంది; బాధలననుభవిస్తుంది. అందుకే అన్నమయ్య

ముంచిన జగమిది మోహినీగజము
పొంచిన యాస పుట్టించే దిది
వంచనలు నిజము వలెనే వుండును
మంచులు మాయలే మరునాడు!

'జగం ఆశలు రేకెత్తించి, ఆనక కష్టాల్లో ముంచెత్తే మోహినీగజం లాంటిదని, వంచనలు కూడా నిజంలాగే కనిపిస్తూ, మరునాటికి మంచులా కరిగి, మాయలా అదృశ్యమై పోతాయ'ని అభిప్రాయపడ్డాడు.

దివ్యజనని శ్రీశారదామాత కూడా ఓ భక్తురాలితో 'మనస్సు భగవంతుణ్ణి వదలి అల్పమైన విషయాల వైపు వెళ్ళినప్పుడు, అవి ఎంత అశాశ్వతమో ఆలోచించుకో! 'అవి నిజంగా నాకు సంపూర్ణ ఆనందాన్ని ప్రసాదిస్తాయా?' అని ఆత్మవిశ్లేషణ చేసుకో! ఆ తరువాత వెంటనే భగవంతుడి పాదాల చెంత శరణాగతినొందు" అన్నారు.



మరులే మాపటికి...

లాభనష్టాల లావాదేవీలతో వర్తకులు, వినియోగదారులు సంతలకు వస్తూ ఉంటారు. ఎవరికి కావలసింది వాళ్ళు తీసుకొని, సరిచూసుకొని పొద్దుగూకగానే ఎవరి ఇళ్ళకు వాళ్ళు వెళ్ళిపోతూ ఉంటారు. అక్కడ వ్యాపారులకు, బేరగాళ్ళకు ఎవరికీ మరొకరితో సంబంధం ఉండదు. అదే భావనతో పద్మావతీప్రియుడి పరమభక్తుడు...

సరి సంసారము సంతల కూటమి
సొరిది పచారము చూపేదిది
గరిమ నెప్పుడు కలకల మనుచుండును
మరులగు విధమే మాపటికి...

'ఈ సంసారం కూడా సంతల కూటమే! వారి వారి ప్రారబ్ధాలను బట్టి ఈ అనుబంధాల అంగడిలోకి అడుగుపెడుతూ ఉంటారు. ఆ గడువు తీరే వరకు ఇచ్చుకోవడాలు, పుచ్చుకోవడాలు కొనసాగిస్తూ ఉంటారు; ఆత్మీయతలను ప్రదర్శిస్తూ ఉంటారు. అవి తీరగానే నిశ్శబ్దంగా నిష్క్రమిస్తారు' అంటాడు.

అయితే, చాలాసార్లు ఆ మమతలు మాధవుడిని మరపించేంతగా మనకు మత్తెక్కిస్తాయి. ఈ సంసార వ్యవహారాలు పైకి మాత్రం అమిత ఆకర్షణీయంగా, అట్టహాసంగా కనిపిస్తూ ఉంటాయి. కానీ జీవనసంధ్యా సమయంలో మసకబారి మరుగైపోతాయి. 'సొరిది' అంటే వరుస, క్రమం అని, 'పచారము' అంటే 'విహారం' అని అర్థం. 'గరిమ' అంటే 'పైకి' అని భావం.

ఇలా బాహ్యంగా చూడడానికి ఎంతో అపురూపంగా అనిపించి, మాపటికి కనుమరుగయ్యేదే సంసారం! అందుకే ఓ అజ్ఞాత మార్మిక కవి ఓ తత్త్వగీతంలో....

నీవారెవ్వరు లేరను సత్యము, మరువకు మెప్పుడు ఓ మనసా!
వ్యర్థములే నీ తిప్పటలన్నియు, ఈ లోకంబున ఓ మనసా...

అంటాడు. అయితే మమతలలో, అనుబంధాల్లో భగవంతుడిని చూడగలిగితే, ఇదంతా పరమాత్ముడి ప్రేమలీలగా తీసుకోగలిగితే ఈ లోకపు భ్రమలన్నీ ఆనంద హారతులుగా అర్పితమవుతాయి; వాంఛలన్నీ వినువీథుల్లో మబ్బుల్లా వీడిపోతాయి.

శ్రీవేంకటేశ్వరుడుండును...

మన మనసుకు తనువుతో ఉండే తాదాత్మ్యత అంతా ఇంతా కాదు! అది ఎప్పటికీ యౌవనంలో లాగా సౌందర్యంతో కాంతులీనుతూ ఉందనుకుంటాం! కానీ ముదిమితో దాని సొగసు ముగిసిపోతుందని మరచిపోతాం. శ్రీరామచంద్రుడు యుక్తవయస్సులో ఉన్నప్పుడు ఓ సందర్భంలో తీవ్ర వైరాగ్యభావనతో

న కించిదపి దృశ్యేఽస్మిన్సత్యం తేన హతాత్మనా ।
చిత్రం దగ్ధ శరీరేణ జనతా విప్ర లభ్యతే ॥ అని సమాలోచిస్తూ...

"మనసా! ఈ దృశ్య ప్రపంచంలో 'ఇది సత్యం' అని మనం అనుకోగలిగేది ఎక్కడైనా, ఏదైనా ఉందా? కనిపించే ఈ సమస్త దృశ్యంలో అంతర్గతమై ఒకానొక వస్తువులా ఉన్న ఈ శరీరం కూడా అసత్యమే అయి ఉన్నది కదా! అసద్రూపములై, దగ్ధప్రాయములైన ఈ శరీరాదులచే నీవు ఎందుచేత మోసాల పాలవుతున్నావు? ఎంత ఆశ్చర్యం! మెరుపులా అస్థిరంగా ఉండే ఈ శరీరంపై 'ఇది మాకు కలదు. ఇది ఇలాగే ఉండబోతుంది' అని భ్రమల్లో ఉన్నవారికి ఎవరు మాత్రం ఎలా చెప్పగలరు?"

ఇక్కడ శ్రీనివాసుడి సేవాగ్రగణ్యుడైన అన్నమయ్య కూడా

కందువ దేహము గాని ముదియదిది
అందిన బహురూప మాడేదిది
యెందును శ్రీ వేంకటేశ్వరుదుండును
డిందుపడగ నిదె తెరమరగు!

'మనసా! ఈ దేహాన్ని అపురూపంగా భావిస్తూ ఉన్నావు. కానీ వార్ధక్యంలో ఇది వదలిపోతుంది. ఆనక జన్మజన్మల్లో ఎన్నెన్నో రూపాలతో కొత్త కొత్త పాత్రల్ని పోషిస్తుంది. మళ్ళీ నటనలతో భ్రమింపజేస్తుంది. ఇక భ్రాంతిని వీడు! శ్రీవేంకటేశ్వరుడే శాశ్వతుడు, ఆతనిని శరణంటే ఈ నాటకాలన్నీ తెరమరుగవుతాయి' అని కీర్తనకు ముక్తాయింపు పలుకుతున్నాడు. ❖

మహాపురుషుని సాన్నిధ్య స్మృతులు

– స్వామి అర్చనానంద



పూజ్య రంగనాథానందజీ మహరాజ్ సంఘ ఉపాధ్యక్షులుగా భక్తులకు మంత్రదీక్షనిస్తూ హైదరాబాద్ మఠంలో ఉండేవారు. ఆ సమయంలో స్వామీజీ చేత మంత్రదీక్ష పొందిన ఒక బ్రహ్మచారి మఠంలోని దేవాలయంలో శ్రీరామకృష్ణులకు పూజాదికాలు (పూజారిగా) చేసేవారు. ఆయనకు తన గురుదేవులైన మహరాజ్ గారికి సేవ చేయాలనే తీవ్ర ఆకాంక్ష ఉండేది. కానీ సమయ లేమి వల్ల చేయలేకపోయేవారు. అప్పుడప్పుడూ చిన్న చిన్న సేవలు– స్వామీజీ భోజన పళ్ళెం తీసుకెళ్ళడం, తీసుకురావడం, బట్టలు ఉతికి ఆరవేయడం లాంటివి మహద్భాగ్యంగా లభించేవి. స్వామీజీ రాత్రి శయనించే ముందు, ఒకరిద్దరు బ్రహ్మచారులు వారికి ఆయుర్వేద తైలమర్దనం, పాదాలు ఒత్తడం మొదలగు సేవలు చేసేవారు. ఈ సేవలను తానూ చేయాలనీ, ఆ భాగ్యానికి 'తాను నోచుకోలేదే' అనీ ఆ బ్రహ్మచారి మథనపడుతూండేవాడు.

అంతర్యామి అయిన మహరాజ్ ఒకరోజు రాత్రి భోజనం తరువాత ఆ బ్రహ్మచారి పళ్ళెం తీసుకెళ్ళడానికి వచ్చి ప్రణామం చేస్తున్నప్పుడు ఇలా అన్నారు: "చూడు, నీవు సాక్షాత్తూ శ్రీరామకృష్ణులకే మందిరంలో సేవ చేస్తున్నావు. అదే అత్యంత ఉత్కృష్టమైన సేవ. శ్రీరామకృష్ణుల సేవను అత్యంత భక్తి, శ్రద్ధలతో చేయి. ఈ విషయం ఎన్నటికీ మరువవద్దు" అని చెప్పి దీవించారు. శ్రీరామకృష్ణుల సేవనే 'సర్వదేవదేవీ స్వరూపుల శ్రేష్ఠసేవ'గా మహరాజ్ భావించేవారు.

ఏ బ్రహ్మచారి అయినా స్వామీజీపై వ్యక్తిగత ప్రేమ, గౌరవం, ఆసక్తి పెంచుకొంటే వారిని ఇలా హెచ్చరించేవారు: "నీవు రామకృష్ణ మిషన్‌లో చేరావని గుర్తుంచుకో, రంగనాథానంద మిషన్‌లో కాదు". ఈ మాటలలో ఎంత అర్థమున్నదో, శ్రీరామకృష్ణులపై ఎంతటి పరిపూర్ణ శ్రద్ధ, పూజ్యత, శరణాగతి, ఆత్మసమర్పణ, నిరహంకారత ఉన్నాయో గ్రహించాలి!

భక్తులకు మంత్రదీక్ష శ్రీరామకృష్ణ దేవాలయం హాలులో ఇచ్చేవారు. మంత్రదీక్ష ఇచ్చే ముందు, ఇచ్చిన తర్వాత, ఆ రోజంతా కూడా పూజ్య స్వామీజీ ముఖమండలం దివ్యతేజస్సుతో ప్రభవించేది. శ్రీరామకృష్ణుల దివ్యప్రభను భక్తులపై వర్షింపజేస్తూ ఆ ప్రత్యేక సమయంలో వారు సాక్షాత్తూ శ్రీరామకృష్ణుల లాగే దర్శనమిచ్చేవారు. వారి ప్రతి పలుకులో, కదలికలో శ్రీరామకృష్ణుల దివ్యప్రేమ, కరుణ, ఆత్మ ఉన్మత్తత తొణికిసలాడేవి. మంత్రదీక్ష కోసం సుదూర ప్రాంతాల నుండి ఎంతో మంది భక్తులు వచ్చేవారు. దీక్షా తేదీ, సమయం చాలా రోజుల ముందుగానే నిర్ణయించి నిర్వాహకులు భక్తులకు తెలియజేసేవారు. తీరా దీక్షా సమయం రోజున ఎన్నోసార్లు స్వామీజీ ఆరోగ్యం బాగుండేది కాదు. కొన్నిసార్లు తీవ్రంగా కూడా! అలాంటి సమయంలో సేవకులు మహరాజ్‌తో 'మంత్ర దీక్షను రద్దు చేద్దామనీ, మీకు విశ్రాంతి అవసరమనీ' చెప్పేవారు. అయినా స్వామీజీ అందుకు ఒప్పుకొనేవారు కాదు. 'వారందరూ ఎంతో దూరం నుండి శ్రీరామకృష్ణుల కోసం, వారి మంత్రం కోసం ఎంతో ఆశతో, భక్తి శ్రద్ధలతో వచ్చారు. వారిని నిరాశపరచడం భావ్యం కాదు. నాకేమీ ఫరవాలేదు, దీక్ష ముగిశాక విశ్రాంతి తీసుకుంటాను' అనేవారు.

ఓసారి బేలూరు మఠంలో మంత్రదీక్ష ప్రసాదించిన తరువాత స్వామీజీ తమ గదికి వచ్చి బాత్‌రూమ్ వాష్ బేసిన్‌లో భళ్ళున వాంతి చేసుకున్నారు. ముఖం కడుక్కుని తిరిగి వచ్చి – "శ్రీరామకృష్ణులకు జయం! దీక్షా సమయంలో ఏమీ ఇబ్బంది కలగలేదు!" అన్నారు.

స్వామీజీ నుండి మంత్రదీక్ష కోసమే కాదు, వారి దర్శనానికి ఇంకా ఎక్కువ మంది సుదూర ప్రాంతాల నుండి వచ్చేవారు. ఎన్నోసార్లు భక్తుల రద్దీ విపరీతంగా ఉండేది. అలాంటి సమయంలో సేవక స్వామి ఒకసారి భక్తులతో కొంచెం కఠినంగా మాట్లాడారు (క్రమశిక్షణగా ఉండమని చెప్పడం కోసం). పూజ్య మహరాజ్ భక్తులందరూ వెళ్ళిపోయిన తరువాత ఆ స్వామితో, 'వారందరూ భక్తులు, వారు శ్రీరామకృష్ణుల వద్దకు వస్తున్నారు – నన్నూ నిన్నూ చూడడానికి కాదు. నీవు పోలీసులాగా కఠినంగా వ్యవహరిస్తే, వారు ఎక్కడికి వెళ్ళాలి?' అన్నారు.

ఆత్మలుప్తత్వం, ఆత్మసమర్పణలతో పూజ్య మహరాజ్ వారి జీవిత సర్వస్వమూ శ్రీరామకృష్ణులకే సమర్పితమై భాసించేది. ఈ మహోన్నత సద్గుణ సంపదతో శోభిల్లే స్వామి వారిని దర్శించిన మనం ధన్యులం కాదా! ఈ నిజమైన సంపద ఉండడం వల్లనే కదా టాటాలు, బిర్లాలు లాంటి 'సంపన్నులు' ఆకర్షితులై పూజ్య స్వామీజీ పాదపద్మాలకు సాష్టాంగ ప్రణామాలాచరించేవారు! ❖

(స్వామి రంగనాథానందజీ మహరాజ్, హైదరాబాద్ రామకృష్ణ మఠ సంస్థాపకాధ్యక్షులు, రామకృష్ణ సంఘ 13వ సర్వాధ్యక్షులు)

సత్పురుషుల సాంగత్యం గంగవలె పాపాలను పోగొడుతుంది; వెన్నెలవలె మనస్సుకు ఆనందాన్నిస్తుంది; సూర్యప్రభవలె అజ్ఞానాన్ని తొలగిస్తుంది; చెట్ల నీడవలె తాపాన్ని తీరుస్తుంది. – హితోపదేశం

- స్వామి పరిజ్ఞేయానంద

జీవితంలో సుఖదుఃఖాలు సహజమేనని గ్రహించి, సమ బుద్ధితో వ్యవహరించేవాడే ధీరుడనీ; అలాంటి నిశ్చలబుద్ధి కలిగినవాడే అమృతత్వానికి అర్హుడనీ భగవాన్ శ్రీకృష్ణుడు బోధించాడు. అయితే, ఈ అమృతత్వం కోసం ఎక్కడ వెతకాలి? కీకారణ్యాలలోనా? హిమగిరులలోనా? సప్తసముద్రాలలోనా? అనంతాకాశంలోనా? కలియుగంలో మానవులకు అంత శక్తి, సహనం, సమయం ఉండదని ఆ శోధనలు, పరిశోధనల్ని మన తరఫున మన ప్రాచీన ఋషులే చేసేశారు. ఆ అమృతభాండం, ఆ శాశ్వతానంద నిధి ఎక్కడో బయట లేదు, మనలోనే ఉందని నిరూపించారు.



నిత్యం విందాం ఈ గీతం!

మన మహర్షులు శోధించి, సాధించిన సత్యాలను విశ్వసించి అభ్యాసం కొనసాగిస్తే మనం కూడా అమృతత్వాన్ని పొంద గలం. అదెలా అంటే... అలలు లేని నిశ్చల సరోవరంలో అడుగుభాగాన్ని స్పష్టంగా చూడగలిగినట్లు, సుఖదుఃఖాలనే అలలు లేని నిశ్చల మానస సరోవరంలో పరమాత్మను దర్శించవచ్చు. అందుకు నిశ్చలబుద్ధిని సాధించడమే ప్రధానార్హతని శ్రీకృష్ణుడు నిర్దేశించాడు. ఆత్మదర్శనం పొందిన వ్యక్తి 'ఈ దేహం వేరు, దేహంలో ఉన్న దేహి (ఆత్మ) వేరు' అన్న అనుభూతితో జీవిస్తాడు.

ఈ దేహం నశించేది. కానీ దేహి మాత్రం శాశ్వతమైనదనీ; ఆత్మ అఖండం, అవ్యయం, అనంతమనీ; దేహం నశించిపోతే, దేహి మరో దేహాన్ని ధరిస్తుందనీ (భగవద్గీత 2.16-30)... ఇలా ఆత్మతత్త్వాన్ని శ్రీకృష్ణుడు, అర్జునుడి ద్వారా మనందరికీ తెలియపరచాడు.

దేహం శాశ్వతం కాదు, దేహి శాశ్వతమని పరిశోధించి ఆత్మతత్త్వాన్ని ప్రపంచానికి ప్రబోధించిన ఆత్మజ్ఞానులతో పునీతమైన పుణ్యభూమి మనది. మహోన్నత ఆధ్యాత్మిక నిధి ఉన్న పుడమి మనది. పాశ్చాత్యులకు ఈ దేహమే సర్వస్వం. వారు దేహాన్ని పోషించడం, పరిరక్షించడమే జీవిత పరమార్థంగా భావిస్తారు. కానీ మన ఋషులు ఈ దేహాన్ని ఆత్మతత్త్వ పరిశోధనకు ఓ ప్రయోగశాలగా పరిగణించారు. నిర్జీవమైన దేహాన్ని కూడా ఏళ్ళ తరబడి పరిరక్షించే పురాతన ఈజిప్టు నాగరకత గురించి మనం వినే ఉన్నాం. అదే మన ఋషులు ఈ దేహం నశించిన తరువాత "**వాయురనిల మమృత మథేదం భస్మాంతం శరీరమ్...** (ఈశావాస్యోపనిషత్తు) - పాంచభౌతిక పదార్థాలతో తయారైన ఈ దేహం ఆ యా పదార్థాలలో కలిసిపోవు గాక! ఈ శరీరం బూడిదవు గాక!" అని దేహం అశాశ్వతత్వాన్ని ఎలుగెత్తి చాటారు.

'మట్టి మట్టిలో, గాలి గాలిలో కలిసిపోయే తోలుబొమ్మరా ఈ దేహం' అని ధైర్యంగా చెప్పిన ధీర ఋషులకు వారసులం మనం. కానీ మన ప్రాచీన ఋషుల బోధనలను విస్మరించి పాశ్చాత్యుల వేషభాషలు అనుసరిస్తూ ఈ తోలుబొమ్మకే ప్రాధాన్యమిస్తున్నాం. ఉదయం లేచిన దగ్గర నుండి దేహ ధ్యాసే గానీ, దేహి ధ్యానమే మరచిపోయాం. కురుక్షేత్రంలో అర్జునుడి శోకానికీ, కర్మక్షేత్రంలో మన సమస్యలకూ కారణం ఈ దేహమనే రథంలో పరమాత్మ పరివేష్టితుడై ఉన్నాడనే ఎరుక లేకపోవడమే!

శ్రీకృష్ణుడు అర్జునుడికి ఆత్మతత్త్వాన్ని వివరించినప్పుడు అతడు శ్రద్ధతో విన్నాడు. అయితే, అప్పటికి ఆ ఆత్మానుభూతి అర్జునుడికి కలగలేదు. కానీ ఈ దేహం అనిత్యం, దేహి నిత్యమన్న జ్ఞానంతో స్వధర్మాన్ని నిర్వర్తించమని ప్రోత్సహించాడు శ్రీకృష్ణుడు. ఈ ఆత్మతత్త్వాన్ని కొంచెమైనా మనం అవగాహన చేసుకొంటే స్వధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించవచ్చు.

నేడు మనలో చాలామందికి భగవద్గీతను వినాలనే శ్రద్ధా లేదు, వినడానికి తీరికా లేదు. భగవద్గీత మొత్తం వినడానికి అందరికీ సమయం ఉండదని ఘంటసాల గారు ముఖ్యమైన శ్లోకాలను పాడి గీతాసారాన్ని మనకు అందించారు. అయితే, మనిషి జీవించి ఉండగా వినాల్సిన భగవద్గీతను మనిషి చనిపోయినప్పుడు వినిపిస్తున్నాం. చనిపోయిన వ్యక్తి ఎలాగూ వినలేడు, చుట్టూ ఉన్న వ్యక్తులకు ఆ ఏడుపుల హోరులో ఏమీ వినపడదు. ఇక ఆ భగవద్గీతాలాపన ఎవరి కోసం?

ఒక యువకుడు చదువు మీద ఏకాగ్రత కుదరడం లేదని సలహా కోసం వచ్చాడు. 'నీ దినచర్య ఏమిటి? అలవాట్లు ఏమిటి?' అని అడిగితే, 'సినిమా గీతాలు వినకుండా ఉండలేను. వినకపోతే పిచ్చెక్కిపోతుంది. అందుకే రోజంతా ఇయర్‌ఫోన్ చెవిలో ఉండాల్సిందే!' అని అన్నాడు. అతడి నిజాయతీకి మెచ్చుకోవలసిందే! కానీ సినిమా పాటలు వినడంలో చూపించిన శ్రద్ధ, భగవంతుని పాట (భగవద్గీత) వినడంలో కూడా చూపిస్తే చదువుపై ఏకాగ్రత చక్కగా కుదురుతుంది. నిజానికి భగవద్గీత వింటే ఉన్న పిచ్చి పోతుందన్న సంగతి ఈ తరానికి తెలియడం

☞

జీవన వేదం
స్వామీజీ కథల సారం

కావాల్సింది కరుణే!

మీరు కొన్ని వేల సంఘాలు పెట్టవచ్చు, ఇరవై వేల రాజకీయ కూటములు స్థాపించవచ్చు, యాభై వేల సంస్థలను ప్రారంభించవచ్చు గాక! ఇతరుల గురించి ఆలోచించే హృదయం, జాలి, ప్రేమ లేకపోతే అవన్నీ నిష్ప్రయోజనాలే. బుద్ధుని కరుణార్ద్ర హృదయం, శ్రీకృష్ణుని బోధనలు ఆచరణలోకి రానంత వరకు భారతీయులకు నిష్కృతి లేదు. మీరు యూరోపియన్లనూ, వారి సంస్థలనూ, కూటములనూ అనుకరిస్తూ పోతున్నారు. కానీ నన్నొక కథ చెప్పనీయండి. అది నా కళ్ళారా చూసిన యథార్థ సంఘటన. ఇక్కడ యురేషియన్లుగా మారిన కొందరు బర్మా దేశం నుండి కొంతమంది జనాన్ని లండన్ నగరానికి తీసుకు వెళ్ళారు. వీరిని లండన్ నగరంలో ప్రదర్శించి, డబ్బంతా దండుకొని, ఈ బర్మన్లను ఖండాంతరానికి తీసుకు వెళ్ళి వారి మానానికి వారిని వదిలేశారు. ఈ దీనులకు యూరోపియన్ భాష ఒక్క పదం కూడా తెలియదు. ఆస్ట్రియాలో ఉన్న ఆంగ్లేయ రాయబారి వారిని తిరిగి లండన్ నగరానికి పంపాడు. లండన్ మహానగరంలో వారికి ఎవరూ తెలియని నిస్సహాయ పరిస్థితి. కానీ ఒక ఆంగ్లేయ యువతి వారి గురించి విని ఆ బర్మా దేశస్థులకు తన స్వగృహంలో ఆశ్రయమిచ్చింది. వారికి కావలసిన సర్వ సదుపాయాలూ సమకూర్చిన తర్వాత, వారి పరిస్థితిని గురించిన వార్తను వార్తాపత్రికలకు పంపింది.

మీరు నమ్ముతారో లేదో, మరునాడు ఆ దేశం యావత్తూ ఒక్కసారిగా స్పందించింది. ధనం ప్రవాహమల్లే వచ్చిపడింది. ఈ బర్మా దేశీయులు మళ్ళీ వారి దేశానికి సురక్షితంగా వెళ్ళగలిగారు.

యూరోపియన్ల రాజకీయ, ఇతర సంస్థలన్నీ ఈ విధమైన దయాగుణంపై ఆధారపడి ఉంటాయి. వారికి సంబంధించినంత వరకూ ఈ గుణమే ప్రేమకు ఆయువుపట్టు. వారు ప్రపంచాన్ని ప్రేమించకపోవచ్చు. బర్మా వారు వారికి శత్రువులు కావచ్చు. కానీ ఇంగ్లాండు దేశంలో వారి సొంత మనుషులంటే అమిత ప్రేమ. వారి ప్రోత్సాహముంటే సత్యం, న్యాయం, వితరణలను క్రొత్త వారికి వారు చూపెడతారు.

పాశ్చాత్య దేశాలన్నింటిలోను నన్ను ఎంత అద్భుతంగా ఆదరించారో, ఎంత ఘనంగా ఆతిథ్యమిచ్చి నన్ను స్వీకరించారో మీకు చెప్పకపోతే, నా అంత విశ్వాస ఘాతకుడు మరొకడు ఉండడు. మనవారికి నిర్మాణాత్మకమైన హృదయమేది? ఒక జాయింటు స్టాకు కంపెనీ ప్రారంభించగానే ఒకరిని ఒకరు మోసం చేయడానికి ప్రయత్నిస్తాం. దానితో సర్వం నాశనం. మీరు ఆంగ్లదేశం గురించి మాట్లాడతారు, అంత గొప్ప దేశంలా మన దేశాన్ని కూడా నిర్మించాలంటారు. కానీ పునాదులు ఎక్కడ ఉన్నాయ్? మనదంతా ఇసుకే. అందుచేత అది ఒక్క దెబ్బకే కుప్పకూలుతుంది. ❖

వదలకుండా పట్టుకొనేది!

టార్టార్‌ను పట్టుకున్న ఒక వ్యక్తి కథ చెబుతాను. ఒక సైనికుడు పట్టణం వెలుపలకు వెళ్ళాడు. అతడు తిరిగి సైనిక స్థావరాల సమీపానికి రాగానే బిగ్గరగా "నేను ఒక టార్టార్ దేశస్థుణ్ణి పట్టుకున్నాను" అని అరిచాడు. లోపలి నుండి ఒక పిలుపు వినిపించింది – "అతడిని లోపలికి తీసుకురా!" అని.

సమాధానంగా "అతడు లోపలికి రావడం లేదు" అన్నాడు సైనికుడు. 'అయితే నువ్వు లోపలికి రా!' అందుకు 'అతడు నన్ను లోపలికి రానివ్వడం లేదు' అని ప్రత్యుత్తరమిచ్చాడు ఆ సైనికుడు.

ఇదే విధంగా మనం మనస్సులో 'టార్టార్'ను పట్టుకున్నాం. (టార్టార్ అంటే పాచి అని కూడా అర్థం ఉంది). దాన్ని మనం వదిలించుకోలేము, అది మనల్ని వదలదు. మనమందరం టార్టార్‌కు బందీలం. 'నిశ్చలంగా ఉండు, ప్రశాంతంగా ఉండు' అంటూ మనమెన్నో చెబుతుంటాం. ప్రతి పసిపాప అలా చెప్ప గలగడం, అలా చెయ్యగలనేమోనని భావించడం తేలికే. కానీ ఆచరణలో అది చాలా కష్టసాధ్యం. 'నా విధులన్నిటినీ ఒక ప్రక్కన పెట్టి కొండ శిఖరాలకు పోతాను. కొండ గుహల్లో, దట్టమైన అరణ్యాలలో నివసిస్తాను' అని అనడం సులభమే!

నేను టార్టార్‌ను పట్టుకున్నాను. ఎల్లవేళలా నా ప్రపంచం నాతోనే ఉంటోంది. ఈ 'టార్టార్' అన్నది నా మనస్సులో ఉన్నది. కనుక మనం బయటి అమాయకులను నిందించకూడదు. 'ఇవి మంచి పరిస్థితులు, ఇవి చెడు పరిస్థితులు' అని చెబుతుంటాం. కానీ లోపల ఉన్న ఈ టార్టార్‌ను నిశ్చలంగా ఉంచగలిగితే మనం చాలా బాగుంటాం. ❖ *తెలుగు సేత: కె. త్రివిక్రమరావు*

లేదు. 'నాకు సమస్యలు ఎదురైనప్పుడు పరిష్కారం కోసం గీతను పఠిస్తాను. గీత భవరోగాలకు మందు' అని గాంధీజీ అన్నారు. అలాగే 'పాలను తాగితే శారీరక పుష్టి కలిగినట్లు, గీతాసారాన్ని పానం చేస్తే మానసిక పుష్టి కలుగుతుంది. గీతను కేవలం పూజగదిలో ఉంచి పూజించడానికి కాదు. ప్రతి నిత్యం అందరూ గీతను పఠించాలి' అని స్వామి రంగనాథానందజీ అనేవారు.

భగవద్గీతను నిత్యం వినడం గానీ, పారాయణం చేయడం గానీ అలవాటు చేసుకుంటే జీవితంలో ధీరునిలా మహోన్నతంగా జీవించడం ఎలాగో (ఆర్ట్ ఆఫ్ లివింగ్), వీరునిలా ధైర్యంగా మరణించడం ఎలాగో (ఆర్ట్ ఆఫ్ డైయింగ్) అవగతమవుతుంది.

మనిషికి మరణించడానికన్నా జీవించడానికే ఎక్కువ ధైర్యం, నైపుణ్యం కావాలి. ఆ ఉన్నత లక్షణాలను అలవరచుకోవడానికి శ్రీకృష్ణుడు మన కోసం పాడిన గీతాన్ని (భగవద్గీత) అందరం క్రమం తప్పకుండా వినాలి. అలా ఈ గీతాన్ని రోజూ వింటూ ఉంటే మనలో దేహధ్యాస తగ్గి, దేహి(ఆత్మ)ధ్యానం పెరుగుతుంది. అప్పుడు జీవన కురుక్షేత్రంలో సమస్యల్ని సమర్థంగా ఎదుర్కొని, ప్రశాంతంగా జీవించగలుగుతాం. అమృతత్వాన్ని పొందగలుగుతాం. ❖

అన్నపూర్ణేశ్వరి ఆవిర్భావం

కథనం: భామతీ మైన్దన్ చిత్రాలు: వేంకట్ అనుసృజన: స్వామి జ్ఞానదానంద


5
పార్వతీదేవి తన వల్ల జరిగిన తప్పిదానికి ప్రాయశ్చిత్తం చేయగోరి తపస్సు చేయడానికి పరమేశ్వరుడి అనుమతిని కోరింది.
దేవీ! నువ్వు లోకమాతవు. నీకు ఏ పాపమూ అంటదు.
క్షమించండి స్వామీ! ఉన్నత స్థానంలో ఉన్నవారు బాగా యోచించి వ్యవహరించాలనే విషయం లోకులు గ్రహించడానికి, నేను చేసిన తప్పిదానికి ప్రాయశ్చిత్తంగా తపస్సు అనుష్ఠించాలి. నాకు అనుమతి నివ్వండి.

6
మహేశ్వరుని ఆశీస్సులతో పార్వతీదేవి దక్షిణ దిశగా బయలుదేరింది. దారిలో కాశీ నగరంలో క్షామం విలయతాండవం చేస్తూండడం ఆమె చూసింది. వెంటనే దేవి ఒక భవంతిని రూపొందించి, అందులో నివసించసాగింది. అన్నపూర్ణ అనే నామధేయంతో జనులందరికీ ఆహారం అందిస్తూ, వారి ఆకలి బాధను నివారించసాగింది.

7
వేలాది పేదలు అన్నపూర్ణాదేవి భవంతికి వచ్చి, అన్నం తిని వెళ్ళసాగారు. ఎంతమందికి అన్నం వడ్డించినప్పటికీ, దేవి అన్నపాత్రలో అన్నం తరగ లేదు.


8
ప్రజల ఆకలి బాధను స్వయంగా తీర్చడం సాధ్యం కాని కాశీ రాజు, దేవి చేస్తున్న అన్నదానం గురించి విని ఆశ్చర్యపోయాడు. అన్నపూర్ణ ఎవరన్నది తెలుసుకోవడానికి రాజోద్యోగులను పంపించాడు. వారు అక్కడకు వెళ్ళి ...
ఓ మాతా! మా రాజు మీ నుండి ధాన్యం అరువుగా పొందగోరుతున్నారు. దయచేసి ఇవ్వగలరా?
ధాన్యం అరువుగా ఇవ్వడం సాధ్యం కాదు. కావాలంటే రాజునే భుజించ డానికి ఇక్కడకు రమ్మనండి!

9
ఆ ప్రకారం, రాజు మర్నాడు మారువేషంలో వచ్చి వరుసలో నిలబడ్డాడు.
అన్నపూర్ణాదేవి ఇంతమందికి అన్నం అందిస్తున్నప్పటికీ, ఆమె అన్నపాత్రలో కించిత్తు కూడా అన్నం తరగడం లేదే! ఇది నిశ్చయంగా దైవశక్తి వల్లనే సంభవిస్తున్నది.
10
వెంటనే రాజు, అన్నపూర్ణాదేవికి భక్తితో ప్రణామం చేసి ...
అమ్మా! మీ మహిమ తెలుసుకోలేక మిమ్మల్ని పరీక్షించడానికి వచ్చాను. నన్ను క్షమించండి.
ఓ... నేడు ఆహారం స్వీకరించడానికి వచ్చింది కాశీ రాజా!
అమ్మా! నేను ఆహారం కోసం రాలేదు. నా ప్రజల ఆకలి బాధ తీర్చడానికి మిమ్మల్ని యాచించడానికి వచ్చాను.
11
అమ్మా! తమరు సదా ఈ కాశీ నగరంలోనే ఉండి మా దేశ క్షామాన్ని తొలగించమని ప్రార్థిస్తున్నాను.
నాయనా! నీ భక్తికి మెచ్చాను. నేను ఇంతకాలం ఇక్కడ ఉన్నందున మీ రాజ్యంలో క్షామం తొలగిపోయింది.
12
అమ్మ అలా పలుకుతూండగానే ఆకాశం మేఘావృతమైంది. వర్షం కురవ నారంభించింది. జనులు ఆనంద పరవశులయ్యారు.
అమ్మా! మీరు లేకుంటే నా రాజ్యం మళ్ళీ క్షామం వాతపడదా? మీరు ఇక్కడే ఉండిపోండి!







హిమవంతుని వంశాన్ని పవిత్రం చేయుదానవై,
కాశీపట్టణమునకు మహారాణివై, దయకు నిలయమైన తల్లీ!
అన్నపూర్ణేశ్వరీ! నీవు నాకు భిక్షనొసంగుము. - అన్నపూర్ణాష్టకమ్

వికాస మంత్రాలు

- స్వామి పార్థసఖానంద



సహన శక్తి

- సహనం అన్నిసార్లూ ఉపయోగపడక పోవచ్చు, కానీ అసహనం ఎన్నడూ ఉపయోగపడదు. తొందర పాటుకు ఫలితం పశ్చాత్తాపం.
- అజేయులైన ఇద్దరు యోధులు–సహనం, సమయం.
- ఎంతసేపు వేచి ఉండగలమని కాదు, వేచి ఉండే సమయంలో మనం ఎంత బాగా ప్రవర్తిస్తామో సూచించేదే సహనం.
- సహనం, అసహనం అనేవి పరస్పర వ్యతిరేకమైనవి, సహనం మనల్ని మానసికంగా బలవంతులుగా చేస్తుంది, అసహనం మనకు మతిస్థిమితం లేకుండా చేస్తుంది.

సత్సాంగత్యం

మనం ఒంటరిగా ఉన్నప్పుడు, ఒంటరితనంతో బాధ పడుతున్నామంటే, మనం దుర్జనుల సహవాసంలో ఉన్నట్లు!

- సజ్జనులతో చేసే ఏ ప్రయాణమూ సుదూరం కాదు.
- సజ్జన సాంగత్యం, సత్సంభాషణం, సత్కర్మాచరణం – ఇవే మనలోని ధార్మిక ప్రవృత్తిని దృఢతరం చేసేవి.
- సజ్జన సాంగత్యం, పరిమళ ద్రవ్యాల దుకాణాన్ని సందర్శించడం లాంటిది. మనం వాటిని కొన్నా, కొనకపోయినా, మనకు సువాసన అంటుకునే తీరుతుంది.
- మనిషి జీవితానికి ఆలంబనగా నిలిచే ముగ్గురు స్నేహితులు : సంపద – అదృష్టం ఉన్నంత వరకు తోడుగా ఉంటుంది. బంధువులు – శ్మశానం వరకు మాత్రమే తోడుగా ఉంటారు. పుణ్యం–శ్మశానం దాటిన తరువాత కూడా మనల్ని అనుసరిస్తుంది.

సృష్టికర్త ఒక్కడే!

మనం వేర్వేరు మతాలకు చెందిన వారమై ఉండవచ్చు, కానీ అందరం ఒకే లోకంలోనే ఉన్నాం కదా! ఈ లోకానికి సృష్టికర్త ఒక్కడే కదా! అంటే అన్ని మతాల వారూ తెలిసో, తెలియకో ఒకే సృష్టికర్తను పూజిస్తున్నారన్న మాట! ఇది అర్థం అయితే ఇక గొడవలే ఉండవు!!

Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust
and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020
and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**

Vol.72-2, Sri Ramakrishna Prabha (Telugu Monthly) February 2015, Regd. with the Registrar of Newspaper for India Under No.1120/57. Postal Registration No. HD-1071/2013-15. Licensed to Post Under WPP : AP/CPMG/HC-13/WPP/2015-16. Date of Publication : 18 January 2015

శివపార్వతుల వాసం
కైలాసం


చిత్రకారుడు : స్వామి భీతిహరానంద

భూతల స్వర్గమైన హిమాలయ పర్వత శ్రేణులలోని కైలాస పర్వతం పార్వతీ పరమేశ్వరుల నిలయంగా మన పురాణాలు ఘోషిస్తున్నాయి.

కైలాసానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే "కైలయోర్జల భూమ్యోః *ఆసనమ్ స్థితిః యస్య కేలాసః స్ఫటికమ్, తస్యా యమ్ కైలాసః* - జలంలోనూ, భూమిలోనూ స్థితమైన దాన్ని 'కేలాస్' అంటారు. కేలాస (స్ఫటిక) రూపంలో ఉంటుంది కాబట్టి దాన్ని 'కైలాసం' అంటారు. వరాహ పురాణాది గ్రంథాలు కైలాసపర్వత మాహాత్మ్యాన్ని వర్ణించాయి.

సనాతన సాహిత్యంలో కైలాస పర్వత వర్ణన కనిపిస్తుంది. వాల్మీకి రామాయణంలోని కిష్కింధ కాండలో సీతాన్వేషణ కోసం సుగ్రీవుడు శతబల వానరసేనను ఉత్తరదిశగా పంపిస్తూ, కైలాస పర్వతాన్ని కూడా పేర్కొన్నాడు.

మహాభారతంలోని అరణ్య, ద్రోణ, అనుశాసన పర్వాల్లో కైలాసపర్వత ప్రస్తావన ఉంది. అరణ్యపర్వంలో పాండవుల గంధమాదన యాత్ర సందర్భంలో కైలాస ప్రసక్తి వస్తుంది. మహాకవి కాళిదాసు ప్రసిద్ధ రచన 'మేఘదూతం'లో కూడా కైలాసగిరిని ప్రస్తావించారు.

మహాభారతంలోని భీష్మపర్వంలో కైలాస పర్వతాన్ని 'హేమకూటం' అనీ; కొన్ని పురాణాల్లో 'గణ పర్వతం'అనీ, 'రత్నాద్రి' అనీ పేర్కొన్నారు.

కృతయుగంలో మాంధాత; త్రేతాయుగంలో రావణ, భస్మాసురులు శివుణ్ణి ప్రసన్నం చేసుకునేందుకు కైలాసంలో తపస్సు చేశారు. ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు, అర్జునుడు, భీముడు, వ్యాసమహర్షి కైలాసపర్వతాన్ని దర్శించారు. ❖

With Best Compliments From

పక్యాల భాస్కర రావు, మేనేజింగ్ డైరక్టర్ & **పక్యాల గిరిజ,** డైరక్టర్

SVIS LABS LIMITED

SVISS LABSS LIMITED

(Manufacturers of Active Pharmaceutical Ingredients and Intermediates)

TÜV CERT DIN EN ISO 9001 : 2000 Certificate : 01 100 058568

Regd. Off. & Fact. : Plot No.88 & 89, Phase - II,
SIPCOT Industrial Complex, Ranipet - 632 403, Tamil Nadu.
Phone : 04172 - 244820, 651507, Tele Fax : 04172 - 244820
E-mail : rao@svisslabss.net Web Site : www.svisslabss.net

SVISS LABSS కంపెనీ వారు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 2,000 పాఠశాలలకు స్పాన్సర్ చేశారు.

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

మార్చి 2015

వెల: ₹10



సుబోధ

మీరు సంసారంలో ఉన్నారు, అలాగే ఉండండి. దానిలో ఉంటూనే సాధనలు చేయడం సులభం. ఇది కోటలో ఉంటూనే యుద్ధం చేసినట్లు. శవసాధన చేసేటప్పుడు శవం మధ్య మధ్యలో 'ఆ' అంటూ నోరు తెరచి, భయపెడుతుంది. అందువల్ల బియ్యం, వేయించిన పప్పులు ప్రక్కన ఉంచుకొని, దాని నోట్లో అప్పుడప్పుడు వేస్తూ ఉండాలి. శవం శాంతించాక నిశ్చింతగా జపం చేయవచ్చు. అదే విధంగా భార్యాబిడ్డలను శాంతియుతంగా ఉంచాలి. అప్పుడే సాధన, భజనలు చేయడానికి ఏ ఆటంకమూ ఉండదు.

సుఖభోగాల పట్ల ఇంకా ఆసక్తిగలవారు సంసారంలో ఉంటూనే భగవంతుణ్ణి ప్రార్థించాలి. కానీ నిజమైన సన్న్యాసి స్థితి ఇందుకు పూర్తిగా విరుద్ధం. చాతకపక్షికి అన్ని నీళ్ళూ నిష్ప్రయోజనమే; మరి ఏ నీటినీ త్రాగదు, కేవలం స్వాతీ నక్షత్రం నాడు కురిసే వాననీటికై అది నోరు తెరచుకుని ఉంటుంది. అదే విధంగా నిజమైన సన్న్యాసి భగవదానందం తప్ప వేరే ఆనందం దేన్నీ ఆశించడు. తేనెటీగ పువ్వుల మీద మాత్రమే వ్రాలుతుంది. యథార్థ సన్న్యాసి తేనెటీగ లాంటివాడు. సంసారులు మామూలు ఈగల లాంటి వారు. ఈగ అటు మిఠాయిల మీదా వ్రాలుతుంది, ఇటు కుళ్ళిపోయిన పదార్థాల మీదా వ్రాలుతుంది.

మీరు ఇంత శ్రమపడి ఇక్కడకు వచ్చారు. భగవంతుణ్ణి అన్వేషిస్తూ ఉన్నారు. అందరూ తోటను తిలకించడంతోనే సంతృప్తి చెందుతున్నారు. ఒకరిద్దరు మాత్రమే తోట యజమానిని వెదుకుతారు. లోకులు జగత్సౌందర్యాన్ని చూడడంలోనే నిమగ్నమై ఉన్నారు, దాని యజమానిని మాత్రం వెదకడం లేదు. ❖

శ్రీరామకృష్ణులు: భగవంతుణ్ణి వ్యాకులతతో ప్రార్థించాలి. మూడు ఆకర్షణలు ఏకం అయినప్పుడు భగవద్దర్శనం కలుగుతుంది. తల్లికి బిడ్డ పట్ల గల ఆకర్షణ, పతివ్రతకు భర్త పట్ల గల ఆకర్షణ, విషయాసక్తుడికి విషయవస్తువుల పట్ల గల ఆకర్షణ - ఇవే ఆ మూడు ఆకర్షణలు.

నిజమైన భక్తుడికి కొన్ని గుర్తులు ఉన్నాయి:

'పాములవాడి నాగస్వరాన్ని వినగానే విషసర్పం స్థిరమైపోయినట్లు, గురువు ఉపదేశం వినగానే అతడి మనస్సు స్థిరమైపోతుంది'.

'నిజమైన భక్తుడికి గ్రహణశక్తి ఉంటుంది. ఛాయాచిత్రం తీస్తున్నప్పుడు ఉత్త అద్దం మీద పటం నమోదు కాదు. కానీ నలుపు ద్రావణం పూసిన అద్దంపై పటం పడుతుంది. ఆ నలుపు ద్రావణమే భక్తి'.

'నిజమైన భక్తుడు జితేంద్రియుడై ఉంటాడు. కామాన్ని జయిస్తాడు'.

శ్రీరామకృష్ణ ప్రభ

రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాదు-500 029

ఫోన్: 040-27667799, సెల్: 8801849494

E-mail : sriramakrishnaprabha@gmail.com

నిర్వాహక సంపాదకులు: స్వామి జ్ఞానదానంద   సంపాదకులు: స్వామి పరిజ్ఞేయానంద



నరసింహ క్షేత్రంలో భక్తి నీరాజనం

అనంతపురం జిల్లాలోని కదిరి శ్రీరామకృష్ణ సేవాసమితి 2015 జనవరి 16,17,18 తేదీల్లో రామకృష్ణ – వివేకానంద భావప్రచార పరిషత్ 23వ వార్షిక భక్తసమ్మేళనాన్ని **కదిరిలో** అత్యంత వైభవంగా నిర్వహించింది.

ఈ మూడు రోజులూ ఉదయం 6 గంటలకు శ్రీరామకృష్ణ సుప్రభాతం, అష్టోత్తర శతనామ పూజ, రామకృష్ణ కథామృత పఠనం, కీర్తనలు, ధ్యానంతో కార్యక్రమం ప్రారంభమయ్యేది.

స్వామీజీలు, మాతాజీలు, ఇతర వక్తల ప్రసంగాలు; వివిధ సేవా సమితుల నుండి వచ్చిన భక్త బృందాల భజనలు; సాంస్కృతిక కార్యక్రమాలు భక్తుల్ని ఆద్యంతం అలరించాయి.

కదిరి, రామకృష్ణ సేవాసమితి జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరించింది.

ఈ భక్తసమ్మేళనంలో 30 మంది రామకృష్ణ మఠం స్వామీజీలు, శారదామఠం మాతాజీలు; రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన సుమారు 2,000 మంది భక్తులు; యువ సమ్మేళనంలో 1,500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలలో స్థానికులు, పరిసర గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనడం విశేషం.

ఈ మూడు రోజులూ భక్తులు ఖాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ప్రవహించిన భక్తిభావ వాహినిలో మునిగి తరించారు. ❖

ఆధ్యాత్మిక అమృతవాహిని
శ్రీ రామకృష్ణ ప్రభ

సంపుటం: 72 సంచిక: 3 మార్చి 2015

ప్రాతః నమామి రఘునాథ పదారవిందం
పద్మాంకుశాది శుభరేఖ సుఖావహం మే।
యోగీంద్ర మానస మధువ్రత సేవ్యమానం
శాపాపహం సపది గౌతమ ధర్మపత్న్యాః॥

పద్మము, అంకుశము మొదలైన శుభరేఖలతో శోభించునవి; ఆనందము నిచ్చునవి; మహాయోగుల మానసములనే తుమ్మెదలచే ఆస్వాదించబడునవి; గౌతమముని ధర్మపత్ని అయిన అహల్యను శాపవిముక్తురాలను చేసినవి అయిన శ్రీరామచంద్రుని పాదపద్మములకు ప్రాతఃకాలమున నమస్కరించుచున్నాను. – శ్రీరామ ప్రాతఃస్మరణ స్తోత్రం

సూక్తి సౌరభం

క్షణం విత్తం క్షణం చిత్తం
క్షణం జీవిత మావయోః।
యమస్య కరుణా నాస్తి
ధర్మస్య త్వరితా గతిః॥

“ధనం ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియదు. మనస్సు ఎప్పుడెలా మారుతుందో తెలియదు. ప్రాణం ఏ క్షణాన పోతుందో కూడా తెలియదు. యముడికి దయాదాక్షిణ్యాలు ఉండవు. కనుక సత్కార్యాలకు త్వరగా ఉపక్రమించు”.

విశ్వసింపదగిన వేషంబు మరిలేదు
కుడువ గూడులేదు కోకలేదు
విశ్వమయుడైన విభునేల తెలియరో
విశ్వదాభిరామ వినుర వేమ!

“ఓ వేమా! ఆర్భాటమైన వేషం లేదనీ, తినడానికి తిండిలేదనీ, కట్టుకోవడానికి బట్టలేదనీ లోకులు బాధపడుతూ ఉంటారు. కానీ సకలమూ ప్రసాదించే భగవంతుణ్ణి మాత్రం ఆశ్రయించరు. లోకం తీరు ఎంత విచిత్రమో కదా!”.



శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి



ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'కి ధన దానం చేసి ప్రోత్సహించాల్సిందిగా కోరుతున్నాం. దాతల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు...... రూ. 10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజ పోషకులు............ రూ. 5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు................. రూ. 1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

	దాత పేరు / ఊరు	రూ.
మహారాజ పోషకులు :	శ్రీమతి వై. రాజేశ్వరి, రెవెన్యూ కాలనీ, అనంతపురం	10,116
రాజ పోషకులు :	శ్రీ టి. సురేందర్, డి.డి. కాలనీ, బాగ్ అంబర్‌పేట్, హైదరాబాద్	5,100
రాజ పోషకులు :	శ్రీమతి వుంగరాల లక్ష్మీకాంతమ్మ,అశోక్‌నగర్, హైదరాబాద్ (కీ॥శే॥ ఎమ్.జాలయ్యనాయుడు&వెంకటరమణమ్మగార్ల జ్ఞాపకార్థం)	5,000
రాజ పోషకులు :	శ్రీ వై. శేషగిరిరావు, తిలక్‌నగర్, హైదరాబాద్	5,000
పోషకులు :	శ్రీమతి ఆర్. సరళకుమారి, మోతీనగర్, హైదరాబాద్	2,000
పోషకులు :	శ్రీ రేపల్లె కృష్ణస్వామి, కొత్తపేట, అవనిగడ్డ, కృష్ణాజిల్లా	2,000
పోషకులు :	శ్రీమతి రేపల్లె సావిత్రి, కొత్తపేట, అవనిగడ్డ, కృష్ణాజిల్లా	2,000
పోషకులు :	శ్రీ పెద్ది పవన్‌కుమార్ & శ్రీమతి శిరీష, భరత్‌నగర్, సిద్ధిపేట, మెదక్‌జిల్లా	1,234
పోషకులు :	శ్రీమతి కె. నాగలక్ష్మమ్మ, ఎ.పి.హెచ్.బి. కాలనీ, అనంతపురం	1,116
పోషకులు :	శ్రీ జె. మంజునాథ్, మహాసముద్రం, ఇరువరం, చిత్తూరు జిల్లా	1,116
పోషకులు :	శ్రీ సాయి సేవా ట్రస్ట్, శ్రీనగర్, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లా	1,116
పోషకులు :	శ్రీ బూర దామోదర్, విజ్ఞానపురి, విద్యానగర్, హైదరాబాద్	1,116
పోషకులు :	శ్రీ కొనకళ్ళ రామారావు, చింతలపూడి, ప.గో. జిల్లా (భార్య కీ॥శే॥ కె. నాగరత్నంగారి జ్ఞాపకార్థం)	1,116
పోషకులు :	శ్రీ కొల్లూరు చంద్రశేఖరరావు & శ్రీమతి సుజాత దేవి, ఇంద్రప్రస్థ కాలనీ, హస్తినాపురం సెంట్రల్, హైదరాబాద్	1,116
పోషకులు :	శ్రీ జి. డోకారెడ్డి & శ్రీమతి అరంజ్యోతమ్మ, కృష్ణారెడ్డి నగర్, కర్నూలు	1,100
పోషకులు :	శ్రీ దీపాల రాధాకృష్ణమూర్తి, కావలి, నెల్లూరు జిల్లా (కుమార్తె కీ॥శే॥ పద్మజ గారి జ్ఞాపకార్థం)	1,050
పోషకులు :	ధరణి ఎంటర్‌ప్రైజెస్, అరండల్‌పేట, గుంటూరు	1,000
పోషకులు :	శ్రీ సిహెచ్. నరసింహారావు, ఆర్.కె.పురం, సికింద్రాబాద్	1,000
పోషకులు :	శ్రీ ఎన్. సత్యనారాయణ, వారాసిగూడ, సికింద్రాబాద్ (కీ॥శే॥ ఎన్. కామేశ్వరిగారి జ్ఞాపకార్థం)	1,000

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

దాత పేరు	విద్యాసంస్థ
శ్రీ టి. సురేందర్, డి.డి. కాలనీ, బాగ్ అంబర్‌పేట్, హైదరాబాద్	హైదరాబాద్ చిల్డ్రన్స్ ఎయిడ్ సొసైటీ, నానల్‌నగర్, హైదరాబాద్
" " "	మాతృభూమి చారిటబుల్ ట్రస్ట్, అంగడి రోడ్, నర్సంపేట, వరంగల్‌జిల్లా
శ్రీ టి. శివయ్య,వేదాయపాలెం,నెల్లూరు (తల్లితండ్రులు కీ॥శే॥ తోట సామ్రాజ్యం&బిక్షయ్యల జ్ఞాపకార్థం)	గుంటూరు జిల్లాలోని మూడు ప్రభుత్వ పాఠశాలలకు జీవిత చందాను స్పాన్సర్ చేశారు.
శ్రీ కె. చిన్నయ్య, రవీంద్రనగర్, మహబూబ్‌నగర్	వరంగల్ జిల్లాలోని 20 పాఠశాలలకు ఒక సంవత్సరానికి పత్రికను స్పాన్సర్ చేశారు.
శ్రీ జి. ప్రభు, విద్యానగర్, హైదరాబాద్	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెల్జల్, తలకొండపల్లి, మహబూబ్‌నగర్ జిల్లా
శ్రీ ఎస్. చంద్రశేఖర్, నవోదయ విద్యాలయం, ఒంగోలు (కీ॥శే॥ శిష్ట్లా సీతారామయ్య గారి జ్ఞాపకార్థం)	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నిజాం పట్నం, గుంటూరు జిల్లా

చందా వివరాలు		భారతదేశంలో	విదేశాలకు
విడి ప్రతి	:	₹ 10	-
సంవత్సర చందా	:	₹ 100	₹ 1,500
మూడు సంవత్సరాలకు	:	₹ 280	₹ 4,500
ఐదు సంవత్సరాలకు	:	₹ 450	₹ 7,500
ఇరవై సంవత్సరాలకు	:	₹ 1,500	₹ 22,000

గమనిక: డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో Ramakrishna Math, Hyderabad అని వ్రాయాలి.

పంపవలసిన చిరునామా: Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.

చందాను ఆన్‌లైన్ http://rkmath.org/srkp ద్వారా చెల్లించవచ్చు.

లోపలి పేజీల్లో...

6 సంపాదకీయం
అరణ్యయానం సాధనా జీవనం

8 గోరుముద్ద
పిట్ట కొంచెం కూత ఘనం!

9 ఆధ్యాత్మిక నవవసంతం

10 పలికెడిది భాగవతం
మనుజ వల్లభ! మాధవు మరువరాదు

13 మన సంస్కృతి
భారతీయ నాట్య సంప్రదాయాలు

15 నీ నామమే కామధేనువు

16 పరిప్రశ్న

17 రామకృష్ణ భక్తి సూత్రాలు

18 జననే జగజ్జనని / అపర అర్జునుడు

19 మహాపురుషుని సాన్నిధ్య స్మృతులు

20 భగవంతునితో అనుసంధానం!

21 ధీరవాణి
స్వధర్మం... సమభావం

22 బహుకోణాల్లో భరతుని జీవితం

24 ఎంత తెలివైన వాళ్ళం!

26 ఆత్మీయతలను దూరంచేసే ఆడంబరం

27 యువవాణి
జీవించడానికి 1000 మార్గాలు

28 తరాలు... అంతరాలు

30 మాతృత్వం

31 ముందుకు సాగిపో!

36 భగవద్గీత - సద్గుణ సుధ
స్వచ్ఛ భారతం - స్వర్గ ధామం

37 జీవనోద్యానంలో మానవతా పరిమళాలు
జ్ఞానం విలువ / పాషాణ హృదయం

38 బొమ్మల కథ
అతిథిదేవో భవ!

ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు. – సంపాదకులు

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు మీద చిరునామాకు పైన మీ చందా నంబరు, కుడి వైపున మీ చందా గడువు ముగిసే నెల ఉంటాయి. మీ చందా గడువు పూర్తయ్యే నెలకు ముందుగానే సొమ్మును చెల్లించి చందాను పునరుద్ధరించుకోండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారిన పక్షంలో 7వ తేదీ లోగా మాకు తెలియపరచినట్లయితే, వచ్చే నెల సంచిక నుండి మీ కొత్త చిరునామాకు పంపబడును.
- ప్రతీ నెల 26 లేదా 27వ తేదీల్లో పత్రిక పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపుగా చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ.... – సర్క్యులేషన్ మేనేజర్

KCP CEMENT
CONCRETE CEMENT
Since 1958

With Best Compliments From
CHAIRMAN & MANAGING DIRECTOR
THE KCP LIMITED
KCP కంపెనీ వారు "శ్రీరామకృష్ణ ప్రభ" మాసపత్రికను
1000 గ్రంథాలయాలకు స్పాన్సర్ చేశారు

KCP Sreshtaa CEMENT
THE NEW GENERATION CEMENT

Cement Marketing Division : Plot No. 10, Gayatri Hills, MP & MLA's Colony, Road No. 10 C, Jubilee Hills, HYDERABAD - 500033.
Tel : 040-2325 3503 to 505, Fax : 2325 3500, Cell : +91 99895 97775 / 9866305145, E-mail : ramakrishna.k@kcp.co.in
Registered Office : No. 2, Dr.P.V.Cherian Crescent, Egmore, CHENNAI - 600 008. Tel : 044 66772668, Fax: 044 66772620, CIN L65991TN1941PLC001128

అరణ్యయానం

ఆధ్యాత్మిక జీవితం గడుపుతున్న ఒక సాధకుడు ఓ వరిష్ఠ సాధువును దర్శించడానికి వెళ్ళాడు. అతడు ఆ సాధువుకు ప్రణమిల్లుతున్నప్పుడు 'ఏమి నాయనా! బాగున్నావా?' అని ప్రశ్నించారు ఆయన. వెంటనే అతడు 'చాలా బాగున్నాను స్వామీజీ' అని బదులిచ్చాడు. అప్పుడు ఆ సాధువు 'అయితే, నీ ఆధ్యాత్మిక సాధన సరిగ్గా సాగడం లేదన్న మాట' అని అన్నారు. ఈ విషయాన్ని మరింత వివరంగా చెబుతూ, "చూడు నాయనా! భగవత్సాక్షాత్కారం కోసం సాధన చేసే సాధకుని జీవితం సాఫీగా సాగిపోతుందంటే అతడు భగవంతుని దర్శనం కోసం నిజంగా పరితపించడం లేదని అర్థం. మనలో ఆ ఆవేదనే ఉంటే సంతోషంగా ఎలా ఉండగలం? భగవద్దర్శనం కానంత వరకూ సాధకుని జీవితం ఆవేదనాభరితంగా, అసంతృప్తికరంగా ఉంటుంది. ఆధ్యాత్మిక జీవితంలో ఆర్తి, ఆవేదనలు లేవంటే అతడి సాధన మందకొడిగా సాగుతుందన్నమాట" అని వివరించారు.

ఒకసారి స్వామి యతీశ్వరానందజీ మహరాజ్ తమ గురుదేవులైన స్వామి బ్రహ్మానందజీ మహరాజ్ (శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష శిష్యులు) వద్దకు వెళ్ళి 'మహరాజ్! ఆధ్యాత్మికంగా పురోగమించాలంటే ఏం చేయాలో తెలపండి' అని ప్రార్థించారు. అందుకు మహరాజ్ గంభీరస్వరంతో 'పరితపించు, పరితపించు, పరితపించు' అని అంటూ ఆశీర్వదించారు. అంటే సాధకుడు భగవంతుని కోసం పరితపించినప్పుడే సాధనా జీవనం సాఫల్యమవుతుందని అర్థం.

ఆధ్యాత్మిక జీవితంలో గమ్యం చేరేవరకూ కష్టాలు, కలతలు, కన్నీళ్ళు తప్పవు. భగవద్దర్శనమే లక్ష్యంగా జీవించిన తుకారాం, మీరాబాయి, రామదాసు, రామకృష్ణుల్లాంటి ఎంతోమంది మహాభక్తులు భగవంతుని కోసం ఎంత ఆవేదన చెందారు! ఎన్ని కష్టాలు అనుభవించారు! రేయింబవళ్ళు ఎంత తపించారు! కాబట్టి సాధకునిగా మన జీవితం సాఫీగా సాగిపోతుందంటే మన సాధనలో తీవ్రత కొరవడిందనీ, తపన మందగించిందనీ, ఆవేదన సన్నగిల్లిందనీ అర్థం. అందుకే కెంపిస్ అనే యోగి *'The more a man desires to be spiritual, the more this present life becomes sorrowful to him* - ఆధ్యాత్మికంగా పురోగమించాలనే కోరిక ఉన్న సాధకునికి ఈ ప్రాపంచిక జీవితం ఆవేదనాభరితమవుతుంది' అని అంటారు.

ఆధ్యాత్మిక పథంలో పురోగమించి, భగవత్సాక్షాత్కారం పొందాలనుకున్న సాధకుడు కష్టాలను ఎదుర్కోవాలి, అవరోధాలను అధిగమించాలి, ప్రలోభాలను ప్రతిఘటించాలి. అప్పుడే భగవదనుభూతి లభిస్తుంది. ఆధ్యాత్మిక జీవితాన్ని రామాయణంలోని అరణ్యకాండతో అన్వయించుకుంటే సాధనపథంలో ఎదురయ్యే అవరోధాలు అవగతమవుతాయి.

విరాధుడు.. విరోధి: సీతా లక్ష్మణ సమేతుడైన శ్రీరాముడు దండకారణ్యంలో ప్రవేశించగానే ముందుగా ఏం చేశాడు?

ప్రవిశ్యతు మహారణ్యం దండకారణ్య మాత్మవాన్ ।
రామో దదర్శ దుర్ధర్ష స్తాపసాశ్రమ మండలమ్ ॥

'బుద్ధిశాలి, శక్తిశాలి అయిన శ్రీరాముడు దండకారణ్యంలో ప్రవేశించి అక్కడ మున్యాశ్రమాలను సందర్శించాడు' అని వాల్మీకి మహర్షి తెలిపారు. అలాగే తపోధనులైన శరభంగుడు, సుతీక్ష్ణుడు, అగస్త్యుడు లాంటి మునులను దర్శించాడు శ్రీరాముడు. అయితే, శ్రీరాముడు ఆశ్రమాలనూ, ఋషులనూ సందర్శించినంత మాత్రాన ఆయన అరణ్యవాసం సుఖంగా సాగిపోలేదు కదా! అరణ్యమార్గంలో ఎన్నో కష్టాలను అనుభవించాల్సి వచ్చింది, ఎంతోమంది అసురులను ఎదుర్కోవాల్సి వచ్చింది.

మనం కూడా ఆధ్యాత్మిక సాధనలను ప్రారంభించినప్పుడు ముందుగా పుణ్యాశ్రమాలను సందర్శిస్తాం, సత్పురుషులను దర్శిస్తాం, మహాత్ముల ఉపదేశాల ఆధారంగా జపతపాలను అభ్యసిస్తాం. అయితే, మహాత్ముల ఆశీస్సులతో సాధన జీవనం ప్రారంభించాం కాబట్టి మన ఆధ్యాత్మిక పయనం ఎలాంటి ఒడుదొడుకులు లేకుండా సాగిపోతుందనే భావనతో అలసత్వం, అతి విశ్వాసం, అజాగ్రత్తలతో వ్యవహరించ కూడదు.

అరణ్యవాసంలో శ్రీరాముడు రాక్షసులను ఎదుర్కొన్నట్లు మనం కూడా సాధన మార్గంలో అవరోధంగా నిలిచే కామ క్రోధాలనే రాక్షసులను జయించాలి.

అరణ్యమార్గంలో సీతా రామ లక్ష్మణులు వెళుతుండగా విరాధుడనే అసురుడు అడ్డుపడ్డాడు. శ్రీరాముణ్ణి చూసి 'నన్ను

సాధనా జీవనం

ఎవ్వరూ అస్త్రశస్త్రాలతో వధించలేరు' అని గర్జిస్తూ సీతాదేవిని తీసుకొని పారిపోయాడు. అప్పుడు శ్రీరాముడు మంత్రోచ్చారణ చేసి బాణాన్ని ప్రయోగించాడు. వాయువేగంతో పరిగెడుతున్న విరాధుడు రామబాణం తగిలి కుప్పకూలిపోయాడు.

సాధన మార్గంలో అవరోధమైన కామమే విరాధుడనే రాక్షసుడు. మరి ఈ కామాసురుణ్ణి ఎదిరించడమెలా? శ్రీరామకృష్ణుల శిష్యుడు యోగీంద్రనాథ్ (స్వామి యోగానంద) 'కామవాంఛలను పారద్రోలే మార్గాన్ని తెలపండి' అని అడిగినప్పుడు, 'భగవన్నామాన్ని జపించు' అని సూచించారు శ్రీరామకృష్ణులు. కాబట్టి శ్రీరాముడు మంత్రోచ్చారణతో బాణ ప్రయోగం చేసి విరాధుణ్ణి హతమార్చినట్లు, మనలోని కామాసురుణ్ణి మంత్రజపంతోనే నాశనం చేయాలి.

శూర్పణఖ క్రోధం... విపరీత పరిణామం: సీతా రాములు పంచవటిలో సంతోషంగా జీవిస్తున్న సమయంలో శూర్పణఖ ప్రవేశించింది. రాముని సుందర రూపానికి ఆకర్షితురాలైన రాక్షసి, రాముణ్ణి ప్రలోభపరచసాగింది. కామనారహితుడైన రాముడు ఆ రాక్షసి మోహజాలంలో పడలేదు. శూర్పణఖ వికృత చేష్టలను చూసిన లక్ష్మణుడు ఆమె ముక్కు, చెవులను ఖండించాడు. 'కామాత్క్రోధోభి జాయతే – తీరని కామం క్రోధంగా పరిణమిస్తుంది' అని శ్రీకృష్ణుడు బోధించినట్లు శూర్పణఖలోని కామవాంఛ తీరకపోవడం వల్ల అది క్రోధంగా మారింది. శూర్పణఖలో రగిలిన క్రోధాగ్నిని చల్లార్చుకోవడానికి ఆమె ఎన్నో పన్నాగాలు పన్నింది.

శూర్పణఖ, శ్రీరాముని పట్ల ప్రతీకారాన్ని తీర్చుకోవడానికి ఖరదూషణాదుల వద్దకు వెళ్ళి 'శ్రీరాముడు అసమానవీరుడ'ని కీర్తించి, వారిలో అసూయాద్వేషాలను రగిల్చింది. అలాగే రాముడు 'నీ కన్నా పరాక్రమవంతుడనీ, సీత అత్యంత సౌందర్యవత'నీ చెప్పి రావణుడిలోని మదమోహాలను ప్రేరేపించింది. మారీచుణ్ణి మాయలేడిగా పంపించి, రావణుడు మారువేషంలో సీతను అపహరించేలా చేసింది. శ్రీరాముడు సీతావియోగాన్ని భరించలేక రోదిస్తూ అరణ్యమంతా అన్వేషించ సాగాడు. లక్ష్మణుడు శూర్పణఖను కేవలం శిక్షించి వదిలేయకుండా అప్పుడే వధించి ఉంటే సీతారామలక్ష్మణులు శూర్పణఖ క్రోధాగ్నిలో చిక్కుకొని ఉండేవారు కాదు.

సాధన మార్గంలో ఎదురయ్యే క్రోధమనే శూర్పణఖను మొదట్లోనే సమూలంగా నాశనం చేయకపోతే, అది పగప్రతీకారాలు, ఈర్ష్యాద్వేషాలు, మదమోహాలుగా పరిణమించి జీవితాన్ని శోకమయం చేస్తుంది. ఈ క్రోధాన్ని అధిగమించడం ఎలాగో శ్రీరామకృష్ణులు చెబుతూ, "నీలో క్రోధం కలిగితే, నీకింకా భగవద్దర్శనం కానందుకు ఆయన పట్ల క్రోధాన్ని ప్రదర్శించు"అని సులభోపాయాన్ని సూచించారు. రామలక్ష్మణులు క్రోధరూపిణి అయిన శూర్పణఖను హతమార్చకుండా వదిలేయడం వల్ల అరణ్యవాసంలో కష్టాలపాలయ్యారు. అలాగే, సాధకుడు క్రోధాన్ని సమూలంగా నాశనం చేయకపోతే సాధనాపథంలో కష్టాలను అనుభవించాల్సి వస్తుంది.

శోకసముద్రం... శాంతినిధానం: సీతావియోగం శ్రీరాముణ్ణి శోకసముద్రంలో ముంచివేసింది. 'రాజ్యం పోయింది, తండ్రి మరణించాడు, బంధుమిత్రులు దూరమయ్యారు, తల్లి ప్రేమాప్యాయతలను కోల్పోయాను, ఇప్పుడు సీతావియోగం దావానలంలా నన్ను దహించివేస్తోంది' అంటూ శ్రీరాముడు విలపిస్తూ సీత జాడను తెలుసుకోవడానికి చెట్టుచేమల్నీ, కొండకోనల్నీ గాలించాడు. సీతావియోగాన్ని భరించలేక రాముడు 'నన్ను తాకిన అగ్ని కూడా చల్లబడిపోతుంది... నేను సముద్రంలో దూకినా అది ఎండిపోతుంద'నీ తన శోకాగ్ని తీవ్రతను లక్ష్మణునికి వెలిబుచ్చాడు. రాముడు సీత కోసం అనుభవించిన దుఃఖం వర్ణనాతీతం, చివరికి ప్రాణాలను సైతం విడిచిపెట్టేందుకు సిద్ధమయ్యాడు.

రాముడు, సీత కోసం విలపిస్తూ అరణ్యమంతా అన్వేషిస్తున్నప్పుడు, జటాయువు 'రావణాసురుడు సీతమ్మను ఆకాశమార్గంలో తీసుకువెళ్ళాడు' అని తెలిపింది. ఈ వార్త పరితపిస్తున్న రాముని హృదయంపై కురిసిన మంచు బిందువులా సాంత్వన చేకూర్చింది. ఆ తరువాత రామునికి వానరసేన సహకారం లభించింది. వారి సహకారంతో మదమోహాలకు ప్రతీకైన రావణాసురుణ్ణి హతమార్చి, సీతమ్మను తిరిగి పొందాడు రాముడు. అలాగే, సాధకుడు భగవంతుని కోసం ఆర్తితో విలపిస్తే, మహాత్ముల సాంగత్యం లభిస్తుంది. వారి సాంగత్య బలం వల్ల మనస్సులోని కామక్రోధాలు తొలగి ప్రశాంతత చేకూరుతుంది. ఆ ప్రశాంత చిత్తంతో జపధ్యానాలను అభ్యసిస్తే భగవద్దర్శనం లభిస్తుంది.

అరణ్యవాసంలో రాముడు కామాసురుడైన విరాధుణ్ణీ; క్రోధరూపిణి అయిన శూర్పణఖనూ; అసూయాద్వేషాలకు ప్రతీకలైన ఖరదూషణాదులనూ; మదమోహాలకు ప్రతిరూపమైన రావణాసురుణ్ణీ వధించి సీతమ్మను తిరిగి పొందాడు. అదే విధంగా మనం కూడా సాధనా పథంలో కామక్రోధాలనూ, అసూయా ద్వేషాలనూ, మదమోహాలనూ సమూలంగా నాశనం చేసినట్లయితే శోకసముద్రం దాటి శాంతినిధానమైన భగవంతుణ్ణి పొందగలం. ❖

క్రోధం వలన తపోఫలం క్షీణిస్తుంది. ఇంద్రియాలను జయించకపోతే మనశ్శాంతి దుర్లభం. కామ క్రోధ లోభాలు నిశ్శేషంగా తొలగినప్పుడే బ్రహ్మానుభూతి కలుగుతుంది. – *శతానందుడు, (రామాయణం)*

గోరుముద్ద

– స్వామి సుప్రియానంద

పిట్ట కొంచెం కూత ఘనం!

“మన పిల్లలు బాగుండాలి; చిన్నప్పటి నుండే మంచి గుణాలు వారికి అలవడాలి; మన ఆచార వ్యవహారాలు వారు తెలుసుకోవాలి, నేర్చుకోవాలి; జీవితంలో ఎంత పెద్ద సమస్య వచ్చినా ధైర్యంగా ఎదుర్కోగలగాలి; ఏ ఒడుదొడుకులు లేకుండా రోజులు సాఫీగా సాగిపోవాలి; వారు ఎప్పుడూ ఆనందంగా ఉండాలి...” అని ప్రతి తల్లి, తండ్రి కోరుకుంటారు, దేవుడిని ప్రార్థిస్తారు. ఇది సరిపోతుందా? ఇంకా ఏదైనా చేయవలసింది ఉందా?

ఈ మధ్య విదేశంలో ఉన్న ఒక రామకృష్ణ మిషన్ కేంద్రంలో మొట్టమొదటి సారిగా భక్తసమ్మేళనం జరిగింది. దానిలో చివరి ఘట్టంగా భక్తుల ప్రతిస్పందన కార్యక్రమం – ఈ కార్యక్రమంలో, పదేళ్ళ పిల్లవాడు వచ్చి తనకు మాట్లాడడానికి అవకాశం ఇవ్వవలసిందిగా కోరాడు. ఆ పిల్లవాడు ఏమి మాట్లాడుతాడోనని అందరూ ఆసక్తితో ఎదురుచూడసాగారు.

ఆ పిల్లవాడు ఇలా మాట్లాడాడు :

“నేను ఏడు సంవత్సరాలుగా ఈ ఆశ్రమానికి వస్తున్నాను. నాకిప్పుడు పదేళ్ళు. ఐదో తరగతి చదువుతున్నాను. నా చిన్నప్పుడు నన్ను ప్రతి వారం, అక్కతో పాటు మా అమ్మ, నాన్న ఆశ్రమానికి తీసుకొని వచ్చేవారు. అప్పుడు నాకేమీ అర్థమయ్యేది కాదు. ప్రసాదం మాత్రం తినేవాడిని. తరువాత ఆరాత్రికం, భజనలు పాడడం నేర్చుకున్నాను. మా అమ్మ, నాన్న కలకత్తాలోని బేలూరు మఠానికి వెళ్ళి ‘మంత్రదీక్ష’ తీసుకున్నారు. మా అక్క కూడా మంత్రదీక్ష తీసుకుంటానని పట్టుబట్టింది. ‘ఇప్పుడు నీకు ఇవ్వరు, రామకృష్ణ–వివేకానంద పుస్తకాలు చదవాలి, పదహారేళ్ళు వచ్చిన తరువాత చూద్దాంలే’ అని అమ్మ చెప్పింది. అప్పటి నుండి నేను కూడా చిన్న చిన్న వివేకానంద పుస్తకాలు చదవడం మొదలు పెట్టాను. గత సంవత్సరం మా అక్కను మంత్రదీక్ష కోసం బేలూరు మఠానికి తీసుకెళుతున్నారన్న సంగతి తెలిసింది.

అప్పుడు ‘నాకూ మంత్రదీక్ష తీసుకోవాలని ఉంద’ని మా అమ్మ, నాన్నలతో అన్నాను. అందుకు వారు అంగీకరించి అక్కతో పాటు నన్నూ బేలూరు మఠానికి తీసుకువెళ్ళారు. అక్కడ పూజ్య స్వామీజీ అక్కతో పాటు నాకూ మంత్రదీక్ష ఇచ్చారు. ఇప్పుడు నేను వారంలో కనీసం రెండు రోజులు ఆశ్రమానికి వస్తున్నాను. మా వయసు పిల్లలకు రూపొందించిన ‘వివేకానంద బాల విహార్’లో నేను సభ్యుణ్ణి. మా అమ్మ, నాన్న నేనొక చిన్నపిల్లవాడినని ఆశ్రమానికి తీసుకురాకుండా ఉంటే నేను ఇంట్లో వీడియోగేమ్స్ ఆడుకుంటూ కాలం గడిపేవాడిని. నాతోటి పిల్లలతో ‘ఐస్‌క్రీం’ తింటూ, ఆడుకుంటూ ఉండేవాడిని. ఈ రోజు నేను ఇక్కడ ఉండడానికి కారణమైన మా అమ్మ, నాన్నలకు, రామకృష్ణ మిషన్‌కు ఎప్పుడూ ఋణపడి ఉంటాను.”

తల్లితండ్రుల బాధ్యతను చెప్పకనే చెబుతున్న ఈ బాల వాక్కు, బ్రహ్మ వాక్కు. పెద్దల జీవితాలు పిల్లలకు ప్రేరణ కావాలి. కాబట్టి పిల్లల నుండి మనం ఏ గుణగణాలను ఆశిస్తామో అవి మన జీవితాలలో ప్రకాశించాలి. అప్పుడు మన కోరికలు నెరవేరుతాయి. ప్రార్థనలకు పరమార్థం చేకూరుతుంది. ❖

ఉగాది శుభాకాంక్షలు

‘శ్రీరామకృష్ణ ప్రభ’ పాఠకులకు, రచయితలకు, రచయిత్రులకు, ఏజెంట్లకు, ప్రకటనకర్తలకు, దాతలకు, శ్రేయోభిలాషులకు మన్మథనామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు. – *సంపాదకులు*

ఆధ్యాత్మిక నవవసంతం

– డాక్టర్ అపర్ణా శ్రీనివాస్

భారతీయ సంస్కృతి నుండి పండుగలు విడదీయరానివి. యాంత్రికంగా గడిచిపోయే జనజీవితాల్లో, పండుగలు జీవాన్ని నింపుతూ ప్రజలు ఉదారంగా, సాత్త్వికంగా ఉండేందుకు దోహదపడతాయి. తోటివారందరితో కలిసి ఆహ్లాదంగా, ఆనందంగా గడిపేందుకు సహాయపడతాయి. నదిలో నీరు పుష్కలంగా ఉన్నా, దాన్ని అవసరమైన మేరకు పంటకాలువలోకి మళ్ళించకపోతే పంట వృథా అయినట్లుగా, యాంత్రిక జీవనం నుండి సేదతీర్చే విధంగా, మనస్సులను ఆధ్యాత్మికత వైపు మళ్ళించేందుకు పండుగలు సహకరిస్తాయి. అలాంటి పండుగలలో ఉగాది, అంటే – సంవత్సరాది మొదటిది.

అనంత విశ్వంలో మానవుడు నిత్య వ్యవహారం కోసం పరిమాణం – కొలత అనే సిద్ధాంతాన్ని ఏర్పరచుకోవడంతో, అనంతమైన కాలాన్ని కూడా ఒక కొలతగా మన మహర్షులు ఏర్పరిచారు. అలా కాలాన్ని కొలిచే కొలబద్దే సంవత్సరం. దానికి అంతర్గతంగా అయనం, ఋతువు, మాసం, పక్షం, వారం, దినం ఏర్పరిచారు. యుగానికి ఆది అయిన రోజును యుగాది (ఉగాది)గా నిర్వచించినా, యుగానికి సంవత్సరం అని కూడా అర్థం ఉండడంతో, ఉగాదిని మనం సంవత్సరాదిగా కూడా వ్యవహరిస్తూ ఉంటాం.

భారతీయ కాలమానం ప్రకారం, సంవత్సరం వసంత ఋతువుతో ఆరంభం అవుతుంది. ఈ ఋతువు ప్రాముఖ్యాన్ని వివరించే విధంగా, '**ఋతూనాం కుసుమాకరః** – ఋతువులలో వసంత ఋతువును నేనే' అని శ్రీకృష్ణుడు *(గీత–10.35)* తెలియజేసాడు. ఈ కాలంలో ప్రకృతి సర్వత్రా నూతనత్వాన్ని సంతరించుకుని ఉంటుంది. చెట్లు చిగురిస్తాయి, చల్లని గాలులతో దిక్కులు ప్రసన్నంగా ఉంటాయి. పక్షుల కిలకిలారావాలతో, విరబూసిన చిగుళ్ళతో అటు పచ్చదనం, ఇటు ఎర్రదనం సంతరించుకున్న వృక్షాలతో జగత్తు అంతా ప్రకాశవంతంగా, శోభాయమానంగా గోచరిస్తూ ఉంటుంది. బాహ్యంగా ఈ జగత్తు అంతా ఏ విధంగా వసంతకాల ఆగమనంతో ఆనందభరితం, శాంతిమయం అవుతుందో, అదే విధంగా ఆంతరంగికంగా, ఆధ్యాత్మికంగా వసంతకాల ఆగమనం మన మానసిక జగత్తును కూడా ఆనందభరితం, శాంతిభరితం చేసే దిశగా మనం ప్రయత్నించాలి.

మన పండుగలలో విధులు, నియమాలు శారీరక, మానసిక, సామాజిక లాభాలను దృష్టిలో ఉంచుకునే ఏర్పాటు చేశారు. ఈ దృష్టితోనే ఉగాదినాడు తైలాభ్యంగనం, దైవారాధనం, నింబకుసుమ భక్షణం (షడ్రుచుల సమ్మిళితమైన ఉగాది పచ్చడిని స్వీకరించడం), ప్రపాదాన ప్రారంభం (చలివేంద్రాల ఏర్పాటు), పంచాంగ శ్రవణం చేయాలని చెప్పారు.

తైలాభ్యంగనం శారీరక ఆరోగ్యం దృష్ట్యా విధించారు. దీనితో పాటు హృదయాభ్యంగనం కూడా చేయాలి. దీనికై కావలసిన పరికరాలు ప్రేమ, దయ, కరుణ, పరోపకారం. వీటన్నింటిని మన జీవనంలో అలవరిచే ప్రయత్నంగానే, పరోపకారార్థం చలివేంద్రాలను ఈనాటి (ఉగాది) నుండి ఏర్పాటు చేయమంటూ దానిని ఒక సంప్రదాయంగా మన సంస్కృతిలో మలిచారు. ఈ విధంగా బాహ్యంగా శరీరాన్నీ, ఆంతరంగికంగా హృదయాన్నీ శుద్ధి పరుచుకున్నాక, దైవారాధనకు ఉపక్రమించాలి. భగవంతునితో పరిపూర్ణ హృదయంతో సంభాషించేందుకు ఈనాటి నుండి వరుసగా తొమ్మిది రోజుల పాటు చేసే వసంత నవరాత్రుల పూజలు మొదలవుతాయి. శక్తి ఆరాధనకూ, శ్రీరామచంద్రుని ఆరాధనకూ ఉపయుక్తమై సాధకులకు మోదాన్ని కలుగజేస్తాయి. నింబకుసుమ భక్షణం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తూ, అంతర్గతంగా జీవిత సత్యాన్ని ప్రబోధిస్తుంది. ఇక పంచాంగ శ్రవణానికి వస్తే, ఆ పరమాత్ముని పంచ అంగాల (తిథి, వారం, నక్షత్రం, కరణం, యోగం) రూపేణా పూజిస్తూ, ఆ వివరాలను శ్రవణం చేయడం మానవ జన్మ పరమార్థాన్ని గుర్తించేందుకే అని అర్థం చేసుకోవాలి.

సాధారణంగా మనం ఏ వస్తువును కొనాలనుకున్నా, ముందుగా దాని ఖరీదునూ, నాణ్యతనూ విచారించి, తరువాత స్తోమతను బట్టి దాన్ని కొనే ప్రయత్నం చేస్తాం. అనిత్యాలు, అశాశ్వతాలు అయిన సాధారణమైన వాటికే ఎంతో ఆలోచనను, విచారణను చేసే మనం ఒక అతి ముఖ్య విషయంలో ఏమరుపాటుతో ఉన్నాం. అదేమిటంటే, చాలా ప్రయత్నం మీద, ఎంతో సుకృతంతో, అతి కష్టం మీద లభించిన ఈ మానవజన్మ విలువను గుర్తించలేక, దాన్ని సరిగా ఉపయోగించుకునే విధానం ఎరుగక, వృథాగా కాలయాపన చేస్తున్నాం. అందుకే కబీర్‌దాస్

గంవాయి సోయేకర్ దివస్ గంవాయా ఖాయ్ ।
హీరాజనమ్ అనమోల్‌థా కౌడీ బదలే జాయ్ ॥

'రాత్రంతా నిద్రలోనూ, పగలంతా తినడంలోనూ అయిపోతోంది. అమూల్యమైన వజ్రం లాంటి మానవజన్మను, గవ్వలా భావిస్తూ బ్రతుకుతున్నావు' అని అన్నారు.

మనం వ్యావహారికంగా ఎన్ని భాషలు నేర్చుకున్నా, పారమార్థికంగా హృదయభాషను అభ్యసిద్దాం. ఉదయం నిద్రలేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ఏ విధంగా కాలాన్ని

(మిగతా 35వ పేజీలో...)

మహర్షి విశ్వామిత్రా! శ్రీరామున్ణి చూసినకొలదీ నాకు అతని పట్ల అనురాగం అధికమవుతూ ఉన్నది. బ్రహ్మధ్యానం కూడా మరచి నా చిత్తం అతనియందే లగ్నమవుతుంది. – *జనకుడు, (రామాయణం)*

మనుజ వల్లభ! మాధవు మరువరాదు

– స్వామి జ్ఞానదానంద

ధర్మం దారి తప్పి, విపరీత పరిస్థితులు దాపురిస్తున్నాయంటూ... మారిన కాలగతిని విషాద వదనుడై విశ్లేషించుకుంటూ ధర్మరాజు, భీమసేనుడి ముందు మథనపడుతూ కూర్చొన్నాడు. అంతలో ద్వారకానగరం నుంచి వచ్చిన అర్జునుడు అశ్రుపూరిత నేత్రాలతో అన్న పాదాలపై వాలిపోయాడు. చింతాక్రాంతుడై తల్లడిల్లిపోతున్న తమ్ముణ్ణి చూసి ఆ పాండవాగ్రజుడు, 'నాయనా! అర్జునా! ఎందుకలా కన్నీళ్ళు పెడుతున్నావు? అక్కడ అందరూ క్షేమమే కదా? ఏ మహానుభావుని కరుణాకటాక్షవీక్షణాలు మనపై శుభాశీస్సులై వర్షిస్తున్నాయో, ఆ మాధవుడు, మధుసూదనుడు, మంగళాకారుడు కుశలమే కదా?' అని ప్రశ్నించాడు. ఇలా ధర్మజుడు అడగగానే అర్జునుడు అరచేతులతో అశ్రువులను తుడుచుకుంటూ, మాటలు రాక గద్గద స్వరంతో...

మన సారథి, మన సచివుడు
మన వియ్యము, మన సఖుడు, మన బాంధవుడున్
మన విభుడు, గురుడు
దేవర, మనలను, దిగనాడి చనియె, మనుజాధీశా!

'మహారాజా! ఏమని చెప్పేది! మనను అన్నీ తానై ముందుకు నడిపించిన మన సారథి, ప్రభువు, బంధువు, మంత్రి, గురువు వాసుదేవుడు మనకిక లేడు! మనల్ని వదిలి మరలిరాని లోకానికి తరలిపోయాడు' అంటూ విలపించాడు.

శ్రీకృష్ణభగవానుడు కౌరవుల కుట్రల నుంచి తమను కాపాడడం మొదలుకొని కురుక్షేత్ర సంగ్రామంలో విజయులను గావించేంత వరకు ఆయన చేసిన మహోపకారాలను ఒక్కటొక్కటిగా మననం చేసుకున్నాడు. 'ఈ భూభారాన్ని తీర్చి, ఆ అచ్యుతుడు, అప్రమేయుడు తాను వచ్చిన కార్యాన్ని పూర్తి చేసుకొని, నిబ్బరంగా వెళ్ళిపోయాడు. ఇక ఏమి చెప్పేది?' అన్నాడు. వ్యక్తిగతంగా వాసుదేవుడు తనతో గడిపిన మధురస్మృతులను విజయుడు నెమరువేసుకుంటూ...

నొక్క శయ్యాసనంబున నుండ
కన్నతండ్రి కైవడి చేసిన తప్పు కాచు
హస్తములు పట్టి పొత్తున నారగించు
మనుజవల్లభ! మాధవు మరువరాదు!

'అన్నయ్యా! ఆ వాసుదేవుడికి నేనంటే ఎంత ప్రేమ! ఒకే పక్క మీద కూర్చోపెట్టుకొని కన్నతండ్రిలా నా తప్పులు సరిదిద్దేవాడు. మరొకమాటు నా చేతులు పట్టుకొని బలవంతం చేసి ఆరగింప చేసేవాడు. అటువంటి మాధవుడిని మరచిపోవడం ఎలా!' అని కుమిలిపోయాడు. మానసిక సంతాపాన్ని శమింపచేసే ఆ వాసుదేవుని వాక్కులను స్మరించుకుంటూ మౌనం వహించాడు.

కురిసిన కవితామృత వర్షధారలు: ఆ పరంధాముడి పరమపద పయనాన్ని పార్థుడి నోట పలికిస్తూ పోతనామాత్యులు ఈ సందర్భంలో హృదయాన్ని హత్తుకునే పద్యాలను చిలికించారు. ధర్మసంస్థాపనార్థం ఆ దేవదేవుడు పాండవపక్షం వహించి అనుక్షణం వారిని కంటికి రెప్పలా కాపాడుకున్న వైనాన్ని విజయుడు వివరిస్తున్న వేళ ఆ సహజ పండితుడి ఘంటం నుంచి కవితామృతధారలు కురిశాయి. అందుకే ఆ పోతనభాగవతాన్ని వ్యాఖ్యానిస్తూ ఓ ఘట్టంలో సాహితీవేత్త 'కరుణశ్రీ' జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు...

ఎండిన మ్రోడులే కిసలయించెనొ! ఏకశిలాపురమ్ములో
బండలు పుల్కరించెనొ! అపారముదమ్మున తెల్గు తల్లికిన్
గుండెలు పొంగిపోయి కనుగొల్కులు నిండెనొ, పచ్చిపైరులే
పండెనొ!జాలువారిన భవత్కవితామృత వర్షధారలన్

'కావ్యంలో జాలువారిన కవితామృత వర్షధారలకు ఏకశిలాపురంలో ఎండిన మోడులు కూడా చిగురించి ఉంటాయి, రాతిబండలూ పులకరించి ఉంటాయి, తెలుగు తల్లి హృదయం

పొంగిపోయి కనుల నుంచి ఆనందభాష్పాలు రాలి ఉంటాయి, పైరులు పచ్చగా పండి ఉంటాయ'నీ కొనియాడారు.

బహుగ్రంథకర్తగా కాకుండా కేవలం భక్తుడిగా భాగవతాన్ని అనువదించడం వల్ల పోతనకు భగవంతుడు ప్రసాదించిన పాండిత్య వరమిది. పలు ఘట్టాలలో సంస్కృత భాగవతం కన్నా తెలుగు భాగవతం పరమరమ్యతను ప్రాప్తించుకోవడానికి పరమాత్ముడి ఈ ప్రేరణే కారణం.

సారథి...సఖుడు: సర్వేశ్వరుడే సారథిగా, సఖుడిగా మెలగడం పాండవులు చేసుకున్న అదృష్టం. అందుకే జగద్దీపమైన సూర్యుడు అస్తమించినప్పుడు లోకం అంధకారంలో విలవిలలాడినట్లు, పాండవులు శ్రీకృష్ణ పరమాత్ముడు తనువు చాలించినప్పుడు విచలితులయ్యారు. ముఖ్యంగా శ్రీకృష్ణుడికి సహచరుడిగా మెలిగిన ఆ సవ్యసాచి దిక్కులేని పక్షిలా పరితపించిపోయాడు. ఏ యుగంలోనైనా అవతార పురుషుల ఆఖరిఘడియలు అంతేవాసులకు, అనుంగు శిష్యులకు అగమ్యగోచర స్థితినే కల్పిస్తాయి. అయితే అవతారమూర్తులు స్థూలశరీరాన్ని వదిలివేసినా, సూక్ష్మశరీరంతో అంతర్యామిగా అంతటా వ్యాపించే ఉంటారు. అదృశ్యంగా వారు, వారి ప్రబోధాల రూపంతో రక్షణగా నిలుస్తూనే ఉంటారు. శ్రీకృష్ణుడు భగవద్గీత, శ్రీమద్భాగవతం, పరమభక్తుల రూపాల్లో అంతర్యామిగా సుస్థితుడై ఉన్నాడు. భక్తులను సేవించుకుంటూ, భాగవతాన్ని, భగవద్గీతను పఠిస్తూ ఉంటే పరోక్షంగా శ్రీకృష్ణపరమాత్ముని ఆరాధిస్తున్నట్లే!

ఆత్మేశ్వరుడైన ఆ శ్రీహరి సారథ్యం లేని రథంపైనున్న నేనూ, నా గుర్రాలు, నా విల్లు, శత్రుసంహారకాలైన శరసమూహాలన్నీ నిరుపయోగమయ్యాయని విజయుడు విలపించాడు.

గౌతమ బుద్ధుడు మరణశయ్య మీద ఉన్నప్పుడు వారి శిష్యులు, అనుయాయులు కూడా ఆవేదనకు గురయ్యారు. అదే బాధతో ఆ తథాగతుడి ప్రధాన శిష్యుడు ఆనందుడు 'గురుదేవా! మీరు వెళ్ళిపోయాక, మాకు ఎవరు దిక్కు? ఎవరు బోధిస్తారు?' అన్నాడు. అందుకు గౌతముడు 'సత్యమూ, నేను రూపొందించిన సంఘ నియమావళి మీకు గురువుగా ఉంటాయి' అన్నాడు. అవతార వరిష్ఠులైన భగవాన్ శ్రీరామకృష్ణుల లక్ష్యానికి సారథిగా నిలిచిన స్వామి వివేకానంద తమ గురుదేవుల మహాసమాధి అనంతరం కంటికీ మింటికీ ఏకధారగా రోదించారు. 'నన్ను నా తల్లితండ్రుల కన్నా, బంధుమిత్రుల కన్నా అధికంగా ప్రేమించి, విశ్వసించి, నా కోసం వీథివీథినా బిచ్చమెత్తడానికి కూడా సిద్ధపడ్డ నా గురుదేవులు అనన్యసామాన్యులు. ఆయన తలుచుకుంటే, మట్టిలో నుంచి నా లాంటి వివేకానందలను వేలమందిని తయారు చేయగలరు' అని ఘోషించారు.

స్వ,పర భేదమెరుగని సర్వేశ్వరుడు : ద్వారకాధీశుడైన శ్రీకృష్ణపరమాత్ముడు దివికేగినాక, విధివైపరీత్యంతో యదుకులం వినాశనమైన రీతిని విజయుడు సోదరులకు విలాపంతో వివరించాడు. ఒక ముల్లుతో మరో ముల్లును పెకలించి, ఆ తరువాత రెంటినీ దూరంగా పారవేసే వివేకవంతుడి లాంటి వాడు భగవంతుడు. అదే విధంగా దేవకీనందనుడిగా దేహాన్ని ధరించి జగత్కంటకులైన రాక్షసులను సంహరించి, తుదకు తన శరీరాన్ని కూడా విడిచిపెట్టాడు. సంహార విషయంలో సర్వేశ్వరుడికి స్వ,పర భేదాలు లేవని నిరూపించాడు. అవతార పురుషులకు సాధారణ మానవుల్లా దేహభ్రాంతి, దేహప్రీతి ఉండవు. ఎంత స్వేచ్ఛగా శరీరాన్ని దాల్చగలరో, అంతే స్వచ్ఛందంగా దానిని వదిలేయగలరు కూడా!

అందుకే **'సంహారంబునకు నిజశరీర పరశరీరములు రెండు నీశ్వరునకు సమంబులు'** అంటోంది భాగవతం. భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస గొంతు క్యాన్సర్‌తో బాధపడుతూ, మహాసమాధి ఘడియలకు దగ్గర పడుతున్న సమయంలో స్వామి వివేకానంద తదితర శిష్యులు దుఃఖంతో 'మీ దేహం మరికొంత కాలం నిలిచేట్లు సంకల్పించుకోండి!' అని ప్రాధేయపడ్డారు. అప్పుడు శ్రీరామకృష్ణులు "భగవంతుడైనా మానవరూపాన్ని దాల్చినప్పుడు కష్టాలు అనుభవించాల్సిందే! అందరికీ ఒకే న్యాయం వర్తించాల్సిందే! ఈ దేహధారణ, వ్యాధి, మరణం కూడా భక్తుల కోసమే!" అన్నారు. వారు మహాసమాధి అనంతరం శ్రీశారదామాతకు దర్శనమిస్తూ, "నేనెక్కడికి వెళ్ళిపోయాను? ఒక గదిలో నుంచి మరో గదిలోకి వెళ్ళాను, అంతే!" అన్నారు.

పరీక్షిత్తు పట్టాభిషేకం...: కృష్ణపరమాత్ముడి మహాప్రస్థానానంతరం వారి సంకల్పానుసారం ద్వారకానగరం కడలిగర్భంలో కలసిపోయింది. యాదవవీరులంతా నాశనమయ్యారు. ఆపై కలికాలం ఆరంభమైంది. ఆ కలిప్రవేశంతో ధర్మరాజు వానప్రస్థానికి సిద్ధమయ్యాడు. హస్తినాపురం సింహాసనంపై మనవడైన పరీక్షిత్తును కూర్చుండపెట్టాడు. పవిత్ర సింధూజలాలతో అభిషేకించి పట్టాభిషిక్తుడిని చేశాడు. మమకారాలను త్యజించి...

చిత్తంబున బ్రహ్మము నా వృత్తము గావించు కొనుచు విజ్ఞాన ధనా
యత్తులు తొల్లి వెలింగెడి, యుత్తరదిశ కేగె నిర్మలోద్యోగమునన్

– మనస్సులో పరబ్రహ్మాన్ని మననం చేసుకుంటూ పూర్వం విజ్ఞానవంతులైన మహానుభావులు అనుసరించిన ఉత్తర దిక్కుకు ఏకాగ్రచిత్తంతో సోదరులతో కలసి సతీసమేతంగా ధర్మనందనుడు ప్రస్థానం సాగించాడు. ❖

దశరథ మహారాజా! ప్రజలు దుఃఖిస్తే రాముడు అధికంగా దుఃఖిస్తాడు. ప్రజలు సంతోషిస్తే రాముడు అధికంగా సంతోషిస్తాడు. రాముడిలాంటి రాజు లభించడం మా సుకృతం. -*అయోధ్యాప్రజలు, (రామాయణం)*



రామకృష్ణ మఠం

'సౌత్ నాడ, అశోక పెట్రోల్ పంప్ ఎదురుగా, హరిపాడ్-690 514. అలెప్పి జిల్లా, కేరళ. ఫోన్: 09745325834;
E mail: srkmathharipad@gmail.com; viveka.vira@gmail.com; www.rkmathharipad.org

శ్రీరామకృష్ణ మఠ కేంద్ర పునర్నిర్మాణానికై విజ్ఞప్తి

కేరళ రాష్ట్రంలో శ్రీరామకృష్ణుల ఉద్యమాన్ని వ్యాప్తి చేసిన స్వామి నిర్మలానందజీ మహరాజ్, ప్రప్రథమంగా 1913లో దక్షిణ కేరళలోని హరిపాడ్‌లో రామకృష్ణ మఠ శాఖను ప్రారంభించారు. భగవాన్ శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష సన్న్యాస శిష్యులైన స్వామి బ్రహ్మానందజీ మహరాజ్, రామకృష్ణ సంఘ వరిష్ఠ సన్న్యాసుల సందర్శనంతో ఈ ఆశ్రమం పునీతమైనది.

పూర్తిగా శిథిలమైన ఆశ్రమ భవనం

ఈ ఆశ్రమం స్థాపించి వందేళ్ళు గడిచాయి. కాలగతిలో ఆశ్రమంలోని భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అందువల్ల నూతన భవనాల నిర్మాణం అత్యంత ఆవశ్యకమైనది. ఈ నేపథ్యంలో విశ్వజనీన శ్రీరామకృష్ణ దేవాలయం, కార్యాలయం, సేవా కార్యక్రమాల నిర్వహణ భవనం, గ్రంథాలయం, సాధునివాస భవనాలను నిర్మించాలని సంకల్పించాం. ఈ పథకానికి ఐదు కోట్ల రూపాయల వ్యయం అవుతుందని అంచనా వేయడం జరిగింది.

ఈ పవిత్ర సేవాయజ్ఞంలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలన్న ఉద్దేశంతో ఐదు కోట్ల రూపాయలను ఉదార హృదయులైన భక్తులు, మిత్రులు, హితులైన 50,000 మంది నుండి రూ.1,000/- చొప్పున విరాళాలను స్వీకరించదలచాం. రూ.1,000/- కన్నా ఎక్కువ విరాళాలను కూడా ఇవ్వవచ్చును.

మీ విరాళాన్ని Ramakrishna Math, Haripad పేరున చెక్కు/ డి.డి తీసి Ramakrishna Math, South Nada, Opp.Asoka Petrol Pump, Haripad - 690514, Dist.Alleppey, Kerala చిరునామాకు పంపాల్సిందిగా మనవి. విరాళాలకు 80జి సెక్షన్ కింద ఆదాయపు పన్ను మినహాయింపు లభిస్తుంది.

రెండు గదులున్న పురాతన గోదాము - ప్రస్తుత సాధునివాసం

ఈ బృహత్ సేవా యజ్ఞానికి మీవంతు ఆర్థిక సహాయాన్ని అందించి భగవాన్ శ్రీరామకృష్ణుల కృపకు పాత్రులు కాగలరని ఆశిస్తున్నాం.

భగవత్సేవలో
స్వామి వీరభద్రానంద
అధ్యక్షులు

విరాళాలను ఆన్‌లైన్ ద్వారా కూడా పంపవచ్చు :

NEFT Transfer: Account Number - 30642551603, State Bank of India, Haripad. RTGS/NEFT/IFSC code: SBIN0010596.

విరాళాలను ఆన్‌లైన్ ద్వారా పంపించిన దాతలు తమ పూర్తి పేరు, చిరునామా, పాన్ నెంబర్, ఫోన్ నెంబర్‌తో సహా పూర్తి విరాళ వివరాలను ఈమెయిల్ srkmathharipad@gmail.com కు తెలియజేయగలరు.

Foreign Donation: Kindly draw a Cheque / Draft in favour of "Ramakrishna Math" and send it to the General Secretary, Ramakrishna Math, Belur, Dt. Howrah (West Bengal), Pin - 711 202, India.

In the covering letter please mention that it is a donation for 'Haripad Centre Building Fund' and inform all the details of the donation to e-mail:srkmathharipad@gmail.com, viveka.vira@gmail.com

Advt.,

"ఒక వ్యక్తి తనను తాను అసహ్యించుకొంటున్నట్లయితే అదే పతనానికి హేతువు. పూర్వీకుల చరిత్రను అవమానకరంగా భావిస్తే, ఆ జాతి అంతానికి చేరుకున్నట్లే!" అంటారు స్వామి వివేకానంద. గత వైభవాన్ని మర్చిపోయినంత కాలం మనమూ, మన దేశం స్తబ్ధతలో మునిగిపోతాం. అందుకే, మన ప్రాచీన సంస్కృతి గురించి తెలుసుకోవాలి. గడచిపోయిన సంగతులు తెలుసుకొంటూ, భవిష్యత్ మహత్కార్యాల సాధన వైపు నడవాలి. మన ప్రాచీన భారతీయ సంస్కృతిని గుర్తు చేసేందుకు చేస్తున్న ప్రయత్నమే ఈ వ్యాసాల పరంపర. సుప్రసిద్ధ రచయిత, బెంగుళూరు రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి హర్షానంద మహరాజ్ మధ్యయుగాల కాలం దాకా విలసిల్లిన మన సంస్కృతిని 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు 2014 ఫిబ్రవరి సంచిక నుండి వివరిస్తున్నారు.

భారతీయ నాట్య సంప్రదాయాలు

మణిపురి: సాక్షాత్తూ పరమశివుడు పార్వతీదేవి ప్రమేయంతో ఈ నాట్యపద్ధతిని ప్రవేశపెట్టాడని ఐతిహ్యం. మహాభారతంలో అర్జునుడు వివాహమాడిన మణిపూర్ రాజకుమారి 'చిత్రాంగద'కు ఈ నాట్యంలో ప్రావీణ్యం కలదని అంటారు. శివపార్వతులకు సంబంధించిన అంశాలే మొదట్లో మణిపురి నాట్యాంశాలు. వైష్ణవం ప్రాచుర్యం పొందిన తరువాత మణిపురిని కృష్ణపరంగా చేస్తున్నారు.

మణిపూర్ మహారాజు భాగ్యచంద్ర (18వ శతాబ్దం) ఒక కృష్ణమందిరాన్ని (గోవిందస్వామి) నిర్మించి రాసలీలా నృత్యాన్ని ప్రవేశపెట్టాడు. కాలాంతరంలో ఆరు ఋతువులకు సంబంధించి ఆరు రకాల మణిపురి విభాగాలు వృద్ధిచెందాయి. అవి వసంత రాస, కుంజరాస, కర్తరాస, నర్తరాస, దివారాస, మహారాసలు.

లాయ్-హరౌబా అనే వేరొక సంప్రదాయం కూడా మణిపురిలో ఉంది. ఇది చాలా పురాతన పద్ధతి. ఇదే మణిపురి ఆవిర్భావానికి మూలమని భావిస్తుంటారు. ఈ రకం నృత్యం నెలరోజుల ప్రదర్శన. ఇందులో సృష్టిక్రమాన్ని వివరిస్తారు. శ్రీకృష్ణుని రాసలీల మణిపురి నృత్యాలలో ఒక ముఖ్యమైన అంశం. ఈ ప్రదర్శన ఒక రాత్రి పూర్తిగా జరుగుతుంది.

ఒడిస్సీ నాట్యం: భరతుని నాట్యశాస్త్ర ఆధారంగా ప్రారంభమైన నృత్యపద్ధతి - ఒడిస్సీ నాట్యము. ఒరిస్సా సంగీత ప్రభావంతో ఇది కొన్ని ప్రత్యేక లక్షణాలు సంతరించుకుంది. ప్రారంభంలో ఇది దేవదాసీలు జగన్నాథాలయంలో (12వ శతాబ్దం) చేసే ఒక నృత్యసంప్రదాయం. 14వ శతాబ్దానికి 'నర్తక-బాలకు'ల (బాలనర్తకుల) సంప్రదాయంగా పరిణమించింది. సమకాలీన ఒడిస్సీ నృత్యం ఉత్తర-దక్షిణ భారత నాట్యాల కలయిక. నేపథ్య సంగీతం ఉత్తర భారత సంప్రదాయంలో ఉంటుంది. భరత నాట్యం, కథాకళి, కథక్ నృత్యపోలికలు కూడా ఈ నాట్యంలో కనిపిస్తాయి. జయదేవుని (క్రీ.శ. 1200) అష్టపదులు ఈ నాట్యానికి మూలాధారం.

సాత్రియ నాట్యం : అస్సాం వైష్ణవ గురువైన 'శంకరదేవ' (క్రీ.శ. 1486-1568) అనేక వైష్ణవ మఠాలను స్థాపించారు. ఈ మఠాలు కొన్ని సత్రాలలో స్థాపితమై, మతపరమైన బోధనలకు నెలవులయ్యాయి. ఈ సత్రాలు 'సాత్రియనాట్య' పద్ధతిని ప్రవేశపెట్టి, వారు బోధించే మత విషయాలను రక్షించడానికి ఉపయోగపడ్డాయి.

ఈ నాట్యంలో జముర్‌సాలి, రాస్ అనే రెండు శాఖలున్నాయి. మొదటిది - శ్రీకృష్ణుని జీవితగాథలకు సంబంధించినదైతే, రెండవశాఖ - శ్రీకృష్ణుడు గోపికలతో సలిపిన రాసలీల నృత్యం. జముర్‌సాలి సంప్రదాయం తమ జీవితాలను సత్రాలకు అంకితం చేసిన యువకులు చేసే మతపరమైన నృత్యం. వృద్ధులైన వారి గురువులు నేపథ్యంలో ఉండి సంగీతాన్ని ఆలపిస్తారు.

యక్షగానం : యక్షగానం లేక బయలాట కర్ణాటక రాష్ట్రంలో ప్రాచుర్యం పొందింది. ఇది కూడా కథాకళి లాంటి నృత్య-నాటిక సంప్రదాయం. భరతముని నాట్యశాస్త్రం ఆధారంగా చేసే నాట్యమైనా ఇది ప్రాంతీయతను సంతరించుకుంది. కళాకారులు పాడుతూ, నాట్యం చేస్తూ వారి పాత్రలను నిర్వహిస్తారు. పురాణ ఇతిహాసాలే నాట్యాంశాలు.

జానపద నృత్యాలు: ఇప్పటివరకు తెలియజేసిన నృత్యరీతులు సంస్కారవంతమైన, అభివృద్ధి చెందిన పద్ధతులు. జనపదంలో అనేక రకాలైన నృత్యరీతులు దైనందిన జీవితంతో ముడిపడి ఉన్నాయి. సంతోషకరమైన పెళ్ళి, శిశుజననం, ఉత్సవాలు, పండుగలు, పంట కోతల సందర్భంలో జానపదులు - స్త్రీలు, పురుషులు కూడా ఈ నృత్యాలు చేస్తారు. ఇవి కూడా కాలాంతరంలో ఒక పద్ధతిని సంతరించుకున్నాయి. వాటిలో కొన్ని :

- భాంగ్రా (పంజాబ్)
- గార్బా (గుజరాత్)
- ఘుమార్ (రాజస్థాన్)
- హోలీ (మణిపూర్)

అమ్మా! ఈ జీవితం బుద్బుదప్రాయం. క్షణికం. తుచ్ఛమైన రాజ్యం కోసం నీ కుమారుడు ధర్మవిరుద్ధంగా ఎన్నటికీ ప్రవర్తించలేడు. ధర్మపథంలో పయనించేలా నన్ను ఆశీర్వదించు. - రాముడు, (రామాయణం)

- కోలాటం (కర్ణాటక)
- లూడి (పంజాబ్)
- పంగి (హిమాచల్ ప్రదేశ్)
- సుగ్గి-కుణిత (కర్ణాటక)
- తబల్-కాగ్బి (మణిపూర్)
- తియాన్‌భాగి (పంజాబ్)

నాట్యాలు జనజీవనాన్ని సుసంపన్నం చేసి జాతి సంస్కృతిని ఇనుమడింపజేశాయనడంలో సందేహం లేదు.

నాటకం: భరతమహర్షి 'నాట్యశాస్త్రం' ప్రకారం సంగీతం - నృత్యం విడదీయలేని అనుబంధము కలిగి ఉన్నా, నాటకంలోని భాగాలే. అయితే కాలక్రమంలో ఇవి వేరువేరుగా అభివృద్ధి చెందాయి. నాటకంలో సంగీత నృత్యాలు అక్కడక్కడా వాడబడుతూనే ఉన్నాయి.

సమాజానికి గుణపాఠంగా, వినోదకరంగా నాటకం చాలా ప్రాచీనమైనది. ఋగ్వేద మంత్రాలలో ఒక ఋషి సోమపానం చేసి ఇంద్రుడిని కూడా యుద్ధానికి పిలవడం, మరొక ఋషి జూదం వల్ల తాను దరిద్రుడనయ్యానని తెలియజేయడం మనుషులలో దాగిన నటనా కౌశలానికి నిదర్శనాలు.

నాటకం ఒక అంశాన్ని సంభాషణల ద్వారా, సంగీతాలాపన ద్వారా నటనతో కలిపి తెలియజేస్తుంది. తగిన దుస్తులు, భూషణాలు, వస్తువులు నాటకాన్ని రక్తికట్టిస్తాయి. ఇవన్నీ కూడా నాట్యశాస్త్రంలో తెలియజేశారు.

నాటకాలు వేయడానికి తగిన 'రంగస్థలం' ఆవశ్యకం. స్థలాన్ని బట్టి ఈ వేదికలను త్రికోణాకారంలో, చతురస్రాకారంలో, వృత్తాకారంలో లేక అర్ధ వృత్తాకారంలో నిర్మించేవారు. నాటక శాలలను వేదిక - ప్రేక్షక గృహాలుగా వేరు చేసేవారు. మొదట్లో ఈ రెండు భాగాలు సమాన పరిమాణంలో ఉండేవి. వేదిక వెనుక చిరువేదిక, అలంకరణ గది, నటులకు విశ్రాంతి గది ఉంటూ, గదులను వేరుచేయడానికి తెరలు వాడేవారు.

నాట్యశాస్త్రంలో దుస్తులు, ఆభరణాలు, శిరోజాలంకరణలను పాత్రలకు తగినట్లుగా వివరించారు. ముసుగులు కూడా వాడేవారు. పాతరోజులలో పురాణాల నుండి నాటకాంశాలను గ్రహించేవారు. సంస్కృత సాహిత్యం వృద్ధి చెందిన తరువాత సామాజిక నాటకాలు కాళిదాసు, భవభూతి (8వ శతాబ్దము), శూద్రక (3వ శతాబ్దం) రచనల ఆధారంగా ప్రదర్శితమైనట్లు తెలుస్తోంది. ఈ నాటకాలు రాజులు - మంత్రి పరివారం కలిగిన సమాజంలో ఉన్నతవర్గాల వారికి, అదే సమయంలో జానపదులకు తగిన నాటకాలుగా విడిగా అభివృద్ధి చెందాయి. క్రీస్తు శకం ప్రారంభంలోనే భారతీయ నాట్యకళ బాగా అభివృద్ధి చెందినట్లు చెప్పవచ్చు. ❖ **అనువాదం: డాక్టర్ పి.వి.రెడ్డి**

కైలాస-మానస సరోవర తీర్థయాత్ర



భక్తులకు ఓ అపూర్వ అవకాశం

1. కైలాస-మానస సరోవర తీర్థయాత్ర
2. ముక్తినాథ్ తీర్థయాత్ర
3. శ్రీరామకృష్ణ గురుపీఠం - బేలూరు మఠ తీర్థయాత్ర
4. మణి మహేశ్ కైలాస్ & శక్తిపీఠ హిమాచల్ యాత్ర
5. కాశీ-పంచక్రోషి తీర్థయాత్ర
6. పంచ ద్వారక తీర్థయాత్ర
7. నర్మదా పరిక్రమ తీర్థయాత్ర
8. దక్షిణభారత తీర్థయాత్ర - తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లోని అన్ని దేవాలయాలు.
9. అండమాన్ - నికోబార్ యాత్ర
10. శ్రీలంక తీర్థయాత్ర
11. మలేషియా - సింగపూర్ - థాయ్‌ల్యాండ్ - కాంబోడియా (అంకోర్‌వాట్) - ఇండోనేషియా యాత్ర

పూర్తి వివరాలకు సంప్రతించండి

శ్రీ రామకృష్ణ యాత్రా సర్వీసు®

ప్రధాన కార్యాలయం : కొత్త నెం. 120/1, పాత నెం. 216/1, రామకృష్ణ మఠం రోడ్,
ఆర్.కె. మఠం ఎదురుగా, మైలాపూర్, చెన్నై - 600 004
ఫోన్:044-2461 6968, 2495 0095, సెల్: (0)94440 91428, (0)98427 11886 ఫ్యాక్స్: 044-2462 0631
Email : srk.yatraservices@gmail.com / anandhan@srkyatra.com Website: www.srkyatra.com
ఆధ్యాత్మిక సేవాపరాయణుడు : జి.యస్. ఆనందన్ సెల్ : (0)94431 44808

Advt.,

నీ నామమే కామధేనువు

– శ్రీమతి బి.కృష్ణకుమారి

అన్నమయ్య పదామృతం

రామభద్ర రఘువీర రవివంశ తిలక
నీ నామమే కామధేనువు నమో నమో ॥

కౌసల్యానంద వర్ధన ఘనదశరథ సుత
భాసుర యజ్ఞరక్షక భరతాగ్రజ
రాసికెక్క కోదండ రచన విద్యా గురువ
వాసితో సురలు నిను వడి మెచ్చేరయ్యా ॥

మారీచ సుబాహు మర్దన తాటకాంతక
దారుణవీర శేఖర ధర్మపాలక
కారుణ్య రత్నాకర కాకాసుర వరద
సారెకు వేదవిదులు జయ వెట్టేరయ్యా ॥

సీతారమణ రాజశేఖర శిరోమణి
భూతలపు టయోధ్యాపుర నిలయా
యీతల శ్రీవేంకటాద్రి నిరవయిన రాఘవా
ఘాత నీ ప్రతాపమెల్ల కడు నిండెనయ్యా ॥

గరుడపురాణం నుంచి గణేశపురాణం వరకు... వరాహ పురాణం నుంచి వామనపురాణం వరకు సమస్త పురాణాలు, మానవునికి ముక్తినొసగే తారకమంత్రం రామనామమేనని ముక్తకంఠంతో ఘోషిస్తున్నాయి. 'శ్రీరామ' అని స్మరించుకున్నంత మాత్రాన్నే సర్వపాపాలూ సమసిపోతాయనీ, శ్రీమహావిష్ణువు వేయినామాలతో సమానమైన ఏకైక నామం రామనామమేననీ అభయమిస్తున్నాయి. రామచంద్రుని నామమే కాదు, రాముని రూపం కూడా ఒక్కసారి మనస్సులో మెదిలితే సమస్త కల్మషాలు కరిగిపోతాయి. సీతాదేవి లంకలో ఉన్నప్పుడు ఒకసారి ఎవరో రావణుడితో 'నువ్వు ఎన్నో మారువేషాలు ధరించి సీత వద్దకు వెళుతుంటావు కదా! రాముడి రూపాన్ని ధరించి ఆమెను వశం చేసుకోవడానికి ఎందుకు ప్రయత్నించడం లేదు? అని అడిగారట! అందుకు రావణుడు 'ఆ దేహాన్ని ధరించడం కాదు, శ్రీరాముడి రూపాన్ని హృదయంలో ఒక్కసారి తలచుకుంటే చాలు, రంభ, తిలోత్తమలు కూడా చితాభస్మంలా తోస్తారు; బ్రహ్మపదవి కూడా తుచ్ఛమైపోతుంది. ఆ మహానుభావుడిలా మారిపోతే ఇక వేరే చెప్పాలా?' అన్నాడట! అంతటి మహితాత్ముడు శ్రీరామచంద్రమూర్తి! అంతటి ఆ రామభద్రుడి నామం, కోరిందల్లా ఇచ్చే కామధేనువుకు సమమని పదకవితా పితామహుడు అన్నమాచార్య ప్రస్తుతిస్తున్నాడు. కలియుగంలో ఆ రఘువీరుడి అవతారమైన భగవాన్ శ్రీరామకృష్ణులు కూడా ఒకమారు భక్తులతో "రామనామంలో అనంతమైన శక్తి ఉంది. రాముని ప్రార్థించండి; ఆయనను ధ్యానించండి; మీ కోసం సమస్తం ఆయనే నెరవేరుస్తాడు" అంటారు.

నీ నామమే కామధేనువు...

సర్వేశ్వరుడు సగటు మనిషిగా జన్మించి, సామాన్య మానవుడి ఊహకు కూడా అందనంత ధార్మిక జీవనాన్ని గడిపి మానవలోకానికే మణిపూసగా వెలిగాడు. అలా ఆ ఆదర్శ జీవితమే ఆయన నామానికి అంత మాహాత్మ్యాన్ని ప్రసాదించింది. అందుకే కొన్నేళ్ళ క్రితం పాశ్చాత్య మేధావి ఒకరు రామాయణం చదివి ఆనందాశ్చర్యాలకు లోనై, ఆ తరువాత అక్కడ ఓ సమావేశంలో ప్రసంగిస్తూ 'మన గ్రంథాలయాల్లోని వ్యక్తిత్వ వికాస పుస్తకాలన్నింటినీ పక్కన పెట్టండి; ఒక్క రామాయణాన్ని ఉంచండి! చాలు' అన్నారట. మనిషి జీవననావకు చుక్కానిలా నిలిచే ఆ రామచరిత కావ్యనాయకుడైన రామచంద్రుడిని కడు హృద్యంగా కీర్తిస్తూ అన్నమాచార్యులు...

'రామభద్ర రఘువీర రవివంశ తిలక;
నీ నామమే కామధేనువు నమో నమో' అంటున్నారు. సూర్యవంశానికే తిలకంగా శోభించే రామభద్రుడి నామం కామ ధేనువు లాంటిదని కొనియాడుతున్నారు. 'రామ' అనే బీజాక్షరంలో అగ్నిసోమాత్మకమైన విశ్వమంతా ప్రతిష్ఠితమై ఉంది. అందుకే ఆ పదాన్ని నిష్ఠగా పలుకగానే విశ్వంలోని సకారాత్మక శక్తి మనలో ప్రవేశిస్తుంది. ఎన్ని మార్లు జపిస్తే అన్ని రెట్లు ఆ శక్తి ప్రవర్ధమానమవుతుంది. అలాంటి రామనామ వైభవాన్ని వర్ణిస్తూ...

ప్రమాదాదపి సంస్పృష్టో యథాఽనల కణోభవేత్ ।
తథౌష్ఠపుట సంస్పృష్టం రామమంత్రం దహేదఘమ్॥

'పొరపాటుగా స్పృశించినా అగ్నికణం ప్రభావాన్ని చూపినట్లు, అధరాల్ని యాదృచ్ఛికంగా రామనామం స్పృశించినా మన పాపాలన్నీ నశించిపోతాయ'ని బ్రహ్మపురాణం స్పష్టం చేస్తోంది.

(మిగతా 34వ పేజీలో...)

శ్రీరాముడు వనాలకు వెళ్ళాలని నేను సంకల్పించినట్లయితే భిక్షమెత్తుకుంటూ పిచ్చివానిలాగ ప్రపంచంలో తిరుగుదునుగాక! దుఃఖాగ్నిలో దహించుకుపోవుదునుగాక! – భరతుడు, (రామాయణం)



పరిప్రశ్న

– స్వామి భూతేశానంద
(రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు)

రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు - స్వామి భూతేశానందజీ మహరాజ్ (1901-1998) భక్తుల ఆధ్యాత్మిక సందేహాలకు సరళమైన రీతిలో ఇచ్చిన సమాధానాలను 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకుల ప్రయోజనార్థం 2013 జూలై సంచిక నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

భక్తుడు: స్వప్నంలో దేవీదేవతలనూ, సత్పురుషులనూ దర్శించడం వల్ల మనలో మంచి సంస్కారాలు ఏర్పడతాయా? భగవద్దర్శనం కలుగుతుందా?

స్వామీజీ: స్వప్నంలో దేవీదేవతలనూ, సత్పురుషులనూ దర్శించడం వల్ల మనస్సులో సద్భావాలు కలుగుతాయి. స్వప్నం నిజమైనా కాకపోయినా, దాని ప్రభావం మాత్రం మనపై పడుతుంది. స్వప్న ప్రభావం గురించి శ్రీరామకృష్ణులు చెబుతూ... 'ఒక వ్యక్తి కలలో పులిని చూశాడు. అతడు మేల్కొనగానే పులి కనిపించలేదు. కానీ అతడి గుండె మాత్రం భయంతో కొట్టుకుంటూనే ఉంటుంది' అని అన్నారు.

కాబట్టి మనం స్వప్నంలో గాంచిన దేవీదేవతల దర్శన ప్రభావం మనస్సుపై ముద్రితమవుతుంది. బృహదారణ్యకోపనిషత్తు కూడా 'స్వప్నంలో మనం గాంచిన దర్శనాల ప్రభావం మనస్సుపై పడుతుందనీ, మంచి స్వప్నాలు మనస్సుకు ఆనందాన్ని కలిగిస్తాయ'నీ తెలియజేస్తోంది. శ్రీరామకృష్ణులు 'స్వప్నంలో భగవంతుణ్ణి, సత్పురుషులను దర్శించడం శ్రేయోదాయకమనీ, అలాంటి స్వప్నాలు మనలో మంచి సంస్కారాలు ఏర్పడడానికి దోహదపడతాయ'నీ తెలియజేశారు.

యథాదర్శే తథాత్మని యథా స్వప్నే తథా పితృలోకే ।
యథాప్సు పరీవదదృశే తథా గంధర్వలోకే ఛాయాతపయోరివ బ్రహ్మలోకే॥

'అద్దంలో ప్రతి వస్తువూ స్పష్టంగా గోచరించినట్లుగా ఈ ఆత్మ తన యందు స్పష్టంగా అనుభూతమవుతుంది. ఈ ఆత్మ పితృలోకంలో స్వప్నంలో లాగా, గంధర్వలోకాన నీటిలో ప్రతిబింబం లాగా, బ్రహ్మలోకంలో ఛాయాతపముల లాగా అనుభూతమవుతుంది' అని కఠోపనిషత్తు వివరిస్తోంది. దీన్నిబట్టి మనం అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే, స్వప్నంలో దర్శించిన వాటి ప్రభావం శాశ్వతంగా ఉండదు.

భగవంతుని గురించి చింతన చేస్తూ ఉంటే ఆయన సద్గుణాలన్నీ మనకు కూడా అలవడతాయి. అలా భగవద్ధ్యానం ద్వారా ఏర్పడిన సద్భావాలు, సద్గుణాలు మనల్ని శాశ్వతంగా ప్రభావితం చేస్తాయి. ఇందుకు శ్రీరామకృష్ణులు "బొద్దింక నిరంతరం కుమ్మర పురుగు మీద ధ్యానం చేస్తూ దాని లక్షణాలను పుణికిపుచ్చుకుంటుంది. అదేవిధంగా ఇష్టదైవాన్ని ధ్యానం చేస్తున్న సాధకుడు అవే లక్షణాలను పొందుతాడు" అని ఉదాహరించారు.

కాబట్టి స్వప్నంలో మనం దర్శించిన భగవత్స్వరూపాల ప్రభావం మనపై శాశ్వతంగా ఉండడానికీ; మనలో ఉత్తమ సంస్కారాలు ఏర్పడడానికీ, సద్భావాలు కలగడానికీ, సద్గుణాలు అలవరచుకోవడానికీ నిరంతరం భగవత్ చింతన చేయడం అభ్యసించాలి. అలాంటి అభ్యాసం వల్ల భగవద్దర్శనం తప్పక కలుగుతుంది.

భక్తుడు: భగవంతుడి నుండి ఏమి కోరుకోవాలి?

స్వామీజీ: భగవంతుడి నుండి దూరం చేయని వాటిని మాత్రమే కోరుకోవాలి. ప్రాపంచిక సుఖాలను ప్రసాదించాల్సిందిగా భగవంతుణ్ణి కోరడమనేది మహారాజు దగ్గరకు వెళ్ళి వంకాయలను అడగడం లాంటిది. సర్వాధిపతి అయిన భగవంతుడి ప్రేమను పొందగలిగితే ఇక మనకు లోటేముంటుంది? అందుకే 'భగవంతుని పాదపద్మాలపై శుద్ధభక్తినీ, విశ్వాసాన్నీ ప్రసాదించాల్సిందిగా కోరుకోవాలి' అని శ్రీరామకృష్ణులు తరచూ చెబుతుండేవారు. ❖

పండుగలు - పర్వదినాలు

మార్చి - 2015

01	ఆదివారం	: ఏకాదశి
05	గురువారం	: శ్రీచైతన్య మహాప్రభు జయంతి
10	మంగళవారం	: స్వామి యోగానంద జయంతి
16	సోమవారం	: ఏకాదశి
21	శనివారం	: ఉగాది
28	శనివారం	: శ్రీరామ నవమి
31	మంగళవారం	: ఏకాదశి

ఏప్రిల్ - 2015

15	బుధవారం	: ఏకాదశి
21	మంగళవారం	: అక్షయతృతీయ
23	గురువారం	: ఆదిశంకరాచార్య జయంతి, శ్రీరామానుజాచార్య జయంతి
29	బుధవారం	: ఏకాదశి

రామకృష్ణ భక్తి సూత్రాలు

– స్వామి యతీశానంద

నారద భక్తి సూత్రాలు, శాండిల్య భక్తి సూత్రాలు భక్తియోగానికి సంబంధించిన ప్రామాణిక గ్రంథాలు. అయితే ఆధునిక తరంలో భగవదన్వేషకులకు అనువైన రీతిలో భక్తితత్త్వాన్ని బోధించారు శ్రీరామకృష్ణులు. ఈ నేపథ్యంలో 'శ్రీరామకృష్ణ కథామృతం' నుండి కొన్ని ఉపదేశాలను 'రామకృష్ణ భక్తి సూత్రాలు'గా సులభరీతిలో వివరించే ప్రయత్నం చేస్తున్నాం.

బౌద్ధగ్రంథాలు పాళీ భాషలో, బైబిల్ హీబ్రూలో, ఖురాన్ అరబ్బీ భాషలో రచించబడ్డాయి. అలాగే శ్రీరామకృష్ణుల ఉపదేశాలు వారి మాతృభాష బెంగాలీలో ఆవిష్కృతమయ్యాయి. అవతార పురుషుని ముఖతః వెలువడిన ఆ అమృతోపదేశాలను యథాతథంగా ఉట్టంకిస్తూ వ్యాఖ్యానిస్తున్నాం. మహాశక్తిమంతమైన ఆ బోధనలను మననం చేసుకుంటూ కృతార్థులమవుదాం.

కలియుగేర్ పక్షే భక్తియోగ్ సహజ పథ్।
భక్తి యోగ ఇ యుగధర్మ॥

కలియుగంలో భక్తియోగమే సరళమైన మార్గం. భక్తియోగమే ఈ యుగధర్మం.

శ్రీరామకృష్ణ ఉవాచ: జ్ఞాన, భక్తి, కర్మ, రాజయోగాలు– అనేకమైన మార్గాలున్నాయి. ఈ యుగంలో భక్తియోగమే సరళమైన మార్గం. అన్యమార్గాల కంటే ఈ మార్గం ద్వారా భగవంతుణ్ణి చేరడం సులభం.

శాస్త్రాలలో చెప్పబడిన కర్మకాండను కలికాలంలో ఆచరించడం చాలా కష్టం. అన్నగతప్రాణులం ఎక్కువగా చేయలేం. భక్తియోగం – భగవంతుని నామగుణ సంకీర్తన, ప్రార్థనల ద్వారా భగవంతుణ్ణి పొందవచ్చు.

వ్యాఖ్య: వేదవేదాంతాది శాస్త్రాలలో ఎన్నో మార్గాలు, ఉపాయాలు చెప్పబడి ఉన్నాయి. ఆ మార్గాలను అనుసరించి భగవంతుణ్ణి పొందవచ్చు. ఎవరు ఏ మార్గాన్ని అనుసరించి సాక్షాత్కారం పొందారో వారు ఆ మార్గమే శ్రేష్ఠమని చెబుతారు.

శ్రీరామకృష్ణులు అన్ని మార్గాల సాధనలూ చేసి, వివిధ విధాల సాక్షాత్కారం పొంది, స్పష్టంగా, దృఢంగా ఈ విషయం చెప్పారు: 'కలియుగంలో మనుష్యులు శారీరకంగా, మానసికంగా, బౌద్ధికంగా దుర్బలులు, అల్పాయుష్కులు. భగవంతుణ్ణి చేరడానికి శీఘ్రము, సులభము అయిన మార్గం – భక్తియోగం'.

జ్ఞాన, ధ్యాన, యోగాలు, వైదిక కర్మకాండ – ఈ యుగంలో కఠినం. దేహాత్మ బుద్ధి ఉన్నంతవరకు జ్ఞానమార్గాన్ని అవలంబించి నిరుపాధిక బ్రహ్మాన్ని తెలుసుకోవడం అత్యంత కష్టసాధ్యమని గీతలో శ్రీకృష్ణుడు కూడా చెప్పాడు. కాబట్టి, కలియుగంలో భక్తిమార్గాన్ని అనుసరించడం శ్రేయోదాయకం.

కలితే భక్తియోగ్। నారదీయ భక్తి। ఈశ్వరేర్ నామ్ గుణగాన్ ఓ వ్యాకుల్ హోయే ప్రార్థనా కోరా, "హే ఈశ్వర్ ఆమాయ్ జ్ఞాన్ దాఒ, భక్తిదాఒ, ఆమాయ్ దేఖా దాఒ।"

కలియుగంలో భక్తియోగం ఉత్తమమార్గం. నారదీయభక్తి – వ్యాకులతతో భగవన్నామ కీర్తన, ప్రార్థన చేయడం."హే భగవాన్! నాకు జ్ఞానమివ్వు, భక్తినివ్వు, దర్శనమివ్వు".

శ్రీరామకృష్ణ ఉవాచ: శాస్త్రాలలో చెప్పబడిన కర్మకాండను ఆచరించడానికి కలియుగంలో సమయమేదీ? నేను జనానికి చెప్పేది ఏమిటంటే, అతి విస్తారమైన కర్మలు, బహుప్రయాసతో కూడినవి అవసరం లేదు. గాయత్రీ మంత్రాన్ని జపిస్తే చాలు.

వ్యాఖ్య: ఈ యుగంలో భక్తిమార్గమే సులభమైనదని శ్రీరామకృష్ణుల వ్యాఖ్య. శాస్త్రాలలో భక్తియోగం గురించి వివిధ భాగాలున్నాయి. నారద, శాండిల్య, గౌతమ, పరాశర మున్నగు ఋషులు, మునులు భక్తియోగానికి ఎన్నో వ్యాఖ్యానాలు రాశారు.

శ్రీరామకృష్ణులు నారదభక్తి సూత్రాలకు ప్రాధాన్యమిచ్చి, కలియుగంలో నారదీయ భక్తిని సూచించారు. 'మనోవాక్కాయాల ద్వారా ఏం చేసినా, (లౌకికమే కానీయండి, ఆధ్యాత్మికమే కానీయండి) అవన్నీ సర్వదా భగవదర్పితం చేయడం, భగవంతుని స్మరణ చేయకపోతే ఆందోళన చెందడం – భక్తి లక్షణం.

"హే భగవాన్! నీ పదసరోజాల పట్ల నాకు భక్తిని ప్రసాదించు. దర్శనం ఇవ్వు అని భగవంతుణ్ణి ఆవేదనతో ప్రార్థించాలి. అలా ప్రార్థిస్తే దుఃఖాలు శాశ్వతంగా తొలగుతాయి. జనన మరణ వలయం నుండి ముక్తి లభిస్తుంది" అని శ్రీరామకృష్ణులు చెప్పారు. ❖

అనువాదం:డాక్టర్ కమల జయరావు

శబరీ! నా మాట విను. నాకు కేవలం భక్తి ప్రధానం. జన్మ, వంశం, కులం, ధనం, శక్తిసామర్థ్యాల కన్నా భక్తియే నాకు ముఖ్యం. భక్తిలేని వ్యక్తి నీరులేని మేఘం లాంటివాడు.-రాముడు, *(రామాయణం)*

జననే జగజ్జనని

సాధారణంగా సన్యాసి అనగానే మన మనస్సుకు స్ఫురణకు వచ్చేది, కన్నవారిని వదిలి ఏ అరణ్యాలకో వెళ్ళి అంతర్ముఖుడై తపస్సు చేసుకోవడమే నని. చైతన్య మహాప్రభువంతటివాడు సన్యాసి అయివుండి కూడా తన తల్లికి మహోన్నత స్థానాన్ని ఇచ్చి, ఆమె మాటకు కట్టుబడ్డాడు. కానీ ప్రస్తుత సమాజంలో యువతరం తమ తల్లితండ్రులను ఏ దృష్టితో చూస్తున్నారు? వారి ప్రయోజనం కోరి చెప్పేటటువంటి మాటలకు ఎటువంటి విలువ నిస్తున్నారు? వారి మాటలకు విలువివ్వడం అటుంచి, మాటలు వినడానికే సమయమివ్వడంలేదు. మన యువత చైతన్య మహాప్రభువును ఆదర్శంగా తీసుకొని తల్లితండ్రులను గౌరవించడం అలవరచుకోవాలి.

చైతన్య మహాప్రభువు తన 24వ ఏట కేశవభారతి నుంచి సన్యాసం స్వీకరించి బృందావనం వెళతాడు. అక్కడ నుండి ఏ దిక్కుకు పయనిస్తున్నాననే ధ్యాస లేకుండా భావావేశంతో హరినామాన్ని జపిస్తూ అద్వైతాచార్యులున్న శాంతిపురమనే గ్రామానికి చేరుకుంటాడు. అద్వైతా చార్యులు చైతన్యుణ్ణి గుర్తించి, తన తల్లి శచీదేవి వద్దకు తీసుకువస్తారు.

చైతన్య మహాప్రభువు తల్లిని చూడగానే సాష్టాంగ ప్రణామం చేస్తాడు. చైతన్యుడి శుష్కించిన శరీరాన్ని తడిమి తడిమి చూస్తూ ఎంతో దుఃఖంతో 'నాయనా!, మీ అన్న విశ్వరూపుడు సన్యసించి ఇల్లువదిలి వెళ్ళిపోయాడు. నీవు కూడా అలా చేయవద్దు' అని కన్నీరుపెడుతుంది. అప్పుడు చైతన్యులు తల్లిని ఓదారుస్తూ 'అమ్మా! నాకు నీ నుండి జన్మ కలిగింది. ఈ శరీరం నీచే పోషించబడింది. కోటి జన్మలెత్తినా నీ ఋణం తీర్చుకోలేను. నేను సన్యసించానని విచారపడవద్దు, నీతోనే ఉంటాను. నీవు ఎక్కడ ఉండమని ఆజ్ఞాపిస్తే అక్కడ ఉంటాను' అని ప్రమాణం చేస్తాడు.

చైతన్యుడి మాటలు వినగానే శచీదేవి దుఃఖమంతా తొలగిపోయింది. కుమారుడితో 'నువ్వు నాకు సమీపంలో ఉండడం ఆనందమే. కానీ సన్యాసి జన్మస్థానంలో ఉండటం ధర్మంకాదు, అందరూ నిందిస్తారు. కనుక సన్యాసి ధర్మం చెడకుండా, నాకు దూరం కాకుండా మన గ్రామానికి దగ్గరలో ఉన్న నీలాచలంలో ఉంటే సరిపోతుంది' అంటుంది. ఇలా చైతన్య మహాప్రభువు తల్లిని సాక్షాత్తు జగజ్జననిగా, ఆమె సూచననే జగజ్జనని ఆజ్ఞగా భావించి నీలాచలంలో ఉండటానికి అంగీకరిస్తాడు.

జీవితంలో గృహస్థుడైనా, సన్యాసి అయినా అత్యున్నత శిఖరాలను చేరుకున్న వారిని గమనిస్తే మనకు స్ఫురించే విషయం, కన్నవారిని సాక్షాత్తు దైవాలుగా భావించి వారికి సముచిత స్థానాన్నిచ్చి గౌరవించడం!

పాశ్చాత్య దేశాల్లో వేదాంత సింహగర్జన చేసి ఆధ్యాత్మికతకు ఒక క్రొత్త ఒరవడిని సృష్టించిన స్వామి వివేకానంద 'తల్లిని ఆరాధించని వ్యక్తి ఉన్నతి పొందలేదు. జీవితంలో నేను సాధించినవన్నింటికీ నా తల్లే కారకురాలు. ఆమెకు ఋణపడివున్నాను' అని తన మాతృమూర్తిని స్మరించుకుంటారు. ❖

(మార్చి 5, శ్రీచైతన్య మహాప్రభు జయంతి)

– బ్రహ్మచారి రవి

అపర అర్జునుడు

శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష సన్యాస శిష్యులైన స్వామి యోగానంద మహరాజ్ పూర్వాశ్రమ నామధేయం యోగీంద్రనాథ్ చౌదరి. ఐదు సంవత్సరాల వయస్సులోనే అతడు ఆధ్యాత్మిక భావావేశంతో పరవశుడైపోతూ ఉండేవాడు. ఆటల మధ్యలో హఠాత్తుగా ఒక తీవ్రమైన భావావేశానికి లోనయ్యేవాడు. 'నేను మరో ప్రపంచానికి చెందిన వాణ్ణి. అయితే, మరి ఇక్కడెందుకున్నాను?' అని తనను తాను ప్రశ్నించుకునేవాడు. ఇలా చిన్నతనం నుంచే అతడిలో ఆధ్యాత్మిక జిజ్ఞాస ఉండేది.

యోగీంద్రుడు పాఠశాలలో చిట్టచివరి సంవత్సరం చదువుతూండగా శ్రీరామకృష్ణులను దర్శించాడు. అతణ్ణి చూడగానే 'యోగీంద్రుడు గతజన్మలో మహాభారత నాయకుడైన అర్జునుడు' అని శ్రీరామకృష్ణులు ప్రకటించారు.

ద్వాపరయుగావతారమైన శ్రీకృష్ణుడు యుద్ధభూమిలో భీతితో క్రుంగిపోయిన అర్జునుడికి విల్లంభులుచేతబట్టి ధైర్యంగా యుద్ధం చేయమని బోధించాడు. మరి కలియుగ అవతారమైన శ్రీరామకృష్ణులు ఈ అపరార్జునుడైన యోగీంద్రుడికి ఏమి బోధించాడు?

ఒకనాడు శ్రీరామకృష్ణులు ఏకాంతంగా ఉన్న సమయంలో యోగీంద్రుడు, 'మహాశయా! కామవాంఛ లను జయించడానికి నాకేదైనా మార్గాన్ని ఉపదేశిస్తారా?' అని అడిగాడు. అందుకు శ్రీరామకృష్ణులు 'హరినామ స్మరణ చేయి. కామవాంఛలు తొలగిపోతాయి' అని జవాబిచ్చారు. గురుదేవుల ఆదేశానుసారం భగవన్నామ జపంతో అతి తక్కువ కాలంలోనే ఆధ్యాత్మికంగా ఉన్నత స్థితికి చేరుకున్నాడు.

స్వామి వివేకానంద, స్వామి యోగానంద మహరాజ్ గురించి తెలుపుతూ 'అన్ని రీతులా పరిపూర్ణంగా కామాన్ని జయించినవాళ్ళంటూ ఎవరైనా ఉంటే అతడు యోగీంద్రనాథుడొక్కడే' అని కొనియాడారు. ❖

(తిథి ప్రకారం మార్చి 10వ తేదీన శ్రీరామకృష్ణ పరమహంస సన్యాస శిష్యులైన స్వామి యోగానంద మహరాజ్ జయంతి)



మహాపురుషుని సాన్నిధ్య స్మృతులు

– స్వామి అర్చనానంద

ఒకరోజు హైదరాబాద్ రామకృష్ణ మఠంలో స్వామి రంగనాథానందజీ మహరాజ్ మధ్యాహ్న భోజనానంతరం తమ గదిలో విశ్రాంతి తీసుకొంటున్నారు. ఆ సమయంలో సుదూరమైన పల్లెటూళ్ళ నుండి భక్తులు గుంపుగా పూజ్యమహరాజ్ వారి దర్శనానికై విచ్చేశారు. వారిని చూసి సేవకస్వామి 'ఈ సమయంలో స్వామీజీ విశ్రాంతి తీసుకుంటున్నారు. సాయంత్రం లేదా రేపు ఉదయం రండి' అంటూ చెబుతున్నారు.

ఆ మాటలు గదిలో విశ్రాంతిలో ఉన్న స్వామి రంగనాథానందజీ మహరాజ్ చెవిన పడ్డాయి. మహరాజ్ ఆ సేవక స్వామిని పిలిచి, 'వారిని లోనికి పిలువు, వారెంతో సుదూర ప్రాంతాల నుండి వచ్చారు – శ్రీరామకృష్ణులను దర్శించుకోవడానికి! అంతేతప్ప నన్నూ, నిన్నూ చూడడానికి కాదు. మనం వెళ్ళిపొమ్మంటే వారు చాలా బాధపడతారు. మనం సాధువులం, మన వల్ల ఇతరులకు బాధ కలగకూడదు. వారిని రమ్మను!' అని సెలవిచ్చారు. ఆ పల్లెటూరి పేదప్రజల ఆనందానికి అంతు లేదు. పేదలు, దీన దుఃఖితుల పట్ల రంగనాథానందజీ ప్రేమకూ అంతు లేదు!

అప్పుడప్పుడూ అకస్మాత్తుగా పూజ్య స్వామీజీ శ్రీరామకృష్ణుల దేవాలయ గర్భమందిరంలోకి వచ్చేవారు. ఆ సమయంలో వారి ముఖమండలం 'వేరుగా' అగుపించేది. అప్పుడు అక్కడ తమ ధీర గంభీర సింహనాదంతో వేదాంత గర్జనను విశ్వవేదికపై వినిపించే 'అపర వివేకానందుడి'లా కాక శాంత, సౌమ్య, భక్తి సంభరిత శ్రీరామకృష్ణ ప్రేమిగా, దాసునిగా, సేవకునిగా అగుపించేవారు. ఆ దివ్యముహూర్తంలో తమ ఇష్టదైవం – శ్రీరామకృష్ణుల వారితో ఏమి సంభాషించేవారో ఎవరికి ఎరుక? పూజారి బ్రహ్మచారి ఇచ్చిన 'పుష్పాంజలి'ని శ్రీరామకృష్ణులకు (గర్భమందిరంలో) మహరాజ్ సమర్పిస్తూ సాష్టాంగ ప్రణామం చేస్తూ ఉంటే – 'వీరేనా, *Modern Science and Vedanta* – ఆధునిక విజ్ఞానం, వేదాంతం' గురించి సింహగర్జన చేసే స్వామి రంగనాథానందజీ మహరాజ్! అనిపించేది. తమకు అత్యంత ప్రియమైన వ్యక్తినెవరినో ఏకాంతంగా కలవడానికి వచ్చినట్లుగా ఉండేవి వారి హావభావాలు! అదొక దర్శనీయ దృశ్యం.

కొన్ని రోజులు సాయంసంధ్యా ఆరతికి కూడా స్వామీజీ విచ్చేసేవారు. అతి సామాన్యంగా, నిరాడంబరంగా మిగతా సాధు, బ్రహ్మచారులందరితో పాటు కూర్చొని పాడేవారు. ఆరతి, భజన ముగిసిన తరువాత లేచి వెళ్ళేటప్పుడు భక్తులు ప్రణామాలు చేయడానికి ముందుకొచ్చేవారు. కానీ మహరాజ్ తమ శాంత గంభీరవాణితో "వద్దు, ఇక్కడ దేవాలయంలో ప్రణామాలు చేయకండి" అని వారించేవారు. అంటే 'ఇది సర్వదేవదేవీ స్వరూపులయిన భగవాన్ శ్రీరామకృష్ణులు సాక్షాత్తూ కొలువై ఉన్న దేవాలయం. ఇక్కడ శ్రీరామకృష్ణులకే ప్రణామాలు చేయాలి కానీ నాకు కాదు' అని భావం కదా! అలాంటి భక్తి, శ్రద్ధ, నిరహంకారతలు మనందరికీ ఆదర్శనీయం కదా!

ఎన్నో ఆశ్రమాలు, మఠాల నుండి ఆహ్వాన పత్రికలు రంగనాథానందజీకి వచ్చేవి. వాటిపై శ్రీరామకృష్ణులు, శారదామాత, స్వామీజీల చిత్రాలు ముద్రింపబడి ఉండేవి. ఆ కవర్లను ఎలా పారవేయాలా? అని స్వామీజీ మథనపడేవారు. స్వామి అనన్యానంద గారిని పిలిచి చిన్న పిల్లవాడిలా,"చూడు! ఈ కవర్లన్నింటిపైనా శ్రీరామకృష్ణుల చిత్రాలను ముద్రించారు. వీటిని నేనెలా పారవేయగలను? ఏం చేయమంటావు చెప్పు" అని ఎంతో బాధ, ఆవేదన, ఆర్తితో అడిగేవారు. ఆ కాగితాలను పారవేస్తే, 'శ్రీరామకృష్ణులనే' పారవేసినంత బాధ, ఆవేదన వారి మాటలలో స్ఫురించేది. అందుకే రామకృష్ణ మఠం వారు ఆహ్వాన పత్రికలపై మూర్తిత్రయం ఫోటోలు ఎప్పుడూ ముద్రించరు! ఇది అందరూ ఆచరించాల్సిన మంచి సంప్రదాయం!

శ్రీశారదామాత జన్మించిన 'మార్గశిర కృష్ణ సప్తమి' తిథి రోజునే రంగనాథానందజీ మహరాజ్ జన్మించారు (1908 డిసెంబరు15న). అందువల్లనే వారి బాహ్యరూపం ధీరగంభీర మైనా, అంతరంగం మాతృప్రేమమయ పూర్ణకుంభం. ఎవరు ఎప్పుడు వచ్చినా, 'భోజనం చేశావా? వెళ్ళు భోజనం చేయి' అని మాతృప్రేమతో చెప్పేవారు. పిల్లలు వస్తే వారికి స్వీట్లు పంచిపెట్టేవారు. మహిళా భక్తులందరినీ మాతృమూర్తులుగా గౌరవించేవారు. వారిని 'శ్రీశారదాదేవి భక్తమండలి'గా ఏర్పడి వారి ఇళ్ళల్లోనే భజన, సత్సంగం, పేదలసేవ మొదలైనవి చేయమని ప్రోత్సహించేవారు. అలా స్వామీజీ దగ్గరకు వచ్చిన ఎంతో మంది మహిళలు ప్రభావితులై ఈనాటికీ గొప్ప సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ❖

(స్వామి రంగనాథానందజీ మహరాజ్, హైదరాబాద్ రామకృష్ణ మఠ సంస్థాపకాధ్యక్షులు, రామకృష్ణ సంఘ 13వ సర్వాధ్యక్షులు)

లక్ష్మణా! నీవు భావజ్ఞుడవు. కృతజ్ఞుడవు. ధర్మజ్ఞుడవు. నీవు నాకు తోడుగా, రక్షకుడిగా సదా నాతో ఉండుట వలన తండ్రి దశరథుడు లేని లోటు నాకు తెలియడం లేదు. –రాముడు, (రామాయణం)

భగవంతునితో అనుసంధానం!

– శ్రీమతి భమిడిపాటి బాలాత్రిపురసుందరి

ప్రతి మనిషికీ ఒక అంతఃకరణ ఉంటుంది. దానికి మూడు లక్షణాలు ఉంటాయి. అవి–మలం, విక్షేపం, ఆవరణం.

మలం – మనిషి చేసిన పాపకర్మలు అంతఃకరణం అనే అద్దానికి పేరుకుని ఉంటాయి. దుమ్ము పట్టిన అద్దం ముందు నిలబడి చూసుకుంటే ముఖం సరిగా కనిపించదు. అద్దాన్ని శుభ్రంగా తుడిచి చూస్తే స్పష్టంగా కనిపిస్తుంది. అంతఃకరణలో ఉన్న 'మల' అనే చెడు లక్షణాన్ని తుడవడానికి భక్తే సాధనం.

విక్షేపం – చాంచల్యం. అద్దం ముందు నిలబడిన మనిషి తన ముఖాన్ని చూసుకుంటూ ఉన్నప్పుడు అద్దం కదిలితే ప్రతిబింబం సరిగ్గా కనిపించదు. అలాగే, ప్రాపంచిక కోరికల వల్ల మనస్సు చంచలంగా ఉంటే ఆత్మను దర్శించలేం. చంచలమైన మనస్సును నిరోధించడానికి భగవన్నామ కీర్తన, స్మరణలను అభ్యసించాలి.

ఆవరణం – అజ్ఞానం. అద్దం మీద ధూళి పేరుకుపోతే దాని మీద ఒక పొర ఏర్పడుతుంది. అందువల్ల ముఖం చూసుకుందామంటే కనిపించదు. ఆ పొరను తొలగించి చూస్తే ముఖం స్పష్టంగా కనిపిస్తుంది. అలాగే మనలోని అజ్ఞానమనే పొర తొలగకపోతే ఆత్మ దర్శనం సాధ్యం కాదు. భగవంతుణ్ణి గురించిన జ్ఞానం పొందడం వల్లనే అది సాధ్యమవుతుంది.

ఒక గురువు దగ్గర ఒక శిష్యుడు ఉండేవాడు. భగవంతుడు అంతటా వ్యాపించి ఉన్నాడు, మనం చేసేవన్నీ చూస్తూనే ఉంటాడు అని నమ్మేవాడు. అతడంటే గురువుగారికి ఎక్కువ ఇష్టం. మిగిలిన శిష్యులకు అతడంటే కోపం. ఒకరోజు అతడు ఒక గదిలో కూర్చొని అనుష్ఠానం చేసుకుంటూ ఉండగా, మిగిలిన శిష్యులు వాళ్ళ పాదరక్షలన్నీ దండగా కట్టి గుమ్మం దగ్గర వ్రేళ్ళాడదీశారు. గదిలో నుంచి బయటకు వచ్చేటప్పుడు తలకు తగిలి అతడు అవమానపడాలన్నది వాళ్ళ కోరిక. కానీ, అతడు అవి తలకు తగలగానే ఎంతో ఆనందపడ్డాడు. మిగిలిన శిష్యులు ఆశ్చర్యపోయి 'నీకు కోపం రాలేదా?' అని అడిగారు. అందుకు అతడు 'ఇంతమంది హరిదాసుల పాదరక్షలు నా తలకి తగిలి నన్ను పవిత్రుణ్ణి చేశాయి... నేను తరించి పోయాను!' అన్నాడు. ఈ విధంగా అహంకార మమకారాలులేని అంతఃకరణ గలవారు భగవంతుణ్ణి దర్శిస్తారు.

నది, సముద్రం వైపు పరుగులు పెడుతుంది. అదే విధంగా మనిషి భక్తి ప్రభావం భగవంతుని వైపు పరుగులెత్తాలి. ఒక వ్యక్తికి పది, యాభై, వంద నోట్లు చూపించి నప్పుడు వాటిలో ఒక్కటి తీసుకోమంటే అతడు ఏది తీసుకుంటాడు? వంద నోటు తీసుకుంటాడు. ఎందుకు? అది ఎక్కువ విలువైంది కనుక.

అదేవిధంగా మనిషి అనిత్యమైన విషయసుఖాల పట్ల కాకుండా శాశ్వతానందాన్ని ప్రసాదించే భగవంతుణ్ణి పొందేందుకు దుర్లభమైన ఈ మానవజన్మను సద్వినియోగ పరచుకోవాలి. అందుకు మన చిత్తంలోని మాలిన్యాన్నీ, చిత్తచాపల్యాన్నీ, అహంకారాన్నీ పారద్రోలాలి. ఇవన్నీ ఇంద్రియ నిగ్రహంతోనే సాధ్యం. ఇంద్రియ నిగ్రహం గల వ్యక్తి సందర్శనం వల్ల పుణ్యక్షేత్రాలు కూడా మరింత పవిత్రతను సంతరించుకొంటాయి అని మైత్రేయ మహర్షి, విదురునితో...

నిగృహీతేంద్రియ గ్రామో యత్ర యత్రసేన్నరః ।
తత్ర తత్ర కురుక్షేత్రం నైమిశం పుష్కరాని చ ॥

'ఇంద్రియాల్ని అదుపులో పెట్టుకున్నవాళ్ళు ఎక్కడెక్కడ తిరుగుతారో అవన్నీ కురుక్షేత్రాలు, నైమిశారణ్యాలు, పుష్కర తీర్థాలుగా ప్రసిద్ధికెక్కుతాయి' అని అంటాడు.

మన జీవితాన్ని భగవంతునితో అనుసంధానం చేసుకొని జప ధ్యానాలను క్రమం తప్పకుండా అభ్యసిస్తే ఇంద్రియనిగ్రహం సాధ్యమవుతుంది. అలా నిత్యం మనం భగవంతునితో సంబంధం పెట్టుకుంటే మనోనిర్మలత, మనోనిశ్చలత, మనఃశాంతి కలుగుతాయి. ❖

ధీరవాణి

- స్వామి వివేకానంద

స్వధర్మం... సమభావం

భగవంతుణ్ణి పూజించే విధానాలు భిన్నములై కన్పిస్తాయి. ఒకడు తాను భగవంతుని పూజించే విధానమే మహా మహిమాధ్యమని భావిస్తాడు. ఇంకొకడు తన మార్గమే మోక్షాన్ని సంపాదించగల మహిమాన్విత విధానమని భావిస్తాడు.

శైవులు, శివుణ్ణి మహామహిమాధ్యుడంటారు. వైష్ణవులు విష్ణువును సర్వశక్తిమంతుడని సేవిస్తారు. దేవ్యారాధకులు తమ దేవి విశ్వంలో సర్వశక్తిమతి అని వాదిస్తారు. కానీ అన్ని విధానాల యొక్క యథార్థమైన మూలాధారం ఒక్కటే అని కనుగొనరు.

ద్వేషమనేది భక్తిమార్గంలో చాలా ప్రతిబంధకంగా నిలుస్తుంది. ఎవరి పట్లా ద్వేషంలేని నరుడే, భగవంతుణ్ణి చేరగల్గుతాడు. “విష్ణువు, రాముడు ఒక్కటే అని నాకు తెలుసు. అయినా, కమలనేత్రుడైన రాముడే నా పరమ నిధానము” అని హనుమంతుడు చెబుతున్నాడు.

ఒక్క మతం మాత్రమే ఉండడాన్ని భగవంతుడు కూడా నిరాకరించుగాక! ప్రతి మనిషినీ వాని ఇచ్ఛానుసారం పోనీయాలి. అలాకాకుండా వాణ్ణి బలవంతంగా వేరొక మార్గంలో ప్రవేశపెడితే, అతడు తనకున్న దాన్ని కూడా కోల్పోయి, ఎందుకూ కొరగానివాడవుతాడు. ఒకని ముఖం వేరొకని ముఖాన్ని పోలి ఉండనట్లుగా, ఒకని స్వభావం వేరొకని స్వభావాన్ని పోలి ఉండదు. కాబట్టి వానిని, వానికి అనుకూలమైన విధంలో వర్తించకుండా మనమేల అడ్డుపెట్టాలి?

భారతదేశంలో మతవైరం లేదు. ప్రతి మతానికీ సర్వస్వాతంత్ర్యం ఇచ్చారు. కాబట్టే మతం సజీవమై నిలిచింది. ఒక్క మతమే సత్యమనీ, తన మతాన్ని విశ్వసించనివాడు మూర్ఖుడనీ, ఇతరులు కపటులనీ భావించడం వల్లనే పోరాటాలు జరుగుతున్నాయని జ్ఞప్తి యందుంచుకోవాలి.

ప్రజలందరూ ఒకే మతాన్ని అవలంబించాలనేది భగవదిచ్ఛ అయితే, ఇన్ని మతాలు ఎందుకు పుట్టుకొచ్చాయి? ప్రతి ఒక్కరినీ, ఒకే మతం అనుసరించమని బలాత్కరించడానికి అనేకులు ఇదివరకు వ్యర్థప్రయత్నాలు చేశారు. కత్తి ఎత్తి ప్రజలందరినీ ఒకే మతంలోకి చేర్చాలని ప్రయత్నించినప్పుడు సైతం దాని స్థానంలో పది మతాలు పుట్టుకొని వచ్చాయని చరిత్ర సాక్ష్యమిస్తోంది. ఒకే మతం అందరికీ సరిపడదు.

నరుడు క్రియ, ప్రతిక్రియలనే రెండు శక్తుల సమ్మేళనంతో ఏర్పడుతున్నాడు. ఈ శక్తులతనిని జిజ్ఞాసువుగా చేస్తున్నాయి. అలాంటి శక్తులు, నరుని మనస్సుకు వ్యాయామం కల్పించకపోతే, అతడు జిజ్ఞాస చేయడానికి, అంటే ఊహించడానికి అశక్తుడైపోతాడు. ‘మానవుడు’ – అంటే మననం చేసేవాడని అర్థం. అట్టి మనుష్యుని మననశక్తి, లేక జిజ్ఞాసశక్తి, లేక ఊహాశక్తి, నష్టమైపోయిన తక్షణమే, అతడు పశుసమానుడైపోతాడు. అలా కావాలని ఎవరు కోరుకొంటారు? అలాంటి దుర్దశ భారతదేశ ప్రజలకు వాటిల్లకుండా భగవంతుడు రక్షించుగాక!

మనుష్యునిగా నిలపడానికి ఏకత్వంలో భిన్నత్వం ఉండడం అవసరం. ప్రతి విషయంలోనూ భిన్నత్వాన్ని అంటే, వైవిధ్యాన్ని పోషించాలి. భిన్నత్వం ఉండేంత వరకే ఈ ప్రపంచం నిలువగలదు. ప్రతి మతంలోను యోగ్యులు, సమర్థులు ఉండి, తాము పూనిన మతాన్ని గౌరవభాజనంగా చేస్తున్నారు. ప్రతి మతంలోనూ అలాంటి వారుంటారు. కాబట్టి ఏ సంప్రదాయం పట్లా ద్వేషమనేది ఉండరాదు.

‘అలా అయితే కళంకాన్ని ప్రోత్సహించే మతాన్ని మనం గౌరవించాలా?’ అని మీరు ప్రశ్నించవచ్చు. దీనికి జవాబు వ్యతిరేకంగా ఉంటుందనడం నిజం. అటువంటి మతాన్ని తక్షణం బహిష్కరించి వేయవలసిందే! అది అనర్థమూలం; అరిష్టదాయకం. మతాలన్నీ తప్పక నీతి మీద ఆధారపడి ఉండాలి. మతం కన్నా పవిత్రశీలం గొప్పదని భావించాలి. ❖

రావణేంద్రా! ఈ లోకంలో తీపి కబుర్లు చెబుతూ స్తుతించేవారు సులభంగా దొరుకుతారు. కానీ అప్రియమైనా నిజం మాట్లాడేవారూ, వినేవారూ చాలా అరుదుగా లభిస్తారు.-మారీచుడు, (రామాయణం)

బహుకోణాల్లో భరతుని జీవితం

– స్వామి శశికాంతానంద

'నీ కలలు పండాలంటే – నిద్రించకు' – అన్నది లోకోక్తి. ఆశయాలు నెరవేరాలంటే అలసత్వం లేకపోవడం, నిరంతర కృషితో పాటు, నియమ నిబద్ధతలు, ధర్మనిరతిగల ప్రజలు, యోగ్యులు, నిస్వార్థపరులు, ధర్మపరాయణులైన పాలకులు ఏ సమాజానికైనా అత్యంత కీలకం. అవి లోపించిననాడు సంక్షేమ రాజ్యం బదులు – సంక్షోభరాజ్యం, రామరాజ్యం బదులు– రాక్షసరాజ్యం ఏలుబడిచేస్తాయి.

రామరాజ్య స్థాపనలో భరతుని భూమిక : రామరాజ్యం కావాలని కలలుకనొచ్చు. కలలు కనడం ద్వారా రామ రాజ్య మెన్నటికీ సాధ్యపడదని రామాయణంలోని దశరథుని చరిత్ర నిరూపిస్తుంది. తన కుమారులలో పెద్దవాడైన రామునికి రాజ్యాభిషేకం చేసి రామరాజ్యాన్ని స్థాపించాలనుకున్నాడు దశరథుడు. కోరిక న్యాయసమ్మతమైనప్పటికీ అది సాధించ కుండానే శోకంతోనే కన్ను మూసాడా మహారాజు. కారణా లందరికీ తెలిసినవే!

స్వార్థం నుండి కాముకత, వ్యామోహం ఉత్పన్నమవుతాయి. వీటికి బానిసలైనవారు నష్టపోయే దేమిటో చిత్రీకరిస్తుంది దశరథుని చరిత్ర. ఎప్పుడో భార్యకైకేయికిచ్చిన మాటకు కట్టుబడి – అత్యంత ప్రీతిపాత్రుడు, ధర్మస్వరూపుడైన రాముని, ఇష్టం లేకపోయినా, వనవాసానికి పంపాడా దశరథుడు. 'నాస్తి కామసమోరిపుః – కామానికి సరితూగే శత్రువు లేదు'. అంత ప్రభావమంతమైనది కామం.

ధర్మం పరిపూర్ణంగా ఉన్నప్పుడే రామరాజ్యం సంభవం. ధర్మరాజ్యమే రామరాజ్యం. ధర్మంలేని రాజ్యం పునాదిలేని భవనం. ధర్మనిరపేక్ష రాజ్యమంటే ధర్మంలేని రాజ్యమని కాదు అర్థం. అన్ని ధర్మాలకూ సమాన ప్రతిపత్తినీ, గౌరవాన్నీ, సముచిత స్థానాన్నీ కల్పించడమే ఆ పదానికి నిజమైన అర్థమని గుర్తించాలి.

దశరథుని ద్వారా వీలుపడని రామరాజ్యస్థాపన భరతుని ద్వారా సంభవించింది. దానికి మూలకారణం భరతుని ధర్మనిష్ఠ. 'భరతా! నీవు ఏది చేసినా, ఏమి చెప్పినా ధర్మాతీతం కాదు – ధర్మబద్ధమే. ఇదే ధర్మానికి నేనిచ్చే నిర్వచనం' అని గురువు వశిష్ఠుడు భరతుణ్ణి ప్రశంసించాడు. ధర్మానికి నిర్వచనమే భరతుని చరిత్ర. దూడను వెంబడించిన ఆవులాగా, ధర్మాన్ని అవలంబించినవారిని, అర్థ కామ మోక్షాలు అనుసరిస్తాయి – అన్నది భరతుని జీవితం నిరూపిస్తుంది. రామరాజ్య స్థాపనలో భరతుని భూమిక అద్వితీయం. సీతలేకపోతే రాముని పరాక్రమం ప్రపంచానికి తెలిసేదికాదు. అలాగే రాముడు అడవికి వెళ్ళకపోతే భరతునిలోని అసాధారణ ప్రతిభాపాటవాలు, భక్తిశ్రద్ధలు, సోదరప్రేమ మున్నగు సద్గుణాలు లోకానికి తెలిసేవికావు.

రామరాజ్య స్థాపనలో భరతుడు ప్రదర్శించిన చొరవ, నైపుణ్యం, ఉదారతను వివరించే అనుభూతి ప్రదాయకములైన కొన్ని విశేషాలు తెలుసుకుందాం:

నిద్రించకు – నిందించకు : రామరాజ్య స్థాపనలో భరతుడు కృతకృత్యుడైనాడంటే ఆయనెన్నడూ నిద్రించలేదు,కలలు కనలేదు. కార్యసిద్ధి కొరకు సదా రామధ్యానంలోనే గడిపాడు. ఎవరినీ నిందించలేదుకూడా, ఒకే ఒక సందర్భంలో తప్ప. దశరథుని మరణానికీ, రాముని అరణ్యవాసానికీ కారణభూతురాలైన కైకేయిని నిందించాడు, వధింపదలచి మరల రాముని ఆగ్రహానికి గురికాకూడదనీ, ఆయన అనుగ్రహానికి దూరం కాకూడదనీ భావించి వెనుకాడాడు. రాముని పట్ల అంత భక్తి ప్రపత్తులు భరతునికి.

రాముణ్ణి అరణ్యంలో కలవడానికి వెళ్తూ మార్గమధ్యంలో భరద్వాజాశ్రమంలో తన పరివారంతో ఒక రాత్రి బస చేశాడు భరతుడు. అందరికీ సకల రాచమర్యాదలతో ఏర్పాట్లు చేయబడ్డాయి. భరతునికి సపర్యలు చేయడానికి పరిచారకులుగా అష్టసిద్ధులు కొలువైవున్నారు. వారిని కన్నెత్తి చూడలేదు కదా– వారి అవసరమే పడలేదు భరతునికి. నిద్రాహారాలు మాని రాముని ధ్యానంలో రాత్రంతా గడిపాడు. అలాగే రాముని ప్రతినిధిగా పదునాల్గు సంవత్సరాలు రాజభోగాల మధ్యవున్నా 'చక్రవాక పక్షుల జంట' వలె తపోమయ జీవితాన్నే గడిపాడు భరతుడు. రామలక్ష్మణులు అరణ్యంలో తపమాచరించగా, రాజ్యంలో ఉంటూ, రాజ్యభారాన్ని వహిస్తూ తపస్వి జీవితాన్ని గడిపిన ధీరుడాయన.

అయోధ్యలో 'రాముడే రాజ్యానికి వారసుడు – అతడే రాజ్యాన్ని ఏలాలి' అన్న మాటనే, అడవిలో రాముని సమక్షంలో కూడా చెప్పాడు. పదునాల్గు సంవత్సరాల తరువాత కూడా ఒకే మాటపై నిలిచి కడకు రామునికి పట్టం కట్టి తననుకున్నది నెరవేర్చిన నిష్ఠాగరిష్ఠుడు భరతుడు. – 'నిరంతర సాధనా ఫలమే సాధుత్వం కదా!' భారతజాతి ఆదర్శాలు 'త్యాగము–సేవ' అన్న మహత్తర సత్యాన్ని భరతుని జీవితంలో మనం ప్రస్ఫుటంగా చూడొచ్చు.

పదవీసేవ!.. పాదసేవ! : 'అసత్యాద్భీతిరధికా మహతాం నరకాదపి – మహాత్ములకు నరకాదులకన్నా అసత్యవాదమే అధిక భయాన్ని కలిగిస్తుంది'. ఇది మన సంస్కృతీ, సాంప్రదాయా లందించిన వారసత్వ సంపద. సత్యదూరుడైన మనిషి పట్టాలు తప్పిన బండిలా ప్రమాదంలో చిక్కుకుంటాడు. "దశరథుడెన్నడూ అసత్యవాదికాదు. కనుక దశరథుని పల్కులు అసత్యాలెన్నటికీ

కారాదు. తనయులుగా తండ్రి సత్యనిష్ఠను కాపాడవలసిన బాధ్యత మనది" అని భరతునికి చెబుతూ, రాముడు "భరతా! నాకు వనవాసం – నీకు రాజ్యాభిషేకం తండ్రి విధించాడు. సత్యాన్ని వక్రీకరించకూడదు. కనుక వెనుకకు వెళ్ళి రాజ్యాభిషిక్తుడవుకా, అరణ్యవాసం ముగిసిన తరువాత నేను రాజ్యబాధ్యతలు స్వీకరిస్తాను" అంటాడు. రాజ్యపదవి వద్దనుకుని రాజమకుటాన్ని తిరస్కరిస్తూ చివరికి పాదుకలకు పట్టం కట్టారు అన్నదమ్ములిరువురూ. పదవుల కోసం పోటీలు పడే ఈ రోజుల్లో

'పదవీసేవకాదు – పాదసేవ' అని 'నీపాదకమల సేవయు, నీ పాదార్చకుల తోడి నెయ్యమున్' అన్న భాగవత ధర్మాన్ని విశదీకరిస్తుందీ భాగవతోత్తముడైన భరతుని జీవితం. అంతేకాదు – ఇదీ మన వారసత్వ సంపద అని మరీ మరీ హెచ్చరిస్తుంది. మన జాతీయ చిహ్నంలో 'సత్యమేవ జయతే' నినాదం సత్యం పట్ల భారతీయులకుండే భక్తి శ్రద్ధలను చాటుతుంది.

దేహధర్మమా?.. ఆత్మధర్మమా? : దశరథుని మరణవార్త కన్నా రాముని వనవాసవార్తే భరతుని అత్యధికంగా బాధించింది. 'నన్ను రాముని కప్పగించకుండా వెళ్ళిపోయావా తండ్రీ!' అని విలపిస్తున్న భరతుడు, రాముని వనవాసవార్త వినగానే తల్లి కైకేయిని దండించాలనుకున్నాడు. కానీ రాముని భయంతో వెనుకకుతగ్గాడు. తండ్రితో సంబంధం దేహధర్మం. రామునితో సంబంధం ఆత్మధర్మం. ఆత్మధర్మానికే ప్రాధాన్యతనిచ్చాడు భరతుడు. భరతుడు ఎన్నుకున్న ఆత్మమార్గమే అందరికీ అనుసరణీయం. ఆ ఆత్మాన్వేషణలోనే అడవికి బయలుదేరాడు భరతుడు.

సీత పరాభక్తి స్వరూపిణి, లక్ష్మణుడు వైరాగ్యానికి ప్రతీక. వారితో కలసి చిత్తమనే చిత్రకూటంలో కొలువైవున్నాడు పరమాత్మ స్వరూపుడైన రాముడు. ఆ పరమాత్మతో కలయికే భరతుని ధ్యేయం. భరతుని చిత్రకూట ప్రయాణంలోని రహస్యమిదే! అతడొక్కడేకాక ఆ పరమాత్మ దర్శనానికి ప్రజలనందరినీ తనతో తీసుకెళ్ళడంలోనే భరతుని విశిష్టత దాగివుంది. దీని ద్వారా 'స్వముక్తి కాదు – సర్వముక్తి' అన్న ధర్మాన్ని చాటాడు.

ఆత్మధర్మాన్ని కోరుకున్నాడు గనుకనే రామభక్తులైన వారందరినీ వీరూవారనక ఆత్మీయభావంతో అక్కున చేర్చుకున్నాడు. అంతేకాదు – శుద్ధ భక్తిలో అంటరానితనానికి చోటులేదన్న సత్యాన్ని నిర్ధారించాడు భరతుడు.

భగవదర్పిత చిత్తుడు: వనవాసానికి వెళ్ళేముందర లక్ష్మణునితో రాముడు 'నీవు అయోధ్యలోవుండి రాజమాతల బాధ్యతలు చూసుకో' అంటే, లక్ష్మణుడు, 'అన్నా! భరతునిలో అన్నీ నీ పోలికలే ఉన్నాయి. తల్లుల బాధ్యత చక్కగా నిర్వర్తించే సమర్థుడతడు. నేను మాత్రం నిన్నే వెంబడిస్తాన'ంటాడు. రామ వియోగాన్ని ఏ మాత్రమూ ఓర్వలేడు లక్ష్మణుడు. కానీ భరతుడు భగవదర్పిత చిత్తుడు. చలనం లేని రామ భక్తి అతనిది. రాముని వియోగంలోనూ భక్తుడే – రాముని సంయోగం లోనూ భక్తుడే.

సైన్యంతో వస్తున్న భరతుని చూసి లక్ష్మణుడు సందేహించగా, రాముడు భరతుని శీలాన్ని ఏ మాత్రమూ శంకించకుండా 'లక్ష్మణా! బ్రహ్మలోకపదవి లభించినా భరతునిలో పదవీమదం కించిత్తైనా కలుగదయ్యా!' అంటాడు ప్రశంసాపూర్వకంగా. 'రాముడే రాజ్యాభిషిక్తుడైతే బదులుగా పదునాల్గు సంవత్సరాలేకాదు, జీవితాంతం అరణ్యవాసం చేస్తాను' అంటాడు భరతుడు. అది మాత్రమే కాదు. 'గడువు దాటిన మరుక్షణం తిరిగిరాకపోతే అగ్ని ప్రవేశం చేస్తానని' రాముని నుండి మాట కూడా తీసుకుంటాడు ఆయన.

'భరతా! రాముని పట్ల నీ భక్తి లక్ష్మణుని భక్తి కన్నా గొప్పది' అని భరద్వాజ మహర్షి మెచ్చుకుంటాడు. రామప్రేమకు మారుపేరే భరతుడు. 'రామో విగ్రహవాన్ ధర్మః' రామప్రేమ – ధర్మనిష్ఠ వేరు వేరు కావు.

చేతన – అచేతనాలు : రావణుడు గొప్పశివభక్తుడు. శివార్చనలో ప్రత్యక్షంగా వచ్చి కూర్చోవలసిందే. మరి రాముడు రామేశ్వరంలో శివలింగం ప్రతిష్ఠించి, అర్చించాడు. ఇక భరతుడో! అచేతనమైన పాదుకలకు చేతనత్వాన్ని ఆపాదించాడు. వాటిలో రామున్నే దర్శించాడు. ఇది భావభక్తి ప్రభావం. చేతనంలో

(మిగతా 35వ పేజీలో...)

మహర్షీ! నన్ను లోకం దూషిస్తుందనిగానీ, పరలోకంలో నా స్థితి ఎలా ఉంటుందోనని గానీ బాధ లేదు. కానీ నా వల్లరాముడు అడవులపాలైనందుకు నా హృదయం దహించుకుపోతోంది. –భరతుడు, (రామాయణం)

ఎంత తెలివైన

– స్వామి శితికంఠానంద

ఈ మధ్య ఒక యువకుడు మఠంలోని ఒక స్వామీజీతో 'స్వామీజీ మీలాగా అందరూ సన్న్యాసం తీసుకుంటే మరి మానవజాతి అంతరించి పోతుంది కదా?' అని ఒక ధర్మసందేహాన్ని వెలిబుచ్చాడు. ఆ స్వామీజీ ఈ ప్రశ్నకు ఏమి సమాధానం ఇచ్చారో తెలుసుకునే ముందు మనం ఒక విషయం తెలుసుకోవాలి. మనం ఈ రోజు ఎన్నో సృష్టి రహస్యాలను కనుక్కున్నాం. ఎన్నింటికో చక్కటి నిర్వచనాలను ఇచ్చాం. మనకు తోచిన విధంగా భగవంతుడికి కూడా కొన్ని నిర్వచనాలు ఇచ్చాం. మనల్ని మనం మినహాయించు కొని భగవంతుడిని నిర్వచించ ప్రయత్నించాం! మనల్ని మనం నిర్వచించుకోలేనప్పుడు భగవంతుడిని ఎలా నిర్వచిస్తాం? ఐనా సాహసం చేసాం. ఎందుకు మనల్ని మనం అవగాహన చేసుకోవటానికి ప్రయత్నించలేదంటే, సృష్టిని చదివే ప్రక్రియలో తెలుసుకోబోయే వస్తువును, తెలుసుకుంటున్న ఉపకరణం రెండింటిపై ఒకే సారి దృష్టిపెట్టడం సాధ్యం కాదు కనుక.

మనం మన స్వభావాన్ని ఒక్కసారి గమనిస్తే మనల్ని మనం ఈ అధ్యయనం నుంచి ఎప్పుడూ మినహాయించుకుంటూ ఉంటాం. ప్రపంచంలో ఉన్న దుఃఖానికంతటికీ కారణం ఈ స్వాధ్యాయం లేకపోవడమే. అంటే మనిషి తన దేహాధారిత వర్తమాన ఉనికియే నిజమైన ఉనికి అని భ్రమిస్తూ, ఆ భావనలోనే సదా జీవిస్తూ, జంతువునుంచి తనను వేరుచేసే పార్శ్వాలను కనుక్కోవటానికి ప్రయత్నించక పోవటమే. ఆ పార్శ్వాలను తాను గుర్తించనట్లైతే తన ఉనికి ఒక ద్విపాద జంతువుతో సమానమే అని మనిషి గ్రహించలేడు. మనకి మనం అర్థం కాకుండా మనకు ప్రపంచం ఎప్పుడూ పూర్తిగా అవగతమవదు. మనం ప్రపంచాన్ని చాలా అర్థం చేసుకున్నాం అనుకుంటున్నాం. అది కేవలం అపోహ మాత్రమే. ఒక్క అణువు రహస్యం కూడా మనం ఇంతవరకూ పూర్తిగా ఆవిష్కరింపజేసుకోలేదు. ఈ లెక్కన మనం ఇంకా కొన్ని కోట్ల సంవత్సరాలు గడిచినా భగవంతుడి సృష్టిలో ఒక్కశాతం అంశాన్ని కూడా పూర్తిగా అధ్యయనం చేయలేం.

అభివృద్ధి భ్రమ : మనం సాధించిన సాంకేతిక అభివృద్ధి మనకళ్ళకు మిరుమిట్లు గొలుపుతున్నది. అది మనల్ని ఒక మత్తులోకి తీసుకువెళుతున్నది. ఈ మత్తులో మనం ఇంకా అభివృద్ధిని వస్తుసృష్టిలోనే వెతుకుతున్నాం. కానీ ఆ సృష్టిని అధ్యయనం చేస్తున్న మనిషి మీద దృష్టిపెట్టలేక పోతున్నాం. మన మీద మనం దృష్టిపెట్టి స్వాధ్యాయానికి శ్రీకారం చుట్టాలంటే ఈ సాంకేతిక అభివృద్ధి మత్తు మనకు కొంచెం వదలాలి. మనసు పోకడలను గమనిస్తూ, పూర్తిగా విశ్లేషిస్తూ మనిషి తనను తాను పూర్తి స్థాయిలో ఆవిష్కరింప జేసుకోవాలంటే ఆ దిశగా పూర్తిదృష్టిని, శక్తిని ప్రసరింపజేయాలి. అలా మనిషి తనమీద పూర్తి దృష్టిని పెట్టి, తన నిజరహస్యాన్ని తెలుసుకుంటే మానవుడే మాధవుడు అవుతాడు. సృష్టికర్త ఈ రహస్యాన్ని అందరూ అంతతొందరగా గ్రహించకూడదనీ, అలా గ్రహిస్తే సృష్టిని అనంతకాలం కొనసాగించలేమనీ మనిషికి నిరంతర బాహ్యదృష్టిని ఇచ్చాడు. దానికి తోడు తామరతంపరగా కోరికలను కలుగజేసి, సదా మనిషిని ఆ ప్రయత్నంలో నియోగింపజేసి స్వకీయ అధ్యయనానికి ఎప్పుడూ ఉపక్రమింపకుండా ఉండేటట్లు చేశాడు. ఈ పరిస్థితినే వేదాంత పరిభాషలో **మాయ** అని అంటారు.

ఈ ప్రపంచంలోకి ఎందుకు వచ్చాం? ఎలా వచ్చాం?: లోకంలోని అన్ని జీవులకు ప్రత్యుత్పత్తి ఒక ప్రగాఢవాంఛగా సృష్టికర్త ప్రసాదించాడు. ఇది ఎంత తీవ్రమైన వాంఛ అంటే జీవికి ఈ వాంఛ 'సహజం' అని మనం అనుకుంటాం. శాస్త్రజ్ఞులు దీనినే జీవవిధి (Biological need) అని పేరుపెట్టారు. మిగతా జీవులలాగా మనకు కూడా ఇది ఒక తప్పనిసరి అవసరం అని మనం భావించటమే తప్పు. ఒక జీవిగా తన ప్రతిరూపాల ద్వారా తన ఉనికిని కొనసాగించడానికి లేదా ఈ జీవఉనికిని దాటి దైవత్వాన్ని సంప్రాప్తించుకోవడానికి మానవుడి స్థాయినుంచే జీవికి నిర్ణయాధికారం ఉంటుంది. వివేకానందుడిని ఒకసారి ఒక శిష్యుడు ఈ యువకుడు అడిగిన ప్రశ్ననే అడుగుతాడు. ఆయన వెంటనే, **'ఈ ప్రపంచంలోకి రావడం నీకంత సంతోషంగా ఉందా?** అంటారు. కానీ ఆ శిష్యుడికి ఈ సమాధానం వెంటనే అర్థం కాక పోయుండవచ్చు. అతను 'ఈ ప్రపంచం కాక ఇంకో ప్రపంచం ఉందా?' అని అనుకొని ఉంటాడు. కానీ స్వామి వివేకానంద ఏ స్థాయి నుంచి, ఏ భూమిక నుంచి మాట్లాడుతున్నాడో ఆ శిష్యుడికి అర్థం కాలేదనడంలో సందేహం లేదు. స్వామీజీ ఉద్దేశ్యం... తెలిసో తెలియకో, మన ప్రమేయం ఉండో లేకో, ఈ ప్రపంచంలో వచ్చి పడ్డాం. సంఘర్షణ, పోరాటంలో పడ్డాం. మనకు ఎవరూ ఎంచుకునే అవకాశం ఇవ్వలేదు. అప్రయత్న పూర్వకంగా, బలవంతంగా, మన ఇచ్ఛతో ప్రమేయం లేకుండా ఇక్కడికి వచ్చాం.

తల్లితండ్రులవలన ఈ ప్రపంచంలోకి వచ్చాం అని మనం అనుకుంటున్నాం. తల్లితండ్రులు కేవలం వాహకాలు మాత్రమే. మన ఉనికికి వాళ్ళు కేవలం ప్రమేయంలేని ఉపకరణాలు మాత్రమే. ప్రారబ్ధం (పూర్వజన్మలో చేసిన పుణ్యపాపాల సంచయం) వలన మనం ఈ రూపంలో ఈ ప్రపంచంలోకి వచ్చాం. తల్లితండ్రుల **వలన** కాదు. కేవలం తల్లితండ్రుల **ద్వారా** వచ్చాం. కనుక ఈ సృష్టిలో అత్యంత సంక్లిష్టమైన, దురవగాహమైన, అద్భుతమైన, అధ్యయన దుర్లభమైన, ఒక పట్టాన అవగతమవని విషయం మనిషియే. కానీ అధ్యయనం చేయాలి. పరిస్థితులు ఎప్పుడూ ఈ పరిశీలనకు సహకరించవు. పరిస్థితులకు ఎదురొడ్డి ఎవరైతే ఈ ప్రయత్నంలో ఉంటారో వారే నిజంగా జీవిస్తున్నట్లు. మిగతావారి జీవితాలు జంతుజీవితాల కన్నా పెద్ద ఉన్నతంగా ఏమీ లేవని గ్రహించాలి.

'పరిస్థితులు ఎందుకు ఈ అధ్యయనానికి అనుకూలంగా ఉండవు?' అని మనం ప్రశ్నించుకోవచ్చు. అలా అందరూ పర్యాలోచించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉంటే భగవంతుడి 'క్రీడ' సాగదు. ప్రతికూల పరిస్థితుల మధ్య సత్యాన్వేషణ చేసి సత్యానుభూతిని పొందినవాడే నిజంగా మనుజుడు. ఆ విధంగా

సృష్టికర్త మనందరికీ ఒక పరీక్ష పెడుతున్నాడు. భగవంతుడి ఒక శక్తి నిరంతరం మనల్ని ఈ ప్రపంచంలోకి నెడుతున్నది. ఇంకోశక్తి మనల్ని ఈ ప్రాపంచిక బంధాలనుంచి బయట పడవేయటానికి ప్రయత్నిస్తున్నది. ప్రతి మనిషి ఈ రెండుశక్తులకు ఏక కాలంలో కేంద్రబిందువయ్యాడు. ఒకేసారి ఎందుకు అలా రెండు శక్తులను మనమీద పనిచేయించాలి? సృష్టి భగవంతుడి క్రీడ కాబట్టి ఈ ప్రశ్నకు మనకు హేతుబద్ధమైన సమాధానం రాదు. ఆ సమాధానం మన బుద్ధిపరిధికి అందనిది.

మనం చేయాల్సిందల్లా మనకూ భగవంతుడికీ గల సంబంధాన్ని అన్వేషించటమే. సత్యానుభూతిని పొందినవారు చెప్పినదేమిటంటే.. 'మనిషి', 'భగవంతుడు..' అని రెండూ వేరుగా లేవు. దేహభావంతో జీవాత్మ తాదాత్మ్యంచెంది ఉండటంవలన రెండు ఉనికిలు కనబడుతున్నాయనీ; 'మనిషి' అనే ఉనికి కేవలం మిథ్యామాత్రమైనదనీ వారి బోధ. ఈ మిథ్యామాత్ర ప్రత్యేక ఉనికిని తొలగించుకోవడమే భువిపై మానవుడి కర్తవ్యం.

హిందువు-ఆధ్యాత్మికత ఒక్కటే:



వివేకానంద తన సందేశ తరంగిణిలో ఈ విషయమై ఎంత స్పష్టంగా చెప్పారో చూస్తే,'.ఏ శాస్త్రం మనల్ని ఎన్నడూ మార్పుచెందని ఆ పరబ్రహ్మను తెలుసుకోవడానికి ఉపకరిస్తుందో అదే మహిమాన్వితం. కేవలం తిండి, గుడ్డ, తోటివారిపై ఆధిపత్యాన్ని సాధించటానికి ఉపకరించే శాస్త్రజ్ఞానం కావాలంటే మన పూర్వీకులు ఏర్పరచుకునేవారే (మనం తయారుచేసుకున్న విద్య మనకు అందించేది ఇదే). వారు మానవ జీవితానికి సంబంధించిన ఇంకా మహోన్నతమైన, పరమానంద దాయకమైన పార్శ్వాన్ని కనుక్కొన్నారు. అది మన జాతి ఆదర్శం అయ్యేంతవరకూ, మనకు పితృ-పుత్ర క్రమంలో సంక్రమించేంతవరకూ, మన జీవితంలో భాగమయ్యేంతవరకూ, మన జీవనాడి అయ్యేంతవరకూ, మన రక్తనాళాలలో ప్రవహించేంత వరకూ, చివరికి హిందువు ఆధ్యాత్మికత ఒకటయ్యేంతవరకూ ఈ ఆదర్శాలను వ్యాప్తిచేయటం జరిగింది. ఒక నమ్మకమో, విశ్వాసమో, గ్రంథమో పట్టుకొని ఆర్యుడు స్వీయశోధనకు పూనుకోలేదు. ఆధ్యాత్మికత అంటే సశాస్త్రీయ స్వీయాన్వేషణ. తదేక దృష్టితో తనను తాను అవలోకించటమే ఆధ్యాత్మికత. సృష్టి రహస్యాన్ని తెలుసుకోవటానికి తాను చేయవలసింది రాకెట్లలో వెళ్ళి గ్రహాంతర వాసం చేయటం కాదు. అత్యంత శక్తివంతమైన పరికరాలతో పరమాణువును శోధించటం కాదు. లేక తీవ్రఉష్ణోగ్రతలలో ప్రోటానులు, న్యూట్రానులను పరస్పరం తాడనం చెందించి, వెలువడిన కణాలను అధ్యయనం చేయటం కాదు. ఈ సృష్టిలో ఇప్పటివరకు మనం నిర్వచించలేనిది మనిషినే. మనిషంటే **'దానవుడు - మానవుడు - మాధవుడు.. మూడూ కలిసిన ఒక ఆశ్చర్యకరమైన జీవియే మనిషి'** అని వివేకానంద ఒక చక్కటి నిర్వచనం ఇచ్చారు.

ఆధ్యాత్మిక సంస్కృతి కనుక లేకపోతే రూపం మానవుడైనా దానవుడు ఎక్కువగా ప్రకటితమవుతుంటాడు. తనను తాను అవలోకిస్తూ అసుర ప్రవృత్తిని నిగ్రహించుకోలేకపోతే, కామ క్రోధ లోభాలను లోబరుచుకోకపోతే, మాధవత్వం కాదు కదా మానవత్వం కూడా ఆ వ్యక్తిలో పరిమళించదు. ఈ అంతః అవలోకనాన్నే తపస్సు, సాధన, ఇంద్రియ నిగ్రహం, వైరాగ్యం, సత్యనిష్ఠ.. అని రకరకాల పేర్లతో మన ధర్మం చెపుతున్నది. ఇదే జీవితధ్యేయం అని మనకు నిర్దేశిస్తున్నది.

ఆ యువకుడి ప్రశ్నకు సమాధానం: ఆహార విహారాలు, సంతానోత్పత్తి, ఇంద్రియ సుఖాలు, నిద్ర..ఇవేవీ మనిషిని జంతువులనుంచి వేరుచేయవని.. ఈ క్రియలు చేయటానికి జంతుశరీరం సరిపోతుందనీ, మానవదేహమే అవసరంలేదనీ అర్థం కావాలి. సృష్టిని మనం సృష్టించలేదు. మరి కొనసాగించే బాధ్యత మనదెలా అవుతుంది? మనం సృష్టించని సృష్టిని కొనసాగించే బాధ్యతని మనపై వేసుకున్నాం. ఎంత తెలివైన వాళ్ళం! అందుకని మిగతా జీవులలాగా మనిషికి ప్రతిరూప సృష్టి అత్యున్నత ఆదర్శం అవదు. అంటే అది తప్పని కాదు. అది గమ్యం అవదు.

ఈ ప్రక్రియ జీవితంలో ఒక భాగం, పార్శ్వం మాత్రమే. సృష్టికి ఆవల ఏమున్నదో తెలియకపోవడం వలన ఇలాంటి ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఎవరూ ఇక్కడ శాశ్వతంగా ఉండరు. అశాశ్వతమైన శరీరం ద్వారా శాశ్వత ఉనికిని గ్రహించటమే మన కర్తవ్యం. మనిషి సన్న్యాసం ద్వారా సత్యాన్వేషణలో నిమగ్న మవుతాడా, లేదా గృహస్థ జీవితం ద్వారా భగవదనుభూతికై ప్రయత్నిస్తాడా? అనేది వ్యక్తిగత నిర్ణయం. ఏ ఆశ్రమంలో ఉన్నా మనిషి సదా సత్యం వైపుకు పయనించటానికి పూనుకోవాలి. తనను తాను సంపూర్ణంగా అధ్యయనం చేస్తూ మనో శరీరాలకు ఆవలగా, అతీతంగా ఉన్న తన నిజమైన ఉనికిని అనుభవపూర్వకంగా తెలుసుకోవాలి. అప్పటివరకూ ఏ ఆశ్రమంలో ఉన్నా, ప్రాపంచిక జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా, ఎంత జ్ఞానాన్ని బడసినా శాంతి మాత్రం మృగ్యం. ప్రతిజీవితం వెలితితో వెలవెలబోతున్న జీవితమే అవుతుంది. మరి ఈ అన్వేషణను కొనసాగిస్తూ జీవితాన్ని కాస్త అర్థవంతం చేసుకుందామా? ❖

ఓరీ రావణా! కత్తుల మీద నడవాలనే సాహసం ఎందుకు చేస్తున్నావు? నీవు నన్ను హరించడమంటే వజ్రాన్ని మ్రింగాలని ఈగ ప్రయత్నించినట్లే అవుతుంది. *-సీతాదేవి, (రామాయణం)*

ఆత్మీయతలను దూరంచేసే ఆడంబరం

- శ్రీమతి సుధామూర్తి,
ఇన్ఫోసిస్ ఫౌండేషన్

మనలో చాలామంది తమ సంపదల పటాటోపంలో పరిమితుల్ని మించి ప్రవర్తిస్తూ ఉంటారు. ముఖ్యంగా కొంతమంది మహిళలు తమ ఆభరణాలను, వస్త్రాలను నలుగురి ముందు ప్రదర్శించడంలో సమయ, సందర్భాలను కూడా చూసుకోరు. ఇలాంటి హంగులు, ఆర్భాటాలు బంధుత్వాలను, స్నేహాలను కూడా దూరం చేస్తాయని చాలా మందికి తెలియదు. నా జీవితంలో తారసపడ్డ కొందరు స్త్రీలను చూశాక, మనం వస్త్రాలు, నగలను ధరించే ముందు ఒకటికి పదిసార్లు ఆలోచించుకోవాలని అర్థమైంది.

నేను, షాలిని, రుద్రాణి, మాలిని - చిన్ననాటి స్నేహితులం. ఎన్ని పనుల్లో ఉన్నా, అప్పుడప్పుడూ మేమందరం కలుస్తూనే ఉంటాం. ఒకసారి మేమందరం మాలిని ఇంట్లో కలసి భోజనం చేద్దామనుకున్నాం. ఆ రోజు మా ఇంటికి దగ్గరలోనే ఉండే షాలిని ఇంటికి ముందు వెళ్ళి, ఆమెను తీసుకొని మాలిని దగ్గరకు వెళదామని బయలుదేరాను. ఇంద్రభవనం లాంటి షాలిని ఇంట్లోకి అడుగుపెట్టగానే, ఆమె అలంకరణ ప్రహసనం ఆరంభమైంది. మంచిగంధపు చెక్కతో చేసిన ఆభరణాల పేటికను నా ముందు పెట్టి తనకున్న సొమ్ములను వర్ణించసాగింది. వజ్రాల నగలు ఖరీదులో, ఆకర్షణలో ఒకదానితో మరొకటి పోటీ పడుతున్నాయి. ఆ తరువాత ఇక తన చీరల ప్రదర్శనను ప్రారంభించింది. అలా ఆ రోజు ఏ నగలు, చీర ధరించాలో నిర్ణయించుకోవడానికి షాలినికి దాదాపు రెండు గంటలు పట్టింది. నాకే విసుగొచ్చి తొందర పెట్టేసరికి మెడ చుట్టూ నగలు వేసుకొని, లక్షల ఖరీదు చేసే ఎర్రటి చీర కట్టుకొని నాతో బయలుదేరింది.

ఇంతలో రుద్రాణి కూడా షాలిని ఇంటి పోర్టికో దగ్గర వేచి చూస్తూ ఉంది. ఆమె తెల్లటి నూలు చీర కట్టుకొని వచ్చింది. మెడలో పిసరంత బంగారం కూడా లేదు. ఆమె వాలకం చూసి షాలిని దాంబికంతో 'రుద్రాణి భర్త దివాలా తీసి ఉంటాడు. దాన్ని చూడు! వేలికి ఉంగరమైనా పెట్టుకోలేదు. అప్పులు చేసి ఉంటాడు; అవి తీర్చడానికి నగలన్నీ అమ్మేసి ఉంటుంది! ముఖం కూడా వడలిపోయి ఉంది!' అంటూ ఉన్నవి లేనివి కలిపి కథ చెప్పింది.

వెంటనే నేను 'నాకు తెలిసినంత వరకు అలాంటిదేమీ లేదు. రుద్రాణి భర్త నిన్ననే వచ్చి వరద బాధితులకు లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చాడు' అన్నాను. ఇలా మాట్లాడుకుంటూ రుద్రాణి దగ్గరకు వెళ్ళి, ముగ్గురం కలిసి, కార్లో మాలిని దగ్గరకు బయలుదేరాం.

మాటల్లో మాటగా నేను షాలిని సందేహాన్ని తీరుద్దామన్నట్లుగా 'ఏం రుద్రాణీ! అలా ఉన్నావు? ఏమైనా సమస్యలా? చాలా సింపుల్‌గా వచ్చావు?' అని అడిగాను. అప్పుడు రుద్రాణి నవ్వి నిదానంగా 'అలాంటిదేమీ లేదు సుధా! సమయాన్ని, సందర్భాన్ని బట్టే నగలైనా, వస్త్రాలైనా! మిత్రులుగా భోంచేసేందుకు కలుస్తున్నాం. మనిషి అందం ముఖంలో, నడవడికలో ఉంటుంది కాని, ఆభరణాల్లో కాదు కదా! వయసు కూడా పెరుగుతోంది. ఇప్పుడు నగలు ఎన్ని ఎక్కువైతే అంత ఎబ్బెట్టుగా కూడా ఉంటుంది. పైగా మన మాలిని భర్త పెద్దగా సంపాదించలేదు. ఆమె చీరలు, నగలు కూడా అంతంత మాత్రమే! అది తెలిసి కూడా నేను ఎక్కడలేని ఆభరణాలూ వేసుకొని వస్తే మాలిని ఆడంబరం అనుకోవచ్చు, బాధపడవచ్చు కూడా! సాధారణంగా మనుషులు సమానస్థాయిలో ఉండేవాళ్ళతో మెలిగేందుకే ఇష్టపడతారు. నేను మాలిని స్థాయిని పెంచలేను. అలా అని నా స్థాయిని తగ్గించుకోలేను. కనీసం ఆమె దగ్గరకు వెళ్ళినప్పుడైనా నిరాడంబరంగా ఉండడం అలవాటు చేసుకుంటున్నాను. ఆమె ముందు ఆస్తులు, చీరలు, నగల ప్రస్తావన రాకుండా చూసుకుంటాను. పోల్చుకొని బాధపడేందుకు ఎవరికీ అవకాశమివ్వను. సంపద వస్తుంది; పోతుంది. శాశ్వతం కాదు. కాని మంచిస్నేహం ఎప్పుడూ అమూల్యమైందే!' అంది.

నేను అప్పుడు వెంటనే షాలిని వంక చూశాను; ఆమె కట్టుకున్న మిరప ఎరుపు చీరతో పోటీపడి మరీ ఆమె ముఖం ఎరుపెక్కింది. ❖ సేకరణ: జి. సతీష్

యువవాణి

- స్వామి పరిజ్ఞేయానంద

జీవించడానికి 1000 మార్గాలు

ఆర్.సందీప్, ఎమ్.బి.ఏ. విద్యార్థి, హైదరాబాదు

ప్రశ్న: ఈ మధ్య నా స్నేహితుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంతవరకు కారణం తెలియలేదు. యువత ఆందోళన, ఒత్తిళ్ళకు గురై అఘాయిత్యాలకు పాల్పడు తోంది. వీటిని అధిగమించడానికి నేటితరం అనుసరించాల్సినమార్గాలేమిటి?

జవాబు: నేటితరంలో ఆందోళన, ఒత్తిడి, నిరాశ..... ఇలాంటివి వాడుక పదాలుగా మారిపోయాయి. ఇక, ఆత్మహత్యలంటే ఓ సాధారణ విషయమై పోయింది. యువతరం ఎదుర్కొంటున్న మానసిక రుగ్మతలకు కారణాలను తెలుసుకోవాలని అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయం ఓ సర్వే నిర్వహించింది. ఆ సర్వేలో... "ప్రపంచమంతా అరచేతిలో (సెల్, ఇంటర్నెట్) ఇమిడిపోయి నప్పటి నుండీ ఈతరం వాస్తవిక ప్రపంచాన్ని మరచిపోయి ఊహాలోకాల్లో ఊయలలూగుతుంది. యువ మనస్సులు వర్తమానాన్ని వీడి భవిష్యత్తులో విహరిస్తున్నాయి. వాస్తవిక స్థితిగతులను అర్థం చేసుకోకపోవడం మానసిక సమస్యలకు కారణం"అని వెల్లడయింది.

ఈ ప్రపంచంలో రెండే తరగతులవారు సంతోషంగా జీవించ గలరు. 1) శక్తిసామర్థ్యాలకు అనుగుణంగా లభించిన దానితో సంతృప్తి చెందేవారు. 2) అభిలషించినదాన్ని పొందడానికి పట్టుదలతో కృషిచేసి సాధించేవారు. ఈ రెండిటికీ మధ్య సతమతమైనవారే మానసిక రుగ్మతల బారిన పడుతున్నారు. జీవితంలో తాము అనుకున్నట్లు జరగలేదని ఆత్మహత్యలు చేసుకోవడానికి కూడా వెనుకాడడం లేదు. అందుకు కారణం జీవితమంటే సరైన అవగాహన లేకపోవడమే!

జీవితంలో ఎన్నో అవమానాలను, అపజయాలను, కష్టాలను ఎదుర్కొని నిలచిన ప్రఖ్యాత ఆంగ్ల నవలా రచయిత చార్లెస్ డికెన్స్ జీవితం విలువ గురించి చెబుతూ.."ఈ జీవితమనే ఆటలో అన్నీ మనం అనుకున్నట్లు జరగవు. అంతమాత్రాన జీవితంలో ఓడిపోయినట్లు భావించకూడదు. ఈ అందమైన జీవనోద్యానంలో ప్రతి ఒక్కరికీ ఓ ప్రాధాన్యం ఉంది. ఎవ్వరూ పనికిరానివారు కాదు" అన్నారు. డికెన్స్ జీవితానుభవంతో చెప్పిన ఈ మాటల్ని నేటితరం ఆకళింపుచేసుకోవాలి.

యువతరం ఎదుర్కొంటున్న మానసిక సమస్యలను అధిగమించడానికి ఆచరించాల్సిన కొన్ని సూచనలు:

తల్లితండ్రుల మాట పెడచెవిన పెడితే...: నేటియువతలో తమ తల్లితండ్రులు పాతతరంవారు, ఆధునికభావాలు లేనివారు అనే భావం అధికమవుతోంది. కానీ తల్లితండ్రుల మాటలను పెడచెవిన పెడితే ప్రమాదకరమని గుర్తించడం లేదు.

సముద్రంలో ఒక నౌక పయనిస్తుంది. అది రాత్రి వేళ కావడం వల్ల అంతా చీకటిగా ఉంది. దూరం నుండి ఒక వెలుతురు కనిపించింది. ఆ వెలుతురును చూడగానే నౌక కెప్టెన్ ఎదురుగా మరొక నౌక వస్తుందని భావించి 'పక్కకు మళ్ళించు' అని వైర్‌లెస్ ద్వారా సమాచారం పంపించాడు. 'నువ్వే పక్కకు మళ్ళించు' అని సమాధానం వచ్చింది. వెంటనే కెప్టెన్ కోపంతో 'నీకెంత పొగరు, నన్నే పక్కకు మళ్ళించమంటావా? ఇంతకీ నీవెవరు?' అని మరలా సమాచారం పంపించాడు. 'నేను కొండపై ఉన్న లైట్‌హౌస్ ఆపరేటర్‌ని' అని సమాధానం వచ్చింది. ఇప్పుడు ఆపరేటర్ మాట వినకపోతే ప్రమాదంలో చిక్కుకునేదెవరు? అంతర్జాలంలో రాకెట్ వేగంతో పయనిస్తున్న యువతను హెచ్చరిస్తున్న తల్లితండ్రులు లైట్‌హౌస్ ఆపరేటర్ లాంటివారు. కాబట్టి యువతరం తల్లితండ్రుల మాటలకు విలువనిచ్చి జీవనయానం సాగిస్తే జరగబోయే ప్రమాదాన్ని నివారించవచ్చు.

నిదానం ప్రధానం : యువతలో సహనంతో వ్యవహరించడం, నిదానంగా ఆలోచించడమనే లక్షణాలు కొరవడుతున్నాయి. అపజయాలను ఎదుర్కోలేక, అవమానాలను సహించలేక తొందరపాటుతనంతో అఘాయిత్యాలకు పాల్పడుతోంది.

ముంబైలో వైద్యవిద్యను అభ్యసిస్తున్న ఒక విద్యార్థి ఎప్పుడూ ప్రథమ ర్యాంక్ సాధించేవాడు. ఆఖరి పరీక్షల్లో అతడికి రెండవ ర్యాంక్ వచ్చిందని విని నిరాశకు గురై ఆత్మహత్య చేసుకున్నాడు. మరుసటి రోజు ఫలితాలను సవరిస్తూ అతడికి ప్రథమ ర్యాంక్ వచ్చినట్లు విశ్వవిద్యాలయం ప్రకటించింది. ఆ విద్యార్థి తొందర పాటు నిర్ణయం ఎంతటి అనర్థానికి దారితీసిందో కదా!

అందుకే ఒక ఆంగ్ల తత్త్వవేత్త *"Success is failure delayed. Failure is success delayed.* - విజయమంటే అపజయం ఆలస్యమవడం. అపజయమంటే విజయం ఆలస్యమవడం" అని అంటారు. అందువల్ల జీవితంలో జయాపజయాలు సహజమనే సత్యాన్ని యువత తెలుసుకొని తొందరపాటుతనాన్ని తగ్గించుకొని నిదానంగా వ్యవహరించగలిగితే జీవితాన్ని ఆస్వాదించవచ్చు.

సన్నిహితుల సహకారం : మనస్సులోని బాధను సన్నిహితులతో పంచుకోవడం వల్ల మనోవ్యథ తగ్గుతుంది. ఆందోళన, ఒత్తిళ్ళ నుండి బయటపడే మార్గాలు తెలుస్తాయి. కానీ నేటి యువతీ యువకులు తమ విషయాలను ఇతరులతో పంచుకోవడం నామోషీగా భావిస్తున్నారు. అందువల్ల మనోభారాన్ని భరించలేక ప్రమాదాల బాట పడుతున్నారు.

కలకత్తాలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న మహేంద్రనాథ్ గుప్త కుటుంబ సమస్యలను భరించలేక ఆత్మహత్య చేసుకోవాలని

(మిగతా 41వ పేజీలో...)

రామా! నీలాంటి ధర్మాత్మునితో స్నేహం స్థిరమైనది. స్నేహమంటే ఏమిటో తెలిసినవాళ్ళు స్నేహితుని కొరకు సుఖాన్నిగానీ, దేశాన్నిగానీ, ధనాన్నిగానీ విడిచిపెట్టడానికి వెనుకాడరు. -సుగ్రీవుడు, (రామాయణం)

తరాలు...అంతరాలే

- బి. సైదులు

శ్రీరామచంద్రుడు సీతాలక్ష్మణ సమేతుడై వనవాసానికి బయలుదేరాడు. కన్నీటితో కూలి, మానుల్లా పడి ఉన్న తల్లితండ్రులను పరామర్శించేందుకు దాశరథి వారి అంతః పురంలోకి అడుగుపెట్టాడు. నారచీరలు ధరించి కొడుకూకోడలు కళ్ళ ముందు కనిపించేసరికి దశరథుడు, కౌసల్యాదేవిలకు దుఃఖం కట్టలు తెంచుకుంది. కుమారుడు అడవులకు వెళుతున్నాడని మానసికంగా వారు సిద్ధమయ్యారు; కానీ అతిసుకుమారి, అమాయకురాలు అయిన కోడలు కారడవికి పయనమవుతుందని ఊహించలేదు; అలా అనూహ్యంగా ఆ జానకి అరణ్యవాసానికి సిద్ధపడేసరికి ఆ అత్తామామలు కన్నీటిపర్యంతమయ్యారు.

అయోధ్య రాకుమారిగా అష్టైశ్వర్యాలను అనుభవించాల్సిన కోడలు, అతిసామాన్యురాలిగా నారచీరలు కట్టుకొని, రాజ్యం విడిచి వెళుతూంటే తట్టుకోలేకపోయారు. వెంటనే దశరథుడు కైకేయిని 'ఓ పాపాత్మురాలా! ఒకవేళ శ్రీరాముడు నీకు ఏమైనా అపకారం చేసి ఉంటే అతనికి వనవాసాన్ని విధించడం యుక్తమే కావచ్చు. కానీ వైదేహికి ఈ శిక్ష వేయడానికి ఆమె నీకు చేసిన అపకారం ఏమిటి?' అని దూషించాడు. మరోవైపు సీతాదేవి అత్తమామలకు దూరమవుతూ, ఇంటికి పెద్దకోడలిగా వారికి సేవ చేసే భాగ్యానికి నోచుకోవడం లేదేనని పడ్డ బాధ వర్ణనాతీతం. కోడలి కోసం ఆ అత్తమామలు, ఆ అత్తమామల కోసం ఆ కోడలు పడుతున్న ఆవేదన చూసి అయోధ్యవాసుల హృదయాలు శోకసంద్రాలయ్యాయి. ఈ కాలంలో కోడలంటే కట్నమే గుర్తొచ్చే అత్తమామలూ, అత్తమామలనగానే ఏదో అంతరిక్షవాసులన్నట్లు అంటీముట్టనట్లు ప్రవర్తించే కోడళ్ళూ ఆ సన్నివేశాలను నిత్యం స్మరించుకోవాలి. తరాలు, అంతరాలు *(generation gap)* పేరిట అగాధాలను సృష్టించుకొని ఎంత అశాంతి పాలవుతున్నామో ఆలోచించుకోవాలి.

పెద్దలు... పెద్దరికాలు : నేడు ఈ తరాల అంతరం చాలా కుటుంబాల్లో అలజడులను సృష్టిస్తోంది. ఎక్కువ శాతం కొడుకుల వివాహానంతరం పిల్లలకు, పెద్దలకు మధ్య చెలరేగుతున్న భేదాభిప్రాయాలు ఆత్మీయతలను, అనుబంధాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. ఫలితంగా రెండు తరాలు ఒకే చూరుకింద కలసి ఉండటం అసాధ్యమన్న భావన సర్వత్రా వ్యాపించింది. ముఖ్యంగా ఇళ్ళలో ఇరు తరాలకు ప్రతినిధులైన అత్తాకోడళ్ళ మధ్య ఒద్దిక కరవై, భిన్నధ్రువాలుగా మారిపోతే ఆ అంతరం అగాధమై, ప్రశాంతత సమాధి అవుతోంది.

నా కొడుకు నాకే సొంతమనే తల్లి, నా భర్త నాకే సొంతమనే భార్య మధ్య నలిగిపోతూన్న ఓ యువకుడు 'మా అమ్మ, నా భార్య నాకు రెండు కళ్ళలాంటివారు; అందుకే ఒకరినొకరు చూసుకోరు!' అని సరదాగా ఓ కవిత రాశాడు. అనుభవంతో పండిన పాతతరం, కొత్తతరాన్ని ప్రేమతో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి; ఆధునికతరం, అనుభవజ్ఞులైన పెద్దల మాటకు విలువనివ్వాలి. దశరథుడి దంపతులు తమ కోడలి పుట్టింటి వారసత్వాన్నీ, వైభవాన్నీ అర్థం చేసుకొని ఆమెకు ఉన్నత స్థానాన్నిచ్చి ఆదరించారు. అందుకే కౌసల్యా దశరథులు, వనవాస వేళ కోడలి కష్టానికి కన్నీరుపెట్టుకుంటూ...

ఇయం హి కస్యాపకరోతి కించిత్ తపస్వినీ రాజవరస్య కన్యా।
యా చీరమాసాద్య జనస్య మధ్యే స్థితా విసంజ్ఞా శ్రమణీవ కాచిత్॥

'ఈ సీతాదేవి పరమధార్మికుడైన జనకుని గారాలబిడ్డ. పతివ్రతా శిరోమణి, పరమ ఆదరంతో చూసుకోవలసిన ఈమె ఈ విధంగా సన్న్యాసినిలా నారచీరలు ధరించడమా?' అని విలపించారు. 'నా కోడలు ఇలా దీనంగా కనిపించడానికి వీలు లేదు. పద్నాలుగేళ్ళు ధరించేందుకు సరిపడా వస్త్రాలను, ఆభరణాలను రథాలలో పెట్టండి' అని దశరథుడు అయోధ్య కోశాధికారిని ఆజ్ఞాపించాడు. అదే విధంగా ఒకసారి బలిచక్రవర్తికి భయపడి దేవేంద్రుడు సతీసమేతంగా అమరావతిని విడిచి అడవులకు పారిపోతాడు. అప్పుడు దేవతల తల్లి అదితి భర్త కశ్యప ప్రజాపతితో కొడుకు కన్నా ముందు తన కోడలు శచీదేవి దుఃస్థితిని తలచుకొని బాధతో, ఆమె అడవుల్లో ఎన్ని కష్టాలు

అనుభవిస్తుందోనని ఆందోళన పడుతుంది. **'ఎండ కన్నెరుగని యింద్రుని యిల్లాలు పలుపంచలను జాలిపడియె నేడు** – ఎండంటే తెలియని కోడలు అడవుల్లో ఎక్కడ తలదాచుకుంటుందో! ఎన్ని కష్టాలు పడుతుందో!' అని దుఃఖిస్తుంది. అయితే ఈ రోజుల్లో చాలామంది కోడలూ ఓ ఇంటి బిడ్డే అన్న వాస్తవాన్ని విస్మరించి వేధిస్తూ ఉన్నారు.

సర్దుకుంటేనే సుఖశాంతులు... : నవతరానికి ప్రతినిధులైన కొందరు కొడుకులు కోడళ్ళు కూడా వాదాలతో, వివాదాలతో పూర్వతరాలను అవమానిస్తున్నారు. ముఖ్యంగా ఈ తరంలో కొందరు అమ్మాయిలు అత్తింటివారితో సర్దుకుపోవడంలో పంతాలకు పోతున్నారు. పుట్టింట్లో జరుగుబాటును మెట్టినింట్లోనూ కొనసాగించాలనుకుంటూ, వారి మాటలను తృణీకరిస్తూ ఉన్నారు. తమకు ఎన్ని తెలిసినా, పెద్దల మాట వినడం వలన, మనం వారి గౌరవాన్ని నిలబెట్టినవారమవుతాం; కొత్తపాఠాలను నేర్చుకున్నవారమవుతాం. కౌసల్యాదేవి, సీతామాత అడవులకు వెళుతున్నప్పుడు అర్ధాంగి బాధ్యతలను గుర్తుచేస్తుంది. అన్నీ తెలిసినా ఆ జానకి అత్తగారి మాటలను ఎంతో సావధానంగా ఆలకించి, ఆ తరువాత కౌసల్యాదేవి పాదాలకు నమస్కరిస్తూ... **'కరిష్యే సర్వమేవాహమ్ ఆర్యా యదనుశాస్తి మామ్...** – పూజ్యురాలైన అత్తమ్మా! భర్తతో, అత్తామామలతో ఎలా మెలగాలో మా తల్లితండ్రులు ఉపదేశించారు' అని, అయినా ఇప్పుడు మీరు సూచించిన విషయాలను తప్పకుండా ఆచరిస్తానంటూ ఆశీస్సులందుకొని కానలకు పయనమవుతుంది. ఈనాటికీ కొంతమంది మహిళామణులు ఈ ఆదర్శానికి వారసులుగా, అత్తవారిళ్ళకే దీపాలుగా వెలుగుతున్నారు.

ఓ ప్రముఖ రచయిత కుటుంబసభ్యులు మూడు తరాల నుంచి ఒకే ఇంట్లో కలిసే ఉంటున్నారు. ఆయన సతీమణి మూడు తరాలతో సర్దుకుపోతూ ఇప్పటికీ ఆ ఇంటి గౌరవాన్ని కాపాడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆమె ఎంతో ఉన్నత విద్యావంతురాలై నప్పటికీ ఆ ఇంటి మర్యాదకు విలువనిస్తూ అటు అత్తామామల, ఇటు కొడుకూ కోడళ్ళ మనసులను కూడా దోచుకున్నారు. 'ఇన్నేళ్ళు కలిసి ఉంటూన్నప్పుడు మీకు–మీ అత్తామామలకు, మీకు–మీ కొడుకూకోడళ్ళకు ఎలాంటి భేదాభిప్రాయాలు రాలేదా?' అని ఎవరైనా అడిగితే ఆమె చిరునవ్వుతో 'అభిప్రాయ భేదాలు రాకేం! కానీ నిజానికి ఒకరితో మరొకరు వైరం పెంచుకునేంత, మానసికంగా వేరుపడేంత అభిప్రాయభేదాలు ఏ ఇద్దరి మధ్యా పొడచూపవు. ఒకరి అలవాట్లను, అభిప్రాయాలను, పద్ధతులను మరొకరు మన్నించగలిగితే, తప్పుల్ని సహించగలిగితే అంతరానికి, అశాంతికి తావేలేదు' అని సమాధానమిస్తారు.

తరానిదో తీరు...: ఎప్పుడూ తమ ఆలోచనలు, అభిప్రాయాలే ఆచరణీయమైనవనీ, అద్భుతమైనవనీ అనుకోవడం ప్రతీ తరానికి అలవాటు. అందుకే జార్జ్ ఓర్వెల్ అనే మేధావి *'Each generation imagines itself to be more intelligent than the one that went before it, and wiser than the one that comes after it* – ప్రతి తరమూ పూర్వతరాల కన్నా, రాబోయే తరాల కన్నా తమదే తెలివైన తరమనుకుంటుంది' అని అంటారు. ఈ సంకుచిత స్వభావంతో చాలామంది నిరంతరం పెద్దలనో, పిల్లలనో నిందిస్తూ ఉంటారు. నిజానికి తరానిదో తీరన్నట్లు, అన్ని తరాల్లోనూ ఏవో కొన్ని ప్రత్యేకతలూ, పొరపాట్లూ సరిసమానంగా ప్రస్ఫుటమవుతూనే ఉంటాయి. ఈ శాశ్వత సత్యాన్ని మరచిపోకుండా ప్రతి తరమూ పరిస్థితులకు తగినట్లు ఇమిడిపోవాలి. గతానికి వర్తమానం, వర్తమానానికి గతం అనుసంధానమైనప్పుడే చరిత్ర చిరకాలం మన్నుతుంది. లేనప్పుడు చరిత్ర చెదలుపట్టి శిథిలావస్థకు చేరుతుంది. కుటుంబసంబంధాలకూ ఇదే సూత్రం వర్తిస్తుంది. ఓ మహిళా ప్రొఫెసర్ భర్త పెట్టే గృహహింసను తట్టుకోలేక విడాకుల కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఆశ్చర్యకరంగా ఆమె అత్తగారు విశాలహృదయురాలై కోడలినే సమర్థిస్తూ, కుమారుడికి వ్యతిరేకంగా తన వాదనను వినిపించారు. కొడుకు తప్పులను బాహాటంగా ఎత్తిచూపారు. ఆ కోపంతో కుమారుడు ఆమెను కాదన్నా, కోడలి దగ్గరే ఉన్నారు. ఆ కోడలు కూడా అందుకు కృతజ్ఞతగా, అత్త కనుమూసేంత వరకూ ఆమెను కంటికి పాపలా చూసుకున్నారు. ❖

అత్త ఉన్న కోడలుత్తమురాలు!
కోడలున్న అత్త గుణవంతురాలు!

భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస వివాహ సందర్భంలో కోడలు శ్రీశారదాదేవికి కొత్త నగలు చేయించాలని అత్తగారు చంద్రమణీదేవి ఎంతో తాపత్రయపడ్డారు. కానీ పేదరికం కారణంగా నగలు పెట్టలేకపోయారు. అయినా ఉత్సాహంతో కొన్ని ఆభరణాలను పక్కింట్లో అరువుగా తెచ్చి కొత్తకోడలికి అలంకరించారు. అవి తనవే అనుకొని శారదాదేవి పొంగిపోయారు.

కొన్ని రోజుల తరువాత ఆమె నిద్రపోతున్నప్పుడు ఆమెకు తెలియకుండా, శ్రీరామకృష్ణులు అన్ని నగలు తీసి పక్కింటివాళ్ళకు ఇచ్చేయమని తల్లికి అందజేశారు. ఉదయం మేల్కొని శారదాదేవి నగలన్నీ ఏవని ఏడుస్తూ అడిగారు. అప్పుడు ఆ అత్తగారు అమిత ఆవేదనతో కోడలిని అక్కున చేర్చుకొని కన్నీరు కారుస్తూ 'అమ్మా! శారదా! ఇవేం గొప్ప నగలు! నా కొడుకు వీటి కన్నా చాలా మంచినగలు ఎన్నిటినో నీకు చేయిస్తాడు చూడు!' అంటూ అనునయించారు. కాలక్రమంలో శ్రీరామకృష్ణులు తల్లి మాటను నిలబెట్టి శారదాదేవికి విలువైన నగలు చేయించారు. శ్రీశారదాదేవి కూడా అత్తమ్మ చంద్రమణీదేవిని చివరి వరకు చిన్నకష్టం కూడా కలగకుండా కన్నతల్లిగా చూసుకున్నారు.

నేటి సమాజంలోనూ కోడళ్ళను కూతుళ్ళ కన్నా మిన్నగా చూసుకుంటున్న అత్తలు, అత్తయ్యలను అమ్మల్లా ఆదరిస్తున్న కోడళ్ళూ ఉన్నారు. 'అత్తలేని కోడలుత్తమురాలు! కోడలు లేని అత్త గుణవంతురాలు!' అన్న పాత పాటకు, కొత్త పల్లవిని రాస్తూ, అత్తలున్నా కోడళ్ళు ఉత్తమురాళ్ళని; కోడళ్ళున్నా అత్తలు గుణవంతురాళ్ళని నిరూపిస్తున్నారు.

సీతా! భర్తనే అనుసరించేవారికి ఉత్తమ గతి ప్రాప్తిస్తుంది. పతివ్రతల మార్గంలోనే నడువు. భర్తకు సహధర్మచారిణిగా వర్తించు. దానివలన నీకు కీర్తి, పుణ్యం లభిస్తాయి. –అనసూయాదేవి, (రామాయణం)

మాతృత్వం

– స్వామి రంగనాథానంద (రామకృష్ణసంఘం 13వ సర్వాధ్యక్షులు)

భారతీయ మహిళ తనను తాను మాతృమూర్తిగా అభివ్యక్తం చేసుకోవడాన్ని మన సనాతన ధర్మం అత్యున్నత ధర్మంగా అభివర్ణించింది. స్త్రీకి సంబంధించినంత వరకు భార్య స్థానం నుంచి తల్లిగా ఎదగడం కేవలం భౌతికపరమైన పరిణామం మాత్రమే కాదు! మాతృత్వభావనతో ఆధ్యాత్మికంగా పరిణతిని సాధించడానికి అరుదైన అవకాశం; భారతీయ వివాహ వ్యవస్థ స్త్రీకి కల్పించిన అదృష్టం! నిజానికి భార్యగా తన పాత్రను పోషించే సమయంలో కన్నా, తల్లిగా తన మాతృత్వ మధురిమలను పంచేటప్పుడే స్త్రీ ఎక్కువ ఉన్నతిని సాధించినట్లు సంతృప్తి పడుతుంది. అమ్మతనంలో అత్యున్నతమైన ఆత్మానందాన్ని పొందుతుంది. స్త్రీ తన సహజమైన సహనం, క్షమ, ప్రేమ తదితర సర్వోన్నత లక్షణాలతో విశ్వజనీనతను పొంది కుటుంబం, జాతి, వంశం మొదలైన హద్దులను చెరిపివేసి ఆదర్శ మాతృమూర్తిగా వెలుగుతుంది. ఈ ఆధ్యాత్మిక ఔన్నత్యమే మహిళ భార్యగా, పౌరురాలిగా కూడా సమర్థంగా తన బాధ్యతలను నిర్వహించడానికి దోహదపడుతుంది. అందుకే స్వామి వివేకానంద

“*The ideal of womanhood in India is motherhood; that marvellous, unselfish, all suffering, ever forgiving mother* – కష్టాలను, బాధలను సహిస్తూ, అనుక్షణం క్షమిస్తూ, నిస్వార్థానికి మారుపేరైన మాతృత్వమే భారతీయ నారీమణుల ఆదర్శమ”ని ఉద్ఘాటించారు.

ఆదర్శ మాతృత్వం – సామాజిక ప్రభావం: మాతృత్వం అంటే చాలామంది అనుకున్నట్లు భౌతికంగా ఓ బిడ్డకు జన్మనివ్వడం కాదు. దురదృష్టవశాత్తూ బిడ్డలకు నోచుకోనంత మాత్రాన వారు మాతృమూర్తులు కాకుండా పోరు! మాతృత్వభావన అనేది భౌతిక స్థాయిని మించినది! ఏ బిడ్డను చూసినా మనస్సు స్పందించడం, నిస్వార్థంగా ప్రేమను పంచడం – ఇవే మాతృత్వ లక్షణాలు. అందుకే భారతీయ సంస్కృతిలో మాతృమూర్తిని మాతృదేవోభవ అని కీర్తిస్తారు. మన మత గ్రంథాలు తల్లిని తండ్రి కన్నా, గురువు కన్నా పూజనీయంగా కొనియాడుతున్నాయి. ఆ పరంపరలో ‘మనుస్మృతి’...

ఉపాధ్యాయాన్ దశాచార్యః ఆచార్యాణాం శతమ్ పితాః।
సహస్రం తు పితౄన్ మాతా గౌరవే నాతి రిచ్యతే ॥

‘గౌరవించదగిన వారిలో ఉపాధ్యాయుల కన్నా ఆచార్యులు పది రెట్లు ఎక్కువ; ఆచార్యుల కన్నా తండ్రి వంద రెట్లు ఎక్కువ; కాగా, తల్లి ఆ తండ్రి కన్నా వేయిరెట్లు ఎక్కువ’ని స్పష్టం చేసింది.

అయితే మాతృమూర్తికి అంతటి ఉన్నతస్థానం ఎలా సంప్రాప్తించింది అంటే ఆమె త్యాగనిరతి వల్ల! నిస్వార్థ ప్రేమానురాగాల వల్ల! భారతీయ సనాతన ధర్మం దృష్ట్యా స్త్రీ వీటినే తన జీవన పరమావధిగా చేసుకుంది. భారతీయ స్త్రీలు ఈ లక్ష్యసాధనకే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు. ఈ నేపథ్యంలో పవిత్రత, స్వచ్ఛత, నిస్వార్థం, సేవాభావం, నిరాడంబరం, వినయం తదితర ఆదర్శాలు అంతర్లీనంగా ఉన్న దివ్యత్వ ప్రేరణతోనే భారతీయ వనితలు ముందుకు సాగుతూ వస్తున్నారు. ఈ ఆదర్శాలు జీవితమనే వస్త్రానికి పడుగుపేకలయ్యాయి. ఈ వారసత్వాన్ని మహిళ ఎన్నడూ తృణీకరించలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రాచీన భారతీయ మహిళ సీత, సావిత్రి, దమయంతుల ఆదర్శాల మీద ఎదిగింది.

అయితే, విస్తృతమైన అవకాశాలున్న ప్రపంచంలో అడుగుపెట్టిన ఆధునిక మహిళకు ఈ ఆదర్శాలు అసమగ్రంగా, చాదస్తంగా తోస్తున్నాయి. కానీ దీర్ఘంగా ఆలోచిస్తే మన మునుపటి తరాల స్త్రీ అడుగుజాడలు నేటికీ అన్వయమవుతాయనీ, నేటి మహిళ ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారాలు వాటిలోనే లభిస్తాయనీ గుర్తించాలి. అందుకే స్వామి వివేకానంద “సీత ఆదర్శానికి భిన్నంగా మన స్త్రీలను ఆధునికీకరించే ప్రయత్నం చేస్తే మనకు పరాభవం తప్పదు. ఎవరు ఎన్ని చెప్పినా, భారతీయ స్త్రీలు సీత, సావిత్రి, దమయంతి లాంటి సాధ్వీమణుల అడుగుజాడల్లోనే అభ్యుదయాన్ని సాధించాలి” అంటారు. ❖

తెలుగుసేత: ఆర్.కృష్ణ

(మార్చి 8 ‘అంతర్జాతీయ మహిళా దినోత్సవం’)

(1884 – 1967)

ముందుకు సాగిపో!

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ, ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్న్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ - వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్న్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం, ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

ప్రియమైన బాదల్! 20 జూన్ 1963

నీవు వ్రాసిన ఉత్తరం నన్ను చాలా ఆనందపరచింది. చాలాకాలం బాధలను అనుభవించాక నేను ఒక 'నిరాశావాది'గా మారానేమోననిపిస్తోంది. మనుష్యుల గురించి గానీ, ఇతర ప్రాణుల గురించి గానీ, ఆఖరికి మొక్కలు, వృక్షాల గురించి గానీ ఆలోచిస్తే చాలు – నాకు చాలా బాధ కలుగుతుంది. ఈ జీవితం కేవలం కరుడు గట్టిన బాధ మాత్రమే. మనం సుఖాన్ని పొందవచ్చుననే ఆశతో కొద్దిగా సుగంధాన్ని దానిపై చిలకరించి, జీవనయానం సాగిస్తున్నామని నాకు అనిపిస్తూ ఉంటుంది. దాన్నే మనం 'జీవితం' అని నిర్వచిస్తున్నాం.

జీవితంలో ఏ ప్రత్యేకమైన స్థాయికీ (సన్న్యాసిగా కాని, గృహస్థుగా కాని) చెందని అనేక మందిని చూశాను. సన్న్యాసి జీవితం అన్ని విధాలా తెరిచిన పుస్తకం లాంటిది. గృహస్థుని జీవితం బంధుత్వాల బంధాలతో మూసి ఉంటుంది.

ఇక్కడ నాకొక మిత్రుడున్నాడు. అతడు అవివాహితుడు. అతనికి పెన్షన్ వస్తూ ఉంటుంది. అతనికి తీవ్ర రోగగ్రస్తత గానీ, కదలలేని స్థితి గానీ వస్తే అతడి పరిస్థితి ఏమిటని నాకు చాలా ఆందోళన కలుగుతూ ఉంటుంది. అతనికి డెబ్భై ఆరేళ్ళు. కానీ మంచి ఆరోగ్యవంతుడు. తాను ఎన్నుకున్న ఏకముఖ ఆదర్శం వల్ల అతని మనఃస్థితి దృఢంగా ఉంది. ఆశ్రమంలోని ఇతర సాధువులతో అతడు చాలా కలుపుగోలుగా ఉంటాడు. అతని రోజులు అలా గడిచిపోతున్నాయి. కానీ, నీ మిత్రుడు ఎందుకు పిచ్చివాడయ్యాడో అర్థం కావడం లేదు. చక్కని కుటుంబ జీవనం గడుపుతున్నాడు, బాధ్యతాయుతమైన ఉన్నత ఉద్యోగం ఉంది. అయినా అతని ఆలోచనా సరళి, మనోనిబ్బరం దెబ్బతినడం ఏమిటి? నేను గమనించినది ఏమిటంటే ఈ గృహస్థులందరూ రాత్రింబవళ్ళు రకరకాల ఆలోచనలతో ఆందోళన చెందుతున్నారు.

జీవితంలో ఒక ప్రత్యేకమైన ఆశయం ఏదీ లేని వ్యక్తి ఈ దయనీయ స్థితి నుండి తప్పించుకోలేడు. అతడు ఇంటి వద్ద ఉన్నా, బయట ఉన్నా అతడికి ఈ పరిస్థితి తప్పదు.

జీవితంలో సంతృప్తిని సాధించడానికి నాలుగు మార్గాలు రూపొందించబడ్డాయి.

1) జనహితానికి పాటుపడడం.

2) భగవంతుని సేవలో నిమగ్నమై ఉండడం.

3) శాస్త్రాధ్యయనం చేస్తూ ఉండడం.

4) ఆధ్యాత్మిక సాధనలను అభ్యసించడం.

ఇప్పుడు నీ జీవితాన్ని ప్రశాంతంగా గడపడానికి ఏదో ఒక మార్గాన్ని ఎన్నుకొని ఆ మార్గంలో పయనించు.

ప్రేమాశీస్సులతో

స్వామి ప్రేమేశానంద

తెలుగు సేత: కె. త్రివిక్రమరావు

సీతా! ప్రాణాల్ని,లక్ష్మణున్ని, నిన్ను సైతం విడిచిపెట్టగలను. కానీ మహర్షులకు ఇచ్చిన మాటను నా ప్రాణం ఉన్నంత వరకూ తప్పను. నాకు సత్యం ప్రాణం కన్నా ముఖ్యమైనది.-రాముడు, *(రామాయణం)*

రామకృష్ణ మిషన్ బాలుర వసతిగృహం



(రామకృష్ణ మఠం, రామకృష్ణ మిషన్, బేలూరు మఠం, హౌరా-711202 అనుబంధ శాఖాకేంద్రం)

రహేరా(పోస్ట్), కొల్‌కతా, పశ్చిమబెంగాల్-700 118

ఫోన్: 033-25682850/3219, 25237666/6116 email: rkmraharahome@gmail.com

విన్నపము

నిరుపేదలు, అజ్ఞానులు, దుఃఖార్తులు - వీరే సజీవ దైవాలు. వీరికి సేవ చేయడమే అత్యున్నతమైన ధర్మం.

-స్వామి వివేకానంద

1943- బెంగాల్‌లో కరువు కాటకాలు విలయతాండవం చేసిన సంవత్సరం. చేతిలో చిల్లిగవ్వ లేక, ఆకలితో అలమటిస్తున్న ఎనిమిదేళ్ళ విష్ణుపాద అనే కుర్రాడు ఆ క్షామబాధితుల్లో ఒకడు. వితంతువైన తల్లి తప్ప, ఆ బాలుడికి ఆ కరువులో బంధువులందరూ దూరమయ్యారు. ఆ ప్రకృతి విలయం ఫలితంగా, వేలాది మందిలాగ విష్ణుపాద భవిత కూడా అగమ్యగోచరంగా మారిపోయింది.

1980-డాక్టర్ విష్ణుపాద హల్దార్, రాయల్ కళాశాల ఫిజీషిన్ సభ్యత్వాన్ని పొందిన ప్రముఖ వైద్య నిపుణుడు. ఈ వైద్యనిపుణుడికి, ఆ అభాగ్య బాలుడికి ఏమిటి సంబంధం? అని మీరు ఆలోచిస్తున్నారా? ఆ సంబంధమే కొల్‌కతా, రహేరాలోని రామకృష్ణ మిషన్ బాలుర వసతి గృహం.

1944లో 37 మంది అనాథ బాలురతో ఆరంభమై నేడు వందలాది మంది బాలురకు ఆశ్రయమిస్తున్న ఆ వసతి గృహం నుంచి డాక్టర్‌గా ఎదిగిన కుర్రాడే విష్ణుపాద హల్దార్.

పరిమిత బాలురతో ఆరంభమైన ఈ వసతిగృహం నేడు 600 మంది అనాథలకు, అభాగ్యులు, హరిజనులు అయిన బాలురకు ఆశ్రయాన్ని కల్పిస్తోంది. 6 నుంచి 18 ఏళ్ళ మధ్య బాలురు పూర్తిగా ఉచితంగా ఇక్కడ వసతిసౌకర్యాన్ని పొందుతున్నారు. ఇక్కడ ఆశ్రయం పొందినవారిలో తొంభైశాతం మంది చిన్నారులు తల్లితండ్రులను, అయినవారిని కోల్పోయి దయనీయ స్థితిలో ఇబ్బందిపడుతున్నవారే! స్వయంగా తల్లితండ్రులే పోషించలేక వదిలేసిన బాలురు, బాలనేరస్థులు మరికొందరు ఈ కేంద్రాన్ని ఆశ్రయిస్తున్నవారిలో ఉన్నారు.

ఈ బాలురు సామాజికంగా, ఆర్థికంగా విధివంచితులే కావచ్చు; కానీ కష్టపడి చదవడంలో, పనిచేయడంలో ఎవరికీ తీసిపోరు; ఏ మాత్రం చేయూతనిచ్చినా వీరు భారతదేశం గర్వించదగ్గ పౌరులుగా ఎదగగలరనడంలో సందేహం లేదు. ఇప్పటికే ఇక్కడి విద్యార్థులు సాధిస్తున్న విద్యాపరమైన విజయాలే ఇందుకు నిదర్శనం. చదువుల్లోనే కాకుండా, చేతివృత్తుల శిక్షణలో కూడా ఈ రామకృష్ణ మిషన్ బాలురు చక్కని ప్రతిభ కనబరుస్తున్నారు. అయితే వీరికి తగిన వనరులు కల్పించడం సాహసంతో కూడుకున్న పనే అవుతోంది.

ఈ వసతిగృహంలోని ప్రతి బాలుడికి ప్రభుత్వం నుంచి నెలవారి రూ. 1,250 అందుతోంది. ఈ నిధులూ నాలుగైదు నెలలకు ఒకసారి మంజూరవుతూండడం బాధాకరం. ఈ పరిమితమైన పైకంతోనే బాలురకు విద్య, వసతి, ఆహారం, వస్త్రాలు, వైద్య ఖర్చులు సమకూర్చడంతో పాటు వసతిగృహం నిర్వహణ ఖర్చులను కూడా భరించాల్సి వస్తోంది. ఉపాధ్యాయులకు, వంటపనివారికి, ఇతర పనివారికి జీతాల్ని చెల్లించాల్సి వస్తోంది. ధరలు ఆకాశాన్నంటుతున్న ఈ రోజుల్లో



పరిమితమైన ఈ నిధులతో సంతృప్తికరంగా ఈ వసతిగృహాన్ని నిర్వహించలేకపోతున్నాం. ప్రభుత్వ పరంగా బాలుడికి నెలకు కనీసం రూ. 1,356 మంజూరు చేస్తే తప్ప వీరి కనీస అవసరాలు తీరవు. నిజానికి ఒక్కో బాలుడికి నెలకు రూ. 2,606 ఖర్చవుతోంది.

ఈ విధంగా నిధుల కొరతతోనే ఈ వసతి గృహం ఎన్నో ఏళ్ళుగా నిర్వహించడం జరుగుతోంది. ఏటా అందే విరాళాలు ఈ నిధుల లోటును భర్తీ చేసేందుకే సరిపోతున్నాయి. ఫలితంగా వసతిగృహం ఆర్థికపరంగా నిలదొక్కుకోలేకపోతోంది. అంతేకాకుండా నిధుల లేమితో బాలుర సంక్షేమం కోసం సంస్థ తలపెట్టిన ఎన్నో ప్రణాళికలు కుంటుపడుతున్నాయి. సౌజన్యమూర్తులు ముందుకు వచ్చి ఆర్థికంగా చేయూతనిస్తే, వసతిగృహ నిర్వహణ ప్రమాణాలను మరింత మెరుగు పరచాలని భావిస్తూ ఉన్నాం.

ఈ నేపథ్యంలో ముందు ఈ వసతిగృహ నిర్వహణకు సంబంధించి, సేవలను నిరాటంకంగా కొనసాగించేందుకు **శాశ్వతనిధి**ని ఏర్పాటు చేయదలచాం. ఈనాటికీ సమాజంలో ఎందరో ఉదారహృదయులు పరోక్షంగా ఇలాంటి సేవాసంస్థలకు అండదండగా నిలుస్తున్నారు. ఈ విశ్వాసంతోనే ఈ బాలుర వసతి గృహం కోసం విరాళాలను అర్థిస్తున్నాం. వ్యక్తిగతంగా ఆర్థికంగా చేయూతనిచ్చే స్తోమత మీకు లేకపోయినా, ఉదారులైన మీ

మిత్రులకు, శ్రేయోభిలాషులకు మా విన్నపాన్ని సూచించాలని ప్రార్థిస్తున్నాం. ఇది మీరు మా బాలుర వసతిగృహానికి చేసే అత్యున్నత సహాయంగా భావిస్తాము.

600 మంది అనాథలు, నిర్భాగ్యులు, హరిజన బాలుర బాధ్యత తీసుకోవడమే కాకుండా ఈ వసతిగృహం ఈ కింద పేర్కొన్న విద్యాసంస్థలను కూడా నిర్వహిస్తోంది. 1. ప్రాథమిక పాఠశాల 2. ప్రాథమికోన్నత పాఠశాల 3. ఉన్నత పాఠశాల 4. పారిశ్రామిక శిక్షణా కేంద్రం 5. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల శిక్షణా సంస్థ 6. బ్రహ్మానంద విద్యా కళాశాల (బి.ఎడ్) 7. రామకృష్ణ మిషన్ వివేకానంద శతజయంతి కళాశాల 8.వడ్రంగి, కుట్టుపని, ముద్రణ, బుక్‌బైండింగ్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో వృత్తి విద్యా శిక్షణ 9. వయోజన విద్య, రాత్రి విద్యాకేంద్రాలు. ఈ సంస్థల ద్వారా సుమారు 4,200 మంది లబ్ధి పొందుతున్నారు.



పై కేంద్రాలన్నింటినీ 'రహారా, రామకృష్ణ మిషన్ బాలుర వసతి గృహం' నిర్వహిస్తుంది. ఈ కేంద్రాలతో పాటు బాలుర వసతిగృహాన్ని సమర్థంగా నిర్వహిస్తూ, అభివృద్ధి చేసేందుకు భూరి విరాళాలు అవసరమవుతున్నాయి. ప్రధానంగా మధ్యతరగతి, దిగువతరగతి కుటుంబాల బాలురు ఈ విద్యాకేంద్రాల ద్వారా లబ్ధిపొందుతున్నారు. వ్యక్తిగతంగా ఈ సంస్థలను, కేంద్రాలను సందర్శించి మా కార్యకలాపాలను పరిశీలించవలసినదిగా మిమ్మల్ని ఆహ్వానిస్తూ ఉన్నాము.

మీ విరాళాన్ని Ramakrishna Mission Boys' Home పేరున చెక్కు/ డి.డి తీసి Ramakrishna Mission Boys' Home, P.O. Rahara, Kolkata - 700 118 చిరునామాకు పంపాల్సిందిగా మనవి. విరాళాలకు 80–G (5)(vi)1961 సెక్షన్ కింద ఆదాయపు పన్ను మినహాయింపు లభిస్తుంది.

ఈ భావిపౌరుల పురోభివృద్ధికి మీవంతు ఆర్థిక సహాయాన్ని అందించి భగవాన్ శ్రీరామకృష్ణుల కృపకు పాత్రులు కాగలరని ఆశిస్తున్నాం.

భగవత్సేవలో

స్వామి జయానంద

కార్యదర్శి

(...15వ పేజీ తరువాయి)

ఈ రామనామ మహిమ అతిశయోక్తి కాదని నేటికీ ఎంతో మంది పట్టాభిరాముడి ప్రియభక్తులు రామజపంతో నిరూపిస్తూ ఉన్నారు.

ఘన దశరథ సుత...

జ్యేష్ఠపుత్రుడిగా అవతరించి కౌసల్యాదేవి,దశరథ మహారాజుల జన్మలనే తరింపచేశాడు జానకిరాముడు. అందుకే అన్నమయ్య ఆ అయోధ్యారాముడిని అక్షరాక్షతలతో అర్చిస్తూ...

కౌసల్యానంద వర్ధన ఘనదశరథ సుత
భాసుర యజ్ఞరక్షక భరతాగ్రజ
రాసికెక్క కోదండ రచన విద్యా గురువ
వాసితో సురలు నిను వడి మెచ్చేరయ్యా॥

యజ్ఞరక్షకుడిగా ఆయన ప్రదర్శించిన సాహసాలనూ, భరతుడి అగ్రజుడిగా ఆయన చేసిన త్యాగాన్నీ, శిష్యుడిగా గురువు విశ్వామిత్రుడి వద్ద నేర్చుకున్న కోదండ ధనుర్విద్యలనూ, దేవతలు సైతం నీరాజనాలర్పించిన దశరథాత్మజుడి ఘనతను అభివర్ణిస్తున్నాడు.

ఈ అవనిపై శ్రీరాముడి ప్రభావం అనన్యమైంది. భక్తపుంగవులే కాదు, కవి గాయక వైతాళికులు కూడా శ్రీరామనామ ప్రాభవంతో తరించిపోయారు. అదే పరంపరలో శ్రీమద్భాగవతాన్ని ఆంధ్రీకరించిన పరమ భాగవతోత్తములు పోతనామాత్యులు కూడా తమ కావ్యరచనలో భాగంగా ఆ కోదండరాముడిని...

జనకసుతా హృచ్చోరా! జనక వచోలబ్ధ విపినశైల విహారా!
జనకామిత మందారా! జనకాది మహేశ్వరాతిశయ సంచారా!

'సీతాదేవి హృదయాన్ని దోచుకున్నవాడా! తండ్రి మాట జవదాటక కొండకోనల్లో తిరిగినవాడా! జనుల కోరికలు తీర్చడంలో కల్పవృక్షం వంటివాడా! జనకుడు తదితర రాజర్షులను అతిశయించిన నడవడిక కలవాడా!' అని కీర్తిస్తూ పరవశించిపోతారు.

కారుణ్య రత్నాకర...

త్రేతాయుగంలో సీతానాయకుడిగా సాకారరూపాన్ని దాల్చి, శ్రీమహావిష్ణువు తన అవతారలక్ష్యంలో భాగంగా స్థూలదేహంతో రావణాది రాక్షసులను దునుమాడాడు. కానీ అంతటితో ఆ ఆజానుబాహుడి అవతారం పరిసమాప్తి అయిందనుకుంటే పొరపాటే! ఈనాటికీ సర్వచరాచర సృష్టిలో అంతర్యామిగా ఆయన సూక్ష్మదేహంతో కొలువయ్యే ఉన్నాడు. మనం మనసారా ప్రార్థిస్తే మనలోని కామక్రోధాది అరిషడ్వర్గాలనే అసురులను అంతమొందిస్తాడు. అంతటి ఆ నిరుపమాన గుణరత్నాన్ని...

మారీచ సుబాహు మర్దన తాటకాంతక
దారుణవీర శేఖర ధర్మపాలక
కారుణ్య రత్నాకర కాకాసుర వరద
సారెకు వేదవిదులు జయ వెట్టేరయ్యా! అని స్వరహారతిని పడుతున్నాడు శ్రీనివాసుడి భక్తాగ్రేసరుడు. మారీచుడు, సుబాహు, తాటకి తదితర రాక్షసులను అంతం చేసిన వీరశేఖరుడు ఆ భార్గవరాముడు. తెలియక పొరపాటు చేసిన కాకాసురుడికి ప్రాణభిక్ష పెట్టిన కారుణ్యరత్నాకరుడు. రాక్షసుడైన కాకాసురుడు మందాకినీ తీరంలో సీత నిద్రిస్తున్నప్పుడు ఆమె శరీరంపై గోళ్ళతో గాయం చేస్తాడు. అప్పుడు రాముడు ఆగ్రహించి బాణం వేస్తాడు. భయంతో అతడు శరణు కోరతాడు. 'నా బాణం తిరుగులేనిది; నీ శరీరంలో ఏదైనా ఒక భాగాన్ని అర్పించక తప్పదు' అంటాడు శ్రీరాముడు. అప్పుడు కాకాసురుడు తన కన్ను ఇచ్చి ఆ రామబాణం బారి నుంచి విముక్తుడవుతాడు. అయితే బాహ్యంగా తారకరాముడు రాక్షసులను హతమార్చినట్లు లోకానికి కనిపిస్తుంది. కానీ వారిని ఆయన మట్టుపెట్టలేదు; వారికి ముక్తిని ప్రసాదించాడు. ఇలా భగవంతుడి ప్రేమలోనే కాదు ప్రతీకారంలో కూడా పరమకారుణ్యమే ప్రతిఫలిస్తుంది. అందుకే అహల్య శాపవిమోచనార్థం గౌతముని ఆశ్రమ సమీపానికి గురువు విశ్వామిత్రుడు, సోదరుడు లక్ష్మణుడితో కలసి రఘురాముడు నడచి వస్తున్న సందర్భాన్ని వర్ణిస్తూ, శ్రీవిశ్వనాథ సత్యనారాయణ గారు 'శ్రీమద్రామాయణ కల్పవృక్షం'లో...

ప్రభు మేనిపై గాలి వచ్చినంతనే పాషాణ మొకటికి స్పర్శ వచ్చె
ప్రభు కాలిసవ్వడి ప్రాంతమైనంతనే శిలకొక్కదానికి చెవులు కలిగె
ప్రభుమేని నెత్తావి పరిమళించిన తోన యశ్మంబు ఘ్రాణేంద్రియంబు చెందె
ప్రభు నీలరత్నతోరణ మంజులాంగంబు కనవచ్చి రాతికి కనులు కలిగె

'శ్రీరాముని గాలి సోకగానే రాయికి కూడా కనులు, చెవులే కాదు ప్రాణాలు కూడా వచ్చాయి! మట్టిరేణువులు కూడా ఆ ప్రభువు తనువు పరిమళాలను ఆఘ్రాణించి పునీతమయ్యాయి' అని అంటారు.

శ్రీవేంకటాద్రి రాఘవ...

అంతటి ఆ సీతారమణుడు, రాజశేఖరుడు, అయోధ్యా రాముడు వేంకటాద్రిపై కొలువై పరోక్షంగా తన ప్రభావ ప్రతాపాలను చూపుతున్నాడని పులకించిపోతూ...

సీతారమణ రాజశేఖర శిరోమణి
భూతలపుటయోధ్యాపుర నిలయా
యీతల శ్రీవేంకటాద్రి నిరవయిన రాఘవా
ఘాత నీ ప్రతాపమెల్ల కదునిండెనయ్యా! అంటున్నాడు అన్నమయ్య. శ్రీవేంకటాచలంపై శ్రీనివాసుడి దర్శనభాగ్యంతో ధన్యుడై ప్రతివాద భయంకర అణ్ణన్ అనే భక్తుడు ఆశువుగా శ్రీవేంకటేశ్వరుడిని సుప్రభాతంతో **'కౌసల్యా సుప్రజా రామా!'** అని ఆరంభించాడు. శ్రీరాముడికి, శేషాద్రినిలయుడికి భేదమే లేదంటూ...

అవనీతనయా కమనీయకరం; రజనీకర చారుముఖాంబురుహమ్
రజనీచరరాజతమో మిహిరం; మహనీయమహం రఘురామమయే

'భూదేవి తనయ అయిన సీతాదేవికి మిక్కిలి నచ్చిన సుందరుడవు, చందమామ లాంటి అందమైన ముఖం కలవాడవు,రావణాసురుడనే దట్టమైన చీకటికి సూర్యుని వంటివాడవు అయిన ఓ రఘురామా! మహానుభావా! నిన్నే శరణువేడుతున్నాను' అని తన్మయుడై స్తుతించాడు. ❖

(...23వ పేజీ తరువాయి)

చైతన్యాన్ని ఆరాధించడం గొప్పకాదు. జడమైన పాదుకలలో చైతన్యాన్ని చూడడం, ఆరాధించడం గొప్ప. 'శివజ్ఞానంతో జీవసేవ'. ఇదీ భరతుని విశేషం.

నిధి రామునిది – రక్షణ భరతునిది : 'రామా! రాజ్యం నాదేనన్నావు. సరే – అంగీకరించాను. కానీ – నా రాజ్యమూ, నేనూ, నా సర్వస్వమూ నీకే సమర్పించు కుంటున్నాను. కట్టలు తెగిన నదిలావుంది రాజ్యం. నీవే తగిన ప్రభువువు. నేనైతే గాడిదలా పాలిస్తాను. నీవైతే జాతి గుఱ్ఱంలా పరిపాలిస్తావు' ఇవి భరతుని సమర్పణా భావాన్ని తెలిపే మాటలు.

బహు కోణాల్లో భరతుని జీవితం

చివరికి పాదుకలకు పట్టంకట్టి రాముని ధర్మప్రతినిధిగా భరతుడు రాజ్యభారాన్ని నిర్వహిస్తాడు. ఈ బాధ్యతలో కూడా సంపూర్ణ శరణాగతి, నిరభిమానం భరతునిలో చూస్తాం. 'నేను కీలుబొమ్మను మాత్రమే. ఆడించేవాడు రాముడు. ఎలా ఆడిస్తే అలాగే ఆడతాను. ఆడించే వాడికే అలసటగాని, ఆడే బొమ్మకు అలసట ఎక్కడిది?' 'నిధిరామునిది – రక్షణ భరతునిది'.

కర్తృత్వ భావమే సకల సమస్యలకూ మూలం. ఇదే దశరథుని సమస్య. 'రాజ్యం నేనిచ్చేవాడిని – రాముడు పుచ్చుకునే వాడు'. ఇది దశరథుని అభిమానం. సమర్పణలో కూడా స్వామిత్వం ఆయనది. సర్వమూ భగవంతునిదే అయినప్పుడు కృష్ణుడు వెన్నదొంగెలా అవుతాడు? ధర్మకర్తను, ధర్మపరిరక్షకుడననే భావం (ట్రస్టీషిప్)తో చేసే పనులు, బాధ్యతలు ప్రతిబంధకాలు కావు. అందులో అసత్యానికి, అవినీతికి, అనైతికతకు, దాపరి కానికి, ఒత్తిళ్ళకు, ఒడుదొడుకులకు తావే ఉండదన్న మహత్తర సందేశం భరతుని జీవితం నుండి ఆధునికసమాజం నేర్చుకోవాలి.

ఆధునిక సమాజానికి ఆలంబనం : నేటి సమాజపు పోకడలు విపరీతం, విచిత్రం. సత్యానికి, ధర్మానికి కట్టుబడి జీవించడం సాధ్యమా? అన్న సందేహాలు; నీతినిజాయతీగా బ్రతికే రోజులా ఇవి? అన్న నిరాశాభావాలు చోటుచేసుకుంటున్నాయి. ఒక వైపు నీతులు వల్లిస్తూనే, మరోవైపు అవినీతికి తలలొగ్గాల్సిన పరిస్థితులు ఎదుర్కొంటున్నవారూ ఉన్నారు సమాజంలో. అవకాశాల కన్నా అవసరాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. మనిషి కన్నా మనిషి సృష్టించిన రూపాయికే విలువ పెరుగుతుంది. వస్తువుల వెలలు తెలుసుకున్నా వాటి విలువలు తెలుసుకోలేక పోతుంది నేటి సమాజం.

మనీతత్త్వపు వెల్లువలో మానవీయ విలువలు, ఆత్మీయతాను రాగాలు తుడిచిపెట్టుకుపోతున్న నేటి సమాజం చుక్కాని లేని నావలా మారుతుంది. అలాంటి సమాజానికి ఆలంబనమేది? బాసట, ఊరట ఎక్కడ?

సత్యం ధర్మం అహింసాది మహత్తర విలువలకు వాహనాలు మన ఇతిహాసాదులు. ఆధ్యాత్మికత అనే మహావృక్షానికి పట్టుగొమ్మలు ఈ విలువలు. ఈ గ్రంథాలే మన సంస్కృతి, చరిత్ర, సంపద, వారసత్వం. చరిత్రను విస్మరిస్తే చరిత్రహీనులం. స్మరిస్తే చరితార్థులం.

భాగవతం – భక్తికి; భారతం – యుక్తికి, రామాయణం – భగవదనురక్తికి ప్రతీకలు. వీటిలో భరతునివంటి విశిష్టపాత్ర లెన్నో మనకెదురవుతాయి. కనుక వాటిని ప్రతివారూ అధ్యయనం చేయాలి. మన సంస్కృతి మూలాలు అందరూ క్షుణ్ణంగా తెలుసుకోవాలి. మూలాలు సుదృఢం, పటిష్ఠం కావాలి. భరతుని చరిత్ర శక్తిపూరితం. ఆత్మబలాన్ని చేకూరుస్తుంది. ప్రాపంచికతను, పోటీతత్వాన్ని తొలగిస్తుంది. భగవంతుని యందు అనురాగం – భవమునందు విరాగం కలిగించే అద్భుతశక్తి భరతుని చరితం.

భరతుని పేర వెలసిన భారతదేశంలో రామరాజ్య స్థాపనకు బహుగుణ సంపన్నుడైన భరతుని జీవితం అందరికీ ఆదర్శం కావాలి! ❖

(...9వ పేజీ తరువాయి)

ఆధ్యాత్మిక నవవసంతం

గడుపుతున్నామో గుర్తించేందుకు వీలుగా పారమార్థిక దైనందిని (spiritual diary)ని ఏర్పాటు చేసుకుని, ప్రతీరోజు చేసే పనులను సాక్షిగా గమనిస్తూ, పొరపాట్లను గుర్తిస్తూ, వాటిని తిరిగి చేయకుండా జాగ్రత్తపడదాం.

జన్మాంతరాలుగా బలీయంగా ఉన్న పాత సంస్కారాలనూ, లౌకిక వాసనలనూ మెల్లమెల్లగా విడనాడే ప్రయత్నాన్ని చేద్దాం. నూతన సంవత్సర ఆరంభంతో, నూతనభావాలను, దైవీసంపదను వృద్ధి చేసే గుణాలను అలవరచుకునే దిశగా సాగుతూ, కాలం విలువనూ, మానవజన్మ పరమార్థాన్నీ అనుక్షణం గుర్తుంచుకునే ప్రయత్నం చేద్దాం. కొత్త కాగితం లాగా మన ఎదురుగా ఉన్న ఈ మన్మథనామ సంవత్సరపుపుటలో ప్రేమ, దయ, పరోపకారం అనే సువర్ణాక్షరాలను లిఖించే ప్రయత్నం చేద్దాం.

వసంతకాల ఆగమనం ఆధ్యాత్మికంగా ఎలా పరిణమించ గలదో శ్రీఆదిశంకరులు వివేక చూడామణిలో...

శాన్తా మహాన్తో నివసన్తి సన్తో, వసన్తవ ల్లోకహితం చరన్తః ।
తీర్ణాః స్వయం భీమభవార్ణవం జనా, న హేతునాన్యానపి తారయన్తః॥

'వసంత ఋతువు సకల చరాచర సృష్టి కోటికంతటికీ ఎలా హితకరంగా ఉంటుందో, అలాగే కొందరు శాంతచిత్తులైన మహాత్ములు భీకర సంసారసాగరాన్ని తాము తరించి, ఇతరులు తరించడానికి సహాయపడతారు' అని తెలియజేశారు.

అలాంటి శాంతచిత్తులైన పురుషులను శరణువేడి, వారిని మన మనస్సులోకి శ్రద్ధతో ఆహ్వానించడమే ఆధ్యాత్మిక వసంత ఋతువుకు ఆహ్వానం పలకడం. అలాంటి మహాపురుషుల ఉపదేశాలు మన హృదయసీమలో చిగురించిన నాడు, మన మానసిక జగత్తు నిత్య వసంతమై, నూతన శోభలతో వెలుగొందుతూ, జ్ఞాన ప్రపూర్ణమై శాంతమూ, ఆనందభరితమూ కాగలదు. అదే మన జీవితానికి సార్థకమైన నిజమైన ఉగాది పండుగ. ❖ **(మార్చి 21, శనివారం - మన్మథనామ సంవత్సరాది)**

రావణా! ఈ దేహాన్ని నీకు తోచిన విధంగా బంధించు, లేదా వధించు. ఈ దేహాన్ని కాపాడుకో వాలనే కాంక్ష నాకులేదు. అవమానకరమైన కార్యాన్ని నేనెన్నడూ చేయను. *-సీతాదేవి, (రామాయణం)*

- స్వామి పరిజ్ఞేయానంద

స్వచ్ఛ భారతం స్వర్గ ధామం

సమాజంలో శాంతి కుసుమాలు వికసించాలన్నా; సమాజం అభ్యుదయపథంలో పయనించాలన్నా ప్రతి వ్యక్తీ తన స్వధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించడం అలవరచుకోవాలి. అలాకాకుండా స్వధర్మాన్ని మరచిపోయి, బాధ్యతల్ని విస్మరించి ప్రవర్తిస్తే వ్యక్తిజీవితంలో గానీ, సంఘజీవనంలో గానీ శాంత్యానందాలు మచ్చుకైనా ఉండవు.

ప్రజలను పరిరక్షించడం, సమాజంలో శాంతిభద్రతలను కాపాడడం, అధర్మాన్ని అణచివేయడం - రాజధర్మం. రాజధర్మ నిర్వహణలో యుద్ధం చేయడం క్షత్రియుని స్వధర్మం. అయితే, ధర్మయుద్ధంలో పోరాడాల్సిన అర్జునుడు తన స్వధర్మాన్ని మరచిపోయి యుద్ధరంగం నుండి వైదొలగాలని నిశ్చయించుకున్నాడు. అలాంటి పరిస్థితుల్లో శ్రీకృష్ణుడు "మన అసక్తత వలనో, పిరికితనం వలనో, అసమర్థత వలనో స్వధర్మం నుండి తొలగిపోకూడదనీ; స్వధర్మపాలనలో ప్రాణాలు కోల్పోయినా శ్రేయోదాయకమేననీ; స్వధర్మనిర్వహణే పరమధర్మమనీ" అర్జునుడికి గుర్తుచేస్తూ...



స్వధర్మ మపి చావేక్ష్య న వికమ్పితు మర్హసి ।
ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయో౽న్యత్ క్షత్రియస్య న విద్యతే॥ *(గీత. 2-31)*

'అర్జునా! క్షత్రియునిగా ధర్మయుద్ధం చేయడమే నీ స్వధర్మం. యుద్ధం కన్నా నీకు శ్రేయోదాయకమైనది వేరొకటి లేదు. నువ్వు శోకింపతగదు' అని స్వధర్మపాలన ప్రాధాన్యాన్ని వివరించాడు శ్రీకృష్ణుడు.

శ్రీకృష్ణుడు బోధించినట్లు ఎవరి స్వధర్మాన్ని వారు నిర్వర్తిస్తే సమాజంలో అవినీతి, అక్రమాలు, అన్యాయాలు, అశాంతికి ఆస్కారమే ఉండదు.

మహారాజు తన శక్తియుక్తుల్ని ప్రజాహితం కోసం ప్రదర్శించాలి గానీ స్వప్రయోజనాలకు వినియోగించకూడదు. స్వధర్మాన్ని ధర్మబద్ధంగా నిర్వర్తించాలి. కౌరవులలాంటి అధర్మవర్తనులు సమాజంలో ఉండి, పాండవుల్లాంటి ధర్మపరాయణులు అడవుల పాలైతే ఇక అలాంటి సమాజం శాంతిసౌభాగ్యాలతో ఎలా విరాజిల్లుతుంది?

నేటి సమాజంలో రాజకీయ నాయకులు, పాలనాధికారులు, న్యాయాధిపతులు, రక్షణాధికారులు, వైద్యనిపుణులు... ఇలా ప్రజాసంక్షేమ బాధ్యతల్ని వహించాల్సిన ప్రతి ఒక్కరూ క్షత్రియులే!

మన నేతలు ప్రజా సంక్షేమం కోసం నిబద్ధతతో కృషిచేస్తే దారిద్ర్యం కనుమరుగైపోతుంది. రక్షణాధికారులు తమ శక్తిని సద్వినియోగపరిస్తే సమాజంలో దోపిడీలు, దౌర్జన్యాలు, అరాచకాలు అంతమైపోతాయి. న్యాయాధిపతులు తమ అధికారాన్ని నిష్పక్షపాతంగా వినియోగిస్తే దేశంలో అవినీతి, అక్రమాలు అంతరించిపోతాయి. అలాగే, ఉద్యోగులు, విద్యార్థులు, గృహస్థులు... ఇలా సమాజంలో ప్రతి ఒక్కరూ తమ తమ స్వధర్మాలను నిబద్ధతతో నిర్వర్తిస్తే ఈ భూతలమే స్వర్గతుల్యమవుతుంది.

అందుకే స్వధర్మాన్ని సక్రమంగా నిర్వహించేవారి కోసం **'స్వర్గద్వార మపావృతమ్** - స్వర్గద్వారాలు తెరవబడతాయి' *(గీత. 2-32)* అని శ్రీకృష్ణుడు హామీ ఇచ్చాడు.

అయితే, స్వధర్మాన్ని ఆచరించడం వల్ల జీవితం స్వర్గమయమవుతుందనీ, సమాజం శాంతిధామంగా మారుతుందనీ తెలిసినా ధర్మబద్ధంగా స్వధర్మాన్ని ఆచరించే వారి సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతోంది. స్వధర్మాన్ని ఆచరించకపోవడం వల్ల కలిగే దుష్పరిణామాలను శ్రీకృష్ణుడు వివరిస్తూ...

...స్వధర్మం కీర్తిం చ హిత్వా పాప మవాప్స్యసి । *(గీత. 2-33)*
...సమ్భావితస్య చాకీర్తి ర్మరణా దతిరిచ్యతే ॥ *(గీత. 2-34)*

'స్వధర్మాన్ని ఆచరించకపోతే పాపం చుట్టుకుంటుందనీ; అపకీర్తి కలుగుతుందనీ; అపకీర్తి మరణం కన్నా ఘోరమైనదనీ' అర్జునుణ్ణి హెచ్చరించాడు.

ప్రముఖ న్యాయవాది చిత్తరంజన్‌దాస్ తండ్రి పేదరికం వల్ల అప్పులపాలయ్యాడు. చేసిన అప్పులను ☛

జీవనోద్యానంలో
మానవతా పరిమళాలు

జ్ఞానం విలువ

చైనా యాత్రికుడు హుయాన్‌త్సాంగ్ నలంద విశ్వవిద్యాలయంలో చదువు పూర్తి చేసుకుని, అక్కడే కొన్ని రోజులు అధ్యాపకుడిగా కూడా పని చేశాడు. తరువాత ఆయన స్వదేశానికి వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నాడు. విద్యార్థులకు హుయాన్‌త్సాంగ్ చైనా వెళ్ళిపోతున్నాడని తెలిసింది. పదిహేనుమంది విద్యార్థులు ఆయనతో పాటు వెళ్ళిపోవాలనీ, అలా అయితే ఆయనతో సత్సంగం చిరకాలం కొనసాగుతుందనీ భావించారు. హుయాన్‌త్సాంగ్ నలంద విశ్వవిద్యాలయంలో పని చేసేటప్పుడు కొన్ని పుస్తకాలు రాశాడు, కొన్ని కొన్నాడు. వాటిని కూడా తనతో తీసుకు వెళ్ళడానికి నిర్ణయించుకున్నాడు.

ఒక నావలో అందరూ ప్రయాణం మొదలుపెట్టారు. దురదృష్టవశాత్తూ దారిలో తుపాను వచ్చి నావ అటూ ఇటూ ఊగిపోసాగింది. నావ నడిపేవాడు హుయాన్‌త్సాంగ్‌తో "మహాశయా! ఈ నావలో బరువెక్కువైపోయింది. ముందుకు సాగడం చాలా కష్టం. పుస్తకాల పెట్టెల్ని నీటిలోకి విసిరివేయండి" అని అన్నాడు. దాంతో, హుయాన్‌త్సాంగ్‌కి ఏం చేయాలో తోచలేదు. అప్పుడాయన విద్యార్థులలో ఒకడు "గురుదేవా! ఈ పుస్తకాలని పారేయాలనే ఆలోచనే వద్దు. ఎందుకంటే పుస్తకాలు విజ్ఞాన భాండాగారం. ఇవి మన దేశస్థులకు ఎంతగానో ఉపయోగపడతాయి. మేము స్వదేశానికి తిరిగి వెళ్ళకపోయినప్పటికీ ఎవరికీ ఎటువంటి నష్టమూ వాటిల్లదు" అంటూ తన తోటి విద్యార్థుల వంక చూశాడు. అప్పుడా విద్యార్థులందరూ ఏ మాత్రం సంకోచించకుండా ఆనందంగా సముద్రంలోకి దూకేశారు. ❖

పాషాణ హృదయం

కళింగ యుద్ధంలో భయంకరమైన హింస చోటు చేసుకుంది. అది చూసి అశోక సమ్రాట్టు మనస్సు కరిగిపోయింది. ఆయన పూర్తిగా మారిపోయాడు. ఆయన బౌద్ధమతాన్ని స్వీకరించాడు. మతప్రచారం కోసం అశోకుడు తన కుమార్తె సంఘమిత్రను లంకకు పంపాడు. మతప్రచారంలో ఆయన ఎంతో సాఫల్యాన్ని పొందాడు. కానీ ఆయనను దెబ్బతీయాలను కొనే శత్రువులు పెరిగిపోయారు. వారందరినీ మార్చాలని ఆయన నిర్ణయించుకున్నాడు.

ఇంతలో ఒక అమావాస్య రాత్రి తిరుగుబాటు దారుల్లో ఒక యువకుడు సంఘమిత్రను హతమార్చేందుకు పథకం వేశాడు. అతడు ఆమె వద్దకు వెళ్ళేసరికి సంఘమిత్ర ఏదో పనిలో నిమగ్నమై ఉంది. కత్తి తీసుకొని వెనుక నుంచి ఆమెకు దగ్గరగా వెళతాడు. ఆ సమయంలో సంఘమిత్ర గాయపడిన ఒక ఆవు కాలిని కడిగి, మందు రాసి, తను కట్టుకున్న బట్టను చించి, దానికి కట్టు కడుతోంది. ఆ దృశ్యాన్ని చూసి అతడి పాషాణహృదయం కరిగిపోయింది. పశ్చాత్తాపంతో అతడు సంఘమిత్ర కాళ్ళపై పడి, క్షమించాల్సిందిగా కోరాడు. ❖

అనువాదం: డాక్టర్ వై.సరోజా నిర్మల
(రామకృష్ణ సంఘం - హిందీ మాసపత్రిక 'వివేకజ్యోతి' నుండి)

తీర్చలేక అపకీర్తి పాలయ్యాడు. చిత్తరంజన్ ఎన్నో కష్టాలను ఎదుర్కొని న్యాయవిద్యను అభ్యసించి న్యాయవాద వృత్తిని చేపట్టాడు. ఆయన తన ప్రప్రథమ సంపాదనతో ముందుగా తన తండ్రి చేసిన అప్పులను తీర్చాడు. ఆ విధంగా తండ్రి అపకీర్తిని తొలగించి, ఆత్మగౌరవాన్ని కాపాడుకున్నాడు.

కానీ నేటి సమాజంలో మనిషికి ఆత్మగౌరవం, ఆత్మతృప్తి, పరువు, ప్రతిష్ఠల కన్నా అక్రమార్జన, అధికారదాహం, అనైతిక భోగవాంఛలే ముఖ్యమయ్యాయి. పరువుపోయిన తరువాత జీవించివున్నా మరణించినట్లేనని భావించేది ఒకనాటి సమాజం. కానీ పరువుపోయినా ఫరవాలేదు విలాసవంతంగా జీవిస్తే చాలన్న స్థితికి దిగజారింది నేటి సమాజం.

స్వధర్మాన్ని విస్మరించిననాడు; పాపభీతి, పరువుప్రీతి లేశమైనా లేనినాడు వ్యక్తి శాంతిగా ఎలా జీవించగలడు? సమాజం అభ్యుదయం ఎలా సాధించగలదు? దేశం సుభిక్షంగా ఎలా వర్ధిల్లగలదు? కాబట్టి శ్రీకృష్ణుని హెచ్చరికను గుర్తుంచుకొని ప్రతి ఒక్కరం స్వధర్మాన్ని ధర్మబద్ధంగా ఆచరించి, నైతికంగా జీవించిననాడు నిజమైన 'స్వచ్ఛ భారతం' సాధ్యమవుతుంది. 'స్వర్గ ధామం'గా విలసిల్లుతుంది. ❖

అతిథిదేవో భవ!

చిత్ర కథ: మోహనా సూర్యనారాయణన్   చిత్రాలు: శివప్రసాద్   అనుసృజన: స్వామి జ్ఞానదానంద




5
నేను వెళ్ళి చితుకులు సేకరించి వంట ప్రారంభిస్తాను.
సరే! ఇంతలో మేం వెళ్ళి గంగలో స్నానం చేసి వస్తాం.
6
i) కాస్సేపట్లో వంట సిద్ధం అయింది.
ii) అందరూ రండి! భోజనం చేద్దాం. నరేన్ ఇంకా రాలేదే!
iii) అదుగో నరేన్! అతడితో పాటు ఎవరో ఒక సాధువు కూడా వస్తున్నారే! ఆయన ఎవరు...?
7
స్వామీ! మాతో కలసి భోజనం చేద్దురుగాని రండి.
సాధుపుంగవులారా! ఇది నాకు మహోపకారం. నేను తిని రెండు రోజులైంది. చాలా ఆకలిగా ఉంది.
8
స్వామీ! నెమ్మదిగా తినండి.
బాబూరామ్! నా వంతు ఆహారాన్ని కూడా వీరికి వడ్డించు. ఈయన రెండు రోజులుగా ఏమీ తినలేదు.


9
స్వామి వివేకానంద వంతు ఆహారాన్ని ఆ సాధువు వెంటనే ఆరగించేశాడు. ఆయన ఆకలి తీరినట్లుగా లేదు.
బాబూరామ్ మహరాజ్! నా వంతు ఆహారాన్నీ ఆయనకు వడ్డించు. సాధువు తృప్తి చెందితే మనమూ తృప్తిపడతాం.
10
నాది, నీది అంటూ ఏం మాట? అతిథి కడుపార భుజిస్తే అది భగవంతుడు స్వీకరించినట్లు కాదా?
సరిగ్గా చెప్పావు శరత్! బాబూరామ్! ఆయన ఇక చాలు అన్నంత వరకూ వడ్డించు.
11
సాధువు తృప్తిగా భోంచేసి సెలవు పుచ్చుకున్నాడు. సోదర శిష్యులు ఆయనను సాగనంపిన తరువాత...
చాలా మంచిపని చేశావు సోదరా!
నేను గంగలో స్నానం చేసి దైవోపాసన చేస్తున్నప్పుడు ఆకలితో అలమటిస్తున్న ఈయనను చూశాను. అందుకే, భోజనం పెట్టడానికని తోడ్కొని వచ్చాను.
12
అతిథి తినగా మిగిలిన ఈ కొన్ని మెతుకులను దైవ ప్రసాదంగా మనం స్వీకరిద్దాం.
సాధువు తినగా మిగిలిన ఆ కాస్త ఆహారాన్ని నలుగురు సోదర సన్యాసులు తిన్న వెంటనే వారి ఆకలి పూర్తిగా తీరిపోయింది.
13
మహాభారతంలో, చాలా రోజులు పస్తులుండిన ఒక బ్రాహ్మణుని కుటుంబం తమకు లభించిన పేలపిండిని అతిథికి సమర్పించి, ఆకలితో ప్రాణాలు త్యజించిన సంఘటన ఉంది. ఆ ఇంట్లో నేలపై చిందిన పిండిపై పొర్లిన ముంగిస దేహంలో సగభాగం స్వర్ణవర్ణం పొందింది. అలాంటి మహోన్నత త్యాగమయ వారసత్వాన్ని కదా శ్రీరామకృష్ణ శిష్యరత్నాలు పుణికిపుచ్చుకున్నారు!

(...27వ పేజీ తరువాయి)

జీవించడానికి 1000 మార్గాలు

నిర్ణయించుకున్నాడు. అయితే, అతడి స్నేహితుడి సలహామేరకు శ్రీరామకృష్ణ పరమహంసను కలిశాడు. ఆయన బోధనలను విన్న తరువాత అతడు ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచనను విరమించుకున్నాడు. అలాగే, ప్రఖ్యాత ఫ్రెంచ్ గాయని మేడమ్ ఎమ్మా కాల్వే తన కుమార్తె అగ్నిప్రమాదంలో మరణించడం వల్ల ఆ బాధను భరించలేక ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించింది. ఆ విషయం తెలిసిన ఆమె సన్నిహితులు స్వామి వివేకానంద వద్దకు వెళ్ళమని సలహా ఇచ్చారు. కాల్వే స్వామీజీ వద్దకు వెళ్ళి ఆయనతో మాట్లాడిన తరువాత ఆమె మనోవ్యథ పూర్తిగా తొలగిపోయింది. అందువల్ల మనోవ్యథకు గురైనప్పుడు మన బాధను సన్నిహితులతో పంచుకోవాలి. మనం వారిచ్చే సలహాలను పాటించడం ద్వారా సమస్యల నుండి సులభంగా బయటపడవచ్చు.

మంచి పుస్తకం ఓ మంచి నేస్తం : మానసిక ఆందోళనలను ఎదుర్కోవడానికి మానసికశక్తి అవసరం. అలాంటి మానసికశక్తి మహాత్ముల బోధనల నుండి లభిస్తుంది. శ్రీరామకృష్ణుల సంభాషణలను విన్న మహేంద్రనాథ్ గుప్త 'శ్రీరామకృష్ణ కథామృతం' అనే పుస్తకాన్ని రాసారు. ఒకప్పుడు ఆత్మహత్య చేసుకోవాలనుకున్న ఆయన రాసిన ఈ పుస్తకం నేడు వేలాది మందిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచి ఆత్మహత్యల నుండి కాపాడుతూ ఉంది.

అలాగే, రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవాలనుకున్న అన్నా హజారేలో స్వామి వివేకానంద సూక్తులు స్ఫూర్తిని నింపాయి. ఆ ఆత్మవిశ్వాసంతోనే ఆయన ఎంతోమంది జీవితాల్లో వెలుగును నింపుతున్నారు.

రాంచీలో ఓ విద్యార్థిని పోటీ పరీక్షలు రాయడానికి వెళుతూ రైలు ప్రమాదంలో కాళ్ళు పోగొట్టుకుంది. ఆమెకు జీవితం అంధకారమయంగా తోచింది. అలాంటి సమయంలో ఆమె స్వామి వివేకానంద సూక్తులు చదవడం వల్ల ఆమెలో నిరాశ పటాపంచలైంది. మరలా పోటీ పరీక్షలు రాసి ఒక బ్యాంక్ అధికారిణిగా ఉద్యోగం సంపాదించింది. నేడు స్వామి వివేకానంద బోధనలతో ఎంతోమందిని ప్రభావితం చేస్తోంది. ఇలా ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది స్వామి వివేకానంద బోధనల నుండి స్ఫూర్తిని పొంది వివిధ రంగాలలో రాణిస్తూ ఉన్నతంగా జీవిస్తున్నారు.

ఆత్మవిశ్వాసాన్ని పెంచే మహాత్ముల సందేశాలను చదవడం ద్వారా ఆందోళన, ఒత్తిడి, నిరాశలను అధిగమించవచ్చు. కానీ నేడు 'ఆత్మహత్యకు వెయ్యి మార్గాలు; అంతిమ నిష్క్రమణ; ఆత్మహత్య-సూచనావళి'...ఇలాంటి పుస్తకాలు అత్యధిక సంఖ్యలో అమ్ముడవుతున్నాయంటే నేటితరం ఎటువైపు పయనిస్తుందో అర్థం చేసుకోవచ్చు. జీవించడానికి వెయ్యి మార్గాలను చూపించే రామకృష్ణ, వివేకానందలాంటి మహాత్ముల బోధనలను చదవాలి గానీ, మరణించడానికి మార్గాలను వెతకడం ఎందుకు? కాబట్టి యువత జీవన మార్గాలను ప్రబోధించే మంచి పుస్తకాలను చదివి ఉన్నతంగా జీవించడానికి ప్రయత్నించాలి; ఆనందమనే మకరందాన్ని ఆస్వాదించడానికే ఈ జీవితంగానీ, మరణ మృదంగం వాయించడానికి కాదని గ్రహించాలి.

అంతర్జాలంలో విహరించే ఆధునిక యువత కాస్త వాస్తవిక ప్రపంచం వైపు తొంగిచూస్తూ తల్లితండ్రుల మాటలకు విలువనివ్వడం; సహనాన్ని అలవరచుకోవడం; నిదానంగా వ్యవహరించడం; సన్నిహితులతో మనస్సువిప్పి మాట్లాడడం; మహాత్ముల బోధనలను చదవడం అలవరచుకోవాలి. అప్పుడే ఈ జీవితం ఓ ఆనందోద్యానంగా మారుతుంది. ❖

పేద విద్యార్థులకు ఉచిత వసతి గృహం

విజయవాడ రామకృష్ణ మిషన్ సీతానగరంలో రామకృష్ణ మిషన్ ఉన్నత పాఠశాలను(6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు - తెలుగు మాధ్యమం) నిర్వహిస్తోంది. బాగా చదువుతున్న బీద విద్యార్థుల కోసం ఉచిత బాలుర వసతి గృహాన్ని కూడా నిర్వహిస్తోంది. ఈ వసతి గృహంలో 5, 6, 7వ తరగతులలో ఉత్తీర్ణులై, ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన బాలురకు మాత్రమే ప్రవేశం లభిస్తుంది.

2015-16 విద్యా సంవత్సరానికి 6, 7, 8వ తరగతులలో ప్రవేశం పొందగోరేవారు అభ్యర్థనను పోస్టుకార్డు (లేదా) ఇ-మెయిల్ ద్వారా తమ పూర్తి చిరునామా, ఫోను/సెల్ నెంబరు తెలియజేస్తూ **2015 ఏప్రిల్ 15 వ తేదీ** లోగా క్రింది చిరునామాకు పంపాలి. ఎంపికైన విద్యార్థులు జూన్ 12వ తేదీన ఇక్కడకు వచ్చి వారం రోజులు వసతి గృహంలో ఉన్న తరువాత వారికి ప్రవేశ, మౌఖిక పరీక్షలు నిర్వహించబడతాయి.

6, 7, 8వ తరగతులలో ప్రవేశం పొందగోరేవారికి వరుసగా 5, 6, 7వ తరగతుల పాఠ్యాంశాలపై ప్రవేశ పరీక్ష ఉంటుంది. ఎంపిక అయిన విద్యార్థులకు సీతానగరం రామకృష్ణ మిషన్ ఉన్నత పాఠశాలలోనూ,బాలుర వసతి గృహంలోనూ ఉచిత ప్రవేశం కల్పించబడుతుంది. వసతి గృహంలో ప్రవేశంపై తుది నిర్ణయం రామకృష్ణ మిషన్, సీతానగరం యాజమాన్యం వారిదే.

స్వామి శశికాంతానంద
కార్యదర్శి

వివరాలకు: **రామకృష్ణ మిషన్**
సీతానగరం, తాడేపల్లి (పోస్ట్ & మండలం)
గుంటూరు జిల్లా - 522 501.
ఫోన్: 08645 - 272248, 272656
ఇ-మెయిల్: rkmvijay@gmail.com

వార్తావాహిని

జాతీయ యువజన దినోత్సవాలు

హైదరాబాద్ రామకృష్ణ మఠం, వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా 2015 జనవరి 8,9వ తేదీల్లో జాతీయ యువజన దినోత్సవాలను నిర్వహించింది.

జనవరి 8వ తేదీన జరిగిన సదస్సులో 1,600 మంది విద్యార్థులు; 9వ తేదీన జరిగిన సదస్సులో 1,900 మంది విద్యార్థినులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమాల్లో స్వామి జ్ఞానదానందజీ, స్వామి బోధమయానందజీ, వివిధ రంగాలకు చెందిన ప్రముఖ వ్యక్తులు, ప్రసిద్ధ వక్తలు పాల్గొని స్ఫూర్తిదాయక ప్రసంగాలిచ్చారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ❖

స్వామి వివేకానంద విగ్రహావిష్కరణ

నిజామాబాద్ జిల్లా **మంచిప్ప శ్రీరామకృష్ణ సేవాసమితి** హైదరాబాద్ రామకృష్ణ మఠం సహకారంతో 2015 జనవరి 30వ తేదీన మంచిప్ప గ్రామంలో స్వామి వివేకానంద విగ్రహావిష్కరణోత్సవం నిర్వహించింది.

ఈ కార్యక్రమంలో రామకృష్ణ మఠం స్వామీజీలు – స్వామి అనుపమానందజీ, స్వామి శితికంఠానందజీ, స్వామి భీతిహరానందజీ; నిజామాబాద్ ఎం.పి. శ్రీమతి కల్వకుంట్ల కవిత, నిజామాబాద్ (రూరల్) ఎం.ఎల్.ఏ. శ్రీ బాజిరెడ్డి గోవర్ధన్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ❖ నివేదిక : ఇందూరి సిద్ధారెడ్డి

Statement about ownership and other particulars about **Sri Ramakrishna Prabha** (according to Form IV Rule 8, circulated by Registrar of Newspapers for India).

1. Place of Publication : Hyderabad - 500 029
2. Periodicity of Publication : Monthly
3. Printer's Name : Swami Jnanadananda
   Nationality : Indian
   Address : Ramakrishna Math Domalguda Hyderabad-500 029
4. Publisher's Name : Swami Jnanadananda
   Nationality : Indian
   Address : Ramakrishna Math Domalguda, Hyderabad-500 029
5. Editor's Name : Swami Parijneyananda
   Nationality : Indian
   Address : Ramakrishna Math Domalguda,Hyderabad -29
6. Name & Address of the individuals who own the news or shareholder holding more than1% of the capital : Ramakrishna Math Domalguda Hyderabad-500029

I , Swami Jnanadananda, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date: 01.03.2015

Sd.
Swami Jnanadananda
Signature of the Publisher

Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020 and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**

Vol.72-3, Sri Ramakrishna Prabha (Telugu Monthly) March 2015, Regd. with the Registrar of Newspaper for India Under No.1120/57. Postal Registration No. HD-1071/2013-15. Licensed to Post Under WPP : AP/CPMG/HC-13/WPP/2015-16. Date of Publication : 16 February 2015

సాకారమైన స్వప్నగాథ!



ఒకరోజు అయోధ్యలో వసిస్తున్న ఒక రామభక్తుడు శ్రీరాముడు మరలా వంగదేశంలో అవతరించినట్లు స్వప్నం గాంచాడు. ఆ అవతారపురుషుణ్ణి దర్శించుకోవాలని అతడు వెంటనే కాలినడకన ప్రయాణం సాగించాడు. కొంతకాలానికి వంగదేశం చేరుకొని అక్కడ విచారణ చేయగా కలకత్తా సమీపంలో శ్రీరామకృష్ణ పరమహంస అనే మహాత్ముడున్నాడని తెలుసుకున్నాడు.

ఆ రామ భక్తుడు చివరికి కలకత్తాలోని దక్షిణేశ్వరం చేరుకొని శ్రీరామకృష్ణ పరమహంస గురించి వాకబు చేశాడు. ఆయన కొద్ది రోజుల క్రితమే మహాసమాధి చెందారని విన్నాడు. ఆ వార్త వినగానే అతడు దుఃఖంతో “ఎన్నోప్రయాసలకు ఓర్చి అయోధ్య నుండి ఇక్కడకు వచ్చింది ఈ వార్త వినడానికా?” అంటూ విలపిస్తూ, నిద్రాహారాలు మాని మూడు రోజులు అక్కడే ఉండిపోయాడు.

మూడవ రోజు రాత్రి సాక్షాత్తూ శ్రీరామకృష్ణులే అతడి ముందు ప్రత్యక్షమై ‘నాయనా! ఏమీ తినకుండా పస్తులుంటున్నావే! ఇదిగో నీ కోసం పాయసం తెచ్చాను, తిను’ అని ఆప్యాయతతో అతడికి తినిపించి అంతర్ధానమయ్యారు. అప్పుడు అతడు తన ఇష్టదైవమైన శ్రీరామచంద్రుడు, శ్రీరామకృష్ణుల రూపంలో దర్శనమిచ్చినందుకు ఆనందపరవశుడయ్యాడు. ❖

With Best Compliments From

పక్యాల భాస్కర రావు, మేనేజింగ్ డైరక్టర్ & **పక్యాల గిరిజ,** డైరక్టర్

SVISS LABSS LIMITED

(Manufacturers of Active Pharmaceutical Ingredients and Intermediates)

TÜV
TÜV CERT DIN EN ISO 9001 : 2000 Certificate : 01 100 058568

Regd. Off. & Fact. : Plot No.88 & 89, Phase - II,
SIPCOT Industrial Complex, Ranipet - 632 403, Tamil Nadu.
Phone : 04172 - 244820, 651507, Tele Fax : 04172 - 244820
E-mail : rao@svisslabss.net Web Site : www.svisslabss.net

SVISS LABSS కంపెనీ వారు ‘శ్రీరామకృష్ణ ప్రభ’ మాసపత్రికను 2,000 పాఠశాలలకు స్పాన్సర్ చేశారు.

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

ఏప్రిల్ 2015

₹10

శ్రీరామకృష్ణులు: సంసారమనేది దట్టమైన మేఘాలతో నిండి ఉన్న ఆకాశం లాంటిది. కామినీ కాంచనాలనే మేఘాలు సూర్యుణ్ణి కనిపించనివ్వవు. కామినీ కాంచనాలను త్యజించనిదే యోగం సిద్ధించదు. అజ్ఞానం, అవిద్యలు నశించేది త్యాగం చేసినప్పుడు మాత్రమే.

సంసారులు సుఖభోగాల నిమిత్తం నలువైపులా తిరుగుతుంటారు. అయితే వారికి అవి ఎక్కడా లభించవు. అలా తిరుగుతూ చివరకు వారు అలసిపోతారు. కామినీకాంచనాల పట్ల ఉన్న ఆసక్తి వలన వారు కేవలం దుఃఖాన్ని మాత్రమే పొందుతారు. అప్పుడు వారికి వైరాగ్యం కలుగుతుంది. త్యాగభావన జనిస్తుంది.

భగవంతుణ్ణి తెలుసుకోకుండా జీవించేవారు మట్టిగోడలతో కట్టిన ఇంట్లో నివసించేవారి లాంటివారు. మిణుకు మిణుకుమనే కొద్దిపాటి వెలుగులో వారు కేవలం ఇంటి లోపలి ప్రదేశాన్ని మాత్రమే చూడగలుగుతారు. కానీ జ్ఞానాన్ని సముపార్జించుకొని భగవంతుణ్ణి సాక్షాత్కరించుకొన్న తరువాత సంసారంలో జీవించేవారు అద్దాల మేడలో నివసించేవారి లాంటివారు. వారు ఇంటి లోపలా చూడగలరు, బయటి వస్తువులను కూడా చూడగలరు. ఏది మంచిది – ఏది చెడ్డది, ఏది నిత్యం – ఏది అనిత్యం అని ఎంతో స్పష్టంగా చూడగలరు.

చాలా మంది నన్ను ఇలా అడుగుతారు: 'మహాశయా! భగవంతుడు ఇటువంటి సంసారాన్ని ఎందుకు సృష్టించాడు? మేము తరించడానికి మాకు వేరే మార్గమేమీ లేదా?' వారితో నేను ఇలా అంటూంటాను: 'మార్గం లేకేం? అనుకూల పవనాలు వీచేలా, శుభయోగం ప్రాప్తించేలా భగవంతుణ్ణి శరణువేడండి; వ్యాకుల చిత్తంతో ఆయన్ని ప్రార్థించండి. ఆయన మీ ప్రార్థనలను విని తీరతాడు'. ❖

శ్రీరామకృష్ణ ప్రభ
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాదు–500 029
ఫోన్: 040–27667799, సెల్: 8801849494
E-mail : sriramakrishnaprabha@gmail.com
నిర్వాహక సంపాదకులు: స్వామి జ్ఞానదానంద సంపాదకులు: స్వామి పరిజ్ఞేయానంద

సురభి

నేను (స్వామి విరజానంద) 1892వ సంవత్సరంలో వరాహనగరం మఠంలో ఉన్నాను. శ్రీశారదాదేవి జయరామ్‌బాటీలో ఉన్నారు. ఆ సంవత్సరం అక్కడ జగద్ధాత్రి పూజ చేయ సంకల్పించారని తెలిసి, పూజకు కావలసిన వస్తువులన్నీ కొని, తీసుకొని వెళ్ళడానికి సన్నాహాలు చేస్తున్నారు శరత్ మహరాజ్. 'నువ్వు కూడా వస్తావా?' అని అడిగారు. కోరకుండానే అమ్మ దర్శన భాగ్యం కలుగుతున్నదన్న ఆనందంతో బయలుదేరాను.

శారదమ్మ, సన్న్యాసి సంతానం వస్తే వారికి ఏమి వండిపెట్టాలని సతమతమయ్యేవారు. ఆమె చేతి వంటకం ఏదైనా అమృతతుల్యమే. ఆ అద్భుతమైన రుచి ఇప్పటికీ మరచిపోలేను.

అమ్మమ్మ గారు (శారదాదేవి తల్లి-శ్యామసుందరీ దేవి) జీవించే ఉన్నారు. ఆమెది సరళ స్వభావం. రాత్రింబవళ్ళూ ఏదో ఒక పని చేసేవారు - పశువులకు మేత పెట్టడం, గొడ్లచావడి శుభ్రం చేయడం, పనివాళ్ళకు భోజనాలు పెట్టడం, ధాన్యం ఉడకబెట్టడం, దంచడం మొదలైనవి. ఎప్పుడూ నవ్వుముఖంతో ఉండేవారు. ఎవరి మీదా కోపం, చిరాకు చూపేవారు కాదు. అమ్మ ఆమెను ఎంతో ఆదరాభిమానాలతో చూసుకునేవారు. ఆమెకు అన్ని పనులలో సహాయం చేసేవారు. ఆమె వద్ద శ్రీరామకృష్ణుల సంగతులు ఎన్నో విన్నాం. ఆయన అల్లరి చేష్టలు, గ్రామంలో మహిళలతో హాస్యం, ఆయన పాడే పాటలు - అన్నీ విన్నాం.

ఒకనాడు జయరామ్‌బాటీకి ఒక బైరాగి వచ్చాడు. పార్వతీదేవి గురించి పాట పాడాడు: 'ఓ శివానీ! నీవు కాశీలో అన్నపూర్ణవట! నీ భర్త బిచ్చగాడట! దిగంబరుడట, పిచ్చివాడట'. అమ్మ జీవితాన్ని అక్షరాలా పోలి ఉంది అది. యోగీన్ మా మొదలైనవారు ఆ పాటను మళ్ళీ పాడించుకొన్నారు.

అప్పుడు అమ్మమ్మ ఇలా అన్నారు: "అవునర్రా! ఆ కాలంలో అందరూ అల్లుడిని (శ్రీరామకృష్ణులను) పిచ్చివాడు అనేవారు. శారదది దురదృష్ట జాతకం అనేవారు. నన్ను నానా మాటలూ అనేవారు. దుఃఖంతో రగిలిపోయేదాన్ని. ఇప్పుడు చూడండి... పెద్ద పెద్ద వంశస్థులు, శారదను 'దేవి' అంటూ పాదపూజలు చేస్తున్నారు!

జగద్ధాత్రి పూజ అయిన 3,4 దినాలకు మేమంతా మలేరియా జ్వరంతో పడుకున్నాం. అమ్మ బెంగకు అంతు లేదు. 'అయ్యో! పిల్లవాళ్ళకు జావ ఇద్దామంటే పాలు లేవే' అని వాపోయేవారు. మాకోసం ప్రతి ఇంటికీ వెళ్ళి పాలు అడిగేవారు.

జ్వరం తగ్గగానే అమ్మ అలౌకిక ప్రేమను నింపుకొని వరాహనగర మఠానికి తిరిగి వచ్చాను. ❖

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

సంపుటం: 72 సంచిక: 4 ఏప్రిల్ 2015

సంపత్కరాణి సకలేంద్రియ నందనాని
సామ్రాజ్య దాన నిరతాని సరోరుహాక్షి।
త్వద్వందనాని దురితా హరణోద్యతాని
మామేవ మాతరనిశం కలయంతు మాన్యే॥

కమల పత్రముల వంటి కన్నులు కలిగిన
పూజనీయురాలవైన ఓ తల్లీ! నీకు అర్పించిన నమస్కారములు
మాకు సంపదలు కలిగించునవి, సకలేంద్రియాలకు తృప్తిని కలిగించునవి,
సామ్రాజ్య వైభవమును కలిగించునవి, పాపములను హరింపజేయునవి.
ఓ తల్లీ! అవన్నీ నిరంతరం మాకు ప్రాప్తించుగాక! – *శ్రీకనకధారా స్తోత్రమ్*

సూక్తి సౌరభం

సోత్సాహానాం నాస్తి అసాధ్యం నరాణాం
మార్గారబ్ధాః సర్వయత్నాః ఫలన్తి।
కాష్ఠాదగ్నిః జాయతే మథ్యమానాత్
భూమిస్తోయం ఖన్యమానా దదాతి॥

"ఉత్సాహంతో పరిశ్రమించే మానవులకు ఏదీ అసాధ్యం కాదు. లక్ష్యసాధనకు చేసే సర్వయత్నాలూ ఫలిస్తాయి. కట్టెలకు రాపిడి కలిగిస్తేనే అగ్నిపుడుతుంది. కష్టించి తవ్వితేనే భూమి జలాన్ని ఇస్తుంది".

ధనలక్ష్మిని సేవించిన
ధనమార్జింపంగ వచ్చు ధర్మముగానే
ధనహీనులకు నొసంగెడు
ధనమే మూలంబు ముక్తిదారికి వేమా!

"ఓ వేమా! ధనదేవత అయిన లక్ష్మీదేవిని పూజించినట్లయితే ఆమె కృపతో ధర్మమార్గములో ధనాన్ని సంపాదించవచ్చు. ఆ ధనాన్ని పేదలకు దానం చేస్తే అదే ముక్తికి మార్గమవుతుంది."



శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి



ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'కి ధన దానం చేసి ప్రోత్సహించాల్సిందిగా కోరుతున్నాం. దాతల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు...... రూ. 10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజ పోషకులు............ రూ. 5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు................. రూ. 1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

	దాతపేరు / ఊరు	రూ.
మహారాజ పోషకులు :	శ్రీమతి ఎమ్. పి. ఎస్. మాధవి, బి.హెచ్.ఇ.ఎల్., మదీనాగూడ, హైదరాబాద్	10,000
రాజ పోషకులు :	శ్రీ యర్రగుంట్ల నాగేంద్ర మనోహర్,నల్లకుంట, హైదరాబాద్(కీ॥శే॥యర్రగుంట్ల వేంకట శేషగిరిరావుగారి జ్ఞాపకార్థం)	5,000
పోషకులు :	శ్రీమతి పి. దేవయాని, భవానీ నగర్, తిరుపతి, చిత్తూరు జిల్లా	1,116
పోషకులు :	శ్రీమతి గిడుతూరి మంగామణి, తుని, తూ॥గో॥జిల్లా (కీ॥శే॥గిడుతూరి బుల్లి అబ్బాయిగారి జ్ఞాపకార్థం)	1,116
పోషకులు :	శ్రీ కందుల వేంకటేశ్వర్లు & శ్రీమతి ఉషారాణి, వెంకటాపురం, ముదిగొండ, ఖమ్మం జిల్లా	1,011
పోషకులు :	శ్రీ బూరి గణేశ్వర రావు & శ్రీమతి విజయలక్ష్మి, మరిపివలస, సీతానగరం, విజయనగరం జిల్లా	1,000
పోషకులు :	శ్రీ బి. రమేష్, కర్నూలు	1,000
పోషకులు :	శ్రీలకిమిశెట్టి కాంతారావు, ఆదివారపు పేట, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా	1,000

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

యువతరానికి 'శ్రీరామకృష్ణ ప్రభ'ను మరింత చేరువ చేయాలని సంకల్పించాం. రాష్ట్రంలోని వివిధ పాఠశాలలు/ కళాశాలలు/ గ్రంథాలయాలకు పత్రికను పంపించడానికి మీ సహాయాన్ని కోరుతున్నాం. ఈ కానుక పథకం క్రింద చందా చెల్లించిన దాత పేరున (మీరు సూచించిన లేదా మేము ఎంపిక చేసిన) విద్యాసంస్థకు పత్రికను పంపుతాం. కానుక చందా రూ.1,500/- అంతకన్నా ఎక్కువ ఇచ్చిన దాత పేరు, విద్యాసంస్థ పేరు పత్రికలో ప్రచురిస్తాం.

దాత పేరు	విద్యాసంస్థ
శ్రీ ఇ.దేముడు&శ్రీమతి వరలక్ష్మి,బి.హెచ్.ఇ.ఎల్.టౌన్‌షిప్,విశాఖపట్నం(కీ॥శే॥ కొట్యాడ విజయగారి జ్ఞాపకార్థం)	ప్రధానాచార్యులు, ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉన్నత పాఠశాల, వాల్తేరు, విశాఖపట్నం
శ్రీ కె.ఆర్.కె.హరనాథ బాబా,తాటిపాక,తూ॥గో॥జిల్లా(తండ్రి కీ॥శే॥కట్టా సూరన్న మాష్టరుగారి జ్ఞాపకార్థం)	ప్రధానాచార్యులు, ఎం.పి.పి.ప్రాథమిక పాఠశాల,తాటిపాక,రాజోలు,తూ॥గో॥ జిల్లా
శ్రీ ఎస్.ఆనందం, రెడ్డి కాలనీ,హనుమకొండ (తల్లితండ్రులు కీ॥శే॥సిరికొండ ఆగమ్మ&నారాయణగార్ల జ్ఞాపకార్థం)	కరీంనగర్ జిల్లాలోని మూడు ప్రభుత్వ పాఠశాలలకు జీవిత చందాను స్పాన్సర్ చేశారు.
శ్రీ గొట్లూరు రామచంద్రరావు(విశ్రాంత ప్రధానోపాధ్యాయులు), అనంతపురం	ప్రధానాచార్యులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, హేమవతి, అనంతపురం జిల్లా
శ్రీ విజయ్ శ్రీనివాస్ విట్టలం	11 విద్యాసంస్థలకు పత్రికను ఒక సంవత్సరానికి స్పాన్సర్ చేశారు
డా॥జి.ప్రసాద్,ఎన్.జి.ఓ.కాలనీ,కె.టి.రోడ్డు,తిరుపతి,చిత్తూరు జిల్లా	ప్రధానాచార్యులు,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,కొండుపల్లి,కర్నూలు జిల్లా
చి॥ కందాళం అభివంద్యన్,మియాపూర్,హైదరాబాద్ (కీ॥శే॥కందాళం కృష్ణమాచార్లు&సుందరమ్మగార్ల జ్ఞాపకార్థం)	లైబ్రేరియన్, ఉస్మానియా విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల, హైదరాబాద్
శ్రీ మలిశెట్టి జానకిరామ్,రవీంద్ర నగర్,కడప (కీ॥శే॥మలిశెట్టి సాలమ్మగారి జ్ఞాపకార్థం)	శ్రీరామాంజనేయ భక్తమండలి, రామాలయం, రవీంద్ర నగర్, కడప
శ్రీ కుర్రి రామ సుబ్బారావు,రాజ్ భవన్,హైదరాబాద్	ప్రకాశం జిల్లాలోని రెండు విద్యాసంస్థలకు జీవిత చందాను స్పాన్సర్ చేశారు
శ్రీ డి.ప్రవీణ్ కుమార్,మాదన్నపేట,సైదాబాద్,హైదరాబాద్	ప్రధానాచార్యులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లక్ష్మణచంద, ఆదిలాబాద్ జిల్లా

With Best compliments from: **Nirmala N Dhepe (in memory of Shri Sadanand V Kasargod.) ECIL, Hyderabad-62**
'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 1,000 విద్యాసంస్థలకు ఒక సంవత్సరానికి చందా చెల్లించారు.

ముఖచిత్రం: ఆది శంకరాచార్యులు బాల్యంలో భిక్షాటనకు వెళ్ళినప్పుడు ఒక నిరుపేదరాలు ఓ ఉసిరికాయను భిక్షగా ఇచ్చింది. ఆమె దుఃస్థితిని చూసిన బాల శంకరులు ఆమె దారిద్ర్యాన్ని రూపుమాపమని లక్ష్మీదేవిని స్తుతించారు. వెంటనే ఆమె ఇంట బంగారు ఉసిరికాయల వర్షం కురిసింది. ఆ స్తోత్రమే 'కనకధారా స్తోత్రం'గా ప్రఖ్యాతి గాంచింది. *చిత్రకారుడు : మణియన్ సెల్వమ్, చెన్నై.*

చందా వివరాలు		భారతదేశంలో	విదేశాలకు
విడి ప్రతి	:	₹ 10	-
సంవత్సర చందా	:	₹ 100	₹ 1,500
మూడు సంవత్సరాలకు	:	₹ 280	₹ 4,500
ఐదు సంవత్సరాలకు	:	₹ 450	₹ 7,500
ఇరవై సంవత్సరాలకు	:	₹ 1,500	₹ 22,000

గమనిక: డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో **Ramakrishna Math, Hyderabad** అని వ్రాయాలి.

పంపవలసిన చిరునామా: **Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.**

చందాను ఆన్‌లైన్ **http://rkmath.org/srkp** ద్వారా చెల్లించవచ్చు.

లోపలి పేజీల్లో...

6 సంపాదకీయం
హృదయ క్షేత్రంలో నిజరూప దర్శనం

8 భగవత్పాదుల భక్తితత్పరత

9 అవతార పురుషుని అరుదైన ప్రయాణం

10 పలికెడిది భాగవతం
తెరపి లేదు రాత్రిందివములే!

12 మన సంస్కృతి
విదేశాలలో భారతీయ సంస్కృతి

15 నిగమ నిగమాంత వర్ణిత...

16 పరిప్రశ్న

17 రామకృష్ణ భక్తి సూత్రాలు

18 ప్రార్థనే పరమార్థంగా...

19 మహాపురుషుని సాన్నిధ్య స్మృతులు

20 ముందు జన్మకు పెట్టుబడి

21 ధీరవాణి
పరహితానికై పాటుపడండి!

22 అశేష విశేషాల అక్షయ తృతీయ

24 ప్రయాణ ప్రయాస

26 సంయమనంతో సానుకూలత

27 యువవాణి
మితమే హితం!

28 వాదాలు వివాదాలు

30 అజ్ఞాత ఆశాజ్యోతి

31 ముందుకు సాగిపో!

35 వికాస మంత్రాలు

36 భగవద్గీత – సద్గుణ సుధ
కార్యసాధనకు ఓ షరతు!

37 జీవనోద్యానంలో మానవతా పరిమళాలు
దేహమున్న విదేహి! / చదువు ఎంతవరకు?

38 బొమ్మల కథ
రామానుజుల వైభవం

ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు. – సంపాదకులు

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు మీద చిరునామాకు పైన మీ చందా నంబరు, కుడి వైపున మీ చందా గడువు ముగిసే నెల ఉంటాయి. మీ చందా గడువు పూర్తయ్యే నెలకు ముందుగానే సొమ్మును చెల్లించి చందాను పునరుద్ధరించుకోండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారిన పక్షంలో 7వ తేదీ లోగా మాకు తెలియపరచినట్లయితే, వచ్చే నెల సంచిక నుండి మీ కొత్త చిరునామాకు పంపబడును.
- ప్రతీ నెల 26 లేదా 27వ తేదీల్లో పత్రిక పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపుగా చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ.... – సర్క్యులేషన్ మేనేజర్

KCP CEMENT
CONCRETE CEMENT
Since 1958

With Best Compliments From
CHAIRMAN & MANAGING DIRECTOR
THE KCP LIMITED
KCP కంపెనీ వారు "శ్రీరామకృష్ణ ప్రభ" మాసపత్రికను
1000 గ్రంథాలయాలకు స్పాన్సర్ చేశారు

KCP Sreshtaa CEMENT
THE NEW GENERATION CEMENT

Cement Marketing Division : Plot No. 10, Gayatri Hills, MP & MLA's Colony, Road No. 10 C, Jubilee Hills, HYDERABAD - 500033.
Tel : 040-2325 3503 to 505, Fax : 2325 3500, Cell : +91 99895 97775 / 9866305145, E-mail : ramakrishna.k@kcp.co.in
Registered Office : No. 2, Dr.P.V.Cherian Crescent, Egmore, CHENNAI - 600 008. Tel : 044 66772668, Fax: 044 66772620, CIN L65991TN1941PLC001128



హృదయ క్షేత్రంలో నిజరూప దర్శనం

భగవంతుడు ఆగ్రహిస్తే ఈ సృష్టిలో ఏ శక్తీ రక్షించలేదు. భగవంతుడు అనుగ్రహిస్తే ఈ సృష్టిలో ఏ శక్తీ శిక్షించలేదు – ఈ పరమసత్యాన్ని సుస్పష్టం చేసేది హిరణ్యకశిపుడు, ప్రహ్లాదుల చరితం. అయితే ఈ చరాచర సృష్టిలోని సర్వ జీవరాశులూ భగవంతునిచే సృజింపబడినప్పుడు, సర్వజీవులూ ఆయన సంతానమే అయినప్పుడు భగవంతుడు ఒకరిని శిక్షించడం, మరొకరిని రక్షించడం ఎందుకు? సకల జీవకోటినీ సమదృష్టితో చూడవలసిన ఆ పరమాత్మునికి ఈ పక్షపాత వైఖరి ఎందుకు? నిజానికి, సర్వజీవుల పట్ల భగవంతుడు చూపే ప్రేమలో భేదం లేదు. కానీ ప్రేమను చూపే ప్రక్రియలో భేదముంది. అంతే! ఎలాగంటే ఆసురీగుణాలున్న హిరణ్యకశిపుడి లాంటి వారిని శిక్షించి అనుగ్రహిస్తాడు; దైవీగుణాలున్న ప్రహ్లాదుడి లాంటి వారిని రక్షించి అనుగ్రహిస్తాడు. అనుసరించే మార్గమేదైనా అందరినీ ఉద్ధరించడమే పరమాత్ముని ఉద్దేశం.

మానవుడిగా పుట్టి దానవుల కన్నా హీనంగా జీవిస్తున్న వారికి, దానవునిగా పుట్టి పరమ భాగవతోత్తమునిగా జీవించడమెలాగో చూపిస్తుంది ప్రహ్లాదుని జీవితం. అధికారమదంతో మత్తెక్కి విపరీత బుద్ధులతో వ్యవహరించే వారి జీవితం ఎలా వినాశనమవుతుందో నిరూపిస్తుంది హిరణ్యకశిపుని జీవితం. భగవంతుని సర్వజ్ఞత్వం ముందు మానవుని మేధ అల్పమనీ; భగవంతునిచే సృష్టింపబడినవాడే మితిమీరిన తెలివితేటలను ప్రదర్శిస్తే, ఇక అతణ్ణి సృష్టించిన వాడు ఇంకెన్ని తెలివితేటల్ని ప్రదర్శించగలడో నిరూపిస్తుంది నరసింహావతారం. భగవంతుని సర్వజ్ఞత్వాన్నీ, సర్వశక్తిమంతత్వాన్నీ, సర్వవ్యాపకత్వాన్నీ నిరూపించే అవతారం 'నరసింహావతారం'.

హృదయమే సింహాచలం: శ్రీహరి ఉగ్రనరసింహునిగా అవతరించి హిరణ్యకశిపుని వధించాడు. నరసింహుని ఉగ్రరూపాన్ని ప్రహ్లాదుడు శాంతింపజేశాడు. ప్రహ్లాదుని కోరిక మేరకు హిరణ్యాక్షుణ్ణి వధించిన వరాహ రూపంతోనూ, హిరణ్యకశిపుణ్ణి వధించిన నరసింహ రూపంతోనూ కలసి వరాహ నరసింహునిగా సింహాచలంపై కొలువు తీరి ఉన్నాడు. ప్రహ్లాదుడు నిర్మించిన ఈ దేవాలయాన్ని, పురూరవ చక్రవర్తి పునరుద్ధరించాడనీ; శ్రీవరాహ లక్ష్మీనరసింహునిగా బ్రహ్మాదిదేవతలతో అర్చనలను అందుకుంటున్నాడనీ; స్వామి ఆదేశం ప్రకారం మూలవిరాట్టుకి చందనపూత వేయడం జరుగుతుందనీ స్కాంద పురాణంలోని 'శ్రీసింహాచల క్షేత్ర మాహాత్మ్యం' తెలుపుతోంది. ప్రతీ సంవత్సరం వైశాఖ శుద్ధ తదియ (అక్షయ తృతీయ) నాడు చందనపూతను తొలగిస్తారు. ఈ చందనోత్సవం జరిగిన ఒక్కరోజే స్వామివారి నిజరూప దర్శనం లభిస్తుంది.

మనం నిత్యం ఆ పరమాత్ముని నిజరూప దర్శనాన్ని పొందాలంటే ఏం చేయాలి? పోలీసును చూసి దొంగ భయపడతాడు. కానీ పోలీస్ యూనిఫామ్‌లో ఉన్న తండ్రిని చూసిన కుమారుడు మాత్రం భయపడడు. అదేవిధంగా అసురగుణాలున్న హిరణ్యకశిపుడు నరసింహుని ఉగ్రరూపాన్ని చూసి భయకంపితుడయ్యాడు. కానీ దైవీగుణ సంపన్నుడైన ప్రహ్లాదుడు మాత్రం భయపడకుండా స్వామి ఒడిలో కూర్చోగలిగాడు. జగత్పిత అయిన భగవంతుడు మన సంరక్షకుడనే భక్తి భావన కలిగిన భక్తుడు భయపడడు. అందుకు సాధనతో మన హృదయ క్షేత్రాన్ని పవిత్ర సింహాచల క్షేత్రంగా మలచుకోవాలి.

ఇంతకీ ఈ ప్రహ్లాద, హిరణ్యకశిపులు ఎక్కడ ఉన్నారు? వీరిద్దరి నివాసస్థానం మన మనస్సే! మన మనస్సులో దైవీగుణాలు ప్రభవిల్లితే ఉద్ధరింపబడతాం; ఆసురీగుణాలు ప్రజ్వరిల్లితే పతనమవుతాం. నరసింహుని ఉగ్రరూపాన్ని చూసి భయకంపితుడైన హిరణ్యకశిపునిలా కాకుండా, ప్రహ్లాదునిలా ప్రశాంతంగా స్వామి నిజరూపాన్ని దర్శించాలంటే మనం అలవర్చుకోవాల్సిన లక్షణాలేమిటో పరిశీలిద్దాం:

ద్వంద్వ వైఖరి దానవ లక్షణం: శ్రీహరి వరాహావతారమెత్తి హిరణ్యకశిపుడి తమ్ముడైన హిరణ్యాక్షుణ్ణి వధించాడు. ఈ వార్త విన్న హిరణ్యాక్షుని భార్య ఉపదానవి, తల్లి దితి విలపిస్తుంటే హిరణ్యకశిపుడు వారిని ఓదారుస్తూ 'తల్లి, తండ్రి, భార్య, పుత్రులు... ఈ భవబంధాలన్నీ భ్రాంతియే! ఈ దేహం మరణించినా దేహి మాత్రం శాశ్వతం. సృష్టి స్థితి లయాలకు కారణభూతుడైన భగవంతుణ్ణి తెలుసుకోవాలి' అని వేదాంతసారాన్ని నూరిపోశాడు.

ఈ భువిపై ఎవరూ శాశ్వతం కాదని బోధించిన హిరణ్యకశిపుడు కఠోర తపస్సు చేసి, బ్రహ్మ ప్రత్యక్షమైతే 'ఓ దేవా! నీచే సృజించబడిన జీవుల వల్ల నాకు మరణం లేకుండా చేయి' అని వరాన్ని కోరాడు.

ప్రహ్లాదుడు నిత్యం శ్రీహరి నామస్మరణలో తన్మయుడై ఉండేవాడు. శ్రీహరి పాదాలను ఆశ్రయించినవారే శాశ్వతానందాన్ని పొందగలరని విశ్వసించాడు. ప్రహ్లాదుడు తింటున్నా, తిరుగుతున్నా, నిద్రిస్తున్నా, మాట్లాడుతున్నా నిరంతరం శ్రీహరి పాదపద్మాల చింతనామృతాన్ని గ్రోలుతూ ఉండేవాడు. తండ్రి హిరణ్యకశిపుని అకృత్యాలను చూసిన ప్రహ్లాదుడు "తండ్రీ! 'నేను, నా వారు' అనే అజ్ఞానచీకటిలో అలమటిస్తూ అంతఃపురంలో జీవించడం కన్నా, సమస్త సృష్టికి ఆధారభూతుడైన ఆ శ్రీహరిని స్మరిస్తూ అరణ్యాలలో చరించడమే ఉత్తమం" అని నిజతత్త్వాన్ని బోధించాడు.

ప్రహ్లాదుడు తన మనస్సులోని మాటనే చెప్పాడు, తాను ఆచరించిన దాన్నే విశదపరిచాడు. అంతేకానీ హిరణ్యకశిపునిలా ఆలోచన ఒకటి, ఆచరణ మరొకటి కాదు. ద్వంద్వ వైఖరిని వదలి, మాట-మనస్సు; ఆలోచన-ఆచరణ ఏకమయ్యేలా జీవించాలి. అప్పుడు మనలోని హిరణ్యకశిపుడు నశించి, ప్రహ్లాదుడు ఉద్భవిస్తాడు. అందుకే యోగివేమన ద్వంద్వ వైఖరితో వ్యవహరించేవారు లోకంలో అందరినీ మెప్పించవచ్చేమో గానీ, ఆ పరమాత్ముడిని ప్రసన్నం చేసుకోవడం సాధ్యం కాదంటూ '*మాటలాడు నొకటి మనసులోన నొకటి, ఒడలి గుణము వేరె యోచ వేరె, ఎట్టుగల్గు ముక్తి యీలాగు తాముండ*' అని అంటాడు.

అధికారమదంతో అనర్థం: హిరణ్యకశిపుడు తన అతి తెలివితేటల్ని ఉపయోగించి మరణం లేకుండా వరాన్ని ప్రసాదించమని బ్రహ్మను కోరుతూ "ప్రభూ! గాలిలో గానీ, భూమి మీద గానీ; నీళ్ళలో గానీ, ఆకాశంలో గానీ; రాత్రి గానీ, పగలు గానీ; చీకటిలో గానీ, వెలుగులో గానీ; రాక్షసుల చేతగానీ, జలచరముల చేతగానీ; క్రూరమృగముల చేతగానీ, సర్పముల చేతగానీ; దేవమనుష్యాదుల చేతగానీ, అస్త్రశస్త్రాలతో గానీ నాకు మరణం సంభవించకుండా అనుగ్రహింపుము" అని నిబంధనలను విధించాడు. బ్రహ్మ అనుగ్రహం పొందిన హిరణ్యకశిపుడు తనకు మరణం లేదని విర్రవీగాడు. ముల్లోకాలనూ స్వాధీనపరచుకొని ఇంద్రాది దేవతలను, నారదాది మహర్షులను సైతం సేవకులుగా చేసుకున్నాడు. ముల్లోకాలకూ అధిపతిననీ, అందరూ తననే ఆరాధించాల్సిందిగా ఆజ్ఞాపించాడు.

అధికార గర్వంతో అంధునిలా ప్రవర్తిస్తున్న హిరణ్యకశిపునితో ప్రహ్లాదుడు "తండ్రీ! సర్వలోకాధిపతి ఆ శ్రీహరే. ఆ నారాయణుడి సాన్నిధ్యం పొందడమే ఈ మానవజన్మ పరమార్థం. ఆ శ్రీహరి చింతన చేయనివాడు పశుసమానుడు" అని అంటాడు. కానీ హిరణ్యకశిపుడు సర్వశక్తిమంతుడైన ఆ శ్రీహరిని మరచి అధికారమదంతో విర్రవీగినందువల్ల నాశనమయ్యాడు. ఆ శ్రీహరియే శరణని నమ్మిన ప్రహ్లాదుడు, ఎన్ని విధాలుగా శిక్షింపబడినా రక్షింపబడ్డాడు.

శుద్ధి లేని సాధనలు పతన హేతువులు: మనం చేసే సాధనలో లక్ష్యశుద్ధి లేకపోతే పతనం తప్పదు. హిరణ్యకశిపుడు సాధనా ఫలాన్ని స్వార్థప్రయోజనాల కోసం, పరహింస కోసం వినియోగించి పతనమయ్యాడు. ఈ చరాచర సృష్టిలో తనకు మరణం లేకుండా అన్నివిధాలా జాగ్రత్తలు తీసుకొన్న హిరణ్యకశిపుడు, ఆ శ్రీమన్నారాయణుడి సర్వజ్ఞత్వాన్నీ, సర్వశక్తి మంతత్వాన్నీ, సర్వవ్యాపకత్వాన్నీ మరచిపోయాడు. సర్వాంతర్యామి అయిన ఆ సర్వేశ్వరుడు స్తంభం నుండి బయటకు వచ్చి 'ఇంట్లో కాదు బయట కాదు - మధ్య గడప మీద; ఆకాశంలో కాదు, భూమి మీద కాదు - తొడల మీద; మనిషి కాదు, జంతువు కాదు - నరసింహ రూపంలో; అస్త్రం కాదు, శస్త్రం కాదు-గోళ్ళతో; రాత్రి కాదు, పగలు కాదు- సంధ్యా సమయంలో...' ఇలా హిరణ్యకశిపుడు విధించిన నిబంధనలను ఉల్లంఘించకుండా అతణ్ణి వధించాడు శ్రీహరి. మనం చేసే జప తప సాధనల వల్ల పరిశుద్ధమైన హృదయక్షేత్రంలోనే పరమాత్ముడు ప్రతిష్ఠితుడవుతాడు. అంతేగానీ స్వార్థ బుద్ధితో చేసే సాధనలు సత్ఫలితాలనివ్వవు, భగవంతుణ్ణి ప్రసన్నం చేయవు.

మనం కూడా ఉగ్రనరసింహుని నిజరూపాన్ని చూసి హిరణ్యకశిపునిలా భీతిల్లకుండా, ప్రహ్లాదునిలా ప్రశాంతంగా స్వామిని దర్శించగలగాలంటే మనలో ద్వంద్వ వైఖరి పోయి సంకల్పం, సాధన ఒకటి కావాలి; సర్వజ్ఞులమనే అహంకారం వీడి అణకువతో, శరణాగతి భావంతో సాధన చేయాలి; సాధనలు భగవల్లాభం కోసమే అన్న లక్ష్యశుద్ధిని కలిగివుండాలి; అలాగే కామ క్రోధ లోభ మద మోహాలనే అజ్ఞానపుపొరలు తొలగినప్పుడే మనలోనే ప్రతిష్ఠితుడై ఉన్న ఆ పరమాత్ముని నిజరూప దర్శనం సాధ్యమవుతుందని గ్రహించాలి. అందుకు ఆ శ్రీవరాహ లక్ష్మీనరసింహస్వామి మనల్ని అనుగ్రహించి, మన హృదయ క్షేత్రంలో స్వామి నిజరూప దర్శనభాగ్యాన్ని ప్రసాదించాల్సిందిగా ప్రార్థిద్దాం. ❖

సకల వస్తువులూ బ్రహ్మంచే పరివ్యాప్తమై ఉన్నవి. సకల కర్మలూ బ్రహ్మం వలననే కలుగుచున్నవి. కనుక వెన్న పాలలో వ్యాపించి ఉన్నట్లు బ్రహ్మం సర్వత్రా వ్యాపించి ఉన్నది. - *ఆది శంకరాచార్యులు*

భగవత్పాదుల భక్తితత్పరత

– బ్రహ్మచారి రవి

ఒక పరమ భక్తురాలు ప్రతి దినమూ మాణిక్య కాత్యాయనీ ఆలయానికి వెళ్ళి అర్చనలు చేస్తూ ఉండేది. ఒకరోజు అనారోగ్య కారణంగా గుడికి వెళ్ళే ఓపిక లేక ఆమె తన ఐదేళ్ళ కుమారుణ్ణి గుడికి పంపింది. తల్లి మాటను శిరసావహించి ఆ బాలుడు ఎంతో భక్తితో పూలను సేకరించి, తల్లి ఇచ్చిన నైవేద్యాన్ని తీసుకొని ఆలయానికి వెళ్ళి అమ్మవారికి సమర్పించాడు. కానీ ఆ బాలుడు సమర్పించిన నైవేద్యంలోని పాలన్నీ అలాగే ఉన్నాయి. దాంతో ఆ బాలుడు నిరాశ చెంది 'అమ్మా! భవానీ! రా!' అని ఎంతోసేపు విలపించాడు. మొండిగా తలను పీఠంకేసి బాదుకో సాగాడు. రక్తం కూడా కారసాగింది. కైలాసంలో అమ్మవారి పీఠం కదలసాగింది. అమాయకమైన ఆ బాలుని భక్తికి అమ్మ ముగ్ధురాలై, అభయహస్తంతో ప్రత్యక్షమై, పాలు తాగి, ప్రేమతో తాను మిగిల్చిన పాలను ఆ బాలుడికి ఇచ్చింది. అలా చిన్నతనంలోనే మృణ్మయరూపంలో ఉన్న దేవిని చిన్మయరూపంగా సాక్షాత్కరింపచేసుకున్న ఆ బాలభక్తుడు మరెవరో కాదు, జగద్గురువు ఆదిశంకరాచార్యులు.

అమ్మ అనుగ్రహంతో... : దేవతామూర్తి ఇచ్చిన పాలను తాగిన శంకరులు ఒకానొక దివ్య రసాయనం ఏదో దేహం, హృదయం, శిరస్సూ అంతా పాకి అమృతస్నానం చేయించి నట్లుగా, చెప్పరాని అనుభూతికి లోనయ్యాడు. తన బాహ్యాంతరాల్లో అమ్మ భవానీయే ఉన్నట్లు అనుభూతి చెందారు. అమ్మవారి స్థూలరూపం, సూక్ష్మరూపం, విరాట్‌రూపం, మంత్రరూపం, యంత్రరూపం, నూటా ఎనిమిది స్వరూపాలు, అష్టాదశ శక్తిపీఠాలు, శ్రీచక్రస్వరూపం, శివశక్తిమయమైన అమ్మవారి వివిధ శక్తి స్వరూపిణులు, యోగినీ గణాలు... ఒకటేమిటి సర్వం, సర్వచరాచరసృష్టి అంతా భవానీమాతగా భాసిస్తోంది. వ్యాకరణం, అష్టాదశవిద్యలు, చతుష్షష్టికళలను గురుబోధ చేస్తున్నట్లుగా ఒకే వాణి వినపడుతోంది. తరువాత జగన్మాత కోటి వెన్నెలలు కురిసినట్లు నవ్వి, దీవించి అంతర్ధానమైంది. ఇలా ఆదిశంకరులు చిన్నవయస్సులోనే అమ్మ అనుగ్రహానికి పాత్రులయ్యారు, కనుకనే సర్వవేదాలు ఆయనకు కరతలామలకాలు! గురుకులవాసంలో ప్రవేశించి గురుసన్నిధిలో షడంగాలతో సహా చతుర్వేదాలను అధ్యయనం చేశారు.

ఉగ్రమూర్తులను శాంతమూర్తులుగా...: ఆ రోజుల్లో దేవాలయాల్లో దేవతా పీఠాల కింద ఉగ్రబీజ యంత్రాలను ప్రతిష్ఠించడం వల్ల దేవతామూర్తులు ఉగ్రస్వరూపిణులుగా ఉండేవారు. దీంతో ప్రజలు అమ్మవారి గుళ్ళకు వెళ్ళడానికి భయపడేవారు. ఆదిశంకరులు ఈ విషయం గుర్తించి, ఎక్కడెక్కడ అటువంటి యంత్రాలున్నాయో వాటిని తొలగించి, శాంతి బీజాక్షర యంత్రాలను ప్రతిష్ఠింప చేసి శాంతస్వరూపిణులుగా మార్చారు.

ఈ పరంపరలో బెజవాడ కనకదుర్గాదేవిని కూడా శ్రీశంకరులు శాంత స్వరూపిణిగా మార్చారు. దుర్గాదేవి మహిషాసుర సంహారానంతరం, అదే స్వరూపంతో ఇక్కడ స్వయంభువుగా వెలసింది. ఆనాటి భక్తులంతా దేవికి వామాచార పద్ధతిలో జంతుబలులు నివేదించి పూజలు చేయడం వల్ల ఇక్కడి అమ్మవారు మరింత ఉగ్రరూపాన్ని ధరించింది. దానివల్ల పూజలో ఏ చిన్న తప్పు జరిగినా, పట్టణంలో ఉపద్రవం సంభవించేది. ఈ దుస్థితిని గమనించిన జగద్గురువులు అమ్మవారిని భక్తితో వేడుకొని శాంత స్వరూపిణిగా మార్చారు. అప్పటి నుండి కనకదుర్గ కరుణామయిగా మారింది. అలాగే మదురై మీనాక్షినీ, కంచి కామాక్షి అమ్మవారినీ, జంబుకేశ్వరంలో ఉన్న అఖిలాండేశ్వరి దేవినీ శాంత స్వరూపిణులుగా మార్చి, అమ్మవారిని సాధారణ భక్తులకు చేరువ చేసి, తమ భక్తి తత్పరతను చాటుకొన్నారు. ఆనాడు లోకక్షేమం కోసం హాలాహలాన్ని మింగిన పరమేశ్వరులే తిరిగి లోక కల్యాణం కోసం, మానవాళి మనుగడ కోసం, శాంతి స్థాపన కోసం శంకర భగవత్పాదులుగా అవతరించి, మానవుల మనస్సుల్లో భక్తిబీజాలను నాటారు.

ఆదిశంకరులను స్మరించగానే ఎవరికైనా అద్వైతం స్ఫురిస్తుంది. అద్వైతమంటే శంకరాద్వైతమని వేరే చెప్పనక్కరలేదు. శంకరనామానికి అద్వైత తత్త్వానికి అంతటి అవినాభావ సంబంధం! భగవత్పాదులు నిర్గుణవాదులే అయినా, భక్తి విరుద్ధులు కారు; సగుణారాధననూ అంగీకరించారు; తమలోని భక్తికోణాన్నీ ఆవిష్కరింపచేశారు. 'వివేక చూడామణి'లో 'మోక్షసాధన సామాగ్ర్యాం భక్తిరేవ గరీయసీ – మోక్షసాధనకు భక్తియే శ్రేష్ఠమైనది'అని స్పష్టం చేశారు. ❖

(ఏప్రిల్ 23వ తేదీన ఆదిశంకరాచార్య జయంతి)

అవతార పురుషుని అరుదైన ప్రయాణం

– మహేందర్ మొలుమూరి

భగవాన్ శ్రీరామకృష్ణుల అవతార కాలంలోనే బ్రిటీష్ ప్రభుత్వం ప్రప్రథమంగా భారతదేశంలో రైళ్ళను ప్రవేశపెట్టడం విశేషం. యాదృచ్ఛికంగా మొట్టమొదటి రైలును కలకత్తా నుంచి హుగ్లీ వరకు నడపాలని ఆంగ్లేయ అధికారులు తలచారు. కానీ సాంకేతిక అవాంతరాల వల్ల ఆ ప్రయత్నాన్ని విరమించుకొని, 1853 ఏప్రిల్ 16న ముంబయి నుంచి థానే వరకు ప్రథమంగా పట్టాలపై రైలును పరుగులు తీయించారు. ఆ తరువాత కొన్నాళ్ళకు కలకత్తా నుంచి రైళ్ళ రాకపోకలను ప్రారంభించారు. అయితే భగవాన్ శ్రీరామకృష్ణులు తమ తీర్థయాత్రలో భాగంగా తొలిసారిగా 1868 జనవరి 27న రైలులో ప్రయాణించారు.

కరుణామూర్తి కాశీయాత్ర: గృహస్థ భక్తుడైన మథుర్‌బాబు విన్నపం మేరకు గురుదేవులు దక్షిణేశ్వరం వదలి కాశీయాత్రకు రైలులో బయలుదేరారు. మథుర్‌బాబు కుటుంబంతో కలసి దాదాపు నూటా ఇరవై మంది శ్రీరామకృష్ణుల వెంట ఆ ప్రయాణంలో భాగస్వాములయ్యారు. మథుర్‌బాబు వంటవారికీ, పరిచారకులకూ, పరిచారికలకూ, కావలివారికీ మూడు మూడోతరగతి రైలు పెట్టెలు కేటాయించారు. గురుదేవులు, వారి మేనల్లుడు హృదయ్‌రామ్ ముఖోపాధ్యాయ్, తనకూ, తన కుటుంబసభ్యులకూ సకల ఏర్పాట్లతో కూడిన రెండో తరగతి పెట్టెను కుదుర్చుకున్నారు. ఈ ప్రయాణానికి మథుర్‌బాబు దాదాపు లక్ష రూపాయలు ఖర్చుచేశారు.

మరపురాని మజిలీ...: తొలి మజిలీగా శివాలయ దర్శనానికి రైలు బీహార్‌లోని వైద్యనాథ్ చేరుకుంది. రైలు దిగగానే అక్కడి పేదప్రజల, పీడితుల కష్టాలను చూసి శ్రీరామకృష్ణుల కళ్ళు ధారాపాతంగా కురవసాగాయి. ఈ గ్రామ ప్రజలకు సాయం చేయనిదే ఇక్కడి నుంచి కదలనని వారు పట్టుబట్టారు. 'దీనావస్థలో ఉన్న ఈ గ్రామీణుల్లో ప్రతి ఒక్కరికీ వస్త్రాలు, భోజనం, తలకు నూనె ఇప్పించే వరకు నేను కాశీకి రాను. వీళ్ళతో ఇక్కడే ఉండిపోతాను' అని మథుర్‌బాబు ముందు భీష్మించుకు కూర్చున్నారు. మథుర్‌బాబు గురుదేవులు కోరినట్లు ఆ గ్రామస్థుల అవసరాలన్నీ తీర్చి, శ్రీరామకృష్ణులతో తిరిగి కాశీ ప్రయాణాన్ని కొనసాగించారు.

ఎక్కేలోపే కదిలిన రైలు...: ప్రయాణ సమయాల్లో మనం కొన్నిసార్లు రైలును అందుకోలేకపోవడమో, మధ్యలో దిగి ఎక్కేలోపే రైలు కదిలిపోవడమో పరిపాటి. అందుకు అవతార పురుషులైన శ్రీరామకృష్ణులూ మినహాయింపు కాదనిపించే సంఘటన ఈ ప్రయాణంలో సంభవించింది. కాశీ సమీపంలో మొఘల్‌సరాయ్ స్టేషన్‌లో శ్రీరామకృష్ణులు, హృదయ్ అనుకోకుండా రైలు దిగారు. వాళ్ళు తిరిగి రైలు ఎక్కేలోపే రైలు కదిలివెళ్ళిపోయింది. మథుర్‌బాబు రైలును ఆపించడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. బాధతో ఆయన కాశీ చేరుకున్నారు. మరుసటి రైలులో శ్రీరామకృష్ణులను, హృదయ్‌ను పంపించమని మొఘల్‌సరాయ్ స్టేషన్ మాస్టర్‌కు మథుర్ తంతి పంపించారు. కానీ గురుదేవులు మరుసటి రైలు వచ్చే వరకూ నిరీక్షించనవసరం లేకపోయింది. శ్రీరామకృష్ణుల విషయం తెలిసి కలకత్తా నుంచి రాజేంద్రలాల్ బంధోపాధ్యాయ్ అనే రైల్వే ఉన్నతాధికారి హుటాహుటిన ప్రత్యేకరైలులో మొఘల్‌సరాయ్ రైల్వేస్టేషన్‌కు వచ్చారు. ఆయన గురుదేవులనూ, హృదయ్‌నూ సాదరంగా తన రైలులో ఎక్కించుకొని వారణాసికి తీసుకువెళ్ళారు.

కాశీలో వారం రోజులు గడిపిన తరువాత శ్రీరామకృష్ణులు, హృదయ్, మథుర్‌బాబు తదితరులు అలహాబాద్‌కు వెళ్ళారు. అక్కడ త్రివేణీ సంగమంలో పవిత్ర స్నానం ఆచరించి, రెండు మూడు రోజులు అక్కడ బస చేసి కాశీకి తిరిగి వచ్చేశారు. ఆ తరువాత బృందావనానికి పయనమయ్యారు. అక్కడ శ్రీకృష్ణావతార ఘట్టాలతో తాదాత్మ్యం చెందుతూ శ్రీరామకృష్ణులు ఎన్నో దివ్యస్మృతులను గాంచారు. వెళ్ళిన ప్రతి పుణ్యక్షేత్రంలో గురుదేవులు ఏదో ఒక రూపంలో తన అవతార రహస్యాన్ని వెల్లడిచేస్తూ ఉండేవారు. అదే విధంగా మథుర్‌బాబు చేత ఆ యా ప్రాంతాల్లో ఎన్నో దానధర్మాలు చేయిస్తూ, పుణ్యతీర్థాల్లో దాతృత్వానికి విశేషఫలితముంటుందని చెప్పకనే చెప్పేవారు. ఇలా భగవాన్ శ్రీరామకృష్ణుల అవతార లక్ష్యంలో దాదాపు అయిదు నెలల ఈ పుణ్యక్షేత్రాల సందర్శన ఎన్నో ప్రత్యేకతలను సంతరించుకుంది. ❖ (ఏప్రిల్ 16 - భారతీయ రైల్వే వ్యవస్థాపక దినోత్సవం)

భగవద్గీతను కాస్త చదివినా, గంగా జలం ఒక చుక్క పానం చేసినా, ఈశ్వరుడిని ఒక్కసారి అర్చించినా యమదూతల వలన కలిగే భయం శాశ్వతంగా నశిస్తుంది. - ఆది శంకరాచార్యులు

తెరపి లేదు రాత్రిందివముల్!

-స్వామి జ్ఞానదానంద

శ్రీకృష్ణపరమాత్ముడు అవతారాన్ని చాలించి, అంతర్ధానమయ్యాడు. ఆ పరమాత్మ పరమపద పయనంతో పాండవులు, మనవడు పరీక్షిత్తుకు పట్టాభిషేకం చేసి, తామూ విష్ణు సాయుజ్యానికి చేరుకున్నారు. హస్తినాపురంలో రాకుమారుడైన పరీక్షిత్తు ప్రాజ్ఞులైన దైవజ్ఞుల ఆదేశం మేరకు గురువుల సన్నిధిలో సమస్త విద్యలూ అభ్యసించి, ప్రజారంజకంగా పాలించసాగాడు. ఉత్తరుని కుమార్తె ఇరావతిని పరిణయమాడి, జనమేజయుడు తదితర నలుగురు కుమారులకు తండ్రి అయ్యాడు. అనంతరం ఓ రోజు పరీక్షిత్తు జైత్రయాత్రకు బయలుదేరాడు. దిక్కులన్నీ జయిస్తూ ముందుకు సాగుతున్న ఆ పాండవపౌత్రుడికి రాజవేషంలో ఉన్న కలిపురుషుడు కనిపించాడు. అతడు ధర్మానికి ప్రతీక అయిన ఓ వృషభాన్నీ, భూదేవికి ప్రతిరూపమైన గోవునూ తన్నుతూ, హింసిస్తూ కనిపించాడు. కలిపురుషుడి ఈ ఘాతుకాన్ని తట్టుకోలేక పరీక్షిత్తు, అతణ్ణి పట్టుకొని శిక్షించబోయాడు. ఈ కథనంతా ఆసక్తిగా వివరిస్తున్న సూతమహర్షికి అడ్డుపడుతూ, శౌనక మహర్షి సందేహాస్పదుడై, 'అయ్యా! సూతమహర్షీ! రాజవేషంలో ఉన్న కలి అసలు ఆ వృషభాన్నీ, ఆ గోవునూ ఎందుకు తన్నాడు? పరీక్షిత్తు అతడిని ఎలా నిగ్రహించాడు? ఆ భగవంతుడి లీలలు ఏంటి?' అని ప్రార్థనాపూర్వకంగా ప్రశ్నిస్తూ...

అరవిందాక్ష పదారవింద మకరందాసక్తులై యున్న స
త్పురుషశ్రేష్ఠుల వృత్తముల్ వినక దుర్బుద్ధిన్ విలంఘించి, దు
ర్నరవార్తాకథన ప్రపంచములు కర్ణ ప్రాప్తముల్ సేసి, వా
సరముల్ వ్యర్థత ద్రోచుచుండ జన దీ సంసార మోహంబునన్

'నందనందన పదారవింద మకరంద పానం చేత పరవశులైన ఉత్తమ పురుషుల పవిత్ర చరిత్రలు వినకుండా, పెచ్చు పెరిగిన మచ్చరంతో దుర్జనుల దుశ్చరిత్రలకు చెవులొగ్గి, సంసారబంధాలకు లోబడి, పరమార్థాన్ని విస్మరించి, వ్యర్థంగా కాలం గడపడం తెలివి తక్కువ పని కదా' అని వాపోయాడు.

ఈ బతుకు అశాశ్వతం! ఈ అల్పాయుష్షులో అపవిత్రాలైన అల్పుల చరిత్రలు, అనవసర విషయాలను చెవులొగ్గి వింటూ, బంగారం లాంటి జీవిత కాలాన్ని పాడు చేసుకోవడం మంచిది కాదన్నాడు. గోవింద పదారవింద మకరంద ధారల్ని మాకు అనుగ్రహించమని సూతమహర్షిని అర్థిస్తూ...

మందునకు మందబుద్ధికి
మందాయువునకు నిరర్థకమార్గునకును గో
వింద చరణారవింద మక
రందము గొన తెరపి లేదు రాత్రిందివముల్!

'మందబుద్ధులూ, సోమరిపోతులూ, అల్పాయుష్కులూ అయిన మూర్ఖులు మాత్రమే పనికిమాలిన మార్గాలలో పడి కొట్టుకుంటూ ఉంటారు. అటువంటి వారికి హరిచరణ కమల సుధాధారలను చవిచూడడానికి రాత్రింబవళ్ళూ తీరికే ఉండదు' అని బాధపడుతూ అంటాడు.

శౌనక మహర్షి ప్రస్తావించిన ఇలాంటి మందబుద్ధుల్లో, మందాయువుల్లో, మూర్ఖుల్లో మనమూ భాగస్వాములం అవుతున్నామేమో! మన ఆసక్తులు అల్పమైన, అర్థం లేని విషయాలకే పరిమితమై, మనల్ని మనం నిరర్థకజీవులుగా మిగుల్చుకుంటున్నామేమో ఆత్మవిమర్శ చేసుకోవాలి.

తీరికలేని తాపత్రయాలు: ఒక్కసారి మన జీవితాల్ని సింహావలోకనం చేసుకుంటే, ఆ శౌనకమహర్షి చెప్పినట్లు ఎక్కువ కాలాన్ని ఫలితం లేని పరుగులతోనే వృథా చేస్తున్నామనిపిస్తోంది. క్షణం తీరిక లేని తాపత్రయాలతో, ఏదో ఇల్లు కాలిపోతుంటే పరిసరాలకు పరుగెత్తుతున్నట్లు ఉంటున్నాయి మన వ్యవహారాలు!

మహాకవి కాళిదాసు రచించిన 'అభిజ్ఞాన శాకుంతలం'లో ఇద్దరు మునిపుత్రులు ఏదో పని మీద ఒకసారి ఆశ్రమం నుంచి హస్తినాపురానికి వెళతారు. అప్పటి వరకు వాళ్ళు ఆ నగరాన్ని చూడలేదు. ప్రశాంతమైన ఆశ్రమంలోనే ఉండడం వాళ్ళకు అలవాటు. కానీ హస్తినలో చూస్తే పరిస్థితి తద్విరుద్ధం! ఎవరికీ క్షణం కాలు నిలవడం లేదు. దేని కోసమో ప్రతివ్యక్తీ పరుగెడుతున్నట్లే వారికి కనిపించింది. వెంటనే ఓ మునికుమారుడు హస్తినాపురవాసుల హడావిడిని చూసి,

'జనాకీర్ణం మన్యే, హుతవహపరీతం గృహమివ – వీళ్ళంతా ఇంటికి నిప్పంటుకుంటే భయంతో పరుగెడుతున్నారా?' అన్న అనుమానం కలుగుతుందని అచ్చెరువొందుతాడు.

ఆశ్రమానికీ, హస్తినకు ఎంత భేదం? భగవంతుని కోసం శాంతంగా, నిబ్బరంగా, ఆనందంగా వేచి చూసే వాళ్ళకీ, ప్రాపంచిక వ్యవహారాల్లో కొట్టుకుపోతున్న వాళ్ళకీ మధ్య ఎంత అంతరం? అని ఆ మునిపుత్రులు ముక్కున వేలేసుకుంటారు. నేటి మన ఉరుకులు, పరుగులు కూడా నాటి హస్తినాపురవాసులకు వందరెట్లు పెరిగాయనిపిస్తోంది. ఫలితంగా మన ఆలోచనలే కాదు మన ఆరోగ్యాలు కూడా మన అదుపు తప్పుతున్నాయి.

దుర్వార్తలే కర్ణప్రాప్తములా?: మనలో ఎక్కువమందికి ఉండే మరో అవలక్షణం దుర్వార్తా కథన శ్రవణ ఆసక్తి! అలాంటివారి మనస్సులకు మంచి కన్నా చెడే అపురూపం, ఆసక్తిదాయకం! అందుకే ఆ శౌనకుడు **'దుర్నర వార్తకథన ప్రపంచముల్ కర్ణ ప్రాప్తముల్'** అంటున్నాడు. ఈనాటి ప్రసార, ప్రచార సాధనాలు కూడా మన ఈ మానసిక దౌర్బల్యాన్ని పసిగట్టి, సంబంధిత కథనాలతోనే క్షణం తీరిక లేకుండా పుష్కలంగా కనులకు, వీనులకు విందు చేస్తున్నాయి. మనమూ ఇలాంటి అంశాలనే చూస్తూ, వింటూ ఆనందపడుతున్నాం. అందుకే నేటి సమాజంలో చాలామంది ప్రవర్తనలో, ప్రవృత్తిలో అరాచక, అశాంతిపూర్వక ఛాయలే కనిపిస్తూ ఉంటాయి. అయితే సహజంగా మన మనస్సు అంత త్వరగా పవిత్రమైన విషయాల వైపునకు మరలదు. ప్రయత్నపూర్వకంగా మనమే ఇంద్రియాలనూ, మనస్సునూ ప్రవృత్తి నుంచి నివృత్తి వైపునకు మరల్చి, పైశాచిక భావనల నుంచి బయటపడాలి. అందుకే శ్రీసుందరపాండ్యుడు అనే భక్తుడు....

> **ఎక్కడికో? ఎందుకో? తెలియకుండా, ఎడతెరపి లేకుండా మనం పెడుతున్న పరుగు కాలానికే విస్మయాన్ని కలిగిస్తుంది. పిండిమరలో పడ్డ గింజల్లా తిరిగి, తిరిగి...నలిగి, నలిగి పొడి అవుతున్నా మనలో పరివర్తన పొడచూపడం లేదు. ప్రపంచంలోని వ్యర్థ విషయాలపై పెంచుకుంటున్న శ్రద్ధ ఏ కొద్దిగానైనా తగ్గడం లేదు. పరమాత్ముడి వైపు మనస్సు మరలడం లేదు.**

పరపరివాదన మూకాః, పరదార నిరీక్షణేషు జాత్యంధాః
యే పరరహస్య బధిరాః, తే పురుషా దేవతా సదృశాః

'పరుల దోషాలు చెప్పడంలో మూగవారు, పరవనితలను చూడడంలో పుట్టుగుడ్డివారు, పరుల రహస్యాలను వినడంలో చెవిటివారు– వీరు దేవతల వంటివార'ని అభివర్ణిస్తారు. కానీ మనలో చాలామందికి వీటిపై ఉండే ఆసక్తి అంతా ఇంతా కాదు. ఈ దుర్వ్యసనాలు విలువైన మన కాలాన్ని వృథా చేయడమే కాకుండా, మన మనస్సును చౌకబారు చింతనల్లో ముంచి, భగవంతుడికి దూరం చేస్తాయి. శౌనక మహర్షి ఇలాంటి వారిని ఉద్దేశించే, **'...వాసరముల్ వ్యర్థత తోచుచుండ జన దీ సంసార మోహంబునన్'** అంటున్నారు.

మనుట నిత్యము కాదు...: జీవితానుభవం లేని పిల్లలు, యువతీయువకులే ఈ అల్పసుఖాలతో పొద్దుపుచ్చుతున్నారంటే సాధారణమనుకోవచ్చు. కానీ వయసు పండిన ఎందరో వృద్ధులు కూడా ఈ వ్యర్థమైన విషయాలతో కాలక్షేపం చేస్తున్నారు. ఇలా స్థాయీ భేదం లేకుండా, అన్ని వర్గాల వారూ ఉన్మత్తమనస్కులై వెర్రిసుఖాల కోసం వెంపర్లాడుతున్నారు. ఎల్లకాలమూ ఇలాగే ప్రపంచాన్ని అనుభవించాలన్న ఆరాటంలో ఉంటున్నారు. ఇంతకు మించిన ఆనందం కూడా మరోటి ఉంటుందన్న విషయాన్నే విస్మరిస్తున్నారు. అందుకే **'మనుట నిత్యము కాదు, మరణంబు నిజమని ఎరిగి మోక్షస్థితి నిచ్చగించు...'** అంటున్నారు శౌనకమహర్షి.

ఒకసారి భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస దక్షిణేశ్వరంలో రాఖాల్, మహేంద్రనాథ్ గుప్త తదితర ఆంతరంగిక భక్తులతో ముచ్చటిస్తూ 'ఈ లౌకిక జీవనంలో పరుగులు తీస్తున్న మనుషుల్ని బియ్యపు గింజలతో పోల్చవచ్చు. ఎక్కువశాతం మంది తిరగలిలో వేసి తిప్పితే నలిగిపోతున్న బియ్యపు గింజల్లాగానే కనిపిస్తున్నారు. కానీ కొన్ని బియ్యపు గింజలు కొర్రును అంటుకొని ఉంటాయి; అవి నలిగిపోకుండా తప్పించుకుంటాయి. ఆ కొర్రే భగవంతుడు; ఆయనను ఆశ్రయిస్తే ఈ పొడి అయ్యే బాధలుండవు. లేకుంటే, జననమరణాలనే తిరగలిలో తిరిగి, తిరిగి నశించిపోవాల్సిందే!' అంటారు. మనం ఇలా నలిగిపోవడానికైనా ఇష్టపడుతున్నామే కానీ, కాస్త తీరిక చేసుకొని తిరగలికొర్రులాంటి భగవంతుడిని పట్టుకుందామన్న ఇంగిత జ్ఞానాన్ని అలవరచుకోవడం లేదు.

బంగారమంటి బ్రతుకు పోనాడగా...: జలగ నొప్పి తెలీకుండా ఒంట్లోని రక్తాన్నంతా పీల్చేసినట్లు, కళ్ళు మూసి తెరిచే లోపే కాలపురుషుడు మన ఆయుష్షును నిర్దాక్షిణ్యంగా లాగేస్తున్నాడు. అందుకే ఇక్కడ **'...అన్య దుర్జన చరిత్రములు కర్ణ రంధ్రముల బెట్టి, బంగారు వంటి యీ బ్రతికెడు కాలంబు పోనాడగా....'** అంటున్నాడు మహర్షి! మాకు ఏం జరుగుతుందో తెలుస్తోంది; మా బ్రతుకులు నిరర్థకమవుతున్నాయని అర్థమవుతూనే ఉంది; ఈ సంసార వ్యామోహం అంత త్వరగా మమ్మల్ని వీడడం లేదు; ఇప్పుడు ఉపాయమేంటో చూపమని, భగవంతుడిని పట్టుకునే మార్గమేంటో తెలుపమని సూత మహర్షిని శౌనకుడు ప్రార్థిస్తాడు. ఇలాంటి ఆర్తితోనే 'గీతాంజలి'లో రవీంద్రనాథ్ టాగూరు కూడా...

నన్నల్లుకున్న బంధాలు మొండివి. కాని వాటిని తెంచుకోవాలని ప్రయత్నిస్తే, నా హృదయం బాధపడుతుంది...
నాకు నిశ్చయంగా తెలుసు. నీలో విలువల్ని మించిన ఐశ్వర్యముందని, నువ్వు నా ఉత్తమ మిత్రుడవని...
కాని నా గది నిండా పేరుకున్న విలువలేని తళుకుల్ని ఊడ్చేసేందుకు నా మనసొప్పదు.... అని ఆ అంతర్యామితో తన నిస్సహాయతను వ్యక్తం చేశారు. శౌనకాది మునుల విజ్ఞాపనతో సూతమహర్షి పరీక్షిత్తు కలిపురుషుడిని నిగ్రహించిన తీరునూ, కలిప్రవేశానంతరం కకావికలమైన కాలపరిస్థితులనూ, 'శ్రీమద్భాగవతం'లోని భగవంతుడి లీలలను మరిన్ని కర్ణపేయంగా వినిపించాడు. ❖

ఉదయాస్తమయాలు, పగలు రాత్రి, వసంతం, శిశిరం వస్తూపోతూ ఉన్నవి. ఆయువు కూడా శీఘ్రమే హరించిపోతుంది. కానీ మానవుడి ఆశకు మాత్రం అంతం లేదు. *- ఆది శంకరాచార్యులు*

ప్రాచీన, మధ్యయుగాలనాటి
మన సంస్కృతి
- స్వామి హర్షానంద

"ఒక వ్యక్తి తనను తాను అసహ్యించుకొంటున్నట్లయితే అదే పతనానికి హేతువు. పూర్వీకుల చరిత్రను అవమానకరంగా భావిస్తే, ఆ జాతి అంతానికి చేరుకున్నట్లే!" అంటారు స్వామి వివేకానంద. గత వైభవాన్ని మర్చిపోయినంత కాలం మనమూ, మన దేశం స్తబ్ధతలో మునిగిపోతాం. అందుకే, మన ప్రాచీన సంస్కృతి గురించి తెలుసుకోవాలి. గడచిపోయిన సంగతులు తెలుసుకొంటూ, భవిష్యత్ మహత్కార్యాల సాధన వైపు నడవాలి. మన ప్రాచీన భారతీయ సంస్కృతిని గుర్తు చేసేందుకు చేస్తున్న ప్రయత్నమే ఈ వ్యాసాల పరంపర. సుప్రసిద్ధ రచయిత, బెంగుళూరు రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి హర్షానంద మహరాజ్ మధ్యయుగాల కాలం దాకా విలసిల్లిన మన సంస్కృతిని 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు 2014 ఫిబ్రవరి సంచిక నుండి వివరిస్తున్నారు.

విదేశాలలో భారతీయ సంస్కృతి

ఇతర దేశాలపై ఆధిపత్యం వహించాలని కోరుకోవడం సహజం. ఈ ఆధిపత్యం రెండు రకాలు - భీకరమైన యుద్ధాలు, హింసల ద్వారా విజయం; మేధనూ, హృదయాన్నీ పరివర్తన చెందించే విజయం. ప్రపంచ దేశాల చరిత్రను చూస్తే ఈ రెండో రకమైన ఆధిపత్యమే చిరకాలం ఉంటుందనీ, మొదటిరకం విజయం కాలాంతరంలో తుడిచిపెట్టుకు పోతుందనీ తెలుస్తోంది.

సాంస్కృతిక ఆధిపత్యం మరొకవిధంగా లాభదాయకం. హృదయ పరివర్తన మేధకు సంబంధించిన అవరోధాలను కూడా అధిగమించగలదు. మేధ అంధవిశ్వాసాలను నిరోధించగలదు.

బహుముఖమైన హిందూ మతం ఆధారముగా వెలసిన హైందవ సంస్కృతి భారతదేశ సరిహద్దులను దాటి విదేశాలలో వ్యాప్తి చెందడం ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది.

భారతీయ ఋషులు, దార్శనికులు విశ్వమానవ ప్రేమను సౌభ్రాతృత్వాన్ని అహింసాయుతంగా, మతప్రమేయం లేకుండా ప్రపంచ మంతా వ్యాప్తి చేయగలిగారు. రాజకీయ ప్రయోజనాలు, వ్యాపార లాభాలలో వారికి ఆసక్తి లేదు. భారతదేశానికి ఆ రోజులలో తగిన సైనికబలం, సంపద ఉండేవి. ఈ సంపదకు ఆకర్షితులై మధ్య తూర్పు దేశాల నుండి, పాశ్చాత్య దేశాల నుండి అనేక అమానుష దండయాత్రలు జరిగాయి. హిందూ మతం కానీ, సంస్కృతి కానీ ఈ దాడుల వల్ల నష్టపోలేదు. పైపెచ్చు మునుపటి కన్నా పటిష్ఠంగా తయారై ఈ జాతి చైతన్యాన్ని తెలియజేస్తున్నాయి.

క్రీస్తుశకం ప్రారంభం నుండి కూడా హిందూ మతం - సంస్కృతి ఆసియా దేశాలకూ, మధ్య ప్రాచ్య దేశాలకూ, సైబీరియా-అమెరికాల వరకు వ్యాపించింది. ఈ వ్యాప్తిని పరిశీలించడం చాలా ఆసక్తిదాయకం. సులభంగా అర్థం కావడానికి ఒక్కొక్క దేశంవారీగా ఈ వ్యాప్తిని పరిశీలించవచ్చు.

అఫ్ఘనిస్తాన్: పురాణాలలో గాంధార దేశంగా పిలువబడే దేశమే అఫ్ఘనిస్తాన్. కాంధహార్ అనే పట్టణం ఈ అభిప్రాయాన్ని బలపరుస్తున్నది. ఈ దేశంలో గార్డెజ్ (క్రీ.శ. 6వ శతాబ్దం), కాబూల్ దగ్గర సాకర్‌ధార్ (క్రీ.శ. 4వ శతాబ్దం)లలో గణేశ విగ్రహాలు బయల్పడ్డాయి. ఈ ప్రాంతాలలోనే శివ-సూర్య ప్రతిమలు కనుగొనబడ్డాయి. (క్రీ.శ. 7వ శతాబ్దం) బమియన్‌లోని 53 మీటర్ల (177 అడుగుల) ఎత్తున్న బుద్ధ విగ్రహం ప్రఖ్యాతిగాంచిన భారత సంస్కృతికి నిదర్శనం.

అమెరికా: కొలంబస్ (క్రీ.శ. 1451-1506) అమెరికాను కనుగొన్నాడు. ఆయన కనుగొన్న హోండ్యూరాస్ దీవులను యూరోపియన్ దేశాలు అమెరికాగా పరిగణించాయి. నిజానికి, కొన్నివేల సంవత్సరాల క్రితమే భారతీయ సంతతివారిచే అమెరికా కనుగొనబడి, వారిచే వలసప్రాంతంగా నివసింపబడింది. మెక్సికోలోని అజ్‌టెక్‌లు, పెరూలోని ఇంకాలు, ఆగ్నేయ మెక్సికోలోని మయాలు ప్రవాస

భారతీయులే! వీరు చతుర్యుగాలను నమ్మేవారు. గురుకుల విద్యావిధానం పాటించేవారు. పల్లెలలో పంచాయతీ పరిపాలన, బజారులో వ్యాపారాలు, సోమయాగాలు, ఇంద్ర, గణేశ ఇతర హిందూ దేవతారాధన, హిందూ మతపరమైన నాట్యాలు ఆచరించేవారు. పిల్లల జననంతో ముడిపడిన ఆచారాలు, వివాహం, దహన సంస్కారాలు, పురోహిత వ్యవస్థ ఉండేవి.

అరేబియా: హీవిట్ మహాశయుడు తన గ్రంథం 'ప్రాచీన రాజకీయ వ్యవస్థలు'లో (2వ సంపుటం) అరేబియా, మెసపుటేమియా దేశాలలో హిందూపాలన గురించి వివరించాడు.

విల్‌డ్యూరాంట్ తన గ్రంథం 'నాగరికత సంపుటి-IV' నమ్మకాల యుగం (న్యూయార్క్‌లోని సైమన్ & షుష్టర్ ప్రచురణ పేజీలు 161-171) కాబాలో (మహమ్మద్‌కు పూర్వం) అనేక విగ్రహాలుండేవని వాటిలో ఒకటి అల్లా అని తెలిపి ఉన్నాడు. ఈ విగ్రహంతోపాటు అల్లా కుమార్తెలైన ముగ్గురి విగ్రహాలుండేవి. ఆచార్య సఘష్టైరి దీనిని నిర్ధరిస్తూ 360 విగ్రహాలు అక్కడ ఉండేవని తెలిపాడు.

అఫ్ఘనిస్థాన్, గార్డెజ్‌లోని క్రీ.శ. 6వ శతాబ్దం నాటి గణేశ విగ్రహం

అరబ్బుల ఉత్సవాలలో, యాత్రలలో వివాహం కాని కన్యల నాట్యం ఉండేది. ఇప్పటికీ హజ్ యాత్రికులు భారతీయ ధోవతి, పైపంచె లాంటి కుట్టు లేని వస్త్రాలను ధరిస్తారు. అరబ్బులు భారతదేశం నుండి గ్రహించిన పంచతంత్ర సారస్వతం, గణితం, ఖగోళశాస్త్రం, వైద్యం, శస్త్ర చికిత్స మొదలైన విషయాల ప్రామాణిక గ్రంథాలను ఐరోపా ఖండాలలో వ్యాప్తిచేశారు.

బాలి, జావా: క్రీస్తుశకం మొదటి శతాబ్దంలోనే హిందూమతం, సంస్కృతి ఆగ్నేయాసియా దేశాలలో వ్యాప్తి చెందింది. దక్షిణ భారతదేశంలో ఓటమిపాలైన కొందరు రాజులు జావా ద్వీపానికి తరలివెళ్ళి, అక్కడ రాజ్యాలను స్థాపించారు.

యవద్వీపమని పిలువబడే జావా ద్వీపం క్రీ.శ. 10వ శతాబ్దానికే శ్రీ విజయరాజ వంశీకులకు నిలయమైంది.

'అజిష్క' అనే గ్రంథం క్రీ.శ. మొదటి శతాబ్దంలో 20 వేల మంది ఒరిస్సాలోని కళింగ రాజ్యం నుండి జావా ద్వీపం చేరుకున్నట్లు పేర్కొంది. 'కావి' లిపిలో వ్రాసిన అనేక సంస్కృత గ్రంథాలు అక్కడ బయల్పడ్డాయి. అవి...

- బ్రహ్మాండ, విష్ణు పురాణాలు.
- మంత్రశాస్త్రం (ఆచారాలు-ఆరాధన), సూర్యసేవన (శివాదిత్యుల ఆరాధన),ఆచారాలకు సంబంధించిన మంత్రాలు, మృత్యుంజయ, గాయత్రి మంత్రాలు, విష్ణుస్తవం.
- నీతిసార, వరరుచి 'సారసముచ్చయం', ఆదిపురాణం, కామందక నీతిశాస్త్రం.
- ధర్మశాస్త్రం (సామాజికపరమైన) శివశాసన కుతార మానవాగమ, దేవాగమ, సర్వజంబు.
- వ్యాకరణ, ఆదీశ్వర, అమరమాల, వృత్తసంచయం.

ఇవే గాక జావనీసుభాషలో లిఖితమైన 'రామాయణ కకవిన్', వైద్యగ్రంథాలు, ఖగోళశాస్త్రం, కథలు, సాహిత్య గ్రంథాలు, చారిత్రక గ్రంథాలు కూడా ఉన్నాయి. రామకవచం (22 శ్లోకాలు) ఇప్పటికీ ప్రాచుర్యంలో ఉంది. శైవారాధన క్రీ.శ. 4వ శతాబ్దంలో జావాలో ప్రవేశించింది. ప్రాచీనమైన శ్రీగణపతి విగ్రహం డీయింగ్ పీఠభూమిలో లభించింది. బోరోబుదూర్‌లో లభించిన గణేశ విగ్రహం చాలా అందమైనది.

బాలిలో నివసించే వారందరూ ఇప్పటికీ హైందవులే. వారు వర్ణాశ్రమ పద్ధతిని పాటిస్తారు. ఉపనయనం, సంధ్యావందనం ఆచరిస్తారు. పౌరాణిక మైన తోలుబొమ్మలాటలు, భరతనాట్యం - ఇప్పటికీ ప్రాచుర్యంలో ఉన్నాయి.

బోర్నియా (ఇండోనేషియా): క్రీ.శ. 5వ శతాబ్దం నాటికి హైందవ మతం బోర్నియాలో ప్రవేశించింది. కోటైలో లభించిన శిలాశాసనాలు అక్కడ నిర్వహించిన హిందూ ఆచారాలను తెలియజేస్తున్నాయి. బోర్నియాలో లభించిన అనేక శిల్పాలు శైవ (గణేశ) లేక బౌద్ధానికి సంబంధించినవి. యూప స్తంభానికి (వైదిక ఆచారాలలో ఉపయోగించే బలి స్తంభం) సంబంధించిన శాసనాన్ని మూలవర్మ (క్రీ.శ. 480) కాలం నాటిదిగా గుర్తించారు. ❖**అనువాదం: డాక్టర్ పి.వి.రెడ్డి**

ధన సంపాదన సామర్థ్యం ఉన్నంత దాకా బంధువులు అనురాగం చూపుతారు. శరీరం శిథిలమై అంత్యకాలం సమీపిస్తున్నప్పుడు ఆత్మ బంధువులు సైతం కుశలం అడగరు. - *ఆది శంకరాచార్యులు*

రామకృష్ణ మిషన్



(ప్రధాన కేంద్రం)

పోస్ట్: బేలూరు మఠం, హౌరా(జిల్లా), పశ్చిమబెంగాల్-711 202
ఫోన్ : 033-2654 1144/1180, ఫ్యాక్స్:033-2654 6179
Email : hqsv150.convener@gmail.com Website: www. belurmath.org

విజ్ఞప్తి

నిరుపేద బాలల అభ్యుదయానికి సహాయం

స్వామి వివేకానంద 150వ జయంతి ఉత్సవాలలో భాగంగా బాలల సమగ్ర వికాసం కోసం **గదాధర్ అభ్యుదయ ప్రకల్ప(జి.ఎ.పి.)** పేరిట బృహత్తర పథకాన్ని ప్రారంభించడం జరిగింది. కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వశాఖ ఆర్థిక సహాయంతో 2010 అక్టోబరు నుంచి 2014 సెప్టెంబర్ వరకు 174 గదాధర్ అభ్యుదయ ప్రకల్ప యూనిట్ల ద్వారా దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలో, మురికివాడల్లో నివసిస్తున్న నిరుపేదలైన 17,400 మంది బాలలు లబ్ధిపొందారు. కుల, మత, వర్ణ భేదాలకు అతీతంగా బాలలందరి శారీరక, మానసిక, బౌద్ధిక, ఆధ్యాత్మిక వికాసానికి ఈ పథకం తోడ్పాటునందిస్తోంది.

ఈ పథకంలో భాగంగా బాలల శారీరక అభివృద్ధి కోసం రోజూ పోషకాహారంతో పాటు నిత్య అవసరాలకు సంబంధించి స్కూల్‌బ్యాగులు, యూనిఫామ్‌లు, విద్యార్జన సామగ్రి, గొడుగులు, రెయిన్‌కోటులు, చెప్పులు, పారిశుద్ధ్య సామగ్రి తదితరమైనవి అందజేయడం జరుగుతోంది.

బాలల శారీరక దారుఢ్యానికి క్రీడలను, వ్యాయామాన్ని ప్రోత్సహించటమే కాకుండా, బాలలకు సాధారణ వైద్యపరీక్షలు చేయించడంతో పాటు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించడం జరుగుతోంది. అదే విధంగా మానసిక వికాసం కోసం చిన్నారులకు సంగీతం, నాటకం, చిత్రకళ, నృత్యం, వేదమంత్రపఠనం, పారాయణం తదితర అంశాల్లో శిక్షణనివ్వడమే కాకుండా మహనీయుల జీవితాలను పరిచయం చేస్తూ, వ్యక్తిత్వ వికాసానికి చేయూతనివ్వడం జరుగుతోంది.

బాలల వైజ్ఞానిక వికాస కార్యక్రమాల్లో భాగంగా, భవిష్యత్తులో వారు మంచి ఉన్నత విద్యా సంస్థల్లో చేరడానికి అనుగుణంగా, ఈ స్థాయిలోనే వారికి పాఠశాల విద్యా సంబంధమైన అంశాల్లో ప్రత్యేక శిక్షణను ఇప్పించడం జరుగుతోంది. బాలల ఆధ్యాత్మిక పరిణతికి కూడా దోహద పడతాయన్న తలంపుతో ప్రార్థన, భజనలు, ధ్యానం తదితర విషయాల్లో మౌలిక అవగాహన కల్పించడం జరుగుతోంది.

ఈ గదాధర్ అభ్యుదయ ప్రకల్ప కార్యక్రమాలు బాలలు, వారి తల్లితండ్రులపై సానుకూల ప్రభావాన్ని చూపుతున్నాయని చెప్పడానికి ఎంతో సంతోషిస్తూ ఉన్నాం. ఈ నేపథ్యంలో ఆ యా ప్రాంతాల్లో ఈ పథకాన్ని కొనసాగించాలన్న అభ్యర్థనలు వస్తున్నాయి. మా సాధు సోదరుల, కార్యకర్తల అంకితభావం, ప్రేమపూర్వకమైన సహకారంతో ఈ జి.ఎ.పి. ద్వారా స్థానిక ప్రాంతాల్లో ఎన్నో మంచి మార్పులు కనిపిస్తున్నాయి.

గదాధర్ అభ్యుదయ ప్రకల్ప(జి.ఎ.పి.) పథకాన్ని ఈ రీతిలో విజయవంతంగా ముందుకు నడిపించేందుకు 2014-2015 సంవత్సరానికి గాను మాకు **8.5 కోట్ల రూపాయలు** అవసరమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ బృహత్ పథకాన్ని నిరాటంకంగా కొనసాగించేందుకు ఉదారహృదయులైన ఎందరో సౌజన్యమూర్తుల ఆర్థిక, హార్దిక సాయాన్ని అర్థిస్తూ ఉన్నాం. నిర్భాగ్యులైన చిన్నారుల వికాసానికి మాతో చేయి కలిపేందుకు, మాకు సహకరించేందుకు సమాజంలోని వివిధ విభాగాల్లోని స్వచ్ఛంద సేవా సంస్థలను కూడా ఆహ్వానిస్తూ ఉన్నాం.

ఈ గదాధర్ అభ్యుదయ ప్రకల్ప పథకానికి విరాళాలను Ramakrishna Mission పేరున చెక్కు/ డి.డి.లను లేదా నగదును Ramakrishna Mission, P.O. Belur Math, Dist. Howrah, West Bengal - 711 202 చిరునామాకు పంపాల్సిందిగా మనవి.

మీరు ఇచ్చే విరాళాలకు 80-G (5)(vi)1961 సెక్షన్ కింద ఆదాయపు పన్ను మినహాయింపు లభిస్తుంది.

ఈ భావిపౌరుల అభ్యుదయానికి మీవంతు ఆర్థిక సహాయాన్ని అందించి భగవాన్ శ్రీరామకృష్ణుల కృపకు పాత్రులు కాగలరని ఆశిస్తున్నాం.

భగవత్సేవలో
స్వామి సుహితానంద
ప్రధాన కార్యదర్శి

Advt.,

నిగమ నిగమాంత వర్ణిత...

–శ్రీమతి బి.కృష్ణకుమారి

సంసారమనే సంకెలతో బంధించినా, వైరాగ్యమనే క్షమాభిక్షతో కాపాడినా – కారకుడు మాత్రం కరుణామయుడైన ఆ భగవంతుడే! ఆయన తలచుకుంటే క్షణంలో మనల్ని మాయలో పడేయగలడు; శరణంటే మరుక్షణంలోనే ఆ మాయాజాలం నుంచి తప్పించగలడు. ఆ పరమరహస్యాన్ని పసిగట్టినవాడు కనుకనే పదకవితా పితామహుడైన అన్నమయ్య, బంధాలు కట్టినవాడినే, బంధవిముక్తిడిని చేయమని బతిమాలుతున్నాడు. ఆట నిమిషాల్లో ముగిస్తే అంత రక్తికట్టదని తెలిసి, మనల్ని పావుల్ని చేసి పాచికలు వేస్తూ రకరకాల మలుపులు తిప్పుతూంటాడు పరమాత్ముడు. అయితే సామాన్యులు ఆటను చూడడం వరకే పరిమితమవుతారు; ఆటాడించే వ్యక్తిని మరచిపోతారు. వివేకి మాత్రమే ఆటగాడి కోసం ఆరా తీస్తాడు. అలా వివేకవంతుడై ఈ సంకీర్తనాచార్యుడు, సంసార బంధాల్ని కట్టేవాడి కటాక్షం కోసమే ప్రయత్నించాడు; **'నిగమ నిగమాంత వర్ణిత...'** అని కీర్తిస్తూ, కోరి కైవల్యాన్ని ప్రాప్తించుకున్నాడు. భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస కూడా ఓ సందర్భంలో 'మానవులంతా లోకమనే ఈ మంత్రజాలాన్ని చూసి అబ్బురపడుతున్నారే కానీ, దానికి మూలకారకుడైన మాంత్రికుడిని మరచిపోతున్నారు. ఆయనను అన్వేషించే ప్రయత్నం చేయడం లేదు' అంటారు. అలా ఆధారమైనవాడిని ఆశ్రయిస్తే మనుషులకు ఇన్ని అగచాట్లు ఉండవు.

నగరాజ ధరుడా!

నిగమాలు అంటే నాలుగు వేదాలు. నిగమాంతాలు అంటే వేదాంతమైన ఉపనిషత్తులు! ఆ నిగమ నిగమాంతాలు వర్ణించే ఏకైక మనోహర రూపం, నగరాజధరుడు. అంటే గోవర్ధన గిరిధారుడైన ఆ శ్రీమన్నారాయణుడి దివ్యస్వరూపం! ఆ మంగళాకారుడిని అలా మనస్సున నిలుపుకొంటూ...

నిగమ నిగమాంతవర్ణిత మనోహరరూప
నగరాజధరుడ శ్రీనారాయణా! అని సంకీర్తనకు శ్రీకారం చుడుతున్నాడీ శ్రీనివాసుడి సేవాగ్రగణ్యుడు. వేదవేదాంతాలన్నింటిలోనూ శ్రీమహావిష్ణువు వర్ణన కనిపిస్తుంది. కానీ ప్రత్యేకంగా ఈ పద్మావతీప్రియుడి ప్రస్తావన ఋగ్వేదంలో ప్రస్ఫుటమవుతుంది. ఆ వేదవేదాంత సారమంతా ఆపోశన పట్టిన అనుభూతితో, ఆ శేషాద్రినిలయుడిలో శేషశాయిని దర్శించుకొని తరించిపోతున్నాడు తాళ్ళపాక అన్నమాచార్యులు. ఓ మారు భక్తకవి పురందరదాసు కూడా తిరుమల శ్రీవేంకటేశ్వరుడి దర్శనభాగ్యంతో పులకించిపోయి, వైకుంఠపురవాసుడే వేంకటరమణుడని వర్ణిస్తూ...

వేంకటాచల నిలయం... వైకుంఠపురవాసం
పంకజనేత్రం పరమ పవిత్రం, శంఖచక్రధర చిన్మయరూపం
అంబుజోద్భవ వినుతం, అగణిత గుణనామం
తుంబుర నారద గానవిలోలం;
మకరకుండల ధరం మదనగోపాలం... అని ఆశువుగా కీర్తించాడు. వైకుంఠవాసుడు, వడ్డీకాసులవాడు, వసుదేవ తనయుడు అభేదమూర్తులని కొనియాడతాడు.

బంధాలు కట్టేవు...

వైరాగ్యాన్ని మించిన సుఖం లేదు. కానీ మనకు ఈ లోకంపై విరక్తి కలగనంత వరకు, భగవంతుడు మన మనోక్షేత్రంలో ఆ వైరాగ్యబీజాలను మొలకెత్తనీయడు. బుట్టబొమ్మలతో ఆడుకుంటూ సంబరపడుతున్నంత సేపు, తనయకు పట్టుబట్టలు చూపెట్టక దాచి ఉంచే తల్లిలా, సంసారమే సారమనుకొని సుఖిస్తున్నంతసేపు సర్వేశ్వరుడు మనకు శాశ్వత శాంతిమార్గాన్ని మరుగుపరచి

(మిగతా 33వ పేజీలో...)

అన్నమయ్య పదామృతం

నిగమ నిగమాంతవర్ణిత మనోహరరూప
నగరాజ ధరుడ శ్రీనారాయణా।

దీపించు వైరాగ్య దివ్యసౌఖ్యంబియ్య
నోపక కదా నన్ను నొడబరపుచు
పైపైనె సంసార బంధముల కట్టేవు
నా పలుకు చెల్లునా నారాయణా॥

చీకాకుపడిన నా చిత్త శాంతము సేయ
లేకకా నీవు బహు లీలనన్ను
కాకుసేసెదవు బహుకర్మముల బడువారు
నా కొలది వారలా నారాయణా॥

వివిధ నిర్బంధముల వెడల ద్రోయకనన్ను
భవసాగరముల దడ బడజేతురా
దివిజేంద్రవంద్య శ్రీతిరువేంకటాద్రీశ
నవనీతచోర శ్రీనారాయణా॥

శరీరం జీర్ణమైనది. తల వెంట్రుకలు పండిపోయినవి. పండ్లు ఊడిపోయినవి. అలాంటి కడువృద్ధుడు కర్రసాయంతో తప్ప కదలలేడు. అయినా ఆశను మాత్రం వీడడు! - *ఆది శంకరాచార్యులు*



పరిప్రశ్న

– స్వామి భూతేశానంద
(రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు)

రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు - స్వామి భూతేశానందజీ మహరాజ్ (1901-1998) భక్తుల ఆధ్యాత్మిక సందేహాలకు సరళమైన రీతిలో ఇచ్చిన సమాధానాలను 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకుల ప్రయోజనార్థం 2013 జూలై సంచిక నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

భక్తుడు: మనస్సులో వెల్లువెత్తే కోరికలను నియంత్రించే మార్గం ఏమిటి? ఆధ్యాత్మిక మార్గంలో వేగంగా పురోగమించడం ఎలా సాధ్యమవుతుంది?

స్వామీజీ: స్వామి తురీయానంద (శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష సన్న్యాస శిష్యులు) "ధ్యానం చేయడానికి కూర్చున్నప్పుడు మనస్సనే తలుపు మీద 'ప్రవేశం లేదు' అని సైన్ బోర్డ్‌ని పెట్టాలి" అని సూచించారు. అంటే మనస్సులోకి ఇతర కోరికలేవీ ప్రవేశించకుండా నిషేధించాలి అని అర్థం. ఇది నిరంతర అభ్యాసం ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. మన స్వభావాన్ని బహిర్గతపరిచేది మనస్సు. నిరంతరం సాధన చేయడం వల్ల మన స్వభావాన్ని మలచుకోవచ్చు.

భగవంతుని పట్ల భక్తిభావం లేకపోతే మనస్సును నియంత్రించడం కష్టం. భగవంతుని పట్ల అనురాగం పెరుగుతున్న కొద్దీ ప్రాపంచిక విషయాల పట్ల అనురక్తి తగ్గుతుంది. కాబట్టి భగవంతుని పట్ల భక్తిభావాన్ని పెంచుకుంటే మనలోని ప్రాపంచిక కోరికలన్నీ తొలగిపోతాయి. సాధన ప్రారంభంలో మనస్సును నియంత్రించడం అసాధ్యమనిపిస్తుంది. కానీ జపధ్యాన సాధనలను అభ్యసిస్తూ ఉంటే కాలక్రమేణా మనస్సు మన అధీనంలోకి వస్తుంది. మన సంకల్పం, ఆవేదన, తపన ఎంత తీవ్రంగా ఉంటే అంత త్వరగా ఆధ్యాత్మిక మార్గంలో పురోగతిని సాధించగలుగుతాం.

భక్తుడు: గృహస్థులు కోరికలను త్యజించి సన్న్యాస జీవితాన్ని గడపడం ఎలా సాధ్యమవుతుంది? అందుకు గృహస్థులు ఏం చేయాలి?

స్వామీజీ: సన్న్యాసం అంటే త్యజించడం. గృహస్థులు ప్రాపంచిక కోరికలను, భవబంధాలను మానసికంగా త్యజించాలి గానీ బాహ్యంగా కాదు. సన్న్యాసులు బాహ్యంగానూ, ఆంతరికంగానూ కోరికలను త్యజించాలి. గృహస్థ జీవితం గడుపుతూ సాధన చేయడం కోటలో ఉంటూ యుద్ధం చేయడం లాంటిదనీ, సన్న్యాస జీవితం కోట బయట ఉండి యుద్ధం చేయడం లాంటిదనీ శ్రీరామకృష్ణులు అనేవారు. అంటే కోటలోపల ఉండి యుద్ధం చేయడం కన్నా కోట బయట ఉండి యుద్ధం చేయడం ప్రమాదకరం. కాబట్టి గృహస్థులు స్వధర్మాలను నిర్వర్తిస్తూ, ఆధ్యాత్మిక సాధనలను అనుష్ఠించాలి. మానసికంగా కోరికలను త్యజించే గృహస్థ జీవితం సన్న్యాస జీవితంతో సమానం. శ్రీరామకృష్ణులు "గృహస్థులు భగవంతుణ్ణి స్మరిస్తూ తమ విధులను నిర్వర్తించాలి. రూపాయిలో పదహారు అణాలు ఉంటే అందులో పద్నాలుగు అణాలను భగవంతునికి అర్పించి, మిగతా రెండు అణాలను సంసార విధులకు వెచ్చించాలి" అని సూచించారు. అంటే మనస్సులో పద్నాలుగు భాగాలను భగవంతునికీ, మిగతా రెండు భాగాలను గృహస్థ బాధ్యతలను నిర్వర్తించడానికీ ఉపయోగించాలి. ఇలా సాధన చేస్తే బాహ్య విషయాల పట్ల ఆసక్తి తగ్గి మనస్సు భగవంతుని పట్ల ఆకర్షితమవుతుంది.

భక్తుడు: 'తురీయం' అంటే ఏమిటి?

స్వామీజీ: 'తురీయం' అంటే నాలుగో అవస్థ. జాగ్రదవస్థ – మెలకువగా ఉండడం; స్వప్నావస్థ – కలలుగనే అవస్థ; సుషుప్త్యవస్థ – గాఢ నిద్రలో ఉండడం. ఈ మూడు అవస్థలకు అతీతమైన నాలుగో అవస్థను 'తురీయావస్థ' అంటారు. పరబ్రహ్మ స్వరూపస్థితి, నిర్విషయానంద స్థితులనే తురీయస్థితి అంటారు. అర్ధమాత్రకం, విరజ, ఉన్మని, శుద్ధసత్త్వం – తురీయానికి సమానార్థకాలు. ❖

పండుగలు - పర్వదినాలు

ఏప్రిల్ - 2015

15	బుధవారం	: ఏకాదశి
21	మంగళవారం	: అక్షయ తృతీయ, సింహాచల చందనోత్సవం
23	గురువారం	: ఆదిశంకరాచార్య జయంతి, శ్రీరామానుజాచార్య జయంతి
29	బుధవారం	: ఏకాదశి

మే - 2015

02	శనివారం	: నృసింహ జయంతి
04	సోమవారం	: బుద్ధ పూర్ణిమ
13	బుధవారం	: హనుమజ్జయంతి
14	గురువారం	: ఏకాదశి
29	శుక్రవారం	: ఏకాదశి

నారద భక్తి సూత్రాలు, శాండిల్య భక్తి సూత్రాలు భక్తియోగానికి సంబంధించిన ప్రామాణిక గ్రంథాలు. అయితే ఆధునిక తరంలో భగవదన్వేషకులకు అనువైన రీతిలో భక్తితత్వాన్ని బోధించారు శ్రీరామకృష్ణులు. ఈ నేపథ్యంలో 'శ్రీరామకృష్ణ కథామృతం' నుండి కొన్ని ఉపదేశాలను 'రామకృష్ణ భక్తి సూత్రాలు'గా సులభరీతిలో వివరించే ప్రయత్నం చేస్తున్నాం.

బౌద్ధగ్రంథాలు పాళీ భాషలో, బైబిల్ హీబ్రూలో, ఖురాన్ అరబ్బీ భాషలో రచించబడ్డాయి. అలాగే శ్రీరామకృష్ణుల ఉపదేశాలు వారి మాతృభాష బెంగాలీలో ఆవిష్కృతమయ్యాయి. అవతార పురుషుని ముఖతః వెలువడిన ఆ అమృతో పదేశాలను యథాతథంగా ఉట్టంకిస్తూ వ్యాఖ్యా నిస్తున్నాం. మహాశక్తిమంతమైన ఆ బోధనలను మననం చేసుకుంటూ కృతార్థులమవుదాం.



ఠీక్ పథ్ జానే నా, కింతు ఈశ్వరే భక్తి ఆఛె, తాఁకే జాన్‌బార్ ఇచ్ఛా ఆ ఛే, ఏరూప్ లోక్ కేవల్ భక్తిర్ జోరే ఈశ్వర లాభ్ కొరే.

సరైన మార్గం తెలియదు, కానీ భగవంతునిపై భక్తి ఉన్నది. ఆయనను తెలుసుకొనవలెననే కోరిక ఉన్నది. ఇటువంటి జనులు భక్తి బలం మూలంగానే భగవంతుని పొందుతారు.

శ్రీరామకృష్ణ ఉవాచ: భగవంతుడు దేశకాలపాత్ర భేదాలను బట్టి వివిధ మతాలను ఏర్పరచాడు. మతధర్మమే ఈశ్వరుడు కాదు. పోతే, శ్రద్ధతో ఒక మతాన్ని ఆశ్రయించి, అనుసరిస్తే, ఆయనను చేరవచ్చు. మనలో ఏదైనా లోపం ఉన్నా శ్రద్ధాభక్తి కలిగి ఉంటే, ఆయన ఆ లోటును పూరిస్తాడు. లోపాన్ని సవరిస్తాడు. ఒక వ్యక్తి పూరీ జగన్నాథ దర్శనానికి బయలుదేరి, దక్షిణానికి బదులు పొరపాటున ఉత్తరం వైపు పయనిస్తున్నాడనుకో, ఎవరో ఒకరు దారిలో తారసిల్లి, 'ఏమండీ! ఇటుకాదు, దక్షిణం వైపు వెళ్ళండి' అంటారు. ఆ వ్యక్తి ఆలస్యంగానైనా, జగన్నాథుని దర్శిస్తాడుగా!

ఆయన అంతర్యామి. తప్పుదారిలో పయనిస్తున్నా దోషం లేదు, ఆవేదన, ఆర్తి ఉంటే చాలు. ఆయనే సరైన దారి చూపిస్తాడు.

వ్యాఖ్య: సరైన మార్గం తెలియదు అంటే సాధనాక్రమం, పూజావిధానం, సంకీర్తన మొదలైనవి తెలియదు అని అర్థం. ఏవి భక్తి మార్గంలో అవశ్యమో, అవి తెలియవన్న మాట. కానీ అమితమైన ప్రేమ, భక్తి ఉంటాయి. భగవద్దర్శనం కోసం తహతహలాడుతారు. ఇలాంటి వ్యక్తులు భక్తిబలంతోనే దర్శనం పొందుతారు. ధ్రువుడు దీనికి ఉదాహరణ. నారాయణుడు జగదీశ్వరుడని విన్నాడు; అంతే, నారాయణుడేడీ అంటూ అడవుల వెంబడి వెదకనారంభించాడు. చివరకు నారాయణ దర్శనమైంది. ప్రాపంచిక వస్తు, విషయాల పట్ల మమత, ఆకర్షణలు లేక భగవంతుణ్ణే కాంక్షించడం నిజమైన భక్తి.

హాజార్ లేఖాపడా శేఖో, ఈశ్వరే భక్తి నా థాక్‌లే, తాఁకే లాభ్ కర్‌బార్ ఇచ్ఛా నా థాక్‌లే, సబ్ మిఛే.

ఎంత చదివినా, భగవంతుని పట్ల భక్తి లేకుంటే, ఆయనను పొందాలనే ఇచ్ఛ లేకపోతే, అంతా దండగ.

శ్రీరామకృష్ణ ఉవాచ: వివిధ శాస్త్రాలు తెలిసినా ఏమి ప్రయోజనం? సంసారసాగరం తరించడం తెలిసి ఉండాలి. భగవంతుడే వాస్తవం. మిగిలినదంతా అవాస్తవం.

శాస్త్రాల ద్వారా భగవంతుణ్ణి పొందగలమా? శాస్త్రపఠనం మూలంగా ఆయన ఉనికి లీలామాత్రంగా బోధపడుతుంది. భగవంతుని దిశగా వెళ్ళే మార్గాన్ని చూపుతాయి శాస్త్ర గ్రంథాలు. వెయ్యి గ్రంథాలు చదువు, వెయ్యి శ్లోకాలు వల్లె వేయి, భగవంతుణ్ణి దర్శించాలన్న ఆవేదన లేకపోతే శాస్త్రపాండిత్యం వ్యర్థం. పాండిత్యంతో ఇతరులను మెప్పించవచ్చు. భగవంతుణ్ణి కాదు.

శాస్త్రాలు, గ్రంథాలు వీటితో ఏమవుతుంది? ఆయన అనుగ్రహం లేనిదే ఏమీ జరుగదు. ఆయన అనుగ్రహం కోసం ఆవేదనతో ప్రార్థన చేయి. ఆయన అనుగ్రహిస్తే, దర్శనమవుతుంది.

వ్యాఖ్య: భక్తి ఉన్నవాడే నిజమైన మనిషి. భగవంతుని పట్ల భక్తి, ఆకర్షణ ఉన్నవా? లేవా? అన్నదే మనిషి మానసిక స్థితిని తెలిపే కొలబద్ద అంటారు శ్రీరామకృష్ణులు. శాస్త్రజ్ఞానం ఎంత ఉన్నా, మనుష్య జన్మ సార్థకత పొందదు. 'భక్తిలాభం కొరకే ఈ మానవజన్మ' అనే విషయాన్ని మరచి, ప్రాపంచిక జ్ఞానంతో అంతా సాధించవచ్చని తలుస్తాం.

ఉపనిషత్తులలో పరా, అపరా అనే రెండు రకాల విద్యలు చెప్పబడినాయి. ప్రాపంచిక జ్ఞానం సర్వం 'అపరా విద్య'. దేని ద్వారా స్వస్వరూపం తెలుస్తుందో అది - 'పరా విద్య'. ఈ పరావిద్యనే శ్రీరామకృష్ణులు 'భక్తి' అంటున్నారు. భగవంతుడే మన స్వరూపం అని - అన్ని శాస్త్రాలూ బోధిస్తున్నాయి. అవతారపురుషులూ, తత్త్వవేత్తలూ ఘోషిస్తున్నారు. కాశీకి ఎలా వెళ్ళాలో అన్ని వివరాలనూ సేకరించినా, కాశీకి పోవాలనే ఇచ్ఛ లేకపోతే, కాశీకి పోలేము కదా! ఆ విధంగానే శాస్త్రజ్ఞానం ఎంత ఉన్నా భగవంతుని పొందాలనే ఇచ్ఛ లేకపోతే ఆయన్ని చేరడం సాధ్యం కాదు. ❖ అనువాదం: డాక్టర్ కమల జయరావు

మాతా! భవానీ! సౌభాగ్యవాంఛా, మోక్షకాంక్షా నాకు లేదు. ఆనందమక్కరలేదు, మరణ సమయంలో నీ దివ్యనామాన్ని స్మరించేలా నన్ను దీవించు. ఇదే నా ఏకైక ప్రార్థన. - ఆది శంకరాచార్యులు



ప్రార్థనే పరమార్థంగా...

– అమిరపు నటరాజన్

ఒక బామ్మ తన మనవణ్ణి, 'ఏరా నాయనా! ప్రతిరోజూ ప్రార్థన చేస్తావా?' అని అడిగింది. ఆ అబ్బాయి, 'రాత్రి నిద్రపోయే ముందు ప్రార్థన చేస్తాను బామ్మా!' అన్నాడు. 'మరి ఉదయం చేయవా?' అని అడిగితే, ఆ పిల్లవాడు, 'లేదు, నాకు పగలు భయం వెయ్యదుగా!' అన్నాడు. నిజమే మనం కూడా ఆ పిల్లవాడిలాగే భయం వేసినప్పుడో, లేదా ఏదైనా కావలసినప్పుడో దేవుణ్ణి ప్రార్థిస్తాం.

ఇంతకీ ప్రార్థన అంటే భగవంతుణ్ణి స్తుతించడానికి కేవలం కొన్ని శ్లోకాలను, స్తోత్రాలను వల్లించడం; అది కూడా ఏదో యాంత్రికంగా చేస్తే సరిపోతుందని అనుకుంటాం. కానీ అనంతమైన జ్ఞానానికీ, శక్తికీ, ఆనందానికీ మూలమైన భగవంతుణ్ణి భక్తి శ్రద్ధలతో ప్రార్థిస్తే పరిపూర్ణతను సాధించవచ్చు. పొలానికి నీరు పెట్టాలనుకునే రైతు ఎలాగైతే నది నుండి కాలువ తవ్వి నీరు పెట్టుకుంటాడో అలాగే, అమృతత్వాన్ని పొందాలనుకునే వ్యక్తి భగవంతునితో అనుబంధాన్ని ఏర్పరచుకోవాలి. ఇంటికి విద్యుచ్ఛక్తి కావాలంటే విద్యుదుత్పాదక కేంద్రంతో తీగల ద్వారా అనుసంధానం చేసుకోవాలి. అదే విధంగా మనం ప్రార్థన ద్వారా భగవంతునితో అనుసంధానం కావాలి.

ప్రార్థనకున్న అద్భుతశక్తిని గురించి డాక్టర్ అలెక్సిస్ కారెల్ వివరిస్తూ "మనిషి ప్రార్థన ద్వారా అద్భుతశక్తిని ఉత్పత్తి చేయగలడు. గురుత్వాకర్షణ శక్తి ఎంత నిజమో ప్రార్థన శక్తి కూడా అంతే నిజమైనది. నేను వైద్యుడిగా చాలామంది రోగులకు చికిత్స చేశాను. ఇక ఏ వైద్యమూ కుదరదని అనుకున్న పరిస్థితుల్లో ప్రార్థన ద్వారా క్రమంగా కోలుకున్న వారిని ఎంతో మందిని నేను చూశాను. ప్రార్థన ఓ రేడియం మూలకం లాగా స్వయం ప్రకాశకమైనది. మనం చిత్తశుద్ధితో చేసే ప్రార్థనల ద్వారా ఉన్నతిని సాధించవచ్చు" అని తన అనుభవాన్ని తెలిపారు.

ప్రఖ్యాత రచయిత ఎవెలిన్ అండర్‌హిల్ ప్రార్థన గురించి చెబుతూ "సకల విశ్వానికీ ఆధారభూతుడైన భగవంతునితో మనం చేసే వినమ్రపూర్వక సంభాషణే ప్రార్థన! మనం నిరంతరం భగవంతునితో సంభాషణ చేయలేకపోయినా ఫరవాలేదు. ఎలాగంటే పిల్లవాడు కాసేపు ఆటలాడుకుని, అమ్మ ఒడికి చేరినట్లుగా, మనం భగవంతుణ్ణి వీలున్నప్పుడల్లా ప్రార్థన చేయడం అలవరచుకోవాలి" అని వివరించారు.

మహాత్మా గాంధీజీకి ప్రార్థన శక్తి మీద అత్యంత విశ్వాసం ఉండేది. ప్రార్థన మాహాత్మ్యం గురించి ఆయన ఇలా చెప్పారు:

"ఆధ్యాత్మికంగానూ, వృత్తిపరంగానూ, సంస్థల నిర్వహణలోనూ, రాజకీయాలలోనూ నేను ఎదుర్కొన్న క్లిష్ట పరిస్థితుల నుండి భగవంతుడే నన్ను కాపాడాడు. ఆశలన్నీ అడుగంటినప్పుడూ, స్నేహితులు కనుమరుగైనప్పుడూ, మనస్సులో శాంతి కరువైనప్పుడూ ఎక్కడ నుండో నాకు తెలియకుండానే ఏదోవిధంగా సహాయం అందేది. ప్రార్థన, ఆరాధన అనేవి మూఢనమ్మకాలు కావు. ఇంకా చెప్పాలంటే తినడం, నిద్రపోవడం, కూర్చోవడం, నడవడం లాంటి పనులకంటే భగవదారాధన, ప్రార్థనలే మరింత వాస్తవమైనవి".

అనాది నుండీ మహాప్రవక్తలు, ఆచార్యులందరూ ప్రార్థన ద్వారానే పరిపూర్ణతను సాధించారు. ఏసుక్రీస్తు తాను కలతచెందినప్పుడు, సందిగ్ధంలో పడినప్పుడు ఏకాంతంలోకి వెళ్ళి ప్రార్థన చేసేవారు. మహమ్మద్ ప్రవక్త కూడా ఏకాంతంలో ప్రార్థన చేస్తూ భగవంతుని ధ్యానంలో లీనమైపోయేవారు. ఇక ఈ ఆధునిక కాలంలో శ్రీరామకృష్ణ పరమహంస ప్రార్థన ద్వారా సర్వోత్కృష్ట సత్యాన్ని సాక్షాత్కరించుకున్నారు. ఈ విధంగా ప్రపంచంలో మహాత్ములందరూ ప్రార్థన ద్వారా పరమోన్నత స్థాయిని పొందారు.

భగవంతుణ్ణి ఏమి కోరాలో శ్రీరామకృష్ణులు చెబుతూ "మనం భగవంతుణ్ణి ప్రాపంచిక కోరికలను కోరకుండా ఆయనే కావాలని కోరుకుంటే, మనకు కావలసినవన్నీ వాటంతట అవే సమకూరుతాయి" అని అన్నారు.

కాబట్టి మనం భగవంతుణ్ణి అది కావాలి, ఇది కావాలి అని అడగకుండా 'ఓ దేవా! నాకు ఎన్ని బాధలు, కష్టాలు వచ్చినా ఫరవాలేదు. కానీ నా మనస్సు నీ చరణారవిందాల నుండి తొలగిపోకుండా నన్ను అనుగ్రహించు' అని ప్రార్థించాలి. ఈ విధంగా మనం ప్రతి దినం భగవంతుణ్ణి ప్రార్థించడం అభ్యసిస్తే కష్టాలు, ఆందోళనలు, ఒత్తిళ్ళకు ప్రభావితులం కాకుండా ప్రశాంతంగా జీవించగలుగుతాం. జీవితంలో పరిపూర్ణతను సాధించగలుగుతాం. ❖

మహాపురుషుని సాన్నిధ్య స్మృతులు

– స్వామి అర్చనానంద

రామకృష్ణ సంఘ ఉపాధ్యక్షులైన కొన్ని నెలల తరువాతనే పూజ్య స్వామి రంగనాథానందజీ భక్తులకు మంత్రదీక్ష ఇవ్వడం ప్రారంభించారు. ప్రారంభం నుంచి ఎందుకివ్వడం లేదని కొందరు వరిష్ఠ స్వామీజీలు ప్రశ్నిస్తే 'ఏదైనా (శ్రీరామకృష్ణుల నుండి) ఆజ్ఞారూపంలో సూచన రానివ్వండి!' అన్నారట. శ్రీరామకృష్ణుల అంత్యలీలా క్షేత్రం, కల్పతరువుగా భక్తులందరినీ దీవించిన క్షేత్రం 'కాశీపూర్ ఉద్యాన గృహం' అంటే స్వామీజీ వారికి విశేషప్రియం. అందువల్లనే ఏమో మంత్రదీక్షనివ్వడం అక్కడే ప్రారంభించారు.

హైదరాబాద్ రామకృష్ణ మఠంలో 1990 ఆగష్టు 15వ తేదీ (స్వాతంత్ర్య దినం)న ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ ఆశ్రమం నుండి వచ్చిన ఇద్దరు బ్రహ్మచారులకు ప్రత్యేకంగా మంత్రదీక్షనిచ్చి దీవించారు. ఒక బ్రహ్మచారి దీక్ష పొందిన తరువాత – 'పాపం' అంటే ఏమిటి స్వామీజీ?' అని ప్రశ్నించాడు. మహరాజ్ గంభీరంగానూ, ప్రేమతోనూ – "ఎవరికైతే 'పాపం' అనే పదమే ఇష్టముండేది కాదో అటువంటి స్వామి వివేకానంద కూడా శ్రీరామకృష్ణుల దివ్యమంత్రాన్ని స్వీకరించడానికి 'మీరు పాపులు కాదు, అమృతాత్మ ఆనంద పుత్రులు' అనేవారు. కాబట్టి 'పాపం' గురించి చింతించకుండా, సాక్షాత్తూ పరమ పావన పవిత్రతా స్వరూపులైన శ్రీరామకృష్ణుల దివ్యనామాన్ని జపిస్తూ ఉండు, నీవు ధన్యుడవవుతావు" అని దీవించారు. ఇలా అన్ని విషయాలలోనూ సకారాత్మక దృష్టి – పూజ్య మహరాజ్ గారి అనంత సద్గుణ రాశిలో అతి ముఖ్యమైనది.

పూజ్య మహరాజ్ వారి జీవితమంతా 'వివేకానందమయమై' భాసించేది. 'బలం, బలం, బలమే భవ రోగానికి సరైన మందు' అని స్వామి వివేకానంద గర్జించినట్లుగానే దుర్బలమైన భావ తీవ్రత, ఉద్విగ్నతలను పూజ్య మహరాజ్ ఎప్పుడూ ప్రోత్సహించే వారు కాదు. ఒక భక్తుడు 'నేను ధ్యానంలో కూర్చుంటే ఎన్నో వింత వింత రంగుల చుక్కలు, నక్షత్రాలు కనిపిస్తున్నాయి' అని ఉత్తరం వ్రాశాడు. అందుకు స్వామీజీ 'నీవు చూస్తున్న వింత వింత చుక్కలు నక్షత్రాల దర్శనంలో ఆధ్యాత్మికత ఏమీ లేదు! శక్తిమంతమైన ఆహారం, వ్యాయామం ద్వారా నీ శారీరక, మానసిక శక్తిని పెంచుకో! వివేకానంద సాహిత్యం బాగా చదువు! ఇష్టమంత్రాన్ని శ్రద్ధాభక్తులతో నిష్ఠగా జపం చేయి! నిజమైన ధ్యానం నీకు తప్పక సిద్ధిస్తుంది' అని సమాధానం వ్రాశారు.

ఏదైనా నిజమైన ఆధ్యాత్మిక అనుభూతి కలిగితే అది వ్యక్తి వ్యక్తిత్వాన్నీ, శీలాన్నీ, నడవడికనూ ఉన్నతంగా, ఉత్తమంగా పరివర్తన చేస్తుందని శిష్యులకు స్వామీజీ బోధించేవారు. కానీ తాత్కాలికమైన, దుర్బలమైన భావావేశం పాలపొంగులా పైకి లేచి, వెంటనే క్రిందికి చల్లారిపోతుంది. సాధకుణ్ణి మాయ, భ్రాంతిలో పడవేస్తుంది' అని హెచ్చరించేవారు. 'చెడు తలపులను, కోరికలను ఎలా జయించాలి?' అని ఒక శిష్యుడు ప్రశ్నిస్తే 'ఆ చెడు తలపులు, కోరికల మీదనే మనస్సును మథనం చేయనీయకుండా, శ్రీరామకృష్ణుల (ఇష్టదైవం)పై భక్తి, ప్రేమలను పెంచుకోవడం ద్వారా, ప్రార్థన ద్వారా' అని బదులిచ్చారు.

మనఃసంయమనం, తపస్సుల గురించి ఒక శిష్యునికి ఇలా వ్రాశారు: "ఒక సాధకునిగా నీవు చేయవలసిన తపస్సు మనస్సు నిమ్నస్థాయి (భోగ) సంస్కారాల వైపు దిగజారుతున్నప్పుడు దానిని ఉన్నత స్థాయికి లేవనెత్తడమే! శ్రీరామకృష్ణుల కృపానుగ్రహం నీపై వర్షించి, నిన్ను శాంతి, ఆనందాలతో ఓలలాడింప (జీవింప)జేసేటంత వరకూ నీవు ఈ తపస్సు, సంగ్రామం చేయవలసిందే! శ్రీరామకృష్ణులను ప్రేమించు, సేవించు. శ్రీరామకృష్ణులు నీకు నీ కుసంస్కారాలతో పోరాడడానికి కావలసిన శక్తిని అనుగ్రహించు గాక!"

'మానవుడే మాధవుడు' అన్న వివేకానంద వేదాంత వాక్యాలను అక్షరాలా పాటించిన అమరజీవి స్వామి రంగనాథానందజీ! ఓసారి తిరుపతికి వెళ్ళినపుడు స్వామీజీ కోసమై ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేయించారు తిరుమల తిరుపతి దేవస్థానాల (టి.టి.డి.) వారు. విఐపి దర్శనం వల్ల వేలాది భక్త జనావళికి శ్రీవేంకటేశ్వరుని దివ్యదర్శనం 10 నిమిషాల పాటు నిలిపివేయవలసి వస్తుందని తెలిసింది మహరాజ్‌కు! తెలిసిన వెంటనే తాను ప్రత్యేక దర్శనానికి వెళ్ళడం లేదనీ, తన ఒక్కరి కోసం వేలమంది భక్తులు వేచి నిలబడి ఇబ్బందులు పడడం తనకు ఇష్టం లేదనీ, ఆ వేలాది భక్తులలోనే తాను శ్రీవేంకటనాథుని దర్శించుకుంటాననీ సవినయంగా తెలియజేశారు. ❖

(స్వామి రంగనాథానందజీ మహరాజ్, హైదరాబాద్ రామకృష్ణ మఠ సంస్థాపకాధ్యక్షులు, రామకృష్ణ సంఘ 13వ సర్వాధ్యక్షులు)

వేదవిదుడూ, పాపరహితుడూ, కామనారహితుడూ, బ్రహ్మనిష్ఠుడూ, పరమశాంతుడూ, కరుణా సముద్రుడూ, ఆశ్రిత రక్షకుడూ, భేదరహితుడూ అయినవాడే సద్గురువు. *– ఆది శంకరాచార్యులు*



ముందు జన్మకు పెట్టుబడి

– శ్రీమతి భమిడిపాటి బాలాత్రిపురసుందరి

మనిషి మృత్యువు అనే మాట వినగానే భయపడతాడు. 'శివ! శివ!' అని చెవులు మూసుకుంటాడు. మంచిమార్గంలో నడిచేవారికి అది మంగళకరంగానే ఉంటుంది. ఆదాయపుపన్ను లెక్కలు తప్పుగా చూపించినట్టు కాదు, భగవంతుడు ఇచ్చిన శరీరం, దాని అవయవాలు ఏ విధంగా ఉపయోగించుకున్నారో సరిగ్గా లెక్క చెప్పి తీరాల్సిందే!

ఒక పెళ్ళి చెయ్యాలన్నా... ఇల్లు కట్టించాలన్నా ఎన్నో విధాలుగా ఆలోచిస్తాం. ఎంతో శ్రమిస్తాం. శరీరాన్ని వదిలి వెళ్ళేటప్పుడు ఏర్పాట్లు ఏం చేసుకోవాలో కూడా ముఖ్యమే కదా! ముసలితనంలో సుఖపడాలంటే వయస్సులో ఉన్నప్పుడే సంపాదించి పెట్టుకోవాలి. పరలోకయాత్ర సఫలం కావాలంటే కావలసినవి ఇహలోకంలోనే సంపాదించి పెట్టుకోవాలి.

ముసలితనానికి సొమ్ము దాచిపెట్టుకుంటే పిల్లలు పోటీ పడి మరీ చూస్తారు. అది లేనప్పుడు "నేనే చూడాలా... వాళ్ళ దగ్గర కూడా ఉండవచ్చుగా!" అంటారు. సుఖంగా జీవించడానికి సొమ్ము ఎంత అవసరమో... తిరిగి ఉత్తమ జన్మ పొందడానికి కూడా సత్కర్మలనే పెట్టుబడి అంతే అవసరం!

వయస్సులో ఉన్నప్పుడు సంపాదించి పిల్లల్ని పోషించినా వృద్ధాప్యం గడవాలంటే దాచి ఉంచుకున్న సొమ్మే ఆధారం.

ఒక తండ్రికి ఐదుగురు కొడుకులు. భార్య మరణించింది. అతడు దాచిపెట్టుకున్న ఐదులక్షల రూపాయలను ఐదుగురి కొడుకులకీ పంచేశాడు. అప్పటి నుండి అతడికి కష్టాలు మొదలయ్యాయి. డబ్బు లేనందువల్ల వృద్ధాప్యంలో ఉన్న తండ్రిని కొడుకులు చూడకుండా వదిలేశారు.

వృద్ధాప్యంలో అతడు పడుతున్న బాధలు చూసిన అతడి చిన్ననాటి స్నేహితుడు ఒకడు ఒక పెట్టెను తెచ్చి, "నువ్వు బాధపడకు. ఈ పెట్టెను నీ గదిలోనే ఉంచు. నువ్వు పోయాక ఈ పెట్టెలో ఉన్నది, నీ కొడుకులు పంచుకోవచ్చని చెప్పు. ఇదిగో తాళంచెవి. అప్పటివరకు ఈ పెట్టెను తెరచి చూడవద్దు!" అని చెప్పి వెళ్ళిపోయాడు.

ఆ పెట్టెను చూసిన కొడుకులు తండ్రి వద్ద ధనం ఉందని భావించి తండ్రిని ప్రేమగా చూసుకోవడం మొదలుపెట్టారు. కోడళ్ళు కూడా అతడికి కావలసినవి అన్నీ చేసిపెడుతున్నారు. కొంతకాలానికి అతడు మరణించాడు. కొడుకులందరూ కలసి కర్మకాండలు వైభవంగా చేశామనిపించుకున్నారు. పనులన్నీ పూర్తయ్యాక ఆ ఐదుగురూ ఆ పెట్టె తెరచి చూశారు. దాంట్లో నిండుగా ఇటుకలు కనిపించాయి! అందరూ ఆశ్చర్యపోయారు.

వయస్సులో ఉండగా సంపాదించిన సొమ్మును వృద్ధాప్యం కోసం ఎలా దాచాలో అదే విధంగా శరీర ఆరోగ్యం సరిగ్గా ఉన్నప్పుడే పరలోక సిద్ధికి కూడా కావలసిన జ్ఞానాన్ని సంపాదించి పెట్టుకోవాలి. లేకపోతే ధనం లేని వార్ధక్యం ఎంత దుర్భరమో... భగవంతుణ్ణి తలవని జీవి మరణించిన తరువాత పడే బాధ అంతకంటే దుర్భరం.

'ఇహ చేదవేదీద ధనసత్యమస్తి న చేది హావేదీన్మహతీవినష్టి, భూతేషు భూతేషు విచింత్య ధీరాః ప్రేత్యాస్మాలోకాద మృతాభవన్తి' – ఈ లోకంలో ఉండగానే తెలుసుకోవలసినవి అన్నీ తెలుసుకుంటే అది సవ్యమైన నిజమైన జీవితం. తెలుసుకోలేని వాళ్ళు నష్టపోతారు. జీవించి ఉండగానే సత్కర్మలు, సాధనలు చేసేవారు శరీరాన్ని వదిలిన తరువాత అమృతత్వాన్ని పొందుతారు.

జీవితంలో ఎన్ని తప్పులు చేసినా... చెడు మార్గంలో నడిచినా వృద్ధాప్య దశకు చేరుకునే సమయానికైనా ఆ విషయం తెలుసుకుని పశ్చాత్తాపం పొంది జీవితాన్ని మంచి మార్గం వైపు నడిపించుకోవాలి. ఆ పని ఒకేసారి సాధ్యం కాదు కనుక భగవన్నామం చేస్తూ జీవించడం ముందు నుంచే అలవరచుకుంటే, ముసలితనంలో జీవనం సుఖంగా ఉంటుంది. పరలోకంలో శాంతి దొరుకుతుంది.

అలాగే, వయస్సులో ఉన్న ప్రతి మనిషీ రాబోయే కాలానికి తాము కూడా వృద్ధులమవుతామన్న విషయం గుర్తుంచుకుని వృద్ధులైన తల్లితండ్రులను ఆదరిస్తే, ఆ సమయం ఆసన్నమయ్యేటప్పటికి వాళ్ళకు కూడా మంచి జరుగుతుంది. ❖

పరహితానికై పాటుపడండి!

'శ్రేయాంసి బహు విఘ్నాని' - మంచి పనులకు అడ్డంకులు అనేకం. మీకిది తెలిసిన సంగతే. ఈ ఆటంకాల వల్లనే గొప్ప శీలవంతులు రూపొందుతారు. ప్రతి పనిలో మెచ్చుకొనేవారు కొందరు, తప్పులెన్నేవారు కొందరు ఉంటారు. మీ పనిని మీరు చేసుకుపోండి. మీరు ఎవరికీ జవాబు చెప్పవలసిన పని లేదు. 'సత్యమేవ జయతే, నానృతం-సత్యమే జయిస్తుంది, అసత్యం కాదు'.

స్త్రీ పురుష వ్యత్యాసాన్ని రూపుమాన్పితే గాని నేను విశ్రమించను. ఆత్మకు స్త్రీ పురుష వ్యత్యాసముందా? స్త్రీ పురుషుల మధ్యనున్న వ్యత్యాసం అంతరించనీ! అందరూ ఆత్మే! శరీరమే నేననే భ్రాంతిని విడనాడు. 'సోఽహం, సోఽహం, శివోఽహం' - అతడే నేను. అతడే నేను. నేను శివుణ్ణి. 'అస్తి, అస్తి' అనే పలుకు. 'అంతా సత్యమే' అనే ఆస్తిక్యభావాలు కలిగి ఉండు. 'నాస్తి', 'నాస్తి' 'ఇది లేదు' అనే వ్యతిరేక భావాలనే పునరావృతం చేస్తూ ఉండడం వలన దేశం వినాశన స్థితికి చేరుతుంది!

ప్రతి జీవిలోను అనంతమైన శక్తి ఉంది. ఈ వ్యతిరేకభావాలను తలపోస్తూ మీరు కుక్కలు, పిల్లులుగా మారాలా? ఈ వ్యతిరేకభావాలను ప్రచారం చేయడానికి సాహసిస్తున్న వారెవరు? వ్యతిరేక భావాలను తలపోసేవారి గురించి విన్నప్పుడు నా తల మీద పిడుగు పడినట్లు అవుతుంది.

ఆత్మవంచన అనేది ఓ రోగం. 'న లిఙ్గమ్ ధర్మకారణం, సమతా సర్వభూతేషు ఏతన్ముక్తస్య లక్షణమ్' - బాహ్యవేషం ఆధ్యాత్మిక స్థితిని ప్రసాదించదు. సర్వభూతాల్లోనూ సమతాదృష్టే ముక్తపురుషుని లక్షణం. 'నా యామాత్మా బలహీనేన లభ్యః' 'దుర్బలులు ఈ ఆత్మను పొందలేరు'.

పరహితార్థానికై ఈ జీవితం అంతరించే దినం ఎప్పటికైనా వస్తుందా? ఈ ప్రపంచం ఒక పిల్లల ఆట కాదు - తమ హృదయ రక్తధారలనే రహదార్లు నిర్మించేవారే మహనీయులు.

శ్రీరామకృష్ణులు అవతరించింది జగత్ హితానికే గాని, పేరుప్రతిష్ఠల కోసం కాదని సదా జ్ఞాపకం ఉంచుకోండి. ఆయన దేన్ని బోధించారో దాన్నే ప్రచారం చేయండి. ఆయన పేరు గూర్చి ఆలోచించవద్దు - దానంతట అదే వ్యాప్తి చెందుతుంది. అందరూ మీ గురుదేవుని యందే విశ్వాసముంచాలని ఒత్తిడి చేస్తే, మీరు మరొక తెగను సృష్టించినవారే అవుతారు. అప్పుడు సమస్తం నేలమట్టమవుతుంది. కాబట్టి జాగ్రత్త వహించండి.

ప్రజలు వారి ఇష్టం వచ్చినట్లు మాట్లాడనీ, మీ ఆశయాలను అంటిపెట్టుకొని ఉన్నారా, లోకం సమస్తం మీ పాదాక్రాంతమవుతుంది. ఆత్మవిశ్వాసం కలిగి ఉండండి - శక్తి సమస్తం మీలోనే ఉంది. దాన్ని బహిర్గతం చెయ్యండి. నేను దేన్నైనా సాధిస్తాను అనండి. గట్టిగా చెప్పగలిగితివా - హాలాహలం కూడా నిర్వీర్యమైపోతుంది. ❖

అశేష విశేషాల అక్షయ తృతీయ

– డాక్టర్ అపర్ణా శ్రీనివాస్

సంవత్సరంలోని అన్ని మాసాలూ వేటికవే విశిష్టతను సంతరించుకుని, మనలో ఒక నూతన ఉత్తేజాన్ని నింపుతూ, జీవనయాత్రలో సహకరిస్తాయి. ఆ విధంగా వైశాఖమాసం కూడా ఆధ్యాత్మికంగా శక్తిమంతమైన మాసం. ఎన్నో విశిష్టతలు కలిగి ఉన్న ఈ వైశాఖ మాసంలోనే పరశురామ, నారసింహ, హనుమంతుని జయంతులు *(తిథుల రీత్యా ఈ సంవత్సరం మే నెలలో)* వస్తాయి.

మహాత్ములైన శ్రీఆదిశంకరాచార్యులు, శ్రీరామానుజాచార్యులు జన్మించింది ఈ మాసంలోనే. ఇటువంటి విశిష్ట మాసంలో ముందుగా వచ్చే పర్వం 'అక్షయ తృతీయ'.

వైశాఖశుక్ల తదియను 'అక్షయ తృతీయ'గా వ్యవహరిస్తారు. ఆనాడు చేసే కొద్దిపాటి జపమైనా, దానమైనా, హోమ తర్పణాదులైనా విశేష ఫలాన్ని అందజేస్తాయని శాస్త్రవచనం. 'అక్షయం' అంటే క్షయం లేకుండుట! అయితే ఈ ప్రపంచంలోని ప్రతీదీ దేశ, కాలాలకు లోబడి ఉన్నదే. సకల ప్రాణులు, పదార్థాలు – అన్నీ పరిమితికి లోబడి, తుదకు క్షయాన్ని (తరుగుదల) పొందవలసినవే!

చలా లక్ష్మీః చలా ప్రాణాః చలం జీవిత యౌవనం।
చలా చలేచ సంసారే ధర్మ ఏకోహి నిశ్చలః ॥

'సంపదలు, ప్రాణం, జీవితం, యౌవనం – ఇవన్నీ అస్థిరాలే! సర్వం అస్థిరమైన ఈ లోకంలో ధర్మం ఒక్కటే స్థిరమైనది'. కాబట్టి ఆ ధర్మాన్ని ఆశ్రయించడం ద్వారా నిత్యుడు, శాశ్వతుడు, అవ్యయుడు, అక్షరుడు, అవినాశి అయిన ఆ పరమాత్ముని కృపను పొందగలం.

'అక్షయ తృతీయ'కు సంబంధించిన విశేషాంశాలు మన పురాణాలలో చాలా ఉన్నాయి. ఆనాడు పునర్వసు నక్షత్రంలో శ్రీమహావిష్ణువు పరశురామునిగా జన్మించాడు. యుగాలలో మొదటిదైన కృతయుగ ప్రారంభం ఆనాటి నుండేనని 'విష్ణుపురాణం' వివరిస్తోంది.

ఇవేకాక, అక్షయ తృతీయకు సంబంధించిన ఆసక్తికరమైన కథనాలు ఇంకా అనేకం ఉన్నాయి. అదే రోజు వేదవ్యాసుడు, గణపతి కలిసి మహాభారత రచనకు ఉపక్రమించారనీ, ఆనాడే శ్రీకృష్ణుడు అరణ్యవాసం చేస్తున్న పాండవులకు అక్షయపాత్రను బహూకరించాడనీ, ఆనాడు శ్రీకృష్ణుడి చిన్ననాటి స్నేహితుడైన సుధాముడు కృష్ణుని దర్శించి గుప్పెడు అటుకులను భక్తిపూర్వకంగా సమర్పించినందుకు, అక్షయ సంపదలను పొందాడనీ చెబుతారు. అంతేకాక ఆదిశంకరులు బాల్యంలో భిక్షాటన చేస్తూ ఓ నిరుపేదరాలు నుండి ఎండిన ఉసిరికాయను గ్రహించి, కనకధారా స్తవ పఠనం ద్వారా ఆమె ఇంట కనకవర్షం కురిపించిందీ ఈనాడేనని తెలుస్తోంది.

ఇన్ని విశేషాలున్న ఈ రోజున, క్షయరహితుడైన ఆ పరమాత్మ విశాఖపట్నం జిల్లా సింహాచలం క్షేత్రంలో తన అక్షయ స్వరూపాన్ని నిజరూప దర్శనం ద్వారా కలిగించడం ఇంకొక విశేషం. ఏడాదిలో ఈ ఒక్కనాడే ఆ దర్శనం లభిస్తుంది.

సింహాచల క్షేత్ర స్థల పురాణం ప్రకారం కృతయుగంలో తండ్రి వల్ల అనేక విధాలుగా బాధలు పడుతున్న ప్రహ్లాదుని రక్షించేందుకు స్వామి వచ్చారంటారు. కొండపై నుండి విసిరివేయబడిన ప్రహ్లాదుణ్ణి స్వామి కాచి రక్షించిన స్థలం ఇదేననీ, అందువల్ల స్వామి పాదాలు కొండ లోపలికి చొచ్చుకుని ఉండడంతో విగ్రహంలో అవి కనబడవనీ చెబుతారు. కాలాంతరంలో పురూరవుడు అనే చక్రవర్తి ద్వారా ఈ విగ్రహం వెలికి తీయబడిందనీ, ఆ సమయంలో ఆకాశవాణి వైశాఖశుద్ధ తదియ (అక్షయ తృతీయ) నాడు మాత్రమే నిజరూప దర్శనం కలిగేలా చేయమనీ, తక్కిన సంవత్సరకాలమంతా చందనపు పూతతో స్వామిని కప్పి ఉంచమనీ ఆదేశించగా, ఆనాటి నుండి ఈనాటి వరకూ ఆ సంప్రదాయాన్నే పాటిస్తూ వస్తున్నారు. అందువల్ల, స్వామి ఇక్కడ రెండు రకాలుగా దర్శనమిస్తారు – ఏడాది పొడవునా నిత్యరూపంతో, చందనం పూతతో లింగాకృతిలోనూ, అక్షయ తృతీయనాడు మాత్రం నిజరూపంలో, వరాహపు ముట్టెతో నరుడు మరియు సింహం రూపాలు కలిసిన త్రిభంగి ముద్రలోనూ కనిపిస్తారు. వరాహ అవతారం, నృసింహ అవతారం కలగలిపి వెలసిన క్షేత్రం ఇది ఒక్కటే.

పదకొండో శతాబ్దం నుండి ప్రాచుర్యంలో ఉన్న ఈ క్షేత్రం సింహం ఆకారంలో ఉన్న కొండపై ఉండడం వల్ల దీన్ని 'సింహాచలం'గా వ్యవహరిస్తున్నారు. ఏడాదికి ఒక్కసారే అక్షయ తృతీయనాడు జరిగే చందనోత్సవం అత్యంత నయనానందకరం. ఈ చందనోత్సవానికై స్వామిని ఏడాది మొత్తంలో పన్నెండు మణుగుల (480 కిలోల) చందనంతో అలంకరిస్తారు. చందనోత్సవానికై శ్రేష్ఠమైన జాజిపోకల గంధపు చెక్కలను తమిళనాడులోని తిరువత్తూర్ నుండి ఆలయ సంబంధిత అధికారులు కొనుగోలు చేస్తారు. చందనోత్సవానికి

వారం రోజులు ముందుగా ఆలయ నిబంధనల ప్రకారం నిష్ఠతో, చందనం అరగదీత మొదలవుతుంది.

వైశాఖశుద్ధ తదియ నాడు తెల్లవారుజామున ఒంటిగంట నుండి స్వామి సేవ మొదలవుతుంది. అభిషేకాలు, ఆరాధనల అనంతరం సుగంధద్రవ్యాలు, వనమూలికలు మిళితం చేసిన పచ్చి చందనం ముద్దను స్వామి శిరస్సున, ఎదపైన ఉంచి, స్వామిని నిజరూపంలోనికి తీసుకు వస్తారు. ఆనాడు అంతా స్వామి నిజరూప దర్శనాన్ని కలిగింపజేసి, తిరిగి సాయంత్రం నుండి స్వామికి సహస్ర ఘటాభిషేకం, 108 కలశాల పంచామృతాభిషేకం చేసి, అర్ధరాత్రి పన్నెండు గంటల తరువాత శీతలోపచారాల అనంతరం తొలివిడతగా మూడు మణుగుల (120 కిలోల) చందనాన్ని సమర్పించి, నిత్యరూపంలోకి తిరిగి

తీసుకువచ్చేస్తారు. ఈ చందన సమర్పణం నాలుగు విడతలుగా, మొదటిసారి అక్షయ తృతీయనాడు, రెండోసారి వైశాఖ పూర్ణిమనాడు, మూడోసారి జ్యేష్ఠ పూర్ణిమనాడు, చివరగా ఆషాఢ పూర్ణిమనాడు సమర్పిస్తారు. ప్రతీ తడవ సుమారుగా నూట ఇరవై కిలోల చందనాన్ని సమర్పిస్తారు.

స్వామి ఉగ్రత్వాన్ని తగ్గించేందుకు చందన సమర్పణం చేస్తున్నామని లౌకికంగా చెప్పుకున్నా, పారమార్థికంగా దీనికి ఇంకో అర్థం కూడా చెప్పుకోవచ్చు. చందనం అనేది సహజసిద్ధమైన పరిమళాన్ని కలిగి ఉంటుంది. అయితే దీనికి నీటితో సంపర్కం ఎక్కువ కాలం కలిగితే, అది తన సహజ పరిమళాన్ని కోల్పోయి దుర్గంధం వెదజల్లుతుంది. దానిని నీటి నుండి బయటకు తీసి, రాతిపై తిరిగి సానపెడితే, అది తన స్వభావ సిద్ధమైన సహజ పరిమళాన్ని వెదజల్లుతుంది. దీనినే శ్రీశంకరులు 'వివేకచూడామణి'లో ఇలా తెలియజేశారు.

జలాది సంపర్కవశాత్ ప్రభూత, దుర్గంధధూతాగరు దివ్యవాసనా ।
సంఘర్షణేనైవ విభాతి సమ్యగ్, విధూయమానే సతి బాహ్యగంధే ॥
అంతః శ్రితానంతదురంతవాసనా, ధూళీవిలిప్తా పరమాత్మ వాసనా।
ప్రజ్ఞాతి సంఘర్షణతో విశుద్ధా, ప్రతీయతే చందనగంధవత్స్ఫుటా॥

పరమాత్మ స్వరూపాలు అయిన జీవులందరూ చందనం వంటివారే, అయితే అజ్ఞానం వల్ల స్వస్వరూపాన్నీ, స్వతహాగా ఉన్న దివ్యత్వాన్నీ గుర్తించడం లేదు. చందనానికి నీటి సంపర్కం వల్ల దుర్గంధం కలిగినట్లు, వాసనలు (దేహవాసన, లోకవాసన, శాస్త్రవాసన) అనే నీటి ప్రభావంచే, జీవులలో స్వతస్సిద్ధంగా ఉన్న దివ్యత్వం మరుగున పడి ఉంది. జ్ఞానమనే రాపిడితో ఈ దుర్వాసనలు తొలగగలవు.

అయితే జీవభావం పూర్తిగా నశించే వరకూ భక్తి, విశ్వాస, జ్ఞానాలు ఆవశ్యకాలే. అందుకనే, తన సర్వవ్యాపకత్వాన్ని స్పష్టం చేస్తూ, అటు మృగమూ, ఇటు మానుషమూ కానీ అద్భుతరూపంలో, ద్వంద్వాలకు అతీతమైన స్థితిలో ఆవిర్భవించిన లక్ష్మీనారసింహుని కృపను అర్థించాలి.

వాస్తవానికి ఆలోచనకూ, ఆలోచనకూ మధ్య గల సూక్ష్మసమయమే – సంధిస్థితి. అదే ఈశ్వరస్థితి. లౌకిక ఆలోచనా ప్రవాహంలో కొట్టుకొనిపోతూ ఉన్నవారికి, ఆ స్థితి అనుభవంలోకి రావాలంటే ఆ భగవంతుని చేయూత తప్పనిసరి. దీనినే వక్కాణిస్తూ, మనలోని భయాలను పోగొట్టే విధంగా అభయమిచ్చే అమృతమూర్తి అయిన ఆ లక్ష్మీనృసింహుని చేయూతను అర్థిస్తూ ఆదిశంకరులు చేసిన ప్రార్థనను మనమూ చేద్దాం.

శ్రీమత్పయోనిధి నికేతన! చక్రపాణే!
భోగీంద్ర భోగమణి రాజిత! పుణ్యమూర్తే! ।
యోగీశ! శాశ్వత! శరణ్య! భవాబ్ధిపోత!
లక్ష్మీనృసింహ! మమదేహి కరావలంబమ్ ॥

'శ్రీమంతమైన పాల సముద్రంలో ఉండువాడా! చేతి యందు సుదర్శన చక్రాన్ని ధరించినవాడా! శ్రేష్ఠమైన ఆదిశేషుని శరీరంపై పవ్వళించి ప్రకాశించువాడా! పుణ్యవిగ్రహా! యోగీశ్వరుడా! శాశ్వతుడా! శరణునొసంగువాడా! సంసార సముద్రాన్ని దాటించే నౌక అయినవాడా! ఓ లక్ష్మీనృసింహా! నాకు చేయూతనిచ్చి కాపాడుము'. ❖

దేహాభిమానాన్నీ, విషయాసక్తినీ త్యజింపకుండా ఆత్మసాక్షాత్కారం కోసం ప్రయత్నించే వ్యక్తి, మొసలిని దుంగగా భ్రమించి, దాని మీద కూర్చొని నదిని దాటగోరేలాంటివాడు. - *ఆది శంకరాచార్యులు*

ప్రయాణ

మహాభారతంలో యక్షప్రశ్నల ఘట్టం మనందరికీ విదితమే. యక్షుడిరూపంలోని యమధర్మరాజు తన కుమారుడైన యుధిష్ఠిరుడిని ఎన్నో తెలివైన ప్రశ్నలడిగి విజ్ఞానదాయక సమాధానాలు రాబడతాడు. ఆ ప్రశ్నలపరంపరలో అడిగిన ఒక ప్రశ్న, **'కో మోదతే?** ఎవరు సంతోషంగా ఉంటారు?' దీనికి సమాధానంగా ధర్మరాజు 'తన భోజనాన్ని తాను వండుకునే వాడు; అనృణి.. అంటే అప్పులు లేనివాడు; అప్రవాసి.. అంటే దూరతీరాలకు ప్రయాణించని వాడు సంతోషంగా ఉంటాడ'ని అంటాడు. నిత్యం ప్రయాణాలు సంకల్పించని వాడు అని కూడా మనం ఈ మూడవ సమాధానానికి అర్థం చెప్పుకోవచ్చును.

సంచారం ఎప్పుడూ శ్రమతో కూడుకునే ఉంటుంది. కాస్తో కూస్తో శ్రమలేకుండా ఏ ప్రయాణమూ చేయలేం. నేటి మనిషి ఉద్యోగరీత్యా, వ్యాపార వృద్ధికై, ఉన్నత అవకాశాలకై, విద్యార్జనకై, తీర్థయాత్రల నిమిత్తం ప్రయాణాలు సంకల్పిస్తున్నాడు. రామకృష్ణ పరమహంసల వారు ఒకే ఒక్కసారి తప్ప హౌరాలోని దక్షిణేశ్వరం వదిలి దూరప్రాంతాలకు ప్రయాణాలు చేయలేదు. రమణ మహర్షి తిరువణ్ణామలై వదిలి ఇంకో ప్రదేశాన్ని చూసింది లేదు.



వివేకానంద స్వామి ప్రపంచాన్ని సుడిగాలిలా చుట్టి వచ్చారు. ఆయన విహారయాత్ర చేయలేదు. సంస్కృతులను చూస్తూ, నాగరకతలను బేరీజు వేస్తూ భారతీయులకు వారి వారసత్వం ఎంత గొప్పదో తెలియజెప్పటానికీ; మనిషి పరిపూర్ణతను సాధించటానికీ; చంచలత్వం నుంచి ముక్తుడై పరమశాంతిని పొందడానికీ భారతదేశంలోనూ, ప్రపంచంలోని వివిధ దేశాలలోనూ పర్యటించి మానవాళికి జ్ఞానబోధ చేశారు.

ఈ రోజు మన ప్రయాణాలు: ఈ రోజు మన పర్యటనలు అల్లకల్లోల మనోసముద్రం నుంచి జనించిన కెరటాలు. చిత్త సాగరాన్ని ఉపశమింపజేయలేకపోవటం వలన కలుగుతున్న పరిణామం. నేడు మనకు రకరకాల ప్రయాణ మాధ్యమాలు ఉన్నాయి. అతివేగంగా ప్రయాణించటానికి విమానాలు, రైళ్ళు, కార్లు, బస్సులు.. అన్నీ ఉన్నాయి. రోజురోజుకు ఇంకా ఎక్కువ వేగంగా ప్రయాణించటానికి అనువుగా ఉండే వాహనాలను సమకూర్చుకోవటానికి ప్రయత్నిస్తున్నాం. కానీ మన ప్రయాణాలలో ఎన్ని అవసరమైన ప్రయాణాలు? ఎన్ని అనవసరమైనవి? అని మనం ప్రశ్నించుకోవటం లేదు. సదా సంచరించటమే ఉన్నత జీవితం అనుకుంటున్నాం. విరామం లేకుండా జీవితాన్ని గడపటం జీవనశోభను మసకబారుస్తుందనీ, అది అంతఃశూన్యత (inner emptiness)కు సూచిక అనీ మాత్రం గ్రహించటం లేదు.

మనలో చాలామంది నేడు సెలవులు రాగానే ఏదో తీర్థయాత్రో, విహారయాత్రో సంకల్పిస్తున్నారు. మనతో మనం గడపటానికి మాత్రం అశక్తులం. మనసునుంచి పారిపోవటానికి ప్రయత్నం చేస్తున్నామనిపిస్తుంది. ఇక సంక్రాంతి, దసరా, దీపావళి మొదలగు పండుగలకు వరుసగా మూడు, నాలుగు రోజులు సెలవులు వస్తే మహానగరాలు ఖాళీ అయిపోతున్నాయి. మన ఊళ్ళకు వెళ్ళడం, మనవాళ్ళను చూడటం, కొద్ది సమయం వారితో గడపటం...ఇందుకు ప్రయాణాలు చేస్తున్నాం. రైళ్ళు, బస్సులు అన్నీ రద్దీగా ఉంటాయి. ప్రయాణం చాలా శ్రమతో కూడుకున్నదవుతున్నది. ఐనా అంత శ్రమకోర్చి, బాధను భరించి మన వాళ్ళను చూడాలి. క్రిందటి దశాబ్దం వరకు చలవాణి లేదు, స్కైపులేదు. ఉత్తరాలు వ్రాసుకొని, క్షేమసమాచారాలు తెలుసుకొని ఆనందించేవారు. ఇంతటి త్రిమ్మటతీపి (తిరిగే కోరిక) అప్పుడు లేదు. మరి నేడు ఇన్ని ఆధునిక పరికరాలతో రోజూ తనవాళ్ళనుకున్న వారి మాటలను వింటూ (చలవాణి ద్వారా), రూపాన్ని చూస్తూ మళ్ళీ ఇన్ని ప్రయాణాలు ఎందుకు? ఈ ప్రయాణ ప్రయాసను కాస్త తగ్గించుకోవచ్చు కదా! ఈ పరిస్థితికి కారణం మనతో మనం ఆనందంగా ఉండలేక పోవటమే.

మన మనసును మనం మిత్రుడిగా చేసుకుంటే అనవసర ప్రయాణాలను కొంత తగ్గించుకోగలుగుతాం. అలా ఆదా చేసిన శక్తి, సమయాన్ని వేరే కార్యానికి ఉపయోగించుకోగలుగుతాం. కానీ ఆధునికుడికి ప్రతినిమిషం పరిగెడితేనే ప్రాణం నిలుస్తుంది! మనసు పోరును వినకుండా ఉండటానికే మనం ప్రయాణాలను సంకల్పిస్తున్నామేమో ఆలోచించాలి.

ఈ పరిణామానికి ఒక కారణం సాంకేతిక అభివృద్ధి విపరీతంగా సాధించినా భావోద్వేగాల పరంగా, ఆలోచనల పరంగా మనిషి బలహీనుడవుతున్నాడు. ప్రతికూల భావోద్వేగాల (negative emotions)వలన, ఆలోచనల (negative thoughts) వలన మనకు ఎప్పుడూ ఎవరిదో ఆసరా కావాలి. ఈ ఆసరా కోసం బంధువులూ లేదా మిత్రులు లేదా తల్లిదండ్రులు పైన ఎక్కువగా ఆధారపడి ఉంటూ మనల్ని మనం భగవంతుడి ప్రేమతో, లేదా తోటి మానవుడి ప్రేమతో నింపుకోలేక, వెలితితో, ఆధారం కోసం మనవాళ్ళనుకున్న వ్యక్తులను తరచుగా చూడాలని తపిస్తున్నాం. ఆ ప్రయత్నం వలన కలుగుతున్న పరిణామమే ఈ ప్రయాణాల హోరు, జోరూనూ.

ప్రయాణం

– స్వామి శితికంఠానంద

ప్రయాణ ప్రహసనానికి దూరం: ఇక తెలుగుదేశాలలో నేడు కనిపిస్తున్న ఇంకో పరిణామమేమంటే పాఠశాలలో చదువుకోవడం కోసం బుడిబుడినడకల బుడతలను కూడా బస్సు ఎక్కించాల్సిందే! వాహనం ఎక్కి దిగితే కానీ చదువు లేదు!

ఇక విద్యార్థులలాగా చాలామంది ఉద్యోగులు కూడా చేస్తున్న పని ఒకచోట, నివాసం ఇంకోచోటయ్యేసరికి రోజూ ప్రయాణం తప్పడం లేదు. నిత్యప్రయాణమే వారి జీవితం. సగం జీవితం బస్సులలోనో, రైళ్ళలోనో, ఇతర వాహనాల పైననో గడిపివేస్తున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. అవకాశం లేకపోతే అది వేరే విషయం. అవకాశం ఉంటే కార్యాలయం లేదా కర్మాగారం సమీపంలో ఉండి ప్రయాణ ప్రహసనానికి దూరంగా ఉండటం ఉత్తమం.

అతి ప్రయాణాల వలన చేటు : ఇక ఈ ప్రయాణాలవలన మనకు సమయం చాలా తక్కువగా లభిస్తుంది కాబట్టి మేధోపరమైన వికాసాన్ని పొందలేం. తరచూ ప్రయాణాలతో మనోశరీరాలు రెండూ తొందరగా అలసిపోతాయి. మనసులో తమోగుణం పెరుగుతుంది. శరీరం వేగంగా అలసిపోవటం వలన నిద్ర ఎక్కువ అవసరమౌతుంది. వ్యక్తిలో సృజనాత్మకత, విశ్లేషణాత్మకత, లోతుగా ఆలోచించే శక్తి సన్నగిల్లుతాయి. ఇక ఆధ్యాత్మిక సాధన, అవగాహన, అవలోకనం గురించి ఆలోచించనవసరంలేదు. ఎవరు తక్కువగా ప్రయాణాలు చేస్తారో వారు ఎక్కువగా తమతో తాము ఉంటారు కాబట్టి ధీకుశలతను పెంచుకోగలుగుతారు. జ్ఞానం పెంచుకుంటే సంతోషం కూడా అదే మోతాదులో పెరుగుతుంది. ఇంకా తమలోనే దైవత్వం ఉందని గ్రహించి సదా జపతపాదులు అనుష్ఠించే వారు గమనశ్రమనుండి ముక్తులు. తన ఆలోచనలతో సంతోషంగా ఉన్న వ్యక్తి అనవసర ప్రయాణాలు సంకల్పించడు. కనీసం ఒక చక్కటి పుస్తకాన్ని చదువుతూ, అందులోని భావాన్ని ఆస్వాదించగలిగిన వ్యక్తికి ప్రయాణాలు అనవసర పరిశ్రమగా పరిణమిస్తాయి.

విశ్రాంతి లేకపోతే అనారోగ్యమే : ఈ తీవ్రమైన విరామరహిత జీవితం వలన మనోశరీరాలు సరియైన విశ్రాంతి లభించకపోవటం వలన తొందరగా శక్తిని కోల్పోతున్నాయి; రోగగ్రస్తమవుతున్నాయి. మనం ఇంకా ఈ విషయాన్ని గ్రహించటం లేదు. సదా ఏదో కార్యంలో తనను తాను నియోగించుకోకుండా మనిషి ఉండలేకపోతున్నాడు. ఇదొక స్థాయి జబ్బు. ఆధునిక రోగం. మనిషి ధ్యానాన్ని అభ్యసించి మనసు ప్రశాంతంగా ఉంచుకోవడానికి ప్రయత్నించకపోతే చిత్తచాంచల్య తీవ్రత పెరిగి మానసిక రోగిగా తయారయ్యే ప్రమాదం ఉంది.

శరీరం అనేది మనసులో ఒక భావన మాత్రమే. ఆ భావనను అధిగమిస్తే శరీరం ఉన్నా లేనట్లే. గాఢనిద్రలో ఎవరూ 'నాకు ఆకలవుతుంది, నేను దాహార్తుడను' అనరు. కారణం ఆ స్థితిలో మనకు దేహభావన లేదు. అదే అనుభూతిని జాగృత స్థితిలో కూడా పొందగలిగితే మనిషి అన్ని పరిమితులను దాటి వెళ్ళినట్లే గదా! కనీసం 'ఈ అవకాశం ఉంది; ఈ దిశగా నేను కొద్దిగా ప్రయాణం చేయాలి; అదే అన్ని విద్యలసారం' అని తెలుసుకోకపోతే మనిషి అచిరకాలంలోనే కొన్ని క్రూరజంతువులు ఏ స్థాయిలో నిరంతర అశాంతిలో ఉంటాయో ఆ స్థాయికి దిగజారిపోయే ప్రమాదం ఉంది. మనసులో అంతటి అశాంతిని భరించలేక ప్రత్యామ్నాయంగా ప్రపంచం అంతా పరుగులు పెడితే అశాంతి తీవ్రత పెరుగుతుందే కానీ తరగదు. అందుకనే యుధిష్ఠిరుడు సంచార అవసరం లేని వాడు సుఖంగా, సంతోషంగా ఉంటాడని అంటారు. అంటే ఆ వ్యక్తి తనలో తాను పూర్తిగా నెలకొని ఉన్నాడని అర్థం. అలాంటి వ్యక్తులైన రామకృష్ణులకు, రమణ మహర్షికి ప్రయాణాలు అవసరం కాలేదు. అక్కడివరకు వెళ్ళటానికి మనకు కొంచెం సమయం అవసరమైనా ఆనందాన్ని లోపల వెతుక్కుంటూ కొంచెం ప్రయాణాలు తగ్గిస్తే, తప్పనిసరిగా శాంతిని పొందుతాం.

మనోనిశ్చలత లేకుండా పనిలో సామర్థ్యం రాదు : మనసు ప్రశాంతంగా ఉండకపోవటం వలన ఏదో పనిచేయాలి కనుక పనిచేయటం వేరు. ప్రశాంతచిత్తంతో చేయవలసిన పని చేయదగ్గ మేరకు చేయటం వేరు. అప్పుడే పనిలో నైపుణ్యం, కౌశలాన్ని కనబరచగలం. అందుకనే వివేకానందుడు 'activity is the manifestation of inferior strength - నిరంతర క్రియ బలహీనతకు తార్కాణం' అంటారు. పనిచేయకుండా ఉండలేకపోవటం కూడా ఒక దౌర్బల్యమే.

శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీత(5-24)లో....

యోఽన్తస్సుఖోఽన్తరారామస్తథాన్తర్జ్యోతిరేవ యః।
స యోగీ బ్రహ్మ నిర్వాణం బ్రహ్మభూతోఽధిగచ్ఛతి॥

'ఎవరు తమలో తాము ఆనందంగా ఉంటారో (మనోదేహభావనను వీడి ఆత్మసుఖంలో నెలకొని ఉంటారో), పూర్తి విశ్రాంతిని తమలోనే పొందుతుంటారో, ఆత్మనే సర్వప్రకాశినిగా దర్శిస్తారో వారు నిర్వాణాన్ని పొంది బ్రహ్మపదంలో నెలకొంటారు' అని అంటాడు.

తమోగుణంలో ఉన్నవాళ్ళకు అలసత్వాన్ని తొలగించుకోవటానికి కార్యం తప్పక అవసరం. రజోగుణంలోని వారు పనిలేకుండా ఉండలేరు. సత్త్వంలో ఉన్నవారికి కార్యాలు తగ్గుముఖం పడతాయి. శుద్ధసత్త్వంలో ఉన్న మనిషికి క్రియతో పనిలేదు. ఆ వ్యక్తి సర్వక్రియాశూన్యుడు అవుతాడు. నిష్క్రియా పరత్వాన్ని పొందుతాడు. అదే మనం పొందదగిన సర్వోత్కృష్ట స్థితి. ఆధ్యాత్మిక సాధన ద్వారా సర్వులం ఆ స్థితిని పొందే ప్రయత్నంలో ఉందుంగాక! ❖

మనం ఓర్పునూ, సహనాన్నీ, క్షమాగుణాన్నీ అలవరచుకోవాలి. ఈ శాశ్వతమైన నీతిపాఠాన్ని నేర్చుకొని, దానికి కట్టుబడి ఉన్నవారు ఆనందమయమైన జీవితాన్ని గడుపుతారు. - స్వామి వివేకానంద

సంయమనంతో సానుకూలత

– శ్రీమతి సుధామూర్తి, ఇన్ఫోసిస్ ఫౌండేషన్

కొన్నిసార్లు మనం తాత్కాలికంగా ఎదురయ్యే అననుకూల పరిస్థితులకు తీవ్రంగా స్పందించి, కఠిన నిర్ణయాలను తీసుకొని తరువాత తీరిగ్గా బాధపడుతూ ఉంటాం. 'అయ్యో! ఆ క్షణంలో కొంత సంయమనాన్ని పాటించి, ఓపికగా ఉండి ఉంటే, పరిస్థితి ఇక్కడి దాకా వచ్చేది కాదు కదా' అని పశ్చాత్తాపపడుతూ ఉంటాం. స్వర్గం లాంటి జీవితాన్ని చేతులారా నరకాన్ని చేసుకున్నామని కుమిలిపోతూ ఉంటాం. అలాంటి పరిస్థితి నుంచి తప్పించుకున్న నా విద్యార్థిని శాంతి జీవితం నేటితరానికి చక్కని పాఠమవుతుంది.

శాంతి నా పూర్వ విద్యార్థిని. కుట్రలు, కుతంత్రాలు తెలియని సరళమైన మనిషి. నిర్మొహమాటంగా మాట్లాడుతుంది. ఎంతో కష్టపడి చదివి ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం సంపాదించుకుంది. 'బహుళజాతి సంస్థలు– సామాజిక బాధ్యతలు' అన్న అంశంపై వాళ్ళ ఆఫీసులో నిర్వహించిన సదస్సులో ఓ సారి మాట్లాడాల్సి వచ్చింది. ఉపన్యాసమంతా అయ్యాక, వీడ్కోలు చెప్పి వస్తూంటే, హఠాత్తుగా అక్కడ శాంతి కనిపించింది. ఎన్నో ఏళ్ళ తరువాత ఆమె కనిపించడంతో నాకు చాలా సంతోషం కలిగింది. కానీ ఎప్పుడూ ఉల్లాసంగా ఉండే శాంతి నిరుత్సాహంగా, ఉదాసీనంగా కనిపించింది. అదే సందేహాన్ని ఆమె ముందు వ్యక్తం చేస్తూ 'శాంతి? ఏంటి సంగతి? ఇంట్లో ఏమైనా సమస్యలా? ఆఫీసులో ప్రాజెక్టు పూర్తి కాలేదా?' అని పరామర్శించినట్లుగా ప్రశ్నించాను.

శాంతి ఏమీ మాట్లాడకుండా, ముందు నన్ను తన ఆఫీసు గదికి తీసుకువెళ్ళి, కుర్చీలో కూర్చోబెట్టింది. ఆ తరువాత తన మనస్సులో మాట బయటపెడుతూ, 'మేడమ్! ఈ ఆఫీసులో ఏ మాత్రం సంతోషం లేదు. బయటవాళ్ళకు నా ఉద్యోగం గొప్పగానే అనిపిస్తుంది. మంచి జీతం, పెద్ద హోదా, ఫైవ్‌స్టార్ హోటల్ లాంటి ఆఫీసు చూసి అద్భుతం అనుకుంటారు. కానీ మా పై అధికారి వేధింపులు భరించలేకపోతున్నాను. ఆమె మహా క్రూరురాలు. అసలు మనిషే కాదు! ఆమె మాటలు కూడా నన్ను భయపెడుతున్నాయి; బాధిస్తున్నాయి. ఏదో ఒక వంకతో నన్ను ఇబ్బందిపెడుతూనే ఉంటుంది. ఆఫీసుకు రావాలంటేనే ఏదోలా ఉంటుంది. ఉద్యోగం వదిలేద్దామనుకుంటున్నాను!' అంది.

ఆవేశమే తప్ప అనుభవం లేని శాంతి మాటలు నన్ను కాసేపు కలవరపరిచాయి. ఆ తరువాత ఆమెను అనునయిస్తూ, 'ఉద్రేకం వద్దు శాంతీ! ఇది నీ జీవితానికి సంబంధించిన విషయం. తొందరపాటుతో ఏ నిర్ణయమూ తీసుకోవద్దు. ఎంతటి గడ్డుకాలమైనా ఎలా వచ్చిందో, అలానే వెళ్ళిపోతుంది. అయినా ఏ వ్యక్తి అయినా మనం అనుకున్నట్లే ఉండాలని కోరడం మంచిది కాదు. కాలం గడిచేకొద్దీ ఆవిడే నిన్ను అర్థం చేసుకుంటుందేమో! అయినా ఎవరూ కలకాలం ఈ స్థానంలో ఉండరు కదా!' అన్నాను. శాంతి నా మాటలకు గౌరవమిచ్చి కొంత స్థిమితపడింది.

రెండేళ్ళు గడిచాయి. మా ఇంటి దగ్గర మార్కెట్లో కూరగాయలు కొంటున్నాను. ఇంతలో వెనక నుంచి 'నమస్కారం మేడమ్!' అన్న మాటలు వినిపించాయి. వెంటనే వెనక్కితిరిగి చూసేసరికి, శాంతి కనిపించింది. వెంటనే ఆమె ఆఫీసు, ఉద్యోగం గుర్తొచ్చాయి. పలకరింపులయ్యాక 'ఏంటి శాంతి! ఎలా ఉంది నీ ఉద్యోగం?' అన్నాను.

అప్పుడు శాంతి, 'చాలా బావుంది మేడమ్! అప్పటి పరిస్థితులకూ, ఇప్పటి పరిస్థితులకూ పొంతనే లేదు. తొందరపడి అప్పుడు ఉద్యోగం వదిలేసి ఉంటే ఎన్ని కష్టాలు పడేదాన్నో ఊహించుకుంటేనే భయం వేస్తోంది. మా పాత బాస్ బదిలీపై వెళ్ళిపోయింది. ఆ స్థానంలో వచ్చిన వ్యక్తి చాలా మంచివారు. మమ్మల్ని ఎంతో గౌరవంగా చూసుకుంటారు. ఎప్పుడూ ఇబ్బందిపెట్టరు. మీరు చెప్పినట్లు కొంత ఓపిక పడితే, ఎంత లాభమో ఇప్పుడర్థమవుతోంది' అంది సంతోషంగా!

అప్పుడు నేను, 'శాంతీ నిన్ను చూస్తూంటే నాకు 'మన్ కీ దర్పణ్ వహీ... న జానే సబ్ కుఛ్ నయా నయా' అన్న పాట గుర్తొస్తోంది. ఇప్పుడు నీ మనసు అలాగే! పాతదే; కానీ ఎందుకో మరి ప్రతీ దాన్ని కొత్త కొత్తగా చూపెడుతోంది కదా!' అన్నాను. ఇద్దరమూ హాయిగా నవ్వుకున్నాం. కష్టసమయాల్లో కాస్త సంయమనం పాటిస్తే నీ చేతుల్లోనే నీ స్వర్గం అన్నది నిజమవుతుందని శాంతి విషయంలో నిజమైంది. ❖

సేకరణ: జి. సతీష్

- స్వామి పరిజ్ఞేయానంద

వి. సాయిచరణ్, కళాశాల విద్యార్థి, రాజమండ్రి

ప్రశ్న: నాకు నా స్నేహితులతో ఎప్పుడూ ఏదో ఒక విషయంలో మనఃస్పర్థలు, భేదాభిప్రాయాలు, వివాదాలు, తగాదాలు వస్తూ ఉంటాయి. అలాంటి పరిస్థితులు రాకుండా ఎంత ప్రయత్నించినా సాధ్యం కావడం లేదు. అందువల్ల ఎవరి తోనూ మాట్లాడకుండా, ఎలాంటి సంబంధాలూ పెట్టుకోకుండా ఉండాలనుకుంటున్నాను. నా నిర్ణయం సరైనదో కాదో తెలపండి.

జవాబు: మనం నలుగురితో కలసిమెలసి ఉన్నప్పుడు మనఃస్పర్థలు, భేదాభిప్రాయాలు, కలహాలు, కోపతాపాలు, తగాదాలు రావడం సర్వసాధారణమైన విషయం. అలాగని ఎవ్వరితోనూ మాట్లాడకుండా ఉండడం; ఎవ్వరితోనూ సంబంధం పెట్టుకోకుండా జీవించడం సరైన పరిష్కారం కాదు. ఎందుకంటే మనం మూగజీవులం కాము, ఎవ్వరితోనూ మాట్లాడకుండా ఉండడానికి; మనం వన్యజీవులం కాము, ఎవ్వరితోనూ సంబంధం పెట్టుకోకుండా జీవించడానికి.

మనిషి సంఘజీవి; భావవ్యక్తీకరణ, అనుబంధాలతో కూడిన సహజీవనం మనిషికి చాలా ముఖ్యం. అందువల్ల సమాజంలో జీవిస్తున్న ప్రతి వ్యక్తీ ఇతరులతో సత్సంబంధాలను పదిలపరచుకొని ఆనందంగా జీవించడానికి తీసుకోవాల్సిన కొన్ని జాగ్రత్తల్నీ, సూచనల్నీ తెలుసుకుందాం.

❖ మనం అందరితో కలహాలు, కోపతాపాలు లేకుండా అన్యోన్యంగా కలసిమెలసి ఉండాలంటే మన జీవితం నుండి 'అతి'ని పూర్తిగా తొలగించాలి. అతిగా ప్రేమించడం గానీ, అతిగా ద్వేషించడం గానీ; అతిగా దయచూపడం గానీ, అతిగా కాఠిన్యం చూపడం గానీ; అతిగా చనువు ఇవ్వడం గానీ, అతిగా నిర్లక్ష్యం చేయడం గానీ; అతిగా మాట్లాడడం గానీ, ఏమీ మాట్లాడకుండా ఉండడంగానీ... ఇలా ఏ విషయంలోనైనా అతిగా ప్రవర్తించడం శ్రేయస్కరం కాదు. కాబట్టి మితంగా వ్యవహరించడమే మనకు హితమని గ్రహించాలి.

❖ మనం అందరితో కలసిమెలసి ఉండలేకపోతున్నామంటే; కోపతాపాలకు గురవుతున్నామంటే మనలో కూడా లోపాలున్నాయని అర్థం. అందుకే శ్రీశారదాదేవి 'నీలో దోషాలు ఉండబట్టే ఇతరుల్లో దోషాలను చూస్తున్నావు' అని అంటారు. నిగూఢమైన ఈ సత్యాన్ని గ్రహించాలంటే ఆత్మపరిశీలన చేసుకోవాలి. అప్పుడు మనలోని లోపాలను మనం తెలుసుకోవడం సాధ్యమవుతుంది.

ప్రఖ్యాత మానసిక వైద్యనిపుణులు కార్ల్ యంగ్ *'Everything that irritates us about others can lead us to an understanding of ourselves* - ఇతరుల గురించిన ప్రతీ విషయం మనల్ని చీకాకు పరుస్తున్నట్లయితే, అది మన నిజస్వభావాన్ని తెలియ జేస్తుందని అర్థం' అని అంటారు. కాబట్టి ఇతరులతో కలసిమెలసి ఉన్నప్పుడు మనలోని లోటుపాట్లు బయట పడతాయి. ఆ లోపాల్ని సరిదిద్దుకోవడానికి ప్రయత్నించాలి.

❖ మన అసంతృప్తి, అసహనాలకు కారణం అందరూ మన ఇష్టాయిష్టాలకు తగ్గట్లు ప్రవర్తించాలనీ; మన మనోభావాలకు అనుగుణంగా స్పందించాలనీ; మనం ఆశించిన విధంగా జరగాలనీ అనుకోవడమే! ఇలాంటి మనోభావాల నుండి బయటపడాలంటే *'Don't blame people for disappointing you. Blame yourself for expecting too much* - నిన్ను నిరుత్సాహపరచినవారిని నిందించకు. వారి నుండి అధికంగా ఆశించినందుకు నిన్ను నువ్వే నిందించుకో!' అన్న ఓ తత్త్వవేత్త సూచనను పాటించాలి.

❖ ఎలాంటివారైనా కొన్ని సందర్భాలలో కోపతాపాలకు గురికావచ్చు. అలాంటి పరిస్థితుల్లో వాదోపవాదాలకు దిగకుండా సంయమనం పాటించాలి. అలా సంయమనం పాటిస్తే ఎలాంటి తగాదాలు రావని భగవాన్ శ్రీరామకృష్ణులు తమ మేనల్లుడైన హృదయ్‌తో చెబుతూ 'హృదయ్! నీకు కోపమొచ్చినప్పుడు నేను మౌనంగా ఉంటాను. నాకు కోపం వచ్చినప్పుడు నువ్వు మౌనంగా ఉండు' అని అంటారు. కాబట్టి 'మాటకు మాట' అనే స్వభావాన్ని విడనాడగలిగితే వివాదాలు తలెత్తవు.

❖ మనం ఎంత తెలివైనవారమైనా, ఎంత శక్తిమంతుల మైనా అన్ని పరిస్థితులలోనూ మనమే అధికులమనీ, మన మాటే నెగ్గాలనీ, మన ఆలోచనే సరైనదనీ భావించడం ప్రమాదకరం. భాగవతంలో గజేంద్రుడు అలాంటి అహంకారానికిపోయి ప్రమాదానికి గురయ్యాడు. అడవిలో సంచరించే గజరాజు తనంత శక్తివంతుడు లేడన్న గర్వంతో సరస్సులోనికి దిగి అల్లకల్లోలం సృష్టించాడు. చివరికి మొసలినోటికి చిక్కి

(మిగతా 41వ పేజీలో...)

పరోక్షంగా ఇతరులను గూర్చి చెడుగా మాట్లాడడం పాపం. దీనిని పూర్తిగా విసర్జించాలి. ఇతరులు చేసిన తప్పలను క్షమించి మరచిపోతే అన్ని సమస్యలూ సమసిపోతాయి. - స్వామి వివేకానంద

వాదాలు వివాదాలు

కురుక్షేత్ర సమరానికి ముందు కౌరవులకు, పాండవులకు మధ్య సయోధ్య కుదిర్చేందుకు రాయబారిగా శ్రీకృష్ణుడు హస్తినాపురానికి వెళతాడు. మహామహులంతా ఆసీనులైన సభలో ధృతరాష్ట్రుడినుద్దేశిస్తూ, నీ కొడుకుకి బుద్ధి చెప్పమని, న్యాయబద్ధంగా పాండవులకు రావలసిన అర్ధరాజ్యాన్ని వారికి ఇచ్చేసి, యుద్ధాన్ని నిలువరించమని హితవు పలుకుతాడు. కౌరవుల తప్పిదాలేంటో, పాండవుల ధర్మబద్ధత ఎలాంటిదో వివరిస్తాడు. శ్రీకృష్ణుడి ఈ వ్యాఖ్యలకు స్పందిస్తూ, అక్కడే సభలో కూర్చొని ఉన్న దుర్యోధనుడు దిగ్గున లేచి 'కృష్ణా! నువ్వు పాండవులను పల్లెత్తు మాటైనా అనకుండా కేవలం నన్ను మాత్రమే ఎందుకు తప్పు పడుతున్నావో అర్థం కావడం లేదు. భీష్మ, ద్రోణ, విదురులు, నా తండ్రి కూడా నన్నే దూషిస్తున్నారు. ఎంత ఆలోచించినా నేను చేసిన అపరాధం ఏమిటో అర్థం కావడం లేదు. అందరూ అంగీకరించి ఆడిన మైత్రీపూర్వకమైన ద్యూతంలో పాండవులు రాజ్యం పణంగా పెట్టి ఆడి, ఓడితే దానిలో నా తప్పేముంది? వాళ్ళు ఏదో అపరాధం కెలికి యుద్ధానికి సిద్ధమవుతున్నారు. మేమేమి తప్పు చేశామని మాతో యుద్ధానికి వస్తున్నారు?' అంటూ వాదనకు దిగుతాడు.

అప్పుడు శ్రీకృష్ణుడితో సహా సభలోని ప్రాజ్ఞులంతా 'ఇందులో పాండవుల రాద్ధాంతం ఏముంది? వారికి రావాల్సిన రాజ్యాన్నే వాళ్ళు అడుగుతున్నారు! ఇవ్వడం ధర్మమే కదా!' అంటారు. అప్పుడు మరింత అహంకారంతో ఆ గాంధారీ పుత్రుడు 'అయినా మా తండ్రి నేను చిన్నవాడనై ఉండగా వాళ్ళకి కొంత రాజ్యభాగం ఏదో పొరపాటున ఇచ్చాడు. అది ఇప్పుడెలా చెల్లుతుంది. ఆ భాగాన్ని ఇప్పుడు నేను ఎందుకు ఇవ్వాలి?' అంటూ వితండ వాదం చేస్తాడు. ఎవరు ఎంత నచ్చచెప్పినా వినకుండా, తన వాదనే నెగ్గాలంటూ పరిస్థితిని వివాదాస్పదం చేసుకొని కురుక్షేత్రం దాకా తెచ్చుకుంటాడు.

ఇలా వాగ్వాదాలు, వ్యర్థ ప్రేలాపనలు మనల్ని చాలాసార్లు ఆలోచనా రహితులుగా, సంయమన శూన్యులుగా చేసి మన విజ్ఞతనూ, వివేకాన్నీ హరించివేస్తాయి. అందుకే భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస తమ సమక్షంలో ఏదో విషయంపై ఇద్దరు యువకులు తీవ్రంగా వాదించుకుంటూంటే విని వారిని మందలిస్తూ 'నా అభిప్రాయమే సరైనది; ఇతరులవి తప్పని వితండవాదం చేసేవారు నిమ్నస్థాయికి చెందినవారు. అలాంటివారు ఎన్నటికీ పరమసత్యాన్ని తెలుసుకోలేరు' అన్నారు.

వాదం...వ్యర్థం : నేడు సమాజంలో చాలామంది వాదోపవాదాలు బురదగుంటలోని వరాహాల ద్వంద్వ యుద్ధాలను తలపిస్తూ ఉంటాయి. మనం ఎంత వాదిస్తున్నామంటే, మనలో శక్తిని అంత వ్యర్థం చేసుకుంటున్నామని అర్థం. నిజానికి వాదించాలనే ప్రవృత్తి మనలోని ఆత్మన్యూనత(ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్)కీ, ఆధిక్యభావన (సుపీరియారిటీ కాంప్లెక్స్)కీ చిహ్నం.

– బి. సైదులు

మనం తగ్గిపోతున్నామేమో అనుకుంటున్న కొద్దీ, ఎక్కువని చూపించుకోవాలనే తపన పెరుగుతుంది. అలాంటి సమయాల్లోనే కల్పించుకొని మరీ వాదోపవాదాలకు దిగుతూ, పరమమూర్ఖంగా ప్రవర్తిస్తూ ఉంటాం. మన మాటే పైనుండాలని గొంతు పెంచుతూ ఉంటాం. అందుకే మన సనాతన ధర్మం...

మూర్ఖ చిహ్నాని షడితి, గర్వో దుర్వచనం ముఖే।
విరోధీ విషవాదీ చ కృత్యాకృత్యం న మన్యతే॥

'మూర్ఖుడి ఆరు లక్షణాలు - అహంకారం, పరుషవాక్కు, విరోధం, చెడ్డగా వాదించడం, చేయదగినది, చేయదగనిది అనే విచక్షణ లేకపోవడం' అని వివరించింది.

దుర్యోధనుడి మనస్సు ఆది నుంచి ఈ ఆరు లక్షణాలతో విషకుంభంగా తయారైంది. అందుకే ఎక్కడ పాండవుల ప్రస్తావన వస్తే, అక్కడ తను వేలికేస్తే కాలికి, కాలికేస్తే వేలికి అన్నట్లు వాదిస్తూ ఉండేవాడు. తనదే పైచేయి కావాలని పట్టుపట్టి, తనే తెలివైన వాడినని నిరూపించుకునేందుకు వెర్రిప్రయత్నాలు చేసి చివరకు తనే అబాసుపాలవుతూ ఉండేవాడు. మనం కూడా చాలా సందర్భాల్లో ఈ వ్యర్థ వాదనలతో మన మూర్ఖత్వాన్ని మనకు మనమే బయటపెట్టుకుంటూ ఉంటాం.

చర్చ వేరు...వాదన వేరు : సామరస్యంగా చర్చించుకోవడానికీ, సహనం కోల్పోయి వాదించుకోవడానికీ ఎంతో భేదముంది. అయితే మనం చాలా సమయాల్లో మొదటి దాని కన్నా, రెండవ దానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ ఉంటాం. ఎదుటివారి అభిప్రాయాలకు విలువనివ్వాలన్న కనీస సంస్కారం మనలో లోపించడమే దీనికి ప్రధాన కారణం. పైగా ఎప్పటికీ మన ఆలోచనలు, అభిప్రాయాలే చెల్లుబాటు కావాలనే అహంకార ధోరణి కూడా వాగ్వాదమనే అగ్నిని ఆజ్యమై రగిలిస్తుంది.

ఈ వాదించే స్వభావం వల్ల మనం ఎక్కడా ఆరోగ్యవంతమైన మానవసంబంధాలను కొనసాగించలేం. అందుకే ఓ పాశ్చాత్య వ్యక్తిత్వ వికాస నిపుణుడు '*Discussion is always better than argument. Because argument is to find out who is right. Discussion is to find out what is right* – వాదన కన్నా చర్చ ఉత్తమం. ఆధిపత్యాన్ని నిరూపించేది వాదన, పరిష్కారమార్గాన్ని తెలిపేది చర్చ' అని అంటారు.

అయితే ఈ రోజుల్లో చాలా మంది కార్యక్షేత్రాల్లో, కుటుంబవ్యవహారాల్లో వాగ్వాదాలకు దిగి పరిస్థితిని వివాదాస్పదం చేసుకుంటూ, తాడోపేడో తేల్చుకుందామన్నట్లు ప్రవర్తిస్తూ ఉంటారు. మాట్లాడుకుంటే పోయేదాన్ని, వాదించుకునేదాక తెచ్చుకుంటున్నామంటే, గోటితో పోయేదానికి, గొడ్డలిని వాడుతున్నట్లే! అహంకారపూరితమైన వాదనల వల్ల వ్యక్తుల మధ్య అంతరాలు పెరిగితే, అణకువతో కూడిన చర్చల వల్ల అనుబంధాలు బలపడతాయి.

పతనానికే ప్రేలాపనలు..: రావణుడు సీతాపహరణ పన్నాగంతో మారీచుడి దగ్గరకు వెళతాడు. అతనిని మాయలేడిగా మారి సీతారామలక్ష్మణుల కళ్ళుకప్పి తన పథకానికి సహకరించమంటాడు. రాజుగా తన దర్పాన్నంతా చూపుతూ, తన చెల్లెలు శూర్పణఖను వారు అవమానించారనీ, అలాంటి వారికి తగిన బుద్ధి చెప్పటం తప్పేమీకాదనీ మారీచుడితో వాదిస్తాడు. అప్పుడు మారీచుడు సీతారామలక్ష్మణులను సమర్థిస్తూ, తన పూర్వానుభవాల నేపథ్యంగా సాకేతరాముడి శక్తిసామర్థ్యాలేంటో కూడా వివరిస్తాడు. కానీ అహంకారం తలకెక్కిన ఆ దశకంఠుడు, 'ఓ మారీచా! రాజు మనస్సును ఎరుగక నీవు పలికిన ఈ వచనాలు అనుచితాలు. ఈ మాటలన్నీ చౌటినేలలో నాటిన విత్తనాలలా నిష్ఫలములు. పాపస్వభావుడు, మూర్ఖుడు, అందునా మానవమాత్రుడైన శ్రీరాముని యుద్ధ పరాక్రమాన్ని తెలుపుచు నీవు పలికిన వచనాలు నన్ను ఏ మాత్రం భయపెట్టజాలవు' అంటాడు. మారీచుడు హితవు పలుకుతూ, ఎంత హెచ్చరిస్తూ ఉన్నా, లంకాధీశుడు తన ప్రణాళికే సమంజసమైందని ప్రేలాపిస్తూ, తన పతనాన్ని తనే కొనితెచ్చుకుంటాడు.

నేటి సమాజంలో కూడా చాలా మంది ప్రముఖులనుకుంటున్న వాళ్ళు కూడా ప్రసార, ప్రచార మాధ్యమాల్లో, సమూహ సమావేశాల్లో భావోద్వేగాలకు లోనై, అసందర్భ ప్రేలాపనలతో, వాగ్వాదాలకు దిగడం గమనిస్తూనే ఉంటాం. ఇలాంటి వారు అనుచిత వ్యాఖ్యలతో తమకు తెలియకుండానే తమ, తమ రంగాల్లో వివాదాస్పదమైన వ్యక్తులుగా ముద్ర వేయించుకొని, విలువైన తమ భవిష్యత్తును అగమ్యగోచరంగా చేసుకుంటారు. మనం ఎంత వివాదాస్పదమైన వ్యక్తులుగా మారుతున్నామంటే, అంత మనపై మనం నియంత్రణ కోల్పోతున్నామని అర్థం చేసుకోవాలి.

తగ్గితే తక్కువేమీ కాదు...: వాదనకు దిగి అందులో ఓడిపోతే చాలా మంది తమ తల కొట్టేసినట్లు భావిస్తుంటారు. తమది తప్పని అర్థమైపోతున్నా, మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ, కిందపడ్డా తమదే పైచేయి అన్నట్లు ప్రవర్తిస్తూ ఉంటారు. శ్రీకృష్ణ రాయబారం సమయంలో పెద్దలంతా మూకుమ్మడిగా తమ వాదనలతో దుర్యోధనుడిని నిలువరించినా, అతను మాత్రం తగ్గడానికి ససేమిరా అంటూ; తన తప్పిదాన్ని అంగీకరించలేదు. పైగా తన వాదననే బలపరుచుకుంటూ 'ఈశ్వరుడి సృష్టి అనుసారం ఏది జరగనుందో, ఏది నా గతియో అదే విధంగా జరుగుతుంది. మీ ప్రలాపాలన్నీ ఆపండి' అని అంటూ తన సహచరుడైన కర్ణుని కేసి చూసి, బిగ్గరగా నవ్వి తొడచరుస్తూ తన ఆసనంపై కూర్చుంటాడు.

ఈ ధృతరాష్ట్ర పుత్రుడి ధోరణి మన నిత్యజీవితంలో అనేక సంఘటనల్లో ద్యోతకమవుతూనే ఉంటుంది. కుటుంబ, సామాజిక సంబంధీకులతో వాదోపవాదాలు చెలరేగిన సమయాల్లో చాలా సార్లు మనది పొరపాటని తెలిసినా, వెనక్కి తగ్గడానికి మనస్సు అంగీకరించదు. అందుకే మరింత గొంతు పెంచి నానా యాగీ చేస్తూ ఉంటాం. ఫ్యామిలీ కోర్టులో దంపతుల మధ్య వివాదాలను పరిష్కరించే ఓ న్యాయమూర్తి ఇటీవల ఓ ఆత్మీయసమావేశంలో మాట్లాడుతూ "న్యాయస్థానాల్లో నేటితరం జంటల వాదనలు వింటూంటే ఆశ్చర్యమేస్తోంది. తమ వాదనలను బలపరుచుకునేందుకు, నెగ్గించుకునేందుకు వారు ఎంతకైనా తెగిస్తున్నారు. కలసి మాట్లాడుకోవడమంటే తామేదో లొంగిపోయినట్లు భావిస్తున్నారు. ఒకరిని మించి మరొకరు వాదనలు వినిపిస్తున్నారు. తమదే తప్పని తెలిసినా, తమ మాటే నెగ్గాలని వాదిస్తున్నారు. వాదనకు కారణం పరిపక్వత లేకపోవడమే! అన్న విషయాన్నే మరచిపోతున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు.

వాదాలు, వివాదాలు వాస్తవంగా మనుషుల అపరిపక్వతను చాటుతాయి. బల్లగుద్ది అరిచినంత మాత్రాన మన మాట బలమైందని అనుకుంటే అంతకు మించిన అవివేకం మరొటి లేదు. మనలో చాలామంది పొరబడుతున్నట్లు న్యాయస్థానాల్లో కూడా బల్లగుద్ది గట్టిగా వాదించేవారు గెలవరు; సావధానంగా బలమైన సాక్ష్యాలను చూపేవారే గెలుస్తారు. ❖

సహనశీలురై మెలగండి. తగవులాడుకోవద్దు. స్వలాభాన్నీ, కీచులాటలనూ, అసూయనూ విడిచి పెట్టండి. వీటిన్ని మీరు సాధించగలిగితే లోకమే మీకు పాదాక్రాంతమవుతుంది. - స్వామి వివేకానంద



అజ్ఞాత ఆశాజ్యోతి

– స్వామి రంగనాథానంద (రామకృష్ణసంఘం 13వ సర్వాధ్యక్షులు)

వివేకానంద యువ మహామండల్ సేవాసంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అతిథిగా పాల్గొనేందుకు నేను (స్వామి రంగనాథానంద) ఒకసారి ఒరిస్సాలోని సంబల్‌పూర్ జిల్లాకు వెళ్ళాల్సి వచ్చింది. ఆ కార్యక్రమం అనంతరం ఆ జిల్లాలో బేల్‌పహార్ అనే పట్టణ సమీపంలో బంజరి అనే ఓ కుగ్రామాన్ని సందర్శించాం. ఆ గ్రామంలో అందరూ ఆదివాసీలే నివసిస్తూ ఉన్నారు. ఏ మాత్రం ఆధునిక సౌకర్యాలు లేని ఆ మారుమూల గ్రామంలో ముప్పై ఏళ్ళు కూడా నిండని రమాకాంత్ సింగ్ అనే యువకుడు తటస్థపడ్డాడు. సమీప నగరంలో మంచి ఉద్యోగాన్ని వదిలిపెట్టి, బంజరి గ్రామస్థులను చైతన్యపరుస్తున్న అతణ్ణి చూస్తే, నాకు అబ్బురమనిపించింది.

సకల సౌకర్యాలతో కూడిన ఉన్నత ఉద్యోగాన్ని వదిలి ఈ కుగ్రామానికి రావాలని ఎందుకు అనిపించిందని రమాకాంత్‌ను ప్రశ్నించాను. అప్పుడు అతను తాను ఉద్యోగం చేస్తున్న సందర్భంలో ఓ రోజు స్వామి వివేకానంద సాహిత్యాన్ని చదివానని వివరిస్తూ, 'The national ideals of India are *tyaga*, renunciation, and *seva*, service. Intensify her in those channels, and the rest will take care of itself' అన్న స్వామీజీ వాక్యం ఎంతో కదిలించిందని గుర్తు చేసుకున్నాడు. భారతజాతి ఆదర్శాలు త్యాగం, సేవ. ఈ జమిలి మార్గాల్లో జాతిని గాఢతరం చేస్తే మిగిలినదంతా దానికదే చక్కదిద్దుకుంటుందన్న యుగపురుషుడి ధీరవచనాలు ఆ యువకుడిని బంజరి గ్రామం వైపు కదిలించాయి.

దాదాపు వెయ్యి కుటుంబాలు నివసిస్తున్న ఆ బంజరి గ్రామంలో రమాకాంత్ ఆ గ్రామస్థుల సంక్షేమం కోసం ఎన్నో సేవాకార్యక్రమాలు చేపట్టాడు. అక్కడి గ్రామస్థుల హృదయాల్లో ఆధ్యాత్మికబీజాలను నాటేందుకు భగవాన్ శ్రీరామకృష్ణుల పేరుతో సేవాసమితిని ప్రారంభించాడు. కాలక్రమంలో పద్నాలుగు ఎకరాల భూమిని సేకరించి శ్రీరామకృష్ణుల మందిరాన్ని నిర్మించేందుకు శంకుస్థాపన చేయించాడు. భవిష్యత్తులో ఆ పద్నాలుగు ఎకరాల్లో ఆలయంతో పాటు, పాఠశాల, విద్యార్థులకు వసతిగృహాలు, సేవాసంస్థ నిర్మించాలన్న ప్రణాళికలు ఉన్నాయని వివరించాడు.

అతని దీక్షాదక్షతలు చూసి ఆనందాశ్చర్యాలు కలిగాయి. He had much to renounce - fine youth, good intelligence, education, a good job, and energy. He renounced it all to do something great, to bring cheer and happiness to thousands of his own people. సుందరమైన యౌవనాన్నీ, మేధనూ, మంచి ఉద్యోగాన్నీ, సౌకర్యవంతమైన జీవితాన్నీ, తన శక్తి యావత్తునూ ఆ ఆదివాసీల ముఖాల్లో ఆనందజ్యోతులు వెలిగించడం కోసం త్యాగం చేశాడు. ప్రారంభంలో అర్ధాంగితో సహా కుటుంబసభ్యులందరూ రమాకాంత్ సంకల్పానికి అడ్డు తగిలారు. కానీ అతని దృఢదీక్షను చూశాక వారందరూ అతనికి సహకరించసాగారు. ఇలా నేను పర్యటించిన ఎన్నో మారుమూల గ్రామాల్లో నిశ్శబ్దంగా చైతన్యాన్ని రగిలిస్తున్న యువబృందాలు తారసపడ్డాయి.

ఆ యా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో క్రమశిక్షణతో, పరమశ్రద్ధతో పాల్గొంటున్న గ్రామీణులను చూస్తున్నప్పుడల్లా, వారి వెనుక అజ్ఞాతంగా శ్రమిస్తున్న చైతన్యమూర్తులైన యువతీ యువకులే గుర్తొస్తారు. భారతదేశంలో నేను పర్యటించిన చాలా రాష్ట్రాల్లోని పల్లెప్రాంతాల్లో, సభ్యసమాజం విస్మరించిన ఎన్నో కుగ్రామాల సంక్షేమం కోసం తమ జీవితాల్నే సమర్పణ గావిస్తున్న ఆదర్శవంతమైన యువతరం తారసపడింది. వారు తమ దృఢసంకల్పంతో ఆర్థిక సమస్యలను కూడా అధిగమించారు. 'అంకితభావంతో కూడిన సమర్థులైన మనుషులు ఉంటే చాలు; డబ్బు దానంతట అదే వస్తుంద'న్న స్వామి వివేకానంద మాటలకు నిదర్శనంగా నిలుస్తున్నారు. నగరాల్లో ఉంటున్న ఎంతోమంది యువతీ యువకులు వారిని చూసి స్ఫూర్తి పొందాలి. ❖ తెలుగుసేత : ఆర్.కృష్ణ

(1884 – 1967)

ముందుకు సాగిపో!

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ, ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్న్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ - వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్న్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం, ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

సార్‌గాచీ,

ప్రియమైన ఖుకీ!*

నువ్వు పరీక్షలో ఉత్తీర్ణురాలవయ్యావని తెలిసి చాలా సంతోషించాను. నివేదిత పాఠశాలలో ఉంటూ ఉన్నత విద్యనభ్యసించాలనే నీ నిర్ణయం తెలిసి మరింత ఆనందం కలిగింది.

నా ప్రత్యేక ప్రార్థన ఏమిటంటే నువ్వు సంస్కృత భాషను నేర్చుకోవాలి. ఎందుచేతనంటే వేదవాఙ్మయంలో తగినంత జ్ఞానాన్ని పొందనందు వల్ల స్త్రీలు మతం నిర్దేశించిన జీవితాన్ని గడపడంలో ముందుకు సాగలేకపోతున్నారు. సహజంగా స్త్రీలు అనేక మూఢ విశ్వాసాలతో, సగం తెలిసీ తెలియని సత్యాలతో ముడిపెట్టుకొని జీవిస్తున్నారు.

నీవు మన్నించవలసిన నా ప్రార్థనలు మూడు. అవి – సంస్కృతం నేర్చుకోవడం; శ్రీరామకృష్ణుల, స్వామీజీల సాహిత్యం చదవడం; గీత, ఉపనిషత్తులను మననం చేసుకుంటూ ఉండడం! ఊరకే వాటిని చదవడం కాదు. అర్థం చేసుకోవాలి. నా ప్రార్థన మన్నిస్తావు కదూ!

మనం విచారించాల్సిన అంశం ఏమిటంటే – గురుదేవుల భావాలను మన దేశస్థులు అంతగా అర్థం చేసుకోవడం లేదు. స్వామీజీ సాహిత్యం ఎవరూ చదవడం లేదేమో! ఒకవేళ చదివినా అందులోని అంతరార్థాన్ని గ్రహించడం లేదని నాకనిపిస్తోంది. సోదరి నివేదిత ఆ స్వర్ణయుగపు ప్రారంభంలో వెలిగించిన ఆ జ్యోతి ఎలాగో అలా కొందరు మనుషుల సాయంతో రెపరెపలాడుతూ ఈనాటికీ వెలుగునిస్తోంది. మీరంతా గురుదేవులు, అమ్మ శారద, స్వామీజీల పాదపద్మాలపై ధ్యానముంచి ఆదర్శ మూర్తులుగా రూపొందాలి. భరింపరాని స్త్రీల బాధలను నిర్మూలించడానికి మిమ్మల్ని మీరు సిద్ధపరచుకోవాలి. అందుకొరకు స్వామీజీ సాహిత్యం చదవడం అత్యావశ్యకం.

మీరు మీ మార్గంలో ముందుకు సాగిపోతున్నారని తెలిస్తే నా అంత సంతోషించే వ్యక్తి మరొకడు ఉండడు. చూడు తల్లీ! శ్రీరామకృష్ణ, స్వామీజీలు మన ప్రాచీన భారతాన్ని పూర్తిగా ఒక క్రొత్త మూసలో పోసి రూపొందించడానికి అవతరించారు. మీరు వారి భావాలను బోధపరచుకోవాలి. ఈ ఆధునిక యుగంలో కూడా మనం బూజు పట్టిన ఆ పాత విధానాలనే పట్టుకు వేళ్ళాడితే మానవజాతి అభివృద్ధి చెందదు. మీరు ప్రత్యేకంగా స్వామీజీ లేఖలను చదవాలి. ఆయన మీ భుజస్కంధాలపై గొప్ప బాధ్యతను ఉంచారు. మీరు బలవంతులు కండి. ఈ దేశంలో పురుషులు స్త్రీల కన్నా బలహీనులు. ఇంతకన్నా స్త్రీలను గురించి నేను వ్రాయగలిగింది ఏముంది చెప్పు?

భగవద్గీతలో ఆరో అధ్యాయంలోని మొదటి రెండు శ్లోకాలను, పద్దెనిమిదో అధ్యాయంలోని మొదటి పన్నెండు శ్లోకాలను చదువు. ఆధ్యాత్మిక సాధనల్లో భ్రమలకు భ్రాంతులకు తావు లేదు. ఏ విషయాలలోనైనా భ్రాంతుల వల్ల సరైన ఫలితాలు కలుగవు. ఏ పనినైనా చేసేటప్పుడు విషయాలను జాగ్రత్తగా అవగాహన చేసుకొని ముందుకు సాగాలి.

ప్రేమాశీస్సులతో

స్వామి ప్రేమేశానంద

తెలుగు సేత: *కె. త్రివిక్రమరావు*

(*ఖుకీ కాలాంతరంలో ప్రవ్రాజిక అచ్యుత ప్రాణామాతాజీగా రూపొందారు. 1950–1955 మధ్య ఆమెకు వ్రాసిన లేఖల సంక్షిప్త సారాంశమిది)

స్త్రీలు ఇతరుల మీద ఆధారపడుతూ జీవిస్తున్నారు. వాళ్ళు విద్య ద్వారా తమ సమస్యలను తామే పరిష్కరించుకుంటారు. స్త్రీజన సముద్ధరణ జరిగితే భారతజాతికి మేలు చేకూరుతుంది. -స్వామి వివేకానంద

బాలికల విద్యకు తోడ్పడండి

స్త్రీలను విద్యావంతుల్ని చేయండి. వారి సమస్యలను వారే పరిష్కరించుకోగలుగుతారు. – స్వామి వివేకానంద

చెన్నై, మైలాపూర్‌లోని శ్రీరామకృష్ణ మఠం కొన్ని దశాబ్దాలుగా రెండు పాఠశాలలను నడుపుతోంది.

1. శ్రీరామకృష్ణ మఠం జాతీయ పాఠశాల: చెన్నైలోని బేసిన్ బ్రిడ్జ్ రోడ్డు వద్దగల ఈ పాఠశాలను 1906వ సంవత్సరంలో భగవాన్ శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష సన్న్యాస శిష్యులైన స్వామి రామకృష్ణానంద మహరాజ్ ప్రారంభించారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 1 నుండి 5 తరగతులకు చెందిన 370 మంది బాల, బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు.

వివరాలకు: www.rkmns.edu.in వెబ్‌సైట్‌ను చూడగలరు.

2. శ్రీరామకృష్ణ మఠం వివేకానంద శతాబ్ది బాలికల ఉన్నత పాఠశాల: చెన్నైలోని మింట్, శరవణ వీధిలో ఉన్న ఈ పాఠశాలను 1962వ సంవత్సరంలో ప్రారంభించారు. ఈ పాఠశాలలో 6 నుండి 12 తరగతులకు చెందిన 900 మంది బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు.

వివరాలకు: www.rkmvcs.edu.in వెబ్‌సైట్‌ను చూడగలరు.

పై రెండు పాఠశాలలలో సుమారు ఎనభై అయిదు శాతం మంది ఉత్తర చెన్నైలోని వెనుకబడిన వర్గాలకు చెందిన నిరుపేద బాల బాలికలే. పాఠశాలలలో మౌలిక సదుపాయాలను మరింత మెరుగు పరచాలని భావిస్తున్నాం. అందుకు శాశ్వత నిధిని ఏర్పాటు చేయదలచాం. ఉన్నతమైన ఈ ఆశయ సాధనలో మాకు సహాయ పడాల్సిందిగా సహృదయులైన పౌరులను, వ్యాపార సంస్థలను, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులను అర్థిస్తున్నాం.

మీ విరాళాన్ని Sri Ramakrishna Math National School (or) Sri Ramakrishna Math Vivekananda Centenary Girls' Higher Secondary School పేరున గాని చెక్కు/ డి.డి. తీసి Sri Ramakrishna Math, No.31, Ramakrishna Math Road, Mylapore, Chennai-600004 చిరునామాకు పంపాల్సిందిగా మనవి. దయచేసి దాతలు పూర్తి చిరునామాను, ఫోన్ నెంబరు, మెయిల్ ID మరియు PAN నెంబరుతో సహా మాకు తెలియజేయాల్సిందిగా కోరుచున్నాం.

పూర్తి వివరాలకు: స్వామి విమూర్తానంద, మేనేజర్/ స్వామి శ్రీవిద్యానంద, పాఠశాల కార్యదర్శి–09445738065; ఇ–మెయిల్: secretary@rkmns.edu.in మరియు secretary@rkmvcs.edu.in

మీరిచ్చే విరాళాలకు ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80జి కింద ఆదాయపు పన్ను మినహాయింపు లభిస్తుంది.

భగవత్సేవలో
స్వామి గౌతమానంద, అధ్యక్షులు

You may also send your contribution by NEFT/CTGS transfer directly and intimate us along with PAN details through email. The following are the details for bank transfer:

Sri Ramakrishna Math National School
Bank and Branch:SBBJ (State Bank of Bikaner & Jaipur, Mylapore Br. Chennai-600004.
Account No. : 61003734105, IFSC : SBBJ0010419

SRKM Vivekananda Centenary Girls' Higher Secondary School
Bank and Branch : CB. Canara Bank, Mandaveli Br., Chennai-600028. Account No. : 8636101036893
IFSC : CNRB0000937

Advt.,

(...15వ పేజీ తరువాయి)

ఉంచుతాడు. ఈ పరమసత్యం తెలుసుకొని పరితపించిననాడు స్వయంగా తానే సాక్షాత్కరిస్తాడు. ఆ ఆవేదనతోనే అన్నమయ్య ఇక్కడ...

దీపించు వైరాగ్య దివ్యసౌఖ్యంబియ్య
నోపక కదా నన్ను నొడబరపుచు
పైపైనె సంసార బంధముల కట్టేవు
నా పలుకు చెల్లునా నారాయణా! 'దివ్యమైంది, దీపంలా ప్రకాశించేది అయిన వైరాగ్యాన్ని నాకివ్వడం నీకు ఇష్టం లేకనే, ఏదో విధంగా నాకు ఈ సంసారబంధాలు కట్టి ఆడిస్తున్నావు. నీ ముందు నా మాట చెల్లుతుందా!' అని చనువుతో నిష్ఠూరమాడుతున్నాడు. 'ఓపక' అంటే 'ఇష్టం లేక', 'ఒడబరపుచు' అంటే 'ఏదో రకంగా ఒప్పిస్తూ' అని అర్థం.

పరమేశ్వరుడి ప్రియభక్తుడైన ధూర్జటి కూడా అత్యంత చొరవతో 'శ్రీకాళహస్తీశ్వర శతకం'లో, ఆ శంకరుడితో తన బాధను వెళ్ళగక్కుతూ...

ఆలంచు నెమ్మెడగట్టి, దానికి నపత్యశ్రేణి కల్పించి, త
ద్బాలవ్రాతము నిచ్చిపుచ్చుకొను సంబంధంబు గావించి, యా
మాలార్కంబున బాంధవంబనెడి ప్రేమంగొందరం త్రిప్పగా,
సీలన్సీల నమర్చిన ట్లొసగితో శ్రీకాళహస్తీశ్వరా! అంటాడు.

'భార్య అనే పేరుతో ఒకరిని నా మెడకు కట్టావు. ఆమెకు నా వలన పిల్లలు కలిగేట్లు చేశావు. ఆ పిల్లలను బట్టి ఇచ్చి పుచ్చుకొనడమనే బంధుత్వాలను ఏర్పరచావు. ఆ తరువాత దండలా ఏర్పడిన ఈ సంబంధాల వలన కొందరు నా చుట్టూ తిరిగేట్లు చేశావు. ఈ విధంగా సీలపై సీల తిరిగేట్లు చేసి సంసారమనే పాశాల నుంచి నేను బయట పడకుండేట్లు చేశావు' అని రమ్యమైన వ్యంగ్యంతో అంటాడు. భక్తుడు భగవంతుడితో ఇంతటి అనుబంధాన్ని పెంచుకొని అర్థిస్తే, తానే ముళ్ళన్నీ విప్పి ముక్తిని ప్రసాదిస్తాడు.

నా కొలది వారలా?

చిత్రాతిచిత్రమైన విన్యాసాలతో కూడిన చిత్తచాంచల్యం అశాంతికి ఆలవాలం. అలాంటి చిత్తాన్ని శాంతపరచకుండా, పైగా అగ్నికి ఆజ్యం పోసినట్లు, బహువిధాల నా అశాంతిని అనంతం చేస్తున్నావని అన్నమయ్య ఆ ఏడుకొండలవాడికి ఏకరువు పెడుతున్నాడు. పైగా భగవంతుడి ధ్యాస లేక, బహుకర్మల్లో మునిగితేలుతున్న ఈ పరివారమంతా, నీ భక్తుడనైన నాతో సమానమా? ఎందుకయ్యా! నన్ను వాళ్ళతో జత కలుపుతావు! అన్న భావంతో అన్నమయ్య...

చీకాకుపడిన నా చిత్తశాంతము సేయ
లేకకా నీవు బహులీల నన్ను
కాకుసేసెదవు బహుకర్మముల బడువారు
నా కొలది వారలా నారాయణా!! అంటున్నాడు.

'కాకుసేసెదవు' అంటే తిరస్కరించెదవు అని అర్థం.



భగవంతుడు మనకు సుఖసంపదలు, భోగభాగ్యాలు ఇస్తున్నాడంటే పరోక్షంగా తనను మరచిపోయేటట్లు చేస్తున్నాడని గమనించాలి; బహుబంధాల్లో పడేస్తున్నాడని గుర్తించాలి. ఇలా చిత్తాన్ని చంచలం చేయడం ఆయన చతురత. అందుకే శేషప్ప కవి –

ఆయురారోగ్య పుత్రార్థ సంపదలన్ని కలుగజేసెడి భారకర్తనీవె
చదువు లెస్సగనేర్పి సభలో గరిష్ఠాధికార మొందించెడి ఘనుడనీవె
నడక మంచిది పెట్టి నరులు మెచ్చెదునట్టి పేరు రప్పించెడి పెద్దనీవె
బలువైన వైరాగ్య భక్తిజ్ఞానములిచ్చి ముక్తి పొందించెడు మూర్తినీవె
అవనిలో మానవుల కన్ని యాసలిచ్చి
వ్యర్థులను చేసి తెలిపెడి వాడనీవె
భూషణవికాస!శ్రీధర్మపుర నివాస!
దుష్టసంహార! నరసింహ! దురితదూర!

'ఆయురారోగ్యాలను ఇచ్చేదీ నీవే; సంతానాన్ని సంపదలను ప్రసాదించేదీ నీవే; విద్యలెన్నో నేర్పి ఉన్నతుడిని చేసి పెద్దపెద్ద పదవుల్లో కూర్చుండబెట్టేదీ నీవే; జనులందరూ మెచ్చే మార్గంలో నడిపించేదీ నీవే; ఉన్నతమైన భక్తి వైరాగ్యాలను పెంపొందించి మోక్షమనే పరమపదాన్ని కలిగించే దైవానివీ నీవే; మనుషులకు లేనిపోని ఆశలు కల్పించి వారిని మోహాల్లో పడవేసి వ్యర్థులను చేసేదీ నీవే!' అంటూ నరసింహమూర్తిని నిలదీస్తాడు.

దివిజేంద్ర వంద్య...

అన్నమయ్య కూడా ఆర్తితో ప్రార్థిస్తూ...

వివిధ నిర్బంధముల వెడల ద్రోయక నన్ను
భవసాగరముల దడ బడజేతురా
దివిజేంద్రవంద్య శ్రీతిరువేంకటాద్రీశ
నవనీతచోర శ్రీనారాయణా!

'ఎన్నో నిర్బంధాలతో కూడిన లోకం నుంచి నన్ను బయటపడేయకుండా, ఇంకా సంసారమనే సాగరంలో తడబడేటట్లు చేస్తున్నావు. ఎన్నో కష్టాల నుంచి దేవేంద్రుడినే రక్షించి, వందనాలు అందుకున్నవాడివి, నవనీతచోరుడివి, తీరిగ్గా తిరుమలపై కొలువు తీరావు! నన్ను కూడా ఆదుకోవయ్యా!' అని ఆపదమొక్కులవాడి అనుగ్రహానికి పాత్రుడయ్యాడు.

కాలమేదైనా ఆ కామిత ఫలదాతను కోరుకోవలసింది – ఈ కర్మపరిత్యాగమే! కేవలం కైవల్యమే! అందుకే ఆధునిక యుగానికి చెందిన భావకవి దేవులపల్లి కృష్ణశాస్త్రి కూడా ఓ కవితాఖండికలో...

ఇంత తెలియని యాత్ర, ఇంత కాల్చే ఆత్ర
మెంతకాలము దేవదేవా!
అంతరమ్మున శాంతి, అంతటా నీ కాంతి
అలరింప చేయవా,దేవదేవా! అని పరమాత్మను ప్రార్థిస్తారు. ❖

దేన్ని సాక్షాత్కరించుకొంటే ఇక చూడదగినది ఏదీ ఉండదో, దేనితో ఏకరూపమైతే ఇక మరుజన్మ ఉండదో, దేన్ని తెలుసుకొంటే ఇక తెలియదగింది ఏదీ ఉండదో అదే బ్రహ్మం. - ఆది శంకరాచార్యులు

రామకృష్ణ మఠం

నౌరా గ్రామం, బోద్ర పోస్ట్, భంగర్ పి.ఎస్., దక్షిణ 24 పరగణాలు జిల్లా, పశ్చిమ బెంగాల్ - 743 502
E mail: rkmathnaora@gmail.com; rkmathnaora@rediffmail.com; www.rkmnaora.org

స్వామి త్రిగుణాతీతానంద 150వ జయంత్యుత్సవాలు

భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస ప్రత్యక్ష సన్న్యాస శిష్యులు స్వామి త్రిగుణాతీతానంద మహరాజ్ జన్మస్థలమైన పశ్చిమ బెంగాల్, నౌరా గ్రామంలో రామకృష్ణ మఠ కేంద్రం గ్రామీణులకు విద్య, వైద్య, సాంస్కృతిక రంగాలలో వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

స్వామి త్రిగుణాతీతానంద మహరాజ్ 150వ జయంత్యుత్సవాలను (2014-2015) పురస్కరించుకొని నౌరా రామకృష్ణ మఠం, నిరుపేద గ్రామీణులకు ప్రత్యేక సంక్షేమ కార్యక్రమాలను సంవత్సరం పాటు నిర్వహించేందుకు సంకల్పించింది.

రామకృష్ణ మఠం, నౌరా

ఈ సేవాకార్యక్రమాల నిర్వహణ కోసం ఉదారులైన దాతలు విరాళాలనిచ్చి సహకరించాల్సిందిగా కోరుతున్నాం.

మీ విరాళాన్ని Ramakrishna Math, Naora పేరున చెక్కు/ డి.డి తీసి Ramakrishna Math, Vill-Naora, P.O - Bodra, P.S - Bhangar, Dist - South 24 Parganas, Pin-743 502, West Bengal చిరునామాకు పంపాల్సిందిగా మనవి. విరాళాలను ఆన్‌లైన్ ద్వారా కూడా పంపవచ్చు :

వివరాలు : రామకృష్ణ మఠం, నౌరా Indian Overseas Bank, Naora, A/C No. 113801000010949, (IFSC code: IOBA0001138). State Bank of India, Ghatakpukur A/C No. 31606923704 (IFSC: SBIN0010540)

విరాళాలకు 80జి సెక్షన్ కింద ఆదాయపు పన్ను మినహాయింపు లభిస్తుంది. ఈ బృహత్ సేవా యజ్ఞానికి మీవంతు ఆర్థిక సహాయాన్ని అందించి భగవాన్ శ్రీరామకృష్ణుల కృపకు పాత్రులు కాగలరని ఆశిస్తున్నాం.

భగవత్సేవలో
స్వామి ముక్తిప్రదానంద
అధ్యక్షులు

మరిన్ని వివరాలకు సంప్రతించండి :
సెల్: 08584098308, ఈ-మెయిల్: vibhakarananda@gmail.com

Advt.,

వికాస మంత్రాలు

- స్వామి పార్థసఖానంద



గతానికి, వర్తమానానికి మధ్య పోట్లాట పెడితే ఏది గెలుస్తుందో తెలీదు. కానీ, వీటి మధ్య భవిష్యత్తు మాత్రం నలిగి నాశనం అయిపోతుంది. గతానికి, వర్తమానానికి మధ్య గురు, శిష్యుల సంబంధం ఉండాలి గానీ, శత్రుత్వం ఉండకూడదు!

అందువల్ల గతాన్ని గురువుగా స్వీకరించి, గతంలోని తప్పుల నుండి పాఠాలు నేర్చుకుంటే మన భవిత బంగారమే!

దారాన్ని పట్టుకుని
లాగితే అది మనల్ని
అనుసరిస్తుంది.
దాన్ని ముందుకు
తోస్తే మాత్రం అది ఒక్క
అంగుళమైనా కదలదు!.
'నాయకత్వ రహస్యం' ఇదే!

సలహాలు ఇవ్వడం తేలికే, పాటించడమే కష్టం.
మాటివ్వడం తేలికే, నిలబెట్టుకోవడమే కష్టం.
లోకంలో అతి పెద్ద అంతరం ఎక్కడ
ఉంటుందంటే.. మాటలకూ, చేతలకూ మధ్య!





మనకున్న సమస్యల గురించి
ఫిర్యాదులు చేయడం మాని,
మనకు లేని సమస్యల్ని తలచుకుని
దేవుడికి కృతజ్ఞతలు చెప్పాలి.
ఆనందానికి మొదటి మెట్టు ఇదే!

- స్వామి పరిజ్ఞేయానంద

కార్యసాధనకు ఓ షరతు!

భగవాన్ శ్రీకృష్ణుడు స్వధర్మ నిర్వహణ వల్ల ప్రయోజనాల్నీ, స్వధర్మాన్ని అనుష్ఠించే విధానాన్నీ, స్వధర్మం పట్ల అలవరచుకోవలసిన దృక్పథాన్నీ అర్జునుడికి వివరిస్తూ ...

హతో వా ప్రాప్స్యసి స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహీమ్ ।
తస్మాదుత్తిష్ఠ కౌన్తేయ యుద్ధాయ కృతనిశ్చయః॥ (గీత, 2-37)

'అర్జునా! యుద్ధంలో మరణిస్తే వీరస్వర్గాన్ని పొందుతావు. జయిస్తే రాజ్యాన్ని అనుభవిస్తావు. కావున కృతనిశ్చయంతో యుద్ధం చేయి' అని ప్రోత్సహిస్తున్నాడు. స్వధర్మ నిర్వహణలో సఫలమైనా, విఫలమైనా శ్రేయోదాయకమే అని గుర్తు చేస్తున్నాడు.

అయితే, స్వధర్మాన్ని అనుష్ఠిస్తే ఎలాగూ శ్రేయస్సు చేకూరుతుంది కదా అని అనిష్టంగానో, అశ్రద్ధతోనో స్వధర్మాన్ని నిర్వహిస్తే సరిపోతుందా? అదే నిజమైతే క్రమశిక్షణా రాహిత్యంతో, నిరాసక్తతతో విధులను నిర్వర్తించే వారందరూ సత్ఫలితాలను పొందాలి. కానీ అలా జరగడం లేదు. అందుకు కారణమేమిటి?

స్వధర్మ నిర్వహణలో సఫలమైనా, విఫలమైనా శ్రేయస్సు చేకూరుతుందని శ్రీకృష్ణుడు హామీ ఇస్తూ, **'కౌన్తేయ యుద్ధాయ కృతనిశ్చయః** - అర్జునా! కృతనిశ్చయంతో యుద్ధం చేయి' అని ఓ షరతును విధించాడు. కురుక్షేత్ర రణరంగంలో యుద్ధాన్ని కృతనిశ్చయంతో చేయమని శ్రీకృష్ణుడు అర్జునుడికి విధించిన షరతు, జీవన రణరంగంలో స్వధర్మాలను అనుష్ఠిస్తున్న మనకు కూడా వర్తిస్తుందన్న సంగతి గుర్తుంచుకోవాలి.

సాధారణంగా మనం దృఢనిశ్చయంతో, పట్టుదలతో, నిబద్ధతతో ప్రయత్నించకుండా; మన శక్తిసామర్థ్యాలను సంపూర్ణంగా వినియోగించకుండా సత్ఫలితాలను ఆశిస్తాం. కానీ స్వధర్మం పట్ల సానుకూల దృక్పథాన్ని అలవరచుకొని అంకితభావంతో, శక్తివంచన లేకుండా కృషి చేసినప్పుడు సత్ఫలితం తప్పకుండా కలుగుతుంది. అందుకే స్వామి వివేకానంద 'To succeed, you must have tremendous will, tremendous perseverance and you will finally conquer - దృఢసంకల్పం, తీవ్రమైన పట్టుదల ఉంటే విజయం సిద్ధిస్తుంది' అని అంటారు.

దృఢసంకల్పంతో స్వధర్మాన్ని నిర్వహించేవారు తప్పక సత్ఫలితాలను పొందుతారంటూ శ్రీరామకృష్ణులు ఒక కథ చెప్పారు:

ఒక ఊళ్ళో ఇద్దరు రైతులు ఉండేవారు. ఒకరోజు ఆ రైతులిద్దరూ సాయంత్రంలోపు తమ పొలాలకు నీరు పెట్టకపోతే పంటలకు నష్టం వాటిల్లుతుందని, పొలానికి దగ్గరలో నున్న చెరువు నుండి కాలువ త్రవ్వడం ప్రారంభించారు. మొదటి రైతు కాలువ త్రవ్వుతుండగా అతడి భార్య వచ్చి భోజనానికి పిలిచింది. అతడు కాలువ త్రవ్వడం పూర్తిచేయనిదే పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టనని చెప్పి, పనిలో నిమగ్నమయ్యాడు. అతడనుకున్నట్లు సాయంత్రానికల్లా కాలువను త్రవ్వి, పొలానికి నీరు వచ్చేలా చేశాడు.

ఇక, రెండో రైతు కాలువ త్రవ్వుతుండగా అతడి భార్య వచ్చి భోజనానికి పిలవగానే పారను ప్రక్కన పడేసి ఆమెతోపాటు ఇంటికి వెళ్ళిపోయాడు. భోజనం చేసి, కాసేపు కబుర్లు చెప్పి, విశ్రాంతి తీసుకొని తిరిగ్గా వచ్చేటప్పటికి చీకటి పడింది. అతడు ఆ రోజు అనుకున్న పనిని పూర్తి చేయలేకపోయాడు. ఈ రైతులిద్దరూ తమ ☛

దేహమున్న విదేహి!

ఒకరోజు జనక మహారాజుతో ఆయన మంత్రి మాట్లాడుతూ, "మహారాజా! మీరు దేహధారులై ఉన్నారు కదా! మరి మిమ్మల్ని విదేహి అని అందరూ ఎందుకంటారు?" అని అడిగాడు. "అందుకు సమాధానం కొద్ది రోజులైన తరువాత చెబుతాను" అని జనకుడన్నాడు.

మంత్రికి అనుభవపూర్వకంగా తెలపాలని జనకుడు అనుకున్నాడు. ఒకనాడు జనకమహారాజు ఒక దూతను పిలిచి, "మంత్రి అపరాధం చేయడం వలన అతడికి సాయంత్రం నాలుగు గంటలకు మరణశిక్ష అమలుపరచ బడుతుంది" అని నగరమంతా దండోరా వేయమని ఆజ్ఞాపించాడు. అదే రోజు ఉదయం పదిగంటలకు మంత్రిని భోజనానికి ఆహ్వానించాడు.

చెప్పిన సమయానికి భోజనానికొచ్చాడు మంత్రి. రాజు అతడి కోసం ఎన్నో రకాల పదార్థాలు వండించాడు. కానీ కావాలనే దేనిలోనూ ఉప్పు వేయలేదు. మంత్రి ఆలోచనలన్నీ మరణదండన మీదే ఉన్నాయి. కానీ రాజుగారి ఆహ్వానం కదా, అందుకని తప్పనిసరై భోజనానికి వచ్చాడు. కానీ ఏ పదార్థాన్నీ తినలేకపోయాడు.

భోజనానంతరం జనక మహారాజు అతడితో, "ఏ వస్తువులోనూ ఉప్పు తక్కువ కాలేదు కదా" అని అడిగాడు. మంత్రి భయపడుతూ "మహారాజా! మృత్యుభయంతో నేను భోజనాన్ని కొంచెం కూడా ఆస్వాదించలేదు. ఏ పదార్థం తియ్యగా ఉన్నదో, ఏది పులుపుగా ఉన్నదో, ఏది చప్పగా ఉన్నదో నేను గ్రహించలేదు" అని అన్నాడు.

అప్పుడు జనక మహారాజు "మంత్రిగారూ! భోజనం చేస్తున్నప్పుడే మీకు తెలుసు, సాయంత్రం మీకు మృత్యుదండన అమలు అవుతుందని! దాంతో మీరు దేహంలో ఉండి కూడా 'విదేహు'లై పోయారు. నేను ఈ శరీరపు ఉనికిని క్షణం కూడా నమ్మను. అందుకే అందరూ నన్ను 'విదేహి' అని అంటారు. ఇందులో ఆశ్చర్యమేముంది?" అన్నాడు. ❖

అనువాదం: డాక్టర్ వై.సరోజా నిర్మల

(రామకృష్ణ సంఘం - హిందీ మాసపత్రిక 'వివేకజ్యోతి' నుండి)

చదువు ఎంతవరకు?

సుప్రసిద్ధ దార్శనికుడు ప్లేటో దగ్గరకు ఒకరోజు ఆయన మిత్రుడొకడు వచ్చాడు. మాటల్లో అతడు తన మనస్సులోని సందేహాన్ని బయట పెట్టాడు - "ప్రపంచ ప్రసిద్ధి పొందిన ఎందరో పెద్ద పెద్ద విద్వాంసులు మీ వద్దకు వస్తూంటారు. నాకర్థం కాని విషయమేమిటంటే మీరింత గొప్ప దార్శనికులు, విద్వాంసులు అయివుండి కూడా ఇతరుల నుంచి ఏదో ఒక విద్యను నేర్చుకోవడానికి ఎందుకంత కుతూహల పడుతూంటారు? అది కూడా ఎంతో వినయంగా, శ్రద్ధగా విషయం తెలుసుకునేందుకు ఆతురత చూపుతూంటారు. ఇంతకీ మీ చదువు ఎప్పటికి పూర్తవుతుందో కాస్త నాకు వివరిస్తారా?"

అందుకు ప్లేటో ఇలా సమాధానమిచ్చారు:

"ఇతరుల నుండి ఏదైనా నేర్చుకోవడానికి సిగ్గుపడనంత వరకు!" ❖

స్వధర్మమైన వ్యవసాయం చేయడానికి పూనుకున్నప్పటికీ మొదటి రైతుకే సత్ఫలితం లభించింది. అందుకు కారణం అతడు కృతనిశ్చయంతో స్వధర్మాన్ని అనుష్ఠించడమే!

మహాత్ముల జీవితాలను పరిశీలిస్తే దృఢనిశ్చయంతో కృషి చేసేవారికి వైఫల్యం ఉండదన్న సత్యం విశదమవుతుంది. 'హితోపదేశం' ఎంత మేధావి అయినా, ఎంతటి శక్తిసామర్థ్యాలున్నా, ఎంత నైపుణ్యమున్నా కృతనిశ్చయంతో కృషి చేయకపోతే సత్ఫలితం సాధ్యం కాదంటూ...

ఉద్యమేన హి సిద్ధ్యంతి కార్యాణి న మనోరథైః ।
న హి సుప్తస్య సింహస్య ప్రవిశన్తి ముఖే మృగాః ॥

'శక్తిసామర్థ్యాలను పూర్తిగా వినియోగించి కృషి చేయడం ద్వారానే కార్యసిద్ధి లభిస్తుంది. సింహమైనా ఆహారం కోసం ప్రయత్నించకుండా నోరు తెరచుకొని నిద్రపోతే, దాని నోట్లోకి జంతువులు వాటంతట అవే వచ్చి పడవు' అని మనల్ని అప్రమత్తుల్ని చేస్తోంది.

కాబట్టి మన స్వధర్మ నిర్వహణలో సఫలమవ్వాలంటే కృతనిశ్చయంతో కృషిచేయాలన్న శ్రీకృష్ణుడు విధించిన షరతును నెరవేర్చాలి. అప్పుడు సత్ఫలితం వస్తుంది. విజయం మన సొంతం అవుతుంది. ❖

రామానుజుల వైభవం

చిత్రకథ: మోహనా సూర్యనారాయణన్
చిత్రాలు: ఆర్.వెంకట్
అనుసృజన: స్వామి జ్ఞానదానంద

1 వెయ్యేళ్ళ క్రితం శ్రీపెరంబుదూర్‌కు చెందిన కేశవ సోమయాజులు, కాంతిమతి అనే భక్త దంపతులు పార్థసారథిస్వామిని పుత్రభాగ్యం కోసం ప్రార్థించారు. స్వామి, సోమయాజులుకు కలలో కనిపించి ...



క్రీ.శ. 1017వ సంవత్సరం చిత్తిరై మాసం 12వ రోజు శుద్ధ పంచమీ తిథి నాడు ఆరుద్రా నక్షత్రంలో శ్రీరామానుజులు జన్మించారు.

2 శ్రీవరదరాజస్వామిని సేవించి వచ్చిన తిరుకచ్చి నంబి పట్ల రామానుజులకు ఆకర్షణ ఏర్పడింది. ఒక రోజు నంబికి సేవలందించడానికి రామానుజులు ఉద్యుక్తుడయ్యాడు.



3 రామానుజులు పెరిగి కాంచీపురంలోని యాదవప్రకాశుడనే పండితుని వద్ద విద్యార్థిగా చేరాడు. ఆయన జ్ఞానపిపాసను చూసి యాదవప్రకాశుడు అసూయ చెందాడు. ఆయన రామానుజులను రూపుమాపడానికి తీర్థయాత్రకు పంపించాడు. ఆ బృందంలో రామానుజులకు వరుసకు సోదరుడైన గోవిందుడూ ఉన్నాడు. అతడు రామానుజులను విడిగా కలుసుకొని ...




4
రామానుజులు బృందం నుండి వైదొలగి కాంచీపురానికి తిరుగుముఖం పట్టాడు. అడవి మార్గంలో, అలసటతో ఆయన ఒక చెట్టు కింద నిద్రపోయాడు. నిద్రలేచేటప్పటికి పక్కనే బోయ దంపతులు ఉన్నారు.
మేమూ కాంచీపురానికే పోతున్నాం. భయపడకు! మేము నీకు తోడుగా ఉంటాం.
ఆ బోయ వనిత 'నాకు దాహంగావుంది' అని అనగానే రామానుజుడు నీళ్ళు తెచ్చాడు. మూడుసార్లు తెచ్చిన నీటిని తాగినా కూడా ఆమెకు దాహం తీరలేదు. నాలుగోసారి అతడు నీళ్ళు తెచ్చేటప్పటికి ఆ దంపతులు లేరు. అందుకు మారుగా తాను కాంచీపురంలో ఉన్నట్లు గ్రహించాడు. అడవిలో తనకు తోడునీడగా వచ్చిన వారు సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడు, శ్రీమహాలక్ష్మి అని గ్రహించి రామానుజులు ఆనందపరవశుడయ్యాడు.
5
యాదవప్రకాశుడు తిరిగి రాగానే కంచిలో రామానుజులను చూసి విస్తుపోయాడు. అయినప్పటికీ ఆయనను గురుకులంలో మళ్ళీ చేర్చుకొన్నాడు. శిష్యుడైన రామానుజుల కీర్తి వ్యాపించసాగింది. అది చూసి భరించలేక యాదవప్రకాశుడు ఆయనను తన గురుకులం నుండి పంపించివేశాడు.
నా ఇష్టప్రకారం నడుచుకోకపోతే నీకు ఇక్కడ స్థానం లేదు. వెళ్ళిపో!
6
వరదరాజస్వామికి సేవలందించడానికి రామానుజులు కంచి వచ్చారు.
నాయనా! వరదరాజస్వామి తిరుమంజరం (అభిషేకం)నకు నీళ్ళు తెచ్చే సేవను కొనసాగించు.
అది నా మహాభాగ్యం స్వాములారా!
రామానుజులు వైష్ణవం స్వీకరించగోరి శ్రీరంగనాథుని ప్రార్థిస్తూ 'స్తోత్ర రత్నమ్' స్తుతి పుస్తకాన్ని ఆయన పాదపద్మాలకు సమర్పించాడు. శ్రీరంగంలో ఉంటున్న ఆళవందార్‌ను కంచి నుంచి వచ్చిన ఇద్దరు బ్రాహ్మణులు కలుసుకొన్నారు.
7
స్వామీ! రామానుజులు వరదరాజస్వామి తిరుమంజరానికి నిత్యకైంకర్యం చేస్తున్నారు.
రామానుజుడు వైష్ణవానికి లభించిన గొప్ప పెన్నిధి కానున్నాడు.
బ్రాహ్మణులు తెలిపిన సమాచారం విని సంతోషించిన ఆళవందార్, రామానుజులను తోడ్కొని రమ్మని తమ శిష్యుడైన పెద్ద నంబికి ఆదేశమిచ్చారు.

8 రామానుజులు ఆళవందార్‌ను చూడడానికి శ్రీరంగం వెళుతున్నప్పుడు దారిలోనే ఆయన పరమపదించిన వార్త విన్నారు. ఆళవందార్ దివ్యకాయాన్ని దర్శించినప్పుడు మూడు వేళ్ళు ముడుచుకొని ఉండడం రామానుజులు చూశారు.



9 రామానుజులు దైవ ఆనతి మేరకు పెద్దనంబిని గురువుగా స్వీకరించాడు. తరువాత కంచిలో తన గురువు వద్ద దివ్య ప్రబంధాలు నేర్చుకున్నాడు.



ఆళవందార్ పార్థివ దేహాన్ని రామానుజులు తదేకంగా చూశారు. అప్పుడు ఆళవందార్ ఏమనుకొన్నారో గ్రహించిన రామానుజులు వెంటనే బిగ్గరగా మూడు శపథాలు చేశారు. అవి:

1. జనుల అజ్ఞానాన్ని తొలగించి, వారికి పంచ సంస్కారాలు గావించి, దివ్యప్రబంధాలలో నిష్ణాతులను చేసి, ప్రపత్తి మార్గంలో పాదుగొల్పి సదా కాపాడుతాను.

2. జనులను రక్షించే ఉద్దేశంతో, శ్రేయమైన తత్త్వజ్ఞానాన్ని మేళవించి 'శ్రీభాష్యం' విరచిస్తాను.

3. విష్ణుపురాణాన్ని సృజించిన పరాశర ముని వర్యులకు, వ్యాసులవారికి కృతజ్ఞత తెలిపే రీతిలో, చక్కగా అధ్యయనం చేసిన ఇద్దరు వైష్ణవులకు వారి పేర్లను నామకరణం చేస్తాను.

రామానుజులు ఈ విధంగా పలుకగానే ఆళవందార్ ముడుచుకొన్న మూడు వేళ్ళు తిన్ననయ్యాయి.

10 కొంతకాలం గడిచాక కంచి వరదరాజస్వామి సన్నిధిలో రామానుజులు సన్యాసం స్వీకరించారు. శ్రీరంగం వెళ్ళిన రామానుజులు తిరుకోష్టియూర్ నంబి వద్ద అష్టాక్షరీ మంత్రాన్ని స్వీకరించారు.







మితమే హితం!

(...27వ పేజీ తరువాయి)

ప్రాణాపాయస్థితిని తెచ్చుకున్నాడు. అందుకే యోగివేమన అన్ని వేళలా, అన్ని చోట్లా మన ఆధిక్యాన్ని ప్రదర్శించకుండా అణకువను అలవరచుకోవాలని చెబుతూ 'అనువుగాని చోట అధికులమనరాదు, కొంచెమయిన అదియు గొదువగాదు, కొండ అద్దమందు కొంచెమై ఉండదా' అని హెచ్చరించారు.

❖ సమాజంలో ప్రతి వ్యక్తీ ప్రత్యేకమే! అందరి పట్ల సద్భావం కలిగి ఉండాలే కానీ హీనభావం ఉండకూడదు. ఎవరితో ఎప్పుడు ఎలాంటి అవసరం వస్తుందో ఎవరికి తెలుసు? శ్రీరాముడంతటి పురుషోత్తముడికి, వానరుల సహాయం అవసరమైంది కదా! దీన్నిబట్టి మనం ఎవ్వరినీ చులకనగా చూడరాదనీ, ఎవ్వరినీ తక్కువగా అంచనా వేయరాదనీ అర్థం చేసుకోవాలి.

❖ ప్రతి వ్యక్తికీ కొన్ని పరిమితులూ, కొన్ని బలహీనతలూ, కొన్ని సున్నిత భావాలూ ఉంటాయి. వాటిని అర్థం చేసుకొని అప్రమత్తంగా మెలగడానికి ప్రయత్నించాలి. 'అందరితో కలసిమెలసి ఉండాలి; స్నేహం కొంతమందితోనే ఉండాలి; అతికొద్దిమందితోనే సన్నిహితంగా మెలగాలి' అన్నది అనుభవజ్ఞుల సూచన. ఇతరుల మనస్తత్త్వాలను అర్థం చేసుకోకుండా స్నేహం చేస్తే ఎంత త్వరగా సన్నిహితుల మవుతామో అంతే త్వరగా మనఃస్పర్థలతో విడిపోవడం జరుగుతుంది. అందుకే 'సద్భావాలు కలిగిన వారితో తప్ప ఎవరితోనూ మీ విషయాలను పంచుకోవద్దు' అని ఎ.కెంపిస్ సూచించారు. కాబట్టి ఇతరుల మనస్తత్త్వాన్ని అర్థం చేసుకోకుండా సన్నిహితంగా మెలగకూడదు, అన్ని విషయాలను పంచుకోకూడదు.

❖ మనల్ని ఎవరైనా అవమానించినప్పుడూ, విమర్శించినప్పుడూ మనస్సు గాయపడకుండా ఉండాలంటే '*Any issue, if taken to the heart, is sure to hurt. Put your peace above everything* - మనకు కష్టం కలిగించే ఏ విషయాన్నైనా హృదయపులోతుల్లోకి తీసుకుంటే మనస్సు గాయపడుతుంది. కాబట్టి మనశ్శాంతిని భంగపరిచే అల్పవిషయాలకు ప్రాధాన్యం ఇవ్వకూడదు' అన్న ఓ ఆంగ్ల తత్త్వవేత్త సూచనను గుర్తుచేసుకోవాలి. కాబట్టి అల్ప విషయాలను మనస్సులో పెట్టుకుని మథనపడకుండా ఎంత త్వరగా మరచిపోగలిగితే అంత త్వరగా మనోవ్యథ నుండి బయటపడగలుగుతాం. ద్వేషభావాన్ని విడనాడి ఇతరులతో అన్యోన్యంగా మెలగగలుగుతాం.

మానవ సంబంధాలను పదిలపరచుకోవడానికి 'మితమే హితమ'ని విశ్వసించి, పైన తెలిపిన సూచనలను పాటించిననాడు మనలో అసహనం, అసంతృప్తి, ద్వేషం, కలహాలు, పంతాలు పోయి అందరితోనూ కలసిమెలసి ఆనందంగా జీవించగలుగుతాం. ❖

వార్తావాహిని

విద్యార్థుల వికాసానికి 'వివేక వాహిని'

విజయవాడ రామకృష్ణ మిషన్ - మాచర్ల, కర్లపాలెం, మచిలీపట్నం, యొండగండి, చీరాల, ఒంగోలు, పొనూరు, హుజూర్ నగర్, నూజివీడు శ్రీరామకృష్ణ సేవా సమితుల ఆధ్వర్యవంలో 'వివేక వాహిని' కార్యక్రమాలను నిర్వహించింది. 2014 ఆగష్టు నుండి 2015 జనవరి వరకు గుంటూరు, కృష్ణ, పశ్చిమ గోదావరి, ప్రకాశం మరియు ఖమ్మం జిల్లాల్లోని 85 విద్యాసంస్థల్లో నిర్వహించిన వ్యక్తిత్వ వికాస సదస్సుల్లో స్వామి స్వసంవేద్యానందజీ, స్వామి సేవ్యానందజీ, స్వామి సన్నివాసానందజీ పాల్గొని విద్యార్థులకు స్ఫూర్తిదాయక సందేశాలను ఇచ్చారు.

ఈ సదస్సుల్లో సుమారు 23,900 మంది విద్యార్థులు పాల్గొని 3,00,000 రూపాయల విలువ చేసే శ్రీరామకృష్ణ - వివేకానంద సాహిత్య గ్రంథాలను కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్వామి వివేకానంద భావాలు, ఆదర్శాలతో కూడిన 'చలన చిత్రం ' ప్రదర్శించబడింది. ❖

నివేదిక : స్వామి సేవ్యానంద

గ్రంథ స్వీకారం



శ్రీదక్షిణామూర్తి స్తవము

(శ్రీశంకరభగవత్పాద విరచిత శ్లోకములకు వేదాంతచర్చ)

వ్యాఖ్యాత: వంగవేటి యజ్ఞనారాయణ శర్మ

వెల: రూ. 100/-, పుటలు: 155

ప్రతులకు: వి.సూర్యనారాయణ

నెం. 37 - ఎల్.ఐ.జి.2, బి.కె.గూడ,

ఎస్.ఆర్. నగర్, హైదరాబాదు-500 038

సెల్: 98486 83957



అభయప్రదాత సమక్షంలో...

(శ్రీరామకృష్ణుల గృహస్థ భక్తుల జీవిత చరిత్రలు)

వెల: రూ. 60/-, పుటలు: 172

ప్రతులకు: శ్రీరామకృష్ణ సేవాసమితి

డా॥పన్నాల శ్యామసుందరమూర్తి

నెం.13-3-20, గుంటూరువారితోట,

2వ లైను, గుంటూరు - 522 001

సెల్: 98661 75274

కపిల గో సంవాదము

ఆధ్యాత్మిక మహా ప్రబంధము

గ్రంథకర్త : శ్రీరామావఝుల

కొండుభట్టార్యులు(18 శతాబ్ది)

వెల: రూ. 300/-, పుటలు: 324

ప్రతులకు:రామావఝుల శ్రీశైలం,

ఫ్లాట్.నెం. జి-4, మైత్రి నివాస్ అపార్ట్‌మెంట్,

విమలాదేవినగర్, మల్కాజ్‌గిరి,

హైదరాబాదు-47, సెల్: 94909 29626



మన పుణ్యక్షేత్రాలు

సంకలనం: వొరుగంటి రామకృష్ణప్రసాద్

వెల: రూ. 300/-, పుటలు: 558

ప్రతులకు: నవరత్న బుక్‌హౌస్,

28-22-20, రహమాన్ స్ట్రీట్,

అరండల్‌పేట, విజయవాడ-520 002

సెల్: 98480 82432

Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust
and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020
and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**

Vol.72-4, Sri Ramakrishna Prabha (Telugu Monthly) April 2015, Regd. with the Registrar of Newspaper for India Under No.1120/57. Postal Registration No. HD-1071/2013-15. Licensed to Post Under WPP : AP/CPMG/HC-13/WPP/2015-16. Date of Publication : 16 March 2015



సప్తగిరుల పావనత్వం

చెన్న పట్టణానికి నలబై కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీపెరంబుదూర్ అనే గ్రామంలో ఆసూరి కేశవాచార్యులు, కాంతిమతి పుణ్య దంపతులకు ఒక దివ్య బాలుడు జన్మించాడు. ఆ బాలుడు శ్రీరాముడి అనుజుడైన లక్ష్మణుడి అంశతో జన్మించినందువలన అతడికి రామానుజుడని నామకరణం చేశారు.

శ్రీరామానుజాచార్యులు కులతత్త్వాలు, వర్ణభేదాలు, అస్పృశ్యతలనే దురాచారాలను తుదముట్టించారు. శ్రీరామానుజులు 'మోక్షం పరమ పురుషార్థం. విశ్వశక్తికి శరణాగతి అయినవాడు, స్వార్థరహితుడైనవాడు మోక్షమును పొందగలడు ' అని మానవాళికి బోధించారు.

శ్రీరామానుజులు తిరుపతి యాత్ర చేసినప్పుడు సప్తగిరుల వైభవాన్ని తమ శిష్యులకు చెబుతూ...

"వత్సలారా! సప్తగిరుల విలాస వైభవాన్ని దర్శించండి. భక్తుల పుణ్యరాసులు ఈ తిరుమల రూపమున వెలసినవి. ఈ పవిత్ర తిరుమల సానువులను మన పాదములతో ఎలా తాకగలం? శ్రీనివాసుని దివ్య పాదములచే స్పృశింపబడిన సప్తగిరులు ఇవి. అసంఖ్యాక భక్తులచే స్పృశింపబడిన మార్గమిది. ఋషిపుంగవులు, మునులు, సాధువులు నడిచిన త్రోవ ఇది. అలాంటి దివ్యమార్గాన్ని మన పాదాలతో తాకుట మనకు తగదనిపిస్తుంది. కాబట్టి మనమందరమూ ఇక్కడి నుండే ఆ శ్రీనివాసుని భక్తిశ్రద్ధలతో ప్రార్థిద్దాం" అని అంటూ భక్తిపారవశ్యంతో నేలపై సాష్టాంగ ప్రణామాలర్పిస్తూ చాలా సమయం అలానే ఉండిపోయారు. ❖

With Best Compliments From

పక్యాల భాస్కర రావు, మేనేజింగ్ డైరక్టర్ & **పక్యాల గిరిజ,** డైరక్టర్

SVIS LABS LIMITED

SVISS LABSS LIMITED

(Manufacturers of Active Pharmaceutical Ingredients and Intermediates)

TÜV CERT DIN EN ISO 9001 : 2000 Certificate : 01 100 058568

Regd. Off. & Fact. : Plot No.88 & 89, Phase - II,
SIPCOT Industrial Complex, Ranipet - 632 403, Tamil Nadu.
Phone : 04172 - 244820, 651507, Tele Fax : 04172 - 244820
E-mail : rao@svisslabss.net Web Site : www.svisslabss.net

SVISS LABSS కంపెనీ వారు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 2,000 పాఠశాలలకు స్పాన్సర్ చేశారు.

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

మే 2015

₹10

సుబోధ

భక్తుడు: కర్మలు నిర్వర్తిస్తూ ఉంటే భగవల్లాభం కలుగుతుందా?

శ్రీరామకృష్ణులు: ప్రతి ఒక్కరూ కర్మలు చేస్తూనే ఉన్నారు. భక్తుడు భగవన్నామ స్మరణ చేయడమూ కర్మే! అద్వైతులు 'సోఽహం' భావంతో ధ్యానం చేయడమూ కర్మే! ఇంతెందుకు – ఊపిరి వదలడం కూడా కర్మే సుమా! కర్మత్యాగం చేసే ఉపాయం లేదు. అందుచేత కర్మలు చేయి, కానీ ఫలితాన్ని భగవంతుడికే వదిలిపెట్టు.

భక్తుడు: అధిక ధనసంపాదనకు ప్రయత్నించవచ్చా?

శ్రీరామకృష్ణులు: అధికంగా ధనం సంపాదించడానికి ప్రయత్నించు, కానీ సరైన మార్గంలోనే! లక్ష్యం ధన సంపాదన కాదు; భగవత్ సేవే! భగవంతుని సేవించడానికై సంపాదించే డబ్బులో దోషం ఉండదు.

భక్తుడు: కుటుంబ బాధ్యతలను ఎంతకాలం వహించాలి?

శ్రీరామకృష్ణులు: పిల్లలు తమ కాళ్ళ మీద తాము నిలబడ్డ తరువాత వాళ్ళ భారాన్ని వహించవలసిన అవసరం లేదు. పక్షిపిల్ల స్వయంగా ఆహారం సేకరించడం నేర్చిన తరువాత, మళ్ళీ తల్లి వద్దకు వెళితే, తల్లి దాన్ని ముక్కుతో పొడిచి వెళ్ళగొడుతుంది.

భక్తుడు: ఎంతకాలం కర్మలు ఆచరించాలి?

శ్రీరామకృష్ణులు: కాయ కాస్తే పువ్వు నిలబడదు. భగవద్దర్శనం అయ్యాక కర్మలు చేయనక్కర్లేదు. అందుకు మనస్సు ఇచ్ఛగించదు కూడా.

తాగుబోతు అధికంగా కల్లు తాగితే అతడికి స్పృహ ఉండదు. ఏదో కాస్త పుచ్చుకొంటే పనీపాటా చేసుకోగలుగుతాడు. భగవంతుడి వైపు వెళ్ళే కొద్దీ, ఆయన అంతగా నీ పనిని తగ్గిస్తాడు.

భక్తుడు: యావజ్జీవితం సాధన చెయ్యాలా?

శ్రీరామకృష్ణులు: లేదు. కానీ మొదట్లో బాగా కష్టపడి సాధన చెయ్యాలి. తరువాత అంత పరిశ్రమ అవసరం లేదు. ఎదురుగాలి వీస్తున్నప్పుడూ, గాలివాన కొడుతున్నప్పుడూ, సుడిగాలి లేక తుపాన్ చెలరేగే సమయాల్లోనూ, నది వంపుల గుండా పయనించేటప్పుడూ పడవ నడిపేవాడు లేచి నిలబడి చుక్కానిని గట్టిగా పట్టుకోవలసి ఉంటుంది. కానీ వీటన్నింటినీ దాటిన తరువాత, మరి భయం లేదు. వంపులతో కూడిన ఆ మార్గాన్ని దాటాక, అనుకూల పవనాలు వీస్తున్నప్పుడు అతడు నిశ్చింతగా కూర్చుంటాడు. చుక్కాని మీద ఊరకే చెయ్యి వేసి ఉంటాడు. తరువాత తెరచాపను మెల్లగా ఎత్తుతాడు. తదనంతరం పొగత్రాగడం మొదలుపెడతాడు. అలాగే మానవ జీవన యాత్రలో కూడా కామకాంచనాలనే సుడిగాలులను, గాలివానలను అధిగమించాకనే జీవితంలో శాంతి లభిస్తుంది. ❖

శ్రీరామకృష్ణ ప్రభ
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాదు-500 029
ఫోన్: 040-27667799, సెల్: 8801849494
E-mail : sriramakrishnaprabha@gmail.com
నిర్వాహక సంపాదకులు: స్వామి జ్ఞానదానంద
సంపాదకులు: స్వామి పరిజ్ఞేయానంద

సురభి

నేను (లారా గ్లెన్ – సోదరి దేవమాత) మద్రాసు నుండి 40 గంటల రైలు ప్రయాణం తర్వాత కలకత్తా చేరాను. మాతృమూర్తి శారదాదేవి నా కోసం తన ఇంట్లోనే ఒక గది ఏర్పాటు చేశారు. కానీ ఇంట్లో కొందరికి అమ్మవారు సోకడంతో, నా బస నివేదిత పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఏ ఇబ్బందీ లేదు. కానీ అనుక్షణం అమ్మ చరణకమలాలను దర్శించలేను కదా అని ఎంతో వ్యథ చెందాను.

ఒక వ్యక్తి వచ్చి, నన్ను అమ్మ ఇంటికి తీసుకువెళ్ళాలి. కానీ ఆయన కోసం ఎక్కువ సేపు నిరీక్షింపలేక, నేనే ఒంటరిగా బయలుదేరాను. అమ్మ ఎంత ఆశ్చర్యపోయారో! మధుర స్వరంతో నా పేరు రెండుసార్లు ఉచ్చరించి, తలపై కరముంచి దీవించారు. ఆ స్పర్శతో నాలో ఏదో దివ్యశక్తి ప్రవహించినట్లయింది.

అమ్మ నాకు కొన్ని పనులు అప్పగించారు. ప్రతిదినం వెళ్ళి ఆమె గది ఊడ్చేదానిని. ఆమె పక్కబట్టలు దులిపేదానిని. కిటికీ అద్దాలను సబ్బునీళ్ళతో శుభ్రం చేసేదాన్ని. నేను చేసే పనుల గురించి అమ్మ అందరికీ చెప్పి సంతోషాన్ని వ్యక్తపరచేవారు.

ఒక రోజు ఒక భక్తుడు రెండు మంచి మామిడి పళ్ళు తెచ్చి అమ్మకు ఇచ్చాడు. అమ్మ నాకు ఇవ్వబోయారు. ఆమెకు మామిడి పళ్ళంటే మిక్కిలి ఇష్టం అని నేను ఎరుగుదును. 'అమ్మా! మీరు తింటే నాకు ఆనందం' అన్నాను. దానికి అమ్మ వెంటనే, 'నేను తింటే నీకు కలిగే ఆనందం కంటే, నీవు తింటే నాకు కలిగే ఆనందం ఎక్కువ కదా!' అన్నారు. 'మీ ఆనందమే ఎక్కువ. ఏలననగా మీ మనస్సు శుద్ధం' అన్నాను.

ఈ జీవితం ఒక నది లేదా సరోవరం వంటిది. సూర్యతాపానికి నీరు ఆవిరి అయినా, అది వాన రూపంలో వచ్చి నేలను మృదువుగా చేస్తుంది. అమ్మ వంటి వారు ఈ మర్త్యలోకాన్ని విడిచిపోయినా, వారి పవిత్రత మన జీవితాలలో వ్యాపించి, మన శుష్క హృదయాలలో భక్తిరసం చల్లి, ఒక నూతన శక్తిని ప్రసాదిస్తుంది.

నేను మద్రాసులో ఉన్నప్పుడు అమ్మ నన్ను ఆశీర్వదిస్తూ ఓ ఉత్తరం వ్రాసారు. ఆ ఉత్తరంలో అమ్మ నా గురించి ఇలా వ్రాసారు:

ప్రియమైన తల్లీ!

నీవు భక్తితో వ్రాసిన జాబు అందినది. సమాధానం వ్రాయడంలో జరిగిన జాప్యానికి కోపగించుకొనకు. నేను నిన్ను సదా తలచుకుంటూనే ఉంటాను. నీవు ఈ ఇంట్లో ఎక్కడ జపధ్యానాలు చేసేదానివో, ఆ చోటు చూడగానే నీ ప్రియమైన రూపం, నీ మాటలు నా మదిలో మెదులుతాయి. ఇక్కడంతా క్షేమం. అందరూ నిన్ను తలుస్తూ ఉంటారు.

దీవెనలతో... మీ

అమ్మ

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

సంపుటం: 72 సంచిక: 5 మే 2015

వీతాఖిల విషయేచ్ఛం జాతానందాశ్రుపులక మత్యచ్ఛమ్ ।
సీతాపతిదూతాద్యం వాతాత్మజ మద్య భావయే హృద్యమ్ ॥

సర్వభోగవిషయాల యందు ఇచ్ఛ లేనివాడు, ఆనందముతో పులకాంకితుడైనవాడు, పరమ పవిత్ర హృదయం కలవాడు, సీతాపతి అయిన శ్రీరామచంద్రుని దూతలలో ప్రథముడు, మనోహరుడు అయిన వాయుపుత్రుణ్ణి హృదయములో ధ్యానించెదను.

– ఆదిశంకరాచార్యకృతమ్ 'హనుమత్పంచరత్నమ్'

సూక్తి సౌరభం

అచరిత్వా బ్రహ్మచర్యం
అలబ్ధ్వా యౌవనే ధనం ।
జీర్ణక్రౌంచ ఇవ క్షీయంతే
క్షీణమత్స్య ఇవ సల్వలే ॥

"విద్యార్థి దశలో విద్యను అభ్యసించకుండా, యౌవనంలో ధనాన్ని ఆర్జించకుండా సమయాన్ని వృథా చేసేవారు, చేపలు లేని మడుగులో ముసలి కొంగల వలె దైన్యమైన జీవితాన్ని గడపాల్సి వస్తుంది."

చర్మ మెపుడు జీవసౌఖ్యంబు గోరును
జీవి కర్మములను చేరుచుండు
జీవి కర్మ మెల్ల చెడ రోయతత్త్వమౌ!
విశ్వదాభిరామ వినుర వేమ!

"ఓ వేమా! ఈ పాంచ భౌతిక దేహం ఎప్పుడూ సుఖాలనే కోరుతూ ఉంటుంది. కనుక మానవుడు సుఖాలను పొందడం కోసం కర్మలు చేస్తూ ఉంటాడు. మానవుడు చేసే ఈ కర్మల్లో ఎన్నో నిరుపయోగమైనవే!"



శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి



ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'కి ధన దానం చేసి ప్రోత్సహించాల్సిందిగా కోరుతున్నాం. దాతల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు......	రూ. 10,000/-,	అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజ పోషకులు............	రూ. 5,000/-,	అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు..................	రూ. 1,000/-,	అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

	దాతపేరు	ఊరు	రూ.
మహారాజ పోషకులు:	శ్రీ నల్లమోతు విద్యాసాగర్,	బి.హెచ్.ఇ.ఎల్. ఎన్‌క్లేవ్, సికింద్రాబాద్	10,000
మహారాజ పోషకులు:	శ్రీమతి ఎనుముల లక్ష్మీశ్రీధర్ రెడ్డి,	సూరారం, రంగారెడ్డి జిల్లా (హనుమాన్ జయంతి సందర్భంగా)	10,000
మహారాజ పోషకులు:	ఒక భక్తుడు,	పశ్చిమ గోదావరి జిల్లా	10,000
రాజపోషకులు :	శ్రీ వి. పార్థసారథి,	ఎస్.ఆర్.పేట, తాడేపల్లి గూడెం, పశ్చిమ గోదావరి జిల్లా	5,000
పోషకులు :	ఒక భక్తుడు,	తాళ్ళవలస, విశాఖపట్నం జిల్లా	2,500
పోషకులు :	శ్రీ పి. ప్రకాశ్ రావు,	శివనారాయణపురం, బడంగిపేట్, హైదరాబాద్	2,232
పోషకులు :	శ్రీ రత్నం శరవణ,	సోమప్ప కాలనీ, కర్నూలు (తండ్రి కీ॥శే॥ ఎమ్. రత్నంగారి జ్ఞాపకార్థం)	1,200
పోషకులు :	శ్రీ ఆర్.వి. రమణారావు,	పెద్దపల్లి, కరీంనగర్ జిల్లా	1,116
పోషకులు :	శ్రీ రాయప్రోలు శ్రీదేవి రమేష్ & శ్రీమతి రామలక్ష్మి,	కె.ఎల్.పురం, విజయనగరం	1,008

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

యువతరానికి 'శ్రీరామకృష్ణ ప్రభ'ను మరింత చేరువ చేయాలని సంకల్పించాం. రాష్ట్రంలోని వివిధ పాఠశాలలు/ కళాశాలలు/ గ్రంథాలయాలకు పత్రికను పంపించడానికి మీ సహాయాన్ని కోరుతున్నాం. ఈ కానుక పథకం క్రింద చందా చెల్లించిన దాత పేరున (మీరు సూచించిన లేదా మేము ఎంపిక చేసిన) విద్యాసంస్థకు పత్రికను పంపుతాం. కానుక చందా రూ.1,500/- అంతకన్నా ఎక్కువ ఇచ్చిన దాత పేరు, విద్యాసంస్థ పేరు పత్రికలో ప్రచురిస్తాం.

దాత పేరు	విద్యాసంస్థ
డా॥సరస్వతి,మెహదీపట్నం,హైదరాబాద్	వంద ప్రభుత్వ పాఠశాలలకు పత్రికను ఒక సంవత్సరానికి స్పాన్సర్ చేశారు.
శ్రీమతి రంగనాయకమ్మ,ఎస్.బి.ఐ.కాలనీ, గాంధీనగర్,హైదరాబాద్	నూటొక్క ప్రభుత్వ పాఠశాలలకు పత్రికను ఒక సంవత్సరానికి స్పాన్సర్ చేశారు.
శ్రీ టి.మలహర్ రావు,పోతుగల్లు, ముస్తాబాద్, కరీంనగర్ జిల్లా	కరీంనగర్ జిల్లా ముస్తాబాద్ మండలంలోని ఇరవై విద్యాసంస్థలకు ఒక సంవత్సరానికి స్పాన్సర్ చేశారు.
శ్రీ లింగా శ్రీనాథ్,సూర్యనగర్ కాలనీ, కార్ఖానా,సికింద్రాబాద్	పది ప్రభుత్వ పాఠశాలలకు పత్రికను ఒక సంవత్సరానికి స్పాన్సర్ చేశారు.
శ్రీ లింగా వేంకటేశ్వర రావు,సూర్యనగర్ కాలనీ,కార్ఖానా,సికింద్రాబాద్	సికింద్రాబాద్‌లోని పది ప్రభుత్వ పాఠశాలలకు పత్రికను ఒక సంవత్సరానికి స్పాన్సర్ చేశారు.
శ్రీమతి ఎ.లక్ష్మీబాయి, గాంధీనగర్, హైదరాబాద్	ఇరవై అయిదు పాఠశాలలకు పత్రికను ఒక సంవత్సరానికి స్పాన్సర్ చేశారు.
శ్రీ కొండూరు నరసింహ,చౌదర్ పల్లి,యాచారం,రంగారెడ్డి జిల్లా	రంగారెడ్డి జిల్లాలోని 3 ప్రభుత్వ పాఠశాలలకు పత్రికను 6 సంవత్సరాలకు స్పాన్సర్ చేశారు.
శ్రీ వి. కేశవనాయుడు, వెంకటరెడ్డి కాలనీ, తిరుపతి, చిత్తూరు జిల్లా	చిత్తూరు జిల్లాలోని ఒక ప్రభుత్వ కళాశాల & ఒక పాఠశాలకు ఐదు సంవత్సరాలకు స్పాన్సర్ చేశారు.
శ్రీ ఎ.కె.విశ్వనాథ రెడ్డి, బజారు వీధి, పూతలపట్టు, చిత్తూరు జిల్లా	చిత్తూరు జిల్లాలోని మూడు ప్రభుత్వ పాఠశాలలకు జీవిత చందాను స్పాన్సర్ చేశారు.
ప్రిన్సిపాల్, వివేకానంద జూనియర్ & డిగ్రీ కళాశాల, చేవెళ్ళ, రంగారెడ్డి జిల్లా	రంగారెడ్డి జిల్లాలోని 50 మందికి ఒక సంవత్సరానికి పత్రికను స్పాన్సర్ చేశారు.
శ్రీమతి ఎన్. ఇందిరాదేవి, హెచ్.ఎమ్.టి.నగర్, నాచారం, హైదరాబాద్	అనాథ విద్యార్థి గృహం, ఎన్.టి.ఆర్. నగర్, కొత్తపేట, హైదరాబాద్
శ్రీ చిన్నదాసరి కృష్ణ, కూకట్‌పల్లి, హైదరాబాద్	మహబూబ్‌నగర్ జిల్లా, నిజాలపూర్ గ్రామంలోని 2 ప్రభుత్వ పాఠశాలలకు పత్రికను స్పాన్సర్ చేశారు.

ముఖచిత్రం: కోల్‌కతాలో స్వామి వివేకానంద స్థాపించిన రామకృష్ణ సంఘ ప్రధాన కేంద్రమైన బేలూరు మఠం - 'భగవాన్ శ్రీరామకృష్ణ దేవాలయం'. మే 1న రామకృష్ణ మిషన్ సంస్థాపన దినోత్సవం.

చందా వివరాలు		భారతదేశంలో	విదేశాలకు
విడి ప్రతి	:	₹ 10	-
సంవత్సర చందా	:	₹ 100	₹ 1,500
మూడు సంవత్సరాలకు	:	₹ 280	₹ 4,500
ఐదు సంవత్సరాలకు	:	₹ 450	₹ 7,500
ఇరవై సంవత్సరాలకు	:	₹ 1,500	₹ 22,000

గమనిక: డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో Ramakrishna Math, Hyderabad అని వ్రాయాలి.

పంపవలసిన చిరునామా: Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.

చందాను ఆన్‌లైన్ http://rkmath.org/srkp ద్వారా చెల్లించవచ్చు.

లోపలి పేజీల్లో...

6 సంపాదకీయం
సర్వయోగ సమన్వయం సంఘాదర్శం

8 గోరుముద్ద
ప్రసాదం ఎంత రుచిరా!

9 అసమాన ధీరుడు అంజనీ సుతుడు

10 పలికెడిది భాగవతం
కలిపురుషుని ప్రదేశంబులు

12 మన సంస్కృతి
విదేశాలలో భారతీయ సంస్కృతి

14 శాంత చిత్తమే ప్రధానం!

15 అదె చూడరయ్య పెద్ద హనుమంతుని!

16 పరిప్రశ్న

17 రామకృష్ణ భక్తి సూత్రాలు

18 భగవంతునికి ఇష్టుడెవరు?

19 మహాపురుషుని సాన్నిధ్య స్మృతులు

20 గౌతముడిచ్చిన ఘనవారసత్వం

21 ధీరవాణి
దేశ ఔన్నత్యానికి పట్టుగొమ్మలు

22 శ్రీరామకృష్ణ ఉద్యమం - స్వచ్ఛంద సేవకుల పాత్ర

24 యువత - ఉపాధి

26 ఏ మట్టిలో ఏ మాణిక్యమో!

27 జీవనోద్యానంలో మానవతా పరిమళాలు
శిలలు నేర్పే పాఠం! / మాతృభాష-మాతృదేవి

28 నిర్ణయం

30 తపస్సు అంటే...

31 ముందుకు సాగిపో!

35 వికాస మంత్రాలు

36 భగవద్గీత - సద్గుణ సుధ
సమభావమే శాంతిపథం!

37 ఒక కథ చెబుతా...
సృష్టిలో అన్నీ పనికొచ్చేవే!

38 బొమ్మల కథ
అక్బర్ అభిలాష

ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు.– సంపాదకులు

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు మీద చిరునామాకు పైన మీ చందా నంబరు, కుడి వైపున మీ చందా గడువు ముగిసే నెల ఉంటాయి. మీ చందా గడువు పూర్తయ్యే నెలకు ముందుగానే సొమ్మును చెల్లించి చందాను పునరుద్ధరించుకోండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారిన పక్షంలో 7వ తేదీ లోగా మాకు తెలియపరచినట్లయితే, వచ్చే నెల సంచిక నుండి మీ కొత్త చిరునామాకు పంపబడును.
- ప్రతీ నెల 26 లేదా 27వ తేదీల్లో పత్రిక పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపుగా చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ.... – సర్క్యులేషన్ మేనేజర్

KCP CEMENT
CONCRETE CEMENT
Since 1958

With Best Compliments From
CHAIRMAN & MANAGING DIRECTOR
THE KCP LIMITED
KCP కంపెనీ వారు "శ్రీరామకృష్ణ ప్రభ" మాసపత్రికను
1000 గ్రంథాలయాలకు స్పాన్సర్ చేశారు

KCP Sreshtaa CEMENT
THE NEW GENERATION CEMENT

Cement Marketing Division : Plot No. 10, Gayatri Hills, MP & MLA's Colony, Road No. 10 C, Jubilee Hills, HYDERABAD - 500033.
Tel : 040-2325 3503 to 505, Fax : 2325 3500, Cell : +91 99895 97775 / 9866305145, E-mail : ramakrishna.k@kcp.co.in
Registered Office : No. 2, Dr.P.V.Cherian Crescent, Egmore, CHENNAI - 600 008. Tel : 044 66772668, Fax: 044 66772620, CIN L65991TN1941PLC001128

సర్వయోగ సమన్వయం సంఘాదర్శం

స్వామి వివేకానంద అమెరికాలో ఉన్నప్పుడు ఒకరోజు ఎమిలి అనే ఆమెతో 'అమ్మా! నేను సమ్మోహితుడనయ్యాను' అని అన్నారు. అందుకు ఎమిలి 'మిమ్మల్ని అంతగా ఆకర్షించిన ఆ స్త్రీ ఎవరు స్వామీజీ?' అని తమాషాగా అడిగింది. అప్పుడు స్వామీజీ పగలబడి నవ్వుతూ 'నన్ను ఆకర్షించింది స్త్రీ కాదు, మీ దేశ ప్రజల సంఘటిత కార్యాచరణశక్తి' అని చెప్పారు.

దీన్ని బట్టి స్వామీజీ అమెరికా దేశపు సంఘటితశక్తిని చూసి ఎంతగా ఆకర్షితులయ్యారో; వారి కార్యనిర్వహణ దక్షతకు ఎంతగా ముగ్ధులయ్యారో అర్థం చేసుకోవచ్చు. ఏ మహత్కార్యాన్ని సాధించాలన్నా సంఘటితంగా కృషిచేయాలనీ; సంస్థాగత కార్యాచరణ అవసరమనీ; అందుకు ఒక సంస్థను ప్రారంభించాలనీ స్వామీజీ విదేశాలలో పర్యటిస్తున్నప్పుడే తీర్మానించుకున్నారు.

భారతజాతిని సోమరితనం, పిరికితనం, పక్షపాతం, స్వార్థం, అసూయ, ద్వేషాల్లాంటి దుర్గుణాలు పట్టి పీడిస్తున్నాయని స్వామీజీ చింతించేవారు. భారతీయులకు సంఘటితంగా కలిసి పనిచేసే శక్తి లేదని మథనపడుతూ 'భారతదేశంలో ఏ ముగ్గురు వ్యక్తులూ, ఐదు నిమిషాల పాటు కలిసి పనిచేయలేరు' అని భారతీయుల బలహీనతను బహిర్గతపరిచారు స్వామీజీ.

సంఘటితంగా పనిచేయడానికి స్వామీజీ ఇచ్చిన సూచనల్లో కొన్ని :

- ❖ పక్షపాత వైఖరిని విడనాడాలి. ఒకరి కన్నా ఇంకొకరిని ఎక్కువగా అభిమానించడం; ఒకరిపై కన్నా మరొకరిపై ఎక్కువ ప్రేమను చూపించడం మానాలి. ఇవే సంఘటిత శక్తిని బలహీన పరచడానికి ప్రధాన కారణాలు.
- ❖ ఒకరి మీద ఒకరు చాడీలు చెప్పే అవలక్షణాన్ని ప్రోత్సహించకూడదు. ఇతరుల గురించి వారి వెనుక చెడుగా మాట్లాడడం కన్నా పాపం మరోటి లేదు. విభేదాలకు అసలు కారణం ఈ అవలక్షణమే!
- ❖ ఒకరి పొరపాట్లను మరొకరు భరించే సహనాన్ని కలిగి ఉండాలి. ఎవరైనా తప్పు చేస్తే సున్నితంగా వారిని మందలిస్తూ, సరిదిద్దడానికి ప్రయత్నించాలి.
- ❖ ఎవరి మీదా పెత్తనం చెలాయించాలని చూడకూడదు. ఒకరి అవసరాన్ని ఇంకొకరు గుర్తించి పనిచేస్తే అసూయద్వేషాలు పొడచూపవు.
- ❖ సేవకుడననే భావంతో పనిచేయాలేగానీ, నాయకుడననే అహంకారంతో వ్యవహరిస్తే ఇతరుల సహకారం లభించదు. కార్యనిర్వహణలో ప్రతి ఒక్కరూ ముఖ్యమేనన్న భావనతో మెలగాలి.

సంఘటితశక్తికి మూలసూత్రం: సంస్థాగత కార్యాచరణ ద్వారా మహత్కార్యాలు సాధ్యమవుతాయన్న ఉద్దేశంతో స్వామీజీ 'రామకృష్ణ మిషన్' సంస్థను 1897 మే 1వ తేదీన ప్రారంభించారు. రామకృష్ణ సంఘ సన్న్యాసులు సమాజ అభ్యుదయానికి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఆత్మోన్నతికి సాధనలు అనుష్ఠించాలనే ఆశయంతో 'ఆత్మనో మోక్షార్థం జగత్ హితాయ చ - స్వీయ ముక్తి, బహుజన హితం' అనే ద్వంద్వాదర్శాలను నిర్దేశించారు స్వామీజీ.

హిమాలయాలలో చిన్న నీటి ధారగా ఆవిర్భవించిన గంగానది ఓ మహానదిగా పరిణమించి భూమిని సస్యశ్యామలం చేస్తూ ప్రవహిస్తున్నట్లు, నాడు కేవలం 16 మంది శ్రీరామకృష్ణుల యువ సన్న్యాస శిష్యులతో ప్రారంభమైన రామకృష్ణ సంఘం, నేడు ప్రపంచ వ్యాప్తంగా 180 కేంద్రాలలో 1600 మంది సాధుబ్రహ్మచారులతో విరాజిల్లుతోంది. ప్రతి ఏటా సుమారు 500 కోట్ల రూపాయలను వెచ్చించి విద్య, వైద్య, సంక్షేమ, గ్రామీణాభివృద్ధి, గిరిజనాభివృద్ధి, సహాయ పునరావాస సేవా కార్యక్రమాలను దేశ వ్యాప్తంగా నిర్వహిస్తూ సమాజాభ్యుదయానికి కృషిచేస్తోంది.

ఆనాడు 16 మంది యువ సన్న్యాస బృందంతో ఏర్పడిన రామకృష్ణ సంఘంలో నేడు దేశ, జాతి, మత, కుల భేదాలకు అతీతంగా వందల సంఖ్యలో సన్న్యాసులు, లక్షల సంఖ్యలో భక్తులు, కోట్ల సంఖ్యలో అనుయాయులు సంఘటితంగా కలిసి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

రామకృష్ణ సంఘంలో వివిధ ప్రాంతాలవారు, వివిధ భాషలవారు, వివిధ సంస్కృతులవారు, వివిధ దేశాలవారు, వివిధ మతాలవారు కలిసి సామరస్యంతో ఎలా జీవించగలుగుతున్నారు? సంఘటితంగా ఎలా పనిచేయగలుగుతున్నారు? అనే సందేహాలు చాలా మందిలో కలుగుతుంటాయి. ఇలాంటి సందేహాలకు సమాధానంగా మాతృమూర్తి శ్రీశారదాదేవి 'సంఘటితశక్తికి ప్రేమే మూలసూత్రం' అని చెప్పారు.

కుటుంబంలోగానీ, కార్యాలయాల్లోగానీ, సమాజంలోగానీ సామరస్యంతో జీవించాలన్నా, సంఘటితంగా పనిచేయాలన్నా అన్యోన్య ప్రేమే మూలసూత్రం కావాలి. వ్యక్తుల మధ్య ప్రేమానురాగాలు ఉన్నప్పుడు మనఃస్పర్ధలు వచ్చినా తొలగిపోతాయి, పొరపాట్లు జరిగినా సహించగలుగుతాం, తగాదాలు తలెత్తినా పరిష్కరించుకోగలుగుతాం, లోపాలున్నా సర్దుకుపోగలుగుతాం. మనమంతా ఈ మూలసూత్రాన్ని ఆచరించిననాడు స్వామీజీ ఆశించిన విధంగా భారతజాతి సంఘటితశక్తికి ప్రతిరూపంగా నిలుస్తుంది.

సంఘచిహ్నం... అంతరార్థం: రామకృష్ణ మిషన్ సంస్థలు విద్యాలయాలనూ, వైద్యాలయాలనూ, అనాథశరణాలయాలనూ, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలనూ, గిరిజన సంక్షేమ కార్యక్రమాలనూ, సహాయ పునరావాస కార్యక్రమాలనూ నిర్వహిస్తున్నందు వల్ల రామకృష్ణ సంఘ సన్న్యాసులు 'సామాజిక సేవా కార్యకర్తల'ని కొంత మంది అభిప్రాయం. సేవా కార్యక్రమాల్లో తలమునకలై ఉండడం చూసి సన్న్యాసులు 'కర్మయోగ' మార్గాన్ని అనుసరిస్తారని మరికొందరి భావన. ఈ అభిప్రాయాలు సరైనవా? కావా? అని తెలుసుకోవాలంటే రామకృష్ణ సంఘ చిహ్నం యొక్క అంతరార్థాన్ని అవగాహన చేసుకోవాలి.

స్వామి వివేకానంద న్యూయార్క్‌లో ఉన్నప్పుడు రామకృష్ణ సంఘం కోసం ఒక చిహ్నాన్ని రూపొందించాలని అభిలషించారు. స్వామీజీలో ఆ ఆలోచన మెదలగానే ఆయనే స్వయంగా ఓ కాగితం మీద చిహ్నాన్ని గీసారు. ఆ తరువాత నిర్దిష్టమైన కొలతలతో స్వామీజీ సూచనల ప్రకారం ప్రఖ్యాత రేఖాచిత్రకారుడైన హెన్రీ వాన్ హాగన్ ఓ చిహ్నాన్ని గీసాడు. అదే నేడు రామకృష్ణ మఠం, మిషన్‌ల చిహ్నంగా విరాజిల్లుతోంది.

స్వామీజీ భారతదేశానికి వచ్చిన తరువాత కలకత్తా జూబ్లీ ఆర్ట్ అకాడమీ ఆచార్యుడైన ఆర్.పి. దాస్‌గుప్తకు రామకృష్ణ సంఘ చిహ్నాన్ని చూపించి, దీని విశిష్టతను వివరించమని అడిగారు. ఆయన ఆ చిహ్నం విశిష్టతను గ్రహించలేకపోయారు. అప్పుడు స్వామీజీ సంఘ చిహ్నం అంతరార్థాన్ని చెబుతూ "తరంగ జలం – కర్మయోగం; వికసిత పద్మం – భక్తియోగం; ప్రభాత సూర్యుడు – జ్ఞానయోగం; చుట్టుకొని ఉన్న పాము (కుండలినీశక్తి) – రాజయోగం; హంస – పరమాత్మ. ఈ నాలుగు యోగాల సమన్వయంతో పరమాత్మ దర్శనం లభిస్తుంది" అని వివరించారు.

సర్వయోగ సమన్వయం : i) కర్మయోగం – తరంగజలం కర్మలకు సంకేతం. నిత్యం మార్పుచెందే ఈ ప్రపంచాన్ని 'భవసాగరం' అని శాస్త్రాలు నిర్వచించాయి. సాగరంలో అలలు ఎంత సహజమో, ఈ ప్రపంచంలో సుఖదుఃఖాలు కూడా అంతే సహజం. ఈ సుఖదుఃఖాల ప్రభావానికి లోనుకాకుండా ఉండాలంటే కర్మల్ని అనాసక్తభావంతో నిర్వర్తించాలంటూ భగవాన్ శ్రీరామకృష్ణులు 'బురదలో ఉన్నా బురద అంటని పద్మంలా ఉండాలనీ; నీటిలో పడవ ఉండాలిగానీ, పడవలో నీరు ఉండకూడద'ని బోధించారు. చలనానికి సంకేతమైన ఈ ప్రపంచంలో అచలంగా జీవించడానికి కర్మల్ని అనాసక్తతతో, భగవదర్పిత భావంతో నిర్వర్తించేందుకు అవలంబించే మార్గం 'కర్మయోగం'.

ii) భక్తియోగం – పద్మం పవిత్రతకు ప్రతీక. 'పవిత్ర హృదయ పద్మంలో ఆసీనుడై ఉన్న పరమాత్మను నిరంతరం ఉపాసించాలి' అని మహానారాయణోపనిషత్తు వివరిస్తుంది. మన హృదయ పద్మంలో పరివేష్టితుడై ఉన్న పరమాత్మను దర్శించడానికి హృదయ పవిత్రతను సాధించాలి. అందుకు పూజ, పారాయణ, సంకీర్తనలను అభ్యసిస్తూ, భగవద్భక్తిని పెంపొందించుకోవడానికి అనుసరించే మార్గమే 'భక్తియోగం'.

iii) జ్ఞానయోగం – ప్రభాత సూర్యుడు జ్ఞానానికి ప్రతీక. 'నేను, నాది' అనే అహంకార మమకారాలే మన అజ్ఞానానికి కారణం. ఈ అజ్ఞానం తొలగిపోతే 'ఉన్నది ఒక్కటే, రెండు కాదు' అనే ఏకత్వభావన ఏర్పడుతుంది. 'బ్రహ్మ సత్యం, జగన్మిథ్య' అనే వివేకాన్ని పొందడానికి అనుసరించే మార్గం 'జ్ఞానయోగం'.

iv) రాజయోగం – చుట్టుకొని ఉన్న పాము కుండలినీశక్తి జాగృతికి ప్రతీక. 'యోగః చిత్తవృత్తి నిరోధః – చిత్తవృత్తులను నిరోధించడమే యోగం' అని పతంజలి మహర్షి నిర్వచించారు. మనోనియంత్రణ ద్వారా నిద్రాణమై ఉన్న కుండలినీ శక్తిని జాగృతం చేయడానికి అభ్యసించే ధ్యానయోగ ప్రక్రియ 'రాజయోగం'.

రామకృష్ణ సంఘ సన్న్యాసులు సమాజ సేవా కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా అనాసక్త భావాన్ని అభ్యసించడానికి అనుసరించే మార్గం 'కర్మయోగం'. పూజలు, స్తోత్ర పఠనం, సంకీర్తనల ద్వారా భగవంతుని పట్ల భక్తిభావాన్ని పెంపొందించుకోవడానికి అనుసరించే మార్గం 'భక్తియోగం'. శాస్త్రాధ్యయనం, శాస్త్ర చర్చల ద్వారా నిత్యానిత్యవస్తు వివేకాన్ని పొందేందుకు అవలంబించే మార్గం 'జ్ఞానయోగం'. మనోనియంత్రణకు అనుష్ఠించే జప ధ్యాన సాధనలు 'రాజయోగం'.

స్వామి వివేకానంద ఆత్మసాక్షాత్కార మార్గాన్ని వివరిస్తూ "అంతర్గతంగా ఉన్న దివ్యాత్మను వ్యక్తపరచడమే జీవుని లక్ష్యం. ఆ లక్ష్యాన్ని కర్మ (కర్మయోగం) ద్వారా గానీ, ఉపాసన (భక్తియోగం) ద్వారా గానీ, మనోనియంత్రణ (రాజయోగం) ద్వారా గానీ, తత్త్వజ్ఞానం (జ్ఞానయోగం) ద్వారా గానీ; వీటిలో ఏ ఒక్క మార్గాన్ని గానీ, కొన్నింటిని గానీ, అన్నిటిని గానీ అభ్యసించి ముక్తుడవుకమ్ము" అని ప్రబోధించారు. ఈ యోగసమన్వయాన్ని ప్రబోధించేలా రామకృష్ణ సంఘ చిహ్నాన్ని రూపొందించారు స్వామీజీ.

మనమంతా స్వామి వివేకానంద నిర్దేశించిన ఆదర్శాలకు అనుగుణంగా సంఘటిత కార్యాచరణ ద్వారా సమాజాభ్యుదయానికీ, యోగానుష్ఠానం ద్వారా ఆత్మోన్నతికీ కృషి చేద్దాం. మానవజన్మ లక్ష్యమైన భగవత్సాక్షాత్కారాన్ని పొంది తరిద్దాం. ❖

ఐకమత్యంతో కలసి పనిచేయండి, ముక్తకంఠంతో మాట్లాడండి, ఏకాభిప్రాయులై ఉండండి. మీ సంకల్పం ఒకటైనదిగా ఉండుగాక! మీ మధ్య అద్భుతమైన సామరస్యం నెలకొనుగాక! -ఋగ్వేదం

గోరుముద్ద - స్వామి సుప్రియానంద

ప్రసాదం ఎంత రుచిరా!

"మఠాలలో, దేవాలయాలలో పెట్టే ప్రసాదాలకు ఎలా వస్తుంది అంత రుచి?" అనేక మంది భక్తులను వేధించే ప్రశ్నలలో ఇది ఒకటి. కొంతమంది భక్తులు ఇంకొక అడుగు ముందుకు వేసి, మఠంలో ప్రసాదం వండేవారి నుండి సూచనలను (అదేనండీ 'రెసిపి – recipe') సంగ్రహిస్తారు. వారింట్లో వండుకొని ఎంచక్కా తిని "ఊహూ! మఠంలో పెట్టే ప్రసాదం రుచి రాలేదు" అంటూ వాపోతారు.

ఇంతకీ ప్రసాదానికి ఎక్కడి నుండి వస్తుంది అంత రుచి? భగవంతునికి మనం అర్పించే 'నైవేద్యం' మనకు 'ప్రసాదం' అవుతుంది. సాధారణంగా ప్రసాద వితరణ జరిగేది పూజలు, భజనలు, ఆధ్యాత్మిక ప్రవచనాల అనంతరం.



దేవాలయ ప్రాంగణంలో, భగవంతుని నామ సంకీర్తన చేసుకుంటూ, ఆయనను స్మరిస్తూ, ఆయన లీలల్ని వింటూ, కాసేపైనా మనల్ని మనం మరచి భగవద్ధ్యానంలో లీనమైతే ఎంత హాయిగా ఉంటుంది! అలాంటి పవిత్ర వాతావరణంలో, అలాంటి ప్రశాంత స్థితిలో మనం ఆరగించే ప్రసాదం అమృత తుల్యమవుతుంది.

కొంతమంది భక్తులు సరిగ్గా ప్రసాద వితరణ సమయానికి వస్తారు. ఈ ప్రసాదం భక్తులను చూసి మిగతా భక్తులు హేళన చేయడం పరిపాటి. భగవంతుని సన్నిధిలో ఇది ఎంతమాత్రం సమంజసం కాదు. ప్రతి మనిషికి సరైన సమయంలో పరిణతి కలగడం తప్పనిసరి. ఇక్కడ పరనిందకు తావు లేదు.

నిజమైన భక్తి కలిగినప్పుడు, భక్తుడు సాధనపరంగా ఉన్నత శిఖరాలను అధిరోహిస్తాడు. ఆ స్థితిలో భక్తుడి యొక్క ధారణా శక్తి పెరుగుతుంది. మనోనిర్మలత, ప్రశాంత చిత్తం కలుగుతుంది.

మరి, శ్రీకృష్ణభగవానుడు అర్జునుడితో పాటు యావత్ మానవాళికి పెట్టిన 'ప్రసాదం' ఏమిటో చూద్దామా!

రాగద్వేష వియుక్తైస్తు విషయా నింద్రియై శ్చరన్।
ఆత్మవశ్యై ర్విధేయాత్మా ప్రసాద మధిగచ్ఛతి॥ *(గీత. 2-64)*

'ఇంద్రియాలను వశపరచుకొని, రాగద్వేషాలు లేకుండా జీవించాలి. మనస్సును స్వాధీనం చేసుకొన్నవాడు విషయాల మధ్య చరిస్తున్నా ప్రశాంతంగానే ఉంటాడు'.

ప్రసాదే సర్వదుఃఖానాం హాని రస్యోపజాయతే।
ప్రసన్నచేతసో హ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతి॥ *(గీత. 2-65)*

'చిత్తప్రసాదం లభించిన వానిలో సమస్త దుఃఖాలు అంతరిస్తాయి. నిర్మలమైన మనస్సుగలవాని బుద్ధి ప్రశాంతతను పొందుతుంది'.

రాగద్వేషాలను విడనాడి, భగవంతునిపై మనస్సును నిమగ్నం చేయడం వల్ల ప్రశాంతత చేకూరుతుంది. చిత్తాన్ని శుద్ధి చేసేదీ, చిత్తానికి శాంతిని ప్రసాదించేదీ 'ప్రసాదం'. కాబట్టి 'ప్రసాదం అంటే – ప్రసన్నత, ప్రశాంతత, మనోనిర్మలత' అని అర్థం చేసుకోవాలి. ఈ 'ప్రసాదం' దుఃఖాలను నాశనం చేస్తుంది. బుద్ధిని నిలకడగా ఉంచుతుంది.

ఇప్పటి నుండి మనం ఎప్పుడు ప్రసాదం ఆరగించినా, ఈ శ్లోకాలను గుర్తు చేసుకోవడానికి ప్రయత్నిద్దాం! ప్రశాంతతను పొందుదాం! ❖

'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక చందాను
ఆన్‌లైన్ http://rkmath.org/srkp ద్వారా చెల్లించవచ్చును.

అసమాన ధీరుడు అంజనీ సుతుడు

– డాక్టర్ అపర్ణాశ్రీనివాస్

'హనుమంతుడు' అనగానే ముకుళిత హస్తాలతో, పరిపూర్ణ శరణాగతితో, ఆర్ద్రతతో రామనామాన్ని జపించడంలో మైమరచి ఉన్న రూపం మన కళ్ళ ముందు మెదులుతుంది. ఆంజనేయుడు, వాతాత్మజుడు, కేసరీనందనుడు, పవనసుతుడు ఇత్యాది నామాలతో వ్యవహరించే హనుమంతునికి, ఆయన తల్లి అయిన అంజనాదేవి పెట్టిన పేరు 'సుందరుడు'. వానరుడు అయినప్పటికీ ఆ బాలుని ఒడిలోకి తీసుకుని ముద్దులాడిన ఆ మహాతల్లికి, ఆ బాలుని బాహ్య సౌందర్యం కాక, మనస్సులో శాంతి, సౌభాగ్యాలను ప్రసాదించే ఆత్మ సౌందర్యం కానరావడంతో ఆ విధంగా నామకరణం చేసింది. ఇదే విధంగా, లంకానగరంలో ఎలాంటి వికారాలకూ లోను కాని ఆయన మానసిక సౌందర్యాన్ని దర్శించగలిగిన వాల్మీకి మహర్షి ఆయనలోని సుందరత్వానికి ముగ్ధుడై, ఆ కాండను 'సుందరకాండ' అని పేర్కొన్నారు.

హనుమంతుని వ్యక్తిత్వం అన్ని యుగాలవారికీ ముఖ్యమైన పాఠాలను బోధిస్తూనే ఉంటుంది. రామాయణ పుటలలో కాంతిపుంజం లాగా వెలుగొందే హనుమంతుని మహోదాత్త గుణాలలో కొన్నింటిని గుర్తుకు తెచ్చుకునే ప్రయత్నం చేద్దాం.

వాల్మీకి మహర్షి రామాయణంలో తొలిసారిగా హనుమంతుని గురించి మనకు పరిచయం చేసినపుడు, ఆయన గురించి వాడిన విశేషణం 'వాక్యకోవిదుడు' అని! దీనికి అర్థం హనుమకు ఎక్కడ, ఎవరితో, ఎలా మాట్లాడాలో బాగా తెలుసు అని చెప్పడమే. ఈ రకమైన పరిచయంతో మన ముందుకు వచ్చిన హనుమ, రామలక్ష్మణులను పంపా సరస్సు ఒడ్డున కలిసి సంభాషిస్తాడు.

శ్రీరాముడు హనుమ మాట్లాడిన తీరు చూసి, అతనికి గల శాస్త్రపాండిత్యం, వాక్చాతుర్యం, సంభాషణా కుశలతను గుర్తించి, మొదటి పరిచయంలోనే ప్రశంసిస్తాడు. అంతేకాదు, హనుమ కార్యదక్షతపై నమ్మకం ఉన్నందునే, సీతాన్వేషణకు వానరులు బయలుదేరిన సందర్భంలో, హనుమంతుని పిలిచి తన గుర్తుగా సీతకు చూపమని అంగుళీయకాన్ని ఇస్తాడు. అశోకవనంలో, నిరాశ నిస్పృహలతో, చిక్కి శల్యమై, శ్రీరాముని రాకకై వేచి ఉన్న సీతాదేవిని గుర్తించి, ఆవిడతో ఓదార్పుగా, మృదువుగా సంభాషిస్తూ, ఆత్మవిశ్వాసాన్ని కలిగించిన తీరు హనుమ వ్యవహార దక్షతను తెలియజేస్తుంది.

హనుమంతుని కర్తవ్యం సీతాసందర్శనం మాత్రమే అయినా, నిర్దేశిత కార్యానికి పూర్వాపరాలు గ్రహించగలిగే జ్ఞానలక్షణం ఉన్నందున, అశోకవన విధ్వంసన కారణంతో, లంకానగర విశేషాలు, రాక్షసుల అంగబల, ఆయుధబల వివరాలను కూడా సేకరించి మరీ వచ్చాడు. ఈ సందర్భంలోనే రావణునితో సంభాషించిన విధానం హనుమంతుని దౌత్య నైపుణ్యాన్ని వెల్లడి చేస్తుంది.

ఇంతేకాక, రామరావణ సంగ్రామ సమయంలో, హనుమంతుడు రావణునితో జరిపిన పోరులో, ఆయన ధాటికీ, పరాక్రమానికీ నిలువలేక, మహావీరుడైన రావణుడు సైతం ఆశ్చర్యచకితుడై, **'సాధు! వానర వీర్యేణశ్లాఘనీయోఽసిమే రిపుః** (ఓ వానరా! వీరత్వంలో కొనియాడదగిన శత్రువు నీవు) అంటూ ప్రశంసించాడు. ఈ విధంగా శత్రువైన రావణునితో కూడా ప్రశంసలందుకొన్న బలపరాక్రమ సంపన్నుడు హనుమంతుడు.

నూరు యోజనాల సముద్రాన్ని అవలీలగా లంఘించి సీతామాత జాడ తెలుసుకుని వచ్చినా, యుద్ధ సమయంలో ఒక దశలో మూర్ఛిల్లిన వానరులనూ, లక్ష్మణుణ్ణీ ప్రాణాపాయ స్థితి నుండి తప్పించినా, వినయాన్ని మాత్రమే ప్రదర్శించాడు తప్ప, తన వల్ల ఇలాంటి ఘన కార్యాలు సాధింపబడ్డాయని విర్రవీగలేదు. హనుమంతుని వినయ సౌశీల్యానికి ఇవి మచ్చుతునకలు. ఎంతటివారికైనా వినయం ఉత్తమ ఆభరణం. ఈ విషయంలో కూడా మనకు హనుమ ఆదర్శప్రాయుడే.

'ఆత్మానం మానుషం మన్యే రామం దశరథాత్మజమ్' అంటూ రామచంద్రుడు తనను తాను ఒక మానవునిగా, దశరథుని పుత్రునిగా చెప్పుకున్నప్పటికీ, హనుమంతుడు ఆ శ్రీరామునిలో పరబ్రహ్మతత్త్వాన్ని చూడగలిగాడు. రాముని పట్ల అమితమైన భక్తిని పెంపొందించుకుని, ఆయనను తన హృదయసీమలో ప్రతిష్ఠించుకున్నాడు. నిర్మలమైన మనస్సుతో, భగవంతుని

(మిగతా 33వ పేజీలో...)

ప్రాప్తముంటే అన్నీ వాటంతటవే కలుగుతాయనే భావనతో ఊరకే ఉండరాదు. కేవలం ప్రార్థన చేస్తూ కూర్చుంటే ఏమి లాభం? దానితోపాటు పురుష ప్రయత్నం కూడా చేయాలి. -గౌతమ బుద్ధుడు

కలిపురుషుని ప్రదేశంబులు...

– స్వామి జ్ఞానదానంద

సరస్వతీ నదీతీరంలో ధర్మదేవుడు, భూదేవిల ప్రతినిధులైన వృషభం, గోమాత సంభాషించుకుంటూ ఉన్నారు. కృతయుగంలో తపం, శౌచం, దయ, సత్యం అనే నాలుగు పాదాలతో నడిచిన ధర్మదేవుడి రూపమైన వృషభం, త్రేతాయుగంలో తపస్సులు లేక ఒక కాలు భగ్నమై ముక్కాలి పీటగా మారిపోయింది. ద్వాపరయుగంలో 'శౌచం' కూడా లోపించి రెండు కాళ్ళే మిగిలాయి. ఇక కలియుగంలో 'దయ' మాయమై సత్యమనే ఒంటికాలితో సరిపెట్టుకొని గోమాత ముందు తన బాధను వెళ్ళబోసుకుంటోంది. ఇంతలో అక్కడికి క్రోధోన్మత్తుడైన కలిపురుషుడు ప్రవేశించాడు. కొంచెమైనా కనికరం లేకుండా మాయామర్మం తెలియని మహావృషభాన్నీ, గోమాతనూ కటిక రాక్షసునిలా పైకెగిరి కాలితో తన్నాడు. ఆ ధాటికి దయనీయంగా ఆ రెండు సాధుజీవులూ

కన్నీరు కారుస్తూ నేల మీద కూలబడి పోయాయి. వాటి కష్టాన్ని చూసి కలిపురుషుడు పైశాచికానందాన్ని పొందుతున్నాడు.

ఇంతలో ఆ వృషభ, ధేనువుల అదృష్టవశాత్తూ హఠాత్తుగా అక్కడికి పాండవుల మనుమడు, రాజర్షి అయిన పరీక్షిత్తు రథారూఢుడై వచ్చాడు. కలిపురుషుడి దౌర్జన్యాన్ని కళ్ళారా చూసి సహించలేక ధరణి, ధర్మదేవుల ప్రతినిధులైన గోమాతనూ, వృషభాన్నీ ఊరడిస్తూ పాపాత్ముడైన కలిని రూపుమాపాలని నిశ్చయించాడు. తనను సంహరించడానికి సమాయత్తమైన పరీక్షిత్తును చూసి కలి భయకంపితుడై ఆయన పాదాలపై పడ్డాడు. పరమ పాపాత్ముడవైన నీకు ఈ భూమండలంలో చోటు లేదు; వెళ్ళిపొమ్మన్నాడు పరీక్షిత్తు. కానీ కలిపురుషుడు దీనుడిగా నటిస్తూ 'నీవే నన్ను బహిష్కరిస్తే, నేను ఇంక ఎక్కడికి వెళ్ళేది? నన్ను కనికరించి ఎక్కడో ఓ చోటు కల్పించు!' అని ప్రాధేయపడ్డాడు. ఆ ఆవేదనను ఆలకించి పరీక్షిత్తు తన పాలనపై, తన ప్రజల శీలంపై ఉన్న నమ్మకంతో...

నేనెక్కడ నుండుదు నానతిమ్మనిన రాజన్యశేఖరుండు ప్రాణివధ స్త్రీ ద్యూత పానంబు లనియెడు నాలుగు స్థానంబులిచ్చి మరియు నడిగిన సువర్ణమూలంబగు నసత్య మద కామ హింసా వైరంబు లనియెడు పంచప్రదేశంబుల నొసంగి, యితర స్థలంబుల స్పృశియింపకుండ నియమించె! ఇలా కలిపురుషుడి ప్రార్థనను మన్నించి పరీక్షిత్తు అతనికి ప్రాణివధ, స్త్రీ, జూదం, మద్యపానం అనే నాలుగు స్థానాలిచ్చాడు. ఇంకా అతడు అర్థించగా ఆ మహారాజు 'సువర్ణం' అనే అయిదో స్థానాన్ని కూడా అనుగ్రహించాడు. అందువల్ల అసత్యం, గర్వం, కామం, హింస, వైరం అనే అయిదు స్థానాలు కూడా కలి నివసించే ప్రదేశాలయ్యాయి.

కొంప ముంచిన కలిపురుషుడు: కలి ముందుచూపుతో అతి చాకచక్యంగా కైవసం చేసుకున్న ఆ అయిదు స్థానాలూ ఆ రోజు నుంచి యావత్ మానవాళినీ తమ కబంధహస్తాలతో బిగించేస్తాయనీ, పరిస్థితులు తన నమ్మకాన్ని వమ్ము చేస్తాయనీ పరీక్షిత్తు ఊహించలేదు. నిశితంగా పరిశీలిస్తే ఈనాటికీ మనిషి పతనానికి ప్రేరకాలయ్యే అన్ని అవలక్షణాలూ ఈ అయిదు స్థానాల్లోనే ఆవహించి ఉన్నాయంటే ఆశ్చర్యమేస్తుంది. ప్రాణివధ క్రౌర్యానికీ, స్త్రీవ్యామోహం కామమోహాలకూ, జూదం లోభానికీ, సురాపానం మదానికీ, సువర్ణం మాత్సర్యానికీ కారణమవుతూ ఉన్నాయి. ఈ రోజు ప్రపంచంలో ఘోరాలన్నింటికీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఈ అయిదు స్థానాలే ప్రేరకాలవుతున్నాయనడంలో సందేహం లేదు. వేటకి, జూదానికి, మద్యపానానికి, స్త్రీలౌల్యానికి, స్వర్ణకాంక్షకి ఆధునిక ప్రపంచంలో పేర్లు మారుతూ ఉండవచ్చు;

కానీ మౌలికంగా చూస్తే మాత్రం ఈ అయిదు స్థానాలే నేటికీ వ్యసనపరులైన మానవులను ఆడిస్తున్నాయనడంలో సంశయం లేదు. బలహీన క్షణంలో ముందు వీటిలో ఏదో ఒకటి మనిషి జీవితంలోకి ప్రవేశిస్తుంది. పోనిమ్మని ఒక్కదానికి చోటిస్తే చాలు, ఒక్కొక్కటీ మనకు తెలియకుండానే అన్ని వైపుల నుంచి ఆక్టోపస్‌లా అల్లుకొని మనల్ని కైవసం చేసుకుంటాయి. విషపు కోరల్లో మనల్ని బందీలుగా చేసి, వివశుల్ని చేసేస్తూ ఉంటాయి. అందుకే శ్రీరామచంద్రుడు ఓ సందర్భంలో సుగ్రీవుడితో...

హిత్వాధర్మం తదార్థం చ కామం యస్తు నిషేవతే ।
స వృక్షాగ్రే యథా సుప్తః పతితః ప్రతిబుధ్యతే ॥

'కామం, అర్థంలో మాత్రమే జీవితాన్ని నిక్షిప్తం చేసుకున్నవాడు, చెట్టు చివరికొమ్మ మీద నిద్రపోతున్నవాడిలా ప్రమాదానికి గురవుతాడ'ని హెచ్చరిస్తాడు.

ఆలోచించే అయిదు స్థానాలు : కలియుగంలో మనిషి ఏ బలహీనతలకు తనను తానే పణంగా పెట్టుకుంటాడో కలిపురుషుడు ముందే విశేషదృష్టితో విశ్లేషించుకొని, పరీక్షిత్తు నుంచి వరంగా ఆ అయిదు స్థానాలు దక్కించుకున్నాడు. నాటి నుంచి నేటి వరకు సమాజపు పోకడలు ఆ కలి అంచనాలను నూటికి నూరుపాళ్ళు నిజం చేసి చూపిస్తున్నాయి. అయితే ఒకనాడు మనుషులు చాటుమాటుగా, బిడియంగా, బింకంగా, తప్పు చేస్తున్నామేమో నన్న న్యూనతా భావంతో ఈ పంచప్రదేశాల్లోకి అడుగుపెట్టేవారు. కానీ నేటి సమాజంలో ఈ అయిదు స్థానాలూ వ్యాపారమార్గాలుగా, గౌరవనీయ స్థలాలుగా, నాగరక చిహ్నాలుగా చలామణి అవుతున్నాయి. జనం వీటిలోకి నిస్సిగ్గుగా, నిర్మొహమాటంగా అడుగు పెడుతున్నారు. అలాంటి వారికి లోకమంతా ఈ అయిదు స్థానాల్లోనే కనిపిస్తూ ఉంది.

అందుకే మన సనాతన ధర్మం 'సర్వం ధనమయం లుబ్ధాః కాముకాః కామినీమయమ్। – ఈ లోకం ధనకాంక్ష గలవారికి ధనరాశిగా, కామంతో చూసేవారికి కామించే వస్తువులుగానే కనిపిస్తుంద'ని వివరించింది. అయితే '....కృతం పాపం వ్యాధి రూపేణ పీడితే!' అన్నట్లు ఈ పంచప్రదేశాల్లో మనం చేసే పాపాలకు ఇదే జన్మలో అంతుచిక్కని వివిధ వ్యాధుల రూపంలో మూల్యాన్ని చెల్లించాల్సి వస్తుందనీ, ఇంకా పాపభారం మిగిలిపోతే హీనజన్మలెత్తి పడరాని కష్టాలు పడాల్సి వస్తుందనీ మన పురాణాలు ఘోషిస్తున్నాయి.

ప్రాణివధ, జూదం, స్త్రీవ్యామోహం, మద్యపానం, పసిడికాంక్ష కలిపురుషుడి ప్రధాన స్థావరాలు; మనిషిలో కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలను ప్రేరేపించే ప్రమాద స్థానాలు. పొరపాటున మనస్సు వీటిలో ఏ ఒక్కదానికి వశమైనా, ఇతరములన్నీ ఇట్టే జతకూడేస్తాయి! ప్రశాంతంగా సాగిపోతున్న జీవనగమనాన్ని దారితప్పించి అగాధంలో సమాధి చేసేస్తాయి. అయితే పవిత్రజీవనాన్ని పాపపంకిలంగా మార్చే ఈ పంచప్రదేశాల ప్రలోభాలకు లొంగని ధీరులపై కలిపురుషుడి ప్రభావం కించిత్తు కూడా కనిపించదు.

చేస్తేనే పాపం... : పరీక్షిత్తు మహారాజు కలిపురుషుడిని నిగ్రహించి అయిదు స్థానాలే కేటాయించడం కాకుండా, వృషభరూపంలో ఉన్న ధర్మదేవునికి తను కోల్పోయిన తపస్సు, శౌచం, దయ అనే మూడు కాళ్ళు ఇచ్చి భూదేవికి కూడా ఆనందాన్ని కలిగించాడు. ఈ వృత్తాంతమంతా సూతుడు శౌనకునికి వివరిస్తూ...

చేసిన గాని పాపములు చెందవు; చేయ తలచి సంతతం
చేసెద నన్న మాత్రమున చెందు కదా కలివేళ పుణ్యముల్
మోసము లేదటంచు నృపముఖ్యుడు గాచె కలిన్ మరంద ము
ల్లాసము తోడ గ్రోలి విరులం తెగచూడని తేటికైవడిన్

'చేస్తేనే కాని పాపాలు తమ ఫలితాన్ని ఇవ్వవు. ఇక పుణ్యాలందామా 'చేస్తాను' అనుకుంటే చాలు ఫలాన్నిస్తాయి. పరీక్షిత్తు, కలి విజృంభణాన్ని మాత్రం అరికట్టి ప్రాణాలతో విడిచిపెట్టాడు. తుమ్మెద, లోపల ఉన్న మకరందాన్ని ఆనందంతో తాగి పూలను వదులుతుంది కదా!' అని కలియుగంలో మానవులకు భగవంతుడు ప్రసాదించిన వెసులుబాటును వినిపించాడు.

మన మానసిక దౌర్బల్యాన్ని ముందే పసిగట్టిన పరమాత్మ మనకు సౌలభ్యం కల్పించాడు. ఈ యుగంలో పరిస్థితుల ప్రభావంతో మన చిత్తవృత్తులు ఎంత పాప పంకిలమవుతాయో ఆయనకు తెలియంది కాదు! చెడు ఆలోచనలు కలిగినంతనే శిక్షించాలని భగవంతుడు శాసనం తీసుకువస్తే, కలియుగంలో ఏ శిక్షలూ చాలవు. అందుకే పాపపు భావన కార్యరూపం దాలిస్తేనే దానికి ఫలితాన్నివ్వాలని పరమప్రేమతో నిర్ణయించాడు. అయితే పవిత్రకార్యాల గురించి సంకల్పించినంత మాత్రానే పుణ్యఫలాన్ని ప్రసాదించాలని మనపై అనుగ్రహంతో సంకల్పించాడు. మంచి చేస్తామని అనుకున్నా చాలట, పుణ్యం మన ఖాతాలో పడిపోతుంది! అందుకే భగవాన్ శ్రీరామకృష్ణులు **'కలికాలే మనేర్ పాప్ పాప్ నొయ్** – ఈ కలియుగంలో మనసుతో చేసిన పాపం పాపం కాదు' అని అనేవారు.

ధీరుల దరి రాదు...: కలి ప్రభావం ధీరులపై ఉండదనీ, ఈ అయిదు స్థానాల విషయంలో అప్రమత్తంగా ఉండేవారు ఆ కలిపురుషుడి ప్రలోభాలకు లోనుకారనీ సూత మహర్షి చెబుతూ... **'ప్రమత్తులై యధీరులగు నరుల యందు వృకంబు చందంబున నొదిగి కాచుకొని యుండి చేష్టించుంగాని ధీరులైన వారికిం కలి వలన భయంబు లేదు...** పొంచి పైకి దూకే తోడేలులా, ప్రమత్తులై చంచలచిత్తులైన వారిని మాత్రమే కలి బాధిస్తుంది కాని ధీరులైన వారికి కలి వల్ల ఎలాంటి భయమూ ఉండదు' అని అభయమిచ్చాడు. ❖

క్రోధమును అక్రోధముతో, హింసను అహింసతో, అసత్యాన్ని సత్యంతో, లోభత్వాన్ని దానగుణంతో జయించాలి. ద్వేషము ఎన్నటికీ ద్వేషముతో నశించదు, ప్రేమతోనే జయించాలి.-గౌతమ బుద్ధుడు

ప్రాచీన, మధ్యయుగాలనాటి

మన సంస్కృతి

- స్వామి హర్షానంద

"ఒక వ్యక్తి తనను తాను అసహ్యించుకొంటున్నట్లయితే అదే పతనానికి హేతువు. పూర్వీకుల చరిత్రను అవమానకరంగా భావిస్తే, ఆ జాతి అంతానికి చేరుకున్నట్లే!" అంటారు స్వామి వివేకానంద. గత వైభవాన్ని మర్చిపోయినంత కాలం మనమూ, మన దేశం స్తబ్ధతలో మునిగిపోతాం. అందుకే, మన ప్రాచీన సంస్కృతి గురించి తెలుసుకోవాలి. గడచిపోయిన సంగతులు తెలుసుకొంటూ, భవిష్యత్ మహత్కార్యాల సాధన వైపు నడవాలి. మన ప్రాచీన భారతీయ సంస్కృతిని గుర్తు చేసేందుకు చేస్తున్న ప్రయత్నమే ఈ వ్యాసాల పరంపర. సుప్రసిద్ధ రచయిత, బెంగుళూరు రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి హర్షానంద మహరాజ్ మధ్యయుగాల కాలం దాకా విలసిల్లిన మన సంస్కృతిని 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు 2014 ఫిబ్రవరి సంచిక నుండి వివరిస్తున్నారు.

విదేశాలలో భారతీయ సంస్కృతి

బర్మా (మయన్మార్) : అశోకచక్రవర్తి కాలం (క్రీ.పూ. 272-232) నాటికి బౌద్ధమతం బర్మాలో వ్యాపించింది. క్రీ.శ. 162వ సంవత్సరానికే మొదటి హిందూ సామ్రాజ్యం 'అరాన్' ప్రాంతంలో స్థాపించబడింది. క్రీ.శ. 8, 9 శతాబ్దాలలో విక్రమరాజ - సుఖోదయ వంశపు రాజ్యాలు ఇచ్చట ఏర్పడ్డాయి.

రాజు పూనరీక (పుండరీకుడు) పెగు ప్రాంతానికి క్రీ.శ. 746లో ఆధిపత్యం వహించాడు. ఆయనకు బ్రాహ్మణులంటే చాలా ఆదరాభిమానాలుండేవి. 'రామన్యాగో పట్టణం' (రామ పట్టణం) ఆయన నిర్మించినదే. ఇప్పటి రంగూన్ పట్టణం అక్కడే నిర్మించబడినది. పెగు ప్రజలు మోన్స్ లేక తెలాంగ్స్‌గా పిలువబడి ప్రస్తుత తెలంగాణా నుండి వలస వెళ్ళినవారై ఉండవచ్చు.

ఖగోళశాస్త్రం, ఇతర శాస్త్రాల జ్ఞానంతో తెలాంగ్స్‌లోని బ్రాహ్మణులు బౌద్ధవంశపు రాజాస్థానాలలో ఉన్నత పదవులు అలంకరించారు. ప్రత్యేక సన్నివేశాలైన రాజ్యపట్టాభిషేకం, భవన నిర్మాణ పునాదులు, మతపరమైన ఆచారాలను నిర్దేశిస్తూ ఈ బ్రాహ్మణులు క్రమంగా నారాయణ ఆరాధనను ప్రవేశపెట్టారు. గ్రంథలిపిలో కులశేఖర ఆళ్వారు ముకుందమాల స్తోత్రాలు రాతిశాసనాలుగా 'పగన్' ప్రాంతాలలో లభించాయి. వాటినిబట్టి ఇక్కడ ఒకప్పుడు విష్ణు ఆలయం ఉన్నట్లు భావిస్తున్నారు. బర్మా దేశస్థుల 'దమ్మతట్స్' అనే న్యాయగ్రంథానికి మనుస్మృతి ఆధారం. ఇప్పటికీ ఈ గ్రంథాన్ని వంశపారంపర్య హక్కులు, కుటుంబ కలహాల పరిష్కారంలో న్యాయసూచిగా భావిస్తున్నారు.

కాంబోడియా (కంపూచియా) : మన పురాణాలలో కాంభోజదేశంగా పేర్కొనబడిన కాంబోడియా రాజ్యాన్ని అశ్వత్థామ శిష్యుడైన కౌండిన్యుడు స్థాపించినట్లు భావిస్తున్నారు. కౌండిన్యుడు సోమ అనే నాగజాతి రాజకన్యను వివాహం చేసుకొని భావపురం రాజధానిగా హిందూ సోమవంశపు సామ్రాజ్యాన్ని స్థాపించాడు.

మహర్షి అగస్త్యుడు హైందవ సంస్కృతిని ఆగ్నేయ ఆసియాలో వ్యాప్తి చేశాడని ఆయనను ఇప్పటికీ కాంబోడియా దేశంలో ఆరాధించడం చూడవచ్చు. అనేక సంస్కృత రాతిశాసనాలు స్వచ్ఛమైన సంస్కృత లిపిలో కాంబోడియా దేశంలో లభించడం వల్ల ఇచ్చట హిందూమత సంస్కృతి వ్యాపించినట్లు తెలుస్తున్నది. వైష్ణవ (భాగవత), శైవ సంప్రదాయాలు ప్రాచుర్యంలో ఉండేవి. శివాలయాలు, గణపతి దేవాలయాలు ఇప్పటికీ ఉన్నాయి. హిందువులకు, బౌద్ధులకు మధ్య మంచి సామరస్యం ఉండేది. క్రీ.శ. 6వ శతాబ్దం వరకు వేదపఠనం, రామాయణ-మహాభారత గ్రంథపారాయణం సర్వసాధారణంగా ఉండేది. 'జయద్రదాయమాల', నిశ్వాస సంహిత, తంత్రాలు ప్రాచుర్యంలో ఉండేవి. రాజవంశీకులు పాణిని సంస్కృత వ్యాకరణం, శైవ సిద్ధాంతం, ధర్మశాస్త్రాలు, దర్శనాలు, ప్రాపంచిక విద్యలతోపాటు అధ్యయనం చేసేవారు.

'అంకోర్‌థామ్' పట్టణం దగ్గరలో సూర్యవర్మ-II (క్రీ.శ. 1112-1152)చే నిర్మించబడిన అంకోర్‌వాట్ మందిరం

హైందవ దేవాలయాలలో ముఖ్యమైనది. జయవర్మన్–VII (క్రీ.శ.1120–1215)చే నిర్మితమైన బేయన్‌వాట్ అంకోర్‌థామ్‌లోని అతి పెద్ద బౌద్ధాలయం. ఆలయ గోపురాలు నాలుగువైపులా చాలా పెద్దవైన బోధిసత్వ, లోకేశ్వర విగ్రహాలు కలిగి ఉన్నాయి.

కంపా (దక్షిణ అన్నం, వియత్నాం) : అనేక సంస్కృత శాసనాలలో కంపా దేశంగా ప్రస్తావితమైన ఇప్పటి వియత్నాం యొక్క దక్షిణ అన్నం ప్రాంతం క్రీ.శ. 2వ శతాబ్దం నుండే హైందవ ప్రభావం కలిగి ఉన్నది. అమరావతి (క్వాగ్నం), విజయ (బిన్‌డిన్), కౌథార (నేట్రంగ్), పాండురంగ (పాన్‌రంగ్)లు ప్రాచీన ఇండోచామ్ రాజ్యాలు.

డాంగ్ దుయాంగ్ (పూర్వపు ఇంద్రపురం)లో కనుగొన్న ఇత్తడి బౌద్ధ విగ్రహం అమరావతీ శిల్ప సంప్రదాయంలో కనిపిస్తుంది. క్రీ.శ. 350కు చెందిన దీని ఎత్తు 1.08 మీటర్లు (43 అంగుళాలు).

ఓకాన్‌లో లభించిన శిలాశాసనం ప్రకారం శ్రీమార వంశపు రాజులు అత్యంత ప్రాచీనులు. బ్రహ్మ–క్షత్రియ వంశపు రుద్రవర్మ (క్రీ.శ. 530–572) కొత్త వంశపాలన స్థాపించాడు. భద్రవర్మ (క్రీ.శ. 5వ శతాబ్దం) ప్రస్తుత 'మిసన్' ప్రాంతంలో ఒక శివాలయం (భద్రేశ్వరస్వామి) నిర్మించాడు. ఈ ఆలయ ప్రాంగణంలో నిర్మితమైన 70 భవనాలు కాలక్రమేణా శిథిలమైనాయి.

పృథ్వీంద్ర వర్మ (క్రీ.శ. 758–773), హరివర్మ (క్రీ.శ. 800–820) ప్రఖ్యాతి చెందిన మహారాజులు. ఈ ప్రాంతంలోనే ఒక శివాలయం దగ్గర నాలుగు చేతుల శ్రీగణేశ విగ్రహం కనబడింది. స్కందుడు (కుమారస్వామి లేక సుబ్రమణ్యస్వామి) పాలకులకూ, ప్రజలకూ ప్రియమైన దైవం. క్రీ.శ. 10వ శతాబ్దానికి చెందిన అనేక మందిరాలు ఈ ప్రాంతంలో ఉన్నాయి.

చైనా: ఆగ్నేయ ఆసియా దేశాల లాగా కాకుండా చీనా లేక చైనా దేశం మీద భారతదేశ సంస్కృతి ప్రభావం కేవలం బౌద్ధమత వ్యాప్తికి పరిమితమైనది. హన్ వంశపాలన నాటికే (క్రీ.పూ. 121) చైనాలో భారతదేశంలో చేసిన బుద్ధ విగ్రహాలు ఉండేవి. క్రీ.శ. 67 మింగ్ వంశపు రాజుల కాలంలో బౌద్ధమతం చైనాలో ప్రవేశించింది. భారత రాయబారులు చైనాలో ఉన్నట్లు లియాంగ్ వంశపు చరిత్ర (క్రీ.శ. 85–167) తెలియజేస్తుంది. మేధావులైన భారతదేశ బౌద్ధ సన్యాసులు అనేకులు చైనాను క్రీ.శ. 64 నుండి సందర్శించారు. వారిలో కశ్యప, మాతంగ, ధర్మరత్న, మహాబల, ధర్మపాలలు ముఖ్యులు. వీరు లోయాంగ్ ప్రాంతంలో స్థిరపడి బౌద్ధగ్రంథాలను చైనా భాషలోకి అనువదించారు.

ఈ అనువాదకులలో కుమారజీవ (క్రీ.శ. 344–413) ముఖ్యులు. ఆయన క్రీ.శ. 401లో ఛాంగ్‌యాన్‌లో ప్రవేశించి క్రీ.శ.413 వరకు జీవించి ప్రఖ్యాతి గాంచిన బౌద్ధగ్రంథాలు ప్రజ్ఞా పారమితా సూత్రాలు, షడ్దర్శన పుండరీకలను అనువదించారు. ఇతర అనువాదకులలో పరమార్థ (క్రీ.శ.499– 569), సుధాకర సింహ (క్రీ.శ. 637 – 735), వజ్రబోధి (క్రీ.శ. 671 – 741), అమోఘవజ్ర (క్రీ.శ. 705 – 774) ముఖ్యులు.

చైనా యాత్రికులు ఉత్తమ బౌద్ధ జ్ఞానం కోసం భారతయాత్ర చేయడం చరిత్రకు తెలిసిన విషయమే. వీరిలో పాహియాన్ (క్రీ.శ. 399 – 410), హ్యుయాన్‌త్సాంగ్ (క్రీ.శ. 600 – 664), ఐత్సింగ్ (క్రీ.శ. 635 – 713) ముఖ్యులు.

పశ్చిమ చైనా భూభాగంలో గణేశ విగ్రహాలు బయల్పడ్డాయి. ఇవి హిందూమత వ్యాప్తిని తెలియజేస్తున్నాయి.

ఇరాన్ (తూర్పు ప్రాంతం): పర్షియా దేశంగా చెప్పబడే ఇరాన్, జొరాష్టర్ (క్రీ.పూ. 6వ శతాబ్దం) స్థాపించిన 'జొరాష్ట్రియనిజమ్' లేక 'పార్సీ' మతానికి నెలవు. ఈ మతం వైదిక హైందవ మతంతో సంబంధం కలిగి ఉండేది. కొందరు చైనా యాత్రికుల రాతల ప్రకారం పర్షియా దేశంలో హీనయాన బౌద్ధమతం ప్రాచుర్యములో ఉండేది. బుద్ధుని భిక్షాపాత్రను అచ్చటి రాజప్రాసాద గిడ్డంగిలో దాచి ఉంచారు. పూర్వం కోరసాన్, పర్షియా, ఇరాక్, మోసుల్ – సిరియా వరకు కూడా బౌద్ధమతం వ్యాప్తి చెందినట్లు ఆల్‌బెరూని (క్రీ.శ. 973 – 1039) తెలిపాడు.

క్రీ.శ. 7వ శతాబ్దంలో పర్షియా దేశపురాజు కుస్రూ, దక్షిణ భారతదేశపు రాజు రెండవ పులకేశి పరస్పరం రాయబారులను కలిగి ఉండేవారు. పదవీచ్యుతుడైన ఇరాన్ రాజు 'షా' పహ్లవ (పహ్లవులు వేదాలలో పేర్కొన్న రాజవంశీకులు) రాజవంశానికి చెందినవాడు. ఆయన బిరుదు 'ఆర్యమిహిర్' (ఆర్య వంశపు సూర్యుడు) ఒక సంస్కృత పదం.

స్వర్గం నుండి గంగ ఆవిర్భావాన్ని జొరాష్ట్రియన్ మత గ్రంథం 'జెందా అవెస్తా'లో పేర్కొన్నారు. యాజిడిస్ లేక యజ్‌డిస్ జొరాష్ట్రియన్ సంప్రదాయానికి చెందిన గిరిజనులు. టర్కీ, అరబ్ గిరిజనులు కూడా ఈ సమూహానికి చెందినవారే. వారిలో వర్ణవ్యవస్థ (4 వర్ణాలు) ఉంది. వీరు ఏకపత్నీవ్రతులై పునర్జన్మను నమ్ముతూ అగ్నిని ఆరాధించేవారు. ❖**అనువాదం: డాక్టర్ పి.వి.రెడ్డి**

ఒక ధర్మానికి కట్టుబడటం, ఇతరుల ధర్మాలను హీనంగా భావించడమూ బంధమే. ధర్మం కేవలం ఒక తెప్ప లాంటిది, నదిని దాటడానికే కానీ పట్టుకొని తిరగడానికి కాదు. - గౌతమ బుద్ధుడు

శాంత చిత్తమే ప్రధానం!

- ఎమ్. రాంబాబు

సుదత్తుడు, హరిభద్రుడు చిన్ననాటి స్నేహితులు. వారిద్దరూ స్నేహితులే గానీ అనేక విషయాల్లో విభేదించుకుంటారు. ఒకరికి పురూరవ వంశీయుల కథలు ఇష్టం. మరొకరికి ఇక్ష్వాకు వంశీయుల కథలు ఇష్టం. ఒకరికి నియంతృత్వ పాలన ఇష్టం, మరొకరికి గణతంత్ర పాలన ఇష్టం. ఒకరికి జానపదం ఇష్టం, మరొకరికి శాస్త్రీయం ఇష్టం.... ఇలా ఎన్ని అభిప్రాయ భేదాలున్నా వారిద్దరూ మంచి స్నేహితులుగా ఉండేవారు. ఆ ఇద్దరి అన్యోన్య స్నేహ ఫలితంగా వారు వియ్యంకులయ్యారు. సుదత్తుని కుమార్తె సుభద్రను, హరిభద్రుని కుమారుడికిచ్చి వివాహం జరిపించారు.

రమణక నగరంలో ఉన్న అత్తగారింట్లో అడుగు పెట్టింది సుభద్ర. అక్కడ ఆమెకు అన్నీ బాగానే ఉన్నాయి. కానీ ఒక వెలితి మాత్రం ఆమెను బాధిస్తుంది. బౌద్ధ కేంద్రమైన శ్రావస్తిలో పుట్టి పెరిగింది సుభద్ర. బుద్ధుని గురించి ఏమీ తెలియని, బుద్ధుని ఉపదేశాలను ఆచరించని రమణక ప్రజల మధ్య జీవించడం ఆమెకు కషాయం తాగినట్లనిపిస్తుంది. కరవీకపక్షి (హిమాలయ అడవుల్లో ఉండే ఈ పక్షి తియ్యని మామిడి పండ్ల రసాన్ని తాగి, సుమధురంగా గానం చేస్తుంది.) సుమధుర స్వరాన్ని వీనుల విందుగా విన్న వారికి గాడిద స్వరం రుచిస్తుందా?

బుద్ధుని బోధనలతో ప్రభావితురాలైన సుభద్ర ఒకరోజు ఆవేదనతో ఇలా ప్రార్థించింది :

"ఓ భగవాన్! ధీరత్వముతో శీలమనే పాదాల మీద నిలబడి, శ్రద్ధ అనే చేతులతో, ప్రజ్ఞ అనే గొడ్డలితో, అజ్ఞానమనే వృక్షాన్ని ఛేదించమని ఇక్కడ నాకు బోధించేవారెవరు? దేహాన్ని లాలించనూ వద్దని, కష్టపెట్టనూ వద్దని సద్బోధలు నాకు చేసేవారెవరు? దేహ ధ్యాసను వదలి ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించమని నాకు చెప్పేవారెవరు?

ఈ రమణక నగర ప్రజలను చూసి నాకు జాలివేస్తుంది. ఈ నగర ప్రజలు కూడా మీ అమృత వాక్కులు విని బాగుపడాలి. ఈ నగరవాసుల పట్ల మీకెందుకు ఇంత ఉపేక్ష. నేను మీ భిక్షు సంఘానికి ఏ లోటుపాటూ లేకుండా అన్ని ఏర్పాట్లూ చేస్తాను. నా ప్రార్థనను మన్నించి మీరు తప్పక ఇక్కడికి వేంచేయండి. మిమ్మల్ని దర్శించి, మీ అమృత వాక్కులను గ్రోలి, మీకు ఆతిథ్యాన్ని ఇస్తే గానీ నేను భుజించను. నా ప్రాణం పోయినా ఫరవాలేదు. ఇక మీ ఇష్టం".

మరుసటి రోజు బుద్ధుడు ఇతర భిక్షువులతో పాటు రమణక నగరానికి వచ్చాడు. బుద్ధుడు నేరుగా సుభద్ర ఇంటికి వెళ్ళి ఆమెకు ఇలా బోధించాడు:

"సుభద్రా! నువ్వు అల్లారుముద్దుగా పెరిగావు. బయట ప్రపంచం గురించి నీకేమీ తెలియదు. ప్రపంచమంతా మీ ఇల్లులాగే, మీ నగరం లాగే ఉండాలనుకోవడం పొరపాటు. భూమి ఒక చోట సమతలంగా ఉంటుంది, మరోచోట ఎత్తుపల్లాలుగా ఉంటుంది. మరొక చోట ముళ్ళతో నిండి ఉంటుంది. భూమినంతా ఒకే విధంగా మార్చడం సాధ్యమవుతుందా? అన్నీ నీకు అనుకూలంగా మార్చుకోవడానికి సాధ్యమవుతుందా? ముళ్ళతో నిండిన నేలనంతా తోలుతో కప్పడం సాధ్యమా? ఇవన్నీ సాధ్యం కాదు కాబట్టి ఏదో ఒక ఉపాయాన్ని ఆలోచించాలి. నేలంతా ముళ్ళతో నిండి ఉంటే కాళ్ళకు చెప్పులు వేసుకొని సుఖంగా నడచిపోయే ఉపాయాన్ని అవలంబించాలి.

అలాగే, జీవితంలో ఎలాంటి క్లిష్ట పరిస్థితులనైనా అధిగమించడానికి శాంతచిత్తాన్ని అలవరచుకోవాలి. కాబట్టి నీ చిత్తం సరిగా ఉంటే నీకు శ్రావస్తీనగరమైనా, రమణక నగరమైనా ఒకటే. శ్రావస్తిలో నువ్వు ఈ దేహాన్ని చూశావు. ఇక్కడికి వచ్చాక ఈ నా రూపాన్ని చూడలేక పోతున్నావు. అందువల్ల నన్ను రూపకాయంగా చూడకు. ధర్మకాయంగా చూడు. ఈ దేహం కొన్నాళ్ళకు అంతరించిపోతుంది. ధర్మ బోధలు శాశ్వతంగా ఉంటాయి కాబట్టి బోధల్ని ఆచరించడానికి ప్రయత్నించు. అప్పుడు సజ్జనులు నీ మనస్సులో నిరంతరం మెదలుతూ ఉంటారు. వారు నీకు దూరమయ్యారనే భావం ఎన్నటికీ కలుగదు". ❖



అన్నమయ్య పదామృతం

అదె చూడరయ్య పెద్ద హనుమంతుని
గుదిగొని దేవతలు కొనియాడేరయ్య ॥

ఉదయాస్త శైలములు ఒక జంగగా చాచె
అదివో ధ్రువమండల మందె శిరసు
చదివె సూర్యుని వెంట సారె మొగము త్రిప్పుచు
ఎదుట ఈతని మహిమ యేమని చెప్పేమయ్య ॥

దండిగా బ్రహ్మండము దాక తోక మీదికెత్తె
మెండుగ దిక్కుల నిండా మేను పెంచెను
గుండు గూడ రాకాసుల కొట్టగ చేతులు చాచె
అండ ఈతని ప్రతాప మరుదరుదయ్యా ॥

దిక్కులు పిక్కటిల్లగ దేహ రోమములు పెంచె
పక్కన లోకములకు ప్రాణమై నిల్చె
ఇక్కడ శ్రీవేంకటేశు హితవరి బంటాయ
మిక్కిలి ఈతని లావు మేలుమేలయ్య ॥

అదె చూడరయ్య పెద్ద హనుమంతుని!

– శ్రీమతి బి.కృష్ణకుమారి

సకల శాస్త్ర పారంగతుడై జ్ఞానమార్గాన్నీ... శ్రీరామచంద్రుడి దాసానుదాసుడై భక్తిమార్గాన్నీ... సీతాన్వేషణను సుసాధ్యం చేసి కర్మమార్గాన్నీ... ఏకకాలంలో ఆచరించి చూపిన ఏకాంగవీరుడు ఆంజనేయుడు. శరీరానికి ప్రాణవాయువులా, శరణాగతులకు ప్రాణబంధువై ఆదుకునే ఆపద్బాంధవుడు ఆ అంజనీసుతుడు. ఆయన రామాయణమనే మహామాలలో రత్నమనీ, రామచంద్రమూర్తి అవతార లక్ష్యానికి ఆయుధమనీ అంటే అతిశయోక్తి కాదు. ఆ మారుతి మాహాత్మ్యంలో మంగళకరమైన ఘట్టం 'సుందరకాండ'. ఆ ఘట్టంలోని సాహసకృత్యాలతో ఆ సమీరకుమారుడు, అందరూ అసాధ్యమేనని చేతులెత్తేసిన కార్యాలను 'అన్నీ సుసాధ్యమేనని!' నిరూపించిన సాహసవంతుడు. అంతటి ఆ ఆంజనేయుడి రక్ష భయాలకు, బాధలకే కాదు భవరోగాలకూ అభయప్రదానమే! అందుకే స్వామి వివేకానంద "హనుమంతుణ్ణి స్మరించండి. మరుక్షణం మీలోని దౌర్బల్యం, పిరికితనాలు మటుమాయమవుతాయి. బ్రహ్మచర్య పాలనలో, సంకల్పబలంలో, కార్యదక్షతలో ఆ మహనీయుడే ఆదర్శం" అనేవారు. అంతటి మహితాత్ముడైన పవనసుతుడి ప్రముఖ ప్రస్థానఘట్టాల్ని ఈ పదకవితా పితామహుడు **'అదె చూడరయ్య పెద్ద హనుమంతుని!'** అన్న కీర్తనలో కట్టెదుట నిలిచేలా కడురమ్యంగా వర్ణిస్తున్నాడు.

దేవతలు కొనియాడేరయ్య...

మంచిపనులు తలపెట్టినప్పుడు ముందు కాళ్ళకు బంధాలు వేసే విఘ్నాలు ఎన్నో! అందుకే మన సనాతన ధర్మం శ్రేయాంసి బహు విఘ్నాని... అంటుంది. అయితే ఆ ఆటంకాలే విజేతలకు అలంకారాలై భాసిస్తాయనడానికి ఆ కేసరి నందనుడి కార్యసాధనే సాక్ష్యం. అందుకే ద్వాపరయుగంలో ఆ స్ఫూర్తితో మారుతి చిత్రాన్ని తన రథధ్వజంపై పెట్టుకొని, జెండాపై కపిరాజు ఉన్నాడన్న అభయంతో అర్జునుడు మహాభారత యుద్ధానికి సిద్ధమయ్యాడు. అంతటి వానరశ్రేష్ఠుడి వైభవాన్ని ఈ వేంకటేశ్వర విశేషభక్తుడు...

అదె చూడరయ్య పెద్ద హనుమంతుని
గుదిగొని దేవతలు కొనియాడేరయ్య! అని కీర్తిస్తున్నాడు. 'గుదిగొని' అంటే 'అతిశయించి' అని అర్థం. కేవలం భువిలోని భక్తులే కాదు, దివిలోని దేవతలు కూడా కొలిచే శివాంశ సంభూతుడు ఆ సమీర తనయుడు. సీతారాములు, శ్రీకృష్ణార్జున భీమాదులే కాదు, నారద తుంబురులు కూడా ఆంజనేయుడి ప్రాభవాన్ని ప్రస్తుతించినట్లు మన పురాణాలు ఘోషిస్తున్నాయి. ఇలా సకల పురాణేతిహాసాలలో హనుమంతుని ప్రస్తావనను క్రోడీకరించి పదిహేడవ శతాబ్దంలో శ్రీపుష్పగిరి తిమ్మనాచార్యుడు 'సమీరకుమార విజయం' పేరుతో పద్యకావ్యాన్ని రచించారు. ఆ కావ్య భాగంలో ఓ చోట నారదుడు, తుంబురులు గుణంలో కానీ, విద్యలో కానీ నీ సాటి ఈ లోకంలో ఎవరూ లేరని హనుమంతుడిని వేనోళ్ళ వినుతిస్తూ...

ఒక గుణంబున నొక విద్య నొక్క సరణి
నీకు సరి యెంచ వచ్చునే లోకమునను

(మిగతా 34వ పేజీలో...)

లోకంలో అన్ని సమస్యలకూ, సంఘర్షణలకూ, దుఃఖానికీ మూలకారణం తృష్ణ. ఏదో పొందాలి, ఏదో సాధించాలనే తృష్ణ ఉన్నంత కాలం సంసార చక్రం తిరుగుతూనే ఉంటుంది. - గౌతమ బుద్ధుడు

పరిప్రశ్న

– స్వామి భూతేశానంద
(రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు)

రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు - స్వామి భూతేశానందజీ మహరాజ్ (1901-1998) భక్తుల ఆధ్యాత్మిక సందేహాలకు సరళమైన రీతిలో ఇచ్చిన సమాధానాలను 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకుల ప్రయోజనార్థం 2013 జూలై సంచిక నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

భక్తుడు: జపధ్యానాలు కొంతసేపు చేయగానే అలసిపోతున్నాను. మహాత్ముల ఆశీర్వాదాలుంటే నాలో ఉత్సాహం, ఆసక్తి అధికమవుతాయనిపిస్తుంది. నాలో ఈ మానసిక బలహీనతకు కారణం ఏమిటి?

స్వామీజీ: ప్రతి ఒక్కరూ సాధన ప్రారంభంలో ఇలాంటి అవాంతరాలను ఎదుర్కోవలసి వస్తుంది. క్రమం తప్పకుండా మెల్లమెల్లగా సాధన సమయాన్ని పెంచుకుంటూ భక్తిశ్రద్ధలతో జపధ్యానాలను అభ్యసించాలి. ప్రారంభంలోనే గంటల తరబడి జపధ్యానాలను అభ్యసించడం అంత సులభమైన పని కాదు. అలా చేయడం ఆరోగ్యానికి కూడా హానికరం.

సాధనపై అభిరుచి పెరుగుతున్న కొద్దీ మనలో ఉత్సాహం పుంజుకుంటుంది. వెయిట్‌లిఫ్టింగ్ అభ్యసించేవాడు ప్రారంభంలోనే రెండు వందల కిలోల బరువును ఎత్తడానికి ప్రయత్నించడు కదా! అలాగే, సాధకులు క్రమం తప్పకుండా నిష్ఠతో జపధ్యానాలను అభ్యసిస్తూ, క్రమంగా సాధనా సమయాన్ని పెంచడానికి ప్రయత్నించాలి.

మహాత్ముల ఆశీర్వాదబలంతో అన్నీ సాధ్యమైనట్లైతే ఎంతోమంది యోగులు ఏళ్ళ తరబడి సాధనలు చేయాల్సిన అవసరం ఏమిటి? ఆధ్యాత్మిక అనుభూతులు పొందడం పసిపిల్లవాడి చేతిలోని మిఠాయిని లాక్కోవడం లాంటిది కాదు. శ్రద్ధతో సాధన చేయడం ద్వారా మాత్రమే ఆధ్యాత్మిక అనుభూతులు పొందడం సాధ్యమవుతాయి. మనలో భగవంతుని పొందాలనే కోరిక జనించడం పూర్వజన్మ సుకృతమని సంతోషించాలే గానీ నిరాశ చెందకూడదు.

మనలో ఉన్న జన్మజన్మల వాసనలన్నీ క్షయమవడానికి భగవంతుని అనుగ్రహం అవసరం. అందుకు 'ఓ భగవాన్! నిన్ను దర్శించాలనే కోరిక నాలో కలిగినందుకు నేను ధన్యుణ్ణి. కానీ ఆ కోరిక నెరవేరడానికి నాలో శక్తినీ, ఆర్తినీ ప్రసాదించు' అని భగవంతుణ్ణి నిరంతరం వేడుకోవాలి.

భగవల్లాభం పొందాలనే ఆసక్తితో ముందుకు సాగాలే గానీ నిరాశకు లోనై సాధనను నిలిపివేయరాదు. భగవంతుణ్ణి పొందాలనే తపన నిజంగా మనలో ఉంటే తప్పక అది సాధ్యమవుతుంది.

భక్తుడు: 'ఓంకారం' ప్రాశస్త్యం ఏమిటి?

స్వామీజీ: ఓంకారం బ్రహ్మమునకు ప్రతీక. సృష్టి, స్థితి, లయలకు ఆధారం 'ఓం'. ఓంకారం ఉచ్చరించడం ద్వారా పరబ్రహ్మాన్ని పొందవచ్చు. పరబ్రహ్మాన్ని తెలుసుకొన్నవారికి సర్వం సిద్ధిస్తుందని 'కఠోపనిషత్తు' (1.2.16) ఇలా వివరిస్తుంది:

ఏతద్ధ్యేవాక్షరం బ్రహ్మ ఏతద్ధ్యేవాక్షరం పరమ్ ।
ఏతద్ధ్యేవాక్షరం జ్ఞాత్వా యో యదిచ్ఛతి తస్యతత్ ॥

'ఈ అక్షరమే బ్రహ్మం. ఈ అక్షరమే సర్వోత్తమం కూడా! ఈ అక్షరాన్ని తెలుసుకున్న వారికి ఏది కోరితే అది సిద్ధిస్తుంది.'

బ్రహ్మం అంటే సగుణబ్రహ్మమనీ, సర్వోత్తమం అంటే నిర్గుణ బ్రహ్మమనీ అర్థం. ఓంకారం బ్రహ్మానికి ప్రతీక కనుక అదే బ్రహ్మమని ధ్యానించాలి.

ఓంకారాన్ని ఆలంబనగా చేసుకొని సాధన చేయడం ఉత్తమమని 'కఠోపనిషత్తు' (1.2.17) ఇలా వివరిస్తుంది:

ఏతదాలంబనం శ్రేష్ఠమేతదాలంబనం పరమ్ ।
ఏతదాలంబనం జ్ఞాత్వా బ్రహ్మలోకే మహీయతే ॥

'ఈ ఆలంబనమే ఉత్తమమైనది. ఈ ఆలంబనమే సర్వోత్కృష్టమైనది. ఈ ఆలంబనాన్ని తెలుసుకున్నవాడు బ్రహ్మలోకంలో పూజింపబడుతాడు'.

ఓంకారాన్ని ఆలంబనగా చేసుకొని సాధన చేసినట్లయితే పరబ్రహ్మ సాక్షాత్కారం సిద్ధిస్తుంది. ❖

పండుగలు - పర్వదినాలు

మే - 2015

01	శుక్రవారం	: రామకృష్ణ మిషన్ సంస్థాపన దినోత్సవం
02	శనివారం	: నృసింహ జయంతి
04	సోమవారం	: బుద్ధ పూర్ణిమ
13	బుధవారం	: హనుమజ్జయంతి
14	గురువారం	: ఏకాదశి
17	ఆదివారం	: ఫలహారిణీ కాళీపూజ
29	శుక్రవారం	: ఏకాదశి

జూన్ - 2015

12	శుక్రవారం	: ఏకాదశి
28	ఆదివారం	: ఏకాదశి



రామకృష్ణ భక్తి సూత్రాలు

– స్వామి యతీశానంద

నారద భక్తి సూత్రాలు, శాండిల్య భక్తి సూత్రాలు భక్తియోగానికి సంబంధించిన ప్రామాణిక గ్రంథాలు. అయితే ఆధునిక తరంలో భగవదన్వేషకులకు అనువైన రీతిలో భక్తితత్త్వాన్ని బోధించారు శ్రీరామకృష్ణులు. ఈ నేపథ్యంలో 'శ్రీరామకృష్ణ కథామృతం' నుండి కొన్ని ఉపదేశాలను 'రామకృష్ణ భక్తి సూత్రాలు'గా సులభరీతిలో వివరించే ప్రయత్నం చేస్తున్నాం.

బౌద్ధగ్రంథాలు పాళీ భాషలో, బైబిల్ హీబ్రూలో, ఖురాన్ అరబ్బీ భాషలో రచించబడ్డాయి. అలాగే శ్రీరామకృష్ణుల ఉపదేశాలు వారి మాతృభాష బెంగాలీలో ఆవిష్కృతమయ్యాయి. అవతార పురుషుని ముఖతః వెలువడిన ఆ అమృతోపదేశాలను యథాతథంగా ఉట్టంకిస్తూ వ్యాఖ్యానిస్తున్నాం. మహాశక్తిమంతమైన ఆ బోధనలను మననం చేసుకుంటూ కృతార్థులమవుదాం.

ఈశ్వర్ అవతీర్ణ హొయే భక్తిర్ ఉపదేశ్ దేన్ - శరణాగత హొతే బొలేన్. భక్తి థేకే తాఁర్ కృపాయ్ సబ్ హొయ్ - జ్ఞాన, విజ్ఞాన సబ్ హొయ్.

భగవంతుడు అవతరించి భక్తిని ఉపదేశిస్తాడు; శరణాగతుడవు కమ్మని అంటాడు. భక్తి ద్వారా ఆయన కృప లభిస్తే, సర్వం తెలియును. జ్ఞాన విజ్ఞానాలన్నీ తెలియును.

శ్రీరామకృష్ణ ఉవాచ: భగవంతుడివి వివిధ రూపాలు, వివిధ లీలలు – భగవల్లీల, దేవలీల, నరలీల, జగల్లీల. ఆయన ప్రతి యుగంలో మానవరూపంలో అవతరిస్తాడు – ప్రేమభక్తి నేర్పడానికి.

వ్యాఖ్య: సాధుజనుల రక్షణార్థం, ధర్మస్థాపన కొరకు భగవంతుడు అవతరిస్తాడని గీతలో చెప్పబడింది. 'భక్తి ఉపదేశం చేస్తాడు' అంటున్నారు శ్రీరామకృష్ణులు. ఇది గీతావాక్యం కన్నా భిన్నమా? కాదు. సాధురక్షణ అనగా ఎవరు సన్మార్గంలో, భగవంతుని చేరే మార్గంలో పయనించే ప్రయత్నం చేస్తున్నారో వారి సాధనాపథంలోని సకల విఘ్నాలనూ, కష్టాలనూ దూరం చేస్తాడు. భగవంతుని పొందే సులభ మార్గాన్ని ఉపదేశించడమే అవతార ఉద్దేశం.

రామాయణాన్ని చదివితే శ్రీరామచంద్రమూర్తి శరణాగతులను రక్షించి, భక్తిమార్గం బోధించాడన్నది అవగతం అవుతుంది. విభీషణ, సుగ్రీవ, అంగద, ఆంజనేయ మొదలైన వారే ఉదాహరణలు.

అవతార ప్రధాన ఉద్దేశం భక్తిని బోధించడమేనని శ్రీకృష్ణుడి జీవితంలో స్పష్టంగా అవగతం అవుతుంది. బృందావన లీలలు, ఉద్ధవ సంవాదం, ఆపై భగవద్గీత. గీతలో ఇతర యోగాల గురించి చెప్పినా, భక్తినే ప్రముఖంగా ఉంటుంది. భగవంతునిపై విశ్వాసం, శరణాగతి, భగవత్సమర్పిత కర్మ, ఆత్మ సమర్పణ గురించి దాదాపు అన్ని అధ్యాయాలలో కనపడుతుంది. భక్తియే ఉత్తమోత్తమమని వెల్లడించాడు.

భగవాన్ శ్రీకృష్ణుడు గీత చివర్లో, 'ఓ అర్జునా! నన్నే శరణు పొందు, నేను నిన్ను రక్షిస్తాన'ని ఘంటాపథంగా చెప్పాడు. ఏసుక్రీస్తు, మహమ్మద్ ప్రవక్త, కన్ఫ్యూషియస్, లా ఓత్సే, శ్రీకృష్ణ చైతన్య మొదలైన అవతారాలలో భక్తియే ప్రధానంగా కనపడుతుంది.

ఆదిశంకరులు జ్ఞానయోగమే బోధించారని తలవకూడదు. ఆలయాలు నిర్మింపజేసి, విగ్రహ ప్రతిష్ఠలు గావించారు, వివిధ స్తోత్రాల ద్వారా భక్తిని బోధించారు. వర్తమాన యుగావతారం శ్రీరామకృష్ణులు కూడా 'ఏ విధంగా భక్తి కలుగునో, ఆ ప్రయత్నం చేయండి' అని ఎన్నోసార్లు చెప్పారు. మనుష్యులను భోగవాంఛల నుండి తప్పించి, భగవన్ముఖులను చేయడానికి భగవంతుడు మనిషిగా జన్మిస్తాడు.

భక్తి కలిగి ఉండడం అంటేనే భగవంతునికి ప్రీతిపాత్రులమవడం. ఆయన మన ఆత్మీయుడనే భావం కలగడం. భగవంతుడే స్వయంగా జ్ఞానవిజ్ఞానాలు సర్వం ఇస్తాడు. జ్ఞానం మూలంగా భగవంతుడే మన స్వరూపం అని బోధపడుతుంది. విజ్ఞానం అంటే విశేషజ్ఞానం; విషయం తెలుసుకొని, దానిని ఉపయోగించుకొనడం. కొందరు పాలను గురించి విని ఉన్నారు, కొందరు చూశారు. కొందరు పాలు త్రాగి పుష్టి పొందారు. ఈ చివరిదే విజ్ఞానానికి ఉదాహరణ. భగవంతునితో సంభాషిస్తూ, ఆయనతో క్రీడించడం విజ్ఞానం. పుత్రుడు తండ్రి ఆస్తికి సునాయాసంగా ఉత్తరాధికారి అవుతాడు. భక్తుడు భగవంతుణ్ణి పొందగానే పితృ – పుత్ర సంబంధం దృఢమవుతుంది. ఫలితంగా భగవంతుని ఐశ్వర్యం మన సొంతం కాగలదు. ❖

అనువాదం: డాక్టర్ కమల జయరావు

సంపదలన్నింటిలోనూ ఆధ్యాత్మిక సంపదే ఉన్నతమైనది. దానిని కాంక్షించేవాడు కామం, క్రోధం, లోభం, మోహం, అసూయ, ద్వేషాలనే అసుర గుణాలకు దూరంగా ఉండాలి. - గౌతమ బుద్ధుడు

భగవంతునికి ఇష్టుడెవరు?

– శ్రీమతి భమిడిపాటి బాలాత్రిపురసుందరి

మనలో చాలా మంది ఉద్యోగ కాలం పూర్తి అయిన తరువాత కూడా మరో ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నారు. కానీ భగవంతుని గురించి చింతించేందుకు సమయం చిక్కింది కాబట్టి మోక్షం కోసం ప్రయత్నం చేద్దామని అనుకోవడం లేదు.

కపిల మహర్షి జన్మించాక ఆయన తండ్రి కర్దముడు సన్న్యాసం తీసుకుని వెళ్ళిపోతాడు. కొంత వయస్సు వచ్చాక కపిలుడు కూడా సన్న్యాసం తీసుకుని వెళ్ళిపోతాడు. వెళ్ళేముందు తల్లికి మోక్షమార్గాన్ని బోధిస్తాడు. సన్న్యాసం రెండు విధాలు. ఒకటి 'వివిదిషా' సన్న్యాసం. "వేత్తుమ్ ఇచ్ఛా – వివిదిషా" అని నిర్వచనం. బ్రహ్మజ్ఞానం తెలుసుకోవాలని తీవ్రమైన కోరిక ఉంటుంది. మహాత్ములు చెప్పిన వాటిని విని వాటి ద్వారా తెలుసుకోవాలి కాబట్టి ఎక్కడెక్కడో తిరిగి మహాత్ములను కలుసుకుని వారి బోధలు విని బ్రహ్మజ్ఞానం పొందడం.

రెండోది 'విద్వత్సన్న్యాసం'. అంటే తెలుసుకో వలసింది పూర్తయింది.. బ్రహ్మజ్ఞానం పొందాడు.. బ్రహ్మానందం పొందాలి. అది ఏకాంతంలోనే సాధ్యం. దాని కోసం తీసుకున్నది విద్వత్సన్న్యాసం. కపిలుడు విష్ణుమూర్తి అంశతో జన్మించినవాడు. విష్ణుమూర్తి అవతారంగా కూడా పేర్కొంటారు. బ్రహ్మజ్ఞాని అయిన కపిలుణ్ణి తల్లి దేవహూతి 'వయస్సులో చిన్నవాడవైన మహాత్మా! ఇంద్రియాల్ని నిగ్రహించలేక వ్యాకులపడుతున్నాను. ఇంద్రియనిగ్రహమెలాగో తెలియచేయ' మంటుంది. అప్పుడు కపిలుడు తల్లితో...

చేతః ఖల్వస్య బంధాయ ముక్తయే చాత్మనో మతమ్ ।
గుణేషు సక్తం బంధాయ రతం వా పుంసి ముక్తయే ॥

'తల్లీ! చిత్తమే జీవుని బంధమోక్షములకు కారణము. చిత్తం విషయములయందు ఆసక్తిగల జీవునకు బంధకారకం. భగవానునియందు లగ్నమైన వారికి మోక్షమును కలుగజేయును' అని అంటాడు. కాబట్టి బంధానికి గాని, ముక్తికి గాని కారణం చిత్తమే! ఆ చిత్తాన్ని ముక్తి కొరకు భగవంతుని యందు లగ్నం చెయ్యాలి.

భగవాన్ శ్రీకృష్ణుడు *(గీత–17.16)* మానసిక తపస్సు గురించి వివరిస్తూ *'...భావ సంశుద్ధి రిత్యే తత్ తపో మానస ముచ్యతే* – భావసంశుద్ధి మానసిక తపస్సు' అని అంటాడు. భావశుద్ధి లేని మనస్సు స్వార్థంతో పాపకార్యాలు చెయ్యడానికి వెనుకాడదు. భావశుద్ధి కలిగినవాడు అందరి క్షేమాన్నీ కోరతాడు. భక్తి ఉంటేనే ఇవన్నీ సాధ్యం. అది ఎలా ఉండాలి అంటే... భగవంతుడు స్ఫురణకు రాగానే శరీరం పులకరించి కృతజ్ఞతా పూర్వకమైన ఆనందబాష్పాలు ఉబికి రావాలి.



'ముహూర్తమపి జీవేత నరః శుక్లేన కర్మణా' మనిషి ముహూర్తకాలం జీవించినా మంచి పనులు చేస్తూ జీవిస్తే ఆ జీవితమే చాలు' అనీ; 'ముహూర్తం జ్వలితం శ్రేయః న తు ధూమాయితం చిరమ్ – ప్రకాశవంతంగా జ్వలించే జీవితం ముహూర్తకాలమైనా చాలు. పొగచూరిన జీవితం చిరకాలం ఉన్నా ప్రయోజనం ఉండదు' అనీ మహాత్ములు చెప్పారు.

భక్తియోగంతో పరమపదాన్ని పొందవచ్చు. మోక్షం కావాలనుకున్నవాడు మనస్సును వశపరచుకోవాలి. అది జరగాలంటే వైరాగ్యం కావాలి, దానికి యోగ సాధన కావాలి. ఒక లోభి ఓ మహాత్ముని దగ్గరకు వెళ్ళి ఖర్చు లేని పూజ చెప్పమన్నాడు. అందుకు అతడు "ఉదయమే స్వామిని లేపడం, గంగానదికి తీసుకెళ్ళి స్నానం చేయించడం, పట్టుబట్టలు ధరింపచేయడం, పాలల్లో రెండు చెంచాలు చక్కెర వేసి తాగించడం మానసికంగా చేయి"అని చెప్పాడు. ఆ లోభి అలాగే చేస్తూ ఒక రోజు రెండు చెంచాల చక్కెర బదులు, మూడు చెంచాల చక్కెర వేశాడట. అందువల్ల ఒక చెంచా వ్యర్థమైపోయిందని బాధ పడుతూ కూర్చొన్నాడట. అసలు పెట్టకుండానే పెట్టినట్టు బాధపడితే... నిజంగా దేవుడే దిగి వస్తే ఎంతమంది ఆయనను భక్తితో సేవించి నైవేద్యం పెడతారు? అందుకేనేమో భగవాన్ శ్రీకృష్ణుడు 'నాకు భక్తి చాలు... పత్రం, పుష్పం, ఫలం, తోయం – ఏదైనా సరే భక్తితో అర్పిస్తే చాలు. అసలు ఏమీ ఇవ్వకుండా భక్తితో మనస్సును అర్పించినా చాలు!' అన్నాడు.

"అన్ని జీవుల్లోను అంతరాత్మగా ఉన్న నాకూ, నా యందే జీవిస్తున్న జీవులకూ మధ్య భేదం పాటించవద్దు" అని భగవంతుడు స్వయంగా చెప్పాడు. భగవంతుడికి ఎవరు ఇష్టులు?

"వేదాధ్యయనం చేసినవారు, వారి కంటే వాటి అర్థం తెలిసినవారు, వారి కంటే వాటిలోని సందేహాలను తీర్చగలిగిన వారు, వారి కంటే ధర్మమార్గం ఆచరించడం తెలిసినవారు, ధర్మకార్యాలు చేసేవారు, సకల ధర్మాలనూ, మంచిచెడ్డలనూ తనకే అర్పించినవారు తనకు ఇష్టం" అని చెప్పాడు.

మనం అర్థం చేసుకోవలసినది ఏమిటంటే, భక్తితో మనస్సును భగవదర్పితం చేసినవాడే భగవంతుడికి ఇష్టుడు! ❖



మహాపురుషుని సాన్నిధ్య స్మృతులు

– స్వామి అకామానంద

నేను (స్వామి అకామానంద) ముగ్గురు మిత్రులతో కలసి రామకృష్ణ సంఘ మూడవ సర్వాధ్యక్షులైన స్వామి అఖండానందజీ మహరాజ్‌ను దర్శించుకోవడానికి ముంబయి రామకృష్ణ మఠానికి వెళ్ళాను. అప్పుడు నేను కళాశాల విద్యార్థిని. స్వామి భాస్కరానందజీ, మాకు మంత్రదీక్ష ప్రసాదింపమని స్వామి అఖండానంద మహరాజ్‌ను అభ్యర్థించారు. 'దీక్ష అంటే బజార్లో వంకాయలు, బీరకాయలు కొనడమా? ఇప్పుడు కుదరదు. వీరిని సార్‌గాచీ పంపు' అన్నారు.

క్రిస్మస్ సెలవుల్లో మేము సార్‌గాచీ వెళ్ళి పది దినాలు ఉన్నాం. 'దీక్ష తీసుకుంటారు సరే, మరి రోజూ జపం చేస్తారా?' అని అడిగారు స్వామి అఖండానందజీ మహరాజ్. 'నాకు దీక్ష గురించి ఏమీ తెలియదు. మంత్రం మనస్సులో నిలుస్తుందో లేదో' అన్నాను. 'ఏమిటిది? మంత్రం మనస్సులో నిలవదూ? అయితే, మీలాంటి వారికి దీక్ష ఇవ్వను' అన్నారు. కానీ మహరాజ్ రెండు రోజుల తర్వాత మంత్రదీక్షను ప్రసాదించారు. ఆ అనుభవం వర్ణనాతీతం.

మంత్రదీక్ష అయిన మర్నాడు 'కూరగాయలు తరగడం వచ్చా?' అని నన్ను అడిగారు మహరాజ్. 'రాదు' అన్నాను. 'ఒక వంకాయను రెండు ముక్కలు చేయి, ఆ రెండింటినీ నాలుగు చేయి, ఇందులో తెలియకపోవడానికి ఏమున్నది?' అని నా చేతికి చిన్న కత్తి ఇచ్చారు. వంకాయలు తరుగుతుండగా నా వేలు తెగింది. అది చూసిన మహరాజ్ 'నిన్ను ఏమి కోయమన్నాను, నీవు ఏమి కోసావు?' అని చీవాట్లు పెట్టారు.

ఆ తరువాత మహరాజ్ నాతో ఇలా అన్నారు:

"చూడు, ఒకటి కర్మయోగం, మరొకటి కర్మభోగం. ఏదైనా పని చేస్తున్నప్పుడు, మనస్సును నూటికి నూరు పాళ్ళు ఆ పని మీద పెట్టు. అప్పుడు పని చక్కగా చేయగలవు. దానిని కర్మయోగం అంటారు. కర్మయోగం మూలంగా చిత్తశుద్ధి కలుగుతుంది.

కర్మభోగం అంటే – ఒక పని చేయబోతాం, మరొకటి జరుగుతుంది, ఫలితం మనమే అనుభవించాలి. ఉదాహరణకు కూరగాయలు తరగమంటే వేలును కోసుకున్నావు. మనస్సు ఎన్నో విషయాల వైపు పరుగులు తీస్తుంది. వివిధ ఆలోచనలతో మనస్సు చెల్లా చెదురు అయి ఉంటుంది".

నా జీవితంలో ఎన్నటికీ మరువలేని సంఘటన ఇది.

మరొకనాడు 'మీకు వంట వచ్చా?' అని మా నలుగురిని అడిగారు. 'ఖిచడీ(పొంగలి), కడి(మజ్జిగ పులుసు) వండగలం' అన్నాం. మేము మహరాష్ట్రులం. ఖిచడీ అనగా బియ్యం, ముడిపెసలు కలిపి వండి, ఉప్పు కలుపుతారు. మసాలా కానీ, మిరియాలు కానీ వేయరు. కడి అనగా పెరుగులో శెనగపిండి కలిపి వండడం. 'సరే, రేపు మధ్యాహ్నం మనకు అదే భోజనం వండండి' అన్నారు మహరాజ్.

భోజనం చేసి వచ్చి కూర్చొన్నారు మహరాజ్. మేము ఇంకా తినలేదు. 'మహరాజ్! మాకు ముక్తి కలగాలని మా తలలపై చేయి పెట్టి దీవించండి' అని ప్రార్థించాం.

మహరాజ్ తన ఉదరంపై చేయి తిప్పుతూ, తిప్పుతూ 'ఇదిగో నా కడుపు నిండుగా భోజనం చేశాను. మీరు ఇంకా తినలేదు. ఇప్పుడు నా చేయి మీ శిరస్సులపై ఉంచితే, మీ కడుపులు నిండుతాయా?' అని అడిగారు. 'అదెలా సాధ్యం?' అని అన్నాం. 'నేను తలపై చేయి పెట్టినంత మాత్రాన ముక్తి కలుగుతుందా? సాధన చేయాలి. సాధన చేయగా చేయగా మనోమాలిన్యం తొలగిపోతుంది. చిత్తం శుద్ధవుతుంది. అందువల్ల సాధన అవసరం. సాధన లేనిదే మోక్షం సాధ్యం కాదు' అని సాధన ప్రాధాన్యాన్ని వివరించారు.

పూజ్య స్వామీజీ అనాథలను చాలా ప్రేమించేవారు. ఆయన పడకపై సదా పది పన్నెండు మంది అనాథ బాలురు ఆయన చుట్టూ కూర్చొని ఉండేవారు. 'చూడండి, ఈ బాలురు ప్రేమ అన్నది ఎరుగరు. వీరిని ప్రేమగా చూడాలి. ఏదీ ఆశించకుండా ప్రేమించాలి' అన్నారు.

పది దినాలే స్వామి అఖండానంద మహరాజ్ సాంగత్యం లభించింది. కానీ ఆ సాంగత్య మహిమ వల్ల మా జీవిత లక్ష్యంపై ఓ నిర్దిష్టమైన అభిప్రాయం ఏర్పడింది. ❖

సేకరణ: ప్రవ్రాజిక నిత్యశుద్ధప్రాణా, శారదామఠం.

(భగవాన్ శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష సన్న్యాస శిష్యులైన స్వామి అఖండానందజీ మహరాజ్, రామకృష్ణ సంఘ 3వ సర్వాధ్యక్షులు)

ఆత్మ సంయమనం పాటించి, అందరిపట్ల దయ చూపుతూ, మంచిని పంచుతూ ఆనందించే వాడు ధన్యుడు. నేను, నాది అనే అహంకారాన్ని వదలిన వాని ఆనందం ఉత్కృష్టమైనది. - బుద్ధుడు

గౌతముడిచ్చిన ఘనవారసత్వం

– బ్రహ్మచారి రవి

కపిలవస్తు నగరాన్ని పాలిస్తున్న శాక్యవంశపు రాజు శుద్ధోదనుడు. ఆయన భార్య – సౌశీల్యవతి మాయాదేవి. వారి కుమారుడే సిద్ధార్థుడు. అపారమైన సిరిసంపదలకూ, అంతులేని భోగభాగ్యాలకూ వారసుడై, మహారాజుగా వెలగాల్సినవాడు ఆ గౌతముడు. కానీ ఒకనాడు ప్రత్యక్షానుభవాలతో ఈ భోగాలన్నీ అశాశ్వతమనీ, కాలక్రమంలో కనుమరుగయ్యేవనీ, దుఃఖహేతువులనీ పరమ సత్యాన్ని తెలుసుకున్నాడు. అవి కాలక్రమంలో కనుమరుగైపోతాయని అర్థం చేసుకున్నాడు. శాశ్వత ఆనంద మార్గాన్వేషకుడై ఓ అర్ధరాత్రి రాజ్యాన్నీ, తల్లితండ్రులనూ, భార్య యశోధరనూ, పసిబిడ్డడైన కొడుకు రాహులుడినీ వదలి పరివ్రాజకుడిగా బయలుదేరాడు. కఠోర సాధనలతో, తపోదీక్షలతో పరమసత్యాన్ని ఆవిష్కరించుకొని గౌతమ బుద్ధుడయ్యాడు.

వారసుడి విలువైన ప్రశ్న: జ్ఞానోదయమయ్యాక ఆ సిద్ధార్థుడు దేశమంతా ధర్మప్రచారకుడిగా పర్యటిస్తూ ఉంటాడు. అందులో భాగంగా ఓ సారి కపిలవస్తులో అడుగుపెడతాడు. భర్త దూరమయ్యాక, ఒక్కగానొక్క కొడుకు రాహులుడే ప్రాణంగా బతుకుతున్న యశోధర అనుకోకుండా గౌతముడికి ఎదురు కావలసి వస్తుంది.

ఏడేళ్ళ కొడుకు రాహులుడికి ఆతని తండ్రిని చూపిస్తూ, 'బాబూ! బ్రహ్మవర్చస్సుతో ప్రకాశిస్తున్న ఆ తేజోమూర్తే నీ తండ్రి. ఆయన వద్ద ఎన్నో విలువైన నిధులు ఉన్నాయి. ఆయన దగ్గరకు వెళ్ళి వాటిని ఇమ్మని అర్థించు. తండ్రి ఆస్తికి కుమారుడే కదా వారసుడు!' అంటుంది ఆ యశోధర.

కన్నతండ్రి గురించి గొప్పగా వినడమే తప్ప, కళ్ళారా చూడటం కుమారుడికి అదే తొలిసారి! రాహులుడు తన తల్లి సూచన మేరకు బుద్ధుని దగ్గరకు వెళ్ళి, సూటిగా ఆయన ముఖంలోకి చూస్తూ, నిర్భయంగా, ప్రేమతో 'నాన్నా! మిమ్మల్ని చూస్తుంటేనే నాకు ఆనందం కలుగుతోంది. మీ దగ్గర ఎన్నో వెలలేని నిధులున్నాయని అమ్మ చెప్పింది! వాటిని మీరు నాకు ఎప్పుడిస్తారు?' అని అమాయకంగా ప్రశ్నిస్తాడు.

అప్పుడు గౌతముడు ప్రశాంతత నిండిన, వైరాగ్యపూరితమైన తన సహజ మందహాసంతో 'కుమారా! వారసత్వాన్ని కోరుతున్నావా? కాలప్రవాహంలో నశించిపోయే నిధులు నేను నీకిచ్చినా వాటి ఫలితంగా బరువుబాధ్యతలు, కష్టాలు కన్నీళ్ళే తప్ప, ఆనందమేమీ ఉండదు. కానీ నేను నీకు ఇవ్వగలిగినవి విలువైన ఆధ్యాత్మిక నిధులే! వాటిని తీసుకోవడానికి నీవు సిద్ధమై, భద్రపరుచుకొనే సామర్థ్యం నీకు ఉంటే ఇప్పుడే వాటిని నీకు ధారపోయగలను' అన్నాడు.

జ్ఞానవారసత్వాన్ని అందుకోవడానికి సిద్ధమంటాడు రాహులుడు. ఆ మాటతో వెంటనే గౌతముడు కొడుకుకి అష్టాంగ మార్గాల్ని (సమ్యగ్ దృష్టి, సమ్యగ్ సంకల్పం, సమ్యగ్ వాక్కు, సమ్యగ్ కర్మాంతం, సమ్యగ్ జీవనం, సమ్యగ్ వ్యాయామం, సమ్యగ్ స్మృతి, సమ్యగ్ సమాధి) బోధించాడు.

తథాగతుడి ప్రవచనాలతో ప్రభావితులై పరివర్తన చెందిన ఎందరో పునీతుల్లో రాహులుడూ ఒకడయ్యాడు. భౌతికంగా జన్మనిచ్చిన తండ్రి గానే కాకుండా, ఆధ్యాత్మికంగా తరింపచేసిన పరమ గురువుగా కూడా రాహులుడి జీవితాన్ని సార్థకం చేశాడు గౌతముడు. అలా... కన్నవారిగా బిడ్డలకు ఇవ్వాల్సిన ఘన వారసత్వం ఏమిటో గౌతముడు చెప్పకనే చెప్పాడు.

నరేంద్రుడి జీవితంలో...: విలువైన వారసత్వం అనగానే స్వామి వివేకానంద జీవితంలోని ఓ ఘట్టమూ స్ఫురిస్తుంది. స్వామీజీ చిన్నతనంలో ఓ సందర్భంలో తండ్రి విశ్వనాథ్ దత్తాను 'నాన్నా! మీరు నాకు వారసత్వంగా ఏమి ఇవ్వాలని అనుకుంటున్నారు?' అని ప్రశ్నిస్తాడు. అప్పుడు తండ్రి తన కొడుకుకు దూరంగా ఉన్న నిలువుటద్దాన్ని చూపి, 'అక్కడకు వెళ్ళి చూసుకో! నీకే అర్థమవుతుంది' అంటారు. అద్దంలో తన రూపాన్ని చూసుకున్నాక నరేంద్రకు తన తండ్రి అంతరంగం అర్థమవుతుంది. తేజస్సు నిండిన ముఖం, కాంతులీనుతున్న కళ్ళు, ఆత్మవిశ్వాసం, మూర్తీభవించిన పురుషత్వంతో కూడిన శరీరం! ఇవే తన తండ్రి తనకు ఇచ్చాడనీ, వీటితో ఈ ప్రపంచంలో ఏదైనా సాధించవచ్చనీ అవగతమవుతుంది. ఆత్మవిశ్వాసం, ఆత్మబలమే విలువైన వారసత్వమని అర్థం చేసుకుంటాడు.

ఆస్తిపాస్తులు, అమితమైన వస్తుసంపదలే పిల్లలకు భద్రతనిచ్చే వారసత్వమని భావిస్తున్న నేటి తల్లితండ్రులు ఆ మహాపురుషుల జీవితాల నుంచి ఎన్నో పాఠాలు నేర్చుకోవాలి. ఇలా ప్రేయస్కరమైన భౌతికసౌఖ్యాలు కాకుండా, శ్రేయస్కరమైన ఆధ్యాత్మిక సంపదలు, నైతిక విలువలే ముందుతరాలకు ఇచ్చే వారసత్వ నిధులని తెలుసుకోవాలి. ❖ **(మే 4వ తేదీన - బుద్ధ పూర్ణిమ)**

దేశ ఔన్నత్యానికి పట్టుగొమ్మలు



'న గృహం గృహ మిత్యాహుః గృహిణీ గృహముచ్యతే – ఇంటిని గృహం అనరు, ఇల్లాలినే గృహం అంటారు' అని ఒక సంస్కృత కవి చెప్పాడు. ఇది ఎంతో సత్యం. చలి నుండి, వేడిమి నుండి నిన్ను కాపాడే ఇంటి విలువను, దానికి ఆధారంగా ఉన్న స్తంభాలను బట్టి నిర్ణయించకూడదు. ఇంటికి నిజమైన ఆధారం, కేంద్రస్థానమైన ఇల్లాలిని బట్టే నిర్ణయించాలి. ఈ ప్రమాణాన్ని బట్టి చూస్తే అమెరికన్ల గృహాలు, లోకంలోని ఏ గృహాలకూ తీసిపోవు.

అమెరికన్ల గృహాల గురించి నేనెన్నో కథలు విన్నాను. అక్కడి వారికున్న స్వేచ్ఛ విచ్చలవిడిగా తిరిగే స్థితిలోకి దిగజారుస్తున్నదనీ, స్త్రీత్వంలేని స్త్రీలు స్వాతంత్ర్యం పేరుతో కుటుంబంలోని సుఖశాంతులను నశింపచేసి, ఒళ్ళు తెలియని శివంతో గంతులు వేస్తున్నారనీ... ఇలాంటివే అనేక విషయాలు విన్నాను. అమెరికన్ల గృహజీవనం ఏ విధంగా ఉంటుందో, నేను ఒక సంవత్సరం స్వానుభవంతో చూశాక ఈ కట్టుకథలన్నీ ఎంత నిరాధారమైనవో గ్రహించాను. ఓ అమెరికన్ మాతలారా! మీ రుణం తీర్చుకోవడానికి నాకు నూరు జన్మలైనా చాలవు.

స్నేహితులు లేరు, డబ్బు లేదు, పేరుప్రతిష్ఠలు లేవు, పాండిత్యమా లేదు, తోడు లేదు. ఫకీరునై నిస్సహాయుణ్ణై ఉన్నాను. దాదాపుగా దిక్కులేని స్థితిలో ఉన్నాను. అలాంటి సమయంలో అమెరికన్ స్త్రీలు నాకు సహాయులయ్యారు. నీడ నిచ్చారు. అన్నపానాలొసగారు. తమ ఇళ్ళకు ఆహ్వానించి తమ సోదరునిలా, తమ కుమారునిలా నన్ను ఆదరించారు. ఈ భయంకరుడిని, ఈ క్రైస్తవేతరుడిని వదలిపెట్టమని వారి మతగురువులు ప్రోద్బలం చేశారు. 'ఈ విదేశీయుడు తెలియని వాడు. ఇతని శీలం ఎలాంటిదో తెలియదు. అందువల్ల ఇతగాణ్ణి చేరదీయొద్దు' అని వారి మిత్రులు నిత్యం వారికి చెప్పేవారు. అయినా ఆ మహాతల్లులు నాకు అండగా నిలిచారు. నేనెలాంటివాణ్ణో, నా శీలమెలాంటిదో వారు బాగా పరిశీలించగలిగారు. అద్దం నిర్మలంగా ఉంటేనే కదా ప్రతిబింబం స్వచ్ఛంగా కనిపిస్తుంది.

అమెరికాలోని ఎన్నో చక్కని కుటుంబాలను నేను తిలకించాను. నిర్మలమైన శీలం గలిగి నన్ను పుత్రవాత్సల్యంతో చూసిన తల్లుల నెందరినో చూశాను. చక్కని సంస్కృతి, ఉత్తమమైన విద్య, మహోన్నతమైన పారమార్థిక సంపద కలిగి హిమాలయాలలోని మంచులా అత్యంత స్వచ్ఛమైన, నిర్మల మనస్కులైన కన్నియలను, కుమార్తెలను ఎందరినో చూశాను. ఈ విధంగా ఉన్నప్పుడు – అమెరికా గంధర్వాంగనలతో, స్వైరవిహారిణులతో నిండి ఉందని చెప్పవచ్చా? అన్ని చోట్లా మంచి ఉంటుంది, చెడూ ఉంటుంది. నిజమే! కానీ ఒక దేశంలోని బలహీనులనూ, దుర్జనులనూ లెక్కలోకి తీసుకొని, ఆ దేశం మంచి చెడులు నిర్ణయించరాదు. కారణం వారు ప్రవాహంలో కొట్టుకుపోయే చెత్త చెదారం లాంటివారు. దేశం విలువ ఆ దేశంలోని ఉదాత్త చరితులను, వినిర్మలులను, పావనాత్ములను బట్టి నిర్ణయించాలి. వారే జాతీయ జీవనవాహిని ఎంత నిర్మలంగా, అనర్గళంగా ప్రవహిస్తుందో సూచిస్తారు. దాన్నిబట్టి వారి జీవన స్వభావాన్ని అంచనా వేయాలి. ❖

తేనెటీగలు మకరందాన్ని స్వీకరించేటప్పుడు పువ్వుకుగానీ, దాని రంగుకుగానీ హాని కలిగించవు. బుద్ధిమంతులు ఎవరికీ హాని కలిగించకుండా, ఎవరినీ నొప్పించకుండా జీవిస్తారు. - బుద్ధుడు

శ్రీరామకృష్ణ ఉద్యమం -

ఈ ప్రశాంత బేలూరుమఠ ఆవరణలో 'శ్రీరామకృష్ణ ఉద్యమంలో స్వచ్ఛందసేవకుల పాత్ర' అనే విషయమై మన అభిప్రాయాలను ఇచ్చిపుచ్చుకోవడానికి సమావేశమవడం ఇదే మొదటిసారి. ప్రతి రామకృష్ణ మఠం, రామకృష్ణ మిషన్ దేనికదే విశిష్టమైనది. ప్రతి ఒక్కటీ దానికంటూ కొన్ని ప్రత్యేక లక్షణాలను సంతరించుకొంది. ఒక కేంద్రానికి అనుబంధంగా ఉన్న అనేకమంది భక్తులలో కొందరు మాత్రం ప్రత్యేకంగా, చొరవతో ముందుకు వచ్చి తమ స్వచ్ఛంద సేవలను అందించడం ముదావహం. వీరిలో చాలా మంది ఆశ్రమాలకు అందించే సేవలలోని అంకితభావాన్ని చూసి మేము వారిని మా సొంతవారిగానే పరిగణిస్తాం. కొన్నిసార్లు మేమే వారి సేవలను మా సొంత హక్కుగా కోరతాం. వారు కూడా మా ప్రేమపూర్వక అభ్యర్థనకు సంతోషంగా ప్రతిస్పందిస్తారు.

ప్రతి ఒక్క స్వచ్ఛందసేవకుడూ సత్ప్రవర్తనతో, నైపుణ్యంతో, శక్తిసామర్థ్యాలకు అనుగుణంగా సేవలను అందించడం చూస్తుంటే ముచ్చటేస్తుంది. వీరంతా ఆశ్రమం పరిధిలో ఒక పెద్ద కుటుంబంలోని సభ్యుల లాగా కలసిమెలసి పని చేస్తున్నారు.

ఎందుకు ఈ స్వచ్ఛందసేవకులు ఆశ్రమం వైపు ఆకర్షితులవుతున్నారో తెలుసా? ఎందుకంటే ఆశ్రమం వారి సూక్ష్మశరీరాల పట్ల శ్రద్ధ వహిస్తుందని! ఇక్కడ సూక్ష్మశరీరం అంటే మనస్సు, బుద్ధి, ఆధ్యాత్మిక జీవితం. ఒకసారి కాశీపూర్‌లో ఉన్నప్పుడు శ్రీరామకృష్ణులు, 'మ'తో "నీవు నా నుండి ఏమీ ఆశించవు. అయినప్పటికీ ఇక్కడికి రావడానికి ఇష్టపడతావు. నీవు కొంతకాలం ఇక్కడికి రాకపోతే నాకు కూడా ఏదోలా ఉంటుంది" అని అన్నారు. ఈ విధంగా స్వచ్ఛందసేవకులు ఆశ్రమాల్లో సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల సన్న్యాసుల ఆదరణను చూరగొంటారు. సాధువుల ఆదరణ ఉంటే వారి మానసిక, ఆధ్యాత్మిక అభివృద్ధి నిశ్చయమైనట్లే. **పరస్పరం భావయంతః శ్రేయః పరమవాప్స్యథ** *(భగవద్గీత-3.11)* అని శ్రీకృష్ణ భగవానుడు చెప్పినట్లు స్వచ్ఛందసేవకులు, ఆశ్రమవాసులు పరస్పరం ప్రేమాభిమానాలతో మెలగుతూ ఉత్కృష్టమైన శ్రేయస్సును పొందుతున్నారు.

శ్రీశారదా రామకృష్ణ వివేకానందులను అనుసరించేవారిని మూడు వర్గాలుగా అంటే సాధువులు, భక్తులు, భావప్రచార కేంద్రాల నిర్వాహకులుగా పేర్కొనవచ్చు. వీరిలో సాధువులు ప్రధాన వర్గానికి చెందిన వారు మాత్రమే కాక ఉద్యమ సంరక్షకులు కూడా! సహజంగానే వారి జీవనసరళి, నడవడిక ఇతరులకు ఆదర్శంగా ఉండాలి. మంత్రదీక్ష పొందిన భక్తుల జీవనసరళి అంకితభావంతో కూడినదే కాక ఇరుగుపొరుగు వారిలో కూడా ఆ జీవనాన్ని అనుసరించాలనే విధంగా ప్రోత్సాహకరంగా సాగాలి. భావప్రచార కేంద్రాలు గృహస్థుల నిర్వహణలోనే ఉన్నా వీటి ఒరవడి ప్రధాన ఉద్యమానికి వెన్నుదన్నుగా సాగాలి. ఈ మూడు వర్గాలు కూడా ఒకే ఉద్దేశంతో కొనసాగాలి - అంటే ఎలాంటి స్వాధికారతను ఆశించకూడదు, స్పర్ధలు లేకుండా ఉండాలి.

స్పర్ధ లేకుండుట అంటే ఇతరుల విజయాలను చూసి అసూయ చెందకపోవడం; స్వాధికారతను ఆశించకపోవడం. ఆశ్రమానికి లోపల కానీ, వెలుపల కానీ ఎటువంటి ప్రత్యేకతను ఆశించకుండా స్వశక్తి, స్వీయకృషి, నైపుణ్యాల ఆధారంగా ఎదగడానికి ప్రయత్నించాలి.

స్వచ్ఛంద సేవకుల నుండి ఆశించేదేమిటి? వారంతట వారే రామకృష్ణ ఉద్యమానికి చేయూత నివ్వడానికి ముందుకు వచ్చారు. ఈ స్వచ్ఛంద సేవకులను పైన తెలిపిన మూడు వర్గాలలో దేనిలోనూ బంధింపజాలం. వారంతట వారే ఒక ప్రత్యేక విభాగం. ఇది వారి స్వీయ ఎదుగుదల, అభివృద్ధికి సంబంధించిన బాధ్యత వారిపైనే ఉందని సూచిస్తుంది. ఒక స్వచ్ఛంద సేవకుడు క్రీస్తు సంఘానికి చెందినవాడైతే ఆ సంఘానికి చెందిన కట్టుబాట్లను అనుసరించాలి. అదేవిధంగా రెడ్‌క్రాస్ సంస్థకు చెందిన స్వచ్ఛందసేవకుడు ఆ సంస్థ నియమావళిని పాటించాలి. ఇక్కడ సమావేశమైన స్వచ్ఛందసేవకులు ఏదో ఒక రామకృష్ణ మఠం, మిషన్ కేంద్రంతో అనుబంధం కలిగినవారు. ఒక విధంగా చూస్తే పైన పేర్కొన్న మూడు విభాగాల వారు కూడా స్వచ్ఛందసేవకులే!

సాధువులు సంఘ నియమావళికి బద్ధులై ఉండాలి. భక్తులు గురువు యొక్క సూచనలు అనుసరించాలి. భావప్రచార కేంద్రాల నిర్వాహకులు పది మార్గదర్శక సూత్రాలకు కట్టుబడి ఉండాలి. మరి స్వచ్ఛందసేవకులకు కూడా ఏదైనా నియమావళి అవసరమా?

దీనికి సమాధానం కచ్చితంగా 'అవును' అనే చెప్పాలి. బాహ్యం నుండి ఎటువంటి నియమాలనూ విధించక పోయినప్పటికీ వీరు నిర్దిష్టమైన క్రమశిక్షణను అనుసరించడం అవసరం. ఉత్తమ జీవితాన్ని గడుపుతూ ఉండాలి; ఉత్తమ పౌరులుగా వ్యవహరించాలి; ఇతరులను ప్రేమ, ఆప్యాయతలతో సేవించడానికి సదా సంసిద్ధులుగా ఉండాలి.

స్వచ్ఛంద సేవకులకు కొన్ని నియమాలు: 1) సమాజంలో ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించి ఉండవచ్చు. కానీ ఆశ్రమంలో స్వచ్ఛందసేవకునిగా ఎలాంటి భేషజాలు లేకుండా

స్వచ్ఛంద సేవకుల పాత్ర

– స్వామి సుహితానంద (రామకృష్ణ మఠం, మిషన్‌ల ప్రధాన కార్యదర్శి)

సేవలు అందించగలిగితే పరోక్షంగా అది అహంకార నిర్మూలనకు దోహదపడుతుంది. అంతమాత్రాన ఆత్మ గౌరవానికి వచ్చిన భంగమేమీ లేదు.

2) సంఘటితంగా పనిచేయడం ద్వారా బృందంలో ఎలా మసలుకోవాలో తెలుస్తుంది. భారతీయులలో కొరవడిన 'సంస్థాగత ఆచరణ' గురించి స్వామి వివేకానంద ఎంతో చింతించేవారు. అందువల్ల స్వచ్ఛందసేవకులు నాయకత్వ లక్షణాలను సంతరించుకొని సమష్టిగా పనిచేయడం అలవాటు చేసుకోవాలి.

3) అవసరానుగుణంగా బాధ్యతలను ఇతరులతో పంచుకోవడానికి సిద్ధంగా ఉండాలి. వారు నిర్వహించే బాధ్యతలను గమనిస్తూ ఉండాలి.

4) మనం సచ్ఛీలురమైతేనే ఇతరులు మన సూచనలను అనుసరిస్తారన్న విషయాన్ని గుర్తించాలి.

5) ఆశ్రమంలో స్వచ్ఛందసేవకులకు వివిధ సందర్భాలలో వేర్వేరు పనులను కేటాయిస్తారు. అందువల్ల ఆ యా పనులపై ఎలాంటి మమకారభావం పొడచూపదు. ఆ విధంగా నిస్సంగభావంతో సేవలందించడం సాధ్యమవుతుంది.

6) ప్రారంభంలో సంఘసేవ అనే భావంతో సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న వారు, క్రమేణ ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకొని పరిపూర్ణ వ్యక్తులుగా పరిణతిని సాధించడం జరుగుతుంది.

సంస్థ ఆవశ్యకత

'సమాజానికి సేవ చేయడానికి ఏదో ఒక సంస్థతో అనుబంధం అవసరమా?' అనే సందేహం మనలో ఉదయించవచ్చు. మనం స్వతంత్రంగా సేవలను చేయలేమా అంటే, చేయవచ్చు. కానీ కష్టంతో కూడుకున్న విషయం. మనం స్వతంత్రంగా తీసుకున్న నిర్ణయాలు కొన్నిసార్లు మనల్ని తప్పుదోవ పట్టించవచ్చు. సమాజంలో పేరు, ప్రఖ్యాతులు వచ్చిన తరువాత అహంకారం పొడచూపవచ్చు. అది మన ఆధ్యాత్మిక ప్రగతికి అవరోధంగా నిలుస్తుంది. 'ఆత్మ శ్లాఘనం' అనే ముసుగులో చిక్కుకొని నిజమైన సేవాదృక్పథం కోల్పోయే ప్రమాదం ఉంది. కాబట్టి సంఘటితంగా సేవా కార్యక్రమాలను చేస్తే ప్రత్యేక గుర్తింపు, పేరుప్రఖ్యాతుల బారిన పడకుండా నిస్వార్థంగా, నిరహంకారంతో సేవలందించడం సాధ్యమవుతుంది. అందుకు ఒక సంస్థ ఆలంబనం ఎంతైనా అవసరం.

ఈనాటి సమన్వయ కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుండి, సమాజంలోని వివిధ హోదాల నుండి దాదాపు 2,400 మంది హాజరయ్యారు. మీరందరూ సంఘటితంగా ఉండగలిగితే ఈ స్వచ్ఛంద సేవకుల బలం ఎంత శక్తిమంతమైనదో ఊహించండి. క్రిస్టోఫర్ ఇషర్‌ఉడ్, creative minority అనే పదజాలాన్ని ఉపయోగించారు. అంటే సమాజంలో మైనారిటీ వర్గం మెజారిటీ వర్గాన్ని పరిపాలించడం. సామ్యవాదం దీనికి వ్యతిరేకం కావచ్చు కానీ దృఢసంకల్పం కలిగిన ఒక చిన్న దొంగల గుంపు ఎంతో శక్తిని ప్రదర్శించడం మనం చూస్తాం. కానీ ఇక్కడ పేర్కొన్న మన (creative minority) మైనారిటీ వర్గం యొక్క సృజనాత్మకబలం సమాజాభివృద్ధిలో ఒక కీలక భూమికను నిర్వహించే శక్తిని కలిగి ఉంది.

కాలానుగుణంగా మనం కొద్దికొద్దిగా ఒక మహోన్నత ఉద్యమం వైపు, విశ్వజనీన మూర్తిత్రయ ఆదర్శాల వైపు పురోగమిస్తున్నాం. మీరు సన్న్యాసులు కాకపోవచ్చు. భావప్రచార సమితి సభ్యులు కాకపోవచ్చు. మంత్రదీక్ష పొందిన భక్తులు కాకపోవచ్చు. అయినప్పటికీ మీరు మీకు తెలియకుండానే శ్రీరామకృష్ణ, శ్రీశారదామాత, స్వామి వివేకానందుల కృపకు పాత్రులవుతున్నారు. దివ్యజనని శారదాదేవి ఒకసారి ఇలా అంటారు: 'శ్రీరామకృష్ణుల భక్తులను చూడండి. వీరిలో ప్రతి ఒక్కరూ సంతుష్టినొందినవారే. వీరు ఒక ప్రత్యేక తరగతికి చెందినవారు'.

అలాగే స్వామి వివేకానంద 'ఒక వ్యక్తి అన్ని రంగాలలో సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే అతడు తన జీవితంలో నాలుగు యోగాలనూ అనుసరించాలి' అని అంటారు.

మీరు ఆశ్రమవాసుల దినచర్యను ఒకసారి పరికించి చూస్తే వారి కార్యక్రమాలన్నీ జ్ఞాన, కర్మ, భక్తి, రాజ యోగాలలో ఏదో ఒక దానికి చెంది ఉంటాయి. ఈ విధంగా మనల్ని మనం చతుర్యోగ సమ్మేళనంతో శ్రీరామకృష్ణుల మూసలో పోతపోసుకుంటున్నాం.

స్వామి వివేకానంద ఇలా అంటారు – 'నా వద్దకు రండి. మీలో ప్రతి ఒక్కరినీ ఇరవైమందిగా తయారుచేస్తాను'.

మూర్తిత్రయ ఆశీస్సుల వల్ల ఆశాజనక, నిర్మాణాత్మక ఆలోచనలు కలిగిన అదృష్టవంతులం మనం. ఇటువంటి ఆలోచనలే క్రమంగా మనల్ని ఉన్నతులుగా తీర్చిదిద్దుతాయి. సంఘసేవ, దేశసేవ చేయడంలో మూర్తిత్రయ చేతులలోని సమర్థమైన సాధనాలుగా మనందరం రూపొందాలని ఆశిస్తున్నాను. ❖

(2014 జూన్ 18న బేలూరుమఠంలో జరిగిన 'అఖిలభారత స్వచ్ఛంద సేవకుల సంయోజనా సదస్సు'లో స్వామి సుహితానందజీ మహారాజ్ ప్రసంగానికి స్వేచ్ఛానువాదం). తెలుగుసేత : బ్రహ్మచారి శ్యామ్

ఇతరులలో తప్పులు కనుగొనడం సులభం. కానీ తన తప్పు తాను తెలుసుకోవడం చాలా కష్టం. ఎదుటివారి తప్పులను ఎంచేవాడు తన తప్పులు ఇతరులకు తెలియకుండా జాగ్రత్తపడతాడు. - బుద్ధుడు

మనదేశ జనాభాలో 65 శాతం యువతేననీ; ప్రపంచంలో మరేదేశంలోనూ ఈ విధమైన పరిణామం లేదనీ; దేశ జనాభాలో ఇంతమంది యువత ఉండటం మనకు ఒక వరమనీ అందరూ అంటున్నారు. అవును నిజమే! అందరికీ ఉపాధి దొరికి అందరూ దేశ నిర్మాణంలో పాలు పంచుకునేటట్లు చేయగలిగితే, వారి శక్తిని సక్రమంగా, సమర్థంగా ఉపయోగించుకోగలిగితే యువశక్తి దేశానికి వరమవుతుంది. అలా చేయలేకపోతే ఈ శక్తియే దేశానికి ప్రమాదకరంగా పరిణమించడానికి కూడా అవకాశముంది.

జనాభా పెరుగుదలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలను పెంచలేకపోతే సమాజం క్లిష్టపరిస్థితిని ఎదుర్కోవలసి వస్తుంది. ప్రభుత్వాలు నైపుణ్య శిక్షణ సంస్థలను ఏర్పాటు చేసి యువతకు తగిన శిక్షణనిచ్చి వారికి ఉపాధి అవకాశాలను పెంచడానికి ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ అవి సరిపోవడం లేదు. జనాభా పెరుగుదల మరియు అవకాశాల అందుబాటు – ఈ రెండింటికీ మధ్య ఉన్న వ్యత్యాసం రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నది. సంపద పెరుగుతున్నది; ఆర్థిక అసమానతలు అధికరిస్తున్నాయి కానీ ఉపాధి అవకాశాలు పెరగడం లేదు. అనూహ్యంగా పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం మానవ వనరుల ఆవశ్యకతను తగ్గిస్తూ నిరుద్యోగాన్ని పెంచడానికి ఉపకరిస్తున్నది.

పారిశ్రామిక విప్లవానికి ముందు కూడా ఇలా భయపడ్డారు. ఐతే యంత్రాలను తయారుచేయడం, వాటిని వినియోగించడం, వివిధ రంగాలలో వాటి వాడకాన్ని పెంచడం వల్ల ఉపాధి అవకాశాలు బాగానే లభించాయి. కానీ ఇప్పుడు సాఫ్ట్‌వేర్, రోబోటిక్స్, మనిషి చేసే చాలా పనులను సునాయాసంగా చేయగలగడంతో చాలా రంగాలలో ఉపాధి అవకాశాలు కుదించుకుపోయే అవకాశాలు ఉన్నాయని నిపుణులు భావిస్తున్నారు. మనిషికి ఇకనుంచి మనిషికన్నా తాను కనుక్కొన్న పరికరమే, తన మేధతో రాసిన సాఫ్ట్‌వేరే, పెద్ద పోటీదారు అయ్యేప్రమాదం ఏర్పడింది. ఈ నేపథ్యంలో మరి మనం యువతకు ఎక్కడ ఎక్కువ ఉపాధి అవకాశాలు కల్పించవచ్చు అని సమాజంలోని పెద్దలు, విధాన రూపకర్తలు ఆలోచించవలసిన అవసరం ఉంది.

ఉద్యోగార్థి నుంచి ఉపాధికల్పకుడిగా... ప్రతి యువకుడు సర్టిఫికెట్ తీసుకొని ఉద్యోగార్థి అవడం కాకుండా, చదువుకుంటున్నప్పుడే కొంత పెట్టుబడిని సంపాదించి ఏ రంగంలో వ్యాపారాభివృద్ధికి అవకాశాలున్నాయో పరిశీలించి నలుగురికి తాను ఉపాధిని కల్పించాలని నిర్ణయించుకోవాలి. సొంత వ్యాపారాన్ని చేపట్టడానికి అస్సలు అవకాశం లేనటువంటి యువతకు ఉన్న కొద్దిపాటి ఉద్యోగాలను వదిలి వేయాలి. ఐతే మన సమాజం అవగాహన నియమిత పరిధిలోనే ఉండడం వలన, కాలానికి అనుగుణంగా మన ఆలోచనావిధానంలో మార్పు రాకపోవడం వలన యువత చాలా ఇబ్బంది పడుతుంది. జనబాహుళ్యం ఆలోచనావిధానం సమగ్రమైనదిగా లేదు. జీవనోపాధికి అన్ని వృత్తులూ, అన్ని పనులూ, అన్ని ఉద్యోగాలూ, సరిసమానమే అన్న భావన మనలో రావాలి.

కానీ నేటితరం మనస్సుల్లో కొన్ని వృత్తులు అధికం, కొన్ని అధమమన్న భావన బాగా పాదుకుపోయింది. అందుకని చాలామంది యువత తమకు నచ్చిన వృత్తినీ, రంగాన్నీ ఎంచుకోలేక పోతున్నారు. చాలామందికి చదువులో ఆసక్తి లేనప్పటికీ పనిపై మంచి ఆసక్తి ఉంది. వారిపై కుటుంబ సభ్యులు, తోటిసమాజం ఉన్నత విద్యను బలవంతంగా రుద్దకపోతే వారికి నచ్చిన పనిని చేపట్టి వారు ఆనందంగా ఉంటూ సమాజానికి తమవంతు సేవలను అందించగలుగుతారు.

నేడు ఉన్నత విద్యాభ్యాసం అంటే ఒక ధ్రువపత్రాన్ని సంపాదించుకొనడమే! ధ్రువపత్రమే ఉన్నత విద్య అయితే దూరవిద్య ద్వారా కూడా ఒక సర్టిఫికెట్‌ను సంపాదించుకోవచ్చు. ఈపాటిదానికోసం సంవత్సరాల పాటు కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో సమయం వృథా చేయవలసిన అవసరం లేదు. పైపెచ్చు పుస్తకాల ద్వారా పొందిన జ్ఞానం నిజజీవితంలో పెద్దగా అక్కరకు రాకుండా పోతున్నది.

అందుకని ఎవరికి వారు ఈ సర్టిఫికెట్ విద్య కాకుండా తమకు ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకొని ఆ రంగంలో ప్రావీణ్యాన్ని సంపాదించడానికి ప్రయత్నం చేయడం వలన వారికి చాలా సమయం కలిసివస్తుంది. తత్ప్రయత్నం ద్వారా యువత తమ శక్తియుక్తుల్నీ, కౌశలాన్నీ, సమయాన్నీ సరిగ్గా ఉపయోగించుకోగలుగుతుంది.

అందరికీ ఉన్నత విద్య అవసరం లేదేమో.. ఉన్నత విద్య చవకవడంతో అందరూ ఉన్నతవిద్యావంతులవుతూన్నారు. మంచిదే కదా అనుకోవచ్చు. కానీ మన సమాజంలో ఒక వ్యక్తి గ్రాడ్యుయేట్, పోస్టుగ్రాడ్యుయేట్ అయ్యాడంటే ఆ వ్యక్తి కొన్ని కొలువులు మాత్రమే స్వీకరించగలడు. మరి తన విద్యకు 'సమానమైన' పని ఆయనకు లేదా ఆమెకు కావాలి. అంటే ఆ వ్యక్తి ఉపాధిని ఎంచుకునే పరిధి కుంచించుకు పోతున్నది. అందరూ ఉన్నత విద్యావంతులైతే ఉన్న కొద్ది అవకాశాలకు అందరూ పోటీ పడుతుంటారు. అభివృద్ధి చెందిన అమెరికా దేశంలో కూడా ఈ పరిణామం లేదు.

అధిక జనాభా ఉన్న మనదేశంలోనే ఇప్పుడు వడ్రంగి పనిచేసేవారు, సుతారి పని చేసేవారు, ప్లంబర్స్, ఎలక్ట్రీషియన్స్ మనకు అవసరమైన సంఖ్యలో లేరంటే, ఇక మిగతా దేశాలలో చెప్పేదేముంది? ఉన్నత విద్యను అభ్యసించిన వారు ఈ పనులు

చేయటానికి భారతీయ సమాజంలో 'అనర్హులు'. సమాజ అవసరాలకు తగ్గట్లు వృత్తివిద్యా శిక్షణ మనం ఇవ్వడం లేదు. నిజానికి ఉన్నత విద్యలో ప్రమాణాలు ఇంతగా పడిపోవడానికి కారణం ఆ విద్యను అభ్యసించేటంత ఆసక్తి, ధీకుశలతలేనివారు కూడా ప్రైవేట్ విద్యాసంస్థలు ఇబ్బడి ముబ్బడిగా పెరగడంతో, ప్రభుత్వం ప్రవేశ రుసుమును, ఉపకార వేతనాలను ఇచ్చి సహాయపడటంతో సర్టిఫికెట్‌ను పొంది కొలువుల వేటలో ఉన్నారు. చాలా మంది యువత ఎప్పుడు పబ్లిక్ సర్వీసు కమీషన్ ఉద్యోగ ప్రకటన జారీ చేస్తుందా? అని ఎదురు చూస్తుంటారు. సరే ఆ ప్రకటన వస్తుంది. ఎన్ని ఉద్యోగాలకు? ఎంతమంది రాయబోతున్నారు? కనీసం ఒక ఉద్యోగానికి యాభై దరఖాస్తులు వస్తుంటాయి. అంటే మిగతా నలభై తొమ్మిది మంది వెనుదిరిగి ఏం చేయాలి? ఎలా స్థిరపడాలి? ఈ ప్రయత్నం వారిపై ఒత్తిడిని కలిగించి మానసిక వ్యథకు గురిచేయడమే

ఉపాధి

–స్వామి శితికంఠానంద

కాకుండా, అమూల్యమైన సమయం నిరుపయోగం అవడానికి కారణభూతమవుతున్నది కదా!

ఈ పరిణామం వలన దేశం కొన్నివేల పనిగంటలను నష్టపోతున్నదన్న విషయాన్ని మనం గుర్తించట్లేదు. వృత్తివిద్య శిక్షణకు యువత ముందుకు రాకపోతే, ఉన్నత విద్యను అభ్యసించిన వారిని కనీసం యువ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా (enterpreneur), వ్యాపారవేత్తలుగా తయారు చేయడానికి ప్రయత్నించాలి.

గతకాలంలో... ప్రాచీన కాలంలో మన వ్యవస్థ ఇంత అసమగ్రంగా లేదు. అప్పుడు ప్రతి పని పవిత్రం (dignity of labour) అన్న భావన, ఒక వర్గానికి ఒక పని (division of labour) ఏర్పాటు ఉండడంతో సమాజంలో పరస్పర సహకారం ఉండేది. అంతేగానీ ఎక్కడా పోటీ, ఇతరులను ప్రక్కకు నెట్టి పైకిరావడం లాంటి రుగ్మతలు లేవు. నాలుగు వర్ణాలను సృష్టించి ఒక్కో వర్ణానికి ఒక పనిని కేటాయించారు (గీతలో భగవానుడు చెప్పిన చాతుర్వర్ణం మయాసృష్టం... శ్లోకాన్ని మనం గుర్తుకు తెచ్చుకోవచ్చు). కానీ ఒక వర్ణం వారు ఎక్కువ, ఇంకొకరు తక్కువ అని భగవానుడు చెప్పలేదు. అది సమాజంలో తరువాత ప్రవేశించిన దురాచారం. పరస్పరం సహకరించుకుంటూ అన్ని వర్ణాలవారు పరిపూర్ణ శాంతి, సౌఖ్యాలతో విలసిల్లారు. మనలాగా కృత్రిమపోటీని సృష్టించుకోలేదు కాబట్టి వారికి జీవన పయనం ఇంత కష్టతరమవలేదు. యువత ఉపాధికోసం వెతకడం కాదు, ఉపాధిని సృష్టించుకోగలగాలి. నేర్చుకునే విద్య ద్వారా వాళ్ళు ఆ కౌశలాన్ని, ప్రతిభను పొందాలి.

సేంద్రీయ వ్యవసాయం – చక్కటి ఉపాధి మార్గం...

ప్రస్తుతం సేంద్రీయ వ్యవసాయం గురించి ఎక్కువగా వింటున్నాం. రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడడం వలన భూసారం తగ్గిపోవడం, తినే ఆహారం, గాలి, నీరు విపరీతంగా కలుషితమవడం జరుగుతున్నది. మన వ్యవసాయ ఉత్పత్తులలో అధికశాతం ఈ విధంగా క్రిమి సంహారకాలతో కలుషితమవడం వలన చాలా దేశాలు మన వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడం లేదు. ప్రకృతి సహజ వ్యవసాయం గురించి తెలియకపోవడం వలన నేటి సేద్యం వనరుల దుర్వినియోగానికి, ప్రజల ఆరోగ్యనాశనానికి ఒక ప్రధాన కారణంగా పరిణమించింది.

ప్రజలలో చైతన్యం వస్తున్నది కాబట్టి సేంద్రీయ ఉత్పత్తులకు (organic products) కూడా ప్రస్తుతం మార్కెట్‌లో మంచి గిరాకీ ఉన్నది. ఎటొచ్చి కావలసిన విస్తీర్ణంలో పండించ లేకపోవడం వలన, అందరికీ తక్కువ ధరలకు వాటిని అందించ లేకపోవడం వలన ఈ ఉత్పత్తులను అందరికీ అందుబాటులోకి తీసుకు రాలేకపోతున్నాం. నిజానికి ఇప్పుడు లభ్యమవుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చు కొని వ్యవసాయం చేయగలిగితే చాలా ఉద్యోగాలకన్నా ఎక్కువ ఆదాయాన్ని మానసిక ఒత్తిడి లేకుండా సంపాదించుకోవచ్చు.

కృషి (వ్యవసాయం) అంటే ఎవరి దగ్గర పని చేయాల్సిన అవసరంలేని వృత్తి. వ్యక్తి సర్వస్వతంత్రంగా ఉండడానికి అవకాశం ఉన్న ఉపాధి కాబట్టి సర్వోత్కృష్టమైన జీవికగా యువత భావించాలి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, ఆ రంగంలో ఉంటే నేడు చాలా ఉద్యోగాలకన్నా మిన్నగా రాణించవచ్చు. పైన తెలిపిన సమస్యలను పరిష్కరించి దేశానికి శాశ్వత ఆరోగ్య భద్రతను కల్పించాలంటే యువత కృషిని చేపట్టాల్సిందే. యువత అంతా స్వావలంబన దిశగా అడుగువేయడానికి ఆధునిక సేద్యం రాచబాట. ఉన్న వనరులను సరిగ్గా ఉపయోగించుకొని దేశ సంపదను పెంచడానికి సశాస్త్రీయ సేంద్రీయ సేద్యాన్ని మించిన వృత్తి, ప్రవృత్తి ఇంకొకటి లేదు.

ఇప్పుడిప్పుడే కొద్దిమంది యువత కర్షకులుగా ఉండడానికి, ఆధునిక పద్ధతులలో వ్యవసాయం చేసి పర్యావరణ పరిరక్షణ, వనరుల సంరక్షణ, ఆహార భద్రత, సామాజిక స్థిరతను సాధించడానికి ముందుకు వస్తున్నారు. ఇది స్వాగతించ వలసిన పరిణామం. చాలామంది ఉన్నతవిద్యను అభ్యసించి నగరాలలో మంచి కొలువులను వదిలి **పల్లెకు పోదాం పద** అన్న నినాదాన్ని చేపట్టి దేశానికి ఆహార భద్రతను చేకూర్చడానికి సాంప్రదాయ రైతుకు ఆధునిక పద్ధతులలో శిక్షణనివ్వడానికి ముందుకు వస్తున్నారు. వీరు నిశ్శబ్దంగా చేస్తున్న సేవ, తీసుకువస్తున్న మార్పు, గతితప్పిన జీవన విధానాన్ని గాడిలో పెట్టడానికి చేస్తున్న ప్రయత్నం ఎంతైనా ప్రశంసనీయం. వారికి ఉత్సాహాన్ని, మనోధైర్యాన్ని ఇవ్వడం మన కనీస బాధ్యత. ❖

ఎవరు నిరంతరం నేర్చుకోవాలనే జిజ్ఞాస కలిగి ఉంటారో, ఎవరు ప్రజ్ఞాపాటవాలతో కూడిన ప్రవర్తన ఆశిస్తూ, అందుకోసం అన్వేషిస్తారో వారే నిజమైన సత్ప్రవర్తనాశీలురు. - గౌతమ బుద్ధుడు

ఏ మట్టిలో ఏ మాణిక్యమో!

– శ్రీమతి సుధామూర్తి, ఇన్ఫోసిస్ ఫౌండేషన్

మనం చేసే ఓ చిన్నసాయం కొందరి జీవితాలనే మార్చేస్తుందన డానికీ, మట్టిలో పడి ఉన్న మాణిక్యాలను వెలుగులోకి తెస్తుందనడానికీ చిత్ర ఉదంతమే నిదర్శనం. ఓ సారి నేను రైల్లో గుల్బర్గా నుంచి బెంగుళూరు వెళుతున్నాను. రైలు చాలా రద్దీగా ఉంది. టి.సి. నా బెర్తు దగ్గరకు వచ్చి, నా టికెట్ తనిఖీ చేస్తూ, హఠాత్తుగా నా సీటు కిందకు చూశాడు. 'ఏయ్ పిల్లా! బయటకు రా!' అంటూ ఓ అమ్మాయిని జబ్బ పట్టుకొని బయటకు లాగాడు. అక్కడ ఓ అమ్మాయి దాక్కొని ఉందని నాకు అప్పటి వరకు తెలియనే లేదు.

అతను అలా గట్టిగా అరిచే సరికి, ఆ అమ్మాయి బయటకు వచ్చింది. రేగిన జుట్టుతో, చిరిగిన బట్టలతో, పీలగా ఉందా అమ్మాయి. పదమూడేళ్ళు ఉంటాయేమో! చెక్కిళ్ళన్నీ కన్నీళ్ళతో చారలు కట్టాయి. వెంటనే టి.సి. 'ఎవరు నువ్వు? టిక్కెట్టు లేకుండా ప్రయాణిస్తున్నావా? ఫైన్ కట్టు! లేకపోతే, పోలీసులకు పట్టిస్తా!' అంటూ దబాయిస్తున్నాడు.

ఆ అమ్మాయి ఏమీ మాట్లాడకుండా, నిశ్శబ్దంగా ఏడుస్తూ నిలబడింది. ఆ అమ్మాయి పరిస్థితి చూసి నాకే చాలా జాలేసి ఆ టి.సి.తో 'టిక్కెట్టు డబ్బులు నేనిస్తాను. ఈ రాత్రి వేళ ప్లాట్‌ఫాం మీద ఈ పాపను దింపేయడం మంచిది కాదు!' అంటూ ఆ అమ్మాయికి బెంగుళూరు వరకు టికెట్ తీసుకున్నాను. ఆ తరువాత భయంగా, కాస్త బిడియంగా ఆ అమ్మాయి నా పక్కనే కూర్చుంది. ఎన్నో సార్లు ప్రశ్నించాక బలవంతంగా తన వివరాలు చెప్పసాగింది.

ఆ అమ్మాయి పేరు చిత్ర. వాళ్ళది బీదర్ దగ్గర పల్లెటూరు. తండ్రి కూలీ. చిత్ర పుట్టగానే తల్లి చనిపోయింది. తండ్రి మరో పెళ్ళి చేసుకున్నాడు. కొన్నాళ్ళకే తండ్రీ చనిపోయాడు. అప్పటి నుంచి చిత్ర కష్టాలు చెప్పనలవి కాదు. సవతి తల్లి తిండి పెట్టకుండా, తెగ బాదేదట! ఆ పిల్ల గౌను మీద ఉన్న రక్తపు మరకలు చూస్తే నిజమే చెప్తున్నట్లుంది. దాంతో తను విసిగిపోయి ఇల్లు వదిలి పారిపోయి వచ్చింది. చిత్ర ఈ వివరాలు చెబుతూండగానే రైలు బెంగుళూరు చేరింది. చిత్రకు చెప్పేసి రైలు దిగాను. ఇంటి నుంచి కారొచ్చింది. కానీ రైలు నుంచి దిగిన చిత్ర, నా వైపే బాధగా చూస్తూ ఉంది. ఇంత పెద్ద నగరంలో ఆ అమ్మాయిని ఒంటరిగా వదిలేస్తే ఎంత ప్రమాదమో తలచుకుంటే భయమేసింది. వెంటనే కారెక్కించుకొని నా వెంట తీసుకువెళ్ళాను.

ఇన్ఫోసిస్ ఆర్థికసాయంతో మా స్నేహితుడు శ్రీరామ్ నడుపుతున్న అనాథ శరణాలయానికి చిత్రను తీసుకువెళ్ళాను. ఆ అమ్మాయికి కొత్త బట్టలు కొనిచ్చి, కొంత డబ్బిచ్చి వచ్చాను. రెండు వారాల తరువాత అక్కడికి వెళ్ళాను. అక్కడ తను ఇంతకు ముందు కంటే ఆనందంగా ఉండడం చూసి ఆశ్చర్యమేసింది.

ఆ తరువాత చిత్ర జీవితం ఎన్నో మలుపులు తిరిగింది. పదో తరగతిలో ఆమె మంచి ర్యాంకు సాధించింది. నా సొంత ఖర్చుతో కాలేజీలో చేరుస్తానన్నాను. కానీ చిత్ర మాత్రం 'లేదక్కా! ఇప్పటికే మీరు నాకు చాలా చేశారు. ఇక నేను ఎవరికీ భారం కాదలచుకోలేదు. కంప్యూటర్స్‌లో డిప్లొమా చేసి, రెండు మూడేళ్ళలో ఉద్యోగంలో స్థిరపడిపోదా మనుకుంటున్నాను' అంది. వీలైనంత త్వరగా తన కాళ్ళపై తాను నిలబడాలనుకుంటున్న చిత్రను చూసి చాలా ఆనందమేసింది. మూడేళ్ళలో తను అనుకున్నట్లుగానే కంప్యూటర్స్‌లో డిప్లొమా పూర్తి చేసి, ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో అసిస్టెంట్ టెస్టింగ్ ఇంజనీర్‌గా ఉద్యోగం సంపాదించుకుంది.

కాలం గిర్రున తిరిగింది. ఏళ్ళు గడిచిపోయాయి. నేను ఒక విశ్వవిద్యాలయంలో ఉపన్యాసం ఇవ్వడానికి అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో వెళ్ళాల్సి వచ్చింది. కార్యక్రమమంతా పూర్తయి, నేను బస చేసిన హోటల్ నుంచి బయలుదేరుతూ, బిల్లు కడదామని రిసెప్షన్ దగ్గరకు వెళ్ళాను. అప్పుడు రిసెప్షనిస్టు 'మేడమ్! మీరు బిల్లు కట్టనవసరంలేదు. అదిగో, ఆవిడ మీ బిల్లు కట్టేశారు' అంది. అటు తిరిగి చూస్తే చిత్ర చిరునవ్వుతో నా ఎదురుగా నిలబడింది. ఆనందాశ్చర్యాలు కలిగాయి. ఎక్కడ బీదర్ రైల్లో బిక్కుబిక్కుమంటూ సీటు కింద నక్కిన అమ్మాయి! ఎక్కడ అమెరికాలో స్టార్ హోటల్‌లో నిలబడిన అమ్మాయి!

'చిత్రా! ఏంటీ నువ్విక్కడ? అయినా ఇంత బిల్లు నువ్వెందుకు కట్టావు?' అంటూ ఆత్మీయతతో ఆలింగనం చేసుకున్నాను. 'అక్కా! మా కంపెనీ ప్రాజెక్టు పని మీద నన్ను ఇక్కడికి పంపారు. మీ హోటల్ బిల్లంటారా! మీరు నాకు అప్పుడు బెంగుళూరు వరకు తీసుకున్న టిక్కెట్టు ఋణాన్ని ఎలాగూ, ఎప్పటికీ తీర్చుకోలేను. జీవితాంతం నేను మీకు ఎంత చేసినా, అది వడ్డీ కిందకే జమ అవుతుంది. కనీసం ఈ చిన్నవైనా చేస్తే నాకు సంతృప్తి. ఇదంతా మీ చలవే అక్కా! లేకుంటే ఏ రైల్వేస్టేషన్‌లో బిచ్చగత్తెగానో, కళంకితగానో, ఎవరింట్లోనో పనిమనిషిగానో మిగిలిపోయేదాన్ని. నన్ను ఈ స్థాయికి తీసుకువచ్చిన గొప్పతనం మీదే!' అంటూ కృతజ్ఞత కలిసిన కన్నీళ్ళతో నా కాళ్ళకు నమస్కరించింది.

చెమ్మగిల్లిన కళ్ళతో చిత్రను లేవదీస్తూ 'లేదు చిత్రా! అంతా నీ కృషి. పట్టుదల. మట్టిలో మాణిక్యాలుంటాయని నిరూపించావు. నీవు ఒక అడుగు వేయడానికి చేయందించినంత మాత్రాన ఇది నా ఘనత కాదు' అంటూ మనసారా హృదయానికి హత్తుకున్నాను. ❖

సేకరణ: జి. సతీష్

జీవనోద్యానంలో
మానవతా పరిమళాలు

శిలలు నేర్పే పాఠం!

ఒకసారి లాల్‌బహదూర్ శాస్త్రిని ఆయన మిత్రుడు ఇలా ప్రశ్నించాడు: "శాస్త్రి గారూ! మీరెప్పుడూ పొగడ్తలకు, సన్మాన కార్యక్రమాలకు దూరంగా ఉంటారు. ఏమిటి కారణం?"



శాస్త్రీజీ చిరునవ్వుతో "మిత్రమా! లాలా లజపతిరాయ్ గారు ఒకసారి నాతో ఏమన్నారంటే 'శాస్త్రీ! తాజ్‌మహల్ కట్టడానికి రెండు రకాలైన రాళ్ళను ఉపయోగించారు. విలువైన పాలరాయి మొదటిరకం. అది బురుజులు కట్టడంలో, అక్కడక్కడ ప్రముఖంగా కనబడేచోట వాడారు. ఇక రెండోరకం సాధారణమైన రాయి. అది తాజ్‌మహల్ పునాదిలో వాడారు. దాని వైపు ఎవరి దృష్టీ పోదు. మనం మన జీవితంలో ఆ రెండో రకానికి చెందిన పునాదిరాళ్ళను ఆదర్శంగా తీసుకోవాలి. కీర్తి ప్రతిష్ఠలు, పొగడ్తలు, సన్మాన సత్కారాలకు దూరంగా జీవిస్తూ మంచి పనులు చేస్తూ గడపాలి. ఆయన నేర్పిన ఈ పాఠం నా మనస్సులో నాటుకుపోయింది. నేను ఆ రెండో రకానికి చెందిన రాయి లాంటివాణ్ణి" అన్నారు లాల్‌బహదూర్ శాస్త్రి. ❖

మాతృభాష - మాతృదేవి

అప్పుడు భారతదేశంలో పరాయిపాలన సాగుతోంది. అంటే భారతీయులు తమ దేశంలో తామే బానిసలుగా బ్రతుకుతున్నారు. లండన్‌లో చదువుకుంటున్న ఒక భారతీయ విద్యార్థికి దైనందిని (డైరీ) రాసే అలవాటు ఉంది. ఒకరోజు అతడు దైనందిని ఆంగ్లంలో వ్రాస్తుండగా అతడి ఆంగ్లేయ మిత్రుడు 'నువ్వు డైరీ ఆంగ్లంలో ఎందుకు వ్రాస్తున్నావు?' అని అడిగాడు. అప్పుడతడు 'మనం చదువుకుంటున్నది ఆంగ్లంలో. కాబట్టి దైనందిని ఆంగ్లంలో రాస్తే తప్పేముంది?' అని ఎదురు ప్రశ్నవేశాడు.

అందుకు ఆ ఆంగ్లేయ మిత్రుడు "దైనందిని వ్రాయడమంటే మనస్సును ఆవిష్కరించుకోవడం. మనతో మనం మాట్లాడుకునేందుకు ఇంతకన్నా గొప్ప సాధనం లేదు. మనస్సు ఎప్పుడూ మాతృభాషలో ఆలోచిస్తుంది కానీ పరాయి భాషలో కాదు. మేము మీ దేశాన్ని పాలిస్తున్నాం కానీ మీ మనస్సులను కాదు. మనస్సులో బానిస భావం ఉన్నంత కాలం బాగుపడడం జరగదు. అమ్మను ప్రేమించినట్లయితే అమ్మభాషను ప్రేమించు" అని నిష్కర్షగా చెప్పాడు.

అతడి మాటలు విన్న భారతీయ విద్యార్థి మరెప్పుడూ ఆంగ్లభాషలో డైరీ రాయలేదు. ఆయనే మహారాష్ట్ర మాజీ గవర్నర్ స్వర్గీయ శ్రీప్రకాశ్. ❖

నూరేళ్ళు బ్రతకడం ఎలా?



ఒకసారి ధృతరాష్ట్రుడు విదురుణ్ణి ఇలా ప్రశ్నించాడు - "మహాత్మా! దాదాపుగా అన్ని వేదాలలో పురుషుడి (మనుష్యుడి) ఆయువు వంద సంవత్సరాలని చెప్పబడింది. కానీ వంద సంవత్సరాలకు ముందే ఎంతో మంది కాలం చేయడం నేను చూశాను. మరి వేదాలలో చెప్పబడింది అసంగతంగా లేదా?" అందుకు విదురుడు "ఓ రాజా! అహంకారం, అతిగా మాట్లాడడం, త్యాగగుణం లేకపోవడం, క్రోధం, స్వార్థం, మిత్రద్రోహం - ఈ ఆరు గుణాలూ పదునైన కత్తుల లాగా మనిషి ఆయువును ఖండించి వేస్తున్నాయి. ఇవే మనిషిని చంపివేస్తున్నాయి కానీ మృత్యువు కాదు. ఏ మనిషైతే ఈ ఆరింటికీ దూరంగా ఉంటాడో అతడు పూర్ణాయువుగా వందేళ్ళు బ్రతుకుతాడు" అని సమాధానమిచ్చాడు. ❖

అనువాదం: డాక్టర్ వై.సరోజా నిర్మల (రామకృష్ణ సంఘం - హిందీ మాసపత్రిక 'వివేకజ్యోతి' నుండి)



నిర్ణయం
The decision

– బి. సైదులు

పాతికేళ్ళ వయస్సులో గౌతముడు రథంపై ఓ రోజు అలా వాహ్యాళికి బయలుదేరాడు. సారథి రథాన్ని పురవీథుల గుండా పరుగులు తీయిస్తూ ఉన్నాడు. అంతఃపురవాసమే తప్ప ఆవలి ప్రపంచమే తెలియని ఆ సిద్ధార్థుడికి బయటిలోకమంతా కొత్తగా కనిపించసాగింది. ఆ శాక్య వంశపు యువరాజు తొలి ప్రయాణంలోనే దారి వెంబడి వరుసగా ఓ వ్యాధిగ్రస్థుడినీ.., ఓ వృద్ధుడినీ.., ఓ శవయాత్రనూ చూడాల్సి వచ్చింది.

రాణివాసాలు, రాజభోగాలే తప్ప కష్టాలు, కన్నీళ్ళన్నవే తెలియని ఆ సిద్ధార్థుడు ఆశ్చర్యంతో రథసారథిని 'ఎవరు వీళ్ళు? ఏమిటిదంతా?' అని ప్రశ్నించాడు. అప్పుడు ఆ రథచోదకుడు, మనిషికి ఈ జనన మరణాలు, జరావ్యాధులు సర్వసాధారణమేనంటూ, 'నాతో, మీతో సహా!' అందరికీ ఇవి తప్పవని తేల్చి చెప్పాడు.

గౌతముడి గుండె బరువెక్కింది. రథం ముందుకు సాగుతూనే ఉంది. అప్పటికే పొద్దువాలింది! ఆ సాయంసంధ్య వెలుగుల్లో ఆ యువరాజుకు ప్రశాంత వదనుడైన ఓ సన్న్యాసి తారసపడ్డాడు. 'ఇతనెవరు? ఇంత నిర్మలంగా ఎలా ఉన్నాడు?' అని అడిగాడు. 'ఇతడు సర్వసంగపరిత్యాగి! ఇతనికి బంధాలు లేవు! బాధలూ లేవు! అందుకే ఇంత ఆనందంగా ఉన్నాడు' అని సారథి చెప్పాడు. వెంటనే రథం వెనక్కి తిప్పమన్నాడు సిద్ధార్థుడు.

ఆ తరువాత ఆ ఆలోచనలతో అతనికి ఎన్నో రాత్రుళ్ళు సరిగ్గా నిదురైనా పట్టలేదు. తీవ్ర సంఘర్షణానంతరం తన భవిష్యత్తుకు సంబంధించిన విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకున్నాడు. ఓ అర్ధరాత్రి తన సిరిసంపదలనూ, ఆలుబిడ్డలనూ వదలి, సత్యాన్వేషణ కోసం బయలుదేరాడు. ఎన్నో సాధనల అనంతరం ఆనందప్రాప్తితో గౌతమ బుద్ధుడయ్యాడు. సంసారమా? సన్న్యాసమా? అన్న సందిగ్ధ సందర్భంలో నిర్దిష్టమైన నిర్ణయం తీసుకొని తన జీవనగమనానికే కాదు, యావత్ మానవాళి ఆనందాన్వేషణకు దిశానిర్దేశం చేసిన మహాపురుషుడిగా నిలిచిపోయాడు.

ప్రతి ఒక్కరి జీవితపు మలుపుల్లో ఇలాంటి సందిగ్ధసందర్భాలు ఎప్పుడో ఒకప్పుడు ఎదురవుతూనే ఉంటాయి. అయితే సరైన సమయంలో, సరైన నిర్ణయం తీసుకొని తమ భవిష్యత్ భారాన్నంతా తమపైనే వేసుకున్నవారినే విజయాలు వరిస్తూ ఉంటాయి. అందుకే స్వామి వివేకానంద 'నీ భవితకు నీవే నిర్మాతవని తెలుసుకో! నీ బాధ్యతనంతా నీ భుజస్కంధాలపైనే వేసుకో!' అంటారు.

నిర్దేశించేవి నిర్ణయాలే! : ఎవరి భవిష్యత్తునైనా నిర్దేశించేవి, కీలకసమయాల్లో వారు తీసుకునే నిర్ణయాలే! సన్న్యాసమే కావచ్చు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగమే కావచ్చు! ఎక్కడైనా మన నిర్ణయమే మన జీవితాన్ని శాసిస్తుందని మరచిపోకూడదు. అందుకే జీవనయానాన్ని మలుపుతిప్పే కొన్ని ముఖ్య సందర్భాల్లో విజ్ఞతతో, వివేకంతో అడుగు ముందుకు వేయాలి. ఆ సమయాల్లో తీసుకునే నిర్ణయాలు, భవిష్యత్తులో తలచుకొని పశ్చాత్తాప పడకుండా ఉండేవై ఉండాలి. అయితే జీవనసమరంలో గెలుపు ఓటముల సంశయం, మనలోని నిర్ణయాత్మక శక్తిని నిర్వీర్యం చేసి, అస్పష్టమైన పరిస్థితికి దారి తీయిస్తుంది. కురుక్షేత్రంలో ఇలాంటి మానసిక దౌర్బల్యంతోనే యుద్ధం చేయాలా? వద్దా? అని సంశయాత్ముడై కలవరపడిపోతున్న కిరీటితో శ్రీకృష్ణభగవానుడు....

వ్యవసాయాత్మికా బుద్ధిః ఏకేహ కురునందన ।
బహుశాఖా హ్యనంతాశ్చ బుద్ధయోఽవ్యవసాయినామ్॥ *(గీత. 2-41)*

'అర్జునా! ప్రయత్నపూర్వకంగా నిశ్చయాత్మకమైన బుద్ధిని ఏకాగ్రం చేసుకొని నీ జీవితలక్ష్యమేదో నిర్ణయించుకో! ఇలా ప్రయత్నించని వారి బుద్ధి పరిపరివిధాల పరుగులు పెడుతుంది' అని హితవు పలికాడు.

మనలో చాలామంది విద్య, ఉద్యోగ, వ్యక్తిగత వ్యవహారాల్లో స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవడంలో బుద్ధిని వ్యవసాయాత్మికంగా ఉపయోగించరు. 'వ్యవసాయాత్మిక బుద్ధి' అంటే కేంద్రీకృతమైన విజ్ఞత – one-pointed intelligence. రాబోయే కాలంలో ఎటువంటి కష్టనష్టాలకైనా, సుఖశాంతులకైనా మనమే బాధ్యులం అనుకున్నప్పుడే బుద్ధి ఇలా అప్రమత్తంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటుంది. అలా కాని వేళ బుద్ధి విక్షేపించి, నిర్ణయాలు నిర్దిష్టతను కోల్పోతాయి.

నిలకడ లేని నిర్ణయాలు....: మనం చాలా సందర్భాల్లో తాత్కాలిక ఉద్రేకాలకో, ఉద్వేగాలకో ప్రభావితమై నిర్ణయాలు తీసుకుంటూ ఉంటాం. నిలకడ లేని నిర్ణయాలతో మనం నలుగురిలో నవ్వులపాలు కాక తప్పదు. సిద్ధార్థుడు రోగినీ, వృద్ధుణ్ణీ, శవాన్నీ, సాధువునూ చూసిన వెంటనే నేను సన్యాసి నవుతానని శ్మశానవైరాగ్యంతో కాషాయ వస్త్రాల కోసం బజారుకు పరుగెత్తలేదు. ఎదురైన ఆ అనుభవాలతో తనలో తలెత్తిన మానసిక సంఘర్షణలను సంయమనచిత్తంతో సాక్షిలా పరిశీలించుకున్నాడు. అంతర్మథనం నుంచి అంకురించిన సహజ సత్యాన్వేషణ కాంక్షతో, కాలపరీక్షకు నిలబడి, కఠినమైనా తనకది కీలకమని నిర్ణయించుకొని ఒంటరిగా ఇంటి ద్వారాన్ని దాటాడు! కానీ మనం చాలాసార్లు తద్విరుద్ధంగా స్పందిస్తూ ఉంటాం. ముందూ, వెనకా ఆలోచించకుండా పరిస్థితులతోనో, పక్కవారితోనో ప్రేరేపితమై ఉద్వేగపూరితమైన తీర్మానాలు చేసేసుకుంటూ ఉంటాం. పుట్టినరోజునాడో, పెళ్ళిరోజునాడో పదుగురి ముందు ఉత్సాహపు ఊపుతో ఏవేవో నిర్ణయాలు తీసేసుకొని, ఆనక వాటిని నిలబెట్టుకోలేక అవస్థలు పడుతూ అభాసుపాలవుతూ ఉంటాం. అందుకే ఉచితానుచితాలను దృష్టిలో పెట్టుకొని, దృఢచిత్తంతో నిర్ణయాలు తీసుకోవాలి. ఒక్కసారి నిశ్చయించుకున్న తరువాత, అమలుపరిచేందుకు శాయశక్తులా శ్రమించాలి. అందుకే పాశ్చాత్య మేధావి మాల్కాల్మ్ గ్లాడ్‌వెల్, 'Truly successful decision-making relies on a balance between deliberate and instinctive thinking – సహజచోదన ఫలితంగా కలిగిన స్పందనకూ, సావధాన చిత్తానికీ మధ్య సమన్వయాన్ని కల్పించి తీసుకునే నిర్ణయాలు విజయవంతమైన ఫలితాలనిస్తాయి' అని అంటారు.

> జీవనగమనంలో మన నిర్ణయాలే మన భవిష్యత్తును నిర్ధారిస్తాయి. చదరంగంలో కదిలించే ప్రతి పావూ, ఆట గెలుపు, ఓటములకు కారకమవుతున్నట్లే, జీవితంలో తీసుకునే ప్రతి నిర్ణయమూ మన విజయవైఫల్యాలకు కారణమవుతుంది.

నిర్ణయం...నిబద్ధత : మనం తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడి ఉండాలంటే మనలో సడలని నిబద్ధత (కమిట్‌మెంట్) ఉండాలి. ఉచితానుచితాలనూ, సానుకూల, ప్రతికూలతలనూ దృష్టిలో పెట్టుకొని చక్కగా విచారించి ఒక నిర్ణయానికి రావాలి. ఎవరు ఉచిత సలహాలిచ్చేందుకు ప్రయత్నించినా, మన నిర్ణయాలను మార్చుకోకూడదు. మన నిర్ణయాన్ని ప్రభావితం చేసే అవకాశం ఎవరికీ ఇవ్వకూడదు. అలా మార్చుకోవడం మన మానసిక అస్థిరత్వానికీ, ఆత్మవిశ్వాస రాహిత్యానికీ చిహ్నం. అలాగని ఎవరి సలహాలనూ స్వీకరించవద్దని కాదు; కానీ ఆ సలహాలు, సూచనలు, సంప్రతింపులకు ఒక పరిధినీ, పరిమితినీ విధించుకోవాలి. ఒక వయస్సుకూ, స్థాయికీ వచ్చాక మన వ్యక్తిగత జీవితానికి రూపకల్పన చేసుకుని, నిర్వహించుకునే బాధ్యత మనదే అయి ఉండాలి. ప్రతి చిన్నదానికీ ఇతరులను సంప్రతించాలనుకోవడం మన మానసిక బలహీనతగా పరిణమించకూడదు. ఏ రంగంలో తీసుకున్నా, అత్యున్నత స్థానాలకు చేరుకున్నవారందరూ, తుది నిర్ణయాధికారాన్ని తమ స్వాధీనంలో ఉంచుకుంటారు.

ఒకసారి భగవాన్ రమణ మహర్షితో ఎస్.ఎస్.కోహెన్ అనే భక్తుడు 'భగవాన్! నేనెప్పుడూ సరైన పనే చేయాలనుకుంటాను. అయితే వచ్చిన కష్టమేంటంటే పనిచేసే ముందు తీసుకునే నిర్ణయం మంచిదా? కాదా? అనేది అంతుపట్టకుండా ఉంది. అది తెలుసుకునేందుకు కొలబద్ధ, సూత్రం ఏమన్నా ఉన్నాయా?' అని ప్రశ్నించాడు. అప్పుడు మహర్షి గంభీరంగా మారిపోయి "జీవించడానికి అలాంటి దగ్గరి తోవలు లేవు. ఎవరైనా వాళ్ళకు వాళ్ళు సొంత నిర్ణయాలు తీసుకోవలసిందే! దానికి బాధ్యత వహించి, ఫలితాలు అనుభవించాల్సిందే!" అన్నారు. మహర్షి చెప్పిన మాటలు మనందరికీ వర్తిస్తాయి.

నాన్చితే నిర్ణయం 'భారమే'! : కొంతమంది ఏ నిర్ణయాన్నీ సరైన సమయానికి తీసుకోలేరు! ఏ వైపు మొగ్గితే ఏం ఫలితముంటుందోనని భయపడుతూ, ఏదీ తేల్చక నాన్చుతూ ఉంటారు; లేదా వాయిదా వేస్తూ ఉంటారు. ఈ 'డిసైడో ఫోబియా' ఉన్నవారు ఏ విషయంలోనూ సాహసించి అడుగు ముందుకు వేయలేక, ఎటూ నిర్ణయించుకోలేక, సంశయాత్ములై దుఃఖభాగులుగా మిగిలిపోతారు. ఆదేశస్థానాలను అలంకరించి, ఔదాసీన్యతతో ఉండేవారు తాము ఇబ్బందుల్లో పడడమే కాక, పక్కవారినీ అసౌకర్యానికి గురిచేస్తూ ఉంటారు. ముఖ్యంగా నాయకుడిగా నలుగురికీ మార్గనిర్దేశకత్వం వహించాల్సిన వారు నాన్చుడు బేరస్థులైతే, అనుచర బృందం అసహనం చెప్పనలవి కాదు. బ్రతుకు కూడలిలో నిలబడినప్పుడు, ఏ వైపునకు మరలితే, ఏ గమ్యానికి చేరతామో అవగాహన ఉండాలి. అందుకే కెన్ లెవిన్ అనే రచయిత, 'We all take decisions, but in the end our decisions make us - మనం తీసుకున్న నిర్దిష్టమైన నిర్ణయాలే మన జీవనప్రస్థానంలో దారిదీపాలై వెలుగుచూపుతాయి' అని అంటారు. ❖

ప్రపంచమంతా తిరస్కరించినా ఎవరినీ ద్వేషించనివాడు నిజమైన యోగి. అతడు ప్రజలు తనకు వంగి నమస్కరించాలని గానీ, పూజించాలని గానీ, ఊరేగించాలని గానీ కోరుకోడు. -బుద్ధుడు



తపస్సు అంటే...

– స్వామి రంగనాథానంద (రామకృష్ణసంఘం 13వ సర్వాధ్యక్షులు)

మన భారతీయ సనాతన ధర్మంలో, వేద పురాణేతిహాసాల్లో తరచూ వినిపించే పదం 'తపస్సు'. అయితే సాధారణంగా తపస్సనగానే మనకు కీకారణ్యాలలో ధ్యానమగ్నులయ్యే మహర్షులు స్ఫురిస్తారు; ఉపవాసాలు, ముక్కుమూసుకొని కూర్చోవడమో, మండుటెండలో ఒంటికాలుపై నిలబడటమో, కఠోరమైన సాధనలు చేయడమో గుర్తొస్తాయి. కానీ తపస్సుకు మన శాస్త్రాలు విశేషమైన నిర్వచనమిచ్చాయి. నిత్య జీవనంలో విద్యార్జన దగ్గర నుంచి ఉన్నతాశయాల సాధన వరకు అన్నీ తపస్సు కిందకే వస్తాయని ఉద్ఘాటించాయి. అందమైన ఓ వస్తువును తయారు చేసే ఓ కళాకారుడి కృషి వెనుక, కోటీశ్వరుడి ధనార్జన వెనుక, ఓ గొప్ప రాజకీయవేత్త సుపరిపాలన వెనుక ఉన్నది ఈ కఠోర తపస్సే!

ఇలా పారమార్థికంగానే కాదు ప్రాపంచికంగా కూడా అభ్యున్నతిని సాధించాలనుకునేవారు తపోదీక్షతో ముందుకు సాగినప్పుడే సత్ఫలితాలు సాధిస్తారు. మనం సాధించే ప్రతి మహత్కార్యం, లక్ష్యసిద్ధి మనం చేసే మానసిక తపస్సు పైనే ఆధారపడి ఉంటుందని మరచిపోకూడదు. సాలీడు తన నుంచే వలను నేసినట్లు విధాత తన నుంచే సమస్త లోకాల్ని సృష్టించాడని ఉపనిషత్తులు ఘోషిస్తున్నాయి. ఈ సృష్టి కేవలం భగవంతుడి సృజనాత్మక తపః ఫలితమేనని స్పష్టం చేశాయి. 'యః సర్వజ్ఞః సర్వవిద్, యస్య జ్ఞానమయం తపః' అంటూ ఆయన సమస్తమూ తెలిసిన వాడు, కనుకనే ఆయన తపస్సు జ్ఞానంతో కూడినదై ఉందని 'ముండకోపనిషత్తు' కీర్తిస్తోంది. అదేవిధంగా శ్రీమద్రామాయణ ఆరంభంలో వాల్మీకి నారద మహర్షిని అభివర్ణిస్తూ 'తపస్స్వాధ్యాయ నిరతం...' అంటూ తపస్సు, స్వాధ్యాయాల యందు ఆసక్తి కలిగినట్టి మహాత్ముడిగా పరిచయం చేస్తారు.

మనలోని అద్భుతమైన 'మనశ్శారీరక' శక్తులనన్నింటినీ సమాయత్త పరచుకొని, ఏకాగ్రతను సాధించడమే 'తపస్సు'. ఈ తపః ప్రభావంతో నిత్యజీవితంలో సమస్త సంఘర్షణలు, సమస్యలు సునాయాసంగా పరిష్కారమవుతాయనడంలో సందేహం లేదు. అందుకే మన భారతీయ సంస్కృతి సుసంపన్నతలో 'తపస్సు'కు అంత ప్రాధాన్యం. మన సనాతన ధర్మంలో జ్ఞానాన్వేషణ, జ్ఞాన సముపార్జన, జ్ఞాన ప్రసారాలను కూడా తపస్సుగానే భావించారు. ఆదిశంకరాచార్యులు 'తైత్తిరీయ ఉపనిషత్తు'లో 'తపస్సు' అనే పదాన్ని విస్తృతంగా వినియోగించారు. తపస్సు అనే సంస్కృత పదాన్ని బహుళార్థాల్లో ప్రయోగించారు.

ఆధునిక జీవనంలో సమగ్ర మానవ వికాసానికి అనువుగా ఈ 'తపస్సు'ను వినియోగించుకోవాలనే మన మహర్షులు ఆశించారు. అందుకే ఆదిశంకరులు ఈ లోకంలో అన్ని సాధనల్లోకీ తపస్సే ఉత్కృష్టమైందని విస్పష్టం చేస్తూ...

మనసశ్చేంద్రియాణాం చ హ్యైకాగ్ర్యం పరమం తపః ।
తజ్జ్యాయః సర్వ ధర్మేభ్యః స ధర్మః పర ఉచ్యతే ॥ *(తైత్తిరీయోపనిషత్)*

'మనస్సునూ, ఇంద్రియాలనూ ఏకాగ్రపరచి నిశ్చలంగా ఉంచడమే తపస్సు; ఇదే పరమధర్మం!' అని పునరుద్ఘాటించారు.

అయితే నేడు జ్ఞాన ఆర్జన విషయంలో విద్యార్థుల్లో, జ్ఞానబోధనా ప్రక్రియలో గురువుల్లో ఈ తపోభావన కరవవుతోంది. అందుకే ఆ స్థానంలో ఉదాసీనత, చపలచిత్తం, భావోద్వేగాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ లక్షణాలన్నీ తపస్సుకు వ్యతిరేకమైనవి. ఉన్నతమైన, సార్థకమైన జీవితం కోసం మనం చేసే సాధనే నిజమైన తపస్సని ప్రాచీన ద్రష్టలు, తత్త్వవేత్తలు, మహర్షులు మనకు మార్గదర్శకత్వాన్ని నిర్దేశించారు. ❖ తెలుగుసేత: ఆర్. కృష్ణ

(1884 – 1967)

ముందుకు సాగిపో!

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్న్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ - వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్న్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం, ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

సార్‌గాఛీ,
15-11-1937

ప్రియమైన జ్యోతిబాబు!

ఒక్కసారి నీ చుట్టూ ఉన్న మనుషులను చూడు. వారు పురుగుల లాగా జీవితాలను గడుపుతున్నారని గ్రహిస్తావు. నీకు చెదపురుగుల గురించి, వాటి పుట్టల గురించి, వాటి సహజీవన విధానం గురించి తెలుసా? అవి మనుషుల లాగానే పనిచేసి ఇళ్ళను నిర్మించుకుంటాయి. కనుక బాహ్య ప్రపంచంలో నగరాలను నిర్మించినప్పటికీ మనిషికి ఏ విధమైన ప్రత్యేకత, గొప్పతనం లేదు. మనిషి ఘనత అతడు సంపాదించిన జ్ఞానం వల్ల లభిస్తుంది. విజ్ఞానశాస్త్ర జ్ఞానాన్ని అనుసరించి మనిషి విశ్వం యొక్క అనేక రహస్యాలను ఛేదించాడు. జీవం యొక్క మూలాలను సైతం పరిశీలించి వాటి రహస్యాలను కూడా కనుగొన్నాడు. అదే మనిషి ఘనత, ప్రత్యేకత. అన్నిటికన్నా గొప్ప విషయం ఏమిటంటే మనిషి జీవానికి మూలాన్ని కనుగొని, ఆత్మశక్తి ద్వారా దానిని అదుపు చెయ్యగలిగి, ప్రాణశక్తిని దాని మూలాలలో కలపగలగడమే. మానవుడు ఈ విధమైన అద్భుతాన్ని సాధించగలడు. దీనినే మనం 'ధర్మం లేదా మతం' అంటాం. దీన్ని సాధించడానికి కావలసిన సమాచారమంతా భగవద్గీతలో వివరించారు. ధర్మాన్ని సాధించడానికి రాజయోగం శాస్త్రీయమైన మార్గాన్ని సూచించింది. నీవు జీవితపర్యంతం ఈ రెండు గ్రంథాలనూ చదవాలి.

నీ మనస్సు, శరీరం – రెంటినీ సాధనకు అనుకూలంగా సిద్ధపరిస్తే నీకు జ్ఞానోపలబ్ధి కలుగుతుంది. అది ఈ జన్మలో కానీ, మరుజన్మలో కానీ కావచ్చు. ప్రస్తుతానికి నీ బాధ్యతలను ఏ విధమైన ప్రతిఫలాపేక్ష లేకుండా నిర్వర్తిస్తూ ఉండు. నీవు శారీరకంగా, మానసికంగా బాగానే ఉన్నావని భావిస్తాను.

విజ్ఞానశాస్త్రజ్ఞులు పరిశోధించి కనుగొన్న సత్యాలు యథార్థమైనవే. అయితే వారు ఇంకా లోతుగా వెళ్ళవలసి ఉంది. జీవం గురించి తుది విశేషాన్ని మనం అర్థం చేసుకున్నాం. వేదాంతం ఈ విశ్వాన్ని గురించి సిద్ధాంతాలను చాలా స్పష్టంగా వివరించింది. విజ్ఞానశాస్త్ర సిద్ధాంతాలకు ఆటమ్‌లు, ఎలక్ట్రాన్లు గురించి తెలుసుకోవడం ఎంత అవసరమో, మన వేదాంతను అర్థం చేసుకోవడానికి కావలసిన పద్ధతులను తెలుసుకోవడం కూడా అంతే అవసరం. మనం జీవం అంటే ఆకాశం లేదా ప్రాణం యొక్క చలనం అని చెబుతాము. ఆ చలనం ఒక సిద్ధాంతం ప్రకారం అమలు జరుగుతూ ఉంటుంది. దానికి వెనకాల సిద్ధాంతం ప్రకారం చలనం కలుగజేసేవాడొకడున్నాడు. మనం ఈ చలనాల గురించి ఎక్కువ మాట్లాడం! వాటికి వెనకాల ఉన్నవాడిని గురించే మనం మాట్లాడతాం. విజ్ఞానశాస్త్ర అంత్యంతో వేదాంతం ఆరంభమవుతుంది. ఇందులో ఏ విధమైన వ్యతిరేకతా లేదు.

గురువు విషయంలో నీకు ఏదో తప్పు అభిప్రాయం ఉండడం వల్ల ఆయనను ఒక వ్యక్తిగా మాత్రమే నువ్వు భావిస్తున్నావు. గురువు అంటే మనకు పిపీలికాది బ్రహ్మపర్యంతం గురించి జ్ఞానాన్ని ప్రసాదించే ఒక దివ్యశక్తి అని తెలుసుకో. నీకు ఎవరు, ఏ విషయాన్ని బోధపరచినా అతడు నీకు గురువే. విజ్ఞానశాస్త్ర జ్ఞానాన్ని నువ్వెలా నేర్చుకున్నావో అదే పద్ధతిలో బ్రహ్మజ్ఞానం కూడా నీకు బోధింపబడుతుంది.

ప్రేమాశీస్సులతో
స్వామి ప్రేమేశానంద

తెలుగు సేత: *కె. త్రివిక్రమరావు*

మనస్సును ఉన్నతస్థాయికి తీసుకొని వెళ్ళాలి. ధర్మ నియమాలను ఉల్లంఘించకూడదు. నీ సుఖం, ఆనందం బాహ్య వస్తువుల్లో కాక, నీ మనస్సుపైనే ఆధారపడి ఉందని గ్రహించు. - బుద్ధుడు

శ్రీరామకృష్ణ మిషన్

స్వామి వివేకానంద రోడ్, రాజమండ్రి-533 105

ఫోన్ : 0883 - 2473112, email : rkmrjy@gmail.com

గోదావరి పుష్కర సేవా కార్యక్రమాలు

విరాళాలకై విన్నపం

రాజమండ్రి, శ్రీరామకృష్ణ మిషన్ 2015 జూలై 14వ తేదీ నుండి 25వ తేదీ వరకు జరుగనున్న పుష్కరాల సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించాలని సంకల్పించింది. 1979లో జరిగిన పుష్కరాల్లో చంటిపిల్లలకు పాలు, పెద్దలకు మజ్జిగ పంపిణీ చేసింది. యాత్రికులకు వైద్య సేవలను అందించింది. 1991లో జరిగిన పుష్కరాల్లో చంటి పిల్లలకు పాలు, హార్లిక్స్, పెద్దలకు మజ్జిగ పంపిణీ చేసింది. యాత్రికులకు వైద్యసేవలను అందించినది. 2003లో జరిగిన పుష్కరాల్లో చంటిపిల్లలకు పాలు, పెద్దలకు మజ్జిగ పంపిణీ చేసింది. యాత్రికులకు భోజన, వైద్య సదుపాయాలను అందించింది.

ఈ సంవత్సరము కూడా 12 రోజుల పాటు ఈ క్రింది సేవా కార్యక్రమాలను నిర్వహించదలచింది.

1) చంటిపిల్లలకు పాలు (రోజుకు 2,000 మంది x రూ.10/-)	రూ.	20,000
2) యాత్రికులకు భోజనము(రోజుకు 5,000 మంది x రూ.40/-)	రూ.	2,00,000
3) యాత్రికులకు మజ్జిగ (రోజుకు15,000 మంది x రూ.6/-)	రూ.	90,000
ఒక రోజుకు అయ్యే మొత్తం ఖర్చు.........	రూ.	3,10,000
12 రోజులకు అయ్యే ఖర్చు రూ.3,10,000 x 12	రూ.	37,20,000
4) వైద్య సదుపాయాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు	రూ.	6,00,000
12 రోజులకు అయ్యే మొత్తం ఖర్చు.......	రూ.	43,20,000

ఈ పుష్కర సేవా కార్యక్రమాల నిర్వహణకు ఉదారహృదయులైన భక్తులు, శ్రేయోభిలాషులు ధన, వస్తు రూపేణ సహాయ సహకారాల్ని అందించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం. మీ విరాళాలను Sri Ramakrishna Mission, Rajahmundry పేరున చెక్కు/డి.డి. తీసి Sri Ramakrishna Mission, Swami Vivekananda Road, Ramakrishna - Vivekananda Nagar, Rajahmundry- 533 105 చిరునామాకు పంపాల్సిందిగా మనవి. మీరిచ్చే విరాళాలకు ఆదాయపు పన్ను చట్టంలోని 80జి సెక్షన్ కింద ఆదాయపు పన్ను మినహాయింపు లభిస్తుంది.

విరాళాలను ఆన్‌లైన్ ద్వారా కూడా పంపవచ్చు. వివరాలు: శ్రీరామకృష్ణ మిషన్, ఆంధ్రా బ్యాంక్, వీరభద్రపురం శాఖ, రాజమండ్రి. అకౌంట్ నంబర్: 062610011010917, IFSC code: ANDB0000626.

ఈ బృహత్ సేవా యజ్ఞానికి మీవంతు ఆర్థిక సహాయాన్ని అందించి, భగవాన్ శ్రీరామకృష్ణుల కృపకు పాత్రులు కాగలరని ఆశిస్తున్నాం.

భగవత్సేవలో

స్వామి కపాలీశానంద

కార్యదర్శి

Advt.,

(...9వ పేజీ తరువాయి)

కల్యాణమయగుణ సంకీర్తనం చేస్తూ, భగవంతుని తత్త్వంలో లీనమై కాలం గడపడమే పరాభక్తి లక్షణం. దీనినే నారదుడు 'సా త్వస్మిన్ పరమ ప్రేమరూపా।*(నారద భక్తిసూత్రాలు-2)*– పరమాత్మపై అపారమైన ప్రేమ కలిగివుండడమే భక్తి' అని నిర్వచించాడు.

హనుమంతునికి శ్రీరాముని ఎడల ఇదే విధమైన భక్తి కలిగింది. పరమ ప్రేమమయమైన భక్తిని అనుభవంలోనికి తెచ్చుకున్న ఆ పవన తనయుడు, చివరికి ఆ అమృతత్త్వంలో లీనమైపోయాడు. మొట్టమొదటిసారిగా ఆయనను దర్శించినప్పుడు ఆయనలోని సుగుణాలను గ్రహించి ప్రేమపూర్వకదాసుడైనాడు. ఆ శ్రీరాముని సత్యనిష్ఠను అవగాహన చేసుకుని పరమభక్తుడైనాడు. శ్రీరాముని ధ్యానిస్తూ, ఆయన తత్త్వంలో పూర్తిగా మునిగిన పిమ్మట, తనకూ, రామునికీ భేదం లేదని తెలుసుకున్నాడు. ఈ విధమైన భక్తి భావనతో మొదలైన హనుమ ద్వైతప్రయాణం, శ్రీరామునితో అభేదాన్ని గుర్తించడంతో, అద్వైత దర్శనంగా పరిణమించి, గమ్యస్థానాన్ని చేరుకుంది. దీనినే స్పష్టంగా హనుమంతుడు రామచంద్రునికి ఈ విధంగా తెలియజేసాడు:

దేహబుద్ధ్యా తు దాసోఽహం జీవబుద్ధ్యా త్వదంశకః ।
ఆత్మబుద్ధ్యా త్వమేవాఽహం ఇతి మే నిశ్చితా మతిః ॥

"ఓ శ్రీరామా! దేహబుద్ధి కలిగి ఉన్నప్పుడు నేను నీ దాసుడను. జీవబుద్ధితో ఉన్నప్పుడు నేను నీ అంశను. ఆత్మబుద్ధి యందు (అనగా, 'నేను' అనే భావన శుద్ధమై నిలిచినపుడు) నీవే నేను అని తెలుసుకుంటున్నాను". ఈ విధంగా భక్తి, జ్ఞానాలు విరుద్ధమైనవి కావు అని మనకు సుస్పష్టంగా తెలియజేసినవాడు హనుమంతుడు.

బహుముఖప్రజ్ఞాశాలి అయినా, ఎందరి నుంచి పొగడ్తలను అందుకున్నా, ఏమీ పట్టనట్లుగా ప్రవర్తించే మహా యోగీశ్వరుడు హనుమంతుడు.

సాధనాపరంగా, హనుమ నుండి గ్రహించవలసినవి అనేకం ఉన్నప్పటికీ, కొన్నింటిని అర్థం చేసుకునే ప్రయత్నం చేద్దాము.

హనుమంతుడు సముద్రాన్ని లంఘించినపుడు త్రోవలో ఆయనకు మూడు ముఖ్య ఆటంకాలు ఎదురైనాయి. ముందుగా, మైనాకుడనే పర్వతరాజు హనుమను ఆపి కొంత తడవు తన శిఖరంపై విశ్రాంతి తీసుకుని వెళ్ళమని కోరగా, కార్యసాధన యందు విశ్రాంతి పనికి రాదని చెబుతూ, మైనాకుడు నొచ్చుకోకుండా తన చేతితో ఆయనను స్పృశించి ముందుకు సాగుతాడు. ఈ సంఘటనతో, హనుమంతునిలో గల కర్తవ్య పరాయణత, కార్యదీక్ష గోచరమవుతాయి.

తరువాత, 'ఆ మార్గంలో వెళ్ళేవారెవరైనా సరే, తన నోటిలోనికి ప్రవేశించవలసినదే' అని పట్టుబట్టిన సురస నోటిలోనికి సూక్ష్మరూపం ధరించి వెళ్ళినట్టే వెళ్ళి తిరిగి బయటకు వచ్చి, ఆమెను మెప్పించిన తీరు హనుమ బుద్ధిసూక్ష్మతను, సమయస్ఫూర్తిని వెల్లడి చేస్తుంది.

ఇంక మూడో విఘ్నంగా, ఛాయాగ్రాహి అయి నీడను పట్టుకుని లాగి సంహరించే ప్రవృత్తి గల సింహిక అనే రాక్షసి ఆటంకపరచగా, ఆ రాక్షసిని సంహరించి మరీ ముందుకు సాగాడు. ఇలా సాగరాన్ని దాటి లంకా నగరాన్ని చేరుకున్న హనుమంతునికి, ఆపైన సీతామాత దర్శన భాగ్యం కలిగింది.

హనుమకు ఎదురైన ఈ మూడు ఆటంకాలను సూక్ష్మంగా పరిశీలిస్తే, ఇవి ప్రతీ సాధకునికీ ఎదురయ్యేవే. ప్రకృతిలోగల మూడు గుణాలైన సత్త్వ, రజస్, తమో గుణాలే ఈ మూడు ఆటంకాలు. సింహిక అనే రాక్షసి తమోగుణానికి ప్రతీకగా నిలుస్తుంది. తమోగుణమంటేనే అలసత్వం, సోమరితనం. ఏమరుపాటుగా, అజాగ్రత్తగా ఉంటే నీడను పట్టుకుని లాగే సింహికలాగా, తమోగుణం సాధకుని పడగొట్టేస్తుంది.

'సురస' రజోగుణానికి ప్రతీకగా నిలుస్తుంది. సురస కర్మల యందు ఆసక్తిని కలుగజేస్తుంది, అహంకారాన్ని ప్రదర్శిస్తుంది. ఈ రజోగుణపు సురస నుండి తప్పించుకునేందుకు, హనుమంతుడు ప్రదర్శించిన సమయస్ఫూర్తి, చాకచక్యం ప్రతీ సాధకుడు అలవరచుకునే ప్రయత్నాన్ని చేయాలి.

ఇక, మైనాకుడు సత్త్వగుణానికి ప్రతీకగా నిలుస్తాడు. సత్త్వగుణం నిర్మలమూ, ప్రకాశవంతమూ అయి అపకారం చేసేది కాకపోయినా, సాధకునిలో సుఖాసక్తిని పెంచి, లక్ష్యసాధనకు ఆటంకంగా నిలుస్తుంది. అందుకే సాధకుడు రజస్ తమో గుణాలను వదిలించుకునేందుకు సత్త్వగుణాన్ని స్పృశించినా, చివరకు దానిని కూడా అధిగమించి, త్రిగుణాతీత స్థితిని చేరుకోవాలి. ఈ భవసాగరాన్ని దాటి ఆ జగన్మాతదర్శనాన్ని ప్రాప్యం చేసుకునేందుకు సాధనాపరంగా త్రిగుణాతీత స్థితికి చేరవలసి ఉంటుందని హనుమంతుడు మనకు ఉపదేశిస్తున్నాడు. ఈవిధంగా సమష్టి, వ్యష్టి దృక్కోణాలననుసరించి,శక్తి సామర్థ్యాలు, కార్యకుశలత, సంభాషణాచాతుర్యం, ఆత్మస్థైర్యం, భక్తి, విశ్వాస, జ్ఞానాలను పెంపొందించుకోవాలనే ఆకాంక్ష ఉన్నవారందరికీ హనుమంతుని చరిత్ర ఆదర్శప్రాయంగా ఎప్పటికీ నిలిచి ఉంటుంది. ❖ **(మే 13వ తేదీన 'హనుమజ్జయంతి')**

జీవన సమరంలో అసూయద్వేషాలు అంటకుండా జీవించాలి. స్వార్థపూరితమైన జీవితం కాకుండా, సత్యధర్మాల బాటలో పయనిస్తే సుఖం, శాంతి, ఆనందం తప్పక లభిస్తాయి.- బుద్ధుడు

(...15వ పేజీ తరువాయి)

సాటి మీరితి వన్నిట మేటివాడు

మహిత రుచి చంద్ర! శ్రీహనుమత్కపీంద్ర! అంటారు. సాహసకార్యాల్లోనే కాదు, సంగీత ప్రావీణ్యంలో కూడా ఆ రామబంటు తనకు తానే సాటి అని నిరూపించుకొని ఆ గానకళలో నారదాదులను కూడా అధిగమించాడు.

మహిమ యేమని చెప్పేమయ్యా...

చేపట్టిన లక్ష్యం పరమ పవిత్రమైనదైనప్పుడు మనలో ఆత్మశక్తి వేయింతలు అవుతుందనడానికి ఆ అనిలుడే నిదర్శనం. జ్ఞానపిపాసతో సాక్షాత్తూ గాయత్రికి సింహాసనమైన సూర్యభగవానుడి వద్దనే విద్యనభ్యసించాలని కపిశ్రేష్ఠుడు సంకల్పించాడు. ఆ మార్తాండుడి వేగానికి సమంగా తన గమన వేగాన్ని పెంచి పాఠానికి సిద్ధమయ్యాడు. తూర్పు పడమర కనుమలపై పాదాలుంచి, గ్రహపతి అయిన దినకరుడికి ప్రదక్షిణ చేసి బ్రహ్మాండమంతా నిండిన విరాట్ స్వరూపంతో విద్యార్థిగా, మార్తాండుని వైపు ముఖం తిప్పి అతని కంటే వేగంగా గమిస్తూ వేదవేదాంగాలు, సకల స్మృతులు, పురాణాలు, ఇతిహాసాలు, సమస్త విద్యలు అభ్యసించాడు. ఆ మహత్తర సన్నివేశాలన్నింటినీ మనోదృష్టితో దర్శించి ఆ సన్నివేశాన్ని సంకీర్తనలో అక్షరీకరిస్తూ అన్నమయ్య...

ఉదయాస్త శైలములు ఒక జంగగా చాచె

అదివో ధ్రువమండల మందె శిరసు

చదివె సూర్యుని వెంట సారె మొగము త్రిప్పుచు

ఎదుట ఈతని మహిమ యేమని చెప్పేమయ్యా... అని అచ్చెరువొందుతున్నాడు. ఈ రూపంలో హనుమంతుణ్ణి ఉపాసన చేసిన భక్తులకు ఆ శక్తిసామర్థ్యాలు సంప్రాప్తించడమే కాకుండా ఇహపరాలు సిద్ధిస్తాయనడంలో సంశయం లేదు. ఆ పరంపరలో మారుతి మహాభక్తులు...

బుద్ధిర్బలం యశోధైర్యం నిర్భయత్వం అరోగతా ।

అజాడ్యం వాక్పటుత్వం చ హనుమత్ స్మరణాత్ భవేత్ ॥

'హనుమంతుని స్మరణతో బుద్ధిబలమూ, కీర్తి, ధైర్యమూ, ఆరోగ్యమూ, వివేకమూ, వాక్పటుత్వమూ ప్రాప్తిస్తాయి' అని విశ్వసిస్తారు.

ప్రతాప మరుదరుదయ్యా...

రామకార్యార్థం రంగంలోకి దిగిన ఆంజనేయుడు లంకలో తన విశ్వరూపాన్ని కనబరుస్తూ బ్రహ్మాండం దాకా తోక మీది కెత్తాడు; దిక్కుల నిండా తన దేహాన్ని వ్యాపింపచేశాడు; రాక్షసులను మట్టి కరిపించాడు. ఇంతటి వాయుపుత్రుడి ప్రతాపం కడు అరుదైనదని అన్నమాచార్యులు అభివర్ణిస్తూ...

దండిగా బ్రహ్మాండము దాక తోక మీదికెత్తె

మెండుగ దిక్కుల నిండా మేను పెంచెను

గుండు గూడ రాకాసుల కొట్టగ చేతులు చాచె

అండ ఈతని ప్రతాప మరుదరుదయ్యా ॥ అంటున్నాడు.

మన మనస్సనేది కూడా ఓ లంకానగరమే! సీతమ్మను ఆవరించినట్లు చిత్తవృత్తులనే రాక్షసులు మన ఆత్మను ఆవరించాయి. ఆ లంకానగరంలోకి ఒక్కసారి అంజనీపుత్రుడు ఆగమిస్తే, వికృతచేష్టలతో స్వైరవిహారం చేస్తున్న రాక్షసులు పలాయనం చిత్తగించి జీవాత్మ, పరమాత్మతో కలసి మన జీవితం కూడా సుందరకాండలా శోభిస్తుంది. రామాయణంలోని ఆ కాండ పారాయణం వెనుక అదే పరమార్థం! రామాయణంలోని ఆ ఘట్టాల్ని చదివినా, విన్నా పుణ్యఫలం.

ఆ అమిత పరాక్రముడు అనితర సాధ్యంగా సీతాన్వేషణ మహత్కార్యాన్ని పూర్తి చేసినా, అంతా రామ మహిమేనని నిజమైన కర్మయోగిలా కర్తృత్వాన్ని మాత్రం తన దైవానికే ఇచ్చేశాడు. అందుకే సాక్షాత్తూ ఆ శ్రీరామచంద్రుడి హృదయాన్ని గెలుచుకున్నాడు. ఆ భావనతో ఆధ్యాత్మ రామాయణంలో వ్యాసుడు...

యత్పాద పద్మయుగళం తులసీదళాద్యైః

సంపూజ్య విష్ణుపదవీమ్ అతులాం ప్రయాంతి ।

తేనైవ కిం పునరసౌ పరిరబ్ధమూర్తీ

రామేణ వాయుతనయః కృతపుణ్య పుంజః ॥

'ముని పాదపద్మాలను తులసీదళాదులతో పూజించినవారు సాటిలేని పరమపదాన్ని పొందుతారు. అలాంటి శ్రీరామచంద్రుడే పుణ్యాల రాశియైన హనుమంతుని అనుగ్రహించి, స్వయంగా ఆయనకు తన ఆలింగన సుఖాన్ని ప్రసాదించాడు. ఆ మారుతి భాగ్యాన్ని ఎంతని కొనియాడగలమ'ని అంటారు.

మిక్కిలి మేలుమేలయ్యా...

శ్రీరాముడు లంకకు సేతువును నిర్మించే సందర్భంలో హనుమంతుడు ప్రతి రోమం చేత మహాశిలలను సైతం బంధించి పూలబంతుల్లా అలవోకగా తెచ్చి వారధికి సాయపడ్డాడు. రాముడిని తన భుజపీఠంపై ఆసీనుడిని గావించుకొని ముందుకు నడిచాడు. ఆ సుమధుర ఘట్టాలను సుందరమైన పదాలతో పొదుగుతూ పదకవితా పితామహుడు...

దిక్కులు పిక్కటిల్లగ దేహ రోమములు పెంచె

పక్కన లోకములకు ప్రాణమై నిల్చె

ఇక్కడ శ్రీవేంకటేశు హితవరి బంటాయ

మిక్కిలి ఈతని లావు మేలుమేలయ్య ॥

'దేహరోమాలను దీర్ఘంగా పెంచుకొని, అన్ని లోకాలకూ ఆయనే ప్రాణమై నిలిచాడు. కలియుగంలో శ్రీవేంకటేశ్వరుడిగా కొలువుతీరిన కోదండరాముడికి బంటుగా భక్తులనూ కాపాడుతున్నాడు' అని తన పదామృతాన్ని వర్షింపచేస్తూ ముక్తాయింపు పలుకుతున్నాడు. ❖

వికాస మంత్రాలు

- స్వామి పార్థసఖానంద

నేను పరీక్షల్లో కొన్ని తప్పాను, నా స్నేహితుడేమో అన్నిటిలోనూ ఉత్తీర్ణుడు అయ్యాడు. అతడు ఇప్పుడు మైక్రోసాఫ్ట్‌లో ఇంజనీరుగా పనిచేస్తున్నాడు, నేనేమో ఆ సంస్థకు అధిపతిగా ఉన్నాను!' అని బిల్‌గేట్స్ అంటారు.

కాబట్టి ఏవో కొన్ని పరీక్షల్లో తప్పామని ఏడవాలా? జీవితంలో ఎదుర్కోబోయేవి అసలైన పరీక్షలు కావా?... ఆలోచించాల్సిన విషయమే!

ప్రతీకారం అంటే... కుక్క మనల్ని కరిచిందని, మనం కుక్కను కరవడం లాంటిది. ప్రతీకారం సాధారణంగా ఓ చిన్న ఒప్పుని చాలా పెద్ద తప్పుగా మారుస్తుంది. ప్రతీకారానికి అంతు అనేది లేదు. కన్నుకు కన్నే సమాధానమైతే మిగిలేది చీకటే!

మన నైపుణ్యాలతో మనం ఉన్నత స్థానాన్ని పొందవచ్చు, కానీ దాన్ని కాపాడుకోవాలంటే మాత్రం మనకు ఉన్నతమైన వ్యక్తిత్వం ఉండాలి. సామాన్యులు సౌశీల్యం కన్నా సౌందర్యాన్నే నమ్ముకుంటారు. ఎందుకంటే, వారికి బుద్ధికన్నా కంటి చూపే బలంగా ఉంటుంది.

నవ్వడానికి కేవలం 16 కండరాలే కావాలి, అదే మొహం చిట్లించడానికైతే 72 కండరాలు కావాలి. ఏది సులభమో మీరే తేల్చుకోండి!



మనం ప్రశాంతంగా బతకాలనుకుంటే... తెలిసిందల్లా మాట్లాడకూడదు, చేతనయ్యిందల్లా చెప్పకూడదు, ప్రతి ఒక్కరిలోనూ తప్పొప్పులు ఎంచుతూ పోకూడదు.

- స్వామి పరిజ్ఞేయానంద

సమభావమే శాంతిపథం!

ఈ ప్రపంచంలో కేవలం ఆత్మానందంలో ఓలలాడే బ్రహ్మజ్ఞాని తప్ప, మిగిలినవాళ్ళంతా ఏదో ఒక కర్మ చేస్తూ ఉండాల్సిందే! అలా కర్మలు చేస్తున్నప్పుడు సుఖదుఃఖాలు, లాభనష్టాలు, జయాపజయాలు కలుగుతాయి. ఈ ద్వంద్వ ఫలితాల వలన మనస్సు సమత్వాన్ని కోల్పోయి అశాంతికి గురవుతుంది. అలాంటప్పుడు మనిషి ప్రశాంతంగా ఎలా జీవించగలడనే సందేహం కలుగుతుంది. అందుకు భగవాన్ శ్రీకృష్ణుడు కర్మల ద్వారానే కర్మరాహిత్య స్థితిని పొందవచ్చునీ; కర్మఫలితాల పట్ల సమత్వభావాన్ని అలవరచుకొని కర్మలను ఆచరించాలనీ కర్మయోగ రహస్యాన్ని అర్జునుడికి వివరిస్తూ...

సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ ।
తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాప మవాప్స్యసి॥ *(గీత. 2-38)*

'సుఖదుఃఖాలనూ, లాభనష్టాలనూ, జయాపజయాలనూ సమానంగా భావించి యుద్ధం చేస్తే పాపమును పొందవు' అంటూ అనుష్ఠాన వేదాంతాన్ని బోధించాడు.



సాధారణంగా మన సుఖదుఃఖాలకు కారణం మనం చేసే కర్మలే అని అనుకుంటాం. కానీ రాగద్వేషాలతో చేసే కర్మలే అందుకు కారణంగానీ, కర్మలు చేయడం వల్ల మాత్రం కాదు. 'సుఖానుశయీ రాగః - సుఖాన్ని కలిగించే వాటిపట్ల రాగం కలుగుతుంది'. 'దుఃఖానుశయీ ద్వేషః - దుఃఖాన్ని కలిగించే వాటిపట్ల ద్వేషం కలుగుతుంది' అని రాజయోగం వివరిస్తోంది.

అందుకే మహాత్మా గాంధీజీ 'Attachment, aversion are also diseases and worse than bodily ailments - మానసిక రుగ్మతలైన రాగద్వేషాలు, శారీరక రుగ్మతలకన్నా ప్రమాదకరమైనవి' అని అన్నారు. దుర్యోధనుడికి రాజ్యంపై రాగం, పాండవులపై ద్వేషం ఉండడం వల్ల అతడి జీవితం దుఃఖమయంగా సాగింది. కాబట్టి రాగద్వేషాలను త్యజించినప్పుడే ద్వంద్వ ఫలితాలను సమభావంతో స్వీకరించడం సాధ్యమవుతుంది.

మన సుఖదుఃఖాలకు రాగద్వేషాలే కారణం కాబట్టి వాటికి అతీతంగా కర్మలను ఆచరించినప్పుడు మనం చేసే ప్రతీ కర్మ, కర్మయోగమవుతుంది. అప్పుడు కర్మ ఫలితాలు అనుకూలమైనా, ప్రతికూలమైనా మనోనిశ్చలతను భంగపరచలేవు. అశాంతిని కలిగించలేవు. అందుకే స్వామి వివేకానంద "మనం అనుభవించే సుఖదుఃఖాలకు కారణం మనం చేసే కర్మలు కాదు. ఆ కర్మల పట్ల మనం ఏర్పరచుకున్న 'నాది' అనే మమకారమే!" అని అంటూ ఇలా వివరించారు:

"ఒక వ్యక్తి దగ్గర ఓ అద్భుతమైన చిత్రం ఉంది. అది కాలి బూడిదైపోతే మనకు ఎలాంటి దుఃఖం కలగదు. కానీ మనదగ్గరున్న అలాంటి చిత్రమే కాలి బూడిదైపోతే ఎంతో దుఃఖిస్తాం. రెండు చిత్రాలూ అద్భుతమైనవే అయినప్పటికీ మన ప్రతిస్పందనలో భేదం ఉంది. అందుకు కారణం 'ఈ చిత్రం నాది' అనే మమకారమే! ఈ మమకారమే స్వార్థానికి దారి తీస్తుంది. స్వార్థం దుఃఖానికి హేతువు".

అయితే, ఏ కర్మా చేయకుండా ఉంటే మమకారం లేకుండా జీవించవచ్చు కదా! అందుకు సమాధానంగా మమకారభావం మనస్సు నుండి తొలగనిదే అరణ్యాలకు వెళ్ళినా ఆనందంగా జీవించలేమంటూ స్వామి వివేకానంద 'రాజసింహాసనాన్ని అధిరోహించినా అనాసక్తిభావంతో కర్మలను నిర్వహించే వ్యక్తి ప్రశాంతంగా ఉండగలడు. బికారి అయినప్పటికీ రాగభావంతో జీవిస్తే దుఃఖాన్ని అనుభవిస్తాడు. అందువల్ల ముందు మమకారరాహిత్యభావాన్ని అలవరచుకొని కర్మలను ఆచరించు' అని సూచించారు.

అలాంటి అనాసక్తి భావంతో, మమకారరాహిత్యంతో రాజ్యపాలన చేసిన జనకమహారాజు మానసిక స్థితిని స్వామీజీ వివరిస్తూ 'మిథిలా నగరం అగ్నికి ఆహుతైపోతుందన్న వార్త విన్నప్పటికీ జనకమహారాజు మనోనిశ్చలతను కోల్పోలేదు. జనకుడు మహోన్నత కర్మయోగి' అని శ్లాఘించారు.

అయితే, జనకమహారాజులాగ అనాసక్తిభావంతో కర్మలను ఆచరించడం అంత సులభమైన విషయమేమీ కాదు. కానీ భగవదర్పిత భావంతో కర్మలను చేయగలిగితే మమకారరాహిత్య స్థితిని పొందవచ్చు. ఇలా నిబద్ధతతో, అప్రమత్తతతో అభ్యాసం చేస్తూ ఉంటే కర్మఫలితాల పట్ల క్రమేణ సమభావాన్ని పెంపొందించుకొని, శాంతిపథంలో పయనించగలుగుతాం. ❖

సృష్టిలో అన్నీ పనికొచ్చేవే !

రామాపురం అనే ఊరిలో శంకరశాస్త్రి అనే గురువు ఉండేవారు. ఆ గురువుకు ఇద్దరు శిష్యులు. ఒకరు రాము, మరొకరు రాహుల్. ఇద్దరూ గురువుపట్ల విధేయత కలిగిన శిష్యులే. గురువు మాటను జవదాటేవారు కాదు. ఇద్దరూ విద్యాభ్యాసం పూర్తి చేశారు.

గురుదక్షిణగా ఏమి ఇవ్వాలని గురువుని అడిగారు. అందుకు గురువు "మన ఆశ్రమం వెనుక ఒక అరణ్యం ఉంది. ఆ అరణ్యానికి వెళ్ళి ఎండుటాకులు తెచ్చి ఇవ్వండి. అవే మీరు నాకు ఇచ్చే గురుదక్షిణ. అయితే ఏ ప్రాణికీ హాని జరగకుండా తీసుకురండి" అని చెప్పారు.

శిష్యులు "ఏమిటి! గురువుగారు ఎండుటాకులను గురుదక్షిణగా ఇవ్వమంటున్నారు?" అని అనుకుంటూ గురువుగారి ఆజ్ఞను శిరసావహించాలి కాబట్టి వారిద్దరూ అడవికి వెళ్ళారు.

అడవిలో వారికి ఒక ఎండుటాకుల కుప్ప కనిపించింది. దానిని తీసుకోవాలని అనుకుంటారు. ఇంతలో ఒక వృద్ధుడు వచ్చి "అయ్యా! నేను ఈ అడవి అంతా తిరిగి ఎంతో కష్టపడి ఎండుటాకులను సేకరించి కుప్పగా వేశాను. ఈ ఎండుటాకులను కాల్చగా వచ్చిన బూడిదను నా పొలంలో చల్లితే పంటలు బాగా పండుతాయి. ఆ పంటలను అమ్మగా వచ్చిన డబ్బుతో నా కుటుంబాన్ని పోషించుకుంటాను. కాబట్టి మీరు దయచేసి ఈ ఎండుటాకులను తీసుకువెళ్ళవద్దు" అని అంటాడు.

శిష్యులు చేసేదేమీలేక ముందుకు సాగిపోయారు. అలా వెళుతుండగా దారిలో వారికి ముగ్గురు ఆడవాళ్ళు కనిపిస్తారు. వారు కూడా ఆకులు ఏరి పోగు చేస్తుంటారు. శిష్యులు ఆ స్త్రీల వద్దకు వెళ్ళి "ఈ ఆకులతో మీరు ఏమి చేస్తారు?" అని అడుగుతారు. ఆ ముగ్గురు స్త్రీలు ఈ విధంగా జవాబులిస్తారు :

మొదటి స్త్రీ: నేను ఈ ఆకులతో విస్తర్లు కుట్టి అమ్ముతాను. ఇదే నా బ్రతుకు తెరువు.

రెండవ స్త్రీ: నేను ఈ ఆకులను చలికాలంలో మంటవేసి చలికాచుకోవడానికి ఉపయోగిస్తాను.

మూడవ స్త్రీ: నేను ఈ ఆకులను వంటచేయడానికి ఉపయోగిస్తాను.

శిష్యులు మరికొంచెం ముందుకు వెళ్ళగా వారికి దారిలో మరలా ఎండుటాకులు కనిపిస్తాయి. ఆ ఆకుల్ని తీసుకుందామని అనుకుంటుండగా ఒక పక్షి వచ్చి "ఈ ఆకులను గూడును నిర్మించుకోవడానికి ఉపయోగించుకుంటాను" అని అన్నది.

ఇద్దరు శిష్యులూ ఇంకా ముందుకు వెళుతుండగా దారిలో ఒక చెరువు కనపడుతుంది. ఆ చెరువులో వారికి ఒక ఎండుటాకు కనిపిస్తుంది. ఆ ఆకును తీసుకుంటుండగా దాని మీద రెండు చీమలు కనిపిస్తాయి. ఆ రెండు చీమలూ "మేము ఈ చెట్టు మీద నుండి జారి ఈ ఆకు మీద పడ్డాము. ఈ ఆకులేకపోతే మేము చెరువులో మునిగిపోతాం. దయచేసి మా ప్రాణాలకు హాని కలిగించవద్దు" అని వారిని ప్రార్థిస్తాయి.

ఆశ్రమానికి తిరిగి వెళ్ళిపోతుండగా వారికి ఒక వ్యక్తి కనపడతాడు. ఆ వ్యక్తి కూడా ఎండుటాకులను పోగుచేస్తూ కనిపించాడు. శిష్యులు అతని వద్దకు వెళ్ళి "ఈ ఆకులు ఎందుకు?" అని అడుగుతారు. అప్పుడతను "నేను ఈ ఆకులతో ఔషధం తయారుచేస్తాను" అని చెప్తాడు.

ఇక చేసేదేమీలేక శిష్యులు నిరాశతో ఆశ్రమానికి వెనుదిరుగుతారు. గురుదక్షిణ ఇవ్వలేక పోతున్నందుకు బాధపడుతూ జరిగినదంతా గురువుగారికి వివరిస్తారు. అప్పుడు గురువు చిరునవ్వు నవ్వి "ఈ సృష్టిలో వ్యర్థమైనదేదీ లేదని మీరు నేర్చుకున్న విజ్ఞానమే నాకు మీరిచ్చే గురుదక్షిణ" అని అంటారు. ❖

నీతి:
1. భగవంతుడు సృష్టించిన ప్రతీదీ అవసరమైనదే.
2. ఏ ప్రాణికీ హాని కలిగించకూడదు.
3. గురువు మాటను శిరసావహిస్తే మనం చాలా విషయాలను నేర్చుకోవచ్చు.

– జె.గాయత్రి, 9వ తరగతి
(విజయవాడ, రామకృష్ణ మిషన్
ఉన్నత పాఠశాల విద్యార్థిని)

ఒక కథ చెబుతా... 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రిక ఉన్నత పాఠశాల విద్యార్థులలో వ్యాసరచన ప్రతిభను ప్రోత్సహించడం కోసం, సద్భావాలను పెంపొందించడం కోసం 'ఒక కథ చెబుతా...' శీర్షికను ప్రారంభించింది. ఈ శీర్షికలో ప్రచురించడానికి విద్యార్థుల నుండి నీతి కథలు, వ్యక్తిత్వవికాస కథలు, స్ఫూర్తిదాయక కథలు, ఆధ్యాత్మిక కథలను ఆహ్వానిస్తోంది. వ్యాసాలను చక్కని దస్తూరీతో సరళభాషలో రాసి, మీ పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను జతపరచి పంపించండి. మీ పూర్తి చిరునామాను పొందుపరచండి. ఎంపికైన కథలకు బహుమతి లభిస్తుంది.

వ్యాసాలను పంపించాల్సిన చిరునామా : సంపాదకులు, శ్రీరామకృష్ణ ప్రభ, రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాద్-500 029. E-mail : sriramakrishnaprabha@gmail.com

అక్బర్ అభిలాష

చిత్ర కథ: ఎం. భైరవ సుబ్రమణియం   చిత్రాలు: దాకోజు శివప్రసాద్   అనుసృజన: స్వామి జ్ఞానదానంద



5
రాజభోగాల్లో మునిగితేలుతున్న అక్బర్ చక్రవర్తికి రామదర్శనం పొందడానికి కావలసిన అర్హతలను తులసీదాసు తెలిపాడు.
రాజా! రామదర్శనం పొందడానికి మొదటి అర్హత నిష్కళంక భక్తి. కామం ఉన్న చోట రాముడు ఉండడు.
ఇలాంటి నియమాలు మీ వంటి వారికే వర్తిస్తాయి దాసుగారూ! నేనో చక్రవర్తిని. రాముడూ చక్రవర్తే! ఒక చక్రవర్తి, మరో చక్రవర్తిని చూడగోరడం సహజమే కదా!
6
రామ దర్శనానికి కావాల్సిన అర్హతలను తులసీదాసు వరుసగా చెబుతూ ఉంటే అక్బర్ అసహనంతో ఉగ్రుడయ్యాడు. అధికారం చలాయిస్తూ, రాముణ్ణి చూపమని బలవంతపెట్టాడు.
రాజా! భక్తి లేకుండా రాముణ్ణి దర్శించడం సాధ్యం కాదు.
7
నేను ఇంతగా అడుగుతున్నప్పటికీ నా కోర్కెను నెరవేర్చని ఈతణ్ణి బంధించండి!
రాజా! ఇదీ ఆ రాముని లీలే!
తులసీదాసు మహత్వం తెలిసిన ఒక మంత్రి జోక్యం చేసుకొన్నప్పటికీ అక్బర్ మనస్సు మారలేదు. తులసీదాసు చెరసాల పాలయ్యాడు. సభికులు ఆందోళన చెందారు.
8
చెరసాలలో తులసీదాసు స్వేచ్ఛగా రామ భజన చేయలేక తపించాడు. అప్పుడు హఠాత్తుగా హనుమంతుడు ఆయన ఎదుట ప్రత్యక్షమయ్యాడు.
ఏం స్వామీ! తులసికి ఈ చెరసాలవాసం?
నాయనా! నువ్వు అప్పుడే చెప్పావే-ఇదీ రాముని ఇచ్ఛయే అని!
రాజు విషయం నేను చూసుకొంటాను, నువ్వు రామజపంలో లయించు.

9
మర్నాడు అక్బర్ నిద్రిస్తున్నప్పుడు అంతఃపురంలో పిడుగులు పడ్డట్లు పెద్ద శబ్దం వినిపించింది. పది పెద్ద కోతులు అటూ ఇటూ గెంతుతూ, కనిపించిన అన్నింటినీ ధ్వంసం చేయసాగాయి. గాభరాగా లేచిన అక్బర్ కోపంతో...
నా అంతఃపురంలో ప్రవేశించిన వారికి శిరచ్ఛేదం చేయండి.
10
రాజా! వచ్చింది మనుషులు కారు, కోతులు. అవి మన కాపలావారి నందరినీ చంపివేశాయి.
అలాగా! వెంటనే మంత్రులను సమావేశ మందిరానికి రమ్మను.
11
సమావేశమైన మంత్రులలో ఒకరు రామభక్తుడు.
మహారాజా! వచ్చినవి మామూలు కోతులు కావు, రామ పరివారం! ఆంజనేయుని అంశలు! మనం భక్తుడైన తులసీదాసుకు చేసిన అపచారం వల్ల ఇదంతా జరిగింది. తులసీదాసును ముందు విడుదల చేయండి.
12
రాజా! తమ సాహేబా బేగం గదిలోని విదేశీ అద్దాన్నీ కోతులు ముక్కలు ముక్కలు చేశాయి.
ఆ! విదేశీ అద్దం బద్దలైందా!
అక్బర్ రక్తం మరిగి పోయింది. వెంటనే తులసీదాసును తీసుకురమ్మని ఆజ్ఞాపించాడు.
13
రాజసభకు వచ్చిన తులసీదాసుతో జరిగినదంతా ప్రధానమంత్రి చెప్పాడు.
తులసీదాసుగారూ! మీరు వెంటనే కాశీకి తిరిగి వెళ్ళిపోండి.
రాజా! రామచంద్రప్రభు మీ పట్ల కరుణించి ఆయనే స్వయంగా మిమ్మల్ని చూడ వస్తాడని అనిపిస్తోంది.



మామూలు అద్దం మీద బొమ్మలు పడవు. కానీ రసాయనాలు పూత పూసిన అద్దం మీద ఛాయాచిత్రం పడుతుంది. అలాగే మానవ హృదయం మీద భక్తి అనే రసాయనం పూసిన పక్షంలో దాని మీద భగవత్ ప్రతిబింబం చక్కగా పడుతుంది.

- శ్రీరామకృష్ణ పరమహంస



రజతోత్సవ వేడుకలు

తూర్పుగోదావరి జిల్లాలోని **వేట్లపాలెం శ్రీరామకృష్ణ సేవాసమితి** 25 వసంతాలను పూర్తిచేసుకుంది. ఈ సందర్భంగా 2015 మార్చి 22వ తేదీన రజతోత్సవాలను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం శోభాయాత్ర, పూజ, హోమం, భజనలు, స్వామి వివేకానంద విగ్రహావిష్కరణ జరిగాయి.

ఈ ఉత్సవాల్లో స్వామి ఆత్మవిదానందజీ, విశాఖపట్నం; స్వామి శశికాంతానందజీ, విజయవాడ; స్వామి నిరంతరానందజీ, జమ్మూకశ్మీర్; స్వామి అక్షరాత్మానందజీ, చెంగల్పట్టు; స్వామి పరిజ్ఞేయానందజీ, హైదరాబాద్; స్వామి సంకర్షణానందజీ, జమ్మూకశ్మీర్; స్వామి గుణసాగరానందజీ, చెన్నై పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ ఉత్సవాల్లో సుమారు 1,200 మంది భక్తులు పాల్గొన్నారు. ❖ నివేదిక : వల్లూరి వీరభద్రరావు

సహాయక చర్యలు

విశాఖపట్నం రామకృష్ణ మిషన్ ఆశ్రమ విశాఖపట్నం జిల్లాలో విధ్వంసం సృష్టించిన హుద్‌హుద్ తుపాను బాధితులకు సహాయక చర్యల్లో భాగంగా జిల్లాలోని 39 గ్రామాలలో 2,500 కుటుంబాలకు కిరాణా సామగ్రి, పారిశుద్ధ్య సామగ్రి, బట్టలు, ఇతర నిత్యావసర వస్తువులను; 155 గిరిజన ప్రాంతాలలో 5,000 కుటుంబాలకు 5,000 సౌర విద్యుత్ దీపాలను, 10,000 దుప్పట్లను పంపిణీ చేసింది. ఈ సహాయక చర్యల నిమిత్తం 90 లక్షల రూపాయలను ఖర్చు చేసింది. మారుమూల గ్రామాలలో నియత విద్యాకేంద్ర భవనాల నిర్మాణాన్ని చేపట్టింది. ❖

నివేదిక : స్వామి నిత్యయోగానంద

Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust
and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020
and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**

Vol.72-5, Sri Ramakrishna Prabha (Telugu Monthly) May 2015, Regd. with the Registrar of Newspaper for India Under No.1120/57. Postal Registration No. HD-1071/2013-15. Licensed to Post Under WPP : AP/CPMG/HC-13/WPP/2015-16. Date of Publication : 16 April 2015

With Best Compliments From

పక్యాల భాస్కర రావు, మేనేజింగ్ డైరక్టర్ & **పక్యాల గిరిజ,** డైరక్టర్

SVIS LABS LIMITED

SVISS LABSS LIMITED

(Manufacturers of Active Pharmaceutical Ingredients and Intermediates)

TÜV TÜV CERT DIN EN ISO 9001 : 2000 Certificate : 01 100 058568

Regd. Off. & Fact. : Plot No.88 & 89, Phase - II,
SIPCOT Industrial Complex, Ranipet - 632 403, Tamil Nadu.
Phone : 04172 - 244820, 651507, Tele Fax : 04172 - 244820
E-mail : rao@svisslabss.net Web Site : www.svisslabss.net

SVISS LABSS కంపెనీ వారు ‘శ్రీరామకృష్ణ ప్రభ’ మాసపత్రికను 2,000 పాఠశాలలకు స్పాన్సర్ చేశారు.

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

జూన్ 2015

₹10

ఎందరో మహానుభావులు అందరికీ వందనములు

సుబోధ

భక్తుడు: ఎవరైనా తల్లి తన బిడ్డతో 'దక్షిణేశ్వరాలయానికి వెళ్ళవద్దు. అలా వెళ్ళినట్లయితే నా రక్తం తాగినంత ఒట్టు' అని అంటే ఏం చేయాలి?

శ్రీరామకృష్ణులు: అలా మాట్లాడే తల్లి తల్లే కాదు; ఆమె అవిద్యారూపిణి. అట్టి తల్లి మాట వినకపోయినా తప్పు లేదు. అటువంటి తల్లి భగవదన్వేషణ మార్గంలో విఘ్నం కలిగిస్తుంది. భగవంతునికై పెద్దవారి మాటలను ఉల్లంఘించడంలో తప్పు లేదు. శ్రీరాముడి కోసం భరతుడు కైకేయి ఆదేశాన్ని ధిక్కరించాడు. శ్రీకృష్ణుణ్ణి దర్శించడానికి గోపికలు తమ భర్తల ఆజ్ఞలను ఉల్లంఘించారు. శ్రీమన్నారాయణుని కోసం ప్రహ్లాదుడు తండ్రి మాటను జవదాటాడు. భగవంతునికి ప్రీతి చేకూర్చడానికై గురువైన శుక్రాచార్యుల ఉపదేశాలను బలిచక్రవర్తి పెడచెవిన పెట్టాడు. అయితే ఒక్క విషయం జ్ఞాపకం ఉంచుకో – 'భగవదన్వేషణ మార్గంలో పోవద్దు అన్నమాట తప్ప తక్కినవన్నీ శిరసావహించాలి సుమా!'

భక్తుడు: మీ నామం పలికి రోగాలు నయం చేయగలనని ఒక భక్తుడు అప్పుడప్పుడు చెబుతున్నాడు.

శ్రీరామకృష్ణులు: సిద్ధులను కోరుకొనేది హీనులే. వ్యాధులు నయం చేయడం, వ్యాజ్యాలు గెలిపించడం, నీళ్ళ మీద నడవడం మొదలైన సిద్ధులను వారు ఆకాంక్షిస్తారు. శుద్ధభక్తులు భగవంతుని పాదపద్మాలను తప్ప అన్యం దేనినీ కాంక్షించరు. హృదయ్ నాతో ఒకసారి 'మామా! అమ్మ వద్ద ఏవైనా శక్తులు, సిద్ధులు కోరుకో' అన్నాడు. నాది బాలక స్వభావం కదా! కాళీ ఆలయంలో జపం చేసేటప్పుడు అమ్మతో ఇలా అన్నాను: 'అమ్మా! హృదయ్ నన్ను నీ నుండి కొన్ని శక్తులు, సిద్ధులను కోరుకోమన్నాడు'. అప్పుడు అమ్మ 'సిద్ధులనేవి వృద్ధవేశ్య మలం లాంటివ'ని నాకు వెల్లడించింది.

ఎవరికైనా కొద్దిపాటి సిద్ధులు కలిగితే చాలు అతడికి పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. అతడి గురించి లోకులు ఇలా అంటూంటారు: 'ఓహ్! ఫలానా వ్యక్తికి చాలామంది శిష్యులు, సేవకులు తయారయ్యారు. ఇంట్లో ఎన్నో వస్తువులు కుప్పలు తెప్పలుగా పడివున్నాయి. జనం అతడికి పలురకాల కానుకలు చెల్లిస్తుంటారు. అతడు తలచుకుంటే ఎంతోమందికి భోజనం పెట్టించగలడు.'

కానీ, 'గురుగిరి' వేశ్యవృత్తి లాంటిది. తుచ్ఛమైన ధనం, పేరు ప్రతిష్ఠలు, శారీరక సుఖం–వీటి కోసం తన్ను తాను అమ్ముకోవడమా! ఏ శరీరం, మనస్సు ద్వారా భగవత్ ప్రాప్తిని పొందగలమో ఆ శరీరం, మనస్సులను సామాన్య వస్తువుల కోసం అమ్ముకోవడం మంచిది కాదు. ❖

శ్రీరామకృష్ణ ప్రభ
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాదు–500 029
ఫోన్: 040–27667799, సెల్: 8801849494
E-mail : sriramakrishnaprabha@gmail.com
నిర్వాహక సంపాదకులు: స్వామి జ్ఞానదానంద
సంపాదకులు: స్వామి పరిజ్ఞేయానంద

ఆధ్యాత్మిక అమృతవాహిని
శ్రీ రామకృష్ణ ప్రభ

సంపుటం: 72 సంచిక: 6 జూన్ 2015



సత్యాన్న ప్రమదితవ్యమ్, ధర్మాన్న ప్రమదితవ్యమ్,
కుశలాన్న ప్రమదితవ్యమ్, భూత్యై న ప్రమదితవ్యమ్,
స్వాధ్యాయ ప్రవచనాభ్యాం న ప్రమదితవ్యమ్,
దేవపితృకార్యాభ్యాం న ప్రమదితవ్యమ్,
మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ, అతిథిదేవో భవ॥

సత్యమార్గం నుండి మరలకుము, ధర్మమార్గం నుండి మరలకుము, ఆత్మసంరక్షణ నుండి మరలకుము, స్వాధ్యాయ ప్రవచనాల నుండి మరలకుము, దేవ పితృ కర్మల నుండి మరలకుము. తల్లీ, తండ్రీ, గురువూ, అతిథులనూ దైవసమానులుగా తలచి పూజింపుము.

(అధ్యయనానంతరం గురువు శిష్యునికి చేసిన బోధ - 'తైత్తిరీయోపనిషత్తు')

సూక్తి సౌరభం

అంజలిస్థాని పుష్పాణి
వాసయన్తి కరద్వయమ్।
అహో! సుమనసాం ప్రీతిః
వామ దక్షిణయోస్సమమ్॥

"దోసిలిలోని పూల వల్ల సువాసన రెండు చేతులకు సమానంగా అంటుకుంటుంది. ఆ పరిమళానికి కుడిచేయి, ఎడమచేయి అనే భేదం లేదు. అలాగే, మంచి మనసున్నవారు కూడా అందరినీ సమభావంతో ఆదరిస్తారు."

కడుపు చిచ్చు చేత, కామానలము చేత
క్రోధ వహ్ని చేత కుతిలపడక, యుక్త
మనసుతోడ నుండును - సుజనుడు
విశ్వదాభిరామ వినుర వేమ!

"ఓ వేమా! జఠరాగ్ని - పొట్టను; కామాగ్ని - దేహాన్ని; క్రోధాగ్ని - మనస్సుని కాల్చే ప్రయత్నం చేస్తున్నప్పటికీ సజ్జనుడు ఆ త్రితాపాలకు చలించడు."



శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి



ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'కి ధన దానం చేసి ప్రోత్సహించాల్సిందిగా కోరుతున్నాం. దాతల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు......	రూ.	10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజపోషకులు............	రూ.	5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు.................	రూ.	1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

	దాత పేరు	ఊరు	రూ.
రాజపోషకులు :	శ్రీమతి కాదా పద్మావతమ్మ,	రాజేంద్ర నగర్, మహబూబ్ నగర్ (కీ॥శే॥ కాదా బాబూరావు గారి జ్ఞాపకార్థం)	5,000
రాజపోషకులు :	శ్రీ కొల్లిపర గజాననలింగం,	తూ.గో. జిల్లా. (తల్లిదండ్రులు కీ॥శే॥ కొల్లిపర వేంకటలలితాంబ &ప్రసాదలింగంగార్ల జ్ఞాపకార్థం)	5,000

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

యువతరానికి 'శ్రీరామకృష్ణ ప్రభ'ను మరింత చేరువ చేయాలని సంకల్పించాం. రాష్ట్రంలోని వివిధ పాఠశాలలు/ కళాశాలలు/ గ్రంథాలయాలకు పత్రికను పంపించడానికి మీ సహాయాన్ని కోరుతున్నాం. ఈ కానుక పథకం క్రింద చందా చెల్లించిన దాత పేరున (మీరు సూచించిన లేదా మేము ఎంపిక చేసిన) విద్యాసంస్థకు పత్రికను పంపుతాం. కానుక చందా రూ.1,500/- అంతకన్నా ఎక్కువ ఇచ్చిన దాత పేరు, విద్యాసంస్థ పేరు పత్రికలో ప్రచురిస్తాం.

దాత పేరు	విద్యాసంస్థ
శ్రీ విజేందర్ రెడ్డి, నయీమ్ నగర్, హనుమకొండ	ఎస్.ఆర్.డిగ్రీ & పి.జి. మహిళా కళాశాల, అడ్వకేట్స్ కాలనీ, హనుమకొండ
శ్రీ ఆర్. వి. రమణారావు, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లా	కరీంనగర్ జిల్లాలోని మూడు పాఠశాలలకు ఐదు సంవత్సరాలకు పత్రికను స్పాన్సర్ చేశారు.
శ్రీ పల్లపోతు మాధవరావు, అజిత్‌సింగ్ నగర్, విజయవాడ	ఎమ్.కె.బాగ్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల, అజిత్‌సింగ్ నగర్, విజయవాడ
శ్రీ వి. నారాయణ రెడ్డి, ఎ.డి.సి.సి.బ్యాంక్ కాలనీ, రుద్రంపేట, అనంతపురం	కె.వి.ఆర్.ఎస్.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మద్దికెర, కర్నూలు జిల్లా
శ్రీ కలిదిండి అప్పల రాజు,పెన్నాడ, పాలకోడేరు, పశ్చిమ గోదావరి జిల్లా	స్వర్ణాంధ్ర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ & టెక్నాలజీ, సీతారాంపురం,నర్సాపూర్,ప.గో.జిల్లా
శ్రీమతి కలిదిండి శాంత కుమారి, పెన్నాడ, పాలకోడేరు, ప.గో.జిల్లా	ఎస్.ఆర్.కె.ఆర్. ఇంజనీరింగ్ కళాశాల, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా
శ్రీ కలిదిండి రవికుమార్ వర్మ, పెన్నాడ, పాలకోడేరు, ప.గో.జిల్లా	బి.వి.రాజు ఇంజనీరింగ్ కళాశాల, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా
శ్రీ కలిదిండి కిరణ్ వర్మ, పెన్నాడ, పాలకోడేరు, ప.గో.జిల్లా	భీమవరం కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ & టెక్నాలజీ, పెన్నాడ, పాలకోడేరు, ప.గో.జిల్లా
శ్రీ గంట్ల దేముడు&శ్రీమతి వరలక్ష్మి(కీ॥శే॥ జి.అప్పలనాయుడు&పైడితల్లమ్మగార్ల జ్ఞాపకార్థం)	బి.హెచ్.ఇ.ఎల్. కమ్యూనిటీ సెంటర్, బి.హెచ్.ఇ.ఎల్.టౌన్‌షిప్, గాజువాక, విశాఖపట్నం
శ్రీ కె. గోపాల్ రెడ్డి, మదనపల్లి, చిత్తూరు జిల్లా	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నిమ్మన పల్లె, చిత్తూరు జిల్లా.



ముఖచిత్రం: సంగీత స్వరూపిణి సరస్వతి; స్వరార్చనలో తరించిన అన్నమాచార్య, ముత్తుస్వామి దీక్షితులు, త్యాగరాజ స్వామి, శ్యామశాస్త్రి, రామదాసు. *(జూన్ 21 సంగీత దినోత్సవం)*

'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక చందాను ఆన్‌లైన్ http://rkmath.org/srkp ద్వారా చెల్లించవచ్చును.

చందా వివరాలు		భారతదేశంలో	విదేశాలకు
విడి ప్రతి	:	₹ 10	-
సంవత్సర చందా	:	₹ 100	₹ 1,500
మూడు సంవత్సరాలకు	:	₹ 280	₹ 4,500
ఐదు సంవత్సరాలకు	:	₹ 450	₹ 7,500
ఇరవై సంవత్సరాలకు	:	₹ 1,500	₹ 22,000

గమనిక: డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో Ramakrishna Math, Hyderabad అని వ్రాయాలి.

పంపవలసిన చిరునామా: Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.

చందాను ఆన్‌లైన్ http://rkmath.org/srkp ద్వారా చెల్లించవచ్చు.

లోపలి పేజీల్లో...

6 సంపాదకీయం
భువిలో వెలసిన త్రిమూర్తులు

8 గోరుముద్ద
ఏం చెప్పాలి? ఎలా చెప్పాలి?

9 రామకృష్ణ భక్తి సూత్రాలు

10 పలికెడిది భాగవతం
మహర్షిని పరీక్షిత్తు పరాభవించి...

12 మహాపురుషుని సాన్నిధ్య స్మృతులు

14 మన సంస్కృతి
విదేశాలలో భారతీయ సంస్కృతి

15 నీ కథామృతము నిరత సేవన నాకు

16 పరమపదానికి రాజమార్గం

18 దేహస్పృహలేని మౌనధ్యాని

20 పరిప్రశ్న

21 ధీరవాణి
ఇచ్ఛాశక్తి వ్యక్తీకరణే విద్య

22 మహిమలు ముక్తినిస్తాయా?

24 కత్తి మీద సాము!

26 లక్ష్యాన్ని ఛేదిద్దాం!

27 కనులు లేవని కలత లేదు

28 అతిథి దేవో భవ!

30 సంగీత సాంత్వన!

31 నిశ్చల స్వభావం

33 ముందుకు సాగిపో!

35 ఒక కథ చెబుతా...
'రామ'చిలుక బోధ

36 భగవద్గీత – సద్గుణ సుధ
ఫలితం పరమాత్ముని అధీనం!

37 జీవనోద్యానంలో మానవతా పరిమళాలు
దేహ ధర్మం! / పక్కనే ఉండాల్సినవారు!

38 బొమ్మల కథ
అసమాన సేవాతత్పరుడు

41 వికాస మంత్రాలు

ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు. – సంపాదకులు

ప్రియ పాఠకులారా!

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు మీద చిరునామాకు పైన మీ చందా నంబరు, కుడి వైపున మీ చందా గడువు ముగిసే నెల ఉంటాయి. మీ చందా గడువు పూర్తయ్యే నెలకు ముందుగానే సొమ్మును చెల్లించి చందాను పునరుద్ధరించుకోండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారిన పక్షంలో 7వ తేదీ లోగా మాకు తెలియపరచినట్లయితే, వచ్చే నెల సంచిక నుండి మీ కొత్త చిరునామాకు పంపబడును.
- ప్రతీ నెల 26 లేదా 27వ తేదీల్లో పత్రిక పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపుగా చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ.... – సర్క్యులేషన్ మేనేజర్

KCP CEMENT
CONCRETE CEMENT
Since 1958

With Best Compliments From
CHAIRMAN & MANAGING DIRECTOR
THE KCP LIMITED
KCP కంపెనీ వారు "శ్రీరామకృష్ణ ప్రభ" మాసపత్రికను
1000 గ్రంథాలయాలకు స్పాన్సర్ చేశారు

KCP Sreshtaa CEMENT
THE NEW GENERATION CEMENT

Cement Marketing Division : Plot No. 10, Gayatri Hills, MP & MLA's Colony, Road No. 10 C, Jubilee Hills, HYDERABAD - 500033.
Tel : 040-2325 3503 to 505, Fax : 2325 3500, Cell : +91 99895 97775 / 9866305145, E-mail : ramakrishna.k@kcp.co.in
Registered Office : No. 2, Dr.P.V.Cherian Crescent, Egmore, CHENNAI - 600 008. Tel : 044 66772668, Fax: 044 66772620, CIN L65991TN1941PLC001128

భువిలో వెలసిన త్రిమూర్తులు

ఈ ప్రపంచంలో ప్రతి ఒక్కరమూ ఆనందంగా జీవించాలనే ఆశిస్తాం. ఆనందంగా జీవించాలంటే మన కనీస అవసరాలు తీరాలి, సౌకర్యాలు సమకూరాలి. అందుకు సంపాదన అవసరం; సంపాదించాలంటే ఉపాధి అవసరం; ఉపాధి కావాలంటే విద్య అవసరం. అయితే, ఉన్నత విద్యావంతులై ఉన్నత పదవులను నిర్వహిస్తూ, ధనసంపాదన చేస్తున్నవారంతా ఆనందంగా జీవించగలుగుతున్నారా? అని ఆలోచిస్తే ఈ ప్రశ్నకు సమాధానం మనందరికీ తెలిసిందే!

మనిషి ఆనందంగా జీవించడానికి **'యువా స్యాత్సాధు యువాఽ ధ్యాయకః** – యవ్వనవంతుడు, సౌశీల్యవంతుడు, విద్యావంతుడు' అయి ఉండాలని తైత్తిరీయోపనిషత్తు మూడు లక్షణాలు పేర్కొంది.

శరీరం క్షీణించి, అనారోగ్యంతో ఉన్నవాడు ఆనందంగా ఉండలేడు. అందుకే ఆనందంగా ఉండడానికి దృఢంగా, బలంగా, ఆరోగ్యవంతంగా ఉండే యువప్రాయం మొదటి అర్హత. ఈ తరం యువతలో శరీర ఆరోగ్యంపై ఓ అవగాహన ఉంది. అందుకే వ్యాయామం, యోగాసనాలు చేస్తూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడంలో తగిన జాగ్రత్తలను తీసుకుంటున్నారు. అలాగే, ఉన్నత విద్యలను అభ్యసించి, ఉన్నతోద్యోగాలను సంపాదించి ధనార్జన చేయడంలో కూడా సఫలీకృతులవుతున్నారు.

ఆనందంగా ఉండడానికి కేవలం ఆరోగ్యం, విద్య ఉంటే సరిపోదు. ఈ రెండింటినీ అనుసంధానం చేసే 'సౌశీల్యం' ముఖ్యమైన అర్హత. అందుకే క్రమశిక్షణ, మనోనియంత్రణ, నైతిక విలువలు ముఖ్యమని మన ఋషులు వేల సంవత్సరాల క్రితమే తేటపరిచారు. కానీ నేడు మనమంతా భారత, భాగవత, రామాయణ, ఉపనిషత్తుల్లో అనంత జ్ఞాననిధి నిక్షిప్తమై ఉందని తెలియక, పాశ్చాత్యులు మన భారతీయ సాహిత్యం నుండి సేకరించి రాసిన వ్యక్తిత్వవికాస పుస్తకాలను చదువుతూ సంబరపడుతున్నాం. దీనికంతటికీ కారణం మన ఆధ్యాత్మిక గ్రంథాలు కేవలం ఆత్మసాక్షాత్కారం గురించి బోధిస్తాయేగానీ; వ్యక్తిత్వవికాసం గురించి తెలియజేయవనే భ్రమలో ఉండడమే!

నిజానికి, కాలేకడుపుల్లో ఆధ్యాత్మిక బోధ జీర్ణం కాదు; కన్నీటి బ్రతుకుల్లో ఆత్మతత్త్వం అంకురించదు. ఈ లోకంలో ఆనందంగా జీవించిన వ్యక్తే అంచెలంచెలుగా ఆధ్యాత్మిక సారాన్ని గ్రహించి, ఆత్మానందాన్ని పొందే అర్హతను సాధించగలుగుతాడు. అందుకే తైత్తిరీయోపనిషత్తు – 'శారీరకబలం, బుద్ధిబలం, నైతికబలం ఉన్న వ్యక్తి ఈ ప్రపంచంలో ఆనందాన్ని పొందుతాడు. ఆ తరువాత గంధర్వలోకం నుండి బ్రహ్మలోకం వైపు పురోగమించేకొద్దీ వంద రెట్లు ఆనందం అధికమవుతూ ఉంటుంది'అని వివరించింది.

ఆరోగ్యం, విద్య, సౌశీల్యం గల వ్యక్తి ఆనందంగా జీవించగలడని మన ఋషులు సూచించారు. అయితే, నేడు ఆరోగ్య పరిరక్షణ కోసం యోగా కేంద్రాలున్నాయి, విద్యార్జన కోసం విద్యాలయాలున్నాయి, మరి సౌశీల్యం కోసం శిక్షణా కేంద్రాలు ఎక్కడున్నాయి? నైతిక విలువల్ని బోధించేవారెవరు?

అందుకు సాక్షాత్తూ ఆ భగవంతుడే నిర్మల ప్రేమను పంచడానికి తల్లిగా; పరిరక్షణ కోసం తండ్రిగా, జ్ఞానాన్ని బోధించడానికి గురువుగా ఈ భువిలో వెలశాడు. అందుకే ఉపనిషత్తులు 'మాతృ దేవో భవ, పితృ దేవో భవ, ఆచార్య దేవో భవ' అంటూ భువిలో వెలసిన త్రిమూర్తులను స్తుతించాయి. కాబట్టి ఆ భగవంతుని ప్రతిరూపాలైన తల్లి, తండ్రి, గురువులే పిల్లల శీలనిర్మాణంలో ప్రధాన పాత్రధారులు.

చిరుప్రాయంలో చెరగని ముద్ర : చిరుప్రాయంలో తల్లి ఇచ్చే శిక్షణా విధానం పిల్లల భవిష్యత్ జీవనంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో అన్న విషయంపై కొన్నేళ్ళ క్రితం ఓ సర్వే జరిగింది. ఆ సర్వేలో వెల్లడైన విషయం ఇది:

ఓ తల్లి పిల్లవాడికి నడక నేర్పే ప్రయత్నంలో పిల్లవాడికి కొంత దూరంలో నిలబడి తన వైపు రమ్మని ప్రోత్సహిస్తుంది. అప్పుడు పిల్లవాడు తల్లిని చేరుకోవాలని ఆశతో ముందుకు నడవడానికి ప్రయత్నించాడు. ఈ ప్రక్రియలో పిల్లవాడు అదుపుతప్పి పడిపోయి, ఏడవడం ప్రారంభించాడు. వెంటనే తల్లి పరుగున వెళ్ళి పిల్లవాణ్ణి ఓదారుస్తూ 'ఛీ, పాడు నేల! నీ వల్లే మా పిల్లాడికి దెబ్బలు తగిలాయ'ంటూ నేలను కొట్టింది. అప్పుడు పిల్లవాడు వెంటనే ఏడుపు ఆపేశాడు.

ఇదే విధంగా మరో తల్లి తన పిల్లవాడికి నడక నేర్పేటప్పుడు, ఆ పిల్లవాడు తల్లి వైపు నడుస్తూ వస్తుండగా పడిపోయాడు. అప్పుడు ఆమె పిల్లవాడి దగ్గరకు వెళ్ళకుండా దూరం నుండే 'లే నాయనా! లే లేచిరా!' అంటూ ఉత్సాహపరిచింది. ఆ పిల్లవాడు మెల్లగా లేచి నడుచుకుంటూ తల్లిని చేరుకున్నాడు. ఈ ఇద్దరు పిల్లలు పెద్దవాళ్ళయిన తరువాత వారి స్వభావాన్ని పరిశీలిస్తే తేలిందేమిటంటే, మొదటి పిల్లవాడు తనకు ఎదురైన కష్టాలకు, అపజయాలకు బయట పరిస్థితులు, పరిసరాలు, వ్యక్తులే కారణమని నిందించే స్వభావం కలవాడయ్యాడు. రెండవ పిల్లవాడు తనకు ఎదురైన కష్టాలు, అపజయాలను ఎదుర్కోగల మనోబలసంపన్నుడయ్యాడు.

శీలనిర్మాణంలో తల్లి పాత్ర: నిజానికి పిల్లల శీలనిర్మాణ ప్రక్రియ తల్లి గర్భంలో ఉన్నప్పటి నుండే ప్రారంభమవుతుంది. పిల్లవాడు గర్భంలో ఉన్నప్పుడే తల్లి తినే ఆహారం, వినే విషయాలు, చూసే దృశ్యాల ప్రభావం పుట్టబోయే బిడ్డపై ఉంటుంది. కాబట్టి పిల్లల శీలనిర్మాణానికి ఆద్యురాలు తల్లి. ఈ సత్యాన్ని ఋజువు చేసే ఎన్నో సంఘటనలు మన పురాణ, ఇతిహాసాల్లో ఉన్నాయి.

అందుకే పిల్లల శీలనిర్మాణంలో తల్లి పాత్ర అత్యంత ప్రధానమైనది. తల్లి పిల్లలకు చిరుప్రాయంలో ఇచ్చిన శిక్షణ ప్రభావం ఏవిధంగా ఉంటుందో ఈశ్వరచంద్ర విద్యాసాగర్ జీవితమే నిదర్శనం. కలకత్తా సమీపంలో ఉన్న వీర్‌సింఘ్ అనే గ్రామంలో ఈశ్వరచంద్ర జన్మించాడు. ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నప్పటికీ తల్లి కష్టపడి అతడికి విద్యాబుద్ధులను నేర్పించింది.

ఈశ్వరచంద్ర ప్రయోజకుడు అయిన తరువాత ఒకసారి తల్లి వద్దకు వెళ్ళి 'అమ్మా! నీకు బంగారు నగలు చేయిస్తాను' అని చెప్పాడు. అందుకు ఆమె 'మన గ్రామంలో ప్రాథమిక పాఠశాలను, వైద్యశాలను ప్రారంభించు, నువ్వు సౌశీల్యవంతుడిగా జీవించు – ఇవే నువ్వు నాకు ఇవ్వాల్సిన ఆభరణాలు' అని చెప్పింది. సద్గుణరాశి అయిన తల్లి మాటలు విద్యాసాగర్ హృదయాన్ని కదిలించాయి.

విద్యాసాగర్ కాలాంతరంలో 'విద్య కేవలం పొట్టకూటి కోసమే కాదు. నైతిక విలువలను పెంచేదే నిజమైన విద్య. నైతిక విలువల్ని విస్మరించొద్దు' అని బాల్యంలో తల్లి చెప్పిన మాటలే తనపై ప్రభావం చూపాయని గుర్తుచేసుకునేవారు. విద్యాసాగర్ గొప్ప విద్యావేత్తగా, ధార్మికవేత్తగా, సంఘసంస్కర్తగా ప్రసిద్ధిగాంచారు.

శీలనిర్మాణంలో తండ్రి పాత్ర: పిల్లల శీలనిర్మాణంలో తల్లి తరువాత తండ్రి పాత్ర ముఖ్యమైనది. తండ్రి పిల్లలతో వీలైనంత ఎక్కువ సమయాన్ని గడపడానికి ప్రయత్నించాలి. అప్పుడు పిల్లల లోటుపాట్లను తెలుసుకొని ఎప్పటికప్పుడు వారిని సరిదిద్దే అవకాశం ఉంటుంది. వారి అలవాట్లు పొరపాట్లుగా మారకుండా జాగ్రత్తలు తీసుకొనే వీలుంటుంది. అందుకు బెంజమిన్ ఫ్రాంక్లిన్ జీవితం నిదర్శనం.



ఫ్రాంక్లిన్ తండ్రి కొవ్వొత్తుల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. పేదరికం వల్ల కష్టాలను అనుభవిస్తున్న కుటుంబానికి చేదోడుగా ఉండాలనుకున్నాడు ఫ్రాంక్లిన్. అతడు ఒకసారి చేపలు పట్టడానికి చెరువుకు వెళ్ళాడు. చేపలు పట్టడానికి వీలుగా ఉంటుందని అక్కడ ఒక గట్టు కట్టాలనుకున్నాడు. అందుకు ఇతర స్నేహితులతో కలసి ఒక ఇంట్లో ఉన్న రాళ్ళను దొంగిలించి చెరువు దగ్గర గట్టు కట్టాడు. అప్పటి నుండి చేపలను వేటాడడం సులభమైంది. ఫ్రాంక్లిన్ వేటాడిన చేపలను తెచ్చి తండ్రికి ఇచ్చేవాడు.

ఫ్రాంక్లిన్ చేసిన దొంగతనం గురించి తెలిసిన తండ్రి అతణ్ణి మందలిస్తూ 'అబద్ధం, దొంగతనం, మోసం ద్వారా సంపాదించినది ఏదైనా విషతుల్యమే! ఆకలితో మరణించినా ఫరవాలేదుగానీ మోసపూరితమైన పనులు ఎన్నడూ చేయవద్దు' అని కుమారుడి తప్పును సరిదిద్దాడు. అప్పటి నుండి ఫ్రాంక్లిన్ చేపల వేటను మానేశాడు. లండన్ వెళ్ళి అక్కడ ఒక ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేయడం ప్రారంభించాడు. క్రమశిక్షణ, నిజాయతీ, నిబద్ధతలతో శ్రమించిన ఫ్రాంక్లిన్ కొన్నాళ్ళకు స్వయంగా ముద్రణాలయాన్ని ప్రారంభించాడు. తరువాత గొప్ప వ్యాపారవేత్తగా ఎదిగాడు. కాలాంతరంలో అమెరికా దేశపు ఉత్తమ నాయకుల్లో ఒకడిగా ప్రసిద్ధిగాంచాడు.

శీలనిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర: విద్యార్థులను శీలవంతులుగా మలచడంలో ఉపాధ్యాయుల పాత్ర ఉన్నతమైనది. ముఖ్యంగా ఉపాధ్యాయులు తమ బోధల్ని కేవలం మాటలకే పరిమితం చేయకుండా, చేతల్లో కూడా చూపించాలి. అప్పుడే విద్యార్థుల మనస్సుల్లో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకోగలుగుతారు. అందుకు ఉదాహరణగా సోక్రటీస్‌ను చెప్పవచ్చు. సోక్రటీస్ తన శిష్యులకు 'ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా సమత్వాన్ని కోల్పోకూడదు, నిజాయతీగా జీవించాలి'అని బోధించేవారు.

సోక్రటీస్ తాను కొద్ది క్షణాలలో మరణించబోతున్నానని తెలిసినప్పుడు కూడా ఆయన ముఖంపై విషాదఛాయలు కనిపించలేదు. పైగా అలాంటి పరిస్థితుల్లోనూ ఒక శిష్యుణ్ణి పిలిచి 'నేను ఫలానా వ్యక్తికి కొంత సొమ్ము బాకీ ఉన్నాను; నువ్వు ఆ అప్పును తీర్చి, నిజాయతీకి భంగం వాటిల్లకుండా చూడు' అని చెప్పారు. గురువు తమకు బోధించిన సమత్వాన్నీ, నిజాయతీనీ మరణ సమయంలో కూడా ఆచరించి చూపినందుకు ఆ శిష్యులు ఎంతగా ప్రభావితులయ్యారో వేరే చెప్పనవసరం లేదు.

అందువల్ల త్రిమూర్తుల ప్రతిరూపాలుగా ఈ భువిపై వెలసిన తల్లి, తండ్రి, గురువులు పిల్లల శీలనిర్మాణానికి ఆద్యులమనీ, సుగుణాలయానికి ఆచార్యులమనీ గ్రహించి భావితరాలకు మార్గదర్శకులుగా మెలగాలి. అప్పుడే ఋషి వాక్కులను నిజం చేసినవారవుతారు. దేశానికి ఉత్తమ పౌరులను అందించినవారవుతారు. ❖

తల్లి కుటుంబానికి మూలకేంద్రం, ఆదర్శమూర్తి. తల్లి ప్రేమ కన్నా ఏ ప్రేమ ఈ సృష్టిలో భగవంతుని ప్రేమకు ప్రతిరూపంగా ఉండగలదు? అందువల్ల తల్లి సాక్షాత్తూ భగవదవతారం. - స్వామి వివేకానంద

ఏం చెప్పాలి? ఎలా చెప్పాలి?

ఈ రోజుల్లో ప్రసంగాల పరంపర చాలా వరకు ఓ ప్రహసనంగా సాగిపోతోంది. వినేవారికి చెప్పేవారు లోకువో, చెప్పేవారికి వినేవారు లోకువో అర్థం కాకుండా అయిపోయింది. ఊహ తెలిసినప్పటి నుంచి మనం వినే మాటలకు వివిధ అర్థాలు వెతుకుతాం. చెప్పేవారేమో 'ఏం! నేను చెప్పింది వినిపించట్లేదా? ఏంటా పరాకు?' అంటూ మండిపడతారు. వినేవారేమో ఎప్పుడూ మీరేనా చెప్పేది! అంటూ అవకాశం కోసం ఎదురుచూస్తూ ఉంటారు. అంతా మాటల మయం! 'మాటలు కోటలు దాటుతాయి, కాళ్ళు మాత్రం గడప దాటవు'. ఈనాడు చాలామంది మాటలు ఉత్తుత్త మాటలు; చెప్పుడు మాటలు; కవ్వించే మాటలు!



ఈ ప్రపంచంలో పొద్దున లేచినప్పటి నుంచి వద్దన్నా మన చెవిన బోలెడు మాటలు పడుతూ ఉంటాయి. వడపోత నీటినే(ఫిల్టర్‌వాటర్) ఎలా తాగుతామో, అలాగే ఎవరు ఎన్ని చెప్పినా మన విజ్ఞతతో వడకట్టి మంచిమాటల్నే మనస్సులో నిలుపుకోవాలి. నిజానికి ఉపన్యాసాలలో ఉత్తమ ఉపన్యాసాలను ఎంపిక చేసుకోవడం కష్టమే! ఈ ప్రసంగాలపై పరిశోధనలు చేసి మేధావులు కొన్ని విషయాల్ని కనిపెట్టారు.

ముఖ్యంగా ఉపన్యాసాలు మూడు రకాలు - వినోద భరితం (Entertaining); విషయజ్ఞానం (Informative); ప్రేరణాత్మకం (Inspirational). అయితే ఇప్పుడు చాలా వరకు మొదటిరకం ప్రసంగాలే ఎక్కువ. ఎవరినోట విన్నా మామిడిపళ్ళను తినడం మరిపించి, మామిడి చెట్లను లెక్కపెట్టించే చొప్పదంటు ఉపన్యాసాలే! చాలా ఉపన్యాసాలను వడకట్టుకుంటూ పోతే, మిగిలేది ఏమీ ఉండదు. అయితే, ప్రసంగాలపై పరిశోధనల ఊసే లేని దాదాపు నూటాయాభయ్యేళ్ళ క్రితమే భగవాన్ శ్రీరామకృష్ణులు సర్వోత్కృష్ట ఉపన్యాసకులుగా నిరూపించుకున్నారు. ఆ అవతార పురుషుడి మాటల్లో సున్నితమైన హాస్యం, విశేషమైన విషయ పరిజ్ఞానం, ప్రేరణాత్మకమైన శక్తి కలగలసి ఉంటాయి.

శ్రీరామకృష్ణుల ఉపదేశాలతో కూడిన 'శ్రీరామకృష్ణ కథామృతం' చదివితే ఈ విషయం స్పష్టంగా అర్థమవుతుంది. ఎవరికి? ఏంటి? ఎలా? చెప్పాలో ఆ గురుదేవులకు తెలిసినంతగా మరెవరికీ తెలియదంటే అతిశయోక్తి కాదు. అత్యున్నతమైన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని కూడా శ్రీరామకృష్ణులు అతి సులువుగా ద్రాక్షపాకంలా అందించారు. వినేవారిని ముందు వినోదింపచేసేవారు. క్షేత్రమంతా సిద్ధమయ్యాక అనువైన కాలమిదే అని తెలిసి విత్తనాలు చల్లే ఉత్తమ కర్షకుడిలా మెల్లిగా విజ్ఞానబీజాలను నాటేవారు! కషాయాన్ని కూడా కడుతీపి పాకంతో కలిపి గుటుక్కున మింగించే వైద్యుడిలా కొరుకుడు పడని ఆధ్యాత్మిక సత్యాలను కూడా అందమైన దృష్టాంతాలతో, ఉపమానాలతో, కథలతో అర్థమయ్యేలా చెప్పేవారు.

ఎవరికి చెబితే, ఎక్కువ మందికి చెప్పినట్లవుతుందో తెలిసిన ముందుచూపున్న ఆచార్యులు శ్రీరామకృష్ణులు. అందుకే తమ ప్రసంగాల పరివ్యాప్తి కోసం మహేంద్రనాథ్ గుప్తను ఎంపిక చేసుకున్నారు.

'ఎంత మాత్రమున ఎవ్వరు తలచిన అంత మాత్రమునే..' అన్నట్లు శ్రీరామకృష్ణుల ఉపదేశామృతం ఏ స్థాయి వారికి ఆ స్థాయిలో అర్థమవుతుందనడంలో సందేహం లేదు. ఎంతటి ఉపన్యాసకులైనా, ఎవరికి ఏం చెప్పాలో? ఎలా చెప్పాలో? తెలుసుకోవాలంటే శ్రీరామకృష్ణ కథామృతాన్ని చదవాల్సిందే! ❖

పండుగలు - పర్వదినాలు

జూన్ - 2015

12	శుక్రవారం	: ఏకాదశి
28	ఆదివారం	: ఏకాదశి

జూలై - 2015

12	ఆదివారం	: ఏకాదశి
18	శనివారం	: పూరీ జగన్నాథ రథయాత్ర
27	సోమవారం	: ఏకాదశి
31	శుక్రవారం	: గురుపూర్ణిమ



రామకృష్ణ భక్తి సూత్రాలు

– స్వామి యతీశానంద

నారద భక్తి సూత్రాలు, శాండిల్య భక్తి సూత్రాలు భక్తియోగానికి సంబంధించిన ప్రామాణిక గ్రంథాలు. అయితే ఆధునిక తరంలో భగవదన్వేషకులకు అనువైన రీతిలో భక్తితత్త్వాన్ని బోధించారు శ్రీరామకృష్ణులు. ఈ నేపథ్యంలో 'శ్రీరామకృష్ణ కథామృతం' నుండి కొన్ని ఉపదేశాలను 'రామకృష్ణ భక్తి సూత్రాలు'గా సులభరీతిలో వివరించే ప్రయత్నం చేస్తున్నాం.

బౌద్ధగ్రంథాలు పాళీ భాషలో, బైబిల్ హీబ్రూలో, ఖురాన్ అరబ్బీ భాషలో రచించబడ్డాయి. అలాగే శ్రీరామకృష్ణుల ఉపదేశాలు వారి మాతృభాష బెంగాలీలో ఆవిష్కృతమయ్యాయి. అవతారపురుషుని ముఖతః వెలువడిన ఆ అమృతోపదేశాలను యథాతథంగా ఉట్టంకిస్తూ వ్యాఖ్యానిస్తున్నాం. మహాశక్తిమంతమైన ఆ బోధనలను మననం చేసుకుంటూ కృతార్థులమవుదాం.

భక్తిర్ బీజ్ ఏక్‌బార్ పాడ్‌లే అవ్యర్థ హోయ్, క్రమే గాఛ్, ఫల్, పూల్ దేఖా దిబే.

భక్తిబీజం ఒక్కమారు పడితే, అది వ్యర్థం కాదు. క్రమంగా అది చెట్టుగా ఎదిగి పూలు, పండ్లనిస్తుంది.

శ్రీరామకృష్ణ ఉవాచ: జ్ఞానం గురించి ఎంత తర్కించినా, లోపల భక్తిబీజం ఉంటే, చివరకు హరి, హరి అంటూ భగవంతుడి వైపే మొగ్గుతావు. విత్తు ఎంతో కోమలం, మొలకా కోమలమే. కానీ గట్టి నేలను సైతం చీల్చుకొని వస్తుంది. భూమి చీలుతుంది. భగవన్నామానికి గొప్ప శక్తి ఉంది. భక్తిబీజం అవిద్యను నాశనం చేస్తుంది.

వ్యాఖ్య: భక్తిబీజం అనగా భక్తి స్వల్పంగా వికసిస్తుంది. జీవితంలో ఏదైనా సమస్య తీరడానికి దేవుడి దగ్గర మొరపెట్టుకుంటే ఆయన మన సమస్య తీరుస్తాడు. అప్పుడు భగవంతుని పట్ల ప్రేమ కలుగుతుంది. కానీ అది అంత బలంగా ఉండదు. అంతమాత్రం చేత భక్తి పూర్తిగా నశించిందని తలవరాదు. అందుకే 'భక్తి బీజం వ్యర్థం కాదు' అన్నారు శ్రీరామకృష్ణులు. సంసార తాపత్రయంలో చిక్కుకొని, భక్తిసాధనకు ఆటంకం కలగవచ్చు. సహజమే! అయితే, కాలక్రమంలో అది మరల జాగృతమై, భక్తి వృద్ధి చెందుతుంది. చివరకు భగవత్సాక్షాత్కారం నిశ్చయం. మర్రి విత్తు గోడ సందులో పడి, చాలాకాలం తర్వాత మొలుస్తుంది. ఆ పైె పెద్ద చెట్టుగా పరిణమిస్తుంది.

ఈ విషయమే గీతలో శ్రీకృష్ణుడు 'కౌంతేయ ప్రతిజానీహి, నమే భక్తః ప్రణశ్యతి – నా భక్తులు ఎన్నడూ నష్టపోరని కచ్చితంగా తెలుసుకో' అంటాడు. క్రమంగా మొక్క కాస్తా చెట్టు అవుతుంది. అంటే భగవంతుని పట్ల విశ్వాసం కలిగి, చిట్టచివరకు భగవత్సాక్షాత్కారం కలుగుతుంది. మనిషిలో సామాన్యమైన స్థాయిలో భక్తి ఉన్నా, అది క్రమంగా వృద్ధి చెంది, మనస్సును పూర్తిగా ఆక్రమించుకొంటుంది. అప్పుడు భగవత్సాక్షాత్కారానికి అర్హుడవుతాడు.

ప్రహ్లాద, నారద, హనుమాన్, ఏరాజ సమాధిర్ పార్ భక్తి రెఖేఛిలో.

ప్రహ్లాదుడు,నారదుడు,హనుమంతుడు సమాధిస్థితిని పొందిన తర్వాత కూడా భక్తిభావాన్ని కలిగి ఉన్నారు.

శ్రీరామకృష్ణ ఉవాచ: హనుమంతుడు సాకార నిరాకారాలు – రెండూ సాక్షాత్కరింపజేసుకొన్నాడు. ఆ పైన దాస్యభావంతో భక్తుని వలెనే ఉన్నాడు.

నారదాదులు లోకకల్యాణం కోసం జ్ఞానం సిద్ధించిన తర్వాత కూడా భక్తి కలిగి ఉన్నారు.

కొందరు డాబా ఎక్కిన తర్వాత, అవే మెట్లపై దిగుతారు, ఎక్కుతారు. ఆ విధంగానే జ్ఞానలాభం తర్వాత కూడా 'విద్యా అహం' నిలుపుకొంటారు. లోకుల శిక్షణార్థం నిలుపుకొంటారు –భక్తిని ఆస్వాదించడానికి, భక్తుల సాంగత్యం చేయడానికి కూడా!

వ్యాఖ్య: భక్తి యోగమే కలియుగ ధర్మం అని చెబుతూ శ్రీరామకృష్ణులు అన్ని యుగాలలోను అదే శ్రేష్ఠం అంటున్నారు. దీనికి ప్రమాణంగా, వేర్వేరు యుగాలలోని కొందరు సాధకులను మాత్రమే పేర్కొన్నారు. ప్రహ్లాద, నారద, హనుమంతులు – అందరూ సమాధిస్థితిని పొందినవారు. వారు భగవంతునితో, పరమాత్మతో, అఖండ చైతన్యంతో తాదాత్మ్యం చెందారు. వారు మహాజ్ఞానులు, తత్త్వదర్శులు. అయినా వారు పొందిన ఆత్మానుభవాన్ని భక్తులకు అందించడానికి తమ శరీరాలను నిలుపుకొన్నారు. భగవంతునిపై భక్తిని కలిగి ఉండి, నిత్యవ్యవహారాలు నడిపించారు.

సమాధి స్థితిలోని అపారమైన ఆనందాన్ని అనుభవించి కూడా లోకంలోని సాధారణ ప్రజానీకం కోసం కరుణార్ద్ర హృదయులై దేహాన్ని నిలిపి ఉంచుకొన్నారు. వ్యవహారంలో భక్తి – భక్త భావంతో నడచుకొన్నారు. అలా కాకపోతే శరీరం నశించేది. కనుక శ్రీరామకృష్ణులు భక్తియోగమే యుగధర్మమని నొక్కి వక్కాణించారు. ❖ అనువాదం: డాక్టర్ కమల జయరావు

ప్రబలంగా మండుతున్న అగ్ని కట్టెలను భస్మం చేసినట్లు, భగవంతుని పట్ల గల భక్తి సమస్త పాపాలనూ దగ్ధం చేస్తుంది. కావున భక్తినిష్ఠుడవు కమ్ము. భక్తివలన సాధ్యం కానిదేదీ లేదు. - శ్రీమద్భాగవతం

పలికెడిది భాగవతం

మహర్షిని పరీక్షిత్తు పరాభవించి...

– స్వామి జ్ఞానదానంద

కలిపురుషుడి కోరిక మేరకు అతడికి జూదం, సురాపానం, స్త్రీలు, ప్రాణివధ, సువర్ణం అనే పంచప్రదేశాల్లో స్థానమిచ్చి, పాండవపౌత్రుడైన పరీక్షిత్తు ప్రశాంతంగా పరిపాలనను కొనసాగిస్తూ ఉన్నాడు. అయితే తానిచ్చిన ఆఖరిస్థానమైన స్వర్ణంలో నిశ్శబ్దంగా ప్రవేశించి, కలి తనకే ముప్పు కొనితెస్తాడని పసిగట్టలేక, స్వర్ణ కిరీటధారియై పరీక్షిత్తు ఒకనాడు వన్యమృగాల వేటకు బయలుదేరాడు. వేటాడే తమకంతో



మృగాల వెంటబడి తరుముతూ పరుగులెత్తి, ఆకలిదప్పులతో అలసిపోయాడు. పరిశ్రాంతుడై ఓ పర్ణకుటీరంలోకి ప్రవేశించాడు. అక్కడ పరమ శాంతంగా తపస్సు చేసుకుంటున్న శమీకమహర్షిని చూశాడు. ఆ మునిపుంగవుడు ఏకాగ్ర చిత్తంతో ధ్యానమగ్నుడై ఉన్నాడు.

ఆ సార్వభౌముడు సంయమీంద్రుడైన మహర్షిని సమీపించి 'తీరని దాహంతో వచ్చాను! నీళ్ళు ఇస్తారా?' అని అడిగాడు. పరమేశ్వర చింతా పరతంత్రుడై ఉన్న ఆ మునీశ్వరుడు మారు మాట్లాడలేదు. మహారాజు ఆగ్రహోదగ్రుడయ్యాడు. 'ఏం చూసుకొని ఈ శమీకుడికి అహంకారం!' అనుకుంటూ, లోలోపల ఉడికిపోయాడు. ఆ కోపాన్ని అణచుకోలేక, అవమానాన్ని భరించలేక, ధనుస్సుతో ఓ మృతసర్పాన్ని తెచ్చి ఆ బ్రహ్మర్షి భుజాన వేసి, కోపాటోపంతో హస్తినా పురానికి వెళ్ళిపోయాడు.

ఆ ఆశ్రమానికి సమీపంలోనే తిరుగుతున్న కొందరు మునికుమారులు ఈ తతంగాన్నంతా గమనించారు. పరుగు పరుగున వెళ్ళి శమీక మహర్షి కుమారుడైన శృంగికి విషయాన్నంతా చెప్పారు. తోటి స్నేహితులతో ఆటలాడుకుంటున్న శృంగి, తన తండ్రికి జరిగిన అవమానాన్ని గురించి విని ఆవేదనతో...

పోము హిరణ్య దానముల పుచ్చుకొనంగ, ధనంబు లేమియుం
తేము, సవంచనం బులుగ దీవన లిచ్చుచు వేసరింపగా
రాము, వనంబులన్ గృహవిరాములమై నివసింప చెల్లరే
పామును వైవగా తగునె బ్రహ్మమునీంద్రు భుజార్గళంబునన్?

'మేము హిరణ్యదానాలు పుచ్చుకోవటానికి పోమే! ఆశీర్వాదాలని మోసం చేసి ధనం గుంజుకోమే! పరులను వేధించేవాళ్ళం కామే! ఇళ్ళూ వాకిళ్ళూ విడిచిపెట్టి అడవుల్లో పడి ఉన్నామే. అటువంటప్పుడు బ్రహ్మర్షి అయిన మా తండ్రిగారి మెడలో పామును పడవేయటానికి ఆ రాజుకు ఏం పోయే కాలం వచ్చిందో'నని ఆక్రోశించాడు.

శపించిన శృంగి: అదే బాధతో సమీపంలోని కౌశికీ నదికి వెళ్ళి శృంగి నీళ్ళు దోసిట్లోకి తీసుకున్నాడు. మిత్రులతో 'బాలకులారా! వినండి' అంటూ...

ఒడక వింటికోపున మృతోరగముం గొని వచ్చి మారు మా
టాడక యున్న మజ్జనకు నంస తలంబున బెట్టి దుర్మద
క్రీడ చరించు రాజు హర కేశవు లడ్డిన నైన చచ్చు బో
యేడవనాడు తక్షక ఫణీంద్ర విషానల హేతి సంహతిన్!

'ఎలాంటి సంకోచం లేకుండా మృతసర్పాన్ని తెచ్చి, మౌనముద్రలో ఉన్న మా తండ్రిగారి భుజంపైన పడవేసి దురహంకారంతో కన్నూమిన్నూ కానని ఆ రాజు, హరిహరులు అడ్డుపడినా నేటికి ఏడవనాడు తక్షకుడనే సర్పపు విషాగ్ని జ్వాలలకు దగ్ధమైపోవలసిందేన'ని శపిస్తూ, ఆగమేఘాల మీద తండ్రి శమీక మహాముని ఆశ్రమానికి పరుగెత్తాడు.

ఇలా మునిని అవమానించిన పాపానికి గాను పరీక్షిత్ మహారాజు ఏడురోజుల్లోనే విషసర్పపు కాటుకు బలికాబోయే శాపానికి గురి కావలసి వచ్చింది. సాధనలో నిమగ్నమై జపతపాదులతో తరిస్తున్న సాధుపుంగవుల జోలికి వెళితే ఎంతటి ప్రమాదం సంభవిస్తుందో పరీక్షిత్ మహారాజుకు అర్థమైంది. బంగారు కిరీటంలో కలిపురుషుడు ప్రవేశించి,

తనను ఎంతటి పాపకార్యానికి ఒడిగట్టించాడో ఆనక ఆత్మశోధనతో అవగతం చేసుకున్నాడు.

సాధుపురుషులను అవమానిస్తే ఆ పాపం జన్మజన్మలు వెంటాడుతుంది. అందుకే అలెగ్జాండర్ అంతటివాడు మన మహర్షుల శక్తిసామర్థ్యాలను గుర్తించి, తన సైనికులతో "భారతదేశంలో మీరు ఎవరి వద్దకైనా వెళ్ళండి; కానీ అడవులలో తపస్సు చేసుకుంటున్న వారి వద్దకు మాత్రం వెళ్ళకండి. ఒకవేళ వారి వద్దకు వెళితే వారితో సవినయంగా మాట్లాడండి. వారిది తపశ్శక్తి. మనది కేవలం బాహుశక్తి. వారి ముందు మనం నిలబడలేము" అన్నాడట!

మహర్షుల మనస్తాపమే మహాశాపం: ఎంతో విజ్ఞత, వివేకం కలిగిన పరీక్షిత్తు కూడా కలిప్రభావానికి లోనై క్షణం పాటు ఉద్రిక్తుడై, చేయకూడని పని చేసి మరణాన్ని కొనితెచ్చుకున్నాడు. మహాత్ముల విషయంలో అనుచితంగా ప్రవర్తిస్తూ, వారి మాటలను ధిక్కరిస్తూ నేటికీ ఇలా ఘోరమైన ఫలితాలను అనుభవిస్తున్నవారిని ఎందరినో చూస్తూ ఉన్నాం. ఉదాహరణకు ఒకసారి అరుణాచలం మీద ఓ వేటగాడు అక్కడే నాట్యమాడుతున్న నెమలిని చంపబోయాడు. అటువైపు నుంచే నడుచుకుంటూ వెళుతున్న భగవాన్ రమణ మహర్షి ఆ వేటగాడితో 'నెమలిని చంపకు వదిలేయ్ నాయనా!' అన్నారు. వెంటనే ఆ వేటగాడు 'వెళ్ళవయ్యా! వెళ్ళు! పెద్ద చెప్పొచ్చావ్! నువ్వెవరు నన్ను వద్దని చెప్పడానికి?' అని వారి మాటలను లెక్కచేయక నెమలిని వేటాడాడు. మర్నాడు ఆ వేటగాడికి ప్రమాదం సంభవించి, యాదృచ్ఛికంగా నెమలిని చంపిన చేతినే తీసివేయాల్సి వచ్చింది. ఈ విషయం తెలియగానే భగవాన్ రమణులు 'పాపం! అతనంటే జాలివేస్తోంది. కానీ చేసేదేముంది? ఇలాంటి అనుభవాలు ఎదురైతే గాని మనుష్యులకు గుణపాఠం కాదు' అన్నారు.

చాలామంది సాధారణ ప్రజలకు కూడా సాధువులంటే, చులకనభావం! నిత్యజీవితంలో ఇమడలేక తప్పించుకుంటున్న పలాయనవాదులంటూ సాధువులను చిన్నచూపు చూస్తూ ఉంటారు. ఆ తేలిక భావనతో వారిని తూలనాడుతూ ఉంటారు. మహర్షులైన వారిని బాధిస్తే, వారు మారుమాట్లాడక పోయినా, వారి మనస్తాపమే మనకు మహాప్రమాదంగా పరిణమిస్తుంది.

శృంగి చెప్పిన సాధులక్షణాలు: సమాజానికి ఆదర్శంగా నిలిచే సాధుపుంగవుల ధర్మాలను కూడా శృంగి పరోక్షంగా వివరిస్తూ, తన తండ్రి శమీక మహర్షి లక్షణాలను ప్రస్తావిస్తూ, **'...కందమూలములు కూడుగ తినుచు, సమాధి నిష్ఠుడై వీడడు లోని చూడ్కులను, విష్ణుని దక్క పర ప్రపంచముల చూడడు మద్గురుండు...** – నాకు తండ్రి, గురువు అయిన శమీకుడు కందమూలాలు తింటూ, అచంచల మనస్కుడై అంతర్ దృష్టిని వీడకుండా, ఇష్టదైవాన్నే తప్ప ఇతర ప్రపంచాన్ని చూడకుండా, తపోనిష్ఠలోనే ఉంటాడ'ని గుర్తుచేశాడు.

స్వర్ణ దానాలు యాచించడం, ఆశీస్సుల పేరుతో మోసాలు చేసి ధనాన్ని ఆశించడం, వస్తువాహనాది సుఖాల కోసం భక్తులనూ, శిష్యులనూ వేధించడం సర్వసంగ పరిత్యాగుల లక్షణాలు కావని శృంగి స్పష్టం చేశాడు. నేటికీ పరిత్యాగానికి పరమ సార్థకతను కల్పిస్తున్న మహానుభావులున్నారు. అలాంటి భాగవతోత్తములను భక్తులు భగవంతుడి ప్రతినిధులుగా ఆదరిస్తూనే ఉన్నారు; ఆరాధిస్తూనే ఉంటారు. అందుకే 'సర్వత్రా భగవంతుడే విరాజిల్లుతున్నాడు. ఉదాహరణకు సాధువులలో ఆయన అభివ్యక్తీకరణ అధికంగా ఉంటుంది' అనేవారు భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస.

శమీకుడి సంతాపం: తనను అవమానించినందుకు పరీక్షిత్తును శృంగి శపించాడని తెలిసి శమీక మహర్షి ఎంతో బాధపడ్డాడు. 'అతిథిని సత్కరించడం మానేసి, శపించడం భావ్యమేనా!' అంటూ శమీకుడు...

సత్పురుషులను, సాధుపుంగవులను అవమానించరాదు; దూషించరాదు. ప్రత్యక్షంగానైనా, పరోక్షంగానైనా దుర్భాషలాడరాదు. మహాత్ములకు, మహర్షులకు, అస్త్రశస్త్రాలు అవసరం లేదు. వారి శక్తి వారి వాక్కుల్లోనే ఉంటుంది. ఆ శక్తి పిడుగు కన్నా ప్రమాదకరమైనది. ఒకవేళ వారు ప్రశ్నించకపోయినా, ప్రతీకార చర్యకు పూనుకోక పోయినా, వారి మనస్తాపమే మనకు మహాశాపమై తగులుతుంది.

చెలగరు కలగరు సాధులు;
మిళితములయి పరుల వలన మేలుం కీడున్
నెలకొనిన నైన నాత్మకు,
నొలయవు, సుఖదుఃఖ చయము లుగ్రము లగుచున్!

'పరీక్షిత్తు సదాచార సంపన్నుడు, పరమభాగవతోత్తముడు; నీవు శపించావని తెలిసినా, శక్తిసామర్థ్యాలుండి కూడా నీపై ప్రతీకారం తీర్చుకోడు! సజ్జనులు ఇతరులు చేసిన ఉపకారానికి పొంగిపోరు; అపకారానికి కుంగిపోరు. మహాత్ముల ఆత్మలను సుఖదుఃఖాలు ఆవహించవు' అంటూ పరీక్షిత్ మహారాజు గొప్పతనం ఏమిటో కుమారుడికి గుర్తుచేశాడు.

శమీకుడు తనకు జరిగిన అవమానాన్ని కించిత్తు కూడా మనస్సులో పెట్టుకోకుండా, 'ఓ భగవంతుడా! నా పిల్లవాడు బుద్ధి చాపల్యం వల్ల ఆ భూపాలుడికి శాపం పెట్టి పాపం మూటకట్టుకున్నాడు! ఈ దోషాన్ని మన్నించు' అని వేడుకున్నాడు. ఆ తరువాత శమీకుడు ఒక శిష్యుణ్ణి పిలిచి శాప వృత్తాంతమంతా మహారాజుకు చెప్పిరమ్మని పంపించాడు. ❖

లోకులు ఎంత సులభంగా స్తుతిస్తారో అంతే సులభంగా నిందించనూగలరు. కాబట్టి నిన్ను గురించి లోకులు చేసే నిందాస్తుతులను ఎన్నడూ పట్టించుకోకు. - *భగవాన్ శ్రీరామకృష్ణులు*

స్వామి యతీశ్వరానంద

అక్కడ సాధారణంగా ప్రతి సాయంత్రం భక్తులు పూజ్య స్వామి యతీశ్వరానందజీ మహరాజ్‌ను దర్శించేవారు. నేను కూడా క్రమంగా ప్రతి సాయంత్రం స్వామీజీని దర్శించి, తరువాత హారతి, భజనల్లో పాల్గొనేదాన్ని. ఇదేగాక ప్రతీ ఆదివారం జరిగే ఉపన్యాసాలకు కూడా హాజరయ్యేదాన్ని.

నెమ్మదిగా స్వామీజీతో అనుబంధం ఏర్పడింది. అంతేగాక అంతకు ముందెన్నడూ అటువంటి పవిత్రమైన ప్రేమను నేను పొందలేదు. అది సాధారణ ప్రాపంచిక ప్రేమ కన్నా అత్యున్నతమైనది.

నాకు 'నైట్ డ్యూటీ' ఉన్నప్పుడు, నేను మొదట ఆశ్రమానికి వెళ్ళి స్వామీజీని దర్శించి, నమస్కరించి ఆస్పత్రికి వెళ్ళేదాన్ని. అటువంటి సమయాల్లో ఆయన ఎంతో ఆప్యాయంగా పరామర్శించేవారు. 'ఏదీ నీ టిఫిన్ బాక్స్ చూపించు! మీ అక్క నీకు తినడానికి ఏమి పెట్టిందో చూద్దాం' అని

మహాపురుషుని సాన్నిధ్య స్మృతులు

– ప్రవ్రాజిక శారదాప్రాణా మాతాజీ

అది 1947వ సంవత్సరం సెప్టెంబర్ నెల. పాకిస్తాన్‌లోని హైదరాబాద్ (సింధు ప్రాంతంలోని కరాచీ వద్దనున్న పట్టణం) వదిలి మేము బెంగుళూరు తరలి వచ్చాం. అక్కడి వాతావరణం, చుట్టుపక్కల జనం, ఆచార వ్యవహారాలు, జీవనశైలి – అన్నీ మాకు కొత్తగా కనిపించాయి. అన్నింటి కన్నా ముఖ్యంగా మా జీవనయానం పూర్తిగా మార్పుచెందిన సమయం అది. మేము బెంగుళూరు వచ్చిన తర్వాత మా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మానసిక శాంతి కోసం మా అమ్మ ప్రతిరోజూ సాయంత్రం దగ్గరలో ఉన్న రామకృష్ణ ఆశ్రమానికి వెళ్ళేవారు. మొదట్లో మాకు ఆశ్రమం పేరు కూడా తెలియదు.

1952వ సంవత్సరంలో నేను బెంగుళూరు వైద్య కళాశాలలో విద్యార్థినిని (అప్పుడు నా వయస్సు 18 ఏళ్ళు). మా ఇంట్లో నేను అందరి కంటే చిన్నదాన్ని. ఒకరోజు సాయంత్రం మా అమ్మ నన్ను తనతో రామకృష్ణ ఆశ్రమానికి తీసుకువెళ్ళింది. ఆ ప్రశాంత వాతావరణం నా జీవితంలో ఒక నూతన అధ్యాయానికి నాంది పలికింది. శ్రీరామకృష్ణులు, శ్రీశారదాదేవి, స్వామి వివేకానంద, స్వామి బ్రహ్మానంద మొదలైన వారి గురించి నాకేమీ తెలియదు. అయినా మౌనంగా ఆరాత్రికం, భజనలు విని వచ్చాను. తరువాత అప్పుడప్పుడు వెళ్ళివస్తుండేదాన్ని.

బాక్స్ చూసి, 'ఉండు; నేను కొంచెం ప్రసాదం ఇస్తాను' అని చెప్పి, ఒకటి రెండు కొబ్బరి ఉండలు గానీ, లేక ఏదైనా స్వీట్ గానీ ఇచ్చి, 'మొదట ఇది తిని, తర్వాత మీ అక్క ఇచ్చినది తిను' అని ఎంతో ప్రేమగా పలికేవారు.

అటువంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. ఆ సమయంలో ఆస్పత్రి విషయాలు, ఇంటి విషయాలు చెప్పేదాన్ని. ముఖ్యమైన వాటికి స్వామీజీ సలహాలు, సహాయం తీసుకునేదాన్ని. ఆయనను కేవలం ఆధ్యాత్మిక గురువుగా మాత్రమేగాక, చిన్నతనంలో కోల్పోయిన నా తండ్రిగా కూడా భావించేదాన్ని. స్వామీజీ నా సామాజిక, ఆధ్యాత్మిక జీవనయాన బాధ్యతను స్వీకరించారనవచ్చు.

స్వామీజీతో పరిచయమైన కొత్తలో ఒకరోజు నన్ను, 'మందిరంలో ముగ్గురు కూర్చుని ఉన్నారు కదా! వారిలో ఎవరంటే నీకు ఎక్కువ ప్రేమ?' అని ప్రశ్నించారు. అప్పుడు కొద్దిగా ఆలోచించి, "శారదామాత నా దృష్టిలో అత్యంత సహజం, సరళం అనిపించారు. ఆమె గురించి ఏమీ తెలియకపోయినా మా అమ్మ పేరు – దేవి, ఈమె పేరు – శారదాదేవి. మా అమ్మ లాగా ఈమె కూడా తెల్లచీర ధరించి ఉన్నారు. అందువల్ల శారదాదేవి నాకు అత్యంత ఆత్మీయురాలనిపించింది. నేను సహజంగా, సులభంగా

ఆమె వైపు ఆకర్షితురాలినయ్యాను" అని నా మనస్సుకు స్ఫురించింది తెలియజేశాను.

నా సమాధానం విని స్వామీజీ చాలా సంతోషించారు. కుతూహలం వ్యక్తపరుస్తూ, 'అవునా, సరే సరే' అన్నారు.

వీలైనంత వరకు ప్రతిరోజూ స్వామీజీ గది ముందున్న వరండాలో కూర్చునిగాని, లేక మఠం ఆవరణలో (ఇప్పుడున్న రామకృష్ణ సభాంగణ ప్రాంతం) నడుస్తూగాని సంభాషించే వాళ్ళం. మా సంభాషణ సామాన్యంగా ఏదో ఒక కుతూహల కరమైన విషయంతోనో, కథతోనో ప్రారంభమయ్యేది. ఆ కుతూహలకర విషయాలు, కథలు, ప్రసంగాలు తెలియ కుండానే చివరకు ఒక గంభీరమైన ఆధ్యాత్మిక చింతనకు దారితీసేవి. ప్రాపంచిక విషయాలను గానీ, సాంసారిక విషయాలను గానీ చర్చించడానికి స్వామీజీ ఏ మాత్రం ఇష్టపడేవారు కాదు. స్వామీజీ ఒక శిష్యుడు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ 'నేను మీకు కేవలం ఆధ్యాత్మిక విషయాలలో సహాయపడగలను. సాంసారిక విషయాలలో తలదూర్చడానికి గానీ, సలహాలివ్వడానికి గానీ నాకు అధికారం లేదు. అది నా పరిధిలోది కాదు' అని అన్నారు. స్వామీజీ అనవసర విషయాలను ఎన్నడూ చర్చించేవారు కాదు.

స్వామీజీ సాంగత్యం ఆధ్యాత్మిక జిజ్ఞాసను అభివృద్ధి చేసుకొనడానికి విశేషమైన ప్రోత్సాహాన్నిచ్చింది. అలాంటి ఆధ్యాత్మిక జీవనాన్ని కొనసాగించడానికి అనువైన సలహాలు, అమూల్య శిక్షణ లభించాయి.

స్వామీజీ అప్పుడప్పుడు ఒక అధికారి కథను చెబుతుండేవారు: ఒక అధికారి మెడలో అనేకమైన చిన్నా పెద్ద పతకాలు వ్రేలాడుతుండేవి. వాటిలో అన్నింటి కంటే పెద్ద పతకం బంగారంతో తయారైంది. అతని స్నేహితుడొకడు ఆ అధికారిని ఇలా అడిగాడు: 'నువ్వు ఇన్ని పతకాలను ఎలా సంపాదించావు?' అందుకు ఆ అధికారి గర్వంగా బంగారు పతకాన్ని చూపిస్తూ 'మొదట ఈ పెద్ద బంగారు పతకాన్ని పొరపాటున నా మెడలో వేశారు. అంతే తరువాత ఒకదాని వెంట ఒకటిగా ఇవన్నీ వచ్చాయి' అన్నాడు. అంటే మొదట ఆ పెద్ద పతకాన్ని చూసిన ఇతరులు అనేక చిన్నా పెద్ద పతకాలతో గౌరవించారు.

స్వామీజీ ఈ కథ చెప్పి దాని అర్థాన్ని వివరిస్తూ 'అజ్ఞానం వల్ల మొదట మనకీ జన్మ వస్తుంది. ఆ తరువాత కామం, క్రోధం, లోభం, మోహాలనే వలలో చిక్కుకుంటాం. వాటివల్ల దుఃఖాలను అనుభవిస్తాం' అని అన్నారు.

ఒకరోజు సాయంత్రం మేము కొంతమంది స్త్రీలము ఆశ్రమానికి వెళ్ళి స్వామీజీతో మాట్లాడుతున్నాం. అప్పుడు హఠాత్తుగా స్వామీజీ "నేను ఇప్పుడు ఏమి చూస్తున్నానో మీరు చెప్పగలరా? – పవిత్రతా స్వరూపిణియైన ఆ జగజ్జనని శ్రీశారదాదేవిని మీ అందరి యందు దర్శిస్తున్నాను" అని అన్నారు.

ఇంకొక రోజు అందరం కూర్చుని ఉన్నాం. నన్ను ఉద్దేశిస్తూ "నీవు రోగులకు ఈశ్వర భావనతో చికిత్స చేయాలి. ఆ దృష్టితోనే వారిని సేవించాలి. ఏకనిష్ఠతో సేవ చేస్తే ఆ కర్మే ఉపాసన అయి తీరుతుంది" అని అన్నారు.

మరొక రోజు సత్సంగం జరుగుతుండగా స్వామీజీ ఒక శిష్యుణ్ణి ఇలా ప్రశ్నించారు: "నీవు నియమానుసారంగా జపధ్యానాలు ఆచరిస్తున్నావా?" ఆయన "చేస్తున్నాను స్వామీజీ" అన్నారు. వెంటనే స్వామీజీ "జపం సంఖ్య కన్నా, దాని అర్థభావనలపై మనస్సు లగ్నం చేయి. దాని వల్లనే నీకు ఆధ్యాత్మిక పురోభివృద్ధి కలుగుతుంది".

ఇంకొక రోజు స్వామీజీ గది వరండాలో కూర్చుని ఉన్న సమయంలో ఒక వ్యక్తి వచ్చి, "స్వామీజీ దీక్ష అంటే ఏమిటి?" అని అడిగారు. దానికి స్వామీజీ "దీక్ష తీసుకుంటే అదేమిటనేది నీకే అర్థమవుతుంది" అన్నారు. తర్వాత కొద్ది రోజులకు ఆయన స్వామీజీ వద్ద దీక్ష తీసుకున్నారు. దీక్ష తీసుకున్న కొన్ని రోజుల తర్వాత మరల ఆయన వచ్చినప్పుడు స్వామీజీ, "దీక్ష అంటే ఏమిటో నీకు ఇప్పుడు అర్థమైందా?" అని అడిగారు. కొత్తగా దీక్ష తీసుకోవడం వల్ల గాభరాగా ఉన్న ఆయన "తెలిసింది స్వామీజీ! ఎప్పుడైతే శిష్యుడు గురువు గారిని స్వీకరిస్తాడో దానినే దీక్ష అంటారు" అన్నాడు. అతని గాభరాను గమనించిన స్వామీజీ నవ్వుతూ, సరైన అర్థాన్ని ఇలా చెప్పారు: "ఔనౌను! ఎప్పుడు గురువు శిష్యుణ్ణి స్వీకరిస్తారో దానినే యథార్థమైన దీక్ష అంటారు."

ఇంకా సంభాషణ కొనసాగిస్తూ స్వామీజీ, "శిష్యునకు గురువుగారిని ఎంచుకోవడం సాధ్యమేనా? అతను గురువును ఎలా వెతకగలడు? కానీ, నిష్కల్మషుడు, భగవత్సాక్షాత్కారం కోసం తపన చెందే శిష్యుని వద్దకు ఆధ్యాత్మిక మార్గంలో సహాయపడడానికి గురువే స్వయంగా వస్తారు. అది మహత్తరమైన భగవత్కృప" అని అన్నారు. ❖

అనువాదం: శ్రీమతి టి. శారద

(స్వామి యతీశ్వరానంద – శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష సన్న్యాస శిష్యులైన స్వామి బ్రహ్మానందజీ మహరాజ్ శిష్యులు)

సాధుపురుషుల సాంగత్యం ఒక్క నిమిషమైనా, ఆ సాంగత్య మహిమతో సరిపోలిస్తే లోకంలోని ఏ సంపదలూ అందుకు సాటిరావు. పరమభక్తుల సాంగత్యానికి ముక్తి కూడా సాటిరాదు. - శ్రీమద్భాగవతం

ప్రాచీన, మధ్యయుగాలనాటి

మన సంస్కృతి

– స్వామి హర్షానంద

"ఒక వ్యక్తి తనను తాను అసహ్యించుకొంటున్నట్లయితే అదే పతనానికి హేతువు. పూర్వీకుల చరిత్రను అవమానకరంగా భావిస్తే, ఆ జాతి అంతానికి చేరుకున్నట్లే!" అంటారు స్వామి వివేకానంద. గత వైభవాన్ని మర్చిపోయినంత కాలం మనమూ, మన దేశం స్తబ్ధతలో మునిగిపోతాం. అందుకే, మన ప్రాచీన సంస్కృతి గురించి తెలుసుకోవాలి. గడచిపోయిన సంగతులు తెలుసుకొంటూ, భవిష్యత్ మహత్కార్యాల సాధన వైపు నడవాలి. మన ప్రాచీన భారతీయ సంస్కృతిని గుర్తు చేసేందుకు చేస్తున్న ప్రయత్నమే ఈ వ్యాసాల పరంపర. సుప్రసిద్ధ రచయిత, బెంగుళూరు రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి హర్షానంద మహరాజ్ మధ్యయుగాల కాలం దాకా విలసిల్లిన మన సంస్కృతిని 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు 2014 ఫిబ్రవరి సంచిక నుండి వివరిస్తున్నారు.

విదేశాలలో భారతీయ సంస్కృతి

జపాన్: బౌద్ధమతం చైనా, కొరియాల ద్వారా జపాన్‌లో ప్రవేశించింది. క్రమంగా జపనీయుల షింటో మతాన్ని అది ఆక్రమించింది. 'జెన్ బౌద్ధమతం'లోని 'జెన్' అనే పదం సంస్కృతపదమైన ధ్యానానికి వికృత రూపం. బౌద్ధ, టావో మతాల కలయిక వల్ల జెన్ బౌద్ధం శూన్యం మీద ధ్యానంగా అద్వైతం యొక్క నిర్గుణ బ్రహ్మారాధనను పోలి ఉంటుంది.

నర దగ్గర (దక్షిణ హోంసు, జపాన్)లోని హొర్యూజి బౌద్ధ దేవాలయం జపాన్ దేశంలో అత్యంత ప్రాచీనమైనది. ఈ దేవాలయంలో బుద్ధుని వర్ణ చిత్రాలు అజంతా పద్ధతిలో కనిపిస్తాయి.

చంద్రుని మీద కుందేలు, మొసలి కథ, కోతి – దాని కాలేయం, ఋష్యశృంగ నాటకం మొదలైన ఐతిహ్యాలు జపాన్‌కు భారతదేశంతో సంబంధము ఉన్న విషయాన్ని తెలియజేస్తాయి.

కొరియా: క్రీ.శ. 4వ శతాబ్దం నుండి కొరియాకు భారతదేశంతో సంబంధం ఉండేది. క్రీ.శ. 372లో భిక్షు–సూండు, చైనా నుండి బౌద్ధమతాన్ని కొరియా దేశానికి సుసూరిమ్‌వాంగ్ కాలంలో తీసుకువచ్చాడు. మొదటి భారత గురువు (కొరియన్‌లో అతడి పేరు–అడొ) క్రీ.శ. 374లో కొరియా వెళ్ళారు. క్రీ.శ. 375లో పింగ్‌యాంగ్‌లో రెండు బౌద్ధాలయాలు నిర్మితమయ్యాయి. పదేళ్ళ తరువాత రెండో గురువు మల్లానంద కొరియా వచ్చారు. మూడో గురువు మూఖోజా క్రీ.శ. 417లో కొరియాను సందర్శించారు.

క్రమంగా వివిధ బౌద్ధ శాఖలు కొరియాలో విస్తరిల్లాయి. రాజులు, ప్రజలు కూడా బౌద్ధ విహారాలు (మఠాలు) స్థాపించి బుద్ధుని విగ్రహాలు, చిత్రాలు నెలకొల్పారు. బౌద్ధ ఆరాధన కార్యక్రమాలలో ఉపయోగించే పాత్ర సామగ్రితో లలితకళలు అభివృద్ధి చెందాయి. కాలక్రమేణా కొరియన్ పండితులు బౌద్ధమతంతోపాటు కొన్ని కళలు, కొన్ని చేతివృత్తులు, సాహిత్యాన్ని జపాన్‌లో ప్రవేశపెట్టారు. 'కైమిక్' అనే కొరియన్ మొదటి గురువు భారతదేశాన్ని సందర్శించి వినయ సంప్రదాయానికి చెందిన అనేక బౌద్ధ గ్రంథాలు తీసుకెళ్ళాడు. పైక్‌జేకి చెందిన క్వాన్‌రెంక్ అనే మేధావి జపాన్‌ను సందర్శించి, హొర్యూజి మందిరాలను స్థాపించారు. సిల్లాకు చెందిన ఉన్‌చెంక్ (క్రీ.శ. 613 – 696) అనే గొప్ప సాంస్కృతిక విద్యావేత్త కొత్త బౌద్ధమత శాఖను స్థాపించారు. క్రీ.శ. 8వ శతాబ్దంలో జెన్ (ధ్యాన) బౌద్ధమతం కొరియాలో ప్రవేశించింది.

గుహాలయాలు, స్తూపాలు, వేణువు – గంట లాంటి వాద్యాలు, గుడిగంటలు వగైరా అన్నీ కొరియా కళలు – వాస్తుశాస్త్రం మీద భారతీయ సంస్కృతి ప్రభావాన్ని తెలియజేస్తున్నాయి.

కార్యు వంశస్థులు (క్రీ.శ. 936 – 1391) ఆలయాలు నిర్మించి స్తూపాలనూ, ప్రాచీన ఆలయాలనూ పునరుద్ధరించారు. ఆ రోజులలో జరిగిన మహత్తర కార్యక్రమం – 'మహాధర్మకోశ' (క్రీ.శ. 1070) అనే బౌద్ధ విజ్ఞానసర్వస్వం వారి ఆస్థాన పండితుల ద్వారా సంకలనం చేయబడింది. ఈ గ్రంథం మంగోలుల దండయాత్రలో నాశనం కాగా మరలా క్రీ.శ. 1236లో మరొక సంపుటి వెలువడింది. క్రీ.శ.1443లో సంస్కృత శబ్దాల ఆధారంగా కొరియన్ల హంగయల్ లిపి రూపొందింది.

కొరియన్ల కళలు, వాస్తుశిల్పం, సాహిత్యం, సంగీత నృత్యాల మీద భారతీయ సంస్కృతి ప్రభావం ఉండేది, ఇప్పటికీ ఉంది. ❖

అనువాదం: డాక్టర్ పి.వి.రెడ్డి

నీ కథామృతము నిరత సేవన నాకు
చేకొనుట సకలసుఖసేవనంబటు గాన ॥

ఇదియె మంత్రరాజము నాకు నేప్రొద్దు
నిదియె వేదసంహిత పాఠము
ఇదియె బహు శాస్త్రమెల్ల చదువుట నాకు
ఇదియె సంధ్య నాకిదియె జపమటు గాన ॥

ఇదియె బ్రహ్మవిద్యోపదేశము నాకు
ఇదియె దుఃఖవిరహిత మార్గము
ఇదియె భవరోగహిత భేషజము నాకు
ఇదియె ఉపనిషద్వాక్యపద్ధతి గాన ॥

ఇదియె దానఫలమీజాలినది నాకు
ఇదియె తపవిరహిత కర్మము
ఇదియె తిరువేంకటేశ్వరుని సంస్మరణ
ఇదియె యిదియె యిన్నియును నటు గాన ॥

నీ కథామృతము నిరత సేవన నాకు

– శ్రీమతి బి.కృష్ణకుమారి

భగవంతుడి కథా శ్రవణం, భక్తులకు సర్వపాప హరణం. అందుకే భాగవతోత్తములు నవవిధ భక్తి మార్గాల్లో శ్రవణానికే ప్రథమ స్థానాన్నిచ్చారు. తరువాతే కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం అన్నారు. మనస్సు ఆ మహితాత్ముడి వైపునకు మరలాలంటే ముందు, ఆయన గుణగాథల్ని ఆస్వాదించాలి. ఆ తరువాత వాటిని మనసారా కీర్తించాలి. ఆయనను మన హృదయంలో స్మరించు కొని, ప్రతిష్ఠించుకోవాలి. గుండెలో కొలువైన ఆ పరాత్పరుడి పాదాలను అర్చించుకుంటూ ఆయనకు దాసానుదాసులమై, సఖ్యత నెరపి తుదకు ఆత్మను నివేదించుకోవాలి.

ఆ తిరుమలవాసుడిని తాళ్ళపాక అన్నమాచార్యులు, ఈ తొమ్మిది తోవల్లో సేవించుకొని తరించారు. అలా ఆ కొండలరాయడి కథాగానంలో తాను ఓలలాడిన అనుభూతిని పదామృతంగా కురిపించారు. **'నీ కథామృతము నిరత సేవన నాకు...!'** అంటూ ఆ పదకవితా పితామహుడు పరవశించి పోయారు. కోనేటిరాయడి ఆ కథాసుధే తనకు మంత్రరాజమనీ, వేదసంహిత పాఠమనీ, దుఃఖవిరహిత మార్గమనీ, దానఫల ప్రదాతయనీ పొంగిపోయారు. నారదుడు కూడా తన భక్తి సూత్రాల్లో 'కథాదిష్వితి గర్గః...' అంటూ భగవంతుని కథా శ్రవణాదులలో అనురక్తి కలిగి ఉండాలని గర్గ మహర్షి చెప్పినట్లు గుర్తుచేశారు. కలియుగంలో భగవత్ప్రాప్తికి భక్తియోగమే అందరికీ అనువైంది; అనుకూలమైంది! అందుకే భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస భవతారిణి అయిన కాళికాదేవి భక్తుడిగా అవతరించి, అన్ని యోగాలనూ భక్తియోగంలో రంగరించి, ఆ యోగసాధనతోనే ముక్తిమార్గాన్ని సుసాధ్యం చేసి చూపారు.

సకల సుఖ సేవనంబు....

పద్మావతీ ప్రియుడి కథాసుధా పానంతో పావనుడైన ఈ పదకవితాపితామహుడు అదే పారవశ్యంతో, **'నీ కథామృతము నిరత సేవన నాకు, చేకొనుట సకలసుఖసేవనంబటు గాన!'** అని సంకీర్తనకు శ్రీకారం చుడుతున్నాడు. నిరంతరం నీ గుణగానామృతాన్ని సేవిస్తున్నాననీ, అన్ని సుఖాలూ నాకు నీ మాహాత్మ్య మధురశ్రవణంలోనేననీ శ్రీవేంకటేశ్వరుడికి విన్నవించుకుంటున్నాడు. భగవంతుడి లీలామృతంలో భక్తుడిని అమితంగా ఆకర్షించే శక్తి ఆవహించి ఉంటుంది. ఆ శక్తే భాగవతులకు పరమశాంతిని ప్రసాదిస్తుంది. భక్తుల అభీష్టం మేరకే విశ్వవ్యాపకుడు, విశ్వంభరుడు అయిన భగవానుడు మానవదేహం ధరించి తన లీలల్ని సల్పుతాడు; మహిమల్ని ప్రదర్శిస్తాడు. అలా ఆ యా రూపాలతో ఆయన ఒనర్చిన కార్యాలన్నీ, భక్తులకు కలకాలమూ మననం చేసుకునే మధురఘట్టాలుగా మిగిలిపోతాయి. ఆ పరంపరలో బృందావనంలో గోపికలు కూడా ఆ గోకులనందనుడిని....

తవ కథామృతం తప్తజీవనం; కవిభిరీడితం కల్మషాపహం
శ్రవణ మంగళం శ్రీమదాతతం; భువి గృణంతి తే భూరిదా జనాః

'నీ కథామృతం తాపపీడిత జీవులకు ఉపశమనం. కవులు కీర్తించేది, కల్మషాలను నశింపచేసేది, శ్రవణమాత్రాన మంగళం చేకూర్చేది' అని ప్రస్తుతిస్తూ, పులకించిపోయారు. ఉత్కృష్ట సంపదలను ఒనగూర్చే నీ కథామృతాన్ని ఈ ఇలలో కీర్తించేవారే పుణ్యజీవులని శ్రీకృష్ణపరమాత్ముడి భక్తిలో తన్మయులయ్యారు.

(మిగతా 34వ పేజీలో...)

ఎవరు భగవన్నామాన్ని స్మరిస్తారో వారు చండాలురైనా శ్రేష్ఠులే! అలాంటివారు జపతపాలు, యజ్ఞయాగాలు, తీర్థస్నానాలు, వేదాధ్యయనాలు ఆచరించినవారే అగుదురు. - శ్రీమద్భాగవతం



పరమపదానికి రాజమార్గం

- స్వామి సర్వగతానంద

రాజయోగం అంటే రాజమార్గం. రాజయోగం మనస్సు గురించి శాస్త్రీయంగా వివరిస్తుంది; మనస్సు మర్మాన్ని క్షుణ్ణంగా తెలుపుతుంది. ఈ మార్గాన్ని ఏ మతంవారైనా, ఎలాంటి తత్త్వభావాలు కలవారైనా అనుసరించవచ్చు. ఎందుకంటే ఏ మత ధర్మాన్ని అనుసరించాలన్నా, ఆధ్యాత్మిక పురోగతిని సాధించాలన్నా మనస్సే ముఖ్యమైన పరికరం. ఈ మనస్సును నియంత్రించడానికి పతంజలి మహర్షి అష్టాంగయోగ సాధనను వివరించారు. ఈ ఎనిమిది అంగాల గురించి విపులంగా తెలుసుకొనే ముందు వాటి అర్థాన్ని క్లుప్తంగా తెలుసుకుందాం.

యమ నియమ ఆసన ప్రాణాయామ ప్రత్యాహార
ధారణాధ్యాన సమాధయోఽ ష్టావంగాని

(పతంజలి యోగసూత్రాలు-2.29)

'యమము, నియమము, ఆసనము, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణ, ధ్యానము, సమాధి అనే ఈ ఎనిమిది యోగాంగాలు.'

యమ, నియమాలు నైతిక పరిధినీ; ఆసన, ప్రాణాయామాలు శారీరక పరిధినీ; ప్రత్యాహార, ధారణలు మానసిక పరిధినీ; ధ్యాన, సమాధి ఆధ్యాత్మిక పరిధినీ తెలియజేస్తాయి.

యమం - ఏవి నిషిద్ధాలో తెలిపేది 'యమం'. ఏవిధంగా అయితే చిన్నపిల్లలు అత్యుత్సాహంతో ప్రతి విషయాన్ని తెలుసుకోవాలని ఉత్సుకతను ప్రదర్శిస్తారో అట్లే సాధన యొక్క ఆరంభంలో సాధకుని మనస్సు కూడా అంతే ఉత్సాహంతో నిండి ఉంటుంది. చిన్నపిల్లలు ఏమి చేయకూడదో తెలుసుకోవడం ద్వారా ఋజువర్తనులవుతారు. సాధకుడు ఏమి చేయకూడదో తెలుసుకోవడం ద్వారా సాధనాపథంలో పురోగమిస్తాడు. యోగసాధనా గమనంలో 'ఏమి చెయ్యాలి' అనేది ఎంత ముఖ్యమో 'ఏమి చేయకూడదు' అనేది కూడా అంతే ముఖ్యం. అందుకే అష్టాంగయోగసాధనలో 'యమము' ప్రథమస్థానంలో ఉంది.

నియమం - కేవలం ఏమి చేయకూడదో తెలుసుకున్నంత మాత్రాన చాలదు. ఆచరించవలసినవి ఏమిటో తెలుసుకోవడం కూడా అవసరం. అలా ఏమి చేయాలో తెలుసుకోవడం ద్వారా సాధకుడు దుఃఖం, ప్రమాదము, నేరము, అపరాధము, పాపము - వీటన్నింటినుండి తప్పించుకోవచ్చు.

ఆసనం - భంగిమ అని అర్థం. ఏదో ఒక భంగిమలో కళ్ళుమూసుకొని కూర్చోగానే ధ్యానసిద్ధిని పొందినట్లు చాలామంది అనుకుంటారు. ఆసనాలు నేర్చుకొనడంతోనే తమ యోగాభ్యాసం పూర్తి అయిందని భావిస్తారు.

ఆసనం అనేది అష్టాంగయోగంలో ఒక భాగం మాత్రమే. యోగాసనాలు అనేవి కేవలం ఒక పార్శ్వం మాత్రమే. నైతిక విలువలు, మానసిక నియంత్రణ, ఆధ్యాత్మిక దృక్పథం ఇవన్నీ యోగాభ్యాసానికి విభిన్న కోణాలు. 'ఆసనం' అనేది శారీరక భంగిమను మాత్రమేకాక మొత్తం శరీరం యొక్క స్థితిని సూచిస్తుంది.

చాలాసార్లు మనకు ఎలా కూర్చోవాలో, ఎలా నడవాలో కూడా తెలియదు. ఎలా కూర్చోవాలో, ఎలా నడవాలో కూడా నేర్చుకోవాలా? ఇవన్నీ తెలిసినవే కదా! అని అనుకుంటాం. పాఠశాల, కళాశాలల్లో కూడా కుర్చీలు, బల్లల సంస్కృతి రావడంతో నేటి విద్యార్థులకు ఎలా కూర్చోవాలో, ఏకాగ్రతను ఎలా పొందాలో చెప్పేవారే కరువయ్యారు.

ప్రాణాయామం - మనలో చాలామందికి సరిగా శ్వాసించడం ఎలాగో కూడా తెలియదు. శ్వాసించడం ఒక కళ. సరిగా శ్వాసించడమే సరిగా జీవించడం. సరైన శ్వాసల ద్వారా ఎన్నో శారీరక రుగ్మతల బారి నుండి బయటపడటమేకాక మానసిక ప్రశాంతతను సైతం పొందవచ్చు. శ్వాసించడం ఒక వ్యాయామం.

ప్రత్యాహారం - 'ఆత్మపరిశీలన లేని జీవితం వృథా' అని సోక్రటీస్ అంటారు. అందువల్ల మానసిక క్రమశిక్షణ ఎంతో ముఖ్యమైనది. మన మనోభావాలను పరీక్షించడం, ఆలోచనలను విశ్లేషించడం ద్వారా మన మానసిక స్థితి పట్ల పూర్తి అవగాహన కలుగుతుంది. ఈ రకమైన పరీక్షల ద్వారా మనస్సును నియంత్రించడమే ప్రత్యాహారం.

మానసిక ఆరోగ్యం సంపాదించాలంటే కావలసినవి మంచి ఆలోచనలు. మనిషికి మనస్సే సర్వస్వం. అందుకే శ్రీరామకృష్ణులు ఇలా అంటారు: "మానవులు మనస్సు చేతనే బంధింపబడతారు. మనస్సు చేతనే ముక్తులు గావింపబడతారు". వాస్తవానికి బంధమోక్షాలనేవి మనస్సులోనివే కాని బయట లేవు.

మనస్సులో నిక్షిప్తమయ్యే ఆలోచనల పరంపరకు అంతేలేదు. ఈ ఆలోచనల దొంతరను విశ్లేషించి క్రమబద్ధీకరించకపోతే వాటి ఉచ్చులో పడే అవకాశం ఉంది. 'ఈ ఆలోచనలను అనుసరించు, ఆ ఆలోచనలను అనుసరించ వద్దు' అంటూ మనస్సుకు పదే పదే హితబోధ చేస్తూ ఉండాలి. లేకపోతే, ఏదో ఒక బలహీన క్షణంలో మనస్సులోని చెడు ఆలోచనలు కార్యరూపం దాల్చే ప్రమాదం ఉంది. కాబట్టి మనం అత్యంత జాగరూకతతో జీవించాలి.

స్వామి సర్వగతానంద

ధారణ – ధారణ అంటే ఏ విషయంపై కావాలంటే ఆ విషయంపై మనస్సుని లగ్నం చేయగలగాలి. మీ వద్ద పదునైన మరమేకు, శక్తివంతమైన మర ఉంటే వాటితో అతి తక్కువ సమయంలో పనిని పూర్తిచేయవచ్చు. అదేవిధంగా క్రమశిక్షణతో కూడిన ఏకాగ్రత నొందిన చురుకైన మనస్సు అద్భుతమైన శక్తిని కలిగి ఉంటుంది. అటువంటి శక్తివంతమైన మనస్సుతో మీరు ఏ శాస్త్రాన్ని అభ్యసిస్తే ఆ శాస్త్రంలో నిష్ణాతులు అవుతారు. ఏ కళను సాధన చేస్తే ఆ కళలో నైపుణ్యాన్ని సాధిస్తారు.

ధ్యానం – ధ్యానమంటే మనస్సు యొక్క లోతును కొలిచే సాధనముగా చెప్పవచ్చు. ఆలోచనల వెనుక అంతర్నిహితంగా దాగి ఉన్న శక్తిని పరికించడమే ధ్యానం. మరి ఈ ఆలోచనల వెనుక ఉన్నది ఏమిటి? అసలు ఎటువంటి ఆలోచనలు లేని మనస్సును ఊహించగలమా? ఎప్పుడూ మంచి చెడులు, తప్పు ఒప్పులనే పరస్పర విరుద్ధాలైన ద్వంద్వాల చుట్టూ పరిభ్రమించే ఈ మనస్సు వెనుక ఉన్నది ఏమిటి?

ఈ మనస్సును శోధించడం ద్వారా ఆలోచనలను పరిష్కరించడం, సమాధానపరచడం – ఇదే ధ్యానం. ఇందుకొరకు అత్యంత క్రమశిక్షణతో కూడిన జీవితం అవసరం. ఎప్పుడైతే నైతిక విలువలను కోల్పోతామో అప్పుడు మన విచక్షణే మనల్ని బాధిస్తుంది.

మనం ఏదైనా తప్పు చేసినపుడు ఎవరూ శిక్షించనప్పటికీ మనకు మనమే పశ్చాత్తాపపడతాం. భగవంతుడు మనల్ని క్షమించవచ్చు. చట్టం బారి నుండి తప్పించుకోవచ్చు. కానీ మన విచక్షణ మనలను క్షమించదు. తప్పుకి తగిన మూల్యం చెల్లించాల్సిందే. పతంజలి వివరించిన నైతిక నియమాలను గూర్చి చర్చించే ముందు మనం శారీరకంగా, మానసికంగా సిద్ధం కావాలి. క్రమక్రమంగా ధ్యానంలో పురోగమిస్తూ ఉన్నత స్థాయినందుకున్నప్పుడు ఈ మనస్సు మనం అనుకున్నంత చెడ్డది ఏమీ కాదని మనకు అవగతమవుతుంది.

మనస్సు స్వతఃసిద్ధంగా స్ఫటికం వలే స్వచ్ఛమైనది, పరిశుద్ధమైనది. స్ఫటికం దగ్గరకు ఏదేని వస్తువును తీసుకువస్తే అది ఆ వస్తువుని ప్రతిబింబిస్తుందే కానీ ఆ వస్తువు యొక్క లక్షణాలను ఏమీ సంతరించుకోదు. అట్లే మనస్సు కూడా ఆలోచనలకను గుణంగా ఆ స్వభావాన్ని ప్రతిబింబిస్తుందే కానీ వాటి స్వభావాన్ని ఆపాదించుకోదు. నిజమైన ధ్యానం సిద్ధించినపుడు మనస్సు నుండి విషయవాసనలన్నీ తొలగిపోతాయి. ఎప్పుడైతే మన మనస్సు నుండి విషయవాసనలన్నీ తొలగిపోతాయో, అప్పుడు మనస్సు శుద్ధమై ఆధ్యాత్మిక పరిధిలోకి ప్రవేశిస్తాం.

సమాధి – మనస్సు పవిత్రమైనప్పుడు శుద్ధ చైతన్యంలో లయమవుతుంది. అదే సమాధి. పరిశుద్ధమైన హృదయం ఉన్నప్పుడే ఈ శుద్ధచైతన్యపు ఉనికిని గుర్తించగలం. ఎప్పుడు మనం ఈ శుద్ధచైతన్యంతో ఏకమవుతామో అప్పుడు మనం అదే అయిపోతాం. ఈ స్థితే అత్యున్నత ఆధ్యాత్మిక అనుభూతి. ఇదే మనఃశ్శరీరాలకు ఆవల ఉన్న ఆత్మచైతన్యం, ఆత్మానుభూతి.

ఆ పరమపదాన్ని చేరుకోవడానికే 'యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధి' అనే ఎనిమిది సోపానాలు రాజయోగంలో విశదీకరించబడ్డాయి. ❖ తెలుగు సేత : బ్రహ్మచారి శ్యామ్

(స్వామి సర్వగతానంద – భగవాన్ శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష సన్న్యాస శిష్యులైన స్వామి అఖండానందజీ మహారాజ్ శిష్యులు)

ధ్యానమంటే తుచ్ఛవిషయాలకు బానిస కాకుండా ప్రతిఘటించగలిగేలా మనల్ని సమర్థులను చేసే శక్తి. బహిర్ముఖమైన మనస్సును అంతర్ముఖం చేసి శాంతపరచడమే ధ్యానం. - స్వామి వివేకానంద

దేహస్పృహలేని మౌనధ్యాని



ఖేలతి మమ హృదయే రామః
ఖేలతి మమ హృదయే ॥
శాంతి విదేహా సుతా సహచారీ
దహరాయోధ్యా నగర విహారీ ॥

...ఇలా తన్మయత్వంతో పాడుకుంటూ వెళుతున్న అతనికి వెనుకగా, "బాబా! ఓ బాబా!" అనే పిలుపు వినపడింది. చూస్తే, కొద్దిదూరంలో ఒక పిల్లల గుంపు కనబడింది.

ఆ పిల్లలంతా పరుగున అతని దగ్గరకు వచ్చారు. "బాబా! ఈ రోజు నీ వద్ద తినుబండారం ఏమి ఉంది?" అని అడిగారు. తన దగ్గర ఏమీ లేదన్నట్లుగా తల అడ్డంగా ఊపాడు. ఒక చిన్నపాప, "బాబా! నీకు తెలుసా! ఈరోజు మదురైలో వృషభ వాహన ఉత్సవం జరుగుతుంది. అక్కడ ఎన్నో రకాల తినుబండారాలు, బొమ్మలు ఉంటాయట. నువ్వు మమ్మల్ని అక్కడికి తీసుకువెడితే మనం కూడా కొనుక్కోవచ్చు" అని కళ్ళు పెద్దవి చేస్తూ చెప్పింది. మిగిలిన పిల్లలంతా చప్పట్లు కొడుతూ "అవును, మాకు కూడా అక్కడికి వెళ్ళాలని ఉంది" అని అనసాగారు.

ఆ పిల్లల ఉత్సాహాన్ని చూసి బాబా నవ్వుతూ, "అయితే మీ పెద్దవాళ్ళకు చెప్పండి. వారు తీసుకువెడతారు" అంటూ నడక సాగించారు. కానీ ఆ పిల్లలు అతడిని వదలలేదు. అతని వెనుకే నడుస్తూ, బ్రతిమాలసాగారు. వారి మంకుపట్టు చూసి, అతను వారితో, "మదురై ఎంత దూరంలో ఉందో మీకు తెలుసా?"అని అడిగాడు. ఒక అమ్మాయి, "మాకు తెలుసు. చా...లా దూ..రంలో ఉంది. కానీ మనం వెడదాం" అంది. ఆ మాటలకు అతనికి నవ్వు వచ్చింది. "సరే! మీ అందరికీ ఉత్సవం నిజంగా చూడాలని ఉంటే, సాయంత్రానికల్లా ఈ చెట్టు దగ్గరకు వచ్చేయండి. వచ్చే ముందు మీ పెద్దవాళ్ళకు చెప్పి మరీ రండి"అని వారిని పంపాడు.

పిల్లలందరూ పట్టరాని సంతోషంతో వారి ఇళ్ళకు వెళ్ళాక, తామందరం ఉత్సవం చూడడానికి వెళతామనీ, అనుమతిని ఇవ్వమనీ తల్లితండ్రులను అడిగారు. వారికి అది హాస్యాస్పదంగా అనిపించింది. "ఏమిటి? ఆ పిచ్చివాడు రాత్రికి మిమ్మల్నందరినీ వృషభ వాహన ఉత్సవానికి తీసుకువెళతాడా? మదురై ఎక్కడుందో తెలుసా? అతను ఏదో పిచ్చిలో మీకు చెబితే మీరు అదంతా నమ్ముతున్నారా?" అంటూ, వాళ్ళ మాటలను పెద్దగా పట్టించుకోక వదిలేశారు.

పెద్దవాళ్ళకు అది అసాధ్యమైనదని తెలుసు, అందుకే అంతగా ప్రాధాన్యం ఇవ్వలేదు. కానీ, ఎప్పుడెప్పుడా అని ఈ పిల్లలంతా ఎదురుచూసే సంధ్యాసమయం కాగానే, ఈ ఏడెనిమిది మంది పిల్లలు ఎంతో ఆత్రుతగా ఆ పెద్దచెట్టు దగ్గర బాబా కోసం ఎదురు చూడసాగారు. అతను రానే వచ్చాడు. పిల్లలంతా ముక్తకంఠంతో, "మమ్మల్ని ఇప్పుడు మదురై తీసుకువెళ్ళాలి. మాకు కావలసినవి నీవు కొనిపెట్టాలి" అని అరవసాగారు. అతను చిరునవ్వుతో, "అలాగే, అలాగే!" అని అన్నాడు. అంతే! నిమిషకాలంలో వారంతా మదురై పురవీధిలో ఉన్నారు. ఉత్సవసంరంభంతో కళకళలాడే వీధులతో, వివిధ రకాలైన ఆకర్షణీయమైన వస్తువులు కలిగిన చిన్నా, పెద్దా దుకాణాలతో ఉన్న మదురైని చూసి పిల్లలు ఉబ్బితబ్బిబ్బవసాగారు.

అతను వారికి ఏది కావాలంటే అది కొనిచ్చాడు. వారు కావలసినంత తిన్నారు. కొనుక్కుందామని అనుకున్నవన్నీ కొన్నారు. గిర్రున తిరిగే కొయ్య గుర్రాలపై సవారీ చేశారు. చివరకు అలసిపోయి, "బాబా! ఇంక మనం వెళదాం" అని అన్నారు. దాంతో, బాబా మళ్ళీ అందరినీ భుజాలపైకి ఎక్కించుకుని, మునుపటిలాగా ఒక్క నిమిషంలో వారిని ఊరిలో దింపాడు.

ఆ మరునాటి ఉదయం విప్పారిన ముఖాలతో, రాత్రి తాము చూసిన అద్భుతాలను వారు ఆనందంతో వర్ణిస్తుంటే, ఆ పెద్దవాళ్ళకు నమ్మశక్యం కాలేదు. కానీ వారు తమతో తెచ్చుకున్న ఆటవస్తువులను చూపేసరికి వారు నిర్ఘాంతపోయారు. ఆ భిక్షుకుడు సామాన్యుడు కాదని వారికి అర్థమైంది. అతని కోసం ఊరంతా వెదకసాగారు. కానీ అతనికి తెలుసు ఇంక ఆ ఊరిలో ఉండడం తన సాధనకు అంతరాయమని! అందుకని ఆ పిల్లలను దింపగానే అక్కడి నుండి వెళ్ళిపోయాడు. అతని జాడ తెలుసుకోలేక బాధపడిన పెద్దవారితో పాటు, అన్నెంపున్నెం ఎరుగని ఆ పసిపిల్లలూ అతని కొరకు విలపించారు.

కావేరీ నది ఒడ్డున గల తిరువిశనల్లూర్ అనే కుగ్రామంలో అతను జన్మించాడు. ఈ గ్రామం కుంభకోణానికి దగ్గరలో ఉంది. అతను పుట్టినప్పుడు, అనేక శుభశకునాలు కనిపించినా, వాటిని

బయటపెడితే కొడుక్కి దృష్టి దోషం తగులుతుందని భయపడింది అతని తల్లి. అతనికి శివరాముడని నామకరణం చేశారు. శివరాముని తండ్రి మోక్షం సోమసుందర అవధాని. గొప్ప పండితుడు. ఆ దేశపురాజైన షాజి (క్రీ.శ.1684–1712) నలభై మూడు మంది పండితులను సత్కరించి, ఆ గ్రామంతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాలను కూడా వారికి దానంగా ఇచ్చాడు. అలా సత్కారం పొందినవారిలో ఒకరు – శివరాముని తండ్రి. దీనివల్ల వారికి ఆర్థిక సమస్యలు లేవు. అతనికి ఎనిమిదవ ఏట ఉపనయనం జరిగింది. అది అతని జీవితంలో అనూహ్యమైన మార్పును తెచ్చింది. అతను నిష్ఠగా జపతపాదులను ఆచరించసాగాడు. అద్వైత వేదాంతంపై ఎక్కువ మక్కువ చూపేవాడు. శ్రీశంకరుల రచనలను ఎంతో శ్రద్ధగా చదువుతూ, వాటిని బాగా మననం చేసుకుంటూ, గంటల కొద్దీ ధ్యానావస్థలో గడిపేవాడు. ఆ ఏకాగ్రత, ధ్యాన తత్పరత చూసి, అలాగే విడిచిపెడితే సన్న్యాసం స్వీకరిస్తాడేమోనని భయపడిన అతని తల్లితండ్రులు పదో ఏట వివాహం చేశారు.

ఒకసారి శివరాముడు అత్తవారింటికి వెళ్ళాడు. ఓ బాలిక వచ్చి అతనికి నమస్కారం చేయగా, 'ఈమే నీ భార్య' అని అతనికి వారు పరిచయం చేశారు. భార్య అన్న మాట అతనికి విద్యుదాఘాతం లాగా అనిపించింది. చాలాసేపు అలాగే ఉండి, మెల్లిగా 'ఈ బంధాలు, అనురాగాలు శాశ్వతం కాదు. వీటిని విసర్జించవలసినదే' అని తీర్మానించుకుని, ఎవరికీ చెప్పకుండానే ఆ ప్రదేశం వీడి, తన ఒంటరి ప్రయాణం ఆరంభించాడు.

కావేరీ నది ఒడ్డున, ఒక వటవృక్షం క్రింద ధ్యానావస్థలో ఉన్న సన్న్యాసి పరమశివేంద్ర సరస్వతిని, "ఓ పూజనీయా! దయతో నన్ను మీ శిష్యునిగా స్వీకరించండి" అని ప్రార్థించాడు. కళ్ళు తెరిచి చూసి, "ఎవరు బాబు నీవు? నీకు ఏమి కావాలి?" అని ఆ సన్న్యాసి అడిగారు. దానికి, శివరాముడు, "నేను సత్యాన్వేషిని. ఈ 'నేను' ఎవరో కనుగొనాలనే మీ వద్దకు వచ్చాను" అని బదులిచ్చాడు. ఆయన మందహాసం చేసి, "బాగు బాగు! నీవెవరో నీకు తెలియాలి, అంతే కదా!" అని అన్నారు. ఆ విధంగా అక్కడ చేరిన శివరాముడు, అక్కడే విద్యార్థి అయి, తదనంతరం సన్న్యాసం స్వీకరించి 'సదాశివ బ్రహ్మేంద్ర సరస్వతి'గా నామాంతరం చెందారు.

సన్న్యాసం స్వీకరించిన తరువాత అతనిలో వైరాగ్యభావనలు, దేవుని పట్ల ప్రేమ, సత్యాన్వేషణ మరింతగా పెరిగాయి. అయితే అతనికి పాండిత్య ప్రదర్శనమన్నా, పండితులన్నా ఒక రకమైన ద్వేషం కలిగి, పండితులను వాదానికి పిలిచి మరీ ఓడించసాగారు. ఇది గమనించిన అతని గురువు "నీకు వాచాలత ఎక్కువ అవుతున్నది; దాన్ని కాస్త అదుపు చేసుకో; అది సాధనకు అవరోధం అవుతుంది" అని మందలించారు. అంతే! అప్పటి నుండి అతను పూర్తి మౌనంలో ఉండసాగారు. ఎంతో అవసరమైతే తప్ప మాట్లాడేవారు కాదు. అవీ – చిన్న చిన్న మాటలు. గురువు గారి ఆజ్ఞకు అంతటి విలువనిచ్చాడు ఈ ఉత్తమ శిష్యుడు.

ఆ తరువాత కొంతకాలానికి, గురువుగారి ఆశీస్సులు పొంది, అక్కడ నుండి తన ప్రయాణం మొదలుపెట్టాడు. దేహస్పృహ లేక, ఆహార విషయం కూడా పట్టించుకోక, చెట్లను నివాసస్థలాలుగా ఎంచుకుంటూ, పశుపక్ష్యాదులతో సహజీవనం చేస్తూ, తీవ్రసాధనలలో మునిగిపోయేవారు. ఆధ్యాత్మికత తెచ్చిన వింతకాంతితో అతని శరీరం మెరవసాగింది. అలా సంచారం చేసే రోజులలోనే, ఒక పల్లెటూరిలోని చిన్నపిల్లల కోరిక ద్వారా అతని గొప్పతనం లోకానికి వెల్లడి అయింది.

సదాశివ బ్రహ్మేంద్ర స్వామి కొంతకాలం సమాధిలో ఉండగా, మట్టితో అతని శరీరం కప్పబడి పోయింది. సుమారు నాలుగైదు నెలల తర్వాత మట్టి కోసం కొందరు తవ్వుతుంటే బాహ్యస్పృహ లేని సదాశివ బ్రహ్మేంద్ర స్వామి కనిపించారు. పార తగిలినందున ఆయన ఎడమచేయి తెగి రక్తం బయటకు వచ్చింది. స్వామి స్పృహలోకి వచ్చిన తరువాత మందహాసం చేస్తూ మెల్లిగా అక్కడ నుండి వెళ్ళిపోయారు.

కొండ మీద ఉన్న ఊరిని దాచేద్దామని ప్రయత్నించినా, అది దాగనట్లుగా, స్వామి పేరుప్రఖ్యాతులను ఆశించకపోయినా, అవి తమంతట తామే వారి వద్దకు రాసాగాయి. తొండమాన్ చక్రవర్తి, స్వామిని కలిసి, తనకు అన్నీ ఉన్నా సంతానం లేదనీ, తపస్సు చేసినా ప్రయోజనం చేకూరలేదనీ, తనను ఆదుకోమనీ ప్రార్థించాడు. స్వామి మనస్సు కరిగి, ఇసుకలో ఏదో వ్రాసి, ఆ రాజుకు చూపించారు. అది ఆయనకు అర్థం కాలేదు. మంత్రం ఉపదేశించబోగా, రాజు ఆసక్తి చూపనందున, ఆ ఇసుకలో వ్రాసిన దానిని తుడిచేసి, వేగంగా అక్కడ నుండి వెళ్ళిపోయారు. ఆ చక్రవర్తికి అప్పటికి తన తప్పిదం అర్థమైనా, చేసేది ఏమీ లేక స్వామి చేయి తగిలిన ఆ ఇసుకనంతా ఒక సంచిలో వేసి రాజభవనానికి చేర్చాడు. తరువాత కొద్ది కాలానికే అతనికి సంతతి కలిగింది. అతని ఐశ్వర్యం, పేరుప్రఖ్యాతులు మరింతగా పెరగడంతో, రాజపరివారమంతా ఆ ఇసుకను పవిత్రమైన విభూతి వలె ధరించేవారు.

సదాశివ బ్రహ్మేంద్రస్వామికి అద్వైతం పట్ల మక్కువ ఉన్నా, భక్తిరసాత్మకమైన కీర్తనలు అనేకం రచించి గానం చేసేవారు. కరూర్ వద్ద ఉన్న నెరూర్ అనే గ్రామంలో, కావేరీ నది ఒడ్డున దేహత్యాగం చేస్తానని ముందుగానే చెప్పారు. స్వామి స్మృత్యర్థంగా నిర్మించిన సమాధిని నేటికీ దర్శించవచ్చు. ❖

తెలుగు సేత: డాక్టర్ అపర్ణా శ్రీనివాస్

(రామకృష్ణ సంఘ ఆంగ్ల మాసపత్రిక – 'ప్రబుద్ధ భారత' నుండి)

నీటికాకి శరీరానికి నీటి చుక్కలు అంటుకున్నా అది రెక్కలను టపటపలాడించగానే అవి రాలిపోతాయి. అలాగే, ముక్తపురుషుడు ఈ లోకంలో నీటికాకిలాగ జీవిస్తాడు. - శ్రీరామకృష్ణులు

పరిప్రశ్న

– స్వామి భూతేశానంద

(రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు)

రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు - స్వామి భూతేశానందజీ మహరాజ్ (1901-1998) భక్తుల ఆధ్యాత్మిక సందేహాలకు సరళమైన రీతిలో ఇచ్చిన సమాధానాలను 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకుల ప్రయోజనార్థం 2013 జూలై సంచిక నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

భక్తుడు: 'భవరోగం' అంటే ఏమిటి? భవరోగ విముక్తికి మార్గమేమిటి?

స్వామీజీ: 'భవ' అంటే ప్రపంచం. ప్రపంచంలో అనుభవించే దుఃఖమే – 'భవరోగం'. దారాసుతులు, సిరిసంపదలు, పేరుప్రతిష్ఠల పట్ల ఉండే మమకారమే భవరోగాలకు హేతువు. ఈ భవబంధాల వల్ల దుఃఖం పొందుతున్నప్పటికీ దాని నుండి బయటపడడానికి మనస్సు ఇచ్ఛగించదు.



భార్యాపుత్రుల మోసానికి గురై, ఇంటి నుండి గెంటివేతకు గురైన సమాధి అనే వ్యాపారి తన మానసిక స్థితి గురించి (దేవీ మాహాత్మ్యం -1.32) వివరిస్తూ...

కిమే తన్నాభి జానామి జానన్నపి మహామతే।
యత్ప్రేమప్రవణం చిత్తం విగుణేష్వపి బన్ధుషు॥

'ఓ రాజా! నా భార్యా పుత్రులు దుర్గుణులైనప్పటికీ, వారు నన్ను ద్వేషిస్తున్నప్పటికీ నా చిత్తం మాత్రం వారి యందే ప్రేమాయత్తమై ఉన్నదే! ఏమి చిత్రం!' అని అంటాడు.

ఈ ప్రపంచంలో చాలామంది దుఃస్థితి ఇలాంటిదే! కుమారుడు ఎన్ని బాధలు పెడుతున్నప్పటికీ వాటన్నింటినీ సహిస్తూ 'నా కొడుకే కదా!' అన్న మమకార పాశానికి బందీయై, జీవితాన్ని గడపడానికి ఇష్ట పడతాడు. కానీ ఆ మమకార బంధాన్ని తెంపుకోవాలనే ప్రయత్నం మాత్రం చేయడు.

మనిషి తన పిల్లలు హింసిస్తున్నా, వారి పట్ల మమకారాన్ని వీడలేడు. శరీరం శిథిలమైపోతున్నా, భోగవాంఛను త్యజించలేడు. ఆయుష్షు క్షీణిస్తున్నా ఆశల్ని వదులుకోలేడు. ఇవన్నీ భవరోగాలే!

ఒక వృద్ధ స్త్రీ తలపై కట్టెలమోపు మోసుకుంటూ వెళుతుంది. కొంతదూరం వెళ్ళాక ఆ కట్టెలమోపు మోయలేక కింద పడేసి 'భగవంతుడా! ఇక ఈ కష్టాలు చాలు. దయ తలచి నన్ను తీసుకుపో' అని ప్రార్థించింది. వెంటనే ఆమె ముందు యమధర్మరాజు ప్రత్యక్షమయ్యాడు. అతణ్ణి చూసి ఆ వృద్ధురాలు 'నాయనా! ఈ మోపు కాస్త మా ఇంటి వరకూ మోసుకురా!' అని యముడికే పని చెప్పింది.

భవబంధాలకు లోబడి బానిసల్లా జీవిస్తున్నామే గానీ బంధ విముక్తులను చేయడానికి ఆ భగవంతుడు వచ్చినా అందుకు అంగీకరించం. ఈ కలియుగంలో భవరోగాలకు మందు భగవన్నామమే! కాబట్టి నిత్యం భగవన్నామాన్ని స్మరిస్తూ స్వధర్మాలను ఆచరిస్తే – ఎవరి పట్లా, దేనియందూ మమకారం జనించదు. భగవంతుని చేతిలో పరికరాలమనే శరణాగతి భావంతో కర్మలు చేస్తూ జీవించగలిగితే భవరోగాల బాధల నుండి విముక్తి లభిస్తుంది.

భక్తుడు: ప్రారబ్ధకర్మకీ, కర్మఫలానికీ తేడా ఏమిటి?

స్వామీజీ: మనం చేసిన కర్మల వల్ల కలిగే ఫలితాన్ని 'కర్మఫలం' అంటారు. ఆ కర్మఫలం అనుభవించడాన్ని 'ప్రారబ్ధం' అంటారు. వదిలిన బాణం లాంటిది – ప్రారబ్ధం. ఒక్కసారి విల్లు నుండి వదిలిన బాణాన్ని తిరిగి వెనుకకు తీసుకోలేనట్లే, ఒక్కసారి కర్మఫలం అనుభవించడం మొదలైతే ఆ ఫలితం ఎలాంటిదైనా అనుభవించాల్సిందే! ప్రారబ్ధం నుండి ఎవరూ తప్పించుకోలేరు. భగవంతుని కృప ఉంటే ప్రారబ్ధ తీవ్రత తగ్గుతుందేగానీ, దాని నుండి తప్పించుకోవడం మాత్రం సాధ్యం కాదంటూ మాతృమూర్తి శ్రీశారదాదేవి ఇలా చెప్పారు: "ప్రారబ్ధానుసారం ఒక వ్యక్తికి నాగటికర్రు గుచ్చుకోవలసి ఉంటే, భగవత్కృప వల్ల ముళ్ళు గుచ్చుకుంటుంది".

మనం చేసే కర్మలను అనుసరించే ఫలితాలు కలుగుతాయి. సత్కర్మలు చేస్తే సత్ఫలితాల్నీ, దుష్కర్మలను చేస్తే దుష్ఫలితాల్నీ పొందుతాం. కాబట్టి మనం చేసే ప్రతీ కర్మనూ అత్యంత జాగరూకతతో నిర్వర్తించాలి. ❖

– స్వామి వివేకానంద

ఇచ్ఛాశక్తి వ్యక్తీకరణే విద్య

విద్య అంటే ఏమిటి? పుస్తక పాండిత్యమా? కాదు. వివిధ శాస్త్ర జ్ఞానమా? అదీ కాదు. ఏ శిక్షణ వల్ల ఇచ్ఛ, దాని వ్యక్తీకరణం ఫలవంతం అవుతుందో అదే విద్య. దేని వల్ల తరతరాల నుండి నిరంతరం బలాత్కరింపబడినదై, ఇచ్ఛాశక్తి స్తబ్ధమై, నేడు ఇంచుమించుగా వినాశనం పాలైందో, దేని ప్రభావం చేత కొత్త భావాల మాట అటుంచి, పూర్వభావాలు కూడా ఒక్కొక్కటిగా అంతర్ధానం చెందుతున్నాయో అదా విద్యంటే? ఏది మానవుణ్ణి మెల్లిగా యంత్రంగా మార్చివేస్తుందో అదా విద్య?

యంత్రం మాదిరి ప్రవర్తిస్తూ, సన్మార్గంలో ఉండడం కంటే స్వతంత్రమైన ఇచ్ఛ చేత, జ్ఞానం చేత ప్రేరేపితమై తప్పులు చేయడమైనా మంచిదని నా అభిప్రాయం. ఎక్కడ మానవులు మట్టి ముద్దల లాగానో, నిర్జీవాలైన యంత్రాల లాగానో, పేర్చిపెట్టిన గులకరాళ్ళ లాగానో ఉంటారో అలాంటి దాన్ని సంఘం అనడం తగునా? అలాంటి సమాజం బాగుపడడం ఎలా? దాని వల్ల అభ్యుదయమనేది సాధ్యమైతే శతాబ్దాల నుండి మనం బానిసలమై ఉండడానికి బదులు ప్రపంచంలో మహోత్తమ జాతి అయ్యుండేవారం. నిరక్షరాస్యులతో, మూఢులతో నిండివుండడానికి బదులు ఈ భరతభూమి శాశ్వత విద్యానిధి అయ్యుండేది.

అలా అయితే, స్వార్థత్యాగం సుగుణం కాదా? బహుజన హితార్థం, బహుజన సుఖార్థం జీవించడం మహోత్తమమైన ధర్మం కాదా? నిశ్చయంగా! కానీ, బెంగాలీ సామెత చెప్పినట్లు "రుద్దుకోవడం, తోముకోవడం వల్ల సౌందర్యాన్ని తెచ్చుకోగలమా? ప్రయత్నం వల్ల, బలాత్కారం చేయడం చేత ప్రేమను పుట్టింపగలమా?"

'అభావే విరక్తి' అన్నట్లు, నిత్యదరిద్రుని వైరాగ్యంలో ఘనత ఏముంది? అదే విధంగా త్యాగమనే ఆశయమే లేని, ఔదార్యమే లేని, సదాశయమే లేని, సమాజమంటే ఏమో తెలియనివాని 'స్వార్థత్యాగం' అనే మాటలో అర్థమేముంది?

ధీరుడైనవాడే స్వార్థాన్ని త్యజించగలడు. కొరడా దెబ్బను చూసి పిరికిపంద భయపడి, ఒక చేత్తో కళ్ళు తుడుచుకొంటూ, మరొక చేత్తో దానం ఇస్తున్నాడు. అలాంటి దానం వల్ల ప్రయోజనమేముంది? సర్వజనులను ప్రేమించడం అనేది కలలోని వార్త. ఒక్కరిని నిస్వార్థంగా ప్రేమించగలగడం నేర్చుకొనగలిగితే, క్రమంగా విశ్వమానవప్రేమను సాధించవచ్చు. ఒక ఇష్టదేవతలో భక్తి కుదిరితే, విరాట్‌రూపంలో భక్తి క్రమంగా సాధ్యమవుతుంది.

కాబట్టి ఒక వ్యక్తి కోసం స్వార్థాన్ని వదలగలిగినప్పుడే స్వార్థత్యాగం గురించి మాట్లాడాలి. అంతకుముందు కాదు. కామ్యకర్మే నిష్కామకర్మకు దారితీస్తుంది. ప్రారంభంలో కోర్కె అనేది లేకుంటే, కోర్కెను త్యాగం చేయడం సాధ్యమవుతుందా? చీకటి అనేది లేకుంటే, వెలుతురు అనే మాటకు అర్థమేమిటి?

కోరికతోనూ, రాగంతోనూ ఉపాసన ప్రారంభమవుతుంది. అల్పమైన ఉపాసనతో ప్రారంభించు. తర్వాత ఉత్తమ, తత్త్వోపాసన దానంతట అదే వస్తుంది. ❖



మనం ఓ మూల కూర్చొని మనలోని లోపాలను గురించి దుఃఖించడం వల్ల కలిగే ప్రయోజనమేమీ లేదు. వాటిని అధిగమించడానికి చేసే ప్రయత్నమే ఆత్మోన్నతిని కలుగజేస్తుంది. - స్వామి వివేకానంద

మహిమలు ముక్తినిస్తాయా?

'మానవ జీవిత లక్ష్యం భగవత్సాక్షాత్కారమ'ని శ్రీరామకృష్ణులు భక్తులకు ఉపదేశించేవారు. అయితే బాబాలు, గురువులు చూపే మహిమల వల్ల జీవితంలో ఎదురయ్యే కష్టనష్టాలు తీరుతాయనీ, భోగభాగ్యాలు కలుగుతాయనీ, ఆ మహిమలతో పొందిన సుఖసౌఖ్యాల అనంతరం ముక్తి సాధించ వచ్చనీ సాధారణంగా అనిపిస్తుంది. నేటి సమాజంలో భక్తులు, సాధకులలో ఎక్కువమంది మహిమలు చూపే వారి పట్ల ఆకర్షితులై, ఆ మహిమలనే సుడిగుండంలో చిక్కుకొని అదే భక్తి సాధన అని భావిస్తూ, తమ జీవితాదర్శమైన దైవసాక్షాత్కారాన్ని మరుస్తున్నారు. అంతేకాదు అసలు మహిమలే చూపని గురువులను ఆశ్రయించడం వృథా అని కూడా అనుకుంటారు.

మహిమలు మాయ వలలు: ముక్తి లేక భగవత్సాక్షాత్కార సాధనలో మహిమలకు ఎంత మాత్రమూ స్థానం లేదని మహాత్ములంటారు. మహిమలనే మాయ వలలో చిక్కినవారు వాటి నుండి తప్పించుకొని బయట పడడం కష్టసాధ్యం. మహిమల గురించి 'వృక్షారోహణవత్' అని ఋషులు చెప్పారు. అంటే ఒక వ్యక్తికి, వానరం కన్నా సునాయాసంగా వృక్షాన్ని ఎక్కగల సామర్థ్యం ఉంది. మరొకరికి చిన్న చెట్టు ఎక్కడం కూడా చేతకాదు. మొదటివాడికి మోక్షం వస్తుంది, రెండవవాడికి రాదు అనగలమా? కాబట్టి ఇటువంటి సామర్థ్యానికీ, ముక్తికీ సంబంధం లేదు.

మహిమలు అహంకార కారకాలు: కొద్దిపాటి మహిమలు పొందినా, అవి అహంకార హేతువులై, ముక్తిని దూరం చేస్తాయి. త్రిశంకు స్వర్గాన్ని తన తపశ్శక్తిని ధారపోసి సృష్టించిన విశ్వామిత్రుడు తపశ్శక్తిని కోల్పోయి, మోక్షానికి దూరమయ్యాడు. అంతేకాదు మన ఇతిహాసాలలో దర్శనమిచ్చే క్షుద్ర రాక్షసులందరికీ ఆకాశంలో విహరించడం, ఏ రూపం కావాలంటే ఆ రూపం ధరించడం, మాయాయుద్ధం చేయడం, హఠాత్తుగా మాయమవడం, రక్తబిందువుల నుంచి మహా బలసంపన్నులైన రాక్షసులను సృష్టించడం వంటి శక్తులున్నాయనీ, అహంకారంతో వాటిని దుర్వినియోగం చేశారనీ మనకు తెలుసు. ఈ శక్తులున్నాయి గదా అని రాక్షసులను మహాత్ములనలేం కదా!

మహాత్ములకు సిద్ధులుంటాయా? మహాత్ములకు కూడా తప్పక సిద్ధులుంటాయి. అయితే మహాత్ముల లక్షణం సిద్ధులు ఉండడం – ఉండకపోవడం కాదు. కొంతమంది వద్ద అపార మహిమలు ఉండవచ్చు. మరికొంతమంది వద్ద ఒక్క మహిమ కూడా ఉండకపోవచ్చు. కానీ వారిద్దరూ సమానమైన మహాత్ములే కావచ్చు. మహాత్ములనడానికి ముఖ్య అర్హత వారు సాధించిన పారమార్థిక ప్రగతే కానీ మహిమలు కాదు.

కొంతమంది మహాత్ములు తమకు మహిమలున్నా వాటిని ప్రదర్శించరు. ఎందుకంటే ఆ మహిమల వల్ల పారమార్థిక జీవనంలో ఎలాంటి ప్రయోజనమూ ఉండదు కాబట్టి! ముక్తి సాధనలో మహిమలకు ఏ విధమైన స్థానమూ లేదని నిజమైన సాధకులు గుర్తించగలుగుతారు. మార్గదర్శి అయిన గురువు కూడా అదే సలహాను సాధకులకిస్తారు.

మహిమల గురించి మహాత్ములు: సాధారణ మహిమలు సాధకులనూ, ప్రజలనూ తప్పుదోవ పట్టిస్తాయి. కానీ ఆత్మజ్ఞానంతో లభించే శక్తులు లోకహితం చేస్తాయి. మహాత్ములు కూడా తమ దివ్యలీలలను అవసరాన్ని బట్టి భక్తుల పారమార్థిక శ్రేయస్సు కోసం గానీ, లోక కల్యాణం కోసం గానీ ప్రకటిస్తారు.

1886 జనవరి 1వ తేదీన కల్పతరు దినాన శ్రీరామకృష్ణులు చూపిన మహిమలు ఆనాడు అక్కడున్న భక్తులందరికీ అద్భుతమైన దివ్యానుభూతిని కలగజేసి, వారి ఆధ్యాత్మిక పురోభివృద్ధికి తోడ్పడ్డాయి. అయితే ఆ పురోభివృద్ధి అందరిలో ఒకే రకంగా లేదు. వారి వారి మనోవృత్తులు, స్థాయిని అనుసరించి విభిన్నంగా వ్యక్తమైంది. ఆ సమయంలో అక్కడున్న ఉపేంద్రనాథ్ ముఖోపాధ్యాయ భౌతిక సంపదను ఆశించి తనకు ధనం కావాలని కోరాడు. శ్రీరామకృష్ణులు అతనికి సమృద్ధిగా సంపద లభిస్తుందని దీవించారు. ఆ తరువాత కాలంలో ఉపేంద్రనాథ్ సంపన్నుడై, తనకున్న ధనంతో ప్రింటింగ్ ప్రెస్ ప్రారంభించి తన గురువు శ్రీరామకృష్ణుల ఉపదేశాలను పత్రికలు,

కరపత్రాలలో ముద్రించి శ్రీరామకృష్ణ భావప్రచారంలో ముఖ్యపాత్ర పోషించాడు. అంటే భక్తులు లౌకిక విషయాలనే కోరినా, మహాత్ములు వారు కోరినవి మహిమల ద్వారా సమకూరుస్తూ, వారి మనస్సును ఆత్మజ్ఞానం వైపు నడిపిస్తారు. అందుకనే భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ కూడా తన భక్తులలో రకాలను వివరిస్తూ "ఆర్తో జిజ్ఞాసు అర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ" అన్నారు.

అంటే స్థాయీ భేదాన్ని బట్టే, మహిమల యెడల సాధకులు ఆకర్షితులవుతారు.

లౌకికమైన కోరికలతో మహాత్ములను సందర్శించకూడదా?: ఒక మహామహుణ్ణి ఇదే ప్రశ్న అడిగితే ఆయన సమాధానమిస్తూ తన వద్దకు మొదట అందరూ లౌకికమైన కోరికలతోనే వస్తారు కానీ వారి కోర్కెలు తీరి ఒక స్థాయికి చేరుకున్నాక తననను సరించి సన్మార్గానికి మరలుతారని చెప్పారు. శ్రీరామకృష్ణులను ఆశ్రయించిన గిరీశ్‌చంద్రఘోష్, కాళీపదఘోష్, ఉపేంద్రనాథ్ ముఖోపాధ్యాయ వంటి శిష్యుల జీవితాలు ఈ భావాన్నే వెలువరిస్తాయి. కానీ సాధారణంగా 90 శాతం మంది సాధకులు మహిమలనే క్రూరమృగాలకు బలి అయి, వాటి దగ్గరే ఆగిపోతారు. వారి సాధన అక్కడితోనే ముగుస్తుంది; ఆ మహిమల చుట్టే తిరుగుతుంటారు. అందుకనే భగవద్గీతలో శ్రీకృష్ణుడు సిద్ధుల గురించి అర్జునుణ్ణి వారిస్తూ, 'అష్టసిద్ధులలో ఏ ఒక్కటి ఉన్నా, నన్ను పొందలేర'ని అన్నాడు. ఎందుకంటే అవి అహంకారాన్ని పెంచి, భగవంతుణ్ణి మరిచేలా చేస్తాయి. హైదరాబాద్ నుంచి విశాఖపట్టణం వెళ్ళదలచిన వారు రైలు ఎక్కి వెళుతూ విజయవాడ స్టేషన్‌లోని 'స్వీట్‌స్టాల్'ను చూసి, అక్కడే దిగిపోయి, తమ గమ్యస్థానాన్ని (విశాఖపట్టణం) మరచినట్లే ఉంటుంది – మహిమల దగ్గరే సాధకులు ఆగిపోవడం!

మహిమలను ఎలా పొందవచ్చు? : తాంత్రిక సాధనల ద్వారా, తపస్సు ద్వారా ఎన్నో సిద్ధులు, మహిమలను పొందవచ్చునని పెద్దలు చెబుతారు. అయితే అలా పొందిన సిద్ధులు, మహిమల వల్ల ఆ శక్తి సాధించిన వారికే ప్రమాదం కలిగే అవకాశం ఎక్కువ. 'భస్మాసురహస్తం' ఈ విషయంలో మనకు తెలిసిన ప్రఖ్యాత ఉదాహరణ. మరి మహాత్ములకు మహిమలెలా వస్తాయి? వారు కూడా మహిమలు కావాలని కోరుకొని సాధిస్తారా? లేదు!

మహాత్ముల మహిమలు: మహాత్ముల మహిమలు తమ ప్రయత్నంతో ప్రదర్శించేవిగా ఉండవు. అవి ఆకాశంలోని సూర్యోదయంలా, పుష్పాలకుండే సువాసనలా సందర్భాన్ని అనుసరించి, అవసరాన్ని బట్టి అత్యంత సహజంగా వెలువడతాయి. అవి ఆహ్లాదకరమైన వాతావరణంలో మందంగా వీచే పిల్లగాలులలాగా, మనస్సులో మెదిలే భావనల లాగా, ఆకాశంలో కనిపించే రంగు రంగుల ఇంద్రధనుస్సు లాగా భక్తుల అనుభవంలోకి వచ్చి, దివ్యానుభూతిని కలగజేసి వారి హృదయాలను రంజింపజేస్తాయి. అంతేకాదు తమకు ఆ అనుభూతిని ప్రసాదించిన మహాత్మునిపై వారి విశ్వాసాన్ని దృఢతరం చేస్తాయి. మహాత్ముల శక్తులు ఆత్మజ్ఞానంతో లభించేవే కానీ, కోరి సాధించే శక్తులు కావు.

మహిమలను ప్రకటించమంటూ సంత్ తులసీదాసును మహారాజు నిర్బంధిస్తాడు. అప్పుడాయన అవి శ్రీరామచంద్రుడు భక్తుల దీనస్థితిని బాపడానికి అవసరాన్ని బట్టి ఇచ్చినవే కానీ, తనకటువంటి శక్తులేవీ లేవని అంటాడు. అతని మాట వినకుండా బలవంతం చేసిన మహారాజు కొరడాలతో దండించబోతే అక్కడ హఠాత్తుగా హనుమంతుడు అనేక భయంకర వానరాలుగా ప్రత్యక్షమై, తులసీదాసును రక్షిస్తాడు. ఆ విధంగా మహిమలు అగోచరమైన సహజ శక్తులుగా మహాత్ములను వరిస్తాయి.

మహిమల గురించి శ్రీరామకృష్ణులు: "ఇష్ట పూర్వకంగా మహిమలు ప్రకటించే వాళ్ళ మనస్సు ఎప్పుడూ సిద్ధుల సాధనలోనే మునిగి ఉంటుంది కాబట్టి వాళ్ళు భగవత్సాక్షాత్కారానికి దూరమవుతారు. సిద్ధులను అశుద్ధం వలె త్యజించాలి. పారమార్థిక సాధనలు చేసేటప్పుడు సిద్ధులు వాటంతటవే కలుగుతాయి. వాటిపై మనస్సు నిలిపితే

(మిగతా 32వ పేజీలో...)

రోగనివారణ చేయడం,వ్యాజ్యాలను గెలిపించడం లాంటి సిద్ధులను ప్రయోగించేవారు అల్ప బుద్ధులు. పరమేశ్వర చరణారవిందాలను తప్ప మరిదేన్నీ కోరనివారే నిజమైన భక్తులు. - శ్రీరామకృష్ణులు

కత్తి మీద

యువతకు వివేకానందుడిని పరిచయం చేసే ఉద్దేశ్యంతో యువజన సమ్మేళనాలను నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమాలలో ప్రశ్న–సమాధానం కూడా ఒక ముఖ్యమైన అంశం. విద్యార్థులు రకరకాల ప్రశ్నలను సంధించేవారు. అందులో కొన్ని ఇబ్బంది కలిగించేవీ లేకపోలేదు. ఒకానొక యువజన సదస్సులో ఒక యువకుడు స్వామీజీ 'ఈ మధ్య బాబాలు, స్వామీజీల గురించి రకరకాల వార్తలు వింటున్నాం, వారి గురించి మీరేమంటారు?' అని కొంచెం మొహమాటంతోనే అడిగాడు. ఇలాంటి సందేహం ఇంకా చాలామందిలో కూడా ఉండవచ్చునని స్వామీజీ కొంచెం వివరంగా ఆ ప్రశ్నకు సమాధానం చెప్పటానికి ప్రయత్నించారు. ఆ సమాధాన సారమేమంటే...

ప్రతిదాంట్లో కొంత మంచి చెడు ఉంటుంది. ప్రపంచం అంటేనే మంచి చెడుల మిశ్రమం. ఇక్కడ ప్రజల విశ్వాసాలు, నమ్మకాల దగ్గరకు వచ్చేసరికి ఆశ్రమాలు, స్వామీజీలు, ఆధ్యాత్మిక గురువులు అంటే వారు ఎప్పుడు కూడా నిందలకు గురి కాకూడదు. వారిమీద ఎలాంటి అభియోగాలు రాకూడదు అనుకుంటారు. అలా అనుకోవటంలో తప్పులేదు. కానీ అది కొద్దిపాటి దురాశయే. ఎందుకంటే సన్న్యాస ఆశ్రమం అంటే అది కఠినాతి కఠినమైనది.

కత్తి అంచుమీద నడవడం....: ఆధ్యాత్మిక మార్గం అనేది ఋషుల మాటల్లో చెప్పాలంటే, *'క్షురస్య ధారా నిశితా దురత్యయా..'* అంటే పదునైన కత్తిఅంచుమీద నడవడం లాంటిది. అలాంటి మార్గాన్ని ఎంచుకున్న వారు సదా కడు జాగరూకతతో ప్రవర్తించాలి. నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. ఇది లోపించి ఏమరుపాటు, ప్రమత్తత ప్రవేశించిన వెంటనే పతనం ఖాయం. ఆదర్శం కఠినాతి కఠినమైనది కాబట్టి ఆదర్శం నుంచి వైదొలగిన వారు, ఆదర్శాన్ని దిగజార్చినవారు తరచుగా కనపడటంలో ఆశ్చర్యమేమీ లేదు. కానీ ప్రతిదాంట్లోని మంచిని, చేసిన సత్కార్యాలని వెంటనే గుర్తించని మనం వ్యక్తి దిగజారినప్పుడు వెంటనే దృష్టిని సారిస్తున్నాం. కానీ ఆదర్శం ఎంత ఉన్నతమైనదో తెలుసుకోవటానికి ప్రయత్నించట్లేదు.

మనదేశానికి చెందిన కైలాస్ సత్యార్థికి ఒక్క పద్మబిరుదు కూడా రాలేదు. నోబెల్ బహుమతిని ప్రకటించే వరకు ఆయన పేరును మనం కూడా వినలేదు. ముప్పై సంవత్సరాలు నిశ్శబ్దంగా పనిచేసుకుంటూ పోయి ఎందరో చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపిన వ్యక్తి మనదేశంలో ప్రభుత్వ దృష్టిలో గానీ, మన ప్రసార మాధ్యమాల దృష్టిలో గానీ నోబెల్ బహుమతి వచ్చేవరకు ఒక అనామకుడు. ఉదాహరణకు రామకృష్ణ మఠం, మిషన్‌లలో నూట ఇరవై సంవత్సరాల నుంచి కొన్నివేలమంది సన్న్యాసులు విద్యాధికులు, లౌకిక జీవితంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించ గలిగిన సామర్థ్యం కలిగి వాటిని అల్పమైన వాటిగా భావించి కేవలం, భగవంతుడికి నివేదనగా సమాజసేవలో తమను తాము అంకితం చేసుకున్నారు. ఎలాంటి బహుమతులు, బిరుదుల ఆశింపు లేకుండా, కీర్తి ప్రతిష్ఠల కాంక్ష లేశమాత్రం లేకుండా, మనసును పరిశీలిస్తూ, పరమాత్ముడి దృష్టిలో పడటానికి ప్రయత్నిస్తూ జీవితాలను గడిపారు. చేసిన కార్య విస్తృతిని గణించి, 'మేము ఇంత చేశాం, చేస్తున్నాం' అని చెప్పుకోవటం కూడా సన్న్యాస ఆశ్రమ ధర్మానికి విరుద్ధం.

ఐతే నేటి మానవ సమాజంలో ప్రచార పటాటోపాలు లేకపోతే కనీసం గుర్తించే అవకాశం లేని పరిస్థితి. కాబట్టి విరాళాలు కావలసిన వారు, కీర్తి కాంక్ష కలిగిన వారు స్వంత ప్రచార మాధ్యమాలు పెట్టుకొని, లేకపోతే ఉన్నవాటిలో ప్రచారం చేసుకొని తమ ఉనికిని గొప్పగా ప్రకటించుకోవటం చేస్తుంటారు.

పూర్తిగా రజోగుణంతో కూడుకున్న కాలం కనుక ఆడంబరాలు, స్వీయఔన్నత్య ప్రకటన లేకుండా ఉన్న సంస్థలు, వ్యక్తులు కొద్దిమందే కనబడతారు. అలా అలా వారికి తెలియకుండానే కాలదోషం వలన ఏదో కాంక్షలో కూరుకుపోయి ఆదర్శాన్ని పతనం చేస్తారు. ఇక జనబాహుళ్యం మిగతా ప్రవృత్తులలో ఉన్నవాళ్ళలో చెడుఉన్నా అంతగా పట్టించుకోరు. కానీ ఈ సన్న్యాస ఆశ్రమంలో ఆదర్శం నుంచి వైదొలగిన వ్యక్తిని తీవ్రంగా గర్హిస్తారు.

సత్యమార్గం దుర్గమం : 'సత్యమార్గం దుర్గమమైనదిగా, ఏటవాలుగా ఉంటుంది. కాబట్టి కొద్దిమంది విజయాన్ని సాధించటం ఆశ్చర్యం కాకపోతే అధికశాతం మంది వైఫల్యాన్ని చెందటమూ ఆశ్చర్యం కాదు' అని స్వామి వివేకానంద అంటారు. ఇలా ఈ సన్న్యాసాశ్రమంలో ప్రవేశించి రకరకాల వేషాలతో ప్రజలను పెడత్రోవ పట్టిస్తున్నవాళ్ళు లేకపోలేదు. వాళ్ళు అన్ని కాలాల్లోనూ ఉన్నారు. ఇక ముందూ ఉంటారు. శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు. త్రేతాయుగంలో రావణుడు కూడా సన్న్యాస వేషంతోనే సీతను అపహరించాడు. కావునా ఎవరు ఆదర్శాన్ని నిజంగా నిలపగలుగుతారో, ఎవరు నిజంగా అధికారో ఎవ్వరూ నిర్ణయించజాలరు. మనదేశంలో హైందవం సంస్థాగతమైన మతం కాదు కాబట్టి అందరికీ మతపరమైన స్వేచ్ఛ ఉంది. ఎవరు, ఎప్పుడు ఏ విధంగా కావాలంటే ఆ విధంగా ఉండవచ్చు. ఆధ్యాత్మికపరంగా మనల్ని నియంత్రించే వ్యక్తి గానీ,

సంస్థ గానీ లేవు. ఎవరి మార్గంలో వారు వెళ్ళవచ్చును. ఇలా స్వేచ్ఛ ఉండటంతో అయోగ్యులు కూడా ఉన్నత ఆశ్రమాలను స్వీకరించి, ఆదర్శాలను భ్రష్టుపట్టిస్తారు. అందులో ఆశ్చర్య పడవలసిన అవసరమేమీ లేదు.

ఈ మహోత్కృష్ట ఆశ్రమం గురించి ఒకసారి స్వామి వివేకానంద అద్భుతంగా ప్రసంగించిన తర్వాత ఒక శిష్యుడు – సన్యాస ఆశ్రమంలో మనకు ఎందరో అయోగ్యులు, కపటులు కనపడతారు. వారి గురించి మీరేమంటారు? అని ప్రశ్నిస్తాడు. అప్పుడు స్వామీజీ, 'కపటి కూడా గొప్పవాడే. కనీసం ఆదర్శాన్ని స్వీకరించి ఒక ప్రయత్నం చేసి వైఫల్యాన్ని పొందాడు. అసలు ఆదర్శాన్ని స్వీకరించ సాహసించటానికి కూడా ప్రయత్నించని వ్యక్తులతో పోలిస్తే ఈ వ్యక్తి ముందున్నాడు. కనీసం సత్యాన్వేషణ దిశగా ఒక ప్రయత్నం చేశాడు' అని ఆశ్రమం యొక్క వైశిష్ట్యాన్ని వివరిస్తారు.

సాము!

– స్వామి శితికంఠానంద

విరామం లేని యాంత్రిక జీవితంలో చిక్కుకుపోయిన మనం ప్రతివిషయాన్ని లోతుగా విశ్లేషణాత్మకంగా చూసే శక్తిని కోల్పోతున్నామేమో! అలానే తమ మనుగడ కొరకై సదా సంచలన వార్తలకై వెదకే ప్రసార మాధ్యమాలు సదా భ్రష్టాచారులు, అసమగ్రవ్యవస్థలు, నిర్వీర్యమైన సంస్థల వైపు దృష్టే తప్ప నిర్మాణాత్మక విషయాలు, దేశానికి అవసరమైనవి, సమాజంపై మంచి ప్రభావాన్ని చూపేవాటిపై దృష్టిపెట్టడం లేదు. నిస్వార్థసేవాపరాయణుల కార్యాలకు, భావాలకు ప్రచారం కల్పించటంలో మాత్రం అంతగా ముందుండటం లేదు.

పత్రికలను చూస్తున్నప్పుడు 'ఇలాంటి వార్తలు వ్రాయవలసిన అవసరం ఉందా?' అని మనకు చాలాసార్లు అనిపిస్తుంది. మన ప్రసార మాధ్యమాల ద్వారా మనకు వస్తున్న దాంట్లో 'సమాజాన్ని సకారాత్మకంగా ప్రభావితం చేస్తున్నదెంత? నకారాత్మకంగా ప్రభావితం చేస్తున్నదెంత?' అని బేరీజు వేస్తే మనకు విషయమర్థ మవుతుంది. భగవంతుడి సృష్టి వైచిత్ర్యం అదేమో కానీ మనిషి మనసు ఎప్పుడూ అల్పవిషయాలపైకే ముందు వెడుతుంది. ఉత్తమమైన వాటికెప్పుడూ శీఘ్రగుర్తింపు, ఆదరణ లభించదు. మన ప్రరోచనలో, అభిరుచులలో మార్పురావాలి. తదర్థం మనకు ఆధ్యాత్మిక సంస్కారం కావాలి. దైవప్రార్థనతో పుట్టిన శిశువులకు మాత్రమే ఈ సంస్కారం అబ్బుతుంది. అదృష్టవశాత్తు తపోభూమి ఐన ఈ దేశంలో కైవల్యాభిలాషులకు, ముముక్షువులకు కొదవలేదు. కనీసం కొద్దిమంది నివృత్తి మార్గాన్ని అనుసరిస్తుండటం వలన వస్తువినిమయ జీవితమే పూర్తిజీవితం కాదని సదా బోధింపబడు తున్నది. తత్ఫలంగా పాశ్చాత్య దేశాల స్థాయిలో ప్రాపంచిక తాపత్రయం ఇక్కడ ఎప్పుడూ రాదు. ఈ దేశంలో కేవలం భౌతిక ప్రపంచంపై ఎవరూ పూర్తి మనసును పెట్టలేరు.

ధర్మతత్పరతే భారతీయత: కేవలం బాహ్యాచారాలు, క్రతువులు, కర్మకలాపాలు.. ఇవి మనిషి భక్తిభావనకు, ధర్మాచరణకు, పారమార్థిక జ్ఞానతృష్ణకు నిదర్శనాలు కావు. ఇంద్రియ నిగ్రహం, సత్యనిష్ఠ, దయ, మృదుభాషిత్వం, అహింస.. ఇత్యాది లక్షణాలకు వ్యక్తి సజీవరూపం కావటానికి ప్రయత్నించాలి. పంచేంద్రియ ప్రపంచమే ప్రపంచమని భావించే పాశ్చాత్యుల భావనతో జాతిమొత్తం ఏకీభవిస్తున్నదా? అని అనిపిస్తున్న తరుణంలో కొద్దిమంది సాధువులు, మఠాలు, పీఠాలు ఋషిప్రోక్త మహోన్నత పారమార్థిక జ్ఞానాన్ని బ్రతికించటానికి ప్రయత్నిస్తున్నాయి. ధనార్జన, భోగలాలసతయే జీవిత పరమార్థంగా బోధిస్తున్న చదువులు పోటీతత్వాన్ని, స్వార్థపరతను పెంచుతున్నాయే తప్ప మానవీయ విలువలకు ఊతమివ్వడం లేదు. దేశ చరిత్రయే ఆధ్యాత్మిక చరిత్రయన్న వివేకానందుని భావనలన్నింటినీ ఎక్కడా మచ్చుకైనా కన్పించకుండా చేసుకొని, ధర్మ భ్రష్టమైన సమాజాన్ని నిర్మించుకుంటున్నాం. 'హైందవుడంటేనే మోక్షార్థి, ధర్మతత్పరతే భారతీయత' అని మనం చదువులలో చెప్పనంతకాలం సమాజం ఇంతకన్నా మెరుగ్గా ఉండజాలదు.

హైదరాబాదులోని ఒక విశ్వవిద్యాలయంలో చదువుతున్న ఒక ఇరాన్ దేశ యువకుడు "మా దేశంలో భారతదేశమంటే యోగులు, ఋషులు, ధ్యానతత్పరులు ఉండే దేశమని అందరూ భావిస్తుంటారు. కానీ నాకు మాత్రం అలాంటి పరిస్థితి ఏమీ కనపడలేదు. మా దేశంలో లాగానే ఇక్కడ కూడా ప్రజలు ప్రాపంచిక సంపదల కోసమే పరుగులు పెడుతున్నారు. నేను ఆశించిన స్థాయిలో ఆధ్యాత్మిక వాతావరణం నాకు కనపడటం లేదు. ఎందుకు ఇలా జరిగింది? ఐనా నేను ఈ దేశంలోనే ఉండి సత్యాన్వేషణలోనే కాలం గడపదలుచుకున్నాను" అన్నాడు.

ఒక్క ఇరాన్ అనే కాదు. అలెగ్జాండర్ కాలంలోని గ్రీకులనుంచి ఆధునిక కాలంలోని బ్రజీలియన్సు వరకూ అందరికీ భారతదేశం అంటే తత్త్వవేత్తలు, జ్ఞానులు, సాధువులు ఉండే దేశమన్న నమ్మకం ఉన్నది. ఐతే స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆ జ్ఞానమేమిటో వారికి విద్య ద్వారా తెలియబడలేదు. ఆరు దశాబ్దాలుగా లౌకికదేశం పేరుతో హైందవుడికి ఆ జ్ఞానామృతం నిరాకరింపబడటంతో దేశం అనార్యుల మయం అయింది. తత్ఫలంగా ఈ జ్ఞానపరిచయానికి చేసే ప్రతి ప్రయత్నానికి వ్యతిరేకతయే నియమంగా కొనసాగు తున్నది. ఈ పరిస్థితులలో ఆ మహోన్నత విద్యను సార్వజనీనం చేసే అవకాశం లేదు. ఎవరికి వారు ఆలోచించి కావలసిన వారు ఆ మార్గాన్ని ఎన్నుకోవటమే గానీ ప్రాచీన వేదకాలంలో లాగా అందరినీ నివృత్తి మార్గంలో పెట్టడం అంతతేలిక కాదు. వేదభూమిలో పుట్టడంతోనే తాను మహోన్నత జ్ఞానసంపదకు వారసుడనయ్యానని ప్రతిపౌరుడు భావించి, ఉపనిషత్తులు, భగవద్గీతలో ప్రక్షిప్తమైన వేదాంత మకరందాన్ని కొద్దిగానైనా తీసుకొని ఋషిఋణం తీర్చుకోవడానికి ముందుకువస్తే కొంతవరకు పరిస్థితి మారుతుంది. ❖

శ్రేయస్సును చేకూర్చే మార్గం అత్యంత దుర్గమమైనది. కాబట్టి అనేకమంది అపజయం పొందడంలో ఆశ్చర్యమేమీ లేదు. ప్రలోభాలను ఎదుర్కొని వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలి. - స్వామి వివేకానంద

లక్ష్యాన్ని ఛేదిద్దాం!

– బ్రహ్మచారి రవి

లక్ష్యం లేని జీవితం చుక్కాని లేని నావలాంటిది. అంటే పయనం ఎటువైపు, ఎందాక తెలియని స్థితి. అందుకే జీవితానికి ఓ లక్ష్యం ఏర్పరచుకోవాలి.

ఉదాహరణకు బస్టాండులో బస్సు ఆగింది అనుకుందాం. పైగా అది హైటెక్ బస్సు. చాలా వేగంగా పయనించగలదు. అన్ని సౌకర్యాలూ ఉన్నాయి. ఆ బస్సు ఎక్కడికి వెళ్తుందనేది దానికి ఉన్న బోర్డు ద్వారా తెలుస్తుంది. ఆ బోర్డే గమ్యం, లక్ష్యం. అదే లేకపోతే ఆ బస్సులో ఎన్ని సౌకర్యాలున్నా, ఎంత వేగంతో పయనించినా అంతా వృథాయే! అలాగే మన జీవితం కూడా బస్సులాంటిదే. కాబట్టి మనకు కూడా ఓ లక్ష్యం ఉండాలి. మనకు ఎన్ని శక్తి సామర్థ్యాలు, ఎంత నైపుణ్యం ఉన్నప్పటికీ వాటిని ప్రదర్శించడానికి ఓ లక్ష్యమంటూ ఉండాల్సిందే. లేకపోతే అవన్నీ నిరుపయోగమే!

అందుకే స్వామి వివేకానంద 'ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకోండి. ఆ లక్ష్యసిద్ధి కోసమే జీవించండి. మీ మెదడు, నరాలు, కండరాలు... ఇలా శరీరంలోని ప్రతీ భాగం ఆ భావంతోనే తాదాత్మ్యం కావాలి. అదే విజయానికి మార్గం' అని అంటారు.

ఊటీలో ఒక బోర్డుపై ఇలా వ్రాసి ఉంటుంది: 'మీరు చూస్తున్న ఈ అందమైన కొండలు జోస్ థామస్ అనే ఏకైక వ్యక్తి కృషి'. ప్రకృతిని ప్రాణప్రదంగా ప్రేమించే థామస్ నీలగిరి కొండలపై తాను ఒక్కడే పదివేల దేవదారుమొక్కలు నాటి, పెంచి పోషించాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఆనాడు అందరూ అతణ్ణి పిచ్చివాడని పరిహసించారు. కానీ ఆయన ఆనాడు నాటిన ఆ మొక్కలే ఇరవై సంవత్సరాల తరువాత మహావృక్షాలై అందమైన ఊటీగా ఆకృతి దాల్చింది. పట్టుదల, కృషి ఉంటే లక్ష్యాన్ని సాధించి తీరగలమని చెప్పడానికి ఒక మనోహర పర్యాటక కేంద్రాన్నే సృష్టించిన థామస్ మనందరికీ ఆదర్శప్రాయుడు.

ఒక లక్ష్యం లేనంతవరకు మనలోని పూర్తి సామర్థ్యాన్ని తెలుసుకోవడం కష్టం. ఎందుకంటే మనం ఎప్పటికప్పుడు ఆ యా పరిస్థితుల అవసరాన్ని మించి ఆలోచించలేం. లక్ష్యం ఉన్నప్పుడు మాత్రమే మనలోని పూర్తి సామర్థ్యాన్ని గుర్తించ గలుగుతాం. దాన్ని వినియోగంలోకి తెచ్చుకోవడానికి మనల్ని మనం విస్తృత పరచుకోగలుగుతాం. అదే క్రమంలో మనం అందుకునే ప్రతి అవకాశం, లభించే ప్రతి వనరూ, పెంచుకునే ప్రతి నైపుణ్యమూ మన లక్ష్యఛేదనలో భాగమవుతాయి.

మన లక్ష్యం ఎంత గొప్పదైతే సామర్థ్యం అంత గొప్పగా ఉండాలంటూ... ఇ.పాల్ హోనీ 'ఒక అంధుని ప్రపంచం తన స్పర్శనుబట్టి, ఒక అజ్ఞాని ప్రపంచం అతని తెలివితేటల్నిబట్టి, ఒక గొప్ప వ్యక్తి ప్రపంచం అతని దార్శనికతనుబట్టి నిర్దేశితమై ఉంటుంది' అని అంటాడు.

లక్ష్యఛేదనలో వైఫల్యం గురించి అంతగా చింతించాల్సిన అవసరం లేదు. విజయమార్గంలో అదీ ఒక భాగమని గుర్తించాలి. విజయం దిశగా సాగే మార్గంలో కొన్ని వైఫల్యాలు, తిరస్కారాలు తప్పనిసరని తెలుసుకోవాలి. 'అపజయాలు జీవితానికి అలంకారాలు. అవి సర్వసాధారణం. అవి లేకుండా జీవితమేమిటి?' అని అంటారు స్వామి వివేకానంద. అందువల్ల అపజయాలను లక్ష్యపెట్టకుండా లక్ష్యసిద్ధికి ప్రయత్నించాలి.

లక్ష్యఛేదనకు కావలసిన అర్హతలను కొన్నింటిని తెలుసుకుందాం:

- ❖ లక్ష్యాన్ని చేరుకోవడానికి తగినంత సామర్థ్యం ఉందా? లేదా? అని విశ్లేషించుకోవాలి. ఒకవేళ లేనట్లయితే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి కృషిచేయాలి.
- ❖ ఓటమిపాలవుతానేమో అన్న భయాన్ని వీడి, సానుకూల దృక్పథాన్ని ఏర్పరచుకొని ముందుకు సాగాలి.
- ❖ పట్టుదలనే ఆయుధాన్ని చేతపట్టి, నైపుణ్యమనే కవచాన్ని ధరించి లక్ష్యసాధనలో ఎదురయ్యే అడ్డంకులను, ఒడిదుడుకులను ఎదుర్కోవాలి.

పైన వివరించిన అంశాలను నిరంతరం మననం చేసుకోవాలి. అలా చేయడం వల్ల మన హృదయలోతుల్లో సంకల్పబలం వృద్ధి చెందుతుంది. ఆ సంకల్పబలమే కరదీపికై మనల్ని విజయపథంలో నడిపిస్తుంది. ❖

కనులు లేవని కలత లేదు

– జి.అనురాధ

జీవితంలో తమకు ఎన్నో ఉన్నా, ఏదో చిన్నకొరతను వెతుక్కొని నిరంతరం చింతిస్తూ, తమకే ఏదో పెద్ద అన్యాయం జరిగిపోయిందని మనలో చాలామంది ఆ దేవుడిని నిందిస్తూ ఉంటారు. కానీ భగవంతుడు తనకు ఈ లోకాన్ని చూసే భాగ్యాన్నే లేకుండా చేసినా, ఆ బాలుడు అది తనకు పెద్ద శాపమే కాదని ఆత్మవిశ్వాసం, పట్టుదలలే వరాలుగా భావించు కొని అంధత్వానికే ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాడు. కనులు లేకపోయినా కలత పడక బహువిధాలుగా తన ప్రతిభను చాటుకుంటున్నాడు. అతడే శబరి వెంకట్! కోయంబత్తూర్ (తమిళనాడు)లోని రామకృష్ణ మిషన్ విద్యాలయంలో చదువుతున్న వెంకట్, విధివైపరీత్యాన్ని కూడా లెక్కచేయకుండా వేస్తున్న అడుగులు ఎందరికో ఆదర్శమనటంలో అతిశయోక్తి లేదు.

తమిళనాడు, కేరళ సరిహద్దు గ్రామంలో వ్యవసాయ దారులైన శ్రీనివాస్, నీలవేణిలకు వెంకట్ జన్మించాడు. కంటిచూపు లేని కొడుకు కోసం ఆ కన్నవారు పడని కష్టం లేదు! ఉన్న కొద్ది ఆస్తినంతా వెంకట్ వైద్యానికే ఖర్చు చేసినా, ఫలితం కనిపించలేదు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిపోయిన ఈ దుఃస్థితిలో కోయంబత్తూర్ రామకృష్ణ మిషన్ విద్యాలయం దిక్కుగా నిలిచింది.

విద్యాలయమే వెంకట్‌కు వెలుగుబాట...: రామకృష్ణ మిషన్ విద్యాలయ యాజమాన్యం తీసుకున్న దయార్ద్ర నిర్ణయం ఆ బాలుడి భవితను మలుపుతిప్పింది. వెంకట్‌లో అంధత్వాన్ని అధిగమించే ఆత్మవిశ్వాసాన్ని అంకురింపచేసింది. ఎలాంటి ప్రత్యేకతలు, వ్యత్యాసాలు లేకుండా వెంకట్ అందరి విద్యార్థులతో పాటే తనూ ఒకడై తరగతులకు హాజరుకావడం, ఎప్పుడూ మొదటి అయిదు ర్యాంకుల్లోనే నిలవడం అందరికీ ఆనందాశ్చర్యాల్ని కలిగించింది.

అంతేకాకుండా వెంకట్ ఆటపాటల్లో, వక్తృత్వపోటీల్లో పాల్గొని బహుమతులు సాధించడం అతని బహుముఖ ప్రజ్ఞకు నిదర్శనంగా నిలిచింది. ఇదే సమయంలో వెంకట్ తల్లితండ్రులచే చదివించుకొని, స్వామి వివేకానంద బోధనలను అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తూ, స్వామీజీ సారస్వతం వైపునకు ఆకర్షితు డయ్యాడు. ఆ తరువాత వెంకట్ స్వామీజీ ధీరవచనాలను బ్రెయిలీ లిపిలో చదువుకుంటూ కంఠతాపట్టాడు. రామాయణ, మహాభారత కావ్యాల్లోని ఎన్నో కథలను ఒంటబట్టించుకోవడమే కాక, ఎన్నో భజనలను ఆలకిస్తూ, స్వయంగా తనూ ఆలపిస్తూ స్నేహితులను, ఉపాధ్యాయులను అచ్చెరువొందిస్తున్నాడు.

వక్తృత్వంలో విశేష ప్రతిభ...: స్వామి వివేకానంద స్ఫూర్తివచనాలను తన వరకే పరిమితం చేసుకోకుండా వెంకట్ వక్తృత్వం రూపంలో వాటికి పరివ్యాప్తిని కల్పిస్తున్నాడు. ఎన్నో అంశాల్లో రాష్ట్రస్థాయి బహుమతులను గెలుచుకొని, బాలబాలికలకే కాకుండా యువతీయువకులకూ స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. ఎన్నో వేదికలపై ఆ బాలవాక్కుకు ఎన్నో అభినందనల జల్లులు కురుస్తున్నాయి. 'భారతరత్న' అబ్దుల్‌కలామ్‌తో పాటు ఎందరో ప్రముఖులు వెంకట్ వాక్పటిమకు ముచ్చటపడి వేదికలపైనే అక్కున చేర్చుకొని తమ ఆనందాన్ని ప్రకటిస్తున్నారు.

అమ్మను చూడాలని ఉంది...: వెంకట్ ప్రతిభను ఆ నోటా ఈ నోటా విని పలకరించేందుకు వచ్చిన పత్రికావిలేకరులకు ఆయనిచ్చే సమాధానాలు ఆలోచింపచేసేవిగా ఉండడం విశేషం. 'నీవు ఎప్పుడైనా దయ్యాలకు భయపడ్డావా?' అని ఓ విలేకరి అడిగినప్పుడు వెంకట్, స్వామి వివేకానంద 'భయమే మృత్యువు!' అన్న మాటల్ని గుర్తుచేస్తూ 'మనలోని భయాన్ని మించిన దయ్యం మరోటి లేదు. మన మంచితనమే మనకు రక్ష!' అని సమాధానమిచ్చాడు.

ఆ భగవంతుడు ప్రత్యక్షమై, 'నీకు ఏం కావాలని అడిగితే, ఏం కోరుకుంటావు?' అని మరో విలేకరి ప్రశ్నించినప్పుడు మాత్రం, ఎప్పుడూ టక్కున సమాధానం చెప్పే వెంకట్ ఆ క్షణంలో ఒక్కసారి మౌనంగా మారిపోయాడు. ఆ తరువాత 'అమ్మను చూడాలని ఉంది! ఒక్కసారి చూపునివ్వు భగవాన్!' అని అడుగుతాను అన్నాడు కనిపించని కళ్ళలో కన్నీళ్ళు సుడులు తిరుగుతూంటే!

అంధునిగా పుట్టించిన ఆ దేవుడిపై 'ఏం కోపం లేదా?' అని ప్రశ్నించినప్పుడు వెంటనే వెంకట్ 'ఎందుకు కోపం! హెలెన్ కెల్లర్‌కి చూపులేదు, వినికిడి లేదు, మాటలేదు! కానీ నాకు మాత్రం ఒక్క చూపే లేదు! అంతేకదా! దేవుడిపై ఇంకెందుకు కోపం!' అన్నాడు. అతని ఆశావహ దృక్పథానికి జోహారులర్పించాల్సిందే! ❖

నువ్వు దీనుడవని తలిస్తే దీనుడవే అవుతావు. మీరు సర్వశక్తి సంపన్నులు, మీ ఆత్మశక్తి ముందు దేశకాల పరిస్థితులన్నీ అల్పమైపోతాయి. మీరు దేనిని చేపట్టితే దానిని సాధించగలరు. - స్వామి వివేకానంద

అతిథి దేవో భవ!

– బి. సైదులు

గోదావరి తీరంలో పుట్టిన పుణ్యవతి ఆ ఇల్లాలు... అతిథిని ఆదరించి ఆకలితీర్చటంలో అపర అన్నపూర్ణగా ప్రసిద్ధురాలు! ఆతిథ్యం అనగానే తరతరాలుగా తెలుగునాట వినిపించే ఆ ఒకే ఒక్క పేరు డొక్కా సీతమ్మ! దాదాపు నూట పది సంవత్సరాల క్రితం తూర్పుగోదావరి జిల్లాలో జీవించిన ఆ తల్లి ఇంట ఆ రోజుల్లో అన్నం తిననివారు లేరంటే అతిశయోక్తి కాదు. అత్తింటిలో అడుగుపెట్టింది మొదలు ఆ మహాసాధ్వి అతిథుల సేవలో నిమగ్నమై ఒక్కసారి కూడా పుట్టింటికి కాని, చివరకు ఊరు విడిచి ఓ దేవాలయానికి కూడా వెళ్ళలేదంటే అతిథి అభ్యాగతులపై ఆ ప్రేమమూర్తికున్న ప్రీతి ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. అందుకే వారణాశి వరకూ వ్యాపించిన ఆమె ఖ్యాతికి సాక్షాత్తూ కాశీ విశ్వనాథుడే ఆమె ఆతిథ్యం కోసం వృద్ధబ్రాహ్మణ రూపంలో కదిలి వచ్చాడట!

నాడు భారతదేశాన్ని పాలిస్తున్న బ్రిటీష్ పాలకులు కూడా ఆమె ఆదరణకు ప్రభావితులై, ఆ రోజుల్లోనే ఆమె జీవితచరిత్రను పాఠ్యాంశంలో పెట్టారు. స్వయంగా ఏడవ ఎడ్వర్డు చక్రవర్తి 1903లో ఆమె నిలువెత్తు చిత్తరువును లండన్ రాజదర్బారులో ఆవిష్కరించి తన అభిమానాన్ని చాటుకున్నాడు. అధికులు, అంత్యజులు అన్న తేడా లేకుండా అతిథులందరినీ అమ్మలా ఆదరించిన ఆమెను 'పేరు పేరున వరుసలడిగి కడుపునిండా పెట్టే సీతమ్మగారు కలియుగ కామధేనువే!' అని అన్నార్తులు కొనియాడేవారు. అలాంటి అపర అన్నపూర్ణలు 'అతిథిదేవో భవ' అన్న మన భారతీయ కుటుంబ ధర్మానికి నిలువెత్తు సాక్ష్యాలు. అయితే దురదృష్టవశాత్తు ఈ రోజుల్లో 'అతిథి', 'ఆదరణ' అనగానే ఈ తరానికి అంతులేని అసహనం పుట్టుకొస్తోంది. ఇంటికొచ్చిన వారిని ఇష్టపూర్వకంగా ఆహ్వానించటమే మనలో చాలామందికి కష్టమైన వ్యవహారంగా మారిపోయింది.

ఆతిథ్యం...ఆత్మీయం : అతిథులను ఆత్మీయంగా ఆహ్వానించి ఆదరించిన ఇల్లు సౌభాగ్యనిలయమవుతుంది. ఇంటికి వచ్చిన అభ్యాగతులకు తమకు ఉన్నంతలో పెట్టి సంతృప్తిపరచిన వారి సిరిసంపదలకు సార్థకత కలుగుతుంది. అయితే ఆధునిక జీవనశైలిలో చాలావరకు ఈ ఆతిథ్యానికి (hospitality) అవకాశమే లేకుండాపోయింది. 'ఎవరికివారు వండుకొని తినటమే గగనమైపోతున్న ఈ రోజుల్లో ఇవన్నీ ఎక్కడ కుదురుతాయండి!' అని సాకులు చెబుతూ, సమర్థించు కుంటూ, తప్పించుకోవటమే సంప్రదాయమైపోయింది. డొక్కా సీతమ్మగారిలా జీవితమంతా అతిథుల సేవకు అంకితం కాలేకపోయినా, అడపాదడపా వచ్చే ఏ ఒక్కరిద్దరికో మనస్ఫూర్తిగా వండి, కడుపునిండా అన్నం పెట్టగలగలేకపోతే గృహస్థ జీవనానికి అర్థమే లేదు! ఈనాడు మనలో ఎంతమంది, ఇంటికి వచ్చినవారిని మనసారా ఆహ్వానించి, ఆదరణతో చూసుకోగలుగుతున్నారు? మన ఇంటి గుమ్మం ముందుకు వచ్చినవారు నిరాదరణతో వెనుతిరిగితే అది మనకు అశుభమని, చిరునవ్వుతో స్వాగతించి మనం ఇచ్చే చిరు ఆతిథ్యం మనకు



చిరపుణ్యాన్ని సంపాదించి పెడుతుందని మరచిపోకూడదు. అందుకే భృగు మహర్షి మహాభారతం శాంతిపర్వంలో అతిథిపూజ విశిష్టతను వివరిస్తూ...

అతిథిర్యస్య భగ్నాశః గృహాత్ ప్రతినివర్తతే।
స దత్వా దుష్కృతం తస్మై పుణ్యమాదాయ గచ్ఛతి॥

'అతిథి ఎవరి ఇంటి నుంచి నిరాశతో, నిరాదరణతో వెళ్ళిపోతాడో, ఆ ఇంటివారికి తన పాపం ఇచ్చి, వారి పుణ్యం తీసుకొని వెళతాడ'ని హెచ్చరిస్తారు. అయితే నేడు చాలా ఇళ్ళు ఆధునికసౌకర్యాలతో తులతూగుతున్నా, అతిథిసేవలో మాత్రం కడుదారిద్ర్యాన్ని తలపిస్తూ ఉన్నాయి. ఇలా అతిథిపూజకు నోచని నివాసంలో పుణ్యం పాదరసంలా జారిపోతుంది; పాపం పాములా ప్రవేశిస్తుంది.

ఆదరణ...ఆశీస్సులు : మనం ఎంత ఆడంబరంతో, అత్యాధునిక సౌకర్యాలతో జీవిస్తున్నామన్నది, ఏ హోదాలో ఏమి అనుభవిస్తున్నామన్నది, రోజూ ఎన్ని అపురూప పదార్థాలను భుజిస్తున్నామన్నది ప్రధానం కాదు. కానీ మన ఇంటికి వచ్చిన వారికి ప్రేమాభిమానాలను పంచిపెడుతూ, ప్రీతితో మనమిచ్చే

ఆతిథ్యమే ఎదుటివారి మనస్సులో కలకాలం నిలిచిపోతుంది. ఉదాహరణకు మన మాజీ ప్రధానమంత్రి ఇంటికి ఎవరు వెళ్ళినా, వారి శ్రీమతే స్వయంగా వడ్డిస్తారట! పనివాళ్ళు కాకుండా గృహిణే అతిథుల అవసరాలు చూడటం ఆ కుటుంబ సంప్రదాయ మట! ఆ ఇంటికి వెళితే ఓ ప్రధాని గృహంలో అడుగుపెట్టినట్లు కాకుండా, తమ ఆత్మీయుల ఇంటికే వెళ్ళినట్లు ఉండేదని ఓ ఉన్నతాధికారి తన ముఖాముఖిలో గుర్తుచేసుకున్నారు. ప్రస్తావనకు ఇది చిన్నవిషయంగానే కనిపించవచ్చు; కానీ మనం చూపే ఈ చిన్న చిన్న ఆదరణలు, ఆత్మీయతలే ఎదుటివారి మనస్సులో చెరగని ముద్రలు వేయటమే కాక, మన కుటుంబ గౌరవాన్నీ నిలబెడతాయి. అదేవిధంగా మనమిచ్చే మొక్కుబడి ఆతిథ్యాలు, కురిపించే కృత్రిమ ఆత్మీయతలు మన ప్రతిష్ఠకే భంగాన్ని కలిగిస్తాయి. అలా అని అతిథులు రాగానే ఆపసోపాలు పడుతూ పంచభక్ష్య పరమాన్నాలు వడ్డించి పెట్టాలని కాదు కానీ, పెట్టే పప్పు, పచ్చడి అయినా ప్రేమతో పెడితే చాలు! ఆ ఆత్మీయతే మనకు అతిథుల ఆశీస్సులను వర్షింపచేస్తుంది.

అందరినీ ఒకేలా...: ఆతిథ్యంలో తరతమ భేదాలను చూపటం ఏ మాత్రం మంచి లక్షణం కాదు. భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస తమ ప్రత్యక్ష శిష్యుడు స్వామి బ్రహ్మానందను ఎంత ఆదరంగా చూసుకునేవారో; పనిమనిషి బృందను కూడా అంతే ఆత్మీయతతో చూసుకునేవారు. మన పెట్టుపోతలు 'అయినవారికి ఆకుల్లో కానివారికి కంచాల్లో' అన్నట్లుగా మారిపోతే అది సభ్యత అనిపించుకోదు. అతిథుల అందలాలను, ఆడంబరాలను బట్టి ఆతిథ్య పద్ధతులను మార్చేస్తూ ఉండటం కుసంస్కారం!

దశరథ మహారాజు అతిథులకు మర్యాదలు చేయడం ఎలాగో తన సేవకులకు చెబుతూ... "గ్రామాల నుంచి ఎందరో జానపదులు వస్తారు. వారికి ప్రవర్తన చేతకాకపోవచ్చు. కానీ వారు జానపదులనీ, అయోధ్యా వాసులు నాగరికులనీ భేదం చూపకండి! పల్లెల నుంచి వచ్చేవారికి ఏమీ తెలియదు కదా! అని అశ్రద్ధతో ప్రవర్తిస్తారేమో! అలా ఎన్నడూ చేయకండి!" అని ప్రత్యేక సూచనలిచ్చేవారట!

సామంతరాజులకు ఎలా ఏర్పాట్లు చేసేవారో, సామాన్య జనులకూ అదే స్థాయిలో మర్యాదలు చేసేవారు. మనలో చాలా మంది ఈ సంస్కారాన్ని పాటించరు. అవసరానికి ఉపయోగ పడతారనుకున్న వారికి అయిదునక్షత్రాల(ఫైవ్‌స్టార్) స్థాయిలో ఆతిథ్యమిస్తూ, అంత ఉపయోగపడరనుకున్నవారికి అంతంత మాత్రపు మర్యాదలు చేస్తూ పంపించివేస్తూ ఉంటారు. ఇలాంటి వివక్ష మన సంకుచిత స్వభావాన్ని, చౌకబారు మనస్తత్వాన్ని బయటపెడుతుంది.

ప్రేమాదరణల పరంపర...: 'ఆతిథ్యానికి ప్రేమే ఆభరణం లాంటిది' అని అంటారు రచయిత హెన్రీ మియర్స్. ఇలా ఆతిథేయులుగా(*Host*) మనం చూపే ప్రేమాదరణలనే మన తరువాతి తరం పరంపరగా అనుసరిస్తుంది. భోజనం వేళ వచ్చిన అతిథికి మనం తేనీటితో సరిపుచ్చటాన్ని చూసిన పిల్లలు, వాళ్ళ వంతు వచ్చే సరికి కేవలం మంచినీళ్ళిచ్చి సాగనంపుతారు. అందుకే మన కుటుంబవారసులుగా పిల్లల్ని శిబిచక్రవర్తి అంతటి దానకర్ణుల్ని చేయలేకపోయినా, కనీసం పిల్లికి బిచ్చం వేయనంత పిసినారులుగా మార్చకుండా ఉంటే చాలు! కానీ బాధాకరంగా చాలామంది ఇళ్ళలో ఆతిథేయులుగా పెద్దలు పరమసంకుచితంగా ప్రవర్తిస్తూ ఉంటారు. రుచికరమైనవి తామే ఉంచుకొని, సరిపడనివన్నింటినీ వచ్చినవారికి వడ్డిస్తూ ఉంటారు. అందుకే మన పూర్వీకులు '*ఏకః స్వాదు న భుంజీత....* – మధురమైన పదార్థాలను మనమే ఒంటరిగా భుజించరాదు'ని హితవు పలికారు.

అదేవిధంగా అతిథులు కూడా ఆతిథేయుల పరిస్థితిని అర్థం చేసుకొని, వారికి అనుకూలంగా నడచుకోవాలి. ఆదరణలో, ఆతిథ్యంలో లోపాలు వెతక్కుండా, వారి పొరపాట్లను పెద్ద మనస్సుతో మన్నించి 'అతిథిదేవో భవ' అన్నదానికి సార్థకతను చేకూర్చాలి. ❖

అతిథుల సేవలోనే అంతర్వేది దర్శనం

ఒకసారి డొక్కా సీతమ్మగారు అంతర్వేది నరసింహస్వామిని దర్శించుకుందామని బయలుదేరారు. వేసవి కావటంతో మార్గమధ్యంలో ఓ చెట్టునీడన ఆగారు. ఆ సమయంలో కొంతమంది తమ పిల్లాపాపలతో అక్కడే ఆగారు. ఇంతలో పిల్లలు ఆకలికి ఏడవసాగారు. ఓ పెద్దావిడ 'ఏడవకండి! మనం సీతమ్మగారి ఊరిపొలిమేరలోనే ఉన్నాం. వాళ్ళింటికి వెళ్ళగానే ఆ చల్లనితల్లి మనకు వేడివేడి అన్నం పెడుతుంది!' అని ఊరడిస్తూ ఉంది.

ఆ మాటలు వినగానే సీతమ్మగారి మనస్సు కరిగిపోయింది. వారిని నిరాశపరచటం ఇష్టం లేక, తన అంతర్వేది ప్రయాణాన్ని రద్దుచేసుకున్నారు. వెంటనే అడ్డదారిలో ఇంటికి చేరుకున్నారు. వాళ్ళు వచ్చేటప్పటికి వంటచేసి, అందరి ఆకలితీర్చి, అతిథుల సేవలోనే అంతర్వేదిని దర్శించుకున్నారు. అంతటి ఆ అపర అన్నపూర్ణేశ్వరి సంస్మరణార్థం కోనసీమలోని గన్నవరం వంతెనకు ఆమె పేరు పెట్టి అక్కడి ప్రజలు నేటికీ ఆరాధిస్తున్నారు. ❖

వండుకునే ఆహారంలో మొదటి భాగం అతిథులకు, రెండవ భాగం మూగజీవులకు, మూడవ భాగం పసిపిల్లలకు కేటాయించి, నాలుగవ భాగాన్ని తాము స్వీకరించాలి. - స్వామి వివేకానంద

సంగీత సాంత్వన!

- ఎమ్. రాంబాబు

సంగీతానికి మానవజాతినంతటినీ ఏకం చేయగల సమ్మోహన శక్తి, సకల జీవులకు సాంత్వన చేకూర్చే మహిమ కూడా ఉంది. ఇందుకు భారతీయ శాస్త్రీయ సంగీతమే చక్కని నిదర్శనం. భాషాభేదాలకు అతీతంగా ఎందరో వాగ్గేయకారులు ఆ సంగీతాన్నే భగవత్ ఆరాధనకు సాధనగా చేసుకున్నారు. భాషలేవైనా శ్రోతలు ఒకే రీతిలో స్పందిస్తూ, సంగీతాన్ని ఆరాధిస్తూ ఉంటారు. తెలుగునాట తిరుపతిలో, తమిళనాడులో తంజావూరులో, కర్నాటకలో మైసూరులో, కేరళలో తిరువాన్కూరులో సంగీత సేవ చేస్తున్న సంస్థలన్నీ ఒకే మణిహారంలో వజ్రాలుగా మెరుస్తున్నాయి. ఆ మణులన్నింటినీ కలిపే సూత్రం సంగీతం మాత్రమే! సంగీతం దానికదే ఒక గొప్ప భాషా, భావప్రచార సాధనమూ కూడా!

స్వర అమృత వర్షిణి: సంగీతానికి ప్రాణులనే కాదు, ప్రకృతిని కూడా ప్రభావితం చేసే శక్తి ఉంది. అమృతగానంతో ప్రకృతిని పరవశింపజేసి చరితార్థులైన వాగ్గేయకారులు ఎంతో మంది ఉన్నారు. భారతీయ సంగీత త్రిమూర్తుల్లో ఒకరైన ముత్తుస్వామి దీక్షితుల జీవితంలో జరిగిన ఓ సంఘటన :

అది నిండువేసవి....ఎక్కడ చూసినా ఎండలు మండిపోతూ ఉన్నాయి. ముత్తుస్వామి దీక్షితులు మధుర మీనాక్షి అమ్మవారిని దర్శించుకొని సమీప గ్రామాల్లో నడచివెళుతూ ఉన్నారు. ఎట్టాయపురం అనే పల్లె పొలిమేరకు చేరుకోగానే దీక్షితుల వారికి అక్కడ వర్షాలు లేక ఎండిపోయిన పైరులు కనిపించాయి. వానలు లేక స్థానికులు పడుతున్న కష్టాల్ని చూసి కన్నీరు ధారాపాతంగా కురిసింది. వెంటనే సమీపంలో ఉన్న చెట్టు నీడకు వెళ్ళి, అమృతేశ్వరీ దేవిని ధ్యానించి, కొన్ని క్షణాల తరువాత అమృత వర్షిణి రాగంలో కీర్తన ఆరంభించారు. పల్లెజనమంతా ఆశ్చర్యచకితులై తిలకిస్తూ ఉన్నారు.

'ఆనందామృత కర్షిణి...అమృత వర్షిణి' అని కరుణరస భరితంగా సాగుతున్న దీక్షితుల ఆలాపనకు ప్రకృతి పులకించిపోయింది. కొద్దిసేపటికే ఆకాశం మేఘావృతమైంది. ఓ వైపు ముత్తుస్వామి దీక్షితులు...

ఆనందామృత కర్షిణి...అమృత వర్షిణి
హరాదిపూజితే శివే భవాని
శ్రీనందనాది సంరక్షిణి
శ్రీగురుగుహ జనని చిద్రూపిణి
సానందహృదయ నిలయే సదయే
సద్యః సువృష్టి హేతవే ద్యాం
సతతం చింతయే అమృతేశ్వరి
సలిలం వర్షయ వర్షయ
వర్షయ ఆనందామృత కర్షిణి....

అని గానం పూర్తి చేసేసరికి కనుచూపు మేర కమతాలు వర్షధారలతో తడిసిపోయాయి. ఎన్నో ఏళ్ళుగా కరువు కాటకాలతో బాధపడుతున్న ఆ గ్రామస్తుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. సంగీతానికున్న శక్తిని చూసి, స్థానిక పల్లెవాసులు ఆనందంతో పరవశులైపోయారు. ఈ 'అమృత వర్షిణి' రాగానికి నేటికీ ఆ వరుణుడు ప్రసన్నుడై వానలు కురిపిస్తున్న ఉదంతాలెన్నో!

సంగీతం... సమ్మోహనం : సంగీతానికున్న విశిష్టతను వివరిస్తూ భారతరత్న అబ్దుల్ కలామ్ కూడా ఓ సందర్భంలో "సంగీతంతో మనస్సు అలౌకికస్థితికి చేరుకుంటుందని ఎమ్.ఎస్.సుబ్బులక్ష్మిగారి గానామృతాన్ని ఆస్వాదించినప్పుడు నాకు అర్థమైంది. తిరువయ్యారులో జరిగే త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా 1950లో మొదటిసారిగా ఆమె స్వరాన్ని వినే భాగ్యం నాకు కలిగింది. అప్పుడామె త్యాగరాజస్వామి పంచరత్న కృతుల్ని ఆలపిస్తూ, **'ఎందరో మహానుభావులు... అందరికీ వందనములు'** అన్న కీర్తనను వినిపించారు. ఆ పాట నేరుగా నా మనస్సును తాకింది. నా ఆత్మను ఆనందమయం చేసింది. ఆ కీర్తనను విన్నప్పటి నుండి నేను ఆ సంగీత సరస్వతికి అభిమానిగా మారిపోయాను. ఆ తరువాత ఆ సంగీత సామ్రాజ్ఞి సభక్తికంగా ఆలపించిన త్యాగరాజ కృతులు, అన్నమయ్య కీర్తనలు నా నిత్యజీవితంలో భాగమైపోయాయి" అన్నారు.

సంగీతానికి భక్తి తోడైతే ఉండే రమ్యత ఆ కీర్తనల్ని ఆలకిస్తున్నప్పుడే తెలుస్తుంది. "ఏ రాగాన్ని ఆలపించినా శ్రోతల హృదయాల్ని భగవంతుడి వైపూ, ఆయన దివ్యవిభూతి వైపూ మరల్చి, సాంత్వన చేకూర్చడమే సంగీత సాధన పరమ ప్రయోజనం" అని నిరూపించిన ఎందరో మహానుభావులకు వందనాలర్పిద్దాం. ❖ (జూన్ 21 సంగీత దినోత్సవం)

నిశ్చల స్వభావం

– స్వామి రంగనాథానంద (రామకృష్ణసంఘం 13వ సర్వాధ్యక్షులు)

ఒకసారి టోక్యో(జపాన్) సమీపంలోని ట్సురుమీ మహిళా కళాశాలలో ఓ కార్యక్రమానికి నన్ను(స్వామి రంగనాథానంద) ముఖ్యఅతిథిగా ఆహ్వానించి, ప్రధాన ప్రసంగం చేయమని కోరారు. దాదాపు వెయ్యి మంది విద్యార్థినులు ఆ సభకు హాజరయ్యారు. ఆ దేశ సంప్రదాయం ప్రకారం అందరూ కాళ్ళు వెనకకు మడచి, నేలపై కూర్చొని ప్రసంగాన్ని ఆలకించారు. ప్రసంగం దాదాపు గంటా పదినిమిషాల పాటు సాగింది. ఆ తరువాత స్థానిక భాషలో ప్రసంగపాఠం అనువాదం కూడా కొనసాగింది.

ప్రసంగం జరుగుతున్నంతసేపూ ఒక్క విద్యార్థిని కూడా కదలడం కానీ, పక్కకు తిరగడం కానీ, కాళ్ళు మార్చుకోవడం కానీ నేను చూడలేదు. బొమ్మల్లా కూర్చున్న వారి నిశ్చలత చూసి నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. వాళ్ళలో ఒక్కరి దృష్టి కూడా వేదికపై నుంచి పక్కకు మరలలేదు. వాళ్ళ శరీరాలకు, మనస్సుకు ఎంత శిక్షణ ఇచ్చి ఉంటే, అంత స్థిరంగా ఉండగలుగుతున్నారో తలచుకుంటే ముచ్చటేసింది.

అదే మన దేశంలో అయితే సభికుల దృష్టిని మళ్ళించడానికీ, ఏకాగ్రతను భంగం చేయడానికీ ఒక చిన్న పక్షి కదలిక చాలు. ఎంత పెద్ద వక్త వేదికపై మాట్లాడుతున్నా ఇక అంతే! అందరి చూపులు ఆ పక్షి వైపే! అలా ఉంటుంది మన ఏకాగ్రత! విద్యార్థులు, వయోజనులు అన్న తేడా లేకుండా, మన దేశంలో ఏ సభలోనైనా శ్రద్ధతో వక్తల మాటలు వినడమనేది దాదాపు అరుదనే చెప్పవచ్చు. దీనికి ప్రధాన కారణం మనకు ఏకాగ్రతకు సంబంధించిన క్రమశిక్షణ కొరవడడమే!

జపాన్, జర్మనీ లాంటి దేశాల్లో ప్రజలకు విద్యార్థి దశ నుంచే అలాంటి క్రమశిక్షణకు అంకురార్పణ జరుగుతుంది. అదే వారి జీవితాల్ని నిర్దిష్టమైన మార్గంలో నడుపుతుంది. ఆ క్రమశిక్షణ ఫలితంగానే వారు నిశ్చల స్వభావులుగా తమ, తమ రంగాల్లో ఘనమైన విజయాలను సాధిస్తున్నారు.

విజయ రహస్యాలు : నేను గమనించినంత వరకు జపాన్ ప్రజల్లో క్రమశిక్షణతో పాటు పనిని ప్రేమించే గుణం కూడా ఎక్కువ. ఎక్కువ కష్టపడడాన్ని వాళ్ళు ఇష్టపడతారు. శ్రమ నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించరు. పైగా వారు మితభాషులు. ప్రతి చిన్న విషయానికీ ఉద్రేకపడే స్వభావం కాదు వారిది. సాధారణంగా వారు ఒకరితో ఒకరు ఘర్షణపడడంగానీ, వాగ్వివాదాలకు దిగడంగానీ ఆ దేశాల్లో ఎక్కడా కనిపించదు. మానసిక, శారీరక శక్తులను సద్వినియోగపరచు కోవడంలో వాళ్ళు నిష్ణాతులు!

మన దేశ పౌరుల్లో జ్ఞానానికి, మేధకు కొదువ లేదు! వాటి విషయంలో మనం ఎప్పుడూ వెనుకబడి లేము. కానీ వాళ్ళలాగా మానసిక సంయమనం, వాక్ నిరోధం మనలో చాలా తక్కువ. తత్ఫలితంగా మన ఆంతరిక శక్తులు చాలా వరకు వృథా అయిపోతున్నాయి. ఈ ధోరణి వల్లే చాలామంది యువతీయువకులు ఇటు తమకు, అటు దేశానికి మేలుచేసుకోలేకపోతున్నారు. కాబట్టి భావోద్వేగాల్ని నియంత్రించుకొని, ప్రశాంతంగా పనిచేయడం నేర్చుకోవాలి.

మత్తు వదలాలి... : ముఖ్యంగా మనవాళ్ళలో మరో అవలక్షణం బద్ధకం, ఉదాసీనత! వందల సంవత్సరాలుగా మనను పీడిస్తున్న ఈ దుర్గుణమే మనల్ని నిష్ప్రయోజకులుగా మార్చేస్తుంది. స్వామి వివేకానంద విదేశాలలో పర్యటించి, ఆ యా దేశస్థుల పనితీరును గమనించాక మన దేశస్థుల నిరాసక్త ధోరణిపై విరుచుకుపడ్డారు. ఉత్సాహపూర్వకమైన కార్యతత్పరతే మనకు ప్రస్తుతం కావలసిందని పిలుపునిచ్చారు. కానీ చాలా కొద్దిమంది మాత్రమే ఈ దృక్పథంతో తమ బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నారు. మిగతా వారిదంతా మొక్కుబడి వ్యవహారమే!

కాబట్టి మన యువతీ యువకులు ఈ నిద్రమత్తును వదిలి కర్తవ్యపరాయణులుగా మారాలి. అప్పుడే ఏ రంగంలోనైనా అత్యుత్తమ ఫలితాలను సాధించగలుగుతారు. ❖

తెలుగుసేత : ఆర్. కృష్ణ

మన దేశప్రజల్ని సోమరితనం, కపటం, మోసం ఆవరించాయి. పాశ్చాత్య ప్రజల్లో ప్రస్ఫుటమవుతున్న అంకితభావం, సాహసం, ఉత్సాహం మనం అలవరచుకోవాలి. - స్వామి వివేకానంద

(...23వ పేజీ తరువాయి)

పురోగతే ఉండదు" అని చెబుతూ శ్రీరామకృష్ణులు గుటికాశక్తి (అదృశ్యశక్తి) పొందిన భైరవీ బ్రాహ్మణి శిష్యుడు 'చంద్ర' ఎలా పతనం చెందాడో తెలియజేశారు.

ఒక్కొక్కసారి సిద్ధులు, మహిమల వల్ల చాలా ప్రమాదముందని శ్రీరామకృష్ణులు తెలిపారు. మహిమలు కలిగిన ఒక వ్యక్తి సముద్రతీరంలో కూర్చొని ఉండగా పెద్ద తుపాను వచ్చి చాలామంది ఆ తుపానులో చిక్కుకుపోయారు. వారిని రక్షిద్దామని అతను తన మహిమతో ఆ తుపానును ఆపాడు. అదే సమయంలో సముద్రం మధ్యలో వెళుతున్న ఒక ఓడ హఠాత్తుగా నిలిచిన గాలి వల్ల మునిగిపోయి, దానిలోని ప్రయాణికులందరూ ప్రాణాలు కోల్పోయారు. అంతమందికి ప్రాణహాని కలిగించిన సిద్ధుడు తన సిద్ధులను కోల్పోవడమే గాక, ఆ పాపానికి నరకానికి పోవలసి వచ్చింది.

మరొక చక్కటి ఉదాహరణతో శ్రీరామకృష్ణులు మహిమల గురించి వివరించారు. బిచ్చగాడు రాజాంతఃపురానికి వెళ్ళి రాజు గారిని గుమ్మడికాయ, పుచ్చకాయ వంటి అల్పమైనవి కోరితే తెలివితక్కువగా ప్రవర్తించిన వాడవుతాడు. అలాగే రాజరాజేశ్వరుడు, సర్వేశ్వరుడు అయిన భగవంతుని ద్వారం వద్ద నిలిచి, అమూల్యమైన భక్తి, జ్ఞానాలను విడిచి, మహిమల కోసం వెంపర్లాడుతూ ప్రాధేయపడడం అవివేకమే అవుతుంది.

అయితే శ్రీరామకృష్ణులు కల్పతరు దినం నాడు తన దివ్య మహిమలను చూపారు. ఆ మహిమల అనుభూతి పొందిన వారందరినీ భగవంతుని వైపు ఆ మహిమలు నడిపించాయి. అంతేకాదు ఆనాడు శ్రీరామకృష్ణులకు ఆ మహిమలు అసంకల్పితంగా కలిగాయి.

ఈ సందర్భంగా 'పాకలపాటి గురువుగారు' అని పిలువబడే మహాయోగిని స్మరించాలి. ఆయన 1960–80 మధ్యన విశాఖపట్టణం జిల్లా చింతపల్లి అటవీ ప్రాంతంలో నివసించేవారు. ఆయన ప్రకటించే మహిమల వల్ల అటవీ ప్రాంతంలో గిరిజనులుండే గ్రామాలలో అంటువ్యాధులుగా వ్యాపించే రోగాలన్నీ తగ్గిపోయేవి. అందుకు కృతజ్ఞతగా తామేమి చేయాలన్న గిరిజనులతో – వారి గుడిసెలలో ఒక గుడిసెను రామాలయం చేసి, రామనామ స్మరణ చేయమనేవారాయన. ఆ విధంగా దాదాపు 500 రామాలయాలను నిర్మింపజేసి, శ్రీరామనామాన్ని గిరిజన గ్రామాలలోనే కాక గిరిజనుల హృదయాలలో కూడా ప్రతిష్ఠింపజేసిన మహాత్ముడు పాకాలపాటి గురువుగారు. ఆ విధంగా మహిమలను ఎలా సద్వినియోగ పరచవచ్చో ఆయన తన జీవితం ద్వారా తెలియజేశారు.

మహిమలు – వివేకానందస్వామి : శ్రీరామకృష్ణులు నరేంద్రునితో (స్వామి వివేకానంద) తపస్సు ద్వారా తాను పొందిన దివ్య శక్తులనిస్తానని అన్నప్పుడు నరేంద్రుడు ఆ శక్తులు భగవత్సాక్షాత్కారానికి ఉపయోగపడతాయా? అని అడిగాడు. అందుకవి పనికిరావు కానీ భగవత్కార్యాలు చేయడానికి మాత్రం ఉపయోగపడతాయని శ్రీరామకృష్ణులు సమాధాన మిచ్చారు. అప్పుడు నరేంద్రుడు భగవత్సాక్షాత్కారానికి ఉపకరించని శక్తులు తనకొద్దని నిరాకరించాడు. తానివ్వజూపిన దివ్య శక్తులను నరేంద్రుడు నిరాకరించినందుకు శ్రీరామకృష్ణులు పరమానందం పొందారు.

మహిమలు అవసరమా? : మహిమల ఆవశ్యకత గురించి లోతుగా పరిశీలిస్తే అసలు ఏ విధమైన అనుభూతీ కలగకపోతే సాధారణ జనులు భగవంతుని వైపు మరలరేమోనని అనిపిస్తుంది. అయితే మహిమలకు ఆకర్షితులయ్యే భక్తులలో 99 శాతం మంది ఆ శక్తుల ఫలితం మీదే దృష్టి నిలిపి, అక్కడే ఆగిపోయి, భగవంతుణ్ణి మరచిపోతారు. ఒక్క శాతం మాత్రమే భగవంతుని దిశగా పయనిస్తారు.

అయితే మహిమలు కూడా కొంత అవసరమే! భగవంతుని వైపు దృష్టి మరలించే మహిమలు ఆవశ్యకమే! పరిపూర్ణ మానవ నిర్మాణం చేసి, మనుషులను మహామనీషులుగా, మహాత్ములుగా, మహాభక్తులుగా, జ్ఞానులుగా, సర్వసంగ పరిత్యాగులుగా తీర్చిదిద్దే మహిమే మహిమలలో కెల్లా అత్యద్భుత మహిమ, శక్తి. శ్రీరామకృష్ణుల వంటి అవతార పురుషులు చేసింది – అదే! మహాత్ములను తయారుచేసే మహిమలున్న మహితాత్ముడు శ్రీరామకృష్ణులు. నిస్వార్థంగా, లోకకల్యాణానికి ఉపయోగపడే మహిమలు ప్రయోజనకారులే కానీ వాటిని స్వార్థానికి వినియోగిస్తే, వినాశనానికి దారితీస్తాయి. భగవంతుని వైపు మానవుని మనస్సును మరలించే మహిమలు ప్రయోజనకారులు. భక్తులు మహిమల విషయంలో అత్యంత జాగరూకతతో ఉండి, తరచూ ఆత్మ పరిశీలన చేసుకుంటూ ఆధ్యాత్మిక పథంలో కొనసాగాలి. ❖

(1884 – 1967)

ముందుకు సాగిపో!

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ, ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ - వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం, ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

సార్‌గాచీ,

ప్రియమైన తల్లీ శిబూ!*

ఇక్కడ ఎండలు బాగా ఉన్నాయి. పాఠశాలకు సెలవులు ప్రకటించారు. భగవంతుని గురించి ఆలోచనలు ప్రశాంతమైన ప్రదేశాల్లో మాత్రమే సాధ్యమైతే కొండలపై నివసించే కొండ జాతుల వారంతా ఆత్మజ్ఞానాన్ని ఎందుకు పొందడం లేదు? నీవు భగవంతుణ్ణి చాలా పెద్ద స్వరంతో పిలుస్తున్నావేమో? అందుకే ఆ కేకలకు భయపడి ఆయన పారిపోతున్నాడనుకుంటాను.

భగవంతుణ్ణి పొందాలనే ఆతురత ఉన్న వ్యక్తిని నీవెన్నడైనా చూశావా? మన మనస్సులు భగవంతుని 'ప్రసాదం' కోసం, ఆయన పేరు మీద 'చందాలు' వసూలు చేయడం కోసం, ఆయన భక్తులతో నిరంతరం సందడిగా గడపడం కోసం ఆతురత పడుతూ ఉంటాయి. మన హృదయాలు ఈ మూడింటితోనే (ఆధ్యాత్మిక జీవితంలో వస్తు సంపదకై) నిండి ఉంటాయి. మనకు 'నాలుగోది' ('తురీయ' భావాతీత స్థితి) అక్కరలేదు. అందుచేతనే మన బాధంతా!

'తల్లీ శిబూ! నీకు భయం ఎందుకు? దివ్యజనని శారదామాత ఆశీస్సులను పొంది 'మృత్యువుపై ఆధిపత్యం' సంపాదించాం. స్త్రీల పరిస్థితి ప్రతిచోటా దారుణంగా ఉంది. కానీ నీవు గొప్ప ఆనంద సామ్రాజ్యంలో ఉన్నావు. ఇంకేం కావాలి చెప్పు? అమ్మ శారద ఒకసారి ఒక భక్తునితో "నువ్వు నిద్ర పోతున్నావనుకో! ఆ స్థితిలో నీ మంచంతో సహా నిన్ను మరొక చోటుకు చేరిస్తే అది నీకు తెలుస్తుందా?" అని అన్నారు.

నీ చుట్టూ ఒకసారి తేరిపార చూడు. ఎక్కడ ఉన్నావో గ్రహించు. నీవు శ్రీరామకృష్ణుల ఇంటిలో ఉన్నావు. రామకృష్ణుల ఆహారం తింటున్నావు. రామకృష్ణుల బంధుకోటితో కలిసి జీవిస్తున్నావు. రామకృష్ణుల ఆత్మీయులను ప్రేమిస్తున్నావు! ఆయనను గురించిన సంభాషణలు, పనుల మధ్య నీ దినచర్య అంతా గడచిపోతోంది. ఇంకా నీకు రామకృష్ణ లోకం కనపడలేదా తల్లీ!

ప్రతి విషయం సంపూర్ణంగా తగినట్లుగా లేదని నీవు అనవచ్చు. అంటే నీవు ప్రతిదాన్నీ ఆ చైతన్యరూపంగా వీక్షించట్లేదన్నమాట. అందుకు చాలాకాలం పడుతుంది తల్లీ! ఎందుచేతనంటే అది చాలా విలువైన స్థితి. నీవు అమ్మ శారద చెప్పిన వచనాలను ఎక్కువగా చదివినట్లు తోచదు. అమ్మ అన్నీ సమగ్రంగా, చాలా బాహాటంగా చెప్పారు. ఆమె కూడా నీలాంటి స్త్రీయే కదా! అందుకే నీకు విశ్వాసం కలగడం లేదేమో! "శ్రీకృష్ణుని అవ్యాజ ప్రేమను ప్రయత్నం ద్వారా పొందడం ఎవరికీ సాధ్యం కాదు. ఆయన లీలలను వింటూ, ధ్యానిస్తూ ఉండే పవిత్ర హృదయాలలో అది పొంగిపొర్లుతోంది" అని చైతన్య చరితామృతం చెబుతోంది.

ప్రేమాశీస్సులతో

స్వామి ప్రేమేశానంద

తెలుగు సేత: కె. త్రివిక్రమరావు

(*స్వామి ప్రేమేశానందజీ 27-5-1953, 4-8-1955 తేదీలలో శిబూకి రాసిన ఉత్తరాల సంక్షిప్త సారాంశం. శిబూగా ప్రస్తావించబడిన శివాని కాలాంతరంలో శారదా మఠంలో ప్రవ్రాజిక శక్తిప్రాణా మాతాజీగా ప్రసిద్ధులు.)

వేదకాలంలో గార్గీ, మైత్రేయీలాంటి వారికి పారమార్థిక జ్ఞాన సంపాదనకు అర్హత ఉన్నప్పుడు, నేటి మహిళలకు కూడా అటువంటి అధికారం ఉండాలి. చరిత్ర పునరావృతమవుతుంది. - స్వామి వివేకానంద

(...15వ పేజీ తరువాయి)

వేదసంహిత పాఠము

భగవంతుడి అవతారఘట్టాలను చర్వితచర్వణంగా మననం చేసుకోవడం వల్ల మన మనోభావాలు సాత్త్వికమవుతాయి. ఆలోచనలు పవిత్రమవుతాయి. నిజానికి వేదవేదాంగాలు, మంత్రతంత్రాలు, సకలశాస్త్రాలు, జపతపాలు, సంధ్యాదికర్మలన్నీ ఆయన స్వరూపాలే! ఆయనను చేరుకునే సన్మార్గాలే! ఆ సర్వేశ్వరుడిని, సగుణ సాకారుడిని స్మరించుకునే సద్భాగ్యం ఆయన చరితామృతపానంతోనే సాధ్యపడుతుంది. అదే భావనతో ఈ సంకీర్తనాచార్యుడు పునరుద్ఘాటిస్తూ...

ఇదియె మంత్రరాజము నాకు నేప్రొద్దు
నిదియె వేదసంహిత పాఠము
ఇదియె బహు శాస్త్రమెల్ల చదువుట నాకు
ఇదియె సంధ్య నాకిదియె జపమటు గాన!

‘శ్రీనివాసుడి కథాశ్రవణమే మంత్రరాజం, వేదపాఠమనీ; శాస్త్రపఠనం, సంధ్యావందన సమమనీ; తనకిదియే జపయజ్ఞమ’నీ పాడుకొని పరవశిస్తున్నాడు.

ఇలా భక్తులైన వారి మనస్సు తమ, తమ ఇష్టదైవాలకు సంబంధించిన కథాగానంతో, ఉపదేశసారంతో రమించగలిగితే వారికి శుభాలే కాకుండా, జ్ఞానఫలాలూ సంప్రాప్తిస్తాయి. అందుకే ఈనాటికీ ఎందరో భక్తపుంగవులు తాము ఆరాధించే అవతారమూర్తుల చరిత్రల పఠనంతో, శ్రవణంతో తమ జీవితాల్ని ధన్యం చేసుకుంటున్నారు. ఇలా చైతన్య మహాప్రభువు ‘చైతన్య చరితామృతం’, భగవాన్ శ్రీరామకృష్ణుల ‘కథామృతం’, శ్రీదత్తాత్రేయుల ‘శ్రీగురుచరిత్ర’, భగవాన్ శిరిడీసాయి ‘శ్రీసాయిసచ్చరిత్రము’ తదితరమైనవి ఎందరో భక్తులకు నిత్యపారాయణ గ్రంథాలు! నిరంతరం వీటిని తమ దినచర్యలో భాగంగా చేసుకొని జీవితాల్ని పండించుకుంటున్న మహానుభావులు ఎందరో!



దుఃఖవిరహిత మార్గము

ఆ తిరుమల కనుమలలో కొలువై నేటికీ తన అభయహస్తంతో అఖిలాండ కోటిని పరిపాలిస్తున్నాడు ఆ బ్రహ్మాండనాయకుడు. ఆయన లీలల్ని తలచుకుంటే చాలు, తనువు పులకించిపోతుంది. ఎలాంటి సాధనలు, తపస్సులు చేయకపోయినా ‘ఏడుకొండలవాడా! వేంకటరమణా! గోవిందా!’ అని ఆర్తిగా పిలిచినంతనే, ఏదో ఒక రూపంలో నేటికీ తన భక్తులకు అండగా నిలుస్తున్నాడాయన. అదీ! ఆయన మహిమోన్నతి!

అన్నీ ఆ మంగళాకారుడి కథామృతమేనంటూ అన్నమాచార్యులు...

ఇదియె బ్రహ్మవిద్యోపదేశము నాకు
ఇదియె దుఃఖవిరహిత మార్గము
ఇదియె భవరోగహిత భేషజము నాకు
ఇదియె ఉపనిషద్వాక్యపద్ధతి గాన!

‘బ్రహ్మోపదేశం, దుఃఖానికి ఊరటనిచ్చే మార్గం, భవరోగ వైద్యం మరోటి లేదు, ఉపనిషత్తుల సారం ఇదియే!’ అని ఆనందపడుతున్నాడు. ‘భేషజము’ అంటే ఔషధమని అర్థం.

ఆస్వాదించగలిగే అభిరుచి ఉండాలే కాని ఆ మధుర సంకీర్తనాచార్యులకే కాదు, మనందరికీ ఆ కారుణ్యమూర్తి కథాగానం కర్ణపేయమై తనువునూ, మనస్సునూ పరిశుద్ధం చేస్తుంది. అందుకే శుకమహర్షి అమిత భక్తిప్రపత్తులై శ్రీమద్భాగవతాన్ని పరీక్షిత్ మహారాజుకు ప్రవచిస్తూ **‘...తత్కమలాధీశ కథాసుధారస నదీ కల్లోల మాలా పరిభ్రమ మెవ్వారికినైన కర్ణయుగళీ పర్వంబు కాకుండునే! –** ఆ లక్ష్మీనాథుని కథాప్రసంగాలనే నదీతరంగాలలో ఓలలాడడం కంటే అదృష్టమేముంటుంది? శ్రీహరి కథలు ఎవరికైనా వీనులవిందు చేయకుండా ఉంటాయా?’ అని అంటారు. మృత్యుముఖానికి సమీపంలో ఉన్న మహారాజుకు ముక్తిని ప్రసాదిస్తాడు. అదీ భగవంతుడి కథాసుధ మాహాత్మ్యం!

శ్రీవేంకటేశ్వరుని స్మరణము

లౌకికులు లోకవ్యవహారాల చింతనతో, చర్చలతో సంతృప్తిపడినట్లే పరమభక్తులు ఆ పారమార్థిక సంభాషణలతో, పరమాత్మ లీలా విశేషాల స్మరణతో తరించిపోతారు. అందుకే శ్రీకృష్ణభగవానుడు భక్తుల విశేషవైఖరిని భగవద్గీతలో వివరిస్తూ....

మచ్చిత్తా మద్గత ప్రాణా బోధయంతః పరస్పరమ్ ।
కథయంతశ్చ మాం నిత్యం తుష్యంతి చ రమంతి చ ॥(10.9)

‘నాయందే స్థిరచిత్తం కలవారు, నా యందే ప్రాణం లగ్నమొనర్చినవారు, నన్ను గూర్చి తెలుసుకొనే భక్తులు సదా నా కథలను వింటూ సంతృప్తి చెందుతూ, ఆనందిస్తూంటారు’ అని స్పష్టం చేస్తాడు.

భక్తి పరిపాకానికి నిదర్శనమైన ఈ కథాపఠనం, శ్రవణం కేవలం సంతోష, సంతృప్తులను ఇవ్వడమే కాదంటూ...

ఇదియె దానఫలమీజాలినది నాకు
ఇదియె తపవిరహిత కర్మము
ఇదియె తిరువేంకటేశ్వరుని సంస్మరణ
ఇదియె యిదియె యిన్నియును నటు గాన!

‘శ్రీవేంకటేశ్వరుడి నామస్మరణమే అశేష దానఫలాన్ని ఇస్తుంది, భౌతిక తపనల్ని పరిహరిస్తుంది, ఇదియే నాకు సర్వస్వం’ అని ఈ సంకీర్తనకర్త ముక్తాయింపు పలుకుతున్నాడు. ❖

ఒక కథ చెబుతా...

'రాము' చిలుక బోధ

ఓ రామచిలుక చెట్టు మీద వాలి దోరమగ్గిన పండొకటి కొరుకుతుండగా దానికి ఒక పావురం ఏడుస్తూ కనిపించింది. దాని రెక్కల నుండి రక్తం కారుతోంది. రామచిలుక గబగబా దాని వద్దకు వెళ్ళి, ఏడవకు నీకు నేను సాయం చేస్తాను అంది. నిన్నెప్పుడూ చూడలేదే! అయినా సాయం అంటే ఏమిటి? అని అడిగింది పావురం. మనతోటివారు బాధలో ఉంటే దాన్ని తగ్గించే పని చెయ్యడమే సాయం అని చెప్పింది. ఆ తరువాత దగ్గరలోని చెరువు నుండి నీటిని తెచ్చి గాయాల్ని కడిగి ఆకు పసరు రాసింది. తర్వాత ధైర్యం చెప్పి, తినడానికి పండును ఇచ్చింది. రామచిలుక తనకు చేసిన సాయానికి పావురం కృతజ్ఞతలు తెల్పగా, నీవు కూడా కష్టాల్లో ఉన్నవారికి సహాయపడాలని చెప్పి వెళ్ళిపోయింది.

ఆ పావురానికి ఒక రోజు ఓ కుందేలు ఏడుస్తూ కన్పించింది. దానికి రామచిలుక మాటలు గుర్తుకొచ్చి దగ్గరకెళ్ళి కారణమడిగింది. నా పిల్ల ఎటుపోయిందో కన్పించడంలేదు అంది కుందేలు. పావురం ఎగురుతూ కుందేలు పిల్లను వెతికి కుందేలుకు చూపించింది. నువ్వు కూడా ఇలాగే ఇతరులు కష్టాల్లో ఉన్నప్పుడు సహాయపడు అని చెప్పి పావురం తన దారిన తాను వెళ్ళిపోయింది.

ఆ కుందేలు ఒక రోజు పొరుగున రెండు కొంగలు దేనికోసమో గొడవ పడటాన్ని గమనించి కారణం అడిగింది. నేను వేటాడి తెచ్చిన చేపలను నిప్పులేదని వండలేదు మా ఆవిడ అని చెప్పింది మగకొంగ. అప్పుడు కుందేలు నిప్పును తెచ్చి కొంగలకు ఇచ్చి మీరు కూడా అవసరమైన వారికి సాయం చేయాలి అని చెప్పింది.

ఇది జరిగిన కొన్నాళ్ళకు కొంగలకు పక్కింట్లో ఉన్న నక్క కొడుకు ఏడుపు వినపడింది. కొంగలు కారణమడగ్గా, నా కొడుక్కి మాంసం ముక్కలేనిదే ముద్ద దిగదు. ఈ రోజు వేటాడి తేలేదని ఏడుస్తున్నాడు అని చెప్పింది నక్క. కొంగలు వెంటనే తమ ఇంట్లో ఉన్న చేపల్ని ఇచ్చి నీవు కూడా అవసరమైన వారికి సహాయపడాలి అని చెప్పాయి.

ఆ నక్కకు ఒక రోజు ఏనుగు ఏడుపు విన్పించింది. అది ఒక పెద్ద గోతిలో పడిపోయిందని తెలుసుకున్న నక్క మిగిలిన జంతువులను పిలుచుకుని వచ్చింది. అన్నీ కలిసి కొమ్మలను, ఆకులను గోతిలో వేసి ఏనుగు పైకి వచ్చేలా చేసాయి. ఈవిధంగా అడవిలోని పక్షులు, జంతువులన్నీ పరస్పరం సహకరించుకుంటూ ఎంతో సంతోషంగా జీవిస్తున్నాయి.

ఈ విషయం మృగరాజు అయిన సింహానికి తెలిసింది. సింహం తన అడవి జంతువులకు ఇంత మంచి అలవాటు ఎలా వచ్చిందో తెలుసుకోవాలని సమావేశాన్ని ఏర్పాటు చేసింది. మీ అందరిలో ఇంత మంచి మార్పు రావడానికి కారణమేంటని అడిగింది. ముందుగా ఏనుగు మాట్లాడి తాను నక్క వల్ల పొందిన సాయం గురించి చెప్పింది. తర్వాత నక్క, కొంగ, కుందేలు తమ తమ అనుభవాలను చెప్పాయి. చివరిగా పావురం 'ఒకరి కొకరం సాయం చేసుకోవాలని రామచిలుక నాకు చెప్పింది అంది'.

మృగరాజు వేరే అడవిలో ఉన్న రామచిలుకను పిలిపించి నీకు ఇంత మంచి అలవాటు ఎలా వచ్చింది అని అడిగాడు. అప్పుడు రామచిలుక ఇలా చెప్పింది: "అరణ్యవాస సమయంలో రాముడు చేసిన మంచి పనులను చూసాను. రాముడు యజ్ఞానికి ఆటంకం కల్పిస్తున్న రాక్షసులను సంహరించి ఋషులకు

సహాయపడ్డాడు. రాతిని నాతిగా మార్చి అహల్యకు శాపవిమోచనాన్ని కల్గించాడు. జటాయువుకు మోక్షాన్ని ప్రసాదించాడు. శబరి చిరకాల వాంఛ తీర్చడానికి ఆమె ఆశ్రమానికి వెళ్ళి, ఆమెను సంతోషపరిచాడు. వాలిని వధించి, సుగ్రీవునికి రాజ్యాన్ని తిరిగి ఇప్పించాడు... ఇలా రాముణ్ణి చూసి ఇతరులకు సహాయపడడం నేర్చుకున్నాను". అప్పుడు మృగరాజు రామచిలుకను సత్కరించి తమతోనే ఉండిపొమ్మన్నాడు. రామచిలుక అందుకు ఒప్పుకోకుండా మంచి లక్షణాలను మిగిలిన జంతువులకు కూడా నేర్పాలని చెప్పి, మరొక అడవికి వెళ్ళిపోయింది.

నీతి: అరణ్యాలలో తిరిగే రామచిలుక రాముని సుగుణాల నుండి స్ఫూర్తి పొంది ఇతర వన్య ప్రాణులకు సహాయం చేసే సద్గుణాన్ని అలవరచుకుంది. కాబట్టి మనమందరం కూడా శ్రీరాముడి నుండి స్ఫూర్తిని పొంది తోటివారికి సాయపడుతూ ఉన్నతంగా జీవించాలి.

– పి. స్వప్న, 9వ తరగతి
(ఆంధ్ర విద్యాలయ ఉన్నత పాఠశాల,
చిక్కడపల్లి, హైదరాబాదు)

ఒక కథ చెబుతా... 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రిక ఉన్నత పాఠశాల విద్యార్థులలో వ్యాసరచన ప్రతిభను ప్రోత్సహించడం కోసం, సద్భావాలను పెంపొందించడం కోసం 'ఒక కథ చెబుతా...' శీర్షికను ప్రారంభించింది. ఈ శీర్షికలో ప్రచురించడానికి విద్యార్థుల నుండి నీతి కథలు, వ్యక్తిత్వవికాస కథలు, స్ఫూర్తిదాయక కథలు, ఆధ్యాత్మిక కథలను ఆహ్వానిస్తోంది. వ్యాసాలను చక్కని దస్తూరీతో సరళభాషలో రాసి, మీ పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను జతపరచి పంపించండి. మీ పూర్తి చిరునామాను పొందుపరచండి. ఎంపికైన కథలకు బహుమతి లభిస్తుంది.

వ్యాసాలను పంపించాల్సిన చిరునామా : సంపాదకులు, శ్రీరామకృష్ణ ప్రభ, రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాద్-500 029. E-mail : sriramakrishnaprabha@gmail.com

- స్వామి పరిజ్ఞేయానంద

ఫలితం పరమాత్ముని అధీనం!



మన ఆందోళనలకూ, ఒత్తిళ్ళకూ మనం చేస్తున్న కర్మలే కారణమని అనుకుంటాం. మరి ఇన్ని బాధలు పడడం కన్నా కర్మలు చేయకుండా ఉంటే సరిపోతుంది కదా అనే ఆలోచన కూడా వస్తుంది. కానీ మనిషి ఏ పనీ చేయకుండా ఒక్క క్షణం కూడా ఉండలేడని భగవాన్ శ్రీకృష్ణుడు మానవ స్వభావాన్ని తేటపరిచాడు. కాబట్టి మనం చేయాల్సింది మన స్వభావానికి విరుద్ధంగా ప్రవర్తించడం కాదు; స్వభావాన్ని అధిగమించడానికి ప్రయత్నించాలి. నిజానికి మనం ఏ కర్మలూ చేయకుండా ఉంటే సోమరులుగా మారే ప్రమాదముంది. అందువల్ల శ్రీకృష్ణుడు, కర్మలు చేయడం వల్ల దుఃఖం కలగకుండా ఉండాలంటే ఎలాంటి దృక్పథాన్ని అలవరచుకోవాలో అర్జునుడికి తెలియజేస్తూ...

కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన ।
మా కర్మఫలహేతు ర్భూ ర్మా తే సంగో౽స్త్వ కర్మణి॥ *(గీత. 2-47)*

'కర్మలు చేయడానికి నీకు అధికారముంది. కానీ కర్మఫలాల విషయంలో మాత్రం అధికారం లేదు. కర్మఫలాలకు నువ్వు కారణం కాదు. అలాగని కర్మలు చేయడం మానకూడదు' అని బోధించాడు.

మన దుఃఖానికి కారణం కర్మలు కాదు, కర్మఫలితాల పట్ల మనకున్న ఆసక్తి, ఆకాంక్షే! మనం ఆశించిన విధంగా ఫలితం రానప్పుడు, మన అంచనాలు తారుమారైనప్పుడు దుఃఖానికి గురవుతాం. మనం చేస్తున్న కర్మలు మనకు దుఃఖకారకం కాకుండా ఉండాలంటే కర్మలను నిష్కామభావంతో చేయడం అభ్యసించాలి; కర్మఫలితాల పట్ల అనాసక్తభావాన్ని అలవరచుకోవాలి. అప్పుడు మనం చేసే ప్రతీ పని కర్మయోగం అవుతుంది.

కర్మఫలితాలను ఆశించకుండా నిష్కామభావంతో కర్మలను ఆచరించినవాడు ఉత్తమోత్తముడు. అలాంటి మహోన్నత వ్యక్తి గురించి స్వామీజీ చెబుతూ, 'కర్మయోగంలో ఉత్కృష్ట స్థితిని పొందిన అత్యుత్తమ కర్మయోగి బుద్ధుడు' అని బుద్ధుని నిష్కామభావాన్ని శ్లాఘించారు.

కర్మఫలితం ఎలాంటిదైనా ఆందోళన చెందకుండా కర్మలు నిర్వర్తించే వ్యక్తి ఉత్తమమైన కోవకు చెందిన వాడు. 'కర్మఫలితాలను శాసించలేం. కానీ కర్మ నిర్వహణలో అలసత్వం లేకుండా కృషిచేయాలి' అని చెప్పి అనాసక్తయోగానికి నిదర్శనంగా నిలిచిన ఉత్తముడు మహాత్మా గాంధీ.

ఇక, కర్మఫలితాలను ఆశించి కర్మలను చేసేవాడు మధ్యముడు. కర్మఫలితం మన అధీనంలో లేదని కర్మలు చేయనివాడు అధముడు.

అయితే, కర్మయోగంలో ఉత్కృష్ట స్థితిని పొందినవారు గానీ, కర్మలను ఆచరించ కుండా తమోగుణంలో ఉన్నవారు గానీ భగవాన్ శ్రీకృష్ణుని బోధల గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు. కర్మలు నిర్వర్తిస్తూ కర్మఫలితం పట్ల ఆసక్తి ఉన్న మధ్యతరగతికి చెందినవారు కర్మయోగ రహస్యాన్ని తెలుసుకోవాలి.

భగవాన్ బుద్ధునిలా ప్రతిఫలాపేక్ష లేని నిష్కామకర్మను అనుష్ఠించడం గానీ, గాంధీజీలా అనాసక్తభావంతో కర్మలను ఆచరించడం గానీ అందరికీ సాధ్యమయ్యే పని కాదు. నిజానికి, చేసినపనికి తగిన ఫలితాన్ని ఆశించడం తప్పేమీ కాదు. మంచి మార్కులతో ఉత్తీర్ణం కావాలనే ఆశతోనే విద్యార్థి పరీక్షలు వ్రాస్తాడు, వ్యాపారి లాభాన్ని ఆశించే వ్యాపారం చేస్తాడు, రైతు పంట పుష్కలంగా పండాలనే ఆశతోనే నారు వేస్తాడు... ఇలా ప్రతీ ఒక్కరం ఫలితాన్ని ఆశించే కర్మలు చేస్తాం. అయితే, ఇక్కడ మనం బాగా గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే ఫలితాల్ని ఆశించి కర్మలు చేయడం తప్పు కాదు. కానీ మనం ఆశించిన విధంగా ఫలితాలు రాకపోతే ఆందోళన చెందకూడదు, నిర్వీర్యులం కాకూడదు.

కర్మఫలితాల పట్ల ఆసక్తి లేకుండా కర్మలను చేయాలని వాదప్రతివాదాలూ, విశ్లేషణలూ, తత్త్వవిచారణలూ ఎన్ని చేసినా ఆచరణలో చూపడం ఎంత కష్టమో మనందరికీ తెలిసిన విషయమే! అయితే, మనం కర్మలు చేస్తున్నా ఫలితాల కోసం కలవరపడకుండా ఉండాలంటే ఏం చేయాలి? అందుకు "సర్వ సృష్టిని నియంత్రించే సర్వజ్ఞుడు ఆ పరమాత్ముడు. ఎవరికి ఎంత ఇవ్వాలి, ఏమి ఇవ్వాలి, ఎప్పుడు ఇవ్వాలి అన్న విషయం భగవంతునికి తెలుసు. మనకు రావాల్సినది రాక మానదు, జరగాల్సింది జరగక మానదు. భగవంతుని ఇచ్ఛ ఉంటే ప్రపంచమంతా అడ్డగించినా మనకు రావాల్సినది వచ్చి ☞

జీవనోద్యానంలో

మానవతా పరిమళాలు

దేహ ధర్మం!

చంపానగరి రాకుమారుడు అత్యంత సౌందర్యవంతుడు. అతడు తన అందచందాలు చూసుకుని గర్వపడుతూ, అందరినీ అవమానిస్తూ ఉండేవాడు. గౌతమ బుద్ధుడు తన దేశాటనలో భాగంగా ఒకసారి చంపానగరికి వచ్చాడు.

రాకుమారుడు ఆయన ఉపదేశాలు వినడానికి కాక తన అందాన్ని ప్రదర్శించేందుకు ప్రయత్నించాడు. అశాశ్వతమైన శరీరం గురించి బుద్ధుని ప్రవచనం విని అతడు ఒక్కసారిగా మారిపోయాడు. శరీరాన్ని కష్టపెట్టేందుకు ముళ్ళతో ఆసనాన్ని ఏర్పాటు చేసుకుని, దానిపై కూర్చుని తపస్సు మొదలుపెట్టాడు. శరీరం నుండి రక్తపుధారలు కారాయి. అతడికి అశాంతిగానే ఉంది. అప్పుడు తథాగతుడు అతడి దగ్గరకు వచ్చి ప్రేమతో...

'నువ్వెప్పుడైనా వీణను వాయించావా?' 'వాయించాను స్వామీ!'

'తీగలు వదులు - వదులుగా ఉంటే స్వరం సరిగా పలుకుతుందా?'

'లేదు తండ్రీ!'

'తీగలు చాలా గట్టిగా బిగించామనుకో! అప్పుడు స్వరం బాగా పలుకుతుందా?' 'లేదు తండ్రీ!'

అప్పుడు బుద్ధుడు "నాయనా! శరీరానిది కూడా ఇదే ధర్మం. శ్రమ చేయకపోతే శరీరం సోమరితనంతో పురుషార్థం సాధించడానికి సహకరించదు. అలాగే అతి కఠోరమైన శ్రమ వల్ల కలిగిన బాధలతో శక్తిని కోల్పోతుంది. శారీరక శక్తి సామర్థ్యాలను బట్టి దానికి క్రమంగా ఇంద్రియ నిగ్రహాన్ని అలవాటు చేయాలి. అప్పుడు శరీరం సాధనకు ఉపయుక్తంగా ఉంటుంది" అని బోధించాడు. ❖

పక్కనే ఉండాల్సినవారు!

వినోబాభావే గారు తనకొచ్చిన ఉత్తరాల నన్నింటినీ జాగ్రత్త పెడుతుండేవారు. ఒకసారి ఆయనకు గాంధీజీ వ్రాసిన ఉత్తరం అందింది. దానిని ఆయన చదివి వెంటనే చింపి పారేశారు. అప్పుడు శ్రీకమలనయన్ బజాజ్ ఆయన ప్రక్కనే ఉన్నారు. జరిగింది చూసి ఆయన ఆశ్చర్యచకితులైనారు. కుతూహలాన్ని ఆపుకోలేక ఆయన చింపిన ఉత్తరం ముక్కలను ఒక క్రమ పద్ధతిలో అమర్చి విషయాన్ని చదివారు. ఉత్తరమంతా వినోబాజీ గురించి పొగడ్తలే! "మీకు సమానమైన ఉన్నత మనస్కుడిని మరొకరిని నేనింత వరకు చూసివుండలేదు" అని వ్రాసి ఉంది ఆ ఉత్తరంలో.

బజాజ్ గారు ఆశ్చర్యంగా "మీరీ ఉత్తరాన్ని ఎందుకు చింపేసారు? ఉన్న నిజాన్నే కదా బాపూజీ మీకు రాసారు?" అని అడిగారు.

అందుకు వినోబాజీ చిరునవ్వుతో ఇలా అన్నారు: "ఈ ఉత్తరం నాకు ఎంత మాత్రం ఉపయోగం లేనిది. అందుకే నేను దీన్ని చింపేశాను. బాపూజీ ఎంతో పెద్ద మనస్సుతో నాలోని సుగుణాలను చూశారు. అదే ఈ ఉత్తరంలో రాశారు. కానీ నాలో ఎన్ని లోపాలున్నాయో ఆయనకేం తెలుసు? ఆత్మస్తుతి నాకు బొత్తిగా గిట్టదు. అదే గనక, ఎవరైనా నా లోపాలను ఎత్తి చూపారనుకో -వారెప్పుడూ నా ప్రక్కనే ఉండాలని కోరుకుంటాను." ❖

అనువాదం: డాక్టర్ వై.సరోజా నిర్మల (రామకృష్ణ సంఘం - హిందీ మాసపత్రిక 'వివేక జ్యోతి' నుండి)

తీరుతుంది. భగవంతుని అనుగ్రహం లేకపోతే ప్రపంచమంతా సహకరించినా మనం ఆశించినది మనకు రాదు" అన్న పరమ సత్యాన్ని సంపూర్ణంగా విశ్వసించాలి.

అలాంటి విశ్వాసంతో మహత్కార్యాలను సాధించిన ఎందరో మహాత్ములను ఆదర్శంగా తీసుకొని, వారి అడుగుజాడలను అనుసరించడానికి ప్రయత్నించాలి. అలాగే మనం ప్రస్తుతం చేసిన కర్మలకు ఆశించిన ఫలితాలు రాకపోవడానికి కారణం పూర్వజన్మల కర్మల ప్రభావం కూడా నేటి ఫలితాలపై ఉంటుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి.

కర్మఫలితాల పట్ల భగవంతునికే అధికారం ఉందన్న సత్యాన్ని జీవితంలో ఆచరించిన వ్యక్తి జార్జ్ వాషింగ్‌టన్ కార్వర్. జార్జ్ వాషింగ్‌టన్ తన జీవితకాలపు ఆదాయమంతా ఓ బ్యాంక్‌లో పొదుపు చేశాడు. ఆ బ్యాంక్ దివాలా తీసిందని తెలిసినప్పుడు 'ఆ భగవంతుడు నా పొదుపు మొత్తాన్ని ఇంకొకరికి ఉపయోగపడేలా చేశాడు' అని నవ్వుతూ అన్నాడు.

'కర్మఫలితాలు ఆ పరమాత్ముని అధీనమే' అన్న ఒక్క భావాన్ని మన మనస్సులో సుస్థిరపరచుకోగలిగితే మనం ఆశించిన ఫలితాలు రాలేదన్న దుఃఖం గానీ, ఇతరులకు మంచి ఫలితాలు వచ్చాయన్న అసూయ గానీ మనలో పొడసూపవు. అప్పుడు కర్మఫలితం ఆ పరమాత్ముని ప్రసాదంగా భావిస్తూ, ప్రశాంతంగా కర్మలను నిర్వర్తించగలుగుతాం. ❖

అసమాన సేవాతత్పరుడు

కథ: స్వామి అపవర్గానంద   చిత్రాలు: వెంకట్   అనుసృజన: స్వామి జ్ఞానదానంద

1 మైసూరు రాష్ట్రంలోని చికమగలూర్‌లో వసిస్తూ వచ్చిన నరసింహాచారి, పెరుందేవి దంపతులకు 1865వ సంవత్సరం మార్చి నెలలో అలసింగ పెరుమాళ్ జన్మించారు. కొంతకాలం గడిచాక వాళ్ళు చెన్నైలోని తిరువళ్ళిక్కేనికి తరలి వచ్చారు.

2



3 పట్టభద్రుడయ్యాక అలసింగ న్యాయ కళాశాలలో చేరాడు. కుంభకోణం, చిదంబరం ఉన్నత పాఠశాలల్లో పని చేశాక చెన్నై పచ్చయప్ప కళాశాలలో విజ్ఞానశాస్త్ర అధ్యాపకుడిగా చేరాడు. కుటుంబ బాధ్యతల్ని చక్కగా నిర్వహించసాగాడు.



4 పరాయిపాలనలో బానిసలుగా బ్రతుకుతున్న మన ప్రజల్లో అనేకులు పాశ్చాత్య మోహంలో పడి మన మతం, సంస్కృతి ఇత్యాదుల పట్ల విశ్వాసం కోల్పోయారని అలసింగ దుఃఖించసాగాడు.




5
1893 జనవరి మాసాంతాన పరివ్రాజకునిగా స్వామి వివేకానంద చెన్నైకి విచ్చేశారు. స్వామీజీని దర్శించుకొన్న అలసింగ, ఆయన అపార జ్ఞాన సంపత్తిని చూసి పాదాక్రాంతుడయ్యాడు. ఒక రోజు స్వామీజీతో ...
స్వామీజీ! చికాగో విశ్వమత మహాసభలో మన హైందవ మత ప్రతినిధిగా మీరు పాల్గొనాలని మా ప్రార్థన.
దేవి సంకల్పం అదే అయితే తప్పక జరుగుతుంది.
6
సర్ ఎస్. సుబ్రమణియం అయ్యర్ ఇంట్లో చెన్నై నగర యువకులతో స్వామీజీ సమావేశమయ్యారు.
మిత్రులారా! మన మతం గురించి ప్రపంచానికి చాటవలసిన సమయం ఆసన్నమైంది. మనం మళ్ళీ ఉన్నతి పొందాలంటే మన భారతదేశం శక్తిమంతంగా, ఐకమత్యంతో భాసించాలి.
స్వామీజీ! విశ్వమత మహాసభలో మీరు పాల్గొనడానికి శాయశక్తులా ప్రయత్నిస్తాం.
7
విశ్వమత మహాసభలో తాను పాల్గొనడానికి కావలసిన నిధి ప్రజల నుండే రావాలని స్వామీజీ అభిలషించారు. వెంటనే అలసింగ, యువకులతో కలిసి ఇంటింటికీ వెళ్ళి రూ.500 సేకరించాడు.
అయినప్పటికీ స్వామీజీ వెంటనే బయలుదేరలేదు. భగవాన్ శ్రీరామకృష్ణుల అనుజ్ఞకై నిరీక్షించారు.
8
రెండు నెలల తరువాత, శ్రీరామకృష్ణులు ఒక దివ్యదర్శనంలో స్వామీజీ అమెరికా వెళ్ళడానికి అనుజ్ఞను ఒసగారు. అదే సమయంలో మాతృమూర్తి శ్రీశారదాదేవి నుండి ఉత్తరం కూడా వచ్చింది.
మిత్రులారా! పాశ్చాత్యానికి వెళ్ళడానికి మాతృమూర్తి శ్రీశారదాదేవి నాకు ఆశీస్సులు ఇచ్చారు.
ఆ తరువాత అలసింగ తదితరులు స్వామీజీ పయనానికై మళ్ళీ రూ.4,000 సేకరించారు. 1893 మే 31 నాడు, ఓడలో స్వామీజీ అమెరికా బయలుదేరడానికి నిర్ణయమైంది.


9
శక్తివంచన లేని అలసింగ ప్రయత్నాల ఫలితంగా స్వామీజీ బొంబాయి నుండి నౌకలో అమెరికాకు బయలుదేరారు. అలసింగ అక్కడకు వెళ్ళి ఆయనను సాగనంపాడు.
నాయనా అలసింగా! నీ వల్లనే కష్టమైన ఈ పని సుసాధ్యమైంది.
అంతా మీ ఆశీస్సులే స్వామీజీ!
10
ఇంతలో అమెరికాలో విశ్వమత మహాసభ వాయిదా పడింది. తీసుకువెళ్ళిన పైకం కరిగిపోవడంతో స్వామీజీ ఎన్నో ఇబ్బందులకు గురి అయ్యారు. అలసింగకు తంతి పంపించారు. చెన్నైలో అలసింగ తన భార్యతో ...
రంగమ్మా! మన గురువు అమెరికాలో పస్తులతో అలమటిస్తున్నారు. ఆయన దురవస్థను తీర్చడానికి నీ నగలు ఇస్తావా?
స్వామీ! మన గురువు గారికి తోడ్పడని నగలను నేను ధరిస్తానా? ఇవిగో తీసుకోండి.
అలసింగ తన భార్య నగలు తెగనమ్మి, అప్పు చేసి రూ. 1,100 స్వామీజీకి పంపించాడు.
11
స్వామీజీ చికాగో విశ్వమత మహాసభలో ఏకైక వాక్యంతో ప్రపంచాన్ని జయించారు.
'అమెరికా సోదర సోదరీమణులారా..!'
విశ్వమత మహాసభ తరువాత స్వామీజీ అమెరికాలో కనీవినీ ఎరుగనంత ఖ్యాతి పొందారు. ఎంతో శ్రమకోర్చి హైందవ మత ప్రాశస్త్యాన్ని ఎలుగెత్తి చాటారు.
12
అమెరికాలో స్వామీజీ పొందిన ఖ్యాతి పట్ల అసూయతో రగిలి పోయిన పలువురు ఆయనకు ఇక్కట్లు కల్పించసాగారు. వాళ్ళ నోళ్ళు మూయించడానికి చెన్నైలో అలసింగ ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశాడు.
మిత్రులారా! హైందవ మత ప్రతినిధిగా స్వామీజీ కార్యాచరణ మీద సంపూర్ణ విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ, ఓ తీర్మానాన్ని అమెరికాకు పంపుదాం.
అలసింగ ప్రయత్నం వల్ల స్వామీజీ ఇబ్బందులు కొంతవరకు తొలగాయి.
వచ్చే సంచికలో... 'అలసింగ అచంచల గురుభక్తి'



వికాస మంత్రాలు

- స్వామి పార్థసఖానంద

తోటి వారిపై ఆధిక్యాన్ని సాధించడంలో గొప్పతనం ఏమీ లేదు, మనపై మనం ఆధిక్యాన్ని సాధించడంలోనే నిజమైన గొప్పతనం ఉంది.



ఒకరో లేక ఇద్దరు వ్యక్తులతో నాకు సమస్య ఉంటే వారిలోనే కాస్తో కూస్తో తప్పు ఉందని అనుకోవచ్చు. కానీ నాకు అందరితోనూ సమస్య ఉంటే.. అసలు సమస్య నాలోనే ఉందేమో!

మన సమస్యలకు రెండే కారణాలు ఉన్నాయి.. దేన్ని గుర్తుంచుకోవాలో దాన్ని మరవడం, దేన్ని మరచిపోవాలో దాన్ని గుర్తుంచుకోవడం.



మనకు ఉన్న అసలు సమస్య ఏమిటంటే... ఎప్పుడు మొదలుపెట్టాలో తెలీదు, ఎప్పుడు ఆపాలో తెలీదు, ఆ మధ్యలో ఏం చేయాలో తెలీదు, అంతే!

మనల్ని రెండు విషయాలు నిర్వచిస్తాయి.. ఏమీ లేనప్పుడు మనకున్న ఓర్పు, అన్నీ ఉన్నప్పుడు మన వైఖరి.

భూకంప బాధితులకు సహాయక చర్యలు

నేపాల్‌లో 2015 ఏప్రిల్ 25న సంభవించిన విధ్వంసకర భూకంపం వల్ల వేలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. రామకృష్ణ మిషన్ లక్నో, డార్జిలింగ్ కేంద్రాల సహాయంతో **ఖాట్మండు, రామకృష్ణ మిషన్** కేంద్రం బాధితులకు వెంటనే సహాయక చర్యలను చేపట్టింది. ఆహార పొట్లాలనూ, నిత్యావసర వస్తువులనూ, శిశు పోషకాహారాన్నీ పంపిణీ చేస్తోంది.

భూకంప బాధితుల సహాయ, సేవా కార్యక్రమాల నిమిత్తం ఉదార హృదయులైన భక్తులు, శ్రేయోభిలాషుల నుండి విరాళాలను కోరుతున్నాం. మీ విరాళాల్ని Ramakrishna Mission, Kolkata పేరున చెక్కు/ డి.డి. తీసి The General Secretary, Ramakrishna Mission (Relief Section), Belur Math, Howrah, West Bengal-711 202 చిరునామాకు పంపాల్సిందిగా మనవి.

మా వెబ్‌సైట్ http://www.belurmath.org/donation_cca/donation.phpను ఉపయోగించి ఆన్‌లైన్ ద్వారా విరాళాలను అందజేసే సదుపాయం కూడా ఉంది.

సహాయ కార్యక్రమాలకు ఇచ్చే విరాళాలకు ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80జి కింద పన్ను మినహాయింపు లభిస్తుంది.

భగవత్సేవలో
స్వామి సుహితానంద
ప్రధాన కార్యదర్శి

గ్రంథ స్వీకారం



యజ్ఞ వైశిష్ట్యము

సంకలనం: శ్రీ తోటపల్లి బాలకృష్ణ శర్మ
వెల: రూ. 165/-, పుటలు: 500
ప్రతులకు: తోటపల్లి బాలకృష్ణ శర్మ, ఇం.నెం. 5-7-278/31, శ్రీకృష్ణ దేవరాయ కాలనీ, బి.యన్. రెడ్డి నగర్, హైదరాబాద్
సెల్ : 94419 27725

మహర్షి శ్రీ మలయాళ సద్గురు
గీతా తత్త్వప్రబోధము

నివేదన: శ్రీమతి బొప్పన అరుణాదేవి
వెల: రూ. 150/-, పుటలు: 218
ప్రతులకు: బొప్పన అరుణాదేవి ప్లాట్ నెం. బి-291; 292, శ్రీరాంనగర్ కాలనీ, కొత్తగూడ పోస్టు, కొండాపూర్ హైదరాబాద్ - 500 083
ఫోన్ : 040 - 3293 3818



విశ్వమానవ విధాత వివేకానంద
(బుర్రకథ)

రచన: డాక్టర్ నిడమర్తి నిర్మలాదేవి
వెల: రూ. 50/-, పుటలు: 42
ప్రతులకు: డా॥ నిడమర్తి నిర్మలాదేవి, ఇం.నెం. 2-2-18-18-5/6, దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ, అంబర్‌పేట్, హైదరాబాద్-13, సెల్ : 92468 18391



రోజుకో సీస పద్యం

సంకలనం: శ్రీ మల్లాది హనుమంతరావు
వెల: రూ. 80/-, పుటలు: 136
ప్రతులకు: మల్లాది హనుమంతరావు, 401, మై హోం రెయిన్ బో, ఆరంజ్, షేక్‌పేట నాలా, గోల్కొండ పోస్టు, హైదరాబాద్ - 500 008.
సెల్: 99493 40236

Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020 and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**

సురభి

నేను (స్వామి అశేషానంద) మాతృమూర్తి దర్శనం కోసం 'ఉద్బోధన్' వెళ్ళాను. అక్కడ స్వామి ధీరానందజీ మహరాజ్ నన్ను 'అబ్బాయీ! నీ బాధ్యత ఎవరికి అప్పగిస్తావు? (ఎవరిని గురువుగా స్వీకరిస్తావు?)' అని అడిగారు. నేను పాశ్చాత్య తత్త్వవేత్తల రచనలు, బైబిలు కూడా చదివి ఉన్నాను. కానీ భగవద్గీత చదవలేదు. నేను చెప్పినదంతా స్వామి ధీరానంద మౌనంగా విని, 'నీకు ఆధ్యాత్మిక జీవితం గురించి ఏమీ తెలియదు. ఆధ్యాత్మిక జీవితంలో మార్గదర్శకులు అత్యావశ్యకం. నీవు ఒక గుహలో ఉన్న దేవాలయాన్ని సందర్శిస్తున్నావు అనుకో. చిమ్మచీకటి. నడుస్తున్నప్పుడు, రాతి గోడలకు తల కొట్టుకోవచ్చు. అదే ఒక పూజారి గనక తోడుగా ఉంటే, ఒక దీపం పట్టుకొని నీతో వస్తాడు. ఏ కష్టం లేకుండా నీవు దైవదర్శనం చేసుకొంటావు. అమ్మ మేడపై ఉన్నారు. మంత్రోపదేశం చేసి నిన్ను అనుగ్రహించాల్సిందిగా ఆమెను వేడుకో' అన్నారు.

అమ్మ దర్శనార్థులను తోడ్కొని వెళ్ళడానికి రాసవిహారి మహరాజ్ వచ్చారు. ఎవరూ అమ్మతో మాట్లాడకూడదని ఆదేశం. కనుక ప్రణమిల్లి, మేడ దిగి వచ్చి, స్వామి ధీరానందకు చెప్పాను. ఆయన వెంటనే, 'రాసవిహారీ! ఈ పిల్లవాణ్ణి మరల అమ్మ వద్దకు తీసుకు వెళ్ళు. ఈతడు స్వామి బ్రహ్మానంద వద్దకు తరచూ వెళతాడని చెప్పి, దయచేసి మంత్రదీక్ష ఇవ్వాల్సిందిగా అమ్మకు చెప్పు' అన్నారు.

మంత్రదీక్ష ప్రసాదించడానికి అమ్మ అంగీకరించినందుకు, స్వామి ధీరానందజీ నా కన్నా ఎక్కువ సంతోషించారు. నేను ఎంత మహత్త్వపూర్ణమైన ఆశ్రయం పొందబోతున్నానో నాకు తెలియదాయె! నా వయస్సు 17 సంవత్సరాలు. ఆమె సాక్షాత్తూ జగన్మాత అని నేను ఎరుగను.

తదనంతర కాలంలో అమ్మ అనుగ్రహంతో నేను స్వామి శారదానంద మహరాజ్ సేవకుడిగా నియుక్తుడనయ్యాను. ఒకనాడు వారితో 'ప్రతి పూట ఎన్నిసార్లు జపం చేయాలో, విశేష దినాలలో ఎన్నిసార్లు చేయాలో ఏమీ పద్ధతి ప్రకారం అమ్మ చెప్పలేదు. మీరు చెబుతారా?' అని అడిగాను.

అప్పుడు స్వామి శారదానంద మహరాజ్ 'నీవు పదహారణాల వెర్రిబాగులవాడివి. సాధారణ గురువులు ప్రణాళికలు ఇస్తారు. అమ్మ సాక్షాత్తూ జగజ్జనని. ఆధ్యాత్మిక జీవనంలో అమ్మ చెప్పిన దానికి మించినది లేదు. మంత్రంలో విశ్వాసం ఉంచి జపం చేయి, ఇష్టదైవాన్ని ధ్యానించు. భగవద్దర్శనానికై నిజంగా ఆవేదన చెందితే, నీవు ఆ ధ్యానంలో మునిగిపోతావు; నీ ప్రార్థన ఫలిస్తుంది. అమ్మ చెప్పినదానికి మరింత జోడించమంటున్నావు కదూ? ఆమె కృప మూలంగానే నేను ఇక్కడ ఉన్నాను.'

అలా స్వామి శారదానంద మహరాజ్ 'శారదామాత మానవ మాత్రురాలు కాదు, సజీవంగా ఉన్న ఆద్యాశక్తి' అని నాకు కనువిప్పు కలిగించారు. ❖

Vol.72-6, Sri Ramakrishna Prabha (Telugu Monthly) June 2015, Regd. with the Registrar of Newspaper for India Under No.1120/57. Postal Registration No. HD-1071/2013-15. Licensed to Post Under WPP : AP/CPMG/HC-13/WPP/2015-16. Date of Publication : 16 May 2015

సంగీత సాధన సర్వేశ్వరారాధన

నరేంద్రుడు (స్వామి వివేకానంద) సంగీతంలోనూ ప్రావీణ్యుడు. అతడు సుశ్రావ్యమైన కంఠంతో, భావయుక్తంగా గానం చేస్తుంటే శ్రోతలు పరవశించిపోయేవారు. ముఖ్యంగా భగవాన్ శ్రీరామకృష్ణులు, నరేంద్రుని గానం వింటూ భావసమాధి స్థితిలోకి వెళ్ళిపోయేవారు.

నరేంద్రుడు వేణీమాధవ్, ఉస్తాద్ అహ్మద్ ఖాన్‌ల వద్ద సంగీతంలో శిక్షణ పొందాడు. సుప్రసిద్ధ ధ్రుపద్ సంగీత విద్వాంసుడైన జ్వాలా ప్రసాద్ వద్ద ధ్రుపద్ సంగీతం కూడా అభ్యసించాడు. కాశీనాథ్ ఘోషాల్ వద్ద తబలా, పక్వాజ్ మొదలైన సంగీత వాయిద్యాలను నేర్చుకున్నాడు. ధ్రుపద్ సంగీతంలో నరేంద్రుడు అగ్రగణ్యుడు.

ఒకసారి నరేంద్రుని మిత్రుడొకడు హావభావాలను ప్రదర్శిస్తూ పాడుతున్నాడు. అప్పుడు నరేంద్రుడు "సంగీతమంటే కేవలం రాగతాళాలు మాత్రమే కాదు. భావం గానానికి ఆధారం. గానంలో ఆ భావం వ్యక్తం కాకపోతే అది సంగీతమనిపించుకోదు. సంగీతం ఉత్తమోత్తమమైన కళ. ఈ కళ ద్వారా గాయకుడు చేసే సాధన భగవదారాధన అవుతుంది" అని సంగీతానికున్న విశిష్టతను అతడికి వివరించాడు.

(జూన్ 21 సంగీత దినోత్సవం)

With Best Compliments From

పక్యాల భాస్కర రావు, మేనేజింగ్ డైరక్టర్ & **పక్యాల గిరిజ**, డైరక్టర్

SVISS LABSS LIMITED

(Manufacturers of Active Pharmaceutical Ingredients and Intermediates)

Regd. Off. & Fact. : Plot No.88 & 89, Phase - II,
SIPCOT Industrial Complex, Ranipet - 632 403, Tamil Nadu.
Phone : 04172 - 244820, 651507, Tele Fax : 04172 - 244820
E-mail : rao@svisslabss.net Web Site : www.svisslabss.net

SVISS LABSS కంపెనీ వారు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 2,000 పాఠశాలలకు స్పాన్సర్ చేశారు.

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

ఆగస్టు 2015
₹10

భారతదేశం నా ఆత్మ

సుబోధ

శ్రీరామకృష్ణులు : సాధనలు చేయాలి. కేవలం శాస్త్రాలు అధ్యయనం చేసినంత మాత్రాన ప్రయోజనం లేదు. నేనొకసారి విద్యాసాగర్‌ను చూశాను. అతడు ఎంతో చదువుకున్నవాడు. అయితే అంతరంగాన ఏముందో అతడికి తెలియదాయె. పిల్లలకు చదువు చెప్పించడంతోటే అతడు సంతుష్టుడయ్యాడు. భగవదానందాన్ని చవిచూడలేదు. ఊరకే చదివినంత మాత్రాన ఏమిటి ప్రయోజనం? చదివిన విషయాన్ని జీర్ణించుకోవాలి. ఇరవై పదునుల వర్షం పడుతుందని పంచాంగంలో వ్రాసి ఉంటుంది. కానీ పంచాంగాన్ని పట్టుకుని పిండితే కనీసం ఒక్కబొట్టు నీరైనా రాలదు కదా!

ఒకసారి ఒక భక్తుడు నాతో 'నా దగ్గర ఉన్న ధనాన్ని పాఠశాలలు, వైద్యాలయాలు, రహదారులు, నదీఘట్టాలు నిర్మించడం కోసం వినియోగింపదలిచాను' అని అన్నాడు.

అందుకు నేను "నువ్వు ఆ పనులన్నింటినీ నిష్కామ భావంతో చేసినట్లయితే మంచిదే. కానీ అలా నిష్కామకర్మలు చేయడం చాలా కష్టం. ప్రతిఫలాపేక్ష ఎక్కడి నుండి వస్తుందో తెలియదు కానీ మొత్తానికి అది వచ్చి పడుతుంది. మరో సంగతి భగవంతుడు గనుక నీకు ప్రత్యక్షమైనట్లయితే, నువ్వు ఆయనను పాఠశాలలు, వైద్యశాలలు మొదలైనవాటిని కోరుకొంటావా ఏమిటి?" అని అన్నాను.

భక్తుడు: అయ్యా! సంసారంలో ఉన్నవారికి మార్గమేమిటి?

శ్రీరామకృష్ణులు: సాధుసాంగత్యం, భగవత్ప్రసంగాలు శ్రవణం మొదలైనవి చేయాలి.



సంసారులు మత్తెక్కి ఉన్నారు; కామినీ కాంచనాలలో మైమరచి ఉన్నారు. మద్యం త్రాగి మత్తెక్కి ఉన్నవాడికి బియ్యపు కడుగు కొద్దికొద్దిగా త్రాపిస్తున్నట్లయితే, క్రమేణా మత్తు దిగుతుంది. అంతేగాక, సద్గురువు వద్ద ఉపదేశం పొందాలి. సద్గురువుకు కొన్ని లక్షణాలు ఉంటాయి. కాశీకి వెళ్ళి ఆ క్షేత్రాన్ని దర్శించి వచ్చినవాడి వద్దనే కాశీక్షేత్రం గురించిన విషయాలు వినాలి. కేవలం పాండిత్యంతో ఒరిగేదేమీ ఉండదు. ❖

శ్రీరామకృష్ణ ప్రభ
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాదు-500 029
ఫోన్: 040-27667799, సెల్: 8801849494
E-mail : sriramakrishnaprabha@gmail.com
నిర్వాహక సంపాదకులు: స్వామి జ్ఞానదానంద
సంపాదకులు: స్వామి పరిజ్ఞేయానంద

సురభి

నేను (స్వామి వాసుదేవానంద) వరద సహాయక పనుల నుండి తిరిగి వచ్చిన పిదప, మాతృమూర్తి శారదాదేవిని 'అమ్మా! ఊరూ వాడా తిరిగే పని. అక్కడ మీరు ఎవ్వరూ ఉండరు. ఏదైనా సందేహం వచ్చినా, తికమకగా ఉన్నా, ఎవరిని అడగాలి? ఏమి చేస్తే మంచిది?' అని అడిగాను.

అప్పుడు అమ్మ ఇలా సమాధానమిచ్చారు: ఎల్లప్పుడు శ్రీరామకృష్ణుల చిత్రపటం ఒకటి దగ్గర ఉంచుకో. ఆయన ఎల్లప్పుడు నీ దగ్గరే ఉన్నారనీ, నిన్ను కాపాడుతున్నారనీ భావించు. ఏ సందేహం వచ్చినా ఆయననే ప్రార్థించు. సమాధానం లభిస్తుంది. ఆయన ఎల్లప్పుడు అంతరంగంలో ఉంటారు.

ఒకసారి ఓ భక్తుడు శారదామాతను 'అమ్మా! చెడు తలంపులు ఎందుకు వస్తాయి?' అని అడిగాడు.

అందుకు అమ్మ సమాధానమిస్తూ ఇలా అన్నారు :

"క్రింద వైపుకు పోవడమే మనస్సు సాధారణ స్వభావం. మనిషి ఎన్నో కోరికలు మూటకట్టుకుని ఉంటాడు. అడపాదడపా ముడివీడి అవిబయటపడతాయి.

ఒక్క సంగతి గుర్తు పెట్టుకో – సాధు సాంగత్యం, సత్సంగం మనస్సును ఊర్ధ్వముఖం చేస్తాయి. సాధు సాంగత్యం మూలంగా అత్యంత అధముల మనస్సు గతి కూడా మారిపోతుంది. సాధువుల సాంగత్యం బాగా చేసిన ఒక బోయ పిట్టల వేటకు వెళ్ళాడు. పక్షుల సరళత్వం, నిర్భీతత్వం చూసి వైరాగ్యం జనించి స్వీయవృత్తిని పూర్తిగా వదలివేశాడు. వీలు చిక్కినప్పుడల్లా సత్సాంగత్యం చేయి. అది దొరకనప్పుడు సద్గ్రంథపఠనం చేయి. మహాత్ముల జీవితాలను మననం చేసుకుంటే చిత్తం శుద్ధమగును. చూడు, నీరు ఎల్లప్పుడు క్రిందకే పారుతుంది. కానీ సూర్య కిరణాలు దానిని పైపైకి ఆకాశంలోకి తీసుకువెళ్ళుతాయి. ఆ నీరు మంచుగా గడ్డకట్టి పర్వతశిఖరాలపై కూర్చుంటుంది. ఆపైన వానగా, జలపాతంగా, నదిగా మారి ఎంత లోకకల్యాణం చేస్తుంది!"

మనుష్యులు తమ మనస్సును తరచి చూడరు. పరుల దోషాలు మాత్రమే చూస్తారు. తమ దోషాలు చూసుకొని, వాటిని సరిదిద్దుకొనే ప్రయత్నం చేస్తే, పరుల దోషాలు వెదికే స్వభావం పోతుంది. మనుష్యుల ఈ స్వభావాన్ని మహామాయ సృష్టించింది – తనలోని నువ్వు గింజంత మంచి గుణాన్ని తాటికాయంత చేసి చూపడం, ఇతరులలోని తాటికాయంత సద్గుణాన్ని నువ్వుగింజంత చిన్నదిగా చూడడం. తన గొప్పదనంలో మునిగితే ఇతరుల గురించి ఏమి పట్టించుకొంటారు?

ఒకప్పుడు నా స్థితి ఎలా ఉండేదంటే... నైవేద్యానికి చీమలు పట్టితే వాటిని తీసివేయలేకపోయేదానిని – శ్రీరామకృష్ణులే తింటున్నారని తోచేది. అన్ని జీవులలో భగవంతుణ్ణి చూడలేకపోతున్నందునే పరనింద చేస్తాం. మన ఉన్నతికై ప్రయత్నించనందువలననే, పరుల మంచీ చెడులు లెక్కిస్తూ మనస్సును అనవసరంగా ఉద్రేకపరుస్తాం. ❖

ఆధ్యాత్మిక అమృతవాహిని
శ్రీ రామకృష్ణ ప్రభ
సంపుటం: 72 సంచిక: 8 ఆగస్టు 2015

భారతీయ వీరులం, భరతమాత బిడ్డలం,
మాతృదేశ గౌరవం కాపాడే ధీరులం.
వేష భాష లేవైనా మతాచార మేదైనా
మనం భారతీయులం, ఒకే తల్లి పిల్లలం.
ప్రపంచాన మనదేశం ప్రతిభను నిలబెట్టుదాం.
హిమశైల కిరీటమై సముద్ర పాద పీఠమై
గంగ, యమున, గోదావరి, కృష్ణవేణి సహితయై
విలసిల్లే భరతమాత
మన తల్లికి జోహార్, మన తల్లికి జోహార్.

– డాక్టర్ దాశరథి కృష్ణమాచార్య

సూక్తి సౌరభం

శరది న వర్షతి గర్జతి వర్షతి
వర్షాసు నిఃస్వనో మేఘః।
నీచో వదతి న కురుతే
వదతి న సాధుః కరోత్యేవ॥

"శరత్కాలంలో మేఘాలు గర్జిస్తాయి. కానీ వర్షించవు. వర్షాకాలంలో మేఘాలు నిశ్శబ్దంగా వర్షిస్తాయి. అదేవిధంగా నీచుడు మాట్లాడతాడు కానీ పని చేయడు. సజ్జనుడు పనిచేస్తాడు కానీ మాట్లాడడు."

పూజకన్న నెంచ బుద్ధి నిదానంబు
మాటకన్న నెంచ మనసు దృఢము
కులముకన్న మిగుల గుణము ప్రధానంబు
విశ్వదాభిరామ వినుర వేమ!

"ఓ వేమా! పూజా పునస్కారాల కన్నా బుద్ధి బాగుండాలి. మాట కన్నా మనస్సు దృఢంగా ఉండాలి. కులం కన్నా గుణం ప్రధానంగా ఉండాలి."



శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి



ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'కి ధన దానం చేసి ప్రోత్సహించాల్సిందిగా కోరుతున్నాం. దాతల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు......	రూ.	10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజపోషకులు............	రూ.	5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు.................	రూ.	1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

	దాతపేరు ఊరు	రూ.
మహా రాజపోషకులు	శ్రీ కె. వి. నాగేశ్వరరావు, జూబ్లీహిల్స్, హైదరాబాద్	10,116
మహా రాజపోషకులు	శ్రీ వెలమాటి చంద్రశేఖర జనార్దనరావు, బేగంపేట, హైదరాబాద్	10,000
మహా రాజపోషకులు	శ్రీ తేతల రత్నారెడ్డి & శ్రీమతి నాగలక్ష్మి, చిన్న గంట్యాడ, గాజువాక, విశాఖపట్నం	10,000
రాజపోషకులు	శ్రీమతి చెవుటూరి కుసుమ కుమారి, బంజారాహిల్స్, హైదరాబాద్ (కీ॥శే॥ చెవుటూరి తాండవకృష్ణగారి జ్ఞాపకార్థం)	5,000
పోషకులు	శ్రీమతి జి. శశికళ, బాలాజీ నగర్, నెల్లూరు	1,200
పోషకులు	డాక్టర్ కె. హరి ప్రసాద్, వికాస్ నగర్, హైదరాబాద్ (కీ॥శే॥ కె. ఇందిర గారి జ్ఞాపకార్థం)	1,000

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

యువతరానికి 'శ్రీరామకృష్ణ ప్రభ'ను మరింత చేరువ చేయాలని సంకల్పించాం. రాష్ట్రంలోని వివిధ పాఠశాలలు/ కళాశాలలు/ గ్రంథాలయాలకు పత్రికను పంపించడానికి మీ సహాయాన్ని కోరుతున్నాం. ఈ కానుక పథకం క్రింద చందా చెల్లించిన దాత పేరున (మీరు సూచించిన లేదా మేము ఎంపిక చేసిన) విద్యాసంస్థకు పత్రికను పంపుతాం. కానుక చందా రూ.1,500/- అంతకన్నా ఎక్కువ ఇచ్చిన దాత పేరు, విద్యాసంస్థ పేరు పత్రికలో ప్రచురిస్తాం.

దాత పేరు	విద్యాసంస్థ
శ్రీ కె. హనుమంతప్ప, ఉరవకొండ, అనంతపురం జిల్లా	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొత్తలపల్లి, విడపనకల్, అనంతపురం జిల్లా
శ్రీ ఎ.వి.ఎన్. జగన్, ప్రకాశం జిల్లా (కీ॥శే॥ అమర రాఘవరావు గారి జ్ఞాపకార్థం)	సరస్వతీ నికేతన్ గ్రంథాలయం, వేటపాలెం, ప్రకాశం జిల్లా
శ్రీ చింతా సూర్యనారాయణమూర్తి, జగన్నాయకపూర్, కాకినాడ, తూ.గో.జిల్లా	50 విద్యాసంస్థలకు పత్రికను ఒక సంవత్సరానికి స్పాన్సర్ చేశారు.
శ్రీ కె. శ్రీ విష్ణు రెడ్డి, బిదాది ఇండస్ట్రియల్ ఏరియా, బెంగుళూరు రూరల్	15 విద్యాసంస్థలకు పత్రికను ఒక సంవత్సరానికి స్పాన్సర్ చేశారు.
శ్రీ ఆర్. భాస్కరరావు, కరణం వీధి, జైపూర్, కొరాపుట్ జిల్లా, ఒడిషా	30 విద్యాసంస్థలకు పత్రికను ఒక సంవత్సరానికి స్పాన్సర్ చేశారు.
శ్రీ కంటిపూడి సోమరాజు, ఆల్ బ్యాంకు కాలనీ, రాజమండ్రి, తూ.గో.జిల్లా	శ్రీ సాయిరాం మందిరము, ఆల్ బ్యాంకు కాలనీ, రాజమండ్రి, తూ.గో.జిల్లా
శ్రీ కొండూరు సుబ్బరాజు, గంజికుంట కాలనీ, శంకరాపురం, కడప జిల్లా	6 విద్యాసంస్థలకు, ఒక ఆశ్రమానికి పత్రికను స్పాన్సర్ చేశారు.
శ్రీ తన్నీరు మలహర్ రావు, పోతుగల్ గ్రామం, ముస్తాబాద్, కరీంనగర్ జిల్లా	సిరిసిల్ల మండలంలోని 75 విద్యాసంస్థలకు పత్రికను ఒక సంవత్సరానికి స్పాన్సర్ చేశారు.
శ్రీ యాతం చంద్రమౌళీశ్వర రెడ్డి, సంజీవనగర్, నంద్యాల, కర్నూలు జిల్లా	మాయలూరి పార్వతి రామకృష్ణ సేవాశ్రమం, ఎస్. ఉప్పలపాడు, కడప జిల్లా
శ్రీమతి బి. అరుణ, ఆనంద్ నగర్, న్యూ మలక్‌పేట్, హైదరాబాదు	50 విద్యాసంస్థలకు పత్రికను ఒక సంవత్సరానికి స్పాన్సర్ చేశారు.

With Best Compliments From

GKC PROJECTS LIMITED

Kondapur, Hyderabad

'జి.కె.సి. ప్రాజెక్ట్స్' వారు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 5000 విద్యాసంస్థలకు ఒక సంవత్సరానికి స్పాన్సర్ చేశారు.

చందా వివరాలు		భారతదేశంలో	విదేశాలకు
విడి ప్రతి	:	₹ 10	-
సంవత్సర చందా	:	₹ 100	₹ 1,500
మూడు సంవత్సరాలకు	:	₹ 280	₹ 4,500
ఐదు సంవత్సరాలకు	:	₹ 450	₹ 7,500
ఇరవై సంవత్సరాలకు	:	₹ 1,500	₹ 22,000

గమనిక: డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో Ramakrishna Math, Hyderabad అని వ్రాయాలి.

పంపవలసిన చిరునామా: Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.

చందాను ఆన్‌లైన్ http://rkmath.org/srkp ద్వారా చెల్లించవచ్చు.

లోపలి పేజీల్లో...

6 సంపాదకీయం
స్వతంత్ర భారతం వీరుల త్యాగఫలం

8 గోరుముద్ద
యోగ'ఆసనం'

9 పరివర్తన / సరళత్వం

10 పలికెడిది భాగవతం
శుభము సాంఖ్యయోగము

12 మహాపురుషుని సాన్నిధ్య స్మృతులు

14 మన సంస్కృతి
విదేశాలలో భారతీయ సంస్కృతి

15 నిండు మనసే నీ పూజ

16 పరిప్రశ్న

17 రామకృష్ణ భక్తి సూత్రాలు

18 అహింస

20 సన్మార్గం వైపు మారదాం!

21 ధీరవాణి
పురోభివృద్ధికి తోడ్పడేదే పుణ్యం!

22 జనయిత్రి... దివ్యధాత్రి

24 అంతా దైవేచ్ఛ!

26 విశ్వాసం విశ్వాసం విశ్వాసం

27 యువవాణి
సాగర కెరటమే స్ఫూర్తి

28 దిద్దుబాటు

30 కష్టాలతో 'కుస్తీ'పట్టి...

31 ఏకనిష్ఠ... దృఢవ్రతం

32 జీవనోద్యానంలో మానవతా పరిమళాలు
సేవతోనే పవిత్రత / సుపరిపాలనకు పునాది

33 ముందుకు సాగిపో!

35 ఒక కథ చెబుతా...
బంగారు ప్రమిద

36 భగవద్గీత – సద్గుణ సుధ
ఆత్మానుసంధానమే యోగం

37 వికాస మంత్రాలు

38 బొమ్మల కథ
చెరుకు తిన్న రాతి ఏనుగు

ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు. – సంపాదకులు

ప్రియ పాఠకులారా!

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు మీద చిరునామాకు పైన మీ చందా నంబరు, కుడి వైపున మీ చందా గడువు ముగిసే నెల ఉంటాయి. మీ చందా గడువు పూర్తయ్యే నెలకు ముందుగానే సొమ్మును చెల్లించి చందాను పునరుద్ధరించుకోండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారిన పక్షంలో 7వ తేదీ లోగా మాకు తెలియపరచినట్లయితే, వచ్చే నెల సంచిక నుండి మీ కొత్త చిరునామాకు పంపబడును.
- ప్రతీ నెల 26 లేదా 27వ తేదీల్లో పత్రిక పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపుగా చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ.... – సర్క్యులేషన్ మేనేజర్

KCP CEMENT
CONCRETE CEMENT
Since 1958

With Best Compliments From
CHAIRMAN & MANAGING DIRECTOR
THE KCP LIMITED
KCP కంపెనీ వారు "శ్రీరామకృష్ణ ప్రభ" మాసపత్రికను
1000 గ్రంథాలయాలకు స్పాన్సర్ చేశారు

KCP Sreshtaa CEMENT
THE NEW GENERATION CEMENT

Cement Marketing Division : Plot No. 10, Gayatri Hills, MP & MLA's Colony, Road No. 10 C, Jubilee Hills, HYDERABAD - 500033.
Tel : 040-2325 3503 to 505, Fax : 2325 3500, Cell : +91 99895 97775 / 9866305145, E-mail : ramakrishna.k@kcp.co.in
Registered Office : No. 2, Dr.P.V.Cherian Crescent, Egmore, CHENNAI - 600 008. Tel : 044 66772668, Fax: 044 66772620, CIN L65991TN1941PLC001128

సంపాదకీయం

స్వతంత్ర భారతం

స్వాతంత్ర్య దినం నాడు 'నేడే స్వాతంత్ర్య దినం, వీరుల త్యాగఫలం...' అనే ప్రబోధ గీతాన్ని పాడుకుంటూ ఆనందిస్తాం. ఇంటిపైన మువ్వన్నెల జెండాను ఎగురవేసి, ముఖం నిండా మూడు రంగులను పూసుకొని, వాహనాల మీద 'ఐ లవ్ ఇండియా' స్టిక్కర్లను అంటించుకొని జెండా పండుగను విజయవంతంగా జరుపుకొన్నామని సంబరపడతాం. కానీ ఆ త్యాగఫలాన్ని అనుభవిస్తున్న మనలో ఏకొంచెమైనా త్యాగబుద్ధి జనించిందా? స్వార్థచింతన తొలగిందా? అని మాత్రం ఆలోచించం. ఆ వీరుల త్యాగఫలమైన భారతదేశ స్థితిగతుల గురించి అవలోకించం.

మన వీరులు మనకు అందించిన ఆ త్యాగఫలం ఎలా ఉంది? ఏమవుతుంది? అని ఆలోచిస్తే, ఆ త్యాగఫలాన్ని స్వార్థ పురుగులు సర్వనాశనం చేస్తున్నాయని మాత్రం అర్థమవుతుంది. దేశంలో అవినీతి, అన్యాయాలు అలముకున్నాయనీ; ప్రతి ఒక్కరూ తమ సౌఖ్యమే ధ్యేయంగా, తమ సౌభాగ్యమే లక్ష్యంగా జీవిస్తున్నారనీ బోధపడుతుంది. ఈ అనర్థాలన్నింటికీ అసలు కారణం స్వార్థమే అని అవగతమవుతుంది.

గత భారత ఘన చరిత్ర : భారతదేశాన్ని వశం చేసుకోవాలని కుట్రలు పన్నిన పాశ్చాత్య శకుని లార్డ్ మెకాలే లాంటి కుటిలుడు కూడా భారతదేశ ఔన్నత్యానికి అబ్బుర పడకుండా ఉండలేకపోయాడు. భారతీయుల ఆదర్శ జీవనాన్ని చూసి కీర్తించకుండా ఉండలేకపోయాడు. భారతదేశ వైభవాన్ని శ్లాఘిస్తూ ఆయన అన్న మాటలివి:

"నేను భారతదేశమంతా పర్యటించాను. ఆ దేశంలో ఎక్కడా ఒక్క భిక్షగాడు కూడా కనిపించలేదు. దొంగలను చూడలేదు. ఎంతో ఉన్నతమైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, నైతిక విలువలుగల దేశమది. అంతేకాకుండా అక్కడ వివిధ రంగాల్లో అద్భుత ప్రతిభను కనబరుస్తున్న ప్రజలున్నారు. అలాంటి దేశాన్ని జయించడం సాధ్యమయ్యే పని కాదు."

పాశ్చాత్యులతో ప్రశంసించబడిన మన మహోన్నత భారతదేశంలో నేడు డబ్బులేక భిక్షగాళ్ళు కొందరైతే, డబ్బు ఉండీ భిక్షగాళ్ళు మరికొందరు; బ్రతుకుతెరువు లేక దొంగలుగా మారినవారు కొందరైతే, ధనవ్యామోహంతో దొంగలుగా మారినవారు మరికొందరు.... ఇలా నీతి నియమాలకు నీళ్ళొదిలి స్వార్థమయ జీవితాలను గడుపుతున్న వాళ్ళ సంఖ్య దినదిన ప్రవర్ధమానమవుతూ ఉంది.

మనం నేడు లార్డ్ మెకాలే ప్రశంసలను తారుమారు చేసి, ఈ దుఃస్థితికి చేరడానికి కారణమేమిటి? ఈ ప్రశ్నకు సమాధానం లార్డ్ మెకాలే మాటల్లోనే...

"భారతదేశాన్ని జయించాలంటే ఆ దేశానికి వెన్నెముక లాంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక, నైతిక విలువలను నాశనం చేయాలి. సనాతనమైన వారి సంస్కృతినీ, విద్యావిధానాన్నీ అంతమొందించాలి. ఈ విధంగా చేస్తే భారతీయుల ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం దెబ్బతింటుంది. అప్పుడు మనం వారిని సులభంగా లోబరచుకోవచ్చు".

నేటి మన దేశ దుఃస్థితికి కారణం – మన భారతజాతి జీవనాడి అయిన ఆధ్యాత్మిక, నైతిక విలువల్ని విస్మరించడమే! ఆత్మగౌరవాన్ని కోల్పోయి పాశ్చాత్యులను అనుకరించడమే!

మరి ఈ వర్తమాన దుఃస్థితికి స్వస్తి చెప్పి, పూర్వ వైభవాన్ని పునరుద్ధరించడమెలా? భారతదేశ కీర్తి ప్రతిష్ఠలను పునఃప్రతిష్ఠించడమెలా?

స్వార్థమే అనర్థ కారణం : స్వార్థం సకల అనర్థాలకు మూల కారణం. దాన్ని మనం రూపుమాపకపోతే, అది మనల్ని రూపుమాపుతుంది. ఈ నిజాన్ని తెలిపే మరువరాని కథను మననం చేసుకుందాం :

ఒక రైతు ఓ ఎద్దునూ, ఓ మేకనూ పెంచుతున్నాడు. ఎద్దు రోజంతా పొలంలో పనిచేస్తుంది. మేక మాత్రం ఏ పనీపాటా లేకుండా తిని కూర్చొంటుంది. పొలంలో కష్టపడి పనిచేసి వచ్చిన ఎద్దుకీ, కూర్చొని తింటున్న మేకకూ మేత వేసేవాడు రైతు. ఇలా రోజులు గడుస్తున్నాయి. కొంత కాలానికి మేకకు ఒక దురాలోచన వచ్చింది. "యజమాని నా కన్నా ఎద్దుకు ఎక్కువ మేత వేస్తున్నాడు. ఎద్దు కాలు విరగ్గొట్టుకునేలా చేస్తే, పొలంలో పనిచేయలేదు. అప్పుడు యజమాని ఎందుకూ పనికిరాని ఈ ఎద్దుకి మేత దండగని అమ్మేస్తాడు. అప్పుడు మొత్తం మేతంతా నాకే వేస్తాడు" అని పన్నాగం పన్నింది మేక.

ఒకరోజు సాయంత్రం పొలం నుండి వచ్చిన ఎద్దుతో 'మిత్రమా! నువ్వు చాలా నీరసంగా ఉన్నావు. యజమాని నీతో ఎండనకా, వాననకా పని చేయిస్తున్నాడు. రోజురోజుకీ నీవు చిక్కిపోతున్నావు. నువ్వు కూడా నాలాగ ఇంట్లోనే హాయిగా కూర్చొని తినే ఉపాయం చెబుతాను' అని మేక అంది. అందుకు ఎద్దు ఎంతో సంతోషించి ఆ ఉపాయమేమిటో త్వరగా చెప్పమని మేకను బతిమాలింది. అప్పుడు మేక "నువ్వు రేపు పొలంలో పనిచేస్తూ స్పృహతప్పి పడిపోయినట్లు నటించు. నువ్వు కింద పడిపోయినప్పుడు నీ కాలికి గాయమవుతుంది. అప్పుడు యజమాని నీతో ఏ పనీ చేయించకుండా నాలాగ ఇంట్లోనే ఉంచి జాగ్రత్తగా చూసుకుంటాడు" అని చెప్పింది.

మేక చెప్పిన ప్రకారం ఎద్దు మరుసటి రోజు పొలంలో దున్నుతూ పడిపోయింది. కాలికి దెబ్బతగిలి లేవలేని స్థితిలో ఉన్న ఎద్దుని చూసి రైతు చాలా బాధపడ్డాడు. తనకు ఎంతో సాయంగా ఉన్న ఎద్దుని కాపాడాలనుకొని, చికిత్స కోసం పశువైద్యున్ని తీసుకువచ్చాడు. ఆ వైద్యుడు మందు ఇస్తూ 'ఈ పసరును మేక రక్తంతో కలిపి ఎద్దు కాలికి కట్టుకడితే గాయం

వీరుల త్యాగఫలం

నయమైపోతుంది' అని చెప్పాడు. రైతు వెంటనే 'మేక రక్తం కోసం ఎక్కడికీ వెళ్ళనక్కరలేదు. ఇంట్లోనే మేక ఉంది కదా!' అని మనసులో అనుకొన్నాడు. ఇంటికి వచ్చి మేకను చంపి, వైద్యుడు చెప్పిన ప్రకారం ఎద్దుకు చికిత్స చేసాడు. గాయం నయమైన ఎద్దు యజమాని వద్ద సంతోషంగా జీవించసాగింది. మేక మాత్రం తన పన్నాగానికి తనే బలైపోయింది.

మేకలాంటి స్వార్థబుద్ధి గలవారున్న సమాజం పతనావస్థకు చేరుతుంది. ఏ సమాజం నిస్వార్థపరులు, సేవాపరాయణులతో విరాజిల్లుతుందో ఆ సమాజం సర్వవిధాల సుభిక్షంగా వర్ధిల్లుతుంది.

త్యాగమే క్షేమదాయకం : "ఈ భూమండలంలో 'పుణ్యభూమి' అని ప్రశంసించబడే ప్రదేశం ఏదైనా ఉందంటే అది కేవలం 'భారతదేశం' మాత్రమే!" అని స్వామి వివేకానంద భారతదేశ ఔన్నత్యాన్ని సగర్వంగా ప్రకటించారు.

భారతావని పుణ్యభూమి, కర్మభూమి, త్యాగభూమి. ఇక్కడ జన్మించడమే ఎన్నో జన్మల సుకృతఫలమనీ; ముక్తికి ఆఖరి మజిలీ భారతావనియే అనీ మహాత్ములు నిర్ధరించారు. అలాంటి మహోన్నత పుణ్యభూమిలో జన్మించిన మనం; త్యాగపురుషులకు వారసులమైన మనం; త్యాగానికి ఆలవాలమైన ఈ పుడమిలో జీవిస్తున్న మనం... నేడు ఎలా జీవిస్తున్నామో ఎవరికివారు ఆత్మావలోకనం చేసుకోవాలి.

త్యాగంలోనే శాశ్వతానందముందనీ, సర్వజనుల హితంలోనే నిజమైన సౌఖ్యముందనీ స్వర్గసుఖాలను సైతం త్యజించిన మహాభారతంలోని ముద్గలుని వృత్తాంతాన్ని ఒక్కసారి గుర్తుచేసుకుందాం:

ముద్గలుడు వ్యవసాయం చేయగా వచ్చిన ధాన్యాన్ని పేదలకు పంచి, పక్షులు తినడానికి వేసిన తరువాత మిగిలిన ధాన్యాన్ని తన కుటుంబ పోషణకు ఉపయోగించేవాడు. ముద్గలుడి త్యాగనిరతికి మెచ్చి, దేవతలు అతణ్ణి స్వర్గానికి తీసుకువెళ్ళారు. అక్కడికి వెళ్ళిన తరువాత తాను ఏం చేయాలో చెప్పమని దేవతల్ని అడిగాడు. 'నువ్వు ఇక్కడ ఏమీ చేయనవసరం లేదు. స్వర్గసుఖాలను అనుభవిస్తూ హాయిగా జీవించు' అని చెప్పారు దేవతలు.

అందుకు ముద్గలుడు "ఇక్కడ సుఖాలను అనుభవిస్తూ సోమరిగా ఉండడం కన్నా, కష్టించి పనిచేస్తూ నలుగురికీ సాయం చేయడంలోనే అసలైన ఆనందం ఉంది. కాబట్టి ఈ స్వర్గం కన్నా నా భారతావనియే మిన్న" అని చెప్పి త్యాగభూమికి వెనుదిరిగాడు.

స్వర్గం కన్నా మిన్న అయిన ఈ భారతావనిలో జన్మించినందుకు మనం ఎంతో ధన్యులమని గ్రహించి, త్యాగభావంతో జీవిస్తూ పరహితానికి పాటుపడడం అలవరచుకోవాలి. అందుకు 'భారతభూమియే నా అత్యున్నత స్వర్గం. భారతదేశ శ్రేయస్సే నా శ్రేయస్సు' అని స్వామి వివేకానంద ఇచ్చిన ఈ మంత్రాన్ని మనం ప్రతినిత్యం స్మరించాలి.

మన పూర్వీకులు దధీచి మహర్షి, శిబిచక్రవర్తి, హరిశ్చంద్ర చక్రవర్తి, భగీరథుడు, భీష్ముడు మొదలైన ఎంతోమంది మహాత్ములు ఎలాంటి ఉన్నతమైన జీవితాల్ని గడిపారో; ఎలాంటి త్యాగనిరతిని ప్రదర్శించారో; ఎలాంటి నిస్వార్థభావాన్ని ప్రకటించారో; ఎలాంటి సేవాదృక్పథాన్ని కలిగి ఉండేవారో; ఎలాంటి ఆదర్శాలను నిర్దేశించారో తెలుసుకొని జీవించాలి.

మనం దధీచి మహర్షిలాగ ఇతరుల కోసం ప్రాణాలను అర్పించలేకపోయినా, పరులను హింసించకుండా ఉండే సహృదయాన్ని అలవరచుకోవాలి . శిబిచక్రవర్తిలాగ పక్షి కోసం శరీరాన్ని పణంగా పెట్టలేకపోయినా, ఇతరులకు కీడు తలపెట్టకుండా ఉండే సద్బుద్ధిని కలిగివుండాలి. అందుకు స్వామి వివేకానంద భారతజాతికి ఇచ్చిన 'త్యాగం-సేవ' అనే రెండు ఆదర్శాలను ప్రతి భారతీయుడు ఆచరించాలి. అప్పుడు మన దేశ పూర్వ వైభవాన్ని పునఃప్రతిష్ఠించగలుగుతాం. మన వీరుల త్యాగఫలమైన స్వతంత్ర భారతావనిని పునరుద్ధరించగలుగుతాం. ❖

పరిత్యాగం, నిస్వార్థసేవ - ఈ రెండూ మన జాతీయ ఆదర్శాలు. ఈ మార్గాలలో దేశాన్ని తీవ్ర కృషి జరుపనివ్వండి. మిగిలిన విషయాలన్నీ వాటంతటవే చక్కబడతాయి. - స్వామి వివేకానంద

గోరుముద్ద - స్వామి సుప్రియానంద

యోగ 'ఆసనం'
Yoga Mat

"దేహం విషయంలో సరైన శ్రద్ధ వహించాలి. శరీరాన్ని హింసించుకునేవారు రాక్షసులు. సర్వదా నీ మనస్సును ఉల్లాసంగా ఉంచుకో. దిగులు కలిగించే ఆలోచనలు వచ్చినప్పుడు వాటిని తరిమివేయి. యోగి మితిమీరి తినరాదు; అలాగే కఠిన ఉపవాసం చేయరాదు; అమితంగా నిద్రించరాదు; పూర్తిగా నిద్రను మానరాదు. ఇలా అన్ని విషయాల్లోనూ మధ్యేమార్గాన్ని అనుసరించేవాడే యోగి".

రాజయోగాన్ని రంగరించి మనకు అందించిన స్వామి వివేకానందుని మాటలు అవి.

ఇప్పుడు ఆ 'మాటల'కు దూరమై 'మ్యాట్'లకు దగ్గరవుతున్నాం! ఉచితంగా దొరికింది కదా అని



వదలకుండా ఎంచక్కా చంకన పెట్టుకొని వెళ్ళిపోతాం. కానీ 'మ్యాట్' నేల మీద పరచి వ్యాయామం చేయడానికి బదులు, దాని మీద పడుకొని యోగనిద్రలోకి జారిపోతాం. ఇంతకీ ఎప్పుడొచ్చిందీ మాయదారి 'మ్యాట్?' ఇది లేకుండా కొన్ని వేల సంవత్సరాలుగా మన యోగులు చేస్తున్నది ఏమిటి?

'హఠ యోగం' అంటే ఏమిటి? 'రాజ యోగం' అంటే ఏమిటి? ఊహూ! మనం తెలుసుకోవడానికి ప్రయత్నించం. దీనికి పర్యవసానం 'విదేశీయుల వెర్రి వ్యాఖ్యానాలకు బలి అవడమే.

ఈ మధ్య ఒక విదేశీయుడు 'హఠ యోగం' అంటే 'హాట్' (hot) యోగం అని నిర్వచించాడు. 'విపరీతమైన వేడి మూలంగా శరీరం నుండి చెమట వెలువడుతుంది కదా! దాన్ని తుడుచుకోవడానికి తుండుగుడ్డ (towel) తెచ్చుకోండి' అని తన శిష్యులకు సలహా ఇచ్చాడు. ఇంకే ముంది? 'యోగ టవల్స్' కోసం శిష్యులంతా మార్కెట్‌పై పడ్డారు.

అసలు నిజమైన 'యోగ సాధన' అంటే ఏమిటి? ప్రకృతితో పోరాడి చెమటలు కక్కడమా? లేక ప్రకృతి సహాయంతో ఆరోగ్యం చెడకుండా మనస్సు, ఇంద్రియాలను అదుపులోకి తెచ్చుకుని అతీంద్రియ స్థితికి చేరడమా?

కేవలం శరీర ఆరోగ్యమే యోగసాధనల ప్రయోజనమని మనం అనుకుంటున్నాం. మనం ఈ భ్రాంతి నుండి



బయటపడాలి. ఎన్నో జన్మల పుణ్యఫలంగా లభించిన ఈ మానవదేహం పరిపూర్ణతను సాధించడానికి ఓ పరికరమని పూర్తిగా మరచిపోయాం.

చిత్తవృత్తులను నిరోధించి, చిత్త ప్రశాంతతను సాధించాలి. ఈ మనశ్శరీరాలనే తొడుగు 'నేను' కాదని తెలుసుకొని, ఆత్మసిద్ధికి ప్రయత్నించాలి. అదే 'యోగసాధన' అసలు ప్రయోజనం.

ఎక్కువగా మాట్లాడేవాడు యోగి కాలేదు!

పండుగలు - పర్వదినాలు

ఆగష్టు - 2015

10	సోమవారం	: ఏకాదశి
12	బుధవారం	: స్వామి రామకృష్ణానంద జయంతి
26	బుధవారం	: ఏకాదశి
29	శనివారం	: స్వామి నిరంజనానంద జయంతి

సెప్టెంబర్ - 2015

05	శనివారం	: శ్రీకృష్ణ జన్మాష్టమి
08	మంగళవారం	: ఏకాదశి
12	శనివారం	: స్వామి అద్వైతానంద జయంతి
17	గురువారం	: వినాయక చవితి
24	గురువారం	: ఏకాదశి

పరివర్తన

- బ్రహ్మచారి శ్యామ్

స్వామి రామకృష్ణానందజీ (శశి మహరాజ్) కథల ద్వారా ఉపదేశాలను అందించడంలో దిట్ట. అవి సమస్యలకు పరిష్కారాన్ని సూచించేవిగా ఉండేవి.

ఒకసారి శశి మహరాజ్ చెడు అలవాట్లను, చెడు ధోరణులను తొలగించుకోవడం ఎలాగో చెబుతూ ఈ కింది కథను వివరించారు :

ఒక వ్యక్తికి నల్లమందు తీసుకోవడం వ్యసనంగా మారింది. ఈ దురలవాటును మానుకోవాలని పరితపించసాగాడు. అందుకోసం అతడు తగిన సహాయం కొరకు ఒక గురువును ఆశ్రయించాడు. ఆ గురువు అతణ్ణి మందలించకుండా రోజూ ఎంత మోతాదులో నల్లమందు తీసుకొనేవాడో అడిగి, అంతే బరువున్న ఒక సుద్దముక్కను అతనికి ఇస్తూ "నువ్వు నల్లమందు సేవనం మానవలసిన అవసరం లేదు. కాకపోతే ఈ సుద్దముక్క ఎంత బరువుందో అంతే మోతాదులో నల్లమందు తీసుకో, అంతకు ఎక్కువా కూడదు, తక్కువా కూడదు. కానీ ఒక షరతు, ప్రతి రోజూ నల్లమందు సేవనం తర్వాత, ఈ సుద్దముక్కతో గోడపై ఒక గీత గీయి. ఇంతకు మించి నీవు చేయవలసినది ఏమీ లేదు" అని చెప్పారు.

గురువు ఇచ్చిన సూచనలతో ఊరట పొందిన శిష్యుడు కొన్ని నెలల పాటు ఆ సూచనలను నిక్కచ్చిగా అమలుపరిచాడు. రోజులు గడుస్తున్నకొద్దీ సుద్దముక్క బరువు ఎలాగైతే తగ్గుతూ వస్తూందో, అంతే మోతాదులో నల్లమందు సేవనం కూడా తగ్గుతూ వచ్చింది. మొత్తానికి ఆ విధంగా అతడు ఆ వ్యసనం బారి నుండి రక్షింపబడ్డాడు.

ఈ కథను వివరించిన శశిమహరాజ్ "ప్రతిభావంతుడైన గురువు శిష్యులలో పరివర్తన తీసుకురావడానికి ఈ రకమైన పద్ధతులను యోచిస్తాడు. అంతేకానీ, అతడు శిష్యులపట్ల ఎలాంటి కోపాన్నిగానీ, తిరస్కారంగానీ ప్రదర్శించడు. కేవలం సున్నితమైన మందలింపుల ద్వారా వారిలో పూర్తి పరివర్తనను తీసుకువస్తాడు" అని అన్నారు. ❖

(తిథి ప్రకారం ఆగష్టు 12వ తేదీన శ్రీరామకృష్ణ పరమహంస సన్న్యాస శిష్యులైన స్వామి రామకృష్ణానంద మహరాజ్ జయంతి)

సరళత్వం

"చూడు నాయనా! ఒక వ్యక్తి 99 మంచి పనులు చేసి, ఒక్క చెడు పని చేస్తే మనుషులు ఆ 99 మంచి పనులను మరచిపోయి, ఒక్క చెడు పనిని మాత్రమే గుర్తుంచుకుంటారు. అదే భగవంతుడు అయితే 99సార్లు చెడు పనులు చేసి, ఒక్కసారి మంచి పని చేస్తే 99 చెడు పనులను మరచిపోయి, ఒక్కసారి చేసిన మంచి పనినే గుర్తుంచుకుంటాడు. ఇదే మనిషి ప్రేమకూ, భగవంతుని ప్రేమకూ మధ్య తేడా. దీన్ని ఎన్నడూ మరువకు."

స్వామి నిరంజనానందజీ (నిరంజన్ మహరాజ్) శ్రీరామకృష్ణులను దర్శించుకోవడానికి వచ్చిన ప్రథమ సమావేశంలో గురుదేవులు వచించిన పలుకులివి.

అప్పటి వరకూ భూతప్రేతాలతో చరించే మాంత్రికుల సాంగత్యంలో పెరిగిన నిరంజన్ మహరాజ్ గురుదేవుల మాటలకు ప్రభావితుడై 'నా మనస్సును భగవంతునికే అర్పించుకుంటాను' అని అన్నారు. నిరంజనుని కృతనిశ్చయం పట్ల గురుదేవులు వర్షించిన కృప అపారం.

నిరంజన్ మహరాజ్ సరళ స్వభావాన్ని చూసి సంతుష్టులైన గురుదేవులు అతని నాలుకపై మంత్రాన్ని వ్రాసి ఉపదేశించారు. ఆ మంత్ర పురశ్చరణ వల్ల అతడు అజపాజపసిద్ధిని పొందాడు.

మొదటి సమావేశంలోనే నిరంజనుడి అంతరాళాన్ని వీక్షించి అతను కల్లాకపటం ఎరుగని బుద్ధిమంతుడని గురుదేవులు ప్రకటించారు. నిరంజనుడి సరళ స్వభావాన్ని పలు సందర్భాలలో గురుదేవులు ప్రశంసించారు. నిర్మలమైన మనస్సు కలిగిన సార్థకనామధేయుడు నిరంజన్ మహరాజ్.

సరళ హృదయం ఉంటే భగవంతుణ్ణి సులభంగా పొందవచ్చు. సరళ హృదయులకు గురూపదేశం సత్వరం ఫలిస్తుంది. నిరంజనుడి సరళ హృదయాన్ని, వైరాగ్యాన్ని గురుదేవులు పదే పదే వెల్లడించడం వెనుక ఉన్న బలమైన కారణం ఇదే! ❖

(తిథి ప్రకారం ఆగష్టు 29వ తేదీన శ్రీరామకృష్ణ పరమహంస సన్న్యాస శిష్యులైన స్వామి నిరంజనానంద మహరాజ్ జయంతి)

భారతదేశం కండబలంతో కాదు, ఆత్మబలంతో మేల్కొంటుంది. విధ్వంస పతాకంతో కాదు, శాంతిప్రేమల పతాకంతో, సన్న్యాసి కాషాయాంబరాలతో విజయం గాంచుతుంది. - స్వామి వివేకానంద

పలికెడిది భాగవతం

శుభము సాంఖ్యయోగము

- స్వామి జ్ఞానదానంద

సప్తదినాలలో జన్మ సమాప్తమవుతుందని స్పష్టమై, సంసారబంధాలు తెంచుకునే తోవను చూపమని పరీక్షిత్తు మునులందరినీ ప్రాధేయపడుతూ ఉన్నాడు. ఆ పాండవపౌత్రుడు వేసిన ప్రశ్నలకు ప్రత్యుత్తరం కోసం ఆ సంయమీంద్రులందరూ సమాలోచనలు జరుపుతూ ఉన్నారు. ఇంతలో పరీక్షిత్తు పుణ్యఫలంగా ఆ గంగాతీరానికి వైరాగ్యమూర్తి, వేదవ్యాస నందనుడు, శుకయోగీంద్రుడు విచ్చేశాడు. మహారాజుతో సహా మహర్షులందరూ ఆ మునిపుంగవుడికి సాదరస్వాగతం పలికి సుఖాసీనున్ని చేశారు. పరీక్షిత్తు ఆ పవిత్రమూర్తిని పలువిధాలుగా ప్రస్తుతించి, తన పరిస్థితిని వివరించాడు. మరణం అనివార్యమైన ఈ వేళలో ముక్తిమార్గాన్ని చూపమని ప్రార్థించాడు.

అప్పుడు ఆ బ్రహ్మజ్ఞాని, పరీక్షిత్తు పశ్చాత్తాపానికి, ప్రాయోపవేశానికి ప్రతిస్పందిస్తూ, జ్ఞానబోధకు ఉద్యుక్తుడవుతున్నాడు. ఎవరో పుణ్యాత్ములకు తప్ప అందరికీ మరణ మాసన్నమయ్యే వేళ ఇలాంటి భాగ్యం కలగదు! అందుకే "భగవంతుడు మనిషికి ముక్తిని ప్రసాదించేటప్పుడు అతడికి సాధుసాంగత్యం కల్పిస్తాడు. తనను పొందడానికై అతడి మనస్సు వ్యాకుల పడేటట్లు చేస్తాడు" అనేవారు భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస. అలా కాక ఆత్మాన్వేషణ ప్రసక్తే లేక, సంసారభోగాల్లోనే మునిగితేలుతున్న లౌకికులు జననమరణ చక్రాల్లో తిరుగాడుతూనే ఉంటారు. అలాంటి ప్రాపంచికుల పోకడను విశ్లేషిస్తూ శుకమహర్షి...

పశుకళత్ర పుత్రబాంధవ దేహాది, సంఘమెల్ల తమకు సత్యమనుచు
కాపురములు చేసి కడపట సత్తురు, కనియుగాన రంత్యకాలసరణి

'పశువులు, భార్య, బిడ్డలు, చుట్టాలు, శరీరం ఇత్యాది పరివార మంతటినీ నిజమని నమ్ముకొని కాపురాలు సాగిస్తూ, సాగిస్తూ కడకు వాళ్ళు కన్నుమూసి కాటిపాలవుతారని, అంత్యకాల దుర్దశ తెలిసినా తెలియనట్లే ఉండిపోతార'ని పరీక్షిత్తు ముందు విస్మయం వ్యక్తం చేశాడు.

నిజమే చాలామందికి భార్యాబిడ్డల తరువాతే భగవంతుడైనా, భాగవతమైనా! చిలకప్రాణం మాంత్రికుడి చేతిలో ఉన్నట్లు చాలా మంది ప్రాణం భార్యాపిల్లల చేతిలోనే ఉంటుంది. వాళ్ళతోనే కలసి పుట్టినంత, వాళ్ళతోనే కలసి వెళ్ళిపోతున్నంత అవినాభావ సంబంధంగా భ్రమపడుతూ ఉంటారు. అందుకే భక్తరామదాసు కూడా తన దాశరథి శతకంలో...

దొరసినకాయముల్ ముదిమితోచినజూచిప్రభుత్వముల్ సిరుల్
మెరుపులు గాక జూచి, మరి మేదినిలో తమతోడివారు ముం
దరుగుట జూచి,చూచి,తెగు నాయువెరుంగక మోహపాశముల్
తరుగని వారికేమిగతి దాశరథీ కరుణాపయోనిధీ!

'దశరథరామా! శరీరములు ముదిసిపోవడంతో శరీరం అస్థిరమనీ; అధికారాలు, సంపదలు మెరపుతీగవలె అదృశ్యం కాగా, అవి అస్థిరమనీ; తమ సహచరులు, సమానవయస్కులు తమకంటే ముందుగానే మరణించినప్పుడు తామునూ మరణించవలసిన వారమనీ తెలుస్తూ ఉన్నప్పటికీ ఆయువు తరిగిపోవడం తెలుసుకోక, అస్థిరాదులైన దేహాదులలో అజ్ఞానమనే తాళ్ళబంధాలలో పట్టుపడుతున్నారు కదా! ఇట్టి అజ్ఞానులకు ఇక గతి ఏంటి?' అని ఆవేదన చెందుతాడు.

యోగమార్గం, ధర్మనిష్ఠ...: సాధారణ జనంలా కాకుండా పారమార్థిక మార్గంలో పయనించాలనుకున్నవారు ఆత్మస్వరూపుడు, జగదీశ్వరుడు అయిన భగవంతుడి గురించి ఆలోచించడానికి, ఆయనను అన్వేషించడానికి అర్హులని ఆ వ్యాసకుమారుడు అంటున్నాడు. అనంతరం పరీక్షిత్తు మహారాజును మాధ్యమంగా చేసుకొని మానవులందరికీ ఈ భవజలధిని దాటే తరుణోపాయాన్ని చూపెడుతూ...

జనుల కెల్ల శుభము సాంఖ్యయోగము
దాని వలన ధర్మనిష్ఠ వలన నయిన
నంత్యకాలమందు హరిచింత సేయుట
పుట్టువులకు ఫలము భూవరేంద్ర!

'ప్రజలందరికీ సాంఖ్యయోగం మేలు చేకూరుస్తుంది. ఆ యోగం వల్లనైనా లేక ధర్మాచరణతోనైనా అవసాన కాలంలో హరిని చింతించాలి. రాజేంద్రా! అలా చేయడమే జన్మమెత్తినందుకు ప్రయోజనం' అని సూచించాడు.

పరీక్షిత్తు పితామహుడైన అర్జునుడు కురుక్షేత్ర సంగ్రామంలో అస్త్రసన్న్యాసం చేయాలనుకున్న సమయంలో శ్రీకృష్ణభగవానుడు బోధించిన భగవద్గీతలో విశేషమైన యోగమే ఈ సాంఖ్యయోగం! గీతాసారమంతా ఈ యోగంలో ఉందని చెప్పవచ్చు. ఏ జ్ఞానాన్ని

ఆశ్రయిస్తే మనిషికి ఇహపరాల్లో శాంతిసౌఖ్యాలు లభిస్తాయో ఆ జ్ఞానాన్ని, ఆచరణాన్ని సాంఖ్యబుద్ధి, యోగబుద్ధి అనే ద్వివిధ నిష్ఠను భగవానుడు ఇక్కడ ప్రతిపాదించాడు. స్థితప్రజ్ఞుడి లక్షణాలను, జీవన్ముక్తి సూత్రాలను వివరించాడు. శుకమహర్షి కూడా పరీక్షిత్తుకు అంతిమఘడియల్లో ఈ సాంఖ్యయోగమే శుభం కలిగిస్తుందని గుర్తుచేస్తున్నాడు. తన తండ్రి వ్యాసభగవానుడి ద్వారా తాను తెలుసుకున్న భాగవత తత్త్వాన్ని వివరిస్తూ, భగవంతుడి నామస్మరణ, మనన మాహాత్మ్యాన్ని వర్ణించసాగాడు.

సమున్నత యోగమార్గం....: వివేకము, వైరాగ్యము, భక్తి, శమాది సంపత్తి, నిష్కామ కర్మల ప్రాధాన్యాన్ని వివరించే యోగమే సాంఖ్యయోగం! గీతాచార్యుడు ఈ యోగంలో ఎన్నో ఆణిముత్యాల్లాంటి బోధనలు చేశాడు. పంచభూతాత్మకమైన దేహాదుల అశాశ్వతత్త్వాన్ని, శాశ్వతమైన ఆత్మ స్వరూపాన్ని సాంఖ్యయోగంలో యోగాచార్యుడైన శ్రీకృష్ణపరమాత్ముడు స్పష్టం చేశాడు. మనిషి దుఃఖానికి కారణాన్నీ, దాని ఉపశమన మార్గాన్నీ ఉపదేశించాడు. తుదకు....

విహాయ కామాన్ యస్సర్వాన్ పుమాం శ్చరతి నిస్పృహః।
నిర్మమో నిరహంకారః స శాన్తి మధిగచ్ఛతి॥ *(భ.గీత - 2.71)*

'ఎవరు సమస్తమైన కోరికలను త్యజించి, అహంకార మమకార వర్జితులై ప్రవర్తిస్తారో అట్టివారే శాంతిని పొందుతార'ని ఉద్ఘాటించాడు.

ఇలాంటి బ్రాహ్మీస్థితిని పొందినవారు మరలా ఎన్నటికీ విమోహాన్ని చెందరు. అంత్యకాలంలో కూడా ఇలాంటి స్థితియందున్నవారు బ్రహ్మానందరూప మోక్షాన్ని పొందుతారని పునరుద్ఘాటించాడు. ఇంతటి అద్భుతజ్ఞాన సంబంధమైన యోగాన్ని అభ్యసిస్తే, ఆచరిస్తే అర్జునుడికిలా మోహవిచ్ఛేదమవుతుంది; పరీక్షిత్తులా మోక్షమూ ప్రాప్తిస్తుంది.

హరినామ స్మరణ చాలు... : శుకబ్రహ్మ, పరీక్షిత్తు మహారాజుకు భగవంతుని కథా విశేషాల్ని వివరిస్తూ, ద్వాపరయుగంలో తన తండ్రి వేదతుల్యమైన ఈ భాగవతం తన చేత చదివించారనీ, పరమాత్మ అవతార లీలలు నన్నాకర్షించడం వల్ల దీనిని పఠించాననీ గుర్తుచేసుకున్నాడు. భాగవత శ్రవణం వల్ల శ్రీమహావిష్ణువును సేవించాలనే బుద్ధి విశాలమవుతుందని విస్పష్టం చేస్తూ, అంతే కాకుండా...

మోక్షకామునకును మోక్షంబు సిద్ధించు
భవభయంబు లెల్లబాసిపోవు
యోగిసంఘమునకు నుత్తమ వ్రతములు
వాసుదేవ నామవర్ణనములు! అని ఘోషిస్తున్నాడు.

> **"శుకదేవుడు బ్రహ్మర్షి! మూర్తీభవించిన జ్ఞానమే ఆ మహర్షి. ఆయన జ్ఞానం సాధన చేసి సముపార్జించింది కాదు; జ్ఞానమే అపరావతారంగా శుకదేవుడై రూపుదాల్చింది" అనేవారు భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస. అంతటి శుకమహర్షి పాండవపౌత్రుడికి ముక్తిమార్గాన్ని నిర్దేశించేందుకు ఆగమించాడు. సంసారసాగరం నుంచి సురక్షితంగా ఆవలికి చేర్చే నావ భగవన్నామమేనని విస్పష్టం చేశాడు. క్షణమాత్రమైనా శ్రీహరినామాన్ని స్మరిస్తే చాలు, కైవల్యం కరతలామలక మవుతుందని హితవు పలికాడు.**

మోక్షాన్ని కాంక్షించేవారికి ముక్తి లభిస్తుందనీ; జన్మ, జరా మరణాది సంసారభయాలన్నీ సమసిపోతాయనీ; వాసుదేవుని నామ సంకీర్తనలే యోగిపుంగవులకు ఉత్తమ వ్రతాలనీ శుకుడు సూచించాడు.

సంశయాల సమయంలో ఎవరిని ఆశ్రయిస్తామన్న దానిపైనే మన ఉద్ధతి ఆధారపడి ఉంది. పరీక్షిత్తుకు పూర్వజన్మ సుకృతంగా శుకమహర్షి దర్శనభాగ్యం ప్రాప్తించింది. ఇలా సద్గురువు శిష్యుడి పాపరాశిని క్షణంలో భస్మం చేయగల జ్ఞానాగ్నిని రగిలించగలడు. ఆ పరంపరలో సద్గురువులాంటి శుకమహర్షి పరీక్షిత్తు మహారాజుకు ఏడురోజుల్లో జన్మను తరించుకునే తోవను చూపాడు! ...**సత్య మా హరినామ సంస్మరణ మొక్క ముహూర్తమాత్రము చాలు ముక్తిదమౌ నృపా!** 'రాజా! ఒక్క క్షణమైనా హరినామం స్మరిస్తే చాలు, అది ముక్తిని ప్రసాదిస్తుంద'ని అభయమిస్తున్నాడు.

అంత్యకాలం సమీపించగానే భయపడకుండా శరీరం, పుత్రులు, భార్య తదితరాలపై గల మోహమనే వృక్షాన్ని నిష్కామ మనే ఖడ్గంతో తెగనరికి, ఏకాంతంగా భగవంతుడినే స్మరించుకునేందుకు ప్రయత్నించాలని ఆ బ్రహ్మజ్ఞాని బోధించాడు.

భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంసకు నాగమహాశయ్ అనే గృహస్థ భక్తుడుండేవాడు. భగవంతుడికీ, గృహస్థధర్మానికీ సామరస్యం కుదిర్చి ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపిన మహానుభావుడాయన! చివరి రోజుల్లో నాగమహాశయుడు తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్నా శ్రీరామకృష్ణుల నామాన్ని మాత్రం విడువలేదు. తనకు శుశ్రూషలు చేయడానికి వచ్చిన ఆత్మీయులతో 'ఈ ఎముకల గూటిలో ప్రాణం ఉన్నంత వరకు శ్రీరామకృష్ణుల గురించీ, శాస్త్రాల గురించీ నాతో మాట్లాడండి' అనేవాడు. మనస్సుతో 'ఓ మనసా! ఈ దేహం, వ్యాధులు పరస్పరం ఒకదాని సంగతి మరొకటి చూసుకుంటాయి. నువ్వు మాత్రం ఆ భగవంతుడినే స్మరించుకుంటూ ఆనందంగా ఉండు' అని అంటూ ఉండేవాడు. చివరి క్షణాల్లో దగ్గరివారు చెవిలో శ్రీరామకృష్ణుల నామాన్ని ఉచ్చరిస్తూ ఉంటే, ఆయన చిత్రపటాన్ని చూసుకుంటూ మహాసమాధిలోకి నిష్క్రమించారు.

ఇలాంటి ఆదర్శవంతమైన అంతిమక్షణాలనే నిర్దేశిస్తూ, అవధూతలలో మేటియైన శుకమహర్షి కూడా పరీక్షిత్తుతో 'చివరకు పండితుడైనవాడు గాలిని అరికట్టి, దారాపుత్రాదులతోడి సంసర్గం వదలిపెట్టి, ఇంద్రియాలను జయించి బుద్ధిబలంతో మనస్సును విష్ణుదేవుని విశాలస్వరూపంలోనే స్థిరంగా నిలపాలి' అని హితవు పలుకుతున్నాడు. ❖

భారతదేశానికి ఈ ప్రపంచం అమితంగా ఋణపడి ఉన్నది. శాంతిమూర్తియైన హైందవునకు ఋణపడని జాతి లేదని, ఏ దేశాన్ని పరిశీలించి చూసినా తెలుస్తుంది. - స్వామి వివేకానంద



స్వామి యతీశ్వరానంద

మహాపురుషుని సాన్నిధ్య స్మృతులు

- ప్రవ్రాజిక శారదాప్రాణా

అది 1955వ సంవత్సరం జూన్ 1వ తేదీ బుధవారం, సాయంత్రం 5 గంటలకు క్లాసుకు వెళ్ళాం. స్వామీజీ అదే రోజు సాయంత్రం బేలూరు మఠం నుండి బెంగుళూరు తిరిగి వచ్చారు. చాలా అలసిపోయి ఉన్నారు. అయినా క్లాసు తీసుకున్నారు. వారి జీవితంలో 'త్యాగము-సేవ' అనేవి పరస్పర విరుద్ధములుగా ఉండడం మేము ఎన్నడూ చూడలేదు. అది ఎంతటి గొప్ప ఆదర్శమో కదా!

ఆ రోజు స్వామీజీ ఆధ్యాత్మిక జీవితములో పోరాటం, విశ్వాసములను గురించి ఇలా చర్చించారు: "పోరాటములోనే ఆనందాన్ని అనుభవించడానికి ప్రయత్నించు అని స్వామి బ్రహ్మానందజీ మాతో చెప్పేవారు. పోరాటమంటే మానసిక, శారీరక పవిత్రతను పెంపొందించుకోవడం, అహంకారాన్ని తొలగించుకోవడం కోసం చేసే ప్రయత్నం."

అప్పటి నుండి ఏ కష్టం వచ్చినా ఆ కష్టం ద్వారానే వ్యక్తిత్వం వికసిస్తుందనిపించేది. కష్టాలను ఎంత ఎదుర్కొంటే అంత ఉన్నతిని సాధించగలమనే భావం నాలో ఏర్పడింది.

మరొకరోజు పవిత్రత, విశ్వాసాల ప్రాముఖ్యతను ఇలా వివరించారు :

"ఆధ్యాత్మిక జీవితంలో అత్యంత ఆవశ్యకమైన లక్షణం పవిత్రత. దీనిని సరిగా అనుసరించడానికి ఇష్టపడనివారు, వారి మనస్సులోని ద్వంద్వముల ఫలితంగా ఆదర్శానికి దూరమవుతారు. ఆ దూరమవడం వెంటనే జరగవచ్చు లేదా ఆలస్యంగానైనా సంభవించవచ్చు. అచంచలమైన విశ్వాసం ఉండితీరాలి. నీ మీద నీవు విశ్వాసముంచుకో. కానీ ఆ విశ్వాసాన్ని భగవద్విశ్వాసంతో అనుసంధానం చేయాలి.

'నీ భావమేవిధమో, నీ ధ్యానమావిధము', ఎవరి శ్రద్ధ ఎలా ఉంటే వారు అదేవిధంగా ఉంటారు. శ్రద్ధ అంటే భావోద్వేగ ప్రకటనం కాదు. అది ఆత్మవిశ్వాసంతో కూడిన ఒక అకుంఠిత శక్తి. ఆ శక్తిని పొందినప్పుడు గురువాక్యాలు, శాస్త్రవాక్యాలలోని నిగూఢార్థములు గ్రహించే శక్తి లభిస్తుంది. ఆ శక్తి ఎంతో సహాయకారిగా ఉంటుంది. మనస్ఫూర్తిగా ప్రయత్నించు. లక్ష్యాన్ని చేరుకో. చరమసత్యాన్ని గ్రహించు."

సాధకుడు తన సాధనాకాలంలో సిద్ధులను పొందుతాడనేది అందరికీ తెలిసిన విషయమే. కానీ, స్వామీజీ ఎల్లప్పుడూ మమ్మల్ని ఇలా హెచ్చరిస్తూ ఉండేవారు:

"సిద్ధుల వలలో చిక్కుకొని బాధపడకు; అలా కనుక జరిగితే ఆధ్యాత్మిక ప్రగతి ఆగిపోవడమేగాక, మీరు చేరిన ఉన్నతస్థితి నుండి క్రిందపడవలసి వస్తుంది. నిగూఢశక్తులను ప్రదర్శించేవారి వద్ద అత్యంత జాగ్రత్తగా ఉండండి. ఆ శక్తులతో వారు ఇతరులను ఆకర్షించగలరుగానీ వారి మనస్సును వారు నియంత్రించుకోలేరు".

అదేరోజు సాయంత్రం సంధ్యాహారతి తరువాత స్వామీజీ నాతో 'సాధన చేయాలంటే మంచి ఆరోగ్యం ఉండాలి. ఆరోగ్యం బాగాలేకపోతే ధ్యానము చేయగలమా? చేయలేం కదా!' అని అంటూ ఇలా చెప్పారు.

ఈ మధ్య ఒక భక్తుడు నా వద్దకు వచ్చి, 'స్వామీజీ! నాకు శరీరస్పృహ లేకుండా ధ్యానంలో మునిగిపోవాలని ఉంది' అన్నాడు. అప్పుడు నేను అతడితో 'నీవు నీ శరీరాన్ని మరచిపోగలవేమోగానీ, అది మాత్రం నిన్ను మరచిపోదు' అని అన్నాను.

స్వామీజీ నవ్వుతూ మళ్ళీ ఇలా చెప్పడం ప్రారంభించారు: 'ఏ ఆధ్యాత్మిక జిజ్ఞాసువైనా శరీరభావనగానీ, దాని ఆరోగ్యవిషయమునుగానీ అతిక్రమించలేడు. దుర్బలుడు లేక అనారోగ్యవంతుడు ఏమి చేయగలడు? శరీరంపై నుండి దృష్టిని మరల్చగలడంతే. శరీరం కేవలము ఇంద్రియ సుఖములకు, ప్రాపంచిక ఆలోచనలకు ఆశ్రయంకాదు. దేహమే దేవాలయం. అక్కడ ఆత్మవిరాజమానమై ఉంటుంది. ఈ భావాన్ని జ్ఞాపకముంచుకో. మనమంతా అజ్ఞానులముగా ఉన్నాం. కన్నులున్న గుడ్డివాళ్ళం'.

స్వామీజీ పాశ్చాత్యదేశాల్లో చెప్పిన విషయాన్ని ఈ సందర్భంలో గుర్తుచేస్తున్నాను:

"ఒక వ్యక్తి గుడ్డివానిగా నటిస్తున్నాడు. తన ప్రక్కన 'గుడ్డివాడిని - సహాయం చేయండి' అని బోర్డుపెట్టుకుని

కూర్చున్నాడు. ఒక భక్తురాలు జాలిపడి 2 షిల్లింగుల నోటు వేసింది. దాన్ని చూసిన ఆ వ్యక్తి ఇలా అన్నాడు: 'మేడం! నాకు రెండు షిల్లింగులు విడిగా ఇవ్వండి; ఒక్కటే ఉంటే సరిపోదు'. ఆ స్త్రీ అవాక్కై 'నువ్వు చూడగలవా?' అని అడిగింది. దానికి ఆ వ్యక్తి, గుడ్డివానిగా నటించే నా స్నేహితుడు సినిమా చూడడానికి వెళ్ళాడు. అతడి స్థానంలో నేను గుడ్డివానిగా నటిస్తున్నాను' అన్నాడు. అప్పుడు ఆమె 'అసలు గుడ్డిదాన్ని నేను' అని నొచ్చుకుంటూ వెళ్ళిపోయింది".

మనకు పవిత్ర ఆధ్యాత్మిక జీవనాన్ని కొనసాగించే సామర్థ్యం ఉన్నప్పటికీ, కళ్ళుండి కూడా గుడ్డివానిలా నటించే వ్యక్తిలా ప్రవర్తిస్తున్నాం.

1955వ సంవత్సరం జూలై 26వ తేదీ సాయం సమయంలో స్వామీజీ మమ్మల్ని అందరినీ పిలిచి 'గురుమహరాజ్ భక్తురాలు ఒకరు వచ్చారు. ఆమె శ్రీరామకృష్ణులకు శిష్యురాలు, దానికంటే ముఖ్యంగా వారి ఆత్మీయురాలు కూడ. ఆమె పేరు భవతారిణి' అంటూ ఆమెను మాకు పరిచయం చేసారు.

భవతారిణి

అప్పుడు ఆమె వయస్సు 83 సంవత్సరాలు. ఆమె బెంగాలీలో మాట్లాడుతుంటే ఒక స్వామీజీ ఇంగ్లీషులోకి అనువదించారు. దుర్లభమైన ఆమె దర్శనభాగ్యం మాకు కలిగినందుకు చాలా ఆనందించాం.

ఒకసారి స్వామీజీ సాధనా జీవనాన్ని గురించి చర్చిస్తూ ఇలా అన్నారు: "మూడు రకాలైన విశ్లేషణలున్నాయి. మొదటిది బాలకుని లాగ విశ్లేషణ చేయడం. రెండవది యుక్తితో విశ్లేషణ చేయడం. మూడవది వితండవాదుల లాగ విశ్లేషణ చేయడం.

ఒక గాడిద ఉందనుకో. దాని ముందు నీళ్ళతో నిండిన ఒక బకెట్‌ను, మద్యంతో నిండిన మరొక బకెట్‌ను ఉంచారు. 'గాడిద నీళ్ళనే తాగుతుంది. దాని శరీరానికి హాని చేసే వాటిని అది స్వీకరించదు' అనేది యుక్తితో చేసే విశ్లేషణ. అదే వితండవాదులైతే ఏమంటారో తెలుసా? అది గాడిద కాబట్టి మద్యాన్ని సేవించదు అంటారు (అందరూ నవ్వారు).

మానవుడు తన వివేచనా జ్ఞానముతో ఆధ్యాత్మిక మార్గం ఏదనేది తెలుసుకోగలడు. మనం అజ్ఞానమనే సురాపాన మత్తులో మన స్వస్వరూపాన్ని మరచిపోతున్నాం. ఆధ్యాత్మిక మార్గంలో మనం మన నిజస్వరూపాన్ని తెలుసుకోగలం".

మానవుడు ఎంత ఎత్తు ఎదుగుతాడో, అంతగా క్రిందికి జారే అవకాశమున్నది. ఎంతెంతగా పైకి వెళ్తే అంతంతగా క్రిందపడే అవకాశముంది కాబట్టి అత్యంత జాగరూకతతో మెలగాలి? అని స్వామీజీ తరచూ మమ్మల్ని హెచ్చరిస్తూ ఈ కథను చెప్పారు:

'ఒకసారి ఒక డచ్ దేశస్థుడు భారత్‌కు వచ్చాడు. నన్ను కలవకుండా కొందరు సాధువులతో కలసి హిమాలయాలు చూడడానికి వెళ్ళాడు. అక్కడ దారి అత్యంత క్లిష్టమైనది, దుర్గమమైనది. చాలా జాగ్రత్తగా పైకి ఎక్కాలి. ఆయనకు ఫోటోగ్రఫీ పిచ్చి ఉండేది. ఒకరోజు దారిలో ఛాయాచిత్రాలు తీయాలని వెళ్ళి, కాలుజారి క్రింద పడ్డాడు. ఆధ్యాత్మిక జీవనము కూడా ఇదేవిధముగా బహుకఠినమైనది. ఏమాత్రము ప్రలోభమున్నా దిగజారే అవకాశముంది. సర్వకాల సర్వావస్థల యందు అత్యంత అప్రమత్తంగా ఉండాలి.'

మనం ప్రతి నిత్యం చేసే పనుల పట్ల ఎలాంటి భావాన్ని కలిగివుండాలో స్వామీజీ చెబుతూ 'ఎవరూ రోజంతా కూర్చొని జపధ్యానాలు చేయలేరు. అందువల్ల పనిచేస్తూ ఉండాలి. మనం చేసే ప్రతి పని భగవదారాధన భావంతో చేయడం అలవరచుకోవాలి' అని అన్నారు.

అప్పుడు నేను 'అంటే మనస్సులో మంత్రాన్ని జపించుకుంటూ పనులు చేయాలా స్వామీజీ?' అని అడిగాను. వెంటనే ఇంకొక భక్తురాలు 'అలా చేయడం ఎన్నటికీ సాధ్యం కాదు' అని అంది.

అందుకు స్వామీజీ "పనిని భగవంతునికి సమర్పించండి. మీరు చేసే పనికి సంబంధించిన బాధ్యతనంతా ఆయన మీద వేయండి. అన్ని పనులూ భగవత్సేవగా భావించండి. భగవంతుడు సర్వవ్యాపి. ఆయన అంతటా విరాజమానమై ఉన్నాడు. నేను చేసేదంతా ఆయన ఆరాధనే అనే భావాన్ని పెంపొందించుకోవాలి. అలా చేసిననాడు అన్నీ సాధ్యమవుతాయి" అని చెప్పారు. ❖

అనువాదం: శ్రీమతి టి. శారద

(శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష సన్న్యాస శిష్యులైన స్వామి బ్రహ్మానందజీ మహరాజ్ శిష్యులు స్వామి యతీశ్వరానంద)

భారతీయ మహిళలు సీతాదేవి అడుగుజాడల్లో నడిచి, అభివృద్ధి చెందాలి. సీతాదర్శం నుండి దూరం చేసేందుకు ప్రయత్నిస్తే ఏ ఆధునీకరణమైనా విఫలమవుతుంది. - స్వామి వివేకానంద

"ఒక వ్యక్తి తనను తాను అసహ్యించుకొంటున్నట్లయితే అదే పతనానికి హేతువు. పూర్వీకుల చరిత్రను అవమాన కరంగా భావిస్తే, ఆ జాతి అంతానికి చేరుకున్నట్లే!" అంటారు స్వామి వివేకానంద. గత వైభవాన్ని మర్చిపోయినంత కాలం మనమూ, మన దేశం స్తబ్ధతలో మునిగిపోతాం. అందుకే, మన ప్రాచీన సంస్కృతి గురించి తెలుసుకోవాలి. గడచిపోయిన సంగతులు తెలుసుకొంటూ, భవిష్యత్ మహత్కార్యాల సాధన వైపు నడవాలి. మన ప్రాచీన భారతీయ సంస్కృతిని గుర్తు చేసేందుకు చేస్తున్న ప్రయత్నమే ఈ వ్యాసాల పరంపర. సుప్రసిద్ధ రచయిత, బెంగుళూరు రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి హర్షానంద మహరాజ్ మధ్యయుగాల కాలం దాకా విలసిల్లిన మన సంస్కృతిని 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు 2014 ఫిబ్రవరి సంచిక నుండి వివరిస్తున్నారు.

విదేశాలలో భారతీయ సంస్కృతి

మెక్సికో : కొలంబస్ కంటే వేలసంవత్సరాలకు పూర్వమే హిందువులు - బౌద్ధులు అమెరికాకు వెళ్ళి అక్కడ వారి మతాన్ని, సంస్కృతిని స్థాపించారనడము అందరూ గుర్తించే సత్యము. మెక్సికో నగరంలో 1962లో జరిగిన అమెరికనిస్టు కాంగ్రెస్ సమావేశాలలో ఈ విషయాన్ని అనేకులు ప్రతిపాదించారు.

అమెరికాలోను ముఖ్యంగా మెక్సికో, పెరూలలోను భారతీయ సంస్కృతి వ్యాప్తి చెందినదనడానికి అనేక ఆధారాలున్నాయి. వాటిలో కొన్ని :

- అజ్‌టెక్ పంచాంగము నాలుగు యుగాలను ఆధారముచేసుకొని రూపొందించబడింది.
- ఇంకా రాజుల పాలనలో చాతుర్వర్ణ వ్యవస్థ ఉండేది. రాజ్యము 1.5 లక్షల చదరపు కిలోమీటర్లు వ్యాపించి 20 మిలియన్ల జనాభా కలిగి ఉండేది.
- వారు చేసే నృత్యాలు భారతీయ నృత్యాలను పోలి ఉండడాన్ని క్రీ.శ. 1844లో స్పెయిన్ దేశ వలసకారులు గుర్తించారు.
- చనిపోయినవారి అంతిమ సంస్కారములు భారతీయ ఆచారాలను పోలి ఉండేవి.
- మెక్సికోలోని మందిరాలు హిందూ సంప్రదాయములో నిర్మింపబడినవి. ఉదాహరణకు టాజిన్‌లోని మందిరము.
- మెక్సికో పురావస్తు నిర్మాణాలు, హిందూ మందిరాలను, బౌద్ధ స్తూపాలను పోలి ఉన్నాయి.
- హిందూ దేవుళ్ళైన శివ, గణేశ, ఇంద్ర, వామన, నరసింహ, వానర వీరులు, ఆదిశేషుల విగ్రహాలు; మందిరాల అలంకరణలో భాగమైన పద్మాలు, సింహాలు, బౌద్ధ అలంకరణలైన ధర్మచక్రాలు ఇక్కడ కనిపిస్తాయి. పైన తెల్పిన దేవుళ్ళ ఆరాధన కూడా ఉండేది.
- గురుకుల విద్యా సంప్రదాయము ఉండేది.
- ఏకపత్నీ వ్రతము, పెద్దలచే నిశ్చయింపబడిన పెళ్ళిళ్ళు జరిగేవి. పెండ్లికి ముందు జ్యోతిష్యులను సంప్రతించేవారు. పెండ్లి ఉత్సవాలు హిందువుల ఆచారాలను పోలి ఉండి, నిరాడంబరంగా జరిగేవి. వధూవరులు అరుంధతి నక్షత్రమును చూడడము తప్పనిసరి.
- దేవదాసి సంప్రదాయము ఉండేది. మందిరాలకు అంకితము ఇవ్వబడిన బాలికలు అక్కడి అగ్నిహోత్రాలను ఆరకుండా చూసేవారు.
- మృత్యువు తరువాత పునర్జన్మ, ఆత్మయొక్క పునరావిర్భావమును నమ్మేవారు.
- రాజవంశపు రాణులు వైధవ్యము ప్రాప్తించినపుడు సతీసహగమనము చేసేవారు.
- రాజుల పట్టాభిషేక ఉత్సవాలు హిందూ ఆచారాలను పోలి ఉండేవి.
- శ్రీరామ యుద్ధ విజయమును పురస్కరించుకొని దసరా ఉత్సవాలు చేసేవారు.
- సమష్టి కుటుంబాలు; ఆయుర్వేద వైద్యులు - వారి మూలికా ఔషధాలు; బజారు వ్యవస్థ; సాంఘిక-మతపరమైన ఉత్సవాలు సమష్టిగా చేయడం; సూర్యారాధన మొదలైనవి హైందవాచారాలను పోలి ఉండేవి. ❖

అనువాదం: డాక్టర్ పి.వి.రెడ్డి

నిండు మనసే నీ పూజ

- శ్రీమతి బి. కృష్ణకుమారి

అన్నమయ్య పదామృతం

నిండు మనసే నీ పూజ
అండకోరకుండు టదియు నీ పూజ ॥
ఇందు హరి గల దందు లేడనేటి
నిందకు బాయుటె నీ పూజ
కొందరు చుట్టాలు కొందరు పగనే
అందదుకు మాను టదియె నీ పూజ ॥
తిట్టులు గొన్నని దీవెన గొంతని
నెట్టుకోనిదే నీ పూజ
పెట్టిన బంగారు పెంకును నినుమును
అట్టే సరియను టదియు నీ పూజ ॥
సర్వము నీవని స్వతంత్ర ముడిగి
నిర్వహించుటే నీ పూజ
పర్వి శ్రీవేంకటపతి నీ దాసుల
పూర్వమనియెడి బుద్ధి నీ పూజ ॥

ప్రశాంతత నిండిన మనసే ... పరుల అండను కోరని మనసే పరమాత్ముడికి ప్రీతికరమవుతుంది; పూజకు పునరంకితమవుతుంది. బాహ్యోపచారాల కన్నా భక్తిప్రపత్తులే భక్తుడిని భగవంతుడికి చేరువ చేస్తాయి. పూజలోని ఈ పరమార్థాన్ని పద్మావతి ప్రియుడి ప్రియభక్తుడు తన పదామృతంలో పరమరమ్యంగా ప్రతిపాదిస్తూ, సమచిత్తమే సర్వేశ్వరుడి సర్వోన్నత ఆరాధనగా అభివర్ణిస్తున్నాడు. అయితే ఆ పరాత్పరుడికి చేసే పూజా విశేషాలను సనాతన సంప్రదాయం మూడు రకాలుగా విభజించింది. అవి భౌతికం, వాచికం, మానసికం. ధూప, దీప, నైవేద్యాదుల సమర్పణతో చేసేది భౌతికపరమైన పూజ. ఇక మంత్రాలు, కీర్తనలు, స్తోత్రాలతో జరిపేది వాచిక ఆరాధన. ఆఖరిది, అత్యున్నతమైంది చింతన, ధ్యానంతో కూడిన మానసిక పూజ!

భక్తుడి సాధన భౌతికం నుంచి మానసికానికి ఎంత త్వరగా చేరుకుంటే పూజలో అంత పరిణతిని సాధించినట్లు! ఆ భావనతోనే భాగవతోత్తముడైన అన్నమాచార్య **'నిండు మనసే నీ పూజ...అండకోరకుండు టదియు నీ పూజ'** అంటూ ప్రత్యక్షదేవుడైన ఆ వేంకటాచలపతిని వినుతిస్తూ, పరోక్షంగా మనందరికీ మానసిక పూజ ప్రత్యేకతను వివరిస్తున్నాడు. భగవాన్ శ్రీరామకృష్ణులు కూడా ఓ మారు భక్తులతో "మనసును పవిత్రం చేయని పూజాపునస్కారాలు, జపతపాలు, సంధ్యావందనాది కర్మల వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదు" అని అంటారు.

అండకోరకుండుటే...

అశాంతి, అసంతృప్తి నిండిన మనసు పురుగు పట్టి, పూజార్హం కాని పూవులాంటిది. తేటగ లేని నీటిలో దృశ్యం ప్రతిబింబించనట్లే, ప్రశాంతత లేని మనసులో పరమాత్మ ప్రకటితం కాదు. అలజడితో కూడిన అంతరంగంతో ఎన్ని ఆరాధనలు చేసినా, ఆశించిన ఫలితం కనిపించదు. అందుకే సద్గురు శ్రీత్యాగరాజస్వామి కూడా ఓ కీర్తనలో, **'మనసు నిల్ప శక్తి లేకపోతే...మధురఘంట విరుల పూజేమి చేయును!'** అంటారు. అయితే మనకూ చాలాసార్లు పూజలో చిత్తశుద్ధి లోపిస్తూ ఉంటుంది. అక్కడ కూడా తనువొక చోట, మనసొక చోట అన్నట్లు ప్రవర్తిస్తూ ఉంటాం. శ్రీవేంకటేశ్వరుడిని భౌతిక, వాచిక, మానసిక పూజాదిక కైంకర్యాలతో సేవించుకున్న సంకీర్తనాచార్యుడు అన్నమయ్య మనందరికీ సందేశాత్మకంగా....

నిండు మనసే నీ పూజ, అండకోరకుండు టదియు నీ పూజ!

అని విస్పష్టం చేస్తున్నాడు. నిశ్చలమనసును మించిన నీరాజనం, ఆపద్బాంధవుడి ఆశ్రయాన్ని మించిన ఆరాధనం మరొకటి లేదు. నిజానికి అందరికీ అండగా, దండగా నిలిచేవాడు ఆ ఆశ్రితపాలకుడే! అలాంటి అనాథరక్షకుడిని కాదనుకొని, అల్పశక్తిమంతులైన మానవమాత్రులపై ఆధారపడడం అవివేకం. కానీ దురదృష్టవశాత్తూ, మనకు మనుషులపై కుదిరినంత గురి భగవంతుడిపై కుదరదు! నడమంత్రాన వచ్చిన నరులను నమ్మినంతగా నారాయణుడిని నమ్మం! మాధవ సంబంధాన్ని కాదని మానవసంబంధాలపై ఆధారపడినంత కాలం మనకు నిరాశలు, నిస్పృహలు, నిట్టూర్పులే!

నిందకు బాయుటే...

అంతటా భగవంతుడిని చూడగలగడం భక్తుడి అత్యుత్తమ హృదయ సంస్కారం. ఈ లోకమంతా ఆ లోకలోచనుడి

(మిగతా 34వ పేజీలో...)

భారతదేశ చరిత్రలో జగత్తును ఉత్తేజితులుగా గింపగలిగిన ఆధ్యాత్మిక మహాపురుషులు లేని యుగం ఎన్నడూ లేదని ఎలుగెత్తి చాటడానికి నేను ఎంతో ఆనందిస్తున్నాను. - స్వామి వివేకానంద

పరిప్రశ్న

– స్వామి భూతేశానంద
(రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు)

రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు-స్వామి భూతేశానందజీ మహరాజ్ (1901-1998) భక్తుల ఆధ్యాత్మిక సందేహాలకు సరళమైన రీతిలో ఇచ్చిన సమాధానాలను 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకుల ప్రయోజనార్థం 2013 జూలై సంచిక నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

భక్తుడు: గృహస్థ జీవితం గడుపుతున్న భక్తులలో 'నేను' అనే భావన పోవాలంటే ఏం చేయాలో తెలపండి.

స్వామీజీ: 'నేను' అనే భావం కలగగానే మొట్టమొదట మనకు స్ఫురించేది ఈ దేహం. ఈ పాంచభౌతిక శరీరానికి ప్రాధాన్యం ఇచ్చినంత వరకూ 'నేను' అనే భావం నుండి బయటపడడం సాధ్యం కాదు.

సంసారులు అంటే వైవాహిక జీవితాన్ని గడుపుతున్నవారు మాత్రమే కాదు. దేహభావన ఉన్నవారంతా సంసారులే! జనన మరణ చక్రంలో తిరుగుతున్న వారంతా సంసారులే!

'నేను' అనే భావనను పోగొట్టడానికి ప్రయత్నించడమే అహంకారానికి సూచన. నేను అంటే అహం. ఈ అహంకారాన్ని తొలగించడం ఎంతో దుర్లభమైన విషయం. శంకరభగవత్పాదులను ఒక శిష్యుడు చాలా కాలం సేవిస్తూ ఉండేవాడు. కానీ ఆయన అతడికి ఏమీ ఉపదేశించలేదు. ఆదిశంకరులు ఒకనాడు ఒంటరిగా కూర్చొని ఉన్నప్పుడు వెనుక నుండి ఎవరో వస్తున్నట్లు అడుగుల చప్పుడు వినిపించింది. 'ఎవరక్కడ' అని శంకరులు అన్నారు. వెంటనే 'నేను' అని శిష్యుడు పలికాడు. అప్పుడు శంకరాచార్యులు ఆ శిష్యుడికి ఇలా బోధించారు:

"ఈ 'నేను' అనేది నీకు అంత ప్రియమైనదైతే ఆ భావనను అనంతంగా పెంచు. విశ్వమంతా 'నేనే' అనే భావనను అలవరచుకో! లేదా దాన్ని పూర్తిగా విడిచిపెట్టు".

"విశ్వాత్మభావన కలగడం అంత సులభసాధ్యం కాదు. కాబట్టి 'నేను భగవంతుని సేవకుణ్ణి, నేను భగవంతునికి దాసుణ్ణి' అనే అహంకారం వల్ల ఎలాంటి ప్రమాదమూ ఉండదు" అని శ్రీరామకృష్ణులు బోధించారు. నేను భగవంతుని చేతిలో పరికరాన్ని అనే భావన పెంపొందించుకుంటే అహంభావం సులభంగా తొలగిపోతుంది.

భక్తుడు: భగవంతుణ్ణి పొందాలనే తపన తీవ్రతరం కావడం లేదు. అందుకు గృహస్థ విధులను త్యజించాలా? భగవంతుణ్ణి పొందే మార్గం సూచించండి.

స్వామీజీ: శ్రీరామకృష్ణులతో గృహస్థ భక్తులు 'స్వామీ! అన్ని బాధ్యతలను త్యజించి, కేవలం భగవంతుణ్ణే పొందాలనే తపన మాలో కలగడం లేదు. అందుకు సరైన మార్గాన్ని సూచించండి' అని అడిగేవారు.

అందుకు భగవాన్ శ్రీరామకృష్ణులు ఇలా సూచించారు: "భగవంతుణ్ణి సాక్షాత్కరింపజేసుకోవడానికి గృహస్థ ధర్మాలను త్యజించనవసరం లేదు. ఎలాగైతే ధనికుని ఇంటిలో పనిమనిషి అన్ని పనులూ చేస్తూ, మనస్సును మాత్రం తన ఇల్లు, సంతానం మీద ఉంచుతుందో, ఆ విధంగానే సంసారంలో మీ బాధ్యతలను నెరవేరుస్తూ, మనస్సును మాత్రం భగవంతునిపై ఉంచాలి. భగవంతుడు ఒక్కడే మన సొంతమనే భావనను అలవరచుకోవాలి."

అదేవిధంగా శ్రీరామకృష్ణులు భగవంతుని యందు మనస్సును లగ్నం చేస్తూ విధులను నిర్వర్తించడం ఎలాగో సూచిస్తూ... 'స్తంభాన్ని పట్టుకొని గిర్రున తిరిగే పిల్లవాడికి ఎలాగైతే భయం ఉండదో, అలాగే భగవంతుణ్ణి ఆలంబనగా చేసుకొని కర్మలను నిర్వర్తించేవారికి ఎలాంటి ప్రమాదమూ ఉండదు' అని అన్నారు.

శ్రీరామకృష్ణులు మనస్సును పదహారు అణాలతో పోల్చారు. గృహస్థ విధులను నిర్వర్తించడానికి రెండు అణాలనూ, మిగతా పధ్నాలుగు అణాలనూ భగవంతునికి అర్పించాలి. అలా అభ్యాసం చేసిన నాడు గృహస్థునిగా ఉంటూనే భగవల్లాభం పొందవచ్చు. తూర్పు దిక్కుకు వెళుతున్నకొద్దీ పడమర దిక్కు దూరమైనట్లు, మనస్సు భగవంతుని చింతనలో నిమగ్నమైనకొద్దీ, ప్రాపంచిక విషయాల పట్ల ఆసక్తి సన్నగిల్లుతుంది. అప్పుడు తప్పక భగవత్సాక్షాత్కారం లభిస్తుంది. ❖

'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక చందాను
ఆన్‌లైన్ http://rkmath.org/srkp ద్వారా చెల్లించవచ్చును.

రామకృష్ణ భక్తి సూత్రాలు

- స్వామి యతీశానంద

నారద భక్తి సూత్రాలు, శాండిల్య భక్తి సూత్రాలు భక్తియోగానికి సంబంధించిన ప్రామాణిక గ్రంథాలు. అయితే ఆధునిక తరంలో భగవదన్వేషకులకు అనువైన రీతిలో భక్తితత్త్వాన్ని బోధించారు శ్రీరామకృష్ణులు. ఈ నేపథ్యంలో 'శ్రీరామకృష్ణ కథామృతం' నుండి కొన్ని ఉపదేశాలను 'రామకృష్ణ భక్తి సూత్రాలు'గా సులభరీతిలో వివరించే ప్రయత్నం చేస్తున్నాం.

బౌద్ధగ్రంథాలు పాళీ భాషలో, బైబిల్ హీబ్రూలో, ఖురాన్ అరబ్బీ భాషలో రచించబడ్డాయి. అలాగే శ్రీరామకృష్ణుల ఉపదేశాలు వారి మాతృభాష బెంగాలీలో ఆవిష్కృతమయ్యాయి. అవతారపురుషుని ముఖతః వెలువడిన ఆ అమృతోపదేశాలను యథాతథంగా ఉట్టంకిస్తూ వ్యాఖ్యానిస్తున్నాం. మహాశక్తిమంతమైన ఆ బోధనలను మననం చేసుకుంటూ కృతార్థులమవుదాం.

జ్ఞానయోగ ఒ సత్య, భక్తిపథ ఒ సత్య.
తిని జొతొక్షణ 'ఆమి' రేఖే దేన్
తొతొక్షణ భక్తి పథఇ సోజా

జ్ఞానయోగమూ సత్యమే. భక్తి మార్గమూ సత్యమే. ఆయన (భగవంతుడు) ఎంతకాలం 'నేను' అనే భావన ఉంచుతాడో అంత కాలం భక్తిమార్గమే సులభ మార్గం.

శ్రీరామకృష్ణ ఉవాచ: శుద్ధజ్ఞానము, శుద్ధభక్తి ఒక్కటే. శుద్ధజ్ఞానం ఏ గమ్యానికి చేరుస్తుందో, శుద్ధభక్తి కూడా అక్కడకే చేరుస్తుంది. పూర్ణజ్ఞానం, పూర్ణభక్తి ఒక్కటే. ఎంతకాలం 'నేను' అనే భావం ఉంటుందో అంతకాలం భక్తునివలే ఉండడమే మేలు.

వ్యాఖ్య : భగవద్గీత 12వ అధ్యాయంలో శ్రీకృష్ణుడు కూడా దేహాత్మబుద్ధి ఉన్నంతకాలం భక్తిమార్గమే సులభమైనది అన్నాడు. శ్రీరామకృష్ణులు కూడా తనదైన సులభశైలిలో ఆ మాటే అంటున్నారు. జ్ఞానమార్గం (ఆత్మవిచారం) సత్యమే. కానీ దేహబుద్ధి ఉన్నంతకాలం జ్ఞానమార్గం కఠినం. భక్తి మార్గం ద్వారానే భగవంతుని చేరడం సులభం.

"భగవంతుడు ఎంతకాలం 'నేను' అనే భావన ఉంచుతాడో అంతకాలం భక్తిమార్గమే సులభమైనది" అనే వాక్యాన్ని మనం గమనించాలి. 'నేను' అనే భావనను ఉంచడానికీ, నశింపజేయడానికీ కర్త ఆ భగవంతుడే అని అన్నట్లే కదా! కనుక మనం భగవంతుని శరణు పొందితే, అహంకారం సులభంగా నశిస్తుంది. తక్షణం భగవత్సాక్షాత్కారం అవుతుంది.

ఆమి బోలి, కామనాశూన్య
భక్తి, అహైతుకీ భక్తి - ఏర్ బాడా
ఆర్ కిఛుఇ నాఇ.

నేను కామనారహిత భక్తి, అహైతుకీ భక్తి - అంటాను. దాని కన్నా గొప్పది మరొకటి లేదు.

వ్యాఖ్య: శ్రీరామకృష్ణులు నిర్ద్వంద్వంగా 'నేను కామనారహిత భక్తి, అహైతుకీ భక్తి కన్నా గొప్పది మరొకటి లేదు అంటాను' అని చెప్పారు. అంటే ఆయన తన అభిమతం తెలుపుతున్నారు. ఆయన అవతారపురుషుడు. కనుక ఈ యుగం వారందరి మానసిక శక్తి సామర్థ్యాలు ఆయనకు తెలుసు.

భక్తి కామనారహితము, అహైతుకము అయి ఉండాలంటున్నారు. మనకు దేహాత్మబుద్ధి, ఈ దేహం నేనే అనే భావన ఉన్నంత కాలం, ఈ సంసారం మిథ్యగా తోచదు. మనం ఈ లోకంలో సుఖశాంతులతో ఉండడానికి యథాశక్తి ప్రయత్నం చేస్తాం. కానీ మన సామర్థ్యంతో ఎంత ఆర్జిస్తామో, అది మనం ఆశించినంత సుఖశాంతులను, ఆనందాన్ని ఒసగదు. కనుక భగవంతుణ్ణి శరణు పొందుతాం. మనకు సుఖశాంతుల్ని ప్రసాదించమని ఆయనను వేడుకొంటాం.

ఆయన కల్పతరువు అనీ, సర్వశక్తిమంతుడు అనీ అంటాం. కానీ మనం లౌకిక సంపదలతోనే చిరశాంతి లభిస్తుందని ఎప్పుడూ లౌకికసంపదల కొరకే ప్రార్థిస్తాం. లౌకికమైనది ఏదైనా శాశ్వత శాంతిని ప్రసాదించదు. లౌకిక సంపదలతో తాత్కాలికంగా దుఃఖం తొలగుతుంది నిజమే. కానీ వాటితో భగవంతుణ్ణి పొందలేం. భగవంతుణ్ణి పొందనిదే దుఃఖం ఆమూలాగ్రం నశించదు.

భగవంతుని నుండి ఏమీ కోరని భక్తి - కామనారహిత భక్తి; భగవంతుడు ఏదో ఇస్తాడనే ఆశతో కొలిచే భక్తి - సకామభక్తి. సకామభక్తి గలవారికి భగవంతుడు కొంగు బంగారం అవుతాడు. కామనారహిత భక్తి గలవారికి కేవలం భగవంతుణ్ణి పొందాలనే ఒకే ఒక కోరిక ఉంటుంది. అలాంటి భక్తుడిని భగవంతుడు తప్పక అనుగ్రహించి, దర్శనమిస్తాడు. కనుక శ్రీరామకృష్ణులు చెప్పిన ప్రకారం ఈ యుగంలో అహైతుకి భక్తియే శ్రేష్ఠపథం. ❖

అనువాదం: డాక్టర్ కమల జయరావు

సమస్త ఉదాత్తతకు, ఆధ్యాత్మికతకు కన్నతల్లి మన భారతదేశం. ఇది ఋషివర్యులు నడయాడిన భూమి. నేటికీ ఈ గడ్డమీద దివ్యపురుషులు మనుగడ సాగిస్తున్నారు. - స్వామి వివేకానంద



పరమపదానికి రాజమార్గం

– స్వామి సర్వగతానంద

రాజయోగ నిర్దేశకాలు నూతనంగా ఆవిష్కరించినవి కావు. ఉపనిషత్తులు, గీత మొదలైన శాస్త్రాలలోని ఆణిముత్యాలవంటి ఉపదేశాలను ఏర్చికూర్చిన అద్భుత సమాహారమే 'పతంజలి యోగసూత్రాలు'.

నైతిక, మానసిక పరిధిలో ఆలోచిస్తే శాస్త్రాలను తరచి చూసినా, మహాపురుషుల సూక్తులను వెదకి చూసినా అవి వీటిని పోలి ఉంటాయి. కాకపోతే ఒకరు ఒక విషయాన్ని నొక్కి చెబితే మరొకరు వేరొక విషయాన్ని లక్ష్యంగా చెప్పి ఉంటారు. కానీ యమనియమాదుల విషయానికి వస్తే అవి అన్ని శాస్త్రాలలోనూ, మత సిద్ధాంతాలలోనూ ఒకేవిధంగా ఉంటాయి. పతంజలి వీటన్నింటిని ఒక చోట సమీకరించి మానవ పరిణామ వ్యవస్థనే రాజయోగంగా సృజించాడు. దీనిలోని విషయం సూటిగా ఉండి, ఇతర ఆదర్శాలతో విభేదించకపోవడం వల్లే ఇది రాజమార్గం అయింది. సిద్ధాంతాలు ఎంత గొప్పవైనా అనుష్ఠానం మాత్రమే ఆధ్యాత్మిక జీవితంలో కీలక భూమికను పోషిస్తుంది. అందుకే ఇప్పుడు నీవు ఏమి ఆలోచిస్తున్నావో, ఏమి ఊహిస్తున్నావో, దేన్ని విశ్వసిస్తున్నావో అనేదికాక దైనందిన జీవితంలో నీవు ఎలా మసలుకుంటున్నావో అనేదే ప్రధానం.

అహింసా ప్రతిష్ఠాయాం తత్సన్నిధౌ వైరత్యాగః *(రాజయోగం-2.35)*

అహింసలో ప్రతిష్ఠితుడైన యోగి ముందు మానవులే కాదు, క్రూరమృగాలు సైతం వైరభావాన్ని వదిలేస్తాయి. అహింసా ప్రతిష్ఠాయాం – ఇతర జీవులను బాధ పెట్టకపోవడం, ఇతర జీవులను చంపకపోవడం. మనసా, వాచా, కర్మణా ఏ జీవిని ఇబ్బంది పెట్టినప్పటికీ అది హింస కిందే లెక్క.

ఎవరైతే 'అహింసా వ్రతం'లో సుప్రతిష్ఠులవుతారో వారి సమక్షంలో సమస్త వైరభావనలు అంతరిస్తాయి. ఇతరులను అసహ్యించుకోకుండా, ఎప్పుడు వారి పట్ల ప్రేమను పెంపొందించుకుంటామో అప్పుడు ఎంతటి కఠినాత్ముని హృదయమైనా తప్పక పరివర్తన చెంది తీరుతుంది. జంతువులలో సైతం మార్పును తీసుకురావచ్చు. ఇతర జీవులకు అపకారం చేసే స్వభావం నీలో లేకపోతే, కరడుగట్టిన హృదయాలను సైతం కరిగించవచ్చు. కానీ ఇందుకు ఎంతో ఓర్పు, సహనం అవసరం.

"ఈ క్షణం నుండి నేను ఎవరినీ హింసించను, ఎవరిపట్లా వ్యతిరేకత చూపను. ఆరు నూరైనా, నూరు ఆరైనా 'నా నుండి ఇతర జీవులకు ఎట్టి అపాయమూ కలుగకుండుగాక!' ఈ విషయంలో నేను ఎంతటి కష్టాన్నైనా భరిస్తాను" అని ఓ దృఢ సంకల్పాన్ని గైకొనండి.

ఋష్యాశ్రమాలలో వన్య జంతువులు తమ సహజ వైర భావాన్ని వదలి స్నేహంగా వర్తించినట్లు మనం చదివి ఉన్నాం. కానీ అవన్నీ అతిశయోక్తులుగా భావిస్తాం. అహింసా భావంలో ప్రతిష్ఠితుడైన ముని సాహచర్యంలోని జంతువులకు సైతం అహింసా గుణం అలవడుతుంది.

ఇది వాస్తవంగా జరిగిన సంఘటన. హృషీకేశ్ దగ్గరిలోని ఒక గ్రామంలో గంగ ఒడ్డున ఒక స్వామీజీ నివసిస్తుండేవారు. ఒకసారి వారు జబ్బు పడితే ఒక సేవకుడు వారికి సహాయంగా ఉండటానికి వెళ్ళాడు. అతడు అక్కడికి చేరుకోవడంతోనే ఒక వింతైన దృశ్యాన్ని చూసాడు. గంగ ఒడ్డున ఆ స్వామీజీ ఒక బండరాయిపై కూర్చొని ధ్యానం చేస్తున్నారు. అంతలో ఒక పులి అక్కడకు వచ్చి ఆ బండరాయికి తన వీపును రుద్దుకోసాగింది. ఆ పులిని చూసిన సేవకుడు బెదిరిపోయి ఎటు

అహింస

పరిగెత్తాలో తెలియక గుడిసెలోకి వెళ్ళి తలుపులు బిడాయించాడు. ఏం జరుగుతుందోనని ఒక కన్నం గుండా తొంగి చూస్తూ ఉన్నాడు. కొంతసేపటికి ఆ పులి వెళ్ళడం రూఢిపరుచుకున్నాక గుడిసె నుండి బయటకు వచ్చి ధ్యానం నుండి మేల్కొన్న స్వామీజీతో ఇలా అన్నాడు: 'స్వామీజీ! ఇప్పుడు ఏం జరిగిందో తెలుసా?' విషయం గ్రహించిన స్వామీజీ "అవును, ఆ పులి ప్రతి రోజూ ఇక్కడకు వస్తుంది. గంగలో నీళ్ళు త్రాగి దాని దారిన అది వెళ్ళిపోతుంది. జంతువులకు ఏ హాని తలపెట్టవద్దు. అంతేకాక వాటిని చూసి పరిగెత్తవద్దు. వాటి దారిలో నిలబడవద్దు" అని అన్నారు.

'మీరు ఈవిధంగా ఎలా ఉండగలుగుతున్నారు' అన్న ప్రశ్నకు స్వామీజీ సమాధానం ఇస్తూ "ఇది నిత్యకృత్యమే, అది నా గుడిసె ముందు నడుస్తూ ఉండడం నేను తరచుగా చూస్తూనే ఉంటాను. అది నాకు ఎలాంటి కీడు తలపెట్టదు. నేను దానిని ఏమీ అననప్పుడు అది మాత్రం నా జోలికి ఎందుకు వస్తుంది? నీవు ఆ పులిని చూసి ఎలా భయపడుతున్నావో, అది కూడా నిన్ను చూసి అలాగే భయపడుతుంది" అని అన్నారు.

నీలో ప్రేమభావమే ఉన్నప్పుడు నీ హృదయంలో వికసించిన ప్రేమ కుసుమ పరిమళం నీ చుట్టు ప్రక్కల పరిసరాలకు

వ్యాపిస్తుంది. నీకు అహింసాతత్త్వం అలవడినప్పుడు, నీవు నివసించే చోట అన్ని శత్రుత్వ వైఖరులు అదృశ్యమవుతాయి. ఒకరి హృదయంలో ఎలాంటి ద్వేషభావం లేనప్పటికీ అతనికి ఎవరైనా కీడు తలపెట్టవచ్చు. అంత మాత్రాన అతడు ప్రేమను వ్యక్తీకరించలేదని చెప్పలేం. ఆశావహదృక్పథంతోను, ప్రేమతోను జనులు ఇతరుల హృదయాలను గెలిచిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

మనలో హింసాప్రవృత్తి లేనప్పుడు, ఇతరులు మనకు ఏదైనా కీడు తలపెట్టినా మననుండి ఎలాంటి ప్రతిచర్య, ప్రతిస్పందన లేకపోతే వారేమి చేయగలరు? మిన్నకుండిపోతారు. మనకు కావలసినదల్లా ఎటువంటి ప్రతిచర్య చూపకుండా ఉండటానికి తగినంత ఓర్పు, సహనం మాత్రమే. మిగిలిన సమస్యలన్నీ వాటంతటవే పరిష్కరించబడతాయి. సమాజంలో మన మనుగడను సజావుగా సాగించడానికి, మనల్ని మనం శక్తిమంతులుగా రూపొందించుకోవడానికి, శాంతియుతంగా

జీవించడానికి ఇదొక్కటే మార్గం. బయట ఎలాంటి క్లిష్టపరిస్థితులు ఎదురైనప్పటికీ ఆశావహ దృక్పథంతో శుభప్రదంగా వర్ధిల్లడానికి దీన్ని మించిన మార్గం లేదు. అందుకే పతంజలి "ఎప్పుడైతే నీవు అహింసా భావంలో సుస్థిరపడతావో అప్పుడు నీపట్ల ఇతరులకు ఎలాంటి ద్వేషభావం ఉండదు" అని అంటారు.

స్వామి వివేకానంద "అహింస అనే ఆదర్శాన్ని చేపట్టిన మానవుని ముందు ఎంతటి క్రూరమృగాలైనా శాంతం వహిస్తాయి. అటువంటి యోగి ముందు పులి, మేకలు సైతం కలసి ఆటలాడుతాయి. అటువంటి స్థితిని పొందినప్పుడే నీవు అహింసావ్రతంలో దృఢంగా నిలదొక్కుకున్నావని అర్థం చేసుకోగలవు" అంటారు.

మీ మనస్సును పవిత్రమొనర్చండి. మీ బుద్ధిని పవిత్రమొనర్చండి. మీ హృదయాన్ని పవిత్రమొనర్చండి. ఇలా పవిత్రమైన మీ మనస్సు, బుద్ధి, హృదయాలే దేదీప్యమానంగా వెలుగొందుతున్న అంతర్జ్యోతి ఎరుకను మీకు విశదపరుస్తాయి. విచిత్రమైన విషయం ఏమిటంటే, ఆ అద్భుత జ్యోతిని మనం మన అంతరంగంలోనే ధరిస్తున్నాం. మోక్షసామ్రాజ్యం మనలోనే నిహితమై ఉంది. కానీ దీన్ని మనం తెలుసుకోలేకున్నాం. బాహ్య ప్రపంచాన్ని అంగీకరించినంతసేపు మనం దాని ఉనికిని మరచిపోతాం. బాహ్య ప్రపంచాన్ని విస్మరించి అంతర్ముఖులమైనప్పుడే అది వెలుగులోకి వస్తుంది.

అందుకే అన్నారు 'మనస్సు లయమవ్వాలి' అని. మనందరికీ మనస్సు ఉంది. కానీ గమనంలో ఉండడమంటే ఏమిటో తెలియదు. 'జీవనకళ' అంతా ఈ గమనంలో ఉండడం పైనే ఆధారపడి ఉంది. మనకు మనస్సు ఉంది. దాని పని అది చేస్తుంది. ఎన్నో విషయాలను మోసుకువస్తుంది. మరెన్నో ఆలోచనలను ప్రోగుచేస్తుంది. ఎటువంటి సమాచారం మనస్సు ద్వారా సేకరించబడుతుందో; ఎటువంటి ఊహలు, ఆలోచనలు ఈ మనస్సు చేస్తుందో మనం గమనిస్తున్నామా? మనస్సుపై నిఘా పెట్టి జాగరూకతతో ఆలోచనల్ని కనిపెట్టి ఉండటమే గమనంలో ఉండడమంటే.

అవసరమైన విషయాలపట్ల, మనకు ఇష్టమైన విషయాలపట్ల గమనంలో ఉంటాం, ఎంతో జాగ్రత్తవహిస్తాం. కానీ దీనిని నిరంతరం కొనసాగించగలమా? దైనందిన జీవితంలో అడుగడుగునా గమనంలో ఉండగలిగితే మన అంతరంగంలో అద్భుతాలు చోటుచేసుకోవడం గమనించగలం.

నీవు ఆశావహ దృక్పథాన్ని అలవరచుకుంటే నీకు ప్రతిదీ ఆశాజనకంగానే కనిపిస్తుంది. ప్రతి ఒక్కరినీ ఆశావాదిగానే చూస్తావు. ఇదియే సత్యం. నీ మనస్సుకు అంతటి శక్తి ఉంది. భావార్ధకమైన శుద్ధ మనస్సుకు జనులలో పరివర్తన తీసుకువచ్చే శక్తి ఉంటుంది. ఇందుకు కొంత సమయం పట్టవచ్చు. కానీ తప్పక జరిగితీరుతుంది. అందుకే ఇక్కడ పతంజలి మహర్షి ఒక్కొక్కటిగా వివరిస్తున్న యోగసూత్రాలతో పాటు మనం ఆశావహ దృక్పథాన్ని అలవరచుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. ఈ విషయాలు జ్ఞానోదయపు అంత్యదశలోనేగాక ఆ మార్గంలో పయనిస్తున్నప్పుడు కూడా మన జీవితాలను కలతలు లేకుండా ప్రశాంతమొనర్చి సకల శుభాలను చేకూర్చుతాయి. అందుకే నీవు ఎక్కడ ఉన్నప్పటికీ, ఏమి చేస్తున్నప్పటికీ పరుల హితాన్ని కోరుకో. ఇతరులు నాకేమి చేస్తున్నారనే ఆలోచన దరికి రానీయకు. నిరంతరం నీ నుండి సకారాత్మక, ప్రేమపూర్వక ఆలోచనా తరంగాలను ప్రసరింపజేయి. అది కూడా ఇతరుల కోసం కాదు, నీ కోసమేనని భావించు. అందరూ బాగుండాలని కోరుకుంటే ఆ అందరిలో నీవు కూడా ఉంటావనే విషయంలో సందేహమే లేదు. ❖ తెలుగు సేత: బ్రహ్మచారి శ్యామ్

(భగవాన్ శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష సన్న్యాస శిష్యులైన స్వామి అఖండానందజీ మహరాజ్ శిష్యులు స్వామి సర్వగతానంద)

భగవంతుని ఆరాధనకు నీవొక దేవాలయాన్ని నిర్మించవచ్చు, మంచిదే! కానీ అంతకంటే ఉన్నతమైనదీ, ఉత్తమమైనదీ ఇప్పటికే నిర్మితమై ఉన్నది - అదే మానవ దేహం. - స్వామి వివేకానంద

సన్మార్గం వైపు మారదాం!

– శ్రీమతి భమిడిపాటి బాలాత్రిపురసుందరి

ప్రపంచానికి ఒక అలవాటుంది. మంచివాణ్ణి పొగడ డానికి మొహమాటపడతారు. కానీ దుర్మార్గుణ్ణి నిందించ డానికి ఎవరూ మొహమాటపడరు. దుర్మార్గుడా? కాదా? అని నిర్ణయించడం వారి వారి అభిప్రాయాలను బట్టి ఉంటుంది. ప్రతి వారికీ అందరూ తనను పొగడాలనే ఉంటుంది. కానీ, నడవడిక మాత్రం అందుకు తగినట్లు ఉండదు. అందుకే అంటారు–“బుద్ధికి భూములు ఏలుదామని ఉంటే అదృష్టం మాత్రం గాడిదల్ని కాస్తుంది” అని!

మనిషికి ఒక మహత్తరమైన శక్తి ఉంది. తన స్వభావాన్ని ఎటు కావాలంటే అటు మార్చుకోగలడు. చెడు అలవాట్లకు అలవాటు పడినవాడు కూడా తను మంచి మార్గంలో లేనన్న విషయం తెలుసుకోగలిగితే స్వభావాన్ని మార్చుకుని మంచి మార్గంలో నడవగలడు.

చెడు అలవాట్లు ఉన్నవారిలో మార్పు కలుగుతుందా? ఎందుకు కలుగదు? అందుకు నిదర్శనం – వేశ్యాలోలుడు వేమన, బందిపోటు దొంగ రత్నాకరుడు.

వేమన పరమ కాముకుడు. అతడు వేశ్య చుట్టూ తిరిగేవాడు. ఇంట్లోవన్నీ తీసుకెళ్ళి వేశ్యకే ఇచ్చేవాడు. ఒకసారి పెద్ద మొత్తాన్ని తీసుకెళ్ళి వేశ్యకిస్తాడు. కొంతకాలం తరువాత వేశ్య దగ్గరకు వెళ్ళి ‘ఇంట్లో అవసరం ఉంది ఆ మొత్తాన్ని ఇమ్మని’ అడుగుతాడు. అందుకు ఆమె “పిచ్చివాడా! భోగందానికి ఇచ్చిన డబ్బు, గోడకు కొట్టిన సున్నం మళ్ళీ రావు! అది కూడా తెలియదా నీకు? పో... పో...!” అంటుంది. ఆమె మాటలు విన్న వేమనకు కనువిప్పు కలిగి, యోగిగా మారాడు.

రత్నాకరుడు ఒక బోయవాడు. దారినపోయేవాళ్ళను దోచుకొని బ్రతికేవాడు. నారదుడు అతణ్ణి చూసి, మార్చడానికి సంకల్పించాడు. ఆయన చెప్పిన విధంగా ఆచరించి ఒక పెద్ద గజదొంగ కాస్తా మహర్షిగా మారి, రామాయణం రచించి ఒక గొప్ప కవిగా కీర్తిని పొందాడు. అతడే వాల్మీకి.

మనిషిలో ఉన్న భగవదంశను వెలికితీస్తే మాధవుడిగా మారగలడు అంటారు మహాత్ములు. “నేనెక్కడ? దైవగుణాలు కలిగి ఉండడం ఏమిటి? నక్క, నాకలోకం అన్నట్టు ఉంటుందని ఎవరూ తమను తాము కించపరచు కోకూడదు. సదాచారుడికి అన్నీ సాధ్యమే! దాన్ని ప్రహ్లాదుడిలో గుర్తించగలం.

ప్రహ్లాదుడు సంసార సముద్రాన్ని దాటాడు, కామక్రోధాది శత్రువర్గాన్ని జయించాడు, కేశవ నామామృతంతో గొప్ప శక్తిగలవాడు అయ్యాడు.

పిల్లలు మంచి నడవడిక కలిగి ఉండాలంటే తల్లితండ్రులు మంచి నడవడిక కలిగి ఉండాలి. ప్రహ్లాదుడి విషయంలో అదంతా వ్యతిరేకమే! హిరణ్యకశిపుడికి తన కుమారుడు చెడిపోతున్నాడేమోనని అనుమానం. “దేవతలను నొప్పించడం, దిక్పాలకులను పరుగెత్తించడం, సిద్ధులనూ, యోగులనూ బాధించడం, యక్ష కిన్నెర గంధర్వాదుల్ని నాశనం చెయ్యడం లాంటి పనులు చెయ్యాలి గానీ, ‘హరీ.. గిరీ...’ అంటూ మోహాంధుడివై చెడిపోతున్నావు కదరా!” అంటాడు.

ప్రహ్లాదుడిది పుట్టుకతో వచ్చిన సంస్కారం. అయినా తండ్రి కొడుకును పిలిచి “ఈ విచిత్రపు బుద్ధి నీకే పుట్టిందా? ఏ గురువైనా బోధించాడా? విష్ణుమూర్తి మన విరోధి. కనుక, అతణ్ణి తలవకు!” అని అంటాడు. ప్రహ్లాదుడికి ఏది చెయ్యొచ్చో... ఏది చెయ్యకూడదో తెలుసు. కనుక తన జాతి స్వభావం రాక్షస స్వభావమే అయినా తన సంస్కారంతో మంచిగా జీవించాడు. మనిషి తన స్వభావాన్ని మార్చుకోగలడు. కనుక మంచి మార్గం వైపు పయనిస్తే ఎవరైనా వేమనలా, వాల్మీకిలా, ప్రహ్లాదుడిలా కీర్తిమంతులు కాగలరు. ❖

ధీరవాణి

– స్వామి వివేకానంద

పురోభివృద్ధికి తోడ్పడేదే పుణ్యం!

పేదల దుఃస్థితే భారతదేశంలోని అన్ని అనర్థాలకు మూలకారణం. పశ్చిమ దేశాలలోని పేదలు రాక్షసులు. వారితో పోలిస్తే మనవారు దేవతలు. అందుచేత మన పేదలను ఉద్ధరించడం అంత కష్టమైన పనికాదు. పేదలకు విద్యను గరపడం, కోల్పోయిన వ్యక్తిత్వాన్ని వారికి కలుగచేయడం – ఇదే మనం వారికి చేయవలసిన సేవ. మన ప్రజలు, మన ప్రభువులు చేయవలసిన మహత్కార్యమిది. ఇంతవరకు ఈ విషయంలో ఎవ్వరూ కలుగజేసుకోలేదు. మతాచార్యుల నిరంకుశ అధికారం వల్లగానీ, విదేశీయుల చేతిలో ఓడిపోవడంవల్లగానీ వందల సంవత్సరాల నుండి జనసామాన్యం అణగదొక్కబడి అధఃపతితమైపోయింది. చివరకు భారతదేశంలోని ప్రజలు తాము మానవులమనే విషయాన్నే మరచిపోయారు. మనం వారికి ఉన్నత ఆశయాలను అందివ్వాలి. తమ చుట్టుపక్కల ప్రపంచంలో ఏం జరుగుతోందో వారి కన్నులు విప్పి చూపాలి. అప్పుడు వారు స్వయంగా తమ భుక్తిని సాధించుకొంటారు.

ఏ వ్యక్తి అయినా తమ ముక్తిని తామే సంపాదించుకోవాలి. మనం చేయాల్సిందల్లా వారికి ఉత్తమ ఆశయాలను అందించాలి. వారికి కావలసిన సహాయం అదే. మిగిలింది దానంతట అదే జరుగుతుంది. రసాయనిక పదార్థాలను ఒకచోట చేర్చడమే మన పని. ప్రకృతి నియమాలననుసరించి స్ఫటికీకరణం జరుగుతుంది. ఆశయాలను వారి మెదడులోకి ఎక్కించడమే మన విధి. మిగిలినదంతా వారు చేసుకొంటారు. ప్రస్తుతం భారతదేశంలో చేయవలసిన కార్యమిదే!

హిందూ దేశంలో పేదరికం ఎంతగా పెరిగిపోయిందంటే, పేద బాలురు బడికి వెళ్ళడం కంటే, తమ తల్లిదండ్రులకు సహాయపడడానికి పొలానికి వెళ్ళడమే మంచిదని తలుస్తారు. పొలానికి వెళ్ళకపోతే, బడికిపోవడానికి మారుగా ఏదో జీవనోపాధి చూసుకొంటారు... పేదబాలుడు విద్య వద్దకు (పాఠశాలకు) రాకపోతే, విద్యే పేదబాలుని వద్దకు వెళ్ళాలి.

సాంఘిక సమానత, అసమానతలను గురించి మనం ప్రచారం చేయకూడదు. ప్రతి మానవుడికీ సమానమైన హక్కులు ఉన్నాయనీ, అతనికి ఆలోచనలోను, ఆచరణలోను అన్నివిధాలైన స్వాతంత్ర్యం అవసరమనీ మనం ప్రచారం చేయాలి.

మనం ఆస్తికుల్నిగానీ, నాస్తికుల్నిగానీ; అద్వైతుల్నిగానీ, విశిష్టాద్వైతుల్నిగానీ; అజ్ఞేయవాదుల్నిగానీ, మరెవ్వరినైనాగానీ నిరాకరించకూడదు. ప్రవర్తన విషయంలో, శీలం విషయంలో అవి ఇతరులకు బాధ కలిగించకుండా ఉండేంతవరకు – మనం ప్రత్యేకమైన ఏ నియమాలనూ విధింపకూడదు.

ఏది పురోభివృద్ధికి ఆటంకమో, ఏది పతనానికి దారితీస్తుందో అది ఏదైనా పాపమే; పురోభివృద్ధిని కలిగించేది, సమన్వయాన్ని కల్పించేది అది ఏదైనా పుణ్యమే! ❖

విశాల హృదయులైన వందలాది స్త్రీ పురుషులు, తమ సుఖానుభవ కాంక్షలను విడిచిపెట్టి, ప్రతి అణువునూ ధారపోసి శ్రమించినప్పుడే భారతదేశం అభివృద్ధి చెందుతుంది. *- స్వామి వివేకానంద*

జనయిత్రి... దివ్యధాత్రి

భారతదేశ వైభవం

మన భారతదేశానికి ప్రపంచం ఎంతగానో ఋణపడి ఉంది. చరిత్రను ఒకమారు పరికిస్తే మానవ వికాసానికి భారతదేశం చేసినంత కృషి ప్రపంచంలో మరొక దేశం చేయలేదని విశదమవుతుంది. కనుక నేను నా దేశ ప్రజల్ని ఎన్నడూ తూలనాడను. 'మీరు ఇంతవరకు మానవలోకానికి చాలా చేశారు. ఇంకా ఎక్కువగా చేయడానికి ప్రయత్నించండి' అని ప్రబోధిస్తాను.

హిందూమతం అన్ని మతాల కంటె ప్రాచీనమైనదని అందరికీ తెలిసిన విషయమే! విజ్ఞాన శాస్త్రాల విషయంలో కూడ ఇదే వర్తిస్తుంది. శాస్త్రీయ వైద్యులను అందించింది భారతీయులే! సర్ విలియమ్ హంటర్ 'భారతదేశం ఆధునిక వైద్య శాస్త్రానికి ఎంతో మేలుచేసింది. ఎన్నో రసాయనాలను కనుగొనుట ద్వారా వైద్య శాస్త్రానికి చాలా ప్రయోజనాన్ని చేకూర్చింది' అని అన్నారు.

అంతకంటే అధికంగా భారతదేశం గణితశాస్త్రంలో బీజ గణితం, రేఖా గణితం, ఖగోళ శాస్త్ర విభాగాల్లో కూడా గణనీయమైన విజ్ఞానాన్ని సమకూర్చింది. అధునాతన శాస్త్ర విజ్ఞాన విజయానికి అనుకూలమైన సంకలన గణితాన్ని ప్రథమంగా కనుగొంది మన దేశమే! మానవ సమాజానికి మూలాధారమైన పది అంకెలను భారతదేశమే కనిపెట్టింది.

వేదాంత పరిజ్ఞానంలో ఇతర ప్రపంచ దేశాలతో పోలిస్తే మనదేశం గణనీయమైన పరిణతిని సాధించింది. ఈ సత్యాన్ని ప్రసిద్ధి చెందిన వేదాంత తత్త్వవేత్త, జర్మనీ దేశస్థుడైన స్కోపెన్‌హోర్ అంగీకరించాడు.

సంగీత శాస్త్రానికి వస్తే అందులోనూ భారతదేశం పాత్ర ప్రముఖమైనదే! సంగీతానికి సప్తస్వరాలనూ, ఆరోహణ అవరోహణ క్రమాలనూ ప్రపంచానికి అందించింది భారతదేశమే!

ఇక భాషాపరంగా చూసినట్లయితే, మన సంస్కృత భాష మొత్తం ఐరోపా భాషలన్నింటికీ ఆధారమని సర్వత్రా ఆమోదింపబడింది.

ఇక సారస్వత విభాగాన్ని విశ్లేషిస్తే మన ఇతిహాసాలు, పద్యకావ్యాలు, నాటకాలు మరి ఏ ఇతర భాషలతో పోల్చినా, ఉన్నత స్థాయి గ్రంథాలుగా పరిగణింపబడ్డాయి. ఒక గొప్ప జర్మనీ కవి మన 'అభిజ్ఞాన శాకుంతలం' నాటకాన్ని వర్ణిస్తూ 'స్వర్గమర్త్యలోకాల అనుసంధానమే ఆ కావ్యం' అన్నారు.

అరేబియన్ నైట్స్ కథలకు ఆధారం సంస్కృతంలోని కథలే! సిండ్రిల్లా, బీన్‌స్టాక్స్ కథలన్నీ మన సాహిత్యం నుండి గ్రహించినవే!

పత్తి ఉత్పత్తినీ, నీలిరంగు అద్దకాన్నీ మొదట తయారు చేసింది మన భారతీయులే! నగల తయారీలో గణనీయమైన ప్రావీణ్యత సాధించిన ఘనత మన దేశానిదే. పంచదారను ప్రథమంగా తయారు చేసిన కీర్తి మనదే. చదరంగం, పేక,

పాశ్చాత్యుల ప్రశంసలు



"ప్రపంచానికి భారతీయులే గణితంలో సులభంగా లెక్కించే 'దశాంశ పద్ధతి'ని అందించారు. 'గణితం' లేకుంటే వైజ్ఞానిక పరిశోధనల్లో ఇంత ప్రగతి సాధ్యమయ్యేది కాదు. అందువల్ల మనం భారతీయులకు ఎంతో ఋణపడి ఉన్నాం."

- ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, జర్మనీ శాస్త్రవేత్త



"నేటి ఖగోళశాస్త్రం, గణితం, జ్యోతిష్యం, తత్త్వశాస్త్రం, తర్కశాస్త్రం... మొదలైన విజ్ఞాన సర్వస్వం గంగానది ఒడ్డు నుండి మనకు సంప్రాప్తించినదేనని నేను సంపూర్ణంగా విశ్వసిస్తున్నాను. మనం ముఖ్యంగా గమనించ దగ్గ విషయమేమిటంటే కనీసం 2500 ఏళ్ళ క్రితం 'పైథాగరస్', గ్రీకులోని సామూస్ నుండి గంగా నది ఒడ్డుకు వెళ్ళి, రేఖా గణితాన్ని అభ్యసించాడు."

- వాల్టేర్ ఫ్రాంకిస్, ఫ్రెంచ్ తత్త్వవేత్త



భారతదేశం వివిధ మతాలకు నిలయం. మానవజాతి పెరిగిన ఊయల. మానవ భాషకు పుట్టినిల్లు. విజ్ఞానవేత్తలకు అమ్మమ్మ, సంస్కృతీ సంప్రదాయాలకు ముత్తవ్వ. ప్రతి ఒక్కరూ భారతదేశాన్ని సందర్శించాలని కాంక్షిస్తారు. ఆ దేశం వైపు క్షణకాలంపాటు వీక్షించిన వారెవరైనా మరే దేశంవైపూ కన్నెత్తి చూడడానికి కూడా ఆసక్తి చూపరు.

- మార్క్ ట్వైన్, అమెరికా రచయిత

పాచికల ఆటలను భారతదేశం ప్రవేశ పెట్టింది. ఇలా అన్ని రంగాల్లోనూ భారతదేశం సాధించిన ఉన్నతిని చూసి, ఐరోపావారు ఆకర్షితులై మనదేశంపై దాడిచేసారు.

చరిత్ర పుటలు తిరగేయండి. ప్రపంచాన్ని ఉర్రూతలూగించిన ఆధ్యాత్మిక జ్ఞాన ప్రవీణులకు భారతదేశంలో ఏ కాలంలోనూ కొరత లేదు. ఈ సత్యాన్ని ఎవరూ కాదనలేరు. ఈ దేశం యొక్క కృషి ఆధ్యాత్మికతకు సంబంధించింది. దీనిని యుద్ధాలతోనూ, సైనిక దాడులతోనూ సాధించలేరు.

నిశ్శబ్దతతో పడే మంచు బిందువులు సుగంధ పరిమళాలను వెదజల్లే పుష్పాలు వికసించడానికి దోహద పడినట్లే, భారతీయ సంస్కృతి కూడా ప్రపంచదేశాల ప్రజలను ప్రభావితం చేస్తూ వచ్చింది. – స్వామి వివేకానంద

ఆదర్శాన్ని మరువకు!

భారతదేశమా! సాధ్వీమణులైన సీత, సావిత్రి, దమయంతులను మరువవద్దు. సర్వసంగపరిత్యాగి, యతీశ్వరుడు అయిన ఉమామహేశ్వరుడు నీకు ఆరాధ్యదైవమని మరువవద్దు.

నీ వైవాహిక జీవితం, నీ ఐశ్వర్యం, నీ జీవిత సర్వస్వం కేవలం ఇంద్రియ సుఖాలకు, వ్యక్తిగత భోగాలకు కాదని మరువవద్దు.

యజ్ఞనారాయణునికి ఆహుతయ్యే నిమిత్తం జన్మించావన్న విషయాన్ని మరువవద్దు. నీ సాంఘిక వ్యవస్థ అనంత జగన్మాతృత్వానికి ప్రతిబింబమన్న విషయాన్ని మరువవద్దు.

నిమ్నజాతులు, దీనులు, దరిద్రులు, అస్పృశ్యులు, అమాయకులు, నిరక్షరాస్యులు... ఇలా అందరూ నీ సహోదరులే అని మరువవద్దు.

– స్వామి వివేకానంద

సింహనాదం!

సోదరులారా! మనమందరమూ అకుంఠిత దీక్షతో పనిచేద్దాం. నిద్రించుటకు ఇది సమయం కాదు. భావిభారత భాగ్యోదయం మన కార్యదీక్షపై ఆధారపడి ఉంది. భారతమాత నిరీక్షిస్తోంది.

లేవండి! నిద్ర నుండి మేల్కొండి! మన భారతమాతను చూడండి. ఇదివరకు ఎన్నడూ లేని మహావైభవంతో, ఉత్తేజంతో ఆమె తన శాశ్వత సింహాసనంపై ఎట్లు కూర్చొని ఉన్నదో చూడండి.

త్యాగభావం లేనిదే మహత్కార్యాలను సాధించుట శక్యం కాదు. మీ భోగాలనూ, మీ సుఖాలనూ, మీ పేరుప్రతిష్ఠలనూ, మీ పదవులనూ, చివరికి మీ ప్రాణాలను సైతం సమర్పించి మానవ శరీరాలతో ఒక వంతెనను నిర్మించండి. ఆ వంతెన మీదుగా కోటానుకోట్ల జనం ఈ సంసారసాగరాన్ని దాటగలరు.



అంతా దైవేచ్ఛ!

– స్వామి శితికంఠానంద

తన ఒక్కగానొక్క పిల్లవాడు పాము కాటుతో చనిపోవడం వల్ల ఆ తల్లి కన్నీరు మున్నీరుగా విలపిస్తుంది. ఇంతలోకే అక్కడికి ఒక వ్యాధుడు వస్తాడు. ఆ తల్లి దుఃఖం చూడలేక ఆమెకు అంత వేదనను కలిగించిన పామును పట్టుకుంటాడు. చేతిలో భుజగాన్ని ఒడిసి పట్టుకొని ఆమె దగ్గరకు వచ్చి ఆ పాము వలననే ఆమెకు అంత దుఃఖం కలిగింది కాబట్టి సర్పాన్ని చంపేస్తానంటాడు. గౌతమి పేరుగల ఆ పుణ్యమూర్తి వ్యాళాన్ని చంపడానికి అంగీకరించదు. పామును చంపడం వలన చనిపోయిన తన కుమారుడు తిరిగిరాడు కాబట్టి ఉరగాన్ని చంపడం వ్యర్థం అంటుంది. వ్యాధుడు పట్టువదలకుండా 'ఇవ్వాళ నీకుమారుడిని పొట్టన పెట్టుకున్న ఈ సర్పం రేపు ఇంకొకరిని కాటేస్తుంది కాబట్టి ఇతరులకు సదా దుఃఖాన్ని కలిగించే ఈ సర్పాన్ని ఉపేక్షించరాదు' అంటాడు. పామును చంపి పాపాన్ని మూటకట్టుకోలేను. కాబట్టి ఆ పాప సంకల్పాన్ని మానుకోమని వ్యాధుడిని హెచ్చరిస్తుంది. తన దుఃఖానికి తన కర్మయే కారణంకాని సర్పం కాదు అని ఆమె భావన.

వ్యాధుడి చేతిలోని ఆ సర్పం బోయవాడితో 'నేను బాలుడిని కాటేసిన మాట నిజమే! కానీ అది నా సంకల్పం కాదు. మృత్యువు నన్ను అలా ప్రేరేపించడం వల్ల నేను ఆ పని చేయాల్సివచ్చింది. కావున బాలుడి మరణానికి నేను కారణం కాదు' అని అంటుంది.

వ్యాధుడు ఈ సమాధానంతో సంతృప్తి చెందక 'మృత్యువు చేతిలో పరికరమయ్యావు కనుక నిన్ను చంపడం ధర్మమే' అంటాడు. ఇంతలో మృత్యుదేవత అక్కడ ప్రత్యక్షమై లుబ్ధకుడిని సంవాదంలోకి లాగుతూ బాలుడి మరణానికి తాను కారణం కాదనీ, తాను కాలం చేత ప్రేరేపింపబడి అలా చేయవలసి వచ్చినదనీ, తనను అనవసరంగా నిందిస్తున్నావనీ అంటుంది. ఇంతలో అక్కడ కాలుడు ప్రత్యక్షమై ఈ ప్రపంచంలో ఒకరి దుఃఖానికి మరొకరు కారణమవరనీ, మనిషికి కలిగే సుఖదుఃఖాలు స్వకర్మజనితాలనీ, వ్యక్తి తనకర్మకు తానే బాధ్యుడనీ పలికి బోయవాడు చేతిలోని సర్పాన్ని వదిలివేసేలా చేస్తాడు.

ఇది మహాభారతంలోని గౌతమి-లుబ్ధక-సర్ప-మృత్యు -కాల సంవాదం మనకు తెలియజేసే ధర్మసూక్ష్మం. మరి ఎప్పటివరకు మన కర్మలకు మనం బాధ్యులం కొంత ఆలోచిద్దాం!

అంతా భగవంతుడే చేస్తున్నాడు : ఈ రోజు మనలో చాలామందికున్న సందేహమేమంటే అంతా భగవంతుడే చేస్తున్నప్పుడు మనకర్మలకు మనం బాధ్యులం ఎలా అవుతాం అని.. అంతా భగవత్సంకల్పంమేరకే జరుగుతున్నదన్న విషయం వందశాతం సత్యం. కాకపోతే సర్వకార్య నిర్వాహకుడు ఆ దేవదేవుడే అన్న భావన మనకు నిరంతరం ఉండడం లేదు. సర్వకాల సర్వావస్థలలోనూ భగవంతుడే మనల్ని పరికరాలుగా గ్రహించి కర్మలను చేస్తున్నాడనీ, మనకు స్వేచ్ఛలేదనీ, మనం కేవలం నిమిత్తమాత్రులమనీ గ్రహించడం లేదు. మంచి జరిగినప్పుడూ, మనం జీవితంలో ఏదైనా సాధించినప్పుడూ, బంధువులు, మిత్రులు, సమాజం మనల్ని అభినందించినప్పుడూ ఆనందిస్తాం; పొగడ్తలను చక్కగా ఆస్వాదిస్తాం. ఆ విజయం మనదికాదనీ, అది భగవంతుడి విజయమనీ, ఆ పొగడ్తలు, అభినందనలను స్వీకరించడానికి ఆయనే అర్హుడనీ మాత్రం అనం. కనీసం ఆయన అనుగ్రహం వలననే నేను ఈ విజయాన్ని సాధించాను అని చెప్పడానికి కూడా మనలో చాలామంది సంసిద్ధులై లేరు.

ఇక కష్టాలు వచ్చేసరికి భగవంతుడు మనకు ఎందుకు కష్టాలు కలిగిస్తున్నాడని నిందిస్తాం. విజయం సాధించినప్పుడు ఉబ్బే అహంకారమే పరాజయం, కష్టం వచ్చినప్పుడు క్రుంగుతుంది. మనది తరంగ గమనం. తరంగం పైకి లేస్తుంది, క్రిందపడుతుంది. ఇలా పైకి లేవడం ఎందుకు? క్రింద పడడం ఎందుకు? అని విచారిస్తే జయాపజయాలకు భగవంతుడినే బాధ్యుడిని చేస్తూ సాక్షిగా ఉండవచ్చును. అప్పుడు మనకు నిజమైన శాంతి, ఆనందం ప్రాప్తిస్తాయి. సుఖం లేదా కేవలం దుఃఖం ఈ లౌకిక జీవితంలో ఎవరికీ రావు. ఈ రెండింటి సన్నిపాతమే జీవితం. కానీ మనది పూర్తి శరణాగతి కాదు. జయాలను మనకు ఆపాదించుకోవడం, కష్టాలను, అపజయాలను భగవంతుడికి ఆపాదించడం మన బలహీనత.

శరణాగత ధర్మం : పూర్తి శరణాగత భావంతో ఉండడమంటే ఏమిటో మనకు తెలియజేయడానికి శ్రీరామకృష్ణులు ఒక చిన్న కథ చెపుతారు. ఓ గ్రామంలో ఒక భక్తుడైన నేతపనివాడు ఉండేవాడు. అతడు ఏ పని చేసినా రాముడిని స్మరిస్తూ చేసేవాడు. అంతా రామేచ్ఛ అంటూ తనను తాను నిమిత్తమాత్రుడిగా భావిస్తూ వృత్తిని నిర్వహించుకుంటూ ఉండేవాడు. ఒకరోజు అతడు పనిముగించుకుని అరుగు మీద కూర్చొని, రామభజన చేస్తున్నాడు. ఇంతలో కొందరు దొంగలు ఆ వైపుగా వెళుతూ తాము దొంగిలించిన వస్తువులను మోయడానికి ఉపయోగపడతాడని ఈ నేతపనివానిని రెక్కపట్టుకొని తమతో తీసుకుపోతారు. ఇంతలో రాజభటులు దొంగలను వెంబడించడంతో ఆ దొంగలు పారిపోతారు. ఈ భక్తుడు భటుల చేతికి చిక్కుతాడు. భటులు ఆయనను రాజుముందు హాజరు పరుస్తారు. రాజు ఆయనను నిర్బంధంలో ఉంచి మరునాడు

విచారణకై సభలో హాజరు పరుస్తాడు. విషయం తెలిసిన గ్రామస్తులు రాజుగారి దగ్గరకు వచ్చి ఆయన చాలా నిజాయితీ పరుడనీ, దొంగ కాదనీ, భగవద్భక్తుడనీ రాజుకు చెపుతారు. రాజు అప్పుడు ఆ పద్మశాలీయుడిని అసలు ఏమి జరిగిందో తెలియజేయమంటాడు. అప్పుడు ఆ భక్తుడు, 'రాజా! రామేచ్ఛ వల్ల నేను నిన్న భోజనం చేసి అరుగు మీద కూర్చున్నాను. రామేచ్ఛ వల్ల అప్పుడు కొందరు దొంగలు అటువైపు వచ్చారు. రామేచ్ఛ వల్ల వాళ్ళు దొంగిలించిన వస్తువులు మోయడానికి ఉపయోగపడతానని నన్నూ వాళ్ళతో లాక్కుపోయారు. రామేచ్ఛ వల్ల మీ భటులు వారిని తరుముకుంటూ అటు వచ్చారు. రామేచ్ఛ వల్ల వాళ్ళు పారిపోయారు. రామేచ్ఛ వల్ల నేను పట్టుబడ్డాను. రామేచ్ఛ వల్ల నన్ను మీరు రాత్రి చెరసాలలో ఉంచారు. రామేచ్ఛ వల్ల నన్ను ఇప్పుడు మీ ముందు హాజరు పరిచారు' అని

అంటాడు. అదంతా విని రాజు అతడు నిజమైన భక్తుడని ఏ విషయాన్నీ దాచకుండా ఉన్నది ఉన్నట్లు చెప్పాడని తెలుసుకొని అతడిని విడుదల చేస్తాడు. అప్పుడు ఆ సాలీయుడు 'రామేచ్ఛ వల్ల నేను విడుదల చేయబడ్డాను' అని మిత్రులతో అంటాడు.

కర్మబంధం నుంచి విముక్తులమవ్వాలంటే...: అంతా దైవసంకల్పంమేరకే జరుగుతుందని అనవరతం భావించగలిగితే లౌకిక ప్రపంచపు సుఖదుఃఖాలు మనల్ని ప్రభావితం చేయలేవు. అలా కాకుండా మంచి జరిగినప్పుడు మనగొప్పనుకుంటూ, చెడు జరిగినప్పుడు భగవంతుడిని నిందించడం ఈ శరణాగత ధర్మం సరిగ్గా అవగతం కాకపోవడం వలన కలిగే పరిణామం. కథలోని సాలెవానికి ఇది మంచి, ఇది చెడు అన్న భావన లేదు. అన్నీ సర్వేశ్వరుడి సంకల్పంమేరకే జరుగుతున్నాయని త్రికరణ శుద్ధిగా నమ్మినవాడు కాన దొంగలు వస్తువుల్ని మోయడానికి లాక్కుపోయినప్పుడు, భటులు పట్టుకొని చెరసాలకు ఈడ్చినపుడు కూడా కష్టానికి లోనుకాలేదు.

ఇలాంటి శరణాగతి రావాలంటే మనకు చాలా నిస్సంగబుద్ధి అలవడాలి. మంచి చెడుల భావన నుంచి అతీతంగా వెళ్ళాలి. మనం కర్మబంధం నుంచి తప్పించుకోవాలంటే మంచికర్మలను చేయడానికి ఉద్యుక్తులమవ్వాలి. ఏవి సుకర్మలు? అని మనకు సందేహం రావచ్చు. మనిషిని ముక్తివైపుకు నడిపించేవి, జననమరణ చక్రం నుంచి బయటపడడానికి ఉపకరించేవి సుకర్మలు. అంటే సత్కర్మాచరణ మంచి ఫలాన్ని, చెడు కృత్యాలు చెడు ఫలాలను ఇస్తాయని తెలుసుకొని సదా అప్రమత్తులుగా ఉంటూ చెడు కర్మలకు, స్వార్థపూరిత కర్మలకు దూరంగా ఉండాలి. గౌతమ బుద్ధుడు అందుకే దైవం గురించి మాట్లాడలేదు. సదా వ్యక్తిని పురుషప్రయత్నంలో ఉండమన్నాడు. అంటే స్వశక్తిని నమ్ముకొని, పూర్తి ఎరుకతో మంచికార్యాలను చేయడమందు మనోశరీరాలను లగ్నం చేసినప్పుడు క్రమేణా శరణాగత భావంతో భక్తుడు పొందే సాక్షి భావనలో నెలకొనడానికి, కర్మపాశం నుంచి విడివడడానికి వీలుంటుంది.

ఆ మూడూ ఒక్కటే : సంపూర్ణ శరణాగతి, దైవకృప, పురుష ప్రయత్నం... మూడూ ఒక్కటే. స్వామి వివేకానంద చెప్పిన 'నీ కర్మకు నీవే బాధ్యుడవు' (పురుష ప్రయత్నం) లేదా శ్రీరామకృష్ణులు బోధించిన 'అంతా భగవదిచ్ఛ' (శరణాగతి), 'దైవకృపతోనే ఏదైనా సాధ్యం' – ఈ బోధనలకు వ్యత్యాసం లేదు. నిజానికి పూర్తిగా మనల్ని మనం భగవత్సంకల్పానికి సమర్పించుకోవడానికి చాలా శక్తి, పురుషప్రయత్నం అవసరం. బలహీనులు, అజితేంద్రియులు, అపవిత్రులు, స్వార్థపరులు తమ సంకల్పాన్ని భగవంతుడి సంకల్పంతో మమేకం చేయలేరు. అంతా దైవేచ్ఛ మేరకే జరుగుతుందని భావించి అన్ని పరిస్థితులలోనూ ఒకేరకంగా ప్రతిస్పందించగలగాలంటే మనం అందరిలోనూ, అంతటా భగవంతుడిని చూడగలగాలి. అంటే దైవస్మరణ నిరంతరం చేయాలి. ఇక్కడ మళ్ళీ ప్రయత్నం అవసరమవుతున్నది.

యోగవాసిష్ఠంలో కూడా ఈ విషయం స్పష్టంగా చెప్పబడింది. వసిష్ఠమహర్షి రాముడికి ఉద్బోధిస్తూ **విశ్వామిత్రేణ మునినా దైవముత్సృజ్య దూరతః పౌరుషేణైవ సంప్రాప్తం బ్రహ్మణ్యం! రామ! నాన్యథా...** దైవాన్ని ప్రక్కన పెట్టి, పురుషప్రయత్నం, స్వీయ కృషితోనే విశ్వామిత్రుడు బ్రహ్మర్షి అయ్యాడు అంటాడు. అంటే విశ్వామిత్రుడి విషయంలో దైవకృప పురుషప్రయత్నం రూపేణ వ్యక్తమైనదని అర్థం. పురుషప్రయత్నమే దైవకృప. ఒక వ్యక్తి లక్ష్యందిశగా అహర్నిశలు శ్రమించగలుగుతున్నాడంటే అతడిపై దైవం తన కృపాదృష్టిని ప్రసరించినట్లే! మనం సర్వం భగవదభీష్టం మేరకే జరుగుతున్నదనుకొని ఉపేక్ష భావంతో ఉండడం తేలికను కుంటాం. అలా అనుకొని కర్మను త్యజించడం చాలా సులువైన విషయం అని భావిస్తాం. అది అంత తేలికైన విషయం కాదు. మనసు మనల్ని అలా కూర్చోనివ్వదు. అలాంటి సంకల్పం బద్ధకానికీ, అలసత్వానికీ, అధిక దుఃఖానికీ దారితీస్తుంది.

కాబట్టి సతతం మనల్ని మనం సత్కర్మలలో నియోగించు కుంటూ, నిరంతరం స్వయంకృషితో, పట్టుదలతో, కార్యశూరత్వాన్ని ప్రకటించుకోవాలి తప్ప భీరువులలాగా కార్య పరిత్యాగానికి సిద్ధపడకూడదు. ఫలితంపై దృష్టి లేకుండా సదా కర్తవ్యనిర్వహణలో, విహితకర్మలను నిర్వర్తించడంలో నిమగ్నమవడమే దైవకృప లేదా దైవసంకల్పం లేదా శరణాగతి. ఇలాంటి అవగాహన మన మనసులో స్థిరపడేవరకు మన కర్మలకు మనమే బాధ్యులం. ❖

భారతీయులు భుజించినా, నిద్రించినా, నడచినా, ఏపని చేసినా అందులో భగవద్భక్తి ఇమిడి ఉంటుంది. ఈ జాతి ప్రాణం ఆధ్యాత్మికతయే అని దీనివల్ల తేటతెల్లమౌతుంది. - స్వామి వివేకానంద

మనలో నిద్రాణమై ఉండి మనం ఆజ్ఞాపించినంతనే బయటకు వచ్చి మనకు విజయం చేకూర్చే యోధానుయోధు డెవ్వరు? అతడు మనల్ని నిరంతరం విజయమార్గాన ఎలా నడుపుతాడు? ఆ యోధుడే 'విశ్వాసం'. ఆ యోధుడి సహకారం లేనిదే ఒక్క అడుగు కూడా ముందుకు పడదు. పసిపిల్లల నుంచి వ్యోమగాములవరకూ ప్రతి ఒక్కరి గమనంలోనూ ఈ విశ్వాసమే నిక్షిప్తమై ఉంటుంది.

విశ్వాసం... విశ్వాసం విశ్వాసం

– బ్రహ్మచారి రవి

ఏ పనైనా నేను చేయగలను అన్న ఆత్మవిశ్వాసం కారుకు బ్యాటరీ లాంటిది. ఇదే ఇంధన శక్తిని జనింపజేస్తుంది. ఏ పనిని ప్రారంభించాలన్నా బలాన్ని ఇస్తుంది. ఈ ప్రపంచంలో పుట్టిన ప్రతి మానవుడూ చిన్నా, పెద్దా అన్న తేడా లేకుండా ఏదో సాధించాలనీ, విజయ శిఖరాలను చేరుకోవాలనీ తహతహలాడు తుంటారు. అయితే జీవితంలో ఎవరు ఉన్నతంగా ఎదిగి విజయ శిఖరాలను అధిరోహిస్తారు? విశ్వాసం కలవారు జీవన సోపానంలో పైకి ఎదుగుతారు. గతం... వర్తమానం... ఎలా ఉన్నా భవిష్యత్తు దివ్యంగా ఉంటుందని విశ్వసించిన వారు అగ్రపథాన నిలుస్తారు. ఏ రంగంలోనైనా విజయం సాధించిన వారిని పలకరించి కాసేపు మాట్లాడి చూడండి. వారిపై వారికి ఎంతో విశ్వాసం ఉందన్న వాస్తవం బోధపడుతుంది.

జీవితం ఓ పోరాటం. నిత్యం సమస్యలతో, ప్రతికూల పరిస్థి తులతో సమరం. ఇది బాధాకరంకాదు. ఇదే జీవనమార్గం. వీటిని ఎవరైతే సమర్థంగా ఎదుర్కొంటారో వారే విజయసారథులు.

విశ్వాసమే ఇంధనం : ప్రసిద్ధ రచయిత చార్లెస్ డికెన్స్ స్కూల్‌కు వెళ్ళలేదు. ఊహ తెలిసేనాటికి తండ్రి అప్పులపాలై డబ్బు చెల్లించనందుకు చెరసాలలో బంధించబడ్డాడు. మరో దారి లేక డికెన్స్ చిన్న పనిలో చేరాడు. ముక్కి వాసన కొడుతూ ఊపిరాడని గోడౌన్లో బాటిళ్ళకు లేబుల్స్ అంటించడం డికెన్స్ పని. అయితే, ఎప్పటికైనా తను మంచి రచయితను కావాలన్నది ఆయన అభీష్టం. ఏదిఏమైనా సరే తను రచయితను కాగలనన్నది ఆయన దృఢవిశ్వాసం. ఆ విశ్వాసమే ఆయన్ని ముందుకు నడిపించింది.

గోడౌన్లో పనిచేస్తూనే రచనలు చేస్తూ, వాటిని ప్రచురణ సంస్థలకు పంపేవాడు. డికెన్స్ మొదట రాసిన తన రచనను ప్రచురణ నిమిత్తం ప్రచురణ సంస్థకు పంపించాడు. అయితే తన రచన ప్రచురణార్హంకాదని తిరిగి పంపించారు. ఇలా ఎన్నోసార్లు జరిగింది. డికెన్స్ ఏమాత్రం నిరాశపడలేదు. మరింత కసితో, కృషితో తన రచనలను కొనసాగించాడు.

ప్రతికూల పరిస్థితులను అధిగమించి, అచంచల విశ్వాసంతో ఎవరైతే ముందుకు సాగుతారో వారే విజయం సాధిస్తారు. డికెన్స్ విషయంలో ఇది రుజువైంది. చాలా కాలానికి అతని కల ఫలించి తన రచన ప్రచురితమైంది. దీంతో తన రచనల పరంపర మొదలైంది. డికెన్స్ ప్రపంచ ప్రసిద్ధ రచయితగా పేరు ప్రఖ్యాతులు పొందాడు. ఆయన రాసిన 'గ్రేట్ ఎక్స్‌పెక్టేషన్స్, ది టేల్ ఆఫ్ ట్విన్ సిటీస్' తదితర గ్రంథాలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. డికెన్స్ ప్రసిద్ధ రచయితగా నీరాజనాలందుకున్నారు, అద్భుత రచయితగా ప్రపంచం యావత్తూ బ్రహ్మరథం పట్టింది.

స్వామీజీ స్వీయ అనుభవం: స్వామి వివేకానంద అత్యున్నతమైన ఆధ్యాత్మికవేత్తగా, మహోన్నతమైన వ్యక్తిగా ఎదగడానికి ఈ విశ్వాసం అనే మహామంత్రం ఏ విధంగా సహాయకారి అయ్యిందో ఆయన మాటల్లోనే...

"మనిషికి, మనిషికి మధ్యగల భేదం విశ్వాసంలో ఉన్న భేదమే తప్ప మరేమీ కాదు. ఒక వ్యక్తిని ఉన్నతుని గాను, మరొకర్ని దుర్బలుని గానూ, అధముని గానూ చేసేది ఈ విశ్వాసమే! మానవ చరిత్రను పరికిస్తే; ఉన్నతులైన స్త్రీ పురుషుల జీవితాల్లో అన్నిటికంటే ఎక్కువగా సామర్థ్యాన్ని ఇచ్చిన మూల శక్తి వారి ఆత్మవిశ్వాసమే. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకొనగలిగితే మనకున్న దుఃఖాలు, రుగ్మతలు చాలావరకు సమసిపోతాయి. ఈ విషయం స్వీయ జీవితంలో నాకు అనుభవానికి వచ్చింది."

'ఓ ధీరయువకులారా! మీరందరూ మహత్కార్యాలు సాధించడానికై జన్మించారనే విశ్వాసాన్ని కలిగి ఉండండి. విశ్వాసం! విశ్వాసం! విశ్వాసం! మనపై మనకు విశ్వాసం!! ఇదే ఉన్నతికి మార్గం'. ఇదే యువనాయకుడు స్వామి వివేకానంద యువతకు ఇచ్చే సందేశం. ❖

యువవాణి

– స్వామి పరిజ్ఞేయానంద

ఎం. వెంకట్, రాజమండ్రి

ప్రశ్న: నేను డిగ్రీ పూర్తిచేసిన తరువాత సంవత్సరం పాటు కష్టపడి చదివి పోటీ పరీక్షలు రాశాను. కానీ ఫలితం దక్కలేదు. 'ఒక్క సంవత్సరంలో ప్రభుత్వ ఉద్యోగం సంపాదించి నేనేమిటో నిరూపించుకుంటాను' అని నా స్నేహితులతో, బంధువులతో సవాలు చేశాను. ఇప్పుడు నా మాట నెరవేరనందుకు మానసికంగా కుంగిపోతున్నాను. కుటుంబం ఆర్థికంగా చాలా ఇబ్బందుల్లో ఉంది. మా కుటుంబానికి ఎలా సహాయపడాలో, పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే ఏం చేయాలో సలహా ఇవ్వండి.

జవాబు: మహాభారతంలోని ఉత్తర కుమారుడిలాగ ప్రగల్భాలు పలకడం మీరు చేసిన పొరపాటు. 'గర్జించే మేఘాలు వర్షించవు' అనేది లోకోక్తి. మన శక్తిసామర్థ్యాలు అంచనా వేయకుండా, పరిస్థితులను అర్థం చేసుకోకుండా అనవసరంగా మాట్లాడడం, బీరాలు పలకడం, డంబం చూపడం అపరిపక్వతకు నిదర్శనం.

సాగర కెరటమే స్ఫూర్తి

'మన దేశంలో నిరుద్యోగుల్లో అధికశాతం విద్యావంతులే!' అని ఈ మధ్య ఓ సర్వేలో తేలింది. అందుకు ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వాలు పథకాలను రూపొందించడం లేదన్నది ఒక వాదన. ఆ సంగతి ఎలా ఉన్నా, చదువుకున్నవారే నిరుద్యోగులుగా ఎందుకు మిగిలిపోతున్నారు? చదువులేనివారు ఏదో ఒక పనిచేసుకుంటూ జీవితాన్ని సాగిస్తున్నారు. చదువుకున్నవారు మాత్రం తమ చదువుకు తగ్గ ఉద్యోగం కోసం నిరీక్షిస్తూ సమయాన్నీ, వచ్చిన అవకాశాల్నీ వృథా చేసుకుంటున్నారు. తాత్కాలికంగానైనా ఏదో ఒక ఉద్యోగం చేయడానికి సుముఖంగా లేరు. 'జీవనభృతి కోసం నిజాయతీగా ఏదో ఒక పని చేస్తూ ఆత్మగౌరవంతో జీవించడానికి నామోషీ ఎందుకు?' అనే ఆలోచన రావాలి.

'మనం కష్టపడి పనిచేస్తే భగవంతుడు మనకు సహాయం చేస్తాడు. కానీ భగవంతుడు మన తరఫున పనిచేయడు' అని ఓ తత్త్వవేత్త అంటాడు. పి.జి. చేసిన ఒక యువకుడికి విద్యార్హతకు తగిన ఉద్యోగం ఎంత ప్రయత్నించినా రాలేదు. అప్పుడు అతడు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి తోపుడు బండిలో కూరగాయలు అమ్మడం ప్రారంభించాడు. కొన్నాళ్ళకు వ్యాన్ కొని కూరగాయలు అమ్మేవాడు. ఇప్పుడు ఒక డిపార్ట్‌మెంటల్ స్టోర్‌ని ప్రారంభించి నెలకు సుమారు లక్ష రూపాయల వరకు సంపాదిస్తున్నాడు. సంపాదించాలంటే కేవలం ఉద్యోగంపైనే ఆధారపడనవసరం లేదని నిరూపించాడు. అలాగని, అందరూ కూరగాయలు అమ్ముకొని బ్రతకాలని కాదు. ఆర్థిక ఇబ్బందుల నుండి బయటపడడానికి ఏదో ఒక పని చేయడం నామోషీగా భావించకూడదన్నదే ఈ ఉదాహరణ ఉద్దేశం.

'జీవితంలో మనం ఇష్టపడేది లభించకపోవచ్చు, కానీ లభించేదాన్ని ఇష్టపడాలి' అనే ఈ జీవన సూత్రాన్ని అర్థం చేసుకొంటే మనం ఏ పని చేస్తున్నా ఇష్టపడి చేయగలుగుతాం. ఆ తరువాత పరిస్థితులే మనకు అన్నివిధాల సహకరిస్తాయి. కాబట్టి ప్రస్తుతం మీరు చేయాల్సింది, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మీ కుటుంబానికి అండగా ఉండడం కోసం ఏదో ఒక ఉద్యోగంలో చేరడం.

ఒకసారి ఓ వ్యక్తి సోక్రటీస్‌ను 'మీరు ఎల్లప్పుడూ సంతోషంగా ఉండడానికి కారణమేమిటి?' అని ప్రశ్నించాడు. అందుకు సోక్రటీస్ 'మతిమరుపు' అని సమాధానమిచ్చారు. అంటే ఇతరులు మనల్ని అవమానకరంగా మాట్లాడినా, నిందించినా, విమర్శించినా గుర్తుపెట్టుకొని మథనపడకూడదని ఆయన మనోభావం.

కాబట్టి మీరు ప్రభుత్వ ఉద్యోగం సాధించలేదని మీ స్నేహితులు, బంధువులు ఏమనుకుంటారోనని బాధపడకుండా 'Learn from yesterday. Live for today. Hope for tomorrow - గతం నుండి నేర్చుకో! నేటి కోసం జీవించు! రేపటి కోసం ఆశించు!' అన్న ఐన్‌స్టీన్ మాటల్ని ఆచరిస్తూ ముందుకు సాగండి.

సాగర కెరటం లాగ పడినా పైకి లేవాలనే పట్టుదలనూ; క్రమంగా వృద్ధిచెందే చంద్రుడి లాగ ఎదగాలనే ఆశనూ; కొత్త చిగురులు తొడగడం కోసం నిరీక్షించే చెట్టు లాగ ఓర్పునూ కలిగివుండాలి. ఈ లక్షణాలన్నీ కలబోసిన 'ఇరా సింఘాల్' ఉద్యోగం చేస్తూనే ఐదేళ్ళు అవిరామకృషి చేసి ఈమధ్యే సివిల్స్‌లో మొదటి ర్యాంక్ సాధించింది. తనకు శారీరక వైకల్యమున్నా, మానసిక వైకల్యం లేదనీ; పట్టుదల, ఆశ, ఓర్పులతో కృషిచేస్తే తప్పక ఆశయం ఫలిస్తుందనీ నిరూపించింది. మరి మీరు ఒక సంవత్సరం ప్రయత్నించి పోటీ పరీక్షల్లో విఫలమైనందుకు నిరాశకు గురైతే ఎలా? మీలోని నిరాశ అనే మానసిక వైకల్యాన్ని పారద్రోలి **'ధైర్యం, సహనం, అవిరామకృషి – ఈ మూడు లక్షణాలు ఉంటే అపజయం మీ దరికి చేరదు'** అన్న స్వామి వివేకానంద హితవచనాలను స్మరిస్తూ ఆశావహదృక్పథంతో మీ ప్రయత్నాన్ని కొనసాగించండి. తప్పక లక్ష్యాన్ని సాధించగలరు. ❖

మనకు కావలసింది వేదాంతం జోడించిన పాశ్చాత్యదేశాల శాస్త్రీయ విజ్ఞానం. బ్రహ్మచర్యమే మనకు దారి చూపే దీక్షా వాక్యం కావాలి. అందుకు శ్రద్ధ, ఆత్మవిశ్వాసం జతపడాలి. - స్వామి వివేకానంద

దిద్దుబాటు

A correction

– బి. సైదులు

ఆధ్యాత్మిక, ధార్మిక ప్రసంగాలలో ప్రఖ్యాతిగాంచిన ఓ ప్రముఖవక్త ఆ రంగంలో ఎందరో అభిమానుల్ని చూరగొన్నారు. ఆదర్శజీవితాన్ని గడుపుతూ, నిస్వార్థంగా తన భక్తి, జ్ఞానాల్ని పంచుతూ ఉంటారు. వారిని పరమగురువుగా భావించి ఎందరో తమ గౌరవాభిమానాల్ని చాటుకుంటూ ఉంటారు. అయితే ఆ ప్రముఖుడు తనకు లభిస్తున్న ఆ ఆదరాభిమానాలను, కీర్తిప్రతిష్ఠలను అంత పట్టించుకోరు. పైగా తనను తాను నిష్పక్షపాతంగా విశ్లేషించుకునే ప్రయత్నం చేస్తూ ఉంటారు. ఆ ప్రక్రియలో భాగంగా వారు తనకు గురువులాంటి ఓ వ్యక్తిని ఎంపిక చేసుకొని, 'అయ్యా! నన్ను ఆకాశానికి ఎత్తేవాళ్ళు, నా ప్రతిభను, ప్రసంగాల్ని అద్భుతమని అభినందించే వాళ్ళు వేలాదిమంది ఉన్నారు. నాకు ఆ వింజామరల్లాంటి వ్యాఖ్యలు అక్కరలేదు. సభాప్రసంగాల్లో నేను చేస్తున్న పొరపాట్లు, నా తడబాట్లు ఎత్తిచూపేవారే ఇప్పుడు నాకు కావాలి. అందుకు మిమ్మల్ని ఎంచుకున్నాను. మీరు నా గురించి ఒక్కటి కూడా మెచ్చుకోలు మాటలు చెప్పకండి; నాలోని లోపాల్ని మాత్రం నిర్మొహమాటంగా ఎత్తిచూపితే చాలు. అదే నాకు పదివేలు!' అని విన్నవించుకున్నారు.

ఆ నిబంధనను అనుసరించి వారంలో ఏదో ఒకరోజు విధిగా వారు ఒంటరిగా ఆ పెద్దాయన దగ్గరకు వెళతారు. తాను చేస్తున్న తప్పులేంటో తెలుసుకుంటారు; లోపాల్ని సరిదిద్దుకుంటారు. భవిష్యత్తులో అవి పునరావృతం కాకుండా చూసుకుంటారు. అంత స్థాయికి వచ్చాక కూడా, తనను తాను సవరించుకోవడం కోసం వారు పడుతున్న తపన మనందరికీ అనుసరణీయమే! అయితే దురదృష్టవశాత్తూ మనం ఒక స్థాయికి వచ్చాక, ఇక మేము సవరించుకునేది ఏముంటుందన్న అహంభావంతో, ఆత్మపరిశీలన అన్న విషయాన్నే మరచిపోతాం. దిద్దుబాటన్నదే అవసరం లేదనుకుంటూ, ఎక్కడో ఓ దగ్గర అవమానాల పాలవుతాం!

మెరుగులతోనే మెరుపులు... : యవ్వనపు తొలివేకువలోనో, అభివృద్ధి తొలిపథంలోనో మన తప్పటడుగులను ఎవరో ఒకరు నిస్సంశయంగా ఎత్తిచూపుతారు. కాని ఒక స్థాయికి చేరుకున్నాక, ఎవరూ అంత చొరవ తీసుకొని మనల్ని సరిదిద్దే ప్రయత్నం చేయరు. చాటుమాటున చెవులు కొరుక్కుంటారే తప్ప, చనువుగా మనతో చర్చించరు. అందుకే ఎవరికి వారే తమను తాము విశ్లేషించుకుంటూ, తమకు అద్దంలా ఉపయోగపడే పరిశీలనా పద్ధతి కోసం ప్రయత్నం చేయాలి. అలాంటి స్వయం సవరణ (self-correction) లేనట్లయితే ఎప్పుడో ఒకప్పుడు ఘోరమైన పరాభవాలను ఎదుర్కోకతప్పదు. ఇలాంటి సవరణ చర్యలు లేకే విపరీత చర్యలకు పాల్పడిన రావణాసురుడిని ఉద్దేశించి, కుంభకర్ణుడు 'అన్నా! ఈ స్థాయిలో నీకు ఎవరూ ఎదురుచెప్పరు. పైగా ఈ మందీమార్బలమంతా నీకు ప్రియమైందే చెబుతారు; కానీ హితమైంది చెప్పరు! అందువల్ల ప్రయత్నపూర్వకంగా నీవు హితమైన మాటల వైపే మొగ్గుచూపాలి. నిన్ను నీవు సరిదిద్దుకోవాలి!' అని హితవు పలుకుతాడు. కానీ అహంకారి అయిన ఆ లంకాధీశుడు, తన సోదరుడి సరిదిద్దే సలహాకు ససేమిరా అన్నాడు. తన వినాశం తనే కొనితెచ్చుకున్నాడు.

మన మనస్సు కూడా చాలాసార్లు ఎదుటివారు ఏ కాస్త సవరించడానికి ప్రయత్నం చేసినా అహంభావంతో గింజుకుంటుంది. కానీ తాత్కాలికంగా అలాంటి దిద్దుబాట్లు మనల్ని కాస్త ఇబ్బంది పెట్టినట్లు అనిపించినా, దీర్ఘకాలంలో అవి మన పురోగతికి కారణమవుతాయనీ, ఆ మెరుగులే మన జీవితంలో మెరుపుల్ని తెస్తాయనీ మరచిపోకూడదు. అందుకే నీ జీవితాన్ని శ్రేయోమార్గం వైపు నడిపే దేనినైనా ఎలాంటి భేషజం లేకుండా వెంటనే అంగీకరించమన్న భావంతో స్వామి వివేకానంద Accept the beneficial... అంటారు.

దిద్దుకోవడమే ధీరత్వం...: సమాజంలో సుస్థిరమైన విజయాలను సాధించేవారు, తమను తాము అన్ని కోణాల్లో నిర్దుష్టంగా ఉంచుకునేందుకు తపిస్తూ ఉంటారు. తమను సంస్కరించుకునేందుకు ఎక్కడ ఏ అవకాశం లభించినా వదిలి పెట్టరు. ఒక ఆశ్రమంలో ఓ వరిష్ఠసాధువు ఉండేవారు. ఒకసారి వారు సాయంత్రం అలా వాహ్యాళిగా నడుస్తుండగా, కొత్తగా చేరిన బ్రహ్మచారి ఒకరు ఎవరితోనో కబుర్లు చెబుతూ నిలబడడం గమనించారు. వెంటనే ఆ సాధువు 'సాయం సమయంలో విధిగా జపం, ధ్యానం చేసుకోవాలి. ఇలా బయట మాట్లాడకూడదు!' అని చెప్పారు. వెంటనే ఆ బ్రహ్మచారి గదిలోకి వెళ్ళిపోయాడు.

తరువాత కొన్నాళ్ళకు ఆ సాధువు, అదే సమయంలో బయట ఎవరో అతిథితో మాట్లాడుతూ ఉండడం ఆ బ్రహ్మచారి చూసాడు. వెంటనే ఆ బ్రహ్మచారి, 'స్వామీజీ! మరి మీరు కూడా జపధ్యానాలు చేయాల్సిన సమయంలో ఇలా బయట మాట్లాడుతూ ఉన్నారేంటి?' అని ప్రశ్నించాడు. ఆ సాధువరేణ్యులు ఆ బ్రహ్మచారితో 'నువ్వేంటి! నాకు సుద్దులు చెప్పేది!' అనలేదు. పైగా ఆ బ్రహ్మచారి మాటతో ఏకీభవిస్తూ 'అవును! నువ్వు చెప్పింది నిజమే!' అంటూ వెంటనే గదిలోకి వెళ్ళిపోయారు. అప్పటి నుంచి ఆ సాధువు ఏ ఒక్కరోజు కూడా సాయంవేళలో ఇతరులతో మాట్లాడలేదు. అదీ దిద్దుబాటులో ధీరోదాత్తత అంటే!

అందుకే ఆంగ్లమేధావి సర్ విలియమ్ జోన్స్ 'Never neglect an opportunity for self-correction in our improvement – మన ఎదుగుదలలో భాగంగా మనను సవరించుకునే అవకాశాలు ఏవైపు నుంచి వచ్చినా, ఎప్పుడూ వదులుకోకూడదు' అని అంటారు.

ఎవరు చెప్పినా ఏకీభవించాలి...: ఉన్నత స్థానాల్లో ఉన్న చాలామంది వ్యక్తులు ఆత్మవిమర్శకు, ఆత్మవిశ్లేషణకు అంత ప్రాధాన్యం ఇవ్వరు. తమ ప్రవర్తనలో, వ్యవహారాల్లో ఎలాంటి లోపాలు, దోషాలు ఉండవనే భ్రమపడతారు. కానీ ఈ నిర్లక్ష్యధోరణే వారిని మరుగుజ్జు మొక్కల్లా మార్చేస్తుంది. అందుకే పూర్వకాలంలో మహారాజులు, చక్రవర్తులు కూడా తమ పాలనను, ప్రవర్తనను సమీక్షించుకునేందుకు విధిగా మహర్షుల వద్దకో, కులగురువుల వద్దకో వెళ్ళేవారు. ఎలాంటి పక్షపాతం లేకుండా, సాక్షిలా తమను పరిశీలించి, తమ తప్పొప్పులను సమీక్షిస్తారన్న నమ్మకంతో వారిని ఆశ్రయించి సూచనలను స్వీకరించేవారు. చివరకు మారువేషాల్లో వెళ్ళి, సామాన్య ప్రజల అభిప్రాయాలను కూడా తెలుసుకొని, తమ పాలనను విశ్లేషించుకుంటూ, తమ లోపాలను సరిదిద్దుకునేవారు! అందుకే మనుస్మృతి '**శ్రద్ధదానశ్శుభాం విద్యాం ఆదదీత అవరాదపి, అంత్యాదపి పరం ధర్మం** – అంత్యజులు అనుకుంటున్నవారి వద్ద నుంచి సైతం గొప్ప ఆలోచనలు నేర్చుకోండి. ఎంత చండాలుడి నుంచైనా గొప్ప విలువలు ఆదర్శనీయమైతే స్వీకరించండ'ని సూచిస్తుంది.

అయితే ఈ రోజుల్లో మనకు అలాంటి విశాలహృదయాలు కొరవడుతున్నాయి. నేడు చిన్నపిల్లలు కూడా తమను ఎవరైనా సవరిస్తూంటే సహించలేకపోతున్నారు. చిన్నబుచ్చుకోవడమో, చిర్రుబుర్రులాడడమో సర్వసాధారణమైపోయింది. యువతరం సంగతి ఇక చెప్పనక్కరలేదు! ఈ తరం యువతీయువకులు మేధస్సులో మెరికల్లా ఎదుగుతున్నారు. యుక్తవయస్సులోనే ఉన్నతస్థానాలను అధిరోహిస్తున్నారు. కానీ వారు జీవితాను భవంలో నలగకపోవడం వలన వ్యవహార జ్ఞానంలో, సామాజిక కోణంలో ఘోరంగా విఫలమవుతున్నారు. చాలా విషయాల్లో తాము ఇంకా నేర్చుకోవలసింది ఎంతో ఉందన్న సంగతే విస్మరిస్తున్నారు. ఉన్నతచదువులు చదివి ఓ అధికారి అయినంత మాత్రాన, అతను అన్ని విషయాల్లోనూ నూటికి నూరుపాళ్ళు 'పర్‌ఫెక్ట్' అనుకోవడం, తప్పటడుగులు వేయననుకోవడం అవివేకం. ఉదాహరణకు ఒక వ్యక్తి సాఫ్ట్‌వేర్ సంస్థాధినేత అయినా సామాన్యగృహ వ్యవహారాల్లో సాధారణ పరిజ్ఞానం కూడా లేకపోవచ్చు. అక్కడ భాగస్వామో, బిడ్డలో సలహాలిచ్చి, సరిచేసినప్పుడు అంగీకరిస్తే తన పరువేమీ పోదు. పైగా హుందాతనం నిలబడుతుంది.

మలచుకునే మార్గాలెన్నో....: మన ముఖం మనకు కనబడనట్లే, మన ప్రవర్తనలో ముడతలూ మనకు కనిపించవు. ముఖానికి మెరుగులు దిద్దుకోవాలంటే అద్దం ఎలాగో, మనలో మంచిమార్పు రావాలంటే ఆత్మవిమర్శ అలాగే! అలా ఆత్మవిశ్లేషణతో మనల్ని మనం మలచుకునే మార్గాలెన్నో!

ఓ చక్కని పుస్తకం కావచ్చు, చక్కదిద్దే సద్గురువు ప్రసంగం కావచ్చు, చనువుతో చెప్పే మంచిమిత్రుడి మాట కావచ్చు! ఇలా ఏదో ఒక రూపంలో మనం దిద్దుబాటుకు సిద్ధపడితే, మనలోని లోపాల్ని సవరించుకుంటే మన వ్యక్తిత్వం పుటం పెట్టిన స్వర్ణంలా వెలుగులీనుతుంది.

అందుకే ఎడ్వర్డ్ బుల్వర్ లిట్టన్ అనే పాశ్చాత్య వ్యక్తిత్వ వికాస నిపుణులు 'Remedy your deficiencies, and your merits will take care of themselves – మీ లోపాల్ని మీరు సవరించుకుంటే, మీలో ప్రతిభాసంపత్తులు వాటికవే శోభిస్తాయి' అని అంటారు. అలా కాకుండా, అందగాన్ని నేను దర్పణం చూసుకునేదేంటని దర్పానికి పోతే, ముఖంలో మరకలు మరకలుగానే మిగిలిపోతాయి. అలాగే, అన్నీ తెలిసినవాణ్ణి, ఒకరు చెబితే నేను దిద్దుకునేదేంటని అహానికి పోతే మనలో పరివర్తన ఎన్నటికీ రాదు. చేసిన తప్పులే మళ్ళీ చేస్తూ అందరిలో నవ్వులపాలవుతాం! ❖

భారతదేశంలో ప్రతివాడూ నాయకుడు కావాలనే ఆశిస్తుంటాడు. సేవకుడిగా ఉండటానికి ఎవ్వరూ ఇచ్ఛగించరు. శాసించడానికి ముందు సేవకుడిగా ఉండటం నేర్చుకోవాలి. - స్వామి వివేకానంద



కష్టాలతో 'కుస్తీ' పట్టి...

– ఆనంద్

ఓ వైపు వైకల్యం...మరోవైపు పేదరికం... కన్నతల్లి అనారోగ్యం... ఆ యువకుడి ఆశలను, ఆశయాలను అంధకార బంధురం చేశాయి. కానీ అచంచల ఆత్మవిశ్వాసం, అవిశ్రాంత పోరాటం అతనిని క్రీడాప్రపంచంలో తళుకులీనే తారను చేశాయి. ఇరవై ఆరేళ్ళ ఈ ఆంథోని రాబెల్స్ జీవితాన్ని చదివినప్పుడల్లా స్వామి వివేకానంద ఉద్ఘాటించిన '*Pull yourself out of difficulties by yourself. There is none to help you- never was.* – కష్టాలను, కడగండ్లను స్వశక్తితోనే అధిగమించు; నీకు సాయపడేవారెవ్వరూ, ఎప్పుడూ లేరు' అన్న మాటలే మనస్సులో మెదులుతాయి.

ఒకే కాలుతో పుట్టిన ఆంథోని బాల్యం నుంచే ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నాడు. యుక్తవయస్సుకు రాగానే ఒంటికాలితోనే చరిత్రను సృష్టించాడు. తండ్రితో సహా అయినవారందరూ అతనిని మానసికంగా, శారీరకంగా వెలివేసినా, కన్నతల్లి సాయంతో, ఆమె కన్న కలల్ని నిజం చేశాడు; కీర్తిశిఖరాలను అధిరోహించాడు.

ఆదిలోనే 'హింస'పాదం...: ఆంథోనికి కృత్రిమపాదం (ప్రోస్థెటిక్ లెగ్) అమర్చి, అలాగైనా కొడుకు వేసే బుడిబుడి అడుగులకు మురిసిపోవాలని తల్లి జ్యూడి తపించింది. కానీ పసివయసులో బరువైన ఆ లోహపాదం ఆంథోనికి ఎంతో బాధకలిగించేది. దానిని ధరించి నడవడం ఆయనకు హింసగా అనిపించి, దానిని విసిరేస్తూ ఉండేవాడు. తోటిమిత్రులు రెండుకాళ్ళతో హుషారుగా పరుగులు తీస్తూ ఉంటే, ఆంథోని లోలోన కుమిలిపోతూ ఉండేవాడు. అప్పుడు ఆ తల్లి జ్యూడి 'బాబూ! భగవంతుడు నీకు ఒక కాలు లేకుండా చేశాడంటే, బాధించే ఆ శాపం వెనుక బలమైన వరమేదో ఉంటుంది, గుర్తించు!' అనేది. ఆ మాటలే ఆంథోని జీవితాన్ని మలుపుతిప్పాయి. మనస్సులో పట్టుదలను పెంచాయి. అదే స్థైర్యంతో పది, పన్నెండేళ్ళ వయస్సు నుంచి శారీరక వ్యాయామం వైపు దృష్టి మరల్చాడు. అంగవైకల్యాన్ని అధిగమించి పాఠశాల స్థాయి నుంచే వ్యాయామపోటీల్లో పాల్గొనడం ప్రారంభించాడు.

కుస్తీపోటీలపై ఆసక్తి....: ఒకసారి తమ బంధువుల్లో కొందరు యువకులు కుస్తీ పోటీలకు సంబంధించిన వ్యాయామాలు చేస్తూ ఉండడం ఆంథోని దృష్టిలో పడింది. అప్పటి నుంచి ఎలాగైనా తానూ కుస్తీపోటీల్లో పాల్గొనాలని ఆయనకు అనిపించింది. ఒక్క కాలుపైనే దేహభారమంతా వేస్తూ, కుస్తీ పట్టడం అంత సులువైన విషయమేమీ కాదని తెలిసినా, ఆంథోని పట్టువిడువలేదు. సాధారణ యువకులు గంట సేపు సాధన చేస్తే, అతను నాలుగు గంటలు చేసేవాడు. చివరకు అదే శ్రమతో, సాధనతో పాఠశాల స్థాయిలో కుస్తీపోటీల్లో మిత్రులందరినీ ఓడించి ఆంథోని ఛాంపియన్‌గా నిలిచాడు. ఆ ఉత్సాహంతో ఆంథోని విజయ పరంపర కళాశాల స్థాయిలోనూ కొనసాగింది.

సాహసం వెంటే సవాలు...: సాహసాలు చేసేవారికే సవాళ్ళు విసరడం కాలానికి సరదా! విధిరాతనే మార్చుకుంటున్న ఆంథోని జీవితంలోనూ ఈ సవాళ్ళు ముప్పేటలా ముసురుకున్నాయి. తన ఉత్సాహానికి ఊపిరిగా నిలిచిన కన్నతల్లి దీర్ఘవ్యాధితో మంచానపడడం, కుటుంబం ఆర్థికంగా చితికిపోవడం, బంధువులంతా అవకాశవాదులుగా మారడం అతనిని కుంగతీశాయి. ఓ క్షణంలో ఆంథోనికి తన మనసైన క్రీడను వదిలేసి, ఏదో చిన్న ఉద్యోగంలో స్థిరపడాలన్న తలంపు కూడా వచ్చింది. కానీ మాతృమూర్తి జ్యూడి అంత బాధలోనూ కొడుకుకు అండగా నిలిచింది. చివరివరకూ ప్రోత్సహిస్తూనే ఉంది.

మాతృమూర్తి ఇచ్చిన ప్రోత్సాహంతోనే ఆంథోని జాతీయస్థాయి కుస్తీపోటీల్లో పాలుపంచుకున్నాడు. కష్టాలన్నీ దిగమింగుకుంటూ, రాత్రీపగలు శ్రమించాడు. చివరకు సాధారణ క్రీడాకారులతో ఒంటికాలితోనే కుస్తీపోటీల్లో పాల్గొని అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేశాడు. స్వర్ణపతకాన్ని సాధించి అన్నాళ్ళు తల్లి కార్చిన కన్నీళ్ళను ఆనందబాష్పాలుగా మార్చాడు. క్రీడాప్రపంచంలో తన కీర్తిపతాకాన్ని రెపరెపలాడించాడు. విజేతలను ముందుకు నడిపించేవి కాళ్ళు కావని; కలలు, కష్టాలేనని నిరూపించాడు. ఎందరో వికలాంగులకు స్ఫూర్తిగా తన జీవిత చరిత్రను 'అన్‌స్టాపబుల్'గా అందించాడు ఆంథోని రాబెల్స్. ❖

(ఆగష్టు 29 జాతీయ క్రీడా దినోత్సవం)

ఏకనిష్ఠ... దృఢవ్రతం

- స్వామి రంగనాథానంద (రామకృష్ణసంఘం 13వ సర్వాధ్యక్షులు)

నాకు (స్వామి రంగనాథానంద) బెంగుళూరులో ఓ మిత్రుడు ఉండేవాడు. అతనికి పలు ఆధ్యాత్మిక సంఘాల్లో సభ్యత్వం ఉండేది. ఆ సంఘానికి ఓ సారి, ఈ సంఘానికి ఓ సారి వెళుతూ ఉండేవాడు. ఓ సందర్భంలో నేను అతనితో సరదాగా 'అన్ని ఆధ్యాత్మిక సంస్థల్లో ఎందుకు సభ్యత్వం తీసుకున్నావు? ఏదో ఒకదాన్ని నమ్ముకొని నిష్ఠగా ఆచరిస్తే సరిపోతుంది కదా?' అన్నాను. అప్పుడు అతను 'అయ్యో! నీకు తెలీదా! ఒక బ్యాంకు దివాలా తీస్తే, మరొక బ్యాంకు అండగా ఉంటుందన్న నమ్మకంతో ఉన్న సొమ్మును వివిధ బ్యాంకుల్లో పెడతాం కదా! అలాగే అవసరానికి ఒక దేవుడు కాకపోతే, మరొక దేవుడు ఉపయోగపడకపోతాడా! అని అన్ని ఆధ్యాత్మిక సంఘాల్లో సభ్యత్వం తీసుకున్నాను. అన్నింటినీ చుట్టి వస్తూ ఉంటాను! ఎప్పుడు ఏ దేవుడితో పని పడుతుందో ఎవరికి తెలుసు?' అన్నాడు.

మతవిశ్వాసాలకు సంబంధించి చాలామందిలో ఇదే ధోరణి కనిపిస్తుంది. మన దేశంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తున్నప్పుడు నాకు ఇలాంటి అనుభవాలు ఎన్నో ఎదురవుతున్నాయి. అపార్థాలతో కూడి, అవసరాన్ని, అవకాశాన్ని బట్టి ఆరాధించే దేవతలను కూడా మార్చేయడం చాలా మందికి ఆనవాయితీగా మారిపోయింది. ఎందరో విద్యావంతులనుకుంటున్నవారు కూడా ఇలాంటి సంకుచితమైన దృక్పథంతోనే ఆధ్యాత్మిక జీవితాన్ని గడుపుతూ ఉన్నారు. తమ పరిమితమైన పరిధిలోనే భగవంతుడిని ఇముడ్చుతున్నారు.

మనకు ఎన్నో కోరికలు! అందుకే చాలామంది ఆ కోరికలను తీర్చుకునే ప్రక్రియలో భాగంగానే దైవారాధనను కొనసాగిస్తూ ఉంటారు. తమ ఇష్టదైవాన్ని మార్చేయడానికి కూడా వెనుకాడరు. ఏదో పుస్తకంలో ఏ దేవుడి గురించో రాశారనీ, ఎవరో ఏదో చెప్పారనీ, ఆ దేవుడిని నమ్ముకుంటే అనుకున్నవన్నీ తీరుతున్నాయనీ, వెనకా ముందూ ఆలోచించకుండా తమ విశ్వాసాన్ని మార్చేసుకుంటూ ఉంటారు. ఇన్నాళ్ళూ ఇన్ని పూజలు చేస్తున్నా, నేను నమ్ముకున్న భగవంతుడు నాకేమీ చేయడం లేదని అలక పూని, తమ కులదైవం అనుకుంటున్న మూర్తిపైనే నమ్మకాన్ని కోల్పోతూ ఉంటారు. ఇలాంటి మూర్ఖత్వంతో మనం ఎన్నటికీ నిజమైన భక్తులం కాలేము. అందుకే భగవద్గీతలో శ్రీకృష్ణభగవానుడు 'భజంతే మామ్ దృఢవ్రతాః' అంటాడు. దృఢవ్రతంతో నన్ను విశ్వసించి, ఆరాధించమని ఉద్ఘాటించాడు. ఏకనిష్ఠతో ఏ రూపంలో పూజించినా, ఆ పూజలన్నీ నాకే చేరతాయని అభయమిచ్చాడు.

ఎవరైనా ఒక్కటే...: ఆధ్యాత్మిక ఉన్నతిని సాధించాలనుకునే వారు ఇలా పరమసత్యమైన భగవంతుడు ఒక్కడేనన్న విషయాన్ని మరచిపోకూడదు. ఈ పరమసత్యాన్ని విస్మరించినంత కాలం ఆధ్యాత్మిక పురోగతి సాధ్యపడదు. ఈ లోకంలో మనం ఆరాధించే వివిధ దేవీదేవతల వెనకనున్న పరబ్రహ్మం ఒక్కటే! అందుకే మన వేదాలు 'ఏకమేవ అద్వితీయమ్ బ్రహ్మ' అని ఘోషిస్తున్నాయి. అయితే మనలో ఎక్కువ మందికి ఈ అద్వైతభావం అర్థం కావడం లేదు. తమ సంకుచితమైన, సాధారణమైన భావనలను, దృక్పథాలనే భగవంతుడికీ ఆపాదిస్తూ ఉంటారు. అవసరార్థం దేవుళ్ళలో కూడా విభజనను తీసుకువస్తూ ఉంటారు. ఆధ్యాత్మిక జీవనంలో ఇలాంటి అవకాశవాద ఆరాధన మనకు ఎన్నటికీ ప్రశాంతతను ఇవ్వలేదు.

Air is there in the atmosphere; wherever you search you find air. Similarly in religion, you do not have to go here and there to see God. Wherever you are, the divine is there, just like oxygen. – గాలి సర్వత్రా వ్యాపించి ఉంది; దాని కోసం ప్రత్యేకంగా ఎక్కడో అన్వేషించనక్కరలేదు. అలాగే భగవంతుడు కూడా!

మతవిశ్వాసాల, ఆరాధనల వెనకనున్న ఈ నిగూఢమైన సత్యాన్ని గుర్తించనంత కాలం ఇలా మనం ఆధ్యాత్మిక జీవితంలో ప్రాథమిక దశకే పరిమితమైపోతాం. అనంతమైన, చైతన్యవంతమైన పరమాత్మ ఒక్కడే! ఏ రూపంలో భావించి పూజించినా ఫలితం కనిపిస్తుందన్న దృఢవ్రతంతో, చిత్తశుద్ధితో సాధన కొనసాగించనంత కాలం ఆధ్యాత్మిక ప్రయాణంలో సంశయాత్ములుగానే మిగిలిపోతాం. ❖ **తెలుగుసేత : ఆర్. కృష్ణ**

ఒక వ్యక్తి ఎంత అత్యధికంగా సంపదను గడించవచ్చో పాశ్చాత్యులు తెలిపితే, ఒక వ్యక్తి సర్వ సంపదలను ఎలా త్యాగం చేయవచ్చో భారతీయులు తెలియజేశారు. - స్వామి వివేకానంద

జీవనోద్యానంలో
మానవతా పరిమళాలు

సేవతోనే పవిత్రత

సిక్కుల పదవ గురువు గురుగోవింద్ సింగ్ ఆశ్రమానికి వచ్చిన భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తున్నారు. ఆయన ప్రసంగిస్తూ "నాకు దాహం వేస్తుంది. ఎవరైనా కొంచెం జలం తీసుకుని రండి" అని భక్తుల్ని అడిగారు. వెంటనే ఒక యువకుడు ఒక పాత్రలో జలం తీసుకువచ్చాడు. జలం తీసుకునేటప్పుడు ఆ యువకుడి చేతులు గురుగోవింద్‌కు తగిలాయి. వెంటనే గురుగోవింద్ "నీ చేతులింత కోమలంగా ఉన్నాయెందుకు?" అని ఆ యువకుణ్ణి అడిగారు. అందుకు అతడు "గురువుగారూ! నాకు అనేకమంది సేవకులున్నారు. నేను స్వయంగా ఏ పనీ చేయవలసిన అవసరం లేదు. అందువల్లనే నా చేతులింత కోమలంగా ఉన్నాయి" అని అన్నాడు.

గురువుగారు పెదవుల వరకు పెట్టుకున్న జలపాత్రను పక్కన పెట్టి "ఎప్పుడూ ఎవరికీ సేవ చేయని చేతులు పవిత్రమైనవి ఎలా అవుతాయి? సేవలు చేయడం వల్లనే పవిత్రులవుతారు. నేను నీ చేతితో అందించిన నీళ్ళు త్రాగలేను" అన్నారు.

ఆ యువకుడు ఎంతో సిగ్గుపడుతూ 'స్వామీ! ఇప్పటి నుండి నేను ఎవరి చేతా ఏ విధమైన సేవలూ చేయించుకోను, శక్తి కొలదీ ఇతరులకు సేవలందిస్తాను' అని శపథం చేశాడు.❖

సుపరిపాలనకు పునాది

ఒక శిష్యుడు 'గురువుగారూ! మంచి పరిపాలనకుండవలసిన లక్షణాలేమిటి?' అని గురువుగారిని అడిగాడు.

'నాయనా! ఏ దేశపురాజు శక్తి సంపన్నుడో అక్కడే సుపరిపాలన సాధ్యమవుతుంది' అన్నారు గురువు. 'శక్తి సంపన్నుడంటే ఎలా ఉండాలి?'

"అందుకు మూడు విషయాలు ముఖ్యంగా అవసరం. ఒకటి – ప్రజలు అన్న పానాదుల కొరకు వెదుక్కోకూడదు; రెండు – రాజ్యంలో అస్త్రశస్త్రాలకు లోటు ఉండకూడదు; మూడు – ప్రజలకు పాలకుడిపైనా, అతడి పరిపాలనపైనా నమ్మకం ఉండాలి"

'అయితే ఈ మూడింటిలో ఏదో ఒకటి వదిలివేయవలసిన అవసరం వస్తే?' 'అస్త్రశస్త్రాలను వదిలివేయాలి'

'మిగిలిన రెంటిలో ఒకదానిని వదిలివేయాల్సివస్తే?'

'అన్నపానాదులను వదిలివేయవచ్చు' 'ఏం ఎందుకలా?'

ఎందుకంటే పాలకుడు ప్రజల నమ్మకాన్ని వమ్ముచేస్తే, ఆ పాలకుడు జీవించి ఉన్నా మరణించినట్లే. ప్రాణాలకన్నా నమ్మకం ముఖ్యం. ప్రజల నమ్మకం చెదిరిపోతే, పరిపాలన సజావుగా జరగదు. పరిపాలన సజావుగా సాగకపోతే ప్రజలు క్షేమంగా ఉండలేరు.

అయితే పరిపాలన లక్ష్యం ఏమిటి?

'ప్రజల క్షేమానికి మించి పరిపాలనకు వేరే లక్ష్యమే లేదు. ప్రజలు సుఖంగా జీవించేటట్లు చూడడమే సుపరిపాలనకు మూలస్తంభం. కాబట్టి శాసకులెప్పుడూ ప్రజాహితం దృష్టిలో ఉంచుకుని పరిపాలించాలి కానీ ప్రజలను దుఃఖపెట్టరాదు. ప్రజల విశ్వాసాన్ని చూరగొనడమే పాలకుని ముఖ్య లక్ష్యం.'❖

అనువాదం: డాక్టర్ వై.సరోజా నిర్మల (రామకృష్ణ సంఘం - హిందీ మాసపత్రిక 'వివేక జ్యోతి' నుండి)

కైలాస-మానస సరోవర తీర్థయాత్ర

భక్తులకు ఓ అపూర్వ అవకాశం

1. కైలాస-మానస సరోవర తీర్థయాత్ర
2. ముక్తినాథ్ తీర్థయాత్ర
3. శ్రీరామకృష్ణ గురుపీఠం - బేలూరు మఠ తీర్థయాత్ర
4. బద్రీనాథ్, కేథార్‌నాథ్, గంగోత్రి, యమునోత్రి - చార్‌దామ్ తీర్థయాత్ర
5. కాశీ-పంచక్రోషి తీర్థయాత్ర, 6. పంచ ద్వారక తీర్థయాత్ర
7. నర్మదా పరిక్రమ తీర్థయాత్ర, 8. దక్షిణభారత తీర్థయాత్ర
9. తమిళనాడు నవగ్రహ తీర్థయాత్ర
10. అండమాన్ - నికోబార్ యాత్ర
11. శ్రీలంక శాంకరీదేవి శక్తిపీఠ తీర్థయాత్ర
12. మలేషియా - సింగపూర్ - థాయ్‌ల్యాండ్ - కాంబోడియా (అంకోర్‌వాట్) - ఇండోనేషియా - చైనా -యూరప్‌లతో పాటు ఇతర విదేశీ పర్యటనలు కూడా నిర్వహిస్తున్నాం.

పూర్తి వివరాలకు సంప్రతించండి

శ్రీ రామకృష్ణ యాత్రా సర్వీసు®

ప్రధాన కార్యాలయం : కొత్త నెం. 120/1, పాత నెం. 216/1, రామకృష్ణ మఠం రోడ్, ఆర్.కె. మఠం ఎదురుగా, మైలాపూర్, చెన్నై - 600 004

ఫోన్:044–2461 6968, 2495 0095, సెల్: (0)94440 91428, (0)98427 11886 ఫ్యాక్స్: 044–2462 0631

Email : srk.yatraservices@gmail.com / anandhan@srkyatra.com Website: www.srkyatra.com

ఆధ్యాత్మిక సేవాపరాయణుడు : జి.యస్. ఆనందన్ సెల్ : (0)94431 44808

Advt.,

(1884 – 1967)

ముందుకు సాగిపో!

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్న్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ - వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్న్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం, ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

సార్‌గాఛీ
28-8-63

ప్రియమైన బాదల్!

మనకు సుస్తీగా ఉన్నప్పుడు మన మనస్సులో ఒక ప్రశ్న తలెత్తుతుంది. "నేను ఈ పూట తినాలా? వద్దా?" అని. అలాంటప్పుడు తినకపోవడమే మేలు. అదే విధంగా "భగవత్‌సాక్షాత్కారం కొరకు ఇల్లూ వాకిలీ వదిలిపెట్టాలా? వద్దా? అన్న ప్రశ్న మనస్సులో ఉదయించినప్పుడు, అలా వదిలిపెట్టకపోవడమే శ్రేయస్కరం.

కుటుంబంలో పెద్ద కుమారునికే బాధ్యతలు ఎక్కువ. పెద్దకుమారుడు బ్రతికి వున్నంతకాలం కనిష్ఠులు తమ తల్లితండ్రుల శ్రాద్ధకర్మలు చెయ్యడానికి అర్హులుకారు. నీకు తెలుసా! శ్రీరామకృష్ణులు ఇలా అనేవారు : "సాధనలు చెయ్యాలని భావించేవాడు తన తల్లితండ్రులను విస్మరించి వారికి బాధ కల్గించరాదు. అలా చేసినవాడికి చివరకు మిగిలే ఫలితం బూడిద మాత్రమే. అయితే ఎవడి హృదయం భగవంతుని కోసం తీవ్ర పరితాపం చెందుతుందో అలాంటి వ్యక్తి తల్లితండ్రులను త్యజించినా ఫరవాలేదు."

శ్రీరామకృష్ణ కథామృతం, స్వామీజీ కర్మయోగం వంటి పుస్తకాలలో వ్యక్తి తన కొంపాగూడూ వదిలిపెట్టడం కన్నా కోరికలను వర్జించడాన్నే ఎక్కువ నొక్కివక్కాణించారు. కోరికల నుండి మనస్సును మరల్చలేకపోతే అంటే తన ఇల్లూ వాకిలీ పరిత్యజించే విషయంలో దృఢమైన నిశ్చయం లేకపోతే, పరిత్యజించకుండా ఉండడమే మేలు. అలా పరిత్యజించడం ప్రమాదం కూడా! అప్రయత్నంగా ఒక విధమైన "జీవపరిణామోన్నతి" జరుగకుండా వ్యక్తి ప్రపంచం నుండి వేరుగా జీవించలేడు. పెద్దలనే సామెత ఒకటుంది 'పనసకాయను పిడిగుద్దులు గుద్ది పక్వానికి తేలేవు' అని.

వ్యక్తి తన క్రియలన్నింటినీ భగవానుని సేవగా భావిస్తూ, మహోన్నతమైన విశ్వాసంతో చాలా కాలం పనిచేస్తూ, తన దృష్టినంతా ముక్తిమార్గం వైపునకు త్రిప్పగల్గితే తప్ప అది నిజమైన పరిత్యాగంగా భావించరాదు.

ఈ రోజులలో కుటుంబ సంప్రదాయం వ్యక్తి జీవనాన్ని నిర్దేశింపలేకపోతున్నందున, దాన్నే స్వధర్మం అనడానికి అవకాశం లేదు. వ్యక్తి గత్యంతరంలేక జీవిస్తున్న నేటి సమాజం నరకప్రాయమైపోతుంది. ఒక పండితుడి కుమారుడు తన కార్యాలయంలో అబద్ధాలు చెప్పడం, లంచాలు స్వీకరించడం వంటి అనేక దుష్కార్యాలు చేస్తుండడం మనం చూస్తున్నాం. అలాంటి వ్యక్తి గాలి సోకితేనే మనస్సు కలుషితమైపోయే అవకాశం ఉంది.

ఇలాంటి సున్నితమైన విషయాలన్నీ నీకు నీవే పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలయ్యా బాదల్!

ప్రేమాశీస్సులతో
స్వామి ప్రేమేశానంద

తెలుగు సేత: కె. త్రివిక్రమరావు

భారతదేశ ప్రజలకు స్వయం సహాయకత్వం, నైతిక, మేధా సంబంధమైన విద్యను నేర్పకపోతే ప్రపంచంలోని సర్వ సంపత్తీ ఏకమైనా, దేశంలోని ఒక్కగ్రామానికి సాయపడజాలదు. -స్వామి వివేకానంద

(...15వ పేజీ తరువాయి)

దివ్యప్రకటితంగా దర్శించగలిగితే అదే అత్యున్నత ఆరాధనం. అదే భావనతో ఉత్తరగీతలోని పరబ్రహ్మస్తోత్రంలో...

అగ్నిర్దేవో ద్విజాతీనాం మునీనాం హృది దైవతమ్।
ప్రతిమా స్వల్పబుద్ధీనాం సర్వత్ర సమదర్శినామ్॥

'బ్రాహ్మణులకు భగవంతుడు అగ్నిలోను, మునులకు హృదయంలోను, సామాన్యులకు కేవలం విగ్రహంలోనే ఉంటాడు. కానీ సమదర్శులైన యోగులకు భగవంతుడు సర్వత్రా విరాజిల్లుతుంటాడ'ని వివరిస్తాడు.

అందుకే హిరణ్యకశిపుడు 'ప్రహ్లాదా! నీ హరి ఎక్కడ ఉంటాడో చెప్పు' అన్నప్పుడు ఆ బాలభక్తుడు నిస్సంశయంగా 'ఇందు గలడందు లేడని సందేహం వలదు; చక్రి సర్వోపగతుండు తండ్రీ!' అన్నాడు. అప్పుడు ఆ శ్రీహరి ప్రహ్లాదుడి నమ్మకాన్ని వమ్ముచేయకుండా రాజసౌధంలోని రాతిస్తంభం నుంచి నరసింహమూర్తియై ఆవిర్భవించాడు. భగవంతుడిపై భక్తుడికున్న విశ్వాసానికి, భక్తుడిపై భగవంతుడికున్న వాత్సల్యానికి అది నిదర్శనం. అపరప్రహ్లాదుడిగా అన్నమయ్య కూడా ఇక్కడ....

ఇందు హరి గల దందు లేడనేటి,
నిందకు బాయుటె నీ పూజ
కొందరు చుట్టాలు కొందరు పగనే,
అందదుకు మానుటదియె నీ పూజ

అంటున్నాడు. 'అందదుకు' అంటే 'తీవ్రంగా పరిగణించటం' అని అర్థం. ఆ ఆద్యంతరహితుడి అస్తిత్వాన్ని పరిమితం చేయక, అనంతంగా ఆయనను వీక్షించగలగడం సర్వోత్కృష్ట ఆరాధన! అదేవిధంగా ఆత్మీయులంటూ కొందరిని మనసుకు హత్తుకోవడం, ఆగర్భశత్రువుల్లా కొందరిపై కత్తులు నూరడం మానుకొని అందరినీ ఏకరీతిగానే భావించుకోగలిగితే, పరమాత్మను ప్రియంగా పూజించినవారమవుతాం! ప్రేమలో కానీ, వైరంలో కానీ తీవ్రత మంచిది కాదని అన్నమయ్య ఈ కీర్తనలో అన్యాపదేశంగా చెబుతూ ఉన్నాడు.

సరియనుటదియే...

దూషణ, భూషణలను ఒకేలా స్వీకరించగలిగితే; బంగారాన్ని, ఇనుమును ఒకేలా చూడగలిగితే మన పూజ పరిపాకం చెందినట్లే! భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస తన సాధనలో భాగంగా గంగా నదిలో 'మాటీ! టాకా! టాకా! మాటీ!' అంటూ మట్టినీ, రూపాయినీ ఒకేలా భావిస్తూ రెంటినీ గంగానదిలో వేసేవారు. మనం ఈ స్థాయిలో బంగారాన్ని, ఇనుపముక్కలా చూస్తూ గంగలో పారేయలేకపోయినా, కనీసం సిరిసంపదలే సర్వస్వమను కోకుండా ఉంటే అదే పదివేలు! అందుకే అన్నమాచార్యులు...

తిట్టులు గొన్నని దీవెన గొంతని
నెట్టుకోనిదే నీ పూజ
పెట్టిన బంగారు పెంకును నినుమును
అట్టే సరియను టదియు నీ పూజ॥ అంటున్నాడు. 'నెట్టుకోనిదే' అంటే 'అనుకోనిదే' అని అర్థం. పరిస్థితులన్నీ సానుకూలంగా ఉన్నప్పుడు ఎవరైనా స్థిరచిత్తులుగానే కనిపిస్తారు. అవి వికటించినప్పుడే విషాదంతో కకావికలమవుతారు. అయితే సుఖమైనా, దుఃఖమైనా సమచిత్తంతో సాగిపోయేవారే ఈశ్వరుడికి ఇష్టులు! ఆ సందేశసారంతోనే శ్రీకృష్ణభగవానుడు భగవద్గీత భక్తియోగంలో...

"మిత్రులు, శత్రువులు, మానావమానాలు, శీతోష్ణాలు, సుఖదుఃఖాలు, నిందాస్తోత్రాలు తదితర ద్వంద్వాలలో సమబుద్ధి కలిగి, ఎవడైతే సంతుష్టుడై, మౌనియై, గృహమందు నాదియను భావం లేక స్థిరచిత్తుడై ఉంటాడో ఆ భక్తుడు నాకు ప్రియమైనవాడ"ని ఉద్ఘాటిస్తాడు. ఇలా సమత్వంతో ఉండగలిగితే మనసులో తెలియకుండానే ప్రశాంతత నెలకొంటుంది.

సర్వము నీవనుటే...

స్వతంత్రేచ్ఛను వదులుకొని, సర్వమూ నీవని ఆ సర్వేశ్వరుడి ముంగిట వాలిపోవడమే పూజ పరమావధి. మనిషి అన్నీ తనే చేస్తున్నానన్న కర్తృత్వభావాన్ని వదులుకుంటే, కరుణాంతరంగుడైన ఆ భగవంతుడు ఆ భారాన్నంతా తనే మోస్తాడు. ఆ శరణాగతినే స్ఫురింపచేస్తూ ఈ సంకీర్తనాచార్యుడు

సర్వము నీవని స్వతంత్ర ముడిగి, నిర్వహించుటే నీ పూజ
పర్వి శ్రీవేంకటపతి నీ దాసుల, పూర్వమనియెడి బుద్ధి నీ పూజ

అంటున్నాడు. 'పర్వి' అంటే పుణ్యాలను ప్రసాదించేవాడని భావం. పుణ్యప్రదాత అయిన ఆ పురాణపురుషుడి దాసులు అపూర్వ మనుకుంటూ, వారి సాంగత్యంతో మెలగడమే అపురూపమైన ఆరాధనగా అన్నమాచార్యులు అభిప్రాయపడుతూ ఉన్నారు. ఇలా శరణాగతి, సత్సాంగత్యమే భగవద్భక్తికి నిదర్శనాలు.

శివతత్త్వసారంలో మల్లికార్జున పండితుడు కూడా హితవు పలుకుతూ...

లోకము విడువని వానిని
లోకము విడువదని విశ్వలోకేశ్వర నీ
లోకము కోరెడు మనుజుడు
లోకము వోవిడుచు నీవ లోకముగ శివా!

'ఈశ్వరుడినే లోకంగా భావించి లోక వ్యవహారాల విషయంలో ఉపేక్ష వహించకపోతే ఈ లోకం కూడా తనని వదిలిపెట్టదు' అని అంటాడు. ❖

బంగారు ప్రమిద

యమునా నదీతీరంలో ప్రశస్తమైన శివాలయం ఒకటి ఉంది. ఒకరోజు వేకువఝామున పూజారి గుడి తలుపులు తెరవగానే ఆయనకు శివలింగం దగ్గర ఒక పెద్ద బంగారు ప్రమిద కనిపించింది. పూజారి ఆశ్చర్యపోతూనే దానిని తీసుకోబోయాడు. కానీ వెంటనే ఆకాశం నుండి ‘ఈ ప్రమిదను



పైకి ఎత్తాలంటే ఆ వ్యక్తి సత్యసంధుడు, ధర్మాత్ముడు అయి ఉండాలి. అలాంటి వ్యక్తి పట్టుకోగానే దీపపు వత్తులు వాటంతట అవే వెలుగుతాయి. అప్పుడు ఈ బంగారు ప్రమిద అతని సొంతమవుతుంది’ అన్న మాటలు వినిపించాయి.

పూజారి ఈ విషయం చాటింపు వేయించాడు. ఊరు ఊరంతా గుడికి తరలి వచ్చింది. చాలామంది ఆ బంగారు ప్రమిదను ఎత్తడానికి ప్రయత్నించారు. కానీ ఎత్తలేకపోయారు. ఆ ఊరిలో వీరయ్య అనే రైతు పగలంతా పొలంలో పనిచేసి సాయంత్రంపూట ఆవుపాలు పితికి పూజారికి ఇవ్వడానికి వస్తాడు. ఆ రోజు వీరయ్య వస్తున్నప్పుడు దారిలో చలికి గజగజా వణికిపోతున్న ఒక వ్యక్తి కనిపించాడు. అతడు ఆకలితో అలమటించిపోతున్నాడు. వీరయ్య తన అంగ వస్త్రంతో అతణ్ణి కప్పి, అతనికి తాగడానికి కొన్ని పాలు ఇచ్చాడు.

గుడి వద్ద అద్భుతాన్ని చూడడానికి ఊరి జనాలు అందరూ గుమిగూడి ఉన్నారు. వాళ్ళలో వీరయ్య కూడా ఉన్నాడు.

వీరయ్యను చూడగానే పూజారి ‘వీరయ్యా! నువ్వు కూడా ప్రయత్నించి చూడు’ అని అన్నాడు.

“దానధర్మాలు చేసిన వాళ్ళు, పేదల కోసం సత్రాలు కట్టించిన వాళ్ళు, ఎన్నో పుణ్యకార్యాలు చేసినవారు ఎంతోమంది ప్రయత్నించారు. వాళ్ళకు వీలుకానిది, ఒక మామూలు వ్యక్తికి సాధ్యమవుతుందా?” అని అంతా గుసగుసలాడారు.

పూజారి మాట కాదనలేక రైతు గుడిలోకి వెళ్ళాడు. అతను బంగారు ప్రమిదను పట్టుకోగానే ఆ ప్రమిదకు ఉన్న వత్తులు వెలిగాయి. ఆ గుడి ప్రాంగణమంతా ప్రకాశవంతంగా వెలిగిపోసాగింది.

‘హరహర మహదేవ శంభోశంకర’ అని అంటూ తన్మయంతో జయజయధ్వానాలు చేసాడు పూజారి. అక్కడున్న వారంతా భక్తితో చేతులెత్తి శివలింగానికి నమస్కరించారు. హారతి పూర్తయ్యాక పూజారి “వీరయ్యా! నువ్వు దేవుని అనుగ్రహం పొందావు. ఈ బంగారు ప్రమిద నీదే. తీసుకు వెళ్ళు” అని అన్నాడు.

అప్పుడు వీరయ్య “అయ్యా! దేవుడిచ్చిన వస్తువును గుడిలోనే ఉంచండి. దీపారాధనకు ఉపయోగపడుతుంది. ఈ బంగారు ప్రమిదను దర్శించుకొనే భాగ్యం అందరికీ దక్కుతుంది” అని వినమ్రంగా చెప్పాడు.

నీతి:
1. కష్టాల్లో ఉన్నవారికి వీలైనంత సహాయం చేయాలి.
2. అయాచితంగా వస్తోంది కదా అని దేనినీ తీసుకోకూడదు.
3. పదిమందికీ ఉపయోగపడే వస్తువును ఒకరి దగ్గరే ఉంచుకోకూడదు.

– ఆకల ఎస్.వి.ఇ.ఆర్. ఉత్తేజ్,
6వ తరగతి, కేంద్రీయ విద్యాలయం,
బాబా మెట్ట, విజయనగరం

ఒక కథ చెబుతా... ‘శ్రీరామకృష్ణ ప్రభ’ మాసపత్రిక ఉన్నత పాఠశాల విద్యార్థులలో వ్యాసరచన ప్రతిభను ప్రోత్సహించడం కోసం, సద్భావాలను పెంపొందించడం కోసం ‘ఒక కథ చెబుతా...’ శీర్షికను ప్రారంభించింది. ఈ శీర్షికలో ప్రచురించడానికి విద్యార్థుల నుండి నీతి కథలు, వ్యక్తిత్వవికాస కథలు, స్ఫూర్తిదాయక కథలు, ఆధ్యాత్మిక కథలను ఆహ్వానిస్తోంది. వ్యాసాలను చక్కని దస్తూరీతో సరళభాషలో రాసి, మీ పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను జతపరచి పంపించండి. మీ పూర్తి చిరునామాను పొందుపరచండి. ఎంపికైన కథలకు బహుమతి లభిస్తుంది.

వ్యాసాలను పంపించాల్సిన చిరునామా : సంపాదకులు, శ్రీరామకృష్ణ ప్రభ, రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాద్-500 029. E-mail : sriramakrishnaprabha@gmail.com

- స్వామి పరిజ్ఞేయానంద

ఆత్మానుసంధానమే
యోగం

'మనం నిర్వర్తించే కర్మల వల్ల వచ్చే ఫలితం అనుకూలమైనా, ప్రతికూలమైనా సమభావంతో స్వీకరించడమే యోగం *(సమత్వం యోగ ఉచ్యతే - భ.గీ. 2.48)'* అని భగవాన్ శ్రీకృష్ణుడు బోధించాడు.

అయితే, కర్తవ్యాలను సమర్థంగా నిర్వహించకుండా, బాధ్యతలను శ్రద్ధతో నిర్వర్తించకుండా, కర్మల్లో కౌశలాన్ని ప్రదర్శించకుండా వచ్చే కర్మఫలితం పట్ల నిర్వికారంగా, నిర్లిప్తంగా వ్యవహరించడం 'యోగం' అవుతుందా? ఉదాహరణకు ఒక విద్యార్థి శ్రద్ధగా చదవకపోవడం వల్ల పరీక్షల్లో విఫలమయ్యాడనుకుందాం. పరీక్షల్లో విఫలమైనందుకు అతడు

ఎలాంటి కలతచెందకుండా నిర్వికారంగా ఉంటే అతణ్ణి 'యోగి' అనగలమా?

అదే నిజమైతే, కర్తవ్యనిర్వహణలో శాయశక్తులా కృషిచేయకుండా, వచ్చే ఫలితాల పట్ల అనాసక్తభావంతో ఉన్నవారంతా యోగులే! అప్పుడు సమాజమంతా అసమర్థులతోనూ, సోమరులతోనూ నిండిపోతుంది. అందుకే శ్రీకృష్ణుడు యోగమంటే కర్మఫలితాల పట్ల సమభావాన్ని కలిగివుండడమే కాదు, **'యోగః కర్మసు కౌశలమ్** (భ.గీ- 2.50) - కర్మలను నైపుణ్యంతో నిర్వర్తించడమే యోగం' అంటూ యోగానికి మరో షరతును విధించాడు.

కాబట్టి మన విధులను బాధ్యతతో నిర్వర్తించాలి; కర్మలను నైపుణ్యంతో నెరవేర్చాలి; కర్తవ్యనిర్వహణలో శక్తివంచన లేకుండా కృషిచేయాలి. అలా అన్నివిధాలా శ్రద్ధతో ప్రయత్నించిన తరువాత, ఫలితాలు సానుకూలమైనా, ప్రతికూలమైనా సమతుల్యాన్ని పాటించగలిగితే భగవానుడు విధించిన కొలమానం ప్రకారం మనమంతా యోగులమే!

మరి నేటితరంలో ఎంతోమంది యువతీయువకులు తమతమ విధి నిర్వహణలో ఎంతో ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. అతిపిన్న వయస్సులోనే కోట్ల రూపాయల జీతాలను ఆర్జిస్తున్నారు. ఈమధ్యే రోజుకి కోటి రూపాయలు సంపాదించే ఓ యువకుడి కథనం వార్తాపత్రికల్లో ప్రచురితమైంది. శ్రీకృష్ణుడు చెప్పిన ప్రకారం కర్మల్లో అత్యంత నైపుణ్యాన్ని కనబరుస్తున్నవారంతా యోగులే కదా! అలాంటప్పుడు నేటితరం యువత ఇంకా ఆందోళన, అలజడి, ఒత్తిళ్ళకు ఎందుకు గురవుతున్నారు? సమాజాన్ని ఇంకా అవినీతి, అక్రమాలు, అన్యాయాలు, అశాంతి ఎందుకు పట్టిపీడిస్తున్నాయి? ఈ ప్రశ్నలకు సమాధానంగా మహాభారతంలోని కౌశికుని కథను గుర్తుచేసుకుందాం.

కౌశికుడు అరణ్యంలో తపస్సు చేసుకుంటూ ఉండేవాడు. అత్యంత శ్రద్ధతో చేసిన సాధనల ఫలితంగా అతడికి కొన్ని శక్తులు కూడా లభించాయి. కౌశికుడు ఒకరోజు చెట్టు క్రింద కూర్చుని ధ్యానం చేసుకుంటున్నప్పుడు పక్షి రెట్ట అతడి తలపై పడింది. అందుకు అతడు ఆగ్రహంతో చెట్టు కొమ్మపై ఉన్న పక్షివైపు చూశాడు. వెంటనే ఆ పక్షి అతడి క్రోధాగ్నికి భస్మమైపోయింది. తరువాత అతడు ఊరిలోకి వెళ్ళి ఒక ఇంటి ముందు నిలబడి భిక్ష అడిగాడు. పతిసేవలో నిమగ్నమై ఉండడం వల్ల గృహిణి భిక్ష తీసుకురావడంలో కొంత జాప్యమైంది. అందుకు కౌశికుడు కోపంగా ఆమెవైపు చూశాడు. కోపావేశంలో ఉన్న అతణ్ణి చూసిన ఆ గృహిణి ప్రశాంతంగా 'నేను మాడి మసైపోవడానికి ఆ పక్షిని కాదు' అని అతడితో అంది. అరణ్యంలో జరిగిన సంఘటన ఒక సాధారణ గృహిణికి ఎలా తెలిసిందని ఆశ్చర్యపోయాడు కౌశికుడు.

ఒక సాధువుగా శ్రద్ధతో తపస్సు చేసుకుంటూ తన కర్తవ్యాన్ని నెరవేరుస్తున్నాడు కౌశికుడు. పత్నిగా పతికి పరిచర్యలు చేస్తూ తన స్వధర్మాన్ని నిర్వహిస్తోంది గృహిణి. ఈ ఇద్దరూ తమతమ కర్తవ్యాలను సమర్థంగా నిర్వహిస్తున్నారు. అయితే, కౌశికుని అంతఃకరణలో పరిపక్వత రాలేదు. అందుకే అతడి మనస్సు క్రోధమనే మాలిన్యంతో నిండివుంది. కానీ ఆ గృహిణి మాత్రం మానసిక పరిపక్వతను సాధించింది. అందువల్ల కౌశికుడు క్రోధం ప్రదర్శించినా ప్రశాంతంగా బదులివ్వగలిగింది.

దీన్నిబట్టి మనం అర్థం చేసుకోవలసింది ఏమిటంటే, కేవలం కర్తవ్యాలను సమర్థంగా నిర్వర్తించడం వల్ల మాత్రమే యోగత్వం ☞

వికాస మంత్రాలు

- స్వామి పార్థసఖానంద

'అందరూ ఎలా జీవించాలి? ఎలా జీవించాలి?' అని అడుగుతుంటారు, కానీ మనం మొదట తెలుసుకోవాల్సింది.. అసలు మనం ఎందుకు జీవించాలి?అని! అది తెలిస్తే, ఎలా జీవించాలో తెలుస్తుంది. ప్రతి విషయమూ అంతే, ఎందుకు అనే ప్రశ్నపై మనకు అవగాహన ఉంటే, అది ఎలాగో తెలిసిపోతుంది.



గమ్యం వైపు వెళ్ళే దారిలో, ఎన్నో కుక్కలు మనల్ని చూసి మొరగవచ్చు, అందుకు మనం ఆవేశపడిపోయి, వాటి పళ్ళు ఊడగొట్టి, తగిన పాఠం చెప్పాలనుకుని.. మొరిగిన ప్రతి కుక్క మీద రాళ్ళు విసురుతూ కూచుంటే, మనం ఇక ఎన్నటికీ గమ్యాన్ని చేరుకోలేం!!.

నాయకునికి, నియంతకి తేడా ఏమిటంటే.. ' ఆ పని చేయి పో ' అని నియంత అంటే, ' ఆ పని చేద్దాం పదండి ' అని నాయకుడు అంటాడు.

సిద్ధించదు. మనం చేసే కర్మల వల్ల మనస్సు పరిశుద్ధం కావాలి. మనోమాలిన్యం తొలగనినాడు బాహ్యంగా ఎంతటి సమర్థతను కనబరిచినా, ఎంతటి ప్రతిభను ప్రదర్శించినా ప్రశాంతత లభించదు. ప్రశాంత చిత్తాన్ని పొందాలంటే, మన మనస్సు కల్మషరహితం కావాలి. అందుకు ఏం చేయాలో భగవానుడు, అర్జునుడితో చెబుతూ **'...సమాధావచలా బుద్ధి స్తదా యోగ మవాప్స్యసి** *(భ.గీ-2.53)* - ఎప్పుడైతే నీ బుద్ధి పరమాత్మయందు నిమగ్నమై ఉంటుందో అప్పుడే యోగాన్ని పొందగలవు' అని సూచించాడు.

కౌశికుని మనస్సు పూర్తిగా పరమాత్మునితో అనుసంధానం కాలేదు. అందుకే అతడి మనస్సు నుండి రాగద్వేషాలు తొలగలేదు. కాబట్టి నిజమైన యోగాన్ని సాధించాలంటే ముందుగా మన మనస్సుని భగవంతునితో అనుసంధానం చేయాలి. అలా చేయడం వల్ల కర్మలను అత్యంత నైపుణ్యంతో చేయగలుగుతాం, కర్మఫలితాల పట్ల సమత్వాన్ని పాటించగలుగుతాం.

భగవంతుడే కర్త, మనం నిమిత్తమాత్రులం అనే భావంతో కర్మలను నిర్వర్తించినప్పుడు మనలో రాగద్వేషాలు, అహంకార మమకారాలు పొడచూపవు. ఆవిధంగా అంతఃకరణ పవిత్రమై మనలో సత్యం, ధర్మం, ప్రేమ, దయ మొదలైన సుగుణాలు అంకురిస్తాయి. అప్పుడు మనం ప్రశాంతంగా జీవిస్తూ, అందరికీ ప్రశాంతతను పంచగలుగుతాం. అదే నిజమైన యోగస్థితి! ❖

చెరుకు తిన్న రాతి ఏనుగు

కథ : తంగవయల్ లోగితాసన్ చిత్ర కథనం : ఎం. భైరవ సుబ్రమణియం
చిత్రాలు : శంకర్ అనుసృజన : స్వామి జ్ఞానదానంద

1 అభిషేక పాండ్యుడనే రాజు మధురైను చక్కగా పాలిస్తున్న కాలం అది. ప్రజానురంజకుడైనప్పటికీ తాను రాజును అనే గర్వం పాండ్యునికి కించిత్తు ఉంది. ఇలావుండగా ఒక రోజు మధురై ప్రధాన వీథిలో ఒక సిద్ధుడు తనకున్న అద్భుత సిద్ధులను ప్రదర్శిస్తూ జనులను అబ్బురపరచసాగాడు.

2



3 సిద్ధుని ఖ్యాతి రాజుకు తెలిసింది. సిద్ధుణ్ణి తన వద్దకు పిలుచుకు రమ్మని రాజు భటులను పంపించాడు. సిద్ధుడు ప్రదర్శిస్తున్న అద్భుతాలను చూసి వారు మైమరచి నిలబడిపోయారు. దాంతో రాజు సేనాధిపతిని పంపించాడు.




4
సేనాధిపతి అంతఃపురానికి తిరిగి వెళ్ళి జరిగింది రాజుతో చెప్పాడు. సేనాధిపతి మాటలు రాజును ఆలోచింపజేశాయి.
సిద్ధుణ్ణి ఇక్కడకు రమ్మనడం పొరపాటే! స్వయంగా నేనే వెళ్ళి ఉండాల్సింది. అధికార దర్పం నా కళ్ళను కమ్మేసింది.
కనువిప్పు కలిగిన రాజు మకర సంక్రాంతి నాడు ఆలయానికి వెళ్ళి శ్రీమీనాక్షీదేవిని తనివితీరా దర్శించుకున్నాడు.
5
ఆలయ ప్రదక్షిణ చేస్తున్న రాజుకు హఠాత్తుగా ఆ సిద్ధుడు ఎదురుపడ్డాడు.
స్వామీ! మీ నామధేయం ఏమిటి? మీది ఏ ఊరు? తమకు నేను ఏం చెయ్యగలను?
రాజా! నేను కాశ్మీరం నుంచి వస్తున్నాను. నాకు నీ నుంచి కావలసింది ఏమీ లేదు.
6
అలా అయితే మీరు మధురైకు వచ్చిన కారణం?
మధురై జనులను నా అద్భుత సిద్ధుల ప్రదర్శనతో అనుగ్రహింప వచ్చాను.
సిద్ధుని ప్రశాంత వదనం, తేజస్సు చూసి రాజుకు ఆయన పట్ల అపార గౌరవం కలిగింది. అయినప్పటికీ మనస్సులో ఏదో సంశయం...



8

అక్కడున్న ఒక వ్యక్తి వద్ద నుండి రాజు చెరుకుగడను తీసుకుని సిద్ధుని చేతికి ఇచ్చాడు.



సిద్ధుడు మందహాసం చేస్తూ చెరుకుగడను రాతి ఏనుగు ముందు చాపాడు. అప్పుడొక అద్భుతం జరిగింది.

9

రాతి ఏనుగు సజీవమై తొండాన్ని చాచి సిద్ధుడు ఇచ్చిన చెరుకుగడను తిన్నది. రాజు నిశ్చేష్టుడయ్యాడు.

10

సిద్ధుడు సంజ్ఞ చెయ్యగా ఏనుగు, రాజును సమీపించి ఆయన మెడలో ఉన్న నవరత్న హారాన్ని తొండంతో తీసింది. రాజు ఆందోళన చెందాడు.





11



12



13

సిద్ధుని ఆదేశానుసారం ఏనుగు రాజు కంఠంలో నవరత్న హారాన్ని మళ్ళీ వేసింది. శిలాప్రతిమలైన వారు సజీవులయ్యారు.



14

రాజు మహదానందం చెందాడు. సిద్ధుడు అంతర్ధానమయ్యాడు. ఆ స్థానంలో మీనాక్షీ సుందరేశ్వరులు ప్రత్యక్షమయ్యారు.



అహంకారంతో అంధులైనవారు సర్వేశ్వరుడే సమస్తాన్నీ నియమిస్తున్నాడనీ, అన్నిటికీ అతడే కర్త అనీ గమనించలేరు. 'సర్వేశ్వరా! అన్నిటికీ నువ్వే కర్తవు, నువ్వే నియామకుడవు' అని బుద్ధిమంతుడు భావిస్తాడు. భ్రాంతిమతుడు 'నేను, నేను' అని ప్రలాపిస్తాడు. – భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస

భావప్రచార పరిషత్ అర్ధవార్షిక సమావేశం

మహబూబ్‌నగర్, శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యవంలో రామకృష్ణ – వివేకానంద భావప్రచార పరిషత్ అర్ధవార్షిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 2015 జూలై 4న విద్యార్థుల సదస్సు, భక్తుల సదస్సు నిర్వహించింది. ఈ సదస్సుల్లో సుమారు 1,500 మంది విద్యార్థులు, 200 మంది భక్తులు; జూలై 5వ తేదీన జరిగిన అర్ధవార్షిక సమావేశంలో ఉభయ రాష్ట్రాల నుండి సుమారు 150 మంది రామకృష్ణ సేవా సమితుల ప్రతినిధులు హాజరయ్యారు.

ఈ కార్యక్రమాల్లో విశాఖపట్నం, రామకృష్ణ మిషన్ ఆశ్రమ కార్యదర్శి స్వామి ఆత్మవిదానందజీ; విజయవాడ, రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి శశికాంతానందజీ; చెంగల్‌పట్టు, రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి అక్షరాత్మానందజీ; హైదరాబాద్, రామకృష్ణ మఠం

స్వామి శితికంఠానందజీ; భావప్రచార పరిషత్ సంయోజకులు శ్రీ వై.రామకృష్ణారావు; పూర్వ సంయోజకులు డాక్టర్ పన్నాల శ్యామసుందరమూర్తి; వివిధ జిల్లాల సమన్వయకర్తలు పాల్గొన్నారు.

నివేదిక : కె. రాజమల్లేష్

ఆధ్యాత్మిక అంతర్యోగ శిబిరం

విశాఖపట్నం, రామకృష్ణ మిషన్ ఆశ్రమ భగవాన్ శ్రీరామకృష్ణ దేవాలయ రజతోత్సవాలను 2015 అక్టోబర్ 15 నుండి 18 వరకు నిర్వహించనుంది. ఈ రజతోత్సవాల సందర్భంగా **అక్టోబర్ 16 నుండి 18 వరకు** 'ఆధ్యాత్మిక అంతర్యోగ శిబిరం' నిర్వహించనుంది. మూడు రోజుల పాటు జరిగే ఈ శిబిరంలో పాల్గొనడానికి నివాసి ప్రతినిధి (రెసిడెంట్ డెలిగేట్) రుసుము రూ.750/–, ప్రవాసి ప్రతినిధి (నాన్ రెసిడెంట్ డెలిగేట్) రుసుము రూ.500/– చెల్లించాలి.

ఈ శిబిరంలో పాల్గొనదలచిన భక్తులు **2015 అక్టోబర్ 1వ తేదీ** లోగా తమ పేర్లను నమోదు చేసుకోవలెను. గడువు తేదీ తరువాత నమోదు చేసుకునేవారు రూ.200/– అదనంగా చెల్లించాలి. పూర్తి వివరాల కోసం ఈ సెల్ నంబర్ 9603452595లో సంప్రతించండి.

స్వామి ఆత్మవిదానంద, కార్యదర్శి,
రామకృష్ణ మిషన్ ఆశ్రమ, రామకృష్ణ బీచ్, విశాఖపట్నం.

గ్రంథ స్వీకారం



మహర్షి వాల్మీకి – మహిళలు
రచయిత: శ్రీ పింగళి పాండురంగరావు
వెల: తెలుపలేదు, పుటలు: 88
ప్రతులకు: పింగళి పాండురంగరావు
ఇం.నెం. 8-71, లాయరుపేట,
ఒంగోలు – 523 002
సెల్: 94405 54114



శ్రీ ఆంజనేయ సుధ
రచయిత: శ్రీ వెల్దండ పూరి బాలస్వామి గుప్త
వెల: రూ.100/– పుటలు: 160
ప్రతులకు: వెల్దండ పూరి బాలస్వామి గుప్త
వివేకానందనగర్, కల్వకుర్తి
మహబూబ్‌నగర్ జిల్లా – 509 324
సెల్: 90524 30492

Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust
and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020
and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**

Vol.72-8, Sri Ramakrishna Prabha (Telugu Monthly) August 2015, Regd. with the Registrar of Newspaper for India Under No.1120/57. Postal Registration No. HD-1071/2013-15. Licensed to Post Under WPP : AP/CPMG/HC-13/WPP/2015-16. Date of Publication : 16 July 2015

With Best Compliments From

పక్యాల భాస్కర రావు, మేనేజింగ్ డైరక్టర్ & **పక్యాల గిరిజ,** డైరక్టర్

SVIS LABS LIMITED

SVISS LABSS LIMITED

(Manufacturers of Active Pharmaceutical Ingredients and Intermediates)

TÜV CERT DIN EN ISO 9001 : 2000 Certificate : 01 100 058568

Regd. Off. & Fact. : Plot No.88 & 89, Phase - II,
SIPCOT Industrial Complex, Ranipet - 632 403, Tamil Nadu.
Phone : 04172 - 244820, 651507, Tele Fax : 04172 - 244820
E-mail : rao@svisslabss.net Web Site : www.svisslabss.net

SVISS LABSS కంపెనీ వారు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 2,000 పాఠశాలలకు స్పాన్సర్ చేశారు.

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

సెప్టెంబర్ 2015

₹10

సుబోధ

భక్తుడు : ఈ 'నేను' అర్థం ఏమిటి?

శ్రీరామకృష్ణులు: మనలో ఈ 'నేను' ఉంచింది ఆయనే! ఇదంతా ఆయన లీల. ఒక రాజుకు నలుగురు కుమారులు ఉండేవారు. వారందరూ రాకుమారులే కదా! కానీ ఆటలాడేటప్పుడు వారిలో ఒకరు మంత్రిగానూ, ఇంకొకరు కొత్వాలుగానూ, మరొకరు మరోలానూ ఆటలాడుతుంటారు. నీకు భగవద్దర్శనం కలిగితే సంశయాలన్నీ సమసిపోతాయి.

జ్ఞానుల దృక్పథం ప్రకారం అవతారమనేది ఉండదు. కృష్ణుడు, అర్జునుడితో ఇలా అన్నాడు: 'ఓ అర్జునా! నువ్వు నన్ను ఎప్పుడూ అవతారం అంటూంటావు కదా! నీకో విషయం చూపించాలి. రా' అంటూ కృష్ణుడు అర్జునుణ్ణి తన వెంట తీసుకు వెళ్ళాడు. కొంతదూరం వెళ్ళాక అర్జునుణ్ణి 'ఏం చూస్తున్నావు?' అని అడిగాడు. అర్జునుడు ఇలా అన్నాడు: 'గుత్తులు గుత్తులుగా నల్లని నేరేడు పళ్ళు వ్రేలాడుతున్న ఒక పెద్ద వృక్షం'.

'ఇంకాస్త ముందుకు వెళ్ళి చూడు' అన్నాడు కృష్ణుడు. అర్జునుడు ముందుకు వెళ్ళి చూసేసరికి, అవి నేరేడు పళ్ళు కాదు, గుత్తులు గుత్తులుగా శ్రీకృష్ణులు వ్రేలాడుతున్నారు. అప్పుడు కృష్ణుడు 'చూశావు కదా! అక్కడ నాలాగే ఎంత మంది కృష్ణులు ఉన్నారో!' అని అన్నాడు. సాధనలో ముందుకు వెళుతున్న కొద్దీ ఉపాధుల దర్శనం తగ్గి, జ్యోతి దర్శనం అవుతుంది.

కాస్త వేదాంత విచారణను విను. ఇంద్రజాలికుడొకడు రాజుకు తన ఇంద్రజాలం ప్రదర్శింప వచ్చాడు. ఇంద్రజాలికుడు కొద్దిగా ప్రక్కకు తప్పుకోగానే, ఎవరో రౌతు గుర్రం మీద రావడం రాజు చూశాడు. అతడు యోధుని దుస్తులు ధరించి అస్త్రశస్త్రాలను చేబూని ఉన్నాడు. రాజుతోపాటు సభాసదులందరూ 'ఇందులో ఏది సత్యం' అంటూ విచారణ చేయసాగారు. గుర్రమైతే సత్యంకాదు, యోధుని దుస్తులు, అస్త్రశస్త్రాలు కూడా సత్యం కాదు. చివరగా చూసేసరికి, రౌతు ఒక్కడే అక్కడ ఉన్నట్లు వారికి పూర్తిగా అవగాహనకు వచ్చింది. ఎందుకంటే బ్రహ్మ సత్యం, జగన్మిథ్య. విచారణ చేసే కొద్దీ ఏమీ మిగలదు. ❖



శ్రీరామకృష్ణ ప్రభ
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాదు-500 029
ఫోన్: 040-27667799, సెల్: 8801849494
E-mail : sriramakrishnaprabha@gmail.com

నిర్వాహక సంపాదకులు: స్వామి జ్ఞానదానంద సంపాదకులు: స్వామి పరిజ్ఞేయానంద

ఆధ్యాత్మిక అమృతవాహిని
శ్రీ రామకృష్ణ ప్రభ
సంపుటం: 72 సంచిక: 9 సెప్టెంబర్ 2015



రణత్ క్షుద్ర ఘంటా నినాదాభిరామం
చలత్తాండ వోద్దండ పత్పద్మ తాళమ్ ।
లసత్తుందిలాంగోపరి వ్యాలహారం
గణాధీశ మీశానసూనుం త మీడే ॥

చిరుగంటలు ఘల్లుఘల్లుమని మ్రోగుచుండగా,
పాదపద్మములు తాళము వేయుచుండగా,
సర్పహారము తన దొడ్డశరీరమున
మిసమిసలాడుతుండగా నృత్యము
చేయుచూ వింతగొల్పే శివుని
కుమారుడైన గణాధిపతిని నుతించెదను.

(గణేశ భుజంగప్రయాత స్తోత్రమ్)

సూక్తి సౌరభం

పరివర్తిని సంసారే
మృతః కోవా న జాయతే ।
స జాతో యేన జాతేన
యాతి వంశస్సమున్నతిమ్ ॥

“నిత్యమూ పరివర్తన చెందే ఈ జగత్తులో
గిట్టిన వారంతా ఒకనాడు పుట్టిన
వారే కదా! ఎవడి పుట్టుక వల్ల
వంశప్రతిష్ఠ పెరుగుతుందో,
అలాంటి వాడే పుట్టినట్లు లెక్క!”

బహుళ కావ్యములను పరికింపగా వచ్చు
బహుళ శబ్దచయము బలుకవచ్చు
సహనమొక్కటబ్బ చాల కష్టంబురా
విశ్వదాభిరామ వినుర వేమ!

“ఓ వేమా! చాలా కావ్యాలను
చదువవచ్చును. అనేక మాటలు
నేర్వవచ్చును. కానీ ఓర్పును
అలవరచుకోవడం చాలా కష్టం సుమా!”



శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి



ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'కి ధన దానం చేసి ప్రోత్సహించాల్సిందిగా కోరుతున్నాం. దాతల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు...... రూ. 10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజపోషకులు............ రూ. 5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు................. రూ. 1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

	దాత పేరు	ఊరు	రూ.
మహా రాజపోషకులు	: శ్రీమతి ప్రభల భానుమతి, విజయనగర్ కాలనీ, హైదరాబాదు (కీ॥శే॥ పి.వి.ఎ.శాస్త్రి గారి జ్ఞాపకార్థం)		10,116
మహా రాజపోషకులు	: శ్రీ దుర్గి రామమూర్తి శెట్టి, చిత్తూరు జిల్లా (తల్లిదండ్రులు కీ॥శే॥ దుర్గి అమృతవల్లి తాయారు, మునిరత్నం శెట్టి గార్ల జ్ఞాపకార్థం)		10,116
మహా రాజపోషకులు	: శ్రీమతి ఉప్పాడ సరోజినీ దేవి, కె. కొత్తూరు, శ్రీకాకుళం జిల్లా (తల్లిదండ్రులు కీ॥శే॥ ఉప్పాడ లక్ష్మీదేవి, అప్పన్న రెడ్డిగార్ల జ్ఞాపకార్థం)		10,000
రాజపోషకులు	: శ్రీమతి ద్వారకమాయి, ఎ.పి.హెచ్.బి. కాలనీ, అనంతపురం (భర్త కీ॥శే॥ పసులూరు మంగల ప్రసాద్ గారి జ్ఞాపకార్థం)		5,000
రాజపోషకులు	: శ్రీమతి కాదా పద్మావతమ్మ,రాజేంద్ర నగర్, మహబూబ్‌నగర్ (కీ॥శే॥ కుంకుమపూడి కృష్ణవేణమ్మ గారి జ్ఞాపకార్థం)		5,000
పోషకులు	: సర్పంచ్, పాలకూరు గ్రామ పంచాయతీ, పాలకూరు, బనగానపల్లి, కర్నూలు జిల్లా		3,000
పోషకులు	: శ్రీ కె. రంగాచారి, భోజన్నపేట, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లా		2,000
పోషకులు	: శ్రీ పి. శివరావు, బాలాజీ నగర్, కొత్త వలస, విజయనగరం జిల్లా		1,000

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

యువతరానికి 'శ్రీరామకృష్ణ ప్రభ'ను మరింత చేరువ చేయాలని సంకల్పించాం. రాష్ట్రంలోని వివిధ పాఠశాలలు/ కళాశాలలు/ గ్రంథాలయాలకు పత్రికను పంపించడానికి మీ సహాయాన్ని కోరుతున్నాం. ఈ కానుక పథకం క్రింద చందా చెల్లించిన దాత పేరున (మీరు సూచించిన లేదా మేము ఎంపిక చేసిన) విద్యాసంస్థకు పత్రికను పంపుతాం. కానుక చందా రూ.1,500/- అంతకన్నా ఎక్కువ ఇచ్చిన దాత పేరు, విద్యాసంస్థ పేరు పత్రికలో ప్రచురిస్తాం.

దాత పేరు	విద్యాసంస్థ
శ్రీమతి సి.హెచ్. వేంకట రత్నమ్మ, వనస్థలిపురం, హైదరాబాద్	మాతాపితరుల సేవా సదనమ్, వినోబా నగర్, ఇబ్రహీం పట్నం
శ్రీ ఉప్పాల శ్రీశైలం&శ్రీహరిప్రసాద్ (తండ్రి కీ॥శే॥ ఉప్పాల ఓబులేషుగారి జ్ఞాపకార్థం)	శ్రీమత్ పెద్ద అహోబిళ ఆర్య వైశ్య అన్నదాన సత్రం, కర్నూలు జిల్లా
" " "	ప్రకాశం జిల్లా కనిగిరిలోని 5 దేవస్థానాలకు జీవితచందాను స్పాన్సర్ చేశారు.
శ్రీ ఎమ్.పి.వి.రెడ్డి, జగద్గిరి గుట్ట, రంగారెడ్డి జిల్లా	శ్రీమాణిక్యేశ్వరి క్షేత్రం(సూర్యనంది క్షేత్రం), గురువిట్కల్, గుల్బర్గా, కర్ణాటక
శ్రీ కె.శ్రీ విష్ణు రెడ్డి, పంజాబ్ నేషనల్ బ్యాంక్, బిదాది బ్రాంచ్, బెంగుళూరు	15 పాఠశాలలకు ఒక సంవత్సరానికి పత్రికను స్పాన్సర్ చేశారు.
శ్రీ ఎస్. సత్యనారాయణ, కాకర్ల, అర్ధవీడు, ప్రకాశం జిల్లా	50 పాఠశాలలకు ఒక సంవత్సరానికి పత్రికను స్పాన్సర్ చేశారు.
శ్రీ ఎమ్. జయరాములు, జి.కె.ఎమ్. కాలనీ, చెన్నై	ఒక దేవాలయానికి, ఒక పాఠశాలకు జీవిత చందాను స్పాన్సర్ చేశారు.
ప్రొఫెసర్. విజయశ్రీ కుప్ప, విద్యానగర్, హైదరాబాద్	శ్రీసాయి విద్యార్థి ఉన్నత పాఠశాల, ఉత్తర లాలాగూడ, సికింద్రాబాద్
శ్రీ గోనె వీరయ్య, ఫణిగిరి, తిరుమలగిరి, నల్గొండ జిల్లా	10 పాఠశాలలకు ఒక సంవత్సరానికి పత్రికను స్పాన్సర్ చేశారు.
శ్రీమతి & శ్రీ కొండూరు చంద్రకళమ్మ, సరిత & స్వాతి, చౌదర్ పల్లి, రంగారెడ్డి జిల్లా	3 పాఠశాలలకు 5 సంవత్సరాలకు పత్రికను స్పాన్సర్ చేశారు.
శ్రీ సాయిశరత్ ముప్పాన, కాకతీయనగర్, హబ్సిగూడ, హైదరాబాద్	జాన్సన్ గ్రామర్ పాఠశాల, కాకతీయ నగర్, హబ్సిగూడ, హైదరాబాద్
శ్రీ రామకృష్ణ సేవా సమితి, కాళ్ళకూరు, కాళ్ళ, ప.గో.జిల్లా	శాంతి గ్రంథాలయం, శ్రీ శాంతి ఆశ్రమం, శంఖవరం, తూ.గో.జిల్లా

చందా వివరాలు		భారతదేశంలో	విదేశాలకు
విడి ప్రతి	:	₹ 10	-
సంవత్సర చందా	:	₹ 100	₹ 1,500
మూడు సంవత్సరాలకు	:	₹ 280	₹ 4,500
ఐదు సంవత్సరాలకు	:	₹ 450	₹ 7,500
ఇరవై సంవత్సరాలకు	:	₹ 1,500	₹ 22,000

గమనిక: డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో **Ramakrishna Math, Hyderabad** అని వ్రాయాలి.

పంపవలసిన చిరునామా: **Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.**

చందాను ఆన్‌లైన్ **http://rkmath.org/srkp** ద్వారా చెల్లించవచ్చు.

లోపలి పేజీల్లో...

6 సంపాదకీయం
నీకు మ్రొక్కెదన్ గణాధిపా!

8 గోరుముద్ద
కర్మయోగికి కవితాంజలి

9 గణపతి ఆవిర్భావం

10 పలికెడిది భాగవతం
ధనమదాంధుల కొలువేల తాపసులకు!

12 మన సంస్కృతి
విదేశాలలో భారతీయ సంస్కృతి

13 రామకృష్ణ భక్తి సూత్రాలు

14 పరిప్రశ్న

15 ఇట్టి ముద్దులాడి బాలు డేడవాడు!

16 సత్యం

18 కత్తిని వదలి తంబురాను పట్టిన కనకదాసు

20 శాంతి స్థాపనే సర్వమత సారం

21 ధీరవాణి
వాచా వేదాంతం వద్దు!

22 శ్రీకృష్ణ లీలలు

24 పాపభీతి... ధర్మనిరతి

26 ప్రశాంత చిత్తం

27 యువవాణి
పరుగులు తీసే మనస్సుకు పగ్గాలు

28 సేవలు... సేవకులు

30 మనోరాగం

31 ప్రియమైన ఉపాధ్యాయులారా...

33 ముందుకు సాగిపో!

35 ఒక కథ చెబుతా...
పరస్పర సహకారం!

36 భగవద్గీత - సద్గుణ సుధ
పరిపూర్ణ వికాసం

37 వికాస మంత్రాలు

38 బొమ్మల కథ
పవిత్రతకు ప్రతిరూపం

ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు. – సంపాదకులు

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు మీద చిరునామాకు పైన మీ చందా నంబరు, కుడి వైపున మీ చందా గడువు ముగిసే నెల ఉంటాయి. మీ చందా గడువు పూర్తయ్యే నెలకు ముందుగానే సొమ్మును చెల్లించి చందాను పునరుద్ధరించుకోండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారిన పక్షంలో 7వ తేదీ లోగా మాకు తెలియపరచినట్లయితే, వచ్చే నెల సంచిక నుండి మీ కొత్త చిరునామాకు పంపబడును.
- ప్రతీ నెల 26 లేదా 27వ తేదీల్లో పత్రిక పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపుగా చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ.... – సర్క్యులేషన్ మేనేజర్

KCP CEMENT
CONCRETE CEMENT
Since 1958

With Best Compliments From
CHAIRMAN & MANAGING DIRECTOR
THE KCP LIMITED
KCP కంపెనీ వారు "శ్రీరామకృష్ణ ప్రభ" మాసపత్రికను
1000 గ్రంథాలయాలకు స్పాన్సర్ చేశారు

KCP Sreshtaa CEMENT
THE NEW GENERATION CEMENT

Cement Marketing Division : Plot No. 10, Gayatri Hills, MP & MLA's Colony, Road No. 10 C, Jubilee Hills, HYDERABAD - 500033.
Tel : 040-2325 3503 to 505, Fax : 2325 3500, Cell : +91 99895 97775 / 9866305145, E-mail : ramakrishna.k@kcp.co.in
Registered Office : No. 2, Dr.P.V.Cherian Crescent, Egmore, CHENNAI - 600 008. Tel : 044 66772668, Fax: 044 66772620, CIN L65991TN1941PLC001128

నీకు మ్రొక్కెదన్ గణాధిపా!

ఆబాలగోపాలానికి ఆరాధ్య దైవం వినాయకుడు. ఆసేతు హిమాచల పర్యంతం గణపతి ఉత్సవాలను ఘనంగా జరుపుకోవడం మన సంప్రదాయం. పిల్లల నుండి వృద్ధుల వరకు అందరూ ఏ కార్యం తలపెట్టినా ప్రథమంగా గణపతిని ఆరాధించడం మన ఆచారం.

ప్రారంభించిన కార్యంలో విఘ్నాలు తొలగించమని విఘ్ననాయకునికి అగ్రపూజలందిస్తూ...

'తొలుత నవిఘ్నమస్తనుచు ధూర్జటినందన నీకు మ్రొక్కెదన్ ఫలితము సేయుమయ్య నిను ప్రార్థన చేసెద నేకదంత...' అని వేడుకుంటాం.

అయితే, ఏ విఘ్ననాయకుణ్ణి ప్రార్థించడం వల్ల సమస్త విఘ్నాలూ తొలగిపోతాయో, అలాంటి విఘ్నరాజు ఉత్సవాల వల్ల విఘ్నాలూ, అఘాయిత్యాలూ, అలజడులూ జరుగుతాయేమోనని ప్రజలు భయాందోళనలకు గురికావాల్సి వస్తోంది.

ఉత్సవాల పరమార్థం : ఒకప్పుడు వినాయకచవితి నాడు ప్రతి ఇంటిలోనూ ఓ చిన్న వినాయక ప్రతిమను ప్రతిష్ఠించి, చక్కగా పాలవెల్లికి పండ్లూ కాయలూ కట్టి, పిండి వంటలు నైవేద్యంగా పెట్టి ఎంతో భక్తి శ్రద్ధలతో ప్రశాంతంగా వినాయకుణ్ణి పూజించేవారు.

నేటికాలంలో ఇళ్ళల్లో వినాయక పూజలు సాధారణ రీతిలోనే కొనసాగుతున్నప్పటికీ, వీధుల్లో భారీ గణపతి విగ్రహాలను పెట్టి ఘనంగా ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా మారింది. ఇప్పుడు విగ్రహాల పరిమాణం ఎంత పెద్దదిగా ఉంటే ఉత్సవాలు అంత వైభవంగా నిర్వహించామనే భావన అధికమవుతోంది. అందువల్ల నేడు అన్ని ప్రాంతాలలోనూ గణపతి ఉత్సవాలను పోటాపోటీగా నిర్వహిస్తున్నారు.

గణపతి ఉత్సవాలను అందరూ, అంతటా వైభవంగా ఉత్సాహంతో జరుపుకోవడం శుభపరిణామమే! అయితే, ఏ ఉత్సవాలైనా ప్రజల మధ్య సంఘీభావం పెంపొందించే విధంగా, శాంతి సామరస్యాలతో జీవించే విధంగా, ధర్మపథంలో నడిపించే విధంగా, ఆధ్యాత్మిక భావాలను వికసింపజేసే విధంగా ఉండాలేగానీ మనుష్యుల మధ్య అంతరాలను అధికం చేసేలా, అశాంతిని కలిగించేలా, పోటీతత్త్వాన్ని ప్రోత్సహించేలా, క్రోధావేశాల్ని పెంచేలా ఉండకూడదు.

మన అంతరంగంలో ప్రతిష్ఠితుడై ఉన్న పరమాత్మ, విరాట్‌రూపంలో విశ్వమంతా విరాజిల్లుతున్నాడు. అందువల్ల మన హృదయమందిరంలో కొలువై ఉన్న పరమాత్ముని ఉనికిని మరువకూడదు. మనం చేసే బాహ్యపూజలు, పునస్కారాలు, పండుగలు, పర్వదినాలు, ఉత్సవాలు, జాతరలు మన అంతరంగ పరివర్తనకు తోడ్పడాలి. ప్రశాంత జీవనానికి దోహదపడాలి. అప్పుడే మనం పండుగల పరమార్థాన్ని పూర్తిగా అవగాహన చేసుకొన్న వారమవుతాం.

దేవాలయం.. దేహాలయం: భగవంతుడు కూడా బాహ్య వైభవాల కన్నా అంతరంగ భక్తి శ్రద్ధలకే ప్రీతి చెందుతాడు. అందుకు ఎంతోమంది భక్తుల జీవితాలు నిదర్శనం. అలాంటి మహాభక్తుల్లో ఒకరైన పూసల నాయనార్ గురించి తెలుసుకుందాం:

ద్రావిడ దేశపు మహారాజు శివుని కోసం ఒక సుందర దేవాలయాన్ని నిర్మించాలని సంకల్పించాడు. దేశంలోని అత్యంత నైపుణ్యంగల శిల్పులను పిలిపించి ఆలయ నిర్మాణాన్ని ఆరంభించాడు. చాలా ఏళ్ళకి విశాల శివాలయ నిర్మాణం పూర్తయింది. ఆ నూతన ఆలయానికి కుంభాభిషేకం జరిపించాలని పండితులను సంప్రతించి ఒక శుభదినాన్ని నిర్ణయించాడు మహారాజు. అదేరోజు రాత్రి మహారాజు కలలో శివుడు కనపడి 'రాజా! నీవు నిర్మించిన ఆలయ కుంభాభిషేక ఉత్సవాలను వాయిదా వేయి. అదేరోజున నేను నా పరమభక్తుడు నిర్మించిన ఆలయ కుంభాభిషేక ఉత్సవానికి వెళ్ళాల్సి ఉంది' అని చెప్పి అదృశ్యమయ్యాడు.

అప్పుడు మహారాజు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యాడు. 'నా దేశంలో నాకు తెలియకుండా శివాలయాన్ని నిర్మించే స్తోమతగల వ్యక్తి ఎవరో, పరమేశ్వరునికి ప్రీతిపాత్రుడైన ఆ మహాభక్తుడెవరో తెలుసుకోవాలి' అని అనుకున్నాడు. దేశం నలుమూలలా భటులను పంపించి వెతికించాడు. కానీ వారికి నూతనంగా నిర్మించిన శివాలయం ఎక్కడా కనపడలేదు. చివరికి ఒక గ్రామంలో పూసలుడనే శివభక్తుడున్నాడని తెలుసుకున్నారు. వెంటనే మహారాజు అతణ్ణి కలుసుకోవడానికి వెళ్ళాడు. పూరిగుడిసెలో ఒక మూల ప్రశాంత వదనంతో కూర్చొని ఉన్న ఆ వ్యక్తిని చూసాడు. దివ్యతేజస్సుతో ప్రకాశిస్తున్న ఆ నిరుపేద భక్తుణ్ణి చూసిన మహారాజు అతనికి ప్రణమిల్లి తనకు శివుడు

కలలో కనిపించి చెప్పిన విషయాన్ని వివరించాడు. నూతనంగా నిర్మించిన శివాలయం గురించి విచారించాడు. అప్పుడు పూసలుడు తాను నిర్మించిన హృదయ మందిరం గురించి వివరిస్తూ... "నా హృదయంలోనే శివునికి ఒక మందిరాన్ని నిర్మించతలపెట్టాను. ఆలయానికి పునాదులు తవ్వుతున్నట్లు, రాళ్ళతో గోడలు కడుతున్నట్లు, విమాన గోపురం నిర్మిస్తున్నట్లు... ఇలా ఏళ్ళతరబడి చింతన చేస్తూ హృదయ మందిర నిర్మాణాన్ని పూర్తిచేశాను" అని తెలిపాడు.

అప్పుడు మహారాజు ఆ పరమశివభక్తుని పాదాలపై పడి తాను నిర్మించిన శివాలయంలో పూజారిగా ఉండమని వేడుకున్నాడు. రాజాజ్ఞను దైవాజ్ఞగా భావించిన పూసల నాయనార్ అందుకు సమ్మతించాడు.

దీన్నిబట్టి భగవంతుడు బాహ్యంగా ఎంత పెద్ద దేవాలయం నిర్మించాం, ఎంత పెద్ద పరిమాణంలో విగ్రహాలను ప్రతిష్ఠించాం, ఎంత వైభవంగా ఉత్సవాలను నిర్వహించామనే విషయాలకన్నా, భగవంతుణ్ణి మన హృదయ మందిరంలో ఎంత భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తున్నామో అన్న విషయానికే ప్రాధాన్యమిస్తాడని తెలుస్తుంది.

'దేహో దేవాలయః - దేహమే దేవాలయం' అన్న మైత్రేయోపనిషత్ వచనాలను సమర్థిస్తూ స్వామి వివేకానంద కూడా 'భగవదారాధన కోసం ఆలయాలను నిర్మించడం మంచిదే! కానీ అంతకన్నా ఉత్తమమైన, ఉన్నతమైన ఆలయం మానవ దేహం' అని అంటారు.

మన హృదయ మందిరంలో ప్రతిష్ఠితుడై ఉన్న భగవంతుణ్ణి స్పృశించిన నాడే దేవాలయంలో విగ్రహరూపంలో ప్రతిష్ఠితమై ఉన్న భగవంతుణ్ణి దర్శించగలుగుతాం. అప్పుడే అంతటా శాంతి వెల్లివిరుస్తుంది, అందరం సామరస్యంతో జీవించగలుగుతాం, ఆధ్యాత్మిక మార్గంలో ప్రగతిని సాధించగలుగుతాం.

విఘ్నాలకు మూలం : సాధారణంగా మనం విఘ్నాలకు కారణం బాహ్య పరిస్థితులు, మనుష్యులు అని భావిస్తాం. కానీ అసలు విఘ్నాలకు నిలయం మన మనస్సే అన్న విషయం గ్రహించం. అందువల్ల బాహ్యమైన విఘ్నాలు తొలగాలనీ, కార్యం సిద్ధించాలనీ, శుభం చేకూరాలనీ విఘ్నేశ్వరుణ్ణి పూజిస్తామే కానీ మన అంతరంగంలో ఉన్న కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సరాలనే ఆరుగురు విఘ్నాసురులను నశింపజేయమని ప్రార్థించడం మరచిపోతాం.

మన ప్రగతికి, శాంతికి ప్రధాన శత్రువులైన ఈ విఘ్నాసురులను వినాయకుడు వికటావతారంలో కామాసురుడ్నీ; లంబోదరావతారంలో క్రోధాసురుడ్నీ; గజాననావతారంలో లోభాసురుడ్నీ; మహోదరావతారంలో మోహాసురుడ్నీ; ఏకదంతావతారంలో మదాసురుడ్నీ; వక్రతుండావతారంలో మత్సరాసురుడ్నీ వధించాడని ముద్గలపురాణం వివరిస్తుంది.

కామ, క్రోధ, లోభ, మోహ, మత్సరాలనే అసురగుణాలుగల వ్యక్తి తాను మాత్రమే పతనమవుతాడు. కానీ మదంతో విర్రవీగే వ్యక్తి తాను పతనమవడంతో పాటు, ఇతరులకు కూడా హాని కలిగిస్తాడు. అందువల్ల ఈ అసురులందరిలోకీ మదాసురుడు చాలా శక్తిమంతుడు. విద్యామదం, ధనమదం, అధికారమదం ఉన్న వ్యక్తి చాలా ప్రమాదకరం. అలాంటి మదాసురుణ్ణి అణచగల మహాశక్తిసంపన్నుడు వినాయకుడు.

ఒకసారి అలకాపురాధీశుడైన కుబేరుడిలో ధనమదం ప్రవేశించింది. దేవతలందరినీ అలకాపురికి విందుకు ఆహ్వానించి ఈ ముల్లోకాలలో తన కన్నా ఐశ్వర్యవంతుడు ఎవరూ లేరని నిరూపించాలనుకున్నాడు. కుబేరుడు దేవతలందరితో పాటు పార్వతీ పరమేశ్వరులను కూడా ఆహ్వానించాడు. కానీ తమ తరఫున బాలగణపతి విందుకు విచ్చేస్తాడని చెప్పాడు పరమేశ్వరుడు. ఆ విందు రోజు బాలగణపతి అలకాపురిలో అడుగుపెట్టీ పెట్టగానే ఆకలి ఆకలి అంటూ ఏడవసాగాడు. బాలుడే కదా! అని తలచిన కుబేరుడు గణపతికి భోజన పదార్థాన్ని కొంచెం వడ్డించాడు. దాన్ని ఆరగించిన బాలగణపతి మళ్ళీ ఆకలి ఆకలి అంటూ అరిచాడు. కుబేరుడు వడ్డిస్తూ ఉంటే గణపతి తింటూనే ఉన్నాడు కానీ ఆకలి తీరిందని మాత్రం అనడం లేదు. ఇంతలో దేవతలందరూ విందుకు వేంచేసారు. భోజనశాలలోని పదార్థాలన్నీ ఖాళీ అయిపోయాయి. ఇక నలుగురిలో నవ్వులపాలవుతాననే భయంతో కుబేరుడు పరిష్కారం కోసం పార్వతీ పరమేశ్వరుల వద్దకు పరుగెత్తాడు. అప్పుడు పార్వతీదేవి అలకాపురికి వెళ్ళి బాలగణపతి నోటిలో పిడికెడు వడపప్పును వేసింది. వెంటనే బాలగణపతి నా ఆకలి తీరింది అంటూ లేచాడు. అప్పుడు కుబేరుడిలో కేవలం ధనంతో అందరినీ మెప్పించగలననే గర్వం అణగిపోయింది.

విఘ్నకారకాలైన అంతరంగ శత్రువులు నశించినప్పుడే శాంతి వెల్లివిరుస్తుంది. సమతాభావం నెలకొంటుంది. ధర్మనిరతి పెంపొందుతుంది. ఆధ్యాత్మిక ప్రగతి సాధ్యమవుతుంది. కాబట్టి బాహ్య విఘ్నాలతో పాటు మన అంతరంగంలో ఉన్న విఘ్నాసురులను కూడా నాశనం చేయమని 'అవిఘ్నమస్తనుచు నీకు మ్రొక్కెదన్ *గణాధిపా!'* అని ఆ విఘ్నపతిని ప్రార్థిద్దాం. ❖

అసుర గుణాలు కలవారు విషయభోగాల కోసమే గానీ, మరొక పురుషార్థం గురించి ఆలోచించరు. అలాంటి వారి చింతకు అంతం ఉండదు. అది మరణం వరకు కొనసాగుతూనే ఉంటుంది. - శ్రీకృష్ణుడు

కర్మయోగికి కవితాంజలి

యువతరానికి కలల విలువను, వాటిని సాకారం చేసుకునే వెలుగుతోవను చూపిన అపురూప ఆచార్యుడు 'భారతరత్న' అబ్దుల్ కలామ్. క్షిపణి ప్రయోగాల నుంచి కవితారచన వరకు ఆయన ప్రవేశించిన రంగాలన్నీ ముందు తరాలకు చైతన్యదీపికలై దారిచూపుతాయనడంలో సందేహం లేదు.

'మానవచరిత్ర అనే గ్రంథంలో నీ పేరిట ఓ స్వర్ణపుటను లిఖింపచేసుకో! అప్పుడే నీవు శాశ్వత స్మరణీయుడవవుతావు!' అంటూ విద్యార్థులకు పిలుపునిచ్చారు. తనూ పది కాలాల పాటు చెదరని, చెదపట్టని అలాంటి పుటను లిఖింపజేసుకున్నారు.

'Dream is not that which you see while sleeping. It is something that does not let you sleep - నీవు నిదురించే వేళలో చూసేది కాదు కల అంటే... నిన్ను నిదుర పోనివ్వకుండా ముందుకు నడిపేదే నిజమైన కల' అంటూ నినదించిన కర్మయోగి కలామ్. యువతను కలలు కనమని చెప్పి, భారతావని అభ్యుదయ ప్రణాళికలను రూపుదిద్ది, ఆ బాధ్యతను ప్రతి భారతీయ పౌరుడి భుజస్కంధాలపై నిలిపి నిశ్శబ్దంగా నిష్క్రమించారు. కానీ ఆయన నింపిన స్ఫూర్తి, నవయుగానికి నాందిగీతం పాడుతుంది.

ఆ మహామూర్తిని స్మరించుకున్నప్పుడు, స్వామి వివేకానంద విరచిత కవిత 'సుఖకర స్వప్నం' మనస్సులో మెదలుతుంది. ఆ కవితాఖండికలో ఇలా అంటారు స్వామీజీ:

శుభం అశుభం ఏమైనా కానీ,
సుఖం తిరోగమించి తన ముఖాన్ని చూపెట్టనీ, లేదా
దుఃఖ సాగరాలు ఉవ్వెత్తున లేవనీ
ప్రతివారికీ ఓ ప్రత్యేక పాత్ర ఉంది.

మందహాసమో, మహాదుఃఖమో
ప్రతి ఒక్కరికీ
తగిన వేషభూషణాలు ఉంటాయి.
ప్రతి ఒక్కరి రంగాలు
కావడి కుండలుగా
ఒకటి తర్వాత ఒకటిగా మారుతూ ఉంటాయి.

ఓ స్వప్నమా! సుఖకర స్వప్నమా!
నీ మాయాజాలాన్ని సుదూరంగా, సమీపంగా పరచు,
కరుకైన రేఖల్ని కడుమృదువుగా మార్చు
కఠోరత్వాన్ని కోమలంగా చేయి
ఇంద్రజాలమంతా నీలోనే నిక్షిప్తం.

నీ స్పర్శతో
ఎడారులు నందనోద్యానాలవుతాయి
భీకరమైన పిడుగుపాటు
శ్రావ్యగానమవుతుంది
మహామృత్యువు మధురముక్తిగా మారుతుంది.

దాదాపు వందేళ్ళ క్రితం ఆ యుగపురుషుడు అంతరంగంలో ఆవిష్కరించుకున్న ఈ కవితాపంక్తులకు, కలామ్‌లాంటి మహానుభావుల జీవితాలు సాకార సాక్ష్యాలు. జన్మను సార్థకం చేసుకొని, మానవచరిత్రలోనే మరపురాని మహర్షిగా నిలిచిపోయిన ఆ మహనీయుడి నడకలను అనుసరించడమే 'కలల కలామ్'కు మనం అర్పించే నిజమైన నివాళి! ❖

గణపతి ఆవిర్భావం

- స్వామి హర్షానంద

'విఘ్నేశ్వరుడు' లేక 'విఘ్నరాజు' అన్న సుప్రసిద్ధ గుణవాచకాలతో గణపతి పూజలు అందుకొంటున్నాడు. ఆటంకం కలిగించేదీ, పరిమితం చేసేదీ, నిరోధించేదీ, ఆపివేసేదీ – వీటి అన్నింటికీ ఆయన ప్రభువు.

ప్రతి పనీ, అది పారమార్థిక కార్యమైనా లేక లౌకిక కార్యమైనా వినాయకుణ్ణి పూజించకుండా ప్రారంభించరు. ఆయన విఘ్నాలకు అధిదేవత.

గజాననుడు లేక గజముఖుడు అనే పేర్లు గణపతికి వచ్చాయి. 'గజ' అన్న పదానికి ఒక అంతరార్థం ఉంది. 'గ' అనే అక్షరం గతిని సూచిస్తుంది. 'జ' అనే అక్షరం జన్మను సూచిస్తుంది. 'గజ' అన్న పదం – ఈ జగత్తు ఎవరి నుండి వెలువడిందో వారి వైపే సాగిపోతూ చివరికి వారిలోనే లయమవ్వడాన్ని సూచిస్తుంది.

సృష్టిలో బ్రహ్మాండం, సూక్ష్మాండం అనే రెండు విధాలైన అభివ్యక్తీకరణలున్నాయి. ఈ రెండూ ఒకటిగా, ఒకదానిలోనే రెండుగా ఉన్నాయి. గజముఖం బ్రహ్మాండానికీ, మానవదేహం సూక్ష్మాండానికీ ప్రతిరూపం. సూక్ష్మాండానికి గమ్యం బ్రహ్మాండం కాబట్టి గజముఖ భాగానికి ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు.

గణపతి ఆవిర్భావానికి వస్తే, మన పురాణాలలో పలు విధాలుగా చెప్పారు.

1.సృష్ట్యాదిలో, జగత్తుని సృష్టించే ముందు ఏర్పడిన విఘ్నాలను తొలగించడానికి బ్రహ్మదేవుడు ధ్యానమగ్నుడు కాగా, ఆ పరబ్రహ్మ ఓంకార స్వరూపునిగా, వక్రతుండునిగా గోచరించి, విఘ్నాలను తొలగించాడు.

2. పార్వతీదేవి అభ్యంగన స్నానమాచరిస్తూ, నలుగు పిండితో బాలుని సృష్టించి, ప్రాణప్రతిష్ఠ చేసి, ద్వారం వద్ద కావలి ఉంచగా, తనను అడ్డగించినందుకు శివుడు రుద్రునిగా మారి ఆ బాలుని శిరస్సు ఖండించి, పిదప పశ్చాత్తాపపడి, ఏనుగు శిరస్సుతో ఆ బాలుని పునరుజ్జీవుని చేసి, ఆ పై గణనాయకునిగా నియమించాడు.

3. పార్వతీదేవి, గంగామాతలచే సంరక్షితుడై పెంచబడిన వానిగా, ద్వైమాతురుడు (ఇరువురు తల్లులు గలవాడు)గా ప్రస్తుతినందుకున్నాడు.

4. పరమశివుని ముఖాకృతి నుండి, ఆకాశతత్త్వాన్ని సూచిస్తూ వింత ఆకర్షణతో వెలువడగా, పార్వతి ఆగ్రహానికి గురై మరుగుజ్జు ఆకారం దాల్చాడు.

5. గణేశుడు అసలు కృష్ణ స్వరూపుడనీ, శనిదృష్టితో శిరస్సు ఖండింపబడగా, ఆ శిరస్సు గోలోకానికి ఎగసినదనీ, ఆ తరువాత ఏనుగు తలను అతికించినారనీ ఒక ఐతిహ్యం.

ఇలా ఎన్నో రకాలుగా ఆవిర్భవించినట్లు చెప్పుకుంటున్న ఆ గణపతి ఉపాసన పలు ప్రాంతాలలో, పలు విధాలుగా ఉంది. 'బాలగణపతి'గా స్వామిని ఉపాసించే సంప్రదాయం ఉంది. అలాగే 'తరుణగణపతి' యువక దశను సూచిస్తుంది. 'హేరంబగణపతి' పంచ ముఖాలతో, పది చేతులతో, ముక్కంటితో, సింహ వాహనాన్ని అధిరోహించి దర్శనమిస్తాడు. 'వీరవిఘ్నేశుడు' (వీరగణపతి) పది చేతుల్లోనూ ఆయుధాలను ధరించి ఉంటాడు. లక్షణకారిని అయిన శక్తి, లక్ష్మితో కూడినప్పుడు లక్ష్మీగణపతిగా దర్శనమిస్తాడు. అలాగే సిద్ధి, బుద్ధి సహిత గణపతిగానూ గోచరమవుతాడు.

వామాచారంలో 'ఉచ్ఛిష్టగణపతి' చెప్పబడింది. 'నృత్య గణపతి' మూర్తి భంగిమ కడు రమ్యంగా, సమ్మోహనంగా కనిపిస్తుంది. ఒక సందర్భంలో బ్రహ్మదేవుడు గణపతికి వినయపూర్వక ప్రణామాన్ని భక్తి శ్రద్ధలతో చేయగా, దానికి ఆనందించి, అద్భుత విన్యాసాలను ప్రదర్శిస్తూ నర్తించాడు గణపతి. ఆనాటి నుండి సంగీత నాట్యకళలకు సాకారమై నిలిచాడు. వినాయక చవితి నాడు మనం పూజించే గణపతి, 'వరసిద్ధి వినాయకుడు'. ఈయన కోరిన వరాలను వెంటనే అనుగ్రహించేవాడు, బ్రహ్మచారి.

మహాగణపతికి, స్వస్తిక పద్మానికి అవినాభావ సంబంధం ఉంది. హోమాలలో, ప్రతిష్ఠలలో, గణపతి స్థానంలో స్వస్తిక పద్మం వేసి గణపతిని ఆరాధించడం ఉంది. ఇంతే కాక, పలు ప్రాంతాలలో లింగాకారంలో, సాలగ్రామ రూపంలో, యంత్ర రూపంలో గణపతి ఆరాధన చేస్తుంటారు. గణపతి దేవాలయాలు మన దేశంలోని అన్ని ప్రాంతాలలో ఉన్నాయి. అంతేకాక ఇతర ప్రముఖ దేవాలయాలన్నింటిలోనూ ఆదిలోనే గణపతి విగ్రహం ఉంటుంది. ❖

ఎవడు శరీరానికి కష్టం కలుగుతుందనీ, దుఃఖం అనుభవించాల్సివస్తుందనీ భయపడి కర్మలను త్యజిస్తాడో, అలాంటి త్యాగం రాజస త్యాగం. అతడు త్యాగ ఫలంను పొందలేడు. - శ్రీకృష్ణుడు



పలికెడిది భాగవతం

ధనమదాంధుల కొలువేల తాపసులకు!

- స్వామి జ్ఞానదానంద

అంత్యకాలం సమీపిస్తున్న పరీక్షిత్తుకు, అంతర్యామి అయిన ఆ భగవంతుడి అస్తిత్వాన్ని, అజ్ఞానంతో కూడిన సగటు మానవుడి సుఖాపేక్షను శుకమహర్షి వివరిస్తున్నాడు. బుద్ధిహీనుడైన మానవుడికి నిరంతరం నిరర్థకమైన దేహసుఖాలపైనే ధ్యాస అనీ, దానికి మించిన ఆలోచనే ఉండదనీ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నాడు. జ్ఞానవంతుడైన మానవుడు శరీరధారణకు అవసరమైనంత మేరకే భోగాలను స్వీకరిస్తాడనీ, ఈ లౌకిక ప్రపంచంలో అప్రమత్తంగా మసలుకుంటూ, శాశ్వతమైన ఆనందం కోసం ప్రయత్నిస్తాడనీ స్పష్టం చేస్తున్నాడు. నిజానికి ఆడంబరాలకు పోయినంత కాలం ఆధ్యాత్మికోన్నతి అసాధ్యమని పరోక్షంగా ప్రవచిస్తున్నాడు. అందుకే బుద్ధిమంతుడు ఈ సంసారం సుఖమనుకోకుండా, దీనికి అతీతమైన స్థితిలో, పూర్తిగా సరళజీవనానికే ప్రాధాన్యమిస్తూ....

కమనీయ భూమి భాగములు లేకున్నవే!
పడియుండుటకు దూది పరుపులేల?
సహజంబులగు కరాంజలులు లేకున్నవే!
భోజనభాజనపుంజ మేల?....
...పోసగ భిక్షము వెట్టరే పుణ్యసతులు!
ధనమదాంధుల కొలువేల తాపసులకు?

అనుకుంటూ, నిరాడంబరంగా, నిశ్చింతగా జీవిస్తాడని శుకబ్రహ్మ గుర్తుచేస్తున్నాడు.

తాపసులుగా జీవించాలనుకునేవారు, నిద్రించడానికి చదునైన చక్కని నేల ఉండగా దూదిపరుపు లెందుకు? పుట్టుకతో వచ్చిన దోసిళ్ళు ఉన్నాయి కదా, భుజించటానికి కంచాలూ, చెంచాలూ ఎందుకు? నారచీరలు, దర్భచాపలు లేవా! కట్టుకోవడానికి పట్టుపీతాంబరాలెందుకు? నివసించడానికి గుహలు ఉన్నాయి కదా! ఇక మేడలూ, మిద్దెలూ ఎందుకు? చెట్లు తగినట్లు ఫలరసాదులు వర్షిస్తున్నాయి కదా! నదులలో తియ్యటి నీటికి కొదవలేదు కదా! పుణ్యస్త్రీలు పుష్కలంగా భిక్ష పెడుతున్నారు కదా! అన్న ధీమాతో ఉంటారు. ధనమదంతో కన్నూమిన్నూ కానకుండా ప్రవర్తించే శ్రీమంతులను వారు ఆశ్రయించేందుకు ఇష్టపడరని వ్యాసపుత్రుడు వివరిస్తున్నాడు.

భౌతికంగా, మానసికంగా పరాధీనులుగా ఉండేవారు, దేహసుఖాల కోసం ధనవంతుల పంచన చేరేవారు లౌకికంగానే కాదు, పారలౌకికంగా కూడా స్వతంత్రులు కాలేరని ఆ అవధూత శిరోమణి అన్యాపదేశంగా చెబుతున్నాడు. డాంబికమైన జీవనశైలికి సుదూరంగా, మితమైన సౌకర్యాలతో సంతృప్తిగా కాలం గడిపేవారే పారమార్థికతలోని ఆనందాన్ని అనుభూతి చెందగలరు. అలా కాకుండా ఎండమావుల వంటి సుఖాలను సొంతం చేసుకోవాలని పరుగులు తీస్తున్నంత కాలం ఆయాసం తప్ప ఆనందం లభించదు. వాటి కోసం నిరంతరం ఎవరో ఒకరి కింద బానిసగా బతకక తప్పదు!

పరిమితితోనే పారమార్థికోన్నతి...: శ్రీకాళహస్తీశ్వర శతకంలో మహాకవి ధూర్జటి కూడా శుకమహర్షి సందేశాన్ని సమర్థిస్తాడు. తత్భావంతోనే శ్రీకాళహస్తీశ్వరుడిని స్తుతిస్తూ, భక్తులైన వారికి సరళజీవనం, శరణాగతి ప్రాధాన్యాన్ని వివరిస్తూ...

ఊరూరం జనులెల్ల భిక్షమిదరో, యుడం గుహల్గల్గవో
చీరానీకము వీథులం దొరకదో, శీతామృత స్వచ్ఛవాః
పూరం బేరుల బారదో తపసులం బ్రోవంగ నీ వోపవో
చేరం బోవుదురేల రాజుల జనుల్ శ్రీకాళహస్తీశ్వరా!

'శ్రీకాళహస్తీశ్వరా! తినేందుకు అడిగితే ప్రతి ఊరిలో ప్రజలు భిక్ష వేయరా! నివసించేందుకు గుహలు లేవా? వసతినిచ్చే వీథులు లేవా? తాగేందుకు నదుల్లో చల్లనైన తియ్యని నీరు ప్రవహించడం లేదా? మానవులను కాపాడేందుకు నీవు లేవా? అయినా ఈ ప్రజలు రాజులను ఆశ్రయించేందుకు ఎందుకు తిరుగుతున్నారో కదా!' అని ఆవేదన చెందాడు.

మనం ఆ మహాత్ములు ప్రబోధించినట్లు చెట్టుచేమలు పట్టుకొని తిరగలేకపోయినా, నిరాడంబరంగా జీవిస్తే చాలు! కానీ మనం ఓ వైపు అపరిమితమైన భోగాలను అనుభవిస్తూ, మరోవైపు ఆధ్యాత్మిక జీవితం గడపాలని ప్రయత్నిస్తూ ఉంటాం.

నిజానికి భోగాలకు, భగవంతుడికి పొసగదు. ప్రాపంచిక విషయాలపై ఎంతో కొంత వైరాగ్యభావం లేనిదే, పారమార్థిక సాధన సాధ్యపడదు. అందుకే కౌపీనం, కమండలం తప్ప తనదంటూ, తనకంటూ ఏమీ ఉంచుకోని శుకమహర్షి, వైరాగ్యమే ఆనందానికి అత్యున్నతమైన అర్హతగా ప్రతిపాదిస్తున్నాడు. ఇలా నిజమైన ఆధ్యాత్మిక గురువులు త్యాగం, పరోపకారం, సరళజీవనాలే భగవంతుడిని చేరే మార్గాలని బోధిస్తారు.

భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస తమ దగ్గరకు వచ్చే గృహస్థభక్తులకు స్వతంత్రజీవనం విలువను తరచూ చెబుతూ "నిరంతరం కామినీకాంచనాలలో మునిగితేలే బడాబాబులు బద్ధజీవులుగా మిగిలిపోతారు. వారి నుంచి మహత్కార్యాలను ఎలా ఆశించగలం? వారు కాకులు కొట్టిన మామిడిపండు లాంటివారు. అటువంటి పండు నైవేద్యానికి పనికిరాదు. తినడానికి కూడా సంకోచిస్తారు" అనేవారు. ఆ ప్రబోధాలతో ఎందరో జమీందారులు, భూస్వాములు పరివర్తన చెంది, తమ ఆస్తిపాస్తుల్లో చాలా వరకు సమాజ సేవకు వినియోగించి, అనంతరం తమ జీవితాల్లో ఆధ్యాత్మిక జ్యోతులను వెలిగించుకున్నారు.

రక్షకుడతడే....: వివేకభూషణుడు, విశేషభాషణుడు శుకదేవుడు పరీక్షిత్తుకు సరళజీవనంతో పాటు సర్వేశ్వరుడి రక్షకత్వాన్ని కూడా గుర్తుచేస్తున్నాడు. అందరినీ సంరక్షించే సర్వాత్మకుడు ఆ భగవంతుడు ఉండగా, ఇతరులను ఎవరినీ ఆదుకొమ్మని అర్థించాల్సిన అవసరం లేదని పునరుద్ఘాటిస్తూ....

రక్షకులు లేనివారల రక్షించెద ననుచు చక్రి రాజై యుండన్
రక్షింపుమనుచు నొక నరు, నక్షము ప్రార్థింపనేల యాత్మజ్ఞులకున్

అంటున్నాడు.

దిక్కులేని వారికి దిక్కై రక్షిస్తానంటూ చక్రధారియైన ఆ శ్రీహరి సిద్ధంగా ఉన్నాడు. అలాంటప్పుడు ప్రాజ్ఞులైనవారు అల్పబలమున్న మానవున్ని రక్షించమని ఎందుకు ప్రాధేయపడాలి? అంటున్నాడు. అయితే భగవంతుడి అస్తిత్వంపై అపనమ్మకమున్న నాస్తికులకు ఈ అభయవాక్యాలు వంటబట్టవు. అందుకే వారు ఎప్పుడూ తమ ఆర్థిక, సామాజిక భద్రతల గురించి అతిగా జాగ్రత్త పడుతూ ఉంటారు. ఇదే మానసికస్థితితో ఒకసారి పాల్‌బ్రంటన్ అనే పాశ్చాత్యభక్తుడు భగవాన్ రమణమహర్షితో 'మీ భారతీయులు భౌతిక పరిణతి (మెటీరియలిస్టిక్ డెవలప్‌మెంట్), సామాజిక భద్రత (సోషల్ సెక్యూరిటీ) గురించి అశ్రద్ధ చేస్తుంటారు.. అంతా దైవాధీనం అనుకుంటూ బతికేస్తూ ఉంటారు' అని విమర్శపూర్వకంగా అన్నారు. అప్పుడు మహర్షి "నిజమే! ఆ విషయంలో మేము అమాయకులమే! కానీ మేము ఎక్కువ కోర్కెలు లేనివాళ్ళం. మీ దృష్టిలో మా సమాజం వస్తుపరంగా ఇంకా వెనుకబడి ఉండవచ్చు! కానీ మేము మీకంటే చాలా తక్కువ వస్తువులతోనూ, పరిమిత సదుపాయాలతోనే మీ కన్నా ఎక్కువ సంతృప్తిగా ఉంటాం. మమ్మల్ని రక్షించేవాడు ఒకడున్నాడన్న నమ్మకమే మాకు బలం" అని వివరణ ఇచ్చారు. ఆ తరువాత అతను మహర్షి పరమభక్తుడయ్యాడు.

హరిని మరిస్తే నరకద్వారమే...: మనలో చాలామంది భగవంతుడి గురించి ఆలోచించకుండా, ఉన్నన్నాళ్ళూ ఈ ఉదరపోషణార్థమే బతుకుతూ ఉంటారు. దాని కోసం పడరాని పాట్లన్నీ పడుతూ, పట్టకూడని వ్యక్తుల పాదాలు పడుతూ, వ్యక్తులకు వింజామరలు విసురుతూ గడిపేస్తూ ఉంటారు. అలా శ్రీహరిని చింతించని భోగజీవులకు నరకద్వారాలు స్వాగతం పలుకుతాయనీ, అక్కడ యమభటుల శిక్షలు తప్పవనీ శుకమహర్షి హెచ్చరిస్తున్నాడు. అలాంటి వారికి జన్మజన్మలు కష్టాలు తప్పవంటున్నాడు. ఇంతటి తీవ్రతతో భీతిగొల్పినప్పుడే, మనం అపురూపమైన మానవజన్మలో అప్రమత్తమవుతాం. బతుకుసరళిని మార్చుకొని భగవంతుడి వైపునకు మరలుతాం. ఈ పరమసత్యం తెలిసిన భాగవతోత్తముడు గనుకనే పోతనామాత్యులు కూడా శ్రీమద్భాగవతాన్ని అల్పసుఖాల కోసం రాజులకు అంకితమివ్వకుండా, ఆ శ్రీహరికే సమర్పించుకుంటూ....

ఆడంబర జీవితానిది, ఆధ్యాత్మిక ఉన్నతిది విలోమ సంబంధం. ఒకటి పెరిగితే, మరోటి తగ్గుతుంది. నిత్యజీవనంలో భోగాల భాగస్వామ్యం ఎంత ఎక్కువైతే, భగవంతుడి భాగస్వామ్యం అంత తరిగిపోతూ ఉంటుంది.

పలు సుఖాల కోసం ప్రపంచంలో, పరాధీనులమై పరుగెడుతున్నంత కాలం ప్రశాంతత అన్న ప్రశ్నే లేదు. మనల్ని పట్టించుకునేవాడు, పరిరక్షించేవాడు ఆ పరమేశ్వరుడు ఒక్కడే అన్న నమ్మికతో నడిస్తే తడబాట్లకు, తప్పటడుగులకు తావే ఉండదు.

ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులున్
సొమ్ములు కొన్ని పుచ్చుకొని, చొక్కి, శరీరము వాసి, కాలుచే
సమ్మెట వ్రేటులం బడక సమ్మతి శ్రీహరి కిచ్చి చెప్పె నీ
బమ్మెర పోతరాజొకడు భాగవతంబు జగద్ధితంబుగన్

'విశ్వశ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని రచించిన ఈ భాగవతాన్ని భగవంతుడికి తప్ప ఈ చిల్లరమల్లర ప్రభువులకు అంకితమివ్వడానికి నా అంతరంగం అంగీకరించడం లేదు. ఈ రాజులిచ్చే అగ్ర'హారాలు', వస్తువాహనాలు పుచ్చుకొని ఆ మైకంలో మైమరచి, ఈ లోకంలో సుఖాలు అనుభవించినా, పైలోకంలో అడుగుపెట్టిన తరువాత, ఇక్కడ చేసిన తప్పిదాలకు యమధర్మరాజు సమ్మెటపోట్లు తప్పవు' అంటూ ఆ శ్రీహరి పాదాలనే ఆశ్రయించాడు. భగవంతుడి హృదయాన్ని గెలిచాడు. ❖

అజ్ఞాన మోహితుడైన మానవుడు 'నేను ఐశ్వర్యవంతుణ్ణి, నేను ఉన్నత వంశంలో పుట్టినవాణ్ణి, నేను దానాలిస్తాను, నేను భోగాలను అనుభవిస్తాను'... అంటూ జీవనం సాగిస్తాడు. - శ్రీకృష్ణుడు

"ఒక వ్యక్తి తనను తాను అసహ్యించుకొంటున్నట్లయితే అదే పతనానికి హేతువు. పూర్వీకుల చరిత్రను అవమానకరంగా భావిస్తే, ఆ జాతి అంతానికి చేరుకున్నట్లే!" అంటారు స్వామి వివేకానంద. గత వైభవాన్ని మర్చిపోయినంత కాలం మనమూ, మన దేశం స్తబ్ధతలో మునిగిపోతాం. అందుకే, మన ప్రాచీన సంస్కృతి గురించి తెలుసుకోవాలి. గడచిపోయిన సంగతులు తెలుసుకొంటూ, భవిష్యత్ మహత్కార్యాల సాధన వైపు నడవాలి. మన ప్రాచీన భారతీయ సంస్కృతిని గుర్తు చేసేందుకు చేస్తున్న ప్రయత్నమే ఈ వ్యాసాల పరంపర. సుప్రసిద్ధ రచయిత, బెంగుళూరు రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి హర్షానంద మహరాజ్ మధ్యయుగాల కాలం దాకా విలసిల్లిన మన సంస్కృతిని 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు 2014 ఫిబ్రవరి సంచిక నుండి వివరిస్తున్నారు.

విదేశాలలో భారతీయ సంస్కృతి

నేపాల్ : ప్రపంచంలో ఏకైక హిందూ రాజ్యము నేపాల్. సంస్కృతి పరంగా దాదాపు 2500 సంవత్సరాల నుండి నేపాల్ గంగానది పరీవాహక ప్రాంతముతో ముడిపడి ఉన్నది. బుద్ధుడు జన్మించిన లుంబినీ వనము నేపాల్‌లో ఉన్నది.

కిరాతరాజులు క్రీ.పూ.3వ శతాబ్దము నుండి క్రీ.శ. 5వ శతాబ్దము వరకు నేపాల్‌ను పరిపాలించారు. లిచ్ఛవి వంశీయులు క్రీ.శ. 500 నుండి క్రీ.శ.700 సంవత్సరాల వరకు నేపాల్‌ను పాలించారు. వీరి తరువాత మల్లవి వంశీయుల పాలన జరిగింది. వీరందరూ హిందూ రాజులే.

నేపాల్‌లోని మందిరాలు, స్తూపాలు, భారత్, టిబెట్‌ల సంప్రదాయానికి చెందినవి. ఖాట్మండులోని బాగమతీ నదీతీరములో ఉన్న పశుపతినాథాలయం ఇప్పటికీ భారతీయులకు తీర్థస్థానముగా ఉన్నది. పతానలోని రాధాకృష్ణ మందిరము అత్యంత సుందరముగా ఉంటుంది. జింపిటాండులోని గణేశాలయం (క్రీ.శ. 800) కూడా ప్రఖ్యాతిగాంచినది. క్రీస్తుపూర్వం శతాబ్దాలకు చెందిన విరూపాక్ష శివలింగము నేపాల్‌లో లభించింది. భక్తపురమందు గల 12 చేతుల దైవ విగ్రహము నేపాలీ శిల్పకళను ప్రతిబింబింపజేస్తుంది.

నేపాల్‌లోని 'పశుపతినాథాలయం'

క్రీ.శ. 5వ శతాబ్దము నుండి 12వ శతాబ్దము వరకు వేయబడిన శిలాశాసనాలు ఎన్నో ఇక్కడ ఉన్నాయి. వీటి లిపి గుప్తుల కాలమునాటి (క్రీ.శ. 4 - 6వ శతాబ్దము) లిపిని పోలి ఉన్నది. లిచ్ఛవి రాజులు ముద్రించిన నాణేలు గుప్తులకాలమునాటి నాణేలను పోలి వున్నాయి.

ఇప్పటికీ దేవనాగరి లిపిలో వ్రాయబడుచున్న నేపాలీ భాష, సంస్కృతము యొక్క రూపాంతరమే. నేపాలీ భాష హింది, గుజరాతి, సింధి భాషలకు దగ్గరగా ఉంటుంది.

పెరు : ఉత్తర అమెరికాలోని మెక్సికోలాగా, దక్షిణ అమెరికాలోని పెరులో కూడా భారతీయ సంస్కృతి ప్రభావము ప్రాచీనము. పెరులోని ఇంకా వంశీయులు భారతదేశము నుండి భూ జల మార్గములద్వారా వలస వెళ్ళినవారే.

కష్కో (కజ్‌కో)లో ఉన్న సూర్యదేవాలయము పెద్దపెద్ద రాళ్ళతో నిర్మింపబడిన అద్భుతమైన వాస్తు కళానిలయము. ఇప్పుడది చర్చిగా మార్చబడినది. స్పెయిన్ దండయాత్రలో అక్కడి అపారసంపద దోచుకొనబడింది.

ఇంకాలు సూర్యవంశపు రాజులు. వారికి చతుర్యుగాలమీద నమ్మకము ఉండేది. వారి ఖగోళశాస్త్రము హిందూ సంప్రదాయానికి చెందినది. వారి పంచాంగాలను పంచత, ఉన్నంచ అనేవారు.

ఇంకాలు అనేక మందిరాలు, సత్రాలు, రహదారులు, ఇతర సామాజిక భవనాలను నిర్మించారు. రవాణా సౌకర్యాలు బాగా అభివృద్ధి చెంది ఉండేవి. వారి దుస్తులు నాగరికముగా ఉండేవి.

హిందూ పురాణాలలో ఉండే నమ్మకాలు, దేవతలు, సూర్యుడు, ఆది-కూర్మ, అనంతనాగ, మాయ (దేవమాత) ఇప్పటికీ పెరులో ఆచారములో ఉన్నవి. యవ్వనంలో ప్రవేశించిన బాలురకు చేసే హరాకు అనబడే ఉత్సవము హైందవ ఉపనయనాన్ని పోలి ఉంటుంది.

పెరువియన్ భాష క్విచువా (కేశవ)లో అనేక సంస్కృత పదాలున్నాయి. ఇంకా రాజుల ప్రార్థనలు వేదమంత్రాలను పోలి ఉంటాయి. అవి అగ్నిహోత్ర సమయములో వాడే వేదమంత్రాలలాగా ఉంటాయి. ❖ **అనువాదం: డాక్టర్ పి.వి.రెడ్డి**

రామకృష్ణ భక్తి సూత్రాలు

– స్వామి యతీశానంద

నారద భక్తి సూత్రాలు, శాండిల్య భక్తి సూత్రాలు భక్తియోగానికి సంబంధించిన ప్రామాణిక గ్రంథాలు. అయితే ఆధునిక తరంలో భగవదన్వేషకులకు అనువైన రీతిలో భక్తితత్త్వాన్ని బోధించారు శ్రీరామకృష్ణులు. ఈ నేపథ్యంలో 'శ్రీరామకృష్ణ కథామృతం' నుండి కొన్ని ఉపదేశాలను 'రామకృష్ణభక్తి సూత్రాలు'గా సులభరీతిలో వివరించే ప్రయత్నం చేస్తున్నాం.

బౌద్ధగ్రంథాలు పాళీ భాషలో, బైబిల్ హీబ్రూలో, ఖురాన్ అరబ్బీ భాషలో రచించబడ్డాయి. అలాగే శ్రీరామకృష్ణుల ఉపదేశాలు వారి మాతృభాష బెంగాలీలో ఆవిష్కృతమయ్యాయి. అవతారపురుషుని ముఖతః వెలువడిన ఆ అమృతోపదేశాలను యథాతథంగా ఉట్టంకిస్తూ వ్యాఖ్యానిస్తున్నాం. మహాశక్తిమంతమైన ఆ బోధనలను మననం చేసుకుంటూ కృతార్థులమవుదాం.

భక్తి కిరూపే హొయ్? ప్రథమే
సాధుసంగ కొరతే హొయ్।
సాధుసంగ కొరలె ఈశ్వరీయ
విషయే శ్రద్ధా హొయ్ ।
శ్రద్ధార్ పర్ నిష్ఠా, నిష్ఠార్ పర్ భక్తి.

భక్తి ఏవిధంగా కలుగుతుంది?
మొట్టమొదట, సాధుసాంగత్యం చేయాలి. సాధుసాంగత్యం చేస్తే భగవద్విషయాలపై శ్రద్ధ కలుగుతుంది. శ్రద్ధ తరువాత నిష్ఠ, నిష్ఠ తరువాత భక్తి కలుగుతుంది.

శ్రీరామకృష్ణ ఉవాచ: సాధుసాంగత్యం ఎప్పుడో ఒకసారి చేస్తే సరిపోదు, ఎల్లప్పుడు చేయాలి. రోగం పట్టుకొనే ఉంది. వైద్యుని వద్దకు వెళ్ళకపోతే నాడి (ఎలాగు పరీక్షించాలో) తెలియదు. కనుక ఆయన వెంట తిరుగుతూనే ఉండాలి. అప్పుడే, కఫం నాడి ఎలా ఉంటుంది, పైత్యం నాడి ఎలా ఉంటుంది అనేది తెలుస్తుంది.

సాధుసాంగత్యం వలన మరొక ప్రయోజనం ఉంది – సత్, అసత్ విచారము. సత్ అనగా నిత్యవస్తువు, అనగా భగవంతుడు. అసత్ అనగా అనిత్యం. అసత్తుపై మనస్సు నిలువగానే, విచారం (ఆలోచన) చేయాలి. మరొకరి ఇంట్లోని అరటిగెల వైపు ఏనుగు తొండం సారించగానే, మావటి వెంటనే అంకుశంతో పొడుస్తాడు.

సాధుసాంగత్యం మూలంగా భగవంతుని పట్ల అనురాగం కలుగుతుంది, ప్రేమ కలుగుతుంది. సాధుసాంగత్యం చేస్తూ ఉంటే భగవంతుని కొరకు ఆవేదన కలుగుతుంది.

ఎవరి మనస్సు, ప్రాణం, అంతరాత్మ భగవంతునిపైనే ఉంటాయో, ఆయనే సాధువు. ఎవరు కామినీ కాంచనాలను త్యజించారో, ఆయనే సాధువు. సాధువు మహిళలను ఐహిక దృష్టితో చూడడు. ఎల్లప్పుడు వారికి దూరంగా ఉంటాడు. మహిళల వద్దకు ఒకవేళ వెళ్తే, వారిని తల్లివలె చూసి, గౌరవిస్తాడు. సాధువు ఎల్లప్పుడు భగవచ్చింతన చేస్తాడు. భగవద్విషయాలు తప్పించి మరేమీ మాట్లాడడు. ప్రతి వ్యక్తిలో ఉన్నది భగవంతుడేనని తెలుసు కనుక, వారి సేవ చేస్తాడు. (మహిళా సాధువులు పురుషులను ఐహిక దృష్టితో చూడరు, వారిని పుత్రులవలె భావిస్తారు)

వ్యాఖ్య: శ్రీరామకృష్ణులు భక్తుల సమస్యలకు సంబంధించిన జ్ఞానాన్నీ, ఆ సమస్యల పరిష్కారానికి ఉపాయాన్నీ సులభంగా తెలుసుకొనేవారు.

భక్తి ద్వారా ఆయనను సులభంగా పొంద వచ్చని శ్రీరామకృష్ణ అంటారు. భక్తి ఏ విధంగా కలుగుననే విషయమిక్కడ విపులంగా చెప్పారు.

సాధువులు భగవద్దర్శనం గాంచినవారు, లేదా సాధన మార్గంలో చాలా దూరం పయనించినవారు అయి ఉంటారు. కనుక వారు భగవద్విషయం సరిగ్గా చెప్పగలుగుతారు.

సాధువును భగవంతుని కాపలాదారు అనవచ్చు. కావలి రాత్రి మేల్కొని ఉండి, మధ్యమధ్యలో 'పారా హుషార్' అని గృహ యజమానిని అప్రమత్తం చేస్తూ ఉంటాడు. కనుక దొంగలు పడే అవకాశం ఉండదు.

ఆ విధంగానే భక్తులు మాయాజాలంలో పడకుండా, సాధువు సదా అప్రమత్తంగా ఉంటాడు. విషయభోగాల ప్రలోభంలో చిక్కుకొనకుండా భక్తులను హెచ్చరిస్తూ ఉంటాడు. భగవంతుణ్ణి మరవకుండా చూస్తాడు. సాధుసాంగత్యం వలన భగవంతుడు ఉన్నాడనీ, ఆయన అన్ని జీవులను రక్షిస్తాడనీ, ఆవేదనతో ప్రార్థిస్తే దర్శనం ఇస్తాడనీ, తమకష్టాలు బాపుతాడనీ భగవంతుని పట్ల విశ్వాసం కలుగుతుంది. కనుక, సాధుసాంగత్యం ప్రాధాన్యాన్ని దాదాపు అన్ని శాస్త్రాలు, అందరు మహాపురుషులు వక్కాణించారు.

సాధువు మాటలు, బోధనలు భక్తులకు భగవంతుని పట్ల శ్రద్ధ, విశ్వాసాలను కలిగిస్తాయి. శ్రద్ధతో నిష్ఠ, ఆకర్షణ కలుగుతాయి. నిష్ఠ దృఢమైతేనే భక్తి, అనురాగం జనిస్తాయి.

కొందరు భక్తులు సాధువుల వద్దకు వెళ్ళి అనవసరమైన మాటలతో కాలక్షేపం చేస్తారు. కొందరు సాధువుల వద్ద సాంసారిక విషయాలు, సామాజిక పోకడల గురించి మాట్లాడుతారు. ఇటువంటివి సాధుసాంగత్యం కాదు. ❖

అనువాదం: డాక్టర్ కమల జయరావు

నా జన్మము, నా కర్మము దివ్యములు. నా యథార్థ దివ్య స్వరూపాన్ని, తత్త్వాన్ని తెలుసుకున్నవాడు తనువును చాలించిన తరువాత తిరిగి పుట్టడు; నన్నే చేరుతాడు. - శ్రీకృష్ణుడు

పరిప్రశ్న

– స్వామి భూతేశానంద

(రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు)

రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు-స్వామి భూతేశానందజీ మహరాజ్ (1901-1998) భక్తుల ఆధ్యాత్మిక సందేహాలకు సరళమైన రీతిలో ఇచ్చిన సమాధానాలను 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకుల ప్రయోజనార్థం 2013 జూలై సంచిక నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

భక్తుడు: రాసపూర్ణిమ నాడు శ్రీకృష్ణుని వేణుగానం విని గోపికలంతా వనంలో ఉన్న ఆయన వద్దకు పరుగెత్తారు. కానీ శ్రీకృష్ణుడు గోపికలను ఎందుకు తిరిగి వెళ్ళిపొమ్మన్నాడు?

స్వామీజీ: శ్రీకృష్ణుని వేణుగానం విని గోపికలు ఆయనను సమీపించినప్పుడు శ్రీకృష్ణుడు వారిని ఇలా మందలించాడు:

"ఈ అరణ్యంలో అనేక క్రూరమృగాలు ఉన్నాయి. ఈ రాత్రివేళ ఇలా మీరంతా ఇక్కడకు రావడం ప్రమాదకరం కదా! మీరు ఎందుకు వచ్చారు? క్రూరమృగాలు మీపై దాడి చేస్తే మీరేం చేయగలరు? ఈ పున్నమి వెలుగుతో నిండిన ప్రకృతి సౌందర్యాన్ని తిలకించాలని మీరు ఇక్కడకు వచ్చివుంటే ఒక్కసారి ఈ వనసౌందర్యాన్ని దర్శించి వెళ్ళండి. మీరు చేయాల్సిన ఇంటిపనులు ఎన్నో ఉన్నాయి. మీ పిల్లల సంరక్షణ బాధ్యత, కుటుంబ సభ్యుల అవసరాలను తీర్చాల్సిన బాధ్యత మీపై ఉంది. మీ బాధ్యతలన్నీ విస్మరించి ఇలా రాత్రివేళ నా వద్దకు రావడం ఏమైనా సమంజసంగా ఉందా? ప్రజలంతా మీ గురించి ఏమనుకుంటారో ఊహించారా? నా వేణుగానం వినడం కోసం మీ బాధ్యతలను విస్మరించి వేళకానివేళ ఇక్కడకు రావడం సరికాదు".

శ్రీకృష్ణుడు గోపికలకు ఎలాంటి హాని కలగకుండా ఉండాలనీ, ప్రజలు వారిపై ఎలాంటి నిందారోపణలు చేయకుండా ఉండాలనీ, వారి పవిత్రతకు ఎలాంటి కళంకం రాకూడదనీ వారిని తిరిగి వాళ్ళ ఇళ్ళకు వెళ్ళిపొమ్మన్నాడు. అంటే గోపికల క్షేమాన్నీ, శ్రేయస్సునీ కోరి శ్రీకృష్ణుడు వారిపట్ల అలా ప్రవర్తించాడేగానీ వారిని అవమానించాలని కాదు. ఒక విధంగా ఆలోచిస్తే శ్రీకృష్ణుడు గోపికలకు తనపట్ల ఉన్న భక్తిని పరీక్షించాడు.

భక్తుడు: శ్రీకృష్ణుని పట్ల గోపికలకు ఉన్న భక్తిని గురించి వివరించండి.

స్వామీజీ: గోపికల ప్రేమ గురించి శ్రీరామకృష్ణులు ఇలా తెలిపారు: "ఆహా! గోపికల ప్రేమ ఎంత గాఢమైందో! శ్యామలవర్ణంలో ఉన్న తమాలవృక్షాన్ని చూడగానే వారికి శ్యామసుందరుడైన కృష్ణుడే తలపుకు వచ్చేవాడు. ఏమి పారవశ్యం! గోపికల హృదయకాసారం నుండి దివ్యప్రేమ పొంగి ప్రవహించింది. ఇలాంటి ప్రేమ అణుమాత్రం లభించినా అలాంటివారి జన్మ ఎంత ధన్యమో కదా!"

గోపికలకు శ్రీకృష్ణుని పట్లగల అనన్యభక్తి గురించి శ్రీమద్భాగవతంలో అద్భుతంగా వివరించబడింది. శ్రీకృష్ణుడు కానల నుండి చేసిన వేణుగానం అందరికీ వినబడేది కాదు. కేవలం

గోపికలకు మాత్రమే ఆ భాగ్యం కలిగేది. ఎందుకంటే గోపికలు నిరంతరం భగవానుని చింతనలో ఉండేవారు, ఆయన దర్శనం కోసం తపించేవారు, ఆయన వేణుగానం వినాలని నిరీక్షించేవారు.

వనం నుండి వచ్చే శ్రీకృష్ణుని వేణుగానం అందరూ వినలేకపోయే వారు. ఎందుకంటే వాళ్ళంతా పూర్తిగా సంసార విధులలో మునిగిపోయి ఉండేవారు. కానీ గోపికలు మాత్రం వంట చేస్తున్నా, కళ్ళాపి చల్లుతున్నా, భర్తలకు సేవచేస్తున్నా, బిడ్డలకు పాలిస్తున్నా, పశువులకు మేత వేస్తున్నా వాళ్ళ మనస్సంతా శ్రీకృష్ణుని చింతనలో నిమగ్నమై ఉండేది. అందువల్ల వేణుగానం వారి చెవిన పడగానే ఎక్కడ పనులు అక్కడే వదిలి శ్రీకృష్ణుని దర్శనం కోసం పరుగెత్తేవారు.

ఒక గోపిక శ్రీకృష్ణుని కోసం పరుగెత్తి వెళుతుంటే ఆమెను ఇంట్లో బంధించారు. ఆమె ఎన్ని విధాలుగా ప్రయత్నించినా బయటకు రాలేకపోయింది. శ్రీకృష్ణుని దర్శించాలని ఆమె ఆత్మ తీవ్రంగా తపించింది. చివరికి భగవానుని దగ్గరకు వెళ్ళకుండా బంధించబడింది ఈ దేహమే కదా అని తలచిన ఆ గోపిక ప్రాణత్యాగం చేసింది. ఆవిధంగా గోపిక ఆత్మ శ్రీకృష్ణునిలో లయమైంది. దీన్ని బట్టి శ్రీకృష్ణుని పట్ల గోపికలకు ఉన్న భక్తి ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. ❖

'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక చందాను
ఆన్‌లైన్ http://rkmath.org/srkp ద్వారా చెల్లించవచ్చును.

ఇట్టి ముద్దులాడి బాలు డేడవాడు!

– శ్రీమతి బి.కృష్ణకుమారి

అన్నమయ్య పదామృతం

ఇట్టి ముద్దులాడి బాలు డేడవాడు
వాని పట్టితెచ్చి పొట్టనిండ పాలువోయరే ॥

గామిడై పారితెంచి కాగెడి వెన్నలలోన
చేమపూవు కడియాల చేయిపెట్టి
చీమ కుట్టెనని తన చెక్కిట కన్నీరు జార
వేమరువాపోవు వాని వెడ్డువెట్టరే ॥

ముచ్చువలె వచ్చి తన ముంగమురువుల చేయి
తచ్చెడి పెరుగులోన తగబెట్టి
నొచ్చెనని చేయిదీసి నోరనెల్ల జొల్లుగార
వొచ్చెలి వాపోవువాని నూరడించరే ॥

ఎప్పుడు వచ్చెనో మా యిల్లుచొచ్చి
పెట్టెలోని చెప్పరాని వుంగరాల చేయిపెట్టి
అప్పడైన వేంకటాద్రి అసవాలకుడు గాన
తప్పకుండ పెట్టె వాని తలకెత్తరే ॥

బాలకృష్ణుని బాల్యలీలలతో, ఆ బృందావనం ఆనంద వనమై, ఆధ్యాత్మిక సదనమై అలరారింది. ఆ నందవ్రజానికి ప్రత్యేకంగా సూర్యోదయాలు, చంద్రోదయాలు లేవంటే అతిశయోక్తి కాదు! ఆ మురళీకృష్ణుడు మేల్కొంటేనే వారికి సూర్యోదయం, ఆ కొంటెకృష్ణుడు కునుకుతీస్తేనే వారికి చంద్రోదయం! అలా గోవులకు, గోపాలురకు ఆ గోవిందుడే సకలమూ, సర్వమూ! చిన్నికృష్ణుడి చిలిపిచేష్టలకు ఆ బృందావనవాసులు పైకి చిర్రుబుర్రులాడినా, లోలోన బ్రహ్మానందపడిపోయేవారు! తమ ప్రాణాల్నే ఆ పరమాత్మ 'పసి'డిపాదాల కింద పరవడానికి సిద్ధమైన అక్కడి పుణ్యవతులకు ఇక పాలుపెరుగులెంత! అయినా వెన్నదొంగ ఆగడాలకు విసిగిపోయినట్లు నటించడం ఆ వనితలకు ఓ వేడుక!అలాంటి గోపకాంతల్లో తాళ్ళపాక అన్నమయ్య తానూ ఒక్కడయ్యాడు. తెచ్చిపెట్టుకున్న అసహనానికి తేనెలూరే పదాలు అల్లి, '**ఇట్టి ముద్దులాడి బాలు డేడవాడు...**' అని అచ్చెరువొందుతున్నాడు. ద్వాపరయుగంలో మధురానగరి నుంచి యమునా లహరి వరకు అన్నీ ఆ దామోదరుడి మధురలీలలతో ఓలలాడాయి. అందుకే "రామావతారంలో శాంత, దాస్య, వాత్సల్య, సఖ్య తదితర భావాలన్నీ ఉన్నాయి. కృష్ణావతారంలోనూ అవన్నీ ఉన్నాయి; వాటికి తోడుగా మధురభావం కూడా ఉంది" అనేవారు అవతార వరిష్ఠులు భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస.

పొట్టనిండ పాలుపోయరే!

కన్నవారికి కొడుకు కొంటెచేష్టలూ కంటికి ఇంపే! అలా యశోద, కృష్ణుడు ఎంత అల్లరి చేసినా, తల్లి మనస్సుతో చూసుకుంటూ మురిసిపోయేది; రేపల్లెవాసులు ఊరికే రాద్ధాంతం చేస్తున్నారని సమర్థించుకునేది. అందుకే ఆ తల్లితో కాదనుకొని, ఆ ఊరి వనితలు తామే ఆ తాండవకృష్ణుడి ఆగడాల ఆటకట్టించేందుకు అన్ని ప్రయత్నాలూ చేశారు. చివరకు 'ఈ ముద్దులబాలుడు ఎక్కడివాడమ్మా! ఉన్న చోట ఉండడు! పట్టుకొని పొట్టనిండా పాలన్నా పోయండి. అప్పుడైనా ఊరుకుంటాడేమో చూద్దాం!' అంటున్నారు. అదే భావనతో '**ఇట్టి ముద్దులాడి బాలు డేడవాడు; వాని పట్టితెచ్చి పొట్టనిండ పాలువోయరే**' అని సంకీర్తనను శుభారంభిస్తున్నాడు శ్రీనివాసుడి సేవాగ్రగణ్యుడు. పదాల పొందికలో అన్నమాచార్యులవారిది అందె వేసిన చేయి. పరమాత్మ పరోక్ష ప్రేరణ లేకుండా, ప్రత్యక్ష దర్శనం కాకుండా ఇంతటి కమనీయకీర్తనను రచించడం అసాధ్యం. పాండిత్య ప్రదర్శనకు పోకుండా, పచ్చని పల్లెపదాలతో గోపకాంతల గుండెగొంతుకలను అన్నమయ్య ఈ గీతంలో ఆవిష్కరించాడు. ఆ పరంపరలో కాగెడి వెన్న... కడియాల చేయి... చేమపూలు... చెక్కిట కన్నీరు... అప్పడు, అసవాలకుడు... వంటి ఎన్నో తేట తేట తెలుగు పలుకుబడులను హృదయంగమంగా ప్రయోగించాడు. భక్తకవిగానే కాదు, భాషాకోవిదుడిగా కూడా చిరకీర్తిని ఆర్జించాడు.

వాని వెడ్డువెట్టరే!

ఉన్నచోట ఉండకుండా, పెద్ద ఆరిందలా ఆ నందనందనుడు ఉట్టిలో పెరుగే కాదు, చివరకు కుండలో కాగుతున్న వెన్నపై కూడా కన్నేశాడట! చల్లగా కాజేద్దామని మెల్లగా ఆ వెన్నలో తన చేమపూవు కడియాల చేయిపెట్టాడట! కాని చేయి చురుక్కుమనటంతో, ఎక్కడ తన చిలిపిపని బయట పడిపోతుందోనన్న భయంతో, చీమకుట్టిందని ఏమార్చి చెక్కిట

(మిగతా 34వ పేజీలో...)

'నేను పుట్టుకలేని వాడిని, వినాశనం లేనివాడిని. ప్రాణులకు ప్రభువును, అయినా ప్రకృతిని నా అధీనంలో ఉంచుకొని, నా మాయాశక్తి చేత అవతరిస్తూ ఉంటాను'. - శ్రీకృష్ణుడు



పరమపదానికి రాజమార్గం

– స్వామి సర్వగతానంద

సత్యం

సత్యప్రతిష్ఠాయాం క్రియాఫలాశ్రయత్వం

(రాజయోగం–2.36)

ఈ సూత్రం సత్యము యొక్క మహత్వాన్ని తెలియజేస్తుంది. సత్యసంకల్పుడు, సత్యవ్రతుడైన వాని మాటలు సార్థకమవుతాయి. ఎవరైతే మనస్సు, వాక్కు, కర్మల యందు సత్యవంతంగా ఉంటారో, సత్యవంతమైన వచనాలే పలుకుతారో, సత్యమార్గంలో జీవిస్తారో అలాంటి వారు ఏది తలస్తే అది జరిగితీరుతుంది.

ఆత్మసాక్షాత్కారాన్ని పొందిన వ్యక్తులు సత్యవాదులు. వారు 'నీవు భగవదనుగ్రహం పొందెదవుగాక! నీవు పవిత్రుడవగుదువుగాక!' అని ఎవరినైనా ఆశీర్వదిస్తే అట్లే జరిగితీరుతుంది. మనసా, వాచా, కర్మణా సత్యవంతంగా జీవించిన వారికి ఇలాంటి అద్భుత శక్తి ఉంటుంది. ఉదాహరణకు శ్రీరామకృష్ణుల వాక్కులలో మనం ఇటువంటి అద్భుత శక్తులను గమనించవచ్చు. 1886 జనవరి 1వ తేదీన కొందరు గృహస్థ భక్తులు కాశీపూర్ ఉద్యానగృహంలో సమావేశమయ్యారు. అప్పుడు గురుదేవులు జబ్బుపడి ఉన్నప్పటికీ ఆరోజు మాత్రం ఉత్సాహంగానే ఉన్నారు. మేడమీది నుండి క్రిందికి వచ్చి అక్కడున్నవారిని 'మీలో చైతన్యం ఉద్దీపనమగుగాక!' అని ఆశీర్వదించారు. అప్పుడు ప్రతి ఒక్కరూ ఏదో ఒక ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు. శ్రీరామకృష్ణుల మాటలు అంతటి శక్తిని సంతరించుకున్నాయి.

సత్యం యొక్క శక్తిని గురించి స్వామి వివేకానంద ఇలా అన్నారు: "ఎప్పుడైతే నీలో ఈ సత్యం యొక్క శక్తి ప్రతిష్ఠితమైందో అప్పుడు నీవు కలలో సైతం అబద్ధం చెప్పలేవు. నీవు మనసా, వాచా, కర్మణా సత్యవంతంగా జీవిస్తావు. నీవు ఏది పలికితే అది జరిగి తీరుతుంది. ఒక వ్యక్తిని చూసి 'నీవు భగవదనుగ్రహం పొందెదవుగాక!' అని అంటే అట్లే జరుగుతుంది. ఒక రోగిని 'స్వస్థుడవు కమ్ము!' అని అంటే అతడు ఆరోగ్యవంతుడవుతాడు. దీనిని ప్రపంచ వ్యాప్తంగా యుగాల పర్యంతం మనం చూస్తున్నాం. సత్యం అనే పదం ఎంతో ఉన్నతమైనది".

ఒకసారి భక్తుడొకరు శ్రీరామకృష్ణులను ఇలా అడిగారు: "ఆచరించడానికి కష్టమైన ఈ అనేక నియమాలు నాకు వద్దు. కానీ ఏ ఒక్క నియమాన్ని అనుసరించడం ద్వారా సమస్యలన్నీ చక్కబడతాయో దాన్ని అనుగ్రహించండి." అప్పుడు గురుదేవులు "సత్యవ్రతాన్ని పాటించు. ఈ విధంగా ప్రమాణం చేయి 'నేను సత్యవంతమైన మాటలను తప్ప వేరే మాటలను పలుకను; కనీసం వాటి గురించి ఆలోచించను కూడా'. దీన్ని నిక్కచ్చిగా అమలుపరచు" అని అన్నారు.

శ్రీరామకృష్ణుల మాటల్లో చెప్పాలంటే ఈ కలియుగంలో సత్యమనేది గొప్ప తపస్సు. మనసా, వాచా, కర్మణా సత్యవంతంగా ఉండాలి. ఈ విషయంలో దృఢ సంకల్పం కలవారై ఉండాలి. తద్వారా మీరు అన్ని సద్గుణాలను పొందగలరు.

దైనందిన జీవితంలో మనం సత్యవంతంగా జీవించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు మన ఆలోచనాసరళి పూర్తిగా మారిపోతుంది. మన మనస్సు ప్రతివిషయం యొక్క వాస్తవికతను మూల్యాంకనం చేస్తుంది. మనం దేనినీ గుడ్డిగా అంగీకరించం. అన్నివిధాలుగా పరిశోధించి, ప్రతి విషయాన్నీ పరీక్షించి రూఢిపరచుకొని మాత్రమే ఒక నిర్ణయానికి వస్తాం. ఈ జాగరూకతే ప్రతి రంగంలోనూ, మన వ్యక్తిగత జీవితంలోనూ, సమష్టిజీవితంలోనూ ఎన్నోవిధాల మేలు చేకూర్చుతుంది. సత్యాన్వేషణలో ఉన్న శాస్త్రవేత్తకు సత్యమొక్కటే ధ్యేయం. అంతేకానీ సత్యానికి దగ్గరలో ఉన్నది కూడా అతనికి అవసరం లేదు. అతను చేసే ప్రయోగాలలో నిర్దుష్టమైన ఫలితాలనే అంగీకరిస్తాడు కానీ ఇంచుమించుగా ఉన్న ఫలితాలను ఖాతరుచేయడు. చంద్రయానం విషయాన్నే తీసుకోండి. రమారమి లెక్కలతో అది సాధ్యమయ్యే పనేనా? ఎట్టి పరిస్థితులలోనూ తమ అంచనా తప్పదని నిర్ధరించుకునే దాకా వారు నిర్ణయం తీసుకోరు. ప్రకృతి నియమాలు ఎల్లప్పుడూ దోషరహితాలే! శాస్త్రవేత్త వృత్తిరీత్యా వాస్తవాలను శోధించేవరకు పరిశ్రమిస్తాడు.

చాలా మంది చింతనాపరులు, శాస్త్రవేత్తలు, గొప్ప తత్త్వవేత్తలయ్యారు. ఎందుకంటే వారందరూ సత్యం

విషయంలో కచ్చితంగా ఉన్నారు కాబట్టి. దీని ఆధారంగానే వారు తత్త్వశాస్త్రం యొక్క ఆధ్యాత్మిక దృక్కోణం నుండి ఇలా మాట్లాడగలిగారు: "ఏదైనా నశిస్తుంది కానీ చైతన్యం మాత్రం నశించదు". తత్త్వవేత్తలు ప్రతి విషయాన్నీ నిశితంగా పరిశీలించారు. కాబట్టి అదే సత్యం వారి జీవితాలలో కూడా ప్రతిబింబించింది. ఒకానొక మార్గంలో మీరు సత్యవంతంగా ఉండగలిగితే దాన్నే మీ జీవితంలో అన్ని విషయాలకూ అన్వయించండి. పరిణతి దానంతట అదే వస్తుంది. ఆధ్యాత్మికపరంగా, మనస్తత్త్వశాస్త్రపరంగా సత్యమనేది ఎంతో ప్రధానమైనది.

మీరు మీ ఆలోచనలకు బానిస అయినప్పుడు మిమ్మల్ని మీరు ఇలా ప్రశ్నించుకోండి : "ఈ ఆలోచన నాకు ఎప్పుడు వచ్చింది? ఇది నాతోనే పుట్టిందా? లేదుకదా! ఇది ఎలాగైతే వచ్చిందో అలాగే పోతుంది. నేను ఈ ఆలోచనను కాను. ఇది నా నుండి విడిగానే ఉంది."

ఎప్పుడైతే మీరు అన్ని విషయాలను ఈ విధంగా పరిశీలిస్తారో క్రమంగా మీరు ఈ ఆలోచనల చిక్కుముడుల నుండి విడివడతారు. ఈ ఆలోచనల నుండి విడివడటానికి సహాయం చేసే మార్గాలను అన్వేషించండి. ఆలోచనల నుండి మాత్రమే కాదు, మనస్సుపై పడిన ముద్రలూ, మనస్సు చేసే ప్రోద్బలాల నుండి కూడా విడివడండి. వాటికెన్నడూ బానిస కావద్దు.

అన్నిరకాల ఆలోచనలు, సంస్కారాలు, ప్రోద్బలాలు, చిత్తవిక్షేపాల నుండి విడివడే సమయం వచ్చే తీరుతుంది. అప్పుడు ఆత్మ ప్రకాశవంతమవుతుంది. అహంకారం నుండి కూడా మీరు వేరుపడతారు. మరి ఈ 'నేను ఎవరు?', 'నేను అంటే ఏమిటి?' ఈ అహాన్ని గురించిన వివేకం మీకు ఉన్న జ్ఞానం, అనుభవాల వల్లనే కలుగుతుంది. అహం అనేది ఎప్పుడూ ఒకే విధంగా ఉండదు. ఒకప్పుడు నేను బాలుడననీ, మంచివాడననీ, బలమైనవాడననీ, ఉత్తమ విద్యార్థిననీ; ఇక వృత్తిలో నేను వైద్యుడిని, నేను న్యాయవాదిని, నేను అధ్యాపకుడననే భావనలు మనలో ఉంటాయి. కానీ వీటన్నింటిలో 'నేను' అనేది మారుతూనే ఉంది కదా. అంటే ఇవేవీ సత్యమైనవి కావు. కానీ వీటన్నింటినీ మించినదేదో నిజంగా నాలో ఉండే తీరాలి. అదే సత్యం. ఇప్పుడు మీరు ఈ గుణసముచ్ఛయరహితమైన 'నేను'ను వెతికే పని మొదలెడతారు. బుద్ధుడు బోధివృక్షం నీడలో సత్యాన్వేషణ గావించాడు. తన అస్తిత్వం యొక్క నిత్యత్వాన్ని గూర్చి అంతః పరీక్షణం చేయనారంభించాడు. ఆ ప్రయత్నంలో తన అహాన్ని నిర్మూలించుకున్నాడు. ఈ గుణలక్షణరహితమైన 'నేను' అంటే ఏమిటి? గది యొక్క గోడలను తొలగిస్తే గది అస్తిత్వాన్ని ఊహించగలమా? కానీ 'నేను' యొక్క గుణలక్షణాలన్నీ నశించినప్పుడు అతనికి అంతఃజ్యోతి దర్శనమైంది. అప్పుడే అతడు బుద్ధుడయ్యాడు. ఆయన ధార్మికోపన్యాసంలో ఇలా వివరించాడు: "సత్యమే మీకు ఆధారం. ఇకపై సత్యమే మీకు మార్గదర్శకం. ప్రతి విషయంలోనూ సత్యమే దాగివుంది. దాన్ని వెతికి పట్టుకోండి".

అహంకారరాహిత్యమే నిర్వాణమని భగవాన్ బుద్ధుడు నిర్వచించాడు. సత్యాన్వేషణ ప్రక్రియలో భాగంగా తనే సత్యంతో మమేకమయ్యాడు. ఆయన అదే సత్యాన్ని అంతటా గాంచాడు.

శ్రీరామకృష్ణులు ఈ కథ చెప్పేవారు: "ఉప్పుబొమ్మ ఒకటి సముద్రం లోతును కనుగొనడానికి బయలుదేరింది. కానీ నీళ్ళలో దిగగానే అది కరిగిపోయింది. ఇక సముద్రం లోతు తెలుపడానికి ఎవరున్నారు?"

మార్పునొందే ప్రతిదానినీ 'నేతి' అంటూ వదలివేస్తూ పోగా మిగిలినదే సత్యం. బుద్ధునికి ఆ అంతఃజ్యోతి ప్రకాశం జీవితమంతా ద్యోతకమై ఉండేది.

సకల చరాచరాల్లో ఒకే సత్యం ఉంది. దాన్ని దర్శించాలంటే ముందు మీలోని అంతఃజ్యోతిని వెలిగించండి. దీన్ని ఆవిష్కరించుకుంటే మరెన్నో విషయాలు వెలుగులోనికి వస్తాయి. సత్యదర్శనం గావించుకోవడం ఎంతో ప్రయాసతో కూడినది. కానీ అసాధ్యం మాత్రం కాదు. ఇందుకోసం ఎన్నో సుఖాలను త్యజించాలి. త్యాగాలు ఒనర్చాలి. మీ యొక్క దృఢ సంకల్పం ద్వారానే ఇది సాధ్యం. 12 సంవత్సరాలు ఇలా సత్యవ్రతంలో సుప్రతిష్ఠుడైన యోగి వాక్శుద్ధి కలిగి తాను ఏది పలికితే అది జరుగుతుంది. అంటే కర్మలు చేయకయే ఆ కర్మల ఫలాలు తనకూ, ఇతరులకూ కలిగేలా చేస్తాడు. ❖

తెలుగు సేత: బ్రహ్మచారి శ్యామ్

(భగవాన్ శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష సన్న్యాస శిష్యులైన స్వామి అఖండానందజీ మహరాజ్ శిష్యులు స్వామి సర్వగతానంద)

కత్తిని వదలి తంబురాను పట్టిన కనకదాసు

కొండలు, కోనలే ఆ బాలుని లోకం. చదువు సంధ్యలపై ఆసక్తి అసలే లేదు. గొర్రెలు మేపుకుంటూ అదే తన జీవితం అని భావిస్తున్న ఆ బాలుడికి కనకం (బంగారం) అంటే వల్లమాలిన అభిమానం. ఓ రోజు గొర్రెలను మేపుతూ పొలాన్ని దున్నుతుండగా... బంగారు నిధి కనిపించింది. అనుకోకుండా అయాచితంగా లభించిన బంగారు నాణెములతో గొప్ప ధనవంతుడయ్యాడు. భూములను కొన్నాడు. ఆ భూములతో గ్రామాలపై ఆధిపత్యాన్ని సంపాదించాడు. చిన్న చిన్న గ్రామాలను ఆక్రమిస్తూ... తనకు అడ్డు వచ్చిన శత్రువులను తుదముట్టించే వాడు. అతని ధైర్య, సాహసాలకు మెచ్చి రాజు అతనిని ఆ రాజ్యానికి సేనాపతిగా నియమించాడు. రాజుకి సేవకుడిగా.. అధికారాన్ని చెలాయిస్తూ... చుట్టూ పరిచారికలతో విలాసవంతమైన జీవితం అనుభవిస్తున్నాడు.

కాని ఆ సేనాపతిని రాత్రివేళల్లో నిద్రకు దూరం చేస్తూ ఓ కల వెంటాడుతోంది. ఆ కలలో ఓ తియ్యటి గొంతు ఆప్యాయంగా పలకరిస్తూ... 'ఓ ప్రియమైనవాడా! నా సేవకుడిగా రా! నా కీర్తనలు ఆలపిస్తూ సంగీత సేవకుడిగా మారు' అని ఆహ్వానిస్తోంది. మొదటిసారి వచ్చినప్పుడు ఏదో మామూలు కల అని అనుకున్నాడు. రెండవసారి కూడా అదే కల.. అదే గొంతు.. అదే అభ్యర్థన.. ఇక ఉండబట్టలేక మూడవసారి ఆ తియ్యటి గొంతుతో కలలోనే మాట్లాడాడు. "నీ సేవకుడిగా నన్నే ఎందుకు రమ్మంటున్నావు. రాజుకు ఎంతో ఇష్టమైనవాడిని, ఎన్నో గ్రామాలను పాలిస్తూ విలాసవంతమైన, సుఖమైన జీవితాన్ని గడుపుతున్న నన్ను నీ సంగీత సేవకుడిగా మారి అడుక్కుంటూ జీవించమంటావా?" అని కోపంగా ప్రశ్నించాడు. 'ఎంతోమంది భిక్షగాళ్ళు ఉన్నారు. వారి వద్దకు వెళ్ళి వారిలో ఒకర్ని నీ సేవకుడిగా ఎంచుకో... నన్ను బాధపెట్టకు' అని అన్నాడు. ఆ తియ్యటి గొంతు భగవంతుడిదని ఆ సేనాపతికి ఎరుకలేదు. భగవంతుడు చిన్న చిరునవ్వు నవ్వి మాయమయ్యాడు. మెలకువ వచ్చిన సేనాపతి ఆ కల గురించి కాసేపు ఆలోచించాడు. ఆ గొంతు సాక్షాత్తు భగవంతుడిదేనా? లేదా దెయ్యానిదా? అని తికమకపడ్డాడు. మళ్ళీ ఆ కల రాలేదు. దాని గురించి మర్చిపోయాడు.

అది యుద్ధక్షేత్రం. బాణాలు వచ్చి పడుతున్నాయి. కత్తుల శబ్దాలతో ఆ ప్రాంతం అంతా రక్తం ఓడుతోంది. ఓ బాణం సేనాపతి భుజంలో గుచ్చుకుంది. అతను కిందపడిపోయాడు. ఆ యుద్ధంలో శత్రు సైనికులు విజయం సాధించారు. స్పృహ తప్పి పడిఉన్న సేనాపతి మరణించాడని శత్రు సైనికులు భావించి వెళ్ళిపోయారు. శవాల దిబ్బగా మారిన ఆ ప్రాంతాన్ని చిమ్మచీకటి ఆవహించింది.

సేనాపతి గాయాలతో లేచే ఓపికలేక సాయంకోసం ఎదురుచూస్తున్నాడు. మళ్ళీ అదే తియ్యటి గొంతు... అదే అభ్యర్థన... 'నా సంగీత సేవకుడిగా వస్తావా?' అని అడుగుతోంది. 'శత్రు సైనికుల దాడిలో తీవ్రంగా గాయపడి రక్తం ఓడుతున్నాను. ఇలాంటి పరిస్థితులలో నీకు సేవకుడిగా పనికొస్తానా?' అని భగవంతుణ్ణి ప్రశ్నించాడు.

'నా ప్రియమైన కుమారుడా! నిన్ను నేను ఎంతగానో ప్రేమిస్తున్నాను. నీ గొంతుతో నా కీర్తిని ఈ ప్రపంచానికి చాటిచెప్పు... నీ శరీరంపై గాయాలెక్కడున్నాయి...' అని భగవంతుడు అడిగాడు. విచిత్రంగా అతని శరీరంపై ఒక్క గాయం కూడా లేదు. అన్నీ మాయమయ్యాయి.

"నన్నే నీ సేవకుడిగా ఎందుకు మారమంటున్నావో నాకైతే అర్థం కావట్లేదు. నేనా చదువు సంధ్యలు లేని, తక్కువ కులంలో పుట్టిన గొర్రెల కాపరిని, అయాచితంగా లభించిన ధనంతో పెద్దవాడినయ్యా. ఇప్పుడు అవన్నీ పోగొట్టుకున్నాను. నేను ఆధ్యాత్మికంగా ఎలాంటి పురోగతి సాధించ లేదు. కనీసం మంత్ర జపం కూడా చేయను" అని సేనాపతి నిర్వేదంగా అన్నాడు. 'నువ్వు త్వరలోనే ఆధ్యాత్మిక ఉన్నతి సాధిస్తావు' అని భగవంతుడు బదులిచ్చాడు.

'సరే.. ఒక నిబంధన.. నేను నీ సేవకుడిగా మారాలంటే నాకు నీ దర్శన భాగ్యం కల్పించు' అని వేడుకున్నాడు. 'తప్పకుండా నీ కోరిక నెరవేరుతుంది' అని భగవంతుడు అభయమిచ్చి అదృశ్యమయ్యాడు. ఒరలో కత్తి, విల్లంబులతో కనిపించే ఆ సేనాపతి ఆనాటి నుంచి వాటన్నింటినీ త్యజించి, భగవంతుని కృపతో తంబురా చేతపట్టి సంగీత సేవకుడిగా మారాడు.

తంబురా చేతపట్టి భగవన్నామ కీర్తనలతో సంచరిస్తూండేవాడు. అతని పాదాలు ఎక్కడకు తీసుకువెళితే అక్కడకు వెళ్ళేవాడు. అతని కీర్తనలకు వేలాదిమంది భక్తులు ఆకర్షితులై అనుసరించేవారు. తన కీర్తనలతో జనులను ఆధ్యాత్మికంగా చైతన్యం చేయాలంటే తాను ముందు మంత్రదీక్ష తీసుకోవాలని తలంచి ఓ ఆశ్రమానికి వెళతాడు. ఆ ఆశ్రమ సాధువు కనకదాసు చెప్పినదంతా సావధానంగా విని అతణ్ణి పరీక్షించదలచి... 'బర్రె' అనే మంత్రం పఠించమని చెబుతాడు. చదువురాని కనకదాసు గురువు చెప్పినట్లుగానే మంత్రాన్ని పఠించడం ప్రారంభిస్తాడు. వెంటనే అతని చుట్టూ గేదెల మంద గుమిగూడుతుంది. గురువు ఆ దృశ్యాన్ని చూసి అతని భక్తికి ఆశ్చర్యచకితుడవుతాడు. 'బర్రె' అనే మంత్రం పఠిస్తేనే నిజమైన గేదెలే వచ్చాయి. ఇక కనకదాసు గొంతు నుంచి వెలువడే సంకీర్తనలతో భక్తులు పునీతులవుతారని ఆ గురువు భావించి, దీవించి పంపుతాడు.

అలా సంకీర్తనలు ఆలపిస్తూ అతను ఉడిపిలోని ప్రసిద్ధ కృష్ణ భగవానుడి ఆలయానికి వెళతాడు. దేవాలయం ఎదుట సంకీర్తన చేస్తున్న అతణ్ణి ఆలయ అధికారులు లోనికి అనుమతించరు. ఎందుకంటే తక్కువ కులంలో పుట్టినందున ఆలయ ప్రవేశానికి అర్హుడు కాదని దూరంగా తరిమేస్తారు. భగవంతుణ్ణి దర్శించుకోలేకపోయానని వేదనతో కృష్ణుణ్ణి కీర్తిస్తూ ఆనాడు ఆ సేవకుడు పాడిన కీర్తనలు నేడు ఎంతో ప్రాచుర్యం పొందాయి. ఆలయానికి కొద్దిదూరంలో చిన్న గుడిసె వేసుకొని నివసించే ఆ సేవకుడు రాత్రివేళల్లో పాడే పాటలకు కృష్ణపరమాత్ముడు పరవశించి పోయేవాడు. వేదనతో.. తన్మయత్వంతో కీర్తనలు ఆలపిస్తున్న అతడికి కృష్ణ పరమాత్ముడి దర్శనం కలుగుతోంది. ఆ రోజు రాత్రి తంబురా మీటుతూ తన్మయత్వంతో పాటలు పాడుతున్న ఆ సేవకుడు కళ్ళుతెరచి చూసేసరికి ఆలయగోడ పగిలి పెద్ద రంధ్రం ఏర్పడిఉంటుంది. ఆ రంధ్రానికి అభిముఖంగా కృష్ణుడు నిలబడి అతని కీర్తనలను వింటూ పరవశించి పోతున్న అద్భుత దృశ్యం కనబడుతోంది. ఇప్పటికీ ఉడిపిలోని ఈ ఆలయంలో కృష్ణపరమాత్ముడు ముఖద్వారానికి అభిముఖంగా ఉండకుండా, ఆ రంధ్రానికి అభిముఖంగా ఉండటం విశేషం. శ్రీకృష్ణుడు రంధ్రం గుండా కనకదాసుకు దర్శనం ఇవ్వడం వల్ల ఆ రంధ్రం 'కనకనకిండి'గా పిలవబడుతోంది.

17వ శతాబ్దంలో తన గానామృతంతో ఓలలాడించిన కనకదాసు అనే ఈ గొర్రెల కాపరి జీవితం కృష్ణపరమాత్ముని లీలతో ఊహించని మలుపు తిరిగి ఆయనను ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్ళింది. కనకదాసు కేవలం సేనాపతిగా ఉండిపోతే ఆయన జీవితం చరిత్ర పుటలో ఓ మూలన చిన్న పేరాకు మాత్రమే పరిమితమయ్యేది. కనకదాసు కాస్త కృష్ణ దాసుడుగా మారడం వల్ల నేడు కవిగానూ, గొప్ప సంగీత విద్వాంసుడిగానూ, తత్త్వవేత్తగానూ తన స్థానాన్ని సుస్థిర పరచుకున్నాడు. కనకదాసు కీర్తన లేకుండా కర్నాటక సంగీతం లేదంటే అతిశయోక్తి కాదు. అన్నింటికంటే ముఖ్యంగా ఉడిపిలో వెలసిన కృష్ణ పరమాత్మను దర్శించుకోవాలంటే కనకనకిండీ అనే మార్గం గుండానే దర్శించుకోవాలి. భగవంతుని దర్శనానికి కులం అనేది అడ్డురాదని కనకదాసు జీవిత చరిత్ర చాటిచెబుతోంది. ❖

తెలుగు సేత: శ్రీమతి టి.ఆశాలత

(రామకృష్ణ సంఘ ఆంగ్ల మాసపత్రిక 'ప్రబుద్ధ భారత' నుండి)

మువ్వగోపాలుని పదకర్త

ఆలయ ప్రాంగణంలో ఒకనాటి రాత్రి తరుణ వయస్కుడైన భక్తుడొకడు కళ్ళుమూసుకొని ధ్యానమగ్నుడై ఉన్నాడు. ఆలయపూజారులు స్వామి సేవలు ముగించుకొని ఆలయద్వారాలు మూసి వెళ్ళిపోయారు.

తెలతెలవారుతుండగా చలిగాలితాకిడికి అతనికి తెలివి వచ్చింది. గుడితలుపులు తెరచి ఉన్నాయి. స్వామి తన మోహనాకారంతో ప్రత్యక్షమై ఎదుట నిలబడి ఉన్నాడు. ఆ మనోహర దృశ్యం ఒక క్షణకాలం మాత్రమే అతని కళ్ళ ఎదుట మెదలింది. కానీ స్వామి ఆశీర్వచనములు మాత్రం విస్పష్టంగా వినబడినవి.

"నాయనా! నీ పదాల ద్వారా మధురభక్తిని దేశం నాలుగుచెరగులా వినిపించు. నీవు పదకర్తగా లోకవిఖ్యాతి గడించగలవు". అతడు పారవశ్యంతో నాలుగువైపులా కలయజూశాడు. ఎవ్వరూ కనబడలేదు. ఆలయ కవాటాలు మూయబడి ఉన్నాయి. తనకు భగవద్దర్శనం లభించినట్లు అతను గ్రహించాడు. అతడే మహాకవి క్షేత్రయ్యగా పేరుగాంచిన వరదయ్య. ఆ ఊరు కృష్ణా జిల్లాలోని మొవ్వ. ఆ ఆలయం మువ్వగోపాలుని దివ్యమందిరం.

గోల్కొండ నవాబు క్షేత్రయ్యను 'పదిహేను వందల పదాలు నలభైరోజుల్లో రచించ'మన్నాడు. ముప్పైతొమ్మిది రోజులు గడచినా ఒక్క పదం కూడా రచించలేదు. ఒకే ఒక రాత్రిలో మూర్తీభవించిన మువ్వగోపాలుడై పదిహేనువందల పదాలను రచించి అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేసిన అసమాన వాగ్గేయకార శిరోమణి మహాకవి క్షేత్రయ్య. ❖

ఎవరు నాయందే మనస్సును ఏకాగ్రం చేసి, నన్నే నిరంతరం కాంక్షించుచూ, శ్రద్ధతో నన్ను ఉపాసింతురో వారే నన్ను శీఘ్రముగా పొందెదరు. నా పట్ల భక్తి గలవారు ఎన్నటికీ చెడిపోరు. - శ్రీకృష్ణుడు

శాంతి స్థాపనే సర్వమత సారం

– స్వామి భూతేశానంద (రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు)

మతం పేరిట ప్రపంచ చరిత్రలో ఎన్నో దారుణాలు జరిగాయి; జరుగుతూ ఉన్నాయి. వీటిని పరిశీలించినప్పుడల్లా మతాలను అర్థం చేసుకోవడంలో, వాటిని అనుష్ఠించడంలో మనం ఎక్కడో పొరపాటు చేస్తున్నామని స్పష్టమవుతూనే ఉంది. మతాన్ని(రిలిజియన్), ఆధ్యాత్మిక భావన (స్పిరిట్యుయాలిటీ)తో చూడకపోవడం వలన జరుగుతున్న తప్పిదాలివి. ఒకరిపై మరొకరు ఆధిపత్యాన్ని ప్రదర్శించాలనుకున్నంత వరకు వారు ఆధ్యాత్మికపరులు కాలేరు. మన ఉపనిషత్తుల ప్రకారం అంతటా ఏకత్వమే నిండి ఉంది.

“నేను అంతటా, అందరిలో నెలకొని ఉన్నాననే భావన ఉంటే, ఇక వైరమన్న మాటే రాదు. అయితే మన సంకుచితమైన అవగాహనతో, మన మతమే పరిపూర్ణమైందని, ఇతర మతాలు లోపభూయిష్ఠమైనవన్న భావనతో, భేదాలను సృష్టించుకుంటూ ఉన్నాం. కల్లోలాలకు కారణమవుతూ ఉన్నాం. వ్యక్తుల మధ్య, వర్గాల మధ్య వైరుధ్యాలను పెంచుకుంటున్నాం. పైగా మనం ఏర్పరచుకున్న చిన్న చిన్న చట్రాల మధ్య జీవిస్తూ, అవే సమున్నతమైనవిగా భ్రమపడుతూ ఉన్నాం. ఇతర మతాల్లో సంస్కరణలు అవసరమంటూ, వాదిస్తూ ఉన్నాం”.

అందుకే బైబిల్‌లో ఏసుక్రీస్తు కూడా One is trying to remove a straw from the neighbours eye while one has got a blanket on ones own eyes అంటారు. మన కళ్ళలో ఉన్న దుప్పట్లను పట్టించుకోకుండా, ఇతరుల కళ్ళలోని చిన్న నలుసును ఎత్తిచూపే ప్రయత్నం చేస్తూ ఉన్నామంటారు. ఈ ధోరణి వల్ల వ్యక్తిగతంగానే కాకుండా వ్యవస్థాపరంగా కూడా అశాంతి నెలకొంటుంది.

ఆచారాలే మతాలు కాదు...: ఈ తరంలో చాలామందికి మతం అనగానే మూఢనమ్మకాలు, అంధవిశ్వాసాలే మనస్సులో మెదలుతాయి. శాస్త్రీయతకు వ్యతిరేకమైన భావన పొడచూపుతుంది. అయితే ఏ మతం కూడా శాస్త్రీయతకు, హేతుబద్ధతకు విరుద్ధం కాదు. మానవజీవనానికి విఘాతాన్ని కలిగించదు. పైగా మానవజీవన సరళిని నిర్దుష్టంగా నిర్దేశించడంలో అది విశేషమైన పాత్రను పోషిస్తుంది. కానీ చాలా వరకు క్రతువులు, ఆచారాలే మతాలు అనుకునే అపోహలు కూడా ఎందరిలోనో ఉన్నాయి. అయితే నిజానికి అవన్నీ మతానుష్ఠానంలో ప్రాథమికస్థాయిలోనివి. వాటిని దాటుకొని ఆదర్శాలు, మానసిక పరివర్తన వైపు అడుగులు వేసినప్పుడే మనలో సామరస్యం సాధ్యపడుతుంది.

ప్రపంచంలో ఏ మతాలను, ప్రవక్తలను తీసుకున్నా కేవలం ఆచారాలు, సంప్రదాయాలు, బోధనలకే పరిమితం కాలేదు. వాటిని నిత్యజీవితంలో, మానవాళి సంక్షేమంలో, ప్రశాంత జీవనంలో ఎంత వరకు అన్వయించుకుంటున్నామన్న వాటికే అన్ని మతాలూ ప్రాధాన్యం ఇచ్చాయి. ముఖ్యంగా మానవాళి నంతటినీ ధర్మం విషయంలో అప్రమత్తం చేసేందుకు ఎన్నో విధాలుగా ప్రయత్నం చేశాయి. ఈ లోకంలో మనం తప్పించుకున్నా, పైలోకంలోనైనా మన తప్పులకు శిక్షలు అనుభవించవలసిందేనని హెచ్చరించాయి. ప్రధానంగా సాటి మనిషి హక్కులకు, ప్రశాంతతకు భంగం కలిగించడాన్ని పాపంగా పరిగణించాయి. I will be happy only when everyone is happy. I will be unhappy if anyone remains unhappy. That is the high truth a truly religious man manifests in his life. ఇతరుల ఆనందంలో తమ ఆనందాన్ని చూసుకుంటూ, ఇతరుల బాధలను తమవిగా భావించుకునే వారే మతాన్ని సరిగ్గా అర్థం చేసుకున్నవారు.

మానవత్వమే మౌలికసూత్రం...: సంఖ్యాపరంగా ఎంత మంది మతస్థులున్నారన్నదానిపై, ఆ మతం గొప్పతనం ఆధారపడి ఉండదు. ఆ మత సిద్ధాంతాలను, ప్రబోధాలను ఆచరించే వ్యక్తుల జీవనశైలిని బట్టి ఆ మతం విశిష్టత, ప్రత్యేకత ఆధారపడి ఉంటాయి. మతస్థుల సహనం, సంయమనం వంటి మానవీయ విలువలే ఆ మతాన్ని సమున్నతస్థానంలో నిలబెడతాయి. స్థూలంగా పరిశీలిస్తే ఆ మతం, మతగ్రంథాలు కూడా వ్యక్తుల మధ్య శత్రుత్వాన్ని, హింసను ప్రోత్సహించవు. ఒక్కమాటలో చెప్పాలంటే మానవత్వంతో మానవాళినంతటినీ మమేకం చేసే సూత్రమే మతం. ❖

(సెప్టెంబర్ 21న అంతర్జాతీయ శాంతిదినోత్సవం)

ధీరవాణి

– స్వామి వివేకానంద

వాచా వేదాంతం వద్దు!

సోదరులారా! ఆలోచించేకొద్దీ మీపై ప్రేమ ఎక్కువవుతోంది. మీరు యోగ్యులు, పవిత్రులు, సాధువర్తనులు. తరతరాలుగా మీరు ఇక్కట్లపాలవుతున్నారు. ఈ మాయామయ భౌతిక ప్రపంచం అటువంటిది. దానిని పట్టించుకోకండి. నిరంతర కృషిచేద్దాం! చివరికి ఆత్మ జయించి తీరుతుంది. దేశాన్ని నిందించవద్దు. నిర్విరామంగా శ్రమించి అలసటపొంది, కాలవైపరీత్యంచేత క్రుంగిపోయిన మన పవిత్ర భారతదేశ వ్యవస్థలను నిందించవద్దు, శపించవద్దు.

మన సమాజంలో లోపాలున్న మాట నిజమే! కానీ, ఇతర సమాజాలలో కూడా లోపాలున్నాయి. మనదేశం ఒకప్పుడు వితంతువుల కన్నీటి ధారలతో తడిసిపోయింది; పాశ్చాత్య దేశాలలో, అవివాహిత యువతుల నిట్టూర్పులతో గాలి సుళ్ళు తిరిగిపోతోంది. ఇక్కడ దారిద్ర్యం జాతి వినాశహేతువుగా ఉంది; అక్కడ భోగలాలసత్వంలోని వెక్కసపాటు జాతి వినాశకారణంగా ఉంది! ఇక్కడ, తిండిలేక ప్రజలు ఆత్మహత్య చేసుకొంటున్నారు. అక్కడ తిండి ఎక్కువై ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఇలా, అంతటా కీడుంది.

ప్రతి సంఘంలోనూ లోపాలుంటాయని అందరికీ తెలుసు. ఈ విషయం చిన్నపిల్లవాడికి కూడా తెలుసు. చదువు సంధ్యలు లేని లోకసంచారి అయిన పరదేశి ఇక్కడికి వచ్చి భారతదేశంలోని ఘోరదురాచారాలను గూర్చి గొప్ప గొప్ప పండితోపన్యాసాలను కురిపించగలడు. మన సంఘంలో దోషాలున్నాయని మనం ఒప్పుకుంటూనే ఉన్నాం. దోషాన్ని ప్రతివాడూ చూపగలడు. కానీ ఆ దోషాన్ని పరిహరించే మార్గాన్ని చూపేవాడు మానవాళికి స్నేహితుడు.

నీటిలో మునిగిపోతున్న ఒక పిల్లవాడికి దారిన పోతున్న ఒక వేదాంతి ఉపన్యాసమియ్యసాగాడట! అందుకు పిల్లవాడు "ముందు నన్ను నీళ్ళలో నుండి బయటకు లాగు" అని అరిచాడట. అట్లే "మేము ఉపన్యాసాలు కావలసినన్ని విన్నాం. సంఘాలు కావలసినన్ని ఉన్నాయి. పత్రికలూ కావలసినన్ని ఉన్నాయి. మాకు చేయి అందించి, పైకిలాగే పురుషులెక్కడున్నారు? నిజంగా మమ్మల్ని ప్రేమించేవాళ్ళెక్కడున్నారు? మాపై సానుభూతి చూపే దయామయులెక్కడున్నారు?" అని మన ప్రజలు ఘోషిస్తున్నారు. అవును, ఇప్పుడు మనకు కావలసింది ప్రజలను ప్రేమించి, వారి కష్టాలను తీర్చే అనుష్ఠానపరులేగానీ, వాచా వేదాంతులు కాదు! ❖

విషయ సంగం వల్ల కామం, కామం వల్ల క్రోధం, క్రోధం వల్ల మోహం కలుగుతాయి. మోహం వల్ల స్మృతి నశిస్తుంది. స్మృతి నశించడం వల్ల బుద్ధి నశిస్తుంది. బుద్ధి నాశనం వల్ల మనిషి నశిస్తాడు - శ్రీకృష్ణుడు

తలను శిఖిపింఛమది వింత తళుకులీన
నుదుట కస్తూరి తిలకంబు కుదురుకొనగ॥
మురళి వాయించుచు జగన్మోహనముగ
పరుగు పరుగున రావోయి బాలకృష్ణ ॥

అన్న పద్యం వినగానే, నెమలి పింఛాన్ని శిరస్సున అలంకారంగా ధరించి, నుదుట కస్తూరి తిలకం వింతశోభను చేకూరుస్తుండగా, హృదయాన్ని ఆర్ద్రం చేసే చూపులతో, చిరునవ్వులు చిందించే జగన్మోహన రూపంతో, తొలకరి మేఘాన్ని సరిపోలిన శరీరఛాయతో, మురళిని చేత ధరించి, బుడిబుడి నడకలతో నడచి వస్తూ ఉన్న బాలకృష్ణుని రూపం గుర్తుకు రాకమానదు.

కర్షతీతి కృష్ణః అన్నట్లుగా కృష్ణశబ్దంలోనే ఆకర్షణ ఉంది. జీవులను తనవైపు ఆకర్షించి తనలో లీనం చేసుకునే పరిపూర్ణతత్త్వం ఆ నామంలో ఇమిడి ఉంది. అందుకే కాబోలు దానిని అనుభవంలోనికి తెచ్చుకున్న మీరాబాయి ఒకానొక గీతంలో ఇలా చెబుతుంది – 'నామమనే చెరగని రంగు గాఢంగా నాకు పట్టింది. ఈ రంగు ఇంక వదిలేది కాదు. దీని వలన ప్రాపంచిక కృత్రిమ రంగులన్నీ తొలగాయి'.

ఉపనిషత్తులలోని భగవత్‌తత్త్వాన్ని సామాన్య మానవులకు అందుబాటులోనికి తెచ్చేందుకు, దానికి చక్కటి కథారూపాన్ని చేకూర్చి భాగవతంగా మలచి జనరంజకం చేసారు వ్యాసమహర్షి. ఉపనిషత్తులనే పూదోటలోని అనేక సుందర కుసుమాలు భాగవత కథారచనలో తమ దివ్య పరిమళాలను వెదజల్లాయి. పరమమైన సత్యం అందమైన కథల ద్వారా, అత్యద్భుత కవితారీతిలో, చక్కటి భావావేశాలతో, కన్నులకు కట్టినట్లుగా వర్ణన గావించబడింది. ఆ నల్లనయ్య తన లీలా ధ్యానంతో భక్తులను తరింపచేసేందుకే బాలకృష్ణునిగా అద్వితీయమైన మాధుర్యలీలలు ప్రదర్శించాడు. ప్రతీ ఒక్కరికీ, ఆ అపురూప బాలకుడు తమ స్వంతమేననే భావనను కలిగిస్తాడు. అందుకే ఆబాలగోపాలం కృష్ణ లీలలను తలుస్తూ, పరవశిస్తూ ఉంటారు. అందుచేతనే యుగం మారినా, నేటికీ తమ ముద్దుపాపడికి, చిన్ని కృష్ణుని రూపధారణను చేస్తూ, మురిసిపోతుంటారు తల్లులు. తత్త్వం తెలిసినా, తెలియకపోయినా, ఆ శక్తి అప్రమేయంగా లాగుతూనే ఉంటుంది.

శ్రీకృష్ణావతారం పరిపూర్ణావతారం. సదా తాను అఖండ చైతన్యస్వరూపుడిననే స్ఫురణను కలిగి ఉన్నవాడు కృష్ణుడు. అందుకే మానవరూపాన్ని ధరించినా, అడుగడుగునా మానవాతీత దివ్యలీలలను ప్రదర్శిస్తూ, తన దివ్యత్వాన్ని చూపించాడు. ఆ స్వామి ప్రదర్శించిన అలౌకిక లీలలను కొన్నింటిని అర్థం చేసుకునే ప్రయత్నం చేద్దాం.

జీవుల బంధనాలను తొలగించే ఆ ఆదిదేవుడు తన తొలిలీలగా కారాగారంలో జన్మించి, చతుర్భుజునిగా తల్లిదండ్రులకు దర్శనమిచ్చి, ఆపై ప్రాకృతిక శిశువుగా మారాడు. ఇక్కడ చతుర్భుజ ప్రాశస్త్యం ఏమిటంటే, అవి భగవత్ ప్రాప్తికి సాధనాలైన నాలుగు యోగాలైన కర్మయోగం, భక్తియోగం, రాజయోగం, జ్ఞానయోగాలను సూచిస్తున్నాయి. వీటిలో ఏ యోగమార్గాన్ని అవలంబించి తనను చేరే ప్రయత్నాన్ని చేసినా, వారిని సంసారమనే కారాగారం నుండి విడుదల గావిస్తాననే అభయాన్ని ఈ దర్శనం ద్వారా తెలుపుతున్నాడు.

రాగద్వేషాలకు తాను అతీతుడననే విషయాన్ని, ప్రాణాలు తీయవచ్చిన పూతనకు ఉత్తమగతులను ప్రసాదించడం ద్వారా స్పష్టం గావించాడు ఆ శైశవకృష్ణుడు. ఆ తరువాత, తన సుకుమార పాదాన్ని మోపి, బండిరూపంలోని శకటాసురుని సంహరించడంలో ఒక అద్భుతలీలను చూపాడు. శకటం అంటే బండి; మానవదేహమే ఒక బండి; పుణ్యపాపాలనేవి ఈ బండికి చక్రాలు. తన పాదాలను హృదయంలో నిలుపుకున్న వారికి దేహతాదాత్మ్యతను తొలగిస్తాననే భరోసాను ఈ లీల ద్వారా తెలియజేస్తున్నాడు.

ఎన్నిసార్లు విన్నా, ఎన్ని మార్లు చెప్పినా, చెప్పించుకున్నా, చెవులకు వినబడనిది, కళ్ళకు కనబడనిది, మాటలకు అందనిది, మనస్సుకి చిక్కనిది అయిన తత్త్వం భక్తి వలన సాధ్యపడుతుంది. శుద్ధ ప్రేమకు,

శ్రీకృష్ణ లీలలు

– డాక్టర్ అపర్ణా శ్రీనివాస్

భక్తికి పరమాత్ముడు తల ఒగ్గుతాడు. దీనికి దృష్టాంతంగా చెప్పేందుకు మనకు యశోదామాత నిలుస్తుంది. బ్రహ్మాది దేవతలు, మునులు కూడా, 'అదృష్టం అంటే యశోదమ్మదే' అని కొనియాడారు. ఆవిడ దగ్గర చిన్ని కృష్ణుడు చేసిన ఆగడాలు అన్నీ ఇన్నీ కావు. ఒక్కసారి, ఆ యశోదామాత చెంతనున్న కృష్ణుని దర్శించే ప్రయత్నం చేద్దాం.

వెన్నను దొంగిలిస్తూ ప్రత్యక్షంగా తల్లికి పట్టుబడగా, కోపాన్ని అభినయిస్తూ ఆ చిన్ని కృష్ణుని దండించేందుకు కర్రను తీసుకుని ఆ తల్లి వెంటపడగా, భయాన్ని నటిస్తూ గోకుల వీధుల్లోకి పరుగెడుతున్నాడు ఆ తుంటరివాడు. ముక్కోటి దేవతలు ఈ అపురూప దృశ్యాన్ని అబ్బురపడుతూ చూడసాగారు. మహాయోగీశ్వరులు తమ కఠోర తపస్సులతో కూడా పట్టలేని ఆ మాయావిని పట్టుకోవాలని ఆ తల్లి శతవిధాలుగా ప్రయత్నిస్తూ, రొప్పుతూ అలసిపోతోంది, ఆమెపై కరుణచే తనంతట తానే దొరికిపోయాడు ఆ ముద్దుల కన్నయ్య. తనను చూస్తూ చూస్తూ, బెత్తంతో దండించ లేక, తాడుతో రోటికి కట్టాలనే ప్రయత్నాన్ని చేస్తున్న తల్లిని చూసి లోలోపల నవ్వుకోసాగాడు ఆ మనోహరుడు. నిష్కపటమైన ఆ మాతృప్రేమకు వశుడై, ఆమెచే రోటికి కట్టివేయబడి, తాను బంధితుడై ఉండి, నలకూబర మణిగ్రీవుల శాపబంధనాలను విడిపించిన ఆ దామోదరుని లీల దివ్యాతి దివ్యం.

నిస్వార్థప్రేమకు స్వామి కట్టుబడతాడనే ఈ లీలను, శ్రీకృష్ణ కర్ణామృతంలో లీలాశుకుడు 'పరమాత్మ తత్త్వాన్ని తెలుసుకునేందుకు ప్రజలంతా వేదాలు అనే మహారణ్యంలో తెగ తిరుగుతూ, వెతుకుతూ, చాలా శ్రమపడుతూ ఉన్నారు. వారంతా వెతికే ఆతడు ప్రస్తుతం రేపల్లెలో తల్లియైన యశోదచే కొయ్యరోటికి కట్టబడి, తప్పించుకునే వీలులేక బిత్తర చూపులు చూస్తూ, కదలక మెదలక నిలచి ఉన్నాడు. సకలోపనిషత్తుల సారమైన ఆ పరబ్రహ్మాన్ని ఈ రూపంలో పట్టుకోవడం చాలా

తేలిక సుమా! ప్రయత్నించిన వారిదే అదృష్టం అంతా!' అని అత్యద్భుత రీతిలో తెలియజేసారు.

'కన్నయ్యా! మన్ను తిన్నావా?' అని తల్లి ప్రశ్నించగా, 'అమ్మా! *మన్ను దినంగ నే శిశువునో? యాకొంటినో వెర్రినో- నమ్మం జూడకు...'* అని అమాయకంగా పలుకుతూనే, తల్లికి తన నోటియందు పధ్నాలుగు భువనభాండాలను చూపి దిగ్భ్రాంతికి గురిచేశాడు. వాస్తవానికి మాయ అనే మట్టిని తినేవాడు జీవుడే, దాని నుండి బయటపడితేనే విముక్తి అని అన్యాపదేశంగా తెలియజేశాడు ఆ కమలనేత్రుడు.

ఇంక ఆసక్తికరమైన కాళీయమర్దన ఘట్టానికి వస్తే, జీవులందరి హృదయమనే మడుగులో, మనస్సనే కాళీయుడున్నాడు. ఈ కాళీయునికి గల అయిదు తలలూ పంచ జ్ఞానేంద్రియాలు. శ్రీకృష్ణుని శరణుకోరి ఆశ్రయించిన, కాళీయుని దర్పమణిచినట్లుగా, మనోదర్పాన్ని అణచి, రాగద్వేషాలనే విషాన్ని ఆవలకు నెట్టివేయగలడు ఆ అచ్యుతుడు.

నవనీత చోరుడనే సార్థక నామధేయానికి వస్తే, పెరుగుని మథించగా మథించగా వచ్చేది వెన్న. ఆ గోపాలునికి సర్వ సమర్పణం గావించుకున్న వారి యొక్క చిత్తాన్ని మథించగా వెలికివచ్చే కర్మ ఫలితాలైన వాసనలను, సంస్కారాలను హరిస్తాడు. ఇదే ఆ వెన్న దొంగ చోరత్వం వెనుక ఉన్న కథ. ఎప్పుడైతే వాసనలు హరించబడతాయో, అప్పుడు మనోబుద్ధులు నిశ్చలమై తత్త్వవిచారణకు సంసిద్ధమవుతాయి. దీనినే శ్రీవల్లభాచార్యులు 'నారాయణుడనే పేరుగల నరుడు, ఈ భూమిపై పెద్ద దొంగగా ప్రసిద్ధి గాంచాడు. అతనిని తలచిన వెంటనే వచ్చి, అనేక జన్మల పాపపురాశిని ఏమాత్రం శేషం లేకుండా హరిస్తాడు' అని విశదీకరించారు.

మరొక అద్భుతలీల దగ్గరకు వస్తే, ఎడమ చేతి చిటికెనవేలుతో అవలీలగా గోవర్ధనగిరిని ఎత్తి, గొడుగు వలె పట్టుకుని వయ్యారాలు పోతుంటాడు ఆ తుంటరివాడు. మనస్సనే ఇంద్రుడు సంక్షోభాన్ని కలుగజేస్తే, బుద్ధి అనే గోవర్ధనాన్ని పైకెత్తి, ఆత్మజ్ఞానంతో మనలను రక్షిస్తానని తెలపడమే ఇందులోని పరమార్థం.

వేణుగానలోలునిగా ఆ శిఖిపింఛమౌళి మనకు అందించే సందేశం, ప్రతీజీవుడూ ఒక వేణువే. ఈ వేణువనే జీవునిలో శ్వాసనునింపుతూ, చైతన్యాన్ని కలుగజేసేది ఆ అనంతుడే. దానిని గుర్తించిన వారిని, వేణువునంటిపెట్టుకుని ఉన్నట్లుగా ఎప్పటికీ అంటిపెట్టుకునే ఉంటాడు.

అయితే దీనికై వేణువువలె మనలోపల కూడా ఎటువంటి కల్మషాలను ఉంచుకోక, ఖాళీగా, బోలుగా తయారవ్వాలి.

ఇంక బాల్యలీలల్లో చివరగా, వేణుగాన మాధుర్యానికి పరవశులయ్యే గోపికల విషయానికి వస్తే, వారు ఎలాంటివారో స్వయంగా ఆ కన్నయ్యే ఇలా వివరిస్తున్నాడు – 'వేయించిన విత్తనాలు తిరిగి మొలకెత్తని విధంగా, హృదయంలో నన్ను నిలుపుకుని, సంపూర్ణంగా శరణాగతిని పొందినవారి దృష్టి లౌకిక విషయాలకు ఆకర్షించబడదు' అని అంటూ అలౌకిక రాసలీలకు గోపికలకు గల యోగ్యతా పత్రం ఇదేనని ధ్రువీకరించి చెప్పాడు ఆ రాసవిహారి.

ఈవిధంగా ఎందరెందరినో ఉద్ధరించాడు ఆ గోపబాలకుడు. సూరదాసు మనోవీధిలో దోబూచులాడేదు; మీరాబాయితో గానం చేసాడు; సక్కుబాయితో సమంగా తిరగలి విసిరాడు; నామదేవునితో కలసి గంతులు వేసాడు; తుకారామ్‌తో చప్పట్లు చరిచాడు; చైతన్యునితో నాట్యం చేసాడు! ఇంకా ఎందరెందరినో, తనవైపుకి తిప్పుకుని ఆనందాంబుధిలో ఓలలాడించాడు. వారిలో మహర్షులున్నారు, జ్ఞానులున్నారు, కర్మయోగులున్నారు, శుద్ధభక్తులున్నారు, విరాగులున్నారు.... వారు, వీరు అననేల, ఏ యోగాన్ని పాటించినా, ఏ మార్గాన్ని అనుసరించినా, తానే గమ్యమని చాటి చెప్పాడు ఆ గోపాలబాలకుడు. ❖

ఎవడు మోహరహితుడై, పురుషోత్తముడనైన నన్ను భగవంతునిగా తెలుసుకొనుచున్నాడో వాడే సర్వజ్ఞుడు. అతడే నన్ను సర్వవిధములా భజించువాడగుచున్నాడు. - *శ్రీకృష్ణుడు*



పాపభీతి...

ఆ రాజు దేవేంద్రుడి వైభవంతో విరాజిల్లుతూ సభతీరి ఉన్నాడు. ఇంతలో ఆ సభలోకి ఒక తపస్వినియైన లలితాంగి బాలార్కుడి సమతేజస్సుతో భాసిస్తున్న సుతుడితో ప్రవేశించింది. దృష్టంతా సింహాసనాధిష్ఠుడైన రాజుపై నిలిపి, 'ఓ రాజా! మీరు ఇంతకు ముందు నన్ను గాంధర్వ విధిలో వివాహమాడినప్పుడు నాకు ఇచ్చిన వాగ్దానాన్ని గుర్తుచేసుకొని మీ పుత్రుడైన ఈ బాలుడికి యువరాజ్య పట్టాభిషేకం జరిపించవలసింది' అని అంది. అప్పటివరకూ ఆ సభలోని వారెవరూ చూడని, వారెవరికీ తెలియని ఒక స్త్రీ హఠాత్తుగా నిండుసభలో తన తనయుడితో ప్రవేశించి 'నేను మీ భార్యను, ఈ బిడ్డడు మీ కుమారుడు, మమ్మల్ని ఆదరించవలసినది' అని అడిగేసరికి రాజు నిర్ఘాంతపోయాడు. ఆ రాజు వెంటనే తేరుకొని, 'ఓ దుష్టతాపసీ! యుక్తాయుక్త వివేకం లేకుండా ప్రసంగిస్తున్నావు. నీ వెవరివో, నే నెవరినో; నీకూ, నాకూ ఏ విధమైన సంబంధంలేదు. శీఘ్రంగా వచ్చిన చోటికి కదిలిపో!' అని గద్దించాడు.

ఈ మాటలతో ఆ సాధ్వి బిత్తరపోయింది. రాజు మాటతప్పడం, అలా ములుకులవంటి మాటలతో తనను తిరస్కరించడంతో ఆమె నిశ్చేష్టురాలైంది. కళ్ళు నిప్పుకణికలయ్యాయి. శరీరం కంపించింది. ఆగ్రహం కట్టలు తెంచుకుంది. అతి కష్టంతో తనను తాను నిగ్రహించుకుని రాజుతో ఇలా అంది:

'ఓ రాజా ఈ వ్యవహారంలో సత్యాసత్యాలకు తమ అంతరాత్మే ప్రత్యక్షసాక్షి. సమస్త పాపాలకన్నా ఆత్మవంచన అత్యంత ఘోరపాపం. **మన్యతే పాపకం కృత్వా న కశ్చిత్ వేత్తి మామితి। విదన్తి చైనం దేవాశ్చ యశ్చైవాన్తరపురుషః॥ ఆదిత్యచన్ద్రావనిలానలౌ చ ద్యౌర్భూమిరాపో హృదయం యమశ్చ। అహశ్చ రాత్రిశ్చ ఉభేచ సంధ్యే ధర్మస్య జానాతి నరస్యవృత్తమ్॥** పాపకార్యం చేసి తాను చేసిన కార్యం ఎవరికీ తెలియదని అనుకుంటాడు మనిషి. దేవతలు, హృదయ కుహరంలో సదా సన్నిహితుడైన ఆ పరమాత్మ సర్వము వేయికళ్ళతో కనిపెట్టి చూస్తూనే ఉన్నారు. అంతేకాదు సూర్యచంద్రులు, పంచభూతాలు, అహోరాత్రాలు, యమదైవతం, ప్రాతః సాయం సంధ్యలు మనిషి ప్రవర్తనను అనునిత్యము పరికిస్తూనే ఉన్నారు. ఏ మానవుడూ ఈ సాక్షుల కన్నుగప్పి చరించలేడు. వ్యక్తులాచరించిన సుకృత దుష్కృతాలకు అనుగుణంగా యమధర్మరాజు ఆయా వ్యక్తులకు ప్రతిఫలితాలు విధిస్తున్నాడు. ఆత్మాపహరణ పరులయిన దుర్జనులు దేవతల ఆగ్రహానికి గురవుతూ ఉన్నారు. నేను మీ ధర్మపత్నిని. ఈ మహాసభ మధ్యలో నన్నీవిధంగా కించపరచడం తగదు' అంది.

ఇలా ఉద్విగ్నభరిత మాటల యుద్ధం తర్వాత ఆకాశవాణి 'రాజా! ఈ పిల్లవాడు నీ పుత్రుడే. నీవు నీ పుత్రుణ్ణి భరింపవలసి ఉన్నది' అంది. మహారాజు ఆ అశరీరవాణి పలుకులను గమనించవలసినదని సభాసదులకు చెప్పి ఆ యువతిని తన భార్యగా, ఆ బాలుడిని తన పుత్రుడిగా స్వీకరిస్తాడు. రాజుతో ఈ మాటలన్న ఆ తపస్విని ఎవరో కాదు విశ్వామిత్రుడు, మేనకలకు పుట్టి కణ్వమహర్షి లాలనలో పెరిగిన మహాసాధ్వి శకుంతల. ఆమె పట్టాభిషేకం చేయాలని తీసుకువచ్చిన బాలుడే భరతుడు. సింహాసనాసీనుడైన రాజు దుష్యంతుడు. ఆర్యావర్తానికి కావలసిన తర్వాతి రాజు పుట్టుపూర్వోత్తరాలు సభికులకు, వారి ద్వారా రాజ్య ప్రజలకు తెలియజెప్పే ఉద్దేశంతో దుష్యంతుడు శకుంతలను గుర్తుపట్టినప్పటికీ కొంతసేపు గుర్తించనట్లు ప్రవర్తించాడు. సన్మార్గం తెలియక కాదు.

నేడు మనం: నేటి పరిస్థితి గురించి మాట్లాడడం అవసరం. ఆస్తుల క్రయవిక్రయాలు దస్తావేజులు, సాక్షుల సంతకాలు లేకుండా మనం చేయలేం. సాక్షులతో సంతకాలు పెట్టించి రిజిష్టర్డు పత్రాలు ఉన్నతర్వాత కూడా ఆస్తిపాస్తుల విషయమై మనుషులు నకిలీ పత్రాలను సృష్టించి భూమి, ఇతర స్థిరాస్తులను కాజేయడం, అమ్మడం లాంటివి సర్వసాధారణమైపోయింది. మాటమీద నిలబడడం అనేది అతి కష్టమైన పనిగా పరిణమించింది.

కలియుగంలో ఉన్నాం. ధర్మం ఒక్కపాదంపైనే నడుస్తుందని మనందరికీ విస్పష్టం. కనీసం ఈ ఒక్కపాదాన్నైనా సరిగ్గా ఉంచుకోవడానికి ప్రయత్నించడమే మన తక్షణ కర్తవ్యం. కాలమహిమను, యుగధర్మాన్ని ఎరిగిన భగవంతుడు మనకు ధర్మపరంగా కొంత రాయితీని కల్పిస్తాడు. **'స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్...** ధర్మానుసరణ కొద్దిపాటిదైనప్పటికీ మనిషిని గొప్ప ఆపద నుండి రక్షిస్తుంది' అన్న గీతలోని భగవానుడి వాక్యాన్ని సదా గుర్తుకు తెచ్చుకొని ఎంత సాధ్యమైతే అంతవరకూ నీతిబద్ధమైన జీవితాన్ని గడపాలి. అంతేకానీ ధర్మంపై విశ్వాసాన్ని కోల్పోకూడదు. పూర్తిగా ధర్మవిమూఢులమై జీవించకూడదు. చట్టాల అవసరం లేకుండా మనిషి సత్పథంపై ఉండాలి. చట్టం కళ్ళు కప్పగలుగుతామేమో కానీ నిరంతరం మనల్ని పరివీక్షిస్తున్న పంచభూతాలను, వాటిని నడిపిస్తున్న సర్వసాక్షి ఐన భగవంతుడి కళ్ళు కప్పలేం కదా?

పాపిగా భావిస్తే పాపియే అవుతాం: సనాతన ధర్మంలో మనం పాపం గురించి ఎక్కువ మాట్లాడం. అంటే దురితకర్మలు లేవని కాదు. 'మనిషి తనను తాను పాపి అని అనుకుంటే పాపియే అవుతాడు' అని శ్రీరామకృష్ణులు అంటారు. 'నేను పవిత్రుడను, నేనే పాపం చేయను, ఏ పాపం నన్నంటుకోదు' అని భావిస్తూ నిరంతరం దైవస్మరణ చేసేవారు పాపానికి దూరం అవుతారు.

మనం నేటి సమాజాన్ని, మనుషులు అనుసరిస్తున్న అనుష్ఠానాలను, కర్మలను, క్రతువులను చూస్తే ప్రతిమనిషి తనను

తాను పాపినని భావించుకుంటూ నిరంతరం అనుచిత కర్మలను నిర్వహిస్తూ పాప ప్రక్షాళనకు తన ధర్మంలో ఏ విధమైన మార్గాలున్నాయో వెతుక్కుంటున్నాడు. ఆ ప్రక్షాళన క్రతువేదో నిర్వహించేసి, చేసిన అఘాన్ని కడిగి వేసుకొని తిరిగి మళ్ళీ పాత జీవనశైలిని అనుసరిస్తూ, శీలనిర్మాణం చేసుకోవడానికి, సచ్చరిత్రుడిగా ఉండడానికి ముందుకు రావడం లేదు. ఇలాంటి అవగాహన పూర్తి అజ్ఞాన జనితం. ఇలాంటి భావన మనల్ని మనం మోసం చేసుకోవడమే కానీ వేరొకటి కాదు. చేసిన అనైతిక క్రియలకు

ధర్మ నిరతి

– స్వామి శితికంఠానంద

పశ్చాత్తాప పడి 'ఇక నుంచి ధర్మమార్గంలో చరిస్తాను' అని సంకల్పించుకుని సునీతిమంతులై ఉండడానికి ప్రయత్నించేవారికి భగవంతుడు ఆసరాగా ఉంటాడు. అంతేకానీ సదా అపసవ్యమార్గంలో సంచరిస్తూ ఏదో ఒక క్రతువును నిర్వహించి దురితం పోయిందని భావించేవారు మోహవశులైనట్లే.

నేడు కొందరు సనాతన ధర్మంలో పాప ప్రక్షాళనకు అనేక సులభ మార్గాలున్నాయని భావిస్తూ విచ్చలవిడిగా జీవించవచ్చును కుంటున్నారు. పాపభీతిని పూర్తిగా విడనాడుతున్నారు. ఋజువర్తనులుగా ఉండటానికి కనీస ప్రయత్నం చేయడంలేదు. ఈ ఆలోచన సరికాదు. పూర్వం చేసినటువంటి కర్మ అనుభవించాల్సిందేననీ, మనిషి ఏ విధంగానూ కర్మఫలాల నుంచి తప్పించుకోలేడనీ మనకు మహాభారతం చెపుతుంది.. **'యథా ధేనుసహస్రేషు వత్సోవిందతి మాతరం। తథా పూర్వకృతం కర్మ కర్తారమనుగచ్ఛతి॥** – ఏ విధంగా వెయ్యి ఆవుల మధ్యలో దూడ తన తల్లిని కనుక్కోగలుగుతుందో అదేవిధంగా గతంలో చేసిన కర్మలఫలాలు మనిషిని అనుసరిస్తాయి' అంటుంది పంచమవేదం. గతం గతః అని తెలుసుకొని, తనచేతిలో లేని దాని గురించి చింతించకుండా, ఇప్పటినుంచి తన వర్తనను సరిచేసుకుంటూ సదాచార అనుగామియై ప్రవర్తించే మనిషే మనిషి.

అంతరాత్మ ప్రబోధాన్ని వినగలగాలి: ఇప్పటికీ భారతదేశంలో ప్రతిమనిషికీ చేసిన కర్మల ఫలాలను అనుభవించాల్సిందేనని తెలుసు. ఏ శాస్త్రం చదవకపోయినా ప్రతివారికీ ఈ కాస్త జ్ఞానం ఉంది. కానీ వస్తుపరమైన జీవితమే జీవితంగా భావిస్తూ ఉన్న జనులు అధిక సంఖ్యాకులవడం, ధార్మిక జీవనమే జీవనం అనుకునే వారి సంఖ్య అత్యల్పం అవడం, వస్తువినియోగంలో ఇతరులతో సమానంగా ఉండాలనుకోవడం వలన ధర్మతత్పరతకు విఘాతం కలుగుతున్నది. ఎలాగూ అనుసరించలేం కాబట్టి తెలుసుకోవడం కూడా అనవసరం అని మరికొందరు భావిస్తూ వస్తున్నారు. ఇది మనిషి బలహీనతకు నిదర్శనం. ఈ విధమైన అపనమ్మకం అత్యంత ప్రమాదకరం. ఇది ఈ కాలానికి సాధ్యమయ్యేది కాదు అని ఎన్నడూ భావించరాదు. హృదయ కుహరంలో ఉన్న భగవానుడు మన ఆలోచనలకు కూడా సాక్షిగా ఉన్నాడు. ఆయన మనిషి యొక్క సర్వకార్యాలను వీక్షిస్తూనే ఉన్నాడు. అందుకని ప్రతివ్యక్తి అంతరాత్మ ప్రబోధం మేరకు నడచుకోవడానికి ప్రయత్నించాలి. ఒక సమాజం ఎంత గొప్పదో అనే విషయం ఆ సమాజంలో అంతర్యామి ఆజ్ఞమేరకు నడచుకోగలిగే వ్యక్తుల సంఖ్యపై ఆధారపడి ఉంటుంది.

ప్రస్తుత సమాజంలో మనుషులలో మనకు కన్పిస్తున్న అస్థిరత, చపలత్వం, వ్యక్తుల అలవాట్లు, చర్యలు అంతర్వాణి ఆదేశానుసారం లేకపోవడం వలననే అని చెప్పవచ్చును. ఆంగ్లంలో ఒక సూక్తిఉంది. a pure conscience is the richest treasure మలినం కాని అంతరాత్మ మహాసంపద. నిజానికి అంతర్యామి మనిషి ఏ చర్యచే కూడా మలినమవడు. చేసే పనులు ధర్మ విరుద్ధాలైతే అజ్ఞానపు ఆవరణ పెరిగి ఆత్మప్రకాశం మందగిస్తుంది. అంటే మనిషి మెల్లగా భగవానుడికి దూరమవుతాడు. క్రమేణా వ్యక్తి శక్తులన్నీ బలహీనమవుతాయి. తద్విరుద్ధంగా శుద్ధాంతరంగుడు దినదిన శక్తిసంపన్నుడవుతాడు. ధర్మానుష్ఠానం ద్వారా అంతర్గత శక్తులు పూర్తిగా జాగృతమైనప్పుడు సర్వశక్తిమంతుడవుతాడు. సంకల్పిస్తే ప్రపంచాన్నే కదిలించగలుగుతాడు. అందుకని ఎవరు చూసినా, చూడకపోయినా సర్వాంతర్యామిగా ఉన్న భగవానుడు సదా మనిషి చర్యలన్నింటినీ చూస్తూనే ఉన్నాడని తెలుసుకొని సర్వప్రాణి హృత్పద్మనివాసిని సంతృప్తి పరచడానికి మాత్రమే మనం ప్రయత్నించాలి.

పరమేశ్వరుడు దృష్టి సారించని ప్రదేశం లేదు: ఒకసారి కనకదాసుని గురువు వ్యాసరాయలు ఒక ఏకాదశినాడు అందరూ ఉపవాస దీక్షలో ఉన్నప్పుడు కనకదాసుతో సహా తన శిష్యులనందరినీ పిలిచి అందరికీ ఒక్కొక్క అరటిపండును ఇచ్చి ఎవరూ చూడని స్థలానికి వెళ్ళి తిని రమ్మన్నారు. అందరూ తమకు తోచిన నిర్మానుష్య స్థలాలకు వెళ్ళి ఎవరూ చూడకుండా తిన్నామని చెప్పారు. కనకదాసు మాత్రం అరటిపండును చేతిలో పట్టుకొని వెనక్కు వచ్చాడు. వెంటనే వ్యాసరాయలు 'నీకు ఎవరూ చూడని ప్రదేశమే కనిపించలేదా?' అని అడిగారు. అప్పుడు కనకదాసు 'సర్వం వ్యాపించి ఉండి సర్వాన్నీ వీక్షిస్తున్న ఆ పరమేశ్వరుడు చూడని ప్రదేశం ఏమన్నా ఉందా? అలాంటి ప్రదేశం లేదు కాబట్టి నేను అరటిపండును తినలేకపోయాను' అని అన్నాడు.

ఏ మనిషైనా తాను చేసే దురితం తాను తప్ప ఎవరూ చూడలేదు అని భావిస్తే అంతకన్నా అజ్ఞానం ఇంకొకటి లేదు. సత్యమార్గం నిస్సందేహంగా కఠినతరం. అనేక ప్రలోభాలమయం. ఐనా ఆకర్షణలకు నిలదొక్కుకొని మన శక్తిని నిరూపించుకోవాలి. అంతేకానీ నలుగురిలో నారాయణ... ఇది ఈ కాలానికి కూడనిది...అని భావించి సుపథాన్ని వదలకూడదు. కష్టాలు వచ్చినా భగవంతుడిని ప్రార్థించి శక్తిని పొందాలి కానీ ధర్మవైముఖ్యం పనికిరాదు. భగవంతుడి నియతిని ఉల్లంఘించడమంటే దైవాన్ని అవమానించడమే. ఆయన, ఆయన నియతి వేరుకాదు. అందువల్ల దుష్కృత్యాలొనరించి పాపప్రక్షాళన మార్గాలు వెతకడం కాదు మనం చేయవలసింది. ధర్మనిరతిని నిత్యవ్రతంగా కలిగి, యథాశక్తి సత్కార్యాలను చేస్తూ, సమస్త ప్రాణికోటి యెడల కరుణతో మెలగడమే మనల్ని దైవకృపకు పాత్రులను చేస్తుంది. అంటే నేడు మనకు కావాల్సింది కనీస పాపభీతి, అనవరత ధర్మనిరతి. ❖

అహింస, సత్యం, క్రోధరాహిత్యం, త్యాగం, ఇంద్రియనిగ్రహం, అనర్థకర సంభాషణ చేయకుండుట, భూతదయ, మృదుత్వం, లజ్జ, ధైర్యం, చపలత్వం లేకుండుట - ఇవన్నీ దైవీగుణములు. - శ్రీకృష్ణుడు

ప్రశాంత చిత్తం

– బ్రహ్మచారి రవి

డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలామ్...ఈ పేరు వినగానే మనందరికీ ముందుగా స్ఫురణకు వచ్చేది ఆయన ఒక గొప్ప ఉన్నత శ్రేణికి చెందిన శాస్త్రవేత్తని, ఒక మాజీ రాష్ట్రపతని... అయితే ఆయన్ను ఆ స్థాయికి చేర్చినదేమిటి? ఆయన మనో నిబ్బరం, నిండుకుండలా తొణకని నైజం. నిరాశాజనకమైన సందర్భాల్లో సైతం చెదరని మనోనిశ్చలత.

డాక్టర్ కలామ్ మొదటిసారి INCOSPAR (ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసర్చ్)లో ఇంజనీర్ పోస్ట్‌కి ఇంటర్వ్యూకి వెళ్ళినప్పుడు అప్పట్లో ప్రముఖ శాస్త్రవేత్తలైన డాక్టర్ విక్రమ్ సారాభాయ్, ప్రొఫెసర్ మీనన్, మిస్టర్ సరాఫ్ ఇంటర్వ్యూ చేశారు. వాళ్ళు కేవలం కలామ్ జ్ఞానాన్ని మాత్రమే పరీక్షించలేదు. ఆయనలో ఉండే సామర్థ్యాన్ని అంచనావేసి, ఒత్తిడిలో నిర్దుష్టమైన నిర్ణయాలు తీసుకొని ఏవిధంగా నెట్టుకురాగలడో పరీక్షించి మరీ ఉద్యోగానికి ఎంపికచేసుకొన్నారు. ఏదైనా ఒక సంస్థను అభివృద్ధి పథంలో నడిపించాలంటే ఉండవలసిన లక్షణాలు ఇవే!

'జ్ఞాన సముపార్జనకైనా, క్రొత్త విషయాన్ని నేర్చుకోవడానికైనా, జీవితంలో దేన్ని సాధించడానికైనా ప్రశాంతమైన మనస్సే (calmness of mind) ప్రధానం' అంటారు స్వామి వివేకానంద.

డాక్టర్ కలామ్ ఉద్యోగంలో చేరిన తరువాత ఆయనకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన SLV (శాటిలైట్ లాంచింగ్ వెహికల్) నిర్మాణ బాధ్యతను అప్పగించారు. వివిధ కారణాల వలన ఎస్.ఎల్.వి. నిర్మాణం చాలా క్లిష్టమైన ప్రయాణంగా మారింది. ఇంత పెద్ద ప్రాజెక్టు అంత త్వరగా పరిష్కరించలేని ఎన్నో ఉపద్రవాలను, సవాళ్ళను ఎదుర్కొంది. అదే సమయంలో కలామ్ వ్యక్తిగతంగా కూడా చాలా ఒత్తిడిని ఎదుర్కొన్నారు. ఆయన తల్లీ, తండ్రీ, ప్రాణ స్నేహితుడూ ఒకరి తరువాత ఒకరు అతి స్వల్ప వ్యవధిలోనే పరమపదించారు. ఆయన ఆ బాధనంతటినీ దిగమింగుకొని ఎటువంటి అలజడికీ, చంచలత్వానికీ లోనవకుండా పూర్తిగా ఎస్.ఎల్.వి. నిర్మాణం పైనే తన మనస్సుని కేంద్రీకరించి చివరికి విజయం సాధించారు.

'ఏదైనా సాధించాలంటే ఎన్ని అవాంతరాలు ఎదురైనా పట్టుదలతో, ప్రశాంతచిత్తంతో ప్రయత్నించాలని నా జీవితం నేర్పింది' అని అంటారు అబ్దుల్ కలామ్.

అరగంట సీరియల్ చూడడానికి, గంట ఫోన్లో మాట్లాడడానికి, రెండుగంటలు సినిమా చూడడానికి, స్నేహితుడి పుట్టినరోజు పండుగను జరుపుకోవడానికి రోజంతా సమయాన్ని వెచ్చిస్తాం. కానీ మనతో మనం ఏకాంతంగా ఉండడానికి మాత్రం సమయాన్ని కేటాయించం. మన మనస్సుకు ఇలాంటి శిక్షణను ఇవ్వనందువల్ల అది దాని ఇష్టానుసారం ప్రవర్తించి, అశాంతికి నిలయమవుతోంది.

ప్రశాంత చిత్తంతో ఆలోచించేవారు ప్రతి కష్టంలోనూ అవకాశాన్ని చూస్తారు, అశాంత చిత్తంతో ఆలోచించేవారు ప్రతి అవకాశంలోనూ కష్టాన్నే చూస్తారు.

మరి ప్రశాంత చిత్తాన్ని పొందాలంటే ఏం చేయాలి?

– మన మనస్సు పట్ల నిత్యం ఎరుకతో ఉంటూ; దానిని జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. అందుకు ప్రతిరోజూ తప్పనిసరిగా కొంత సమయాన్ని కేటాయించుకోవాలి.

– మనస్సులో ఒక ఆలోచన వచ్చిన వెంటనే ప్రత్యాలోచన చెయ్యకుండా దానిని అమలుపరచకూడదు. దాని పట్ల స్పష్టమైన అవగాహనకు వచ్చిన తరువాత కార్యరూపంలో పెట్టాలి.

– మనకు ఎవరైనా సలహాను ఇచ్చినా లేదా మనకేదైనా ఆలోచన వచ్చినా వాటి గురించి భిన్న విధాలుగా ఆలోచించి, విభిన్న కోణాల నుండి పరిశీలించాలి.

ఇలా పలుమార్లు చేయడం వలన మన మనస్సుపై మనకు స్పష్టమైన అవగాహన, నియంత్రణ ఏర్పడుతుంది. ఎటువంటి ఆటుపోట్లు ఎదురైనా, ఏవిధమైన అలజడి లేకుండా ఒత్తిడిని అధిగమించి మానసిక స్థైర్యంతో, ప్రశాంత చిత్తంతో స్థిరమైన నిర్ణయాలు తీసుకొని ప్రగతి పథాన పయనించేందుకు వీలవుతుంది. ❖



యువవాణి

– స్వామి పరిజ్ఞేయానంద

పి. అనూష, ఇంజనీరింగ్ విద్యార్థిని, హైదరాబాద్

ప్రశ్న: మనస్సు ఎప్పుడూ బయట విషయాలవైపే ఎందుకు పరుగెడుతుంది? మన ప్రమేయం లేకుండానే చెడు విషయాల వైపు వెళ్ళే ఈ మనస్సును మంచి మార్గం వైపు మరల్చడానికి ఏం చేయాలి?

జవాబు: నీరు పల్లానికే ఎందుకు ప్రవహిస్తుందని అంటే ఏం చెబుతాం? అది దాని స్వభావమని అంటాం. అలాగే, బాహ్యవిషయాలవైపు పరుగులు తీయడం మనస్సు స్వభావం.

పరుగులు తీసే మనస్సుకు పగ్గాలు

ఈమధ్య మనం తరచూ వింటున్న పదం – ఇన్నర్ ఇంజనీరింగ్. నిజానికి, మన మహర్షులు ఎన్నో వేల సంవత్సరాల క్రితమే 'ఇన్నర్ ఇంజనీరింగ్' గురించి ఉపనిషత్తుల్లో ప్రస్తావించారు. భగవంతుడు ఈ దేహమనే యంత్రాన్ని తయారుచేసినప్పుడే దాని లోపల ఇంద్రియాలను, మనస్సును అమర్చి, వాటి పనితీరును నిర్దేశించాడు. 'పరాంచి ఖాని వ్యతృణత్ స్వయంభూః.... – భగవంతుడు ఇంద్రియాలను బయటకు వెళ్ళే విధంగా ఏర్పాటు చేసాడు' అని కఠోపనిషత్ వివరించింది.

మన దేహంలోని కళ్ళు, చెవులు, నాలుక, ముక్కు, చర్మం... ఈ ఇంద్రియాలన్నీ బాహ్య విషయాలనే గ్రహిస్తున్నాయి. ఈ ఐదు చక్రాల (జ్ఞానేంద్రియాలు)తో కూడిన మనస్సనే వాహనం విశ్వమంతా చుట్టివస్తుంది. భగవంతుడు ఈ మానవ దేహంలోని మనస్సనే వాహనానికి వేగవంతంగా ముందుకు వెళ్ళేందుకు యాక్సిలరేటర్‌ను ఏర్పరచాడు. దాన్ని వెనక్కి మరల్చడానికి మాత్రం మన 'సంకల్పశక్తి'ని రివర్స్‌గేర్‌లా ఉపయోగించాల్సిందే! ఎవరైతే తమ సంకల్పశక్తిని ఉపయోగించి, బయటకు పరుగులు పెడుతున్న మనస్సుకు పగ్గాలు వేయగలుగుతారో వారే 'ధీరులు' అని యమధర్మరాజు, నచికేతునితో అంటాడు. 'తన మనస్సును తాను జయించినవాడే నిజమైన వీరుడు' అని భగవాన్ బుద్ధుడు అంటాడు.

మరి, ఎప్పుడూ 'ఫేస్‌బుక్'లో తలమునకలైన నేటితరానికి 'మైండ్‌బుక్'ని తెరచి చూడడానికైనా సమయం లేదు. అలాంటప్పుడు నేటి యువతీ యువకులు నిజమైన ధీరులుగా, వీరులుగా ఎలా మారగలరు? ఈమధ్య ఒటావా పబ్లిక్ హెల్త్ సంస్థ నిర్వహించిన అధ్యయనంలో...

"నేటి యువతీ యువకులు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లాంటి సామాజిక అనుసంధాన వేదికలను చూడడంలో అధిక సమయాన్ని వెచ్చిస్తున్నారు. స్మార్ట్‌ఫోన్‌లో రోజుకి కనీసం మూడు గంటలు గడుపుతున్నారు. రెండు గంటలకు పైగా సామాజిక అనుసంధాన వేదికలను చూసేవారిలో మానసిక సమస్యలు, ఆత్మహత్య ఆలోచనలు పెరిగే అవకాశముంది" అని వెల్లడైంది.

కాబట్టి సామాజిక మాధ్యమాలలో విహరించడం ఆపి, మన మనోసామ్రాజ్యం గురించి ఆలోచించడానికి కొంత సమయాన్ని కేటాయించాలి. మనం నిజమైన ధీరులుగా మారడానికి క్రమశిక్షణ, అభ్యాసం అవసరం. అందుకు ఈ నియమాలను పాటించాలి:

❖ 'భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః – ఓ భగవాన్! మేము ఎప్పుడూ మాకు శుభాన్ని చేకూర్చేవాటినే విందుముగాక! మేము ఎప్పుడూ మాకు శుభాన్ని చేకూర్చేవాటినే చూసెదముగాక!' అని మన మహర్షులు బోధించిన సూచనను పాటించాలి. మనస్సులో చెడు ఆలోచనలు రేకెత్తించే దృశ్యాలను చూడకూడదు. మనస్సులో అలజడిరేపే విషయాలను వినకూడదు. మనస్సును ఉద్వేగపరిచే సాహిత్యాన్ని చదవకూడదు.

❖ తల్లి చేయి పట్టుకొని సంతలో తిరిగే పిల్లవాడిలాగ ఆధునిక ఆకర్షణల సంతలో తిరిగే మనం ఎప్పుడూ తల్లిలాంటి ఓ మహాత్ముణ్ణి ఆదర్శంగా స్వీకరించాలి. స్వామి వివేకానంద లాంటి మహాత్ముల చిత్రపటాలను గదిలో పెట్టుకోవాలి. వారి బోధనలను పఠించాలి.

❖ మనస్సు తాత్కాలిక వినోదాలు, విలాసాలవైపు ఆకర్షితమైనప్పుడు "మనస్సును నియంత్రించడానికి శ్రమిస్తే జీవితం సుఖమయమవుతుంది. మనస్సును విచ్చలవిడిగా వదిలేస్తే జీవితం దుఃఖమయమవుతుంది" అన్న ఓ మనస్తత్త్వవేత్త మాటలను గుర్తుంచుకోవాలి.

❖ చెడు ఆలోచనలను అణచడానికి ప్రయత్నించేకొద్దీ అవి రెట్టింపు శక్తితో మనపై దాడిచేస్తాయి. కాబట్టి వాటి గురించి అదేపనిగా ఆలోచించకుండా, మనస్సును సద్భావాలతో నింపాలి, మంచి మార్గంవైపు మళ్ళించాలి.

❖ మన మనస్సు అసలు స్థితిని అర్థం చేసుకోగలిగితే దాన్ని నియంత్రించడం సులభమవుతుంది. కాబట్టి 'పిల్లవాడు అటూఇటూ పరుగులు తీస్తుంటే, తల్లి గమనిస్తూ ఉన్నట్లు, మన మనస్సును స్వేచ్ఛగా వదిలేసి సాక్షిగా ఉండడం అభ్యసించాలి' అన్న స్వామి వివేకానంద సూచనను పాటించాలి. అందుకు ప్రతీరోజు కొంత సమయాన్ని కేటాయించాలి.

పై సూచనలను మన 'మైండ్‌బుక్'లో రాసుకొని క్రమం తప్పకుండా అభ్యసించగలిగితే పరుగులుతీసే మనస్సుకు పగ్గాలు వేయగలుగుతాం. మనం నిజమైన ధీరులమవుతాం. ❖

పరమేశ్వరుడు సర్వజీవుల హృదయాల్లో నెలకొని ఉన్నాడు. యంత్రగాడు త్రిప్పనట్లు జీవులందరినీ తన మాయాశక్తితో త్రిప్పుచున్నాడు. పరమేశ్వరుణ్ణి శరణు పొందితే పరమ శాంతి లభిస్తుంది. - శ్రీకృష్ణుడు

శుకబ్రహ్మాశ్రమ వ్యవస్థాపకులు శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామి తొలిరోజుల్లో బ్రహ్మచారిగా శ్రీమళయాళస్వామి వారికి శిష్యరికం చేశారు. గురువుగారి దగ్గర ఉండేరోజుల్లో శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామి ఓసారి పనిమీద మచిలీపట్నం ప్రయాణమయ్యారు. వెళ్ళేముందు స్వామీజీ అనుమతి తీసుకుందామని ఆయన వద్దకు వచ్చారు. 'ఊరికి బయలుదేరుతున్నాను గురువుగారు! మీకు ఓ మాట చెప్పి వెళదామని వచ్చాను' అంటూ, పాదాలకు ప్రణామం చేసి వెనుతిరిగారు. ఇంతలో మళయాళస్వామి 'నీ వస్త్రాలున్న చేతి సంచీ ఏది?' అని ప్రశ్నించారు.

అప్పుడు శ్రీవిద్యాప్రకాశానందులవారు 'ఆశ్రమంలోని సేవకుడు పట్టుకొస్తున్నాడు!' అన్నారు. వెంటనే ఆ స్వామీజీ 'సేవకులు ఉన్నారు కదా! అని ప్రతి చిన్నదానికీ వారిపై ఆధారపడవద్దు. నువ్వు మోయగలిగి ఉండి కూడా, నీ పక్కవారితో నీ సంచీని మోయించుకోవడం సభ్యత కాదు! పరాధీనత పనికిరాదు. అలాంటి సేవలు నీకు బంధాలు, బంధనాలైపోతాయి' అంటారు.

మోసేశక్తి ఉండి కూడా, ఒకరితో మన చిన్న సంచీని మోయించుకుంటే ఆ కర్మఫలం తీర్చుకోవడానికి, వచ్చే జన్మలో మనం వారి బియ్యం బస్తాని మోయాల్సి ఉంటుందని పెద్దలంటారు. ఈ లెక్కన నిత్యజీవితంలో మనం ఎదుటివారితో చేయించుకుంటున్న ఎన్నో ఉచితసేవలకు ఎన్ని జన్మలు ఎత్తి, వారికి ఎన్ని ఎదురుసేవలు చేయాల్సి వస్తుందో ఆలోచించుకుంటే భయమేస్తుంది. కానీ మనలో చాలా మందికి పనుల విషయంలో పరాధీనత ఓ బలహీనత! మన ప్రతి చిన్న పనిని మరెవరికో పురమాయించటం ఓ సరదా! అందుకే స్వామి వివేకానంద 'వీలయినంత వరకు ఎవరి పనులు వాళ్ళే చేసుకోవాలి. ఎవరికీ భారం కాకుండా చూసుకోవాలి' అని సూచించారు. అయితే చాలాసార్లు మనలోని అహంకారం వ్యక్తిగత సేవల కోసం, సేవకుల కోసం తపించేలా చేస్తుంది.

అతిసేవలు అహంకార చిహ్నాలు...: ఎంతమంది సేవకులుంటే, ఎంత మంది తమకు సేవలు చేస్తూంటే అంత ఘనతగా భావించుకోవడం మన ఆభిజాత్యానికి చిహ్నం. మనలోని ఆత్మన్యూనతాభావం వల్ల, అహంకారం వల్ల, ఆధారపడే స్వభావం వల్ల తరచూ వేరొకరి సేవల కోసం పాకులాడుతూ ఉంటాం. నిజానికి మన వ్యక్తిగత పనుల విషయంలో వీలయినంత వరకు వేరెవరిపైనా ఆధారపడకపోవడమే మన స్వతంత్రతకు ప్రతీక. అయితే మనలో చాలామంది ఇళ్ళల్లో, కార్యక్షేత్రాల్లో పరివారంతో, పక్కవారితో పనులు చేయించుకోవడం తమ ఆజన్మాంతర హక్కుగా, అధికారంగా భావిస్తూ ఉంటారు. ఎదుటివారికి కూడా ఆత్మాభిమానం ఉంటుందన్న విషయాన్ని మరచిపోయి, ఉచితానుచితాలని కూడా చూడకుండా పనులు పురమాయిస్తూ ఉంటారు. అలా ప్రవర్తించడం తమ ప్రత్యేకతగా, ప్రాభవంగా భ్రమపడుతూ ఉంటారు. అందుకే దేవసంఘజైన సంప్రదాయకుడైన సోమదేవుడు '**ప్రశ్రయసేవాది లాభేన ఆత్మనః ఉత్కర్షసంభావనమ్ అహంకారః** – ఇతరులు తన ఎదుట చూపే వినయం చేత, ఇతరులు తనకు చేసే సేవల చేత తానేదో గొప్పవాడననుకోవడం అహంకారమ'ని నిర్వచించారు. ఈ కోవకు చెందిన కొంతమంది అధికారులు, పెద్దమనుషులు సేవకులతో చెప్పులు శుభ్రం చేయించుకొని, పాదాలకు

తొడిగించుకోవడానికి కూడా వెనుకాడడం లేదు. ఇలాంటి సేవలు వారి అహంభావాన్ని, అనాగరకతను బయటపెడతాయి, చూస్తున్నవారు మానసికంగా ఈసడించుకునేలా చేస్తాయి.

పరాధీనత పరమ హీనత...: నేడు మన భారతీయ సమాజంలో మానసికంగా, శారీరకంగా ఆధారపడే ధోరణి నానాటికీ పెరిగిపోతోంది. ఈ వాలిపోయే స్వభావం రానురాను మనల్ని బలహీనులుగా మార్చేస్తోంది. ముఖ్యంగా చాలా కుటుంబాల్లో పనివాళ్ళు రానిదే పొయ్యి కూడా వెలగదు; కార్యాలయాల్లో ఆఫీసుబాయ్ రానిదే ఫైలు కూడా కదలదు. ఇలాంటి ఉదాసీన స్వభావాలతో ఉన్నతమైన స్థితికి మనం ఎలా ఎదగగలం?

ఓ ప్రముఖ భారతీయ వైద్యురాలు విదేశాల్లో పాతికేళ్ళకు పైగా వివిధ హోదాల్లో పనిచేసి, తదనంతరం స్వదేశంలో స్థిరపడ్డారు; రాజకీయంగా కూడా ఉన్నతస్థానాలను అలంకరించారు. ఆవిడ ఓ సారి పత్రికా ముఖాముఖిలో మన సమాజస్థితిగతులను విశ్లేషిస్తూ, భారతదేశంలో పనివాళ్ళతో మనం చేయించుకుంటున్న పనులను చూసి

ఆశ్చర్యపోయానన్నారు. 'ఆ యా దేశాల్లో ఎంత సంపన్నులైనా కొన్ని పనులను ఎవరికి వారే చేసుకోవాల్సి వస్తుంది. ఎవరి మీదా, ఎవరూ ఆధారపడరు. డబ్బులతో ఇన్ని సేవలు చేయించుకోవచ్చని నాకు ఇక్కడికి వచ్చాకే తెలిసింది!' అన్నారు సరదాగా!

మనలో చాలామంది చేయి కింద సేవకు ఓ మనిషి లేకపోతే, ఉక్కిరిబిక్కిరి అయిపోతారు; అన్ని అవయవాలు సక్రమంగా ఉండి కూడా అంగవికలురుగా ప్రవర్తిస్తూ, ఒకరు చేసే ఊడిగాల కోసం ఉవ్విళ్ళూరుతూ ఉంటారు. ఓసారి మాతా అమృతానందమయి అరుణాచలేశ్వరుడిని దర్శనం చేసుకొని బయటకు వస్తున్నారు. వీధుల పక్కన పాములవాళ్ళ విన్యాసం కనిపించింది. నాగస్వరానికి నాట్యమాడుతున్న సర్పాలను చూపిస్తూ, తన పక్కనే ఉన్న పిల్లలతో సరదాగా 'పిల్లలూ! కాళ్ళూ, చేతులూ ఉండి కూడా మన పనులు మనం చేసుకోకుండా, పక్కవారిపై ఆధారపడితే, వచ్చే జన్మలో అలా కాళ్ళూ, చేతులూ

సేవకులు

– బి. సైదులు

లేకుండా పాకే సరీసృపాల్లా పుడతాం' అంటూ పరాధీనత పరమహీనత అని చెప్పకనే చెప్పారు.

తప్పనిసరైతే తప్పు కాదు....: అనివార్యమైన పరిస్థితుల్లో సేవకులు, సేవలు తప్పకపోవచ్చు. కొన్ని పదవుల్లో, హోదాల్లో ఉన్నప్పుడు ప్రోటోకాల్ ప్రకారం కిందివారి సహాయాన్ని వినియోగించుకోవడంలో తప్పు లేదు. అదే విధంగా వయస్సు రీత్యా, ఆరోగ్యపరిస్థితుల రీత్యా కూడా కొన్నిసార్లు ఇతరుల సేవలు తప్పకపోవచ్చు. అయితే ఆ సేవల పరిమితి ఎంత వరకో, ఎవరికి వారే విజ్ఞతతో, వివేకంతో నిర్ధరించుకోవాలి. ఎక్కడా మనం అహంకారం, ఆధిపత్యం ప్రదర్శించకుండా జాగ్రత్తపడాలి. అయితే చాలామంది ఈ పరిస్థితులను కూడా తమకు అనుకూలంగా మలచుకొని, సేవల్లో ఏ కాస్త అపశృతులు దొర్లినా అగ్గిమీద గుగ్గిలమైపోతారు. కానీ వికసిత వ్యక్తిత్వంతో విరాజిల్లే వ్యక్తులు ఆ సేవల్ని కూడా నిస్సంగత్వం(డిటాచ్‌డ్)గా స్వీకరిస్తారు. పొరపాట్లను పెద్దమనసుతో అర్థం చేసుకుంటారు.

రామకృష్ణ సంఘ సర్వాధ్యక్షులుగా వ్యవహరించిన పూజ్య స్వామి రంగనాథానందజీ మహరాజ్ ఓసారి కారులో విమానాశ్రయానికి బయలుదేరారు. అనుకోకుండా కారు

భగవాన్ శ్రీరామకృష్ణులు మహాసమాధి అయ్యాక, బారానగర్ మఠంలో ఒకసారి సోదర శిష్యులందరితో కలసి స్వామి వివేకానంద భోజనానికి కూర్చున్నారు. భోజనాలయ్యాక ఎవరి విస్తరాకులు వారు తీసేశారు. కానీ స్వామి వివేకానంద తన విస్తరితో పాటు, శ్రీరామకృష్ణుల గృహస్థభక్తులలో ప్రముఖుడు, కథామృత రచయిత మహేంద్రనాథ్ గుప్త విస్తరాకును కూడా స్వయంగా తనే తీసారు. అది చూసి అక్కడున్నవారందరూ ఆశ్చర్యపోయారు. చివరకు మహేంద్రనాథ్ గుప్త కూడా దానికి అభ్యంతరం చెప్పినప్పుడు, వెంటనే స్వామీజీ 'ఇక్కడ అందరూ సమానులే! నేనేమీ ఎక్కువ కాదు' అని అన్నారు.

మధ్యలోనే ఆగిపోయింది. స్వామీజీకి కలిగిన అసౌకర్యానికి ఆందోళన పడుతూ, డ్రైవర్ హడావిడిగా కారు బాగు చేయసాగాడు. కానీ మహరాజ్ 'ఫర్వాలేదు! యంత్రాలతో చేసింది కదా! పాడవడం సహజం. నీవు మెల్లిగా బాగు చేసుకొని రా!' అని డ్రైవర్‌కి చెప్పి ప్రశాంతంగా నడుచుకుంటూ, విమానాశ్రయానికి వెళ్ళిపోయారట. కారులో వెళ్ళేటప్పుడు ఎంత నిశ్చలంగా ఉన్నారో, నడచివెళ్ళేటప్పుడూ అంతే నిశ్చలంగా ఉండగలిగారు. ఈ రీతిలో సౌకర్యాల్లోనూ, అసౌకర్యాల్లోనూ స్థిరంగా ఉండగలిగితే సేవకులు మరింత సమర్థంగా సేవలందిస్తారు. అలా కాకుండా ప్రతిచిన్నదానికీ 'బీపీ' తెచ్చుకుంటూ ఉంటే, మందుల వాడకం పెరగడమే తప్ప, మనుషుల పనిలో నాణ్యత పెరగదు. పక్కవారూ భయంతో తప్ప బాధ్యతతో పనిచేయరు.

సహృదయంతో సాధించాలి...: మనలో చాలామందికి సేవకులు, సహాయకులు అంటే చిన్నచూపు. పనివాళ్ళు పుట్టిందే మనకు సేవలు చేయడానికన్నట్లు సంస్కారహీనంగా ప్రవర్తిస్తూ ఉంటారు. వాళ్ళూ మనలాంటి మనుషులేనని అర్థం చేసుకోరు. మనుషులుగా వారితో మసలుకోరు. మన అన్ని అవసరాలు చూస్తూ, అందుబాటులో ఉంటున్న వారిపైనే మనకు ఆదరణ, పట్టింపు (concern) లేకపోతే మనం మనుషులుగా ఎలా ఎదగగలం? పైస్థాయి వారిని గుర్తించి, గౌరవించడంలో కాదు, క్రింది స్థాయి వాళ్ళతో మనం ఎంత సహృదయంతో మసలుకుంటున్నామన్న దానిపైనే మన సంస్కారం ఆధారపడి ఉంటుంది.

ఇటీవల దివంగతులైన 'భారతరత్న' అబ్దుల్ కలామ్ తమను ఆదరించిన తీరును తలచుకొని రాష్ట్రపతి భవన్‌లోని పనివాళ్ళు కన్నీరుమున్నీరయ్యారు. ఏనాడూ ఆయన మమ్మల్ని సేవకులుగా చూడలేదనీ, పల్లెత్తుమాట కూడా అనలేదనీ, మా ఇన్నేళ్ళ జీవితంలో ఇలాంటి మహానుభావున్ని చూడలేదనీ చలించిపోయారు. అలా సేవకుల మనస్సులను కూడా గెలుచుకున్నారు కనుకనే, ఆయనకు భగవంతుడు అనాయాస మరణాన్ని ప్రసాదించాడు. ❖

సత్కారం కోసం, సన్మానం కోసం, గౌరవాల కోసం దంబాచారంతో చేసే తపస్సు రాజస తపస్సు. ప్రసన్న మనస్సు, శాంత స్వభావం, మౌనం, ఆత్మనిగ్రహం, అంతఃకరణశుద్ధి-మానసిక తపస్సు. - శ్రీకృష్ణుడు

మనోరాగం

– స్వామి రంగనాథానంద (రామకృష్ణసంఘం 13వ సర్వాధ్యక్షులు)

కలకత్తాలోని రామకృష్ణమిషన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కల్చర్ కార్యాలయంలో నేను (స్వామి రంగనాథానంద) ఉన్న రోజుల్లో ఒకసారి ఫ్రాన్స్ నుంచి కొందరు సందర్శకులు వచ్చారు. భారతదేశం, సంస్కృతి, జీవనశైలి తదితర అంశాలకు సంబంధించి వారికున్న ఎన్నో సంశయాలను నా ముందుంచారు. అందులో భాగంగా ఆ దేశస్థుడు ఒకరు 'స్వామీజీ! మీ దేశంలో గోవును ఆరాధించడం చూస్తూంటే చాలా ఆశ్చర్యంగా ఉంది. ఓ వైపు ప్రజలేమో ఆకలితో చనిపోతూ ఉంటారు; పోషకాహారం లేక అవస్థలు పడుతూ ఉంటారు. వాళ్ళను పట్టించుకోకుండా, గోసంరక్షణపై దృష్టి పెట్టడం మా తర్కానికి అందడం లేదు. ఇది ఎంత వరకు సమంజసం?' అని అడిగాడు.

అప్పుడు నేను "అనాదిగా భారతీయుల జీవితంలో గోవుది ఒక ప్రత్యేకమైన స్థానం. ఒకానొక సమయాన కుటుంబంలో అది ఒక భాగమైపోయింది. మా దేశంలో పసిబిడ్డలకు తల్లిపాల తరువాత, గోవు పాలను తాగించడం ఆనవాయితీ. గోవు పాలు, తల్లిపాలతో సమానం. అందుకే మాతృమూర్తి తరువాత గోవుకు అంత ప్రముఖస్థానాన్నిచ్చారు. అంతేకాకుండా పాడిపంటల్లో ఈ ఆవులు ఇక్కడి రైతులకు చేదోడువాదోడుగా ఉంటాయి. ఇలా వందలాది సంవత్సరాలుగా గ్రామీణ జీవితం గోవులతో మమేకమైపోయింది. అందుకే ఆ అనుబంధాన్ని, సంప్రదాయాన్ని గౌరవిస్తూ, గోవును సంరక్షించుకోవడం భారతీయుల మనోరాగం (సెంటిమెంట్). మీ పాశ్చాత్యులు చూస్తున్నట్లు అన్నింటినీ లాజిక్ (తర్కం), యుటిలిటీ (ప్రయోజనం) దృష్టితోనే చూడలేం".

మనోరాగం మన జీవనవేదం...: జీవితంలో అన్నీ మన తర్కానికి అందాలని అనుకోకూడదు. లెక్కలు కట్టే బుద్ధితో బతికితే మానవజన్మకు అర్థమే లేదు. సూటిగా చెప్పాలంటే, *Human life is enriched by a number of such sentiments.* నిశితంగా ఆలోచిస్తే, ఇలాంటి ఎన్నో మనోరాగాలతో మానవజీవితం సుసంపన్నమవుతుంది; శోభాయమానమవుతుంది. ఉదాహరణకు ఒక కుటుంబం ఎన్నో రోజులుగా పట్టెడు మెతుకులు లేక, ఆహారం కోసం అలమటిస్తూ ఉందనుకుందాం. ఇంతలో ఎవరైనా వచ్చి, ఆ ఇంట్లో ఉన్న ఆవునో, దూడనో చంపేసి తిని, ఆకలి తీర్చుకోమంటే ఆ కుటుంబసభ్యులు ఒప్పుకుంటారా? ముందు పిల్లలే అంగీకరించరు. ఎందుకు? ఎన్నో రోజుల నుంచి తాము ప్రాణంగా పెంచుకుంటున్న ఆ మూగజీవిపై వారికున్న తెలియని ప్రేమ, మనోరాగం ఆ చర్యను భరించలేదు. ఇది అత్యున్నతమైన సంస్కృతికి చిహ్నమే కదా! ఇలా చాలా విషయాల్లో భారతీయులు కేవలం స్వలాభాన్నే చూసుకుంటూ బతకరు.

తర్కంతో తూయలేము....: అన్నింటినీ తర్కం, లాభంతో ముడిపెట్టలేము. మన తర్కానికి అందలేదని ప్రతి దాన్నీ కొట్టి పడేయలేము; మనకు ఉపయోగపడడం లేదని కొన్నింటిని వదులుకోలేము. అదే మానవీయ కోణం. *If logic and utility alone guide human life and all sentiments is set aside, serious consequences will follow.* ప్రయోజనం దృష్టితోనే ఆలోచిస్తూ, సెంటిమెంట్స్‌ను పక్కన పెడితే మానవుడి మనుగడ, జీవనప్రమాణాలు దుర్భరంగా, విపరీతంగా ఉంటాయి.

తల్లితండ్రులు వయస్సులో ఉన్నప్పుడు కుటుంబానికి అన్నిరకాలుగా అండదండగా ఉంటారు. అయితే వయస్సు పైబడ్డాక, వట్టిపోయిన గోవుల్లా మిగిలిపోతారు. ఆర్థికంగా, భౌతికంగా ఎలాంటి సహాయమూ వారి నుంచి లభించదు. అలా అని ప్రయోజనాల దృష్టితో ఆలోచించి పిల్లలు వారిని చంపేస్తున్నారా? లేదు కదా! కొందరు దయాహీనులై వృద్ధాశ్రమాల్లో చేరుస్తారేమో కానీ, మట్టుపెట్టాలనుకునేంత రాక్షసులు ఉండరు. ఇదే మానవత్వం; మనోరాగం. అలాగే భారతీయులు గోవుల విషయంలో కూడా ఇలాంటి అనుబంధాన్నే పెంచుకున్నారు. మీ, మీ దేశాల్లో కూడా ఇలాంటి సెంటిమెంట్లు ఎన్నో ఉంటాయి. నిజానికి ఎదుటివారి సెంటిమెంట్లను గౌరవించడం మన సంస్కారం. ఈ వివరణతో ఆ ఫ్రాన్స్ దేశస్థులు సంతృప్తినిండిన భావంతో తిరిగివెళ్ళారు. ❖

తెలుగు సేత : ఆర్. కృష్ణ

ప్రియమైన ఉపాధ్యాయులారా...

- రవీంద్రనాథ్ టాగూరు

మా చిన్నప్పుడు ఓ బిచ్చగాడి కథ చెప్పేవారు. అతడు శీతాకాలంలో చలిని తట్టుకోలేక ఉన్ని దుస్తులు కొనుక్కునేందుకు బిచ్చమెత్తి సొమ్ము సమకూర్చుకునేవాడు. సరిపడా సొమ్ము పోగయ్యేసరికి వేసవి వచ్చేసేది. అలాగే ఎండాకాలం బిచ్చమెత్తి పలుచని దుస్తులు కొనుక్కునే తాహతు వచ్చేసరికి వర్షాకాలం వచ్చేసేది. ఇలా అన్ని కాలాల్లో ఇదే తికమక ఎదురవుతూ ఉండేది. అతని దీనావస్థను చూసి ఓ అదృశ్య దేవత ప్రత్యక్షమై వరమివ్వబోతే ఆ బిచ్చగాడు 'అమ్మా! నాకు మరేమీ అక్కర లేదు; ఈ తారుమారు పరిస్థితిని అంతం చేయి; ఎండాకాలంలో చలిదుస్తులు, చలికాలంలో వేసవి దుస్తులు వేసుకుంటున్నాను; ఈ గందరగోళాన్ని తప్పించావంటే నేను ధన్యుడిని' అని అన్నాడట.

నేడు విద్యార్థులు బోధకుల నుంచి ఇదే కోరుకుంటున్నారనిపిస్తోంది. ఆకలితో పాటు అన్నం, చలితో పాటు వస్త్రం కలసి ఉంటే ఎంత సౌకర్యంగా ఉంటుందో, భాషతో పాటు భావం, విద్యతో పాటు జీవితం కలసి ఉంటే విద్యార్థులకు అంతే సౌలభ్యం ఉంటుందని ఉపాధ్యాయులు గుర్తించాలి. మీరు బోధించే అంశాలు మీ విద్యార్థుల జీవితాలకు ఏ మేరకు అన్వయమవుతున్నాయో ఎప్పటికప్పుడు ఆలోచించుకుంటూ ఉండాలి.

శృతిమించనిదే క్రమశిక్షణ...: క్రమశిక్షణ అనే యంత్రాన్ని లేదా మరను తిప్పి పిల్లలను వశపరచుకోవడం అవసరమైన దాని కన్నా ఎక్కువగా జరుగుతోంది. చంచలత్వం పిల్లల సహజ స్వభావం. వారి ఆరోగ్యానికి అది ఎంతైనా అవసరం. విదేశాల్లో తమ పిల్లల విషయంలో దీని ఆవశ్యకతను బాగా గుర్తించారు. ఈ చంచలత్వాన్ని అణచి పెట్టకుండా సక్రమమైన మార్గంలోకి తీసుకువెళ్ళగలిగితే అదే వారి శీలాన్ని దృఢంగా, వారి బుద్ధిని నిశితంగా నిర్మిస్తుంది. ఈ చంచలతకు లేదా అల్లరికి ఆందోళన పడకుండా, వారిపై ఆరోపణలు చేయకుండా ఉండడం సుగుణమని ఉపాధ్యాయులు గుర్తించాలి. తమంత తాము ఆలోచించగలిగి, పరీక్షించుకోగలిగి ఇతరుల సహాయం లేకుండా స్వయంగా తమను తాము నిర్మించుకునే పద్ధతి వేరు. ఇతరుల మాటలకు తలలూపుతూ, వారి మాటలకు బదులు చెప్పకుండా, కేవలం ఇతరులచే సవారీ చేయబడే గుర్రాల్లా ఉండే మర మనుష్యుల్ని తయారు చేసే పద్ధతి వేరు. ఇలా కాకుండా మానవత్వానికి, నాగరకతకు వారసులైన విద్యార్థులను తయారు చేయడమే ఉపాధ్యాయుల లక్ష్యం.

దారిదీపాలు...దీపారాధకులు : అయితే ఎక్కువ విషయాలు బోధించే చోట విద్య కూడా ఉత్తమంగా ఉంటుందని తలచడం కూడా పొరపాటు. విద్యార్థి ఎలా రూపుదిద్దుకున్నా అది కేవలం బుద్ధి వల్ల కాదు, కేవలం ఎక్కువ విషయాలు వినడం వల్లా కాదు. ఏకాంతంలో అధ్యయనం జరిగినప్పుడే వారు ఎక్కువ నేర్చుకోగలుగుతారు. ఉపాధ్యాయులు జ్ఞానాన్ని మనస్సు ద్వారా అందించే చోటే విద్యార్థులు మనస్ఫూర్తిగా స్వీకరిస్తారు. ఉపాధ్యాయులు స్వాధ్యయనంలో లీనమైనచోట విద్యార్థులు సరస్వతిని సాక్షాత్కరింప చేసుకోగలరు. అయితే విదేశాలలో మాదిరే మన దేశంలో కూడా పాఠశాలలు, ఉన్నత విద్యాలయాలతో పాటు ఆధునిక హంగులతో వసతి గృహాలు కూడా వెలుస్తున్నాయి. కానీ వీటిలో చాలా వరకు ఆసుపత్రులనో, పిచ్చాసుపత్రులనో, కారాగారాలనో తలపిస్తున్నాయి. అక్కడ నిర్బంధమైన ఓ శిక్షణా వ్యవస్థ కనిపిస్తుందే తప్ప, ఆహ్లాదపూరితమైన, చైతన్యవంతమైన వాతావరణం అగుపించదు. సాధారణంగా ఆకలితోనో, అనారోగ్యంతోనో యువతరం బలహీనమవడం మనకు తెలుసు. కానీ నేడు బుద్ధివికసించక, చైతన్యం దీపించక యువతీయువకులు బలహీనమవుతున్నారు. అదే దురదృష్టం! అలాంటి వారికి విద్యార్థి దశ నుంచే జ్ఞానబలాన్ని ఇవ్వాల్సింది ఉపాధ్యాయులే!

కర్మాగారాల్లో తయారైన వస్తువుల కొలతలు, తూనికలు మనం ఆశించిన రీతిలో ఒకే మూసలో ఉంటాయి. వీటికి మార్కులు వేయడం చాలా తేలిక. కానీ ఏ ఇద్దరు మనుషుల ప్రజ్ఞను ఒకే కొలబద్దతో కొలవడం సాధ్యం కాదు. అయితే యంత్రాలు వస్తువులను తయారు చేయగలవే కానీ చేతికి అందించలేవు. యంత్రం నూనెను తీయగలదేగానీ దీపాన్ని వెలిగించలేదు కదా! కానీ ఉపాధ్యాయులు అలా కాదు! మట్టిని ప్రమిద చేయగలరు. దానిలో నూనెను పోసి, ఒత్తినీ వెలిగించగలరు. ఇలా విద్యార్థుల జీవితాలకు దారిదీపాలే కాదు దీపారాధకులు కూడా ఉపాధ్యాయులే! ❖



(సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం)

సేకరణ: ఎమ్. రాంబాబు

దేవతలను, బ్రాహ్మణోత్తములను, గురువులను, జ్ఞానులను పూజించుట, శుచిత్వం, ఋజుత్వం, బ్రహ్మచర్యం, అహింస మొదలైనవి ఆచరించడాన్ని శారీరక తపస్సు అంటారు. - శ్రీకృష్ణుడు

రామకృష్ణ మిషన్ క్షయరోగ వైద్యశాల

(రామకృష్ణ మిషన్, బేలూరు మఠం, పశ్చిమబెంగాల్ అనుబంధ శాఖాకేంద్రం)

పోస్టు: శానిటోరియం, రాంచీ-835221, జార్ఖండ్. ఫోన్: 09431170005 Email: rkmtbs@gmail.com

విరాళాలకై విన్నపం

రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీ జిల్లాలో గ్రామీణ ప్రాంతంలో క్షయరోగుల సేవల నిమిత్తం 285 ఎకరాల్లో వైద్యశాల నిర్వహించబడుతోంది. క్షయవ్యాధితో తీవ్రంగా బాధపడుతున్న రోగులకు సేవలందించే సదాశయంతో, దేశంలో వెనుకబడిన ప్రాంతాల్లో ఒకటైన రాంచీలో ఈ ఆరోగ్యనిలయాన్ని ఆరంభించడం జరిగింది. రామకృష్ణ సంఘ వరిష్ఠ సాధువులైన శ్రీమత్ స్వామి వేదాంతానందజీ, శ్రీమత్ స్వామి ఆత్మస్థానందజీ తదితరుల పర్యవేక్షణలో రూపుదిద్దుకున్న ఈ క్షయవైద్యశాలను 1951లో భారత తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ ప్రారంభించడం విశేషం. అప్పటి నుంచి దాదాపు ఆరు దశాబ్దాలుగా స్థానిక నిరుపేద క్షయ రోగులకు ఈ కేంద్రం అవిశ్రాంతంగా వైద్య, ఆరోగ్యసేవలందిస్తూ ఉంది. ఈ నేపథ్యంలో గత సంవత్సరం నుంచి కేవలం క్షయ రోగులకే కాకుండా, ఈ రామకృష్ణ వైద్యశాలలో ఇతర వ్యాధులకు సంబంధించిన వైద్యసేవలను కూడా అందించడం జరుగుతోంది. అయితే పెరుగుతున్న రోగులు, వైద్యసేవల అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ కేంద్రాన్ని పూర్తిస్థాయి వైద్యశాలగా విస్తరింప చేయాలని రామకృష్ణ మిషన్ నిర్ణయించింది.

మా ప్రాజెక్టులు...:

1) క్షయ రోగులకు 150 పడకల ఆసుపత్రి (నిర్వహణ ఖర్చు సంవత్సరానికి **3 కోట్ల రూపాయలు**)

2) సాధారణ రోగులకు 50 పడకల ఆసుపత్రి (నిర్వహణ ఖర్చు సంవత్సరానికి **కోటి రూపాయలు**)

3) అధునాతన వైద్యసేవలకు సంబంధించిన వైద్య పరికరాల కొనుగోలు, ఆధునిక సాంకేతిక సౌకర్యాల కల్పన (అంచనా వ్యయం దాదాపు **10 కోట్ల రూపాయలు**)

సాధారణ వైద్యంతో పాటు శ్వాసకోశ, నేత్ర, దంత, చర్మ, గర్భిణీ వైద్యవిభాగాలకు తోడు ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్, రేడియాలజీ, పాథాలజీ, ఫిజియోథెరపీ, నేచురోపతి, ఆయుర్వేద తదితర విభాగాలలో కూడా ఆధునిక వైద్యసదుపాయాలు అనివార్యమవుతున్నాయి. అదే విధంగా ఈ వైద్యనిలయంలో ప్రత్యేక వైద్య నిపుణులను, శస్త్రచికిత్సల్లో కూడా నూతన సాంకేతిక సౌలభ్యాలను పరిచయం చేయాలని నిశ్చయించాము.

వైద్యశాల ఆధునికీకరణ...అభివృద్ధి (అంచనా వ్యయం సుమారు **20 కోట్ల రూపాయలు**)

1) 50 పడకల ఆసుపత్రి నూతన భవనసముదాయం.

ఈ భవనంలో క్షయరోగులతో పాటు సాధారణ రోగులకు కూడా వైద్యసేవలందిస్తున్నాం. అయితే రోగుల రద్దీ దృష్ట్యా భవనాన్ని ఆధునికీకరిస్తూ, విస్తరించాలని నిర్ణయించాం. సాధారణ రోగులకు ప్రత్యేక విభాగం; స్థానిక వైద్యాధికారికి, ఇతర సిబ్బందికి వసతిగృహాలు; పురాతన భవనాల పునరుద్ధరణ, ఆధునికీకరణ, జలవనరుల పునరుద్ధరణ, ప్రహరీగోడ, రహదారుల నిర్మాణం.

సంచార వైద్యశాల

రాంచీ జిల్లాతో పాటు స్థానికంగా 600 గ్రామాల్లో కూడా వైద్యసేవలను విస్తరిస్తున్నాము. ఇందులో భాగంగా ఇప్పటికే సంచార వైద్యశాలను వారానికి మూడురోజులు నడుపుతూ ఉచితంగా సేవలందిస్తూ ఉన్నాం. అయితే ఈ శిబిరాల సంఖ్యను పెంచేందుకు పూర్తి సౌకర్యాలతో కూడిన అంబులెన్స్ అవసరమవుతోంది.

వైద్యం, మందుల ఖర్చులు నానాటికీ పెరుగుతున్న దృష్ట్యా 2006 నుంచి లోటు బడ్జెట్‌తోనే ఈ వైద్యశాలను నిర్వహించడం జరుగుతోంది. ప్రభుత్వం నుంచి అందుతున్న ఆర్థికసాయంతో ఈ సేవల నిర్వహణ భారమవుతోంది. వైద్యశాలను నిరాటంకంగా కొనసాగించేందుకు **50 కోట్ల రూపాయల శాశ్వతనిధిని** ఏర్పాటు చేయాల్సి ఉంది.

ఈ నేపథ్యంలో సౌజన్యమూర్తుల ఆర్థిక సాయాన్ని అర్థిస్తున్నాము. ఉదారులైన దాతల చేయూతతో ఈ వైద్యసేవలను నిరాటంకంగా నిర్వహించగలమని విశ్వసిస్తున్నాము. 'నిరుపేదలు, నిరక్షరాస్యులు, అజ్ఞానులు, వ్యాధిపీడితులు–వీళ్ళే మన ప్రత్యక్ష దైవాలు; వీరిని సేవించడమే అత్యున్నతమైన మతం' అన్న స్వామి వివేకానంద బోధనలను అనుసరించి, ఎందరో సహృదయులు ముందుకు వస్తారని ఆశిస్తున్నాము.

మీ విరాళాలను Ramakrishna Mission TB Sanatorium పేరున చెక్కు/డి.డి. తీసి Ramakrishna Mission TB Sanatorium, P.O. Sanatorium, Tupudana, Ranchi - 835 221, Jharkhand చిరునామాకు పంపాల్సిందిగా మనవి.

మీరిచ్చే విరాళాలకు ఆదాయపు పన్ను చట్టంలోని 80జి సెక్షన్ కింద ఆదాయపు పన్ను మినహాయింపు లభిస్తుంది.

ఈ బృహత్ సేవా యజ్ఞానికి మీవంతు ఆర్థిక సహాయాన్ని అందించి, భగవాన్ శ్రీరామకృష్ణుల కృపకు పాత్రులు కాగలరని ఆశిస్తున్నాం.

రోగినారాయణ సేవలో

స్వామి బుద్ధదేవానంద

కార్యదర్శి

Advt.,

(1884 – 1967)

ముందుకు సాగిపో!

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ, ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్న్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ - వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్న్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం, ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

22-12-1960

ప్రియమైన ధ్రువ!

జీవితంలోని ప్రతి సంఘటనను జ్ఞాన, భక్తి, యోగ, కర్మల ద్వారా అభివృద్ధి పరచుకోవాలి. రసాయనిక శాస్త్రం వలె ఇది కూడా ఒక శాస్త్రమే. సిద్ధాంతాలను అవగాహన చేసుకొని పరిశోధనాలయంలో ప్రవేశించాలి. నిద్రాహారాలు మాని ఆత్మశుద్ధిగా పరిశోధన చెయ్యాలి. అప్పుడే సత్యం ద్యోతకమవుతుంది.

భారతీయులచే మానవ జీవితం నాలుగు తరగతులుగా విభజింపబడింది. ధర్మాన్ని గురించి పరిశోధన చేసిన బ్రహ్మవేత్తలు అర్థకామాలను గురించి గృహస్థులకు సూచనలు చేశారు. సన్న్యాసులు మోక్షప్రాప్తికై వారి జీవితాలను అంకితం చేశారు. ఏమైనప్పటికీ ప్రస్తుత కాలపు సాహిత్యం వేదశాస్త్రాల స్థానాన్ని ఆక్రమించింది. మనం ఇప్పుడు చదువుతున్న పుస్తకాలన్నీ నవలలు, ఇతర రకాలైన సాహిత్య గ్రంథాలు. ఇవి జనులను ప్రక్కదారి పట్టిస్తున్నాయి. సన్న్యాసులు పారాయణ చేసే వేదశాస్త్రాలు, ఉపనిషత్తులు 'బుద్ధిమంతుల కసరత్తులు'గా మిగిలిపోయాయి. గీతచదివానని నీవు వ్రాశావు. బహుశః దాని యొక్క కళాత్మక కౌశలం నీకు కొంత ఆనందాన్ని ఇచ్చిందని భావిస్తాను. దానిలోని ప్రతి వివరణను నీవు నీ జీవితంలో పరిశోధన చెయ్యాలి. అది చేస్తున్నావా?

స్వామీజీ రాజయోగం, జ్ఞానయోగం చదివావా?

మీరంతా ఈ మోక్షశాస్త్రం గురించి, దాని సాధన గురించి పరస్పరం చర్చించు కోవడానికి సమకూడకపోతే మీరూ కేవలం 'జాతీయ స్వచ్ఛంద సేవకులు'గా మిగిలిపోతారు. తాలింఖానాలో కసరత్తును అభ్యసించి 'ఉక్కునరాలు, ఇనుపకండరాలు' పెంచుకొన్న వస్తాదుల్లాగన్నమాట.

కనుక పదునైన విచక్షణా ఖడ్గంతో ప్రాపంచిక వలను ఛేదించాలి. ముముక్షుత్వం అనే అగ్నికి శ్రవణ, మనన, నిధి, ధ్యాసలనే సమిధలను అందిస్తూ నిరంతరం దాని జ్వాలను దేదీప్యమానంగా ఉంచాలి.

నీ మొదటి ప్రశ్నకు సమాధానం స్వామీజీ రాజయోగం మొదటి అధ్యాయం పధ్నాలుగవ సూక్తిలో ఉంది. ఏ వ్యక్తి అయినా చాలాకాలం పాటు ఏ అవాంతరం లేకుండా దృఢ విశ్వాసంతో సాధన చేస్తే ఆ ఆధ్యాత్మిక సాధన తదుపరి రంగానికి గట్టిపునాది అవుతుంది. కనుక ప్రారంభంలోనే ఫలితాలు ఆశించడం వెర్రితనం. మామిడి టెంకను నాటి, వెంటనే మామిడి పండ్లు కోసే గడపట్టుకు తయారైతే జనం నవ్వరా?

నీవు మోక్షం కోసం సాధన మార్గంలో నిదానంగా దృఢ చిత్తంతో, స్థిరమైన అడుగులు వేయవలసి ఉంటుంది.

ప్రేమాశీస్సులతో

స్వామి ప్రేమేశానంద

తెలుగు సేత: కె. త్రివిక్రమరావు

నీవు దేహధారణకై చేయు భోజనభాజనాదులనుగానీ, శాస్త్రోక్తములైన యజ్ఞ దాన తపః కర్మలనుగానీ, ఏ పని చేసినాగానీ వాటన్నింటినీ భక్తితో నాకే అర్పించడం అలవరచుకో! - శ్రీకృష్ణుడు

(...15వ పేజీ తరువాయి)

కన్నీరు జారేట్లు ఏడుస్తున్నాడట! పాపం ఊరడించండమ్మా! అంటున్న ఆ వనితల వ్యాఖ్యలను వేంకటేశ్వరుడి భక్తాగ్రేసరుడు...

గామిడై పారితెంచి కాగెడి వెన్నలలోన

చేమపూవు కడియాల చేయిపెట్టి

చీమ కుట్టెనని తన చెక్కిట కన్నీరు జార

వేమరువాపోవు వాని వెడ్డువెట్టరే! అన్న పదాల సొబగులద్ది సంకీర్తనబద్ధం చేశాడు. 'గామిడి' అంటే గ్రామపెద్ద, ఆరింద అని అర్థాలున్నాయి. 'పారితెంచి' అంటే 'పరుగెత్తుకొని వచ్చి' అని భావం. 'వెడ్డువెట్టరే' అంటే 'ఎలాగైనా ఊరడించరే' అని అర్థం.

కృష్ణలీలలనగానే భక్తకవులకు గుండెతో పాటు ఘంటమూ ఉప్పొంగిపోతుంది. రసరమ్య భావధారను కురిపిస్తుంది. అదే కోవకు చెందిన కవిశ్రేష్ఠుడు బమ్మెర పోతన తమ శ్రీమద్భాగవతం దశమ స్కంధంలో నవనీతచోరుడిని హృద్యమైన పద్యాలతో కళ్ళముందు నిలబెట్టాడు. ఓ రోజు ఆ గోపాలకృష్ణుడు గోపికల ఇండ్లలో వెన్న అంతా తిని ఇంటికి వచ్చాడు. పైగా ఏమీ ఎరగనట్లు తప్పటడుగులతో తల్లి దగ్గరకు వచ్చి, నెమ్మదిగా 'అమ్మా! చనుబువ్వపెట్టు' అని అడుగుతున్నాడు. ఆ సన్నివేశంలో ఆ వెన్నదొంగను వర్ణిస్తూ పోతనాచార్యులు...

వల్లవగృహ నవనీతము, లెల్లను భక్షించి వచ్చి ఎరుగని భంగిం తల్లి కదిసి చిట్టాడుచు, నల్లన చను బువ్వ పెట్టుమవ్వా!యనుచున్ అంటాడు. ఇలా ఎప్పుడు ఆ నందనందనుడిని కీర్తించాలన్నా కవులందరూ మానసికంగా గోకులానికే పరుగులు తీస్తారు.

వాని నూరడించరే!

మహాభారతాన్ని ఆంధ్రీకరించిన కవిత్రయంలో ఒకరైన తిక్కన కూడా, ఉద్యోగపర్వంలో శ్రీకృష్ణుడిని విశేషరీతిలో పరిచయం చేస్తారు. ఓసారి ఆ గోవర్ధనోద్ధారిని చూసి మేడలపై నుంచి మధురానగరవాసులు ఒకరితో ఒకరు '...వెన్నలును గోపికా చిత్తవృత్తములును, నరసి మ్రుచ్చిల నేర్చిన హరి ఇతండె... – గోపాలకుల ఇళ్ళలో ఉండే వెన్నలతో పాటు గోపికల మనస్సుల ప్రవర్తనను కూడా కనిపెట్టి అపహరించిన హరి ఇతడే సుమా!' అని అనుకుంటూ ముగ్ధులైపోయారని వివరించాడు. ఎలాంటి తపస్సులు, యజ్ఞాలు, సాధనలు చేయకుండానే, కేవలం తనతో కలసి మెలిగినందుకే అమాయకులైన ఆ ద్వాపర, బృందావనవాసులకు దివ్యలోకాలను ప్రసాదించాడు ఆ పరంధాముడు.

కలియుగంలో శ్రీరామకృష్ణులుగా అవతరించినప్పుడు కూడా ఆయన వెంట వారు ఆగమించారు. ఉదాహరణకు గోపాలేర్ మా, యోగిన్ మా, గోలాప్ మా తదితర శిష్యురాండ్రు అపర గోపికలుగా కలియుగంలో భగవాన్ శ్రీరామకృష్ణులపై తమ మధురభక్తిని చాటుకున్నారు. ఒకసారి యోగిన్ మా శ్రీరామకృష్ణులను 'మా గతి ఏమవుతుంది?' అని అడుగుతుంది. అప్పుడు ఆ పరమపురుషుడు 'మీకు ఏం కావాలి? నన్ను చూశారు; నాకు తినిపించారు; నన్ను సేవించారు; ఇంత కన్నా మీకు ఇంక ఏం కావాలి? కలత చెందకండి. మరణసమయంలో మీ సహస్రారంలోని సహస్రదళ పద్మం వికసిస్తుంది' అన్నారు. ఆయన అనుగ్రహంతో వారంతా పరిపూర్ణత్వాన్ని పొందారు. అలాంటి ఆంతరంగిక భక్తులు ఆనాడు రేపల్లెలో వేణుగానలోలుడి చేష్టలకు చిద్విలాసంతో...

ముచ్చువలె వచ్చి తన ముంగమురువుల చేయి

తచ్చెడి పెరుగులోన తగబెట్టి

నొచ్చెనని చేయిదీసి నోరనెల్ల జొల్లుగార

వొచ్చెలి వాపోవువాని నూరడించరే!

'చిలుకుతున్న పెరుగుకుండలో, దొంగలా వచ్చి చెయ్యి పెట్టాడు. కవ్వం తగలగానే చెయ్యి నొప్పి పెడుతుందని బాధపడుతున్నాడు. నోరంతా జొల్లుకారేట్లు ఏడుస్తున్న ఆ పిల్లాడిని కాస్త ఊరుకోపెట్టండమ్మా!' అంటున్నాడు అపర గోపకాంతలా అన్నమయ్య. 'ముచ్చు' అంటే దొంగ అని అర్థం.

పెట్టె తలకెత్తరే!

బ్రహ్మాండాన్ని బొజ్జలో పెట్టుకున్న బ్రహ్మాండ నాయకుడికి కుండలోని పాలపదార్థాలపై ప్రీతి ఎందుకుంటుంది? అయినా మన మనస్సనే మట్టిపాత్రలోని ప్రాపంచిక వ్యామోహాలనే పాలు, వెన్నలను పరిహరించేందుకే అన్ని పాట్లు పడ్డాడు! నవనీత చోరుడనే నిందలు మోశాడు. అయితే వెర్రివాంఛలను వదులుకునేందుకు మన మనస్సెలాగూ ఒప్పుకోదని తెలిసి, తనే బలవంతంగా లాగేసుకున్నాడు. ఆ మర్మం తెలిసిన మహాభక్తులే ఆ లీలలను అర్థం చేసుకుంటారు. ఆ భావం తెలిసిన భక్త పుంగవుడు కనుకనే శ్రీనారాయణతీర్థులు కూడా తమ శ్రీకృష్ణలీలాతరంగిణిలో...

ఆలోకయే శ్రీ బాలకృష్ణం సఖి, ఆనందసుందర తాండవకృష్ణం– నవనీతఖండ దధిచోరకృష్ణం భక్త భవపాశబంధ విమోచనకృష్ణం – 'సఖులారా! పాలువెన్నల అపహరణ పేరుతో, భక్తుల సంసారపాశాలను విడిపిస్తున్న ఆ ఆనందసుందర తాండవకృష్ణుడిని ఆలోకించమ'ని గోపికరూపమెత్తి తోటిసఖులను కోరుతున్నాడు. ఆ వరుసలోనే ఈ వేంకటాచలపతి విశేషభక్తుడు హితవు పలుకుతూ...

ఎప్పుడు వచ్చెనో మా యిల్లుచొచ్చి

పెట్టెలోని చెప్పరాని వుంగరాల చేయిపెట్టి

అప్పడైన వేంకటాద్రి అసవాలకుడు గాన

తప్పకుండ పెట్టె వాని తలకెత్తరే.

'ఎప్పుడు మా ఇంట్లోకి వచ్చాడో తెలియదు. కానీ సొమ్ములున్న పెట్టెలోకి చేయిపెట్టాడు. ఆ పెట్టెను ఆ బాలుడి తలకెత్తండని, పరోక్షంగా సూక్ష్మార్థంలో మన దేహభ్రాంతులనే సొమ్ముల సంపదను ఆ సర్వేశ్వరుడికి సమర్పించమ'ని అంటున్నాడు. 'అప్పడు' అంటే 'తండ్రి' అని, 'అసవాలకుడు' అంటే అసమానుడు అని అర్థాలు. ❖

పరస్పర సహకారం!

అనగనగా ఒక రాజు ఉండేవాడు. అతని పేరు వేంకటపతి. అతను తన ప్రజలకు కొంచెం కష్టం వచ్చినా సహించేవాడు కాదు. ఒకసారి ఆ రాజ్యంలో కరువు వచ్చింది. పంటలు పండక, తినడానికి తిండిలేక, తాగడానికి నీళ్ళులేక ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. అప్పుడు రాజు కోశాగారంలోని ధనరాశులన్నీ పొరుగు దేశపు రాజుకు ఇచ్చి తన రాజ్యానికి అవసరమైన నీటిని, ఆహారపదార్థాలను అతని వద్ద నుండి తీసుకున్నాడు. అప్పుడు ప్రజలు చాలా సంతోషించి రాజు చేసిన మేలు ఎన్నటికీ మరువమని కీర్తించారు.

కరువు నుండి తన ప్రజలను రక్షించడం కోసం తన కోశాగారంలోని సంపదనంతా పొరుగు దేశపు రాజుకు ఇవ్వడం వలన కోశాగారం ఖాళీ అయింది. దీంతో మరలా ఏమైనా అవసరమొస్తే ఎలా? అనే చింత రాజు మనస్సును తొలిచేది. అప్పుడు వేంకటపతిరాజుకు ప్రక్క రాజ్యంపై దండెత్తి ఆ రాజ్యంలోని సంపదనంతటినీ దోచుకోవాలనే దురాలోచన వచ్చింది. యుద్ధం వలన ఆస్తినష్టం, ప్రాణనష్టం జరుగుతుందని మంత్రులు ఎంత వారించినా, రాజు వారి మాటలను ఖాతరు చేయలేదు. పొరుగు రాజ్యంపై దండెత్తడానికే రాజు నిర్ణయించుకున్నాడు.

మరునాడు వేంకటపతిరాజు తన సైన్యంతో పొరుగు రాజ్యంపైకి దండయాత్రకు బయలుదేరాడు. వేంకటపతి రాజు తమ రాజ్యంపైకి దండయాత్రకు వస్తున్న విషయాన్ని గూఢచారులు రాజుకు తెలియజేశారు. ఆ రాజు చాలా తెలివైనవాడు. యుద్ధం వలన అనేక ఇబ్బందులు తలెత్తుతాయని భావించి వేంకటపతిరాజుతో సంధి ప్రయత్నాలు చేశాడు. ఆ రాజు వేంకటపతి రాజుని 'ఏమైంది రాజా! మా రాజ్యంపైకి దండయాత్రకు వచ్చారు?' అని అడిగాడు.

అప్పుడు వేంకటపతి రాజు తన రాజ్యంలో సంభవించిన కరువు కాటకాల దగ్గర నుంచి కోశాగారం ఖాళీ అవడం వరకు మొత్తం విషయాన్ని అతనికి వివరించాడు. అప్పుడు అతడు 'మీ రాజ్యంలో కరువు కాటకాలు సంభవించి ఇబ్బందులు తలెత్తితే మా రాజ్యంపై దండయాత్ర చేయడం న్యాయమా? యుద్ధం వద్దు, మనమిద్దరం పరస్పరం సహకరించుకొంటూ మన రెండు రాజ్యాలనూ పాలిద్దాం' అని తన కత్తిని క్రింద పడేశాడు. అప్పుడు వేంకటపతిరాజు అతని సుహృద్భావానికి మెచ్చుకొని, తన చేతిలోని కత్తిని కూడా క్రింద పడవేసి ఆ రాజును కౌగిలించుకున్నాడు.

అప్పటి నుండీ ఆ ఇద్దరు రాజులు పరస్పరం సహకరించుకుంటూ పాలనకొనసాగించారు. ప్రజలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సుఖసంతోషాలతో జీవించసాగారు.

నీతి: 1. మన సుఖం కోసం ఎదుటివారిని కష్టపెట్టరాదు.

2. పరస్పర సహకారమే జీవనం, స్వార్థమే మరణం.

3. కలిసి చర్చించుకుంటే ఎలాంటి సమస్యనైనా పరిష్కరించుకోవచ్చు.

– సి.హెచ్. శ్రీకాంత్, 10వ తరగతి
శారదా విద్యాదాన కేంద్రం,
రామకృష్ణ మఠం, హైదరాబాద్.

ఒక కథ చెబుతా... 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రిక ఉన్నత పాఠశాల విద్యార్థులలో వ్యాసరచన ప్రతిభను ప్రోత్సహించడం కోసం, సద్భావాలను పెంపొందించడం కోసం 'ఒక కథ చెబుతా...' శీర్షికను ప్రారంభించింది. ఈ శీర్షికలో ప్రచురించడానికి విద్యార్థుల నుండి నీతి కథలు, వ్యక్తిత్వవికాస కథలు, స్ఫూర్తిదాయక కథలు, ఆధ్యాత్మిక కథలను ఆహ్వానిస్తోంది. వ్యాసాలను చక్కని దస్తూరీతో సరళభాషలో రాసి, మీ పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను జతపరచి పంపించండి. మీ పూర్తి చిరునామాను పొందుపరచండి. ఎంపికైన కథలకు బహుమతి లభిస్తుంది.

వ్యాసాలను పంపించాల్సిన చిరునామా : సంపాదకులు, శ్రీరామకృష్ణ ప్రభ, రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాద్–500 029. E-mail : sriramakrishnaprabha@gmail.com

- స్వామి పరిజ్ఞేయానంద

పరిపూర్ణ వికాసం

ఈ ఆధునిక సమాజంలో యువతీయువకులు 'వ్యక్తిత్వవికాసం' పట్ల ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తున్నారు. అందులో ఒక అంశమైన బాడీ లాంగ్వేజ్ (శారీరక తీరును బట్టి వ్యక్తిత్వాన్ని అంచనా వేసే పద్ధతి) శిక్షణా తరగతులకు కూడా హాజరవుతున్నారు. ఎందుకంటే ఉద్యోగ అర్హతను సాధించడానికి బాడీ లాంగ్వేజ్‌ను కూడా పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుంది కాబట్టి. అభ్యర్థి కూర్చునే విధానం, మాట్లాడే పద్ధతి, ప్రతిస్పందించేతీరులను బట్టి వ్యక్తిత్వాన్ని అంచనా వేస్తున్నారు. కాబట్టి నేడు ఉద్యోగ నియామక విషయంలో బాడీ లాంగ్వేజ్ కీలక పాత్ర పోషిస్తోంది.

సాధారణంగా మనల్ని మనం పరిశీలించుకోవడానికి ఇష్టపడం. కానీ ఇతరులను పరిశీలించడానికి ఎప్పుడూ ముందుంటాం. కాబట్టి మనం ఇతరులను పరిశీలించినప్పుడు కొన్ని విషయాలను గమనించవచ్చు. కొంతమంది కూర్చుని పనిచేస్తున్నప్పుడు కాలును ఊపుతుంటారు; మరికొంతమంది అవసరమైనదానికంటే అధికంగా మాట్లాడుతుంటారు; ఇంకొంతమంది ప్రతిచిన్న విషయానికీ తీవ్రంగా స్పందిస్తారు... ఇలా శరీరంలోని ప్రతీ కదలికా, ప్రతిస్పందనా మన మనోస్థితిని బయటపెడుతుంది. బాడీ లాంగ్వేజ్‌లో తర్ఫీదు పొందడం వల్ల తాత్కాలిక పరివర్తనే కలుగుతుంది. మనలో సంపూర్ణ పరివర్తన రావాలంటే మైండ్ లాంగ్వేజ్‌ను (మనోభావాలను) అర్థం చేసుకోవాలి.

ఒక పండితుడు, ఒక పామరుడు కలిసి ఒకే పని చేస్తున్నప్పుడు శారీరక స్థాయిలో ఇద్దరూ ఒకే విధంగా కనిపిస్తున్నప్పటికీ, వారి మానసిక స్థాయిలో ఎంతో భేదం ఉంటుంది. శ్రీమద్భాగవతంలో జడభరతుని ఉదంతం ఇందుకు చక్కని ఉదాహరణ.

ఒకరోజు రహూగణుడు అనే మహారాజు అత్యవసరంగా పనిమీద వెళ్ళవలసి వచ్చింది. రాజు పల్లకీని మోసే బోయల్లో ఒకరు తక్కువయ్యారు. భటులు బోయను వెతకడానికి వెళుతుండగా దారిలో జడభరతుడు కనిపించాడు. వెంటనే భటులు అతణ్ణి పల్లకీ మోయడానికి తీసుకువెళ్ళారు. మహారాజు పల్లకీని బోయలు మోస్తున్నారు. పల్లకీ కుదుపులకు రాజు బోయలను మందలించినప్పుడు వెంటనే మిగతా బోయలందరూ తప్పు జడభరతుడిదే అని చెప్పారు. వెంటనే రాజు ఆగ్రహంతో జడభరతుణ్ణి దుర్భాషలాడాడు. కానీ జడభరతుడు ప్రశాంతంగా రాజుతో 'మనస్సు ఆత్మలో సుప్రతిష్ఠమై ఉన్న వ్యక్తిపై నిందావాక్యాలు ప్రభావం చూపవు' అని అన్నాడు. వెంటనే మహారాజు అతడు సాధారణ వ్యక్తి కాదని గ్రహించి జడభరతుని పాదాలపై పడి క్షమించమని ప్రార్థించాడు.

పల్లకీని మోస్తున్నప్పుడు మహాజ్ఞాని అయిన జడభరతుడు, పామరులైన మిగతా బోయలు శారీరక స్థాయిలో ఒకే విధంగా కనబడుతున్నప్పటికీ, వారి మానసిక స్థాయిలో ఎంతో భేదం ఉంది. మహారాజు బోయలను మందలించినప్పుడు వారు భయకంపితులయ్యారు. జడభరతుడు మాత్రం ప్రశాంతంగా ఉన్నాడు.

మృదువుగా మాట్లాడడం, నిశ్చలంగా కూర్చోవడం, నమ్రతగా ప్రవర్తించడం... ఇలా బాహ్యంగా ప్రదర్శించే సభ్యతా సంస్కారాలను బట్టి వ్యక్తి వ్యక్తిత్వాన్ని అంచనా వేయలేం. ఎవరైనా మనల్ని ప్రలోభ పెట్టినప్పుడు, కోపగించుకున్నప్పుడు, నిందించినప్పుడు, మనకు కష్టాలు ఎదురైనప్పుడు మనం ప్రతిస్పందించే తీరును బట్టి మన నిజమైన వ్యక్తిత్వం వెల్లడవుతుంది. అందుకు మన మానసిక ఆలోచనా సరళిలో పరివర్తన రావాలి.

అందువల్ల విశ్వానికే వ్యక్తిత్వవికాస నిపుణుడైన భగవాన్ శ్రీకృష్ణుడు సూచించిన నియమాలను ఆచరించగలిగితే బాడీ లాంగ్వేజ్(బాహ్యప్రవర్తన)తో పాటు మైండ్ లాంగ్వేజ్ (అంతరంగ పరివర్తన)లో కూడా ప్రావీణ్యతను సాధించవచ్చు.

అంతరంగ పరిణతి సాధించిన (స్థిర బుద్ధిగల) వ్యక్తి లక్షణాలు ఏమిటో తెలుపమని అర్జునుడు, శ్రీకృష్ణుణ్ణి అడుగుతూ...

వికాస మంత్రాలు



– స్వామి పార్థసఖానంద

ప్రేరణ ప్రతి విషయంలోనూ పని చేయదు. మనం ఏం చేయగలం అనే దాని కంటే, ఏం చేయలేమో తెలుసుకోవడమే చాలా సందర్భాల్లో ముఖ్యం.



ఎన్నో సమస్యలు నా తలుపు తడుతూ ఉంటాయి, అయితే అవి ఎప్పుడూ లోపలికి రాలేదు! బహుశా నా నవ్వులు వినిపించి, అవి అటు నుంచి అటే పారిపోతున్నాయని అనుకుంటా!

ఒకరి.. గురించి.. ఒకరం మాట్లాడటం ఆపేసి, ఒకరితో... ఒకరం మాట్లాడుకోవడం మొదలు పెడితే, మన జీవితంలోని చాలా సమస్యలు తీరుతాయి.

స్థితప్రజ్ఞస్య కా భాషా సమాధిస్థస్య కేశవ ।
స్థితధీః కిం ప్రభాషేత కిమాసీత వ్రజేత కిమ్ ॥ (గీత- 2.54)

'కేశవా! స్థితప్రజ్ఞుడి (స్థిరమైన బుద్ధిగలవాడు) లక్షణమేమిటి? అతడు ఎలా మాట్లాడుతాడు? ఎలా కూర్చుంటాడు? ఎలా ప్రవర్తిస్తాడు?' అని ప్రశ్నించాడు.

అర్జునుడు అడిగిన ఈ నాలుగు ప్రశ్నలకు సమాధానంగా భగవానుడు (గీత, 2.55-72) పద్దెనిమిది శ్లోకాలలో స్థితప్రజ్ఞుని లక్షణాలను వివరించాడు.

భగవద్గీత కేవలం ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు మాత్రమే ఉపయోగపడుతుందనే భావనలో నేటితరం ఉంది. కానీ జీవితాంతం కర్మక్షేత్రంలో ఉన్న మహాత్మాగాంధీ, వినోబాభావే లాంటి మహాత్ములు స్థితప్రజ్ఞ లక్షణాలను వివరించే ఈ పద్దెనిమిది శ్లోకాలను నిత్యమూ పఠించేవారు. 'స్థితప్రజ్ఞ లక్షణాలను పఠించడం వల్ల నాలో కార్యదక్షత, మనోనిశ్చలత, అసంగత్వం పెంపొందాయ'ని గాంధీజీ ప్రకటించారు.

ఈ పద్దెనిమిది శ్లోకాలను ప్రతి ఒక్కరం ప్రతి నిత్యమూ పఠించి, సాధ్యమైనంత వరకు ఆచరించడానికి ప్రయత్నించగలిగితే మన వ్యక్తిత్వం పరిపూర్ణంగా వికసిస్తుంది. అప్పుడు మనం అశాంతికి లోనుకాకుండా అన్ని పరిస్థితులలోనూ నిశ్చల మనస్సుతో, స్థిరబుద్ధితో, ప్రశాంతచిత్తంతో వ్యవహరించగలుగుతాం. ❖

పవిత్రతకు ప్రతిరూపం

ఆధారం : శ్రీరామకృష్ణ కథామృతం
చిత్రాలు : గోవి
అనుసృజన : స్వామి జ్ఞానదానంద










4
నందగోపా! వివాహితయైన రాధ, మన కృష్ణుడు అలా సన్నిహితంగా మెలగడం ఏమన్నా బాగుందా?
కృష్ణుడు గోపికలందరితోనూ నిష్కాపట్యంతోనే మెలగుతున్నాడు! నా కుమారుడని అతణ్ణి సమర్థించడం లేదు. గోపికలందరూ అతణ్ణి పురుషునిగా కూడా చూడట్లేదు!
5
అదేమో మాకు తెలియదు. యుక్తవయస్సుకు వచ్చిన ఇద్దరు అలా మెలగడాన్ని అట్లే వదలివేస్తే అది మన సమాజానికి మాయని మచ్చగా పరిణమిస్తుంది.
ఊళ్ళో అందరినీ కలుసుకుని దీనికి స్వస్తి పలికించాలి.
సరే, రేపు పంచాయతీకి రాధను రప్పించి విచారిద్దాం.
6
రాధా! నువ్విలా కృష్ణుని వెనుకే తిరగడం ఏమైనా బాగుందా?
స్వామీ! క్షమించండి. నేను ఎలాంటి తప్పూ చేయలేదు. నేను నిష్కళంకను.
7
నువ్వు నిష్కళంకవైతే, అది నిరూపించు.
నిష్కళంకనని నిరూపించడానికి నేను ఏం చేయాలో దయచేసి మీరే చెప్పండి.
రాధకు ఏం పరీక్ష పెట్టాలో నిర్ణయించాక దాన్ని వెల్లడింప ఏర్పాటు చేశారు.


8
ఓ పెద్దమనిషీ! పరీక్ష ఏమిటో మీరే రాధతో చెప్పండి.
నువ్వు ఈ కుండనిండా యమున నుండి నీళ్ళు తేవాలి.
ఆ, నూరు చిల్లులున్న ఈ కుండలోనా? అదెలా సాధ్యం? రాధకు నిష్కర్షగా చెబితే తప్పక ఆమె మనస్సు మార్చుకొంటుంది.
ఈ పరీక్ష జరుగవలసిందేనని అందరూ పట్టుబట్టడంతో నందగోపుడు కూడా సమ్మతించాల్సి వచ్చింది.
9
విన్నావా కృష్ణా, నాకు పెట్టిన పరీక్ష గూర్చి?
నీ అచంచల భక్తిని లోకానికి చాటడానికే ఈ ఏర్పాటు, రాధా! కలత చెందకు.
10
మర్నాడు యమునా తీరంలో అందరూ గుమిగూడారు.
ఈ చిల్లుకుండలో నీరు తీసుకురాలేక, రాధ అవమానపడి ఆత్మహత్యకు పాల్పడుతుందేమో!
అవును, ఆ అవకాశం లేకపోలేదు. కానీ రాధ ఇలా కష్టపడుతుండడం చూస్తూ మన కృష్ణుడు ఊరకే ఉంటాడా?



ప్రభూ! మనోహరా! గోవులను తోలుకొని గోకులము నుండి నీవు వనానికి వెళతావు. అడవిలో నీవు నేలపై తిరుగుతూ ఉంటే, కమలముల లాంటి సుందరమైన, మృదువైన నీ చరణాలకు ముళ్ళు గుచ్చుకుంటాయేమో, రాళ్ళు తగులుతాయేమో అని మా మనస్సు తీవ్రంగా వ్యథ చెందుతుంది.

కృష్ణా! పగటి వేళ నీవు బృందావనానికి వెళ్ళినప్పుడు నిన్ను చూడని మాకు క్షణమొక యుగంగా ఉంటుంది. సాయంత్రాలలో ఉంగరాల జుట్టుతో శోభించు నీ ముఖ పద్మాన్ని నిరంతరం దర్శించడానికి అడ్డుపడుతున్న కనురెప్పలను సృష్టించిన బ్రహ్మదేవుడు మందమతి.

('గోపికాగీతం' నుండి)

వార్తావాహిని

గోదావరి పుష్కరోత్సవాలు

రాజమండ్రి, రామకృష్ణ మఠం గోదావరి మహాపుష్కరాలను పురస్కరించుకొని 2015 జూలై 14 నుండి 25 వరకు సేవాకార్యక్రమాలను, సత్సంగాలను నిర్వహించింది. పుష్కర యాత్రికులకు 12 రోజుల పాటు అన్నదానం, మజ్జిగ; పిల్లలకు పాల పంపిణీ చేసింది. ఈ సేవా కార్యక్రమాల ద్వారా సుమారు 2,76,000 మంది యాత్రికులు లబ్ధి పొందారు.

ఈ సందర్భంగా నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో స్వామీజీల ఉపన్యాసాలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. నివేదిక : స్వామి కపాలీశానంద

మారుటేరు, శ్రీరామకృష్ణ సేవాసమితి గోదావరి మహాపుష్కరాల సందర్భంగా 2015 జూలై 14 నుండి 25 వరకు కోడేరు, సిద్ధాంతం పుష్కరరేవుల్లో యాత్రికులకు ఉచితంగా సామాన్లు భద్రపరచే గదులను ఏర్పాటు చేసింది. 6,500 మంది యాత్రికులకు పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేసింది.

నివేదిక : విస్సాప్రగడ సత్యహరి

పండుగలు - పర్వదినాలు

సెప్టెంబర్ - 2015

05	శనివారం	: శ్రీకృష్ణ జన్మాష్టమి
08	మంగళవారం	: ఏకాదశి
12	శనివారం	: స్వామి అద్వైతానంద జయంతి
17	గురువారం	: వినాయక చవితి
24	గురువారం	: ఏకాదశి

అక్టోబర్ - 2015

06	మంగళవారం	: స్వామి అభేదానంద జయంతి
08	గురువారం	: ఏకాదశి
12	సోమవారం	: స్వామి అఖండానంద జయంతి
21	బుధవారం	: మహా అష్టమి
22	గురువారం	: విజయదశమి
23	శుక్రవారం	: ఏకాదశి
27	మంగళవారం	: లక్ష్మీపూజ

Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust
and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020
and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**

సురభి

నాకు (స్వామి గిరిజానంద) పాణిని వ్యాకరణం నేర్పిన పండితుడు మాతృమూర్తి శారదాదేవి దర్శనానికి వచ్చారు. ఆయన చాలా వృద్ధుడు. అమ్మకు ప్రణామం చేయగానే ఆమె కూడా ఆయనకు ప్రణామం చేశారు. అమ్మను చూసీ చూడగానే 'మా పాండిత్యం అంతా మీ శక్తినే. మీరు సరస్వతీ మాత' అన్నారు ఆయన.

కాశీలో ఒక దిగంబర సన్న్యాసి ఉన్నారు. పేరు చమేలీపురి; తోతాపురి సమకాలీనుడు. అమ్మ ఆయనను దర్శించి ఒక కంబలి బహూకరించారు. ఆయనను దర్శించిన పిదప మరే సాధువునూ దర్శింప ఇచ్ఛగించలేదు అమ్మ.

ఆ సంవత్సరం తన జన్మదినం నాడు అమ్మ కాశీలోనే ఉన్నారు. స్వామి బ్రహ్మానందకు నారింజ రంగు పట్టు ధోవతి పంపించారు. మహరాజ్ ఆనందంతో చిన్న పిల్లవాడి వలె నవ్వుతూ తిరిగి, అమ్మ బసకు వెళ్ళి ప్రణామం చేశారు.

ఒక బ్రహ్మచారి మంత్రదీక్ష కోసం స్వామి బ్రహ్మానంద వద్దకు వెళ్ళారు. ఏ కారణంగానో స్వామీజీ దీక్ష ఇవ్వలేదు. కానీ ఏదో దైవనామం జపించమన్నారు. ఆ తర్వాత అమ్మ అతడికి మంత్రదీక్ష ఇచ్చారు. ఆ బ్రహ్మచారి అందరితో 'బ్రహ్మానంద మహరాజ్ ఈ మంత్రం ఇచ్చారు, అమ్మ ఫలానా మంత్రం ఇచ్చారు' అని చెప్పుకొనేవాడు. అమ్మ నాతో "ఈ అబ్బాయి ఎంత వెర్రిబాగులవాడో చూడు. బీజమంత్రం ఇలా వెల్లడి చేయవచ్చా? మర్రి విత్తు ఎంత చిన్నది. కళ్ళకు సరిగ్గా కనపడదు. కానీ అందునుండి విశాలమైన మర్రిచెట్టు ఉద్భవిస్తుంది. బీజమంత్రం కూడా అంతే. శ్రద్ధతో సాధన చేస్తే, బ్రహ్మజ్ఞానం కలుగుతుంది" అని అన్నారు.

నేను చాలా సంవత్సరాల తర్వాత కలకత్తా తిరిగి వచ్చాను. ఒక భక్తురాలి విన్నపాన్ని మన్నించి అమ్మ ఆమె ఇంటికి వెళ్ళి, శ్రీరామకృష్ణుల పూజ చేసి నైవేద్యం సమర్పించారు. కానీ శ్రీరామకృష్ణులు ఒక్క పదార్థమైనా స్వీకరించలేదట. అప్పుడు అమ్మ 'మీరు ఏమీ తినకపోతే, నేనూ తినజాలను. కానీ ఏమీ తినకుండా గృహస్థుల ఇంటి నుండి వెళ్ళిపోతే అది వారికి శుభం కాదు' అని వేడుకున్నారు.

అప్పుడు వెంటనే శ్రీరామకృష్ణుల నుండి ఒక కాంతి కిరణం బయల్వెడలి, పరమాన్నాన్ని తాకిందట. అమ్మ పరమాన్నం మాత్రం, అదీ కొద్దిగా తిని, వచ్చేశారు.

అక్కడి నుండి ఇంటికి రాగానే వమనమై, రెండు దినాలు అస్వస్థతతో ఉన్నారు. స్వామి బ్రహ్మానంద మహరాజ్, 'అమ్మను ఎవరింటికి అంటే వారింటికి ఎందుకు తోడ్కొని వెళతారు. మీ కారణంగానే అమ్మ ఇప్పుడు అస్వస్థతకు గురయ్యారు' అని చీవాట్లు పెట్టారు. ❖

Vol.72-9, Sri Ramakrishna Prabha (Telugu Monthly) September 2015, Regd. with the Registrar of Newspaper for India Under No.1120/57. Postal Registration No. HD-1071/2013-15. Licensed to Post Under WPP : AP/CPMG/HC-13/WPP/2015-16. Date of Publication : 16 August 2015

బోధకులకు ఉద్బోధ !

అబ్రహామ్ లింకన్ తన కుమారుడి ఉపాధ్యాయునికి రాసిన లేఖ నేటి తల్లితండ్రులకూ, ఉపాధ్యాయులకూ, విద్యావంతులకూ ఎంతో స్ఫూర్తిదాయకం. అందులోని కొన్ని అంశాలు :

1. ఎలాంటి పరిస్థితులలోనూ తనపై తాను విశ్వాసాన్ని కోల్పోకూడదని బోధించండి. కష్టాల మధ్య కూడా హాయిగా నవ్వడం ఎలాగో నేర్పండి.
2. ఆకాశంలో ఎగిరేపక్షులు, సూర్యకాంతిలో తిరుగాడే తేనెటీగలూ, పచ్చని చెట్లపై పూచే పూవుల అంతుచిక్కని మర్మాల గురించి ఆలోచించడానికి సమయం ఇవ్వండి.
3. దొరికిన అయిదు డాలర్ల కన్నా, సంపాదించిన ఒక డాలర్ ఎంతో విలువైనదని నేర్పండి.
4. అసూయ నుంచి దూరం చేయండి. ప్రశాంతమైన నవ్వులోని రహస్యం నేర్పండి.
5. బుద్ధి బలంతో ధనార్జన చేయవచ్చు. కానీ వ్యక్తిత్వాన్ని మాత్రం డబ్బు కోసం అమ్ముకోవద్దని బోధించండి.
6. అందరు చెప్పిందీ విని, దానిలోని నిజాన్నే స్వీకరించాల్సిందిగా బోధించండి.
7. తాను అనుకున్నది ఒప్పు అని నమ్మితే దాని కోసం పోరాడడం నేర్పండి.
8. ప్రేమగా చూడండి, కానీ ముద్దు చేయవద్దు. ఎందుకంటే, వేడి కొలిమి మాత్రమే ఉక్కును తయారు చేయగలదు. ❖ (సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం)

With Best Compliments From

పక్యాల భాస్కర రావు, మేనేజింగ్ డైరక్టర్ & **పక్యాల గిరిజ,** డైరక్టర్

SVIS LABS LIMITED

SVISS LABSS LIMITED

(Manufacturers of Active Pharmaceutical Ingredients and Intermediates)

TÜV CERT DIN EN ISO 9001 : 2000 Certificate : 01 100 058568

Regd. Off. & Fact. : Plot No.88 & 89, Phase - II,
SIPCOT Industrial Complex, Ranipet - 632 403, Tamil Nadu.
Phone : 04172 - 244820, 651507, Tele Fax : 04172 - 244820
E-mail : rao@svisslabss.net Web Site : www.svisslabss.net

SVISS LABSS కంపెనీ వారు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 2,000 పాఠశాలలకు స్పాన్సర్ చేశారు.

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

అక్టోబర్ 2015

₹10

సుబోధ



భక్తుడు : మనస్సు ఒక మదపుటేనుగు. దానిని విషయవాంఛల నుండి మళ్ళించడమెలా?

శ్రీరామకృష్ణులు : భోగవాసనలు ఉన్నంత వరకు, భగవంతుని తెలుసుకోవడానికో లేక దర్శించడానికో మనస్సు వ్యాకులత చెందదు. చిన్న పిల్లవాడు బొమ్మలతో ఆడుకుంటూ అన్నిటినీ మరచిపోతాడు. మిఠాయి ఇచ్చి పిలువు, ఏదో కాస్త తింటాడు, అంతే. కానీ ఆట బొమ్మలు నచ్చనప్పుడు, మిఠాయి నచ్చనప్పుడు, 'అమ్మ వద్దకు పోతాను' అంటాడు. అప్పుడు అతడికి మిఠాయి కూడా అక్కరలేదు. ముక్కూముఖం తెలియని వ్యక్తి ఎవరైనా వచ్చి, 'రా, మీ అమ్మ దగ్గరకు నిన్ను పిలుచుకుపోతాను' అంటే, ఆ వ్యక్తితోనే వెళ్ళిపోతాడు.

విషయవాంఛలు తీరిపోగానే భగవంతుడికై మనస్సు వ్యాకులత చెందుతుంది. ఆయనను ఎలా పొందగలను అనే చింతన మాత్రమే ఉంటుంది. ఆ స్థితిలో ఉన్న వ్యక్తితో భగవంతుని గురించి ఎవరు ఏది చెప్పినా దాన్ని అతడు వింటాడు.

భగవంతుని రూపాల పట్ల అపనమ్మకం ఉంచుకోకు. సాకారం నిజమని విశ్వసించు. తరువాత నీకు ఏ రూపం ప్రియమైనదో ఆ రూపాన్నే ధ్యానించు. భగవద్రూపాలను అంగీకరించాలి. జగద్ధాత్రీ రూపం అర్థం ఏమిటో తెలుసా? జగత్తును ధారణ చేసిందని అర్థం. ఆమె ధారణ చేయకుంటే, ఆమె పాలించకుంటే, జగత్తు క్రిందపడిపోయేది; నాశనం అయిపోయేది.

మనస్సు అనే ఏనుగును ఎవడు నియంత్రించగలడో అతడి హృదయంలో జగద్ధాత్రి విరాజిల్లుతుంది. అందుచేతనే సింహవాహినీదేవి వాహనమైన సింహం, ఏనుగును నియంత్రించి ఉంచింది.

భక్తుడు : మహాశయా! కాళికాదేవి మేని ఛాయ నల్లగా ఎందుకు ఉన్నది?

శ్రీరామకృష్ణులు : దూరం కారణం చేతనే. దగ్గరకు పోయి చూస్తే ఏ రంగూ ఉండదు. కొలను నీరు దూరం నుండి చూస్తే నల్లగా కనబడుతుంది. దగ్గరకు వెళ్ళి చేతిలోకి తీసుకొని చూస్తే ఏ రంగూ ఉండదు. దూరం నుండి ఆకాశం నీలంగా కనిపిస్తుంది. దగ్గరగా ఉన్న ఆకాశాన్ని చూడు, రంగు ఉండదు. భగవంతుణ్ణి సమీపించేకొద్దీ ఆయనకు నామరూపాలు లేవని తెలుస్తుంది. ❖

శ్రీరామకృష్ణ ప్రభ
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాదు-500 029
ఫోన్: 040-27667799, సెల్: 8801849494
E-mail : sriramakrishnaprabha@gmail.com
నిర్వాహక సంపాదకులు: స్వామి జ్ఞానదానంద
సంపాదకులు: స్వామి పరిజ్ఞేయానంద

ఆధ్యాత్మిక అమృతవాహిని
శ్రీ రామకృష్ణ ప్రభ
సంపుటం: 72 సంచిక: 10 అక్టోబర్ 2015

ప్రార్థన

దుర్గాయై దుర్గపారాయై సారాయై సర్వకారిణ్యై।
ఖ్యాత్యై తథైవ కృష్ణాయై ధూమ్రాయై సతతం నమః ॥

కష్టాలను తొలగించేదీ, సారస్వరూపిణీ,
సర్వకార్యాలనూ ఒనర్చేదీ,
జ్ఞాన స్వరూపిణీ, కృష్ణ వర్ణం కలదీ,
ధూమ వర్ణం కలదీ అయిన దుర్గాదేవికి
ఎల్లప్పుడూ నమస్కారములు.

(శ్రీదేవీ మాహాత్మ్యం)

సూక్తి సౌరభం

గిరౌ కలాపీ గగనే పయోదో
లక్షాంతరేర్కశ్చ జలేషు పద్మమ్।
ఇందుర్ద్వి లక్షే కుముదీ స్సబంధుః
యోయస్య హృద్యో నహి తస్యదూరః ॥

"కొండమీద నెమలి ఎక్కడో ఆకాశంలోని మేఘాలను చూసి ఆనందంతో నాట్యం చేస్తుంది; నీటిలోని తామరపువ్వు అనంత దూరంలో ఉన్న సూర్యున్ని చూసి వికసిస్తుంది; కలువల నెచ్చెలి చందమామ అనంత దూరంలో ఉన్నా వాటికి ఆనందాన్నిస్తాడు. ఈ దూరాలేవీ వాటి ఆనందానికి అడ్డురావడం లేదు. అలాగే మనస్సులో అనురాగం ఉండాలేగానీ దూరాలు ఆటంకం కావు!"

చదువులన్ని చదివి చాల వివేకియౌ
కపటి కెన్నడైన కలదె ముక్తి?
నిర్మలాత్మకునకె నిశ్చలపు సమాధి
విశ్వదాభిరామ వినుర వేమ!

"ఓ వేమా! ఎంత విద్యావంతుడై నప్పటికీ కపటం ఉన్న వ్యక్తికి ముక్తి లేదు. నిర్మలమైన మనస్సు గలవాడికే ముక్తి లభిస్తుంది."



శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి



ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'కి ధన దానం చేసి ప్రోత్సహించాల్సిందిగా కోరుతున్నాం. దాతల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు......	రూ.	10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజపోషకులు............	రూ.	5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు.................	రూ.	1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

	దాత పేరు	ఊరు	రూ.
మహా రాజపోషకులు	శ్రీమతి సుంకర అన్నపూర్ణా దేవి,	గంగారం, చందా నగర్, హైదరాబాద్	10,116
మహా రాజపోషకులు	శ్రీమతి వీణారావు కొల్లి,	జూబ్లీ హిల్స్, హైదరాబాద్	10,000
మహా రాజపోషకులు	డా॥ పి. శశికళా దేవి,	గడ్డి అన్నారం, హైదరాబాద్ (తల్లిదండ్రులు కీ॥శే॥ పి. సీతాదేవి, సుబ్బారావు గార్ల జ్ఞాపకార్థం)	10,000
మహా రాజపోషకులు	డా॥ బి. యస్. ప్రసాద్,	భీమడోలు, పశ్చిమ గోదావరి జిల్లా	10,000
మహా రాజపోషకులు	శ్రీ ఎమ్. రామస్వామి,	ఎమ్. అగ్రహారం, మురకమ్‌భట్, చిత్తూరు జిల్లా	10,000
రాజపోషకులు	శ్రీ మన్నెం కన్నయ్య & కన్నమ్మ,	అమూల్య కాలనీ, నల్గొండ (కీ॥శే॥ మన్నెం సత్యేంద్ర కుమార్ గారి జ్ఞాపకార్థం)	5,116
పోషకులు	శ్రీమతి శివకోటి సత్యవతి,	టి. సి. ఆర్. కాలనీ, విజయవాడ (కీ॥శే॥ శివకోటి కృష్ణమూర్తి గారి జ్ఞాపకార్థం)	1,116
పోషకులు	శ్రీ కె. సోమేశ్వర రావు,	శ్రీనివాస నగర్, రాజమండ్రి, తూర్పు గోదావరి జిల్లా	1,000
పోషకులు	శ్రీ కె. గంగులప్ప,	నంద్యాల, కర్నూలు జిల్లా	1,000
పోషకులు	శ్రీ నండూరు మురళీకృష్ణ,	గాంధీ నగర్, విజయవాడ	1,000

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు మీద చిరునామాకు పైన మీ చందా నంబరు, కుడి వైపున మీ చందా గడువు ముగిసే నెల ఉంటాయి. మీ చందా గడువు పూర్తయ్యే నెలకు ముందుగానే సొమ్మును చెల్లించి చందాను పునరుద్ధరించుకోండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారిన పక్షంలో 7వ తేదీ లోగా మాకు తెలియపరచినట్లయితే, వచ్చే నెల సంచిక నుండి మీ కొత్త చిరునామాకు పంపబడును.
- ప్రతీ నెల 26 లేదా 27వ తేదీల్లో పత్రిక పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపుగా చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ.... – సర్క్యులేషన్ మేనేజర్

చందా వివరాలు		భారతదేశంలో	విదేశాలకు
విడి ప్రతి	:	₹ 10	-
సంవత్సర చందా	:	₹ 100	₹ 1,500
మూడు సంవత్సరాలకు	:	₹ 280	₹ 4,500
ఐదు సంవత్సరాలకు	:	₹ 450	₹ 7,500
ఇరవై సంవత్సరాలకు	:	₹ 1,500	₹ 22,000

గమనిక: డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో Ramakrishna Math, Hyderabad అని వ్రాయాలి.

పంపవలసిన చిరునామా: Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.

చందాను ఆన్‌లైన్ http://rkmath.org/srkp ద్వారా చెల్లించవచ్చు.

అన్ని వర్గాల వారికి అనువైన ఋణ మరియు డిపాజిట్ పథకములతో
మీ సేవలో....
सिंडिकेटबैंक SyndicateBank
'సిండికేట్ బ్యాంక్' వారు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 1000 విద్యాసంస్థలకు ఒక సంవత్సరానికి స్పాన్సర్ చేసారు.
ఫీల్డ్ జనరల్ మేనేజర్ వారి కార్యాలయం, హైదరాబాద్–500004

లోపలి పేజీల్లో...

6 సంపాదకీయం
చిరకాలం చెరగని ఆ చిరునవ్వు!

8 గోరుముద్ద
మరో ప్రపంచం

9 నిద్రనే నిద్రపుచ్చు

10 పలికెడిది భాగవతం
ప్రకాశకుడు పరమాత్ముడే!

12 మన సంస్కృతి
విదేశాలలో భారతీయ సంస్కృతి

13 రామకృష్ణ భక్తి సూత్రాలు

14 జీవనోద్యానంలో మానవతా పరిమళాలు
భావం ప్రధానం!/ పొగడ్తలు వ్యక్తిత్వానికి మరకలు

15 చూడ చూడ మాణిక్యాలు...

16 పరమపదానికి రాజమార్గం
సత్యమే భగవంతుడు

18 మహాత్ముడు మెచ్చిన మధురగీతం

20 పరిప్రశ్న

21 ధీరవాణి
ప్రపంచానికి ఆదర్శం హైందవ స్త్రీ

22 ముగ్గురమ్మల మాహాత్మ్యం

24 అంతా మన చేతుల్లోనే...

26 ప్రయత్నాస్త్రం

27 యువవాణి
మనవంతు సేవ...

28 మూగప్రాణాల మౌనపాఠాలు

30 మరపురాని మహామనిషి

31 భావ కాలుష్యం

33 ముందుకు సాగిపో!

35 ఒక కథ చెబుతా...
చేసుకున్నవారికి చేసుకున్నంత!

36 భగవద్గీత - సద్గుణ సుధ
తృష్ణ తగ్గితేనే తృప్తి!

37 వికాస మంత్రాలు

38 బొమ్మల కథ
పాతివ్రత్య మహిమ

ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు. - సంపాదకులు



దసరా శుభాకాంక్షలు

'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు, రచయితలకు, రచయిత్రులకు, ఏజెంట్లకు, దాతలకు, శ్రేయోభిలాషులకు మా హృదయపూర్వక దసరా శుభాకాంక్షలు. - సంపాదకులు

KCP CEMENT
CONCRETE CEMENT
Since 1958

With Best Compliments From
CHAIRMAN & MANAGING DIRECTOR
THE KCP LIMITED
KCP కంపెనీ వారు "శ్రీరామకృష్ణ ప్రభ" మాసపత్రికను
1000 గ్రంథాలయాలకు స్పాన్సర్ చేశారు

KCP Sreshtaa CEMENT
THE NEW GENERATION CEMENT

Cement Marketing Division : Plot No. 10, Gayatri Hills, MP & MLA's Colony, Road No. 10 C, Jubilee Hills, HYDERABAD - 500033.
Tel : 040-2325 3503 to 505, Fax : 2325 3500, Cell : +91 99895 97775 / 9866305145, E-mail : ramakrishna.k@kcp.co.in
Registered Office : No. 2, Dr.P.V.Cherian Crescent, Egmore, CHENNAI - 600 008. Tel : 044 66772668, Fax: 044 66772620, CIN L65991TN1941PLC001128

చిరకాలం చెరగని ఆ చిరునవ్వు!

అది శీతాకాలం... ఎముకలు కొరికేచలి... దేశాధినేతను స్వాగతించడానికి ఉన్నతాధికారులు, సిబ్బంది బారులుతీరి నిలబడ్డారు. ఇంతలో దేశాధినేత రానే వచ్చారు. ఆయన వాహనంలో ఉన్న సామాన్లపెట్టెలను తీసుకువెళ్ళడానికి ఒక పరిచారకుడు ముందుకు వెళ్ళాడు. చలిలో గజగజ వణకుతూ వస్తున్న ఆ పరిచారకుణ్ణి చూసిన ఆ మహానేత 'ముందు నువ్వు ఉన్ని దుస్తులు వేసుకొనిరా!' అని అంటూ అతడికి ఉన్ని దుస్తులను ఇప్పించారు. ఆ పరిచారకుడు ఉన్ని దుస్తులు వేసుకొని వచ్చిన తరువాతే తన సామాన్ల పెట్టెలను తీసుకు వెళ్ళడానికి అనుమతించారాయన. అంతవరకూ బయట చలిగాలులు ఆ పరిచారకుడి శరీరాన్ని మాత్రమే వణికించాయి. కానీ ఒక దేశాధినేత ఓ సామాన్య పరిచారకుని పట్ల చూపించిన చల్లని ప్రేమాదరణ వీచికలు అతడి హృదయాన్నే కదిలించాయి.



"ఇతరుల కష్టాలను చూసి నీ హృదయం స్పందిస్తుందా? దీనులను చూసి నీ హృదయం ద్రవిస్తుందా? హృదయద్వారాలను తెరు, ఇతరుల కోసం స్పందించు" అన్న స్వామి వివేకానంద ప్రేరణ వచనాలకు సజీవ భాష్యంగా నిలచిన ఆ దేశాధినేత ఎవరు?... ఆయనే మన 'ప్రజల రాష్ట్రపతి'.

ఒకరోజు ఓ ఉద్యోగి వచ్చి తన అధికారితో 'సర్! ఈ రోజు సాయంత్రం పిల్లల్ని ప్రదర్శన శాలకు తీసుకువెళ్ళాలి. ఇంటికి కాస్త తొందరగా వెళ్ళడానికి అనుమతివ్వండి' అని కోరాడు. అందుకు ఆ అధికారి వెంటనే అంగీకరించారు. కానీ ఆ ఉద్యోగి పనిలో నిమగ్నమై ఆ విషయాన్ని మరచిపోయాడు. ఇంటికి వెళ్ళడం ఆలస్యమైంది. పిల్లలు గొడవ చేస్తారేమోనని బాధపడుతూ ఇంట్లో అడుగుపెట్టాడు. భార్య ఎదురొచ్చింది. 'పిల్లలేరి?' అని అడిగాడు. 'సాయంత్రం మీ అధికారి వచ్చి పిల్లల్ని ప్రదర్శనశాలకు తీసుకువెళ్ళారు' అని ఆమె చెప్పింది. భార్య మాటలు విన్న అతడు విస్తుపోయాడు. అధికారి సహృదయానికి మనస్సులో కృతజ్ఞతలు తెలిపాడు.

'మనం సంతోషంగా ఉండడానికి సులభమైన మార్గం, ఇతరులను సంతోషపరచడమే!' అన్న స్వామి వివేకానంద సూచనను అక్షరాలా ఆచరించిన ఆ అమృతమూర్తి ఎవరు?... ఆయనే మన 'క్షిపణి పితామహుడు'.

ఓ మహోపాధ్యాయుని వాహనం కొండకోనల నడుమ పయనిస్తోంది. ఆ వాహనం ముందు రక్షకభటుల వాహనం వెళుతోంది. అందులో ఒక సైనికుడు నిలబడి ఉన్నాడు. గంటల తరబడి అతడు అలా నిలబడి ఉండడం చూసిన ఆచార్యుని మనస్సు కలవరపడింది. ఆ సైనికుణ్ణి కూర్చోమని చెప్పడానికి చేసే ప్రయత్నాలు సఫలం కాలేదు. గమ్యస్థానం చేరిన వెంటనే ఆ సైనికుణ్ణి పిలిపించి అతడితో 'నా వల్ల మీరు చాలాసేపు నిలబడాల్సి వచ్చింది. మీరు బాగా అలసిపోయి ఉంటారు. భోజనం చేసి, విశ్రాంతి తీసుకోండి' అని ఆర్ద్రంగా అన్నారు ఆచార్యుడు. ఆ ఆత్మీయ వచనాల జల్లులో తడిసిన యువ సైనికుని మనస్సు సేదతీరింది, అలసటంతా మటుమాయమైపోయింది. వెంటనే అతడు 'మీ కోసం ఎన్ని గంటలైనా నిలబడతాను సార్!' అని స్పందించాడు.

ప్రేమాప్యాయతలతో పలికిన మాటలకు ఎంత శక్తి ఉంటుందో, ఇతరులను ఎంత ప్రభావితం చేస్తాయో చెబుతూ... 'ఎవరి జీవితం ప్రేమమయమో, ఎవరి జీవితం స్వార్థరహితమో అలాంటి వ్యక్తి పలికిన ప్రతి మాటా హృదయపులోతులను తాకుతుంది' అన్న స్వామి వివేకానంద శక్తిమంత్రాన్ని జీవితాంతం ఆచరించిన ఆ ఆచార్యుడెవరు?... అసమాన వ్యక్తిగా ఎదిగిన అతి సామాన్యుడు మన 'భారతరత్నం'.

మనం కూడా భారతరత్నాలమే...: అబ్దుల్ కలామ్ జీవితం నుండి ఉదహరించిన పై సంఘటనలన్నీ అత్యంత సాధారణమైనవే! మనమందరమూ చేయగలిగినవే! మన జీవితంలో కూడా ప్రతిరోజూ ఇలాంటి సందర్భాలెన్నో చోటుచేసుకుంటాయి. కానీ మహాత్ములకూ, మనకూ మధ్య తేడా ఆయా సందర్భాల్లో స్పందించే తీరే! నేటి సమాజంలో కుటుంబంలో గానీ, బయటగానీ ఒకరినొకరు పట్టించుకునే పరిస్థితులే లేవు. ఒకరితో ఒకరు మనస్సు విప్పి మాట్లాడుకునేందుకు సమయమే లేదు. జీవితంలో ఆస్తిపాస్తులు సంపాదించాలనే తపన, భోగభాగ్యాలతో సుఖంగా జీవించాలనే ఆరాటమే తప్ప మన వాళ్ళ కోసం, మన చుట్టూ ఉన్నవాళ్ళ కోసం ఆలోచించాలన్న భావనే కరవైపోతోంది.

ఒక వ్యక్తి మహామేధావి కావచ్చు; ఎన్నో మహత్కార్యాలు సాధించవచ్చు; ఎనలేని కీర్తి ప్రతిష్ఠలు ఆర్జించవచ్చు... ఈ అర్హతలను బట్టి అతడి వ్యక్తిత్వాన్ని నిర్ధరించగలమా?

మహావ్యక్తి అని తీర్మానించగలమా? అందుకు సమాధానంగా స్వామి వివేకానంద "ఒక వ్యక్తి వ్యక్తిత్వాన్ని తెలుసుకోవాలంటే అతడు సాధించిన అసాధారణ కార్యాలను చూడవద్దు. అతి సాధారణ విషయాలలో అతడు వ్యవహరించే తీరును గమనించు. అప్పుడు అతడి నిజమైన వ్యక్తిత్వం బయటపడుతుంది" అని అంటారు.

సాధారణ విషయాలలో వ్యవహరించే తీరే మన వ్యక్తిత్వాన్ని తెలుపుతుందన్న స్వామీజీ నిర్వచనానికి అద్భుతరూపంగా నిలచిన భారతరత్నం అబ్దుల్ కలామ్. మన 'భారతరత్నం' మెచ్చేలా జీవించాలంటే మనం చేసే కార్యకలాపాలలో ఋజువర్తనం, క్రమశిక్షణ, నిజాయతీ, అంకితభావం కనబరిస్తేచాలు; సాటి మానవులతో వ్యవహరించినప్పుడు మానవత్వాన్ని ప్రదర్శిస్తేచాలు. అప్పుడు మనం కూడా భారతమాత ముద్దు బిడ్డలమే! భారతరత్నాలమే!

పులకించిన భారతావని...: నేడు యావత్ భారతజాతీ కలామ్‌ను మహనీయునిగా, మహోన్నతునిగా, మహామనీషిగా కీర్తిస్తూ నీరాజనాలర్పిస్తుందంటే అందుకు కారణం... ఆయన దేశ అత్యున్నత పదవిని అధిరోహించారనా? భారతసైన్యం అమ్ములపొదిలో అస్త్రాలను అమర్చి 'క్షిపణి పితామహుని'గా పేరుగాంచారనా? శస్త్ర, శాస్త్ర, సాంకేతిక రంగాలలో పరిశోధనలు చేసి 'భారతరత్నం'గా వెలుగొందారనా? భారత యువతకు దిశానిర్దేశం చేసి 'మహాచార్యుని'గా ఎనలేని కీర్తిని ఆర్జించారనా? ఈ ప్రశ్నలకు సమాధానం స్వామి వివేకానంద మాటల్లోనే...

"ఒక వ్యక్తిని మహోన్నత స్థితికి చేర్చగలిగేది హృదయమే! మేధస్సు కాదు! ఎందుకంటే, హృదయం ద్వారా భగవంతుడు మాట్లాడతాడు. బుద్ధి ద్వారా మనిషి మాట్లాడతాడు. అందువల్ల ముందు విశాల హృదయాన్ని అలవరచుకోండి".

అబ్దుల్ కలామ్ మహోన్నత వ్యక్తిత్వం సకల భారతావనినీ పులకింపజేసిందంటే, సమస్త భారతజాతినీ ఆకర్షించిందంటే అందుకు కారణం... ఆయన స్వచ్ఛమైన హృదయక్షేత్రంలో విరబూసిన నిరాడంబరత, వినమ్రత, నిస్వార్థత, నిజాయతీ, ఋజువర్తనం, మృదుభాషణం, సేవాభావం... అనే విలువల కుసుమాల సుగంధ పరిమళాలే!

కలకాలం కలామ్ చిరునవ్వు...: నాడు 'లేవండి! మేల్కొండి! గమ్యం చేరేవరకూ ఆగకండి' అంటూ తన సింహగర్జనతో నిద్రాణమై ఉన్న భారతజాతిని మేల్కొల్పారు యుగనాయక వివేకానంద. అదే భావనతో నేడు 'కలల సాకారానికి నిద్రపోనివ్వకుండా చేసేదే కల' అంటూ యువతరాన్ని నిద్రపోనివ్వకుండా చేసారు కలల కలామ్.

ఒకరు నిద్రమత్తులో ఉన్న భారతజాతిని మేల్కొలిపితే, ఇంకొకరు కలల సాకారానికి నిద్రపోకుండా శ్రమించాలని నిర్దేశించారు. స్వామి వివేకానంద బాటలో పయనించి దేశపురోగతి కోసం, యువత ప్రగతి కోసం తపించిన కలామ్ మోముపై చిరునవ్వు కలకాలం ఉండాలంటే మనం ఏం చేయాలి?

మన కోసం కలలు కన్న కలామ్ ఇక లేరని తెలిసిన మరుక్షణమే దేశప్రజలు కలామ్ స్మృతులను స్మరించుకుంటూ తమ అభిమానాన్నీ, ఆరాధనాభావాన్నీ చాటుకున్నారు. కానీ ఇప్పుడు మనం చేయాల్సింది వ్యక్తిని ఆరాధించడం కన్నా వ్యక్తిత్వాన్ని ఆదర్శంగా తీసుకొని మన జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడానికి ప్రాధాన్యమివ్వాలి.

నేటితరం తల్లితండ్రుల పట్ల ఆరాధనాభావాన్నీ; గురువుల పట్ల కృతజ్ఞతాభావాన్నీ; దేశం పట్ల భక్తిభావాన్నీ పెంపొందించుకోవాలన్న ఆయన సూచనలను ఆచరణలో చూపించాలి. 'ఈ భువిపై నా చివరిరోజు ముగిసిన వెంటనే నిన్ను చేరుకుంటానమ్మా' అన్న ఆయన మాటలే అమ్మ పట్ల ఆయనకున్న అనురాగానికి నిదర్శనం. అలాగే, ఉపాధ్యాయులు, ఆచార్యుల పట్ల జీవితాంతం కృతజ్ఞతా భావంతో మెలిగేవారు. దేశాభివృద్ధి కోసం, దీనజనుల ఉద్ధరణ

కోసం తపించారు. విద్య, వైద్య, సమాచార, సాంకేతిక, వ్యవసాయ, రక్షణ, అంతరిక్ష, అణుశక్తి రంగాలలో దేశాన్ని అగ్రగామిగా నిలపాలని ఆరాటపడ్డారు.

యువతలో ప్రతికూలభావాలు అధికమవుతున్నాయనీ; ఆత్మన్యూనతాభావం పెరిగిపోతుందనీ; మనోనిగ్రహంలేక దురలవాట్లకు బానిసైపోతుందనీ ఆవేదన చెందారు. యువత ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని సాధించడానికి శ్రమించాలని సూచించారు. అందం ఉండేది మోహంలో కాదని, హృదయంలోనేనని అందుకు హృదయసౌందర్యాన్ని పెంచే విలువలను పెంపొందించుకోవాలని నిర్దేశించారు... ఇలా నేటియువతకు స్ఫూర్తి సందేశాన్నిచ్చారు, ప్రగతి బాటను చూపించారు.

ఆ మహనీయుని మోముపై చిరునవ్వు కలకాలం నిలవాలంటే, మనం ఆయన చూపిన బాటలో నడవాలి, ఆయన వ్యక్తిత్వాన్ని ఆదర్శంగా తీసుకొని ఉన్నతంగా ఎదగాలి. వ్యక్తిఉన్నతి, దేశప్రగతి సాధించినప్పుడే కలామ్ కలలు సాకారం చేసినవారమవుతాం. అందుకు వట్టి మాటలు కట్టి పెట్టి, గట్టి మేలు తలపెట్టాలి! ❖

సర్వజీవులయందూ బుద్ధిరూపంగా ప్రతిష్ఠితమై ఉన్న దేవికి మాటిమాటికీ నమస్కారములు. - దేవీ మాహాత్మ్యం

గోరుముద్ద - స్వామి సుప్రియానంద

మరో ప్రపంచం

ఈ ప్రపంచంలో కలతలు, కలహాల మధ్య సతమతమవుతూ, ఈ బాధలు పడలేక మనిషి ఎప్పుడూ ఆనందంతో నిండిన 'మరో ప్రపంచం' సృష్టించాలనుకుంటాడు. అది సాధ్యమా? మారాల్సింది మనిషా? లేక ప్రపంచమా? దేశాల మధ్య ప్రహరీగోడలు కట్టుకుంటున్న ఈ రోజుల్లో మనిషి స్వార్థానికి, అత్యాశలకు అంతులేకుండా పోయింది. కొనితెచ్చుకున్న కష్టాలకు ఎవరు బాధ్యులు? ప్రపంచాన్ని ద్వేషిస్తూ, ప్రపంచ శాంతిని తమ స్వార్థానికి బలి పెడుతున్నారు కొందరు. ప్రపంచ పరిస్థితులను సహనంతో ఎదుర్కోడానికి బదులుగా విధ్వంసానికి పాల్పడుతున్నారు మరికొందరు.

స్వార్థరాహిత్యం కష్టాలకు దారితీయదు. పైపెచ్చు కష్టాన్ని ఆనందంగా ఎదుర్కొనే శక్తినిస్తుంది. స్వామి వివేకానంద మాటల్లో:

"శిశువును ప్రసవించే సమయంలో తల్లిపడే యాతన ఎలాంటిదో ఊహించండి. అప్పుడు ఆమె ఆనందిస్తుందా? తప్పక ఆనందం పొందుతుంది. ఉపవాసాలు ఉండి, ప్రార్థనలు సలిపి, ముహూర్తానికై ఆమె ఎదురుచూస్తుంది. ఆ ముహూర్తంపట్ల ఆమెకున్న మక్కువ సర్వోత్కృష్టమైనది. ఎందుకు? మాతృప్రేమలో స్వార్థం లేకపోవడమే అందుకు కారణం.

ఆనందం వద్దని ఎవరంటారు? యాతన వస్తుంది. దాన్నీ ఆహ్వానించు. దోమ ఒకటి ఒక ఎద్దుకొమ్ము మీద వాలింది. పాపం ఆ దోమ అంతరాత్మ దాన్ని బాధించింది. వృషభాన్ని ఉద్దేశించి అది ఇలా అంది: 'ఓ వృషభమా! చాలా సేపటి నుండి నీ కొమ్ము మీద వాలి ఉన్నాను. బహుశ నీకు చాలా శ్రమ కలిగి ఉంటుంది. ఇందుకు ఎంతో విచారిస్తున్నాను, ఇక పోతాను'.

అందుకు ఎద్దు ఇలా బదులిచ్చింది: 'అబ్బే! అలా అనుకోవద్దు. నాకేమీ బాధ కలుగలేదు. నీ యావత్తు కుటుంబాన్ని తీసుకొచ్చి నా కొమ్ము మీద కాపురముండు. నీ వల్లగానీ, నీ కుటుంబంవల్లగానీ నాకు ఎలాంటి కష్టం కలుగబోదు'.

యాతనను గురించి మనం ఇలా ఎందుకు చెప్పలేకున్నాం. సాహసోపేతులమై ఉండడం అంటే 'తల్లి' పట్ల ప్రగాఢ విశ్వాసం కలిగివుండడమే."

స్వామి వివేకానంద బోధనలోని సారాన్ని గ్రహించి నిస్వార్థానికి ప్రతిరూపమైన జగజ్జననిపై భక్తి విశ్వాసాలను పెంచుకొని, ధైర్యంగా ఈ ప్రపంచాన్ని ఎదుర్కొందాం, ఆనందాన్ని పంచుకుందాం. ❖

పండుగలు-పర్వదినాలు

అక్టోబర్ - 2015

06	మంగళవారం	స్వామి అభేదానంద జయంతి
08	గురువారం	ఏకాదశి
12	సోమవారం	స్వామి అఖండానంద జయంతి
21	బుధవారం	మహా అష్టమి
22	గురువారం	విజయదశమి
23	శుక్రవారం	ఏకాదశి
27	మంగళవారం	లక్ష్మీపూజ

నవంబర్ - 2015

07	శనివారం	ఏకాదశి
10	మంగళవారం	కాళీపూజ
11	బుధవారం	దీపావళి
22	ఆదివారం	ఏకాదశి
23	సోమవారం	స్వామి సుబోధానంద జయంతి
25	బుధవారం	స్వామి విజ్ఞానానంద జయంతి

నిద్రనే నిద్రపుచ్చు

- బ్రహ్మచారి శ్యామ్



సార్‌గాచి ఆశ్రమంలో సంధ్యాహారతి అనంతరం ఆశ్రమవాసులూ, భక్తులూ స్వామి అఖండానంద మహరాజ్‌కి ప్రణామం చేసుకోవడానికి వెళ్ళేవారు. వారి పెదవుల నుండి జాలువారే హిమాలయ పర్యటన అనుభవాలను వినడానికి వారి పాదాలమ్రోల వాలిపోయేవారు. అఖండానంద మహరాజ్‌కు కూడా సాహసంతో కూడిన ఆ అద్భుత విహారానికి సంబంధించిన జ్ఞాపకాలు భక్తులతో పంచుకోవడం వాడుక, వేడుక. వారు తమ అనుభవాలను భక్తులతో ఈ విధంగా ముచ్చటించారు:

ఒకసారి నేను హిమాలయాల్లోని ఒక కొండ శిఖరంపైన ఉన్న నిర్జన ప్రదేశంలో ఒక పూరి గుడిసెను చూశాను. పక్కన ఉన్న కొండలపై నుండి కిందికి ప్రవహించే జలపాతాలు యోగసాధనకు స్ఫూర్తిదాయకంగా అనిపించాయి. నేను ఆ ప్రదేశాన్ని ఆవాసంగా చేసుకొని సాధనకు సంకల్పించాను. కానీ అక్కడున్న గొర్రెలకాపరులు 'స్వామీ! ఈ ప్రదేశం నుండి నీరు కావాలంటే ఎంతో కిందికి దిగి వెళ్ళాలి. అదీగాక ఇది క్రూరమృగాలు సంచరించే స్థలం' అంటూ వారించారు.

గొర్రెలకాపరులు నన్ను తమ గ్రామానికి తీసుకువెళ్ళారు. వారి గ్రామంలో నాకు ఒక గదిని ఏర్పాటు చేసి చలిమంట కూడా వేసారు. భగభగమండే ఆ మంటలు నాలో వైరాగ్యాగ్నిని ప్రజ్వలింపజేశాయి. అప్పుడు ఆ గొర్రెలకాపరుల మాటలు విని, భగవంతునిపై విశ్వాసాన్ని కోల్పోయినందుకు సిగ్గుపడ్డాను. వెంటనే తిరిగి ఆ కొండ మీద గుడిసెలోకి వెళ్ళిపోయాను. ఆ రాత్రంతా నిద్రను త్యజించి, అక్కడే ప్రగాఢ ధ్యానంలో మునిగిపోయాను. క్రూరమృగాల నుండిగానీ, ఇంకెలాంటి ఆపదగానీ సంభవించలేదు. జరగకూడనిది ఏదీ జరగలేదు.

స్వామి బ్రహ్మానంద మహరాజ్ ఇలా అనేవారు: "యోగి రోజుకు నాలుగు గంటలు మాత్రమే నిద్రిస్తాడు. భోగి ఆరు గంటలు లేదా అంతకంటే ఎక్కువగా నిద్రిస్తాడు. మీరందరూ యోగులు. ఎలా నిద్రించగలరు? భగవంతుణ్ణి అభిలషించేవారు ఆయన్ని సాక్షాత్కరించుకోకుండా విశ్రమించరు. వారు తరచూ 'నేను ఇంకా భగవంతుణ్ణి దర్శించుకోలేదే' అని వ్యాకులత చెందుతారు. వారికి భగవత్ప్రసంగాలు తప్ప మరేవీ రుచించవు".

మీరు అనంతమైనదాన్ని పొందడానికి వచ్చారు. గడియారం వంక ఎందుకు చూడాలి? గడియారం ఎప్పుడు కూడా పరిమితమైనది, సాపేక్షమైనదానినే సూచిస్తుంది. భగవంతుని అనంతత్వాన్ని ఊహించాలంటే ఈ కాలపరిమితిని దాటి వెళ్ళాలి. నిమిషాలు, గంటలు, రోజులు ఈ విధంగా మీరు లెక్కలు కట్టే బుద్ధిని అలవరచుకుంటే ఆ భగవంతుని అనంతత్వాన్ని ఎన్నడూ అనుభూతం చేసుకోలేరు. లెక్కలు కట్టినంతసేపు దేశకాలాదులు ఉండనే ఉంటాయి. ఇదే మాయ యొక్క ఆవరణం. సత్యం అనేది ఈ పరిధులన్నింటిని అతిక్రమించి ఉన్నది. 'ఇప్పుడు సమయం రాత్రి పది గంటలు అయింది. ఇది నిద్రించే సమయం' అని మాకు ఎప్పుడూ అనిపించలేదు.

భగవంతుని నామాన్ని జపించడానికి నిర్దుష్టమైన సమయం, ప్రత్యేకమైన స్థలం కావాలా? గడియారాల ద్వారా కాలాన్ని లెక్కించడం వ్యర్థం. అవి ఒక రకమైన అవాంతరాలు. సూర్యుని వల్లనే మనకు కాలాన్ని గురించిన అవగాహన వస్తుంది. సూర్యుడు కూడా లేని ఒకానొక స్థితిని ఊహించడం తీవ్ర జపధ్యానాదుల వల్లనే సాధ్యం.

నిద్ర అనేది మనిషిని తన నిజ స్వభావాన్ని మరచేలా చేస్తుంది. నిజమైన సాధకులుగా మారాలంటే నిద్రను తప్పక జయించితీరాలి. శ్రీరామకృష్ణ గురుదేవులను ఇలా ప్రార్థించండి: 'ఓ దేవా! నా నిద్రించే సమయాన్ని తగ్గించు. తద్వారా ఎక్కువ సమయం నీ ఆలోచనలతో గడుపుతాను'.

గురుదేవులు కూడా రాత్రులందు జాగరణ చేస్తూ కాళీమాతను ప్రార్థించేవారు. ఆయన ఎప్పుడూ మెలకువగా ఉండి భగవద్ధ్యానంలో లయించిపోయేవారు. భగవంతునితో మమేకమై ఉండేవారు. నిద్రించేవారు కాదు. వారు మాత్రమే కాదు, వారి వద్దకు వెళ్ళేవారు కూడా 'నిద్రనే నిద్రపుచ్చారు'. ❖

(తిథి ప్రకారం అక్టోబర్ 12వ తేదీన శ్రీరామకృష్ణ పరమహంస సన్న్యాస శిష్యులైన స్వామి అఖండానంద మహరాజ్ జయంతి)

సర్వజీవులయందూ శక్తిరూపంగా ప్రతిష్ఠితమై ఉన్న దేవికి మాటిమాటికీ నమస్కారములు. - దేవీ మాహాత్మ్యం

ప్రకాశకుడు పరమాత్ముడే!

– స్వామి జ్ఞానదానంద

కలియుగంలో కైవల్యప్రాప్తికి భక్తిమార్గమే సర్వోత్కృష్ట సాధనాపథమని జ్ఞానవరిష్ఠుడైన శుకమహర్షి పరీక్షిత్తుకు పునరుద్ఘాటించాడు. శుకుని ఈ శ్రవణోపేయమైన పలుకులు విని ఆ పాండవపౌత్రుడి హృదయకమలం వికసించింది. మరణిస్తానన్న భీతిని విడిచి, వాసుదేవుని లీలా విశేషాలను ఆసాంతం ఆకర్ణించాలన్న ఆకాంక్షను ఆ వ్యాసపుత్రుడి

ముందుంచాడు. 'ఏకమూర్తియైన పరమాత్ముడు అనేక మూర్తులను ధరించి, అనేక విధాల ఎందుకు ప్రవర్తిస్తాడు? అసలు అన్ని అవతారాలను ధరించాల్సిన అవసరం ఆ అంతర్యామికి ఎందుకు కలిగింది?' అని ప్రశ్నించాడు. పరీక్షిత్తు ప్రశ్నకు ఆ విజ్ఞానమూర్తి వికసిత వదనుడై, పూర్వం ఇదే ప్రశ్నను నారద మహర్షి కూడా తండ్రియైన చతుర్ముఖ బ్రహ్మను అడిగాడని గుర్తుచేశాడు. దానికి సమాధానంగా బ్రహ్మదేవుడు తన మానసపుత్రుడికి నారాయణుడి విశేషాలన్నీ వివరించాడంటూ, శుకుడు ఆ ఇద్దరి సంభాషణను శాబ్దిక ప్రత్యక్ష ప్రసారం చేస్తూ ఉన్నాడు.

ఒకనాడు త్రిలోక సంచారి నారదుడు త్రిమూర్తులలో ఒకడైన బ్రహ్మను సమీపించి, 'తండ్రీ! నీవు దేవతలలో జ్యేష్ఠుడివి. లోకాలకు సృష్టికర్తవి. ఈ వేదరాశులన్నీ నీ ముఖపద్మాలలోనే ప్రకాశిస్తున్నాయి. శబ్దార్థమయమైన ఈ విశ్వమంతా నీకు తేటతెల్లమే! అసలు నీకు ఈ సృష్టి నిర్మాణ విజ్ఞానం ఎలా సంప్రాప్తించింది? నా దృష్టిలో నీవే ప్రభువువి! నిన్ను మించిన వారు కాని, నీతో సమానమైన వారు కాని ఎవరూ లేరు!' అని శ్లాఘిస్తూ ఉన్నాడు. అప్పుడు ఆ బ్రహ్మదేవుడు మందహాసంతో, నాయనా నారదా! ఇదంతా నా ప్రజ్ఞ కాదు. నేను అల్పుడిని! పరమేశ్వరుడి ఆనతి లేకపోతే ఈ లోకాలు నిర్మించే శక్తి నా కెక్కడిది? అంటూ...

అనఘా!విశ్వము నెల్ల దీప్తముగ చేయన్ నే సమర్థుండనే?
యినచంద్రానల తారకాగ్రహగణం బే రీతి నా రీతి నె
వ్వని దీప్తిం ప్రతిదీప్త మయ్యె భువనవ్రాతంబు దద్దీప్తిచే
ననుదీప్తం బగునట్టి యీశ్వరున కే నశ్రాంతమున్ మ్రొక్కెదన్

–'పాపరహితుడా! ఈ ప్రపంచాన్నంతటినీ ప్రకాశింపచేసే సామర్థ్యం నాకు లేదు. ఎవరి ప్రకాశం వల్ల సూర్యుడూ, చంద్రుడూ, అగ్నీ, నక్షత్రాలూ, గ్రహాలూ లాగానే ఈ లోకాలన్నీ సముజ్జ్వలంగా ప్రకాశిస్తున్నాయో, ఆ దివ్యదీప్తితో తేజరిల్లుతున్న పరమేశ్వరునికి నేనెల్ల వేళలా ప్రణమిల్లుతున్నా'నని వినయంతో తలవంచాడు. ఇలా ఏ కొద్ది మంది పుణ్యమూర్తులో తప్ప భగవంతుడి విశ్వవ్యాపకత్వాన్ని అర్థం చేసుకోలేరు. భీష్మాచార్యులు కూడా అంతిమఘడియల్లో శ్రీమహావిష్ణువుని సహస్రనామాలతో స్తుతిస్తూ 'విశ్వమూర్తిర్మహామూర్తిః దీప్తమూర్తి రమూర్తిమాన్...' అని కొనియాడతారు.

అనంతరం ఆ విధాత నారదమునికి విశ్వాత్మకుడైన భగవంతుడి మాయావిశేషాలను వివరించాడు. మాయ ఈశ్వరుని దృష్టిపథంలో ప్రవేశించడానికి శంకించి సిగ్గుతో కుంచించుకుపోతుందని విస్పష్టం చేస్తూ, మాయాతీతుడైన మాధవుడి మాహాత్మ్యాన్ని వర్ణిస్తూ....

వినుమీ యీశ్వరు దృష్టిమార్గమున నావేశింప శంకించి సి
గ్గున సంకోచము నొందు మాయవలనం కుంఠీభవత్ప్రజ్ఞచే
నను లోకేశ్వరుడంచు మ్రొక్కు మతిహీన వ్రాతము జూచి నే
ననిశంబున్ నగి ధిక్కరింతు హరిమాయాకృత్య మంచున్ సుతా!

'ఈ మాయవల్ల తమ ప్రజ్ఞ కుంఠితం కాగా బుద్ధిలేని వాళ్ళు నన్నే లోకవిభుడని భావించి నాకు నమస్కరిస్తుంటారు. కుమారా! అలాంటి మూర్ఖులను చూసి ఇది శ్రీహరి మాయ వల్ల జరిగే పనే కదా! అని నాలో నేను నవ్వుకొని వాళ్ళని తోసిపుచ్చుతాను' అన్నాడు ఆ వాగ్దేవి విభుడు!

అంతా ఆయన కృత్యమే! : ఆ విధాత వినయసంపన్నుడు కనుక, విశ్వసృష్టి వెనుక ప్రకాశమంతా ఆ పరమాత్మదేనని ప్రస్ఫుటం చేస్తున్నాడు. పరమవినమ్రతతో, ప్రశంసలకు తాను అర్హుడను కానని తోసిపుచ్చాడు. కానీ మనం, మనలోని శక్తిసామర్థ్యాలను, ప్రజ్ఞావిశేషాలను ఎవరైనా కీర్తిస్తూ, ఆకాశానికెత్తేస్తుంటే అంతా మన ప్రజ్ఞేననుకొంటాం.

మన విజయాలకు కర్త, కర్మ, క్రియ మనమే అన్నంత అహంభావంతో, మన వెనుక ఒకడున్నాడన్న సత్యాన్నే మరచిపోతాం. ఇలా అంతా మన ఘనత అనుకోవడం దగ్గర నుంచే మన పతనం ప్రారంభమవుతుంది. ఉదాహరణకు శివమహిమ్న స్తోత్రాన్ని రాసిన పుష్పదంతుడికి కూడా ఓసారి, ఆ విషయమై అహంకారం కలిగింది. 'నేను రచించడం వల్లే కదా! ఇంత అద్భుతమైన స్తోత్రాలు పరమశివుడి ముందు పాడుకుంటున్నారు' అనుకున్నాడు.

అప్పుడు ఒక్కసారిగా శివుడి ముందున్న నంది తన దంతాలను బయటకు చూపింది. పుష్పదంతుడు ఆ దంతాలలో ఒక్కొక్క దంతాన్ని ఒక్కొక్క మంత్రరాజంగా దర్శించాడు. తను రాశానని గర్వపడుతున్న మంత్రాలన్నీ అనాదికాలంగా ఉన్నవే; తాను ప్రస్తుతం చేసింది, వాటిని ఆవిష్కరించడమేనని పుష్పదంతుడికి అర్థమైంది. అప్పుడు అతడి అహంభావం పటాపంచలైంది. ఇలా ఈ చరాచర సృష్టిలో ఏ జీవి ప్రతిభ అయినా పరోక్షంగా పరమాత్మ ప్రమేయం లేకుండా ప్రకాశించే ప్రసక్తే లేదు. అయితే అవివేకులు, అజ్ఞానులే విశేషమంతా తమదేనని విర్రవీగుతూ ఉంటారు. అందుకే "ఏదైనా గొప్ప కార్యాన్ని నువ్వే చేశావని భావిస్తే ఇతరుల నుంచి కించిత్తు స్పందనే వస్తుంది. కానీ భగవంతుడు నీ మూలంగా చేయిస్తున్నాడని భావిస్తే వాటికి ఎంతో ఆదరణ లభిస్తుంది" అనేవారు శ్రీరామకృష్ణులు.

నాయకుడీ భువనములకు...: నారదమహర్షిని సాక్షిగా చేసుకొని బ్రహ్మదేవుడు సమస్త ప్రపంచానికి ఆ శ్రీమహావిష్ణువు వైభవాన్ని విపులంగా వివరిస్తూ...

ఆ యీశు డనంతుడు హరి,
నాయకు డీ భువనములకు నాకున్ నీకున్
మాయకు ప్రాణివ్రాతము
కీ యెడలన్ లేద యీశ్వరేతరము సుతా!

ఆ పరమేశ్వరుడు తుది లేనివాడని, ఆ శ్రీహరి ఈ లోకాలకూ, నాకూ, నీకూ, మాయకూ, ప్రాణిసముదాయానికీ ప్రభువని, ఆయన కంటే అన్యమైనది ఏదీ ఈ జగత్తులో లేనేలేదని ఘంటాపథంగా చెబుతున్నాడు.

సత్యం తెలిసిన వారెవరైనా ప్రతిభ మీదే, అనగానే పొంగిపోరు. పరోక్ష ప్రేరకులను ప్రస్తావించకుండా ఉండలేరు. ఉదాహరణకు సీతాన్వేషణలో విశేషపాత్రను పోషించి, ఆంజనేయుడు విజయకేతనంతో కిష్కింధలో అడుగుపెడతాడు. అనితర సాధ్యమైన ఈ అన్వేషణ నీవల్లే సుసాధ్యమైందని వానరవీరులంతా విజయగీతాలు పాడుతూ ఉంటారు. అప్పుడు ఆ మారుతి మనస్సులో నవ్వుకుంటూ, 'దీనిలో నా శక్తిసామర్థ్యాలు ఏమీ లేవు, 'రాఘవస్య ప్రభావేణ....!' అని అభినందనలను సున్నితంగా తిరస్కరిస్తాడు. మనందరి నాయకుడైన శ్రీరామచంద్రుడి ప్రభావం చేతనే నేను సీతాన్వేషణలో కృతకృత్యుడనయ్యానని, ఆ రఘువీరుడి పాదాలకు ప్రణమిల్లుతాడు.

అదే విధంగా విదేశాలలో విశ్వనాయకుడిగా నీరాజనాలందుకొని వచ్చిన స్వామి వివేకానందకు ప్రజానీకం బ్రహ్మరథం పట్టింది. అప్పుడు స్వామీజీ కూడా అమితమైన అణకువతో 'ఇదంతా నా విశేషమేమీ కాదు. నా గురుదేవులు తలచుకుంటే, పిడికెడు మట్టిలోంచి వేలమంది వివేకానందలను తయారు చేయగలరు. ప్రపంచంలో ఎక్కడైనా నేను సత్యప్రదీప్తమైన మాట ఒక్కటైనా పలికి ఉంటే, ఆధ్యాత్మిక భావసందీప్తమైన శబ్దాన్ని ఒక్కదాన్నైనా ఉచ్చరించి ఉంటే అది నా గురుదేవులు భగవాన్ శ్రీరామకృష్ణులదే!' అన్నారు. ఏ స్థాయికి చేరుకున్నా, ఎంతటి ఘనకార్యాలు సాధించినా, మనం పరమాత్మ చేతిలో పరికరాలమన్న విషయాన్ని మాత్రం మరచిపోకూడదు. అప్పుడే భగవంతుడు మనల్ని తన మహత్కార్యాలకు సాధనంగా ప్రయోగించుకుంటాడు.

తానె మూలమై...: నారదుడి సంశయాలను నివృత్తి చేస్తూ, 'ఆ దేవదేవుడి ఆనతిని అనుసరించే నేను చరాచర ప్రాణులను విస్తారంగా సృష్టిస్తున్నాను. మరలా ఆ మహావిష్ణువు, ప్రభావసంపన్నుడై ఈ సృష్టిని పోషిస్తున్నాడు. తుదకు ఆ పరమేశ్వరుడు దీనిని లయింపచేస్తున్నాడు' అని సృష్టి స్థితి లయల క్రమాన్ని బ్రహ్మదేవుడు వివరించాడు.

హరి భగవంతు డనంతుడు
కరుణాంబుధి సృష్టికార్యకారణ హేతు
స్ఫురణుం డవ్విభుని కంటెం
పరుడెవ్వడు లేడు తండ్రీ! పరికింపగన్!

'ఈ మూడుశక్తులకూ మూలం మాత్రం మరలా శాశ్వతుడైన ఆ లక్ష్మీనాథుడేనని, ఆయన కంటే గొప్పవారు ఎవరూ లేర'ని ప్రస్తుతించాడు.

మనం సాధించే మహత్తర కార్యాలన్నింటికీ మూలాధారం ఆ భగవంతుడే! పరమాత్మ పరోక్ష పూనిక లేకుండా, మన ప్రజ్ఞ ప్రకాశించే ప్రసక్తే లేదు. మన విజ్ఞానమూ, వైభవమూ అన్నీ ఆయన పెట్టిన భిక్షే. అందుకే సర్వజ్ఞుడైన వాడు ఈ సత్యాన్ని విస్మరించకుండా, విజయంలోనూ వినమ్రంగా మసలుకుంటాడు. 'నా శక్తిసామర్థ్యాలకు, సాధించిన విజయాలకు నేనే కర్తను!' అనుకునే అవివేకి మాత్రం మిడిసిపాటుతో కన్నూమిన్నూ కానకుండా ప్రవర్తిస్తాడు.

ఆనాటి సృష్టికర్త నుంచి నేటి శాస్త్రసాంకేతిక వేత్తల వరకు ఆ ఆధారభూతమైన భగవంతుడి శక్తిసంపత్తులకు దాసోహమే అవుతున్నారు. ఆ శక్తిని కాదని స్వతంత్రులమనుకుంటూ ఎవరూ అహంకరించరు. ఉదాహరణకు ఆధునిక విజ్ఞానశాస్త్రాన్ని అత్యంత ప్రభావితం చేసిన మేధావి ఐన్‌స్టీన్ అంతటివాడు కూడా మనిషి మేధకు అందని విశ్వాధారమైన శక్తి ఒకటుందని నిర్ధరించుకున్నాడు. ఆ విశ్వశక్తికి తలవంచి నమస్కరించాడు. ❖

సర్వజీవులయందూ సహనరూపంగా ప్రతిష్ఠితమై ఉన్న దేవికి మాటిమాటికీ నమస్కారములు. - దేవీ మాహాత్మ్యం

మన సంస్కృతి

- స్వామి హర్షానంద

"ఒక వ్యక్తి తనను తాను అసహ్యించుకొంటున్నట్లయితే అదే పతనానికి హేతువు. పూర్వీకుల చరిత్రను అవమాన కరంగా భావిస్తే, ఆ జాతి అంతానికి చేరుకున్నట్లే!" అంటారు స్వామి వివేకానంద. గత వైభవాన్ని మర్చిపోయినంత కాలం మనమూ, మన దేశం స్తబ్దతలో మునిగిపోతాం. అందుకే, మన ప్రాచీన సంస్కృతి గురించి తెలుసుకోవాలి. గడచిపోయిన సంగతులు తెలుసుకొంటూ, భవిష్యత్ మహత్కార్యాల సాధన వైపు నడవాలి. మన ప్రాచీన భారతీయ సంస్కృతిని గుర్తు చేసేందుకు చేస్తున్న ప్రయత్నమే ఈ వ్యాసాల పరంపర. సుప్రసిద్ధ రచయిత, బెంగుళూరు రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి హర్షానంద మహరాజ్ మధ్యయుగాల కాలం దాకా విలసిల్లిన మన సంస్కృతిని 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు 2014 ఫిబ్రవరి సంచిక నుండి వివరిస్తున్నారు.

విదేశాలలో భారతీయ సంస్కృతి

ఫిలిప్పైన్స్ : భారతీయ సంస్కృతి మలయా, బోర్నియా, ఇండోనేషియా తీర ప్రాంతము నుండి క్రీ.పూ. 200 నుండి క్రీ.శ. 300 సంవత్సరములలో ఫిలిప్పైన్స్‌లో ప్రవేశించింది. ఫిలిప్పినో భాషపై సంస్కృత ప్రభావము కనిపిస్తుంది. ఇది మలయా వారి భాష మీద సంస్కృత ప్రభావాన్ని తెలియజేసే శ్రీ విజయ వంశపు రాజుల శాసనాల ద్వారా తెలియబడుతున్నది. పురావస్తు నిర్మాణాలు భారతీయ ప్రభావాన్ని తెలియజేస్తున్నాయి. మట్టితో చేసిన దక్షిణ లుజాన్‌లోని అవలోకితేశ్వర, పద్మపాణి హారము, సెబు నందు గల కంచు లోకేశ్వర విగ్రహము, బ్రూక్స్ పాయింట్‌లోని బంగారు గరుడహారము ఇందుకు నిదర్శనాలు (క్రీ.శ. 12-14 శతాబ్దాలు).

ఫిలిప్పైన్స్ చామ్ వర్ణక్రమము దక్షిణ భారతదేశపు పల్లవ శాసనాల లిపిలాగా ఉంటుంది. దక్షిణ ఫిలిప్పైన్స్‌లో నివసించే 'మోరోలు' హిందువులు. ఇచ్చటి స్త్రీల శిరోజాలంకరణ కేరళ స్త్రీల అలంకరణలాగా ఉంటుంది. బంగారు ఆభరణాలు కూడా హిందూ ప్రభావాన్ని తెలియజేస్తాయి.

రష్యాలో కనుగొనబడిన విష్ణువు విగ్రహం

సోవియట్ రష్యా : 1983 నవంబర్ 27న ఇండియన్ ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో మల్హాన్ అనే రచయిత ఒక ఆశ్చర్యకరమైన వ్యాసము ప్రచురించారు. అందులో హిందూ, బౌద్ధ అవశేషాలు రష్యాలో బయల్పడ్డట్లు చెప్పబడింది. ఉజ్బెకిస్తాన్, టెర్మెజ్‌లోని కరతెపె కొండలలో రష్యా పురావస్తు శాఖవారు ఒక పెద్ద బౌద్ధ గుహారామము కనుగొన్నారు. టెర్మెజ్‌ను సందర్శించిన యాత్రికుడు హ్యుయిత్సావో (క్రీ.శ.728) అచటి రాజు హాతోలా (హుతల్)కు బుద్ధుని మీద విశ్వాసము ఉండేదని తెలిపారు. టెర్మెజ్‌లో చాలా బౌద్ధారామాలు ఉండేవి. ఉజ్బెకిస్తాన్ సమర్‌ఖండ్‌లో బౌద్ధాలయములన్నింటినీ క్రీ.శ. 7వ శతాబ్దములో పునరుద్ధరించినట్లు ఒక గ్రంథము తెలియజేస్తుంది.

ఇచ్చటి త్రవ్వకాలలో గుహాలయాలు, మందిరాలు, స్తూపాలు, ఏకాంత ధ్యాన మందిరాలు బయల్పడ్డాయి. ఈ గుహాలయాలలో వివిధ దేవతల మరియు పురాణ గాథల చిత్రాలు చిత్రించబడేవి. అనేక శిలాశాసనాలు కరోష్ఠి, బ్రాహ్మీలిపిలో ఉన్నాయి. బుద్ధుని విగ్రహాలు, గోడమీద బొమ్మలు, అనేక సంస్కృత గ్రంథాలు, పట్టువస్త్రాలు, కాగితములు ఇక్కడ కనుగొనబడ్డాయి. కాస్పియన్ సముద్రము బాకు దగ్గర ఒక వైదిక అగ్నిహోత్రాలయము బయటపడింది. తజకిస్తాన్‌లో వేదకాలము నాటి ఒక శిలారథము, ఇతర విశేషాలు బయటపడ్డాయి.

రష్యన్‌భాష, లితువేనియన్ భాష సంస్కృతానికి దగ్గరగా ఉంటాయి. రష్యాలో ఒక భారతీయ అంతర్జాతీయ సంస్కృతి ప్రదర్శనశాల ఉన్నది. అందులో సంస్కృత ఆయుర్వేద గ్రంథములు, వైదిక దేవతల కంచు విగ్రహాలు ఉన్నాయి. విష్ణువు విగ్రహాలు, ఇత్తడి గొడ్డళ్ళు కొన్ని అలంకారమైన బొమ్మలు అడిగ్గె వైదిక సమాజానికి చెందినవిగా (వారు ఇప్పటికీ రష్యాలో ఉన్నారు) కనుగొనబడ్డాయి. ఈ తెగవారి జానపద గీతాలు, నృత్యాలు, ఆభరణాలు భారతీయ సంస్కృతి ప్రభావాన్ని తెలియజేస్తాయి. రష్యన్లు నిర్వర్తించే కుపాలో (మన్మథ దహనం), కోలో నృత్యము, భారతీయ హోలి పండుగలోని కామదహనాన్ని స్ఫురింపజేస్తాయి. ❖

రామకృష్ణ భక్తి సూత్రాలు

– స్వామి యతీశానంద

నారద భక్తి సూత్రాలు, శాండిల్య భక్తి సూత్రాలు భక్తియోగానికి సంబంధించిన ప్రామాణిక గ్రంథాలు. అయితే ఆధునిక తరంలో భగవదన్వేషకులకు అనువైన రీతిలో భక్తితత్త్వాన్ని బోధించారు శ్రీరామకృష్ణులు. ఈ నేపథ్యంలో 'శ్రీరామకృష్ణ కథామృతం' నుండి కొన్ని ఉపదేశాలను 'రామకృష్ణ భక్తి సూత్రాలు'గా సులభరీతిలో వివరించే ప్రయత్నం చేస్తున్నాం.

బౌద్ధగ్రంథాలు పాళీ భాషలో, బైబిల్ హీబ్రూలో, ఖురాన్ అరబ్బీ భాషలో రచించబడ్డాయి. అలాగే శ్రీరామకృష్ణుల ఉపదేశాలు వారి మాతృభాష బెంగాలీలో ఆవిష్కృతమయ్యాయి. అవతారపురుషుని ముఖతః వెలువడిన ఆ అమృతోపదేశాలను యథాతథంగా ఉట్టంకిస్తూ వ్యాఖ్యానిస్తున్నాం. మహాశక్తిమంతమైన ఆ బోధనలను మననం చేసుకుంటూ కృతార్థులమవుదాం.

భక్తిలాభ కొరతే హొలె నిర్జన్ హోవాచాఇ. నిర్జనే ఈశ్వరచింతా కొరలె భక్తిలాభ హొయ్.

భగవద్భక్తిని పొందడానికి నిర్జనవాసం చేయాలి. ఏకాంతంలో భగవంతుణ్ణి ధ్యానిస్తే మనస్సులో భక్తి జనిస్తుంది.

శ్రీరామకృష్ణ ఉవాచ : వెన్న పొందాలంటే పాలను ఏకాంత ప్రదేశంలో తోడెయ్యాలి. పాత్రను కదిపినా, పాలను కెలికినా పాలు తోడుకోవు. పెరుగు సిద్ధమైన పిదప చిలకాలి. అప్పుడే వెన్నపైకి తేలుతుంది.

సంసారం నీరు, మనస్సు పాల వంటివి. నీటిలో పాలు కలిపితే, రెండూ కలసిపోయి, ఏది నీరో, ఏవి పాలో తెలియదు. పాలను తోడువేసి, పెరుగు చిలికితే వెన్నపైకి తేలుతుంది. ఆ విధంగానే, నిర్జన ప్రదేశంలో సాధనల ద్వారా జ్ఞానం, భక్తి అనే వెన్న ఏర్పడుతుంది. ఆ వెన్నను సంసారమనే నీటిలో వేసినా అది తేలుతునే ఉంటుంది.

అడపాదడపా కుటుంబం నుండి దూరంగా వెళ్ళి, నిర్జన ప్రదేశంలో భగవచ్చింతన చేస్తే భక్తి జనించును. ఎంతకాలం దూరంగా ఉండాలి అని అడుగుతారా? ఒక్కదినమైనా మంచిదే; మూడు దినాలైతే మరీ మంచిది; వారం, ఒక నెల, మూణ్ణెల్లు, ఒక సంవత్సరం – ఎవరి వీలును బట్టి వారు.

వ్యాఖ్య: భక్తిని పొందడానికి ముఖ్య ఉపాయం, నిర్జనవాసం. ఏకాంతంలో కొన్ని నిమిషాలు గడపినా చాలు, మన మనస్సు అట్టడుగున ఉన్న భావాలు పైకి వస్తాయి. ఫలితంగా, జీవితంలో చేసిన తప్పులు, పొరపాట్లు గుర్తుకు వస్తాయి; వాటిని సరిదిద్దుకొనే అవకాశం దొరకుతుంది. ఏకాంతంలోనే భగవంతునికి ఆత్మసమర్పణం చేసికొని, భగవచ్చింతన చేయగలం. ఈ విధంగా ఆయన పట్ల అనురాగం జనిస్తుంది. ఆయన అపార కరుణ పదేపదే గుర్తుకు వస్తుంది. జీవితంలో ఎన్ని తప్పులు, ఎంత అనౌచిత్యం చేశామో కదా. కానీ, భగవంతుడు వాటిని క్షమించి, తన చేయి అందించి తన వైపు లాగుకొన్నది గుర్తుకు వస్తుంది. ఈ ఆలోచన కలుగగానే భక్తి జనిస్తుంది. భగవంతుణ్ణి ప్రేమించాలనే కాంక్ష కలుగుతుంది. ప్రాపంచిక వస్తువులతో కలిగే సుఖం క్షణికమనీ, భగవద్దర్శనంతో కలిగే ఆనందం చిరస్థాయి అనీ తెలిసివస్తుంది.

ప్రథమే స్త్రీర్ జేమన్ స్వామితె నిష్ఠా, శేఇరూప్ నిష్ఠా జది ఈశ్వరేతె హొయ్ తబెఇ భక్తి హొయ్.

భార్య మొదట్లో తన భర్త పట్ల ఎటువంటి శ్రద్ధ చూపుతుందో, అదే విధమైన నిష్ఠ భగవంతుని పట్ల కలిగితే, అప్పడే భక్తి కలుగును.

వ్యాఖ్య: పనిలో ఎన్ని ఆటంకాలు, కష్టాలు వచ్చినా, వాటిని లెక్క చేయక నిర్దిష్ట సమయంలో దానిని పూర్తి చేయడమే నిష్ఠ. అదే విధంగా, ఏదేని వస్తువు లేదా వ్యక్తి పట్ల కలిగే ఆకర్షణ కూడా నిష్ఠనే. శ్రీరామకృష్ణ ఒక చక్కని ఉదాహరణతో దీనిని వివరించారు.

నూతన వధువు తన ప్రేమను పూర్తిగా తన భర్త పట్ల చూపుతుంది. ఆయనపైన పూర్తి నమ్మకం ఉంచుతుంది. ఆయన పట్ల ఏ సేవాతత్పరత, ఆకర్షణ కలిగి ఉంటుందో, అది ఎంతో గాఢమైనది. ఆయన ఆమెకు అత్యంత ప్రీతి పాత్రుడు, సాక్షాత్తు దైవంగా భావిస్తుంది. పూర్తిగా ఆత్మ సమర్పణం చేసికొని, నిశ్చింతగా ఉంటుంది. ఆయన అవసరాలను జాగ్రత్తగా గమనిస్తూ ఏది కావాలో అది వెంటనే అందించి, ఆయనను ఎల్లప్పుడు సంతుష్టి పరచాలని కోరుకుంటుంది. ఆయన భోజనం చేయనిదే ఆమె తినదు, ఆయన నిద్రించని పూర్వం ఆమె నిద్రకు ఉపక్రమించదు. ఈ విధంగా తన సుఖాన్ని లెక్క చేయక, భర్తకు సకాలంలో అన్ని సేవలు చేస్తుంది. దీనినే నిష్ఠ అంటారు.

సాధకునికి భగవంతుని పట్ల ఈ విధమైన ఆత్మీయత, సేవాతత్పరత ఉంటే, దానినే భక్తి అంటారు. 'భగవద్విషయాలు తప్పించి మరే మాటలూ వినడానికి ఇచ్ఛగించరు. ఆయన సేవే చేయ తలుస్తారు' అని శ్రీరామకృష్ణ నిష్ఠను గురించి చెప్పారు. ❖

అనువాదం: డాక్టర్ కమల జయరావు

సర్వజీవులయందూ వినమ్రతారూపంగా ప్రతిష్ఠితమై ఉన్న దేవికి మాటిమాటికీ నమస్కారములు. - దేవీ మాహాత్మ్యం

జీవనోద్యానంలో

మానవతా పరిమళాలు

భావం ప్రధానం!

ఒకసారి వినోబాభావే, కొంతమందితో కలిసి అప్పటి బెంగాల్ గవర్నర్‌ను కలిసేందుకు వెళ్ళారు. అప్పుడు చీకటిగా ఉండడం వలన ఏ వస్తువూ సరిగా కనబడడం లేదు. రాజ్‌భవన్ ప్రాంగణంలో ఒక

శిలావిగ్రహం కనబడిందాయనకి, 'ఈ విగ్రహం ఎవరిది?' తోటి వారిని ప్రశ్నించారు వినోబాభావే. 'మహాత్మా గాంధీగారిది" అన్నాడా సహచరుడు. వెంటనే వినోబా చెప్పులు తీసి ఆ విగ్రహానికి నమస్కరించి, మూడు ప్రదక్షిణలు చేసి ముందుకు కదిలారు.

ఆ వ్యక్తి తిరిగి వస్తూ, ఆ విగ్రహాన్ని జాగ్రత్తగా పరిశీలించాడు. అది మహాత్ముడిది కాదు, ఐదవ జార్జి విగ్రహం. 'క్షమించండి, నేను పొరపాటుగా ఆ విగ్రహం గాంధీజీదని చెప్పాను, అది ఐదవ జార్జిది' అన్నాడు. అప్పుడు వినోబాభావే 'నేను ఆ విగ్రహాన్ని మహాత్ముడన్న భావంతోనే నమస్కరించాను. అప్పుడా శిలలో గాంధీగారి ఆత్మే కొలువై ఉన్నది. నేను మనసా నమస్కరించినది ఆ మహాత్ముడికే!' అని శాంతంగా అన్నారు. ❖

పొగడ్తలు వ్యక్తిత్వానికి మరకలు

1938వ సంవత్సరం నాటిమాట. అప్పుడు డాక్టర్ సంపూర్ణానంద ఉత్తరప్రదేశ్ శాసన మండలి సభ్యులు. ఒకసారి ఒక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తన స్వార్థసిద్ధి కోసం ఆయన వద్దకు వచ్చాడు. ప్రతి వాక్యం చివర 'అయ్యగారూ', 'తమరు' 'ఈ దీనుణ్ణి దయ తల్చండి' లాంటి మాటల్ని ఉపయోగిస్తూ పొగడ్తలతో ముంచెత్తుతున్నాడు.

అప్పుడు సంపూర్ణానంద అతడి వాక్ప్రవాహాన్ని ఆపి "చూడండీ, మీరు ఒక పాఠశాలకు ప్రధానోపాధ్యాయులు, విద్వాంసులు, వయస్సులో నాకంటే పెద్దవారు. అయినప్పటికీ ఈ కుర్చీకి లేని విలువనిస్తూ నన్ను అయ్యగారూ అంటూ మిమ్మల్ని దీనుడు అని చెప్పుకుంటున్నారు. ఈ కుర్చీలో ఇది వరకు ఎంతోమంది కూర్చున్నారు, మరెంతోమంది కూర్చోబోతారు. పని సాధించుకోవడానికి ఇంతగా దిగజారిపోవాల్సిన అవసరం లేదు. ఇలాంటి స్వభావంతో మీరు భారత భావిపౌరుల వ్యక్తిత్వాలను ఎలా తీర్చిదిద్దగలరు?" అని అన్నారు. ❖

వశీకరణ మంత్ర ప్రభావం

ఒకసారి ఓ సాధువు వద్దకు ఒక స్త్రీ వచ్చింది. తన భర్త తనను ఎప్పుడూ తిడుతూంటాడనీ, అందువలన ఇంట్లో అశాంతి వాతావరణం నెలకొని ఉంటుందనీ, భర్తలో మార్పు వచ్చేందుకు ఏదైనా తాయెత్తు ఇవ్వమనీ వేడుకుంది.

ఆయన ఆమెను ఓదారుస్తూ "అమ్మా! నీ భర్తలో ఉన్నటువంటి దుర్గుణాలను ఎత్తి చూపడం మానివేసి, నీ కర్తవ్యాన్ని నువ్వు సక్రమంగా నెరవేరుస్తూవుండు. మనస్సును నిర్మలంగా ఉంచుకో! అప్పుడు మనిషేమిటి, పశువు కూడా దారిలోకి వస్తుంది" అని సమాధానపరిచారు. సాధువు హితోపదేశం ఆమెకు రుచించలేదు. ఆమె మళ్ళీ మళ్ళీ ఏదైనా వశీకరణ తాయెత్తు ఇమ్మని బలవంతం చేసింది. దాంతో ఆ సాధువు ఒక చిన్న కాగితం తీసుకుని దాని మీద కొన్ని అక్షరాలు వ్రాసి, దానిని ఒక తాయెత్తులో పెట్టి, దాన్ని కట్టుకోమని చెప్పాడు.

తాయెత్తు ధరించి ఆమె ఎంతో సంతోషంగా ఇంటికి వెళ్ళిపోయింది. ఆరునెలల తరువాత ఆమె పళ్ళు, తీపి పదార్థాలు తీసుకువచ్చి ఆ సాధువుకి సమర్పిస్తూ, తాయెత్తు మహిమ వలన తన ఇంటి పరిస్థితులు చక్కబడ్డాయని చెప్పింది. ఆమె మాటలు విని ఆ సాధువుగారి శిష్యులు ఆశ్చర్యపోయారు. ఎందుకంటే ఆయన ఎప్పుడూ ఎవరికీ తాయెత్తులు ఇవ్వరు. ఆమె కాపురాన్ని చక్కదిద్దిన ఆ తాయెత్తులో ఏ మంత్రం రాసిందీ తమకు కూడా చెప్పమని శిష్యులు గురువును అర్థించారు. అందుకాయన ఆ స్త్రీనే ఆ తాయెత్తులోని విషయాన్ని అందరికీ వినిపించమని కోరాడు. అప్పుడు ఆ స్త్రీ ఆ కాగితంలోని విషయాన్ని ఇలా చదివి వినిపించింది:

"ఇతరుల తప్పులు చూసి క్రోధం చెందవద్దు, మనస్సులో అనుమానాలు వద్దు, ప్రేమతో మెలిగితే తప్పక ప్రేమ లభిస్తుంది. ఇది నిజం."

మాటకు మాట ఎదురు చెప్పకుండా, శాంతంగా ఉండడం వలన భర్తలో మార్పు వచ్చిందిగానీ తాయెత్తు వలన కాదని ఆమె గ్రహించి, ఆ సాధువుకి నమస్కరించి వెళ్ళిపోయింది. ❖

అనువాదం: డాక్టర్ వై.సరోజా నిర్మల (రామకృష్ణ సంఘం - హిందీ మాసపత్రిక 'వివేకజ్యోతి' నుండి)

చూడ చూడ మాణిక్యాలు...

– శ్రీమతి బి.కృష్ణకుమారి

ఎంత చూసినా తనివి తీరని సుందరాకారుడు, ఏడుకొండలపై నున్న ఆ సాలగ్రామధరుడు. ఏ క్షణాన ఏ భక్తుడికి ఏ ఆపద కలుగుతుందోనని, ఆదుకునేందుకు తన అభయహస్తాలతో సదా సంసిద్ధుడై ఉంటాడు. అనంత విభూతులతో అలా ఆనందనిలయంలో చతుర్భుజుడై... శంఖ, చక్రధరుడై కొలువైన కోనేటిరాయని కడురమణీయంగా వర్ణించాడు వేంకటేశుడి విశేషభక్తుడు. కనుల ముందున్న విగ్రహాన్ని మృణ్మయంగా కాకుండా, చిన్మయంగా కాంచగలగడం భక్తి పరిపాకానికి ప్రగాఢ నిదర్శనం. అలా అన్నమయ్య సప్తగిరులపై నున్న సాలగ్రామ రూపంలో సాక్షాత్తూ శ్రీనివాసుడినే చూసుకున్నాడు. భూనభోంతరాలన్నీ ఆ భక్తశిఖామణికి ఆ బ్రహ్మాండనాయకుడిలోనే దర్శనమిచ్చి బ్రహ్మానందంలో ఓలలాడించాయి. ఆ పదకవితా పితామహుడి నోట **'చూడ చూడ మాణిక్యాలు చుక్కల వలె నున్నవి...'** అన్న పదవాహినిగా ప్రవహించాయి. ఆ ఆనందనిలయుడిని అభివర్ణిస్తూ అన్నమయ్య ఆలపించిన అత్యద్భుతమైన కీర్తనల్లో ఇదీ ఒకటనడంలో సందేహం లేదు.

"భగవంతుడి దర్శనం కలిగాక భక్తుడి పారవశ్యం చెప్పనలవి కాదు. పరమాత్మను దర్శించాలన్న వ్యాకులతతో ఒక్కొక్క ప్రాకారం దాటుకొని వెళ్ళిన భక్తుడికి ఏడు ప్రాకారాల తరువాత ఆ రూపం సాక్షాత్కరిస్తుంది. ఆ వైభవమంతా వీక్షించాక ఇతడే భగవంతుడని ఆ భక్తుడికి ప్రత్యేకంగా వివరించాల్సిన అవసరం లేదు" అనేవారు భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస.

చుక్కల వలె నున్నవి...

అలా వేంకటాచలపతిని విశ్వమంతా వ్యాపించిన విరాడ్రూపంగా వీక్షించి సంకీర్తనాచార్యుడు సంబరపడిపోయాడు.

ఆ అభిషేక ప్రియుడి దర్శనమయ్యాక అలంకారాల నుంచి ఆభరణాల వరకు అన్నీ ఆయనకు అపురూపంగా అగుపిస్తున్నాయి. ఆ స్వామి ముందున్న మాణిక్యదీపాలు, వినీలాకాశాన తారల్లా తళుకులీనుతున్నాయి. కోనేటిరాయని కన్నులు శాశ్వతమైన సూర్యచంద్రుల్లా శోభిస్తున్నాయి. అంతటి ఆ అనుభూతులకు అక్షరరూపమిస్తూ...

చూడచూడ మాణిక్యాలు చుక్కలు వలె నున్నవి
యీడులేని కన్నులవె యినచంద్రులు! అంటూ సంకీర్తనకు శ్రీకారం చుడుతున్నాడు శ్రీనివాస భక్తాగ్రేసరుడు. ఇక్కడ ఈ నీరజనాభుడివి ఈడు లేని కన్నులని వినూత్నంగా వర్ణిస్తున్నాడు అన్నమయ్య. ఆయువుతో సంబంధం లేని అక్షాలవి! అందుకే ఎన్నటికీ ఆ కళ్ళకు వార్ధక్యం అన్న ప్రశ్నే లేకుండా, కలకాలం కాంతులీనుతూనే ఉంటాయి. అలా శిష్ట రక్షణకు ఓ కంట శశిరేఖలను కురిపిస్తూ, దుష్టశిక్షణకు మరోకంట సూర్యప్రతాపాన్ని చూపిస్తూ, ఆ లోకలోచనుడు ఈ భువనాలను తన కనుసన్నలతో కాపాడుతూ ఉన్నాడు. సహస్రనాముడి ఆ స్వభావం తెలిసినవాడు కనుకనే అన్నమాచార్యులు ఇంపైన ఆ కళ్ళను యినచంద్రులతో పోల్చాడు. అదే విధంగా శ్రీకృష్ణదేవరాయల ఆస్థానకవి పింగళిసూరన తన 'కళాపూర్ణోదయం' కావ్యంలో తిరుమల శ్రీవేంకటేశ్వరుడి ప్రస్తావన విస్తారంగా చేశాడు. ఆ వేంకటాచలపతి దివ్యమంగళ స్వరూపాన్ని సీసపద్యంలో సాక్షాత్కరింపచేస్తూ....

మృదుపదాంబుజములు మెరుగుటందెలు పైడి
దుప్పటియును, మొల ముప్పిడియును

(మిగతా 34వ పేజీలో...)

అన్నమయ్య పదామృతం

చూడచూడ మాణిక్యాలు చుక్కలు వలె నున్నవి
యీడులేని కన్నులవె యినచంద్రులు॥

కంటి గంటి వాడె వాడె ఘనమైన ముత్యాల
కంటమాల లవే పతకములు నవె
మింటి పొడవైనట్టి మించు కిరీటం బదె
జంటల వెలుగుశంఖచక్రాలవె॥

మొక్కు మొక్కు వాడె వాడె ముందరనే వున్నాడు
చెక్కులవే నగవుతో జిగిమోమదె
పుక్కిట లోకములవె భుజకీర్తులును నవె
చక్కనమ్మ అలమేలు జవరాలదె॥

ముంగైమురాలును నవె మొలకతారును నదె
బంగారు నిగ్గుల వన్నె పచ్చబట్టదె
యింగితమెరిగి వేంకటేశుడిదె కన్నులకు
ముంగిటనిధానమైన మూలభూతమదె॥

సర్వజీవులయందూ శాంతిరూపంగా ప్రతిష్ఠితమై ఉన్న దేవికి మాటిమాటికీ నమస్కారములు. - దేవీ మాహాత్మ్యం



పరమపదానికి రాజమార్గం

– స్వామి సర్వగతానంద

కౌరవులు, పాండవులు వారి బాల్యంలో విద్యాభ్యాసం చేస్తున్న రోజులవి. ఆచార్యుడు 'సత్యం వద, ధర్మం చర' అనే వేద మంత్రాన్ని చెప్పి శిష్యులందరినీ అదేవిధంగా ఉచ్చరించమని చెప్పాడు. ప్రతి ఒక్కరు తిరిగి ఆ మంత్రాన్ని మననం చేయవలసిందిగా ఆదేశించారు. మరునాడు ఆచార్యుడు వారు నేర్చిన ఆ మంత్రాన్ని అప్పగించవలసిందిగా కోరినప్పుడు యుధిష్ఠిరుడు తప్ప తక్కినవారందరూ ఆ మంత్రాన్ని అప్పజెప్పారు.

అందరిలోకి పెద్దవాడు, తెలివైనవాడు అయిన యుధిష్ఠిరుడు ఈ చిన్న మంత్రాన్ని ఎందుకు నేర్చుకోలేక పోయాడా అని ఆచార్యుడు విస్తుపోయాడు. యుధిష్ఠిరుడిని ఎందుకు నీవు మంత్రం నేర్చుకోలేదని ప్రశ్నించాడు. అందుకు యుధిష్ఠిరుడు 'సత్యాన్ని పలకడం ఇంకా నేర్చుకోలేదు' అని నిజాయతీగా ఒప్పుకున్నాడు. మిగిలినవారు ఏవో కొన్ని పదాలను కంఠస్థం చేసి ఉండవచ్చు. కానీ నిగూఢమైన ఈ చిన్న ధర్మ సూత్రం యొక్క ఉద్దేశం మాత్రం కచ్చితంగా అదికాదు.

సత్యం వద– సత్యమును వచించు. జీవితంలో నిజం చెప్పడాన్ని అలవాటు చేసుకోకుండా సూత్రాలు, శ్లోకాలు కంఠస్థం చేయడం వల్ల ప్రయోజనం ఏముంది? కానీ నిజానికి ప్రాథమికస్థాయిలో ఈ మంత్రాన్ని నేర్చుకోవడానికి, ఈ ధర్మ విధిని సాధన చేయడానికి సంవత్సరాల పర్యంతం కఠోర శ్రమ, చెప్పనలవి కాని కష్టాలు యుధిష్ఠిరుడు అనుభవించాడు.

'సత్యాన్ని పలకడం' అనే మొదటి నైతిక సూత్రాన్ని బాలలు తమ తల్లి ఒడిలోనో, ఊరి బడిలోనో నేర్చుకుంటారు. ప్రతి నాగరిక సమాజంలో సత్యవంతమైన జీవితం గౌరవప్రద మైనది. కానీ అది అడుగడుగునా నిర్లక్ష్యానికి గురవుతూనే ఉంది. ఎందుకంటే 'సత్యం' అన్న మాటను పలికినంత సులభం కాదు దాన్ని ఆచరించడం.

శ్రీరామకృష్ణులు "సత్యాన్ని పాటించడం ఈ కలియుగానికి అనువైన తపస్సు, మిక్కిలి ప్రయోజనకరం. సత్యాన్ని అంటిపెట్టుకొని ఉంటే భగవంతుణ్ణి పొందగలం" అని అంటారు. తులసీదాస్ ఒక దోహాలో...

సత్యకథా, అధీనతా, పరస్త్రీ మాతృసమాన్ ।
ఇస్‌సే హరి న మిలేతో తులసీ ఝూట్ జబాన్॥

'సత్యం వచించడం, భగవంతునిపై ఆధారపడటం, పరస్త్రీని తల్లిగా దర్శించడం – వీటి ద్వారా భగవంతుడు లభించనట్లయితే తులసీ అసత్యవాదియే' అని అంటాడు.

శ్రీమద్భాగవతం ప్రకారం ధర్మానికి గల నాలుగు పాదాలలో కలియుగంలో మిగిలిన ఏకైక పాదం సత్యం.

సత్యవాది, ఆధునికయుగ ప్రతినిధి అయిన మహాత్మాగాంధీ సత్యం విశిష్టతను గురించి చెబుతూ...

"సత్యం, భగవంతుడు అభిన్నాలు. వాస్తవానికి ఉన్నది సత్యం ఒక్కటే. బహుశా అందుకే సత్ లేదా సత్యం అనేది భగవంతుని నామాలలో ముఖ్యమైనది. ఇంకా చెప్పాలంటే భగవంతుడు ఒక్కడే సత్యం అనడం కంటే సత్యమే భగవంతుడు అని అనడం సముచితం" అని అంటారు.

గాంధీజీ ఉద్దేశం ప్రకారం సత్యాన్ని పాలించకుండా ఎవరూ భగవంతుని పొందలేరు. అందుకే ఆయన మిగిలిన నైతిక విలువల కంటే సత్యానికే అధిక ప్రాధాన్యత ఇచ్చారు.

సత్యమే భగవంతుడు

సత్యం లేదా పారమార్థిక సత్యం మరియు భగవంతుడు ఒకటే కావచ్చు. కానీ ఈ సత్యాన్ని అనుభూతమొనర్చుకోవడానికి దైనందిన జీవితంలో మనం ఎదుర్కొనే ఇంద్రియ గోచరమైన వ్యావహారిక సత్యాలు ఎంత మాత్రం తోడ్పడవు.

వ్యావహారిక సత్యం – 'X' అనేది ఒక వాస్తవం. 'Y' అనేది మన మనస్సు. అప్పుడు మనకు తెలిసింది X+Y మాత్రమే కానీ, X మాత్రం కాదు. ఉదాహరణకు ఆకాశానికి ఏ రంగూ లేదు. కానీ అది మనకు నీలంగా కనిపిస్తుంది. సూర్యునికి ఉదయాస్తమయాలు లేవు కానీ భూభ్రమణం కారణంగానే మనకు ఆ విధంగా కనిపిస్తుంది. ఈ విశ్వమంతా అనేక చిన్న చిన్న అణుపరమాణువుల సమ్మిశ్రితం అయినప్పటికీ అది మనకు స్థూల వస్తువుల నిర్మాణంగా కనిపిస్తుంది. మన నడవడి కూడా అనేక సామాజిక నిబంధనలచే ప్రభావితమై ఉంటుంది. ఒక వ్యక్తి కుమారుడుచే తండ్రిగా చూడబడతాడు. అలాగే బాలుడు కూడా తండ్రిచే కుమారుడిగా చూడబడతాడు. ఇలాగే భర్తచేత భార్య, భార్యచేత భర్త, యజమాని చేత

సేవకుడు, సేవకుని చేత యజమాని. అయితే ఆ వ్యక్తి ఇవన్నీకాక ఇంకా మరేదో కూడా అయి ఉన్నాడు. ప్రపంచంలోని వస్తు విషయాలన్నీ మంచివీ కావు, అలా అని చెడ్డవీ కావు. మనం వాటిపై ఆరోపించిన ప్రాముఖ్యత చేత అవి కోరదగినవి, ఉపేక్షించదగినవి మరియు తటస్థమైనవిగా పరిగణించబడుతున్నాయి.

ఇక, ప్రాతిభాసిక సత్యం. కారు చీకటిలో ఒక త్రాడు పాముగా మనలను భ్రమింపజేస్తుంది. ముత్యపుచిప్ప వెండివలే మెరుస్తుంది. ఎండమావిలో నీరు ఉన్నట్లుగా కనిపిస్తుంది. కలకంటున్నంత సేపు అది నిజమేనని మనం అనుకుంటాం. ఇవన్నీ ప్రాతిభాసిక (నామమాత్రపు) సత్యాలే! కానీ సత్యసాధన యొక్క లక్ష్యం పారమార్థిక సత్యాన్ని పొందడమే!

ఆచరణలో సత్యవాదం: మనసా వాచా కర్మణా సత్యవంతంగా జీవించడమే ఈ సత్యం యొక్క ఆదర్శ సారం. నియమాలను అనుసరించడం, ఆజ్ఞలను పాలించడం ఇవన్నీ సత్యసాధన కిందే వస్తాయి. ప్రతిజ్ఞలకు కట్టుబడి ఉండటం, వాగ్దానాలను నెరవేర్చడం, సంకల్పబద్ధులై ఉండటం ఇదంతా కూడా సత్యసాధనే. భీష్మపితామహుని ఆజన్మ బ్రహ్మచర్య ప్రతిజ్ఞ, ఆడితప్పని హరిశ్చంద్రుని జీవితగాథ ఈ సత్యవంతమైన జీవనానికి చక్కటి దృష్టాంతాలు. పవిత్రురాలైన స్త్రీ పాతివ్రత్యధర్మాన్ని అనుసరిస్తూ భర్తపట్ల విశ్వసనీయురాలై మసలుకోవడం కూడా సత్యసాధనే!

ఏది ఏమైనప్పటికీ సత్యపథగాముడు కావాలనుకునేవాడు సత్యమైన వాక్కులనే యోచిస్తూ వాటికి కట్టుబడి ఉండటం ప్రారంభించాలి. శ్రీరామకృష్ణుల జీవితంలోని కొన్ని ఉదాహరణలు వారి మాటల్లోనే చూద్దాం:

"ఒకవేళ నేను సరుగుడుతోపు వైపు వెళ్ళాలి అని అన్నాననుకో నాకు అవసరం ఉన్నా లేకపోయినా నేను ఆ వైపు వెళ్ళి తీరాల్సిందే! లేదంటే నాకు సత్యంపై ఉన్న పట్టు ఎక్కడ విడివడుతుందోనని నా ఆతురత".

"ఒకసారి ఉన్నట్టుండి నేను ఏమీ తినను అని చెప్పాననుకో ఆకలి వేస్తున్నాసరే ఆ వేళకిక నేను ఆహారమేమీ తీసుకోలేను".

సాధన ప్రారంభ దశలో సాధకుడు ఈ విధమైన పద్ధతిని అనుసరించినప్పటికీ యథార్థమైన సత్యసాధన అన్నది మాత్రం వ్యక్తిగత విచక్షణపై ఆధారపడి ఉంటుంది.

ఒకసారి గురుదేవుల శిష్యులైన స్వామి అద్భుతానంద మహరాజ్‌ను ఒక భక్తుడు మధ్యాహ్న భోజనానికి ఆహ్వానిస్తాడు. మహరాజ్ కూడా ఆ ఆహ్వానాన్ని మన్నించి ఆ భక్తుని ఇంటికి ఆ వేళకు వస్తానని మాట ఇస్తాడు. కానీ ఆ రోజు అదే సమయానికి కుండపోతగా వర్షం కురుస్తూ ఉండటంతో స్వామి తన ఇంటికి రాలేరని ఆ భక్తుడు అనుకుంటాడు. కానీ మోకాళ్ళలోతు నీళ్ళలో కూడా నడచి చెప్పిన సమయానికి మహరాజ్ విచ్చేస్తాడు. స్వామి అంత శ్రమ తీసుకొని రావడం చూసిన భక్తుడు "స్వామీ! సత్యవంతంగా జీవించడం అంటే ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటమా?" అని అడుగుతాడు. అప్పుడు అద్భుతానంద మహరాజ్ ఇలా ప్రత్యుత్తరమిచ్చారు:

"సత్యవంతంగా జీవించడం అనేక విషయాలపై ఆధారపడి ఉంటుంది. బహుశా మన నుండి వ్యక్తమైన ప్రతీమాటను కార్యరూపంగా ఆచరణలో పెట్టలేకపోవచ్చు. కానీ దీని నిజమైన అర్థం మనలను సంకల్ప బద్ధులుగా ఉండాలని సూచిస్తుంది. మన సంకల్పాన్ని మాటలలో వ్యక్తపరచినా, మనస్సులో దృఢపరచుకున్నా లేదా పని ద్వారా ఆచరణయుతమైనా, ఏది ఏమైనప్పటికీ అంతిమంగా అది ఆ సంకల్పం నెరవేరడానికే దారితీస్తుంది. అంతేకానీ అన్నివేళలా తూ.చా. తప్పకుండా మాటమీద నిలబడాలని కాదు. కేవలం మాటమీద నిలబడి ఉండటమే కాక ఆదర్శాన్ని చక్కగా అవగతం చేసుకుని ఎంతటి క్లిష్టపరిస్థితుల్లోనైనా ఆ ఆదర్శానికి కట్టుబడి ఉండటమే నిజమైన సత్యనిష్ఠ. అటువంటి సత్యమే దైవీశక్తి, అటువంటి సత్యమే భగవంతుడు."

మహాత్మాగాంధీ ఇలా అంటాడు: "సత్యసంధత అంటే మనస్సాక్షిని అనుసరించి ధర్మాన్ని, న్యాయాన్ని పాలించడం. ఇది ఎంత ప్రయాసతో కూడినప్పటికీ ఈ సత్య వ్రతాన్ని వీడ కూడదు. మిన్ను విరిగి మీద పడినప్పటికీ మనం ఈ నియమానికి కట్టుబడి ఉండాలి. సత్యమార్గం పూలబాట వంటిదైతే ప్రతి ఒక్కరూ ఆ మార్గాన్ని అనుసరిస్తారు కదా!" ❖

(వచ్చే సంచికలో... సత్యపాలన గురించి మరిన్ని విశిష్టతలు)

తెలుగు సేత: బ్రహ్మచారి శ్యామ్
(భగవాన్ శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష సన్న్యాస శిష్యులైన స్వామి అఖండానందజీ మహరాజ్ శిష్యులు స్వామి సర్వగతానంద)

సర్వజీవులయందూ శ్రద్ధరూపంగా ప్రతిష్ఠితమై ఉన్న దేవికి మాటిమాటికీ నమస్కారములు. - దేవీ మాహాత్మ్యం

మహాత్ముడు మెచ్చిన మధురగీతం

– సి. హెచ్. శివకృష్ణ

మహాత్మాగాంధీ అనగానే సత్యాగ్రహం, స్వాతంత్ర్యోద్యమం తరువాత మన మనస్సులో మెదిలేది 'వైష్ణవ జన తో...' ప్రబోధగీతం. జాతిపిత జీవితాన్ని అత్యంత ప్రభావితం చేసిన అంశాల్లో ఈ మధురకీర్తన ఒకటి. గాంధీజీ ఊహ తెలిసినప్పటి నుంచి ఊపిరి ఆగిపోయేంత వరకు నిత్యం వారి దినచర్యలో ఆ గీతాన్ని సుప్రభాతంగా చేసుకున్నారు. సంగీత సామ్రాజ్ఞి ఎమ్మెస్ సుబ్బులక్ష్మిగారి చేత కోరి మరీ ఆ కీర్తనను ఆలపింపచుకొని తన్మయులయ్యేవారు. అనంతరం ఆ భజన ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది సంగీత, సాహిత్య ప్రియులకు అభిమాన గీతంగా అలరారుతోంది.

ప్రముఖ భక్తకవి నర్సీమెహతా గుజరాతీలో రచించిన ఈ 'వైష్ణవ జన తో...' భజన అంత ప్రఖ్యాతి గాంచడానికి ప్రధానకారణం అందులోని భావగాంభీర్యమే! విష్ణుభక్తుడైన వ్యక్తికి ఉండాల్సిన విశేష గుణాలను ఆ భక్తకవి ఈ పంక్తుల్లో విపులీకరించారు. అందుకే జన్మతః ఆ జానకీనాథుడి భక్తుడైన జాతిపితకి ఆ గీతం గుండెలకు హత్తుకుంది. అయితే ఆయన కేవలం ఆ ఆలాపనను ఆలకించి, ఆస్వాదించి, అబ్బురపడడంతో ఆగిపోలేదు. అక్షరాలా ఆచరణలో చూపి తన జీవితాన్నే ఆ మధురకీర్తనకు మహాభాష్యంగా చేసుకొని ఆదర్శప్రాయంగా నిలిచారు.

పరోపకారే పరమవైష్ణవుడు...: విష్ణువును, విష్ణువు అవతారాలను పూజించినంత మాత్రాన వైష్ణవులు అనిపించుకోరు. పరుల బాధను తమ బాధగా భావించుకొని, వారి దుఃఖోపశమనానికి శాయశక్తులా ప్రయత్నించేవారే పరమవైష్ణవులు. అదే భావనతో ఈ కవి....

వైష్ణవ జన తో తేనే కహియే జే, పీడ్ పరాయీ జానే రే ।
పర్ దుఃఖే ఉప్‌కార్ కరే తో యే, మన్ అభిమాన్ న ఆనే రే॥

అంటూ కీర్తనకు శ్రీకారం చుట్టారు. పైగా చేసిన సాయానికి, చూపిన సానుభూతికి అహంకరించవద్దని, కృతజ్ఞతనూ ఆశించవద్దని సూచిస్తున్నారు. ఇతరుల కష్టాన్ని చూసి కరగని మనిషి ఎన్నటికీ భక్తుడు కాలేడని పునరుద్ఘాటిస్తున్నారు. భక్తిని ఉద్యమంగా ఉద్దీపింప చేసిన చైతన్య మహాప్రభువు కూడా ఇదే రీతిలో వైష్ణవ ధర్మాన్ని ప్రబోధిస్తూ, ఓ సనాతనా! భూతదయను అలవరచుకోవడాన్ని, భగవన్నామంపై అనురక్తిని కలిగి ఉండటాన్ని, భక్తులను సేవించుకోవటాన్ని మించిన ఉత్కృష్టమైన ధర్మం మరోటి లేదంటూ ఓ భజనలో...

జీవే దయ, నామే రుచి, వైష్ణవ్ సేవన్,

ఇహ విన ధర్మ నై ఘన సనాతన్! అంటారు. నిజానికి మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీని మహాత్మాగాంధీగా మలచింది ఈ పరోపకార ప్రతిజ్ఞే. దక్షిణాఫ్రికాలో తనకు జరిగిన అవమానం, మరొకరికి జరగవద్దని ప్రతిన పూని భారతదేశానికి వచ్చి స్వాతంత్ర్యోద్యమాన్ని ముందుండి నడిపించటానికి ఈ సహానుభూతే ప్రధాన కారణం.



సహనం, సమాదరణ...: పరోపకారం తరువాత పరమభక్తులైన వారు అలవరచుకోవలసిన సుగుణాలు సహనం, సమాదరణలు అంటూ ఈ గీత రచయిత...

సకల్ లోక్ మాన్ సహునే వందే, నిందా న కరే కేనీ రే!
వాచ్ కాచ్ మన్ నిశ్చల్ రఖే, ధన్ ధన్ జననీ తేనీ రే॥

ప్రతీకారం ఎంత ప్రేరేపించినా, పరనిందకు పూనుకోని సహనభావం మనిషి మహోన్నత వ్యక్తిత్వానికి నిదర్శనమనీ; మనస్సు, మాట, ఆచరణ ఒక్కటే అయి జీవించటాన్ని మించిన ఆదర్శం మరొకటి లేదనీ; ఈ లక్షణాలున్న బిడ్డను కన్న జనని ధన్యురాలనీ ప్రబోధిస్తున్నారు.

భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస కూడా భక్తులతో మనస్సు, మాట ఏకమైన మనిషి హృదయంలో భగవంతుడు కొలువుంటాడనేవారు. మనస్సులో ఆలోచనలకు, మనం చెప్పే మాటలకు, మనం చేసే చేతలకు పొంతన లేకపోతే పారమార్థికంగానే కాదు, ప్రాపంచికంగానూ ప్రగతిని సాధించలేమని స్పష్టం చేసేవారు. ఉదాహరణకు మహాత్మాగాంధీ తన జీవితంలో సత్యం, అహింసలను మనసా, వాచా నమ్మటమే కాదు, చివరకు కర్మణా కూడా సత్యాగ్రహం రూపంలో రుజువు చేసి స్వాతంత్ర్యోద్యమాన్ని ముందుకు నడిపారు. ఎన్ని ప్రలోభాలు ఎదురైనా తను నమ్మిన సిద్ధాంతాల నుంచి కించిత్తు కూడా సడలిపోలేదు. చివరకు ప్రత్యర్థి హృదయాన్ని కూడా ఆయుధబలంతోనో, హింసతోనో కాకుండా సహనం, ప్రేమలతో గెలవాలని నినదించారు.

సత్యం, సమదృష్టి : సర్వేశ్వరుడి సృష్టిలో అందరూ సమానమే! ఆ సత్యాన్ని తెలుసుకొని ఆయన భక్తులైనవారు కూడా సమత్వాన్ని అలవరచుకోవాలని ఈ వైష్ణవోత్తముడు విస్పష్టం చేస్తూ...

సమదృష్టి నే, తృష్ణా త్యాగీ, పరస్త్రీ జేనే మాత్ రే.
జిహ్వా తాకీ అసత్య న బోలే, పరధన్ నవ్ ఝాలే హాథ్ రే॥

'సమదృష్టి, తృష్ణాత్యాగం, పరస్త్రీ పట్ల మాతృభావం కలిగి ఉండడం; సత్యం పలకడం, పరుల సొమ్మును స్పృశించక పోవడం మొదలైన వాటిని ఆచరించాల'ని ప్రబోధించారు.

ఇలాంటి విశాలహృదయంతోనే జాతిపిత, ఈ లోకం అస్పృశ్యులని దూరం పెట్టిన వాళ్ళకి హరిజనులన్న పేరునిచ్చి తన సమదృష్టిని చాటుకున్నారు. శ్వాస ఆగిపోయే వరకు సత్యశోధనే తన సాధనగా చేసుకుంటూ జీవితాన్ని గడిపారు. అందుకే స్వామి వివేకానంద 'సత్యాన్ని త్రికరణశుద్ధిగా నమ్మితే విజయం తథ్యం' అనేవారు. కానీ చాలా సందర్భాల్లో మనకు సహనంతో వేచి చూసే స్థైర్యం, సత్యపాలనపై విశ్వాసం లేకనే సమర్థనలతో, పరిస్థితుల చేతుల్లో పావులమైపోతాం. ఆశయాలు, ఆదర్శాల విషయంలో ఆరంభశూరులుగా మిగిలిపోతాం.

దృఢవైరాగి, రామనామ ప్రేమి...: నిరంతరం విషయవాంఛల్లో చిక్కుకోనివారే నిజమైన వైష్ణవులంటూ ....

మోహ్‌మాయా వ్యాపే నహీజేనే,దృఢవైరాగ్య జేనే మన్‌మాన్ రే.
రామ్‌నామ్ శూన్ తాలి లాగీ, సకల తీర్థ్ తేనా తన్ మాన్ రే॥

'దృఢవైరాగ్యంతో మాయామోహాల్ని విడిచి, భగవన్నామంపై విశ్వాసంతో జీవితాల్ని సార్థకం చేసుకున్నవారే భాగవతులు' అని గుర్తుచేస్తున్నాడు పరమ భాగవతోత్తముడైన నర్సీమెహతా.

> వైష్ణవ జన తో తేనే కహియే జే, పీడ్ పరాయీ జానే రే।
> పర్ దుఃఖే ఉప్‌కార్ కరే తో యే, మన్ అభిమాన్ న ఆనే రే॥
>
> సకల్ లోక్ మాన్ సహునే వందే, నిందా న కరే కేనీ రే!
> వాచ్ కాచ్ మన్ నిశ్చల్ రఖే, ధన్ ధన్ జననీ తేనీ రే॥
>
> సమదృష్టి నే, తృష్ణా త్యాగీ, పరస్త్రీ జేనే మాత్ రే.
> జిహ్వా తాకీ అసత్య న బోలే, పరధన్ నవ్ ఝాలే హాథ్ రే॥
>
> మోహ్‌మాయా వ్యాపే నహీ జేనే,దృఢవైరాగ్య జేనే మన్‌మాన్ రే.
> రామ్‌నామ్ శూన్ తాలి లాగీ, సకల తీర్థ్ తేనా తన్ మాన్ రే॥
>
> వన్ లోభీ నే కపట్ రహిత్ చే, కామ్‌క్రోధ్ నివార్య రే.
> భానే నర్‌సయ్యో తేనన్ దర్శన్ కర్తా, కుల్ ఏకోతేర్ తార్య రే॥
>
> – నర్సీమెహతా

ఆగర్భ శ్రీమంతుడు బాపూజీ! ఆ రోజుల్లోనే ఆయన విదేశాల్లో న్యాయవిద్యను అభ్యసించారు. అయినా ఒక్కసారిగా తను నమ్ముకున్న ఆశయం కోసం సర్వమూ త్యజించారు. మధురైలో ఓ బహిరంగ సభలో ప్రసంగిస్తుండగా, స్థానిక నిరుపేదలందరూ ఆ సభకు హాజరయ్యారు. వారిలో చాలామందికి కనీసం కట్టుకోవటానికి మంచి వస్త్రాలు లేక, అర్ధనగ్నంగా సభకు హాజరయ్యారు. వారి దుస్థితికి కదిలిపోయిన మహాత్ముడు ఆ మరుసటి రోజు నుంచి తన ఆడంబర వస్త్ర ధారణను కూడా త్యాగం చేశారు. ఆజన్మాంతమూ కొల్లాయే తప్ప పై వస్త్రం కూడా ధరించలేదు. అదే విధంగా 'రామ'నామంపై వారికున్న విశ్వాసం అనితరసాధ్యం. కష్టనష్టాలలో ఆ నామాన్నే నమ్ముకున్నారు. తుదకు ఆ రామనామస్మరణతోనే తనువు చాలించారు.

కామక్రోధరహితుడు...: 'నిష్కపటంతో మెలగాలి. భగవంతుడు సరళత్వానికి, పవిత్రతకు, ప్రేమకు లొంగుతాడు. బాహ్య పటాటోపాలను, ప్రదర్శనలను ఆయన ఆశించడు' అనేవారు దివ్యజనని శ్రీశారదామాత. అదే భావనతో...

వన్ లోభీ నే కపట్ రహిత్ చే, కామ్‌క్రోధ్ నివార్య రే.
భానే నర్‌సయ్యో తేనన్ దర్శన్ కర్తా, కుల్ ఏకోతేర్ తార్య రే॥

'లోభం, కపటం, కామం, క్రోధం ఆధ్యాత్మిక జీవితానికి అనర్హతలు. ఈ అవలక్షణాలను అధిగమించిన వారే అసలైన భక్తులు. అంతటి మహోన్నతులను దర్శిస్తే చాలు, నా జన్మ పునీతమవుతుంద'ని నర్సీమెహతా వారికి నీరాజనాలర్పిస్తున్నారు.

ఆ మహాభక్తుడి వాక్శుద్ధి ఫలితంగా, ఆ నాలుగు దుర్గుణాలతో పాటు, మద, మాత్సర్యాలతో కలిపి అరిషడ్వర్గాలను జయించిన మహాపురుషుడు ఈ భారతావనిలో మహాత్ముని రూపంలో జన్మించాడు. ఆ భజనను సార్థకం చేశాడు. ❖

(అక్టోబర్ 2 మహాత్మాగాంధీ జయంతి)

సర్వజీవులయందూ స్మృతిరూపంగా ప్రతిష్ఠితమై ఉన్న దేవికి మాటిమాటికీ నమస్కారములు. - దేవీ మాహాత్మ్యం

పరిప్రశ్న

– స్వామి భూతేశానంద

(రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు)

రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు-స్వామి భూతేశానందజీ మహరాజ్ (1901-1998) భక్తుల ఆధ్యాత్మిక సందేహాలకు సరళమైన రీతిలో ఇచ్చిన సమాధానాలను 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకుల ప్రయోజనార్థం 2013 జూలై సంచిక నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

భక్తుడు: దుర్గాపూజ సమయంలో నవపత్రికను సమర్పిస్తారు. ఈ నవపత్రిక అంటే ఏమిటి?

స్వామీజీ: ప్రతీ చెట్టుకీ ఒక అధిష్ఠాన దేవత ఉంటుంది. ఈ నవపత్రికకు అధిష్ఠాన దేవత దుర్గాదేవి. దుర్గాదేవి ప్రతిరూపంగా నవపత్రికను ఆరాధిస్తారు. 'నవపత్రికా వాసిన్యై దుర్గాయై నమః – నవపత్రికలో వసించే ఓ దుర్గా! నీకు వందనములు' అనే మంత్రాన్ని దుర్గాపూజ సమయంలో పఠిస్తారు.

కదలీ దాడిమి ధాన్యమ్ హరిద్రా మానకమ్ కచుహు
బిల్వాశోకౌ జయంతి చ విజ్ఞేయా నవపత్రికా

– అరటి, దానిమ్మ, ధాన్యం, పసుపు, మానక, కచు, బిల్వ, అశోక, జయంతి... ఈ తొమ్మిది చెట్ల ఆకులను నవపత్రిక అంటారు.

భక్తుడు: శ్రీరామకృష్ణులు 'అచిన వృక్షం' గురించి చెప్పారు. అచిన వృక్షం అంటే ఏమిటి?

స్వామీజీ: అచిన అంటే చింతనకు అందనిది; గుర్తింప సాధ్యం కానిది అని అర్థం. "భగవంతుడు మానవరూపంలో అవతరించినప్పుడు సాధారణ మానవులు ఆ అవతారమూర్తిని గుర్తించలేరు" అని శ్రీరామకృష్ణులు చెబుతూ ఆ సందర్భంలో అవతారమూర్తిని 'అచిన వృక్షం'తో పోల్చారు. 'అచిన అనే పేరుగల ఒక వృక్షం ఉంది అంటారు. కానీ అదేమిటో ఎవరికీ తెలియదు' అని 'శ్రీరామకృష్ణ కథామృతం'లో పేర్కొబడింది.

భక్తుడు: ప్రతీ రోజు కొంత సమయం ధ్యానం చేస్తున్నాను. అయినప్పటికీ మనస్సు చంచలంగానే ఉంటుంది. అలాంటప్పుడు మనస్సుతో ఆత్మపరిశీలన ఎలా సాధ్యమవుతుంది?

స్వామీజీ: ప్రతీ రోజు కొంత సమయం ధ్యానం చేయగలుగుతున్నారంటే మీరు ఆధ్యాత్మిక మార్గంలో పురోగతిని సాధిస్తున్నారని అర్థం. రేయింబవళ్ళూ ప్రాపంచిక విషయాల గురించి ఆలోచిస్తూ, ప్రాపంచిక భావాలున్నవారితో మెలగుతూ, ప్రాపంచిక వ్యవహారాలలో మునిగితేలుతూ ఉంటే మనస్సు అచలంగా ఎలా ఉంటుంది? రోజులో కొద్ది సమయం ధ్యానం చేసి, కొన్నిసార్లు భగవన్నామాన్ని జపించినంతమాత్రాన మనస్సును నిగ్రహించడం ఎలా సాధ్యమవుతుంది?

మన మనస్సు చంచలంగా ఎందుకు ఉంటుందో ఎప్పటికప్పుడు ఆత్మపరిశీలన చేసుకోవాలి. మనం ఈ మనస్సుతో ఎన్నో విషయాలను ఆలోచిస్తాం, ఎన్నో వ్యవహారాలను చక్కబెడతాం. అలాంటప్పుడు ఆత్మపరిశీలన ఎందుకు సాధ్యం కాదు? నిజానికి మన లోపాలు, బలహీనతలు మనకు తెలుస్తాయి. అయినప్పటికీ వాటిని అధిగమించడానికి ప్రయత్నించం.

"జానామి ధర్మం న చ మే ప్రవృత్తిః, జానామి అధర్మం న చ మే నివృత్తిః – నాకు ధర్మమంటే ఏమిటో తెలుసు, కానీ ఆచరించలేను; నాకు అధర్మమంటే ఏమిటో తెలుసు, కానీ విడిచిపెట్టలేను" అని దుర్యోధనుడు అంటాడు. అలాగే, మనం కూడా చాలా సందర్భాల్లో మనం చేస్తున్నది తప్పు అని తెలిసినా చేయకుండా ఉండలేం. ఒప్పు అని తెలిసినా ఆచరించడానికి ప్రయత్నించం.

'ఓ భగవంతుడా! అసహాయులం, బలహీనులమైన మేము ఏం చేయగలం?' అని అనుకున్నంత కాలం మనం సన్మార్గంలో ఎన్నటికీ పయనించలేం. ప్రతినిత్యం ఆత్మపరిశీలన చేసుకుంటూ సంకల్పశక్తితో మన లోపాలను సరిదిద్దుకోవడానికి ప్రయత్నించినప్పుడు భగవంతుడు తప్పక మనకు తోడ్పాటును అందిస్తాడు. ❖

'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక చందాను ఆన్‌లైన్ **http://rkmath.org/srkp** ద్వారా చెల్లించవచ్చును.

ప్రపంచానికి ఆదర్శం హైందవ స్త్రీ

పరబ్రహ్మ పరతత్త్వంలో స్త్రీ, పురుష భేదం లేదు. వ్యావహారిక క్షేత్రంలోనే మనకిది గోచరిస్తుంది. మనస్సు అంతర్ముఖమయ్యేకొద్దీ ఈ భేదభావం అదృశ్యమవుతుంది. మనస్సు ఎప్పుడైతే అఖండ అవ్యయబ్రహ్మంలో పూర్తిగా లీనమవుతుందో అప్పుడు ఈమె స్త్రీ, ఇతడు పురుషుడు అనేటటు వంటి భావాలు ఉండనే ఉండవు. మేము దీన్ని శ్రీరామకృష్ణుల జీవితంలో ప్రత్యక్షంగా దర్శించాం. కాబట్టి బాహ్యంగా స్త్రీ పురుషులలో భేదం కనిపిస్తున్నా వారి యథార్థ స్వభావంలో ఎలాంటి భేదం లేదు. కాబట్టి పురుషుడు బ్రహ్మజ్ఞాని కాగలిగితే, స్త్రీకి మాత్రం అదే జ్ఞానం ఎందుకు కలుగకూడదు?

జీవులందరిలో ఒకే ఆత్మ ఉన్నదని వేదాంతం చెబుతుండగా ఈ దేశంలో స్త్రీ పురుషుల మధ్య అంత తారతమ్యం ఎందుకు ఏర్పడిందో తెలుసుకోవడం కష్టంగా ఉంది. మీరెప్పుడూ స్త్రీలను విమర్శిస్తారు, వారి ఉన్నతికై మీరు చేసిందేమిటో చెప్పండి. స్మృతులు మొదలైనవి రాసి కఠిన నియమాలతో స్త్రీలను బంధించి వారిని ఉత్పత్తి చేసే యంత్రాలుగా మార్చివేశారు పురుషులు. జగజ్జనని ప్రతిరూపాలైన స్త్రీలను ఉద్ధరించకపోతే మీరు పైకి రావడానికి మార్గం ఏదైనా ఉందని తలస్తున్నారా?

స్త్రీలను తగురీతి గౌరవించిన ఇతర జాతులెంతో గొప్పతనాన్ని సాధించాయి. స్త్రీలను గౌరవించని దేశం ఏదీ గొప్పది కాలేదు. భవిష్యత్తులో కూడా గొప్పది కాబోదు.

"ఏ గృహాలలో స్త్రీలు గౌరవ మర్యాదలతో చూడబడతారో ఆ కుటుంబాలను దేవతలు ఆశీర్వదిస్తారు" అని మనువు చెప్పాడు. స్త్రీలను ఎంతగా ఆదరించాలో అంతగా పాశ్చాత్య పురుషులు వారిని ఆదరిస్తారు. అందువల్లనే పాశ్చాత్యులు అంతటి సంపదలతోను, అంతటి స్వాతంత్ర్యంతోను, అంతటి విజ్ఞానంతోను, అంతటి శక్తితోను అలరారుతున్నారు. అయితే మనం బానిసలుగా, దుః ఖితులుగా, నిర్జీవులుగా ఎందుకు ఉన్నాం? జవాబు సుస్పష్టంగా అవగతమవుతుంది.

భగవంతుడు విశ్వమంతటా వ్యాపించి ఉన్న శక్తి అని, స్త్రీలు ఆ శక్తి యొక్క ప్రతిరూపాలు అని భావించేవాడు నిజమైన 'శక్తి ఆరాధకుడు'.

మగపిల్లలను గూర్చి ఎంత జాగరూకత వహిస్తున్నామో అంత జాగరూకత ఆడపిల్లల విషయంలోను చూపుతూ, వారిని పోషిస్తూ విద్యావంతులను చేయాలి. ముప్పై సంవత్సరాల వరకు బ్రహ్మచర్యం పాటించిన తర్వాత ఏ ప్రకారంగా కుమారులకు వివాహం చేస్తున్నామో, అదేవిధంగా కుమార్తెలు కూడా బ్రహ్మచర్యం పాటించి, విద్యాభ్యాసం చేసేటట్లు తల్లితండ్రులు చూడాలి.

ప్రపంచంలో ఉన్న స్త్రీలందరికన్నా హైందవస్త్రీలు ఎంతో ఆధ్యాత్మికత కలవాళ్ళు, మతానురక్తులు. మనం ఈ సద్గుణాలను పదిలపరచి స్త్రీల బుద్ధిబలాన్ని పెంపొందించ గలిగితే భావి హైందవస్త్రీ ప్రపంచానికి ఆదర్శస్త్రీ కాగలదు. ❖

సర్వజీవులయందూ దయారూపంగా ప్రతిష్ఠితమై ఉన్న దేవికి మాటిమాటికీ నమస్కారములు. - దేవీ మాహాత్మ్యం

ముగ్గురమ్మల మాహాత్మ్యం

- డాక్టర్ అపర్ణా శ్రీనివాస్

పరమాత్మున్ణి శక్తి స్వరూపిణిగా, జగజ్జననిగా భావిస్తూ, పూజించే పరమోత్కృష్టమైన పండుగ దసరా పండుగ. దేవీ పురాణంలో ఆ శ్రీమాతని గురించి చెబుతూ...

పుంరూపం వా స్మరేత్ దేవీం స్త్రీరూపం వా విచింతయేత్।
అథవా నిష్కళాం ధ్యాయేత్ సచ్చిదానంద విగ్రహమ్॥

"సత్యమై, జ్ఞానమై, ఆనందమయమై ఉన్న ఆ పరతత్త్వాన్ని పురుషరూపంలో ధ్యానించినా, స్త్రీరూపంలో ధ్యానించినా, నిర్గుణంగా ఉపాసించినా ఉన్న వస్తువు మాత్రం ఒక్కటే" అని అంటారు.

పరబ్రహ్మం అవ్యక్తంగా, నామరూపాలు లేకుండా, అఖండంగా, అనంతంగా, మనో ఇంద్రియాలకు అతీతంగా చెప్పబడినా, వ్యక్తరూపంలో అత్యద్భుతంగా, నిర్మాణాత్మకమైన శక్తిగా, క్రియారూపం ధరించి, నామరూపాలు వహించి, ఈ దృశ్య ప్రపంచాన్నంతా తన అఖండ శక్తులతో నింపి, అడుగడుగునా గోచరిస్తుంది. ఈ రెండింటిని సమన్వయించడం ఎలాగంటే పాలు వేరు, దాని రంగు వేరు కాదు, అగ్ని నుండి వేడిమి వేరు కాదు, సూర్యుని నుండి తేజస్సు భిన్నం కాదు. అదేవిధంగా పరబ్రహ్మం - శక్తిస్వరూపం అవిభాజ్యమైనవి.

అయితే, పరబ్రహ్మాన్ని 'మాత' రూపంలో, అమ్మగా ఆరాధించడంలో ఒక సౌలభ్యం ఉన్నది ఎందుకంటే సృష్టిలో 'అమ్మ' అనే భావన ఒక దివ్యత్వాన్ని సంతరించుకుని ఉంది. అందరికీ అమ్మదగ్గర చనువు, చేరిక ఉంటాయి. అమ్మ ఒడి సాంత్వనను, ధైర్యాన్ని, రక్షణను కలిగిస్తుంది. అందుకనే ఏ చిన్నపాటి కష్టం కలిగినా, ముందుగా 'అమ్మా' అనే అంటాం. జన్మలతో తల్లులు మారుతారు కానీ సమస్త విశ్వానికి ఆదికారణమైన ఆ జగన్మాతలో ఏ మార్పూ రాదు, తనను తలచినా, తలవకున్నా సదా రక్షిస్తూనే ఉంటుంది. అందుకే మన శాస్త్రాలలో, పురాణాలలోనే కాక, మన దేశ ప్రజల పరంపరాగత జీవనంలో శక్తి ఆరాధనకూ, నవరాత్రుల సంబరాలకూ ఒక విశేష ప్రాముఖ్యం ఉంది. అంతేకాక, భగవంతుని 'అమ్మ'గా భావిస్తూ, పూజించడం మన భారతీయ సంస్కృతిలోనే ప్రధానంగా కనిపిస్తుంది, ఇది ఒక విశేషం.

దేవి రాక్షసులైన శుంభనిశుంభులను సంహరించి, అపరాజితయై నిల్చినందుకు, ఆ దేవిని తొమ్మిది రోజులు నిష్ఠగా ఆరాధిస్తూ, పదవనాడు విజయోత్సవానికి ప్రతీకగా విజయదశమి పండుగను జరుపుకుంటాం. అయితే ఆధ్యాత్మిక దృష్టితో చూస్తే, సాధకుడు ఒక దశ నుండి మరోదశకు, అనగా తామసరాత్రిని చీల్చుకుంటూ, ఉజ్జ్వల సత్య ప్రభాతంలోనికి పయనించేందుకు, సత్యం యొక్క విభిన్న రూపాలను దర్శిస్తూ, పూర్ణత్వాన్ని సాధించేందుకు ఈ నవరాత్రులు సహకారకాలుగా నిలుస్తాయి. ఆ విశేషాల్లోనికి వెళ్ళేముందు, విజయదశమి పుట్టుపూర్వోత్తరాలను పరిశీలిద్దాం.

ఒకప్పుడు దేవతలకు రాక్షసుల వలన దుర్భర బాధలు కలిగి, ఆ బాధలను తొలగించుకునేందుకు, సర్వశక్తి స్వరూపిణి అయిన జగన్మాతను ఆశ్రయించి, స్తుతించి, ప్రార్థించగా, ఆ కరుణామయి వారికి అభయమిచ్చి రాక్షసులను సంహరించి, లోక సంరక్షణం గావించింది. వీటి సమగ్ర

వివరాలు దేవీ మాహాత్మ్యం లేక దేవీ సప్తశతి నందు వివరించబడ్డాయి. ఇది మార్కండేయ పురాణంలో ఒక భాగం.

తొమ్మిది రోజుల పాటు సాగిన ఈ యుద్ధంలో, మొదటి మూడు రోజుల్లో ఆ తల్లి మహాకాళి (దుర్గ)గా అవతారం దాల్చి, యోగనిద్రలో ఉన్న విష్ణువు కర్ణం నుండి వెలువడ్డ మధుకైటభులనే రాక్షసులను సంహరించేందుకు, విష్ణువుని మేల్కొలిపి తద్వారా కార్యం సాధించింది. ఆ తరువాత మూడు రోజుల్లో, ఆ దేవి మహాలక్ష్మిగా నిలిచి మహిషాసురుని, రక్తబీజుని సంహరించింది. ఇంక చివరి మూడు రోజుల్లో, మహా సరస్వతిగా ఆవిర్భవించి, శుంభనిశుంభులను మట్టుపెట్టి, లోకాలకు సుఖ శాంతులను ప్రసాదించింది. ఈ విధంగా నవరాత్రులలో మహాకాళిగా, మహాలక్ష్మిగా, మహాసరస్వతిగా ఆరాధించబడుతూ, పదవనాడు జరిగే

విజయోత్సవాల్లో అపరాజితా దేవిగా (పరాజయం ఎరుగనిది) పూజలను అందుకుంటోంది.

ఈ దివ్యఘట్టాలను సాధనాపరంగా చూసే ప్రయత్నానికి ముందుగా, వేదాంత పరిభాషలో గల మలం, విక్షేపం, ఆవరణం అనే పదాల అర్థాన్ని గమనిద్దాం. 'మలం' అనగా మురికి, విసర్జితం; 'విక్షేపం' అనగా చాంచల్యం; 'ఆవరణం' అనగా భ్రమ వలన కలిగిన అజ్ఞానం. ఈ మల, విక్షేప, ఆవరణలను తొలగించుకోవడమే నవరాత్రుల పరమార్థం.

నవరాత్రుల్లో, మొదటి దశలో మధుకైటభులు అనే రాక్షసులు విష్ణువు చెవి నుండి గులిమి రూపంలో, మలం వలె వెలువడి, లోకాలను అల్లకల్లోలం చేయనారంభించారు. దీనినే దేవీ మాహాత్మ్యంలో 'విష్ణు కర్ణా మలోద్భూతౌ

హంతుం బ్రహ్మాణముద్యతౌ' అని తెలియజేసారు. మలరూపంగా వెలువడినవారిని సంహరించేందుకు యోగనిద్రలో ఉన్న విష్ణువుని మేల్కొలిపి కాళీమాత తద్వారా కార్యసాధన గావించింది.

సాధనాపరంగా చూస్తే, మనలోని మురికి కామక్రోధలోభాలు. ఇవే మధుకైటభుల ప్రతిరూపాలు. వీటి వలన నిత్యజీవనంలో అనేక ఇబ్బందులకు గురి అవుతూ, మనశ్శాంతిని కోల్పోతూ ఉంటాము. భగవద్గీతలో శ్రీకృష్ణుడు వీటి గురించి తెలుపుతూ...

త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః।
కామః క్రోధస్తథాలోభః తస్మాదేతత్త్రయం త్యజేత్॥ *(16-21)*

'కామక్రోధలోభాలు' అనే మూడూ నరకద్వారాలుగా నిలుస్తూ, మానవుని అధోగతిపాలు చేస్తున్నందున, వీటిని త్యజించవలసింది' అని అంటాడు.

ఈ కామక్రోధలోభాలు, స్వచ్ఛమైన గాజుపలకపై తారు ద్రావణాన్ని పూసిన విధంగా, హృదయాన్ని ఆవరించుకుని ఉంటాయి. తద్వారా పారదర్శకమైన గాజుని (హృదయాన్ని) కనపడనీయక, దాని ఉనికి కూడా తెలియని విధంగా కప్పి వేస్తాయి. అందుకని వీటిని వదిలించుకోవలసిందే, దానికై తమస్సు నుండి మేల్కొలిపే ఆ కాళీమాతను ఆశ్రయించి, నిష్కామ కర్మానుష్ఠానం చేయాలి, అప్పుడే వీటి బారి నుండి తప్పించుకోగలం.

ఇంక రెండవదశ వద్దకు వస్తే, ఇక్కడ యుద్ధం ఇంకా కష్టతరం. సూక్ష్మాతిసూక్ష్మతర శత్రువులను ఎదుర్కొనవలసి వస్తుంది. కామక్రోధలోభాలు కొంతవరకు బాహ్యంగా ప్రకటితమవుతూ కనిపించే శత్రువులు, కానీ చంచలంగా ఉన్న మనస్సులో బీజరూపంగా దాగి ఉన్న వాసనలు, సంస్కారాలు ప్రచ్ఛన్నంగా దాడి చేస్తుంటాయి. ఇవి మనస్సుని విక్షేపానికి గురి చేస్తూ, అదను చూసి దాడి చేస్తాయి. ఇవి మహిషాసురునికి, రక్తబీజునికి ప్రతిరూపాలు. దేవీ మాహాత్మ్యంలో చూస్తే, మహిషాసురుడు ఒకసారి ఏనుగురూపంలో, మరొకసారి గేదె రూపంలో, ఇంకొకసారి రాక్షసరూపంలో కనిపిస్తూ, వివిధములైన ఆకారాలను ధరిస్తూ, క్షణానికో విధంగా మారుతూ ఉంటాడు. ఒక రూపంలో అణిచివేస్తే, మరో రూపంలో ప్రత్యక్షమవుతూ కనిపిస్తాడు.

ఇంక, రక్తబీజుని కథ అందరికీ తెలిసినదే, గాయపడిన శరీరం నుండి నేలపై పడిన ప్రతీ రక్తపు బొట్టు నుండి ఉద్భవిస్తూ, వందలాదిగా, వేలాదిగా రక్తబీజులను సృష్టిస్తూ ఉంటాడు. వీరిరువురి వలె, మనలో వాసనలు, సంస్కారాలు బీజరూపంగా ఉంటూ, అదను చూసుకుని విజృంభిస్తూ ఉంటాయి. వాటిని అణచివేసే ప్రయత్నం చేసే కొద్దీ రెట్టింపు శక్తితో తిరిగి లేస్తూ ఉంటాయి. ఈ పరిస్థితిలో కాళికాదేవి నాలుకను యుద్ధ భూమినంతా పరచి, ఆ రక్తబీజుని రక్తాన్ని నేల పడనివ్వకుండా, రాక్షస వధ గావించింది.

అదే విధంగా, మనలోని బీజరూప సంస్కారాలను హృదయనేలలో మొలకెత్తనివ్వక, సమూలంగా దగ్ధం చేయగలగడమే నివారణోపాయం. అయితే దీనికి ఉపాసనే శరణ్యం. ఉపాసనలో అంతర్నిహితంగా కర్మ, జ్ఞానాన్ని కలిగి ఉండేలా చేస్తూ ఆ మహాలక్ష్మిని ధ్యానించడం ద్వారా ఈ దశను దాటగలం. సర్వలక్షణ శోభితురాలై, సకలైశ్వర్య ప్రదాయిని అయిన ఆ శ్రీమహాలక్ష్మిని మనకు ఆధ్యాత్మిక సంపదను ప్రసాదించమని ప్రార్థించాలి. మన హృదయంలోని మలాన్ని (కామక్రోధలోభాలు) తొలగించుకున్నాక హృదయాన్నీ దైవీగుణ సంపదతో నింపేలా చేయగల శక్తిని ప్రసాదించమని ఆ దేవిని శరణు వేడాలి. అయితే ఈ విస్తార సంపదను

(మిగతా 32వ పేజీలో...)

సర్వజీవులయందూ తృప్తిరూపంగా ప్రతిష్ఠితమై ఉన్న దేవికి మాటిమాటికీ నమస్కారములు. - దేవీ మాహాత్మ్యం

అంతా మన చేతుల్లోనే...

– స్వామి శితికంఠానంద

వంశాంకురం ఇంకా ఉదయించలేదని ఆ సార్వభౌముడు నిరంతరం మథనపడుతున్నాడు. ముగ్గురు భార్యలున్నా ఎవరి ద్వారా కూడా సంతానం కలుగక పోయేసరికి ఆయనకు కంటిమీద కునుకు కరువైంది. దేవసమానులైన రాజులతో అప్పటివరకూ అవిచ్ఛిన్నంగా కొనసాగిన ఆ మహావంశం తనతో అంతమై పోతున్నదన్న బాధ ఆయన్ను చింతాక్రాంత మనస్కుడిగా చేసింది. రాజగురువును తన సన్నిధికి రప్పించుకొని భక్తిపూర్వకంగా ఉచిత సలహాను ఇవ్వమని ప్రాధేయపడ్డాడు. పుత్రకామేష్టి యజ్ఞం చేయవలసినదిగా ఆదేశించి, ఎవరు ఆ కార్యానికి సమర్థుడో, ఆ వ్యక్తిని ఎలా అక్కడికి ఆహ్వానించాలో కూడా తెలియజేసి బ్రహ్మర్షియైన ఆ గురువు తన నివాసాన్ని చేరుకున్నాడు. గురువు ఆజ్ఞ మేరకు అన్నింటినీ తూ.చా. తప్పకుండా ఆచరించి యజ్ఞ ఫలాన్ని స్వీకరించి సతులు మువ్వురికి ఆ ఫలాన్ని అందించి, సత్పురుషులకు, దీనులకు, వివిధరీతిన దక్షిణలు పంచి అందరి మెప్పును పొందాడు ఆ భూమీశుడు.

రాజ్య ప్రజలందరూ ఆ వితరణకు అమందానందాన్ని పొంది తమ మహారాజుకు ఉత్తమ సంతానం కలగాలని తమ తమ కులదైవాలను ప్రార్థించారు. ఇలా సకల జనుల ప్రార్థనలు, ఋషుల ఆశీర్వాదాలు, రాజమాతల నోములు, వ్రతాలు, ప్రార్థనలు ఫలించి ఆ రాజు తేజోసంపన్నులైన నలుగురు బిడ్డలకు జనకుడయ్యాడు. విద్యాబుద్ధులు నేర్పుటకై వారందరినీ ఆచార్యుల సమక్షంలో ఉంచి వారి దినదినప్రవర్ధమానతను చూసి సదా సంతోషాంతరంగుడయ్యాడు. ఆ నరపతికి వారు నలుగురిలో పెద్దవాడు, తనతర్వాత రాజవ్వాల్సిన కుమారుడిని చూసి పుత్రోత్సాహం కలగని రోజు లేదు. ఒక తండ్రిగా తన జన్మ సార్థకమయింది అనుకున్నాడు. పరిపూర్ణత మూర్తీమంతమవ్వడమేమిటో తెలియాలంటే ఆ బాలుడిని చూడాలి. రాజమాతలు కూడా అలాంటి బిడ్డలకు జన్మనివ్వటంతో తమ జన్మధన్యమయిందని అనుకున్నారు. అనతి కాలంలోనే ఆ నలుగురు రాకుమారులు సకల విద్యాపారంగతులయ్యారు. వారే దశరథ తనయులు; ఇక్ష్వాకువంశ ప్రదీపకులైన రామలక్ష్మణభరతశత్రుఘ్నులు.

ధర్మం, వ్యక్తిత్వమంటే ఏమిటో, ఏవి చేయవలసిన కార్యాలో, ఏవి చేయకూడనివో వారికి ఎవరూ చెప్పవలసిన అవసరం లేదు. వారి విద్యాబోధనలు, గురుకులవాసాలు లోక విడంబనార్థమే. అనాదిగా వస్తున్న సంప్రదాయాన్ని గౌరవించటానికే. వారు జన్మతః పరిపూర్ణులు. వారి స్వభావంలోనే ధర్మం ఇమిడిపోయింది. సత్ప్రవర్తన, ఉత్తమ నడవడి వారికి బోధతో రాలేదు. పుట్టుకతో వచ్చాయి. శీలం వారి జన్యువులలో ఇంకి ఉంది. జీవనసాగరాన్ని ఈదేటప్పుడు వచ్చే తుపానులు, ప్రాపంచిక ప్రలోభాలు వారి మనోధైర్యాన్ని ఎప్పుడూ చలింపజేయలేదు. వారి జీవితాలు ధర్మానుష్ఠానానికి సజీవ వ్యాఖ్యలు.

ఇక జ్యేష్ఠుడైన రాముడంటే ధర్మస్వరూపమే. అందుకే **రామో విగ్రహవాన్ ధర్మః** అంటుంది రామాయణం. **'మహాగిరిరివ**

అకమ్ప్యః కాకుత్స్థేన ప్రకంపతే.. ఏ విధంగా ఝంఝూ మారుతాలు పర్వతాలను చలింపజేయలేవో అదేవిధంగా కాకుత్స్థవంశజుడైన రాముడిని కష్టాల పెనుగాలులు చలింపజేయలేవు' అని అర్థం.

ఈ నలుగురికి అంతశక్తి ఎలా వచ్చింది? మరి వారు ఊరకనే పుట్టలేదు కదా! తమ తల్లులతో సహా ఎంతమంది ప్రార్థనలు, ఆశీర్వాదబలం వారి జన్మకు కారణమైంది? జన్మంటే వారిది. ఈ బిడ్డలని తన మేనిపై మోయటానికి పుడమితల్లి ఎంత పులకరించి ఉంటుందో కదా!

దశరథ మహారాజులాగా ఆయనకూడా ఒక మహాసామ్రాజ్య భారాన్ని నిర్వహిస్తున్నాడు. తనదీ దశరథుడి

లాంటి సమస్యయే. పుత్రసంతానం లేదు. మరి తన తర్వాత రాజ్యాన్ని ఎవరు పరిపాలించాలి? ఈ సందేహం ఆయనకు దుఃఖ హేతువైంది. ఆయన సావిత్రీ మాత ఉపాసకుడు. మాతను తనకు వంశోద్ధారకుడైన తనయుడిని ప్రసాదించమని ప్రార్థించాడు. పదునెనిమిది సంవత్సరాలు నిరంతర ఉపాసన తర్వాత ఆయనకు ఒక బాలిక జన్మించింది. **ప్రాప్తేయం దేవకన్యేతి దృష్ట్వా సమ్మేనిరే జనాః...** ఆమె తేజస్సును చూసి ప్రజలు తమ రాజుకు ఒక దేవత బిడ్డగా పుట్టిందని అనుకున్నారు. తనయుడికై ప్రార్థిస్తే తనయ కలిగిందని, రాజ్యాన్ని తనయ పాలించలేదుగదా అని చింతిస్తున్న ఆ రాజుకు సావిత్రీమాత ప్రత్యక్షమై, 'ఓ రాజా! ఈమె సామాన్యురాలు కాదు, నీ అభీష్టాన్ని ఈడేర్చగల సబల' అని చెప్పి అంతర్ధానమైంది.

పాతివ్రత్య మాహాత్మ్యంతో అల్పాయుష్కుడైన భర్త ప్రాణాన్ని యమధర్మరాజు నుండి తిరిగి గైకొనడమే కాకుండా, తన తండ్రికి నూరుగురు పుత్రులు కలిగేటట్లుగా ధర్మదైవతం నుండి వరాన్ని పొందింది. నారీలోకానికే ఆదర్శప్రాయురాలై ఆచంద్రార్కం తన కీర్తిని సుస్థిరపరుచుకున్న పరమపావని సావిత్రియే ఆ ముదిత. ఈ పతిదేవతకు తండ్రయ్యే అదృష్టానికి నోచుకున్న ఆ నరేంద్రుడే అశ్వపతి.

ముని శాపం వలన తాను తండ్రి అయ్యే అవకాశంలేదని తెలిసి ఆ రాజు కుమిలికుమిలి కునారిల్లాడు. భర్త నిరంతరం బాధాపరితప్త హృదయుడై ఉండటం భార్యకు చాలా బాధ కలిగించింది. వివాహానికి పూర్వం దుర్వాసమహర్షికి తాను చేసిన సేవ వలన ఆయన తనకు ప్రసాదించిన వరాన్ని భర్తకు తెలియజేసింది. తను కోరుకుంటే దేవతల ద్వారా సంతానాన్ని గ్రహించగలను అని ఎరిగించింది.

భర్త ఆనందానికి అవధులు లేవు. పుత్రోత్సాహానికై పరితపిస్తున్న ఆ రాజుకు ఈ మాటలు అమృతపానం లాగా తోచాయి. వెంటనే వారిని ప్రార్థించి, ఆవహింపజేసుకొని, సంతానవతియై వంశాన్ని నిలపవలసినదని భార్య కుంతిని వేడుకున్నాడు. భర్త కోరిక మేరకు ఆమె యమదైవతాన్ని, వాయుదేవుడిని, ఇంద్రుడిని ప్రార్థించి ముగ్గురు మహాతేజో సంపన్నులైన తనయులకు తల్లి అయింది. సోదరి మాద్రిచే అశ్వినీ దేవతలను ప్రార్థింపజేసి, ఆమె ఇరువురికి తల్లి అయ్యేందుకు కారణమైంది. ఈ ఇద్దరు మాతృమూర్తులకు పుట్టిన ఆ ఐదుగురే, కష్టాల కడలిని ఈదవలసి వచ్చినా ధర్మమార్గాన్ని వీడక, తుదకు మహాభారత యుద్ధంలో అజేయులుగా నిలబడ్డ పాండవులు.

ప్రాచీన కాలం నుంచి ఆధునిక యుగం వరకు మనం జాగ్రత్తగా గమనిస్తే తల్లితండ్రుల దైవావహనతో ప్రపంచానికి పరిచయమైన బిడ్డలంతా మానవాళికి వరాలయ్యారు. దైవప్రమేయాన్ని కోరుకొని సంతానాన్ని గ్రహించగలిగితే ప్రారబ్ధాన్ని విదళించి ఉత్తమ సంస్కారాలు కలిగిన మనీషులతో ప్రపంచాన్ని నింపివేయవచ్చు.

వంశపారంపర్య లక్షణాలు: విజ్ఞానశాస్త్రం చెపుతున్నట్లుగా జన్యువుల (genes) ద్వారా లక్షణాలు తల్లితండ్రుల నుంచి బిడ్డలకు సంక్రమిస్తున్నట్లైతే ఒకే తల్లితండ్రులకు పుట్టిన బిడ్డలు అందరూ ఒకేరకంగా ఉండాలి. తల్లితండ్రులలోని ఏ లక్షణాలు బిడ్డకు ఏ స్థాయిలో రావాలి అనేది దేనిపై ఆధారపడి ఉంటుంది? అంటే పిండం తయారవటానికి ముందు లక్షణాలు లేదా గుణాల సంప్రాప్తికి కారణమయ్యే జన్యుసమాచార మార్పిడి (exchange of genetic information responsible for characters) పూర్తిగా ఒక క్రమం ప్రకారం కాకుండా అడ్డదిడ్డంగా జరుగుతుంది అని శాస్త్రజ్ఞుల భావన. కార్య-కారణ సంబంధం ద్వారా ఒక విషయాన్ని సరిగ్గా వివరించలేనప్పుడు అసంకల్పిత చర్య అనో, నిర్దుష్ట క్రమం, పద్ధతి లేదనో (random) చెప్పి దాటవేయటం సైన్సులో ఆనవాయితీ అయింది.

స్వామి వివేకానంద 'కొన్ని విషయాలలో శాస్త్రజ్ఞులు కన్నా మన మతపెద్దలు ఎక్కువ శాస్త్రీయతను, సహేతుకతను కలిగి ఉన్నారు' అని అంటారు. వీరు కనీసం తెలియని విషయాన్ని దైవంపై అంటే బుద్ధికి అందని శక్తిపై వేస్తున్నారు కానీ శాస్త్రజ్ఞులలాగా అసంకల్పితమని, అనుక్రమం అని చెప్పి దాటవేయటానికి ప్రయత్నించటం లేదు. తెలియనిది తెలియదని చెప్పటం సైన్సులో లేదు. ప్రతీదానికి ఏదో వివరణ ఇవ్వటం, లేకపోతే కారణరహితం అని చెప్పటం జరుగుతున్నది. కానీ మనం ఇలాంటి వివరణలోని అసంబద్ధతను గుర్తించలేక పోతున్నాం. తల్లి నుంచి 23 క్రోమోజోములు, తండ్రి నుంచి 23 క్రోమోజోముల ద్వారా లక్షణాలు బిడ్డలకు సంక్రమిస్తున్నాయి అని జన్యుశాస్త్రం చెపుతున్నది. కానీ ఏ లక్షణాలు, ఏ నిష్పత్తిలో బిడ్డలకు సంక్రమించాలో ఎలా నిర్ణయించబడుతుంది? ఒకే జననీ జనకులకు పుట్టిన పిల్లల్లో మనకు కనపడే బుద్ధిస్థాయిలలోని వ్యత్యాసం, రూపగుణసంపదలలోని వ్యత్యాసం కేవలం యాదృచ్ఛికమే అనడం ఎంత అసమంజసమైన వివరణ!

(మిగతా 32వ పేజీలో...)

సర్వజీవులయందూ మాతృరూపంగా ప్రతిష్ఠితమై ఉన్న దేవికి మాటిమాటికీ నమస్కారములు. - దేవీ మాహాత్మ్యం



ప్రయత్నాస్త్రం

– బ్రహ్మచారి రవి

జీవితంలో ఏదైనా సాధించాలంటే నిరంతర ప్రయత్నం అనే అస్త్రం తప్పనిసరి, అగ్నిహోత్రంలా అది రగులుతూనే ఉండాలి. కానీ చాలామందిలో ఇది లోపిస్తుంది. ఎంతసేపూ లక్ష్యం గురించి డంబాలుపలుకుతారే తప్ప దాన్ని సాధించేందుకు చేయవలసిన ప్రయత్నం, శ్రమలను గురించి ఆలోచించరు. వారి దృష్టిలో ఒక పనిని ప్రారంభిస్తే చాలు ఆశించినంత ఫలితం అదేవస్తుంది అనుకుంటారు. స్వప్నజగత్తులో, ఊహల్లోతేలిపోతూ జీవిత కలల సాకారానికి హేతువు మడమ తిప్పని ప్రయత్నమే అన్న విషయాన్ని విస్మరిస్తారు.

ప్రయాణారంభంలో ఉన్న శూరత్వం మధ్యలోనే అణగారి పోతే, గమ్యం చేరడం గగనమైపోతుంది. లాగిన కొద్దీ పట్టుబిగించే ఉడుంలా మరింత ఉత్తేజంతో అడుగడుగునా పొంచి ఉన్న సమస్యల వలయాన్ని ప్రయత్నమనే అస్త్రంతో ఛేదిస్తూ ముందుకు సాగితే నిస్సందేహంగా విజయలక్ష్మి మనల్ని వరిస్తుంది.

అందుకే స్వామీజీ 'Perseverance will finally conquer nothing can be done in a day - పట్టు వదలకుండా చేసే ప్రయత్నం చివరకు విజయాన్ని చేకూరుస్తుంది. ఒక్కరోజులో దేన్నీ సాధించలేం' అంటారు.

కీటకం నేర్పిన పాఠం: మంగోలియన్ యోధుడు ఒకడు ప్రత్యర్థులతో యుద్ధం చేయలేక, సమీపంలోని అడవుల్లోకి పలాయనం చిత్తగించాడు. ఒక శిథిల భవనంలోకి వెళ్ళి తలదాచుకొని ఏదో విధంగా ప్రత్యర్థుల కంటపడకుండా ఈ అడవి దాటిపోతే చాలు ప్రాణాలు దక్కుతాయని ఆలోచిస్తున్నాడు. ఇంతలో ఎదురుగా ఒక కీటకం గోడపైకి ఎక్కాలని ప్రయత్నిస్తోంది. అది గోడ ఎక్కితే పైన దానికి కావలసిన ఆహారం ఉంది. అయితే అది గోడ ఎక్కలేకపోతోంది. ప్రయత్నించిన ప్రతిసారి జారి కిందపడుతూనే ఉంది. అయినా అది పట్టువదలడం లేదు. అది అలా ప్రయత్నించి 17వ ప్రయత్నంలో పైకి ఎక్కగలిగి, తనకు కావలసిన ఆహారాన్ని అందుకుంది.

ఇదంతా గమనించిన మంగోలియన్ యోధుడికి కనువిప్పు కలిగింది. గోడపై పాకుతున్న ఆ చిన్న కీటకం నేర్పిన గుణపాఠం వల్ల ఆ యోధుడు తిరిగి యుద్ధభూమి వైపు మరలి వీరోచితంగా పోరాడి తానూ ఘనవిజయంలో పాలు పంచుకున్నాడు.

'Hold the ideal a thousand times, and if you fail a thousand times, make the attempt once more – స్వీకరించిన ఆదర్శాన్ని ఆచరించే ప్రయత్నంలో వేయిసార్లు విఫలమైనా, మరోసారి ప్రయత్నించు' అని అంటారు నిరంతర ప్రయత్నశీలురైన స్వామి వివేకానంద.

విజయం సాధించేంత వరకూ ప్రయత్నానికీ స్వస్తి పలుకరాదు. అయితే ప్రతి ప్రయత్నం ఒక వ్యూహం ప్రకారం జరగాలి. చేసిన ప్రయత్నం విఫలమైనపుడు తప్పొప్పులను బేరీజు వేసుకోవాలి. విశ్లేషించుకోవాలి. ఒక పరాజయం తరువాత వేసే అడుగు మరింత పటిష్ఠంగా ఉండాలి.

- విఫలమవ్వడం వలన మనం తలదించుకోవాల్సిన అవసరంలేదు. అసలు ప్రయత్నమే చేయనందుకు సిగ్గుపడాలి.
- ప్రయత్నం చేయాలి, పొరపాట్లు జరిగితే వాటిని సరిదిద్దుకొని మరింత శక్తివంతులై కొదమ సింహంలా విజయంకోసం ఉరకలు వేయాలి. ఈ ప్రక్రియ మన జీవననేస్తం కావాలి.
- విజయశిఖరాలను చేరుకొన్నవారు వాటిని యాదృచ్ఛికంగా అందుకోలేదు. వారంతా అంతర్మథనంతో అహరహం శ్రమించారన్న విషయాన్ని మరువకూడదు.

'సూర్యునిలాగ ప్రకాశించాలంటే, సూర్యునిలాగ మండాలి' అని అబ్దుల్ కలామ్ అంటారు. కాబట్టి జీవితంలో ఉన్నతిని సాధించాలంటే తీవ్రంగా శ్రమించాలి. ❖

మనవంతు సేవ...

- స్వామి పరిజ్ఞేయానంద

ఒక విద్యార్థి, హైదరాబాద్

ప్రశ్న: నేను స్వామి వివేకానంద బోధనలను చదివాను. నాకు దేశమంటే భక్తి ఉంది. కానీ మనుషులంటేనే ద్వేషం కలుగుతుంది. నేటి సమాజంలోని పరిస్థితులను చూస్తూ ఉంటే ఆందోళన కలుగుతుంది. మరి ఇలాంటి పరిస్థితుల్లో దేశానికి మంచి చేయాలంటే ఏం చేయాలి?

జవాబు: 'దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్' అన్న ప్రజాకవి గురజాడవారి వచనాలను మరచిపోయారా? దేశమంటేనే మనుషులు; మనుషులుంటేనే దేశం. ఈ రెండూ అభిన్నాలైనప్పుడు దేశాన్ని ప్రేమిస్తూ, మనుషుల్ని ద్వేషించడం ఎలా సాధ్యం?

స్వామి వివేకానంద 'భారతదేశం నా ఆత్మ'; 'నేను సంక్షిప్త భారతాన్ని' అని అంటూ భారతదేశంతో తనకున్న అనుబంధాన్ని సగర్వంగా ప్రకటించారు. 'నేనే భారతదేశాన్ని, భారతదేశమే నేను' అని అంటూ భారతదేశంతో తాదాత్మ్యం చెందారు. కాబట్టి స్వామి వివేకానంద బోధనలను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకున్న వారిలో దేశమే ప్రజలు, ప్రజలే దేశమన్న ఓ స్పష్టమైన అవగాహన ఏర్పడుతుంది.

అయితే, నేటి సమాజంలోని పరిస్థితులనూ, వ్యక్తుల ప్రవర్తననూ చూస్తే ఎవరికైనా ఆందోళన, విచారం కలగక మానవు. అలాగని ఈ సమాజం పూర్తిగా చెడిపోయింది, మానవత్వం ఉన్న మనుషులే లేరనే నిర్ణయానికి రావడం సరికాదు. స్వామి వివేకానంద కూడా 'మన సమాజం చెడ్డదని నేను అనను. సమాజం మంచిదే కానీ ఇంకా ఉత్తమ స్థితికి చేరాలి' అని అంటారు.

నేటి సమాజంలోని పరిస్థితులను చూసి ఆందోళన చెందకుండా, మనం సమాజానికి చేయగలిగింది చేస్తూ మనశ్శాంతిని పదిలపరుచుకోవాలంటే ఒక ఆంగ్ల నాటకంలోని ఈ ప్రార్థనను గుర్తుంచుకోవాలి:

"O God! grant me the serenity to accept the things I cannot change; courage to change the things I can; and wisdom to know the difference - ఓ భగవంతుడా! నేను మార్చలేని పరిస్థితులను ప్రశాంతంగా ఆమోదించే శక్తినీ; నేను మార్చగల పరిస్థితులను మార్చేందుకు ధైర్యాన్నీ; ఈ రెండింటికీ మధ్యగల తేడాను గ్రహించగలిగే వివేకాన్నీ ప్రసాదించు!"

ఈ ప్రార్థన సారాన్ని గ్రహించి, మన నిత్యజీవితంలో ఆచరించగలిగితే మన చుట్టూ ఉన్న మనుషులను ద్వేషించకుండా, పరిస్థితులను చూసి ఆందోళన చెందకుండా ఉండగలం. ముఖ్యంగా మనం గ్రహించాల్సింది ఏమిటంటే, మనం ఏదైనా చేయడానికి ప్రయత్నించినప్పుడు మన శక్తి సామర్థ్యాలనూ, మన పరిధులనూ, మన పరిమితులనూ పరిగణనలోకి తీసుకోవాలి. అలాకాని నాడు మనకు మిగిలేది మనోవ్యథే!

మొత్తం సమాజాన్నే ప్రక్షాళనం చేసేద్దాం అనుకోవడం మన అవగాహనారాహిత్యానికి నిదర్శనం. అందుకే స్వామి వివేకానంద ఈ ప్రపంచాన్ని కుక్కతోకతో పోల్చారు. కుక్కతోకను ఎంతమంది, ఎన్నిసార్లు తిన్నగా చేసినా మరలా అది వంకరగా అయిపోతుంది. ఈ ప్రపంచ పరిస్థితి కూడా అంతే! అలాగని సమాజ పరిస్థితిని గమనిస్తూ స్పందించకుండా ఉంటే మనిషికీ, మానుకీ తేడా ఉండదు.

అందుకే స్వామీజీ 'ఈ ప్రపంచం ఒక వ్యాయామశాల. మనల్ని మనం బలవంతులుగా తీర్చిదిద్దుకోవడానికి ఇక్కడికి వచ్చాం' అని అంటారు. కుక్క తోకలాంటి ఈ ప్రపంచాన్ని సరిచేసే ప్రయత్నమే వ్యాయామం. ఈ ప్రక్రియ ద్వారా

మనం శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా బలవంతులమవుతాం. మన వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోగలుగుతాం.

సమాజం పాడైపోతుందనీ, మనుషుల్లో విలువలు కొరవడుతున్నాయనీ అందరూ అంటారు. కానీ ఈ సమాజాన్ని తీర్చిదిద్దే బాధ్యత మనందరిపైన ఉందనీ, అందుకు ముందు మనలో పరివర్తన రావాలని మాత్రం ఎవ్వరమూ అనుకోం. ఇదే మన సమస్య!

అందుకే స్వామీజీ 'Purify yourself first. The world is bound to be purified then - మొదట మీరు పవిత్రులు కండి. అప్పుడు ప్రపంచం పవిత్రంగా కనబడితీరుతుంది' అని అంటారు. కాబట్టి ముందు మనలోని లోపాలను సరిదిద్దుకొని, ఉన్నత విలువలతో జీవించడానికి ప్రయత్నించాలి. ఇదే ప్రస్తుతం మనం దేశానికి చేయగల సేవ! ❖

సర్వజీవులయందూ ఆకలిరూపంగా ప్రతిష్ఠితమై ఉన్న దేవికి మాటిమాటికీ నమస్కారములు. - దేవీ మాహాత్మ్యం

మూగప్రాణాల మౌనపాఠాలు

– బి. సైదులు

అది రెండవ ప్రపంచయుద్ధం హోరుగా సాగుతున్న సమయం... పతాకస్థాయికి చేరుకున్న అమెరికా సైన్యాల భీకర సమరం... ఆ అగ్రరాజ్య సేనను కల్నల్ చార్లెస్ విట్లెస్లీ అనే సేనాని ముందుండి నడిపిస్తున్నాడు. ఒకానొక సమయంలో అతను ప్రత్యర్థుల దాడిని తట్టుకోలేక దాదాపు రెండు వందల మంది సైన్యంతో కలసి ఓ పెద్ద కొండ పక్కన దాక్కున్నాడు. తమ పరిస్థితిని పై అధికారులకు ఎలా తెలియజేయాలా? అని ఆలోచిస్తున్నాడు. ఇంతలో ఆయనకు తన పెంపుడు పావురం 'అమీ' గుర్తొచ్చింది. అది ఎప్పుడూ ఆయన వెన్నంటే ఉండేది. యుద్ధరంగంలో పరిస్థితులన్నీ వివరిస్తూ, ఓ లేఖ రాసి తన ప్రియపావురం కాలికి కట్టాడు. ఆ లేఖతో వెంటనే అమీ ఆకాశంలోకి ఎగిరింది.

ఓ వైపు తుపాకి గుండ్ల శబ్దాలు, మరోవైపు కాల్పుల జ్వాలలు! అయినా ఆ పావురాయి తన యజమాని తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టాలనుకుంది. సిపాయిల స్వైరవిహారాన్ని తప్పించుకుంటూనే అది వినువీధుల్లో ముందుకు సాగిపోతూ ఉంది. ఇంతలో దురదృష్టవశాత్తూ ఓ సైనికుడు పేల్చిన తుపాకి గుండు అమీకి తగిలి, కాలు ఛిద్రమైపోయింది. అయినా పాపం! ఆ పావురం ఆగిపోలేదు. ఆ బాధతోనే ఎగరసాగింది. రక్తమోడుతూ, ఆ గాయాల బాధను ఓర్చుకుంటూనే వెళ్ళి, చార్లెస్ ఇచ్చిన సమాచారాన్ని అధికారులకు చేర్చింది. అమీ ఇచ్చిన సమాచారంతో అధికారులు అప్రమత్తమై, హుటాహుటిన స్పందించారు. తమ సేనానితో పాటు సైనికుల ప్రాణాలను రక్షించారు. అమీ మాత్రం ఆ గాయాలతో కృశించి పోయి, కొన్నాళ్ళకు కన్నుమూసింది. అయినా ప్రపంచ పోరాట చరిత్రలో చిరస్థానాన్ని మిగుల్చుకుంది.

అందుకే 'అమెరికన్ చారిత్రక జాతీయ ప్రదర్శనశాలలో' అమీ జ్ఞాపకంగా విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఇలా మూగజీవాలైనా అనేక సార్లు మనిషి కన్నా ఉదాత్తంగా ప్రతిస్పందిస్తూ, మానవలోకానికే మహత్తర పాఠాలు నేర్పుతూ ఉంటాయి. అందుకే 'మూగప్రాణుల ప్రపంచమే వేరు. మనుషుల్లా కాకుండా, సరళంగా జీవించే ఆ పశుపక్ష్యాదుల నుంచి మనం ఎన్నో మంచి లక్షణాలను నేర్చుకోవాలి' అనేవారు భగవాన్ రమణ మహర్షి.

ప్రేమనిస్తే ప్రాణమిస్తాయి....: పేరుకు నోరులేని ప్రాణులైనా, ఎన్నో సందర్భాల్లో అవి మన కన్నా ఎంతో ఇంగితంతో ప్రవర్తిస్తాయి. తమను పాలించి, పోషించే వ్యక్తుల కోసం ప్రాణాలైనా అర్పించటానికి వెనుకాడవు. నిత్యజీవితంలో అలాంటి మూగజీవాల ఉదంతాలను ఎన్నింటినో మనం చూస్తూనే ఉంటాం. విశ్వాసపాత్రతలో అవి సాటిమానవుడిని కూడా మించిపోయిన సందర్భాలు ఎన్నో!

ఉదాహరణకు రాజస్థాన్ రాజపుత్రుడైన మహారాణా ప్రతాప్‌సింగ్‌కి చేతక్ అనే అశ్వం ఉండేది. అది ఆ మహావీరుడికి నమ్మినబంటు! మహారాణాప్రతాప్‌కి, అక్బర్‌కి మధ్య జరిగిన మహాసంగ్రామంలో చేతక్ విశేషమైన పాత్రను పోషించింది. ఒకానొక స్థితిలో మహారాణా రణభూమిలో తీవ్రగాయాలపాలై అచేతనుడయ్యాడు. తీవ్ర గాయాలతో ఆ రాజపుత్రుడు తన ప్రియమైన చేతక్‌పైనే మూర్ఛపోయాడు. అక్బర్ సైన్యం కత్తులతో దాడి చేస్తూ వెంటాడుతున్నా, ప్రాణాలకు తెగించి తన యజమానిని ప్రాణాపాయం లేకుండా శిబిరానికి చేర్చింది. తుదకు తను మాత్రం నేలకొరిగింది. ఇలా ఎన్నో మూగజీవాలు తమ స్వామిభక్తితో చరిత్రలో తమకు విశేషమైన స్థానాన్ని మిగుల్చుకున్నాయి. అదే భావంతో ఎమ్మెల్యో హారిస్ అనే పాశ్చాత్య మేధావి 'Animals have a much better attitude to life and death than we do – మూగజీవులు జీవనంలోనూ, మరణంలోనూ మనకన్నా మంచి వైఖరిని కనబరుస్తాయి' అని అంటారు.

విధాత విశేష సృజన...: మూగప్రాణులను నిశితంగా పరిశీలిస్తూ ఉంటే భగవంతుడి సృష్టి వైచిత్రి, విశేషం, మనకు అవగతమవుతూ ఉంటాయి. ఒక్కో జీవిలో ఒక్కో ప్రత్యేకతను పొదిగిన ఆ విధాత విజ్ఞత, సృజనాత్మకత మన ఊహకందని అద్భుతాలు! ఏ జీవికి తగ్గ అవసరాలను, అనుకూలతలను ఆ జీవికి కల్పించి వాటి మనుగడ సజావుగా సాగేట్లు ఆ సృష్టికర్త జాగ్రత్తలు తీసుకుంటూనే ఉంటాడు.

ఆ పరమార్థం తెలిసిన ప్రాణులు కనుకనే అవి కూడు కోసం, గూడు కోసం అనవసరమైన ఆందోళన పడవు. 'నారు పోసిన వాడు నీరు పోయక పోతాడా!' అని మనలా పైకి వల్లించకపోయినా, జీవనంలో మాత్రం నిజంగా ఆ సిద్ధాంతాన్నే అనుసరిస్తాయి. ఆకలి, అవసరం మేరకే ఆర్జిస్తూ, నిబ్బరంగా, నిశ్చలంగా బతికేస్తాయి. కానీ అన్నీ తెలుసను కుంటున్న మనం మాత్రం నారు కోసం, నీరు కోసం అనవసరంగా ఆందోళనలు పడుతూ ఉంటాం. పైగా నలుగురి నారూ మనకే కావాలనుకుంటాం; పొరుగునున్న పొలం నీరూ మన నారుకే మళ్ళించాలనుకుంటాం.

ఇలా బతుకు భద్రత పేరుతో, అతిగా ప్రణాళికలు రచించుకుంటూ, తలకు మించిన భారాన్ని మోస్తూ ఉంటాం. చివరకు ప్రకృతి చేతిలో పిప్పిలా మారి, అర్థం కాని వ్యాధులతో అవస్థలు పడుతూ ఉంటాం. అందుకే ఆ పశుపక్ష్యాదుల రూపంలో భగవంతుడు మనకు మౌనపాఠాలెన్నో నేర్పుతున్నాడు. పట్టెడు అన్నం పెట్టినందుకు ప్రాణాలు పణంగా పెట్టయినా, నమ్మినవారి పట్ల విశ్వాసంతో మెలగాలని శునకంతో, కన్నీళ్ళు తుపానులై ముసిరినా ఆశల రెక్కలతో గమ్యపు గగనానికి చేరువకావాలని కపోతంతో సందేశాలను ఇస్తున్నాడు.

ఆదరిస్తే ఆహ్లాదం, ఆనందం...: పశుపక్ష్యాదులతో గడపటం వలన మనలో సౌమనస్యత, సౌహార్ద్రత, సున్నితత్వం పెంపొందుతాయి. మనస్సులో తెలియని ఆహ్లాదం, ఆనందం పెల్లుబుకుతాయి. పైగా వాటికి ఆహారం పెట్టటం, వాటి ఆలనాపాలనా చూసుకోవటం వలన మనలో ప్రతిఫలం ఆశించకుండా సేవ చేయటం అలవాటవు తుంది. అందుకే మహాత్ములు మూగజీవాలతో సాన్నిహిత్యాన్ని పెంచుకుంటారు.

ఉదాహరణకు శ్రీశారదామాత సాధారణ ప్రజలనే కాకుండా, గోవులు, పిల్లులు, కాకులు తదితర ప్రాణులను కూడా అమ్మలా అక్కున చేర్చుకునేవారు. ఓ సారి లేగదూడ కడుపు నొప్పితో 'అంబా' అని అరుస్తోంది. అది విన్న శారదాదేవి మాతృహృదయం బాధతో తపించింది. ఆమె వెంటనే ఆ దూడ దగ్గరకు వెళ్ళి ఆప్యాయంగా తన చేతులతో నిమిరింది. అమ్మ కరస్పర్శతో కడుపునొప్పి తగ్గి ఆ లేగదూడ కోలుకుంది.

అదేవిధంగా స్వామి వివేకానంద బేలూరుమఠంలో ఉన్నప్పుడు కుక్కలు, జింకలు, కొంగలు, బాతులు ఆయన చుట్టూ తిరుగుతూ ఉండేవి. స్వామీజీ వాటిని ముద్దుపేర్లతో పిలుస్తూ, ఆదరించేవారు. చివరకు 'భాగ్' అనే కుక్క స్వామీజీ కన్ను మూసిన తరువాత ఆ ఎడబాటును తట్టుకోలేక కొన్నాళ్ళకు అది కూడా మరణించింది.

రమణాశ్రమంలో శిష్యుల కన్నా జంతువులే ఎక్కువగా ఉండేవంటే అతిశయోక్తి కాదు. వాటిని మహర్షి అత్యంత ఆత్మీయంగా చూసుకునేవారు. రాళ్ళపొడితో ముగ్గు వేస్తే ఆ పొడి తిని చీమలు చనిపోతాయని, బియ్యం పిండితోనే ముగ్గువేయమని భక్తులకు సూచించేవారంటే, ఆ మహనీయుని జీవకారుణ్యం ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు.

చివరకు 'భారతరత్న' అబ్దుల్‌కలామ్ కూడా మూగజీవాల విషయంలో పరమదయగా మసలుకునేవారు. ఒకసారి తమ ప్రయోగశాల భవనం భద్రతలో భాగంగా ప్రహరీగోడకు సిబ్బంది గాజుముక్కలు అమర్చాలన్నారు. అయితే అలా చేస్తే గోడలపై వాలిన పక్షులు గాయపడతాయని కలామ్ అందుకు అంగీక రించలేదు. అదీ మహానుభావుల సహృదయం.

అందుకే 'He who is cruel to animals becomes hard also in his dealings with human beings. We can judge the heart of a man by his treatment of animals - మూగప్రాణుల పట్ల కఠినంగా వ్యవహరించే వారు మనుషుల పట్ల కూడా అదేవిధంగా వ్యవహరిస్తారు. మూగప్రాణులతో మసలుకునే తీరును బట్టే మనిషి మనస్సు అర్థమవుతుంది' అని అంటారు మహాత్మాగాంధీ.

నేటికీ సమాజంలో స్వచ్ఛంద సంస్థల ద్వారా, సేవాకార్యక్రమాల ద్వారా మూగజీవాలపై ప్రేమాదరణలను చూపుతున్న ఎంతోమంది దయామయులు అభినందనీయులు. ❖

గురుదేవుల జీవకారుణ్యం

భగవాన్ శ్రీరామకృష్ణులకు మూగజీవాలపై అనంతమైన ప్రేమ, కారుణ్యమూ ఉట్టిపడేవి. దక్షిణేశ్వరంలోని వారి గదిలో ఓసారి ఒక పిల్లి తన కూనలతో ఆశ్రయం పొందింది. ఆ తల్లిపిల్లి పరుపు మీద వారి కాళ్ళ వద్ద పడుకొని నిద్రపోయేది. వారు కిందికి జరిగి తమ చేతులతో ఆ పిల్లిని తాకితే, వెంటనే అది ప్రణామం చేస్తున్న భంగిమలో లేచి కూర్చునేది. ఆలయంలో ఆ పిల్లికి, దాని కూనలకు సరిగ్గా ఆహారం లభించటం లేదని తెలిసి శ్రీరామకృష్ణులు ఆందోళన పడ్డారు. వాటిని ఏం చేయాలో అర్థం కాక, చివరికి నిస్తారిణీ ఘోష్ అనే భక్తురాలికి ఇచ్చి, బాగోగులు చూడమని చెప్పారు. ఆమె వచ్చినప్పుడల్లా వాటి ఆలనాపాలనా గురించి ఆరా తీసేవారు.

భగవాన్ శ్రీరామకృష్ణులు అడపాదడపా కలకత్తాకు గుర్రపు బండిలో వెళ్ళేవారు. ఆ గుర్రాలపై ఆయన ఎంతో దయ కనబరచే వారు. ఎక్కువ మందిని లాగటానికి గుర్రాలు కష్టపడ తాయని, బండిలో కూర్చోడానికి ఎక్కువ మందిని అనుమతించే వారు కారు.

అదేవిధంగా బండివాడు గుర్రాలను కొరడాతో కొట్టి నప్పుడు గురుదేవులు బాధ పడుతూ, తనకే దెబ్బతగిలినట్లు కేకపెట్టేవారు. అందుకే బండి వాడు కొరడా ఝుళిపించేవాడు కాదు; అతడు పగ్గాలతో మాత్రమే గుర్రాలను అదిలించేవాడు. ❖

(అక్టోబర్ 4న ప్రపంచ మూగజీవాల దినోత్సవం)

మరపురాని మహామనిషి

-శ్రీమతి సుధామూర్తి(ఇన్ఫోసిస్ ఫౌండేషన్)

'భారతరత్న' అబ్దుల్ కలామ్ ప్రత్యక్ష పరిచయంతో స్ఫూర్తిపొందిన వారిలో నేనూ(సుధామూర్తి) ఒక దాన్నని చెప్పుకోవడానికి ఎంతో సంతోషిస్తున్నాను. కలామ్ గారిని మొదటిసారి బెంగుళూరులో కలిశాను. వారి నిరాడంబర జీవితాన్ని గురించి ఎంత చెప్పినా తక్కువే ననిపిస్తుంది. రోజంతా విశ్రాంతి లేని కార్యక్రమాలతో గడిపినా, ఎప్పుడూ ప్రశాంతంగా ఉండటం వారి ప్రత్యేకత. సమాజంలో పేరున్న వ్యక్తులను ఎంత గౌరవిస్తారో, సాధారణ ప్రజల్నీ అంతే ఆదరించేవారు. వారు రాష్ట్రపతిగా ఉన్న సమయంలో ఓసారి మేము వారిని కలుసుకొని ఏదో విషయమై మాట్లాడుతూ ఉన్నాం. ఇంతలో బయట నుంచి ఓ వ్యక్తి లోపలికి రావాలని ప్రయత్నిస్తున్నాడు. కానీ అక్కడి భద్రతాసిబ్బంది అతన్ని లోనికి రానివ్వటం లేదు. చివరకు కలామ్‌గారు కల్పించుకొని 'ఫరవాలేదు! అతన్ని లోపలికి రానివ్వండి, పాపం! చాలా దూరం నుంచి వచ్చి ఉంటాడు' అని చెప్పి అనుమతించారు. అతనితో ఎంతో ఓపిగ్గా, చిరునవ్వుతో మాట్లాడి పంపారు. వారితో కలసిన ప్రతిసారీ ఇలాంటి అసాధారణ, మానవీయ అనుభవాలు ఎన్నో ఉన్నాయి.

ప్రమాణస్వీకారంలో ప్రత్యేకత...: కలామ్ గారి జీవనఘట్టాలన్నీ విశేషమైనవే అనటానికి ఎన్నో ఉదాహరణలు. దేశాధ్యక్షుడిగా వారి ప్రమాణస్వీకారోత్సవమే ఇందుకు నిదర్శనం. సాధారణంగా రాష్ట్రపతి ప్రమాణస్వీకార కార్యక్రమమనగానే పారిశ్రామిక వేత్తలను, రాజకీయ నాయకులను, అత్యంత ప్రముఖులనే ఆహ్వానిస్తారు. కానీ కలామ్‌గారి ప్రమాణస్వీకారోత్సవానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, శాస్త్రవేత్తలు, సామాన్య ప్రజలకు, వారి చిన్ననాటి మిత్రులకు ఆహ్వానాలు అందాయి. ఆ రోజు ఆ మహానుభావుడు వేదికపై నుంచి 'ఎందరో మహానుభావులు... అందరికీ వందనములు' అనగానే ప్రేక్షకుల్లో ప్రతి ఒక్కరూ కలామ్‌గారిపై కరతాళ ధ్వనులతో ప్రేమామృతాన్ని కురిపించటం ప్రత్యక్ష సాక్షిగా నన్ను కదిలించింది.

కలామ్‌తో సుధామూర్తి దంపతులు

పల్లెసీమలు...పసిమనస్సులు : కలసిన ప్రతిసారీ వారిలోని దాపరికం లేని మనస్తత్వం, మతాతీత దృక్పథం నన్నాశ్చర్య పరచేవి. దయాపూరిత హృదయుడాయన. పల్లెసీమలన్నా, పసిమనస్సులన్నా కలామ్ గారికి అమితమైన ప్రేమ. గ్రామాల సంక్షేమంపై, చిన్నారుల సేవా కార్యక్రమాలపై మాకు ఎన్నో సూచనలిచ్చేవారు. బాలలకు, విద్యార్థులకు సంబంధించిన ఏ కార్యక్రమానికైనా హాజరుకావటానికి వారు ఎప్పుడూ సిద్ధంగా ఉండేవారు. వారు రాష్ట్రపతిగా ఉన్న రోజుల్లో, నిరుపేద చిన్నారుల కోసం ఒరిస్సాలో మేము ఓ ఆసుపత్రి కట్టించాం. దేశాధ్యక్షుడిగా ఊపిరి సలపనంత పనులున్నా, ఆ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి విచ్చేసి తన పెద్దమనస్సును చాటుకున్నారు డా॥ కలామ్.

కర్మయోగి...: ఒకసారి మా ఇన్ఫోసిస్ బృందానికి వారితో కలసి బీహార్‌లో పర్యటించే భాగ్యం కలిగింది. అలా వారి దినచర్యను ప్రత్యక్షంగా గమనించే అవకాశం మా బృందానికి లభించింది. ఆ వయస్సులో కూడా కలామ్ గారు ఎక్కువ పనిచేసేవారు. వారి దినచర్య ఉదయం ఆరున్నరకు ప్రారంభమైతే రాత్రి పదకొండు గంటల వరకు కొనసాగేది. ఆయనతో ఉన్న అందరం వయస్సులో ఆయన కంటే చిన్నవాళ్ళమే! అయినా అందరికంటే అలసట లేకుండా, అత్యంత ఉత్సాహంగా కనిపించింది కలామ్ గారు మాత్రమే! అదే విధంగా బెంగుళూరు ఐ.టి. కామ్‌లో వెయ్యిమంది విద్యార్థులతో వారు ఇంటర్‌నెట్ తరగతిని నిర్వహించడం నేను ప్రత్యక్షంగా చూశాను. అద్భుతంగా పాఠ్యాంశాలను సిద్ధం చేసుకొని వచ్చి, అంతమంది విద్యార్థులను ఏకకాలంలో ఏకాగ్రతతో వినేలా చేసుకున్నారు. మా కుటుంబంతో కలసి ఓసారి రాష్ట్రపతి భవన్‌లో వారితో విందుకు హాజరైనప్పుడు ఆధునిక శాస్త్రపరిజ్ఞానం నుంచి ఆధ్యాత్మిక విషయాల వరకు వారు అన్ని విషయాలపై సాధికారంగా ప్రసంగించగలగటం, చర్చించగలగటం చూసి మేమందరం విస్మయం చెందాం. దార్శనికత, దయార్ద్రహృదయం కలగలిసిన ఆ 'భారత రత్నం' మరపురాని మహామనీషి. ❖సేకరణ: జి.సతీష్

(అక్టోబర్ 15న 'భారతరత్న' డా॥కలామ్ జయంతి, ప్రపంచ విద్యార్థుల దినోత్సవం)

భావ కాలుష్యం

- స్వామి రంగనాథానంద

(రామకృష్ణసంఘం 13వ సర్వాధ్యక్షులు)



కొన్ని దశాబ్దాల క్రితం హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రముఖ మనస్తత్వ శాస్త్రజ్ఞుడు విలియమ్ మెక్‌డొగల్ 'క్యారెక్టర్ అండ్ కాండక్ట్ ఆఫ్ లైఫ్' పేరుతో ఓ పుస్తకం రాశారు. యువతరానికి సచ్ఛీలం, సదాశయాల ప్రాధాన్యం ఎంతో ఆయన ఆ పుస్తకంలో చక్కగా వివరించారు. ముఖ్యంగా యుక్తవయస్సులో ఎలాంటి భావాలతో మనస్సు ప్రభావితమవుతుందో అన్న దానిపైనే భవిత ఆధారపడి ఉంటుందని ఆ రచయిత అభిప్రాయపడ్డారు. నిరంతరం సద్భావనలు, సానుకూల భావనలు మన మనస్సులోకి ప్రసరిస్తూ ఉండాలని సూచించారు. ఆ భావనలే మనలోని ఆదర్శవంతమైన, సంస్కారవంతమైన వ్యక్తిని ప్రపంచంలో ప్రకాశింపచేస్తాయని స్పష్టం చేశారు.

ప్రవర్తనపై ప్రభావం.... : ఈ రోజుల్లో సమాజం వివిధ కాలుష్యాలతో నిండిపోయి ఉందన్న విషయం మనందరికీ తెలిసిందే! వాతావరణ కాలుష్యం, జల కాలుష్యం, ఆహార కాలుష్యం– ఇలా ఎన్నో కాలుష్యాలు మన భౌతిక ప్రపంచాన్ని కకావికలం చేసేస్తున్నాయి. కానీ అన్నింటికన్నా ప్రమాదకరమైన కాలుష్యం 'భావ కాలుష్యం'. నేడు ఎన్నో విధాలుగా చెడుభావాలతో ప్రభావితమై, మన మనస్సులు ఈ భావకాలుష్యంతో మసకబారుతున్నాయి. The world is simply sending waves and waves of pollution to the mind – ఈ ప్రపంచం మన మనస్సులోకి కాలుష్యాన్ని పంపిస్తూనే ఉంది. కానీ మనలో అప్రమత్తత లోపించి, దానిని నియంత్రించుకునే శక్తి మాత్రం నానాటికీ సన్నగిల్లుతోంది. నిశితంగా ఆలోచిస్తే, మన ప్రవర్తనను నిర్దేశించడంలో, బాహ్యం నుంచి స్వీకరించే భావనలు ప్రముఖ పాత్రను పోషిస్తాయి.

అందుకే మన సనాతన ధర్మంలో ఉపనిషత్తులు ఈ భావకాలుష్యాన్ని పరిహరించుకునే విధాలెన్నింటినో ఉటంకించాయి. ఎల్లప్పుడూ జ్ఞానేంద్రియాల ద్వారా సద్భావనలే ప్రవేశించుగాక! అని ప్రార్థించమని ప్రబోధించాయి. మనం స్వీకరించే భావాలను అనుసరించే మన వ్యక్తిత్వం ఆధారపడి ఉంటుందన్నది నిర్వివాదాంశం. మనం తీసుకునే ఆహారం మన ఆరోగ్యానికి, శారీరక దారుఢ్యానికి ఎలా కారణమవుతుందో అలానే మనం చదివే, వినే, చూసే భావనలే మన ఆలోచనలను, ప్రవర్తనను ప్రభావితం చేస్తాయి. అందుకే ...mental food is more important than even physical food - శారీరక పోషణార్థం తీసుకునే ఆహారం కన్నా, మనస్సు ద్వారా స్వీకరించే భావాలు(మానసిక ఆహారం) ముఖ్యం.

భావశుద్ధి ప్రధానం...: పరిసరాల్లోని భావాలకు మనం ఎలా ప్రతిస్పందిస్తున్నామన్న దానిపైనే మన వ్యక్తిత్వం ఆధారపడి ఉంటుంది. బాహ్యంలోని భావప్రేరణలను విచక్షణతో పరిశీలించుకోకుండా, యాంత్రికంగా ప్రభావితమయితే ప్రమాదం. మన చుట్టూ ప్రసరించే భావనలను శుద్ధి చేసుకుంటూ, సద్భావనలనే ఆహ్వానించగలిగేలా మనస్సుకు శిక్షణనిచ్చుకోవాలి. ఉదాహరణకు కోలారు బంగారు గనుల్లో ఇలాంటి లోహశుద్ధి ప్రక్రియే కొనసాగుతుంది. రాళ్ళూ, మట్టి కలిసిన ముడిసరుకును శుద్ధి చేసి బంగారాన్ని వెలికితీస్తారు. ఈ శాస్త్రీయ ప్రక్రియను మన భావశుద్ధికి కూడా అన్వయించుకోవాలి. అయితే మనం చాలాసార్లు, ముఖ్యంగా యుక్తవయస్సులో ఈ భావశుద్ధి, భావనియంత్రణల ప్రాముఖ్యాన్ని గుర్తించకపోతే దుష్పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుంది.

నిజానికి నేడు ప్రపంచంలో ఎన్నో ఘాతుకాలకు బీజం వేస్తుంది, మన మనస్సులను కారుమేఘాల్లా కమ్మేస్తున్న ఈ భావకాలుష్యమే! మనలో పేరుకు పోయిన చెడు భావనలే ఏదో ఒక క్రియారూపకంగా ప్రదర్శితమవుతాయి. అటు మనతో పాటు సమాజానికీ నష్టాన్ని చేకూరుస్తాయి. బాహ్యమైన భావకాలుష్యానికి స్పందించిన రీతిలో మానసికంగా కూడా సురక్షితంగా, సుశిక్షితులుగా నిలబడడం అలవాటు చేసుకోవాలి. ❖ **తెలుగు సేత : ఆర్. కృష్ణ**

సర్వజీవులయందూ చేతనారూపంగా ప్రతిష్ఠితమై ఉన్న దేవికి మాటిమాటికీ నమస్కారములు. - *దేవీ మాహాత్మ్యం*

(...23వ పేజీ తరువాయి)

ముగ్గురమ్మల మాహాత్మ్యం

(దైవీగుణాలు) సముపార్జించేందుకు తీవ్ర ప్రయత్నమనే మూల్యం తప్పక చెల్లించవలసి ఉంటుంది.

ఇంక ఆఖరుదశలో, భ్రమ అనే అజ్ఞానపు ఆవరణను కలిగి ఉన్న శుంభనిశుంభులను తుదముట్టించేందుకు, ఆ దేవి అత్యున్నత బ్రహ్మజ్ఞానానికి చైతన్యవంతమైన మూర్తిగా, మహా సరస్వతిగా ఆవిర్భవించి, వారిని సంహరించింది. ఈ దశలో, సాధకుడు సరస్వతీ దేవిని ఉపాసించడం అనగా విచారణ చేస్తూ జ్ఞానార్జన ద్వారా అవిద్య అనే అంధకారాన్ని మటుమాయం చేస్తూ, సత్త్వగుణాన్ని కూడా అధిగమించి, భ్రమల నుండి వెలువడతాడు. దానిచే హృదయక్షేత్రంలో జ్ఞానభాస్కరుడు మబ్బులచే తిరిగి కప్పబడని విధంగా, జ్వాజ్వల్యమానంగా ప్రకాశిస్తాడు. ఈ విధంగా సరస్వతీమాత అనుగ్రహంచే జ్ఞానప్రదానాన్ని పొంది జీవుడు జీవన్ముక్తునిగా పరిణమించేందుకు, విజయాన్ని కైవశం చేసుకునేందుకు, దేవీనవరాత్రులను ఆలంబనంగా చేసుకోగలగాలి. ఈ మూడు దశలను దాటేందుకు నిష్కామకర్మాచరణం, ఉపాసన, జ్ఞాన సముపార్జన ప్రధానాలని మరువరాదు.

మానవ జీవితం పిల్లలు ఆడుకునే వైకుంఠపాళి ఆట వంటిది. ఒకసారి నిచ్చెన ఎక్కినా, క్షణకాలంలో, ఏమరుపాటు వలన క్రిందకు జారుతూ ఉంటాము. అయితే ఈ పరమపద సోపాన మార్గంలో పట్టుదల, దృఢ విశ్వాసం, అచంచల దీక్షలను కలిగి ఉండి, పైన తెలిపిన సాధనాలను ఉపయోగించుకుంటే, అవి ప్రధాన నిచ్చెనలుగా నిలిచి, మార్గాన్ని సుగమం చేస్తాయనడంలో సందేహం లేదు. మనం ఆ లక్ష్యసాధనకై అడుగిడుతూ, ఆదిశంకరులు సౌందర్యలహరిలో దేవిని ప్రస్తుతిస్తూ చేసిన శ్లోకాన్ని స్మరిస్తూ, ముందుకు సాగుదాం.

నిధే! నిత్యస్మేరే! నిరవధిగుణే! నీతినిపుణే!
నిరాఘాట జ్ఞానే! నియమపరచిత్తైకనిలయే!
నియత్యా నిర్ముక్తే! నిఖిల నిగమాంతస్తుతపదే!
నిరాతంకే! నిత్యే! నిగమయ మమాపి స్తుతిమిమామ్!

“సకల శక్తులకు నిధియైన తల్లీ! ఎల్లప్పుడూ మందహాసవదనాన్ని కలిగి ఉన్న ఓ దేవీ! హద్దులేని కళ్యాణ గుణాలను కలిగి ఉన్నదానా! శాస్త్రమార్గంలో నేర్పరియైన దానా! నిర్విషయజ్ఞాన స్వరూపిణీ! నియమ పరులైన యోగుల చిత్తమే ముఖ్య నివాసంగా గల తల్లీ! ఏ నియమానికీ కట్టు వడనిదానా! సకల ఉపనిషత్తులచే స్తుతించబడే తత్త్వ స్వరూపిణీ! ఏ భయమూ, ఆపదా లేని తల్లీ! శాశ్వతురాలా! నా స్తుతిని స్వీకరించుము”. ❖

(...25వ పేజీ తరువాయి)

అంతా మన చేతుల్లోనే...

మనధర్మం ఏమి చెపుతున్నది?... సనాతన ధర్మం ఈ విషయంలో చాలా స్పష్టమైన వివరణను కలిగి ఉన్నది. మనం గత జన్మలలో చేసిన పాపపుణ్యాల ద్వారా సూక్ష్మశరీరం లేదా మనసు నిర్మితమై పోయింది. తల్లితండ్రులు కేవలం స్థూలశరీరం అంటే దేహాన్ని అందిస్తారు. సూక్ష్మశరీరం ఒక సాఫ్ట్‌వేర్ లాంటిది. ఆ సాఫ్ట్‌వేర్ ప్రకారం హార్డ్‌వేర్ దేహం నిర్మితమవుతుంది. తల్లిదండ్రులు కేవలం ఈ దేహాన్ని అందించే వాహకులు మాత్రమే. సూక్ష్మశరీరం తనకు అనువైన శరీరాన్ని జననీజనకుల జన్యువులనుంచి సమీకరించుకుంటుంది. కానీ వారు తెలివైన జననీజనకులై, కేవలం తమకు మంచిచెడుల మిశ్రమంతో కూడుకున్న బిడ్డలు కాకుండా సర్వసులక్షణ శోభితులైన వారసులు కావాలని సంకల్పించి భగవంతుడిని వేడుకున్నట్లైతే వారిద్వారా ప్రపంచానికి పరిచయమవ్వాల్సిన దుర్బలులను ఆయన ఓజస్సంపన్నులుగా చేస్తాడు. వ్యక్తి గత జన్మలలో తన కర్మద్వారా నిర్మించుకున్న సూక్ష్మశరీరం లేదా మనసు, దేహాన్ని ధరించే దశలో ఉన్నప్పుడు ఆ సూక్ష్మశరీరాన్ని మార్చేశక్తి భగవంతుడికి మాత్రమే ఉంటుంది. అందుకని పూర్వం ఎన్నో నోములు, వ్రతాలు, జపతపాలు, యజ్ఞాలు అనుష్ఠించి, ఆలోచనలను పవిత్రం చేసుకొని, దైవాన్ని సంతుష్టపరచి పవిత్ర సంతానాన్ని మాత్రమే లోకంలోనికి తీసుకువచ్చేవారు.

ఈ నిగూఢ రహస్యాలు అర్థం కాకపోవటం వలన, ఆధ్యాత్మిక నియమాలను అవగతం చేసుకోలేకపోవటం వలన గత కొన్ని దశాబ్దాలుగా బలహీన మనస్కులు, తేజోవిహీనులైన వారి సంఖ్యను గణనీయంగా పెంచుకొంటూ వస్తున్నది భారతీయ సమాజం. బలహీనులంటే నిజమైన జ్ఞానాన్ని గ్రహించలేనివారు. నిజమైన జ్ఞానమంటే మనిషిని సర్వదుఃఖాల నుంచి తరింపజేసే ఆధ్యాత్మిక భావనలు.

నేటి భారతంలో ఉన్న పరిస్థితులను చూస్తే సర్వత్రా అజ్ఞానం ప్రబలి ఉందనిపిస్తున్నది. అజ్ఞానమే సర్వదుఃఖహేతువని ఋషుల బోధ. శంకరాచార్య, వివేకానంద, రామకృష్ణ పరమహంస, రమణమహర్షి లాంటి మహనుభావులు ప్రపంచాన్ని అంతగా ప్రభావితం చేసారంటే వారంతా నిజమైన ఆర్యసంతానం. వారి మాతాపితరులు ఎన్నో ఏళ్ళు దైవాన్ని ఉపాసించి, ప్రార్థించి, పవిత్ర సంకల్పంతో అలాంటి వారిని ఈ లోకానికి పరిచయం చేశారు.

కోరుకోవాలే గానీ దైవమే మానవుడై భువిపై అవతరిస్తాడని మన ధర్మం చెపుతున్నది. కాబట్టి అంతా మన చేతుల్లోనే ఉంది. అందుకే రేపటి తల్లితండ్రులైన నేటి యువతంతా ప్రార్థనతో సంతానాన్ని స్వీకరించి, బిడ్డలకు ధర్మసంస్కారాన్ని జన్మతః రాబట్టుకొందురు గాక! ❖

(1884 – 1967)

ముందుకు సాగిపో!

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ, ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్న్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ - వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్న్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం, ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

సార్‌గాచీ
...1948

ప్రియమైన సి. ఆర్. దాస్!*

అస్తవ్యస్తత, సంశయాత్మకత, అసూయలాంటి విషాలు ప్రపంచమంతటా వ్యాపించి ఉన్నాయి. ఇలాంటి వాతావరణంలో మానసిక ప్రశాంతత అసాధ్యమైన విషయమే. అవిశ్రాంతత నెలకొన్న తావులో మనస్సు ఎలా ప్రశాంతంగా ఉండగలదు?

నీకు కావలసింది ఏమిటో, అక్కరలేనిది ఏమిటో కాలగమనంలో నీవే నిర్ణయించుకోవాలి. ఒకవేళ చిట్ట చివరకు మనం ఆశించిన ఫలితం దక్కినా, అప్పటికి మాత్రం మనస్సు సంతృప్తిగా ఉంటుంది. కానీ కోరికలనన్నింటినీ త్యజిస్తేనే సంపూర్ణానందం లభిస్తుంది.

పరిస్థితులపై ఆధిపత్యం సంపాదించడానికి రెండే మార్గాలున్నాయి:

ఒకటి – మోహరహితుడవై సంఘటనల యెడల సంపూర్ణమైన నిర్లక్ష్య వైఖరి అవలంభించడం. ఇక రెండవది – ప్రాణశక్తిపై సంపూర్ణమైన అదుపును సంపాదించడం. ఇందులో మొదటి విధానం కర్మ, భక్తి, జ్ఞాన యోగాల వల్ల సాధ్యమవుతుంది. రెండవదానిని రాజయోగం ద్వారా సాధించవచ్చును. కానీ మనం కోరుకున్నా, కోరుకోకపోయినా సంఘటనల్లో వచ్చే పరిణామాలు శాశ్వతాలు కావు.

నువ్వు మీ అమ్మకు సేవ చేయడానికి ఎవరినో నియమించావు. అది గొప్ప పనే. అయితే నీవు కూడా కొంతమేరకు ఆమెను సేవించాలి. ఎవరికైనా సరే మాతృమూర్తి దీవెనలు ఎంతో ముఖ్యమైనవి. ఆశ్చర్యకరమైనది ఏమిటంటే, జీవితం తన రహస్యాలను ఆవిష్కరించడానికి చాలా సమయం తీసుకుంటుంది. దీనిని అర్థంచేసుకోవడానికి నీకు తగినంత సమయం ఉందని ఆశిస్తాను.

మనం భగవంతునికి ప్రతి విషయాన్నీ మౌనంగా విన్నవించుకోవచ్చును. కానీ మనుష్యులకు మన భావాలను విశదీకరించడానికి మాటలు అవసరం. సమస్యల భారం నీ భుజస్కంధాలపై ఎప్పుడు పడుతుందో లేదా సమస్యల భుజాలపైకెక్కి నీవే ఎప్పుడు స్వారీ చేయగలవో చెప్పడం అంతతేలికైన విషయం కాదు. చివరకు ఎవరు గెలుస్తారో కూడా నిర్ణయించలేము.

నీ భవిష్యత్ గురించి నేను చెప్పినదంతా ఏవిధమైన జ్యోతిష్యశాస్త్ర గణనలను బట్టి కాదు. కేవలం మనిషిని చూసి చెప్పవచ్చును. వర్తమానం గతం చేత నెట్టబడుతూ, భవిష్యత్తు చేత లాగబడుతూ ఉంటుంది. శ్రీరామకృష్ణులను శరణువేడితే పరిస్థితులన్నీ అనుకూలంగా మారతాయి. అందుకు ప్రయత్నించు.

*(చిత్తరంజన్‌దాస్ కాలాంతరంలో రామకృష్ణ సంఘంలో స్వామి ముముక్షానందగా ప్రసిద్ధులు)

ప్రేమాశీస్సులతో
స్వామి ప్రేమేశానంద

తెలుగు సేత: *కె. త్రివిక్రమరావు*

సర్వజీవులయందూ జాతిరూపంగా ప్రతిష్ఠితమై ఉన్న దేవికి మాటిమాటికీ నమస్కారములు. - దేవీ మాహాత్మ్యం

(...15వ పేజీ తరువాయి)

మణిమేఖలయు, బొడ్డుమానికంబును, వైజ
యంతియు, నురమున నలరు సిరియు
వరదహస్తము కటి వర్తిలు కేలు, శం
ఖము చక్రమును దాల్చు కరయుగంబు
నెసగ కనుపట్టు శ్రీవేంకటేశు జూచె! అన్నాడు. ఆ దివ్యానుభూతితో ఆ తరువాత సూరన కంచికి ప్రయాణమయ్యాడు. నాటికీ, నేటికీ కవులు, కళాకారులు వివిధ ప్రక్రియల్లో ఆ పద్మావతి ప్రియుడిని సేవించుకుంటూనే ఉన్నారు.

జంటల వెలుగుశంఖచక్రాలవే...

తీర్థక్షేత్రాలను ఎన్నిసార్లు సందర్శించుకున్నామన్నది ముఖ్యం కాదు. తాదాత్మ్యతతో ఆ మూర్తులను మనస్సులో ఎంత గాఢంగా ముద్రించుకున్నామన్నది ప్రధానం. ఆ భావనతో ఒక్కమారు ఆలయంలో అడుగుపెట్టినా చాలు, చిన్మయమూర్తి చిత్తరువులు చిరకాలం మనస్సులో మెదలుతూనే ఉంటాయి. ఆ తన్మయంతోనే ఆ నిత్యకల్యాణమూర్తి నిలువెత్తు రూపాన్ని గుండెలనిండా నింపుకొని,

కంటి గంటి వాడె వాడె ఘనమైన ముత్యాల
కంటమాల లవే పతకములు నవె
మింటి పొడవైనట్టి మించు కిరీటం బదె
జంటల వెలుగుశంఖచక్రాలవే! అంటున్నాడు అన్నమయ్య. ముత్యాల కంఠమాలలను, పతకాల పేరును, ఆకాశమంత ఎత్తుకు ఎదిగిన కిరీటాన్ని, వెలుగులీనుతున్న జంట శంఖచక్రాలను పేరుపేరునా వర్ణిస్తున్నాడు. ప్రముఖ వాగ్గేయకారుడు ముత్తుస్వామి దీక్షితులు కూడా తిరుమల వాసుడిని దర్శించుకొని ఇదే అనుభూతిని ఆస్వాదించి, ఆనందపరవశుడై ఆశువుగా....

శ్రీవేంకటేశం భజామి సతతం,
శంఖచక్రధరం। శంఖనాదప్రియకరం।
గోవిందం, విధిగురుగుహాది
పూజితాత్మపదం। కలియుగ ప్రసన్నం॥ అంటూ గీతమాలికలతో ఆ గజరాజ రక్షకుడిని కీర్తించాడు. ఇలా పండితులు, పామరులు అన్న తేడా లేకుండా ఎవరికైనా ఆ పుండరీకాక్షుడిని చూడగానే చిత్తం భక్త్యావేశంతో ఉప్పొంగిపోతుంది.

భుజకీర్తులును నవె...

ఏకస్వరూపుడైన భగవంతుడు అనేక రూపాలను ధరించి దర్శనభాగ్యం కల్పించేది మన ఆరాధనా సౌలభ్యం కోసమే! ఎవరికి ఏ రీతిలో గురి కుదురుతుందో గుర్తెరిగి తన రూపురేఖల్ని మార్చుకుంటున్నాడు ఆ అనంతరూపుడు! ఆ పరంపరలో భద్రాద్రిపై సీతాసమేత రామచంద్రుడి ప్రత్యక్షం రామదాసును పరమానందంలో ముంచెత్తింది. ఆ పులకింతతోనే మధ్యమావతి రాగంలో 'పాహి రామ ప్రభో, పాహి రామప్రభో! పాహి భద్రాద్రి వైదేహి రామప్రభో! ఇందిరా హృదయారవిందాధి రూఢా, సుందరాకార ఆనంద రామప్రభో!' అంటూ పట్టాభిరాముడిని తన పాటలపల్లకీలో ఊరేగించాడు. ముందుకు వచ్చి నిలుచున్న ముగ్ధమనోహరుడిని మనసారా చూసుకుంటూ, ఇక్కడ అన్నమాచార్యులు అదే భక్త్యావేశంతో....

మొక్కు మొక్కు వాడె వాడె ముందరనే వున్నాడు
చెక్కులవే నగవుతో జిగిమోమదె
పుక్కిట లోకములవె భుజకీర్తులును నవె
చక్కనమ్మ అలమేలు జవరాలదె! అని ఆ నవ్వుల చెక్కిళ్ళ మోమును, పుక్కిట కనిపిస్తున్న సమస్తలోకాలను, ఆ పక్కనే నిలుచున్న అమ్మ అలమేలు మంగను మనందరికీ పరిచయం చేస్తూ, ఆ దర్శనాలను తన పదాలతో ప్రత్యక్ష ప్రసారం చేయిస్తున్నాడు. మొక్కుకొని తరించమంటున్నాడు.

మూలభూతమదె...

దయామయుడైన భగవంతుడు తనను దూషించినవారికీ ఇదే తీరులో దర్శనమిచ్చి తరింపచేస్తాడనటానికి దృష్టాంతాలెన్నో! మార్గమేదైనా మననం చేసుకుంటే చాలు, ముందు వాలిపోతాడు. మోక్షమిచ్చేస్తాడు. ఆర్తితో ప్రహ్లాదుడి మనస్సు నిండా శ్రీమన్నారాయణుడే! అక్కసుతో హిరణ్యకశిపుడి మనస్సు నిండా శ్రీమన్నారాయణుడే! 'ఎక్కడ ఉన్నాడో చెప్పు నీ శ్రీహరి?' అంటాడు ఆ తండ్రి! 'నా శ్రీహరి అంతటా ఉన్నాడ'ని అంటాడు ఆ కుమారుడు. ఇక లాభం లేదనుకొని ఆ ఇద్దరి కోసం హుటాహుటిన నరసింహుడై అవతరించాడు. ఆ ఇద్దరితో పాటు పరోక్షంగా పోతనామాత్యులకూ దర్శనభాగ్యం కలిగింది. అందుకే ఊపిరి సలపలేనంత పదబంధాలతో ఆ నారసింహుడి ఆవిష్కరణకు అక్షరరూపమిచ్చాడు. ఆ అపూర్వ సాక్షాత్కృతి సన్నివేశాన్ని...

శంఖ చక్ర గదా ఖడ్గ కుంత తోమర ప్రముఖ నానాయుధ...
మంజు మంజీర మణిపుంజ రంజిత మంజుల హార కేయూర
కంకణ కిరీట మకర కుండలాది భూషణ భూషితుండును...

అంటూ కొనసాగించాడు. అదే తీరులో ఈ తాళ్ళపాక వంశ శోభితుడు, ఆ మూలవిరాట్టు ముంజేతి కంకణంపై, మొలతాడుపై, పచ్చని పసిడి పుట్టంపై తన పదాల పన్నీరును చిలకరిస్తున్నాడు. తన కన్నులకు ఇంతటి దివ్యదర్శన భాగ్యాన్ని కల్పించిన ఆ మోహనాకారుడిని మూలనిధానమైన, మూలభూతంగా కొనియాడుతూ...

ముంగైమురాలును నవె మొలకతారును నదె
బంగారు నిగ్గుల వన్నె పచ్చుబట్టదె
యింగితమెరిగి వేంకటేశుడిదె కన్నులకు
ముంగిటనిధానమైన మూలభూతమదె! అని ముక్తాయింపు పలుకుతున్నాడు. ఇలాంటి కీర్తనను భావమెరిగి వినినంతనే ఆ తిరుమలవాసుని నిలువెత్తు విగ్రహం మనస్సులో మెదలుతుందనడంలో సందేహం లేదు. ❖

(అక్టోబర్ 14 నుండి 22 వరకు శ్రీ తిరుమల తిరుపతి నవరాత్రి బ్రహ్మోత్సవాలు)

చేసుకున్నవారికి చేసుకున్నంత!

అనగనగా ఒక గ్రామంలో ఇద్దరు బ్రాహ్మణులు ఉండేవారు. ఇద్దరూ చాలా బీదవారు. వారిలో ఒకడు పుట్టు గ్రుడ్డివాడు. ఇద్దరూ మంచి శివభక్తులు. ఒక రోజు పార్వతీ పరమేశ్వరులు విహారానికి వెళుతూ ఈ ఇద్దరిని చూసినపుడు పార్వతీదేవి "నాథా! వీరిద్దరూ మంచి శివభక్తులు; మిమ్మల్నే నమ్ముకొని జీవిస్తున్నవారు. ఎప్పుడూ మీ నామస్మరణే చేస్తుంటారు. వీరికి సర్వ సంపదలను ప్రసాదించవచ్చు కదా!" అని శివుణ్ణి అడిగింది.

అందుకు శివుడు నవ్వుతూ "దేవీ! బ్రహ్మరాతని ఎవ్వరూ తప్పించలేరు. అదృష్టవంతుణ్ణి చెడగొట్టేవాడు లేడు, దురదృష్టవంతుణ్ణి బాగుచేసేవాడు లేడు. త్వరలో గ్రుడ్డివానికి అదృష్టం కలుగబోతోంది; కానీ ఈ కళ్ళున్న బ్రాహ్మణుడికి బాధలు తప్పవు" అని అంటాడు. పార్వతీదేవికి భర్త మాటలు నచ్చలేదు. అందుచేత కళ్ళు ఉన్న బ్రాహ్మణునికి తానే సహాయం చేయాలనుకుంది.

మరునాడు ప్రక్క గ్రామానికి వెళ్ళిన ఇద్దరు బ్రాహ్మణులు భిక్షాటన ముగించుకొని వస్తున్నారు. అప్పుడు పార్వతీదేవి బంగారు నగలున్న మూటను వారు వెళుతున్న దారిలో పడేసింది. కళ్ళున్న బ్రాహ్మణుడు ఆ దారిన నడుస్తూ "కళ్ళులేని బ్రాహ్మణుడు పాపం ఎలా నడుస్తాడో కదా! ఈ రోజు నేను కళ్ళు మూసుకొని ఎంతదూరం నడవగలనో చూస్తాను" అని అనుకున్నాడు. కళ్ళు మూసుకొని నడుస్తూ దారిలో పడి ఉన్న బంగారు నగల మూటను దాటి వెళ్ళిపోయాడు. అలాదాటి 10 అడుగులు వెళ్ళిన తర్వాత, ఇంక కళ్ళు మూసి నడవడం కష్టం అని అనుకుంటూ కళ్ళు తెరిచాడు.

ఇక కళ్ళులేని బ్రాహ్మణుడు కర్రతో నేల మీద తట్టుకొంటూ వెళుతున్నాడు. పార్వతీదేవి దారిలోపడవేసిన బంగారు నగల మూట అతని కర్రకు తగిలింది. అప్పుడు ఆ బ్రాహ్మణుడు "అయ్యో! ఎవ్వరో ఈ రాయిని దారిలో పడవేశారు; దీనిని ప్రక్కన పెట్టాలి అనే మంచి హృదయంతో వంగి దానిని తీసాడు. అతడి చేతికి ఒక మూట తగిలింది. ఆ మూటను తన జోలెలో వేసుకొని ఇంటికి తీసుకువెళ్ళి భార్యకు ఇచ్చాడు. ఆమె మూటను విప్పి చూసి, సంతోషంతో పొంగిపోయింది. ఇంతకాలానికి మనలను దేవుడు కరుణించాడు అని భర్తకు చెప్పి మూటలో ఉన్న బంగారు నగల గురించి చెప్పింది. ఆ బ్రాహ్మణుడు కూడా సంతోషించి దైవాన్ని ప్రార్థించాడు.

ఇదంతా చూసిన పార్వతీదేవి శివుని మాటలలోని ఆంతర్యాన్ని అర్థం చేసుకుంది. సంపద ఇచ్చినా కళ్ళు ఉన్న బ్రాహ్మణుడు కళ్ళు మూసుకోవడం వల్ల అతడికి సంపద దక్కలేదు. కళ్ళులేని బ్రాహ్మణుడికి ఆ సంపద దక్కింది. దీన్నిబట్టి భర్త చెప్పిన మాటల్లోని మర్మాన్ని గ్రహించింది.



నీతి: 1. చేసుకున్నవారికి చేసుకున్నంత.

2. అదృష్టవంతుణ్ణి చెడగొట్టేవారు లేరు, దురదృష్టవంతుణ్ణి బాగుచేసేవారు లేరు.

– **ఆకల శ్రీధాత్రి**, 7వ తరగతి
కేంద్రీయ విద్యాలయం,
బాబా మెట్ట, విజయనగరం.

ఒక కథ చెబుతా... 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రిక ఉన్నత పాఠశాల విద్యార్థులలో వ్యాసరచన ప్రతిభను ప్రోత్సహించడం కోసం, సద్భావాలను పెంపొందించడం కోసం 'ఒక కథ చెబుతా...' శీర్షికను ప్రారంభించింది. ఈ శీర్షికలో ప్రచురించడానికి విద్యార్థుల నుండి నీతి కథలు, వ్యక్తిత్వవికాస కథలు, స్ఫూర్తిదాయక కథలు, ఆధ్యాత్మిక కథలను ఆహ్వానిస్తోంది. వ్యాసాలను చక్కని దస్తూరీతో సరళభాషలో రాసి, మీ పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను జతపరచి పంపించండి. మీ పూర్తి చిరునామాను పొందుపరచండి. ఎంపికైన కథలకు బహుమతి లభిస్తుంది.

వ్యాసాలను పంపించాల్సిన చిరునామా : సంపాదకులు, శ్రీరామకృష్ణ ప్రభ, రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాద్–500 029. E-mail : sriramakrishnaprabha@gmail.com

- స్వామి పరిజ్ఞేయానంద

తృష్ణ తగ్గితేనే తృప్తి!

అర్జునుడు స్థితప్రజ్ఞుని గురించి వివరించమని భగవాన్ శ్రీకృష్ణుణ్ణి 'స్థితప్రజ్ఞుని లక్షణమేమిటి? అతడు ఎలా మాట్లాడుతాడు? అతడు ఎలా కూర్చుంటాడు? అతడు ఎలా వ్యవహరిస్తాడు?' అని నాలుగు ప్రశ్నలను అడిగాడు. ఈ ప్రశ్నలన్నీ బాహ్య ప్రవర్తనకు సంబంధించినట్లుగా ఉన్నా, అవి మన అంతరంగ పరివర్తనతో ముడిపడి ఉన్నాయని గ్రహించాలి.

ఈ నాలుగు ప్రశ్నలకు భగవానుడిచ్చిన సమాధానాల వల్ల సిద్ధపురుషుడి సహజ లక్షణాలు తేటతెల్లమవుతాయి. భగవానుడు వివరించిన స్థితప్రజ్ఞుని లక్షణాలు సాధనామార్గంలో మనం ఎంత ప్రగతిని సాధించామో పరీక్షించుకోవడానికి కొలబద్దగా ఉపయోగపడతాయి.

అర్జునుడు అడిగిన మొదటి ప్రశ్నకు శ్రీకృష్ణుడు సమాధానమిస్తూ...

ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్ ।
ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞ స్తదోచ్యతే ॥ *(భ.గీ. 2-55)*

'పార్థా! మనస్సులోని సమస్త కోరికలను విడిచిపెట్టి, తనలో తాను సంతృప్తిచెందినవాడిని స్థితప్రజ్ఞుడంటారు' అని స్థితప్రజ్ఞుని లక్షణాన్ని వివరించాడు.

మనస్సులో కోరికలు ఉన్నవాడు సాధారణ వ్యక్తి. కేవలం మంచి కోరికలే ఉన్నవాడు సాధకుడు. మనస్సులో ఎలాంటి కోరికలూ లేనివాడు స్థితప్రజ్ఞుడు.

ఒక ఊరిలో ఓ యోగి ఉండేవాడు. అతడు ప్రాణాయామ ప్రక్రియ ద్వారా శ్వాసను బంధించి చాలా రోజులు సమాధిలో ఉండిపోయాడు. ఆ యోగి నిర్వికల్పసమాధి స్థితిని పొందాడని ప్రజలు ఆయనను దర్శించుకోవడానికి తండోపతండాలుగా వెళ్ళేవారు. అతడు కొద్దిరోజుల తరువాత సమాధిస్థితి నుండి బాహ్యస్పృహకు రాగానే 'ఫలానా వ్యక్తి నాకు కొంత సొమ్ము ఇస్తానన్నాడు, అతడెక్కడ?' అంటూ చుట్టూ ఉన్న వారిని వాకబు చేయసాగాడు. మనస్సులో ఏ చిన్న కోరిక ఉన్నా అది సాధనావస్థేగానీ సిద్ధావస్థకాదు. అందుకే భగవానుడు 'మనస్సులో లేశమైనా వాంఛలు లేనివాడే నిజమైన స్థితప్రజ్ఞుడు' అని నియమాన్ని విధించాడు.

అయితే, మనస్సులో ఏ కోరికలూ లేనివారంతా స్థితప్రజ్ఞులేనా? ఒకరికి మాట ఇచ్చామనో, ఎవరైనా చూస్తే ఏమనుకుంటారనో, పరిస్థితులు సహకరించకపోవడం వల్లనో మనస్సులోని కోరికలను బలవంతంగా అణచుకొని, బయటకు మాత్రం ఏ కోరికలూ లేనట్లుగా ప్రవర్తిస్తే స్థితప్రజ్ఞత్వం సిద్ధించినట్లేనా? కోరికలను అణచుకున్నవారు ప్రశాంతంగా ఉండలేరు; సంతృప్తిగా జీవించలేరు.

అందుకే నిజమైన స్థితప్రజ్ఞుడికి ఉండాల్సిన మరో లక్షణాన్ని భగవానుడు వివరిస్తూ 'ఆత్మన్యేవాత్మనా తుష్టః... - తనలో తాను సంతుష్టుడై సంతోషంగా ఉన్నవాడు స్థితప్రజ్ఞుడు' అని తెలిపాడు. మనస్సులోని కోరికలు సహజంగా నాశనమైనప్పుడే నిజమైన ఆనందం, సంతృప్తి కలుగుతుంది. అంతేగానీ, మనస్సులో ఏ మాత్రం వెలితి ఉన్నా సంతృప్తిగా, సంతోషంగా జీవించడం సాధ్యం కాదు.

ఒక కోటీశ్వరుడు ఓ సూఫీ యోగిని దర్శించుకోవడానికి వెళ్ళాడు. ఆ యోగిని దర్శించిన తరువాత అతడు 'స్వామీ! నేను మరణించిన తరువాత నా యావదాస్తి మీకు చెందేటట్లు వీలునామా రాస్తాను' అని అన్నాడు. వెంటనే ఆ యోగి అతడితో 'నేను ఎప్పుడో చనిపోయానని నీకు తెలియదా!' అని నవ్వుతూ అన్నాడు. మనస్సులోని వాంఛలన్నీ తొలగిపోయినవారు ఆత్మానందంలో ఓలలాడుతూ నిత్యతృప్తులుగా జీవిస్తారు. అలాంటి మహాత్ములకు బాహ్యసంపదలతో పనిలేదు. అందుకే ఆదిశంకరాచార్యులు వివేకచూడామణిలో 'నిర్ధనోపి సదా తుష్టో... - బ్రహ్మవేత్త నిర్ధనుడైనప్పటికీ నిత్య సంతుష్టుడిగా ఉంటాడు' అని సిద్ధపురుషుడి లక్షణాన్ని వివరించారు.

వాంఛలన్నీ తొలగిపోవడం, ఆత్మానందంలో ఓలలాడడం - ఈ రెండు లక్షణాలు ఉన్నవాడే నిజమైన స్థితప్రజ్ఞుడు. అయితే, 'కోరికలు లేని జీవితాన్ని ఊహించగలమా? అసలు అలాంటి స్థితిని పొందడం సాధ్యమేనా?' అని మనకు అనిపిస్తుంది. అందుకు కారణం పుట్టిన దగ్గర నుండి మన ఆనందం బాహ్యవస్తువుల వల్ల, వ్యక్తుల వల్ల లభిస్తుందని భ్రమించడమే! పిల్లవాడు తనకు బొమ్మలతో ఆడుకోవడం వల్ల ఆనందం

- స్వామి పార్థసఖానంద

చదువులకు పరమావధి సమాచారం కాదు - సౌశీల్యం; మానవ ఆదర్శం జీతం కాదు - జీవితం; మన గమ్యం మర మనిషిగా మారడం కాదు - మహోన్నతమైన మహర్షిగా మారడం.



చింతించడం అనేది ఊయల లాంటిది. అది మనల్ని నిరంతరం కదిలిస్తూనే ఉంటుంది. కానీ ఎక్కడికీ తీసుకువెళ్ళదు!



ఈ ఘోర ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదు, చివరికి మనల్ని ఏడిపించే సమస్యలతో సహా!

లభిస్తుందని అనుకున్నట్లు, మనం కూడా బాహ్యవిషయాల వల్లనే మనకు ఆనందం లభిస్తుందని భావించినంత కాలం కోరికలు లేని జీవితాన్ని ఊహించలేం. ఎప్పుడైతే నిజమైన ఆనందం మన అంతరంగంలోనే ఉందని గ్రహిస్తామో అప్పుడు మనస్సు బాహ్యవిషయాలవైపు పరుగులు తీయడం ఆపేస్తుంది.

అయితే, స్థితప్రజ్ఞ స్థితిని సాధించడం అందరికీ అంత సులభసాధ్యమైన విషయం కాదు. కానీ భగవానుడు 'సమస్త వాంఛలూ సమూలంగా తొలగిననాడే నిత్యతృప్తులుగా జీవించగలమనీ, ఆత్మానందానుభూతిని పొందడమే మానవజన్మ పరమలక్ష్యమ'నీ విశదపరిచాడు. మొదట మార్గం తెలుసుకొని ప్రయాణం ప్రారంభిస్తేనే కదా గమ్యం చేరగలిగేది! కాబట్టి ముందు మానవునిగా సాధించాల్సిన మన లక్ష్యమేమిటో తెలుసుకొని, సాధనయానం ఆరంభిస్తే గమ్యమైన స్థితప్రజ్ఞత్వాన్ని సాధించగలుగుతాం. అందుకు మానవునిగా జన్మించిన ప్రతి ఒక్కరమూ మొదట సచ్ఛీలురుగా మారడానికి ప్రయత్నించాలి; మానవత్వంగల మనుషులుగా పరిణతిని సాధించాలి. మనలో మానవత్వం వెల్లివిరిసినప్పుడే ఆత్మోద్యానంలో విరబూసే ఆనంద కుసుమాల పరిమళాలను ఆఘ్రాణించగలం.

మనలో అశాంతికి ముఖ్య కారణం కోరికలే! అందుకే భగవాన్ శ్రీరామకృష్ణులు "గ్రద్ద నోట చేప ఉన్నంత వరకూ కాకులు దాన్ని తరుముతూ వెళ్ళాయి. ఎప్పుడైతే గ్రద్ద నోటిలోంచి చేప జారి పడిపోయిందో, వెంటనే కాకులన్నీ గ్రద్దను తరమడం మానేసాయి. అప్పుడు గ్రద్ద ప్రశాంతంగా చెట్టు కొమ్మ మీద కూర్చుంది. అలాగే మనస్సులో చేప అనే కోరికలు ఉన్నంత వరకూ అశాంతి అనే కాకులు వెంబడిస్తాయి" అని అంటారు. కాబట్టి కోరికలను ఎంత త్యజించగలిగితే అంత ప్రశాంతత చేకూరుతుంది.

ప్రాపంచిక భోగాల పట్ల తృష్ణ ఎంత తగ్గితే అంత తృప్తి కలుగుతుంది. ఈ నిత్యసత్యాన్ని గుర్తెరిగి ప్రాపంచిక తృష్ణను తగ్గించుకుంటూ పారమార్థిక తృష్ణను పెంచుకోవడానికి ప్రయత్నించాలి. అప్పుడే క్రమంగా సాధారణ మానవుని స్థితి నుండి అసాధారణ సిద్ధపురుషుని స్థితికి చేరుకోగలుగుతాం. ❖

పాతివ్రత్య మహిమ

కథ: మోహనా సూర్యనారాయణన్, బైరవ సుబ్రమణియం
చిత్రాలు: శ్రీశారదా ఆశ్రమం, ఉళుందూర్‌పేట్టై
అనుసృజన: స్వామి జ్ఞానదానంద

1 సూర్యవంశపు రాజైన శర్యాతి గొప్ప పాలకుడు, ధర్మనిరతుడు. ఆయన ఒకసారి భార్య స్థవిష్ట, కుమార్తె సుకన్య, పరివారంతో పయోష్ణీ నదీతీరాన ఉన్న అరణ్యానికి వేటకై వెళ్ళాడు. సుకన్య చెలికత్తెలతో పువ్వులు సేకరిస్తూ ఆడుకొంటున్నది.

2 అక్కడున్న ఒక పుట్టనుండి రెండు మెరుపు కాంతులు కనిపించాయి. అది చూసిన సుకన్య...

ఆ! ఇదేమిటి? రెండు మెరుపు కాంతులు! ఈ పుల్లతో గుచ్చి ఏమిటో చూద్దాం.

3 సుకన్య పుల్లతో గుచ్చగానే వాటి నుండి రక్తం స్రవించింది. అవి మెరుపు కాంతులు కావు; ఆ పుట్టలో తపస్సు చేసుకొంటున్న చ్యవన మహర్షి నేత్రాలు.



5 వెంటనే రాజు పరివారంతోపాటు మహర్షి ఉన్న చోటుకు వెళ్ళాడు.

6 రాజు తన మంత్రులతో ఈ విషయంగా చర్చించాడు.

చ్యవన మహర్షికి సుకన్యకు వివాహం జరిగింది.

7



8 సుకన్య చ్యవన మహర్షికి సకలోపచారాలూ చేస్తూ, ఆనందంగా జీవనం కొనసాగిస్తోంది.

ఒక రోజు సుకన్య చెరువు గట్టున బట్టలు ఉతుకుతున్నప్పుడు అశ్వినీదేవతలు అక్కడకు వచ్చారు.



మహాపతివ్రతయైన సుకన్య కోపం చూసి అశ్వినీదేవతలు భయంతో గడగడలాడారు.

12 ఆశ్రమానికి తిరిగి వచ్చిన సుకన్య జరిగింది భర్తతో చెప్పింది. అశ్వినీదేవతలను ఆశ్రమానికి తోడ్కొని రమ్మని మహర్షి భార్యకు చెప్పాడు.

13 దేవతలు చెప్పినట్లు చ్యవనుడు చెరువులో మునిగి లేవగానే కంటిచూపు పొంది ఒక అందమైన యువకునిగా మారిపోయాడు. ఒకే రూపంలోని ముగ్గురూ పక్కపక్కనే నిలబడ్డారు.

సుకన్య ప్రార్థన ఫలితంగా మాల చ్యవనుని మెడలోనే పడింది.

14

15 కొన్ని రోజుల తరువాత సుకన్య తల్లితండ్రులు కుమార్తెను చూడడానికి ఆశ్రమానికి వచ్చారు. చ్యవనునికి బదులుగా ఎవరో యువకుడైన ఒక ముని అక్కడ ఉండటం చూసి రాజు ఆవేశంతో...

చ్యవనుని ద్వారా వివరాలు తెలుసుకొన్న రాజు ఎంతో సంతోషించాడు.

16 రాజుకు ఒక వారసుడు కలగాలని చ్యవనుడు ఒక యాగం నిర్వహించాడు. తను వాగ్దానం చేసినట్లు అశ్వినీదేవతలకూ దాన్లో హవిర్భాగం ఇచ్చాడు. దాంతో ఆగ్రహించిన ఇంద్రుడు వజ్రాయుధంతో చ్యవనుని సంహరింప వచ్చాడు. అప్పుడు సుకన్య, ఇంద్రుణ్ణి చూసి హూంకారం చేసింది. వజ్రాయుధం ఎత్తిన ఇంద్రుని చెయ్యి అట్లే స్తంభించిపోయింది.

17 తప్పు తెలుసుకొన్న ఇంద్రుడు అశ్వినీదేవతలకు యాగంలో హవిర్భాగం

కేటాయింప సమ్మతించాడు. రాజైన శర్యాతికి వారసుడు జన్మించాడు. చ్యవనుడు, సుకన్య సత్పుత్రులను కని ఆనందంగా జీవించారు. పాతివ్రత్య మహిమే మహిమ!

వార్తావాహిని



నూతన రామకృష్ణ మిషన్ కేంద్రం

తిరుపతిలో 1981 నుండి భక్తులు నిర్వహిస్తున్న శ్రీరామకృష్ణ సేవాసమితిని కొల్‌కతా రామకృష్ణ మఠం, రామకృష్ణ మిషన్‌ల ప్రధానకేంద్రం అనుబంధ శాఖగా గుర్తించింది. ఈ నూతన రామకృష్ణ మిషన్ శాఖా కేంద్ర ప్రారంభోత్సవ కార్యక్రమం 2015 ఆగష్టు 6వ తేదీన శ్రీమత్ స్వామి గౌతమానందజీ మహరాజ్ ఆధ్వర్యవంలో జరిగింది.

ఈ సందర్భంగా భగవాన్ శ్రీరామకృష్ణ దేవాలయంలో ప్రత్యేక పూజ, హోమం, భజనలు జరిగాయి. సాయంత్రం జరిగిన బహిరంగ సభలో పూజ్య స్వామి గౌతమానందజీ మహరాజ్ మాట్లాడుతూ 'తిరుపతిలో రామకృష్ణ మిషన్ కేంద్రం ప్రారంభించాలన్న భక్తుల చిరకాల వాంఛ నెరవేరిందనీ, భక్తులు ఆశ్రమ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనాల'నీ సూచించారు.

తిరుపతి శ్రీరామకృష్ణ సేవాసమితి కార్యదర్శి శ్రీ పి.వి.రెడ్డి సేవాసమితి ప్రారంభమైన నాటి నుండి జరిగిన అభివృద్ధినీ, నిర్వహించిన సేవాకార్యక్రమాలనూ వివరించారు. స్థానిక శాఖ కార్యదర్శి స్వామి అనుపమానందజీ కేంద్రంలో నిర్వహించే నిత్యకార్యక్రమాల వివరాలను తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానముల చైర్మన్ శ్రీ చదలవాడ కృష్ణమూర్తి, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ డి. సాంబశివరావు, తి.తి.దే. ఉన్నతాధికారులు పాల్గొని ప్రసంగించారు. వివిధ రామకృష్ణ మఠ కేంద్రాల నుండి స్వామీజీలు; ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి సేవాసమితుల ప్రతినిధులు; భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చిరునామా: రామకృష్ణ మిషన్ ఆశ్రమ
రామకృష్ణ మార్గ్, వినాయక నగర్
తిరుపతి – 517 507
ఫోన్ నెం. : 0877 – 2234790
email : tirupati@rkmm.org

గ్రంథ స్వీకారం

శ్రీరామకృష్ణ భజనామృతం (సీ.డీ.)

రచన: శ్రీ అనుభవానంద స్వామి
గానం, సంగీతం: శ్రీ మాతాజీ త్యాగీశానంద
సంగీత సహకారం: డా॥ యం. శారద
వెల: రూ. 50/-
ప్రకాశకులు: శ్రీఅనుభవానందగ్రంథమాల,
బాపట్ల-522101, గుంటూరు జిల్లా.
భీమునిపట్నం-531163, విశాఖపట్నం జిల్లా.
సెల్ : 83417 50016



ప్రస్థానత్రయం

దశోపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, భగవద్గీత
(పారాయణ ప్రతి)

ప్రకాశకులు: శ్రీసత్యానంద సేవాసమితి
వెల: రూ. 100/-, పుటలు: 864
ప్రతులకు : శ్రీహరి తీర్థస్వాములవారు,
శ్రీసత్యానందాశ్రమము, ఇనమడుగు,
నెల్లూరు జిల్లా – 524 137
సెల్: 94402 79712

Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust
and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020
and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**

సురభి

నేను (స్వామి ప్రేమేశానంద) బ్రహ్మబాంధవ ఉపాధ్యాయ, శ్రీఅరవిందుల రచనలు చదివి శ్రీరామకృష్ణుల గురించి 1905-06లో తొలిసారి తెలుసుకున్నాను. ఇంట్లో శ్రీగోవిందుడి పూజ జరిగేది. పూజలో తన్మయం చెందేవాడిని. ఇంతలో 'శ్రీరామకృష్ణ కథామృతం' చదివాను. భగవంతుడు స్వయంగా భువిపై వెలిశాడని తెలుసుకొన్న నా ఆనందానికి మేరలేదు. క్రమంగా లేఖల ద్వారా మాష్టరు మహాశయతో పరిచయం కలిగింది. ఆయన నా తొలి గురువు. ఒకనాడు కలకత్తా వచ్చి, బాగ్ బజార్లో శారదమ్మ దర్శనానికి వెళ్ళాను. ఆమె చరణాలు మాత్రమే చూడగలిగాను.

1913లో మంత్రదీక్ష కొరకు జయరాంబాటీ వెళ్ళాను. దారిలో ఒక పెద్ద మనిషి కలిసి, నన్ను తన ఇంటికి తీసుకువెళ్ళి అతిథి సత్కారాలు చేశారు. నేను ఉన్నత కుటుంబానికి చెందినవాడినని తెలిసి, అలా చేస్తున్నాడని తలచాను. వాస్తవం చాలా కాలం తర్వాత విభిన్న భక్తుల కథనాల ద్వారా తెలుసుకున్నాను. అమ్మ నన్ను తనవాడిని చేసుకొనడానికే దారిలో ఈ సహాయం కల్పించారు.

దీక్షకై వచ్చానని అమ్మతో చెప్పాను. 'బాబూ, నీకు వంశ గురువు ఉన్నారు. అదీగాక నా ఆరోగ్యం అంత బాగాలేద'న్నారు అమ్మ. 'నాకు ఆ మంత్రంతో శాంతి లభించడం లేద'ని ప్రాధేయపడితే మర్నాడు మంత్రోపదేశం చేశారు. చేతివేళ్ళపై జపం ఎలాగు లెక్కించాలో చూపారు. ఆ వేళ్ళు సాధారణ గృహిణుల వేళ్ళవలె గరుకుగా ఉన్నాయి. ఆ తర్వాత ఒకటి రెండు సార్లు జయరాంబాటీ వెళ్ళాను. కన్నతల్లిని పలకరించి నట్టే క్షేమ సమాచారాలు అడిగేవాడిని. స్వామి బ్రహ్మానంద మహరాజ్ మాత్రం అమ్మకు ప్రణామం చేసి ఎక్కువ సేపు ఉండలేకపోయేవారు. కంపిస్తున్న శరీరంతో వెంటనే వెళ్ళిపోయేవారు. బహుశ ఆమె ఉదరంలోనే పదునాలుగు భువనాలు ఉన్నాయనీ, ఆమె బ్రహ్మాండోదరి అనీ గ్రహించారు కాబోలు.

దుర్గాపూజకు అమ్మ బేలూరు వచ్చి, 'లెగెట్ భవనం'లో ఉన్నారు. ఆమెకు ప్రణామం చేయడానికి ఎందరో భక్తులు వచ్చారు. అమ్మ శరీరం పూర్తిగా ఆచ్ఛాదితమై ఉంది. ప్రణామం చేసి, తలెత్తి ముసుగు క్రింద నుండి అమ్మ ముఖం క్షణమాత్రం చూశాను. అమ్మ నేత్రాలు ఎంతో తేజోపూరితంగా – వెలుగుతున్న టార్చిలైట్ల మాదిరి ఉన్నాయి. అప్పట్లో ఆమెను అర్థం చేసుకొనలేదు. అవతార పురుషుని సతీమణి అనే తలచేవాడిని. ఎంతోకాలం అనంతరం ఆమె జగజ్జనని, ఆదిశక్తి అని గ్రహించాను.

నా వంశగురువు ఇచ్చిన మంత్రం జపించి మంత్రసిద్ధి పొందాను– దాని ఫలితమే అమ్మ దర్శనం. కానీ అప్పుడు తెలుసుకొనలేకపోయాను. అందుకే మరల దీక్ష ఇవ్వడానికి అమ్మ నిరాకరించారు. ఆనాడు, 'అమ్మా, మీ పట్ల శ్రీరామకృష్ణుల పట్ల భక్తి శ్రద్ధలు అక్షయంగా ఉండాలి; మరేమీ కోరను' అని ప్రార్థించి ఉండి ఉంటే చాలు కదా! ❖

Vol.72-10, Sri Ramakrishna Prabha (Telugu Monthly) October 2015, Regd. with the Registrar of Newspaper for India Under No.1120/57. Postal Registration No. HD-1071/2013-15. Licensed to Post Under WPP : AP/CPMG/HC-13/WPP/2015-16. Date of Publication : 16 September 2015

విద్యార్థుల ప్రతిజ్ఞ

'భారతరత్న' అబ్దుల్ కలామ్ భవిష్యత్ భారత ఆశాదీపాలైన చిన్నారుల్లో స్ఫూర్తిని నింపేందుకు నిరంతరం తపించేవారు.

విద్యార్థుల సమావేశాలలో విద్యార్థులు విధిగా నిర్వర్తించాల్సిన బాధ్యతలకు సంబంధించి ఆయన వారితో ఇలా ప్రతిజ్ఞ చేయించేవారు:

- నేను అంకిత భావంతో విద్యాభ్యాసం చేస్తాను.
- నేను నిజాయతీతో కష్టపడి పనిచేస్తాను.
- నేను సన్మార్గంలో నడుస్తూ, నా కుటుంబానికి అండగా నిలుస్తాను.
- నేను నా తోటివారి బాధలను నివారించడానికి పాటుపడతాను.
- నేను కనీసం ఐదు మొక్కలను నాటి, వాటిని సంరక్షిస్తాను.
- నేను శారీరక, మానసిక వికలాంగులు ఆనందంగా జీవించడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తాను.
- నేను బాధ్యత కలిగిన పౌరునిగా రూపొందుతాను.
- నేను నా దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా రూపొందించడానికి నా వంతు కృషి చేస్తాను.

(అక్టోబర్ 15న 'భారతరత్న' డా॥కలామ్ జయంతి, ప్రపంచ విద్యార్థుల దినోత్సవం)

విజయవాడ రామకృష్ణ మిషన్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో డా॥ కలామ్.

With Best Compliments From

పక్యాల భాస్కర రావు, మేనేజింగ్ డైరక్టర్ & **పక్యాల గిరిజ,** డైరక్టర్

SVISS LABSS LIMITED

(Manufacturers of Active Pharmaceutical Ingredients and Intermediates)

Regd. Off. & Fact. : Plot No.88 & 89, Phase - II,
SIPCOT Industrial Complex, Ranipet - 632 403, Tamil Nadu.
Phone : 04172 - 244820, 651507, Tele Fax : 04172 - 244820
E-mail : rao@svisslabss.net Web Site : www.svisslabss.net

SVISS LABSS కంపెనీ వారు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 2,000 పాఠశాలలకు స్పాన్సర్ చేశారు.

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

నవంబర్ 2015

₹10

సుబోధ

భక్తుడు : భగవంతుని కృప ఒకరిపై ఎక్కువగానూ, మరొకరిపై తక్కువగానూ ఎందుకు ఉంటుంది?

శ్రీరామకృష్ణులు : భగవంతుడు విభురూపంలో అందరిలోనూ నెలకొని ఉన్నాడు. నాలో ఎలా ఉన్నాడో చీమలో కూడా అలాగే ఉన్నాడు. కానీ శక్తి అభివ్యక్తీకరణలో వ్యత్యాసం ఉంది.

వెలుగును ఇస్తున్నాయన్న కారణంగా చంద్రుడు, మిణుగురు పురుగు రెండూ ఒక్కటైపోతాయా ఏమిటి? ఒంటరిగా నిలబడి నూరుమందిని ఓడించేవాడూ ఉన్నాడు, కేవలం ఒక వ్యక్తిని చూసినంత మాత్రాన్నే భయపడి పారిపోయేవాడూ ఉన్నాడు.

పాండిత్యంలోగానీ, సంగీతంలోగానీ, లెక్చర్లోగానీ, లేక మరిదేన్లోగానీ ఎవరినైనా పలువురు గౌరవిస్తూ ఉంటే అతడిలో భగవంతుని విశేష శక్తి ఉందని నిశ్చయంగా తెలుసుకో అని గీత తెలుపుతోంది.

భగవంతుణ్ణి ప్రేమించడం నేర్చుకో. ఆయన ప్రేమలో లోతుగా మునిగిపో. మీరెందుకు భగవదైశ్వర్యాలను అంత ఎక్కువగా వర్ణిస్తున్నారు? 'ఓ భగవంతుడా! నువ్వు ఆకాశాన్ని సృష్టించావు; మహాసముద్రాలను రూపొందించావు; చంద్రలోకం, సూర్యలోకం, నక్షత్రలోకం అన్నిటినీ సృజించావు' – ఇలా చెబుతూ ఉండడంలో మనకు ప్రయోజనం ఏమిటి?

అందరూ ధనవంతుని తోటను చూసి ఆశ్చర్యపోతారు 'ఆహా ఎటువంటి చెట్లు! ఎటువంటి పువ్వులు! కొలనులు! అతిథుల గదులు! గోడలకు అందమైన చిత్తరువులు!' అనుకొంటూ అబ్బుర పడతారు. తోట యజమాని కోసం ఎంతమంది వెదకుతారు? ఎవరో ఒకరిద్దరు మాత్రమే. మనోవ్యాకులతతో భగవంతుణ్ణి వెదకితే ఆయన దర్శనం కలుగుతుంది, నేను మీతో మాట్లాడుతూ ఉన్నట్లే ఆయనతో మాట్లాడవచ్చు, ముచ్చటించవచ్చు. నిజంగా చెబుతున్నాను, ఆయన్ని దర్శించవచ్చు! ఇవన్నీ ఎవరికి చెప్పగలను? ఎవరు నమ్ముతారు?

శాస్త్రాల ద్వారా భగవంతుని గాంచగలమా? మహా అయితే, వాటిని చదవడం వల్ల భగవంతుడి అస్తి, అంటే ఉన్నాడనే ఎరుక కలుగవచ్చు, అంతే! కానీ లోతుగా మునుగనిదే ఆయన దర్శనం ఇవ్వడు. మునిగిన పిదప ఆయనే స్వయంగా తన స్వరూపాన్ని విశదపరచినప్పుడే సంశయాలన్నీ తీరుతాయి. నువ్వు వేయి పుస్తకాలు చదువవచ్చు గాక, వేలాది శ్లోకాలు వల్లింపవచ్చుగాక – కానీ మనోవ్యాకులతతో ఆయనలో మునిగిపోనట్లయితే ఆయన్ను అందుకోలేవు. శుష్క పాండిత్యంతో లోకులను మైమరపించవచ్చును కానీ భగవంతుని మైమరపించలేవు.

శాస్త్రాలు, గ్రంథాలు – వీటితో ఏం సాధించవచ్చు? భగవంతుని కృప లేకుండా ఏదీ సాధ్యం కాదు. వ్యాకులతతో ఆయన కోసం ప్రార్థించండి. కృప కలిగితే ఆయన దర్శనం లభిస్తుంది. ❖

శ్రీరామకృష్ణ ప్రభ
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాదు–500 029
ఫోన్: 040-27667799, సెల్: 8801849494
E-mail : sriramakrishnaprabha@gmail.com
నిర్వాహక సంపాదకులు: స్వామి జ్ఞానదానంద   సంపాదకులు: స్వామి పరిజ్ఞేయానంద

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

సంపుటం: 72 సంచిక: 11 నవంబర్ 2015

ప్రార్థన

సిద్ధలక్ష్మీర్మోక్షలక్ష్మీర్జయలక్ష్మీస్సరస్వతీ ।
శ్రీలక్ష్మీర్వర లక్ష్మీశ్చ ప్రసన్నా మమ సర్వదా ॥

సిద్ధలక్ష్మిగా, మోక్షలక్ష్మిగా, జయలక్ష్మిగా, వాగ్దేవిగా, సంపదలనిచ్చే శ్రీదేవిగా, వరలక్ష్మిగా విరాజిల్లుతూన్న నీవు సర్వవేళలా నాకు ప్రసన్నురాలవుగా ఉండెదవుగాక!

(శ్రీ సూక్తమ్)

సూక్తి సౌరభం

కో అంధో? యో అకార్యరతః
కో బధిరో? యో హితాని నశృణోతి ।
కో మూకో? యః కాలే
ప్రియాణి వక్తుం నజానాతి ॥

“ఎవడు గుడ్డివాడు? చేయకూడని పనిచేసేవాడు; ఎవడు చెవిటివాడు? హితవచనాలను పెడచెవిన పెట్టేవాడు; ఎవడు మూగవాడు? బాధల్లో ఉన్నవారితో సాంత్వన వచనాలను పలుకనివాడు”

నీతి జ్యోతి లేక నిర్మలంబగు నేది:
ఎట్లు కలుగుఁ బర మదెంత యైన
ధనము గలిగి యున్న దైవంబు గలుగదు
విశ్వదాభిరామ వినుర వేమ!

“ఓ వేమా! నీతి అనే దీపం లేకపోతే మనస్సు నిర్మలమవదు. నిర్మలమైన మనస్సు లేకపోతే పరబ్రహ్మ స్వరూపం గోచరమవదు. ధనం ఉన్నంత మాత్రాన దైవదర్శనం లభించదు.”



శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి



ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'కి ధన దానం చేసి ప్రోత్సహించాల్సిందిగా కోరుతున్నాం. దాతల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు......	రూ.	10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజపోషకులు............	రూ.	5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు.................	రూ.	1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

దాత పేరు / ఊరు	రూ.
మహా రాజపోషకులు : శ్రీ ఎ. సీతారామ రాజు, శ్రీరాంపురం, భీమవరం, ప.గో. జిల్లా (కీ॥శే॥ అల్లూరి విశ్వనాథ రాజుగారి జ్ఞాపకార్థం)	10,000
రాజపోషకులు : శ్రీ ఎ. శివ ప్రసాద్, వేములవాడ, కరీంనగర్ జిల్లా (తండ్రి కీ॥శే॥ ఆకుల వెంకటి గారి జ్ఞాపకార్థం)	5,000
పోషకులు : శ్రీమతి కె. పద్మజ, సీతాఫల్‌మండి, సికింద్రాబాద్ (అత్తగారు కీ॥శే॥ కూనపరెడ్డి పద్మావతి గారి జ్ఞాపకార్థం)	2,116
పోషకులు : శ్రీ గుమ్ముడవెల్లి పాండురంగయ్య, న్యూటౌన్, మహబూబ్ నగర్ (తల్లి కీ॥శే॥ నారాయణమ్మ గారి జ్ఞాపకార్థం)	2,116
పోషకులు : ప్రొఫెసర్ ఎన్.ఎస్. మూర్తి శర్మ, పి & టి కాలనీ, గాంధీనగర్, హైదరాబాద్	1,116
పోషకులు : శ్రీ పర్రె పిచ్చయ్య, కొలగుట్ల, దుర్గి, గుంటూరు జిల్లా	1,000
పోషకులు : శ్రీ జంపని రవి, పెద్ద విరివాడ, నందివాడ, కృష్ణా జిల్లా	1,000

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

యువతరానికి 'శ్రీరామకృష్ణ ప్రభ'ను మరింత చేరువ చేయాలని సంకల్పించాం. రాష్ట్రంలోని వివిధ పాఠశాలలు/ కళాశాలలు/ గ్రంథాలయాలకు పత్రికను పంపించడానికి మీ సహాయాన్ని కోరుతున్నాం. ఈ కానుక పథకం క్రింద చందా చెల్లించిన దాత పేరున (మీరు సూచించిన లేదా మేము ఎంపిక చేసిన) విద్యాసంస్థకు పత్రికను పంపుతాం. కానుక చందా రూ.1,500/- అంతకన్నా ఎక్కువ ఇచ్చిన దాత పేరు, విద్యాసంస్థ పేరు పత్రికలో ప్రచురిస్తాం.

దాత పేరు	విద్యాసంస్థ
శ్రీ ఎమ్. మురళీకృష్ణ, సత్యనారాయణ స్వామి కాలనీ, కెపిహెచ్‌బి, హైదరాబాద్	ఫిట్ జీ లిమిటెడ్, విజయనగర్ కాలనీ, కూకట్‌పల్లి, హైదరాబాద్
శ్రీ కె.హనుమంతప్ప, ఉరవకొండ (తల్లితండ్రులు కీ॥శే॥ లక్ష్మమ్మ, తిమ్మప్పగార్ల జ్ఞాపకార్థం)	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొట్టాల పల్లి, విడపనకల్, అనంతపురం జిల్లా
శ్రీ పి. నరసింహం, పంచవటి కాలనీ, మణికొండ, హైదరాబాద్	అనంతపురంలోని 10 విద్యాసంస్థలకు 5 సంవత్సరాలకు పత్రికను స్పాన్సర్ చేశారు.
శ్రీ పరమేశ్వర రెడ్డి, రామ్ నగర్, సంగారెడ్డి, మెదక్ జిల్లా	మెదక్ జిల్లాలోని 10 పాఠశాలలకు ఒక సంవత్సరానికి పత్రికను స్పాన్సర్ చేశారు
శ్రీ జి.దేముడు, విశాఖపట్నం (తల్లితండ్రులు కీ॥శే॥ జి.పైడితల్లమ్మ, అప్పలనాయుడుగార్ల జ్ఞాపకార్థం)	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చింతల అగ్రహారం, విశాఖపట్నం
శ్రీ కె. శ్రీవిష్ణు, పంజాబ్ నేషనల్ బ్యాంక్, బిదాది బ్రాంచ్, బెంగుళూరు	పదిహేను పాఠశాలలకు ఒక సంవత్సరానికి పత్రికను స్పాన్సర్ చేశారు.

దీపావళి శుభాకాంక్షలు

'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు, రచయితలకు, రచయిత్రులకు, ఏజెంట్లకు, దాతలకు, శ్రేయోభిలాషులకు మా హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు. - సంపాదకులు

చందా వివరాలు		భారతదేశంలో	విదేశాలకు
విడి ప్రతి	:	₹ 10	-
సంవత్సర చందా	:	₹ 100	₹ 1,500
మూడు సంవత్సరాలకు	:	₹ 280	₹ 4,500
ఐదు సంవత్సరాలకు	:	₹ 450	₹ 7,500
ఇరవై సంవత్సరాలకు	:	₹ 1,500	₹ 22,000

గమనిక: డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో Ramakrishna Math, Hyderabad అని వ్రాయాలి.

పంపవలసిన చిరునామా: Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.

చందాను ఆన్‌లైన్ http://rkmath.org/srkp ద్వారా చెల్లించవచ్చు.

లోపలి పేజీల్లో...

6 సంపాదకీయం
జీవితమే ఒక దీపావళి!

8 గోరుముద్ద
లేత మనసులు

9 కపటం లేని మనస్సు

10 పలికెడిది భాగవతం
సమ్మాన్యము శ్రీహరి కథామృతము

12 మన సంస్కృతి
విదేశాలలో భారతీయ సంస్కృతి

13 మహాపురుషుని సాన్నిధ్య స్మృతులు

14 రామకృష్ణ భక్తి సూత్రాలు

15 నీవు సర్వసముడవు...

16 పరమపదానికి రాజమార్గం
సత్యపాలన... లోకహితం

18 సంధి వందనం

19 చిలుక చెప్పిన పాఠం

20 పరిప్రశ్న

21 ధీరవాణి
ఆత్మశక్తిని జాగృతం చేయాలి!

22 జ్ఞానదీప దర్శనం

24 ఇస్తూనే ఉందాం!

26 దిశను బట్టే దశ

27 జీవనోద్యానంలో మానవతా పరిమళాలు
శ్రేష్ఠ పాలకుడు / ఏది విలువైన రాయి?

28 వేడుకల వేళ

30 మంచిని చెప్పే పోటీ

31 ఆత్మాభిమానం

33 ముందుకు సాగిపో!

35 ఒక కథ చెబుతా...
సత్యనిష్ఠ ప్రభావం

36 భగవద్గీత – సద్గుణ సుధ
మననశీలుడే ముని!

38 బొమ్మల కథ
అసామాన్య త్యాగశీలి

41 వికాస మంత్రాలు

ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు. – సంపాదకులు

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు మీద చిరునామాకు పైన మీ చందా నంబరు, కుడి వైపున మీ చందా గడువు ముగిసే నెల ఉంటాయి. మీ చందా గడువు పూర్తయ్యే నెలకు ముందుగానే సొమ్మును చెల్లించి చందాను పునరుద్ధరించుకోండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారిన పక్షంలో 7వ తేదీ లోగా మాకు తెలియపరచినట్లయితే, వచ్చే నెల సంచిక నుండి మీ కొత్త చిరునామాకు పంపబడును.
- ప్రతీ నెల 26 లేదా 27వ తేదీల్లో పత్రిక పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపుగా చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ.... – సర్క్యులేషన్ మేనేజర్

KCP CEMENT
CONCRETE CEMENT
Since 1958

With Best Compliments From
CHAIRMAN & MANAGING DIRECTOR
THE KCP LIMITED
KCP కంపెనీ వారు "శ్రీరామకృష్ణ ప్రభ" మాసపత్రికను
1000 గ్రంథాలయాలకు స్పాన్సర్ చేశారు

KCP Sreshtaa CEMENT
THE NEW GENERATION CEMENT

Cement Marketing Division : Plot No. 10, Gayatri Hills, MP & MLA's Colony, Road No. 10 C, Jubilee Hills, HYDERABAD - 500033,
Tel : 040-2325 3503 to 505, Fax : 2325 3500, Cell : +91 99895 97775 / 9866305145, E-mail : ramakrishna.k@kcp.co.in
Registered Office : No. 2, Dr.P.V.Cherian Crescent, Egmore, CHENNAI - 600 008. Tel : 044 66772668, Fax: 044 66772620, CIN L65991TN1941PLC001128

సంపాదకీయం

జీవితమే ఒక దీపావళి!



ఇళ్ళన్నీ దీపకాంతులతో కళకళలాడే విశేషదినం; ముంగిళ్ళన్నీ వెలుగుపూలతో విరబూసే పుణ్యదినం; మోములన్నీ నవ్వుల వెలుగులతో శోభించే శుభదినం; దుష్టశక్తులను పరిహరించే పవిత్రదినం; పున్నమిరాత్రిని తలపించే వెలుగులదినం – 'దీపావళి' పర్వదినం.

ఈ దీపావళి పర్వదినాన దీపకాంతులు ఒకవైపు, మతాబుల వెలుగులు మరోవైపు; ఉత్సాహంతో పరవళ్ళుతొక్కే పిల్లలు ఒకవైపు, ఆనందంతో పరవశించే పెద్దలు మరోవైపు... ఇలా ఎటుచూసినా ఉత్తేజాన్ని నింపే వాతావరణం, ఆహ్లాదాన్ని పంచే అనుబంధాల సుగంధం. ఈ ఆత్మీయతానురాగాల ఆస్వాదనలో మనస్సంతా ఆనందమయంగా, జగమంతా శాంతినిలయంగా మారిపోతుంది. అయితే, ఈ శాంత్యానందాలు కేవలం ఒక్కరోజుకే పరిమితమా? మన జీవితాలు నిరంతరం ఆనందమయంగా ఉండాలంటే, మన సమాజం శాంతినిలయంగా మారాలంటే మన జీవితమే ఒక దీపావళి కావాలి. అందుకు దీపావళి ప్రబోధించే జీవన సూత్రాలను ఆచరించాలి, విలువల పాఠాలను అభ్యసించాలి, ఆధ్యాత్మిక సత్యాలను ఆవిష్కరింపజేసుకోవాలి.

సమాజం శాంతినిలయంగా మారాలంటే దుష్టశక్తులను నాశనం చేయాలి. జీవితం ఆనందమయంగా ఉండాలంటే మనస్సులోని దురాలోచనలను పారద్రోలాలి. పవిత్ర మనస్సుతో సాధనచేసి పరమాత్మను దర్శించాలి. ఏ పండగ అంతరార్థాన్ని విశ్లేషించినా మానవుడు తనలోని దానవగుణాలను హతమార్చి, మానవత్వంతో జీవిస్తూ, దైవత్వాన్ని పొందాలన్నదే సారాంశం. ఈ పండుగలు, పర్వదినాలను జరుపుకోవడంలోని ముఖ్యోద్దేశం మానవజీవిత పరమార్థాన్ని మరచిపోకుండా ఉండేందుకే!

ప్రపంచం ప్రశాంతినిలయం: ప్రపంచం ప్రశాంతి నిలయంగా మారాలన్నా, నివాసయోగ్యంగా ఉండాలన్నా దుర్మార్గులు, స్వార్థపరులు, అధర్మవర్తనులు సమూలంగా నాశనమొందాలి. లోకక్షేమానికి భంగం కలిగించే దుర్మార్గుడైన నరకాసురుణ్ణి హతమార్చిన సందర్భంగా ప్రజలు తమ ఆనందాన్ని వ్యక్తపరుస్తూ జరుపుకునే పండగే దీపావళి.

ఇంతకీ ఈ నరకాసురుడు ఎవడు? శ్రీకృష్ణునికి, సత్యభామకు ఏమవుతాడు? హిరణ్యాక్షుడు భూదేవిని అపహరించినప్పుడు, మహావిష్ణువు వరాహావతారమెత్తి ఆ దానవుణ్ణి సంహరించాడు. భూదేవికీ, వరాహమూర్తికీ జన్మించినవాడే నరకాసురుడు. మానవులను, మునులను, దేవతలను హింసలకు గురిచేస్తూ, ఎంతోమంది స్త్రీలను చెరసాలలో బంధించి అకృత్యాలకు పాల్పడుతూ, ముల్లోకాలనూ పట్టిపీడిస్తున్నాడు నరకాసురుడు. ఈ దానవేంద్రుడు పెడుతున్న బాధలకు తాళలేక మానవులు, మునులు, దేవతలు నరకాసురుణ్ణి వధించమని శ్రీకృష్ణుణ్ణి వేడుకున్నారు. అప్పుడు శ్రీకృష్ణుడు సత్యభామాసమేతుడై నరకాసురుణ్ణి సంహరించాడు. విష్ణువు అవతారమైన శ్రీకృష్ణుడు, భూదేవి అవతారమైన సత్యభామల కుమారుడే నరకాసురుడు. నరకాసురుడు తమ కుమారుడైనప్పటికీ లోకక్షేమం కోసం, ప్రజాసంక్షేమం కోసం వధించారు.

నేటి సమాజంలో విచ్చలవిడిగా దుష్కార్యాలను చేస్తున్నా, అదుపాజ్ఞలు లేకుండా అకృత్యాలకు పాల్పడుతున్నా దుర్మార్గులను శిక్షించడానికి కడుపుతీపి, బంధుప్రీతి, అధికారశక్తి, స్వలాభాపేక్ష, స్వార్థబుద్ధి అడ్డుతగులుతున్నాయి. అరాచకాలూ, అకృత్యాలూ, అన్యాయాలూ చేస్తే కఠినంగా శిక్షింపబడతామనే భయం లేకపోవడం వల్ల దుర్మార్గులు స్వేచ్ఛావిహారం చేస్తున్నారు, దుష్కార్యాలను నిర్భయంగా కొనసాగిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఏ దేశం శాంతినిలయంగా ఉంటుంది? ఏ సమాజం నివాసయోగ్యమవుతుంది?

సమాజంలో చీడపురుగులు లేకుండా చేయాలంటే తల్లితండ్రులు 'మొక్కైవంగనిది మానైవంగునా!' అనే సామెతను గుర్తుంచుకొని పిల్లల్ని చిన్నప్పటి నుండే సన్మార్గంలో నడిపించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. తల్లితండ్రులు పిల్లల్లో అబద్ధాలాడడం, దొంగతనం చేయడం, ఇతరులను హింసించడం లాంటి దుర్గుణాలను గమనించినప్పుడు వారిని సమర్థించకుండా, సరిదిద్దడానికి ప్రయత్నించాలి. తల్లితండ్రులు పిల్లల మనస్సులోని కలుపు మొక్కలనే చెడు భావాలను ఎప్పటికప్పుడు త్రుంచివేయాలి. అప్పుడు మాత్రమే మన సమాజం నరకాసురులు, రావణాసురులు, బకాసురులతో కాకుండా హరిశ్చంద్రుడు, రామచంద్రుడు, శిబిచక్రవర్తి లాంటి త్యాగశీలులతో నిండిపోతుంది. అలాంటి ప్రపంచమే ప్రశాంతి నిలయమవుతుంది.

మతాబులు... జీవన సూత్రాలు : దీపావళి చీకటిని పారద్రోలి వెలుగును నింపే పండగ. చీకటి దుఃఖానికీ, వెలుగు ఆనందానికీ సంకేతాలు. మన జీవితంలో దుఃఖమనే చీకటిని పారద్రోలి, ఆనందమనే వెలుగును నింపాలన్నదే దీపావళి మనకిచ్చే సందేశం. అయితే, మన జీవితంలో ఎదురయ్యే క్లిష్ట పరిస్థితులను అధిగమించడానికీ, ఇతరుల జీవితాల్లో ఆనందాన్ని నింపడానికీ అవసరమైన నిరంతర పరిశ్రమ,

సానుకూలదృక్పథం, ఆత్మవిశ్వాసం, ప్రేమ, సేవాభావం లాంటి ఉన్నత లక్షణాలను అలవరచుకోవాలి.

ఈ లక్షణాలన్నీ దీపావళి నాడు మనం వెలిగించే భూచక్రాలూ, తారాజువ్వలూ, కాకరపువ్వొత్తులూ, చిచ్చుబుడ్లు లాంటి ఎన్నో మతాబుల నుండి నేర్చుకోవచ్చు.

వెలుగులను విరజిమ్ముతూ, గిర్రున తిరిగే భూచక్రం 'సోమరిగా ఉండకుండా ఉత్సాహంతో నిరంతరం పరిశ్రమించాలి' అని నేర్పుతుంది; నిప్పులను వెదజల్లుతూ నింగికెగసే తారాజువ్వ 'జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలనీ, సానుకూలదృక్పథంతో ఆలోచించాలనీ, ఆత్మవిశ్వాసంతో అవరోధాలను అధిగమించి ఉన్నత శిఖరాలను అధిరోహించాల'నీ నేర్పుతుంది; అందరికీ ప్రియమైన కాకరపువ్వొత్తి 'అందరూ

మన దరికి చేరేలా ఉండాలనీ, ఎవరికీ హాని కలిగించకూడదనీ, మనల్ని చూసి ఎవరూ భయపడకూడద'నీ తెలుపుతుంది; వెలుగుతున్నంతసేపూ అందరి దృష్టిని ఆకర్షించే చిచ్చుబుడ్డి 'జీవించినంతకాలం అందరినీ ఆనందపరుస్తూ, అందరి మన్ననలను పొందుతుండాలి' అని నేర్పుతుంది.

దత్తాత్రేయుడు కూడా భూమి నుండి సహనాన్నీ, సూర్యుడి నుండి సమదృష్టినీ, చంద్రుని నుండి వృద్ధిక్షయాలలో చలించని మనస్తత్వాన్నీ; అలాగే పక్షులు, జంతువుల నుండి ఏకాగ్రతనూ, నిస్వార్థతనూ, ఇంద్రియ నిగ్రహాన్నీ, నిరంతర పరిశ్రమనూ... ఇలా ఎన్నో జీవన సూత్రాలను గ్రహించాడు.

మనం కూడా సావధానంగా పరిశీలిస్తే మన చుట్టూ ఉన్న పరిసరాల నుండీ, వస్తువుల నుండీ, మనతోటివారి నుండీ ఎన్నో జీవన సూత్రాలను నేర్చుకోవచ్చు. ఉన్నత ఆదర్శాలతో జీవించవచ్చు.

పరమాత్మకు ప్రతీక దీపజ్యోతి : దీపం అమంగళాన్నీ, దారిద్ర్యాన్నీ, దుష్టశక్తుల్నీ పారద్రోలే శక్తిస్వరూపం. దీపం లేని ఇంట్లో అలక్ష్మి తాండవిస్తుందనీ, దారిద్ర్యం రాజ్యమేలుతుందనీ శ్రీరామకృష్ణులు చెబుతూ 'సాయంసంధ్య కాగానే దీపం వెలిగించమ'ని సూచించేవారు.

దీపజ్యోతిని పరిశీలించినట్లయితే జ్యోతిలో మొదట ఎరుపురంగు, తరువాత తెలుపురంగు, ఆ తరువాత నీలంరంగు కనబడతాయి. ఈ మూడు రంగులూ లక్ష్మీ, సరస్వతీ, కాళీ మాతలకు ప్రతీకలు. అందువల్ల దీపం వెలుగుతున్న ఇల్లు సకల సౌభాగ్యాలతో తులతూగుతుంది, సకల విద్యలతో విలసిల్లుతుంది, అరిష్టాలు లేకుండా వర్ధిల్లుతుంది.

దీపం వెలుగుతున్న ఇంట్లో దుష్టశక్తులు చొరబడనట్లు, దేహమనే ఇంట్లో ప్రకాశిస్తున్న ఆత్మజ్యోతిని ధ్యానించినప్పుడు మనస్సులోని కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలనే దుష్టశక్తులు ప్రవేశించలేవు. అలాగే, దీపజ్యోతిలోని మూడు రంగులూ సత్వ రజ తమో గుణాలను సూచిస్తాయి. ఈ త్రిగుణాలను అధిగమించినప్పుడు ఆ ఆత్మజ్యోతిలో ప్రతిష్ఠితమై ఉన్న పరమాత్మ దర్శనమవుతుంది.

ఆత్మజ్యోతిలో ప్రతిష్ఠితమై ఉన్న పరమాత్మ గురించి నారాయణ సూక్తమ్...

నీలతో యదమధ్యస్థా ద్విద్యుల్లేఖేవ భాస్వరా ।
నీవారశూకవత్తన్వీ పీతా భాస్వత్యణూపమా ॥

తస్యాః శిఖాయా మధ్యే పరమాత్మా వ్యవస్థితః ।
స బ్రహ్మ స శివః స హరిః సేంద్రః సోఽక్షరః పరమః స్వరాట్॥

'నీలిమేఘం మధ్య నుండి వెలుగును విరజిమ్మే మెరుపుతీగలా, వరిమొలకలా సన్నదిగా, బంగారు ఛాయలా, అణువులా సూక్ష్మమైనది అయిన ఆత్మ ప్రకాశిస్తూ ఉంటుంది. ఆ అగ్నిశిఖ మధ్యన పరమాత్మ సుప్రతిష్ఠితుడై ఉన్నాడు. ఆయనే బ్రహ్మ, ఆయనే శివుడు, ఆయనే విష్ణువు, ఆయనే ఇంద్రుడు. ఆయన అవినాశి, స్వప్రకాశకుడు. ఆయన కంటే అధికుడెవడూ లేడు' అని వివరించింది. భగవాన్ శ్రీరామకృష్ణులు కూడా 'దీపజ్యోతి ధ్యానాభ్యాసం పరమాత్మ దర్శనానికి ఒక మార్గం' అని బోధించారు. అందువల్ల పరమాత్మకు ప్రతీకైన దీపజ్యోతి మన ఆధ్యాత్మిక ప్రగతికి ఆలంబనంగా నిలుస్తుంది.

కాబట్టి ఈ జగమంతా శాంతినిలయంగా మారాలన్నా, మన జీవితమంతా ఆనందమయంగా ఉండాలన్నా, ఆధ్యాత్మిక వికాసం పొందాలన్నా దీపావళి ప్రబోధించే జీవన సూత్రాలను, విలువల పాఠాలను, ఆధ్యాత్మిక సత్యాలను ఆచరించాలి. అందుకు మన జీవితమే ఒక దీపావళి కావాలి! ❖

శరీరమనే ప్రమిదలో నిష్ఠ అనే నూనె వేసి, వత్తి అనే బుద్ధితో జ్ఞానమనే జ్యోతిని వెలిగించి, హృదయంలో ఉన్న ఆత్మను దర్శింపజేసుకోవడానికి చేసే ప్రయత్నమే దీపారాధనలోని ఆంతర్యం. - ఆర్యధర్మ

గోరుముద్ద – స్వామి సుప్రియానంద

లేత మనసులు

కోకిల కూస్తుంది. కోకిల, కోకిల ఎందుకు గాండ్రించవు? అని అడిగితే, కోకిల ఏం సమాధానం చెబుతుంది! కూయడం కోకిల సహజ స్వభావం. అలాగే, పిల్లల సహజ స్వభావాన్నీ, సృజనాత్మకతనూ అర్థం చేసుకోవడానికి తల్లితండ్రులు ప్రయత్నించాలి.

మనం పిల్లలలో రెండు ముఖ్యమైన అంశాలను చూడవచ్చు. మొదటిది – పిల్లలు ప్రతి విషయంలో కనబరిచే కుతూహలం. రెండవది – స్వేచ్ఛ కోసం వారు పడే తపన.

అనేక సమస్యలతో సతమతమవుతున్న తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, పెద్దలు ఈ లేత మనసులలో అతి సహజంగా పుట్టిన కుతూహలం, స్వేచ్ఛలనే మొగ్గలను పువ్వులుగా వికసించకుండానే తుంచివేస్తున్నారు.

పిల్లలు అనేక విషయాలను తెలుసుకోవడానికి కుతూహలాన్ని చూపుతారు. ఆ కుతూహలాన్ని పెద్దలు ప్రోత్సహించాలి. వారు అడిగిన ప్రశ్నలకు ఓపిగ్గా సమాధానం చెప్పాలి. అలా చేయడం వల్ల వారు చిన్నప్పటి నుండే అనేక విషయాలపై మంచి అవగాహన కలిగి ఉంటారు. భవిష్యత్తులో జ్ఞానవంతులుగా ఎదుగుతారు.

ఒక చిన్న పిల్లవాడు పిచ్చుకల గూడును అదేపనిగా కూర్చొని చూస్తుంటే, “ఏమిట్రా, నీకు పనీపాట లేదా? పుస్తకం తీసుకొని చదువుకో!” అని తండ్రి చీవాట్లు పెడితే, ఆ పిల్లవాడు సైన్స్ పరీక్షలో తప్పుతాడు. ఒకవేళ పుస్తకాలు చదివి పిచ్చుకల గురించి తెలుసుకుని సైన్స్ పరీక్షలో ‘గోల్డ్‌మెడల్’ సంపాదించినప్పటికీ, నిజ జీవితంలో ప్రకృతికి దూరమై పర్యావరణాన్ని లక్ష్యపెట్టక, పిచ్చుకలను చంపేసి మానవతకు ‘రాళ్ళమెడల్’ వేసి సమాధి చేస్తాడు.

'Freedom is the first condition of Growth – అభివృద్ధికి మొదటి నియమం – స్వేచ్ఛ' అని అంటారు స్వామి వివేకానంద. తల్లితండ్రులు పిల్లల్ని క్రమశిక్షణ పేరుతో ప్రపంచ జ్ఞానానికి తావు లేకుండా పెంచితే, వారిలో సృజనాత్మకత, లోకజ్ఞానం కొరవడి అప్రయోజకులుగా తయారవుతారు. అప్పుడు “అయ్యో, మేము ఏం పాపం చేశాం” అంటూ బాధపడాల్సివస్తుంది.

కాబట్టి తల్లితండ్రులు పిల్లల లేత మనసులను అర్థం చేసుకోవడానికి ప్రతిరోజూ కొంత సమయాన్ని కేటాయించాలి. వారి అభిరుచులను గమనించి, ఆ యా విషయాలలో వారి ప్రతిభను వ్యక్తపరచడానికి తగిన స్వేచ్ఛను ఇవ్వాలి. వారికి మంచి కథలు చెప్పాలి. వారు చెప్పే కథలను ఓపిగ్గా వినాలి. ❖

(నవంబర్ 14, బాలల దినోత్సవం)

పండుగలు - పర్వదినాలు

నవంబర్ - 2015

07	శనివారం	: ఏకాదశి
10	మంగళవారం	: కాళీపూజ
11	బుధవారం	: దీపావళి
22	ఆదివారం	: ఏకాదశి
23	సోమవారం	: స్వామి సుబోధానంద జయంతి
25	బుధవారం	: స్వామి విజ్ఞానానంద జయంతి

డిసెంబర్ - 2015

07	సోమవారం	: ఏకాదశి
19	శనివారం	: స్వామి ప్రేమానంద జయంతి
21	సోమవారం	: వైకుంఠ ఏకాదశి

కపటం లేని మనస్సు - బ్రహ్మచారి శ్యామ్

'ఆధ్యాత్మిక సత్యాలను ఆవిష్కరించుకోవాలన్నా, పరమాత్ముణ్ణి ప్రత్యక్షం చేసుకోవాలన్నా కల్లాకపటం లేని బాలక స్వభావం కలిగి ఉండాలి' అని అంటారు భగవాన్ శ్రీరామకృష్ణులు. అటువంటి కల్లాకపటం ఎరుగని దివ్యబాలుడే సుబోధ్ (స్వామి సుబోధానంద) మహరాజ్.

సంపన్నుల కుటుంబంలో జన్మించిన సుబోధ్‌కు ఉపాధ్యాయుడు ఇంటివద్దనే పాఠాలు చెప్పేవాడు. కానీ శ్రీరామకృష్ణుల మధుర వచనాలను గ్రోలే సుబోధ్ తరచూ దక్షిణేశ్వరంలో శ్రీరామకృష్ణులను దర్శించుకొని ఆలస్యంగా తరగతులకు హాజరయ్యేవాడు. ఈ విషయమై మీ తండ్రికి ఫిర్యాదు చేస్తానని మందలించిన ఉపాధ్యాయునితో సుబోధ్ "చూడండి, చదువుకోవలసింది నేను. అందుకు నా తండ్రి ఏమి చేయగలడు, నా బదులుగా వారు చదవలేరు కదా! అయినా దయచేసి మీరు యథావిధిగా రండి. నా మనస్సు చదువువైపు మళ్ళినప్పుడు, తీరిక కలిగినప్పుడు చదువుకుంటాను" అని అంటాడు. ఈ సమాధానానికి విస్మయం చెందిన ఉపాధ్యాయుడు విషయాన్ని అతని తండ్రికి నివేదిస్తాడు. కానీ సుబోధ్ ఏదైనా విషయాన్ని అధ్యయనం చేయడం ప్రారంభిస్తే దాని పట్ల అతడు కనబరిచే శ్రద్ధను తెలిసి ఉండటంచేత తండ్రి అతనిని ఏమీ మందలించడు.



ఒకసారి శ్రీరామకృష్ణులు, సుబోధ్‌తో "మహేంద్రనాథ్ ఇల్లు మీ ఇంటి దగ్గరే కదా! అతని వద్దకు ఎందుకు వెళ్ళడం లేదు?" అని ప్రశ్నిస్తారు. అందుకు సుబోధ్ "అతను సంసారాన్నే త్యజించలేకపోయాడు. అతని వద్ద నుండి నేనేమి నేర్చుకోగలను?" అంటూ ముక్కుసూటిగా మాట్లాడుతాడు. ఒక గృహస్థుడి నుండి ఆధ్యాత్మిక శిక్షణ పొందడంలో అర్థంలేదని అతని ఉద్దేశం. అందుకు గురుదేవులు నవ్వి, వైరాగ్యం విషయంలో అతని కచ్చితత్వాన్ని చూసి సంతోషించి 'మహేంద్ర నా వద్ద నుండి నేర్చిన విషయాలే నీకు బోధిస్తాడు' అని చెప్పి అతడి వద్దకు వెళ్ళేలా ఒప్పిస్తారు.

ఒకరోజు శ్రీరామకృష్ణులు సుబోధ్‌తో "నా గురించి నువ్వు ఏమనుకుంటున్నావు?" అని ప్రశ్నిస్తాడు. అందుకు సుబోధ్ "జనులు ఎంతోమంది మీ గురించి ఎన్నో రకాలుగా చెబుతూ ఉంటారు. కానీ స్పష్టమైన ఋజువు కనబడనిదే నేను దేన్నీ నమ్మను" అంటూ కుండ బద్దలు కొట్టినట్టు సమాధానం ఇస్తారు. అందుకు నిరహంకార పూరితులైన గురుదేవులు "మంచిది, పాతనాణేలకు బదులుగా కొత్త నాణేలు ఇచ్చేవాడు నాణేలను పరీక్షించిన విధంగా నీవు కూడా నన్ను పూర్తిగా పరీక్షించాకే అంగీకరించు" అని అంటారు.

మరొకసారి శ్రీరామకృష్ణులు ధ్యానం అభ్యసించవలసిందిగా సుబోధ్‌కు సూచిస్తారు. అప్పుడు సుబోధ్ "అయ్యా! నేను ధ్యానం అభ్యసించవలసి వస్తే మీ దగ్గరకే ఎందుకు రావాలి? నేను వేరే గురువు వద్ద ధ్యానం నేర్చుకోగలను కదా!" అంటూ మనస్సులో ఉన్నది ఉన్నట్లు చెప్పాడు. అతని ఉద్దేశాన్ని అర్థం చేసుకున్న గురుదేవులు "సరే, నీవు ధ్యానం చెయ్యవద్దు. కానీ కనీసం రోజులో ఒక్కసారైనా నా గురించి ఆలోచించు" అని అంటారు.

శ్రీరామకృష్ణులు కాశీపూర్‌లో ఉండే రోజులలో ఒకసారి సుబోధ్ మహరాజ్‌ను తులసీదాస్ రచించిన 'సీతాపతి రామచంద్ర రఘుపతి రఘురాయి' అనే పాటను వ్రాసి పెట్టమని అడుగుతారు. అందుకు సుబోధ్ తన చేతిరాత బాగుండదని అంటూ నిరాకరిస్తారు. అయినా ఫరవాలేదు, వ్రాసి ఇమ్మని గురుదేవులు బలవంతం చేసినా అతడు ఒప్పుకోడు. దానితో గురుదేవులు అతణ్ణి నీవు మందమతివి, నీ చదువు నిర్లక్ష్యంచేసి స్నేహితులతో ఆటలాడుతున్నావు కాబోలు అంటూ మందలిస్తారు. ఆ విధంగా మందలించబడినప్పటికీ సుబోధ్ చిరునవ్వుతోనే ఉంటాడు. గురుదేవులు కూడా నవ్వి "ఏమి నాయనా! నేను మందలించానని నీకు కోపం రాలేదా?" అని అంటారు. అందుకు సుబోధ్ "మీ మందలింపులు కూడా తీయగానే ఉంటాయి" అని అంటాడు. డాంబికంలేని సుబోధ్ స్వభావానికి సంతోషించిన శ్రీరామకృష్ణులు అతని శిరస్సుని స్పృశించి ఆశీర్వదిస్తారు.

ఇలా సుబోధ్ ఎటువంటి దాపరికంలేని మనస్తత్వంతో గురుదేవులకు సన్నిహితంగా ఉంటూ వారి అనుగ్రహానికి పాత్రులయ్యారు, వారి దివ్యత్వాన్ని అవగతం చేసుకోగలిగారు. ❖

(తిథి ప్రకారం నవంబర్ 23వ తేదీన శ్రీరామకృష్ణ పరమహంస సన్న్యాస శిష్యులైన స్వామి సుబోధానంద మహరాజ్ జయంతి)

మాటలలో, చేతలలో, ఆచరణలో చిత్తశుద్ధి కలిగి ఉండు. నిష్కాపట్యంతో జపసాధనలను అనుష్ఠించు. అప్పుడు భగవంతుని అనుగ్రహం కోసం ప్రత్యేకంగా కోరనవసరం లేదు. - శ్రీశారదాదేవి

పలికెడిది భాగవతం

చతుర్ముఖ బ్రహ్మ తన మానసపుత్రుడైన నారదమహర్షికి శ్రీమన్నారాయణుడి వైభవాన్ని ఆవిష్కరింపచేస్తూ ఉన్నాడు. పరాత్పరుడైన ఆ పద్మనాభుడే ఈ విశ్వాన్ని సృష్టిస్తాడు, పోషిస్తాడు, సంహరిస్తాడని ఉద్ఘాటిస్తున్నాడు. అయితే మనస్సు ప్రసన్నంగా ఉన్న మహానుభావులే మహిత కళావిలసితమైన ఆ మాధవుడిని దర్శించగలరని ఆ విధాత విస్పష్టం చేస్తున్నాడు. అనంతరం ఆ అనంతాత్ముడి అవతారక్రమాన్ని త్రిలోక సంచారికి వివరిస్తున్నాడు. రేయింబవళ్ళు ఇతర కథా ప్రసంగాలు వింటూ ఏ మాత్రం పుణ్యకథల రుచి ఎరుగని వీనులకు,

సమ్మాన్యము శ్రీహరి కథామృతము

- స్వామి జ్ఞానదానంద

విష్ణుగాథలు విందుచేస్తాయని ప్రస్ఫుటంచేస్తూ ఆ బ్రహ్మదేవుడు **'సర్వలోక సమ్మాన్యమునై తనర్చు హరిమంగళ దివ్యకథామృతంబు సౌజన్యతన్ గ్రోలవయ్య బుధసత్తమ! యే వివరించి చెప్పెదన్!** – సకల లోక పూజనీయమై వెలుగొందే ఆ దేవదేవుని దివ్యమంగళ కథాసుధారసాన్ని నీకందిస్తాను!' అని యజ్ఞవరాహం నుంచి కల్కి వరకు శ్రీహరి లీలావతారాలన్నింటినీ శాబ్దిక ప్రత్యక్ష ప్రసారం చేశాడు. ఇలాంటి సర్వేశ్వరుడి లీలల స్మరణ వలన మన మనోక్షేత్రం భక్తిబీజాలు పడి, సాత్త్వికగుణాంకురంతో సస్య శ్యామలమవుతుంది. అందుకే భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస "భగవంతునికి నానారూపాలు, నానా లీలలు ఉన్నాయి. ఈశ్వర లీల, దేవలీల, మానవలీల, జగత్‌లీల అంటూ ఆయన లీలలు పలురకాలు. ప్రేమభక్తిని బోధించే నిమిత్తమే ప్రతి యుగంలోను భగవంతుడు వివిధ రూపాలను ధరిస్తూ ఉన్నాడు" అంటారు.

కనకాక్షుని కూల్చిన కమలాక్షుడు: ఆ సరోజసంభవుడు నారదమునికి శ్రీమన్నారాయణుడి అవతార పరంపరను పరిచయం చేస్తూ తొలుత యజ్ఞవరాహ ఘట్టాన్ని గుర్తుచేశాడు. హిరణ్యాక్షుడనే దానవుడు భూగోళాన్ని సాగరగర్భంలో దాచినప్పుడు, ఆ దామోదరుడు వరాహరూపం ధరించి దారుణమైన రణానికి దిగాడని, కోరలతో కుమ్మి కడతేర్చి భూమాతను రక్షించాడని వివరించాడు. నిజానికి మన మనస్సులో కూడా అప్పుడప్పుడు ఆ కనకాక్షుడు కళ్ళు తెరుస్తూనే ఉంటాడు. కనిపించిన దాన్నల్లా దోచేసుకోవాలని, దాచేసుకోవాలని తాపత్రయపడుతూ ఉంటాడు. ఇలాంటి ఎన్నో మన మనోప్రవృత్తులకు ప్రతీకాత్మక(సింబాలిక్) రూపాలే ఆ రాక్షసులు. అయితే ఆ అంతర్యామిని మన హృదయంలోకి ఆహ్వానిస్తే, ఆయనే ఆ దానవగుణాలను మట్టుపెడుతూ దైవికగుణ సంపదను నెలకొల్పుతాడు. భగవంతుడి పలు అవతారాల అంతిమ లక్ష్యమదే! అందుకే ఆ ఘట్టాలను, పాత్రలను పుక్కిట పురాణాలుగా కొట్టిపారేయకుండా మన మానసిక స్థితులతో సరిపోల్చుకుంటూ, విశ్లేషించుకుంటూ ఉండాలి.

ఇలా యజ్ఞవరాహం తరువాత సుయజ్ఞుడు, కపిలుడు, దత్తాత్రేయుడు, సనందుడు, సనత్కుమారుడు, సనత్సుజాతుడు, నరనారాయణులు, ధ్రువుడు, పృథుచక్రవర్తి, వృషభుడు, హయగ్రీవుడుగా పలు అవతారాలు దాల్చి ఆ ధరణీనాయకుడు ధర్మాన్ని సుస్థాపితం చేసేందుకు ప్రయత్నించాడని చతుర్ముఖ బ్రహ్మ ఉద్ఘోషించాడు. ఆ తరువాత సముద్రం పాలవుతున్న వేదరాశిని రక్షించేందుకు ఆ మాధవుడు మత్స్యావతారం, క్షీరసాగర మథనసమయంలో కూర్మావతారం, బాలభక్తుడు ప్రహ్లాదుడిపై ప్రేమమేరకు నరసింహావతారం దాల్చాడని, గజేంద్రసంరక్షణార్థం ఆదిమూల స్వరూపుడై మకరిని మట్టుపెట్టాడని ఆ విరించి విశేషంగా వర్ణిస్తున్నాడు.

లోకోపకారార్థం లోకాభిరాముడై....: అనంతరం రాక్షసరాజైన బలిచక్రవర్తి గర్వమణచేందుకు వామనావతార మెత్తాడని, మూడడుగులతో ముల్లోకాలను ఆక్రమించి, తుదకు ఆ దానవరాజును తుదముట్టించాడని వివరించాడు. అనక హంసావతారమెత్తి ఆత్మతత్త్వం తేటపరచే భాగవత మహాపురాణాన్ని ఉపదేశించాడని, అనక మనువుగా పుట్టి చక్రం చేబూని దుర్జనులను శిక్షించాడని, ధన్వంతరిగా దిగివచ్చి తన నామస్మరణతోనే భువిపై జనుల రోగాలను నయంచేసే ఆయుర్వేదాన్ని అందించాడని బ్రహ్మదేవుడు పేర్కొన్నాడు. ఆ

వరుసలో జమదగ్ని సుతుడైన పరశురాముడిగా వచ్చి లోకవిరోధులైన హైహయరాజులను ఎదిరించాడని, రణరంగంలో ఇరవై ఒక్కసార్లు ఆ రాజసమూహాన్ని తన గండ్రగొడ్డలితో చెండాడాడని నారదుడికి గుర్తుచేశాడు. ఇలా విష్ణుమూర్తి విశేష అవతారాలన్నీ వివరిస్తూ, విధాత శ్రీరామావతార ఘట్టాన్ని నారదమహర్షికి స్ఫురణకు తెస్తూ...

చటుల దానవ గహన వైశ్వానరుండు,రావణాటోప శైల పురందరుండు
నగుచు లోకోపకారార్థ మవతరించె,రాముడై చక్రి లోకాభిరాముడగుచు!

'దానవులనే దారుణారణ్యాన్ని దహించే కార్చిచ్చు, రావణుని గర్వమనే పర్వతాన్ని బద్దలు చేసే ఇంద్రుడు శ్రీరామచంద్రప్రభువు' అని అభివర్ణిస్తున్నాడు. ఆ పరంపరలోనే శ్రీకృష్ణావతార మాహాత్మ్యాన్ని మననం చేసుకుంటూ, బలరామకృష్ణుల బాల్య సాహసలీలలన్నింటికీ దృశ్యరూపమిచ్చాడు. అంతేకాకుండా బలరాముడు, భీముడు, అర్జునుడు, తదితర విలుకాండ్ర రూపాలతో అవతరించి కఠినులు, నీచులు, దుర్మార్గులు అయిన రాజులను రణరంగంలో ఆరితేరిన భుజబలక్రీడతో శ్రీకృష్ణుడు హతమార్చాడని పేర్కొంటూ... **...సాధుల రక్షించిన యట్టి కృష్ణుని అనంతుని కొల్తు నెల్లప్పుడున్** అంటూ ఆ బ్రహ్మదేవుడు మనస్సులోనే అంజలి ఘటించాడు.

> **శ్రవణపేయమైన శ్రీమహావిష్ణువు అవతారగాథలు అమృత పానంతో సమానం. ఆ సుధాజలధిలో మునిగితేచాలు మన జన్మ తరించిపోతుంది. పర్వతమంత ఎదిగిన మన పాపరాశి క్షణంలో భస్మీపటలమవుతుంది. ప్రాపంచిక చింతనలు మాని, ఆ పరాత్పరుడి పాదాలే శరణమనుకుంటూ, ఆ కథాతీరంలో సేదతీరిన వారికి సులభోపాయాలన్నీ ఆయనే చూపెడతాడు.**

వ్యాసుడై, బుద్ధుడై, కాలక్రమంలో కల్కియై...: ఆ సృష్టికర్త వ్యాస, బుద్ధ, కల్కి రూపాలను కూడా కుమారుడి కళ్ళ ముందు దర్శింపచేస్తున్నాడు. అల్పబుద్ధులు, అల్పాయుష్కులు, అవినీతి పరులైన మానవులకు వేదాలు బోధపడవని, అలాంటి వారిని అనుగ్రహించాలనే సదాశయంతో శ్రీహరి వ్యాసమహర్షిగా రూపుదాల్చాడన్నాడు. వేదవృక్షాన్ని శాఖలుగా విభజించి సులభసాధ్యం చేసి బోధించాడని బ్రహ్మదేవుడు చెబుతున్నాడు. చపలచిత్తంతో, అసత్యవాదంతో ప్రజలను దురాచారాల వైపు మళ్ళించే ప్రబుద్ధులను, పుండరీకాక్షుడు బుద్ధుడై అవతరించి నిర్మూలించాడని విస్పష్టం చేస్తున్నాడు. ఇక కలియుగంలో అధర్మవర్తనుల ఆగడాలను అరికట్టేందుకు ఆ దేవదేవుడు కల్కిగా కాలుమోపి ధర్మ ప్రతిష్ఠాపన చేస్తాడని నారదుడికి పునరుద్ఘాటించాడు.

భగవంతుడి అవతారాలు అనంతమని పురాణాలు ఘోషిస్తున్నాయి. యుగయుగానికి పూర్ణావతారాలతో, అంశావతారాలతో ఆ దేవదేవుడు ధర్మాన్ని సంరక్షిస్తూనే ఉంటాడు. అలాంటి శ్రీహరి అవతారతత్త్వానికి సంబంధించిన కథామృతం ఇచ్చే ఫలితం అనంతమైంది. కలియుగంలో అవతార వరిష్ఠులై పూజలందుకున్న భగవాన్ శ్రీరామకృష్ణుల లీలలు కూడా మహనీయమైనవి. ఆ పరమపురుషుని గురించి ప్రస్తావిస్తూ, 'సాక్షాత్తూ భగవంతుడి అపరావతారం శ్రీరామకృష్ణ పరమహంస. వారి జీవన ఘట్టాలు భగవంతుని ముఖాముఖి మనకు దర్శనం చేయిస్తాయి' అని అన్నారు మహాత్మాగాంధీ!

అదే విధంగా శ్రీరామకృష్ణుల కథామృతంలో వారి ముఖతా జాలువారిన బోధనలు కేవలం పండిత వాక్యాలు కావు. జీవిత గ్రంథపు పుటలు. అవి ఆయన స్వీయ అనుభవాల ఆవిష్కృతాలు. సర్వమత సారంతో కూడిన ఆ అమృతవాక్కులు చదివిన వారందరూ 'భగవంతుడే సత్యం, తక్కినదంతా అసత్యం అనే భావనకు రాకుండా ఉండలేరు'. అలాంటి శ్రీరామకృష్ణుల కథామృతం నిష్ఠగా, విశ్వాసంతో ఒక్కసారి చదివినా చాలు జీవితాలు మహత్తరమైన మలుపు తిరుగుతాయంటే అతిశయోక్తి కాదు.

హరి మాయాబలం ఎరుగ శక్యమే! : ఇక పరంధాముడి అవతార తత్త్వమంతా వివరించాక ఆ విరించి, ఆ పరమాత్ముని అప్రతిహతమైన శక్తి ఇంతని వర్ణించటం ఎవరి తరమూ కాదని తేల్చి చెప్పాడు. పైగా మాధవుడి మాయను వర్ణిస్తూ, ఇక సనకుడు, సనందుడు, సనత్కుమారుడు తదితర సజ్జన సంఘాలకు మాత్రం తెలుసుకోవడానికి వీలవుతుందా? ఆదిశేషుడు ఇతరమైన ఆలోచనలు వదలిపెట్టి బుద్ధిని సదా భగవత్సేవకే అంకితం చేశాడు. వేయినోళ్ళతో ఆ పరమేశ్వరుని చరిత్రను అనురక్తుడై కీర్తిస్తూ ఉంటాడు. అలాంటి శేషుడు కూడా ఆయన మాయామహిమ ఎలాంటిదో తెలుసుకోలేకున్నాడు. ఇక ఇతరుల సంగతి చెప్పాలా? అని నారదుడి ముందు నివ్వెరపోయాడు. అందుకే ఓసారి భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస ఓ గృహస్థ భక్తుడితో "భగవంతుడు తన మాయచే సర్వాన్ని కప్పి ఉంచాడు. ఎవ్వరికీ ఒకింత కూడా తెలియనివ్వడు. కామినీకాంచనాలే ఆ మాయ. ఆ మాయను తొలగించి చూసిన వారే ఆయనను దర్శించగలరు" అంటారు. అదే భావనను ఆనాడు బ్రహ్మదేవుడు కూడా శ్రీమన్నారాయణుడి పరమభక్తుడైన నారదమహర్షికి తేటపరుస్తూ....

ఇతరము మాని తన్ను మది నెంతయు నమ్మి భజించువారి నా
శ్రితజన సేవితాంఘ్రి సరసీరుహుడైన సరోజనాభు డం
చితదయతోడ నిష్కపట చిత్తమునం కరుణించు, నట్టి వా
రతుల దురంతమై తనరు నవ్విభు మాయ తరింతు రెప్పుడున్

'ఎవరు ఇతర చింతలు మాని సదా శ్రీమన్నారాయణున్నే దృఢంగా నమ్మి సేవిస్తారో వాళ్ళను, ఆశ్రితులు అర్చించే పాదపద్మాలు కలవాడైన పద్మనాభుడు మిక్కిలి దయకలిగి కల్లాకపటం లేని మనస్సుతో అనుగ్రహిస్తాడు. అలా భగవంతుని సేవించి ఆయన కృపకు పాత్రులైన వాళ్ళు మాత్రమే సాటిలేనిదీ, దాటరానిదీ అయిన ఆ భగవంతుని మాయను నిరంతరం తరింపగలుగుతార'ని సులభోపాయాన్ని సూచించాడు. ❖

"ఒక వ్యక్తి తనను తాను అసహ్యించుకొంటున్నట్లయితే అదే పతనానికి హేతువు. పూర్వీకుల చరిత్రను అవమానకరంగా భావిస్తే, ఆ జాతి అంతానికి చేరుకున్నట్లే!" అంటారు స్వామి వివేకానంద. గత వైభవాన్ని మర్చిపోయినంత కాలం మనమూ, మన దేశం స్తబ్ధతలో మునిగిపోతాం. అందుకే, మన ప్రాచీన సంస్కృతి గురించి తెలుసుకోవాలి. గడచిపోయిన సంగతులు తెలుసుకొంటూ, భవిష్యత్ మహత్కార్యాల సాధన వైపు నడవాలి. మన ప్రాచీన భారతీయ సంస్కృతిని గుర్తు చేసేందుకు చేస్తున్న ప్రయత్నమే ఈ వ్యాసాల పరంపర. సుప్రసిద్ధ రచయిత, బెంగుళూరు రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి హర్షానంద మహరాజ్ మధ్యయుగాల కాలం దాకా విలసిల్లిన మన సంస్కృతిని 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు 2014 ఫిబ్రవరి సంచిక నుండి వివరిస్తున్నారు.

విదేశాలలో భారతీయ సంస్కృతి

శ్రీలంక (సిలోన్): శ్రీలంక లేక సింహళ ద్వీపం లేక సిలోన్ - ప్రాచీన కాలం నుండి భారతదేశంతో సంస్కృతిపరంగాను, రాజకీయంగాను ముడిపడి వుంది. శ్రీలంకలో బయల్పడిన పురాతన సంస్కృతి శిథిలాలు, తమిళనాడు తిరునల్వేలి టెరిలో లభించిన అవశేషాలు ఒకేలాగ ఉన్నాయి. శ్రీలంక రావణాసురుని రాజ్యం. శ్రీరామ, సీతామాతల ఉదంతం యిప్పటికీ శ్రీలంక సాంఘిక-సాంస్కృతిక జీవనంలో ముఖ్యమైనది.

గుజరాత్ నుండి విజయ మహారాజు క్రీ.పూ. 543లో శ్రీలంక చేరుకోవడం భారతీయ మత, సంస్కృతులకు నాంది. అక్కడ ఆయన తన రాజ్యాన్ని స్థాపించారు. శివ, విష్ణు, స్కంద, గణేశుల ఆరాధన ఆయన కాలం నుండే ప్రారంభింపబడి ఉండ వచ్చు. అశోకుని (క్రీ.పూ. 247-207) మతప్రచారకులు శ్రీలంకకు బౌద్ధమతాన్ని తీసుకు వచ్చారు. బుద్ధఘోషుడు బుద్ధుని దంత అవశేషాన్ని మహానామ (క్రీ.శ. 401-431) కాలంలో యిక్కడికి తెచ్చాడు. గుప్తుల కళలు, సంస్కృతి ఈ కాలంలో శ్రీలంకను ప్రభావితం చేశాయి. క్రీ.శ. 7వ శతాబ్దం నుండి 16వ శతాబ్దం వరకు పల్లవులు, చోళులు, పాండ్యులు, విజయనగర రాజులు శ్రీలంకతో సన్నిహిత సంబంధాలు కలిగివుండేవారు.

శ్రీలంకలోని పురాతన హిందూ దేవాలయం

బౌద్ధమతంతోపాటు శైవారాధన యిక్కడ ప్రాచుర్యంలో ఉండేది. బౌద్ధులు విష్ణువును తమను రక్షించే దైవంగా భావించేవారు. సుబ్రహ్మణ్యస్వామి, కార్తికేయ ఆరాధన కూడా ఉండేది. సింహళ లిపి, భాష భారతీయ ప్రభావాన్ని కలిగివుంది. వాస్తు, కళలలో బార్హట్, సాంచి, అమరావతి సంప్రదాయాలు కనిపిస్తాయి. నృత్య, నాటక రంగాలు కూడ భారతీయ ప్రభావాన్ని కలిగివున్నాయి. కుల వ్యవస్థ, వివాహం, దుస్తులు దక్షిణ భారతదేశంలోని తమిళనాడు, కేరళ పద్ధతులను పోలి ఉంటాయి.

థాయ్‌లాండ్ (సియాం) : ఒకప్పుడు సియాంగా పిలువబడిన థాయ్‌లాండ్ క్రీ.శ. 2వ శతాబ్దం నుండి భారతదేశంతో సంబంధాలు కలిగివుండేది. ఇటీవల ప్రహ్ పథోమ్ మరియు పాంగ్‌టాక్ ప్రాంతాలలో జరిపిన త్రవ్వకాలలో క్రీ.శ. 6వ శతాబ్దానికి చెందిన గణపతి విగ్రహంతో పాటు బుద్ధ విగ్రహాలు (అమరావతి సంప్రదాయం), గుప్తుల వాస్తు కళా పద్ధతిలోని నిర్మాణాలు బయల్పడ్డాయి. క్రీ.శ.4వ శతాబ్దానికి చెందిన ఒక సంస్కృత శాసనం, కొన్ని వైదిక దేవతా విగ్రహాలు ఈ స్థలంలో లభించాయి. హైందవ మతం, గ్రంథాలు, భాష, సాహిత్యం యిక్కడ వ్యాపించి ఉండేవి. అగస్త్య మహర్షిని వీరు ఆరాధించేవారు. మంగోలియా రాజు కుబ్లాయ్‌ఖాన్ దండయాత్రలో, యువాన్‌లోని థాయ్ ప్రజలు (దక్షిణ చైనా) సియాం దేశానికి వలసవచ్చి (బహుశా క్రీ.శ. 1253) అక్కడ స్థిరపడ్డారు. క్రమంగా వీరు సియాం, లావోస్‌లను పూర్తిగా ఆక్రమించారు.

థాయ్ రాజ్యాలలో మొదటిది సుఖోదయ ప్రభుత్వానికి చెందినది. సజ్జనాలయ రాజధానిగా ఇంద్రాదిత్య మొదటిరాజు. యీ కాలం నాటి కొన్ని పేర్లు - గాంధార, మిథిల, విదేహ భారత సంస్కృతి ప్రభావాన్ని తెలియజేస్తాయి. సువర్ణగ్రామ, ఉన్మార్గశిల, హరిపుంజయ మొదలయిన పేర్లు, పాళీ భాషలోని శిలాశాసనాలు, గుప్తుల సంప్రదాయంలో మందిరముల నిర్మాణం భారతీయ ప్రభావాన్ని ధ్రువపరుస్తున్నాయి. సుఖోదయ రాజ్యం తరువాత అయోధ్య రాజుల పాలన క్రీ.శ. 1350లో మొదటి ప్రభువు 'రామాధిపతి' తో ప్రారంభమయింది. వీరి రాజధాని ద్వారావతి. ఈ కాలంలో బౌద్ధమతం ప్రబలంగా ఉండేది. అయినాకూడా ఆనాటి రాజులు హిందూ మందిరాల నిర్మాణం, బౌద్ధ స్తూపాల, శిలల నిర్మాణాన్ని ప్రోత్సహించారు. థాయ్ భాషలో ఇప్పటికీ అనేక మార్పు చెందిన సంస్కృత పదాలు వున్నాయి. ❖

అనువాదం: డాక్టర్ పి.వి.రెడ్డి


స్వామి యతీశ్వరానంద

మహాపురుషుని సాన్నిధ్య స్మృతులు

- ప్రవ్రాజిక శారదాప్రాణా

స్వామి యతీశ్వరానందజీ మహరాజ్ శ్రీశారదామాతను ఏ విధంగా దర్శించి, ఆశీర్వాదం పొందారనే విషయాన్ని మాకు ఈ విధంగా వివరించి చెప్పారు.

'మేము శారదాదేవి దగ్గరకు వెళ్ళినప్పుడల్లా సాష్టాంగ నమస్కారం చేసి పాదాభివందనం చేసేవారం. కానీ ఆమె ముఖారవింద దర్శనం లభించేది కాదు. ఆమె ఎప్పుడూ ముసుగువేసుకునే ఉండేవారు. కానీ ఒకరోజు వెళ్ళినప్పుడు ఆమె ముఖారవింద దర్శన భాగ్యం లభించింది. నమస్కరించేటప్పుడు ఆమె దేదీప్యమానమైన ముఖారవిందాన్ని దర్శించాను. ఆరోజు ఆమె ముసుగు వేసుకోలేదు. వాకిలి దగ్గర నిలుచుని ఉన్నారు. (చెప్తూ, చెప్తూ స్వామీజీ కంఠం గద్గదమై పోయింది) ఆహా! ఆ ముఖంపై ఎటువంటి పవిత్రత! దేదీప్యమానమైన తేజం శతాధిక్యముగా ప్రసరించునట్టి కాంతి. ప్రసన్న వదనంపై చిరునవ్వు. శారదామాత ఎంతో ప్రేమగా, ఆప్యాయంగా నా తలపై చేయి ఉంచి ఆశీర్వదించారు. నా మనస్సు ఆనంద ప్రవాహంలో ఓలలాడింది. తీవ్రమైన జ్వరతాపంతో ఉన్నప్పుడు శరీరానికి తగిలే శీతల స్పర్శకన్నా చల్లగా ఉన్న పరమసుఖవంతమైన అనుభూతి అది. ఆ స్పర్శ నా వ్యక్తిత్వాన్నే పరిపూర్ణంగా మార్చివేసింది. అటువంటి సుఖానుభూతి జీవితంలో మరెన్నడూ కలుగలేదు'.

శ్రీశారదామాత చిత్రం (నాకు సజీవమూర్తి) నా దగ్గర ఎప్పుడూ ఉండేది. 1933వ సంవత్సరం నేను విదేశంలో ఉన్నప్పుడు నా దగ్గర ఉన్న ఆమె చిత్రానికి ఒక ఫ్రేమ్ చేయించాల్సి వచ్చింది. సరే అని ఫోటో ఫ్రేమ్ చేసేవాని వద్దకు వెళ్ళి ఫ్రేమ్ చేయమని చిత్రాన్ని ఇచ్చినప్పుడు ఆ వ్యక్తి 'ఇది మీ అమ్మగారి ఫోటో కదా' అని అడిగాడు. నేను 'అవును మా అమ్మగారే, అందరికీ అమ్మ' అన్నాను.

పూజ్య యతీశ్వరానందజీ తాను శ్రీరామకృష్ణుల చేతిలో ఓ పరికరాన్నని ఎల్లప్పుడు భావించేవారు. ఒకరోజు అందరం కూర్చుని ఉన్నాం. స్వామీజీ తనలోతాను అనుకుంటున్నట్లుగా, 'భవిష్యత్తులో ఇక్కడి నుండి (శ్రీరామకృష్ణ మఠం, బెంగుళూరు) ఎంతటి శక్తి ప్రవహిస్తుందో చూడండి' అన్నారు.

మరొకసారి స్వామీజీకి కలలో శ్రీరామకృష్ణులు కనిపించి 'నా కొరకై ఇక్కడ ఒక మందిరాన్ని నిర్మించు' అని ఆదేశించారట. కాలక్రమేణ ఒక సుందరమందిర నిర్మాణం జరిగింది. అదీగాక మెల్లమెల్లగా అసంఖ్యాకులైన భక్తులకు ఆకర్షణీయ స్థలమైపోయింది.

స్వామీజీ మాతో 'ప్రతివారు నిస్వార్థభావనతో పనిచేయడం చాలా యోగ్యమైనది' అని అన్నారు.

అందుకు నేను, 'స్వామీజీ మేమందరం నిస్వార్థంగా ఇతరుల సుఖానికై పనిచేస్తే, చాలా సమయం ఇతరుల కొరకై వెచ్చించాల్సి వస్తుంది. దానివల్ల వారిని సోమరిపోతులుగా చేసినట్లవుతుంది కదా! అందువలన ఉపకారం కన్నా అపకారమే ఎక్కువవుతుందేమో?' అని సందేహం వెలిబుచ్చాను.

వెంటనే స్వామీజీ, 'మనలను ఒక రోగం పీడిస్తున్నది. అదేమిటంటే ఇతరులను ఏదో బాగు చేయాలని, ఆరోగ్యవంతులను చేయాలని, వారి కాళ్ళపై వారిని నిలబెట్టాలని, ఇంకా ఏదేదో అనుకోవడమే. మనం చేసే పని వారిని సోమరులుగా మార్చకూడదు. మనం చేసే పని ఏవిధంగా ఉండాలంటే అది ఇతరులలో పనిచేయాలనే ఉత్సాహాన్ని పెంపొందించగలగాలి. వారికి ఆ విధమైన శిక్షణనివ్వు. మన జీవన విధానం మనకు ఏ విధంగా మంచి చేస్తుందో, అదేవిధంగా అది ఇతరులకు కూడా అంతే మంచిని చేయాలి. మనకు లభించే భగవదాశీర్వాదం వారికి కూడా లభించాలి' అని చెప్పారు. ❖ **అనువాదం: శ్రీమతి టి. శారద**

(స్వామి యతీశ్వరానంద – శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష సన్న్యాస శిష్యులైన స్వామి బ్రహ్మానందజీ మహరాజ్ శిష్యులు)

గర్వాంధకారులై మానవులు తామే సమస్తమూ చేస్తున్నామని భావిస్తారు. దేవుని మీద ఆధార పడరు. ఆయనపై ఆధారపడిన వారిని ప్రమాదాల నుండి ఆయనే కాపాడుతాడు. - *శ్రీశారదాదేవి*

రామకృష్ణ భక్తి సూత్రాలు

– స్వామి యతీశానంద

నారద భక్తి సూత్రాలు, శాండిల్య భక్తి సూత్రాలు భక్తియోగానికి సంబంధించిన ప్రామాణిక గ్రంథాలు. అయితే ఆధునిక తరంలో భగవదన్వేషకులకు అనువైన రీతిలో భక్తితత్త్వాన్ని బోధించారు శ్రీరామకృష్ణులు. ఈ నేపథ్యంలో 'శ్రీరామకృష్ణ కథామృతం' నుండి కొన్ని ఉపదేశాలను 'రామకృష్ణ భక్తి సూత్రాలు'గా సులభరీతిలో వివరించే ప్రయత్నం చేస్తున్నాం.

బౌద్ధగ్రంథాలు పాళీ భాషలో, బైబిల్ హీబ్రూలో, ఖురాన్ అరబ్బీ భాషలో రచించబడ్డాయి. అలాగే శ్రీరామకృష్ణుల ఉపదేశాలు వారి మాతృభాష బెంగాలీలో ఆవిష్కృతమయ్యాయి. అవతారపురుషుని ముఖతః వెలువడిన ఆ అమృతోపదేశాలను యథాతథంగా ఉట్టంకిస్తూ వ్యాఖ్యానిస్తున్నాం. మహాశక్తిమంతమైన ఆ బోధనలను మననం చేసుకుంటూ కృతార్థులమవుదాం.

మా (హే ఈశ్వర్) ఆమి తొమార్ శరణాగత, శరణాగత! తొమార్ శ్రీపాదపద్మే శరణ నిలాం. దేహసుఖ చాఇ నా మా! లోకమాన్య చాఇ నా; (అణిమాది) అష్టసిద్ధి చాఇ నా, కేవల ఏఇ కొరొ జేనో తొమార్ శ్రీపాదపద్మే శుద్ధాభక్తి హొయ్–నిష్కామ, అమలా, అహైతుకీ భక్తి హొయ్. ఆర్ జేనో మా, తొమార్ భువనమోహినీ మాయాయ్ ముగ్ధ నా హోఇ–తొమార్ మాయార్ సంసారే కామినీ–కాంచనేర్ ఊపర్ భాలొబాశా జేనో కొఖన్ నా హొయ్! మా! తొమా బొయి ఆమార్ ఆర్ కేఉ నాఇ. ఆమి భజనహీన్, సాధనాహీన్, జ్ఞానహీన్, భక్తిహీన్–కృపా కొరె శ్రీపాదపద్మే ఆమాయ్ భక్తి దాఒ.

తల్లీ (హే భగవాన్) నేను నీకు శరణాగతుడను, శరణాగతుడను! నీ చరణారవిందాలలో శరణు పొందాను. శరీరసౌఖ్యం కోరను తల్లీ! పేరు ప్రతిష్ఠలు కోరను. (అణిమాది) అష్టసిద్ధులు కోరను. నీ పాదపద్మాల పట్ల శుద్ధభక్తి కలిగేటట్లు మాత్రం చేయి; నిష్కామ, నిర్మల, అహైతుకీ భక్తి కలగనీ. ఇంకా అమ్మా, నీ భువనమోహన మాయా సంసారం చూచి ముగ్ధుడనవరాదు. నీ మాయా ప్రపంచంలో కామినీ కాంచనాలపై అనురక్తి ఎన్నడూ కలుగరాదు. అమ్మా! నీవు తప్ప నాకు మరెవ్వరూలేరు. నాకు భజన, సాధన తెలియదు. జ్ఞానభక్తులు లేవు. కృప చూపి నీ పాదపద్మాల పట్ల నాకు భక్తినిమ్ము.

వ్యాఖ్య: ప్రార్థన ఏవిధంగా చేస్తే జీవులలో భక్తి ఉదయిస్తుందో, అది శ్రీరామకృష్ణ స్వయంగా లోకానికి బోధిస్తున్నారు.

'తల్లీ' అని శ్రీరామకృష్ణులు సంబోధించినా, అది వ్యక్తుల ఇష్టదైవమని ఆయన వివరణ. భగవంతునికి అనేక రూపాలు, నామాలు. ఎవరు ఏ రూపాన్ని ఆరాధించినా, ఏ నామాన్ని స్మరించినా, హృదయపూర్వకంగా చేస్తే భగవంతుడు ఆ రూపంలో వారికి దర్శనమిస్తాడు. ఎవరు ఏ భావంతో నన్ను కొలిచితే, నేను ఆ భావంతోనే వారిని అనుగ్రహిస్తానని గీత(4.11)లో భగవానుడు చెప్పారు కదా!

భగవంతునితో ఒక సంబంధం పెట్టుకొనాలని శ్రీరామకృష్ణులు చెప్పేవారు. మనం ఎవరినైనా పిలవాలంటే ఏదో ఒక సంబంధం కలపేరుతో – అన్న, అమ్మ, బాబు, అయ్యా ఇలాగు పిలుస్తాం. భగవంతుడు మన ఆత్మీయుడు కదా. శ్రీరామకృష్ణులు 'మా' అని పిలిచేవారు. అది కాళీమాతను ఉద్దేశించి మాత్రమే కాదు, పరబ్రహ్మాన్ని కూడా సంబోధించినట్లే. ఆయన శ్రీరాముణ్ణి సంబోధించినా, కాళీమాతను సంబోధించినా ఒకే విధంగా ప్రార్థించేవారు. మనకు శుద్ధ భక్తి కలగడానికి శ్రీరామకృష్ణుల ఈ విశేష ప్రార్థనను గురించి దీర్ఘంగా ఆలోచించాలి.

"ఓ ప్రభూ! నేను ఆత్మసమర్పణ చేసుకొంటున్నాను, శరణాగతుడను. లోకంలో సాధారణంగా ప్రతి ఒక్కరమూ సౌఖ్యాన్నే కోరుకుంటాం. పేరు ప్రతిష్ఠలు రావాలని కాంక్షిస్తాం. కనుక శ్రీరామకృష్ణ నాకు దేహసౌఖ్యం వద్దు, కీర్తి వద్దు" అంటున్నారు.

అష్టసిద్ధులు అనగా నానావిధ అలౌకిక శక్తులు. వాటి వల్ల నిన్ను మరచిపోతాను. నాకు అహైతుకీ భక్తిని ప్రసాదించు. నీవు భక్తుడ్ని పరీక్షించడానికి ఎన్నోవిధాల మాయకు ముగ్ధుడ్ని చేస్తావు. నన్ను పరీక్షించకు ప్రభూ! నేను దుర్బల చిత్తుడను. లోకంలో అందరూ స్త్రీ – పురుష ఆకర్షణకు లోనవుతారు; సంపదపై ప్రేమతో బద్ధులు అవుతారు. దీనికి వశుడను కాకుండా నన్ను రక్షించు ప్రభూ! ఇందులో బద్ధులైన వారికి ఎన్ని జన్మలు గడచినా భోగలాలస తీరదు– అగ్నిలో ఆజ్యం పోసినట్లు. మనుష్యులు నిన్ను మరచిపోయి కష్టాల సుడిగుండంలో గిరగిర తిరుగుతారు. నాకు అటువంటి అవస్థ రానీయకు, కామకాంచనాలపట్ల అనురక్తి కలుగనీయకు.

భగవాన్! నావారంటూ ఈ ప్రపంచంలో ఎవ్వరూ లేరు. ఎవ్వరూ నిజమైన ఆనందాన్ని ఈయజాలరు. ఎవ్వరూ నిస్వార్థంగా ప్రేమించరు. కనుక, నీవే నావాడివి; నన్ను నీవాడిని చేసుకో.

భగవాన్! నాకు చెప్పుకొనదగిన గుణాలు లేవు. భజన, సాధనలు చేయను. నాకు భక్తి లేదు. ఎందుకనగా, అనేక జన్మలలో విషయ వస్తువుల వెంబడి పరుగులెత్తాను. వాటిని త్యజించే ప్రయత్నమే చేయడంలేదు. విషయభోగాలలో మునిగి, నిన్ను ఎన్నడూ పిలువ లేదు. నీవు దయాసాగరుడవని విని, ఆ విశ్వాసంతో ప్రార్థిస్తున్నాను. నాకు శుద్ధభక్తిని ప్రసాదించు."

మనం ఏ విధంగా ప్రార్థించాలన్నది శ్రీరామకృష్ణులు మనకు తెలిపారు. మనం హృదయపూర్వకంగా ఆ విధంగా ప్రార్థిస్తే, భగవంతుడు కృప చూపి, మనకు శుద్ధభక్తిని ప్రసాదిస్తాడు. ❖

అనువాదం: డాక్టర్ కమల జయరావు

నీవు సర్వసముడవు...

– శ్రీమతి బి.కృష్ణకుమారి

అన్నమయ్య పదామృతం

నీవు సర్వసముడవు, నీవు దేవదేవుడవు
ఈవల గుణదోషాలెంచనిక నేలా?॥

పూవులపై గాసీ పారి ముండ్లపై గాసీని
ఆవల వెన్నెలకేమి హాని వచ్చీనా
పావనుల నటు గాచి పాపపుంజమైన నన్ను
గావగా నీ కృపకును కడమయ్యీనా॥

గోవు మీద విసరీ కుక్క మీద విసరీని
పావనపు గాలికిని పాపమంటీనా
దేవతల రక్షించి దీనుడనైన నాకు
దోవచూపి రక్షించితే దోసమయ్యీనా॥

కులజుని యింట నుండీ కులహీనుని యింటనుండీ
యిలలో నెండకు నేమి హీనమయ్యీనా
వలసి శ్రీవేంకటాద్రి వరములు యిచ్చి నాలో
నిలిచి వరములిచ్చి నేడు గావవే॥

అంతరాలు ఎంచక, అంతర్యామియై అందరినీ సమంగా కాచే కరుణాంతరంగుడు ఆ కమలదళాక్షుడు. కోటికిపడగలెత్తిన కొడుకైనా, కటికదారిద్ర్యంలో మగ్గుతున్న కొడుకైనా కన్నవారికి ఒకే కడుపుతీపి! అలాగే జగదేక నాథుడైన ఆ పరమాత్మకి గుణవంతుడన్నా, గుణహీనుడన్నా సరిసమాన ప్రీతి! స్వపరభేదాలన్నవే తెలియని ఆ సర్వేశ్వరుడి సృష్టిలో పక్షపాతమన్నదే లేదు! పూలనెలా పోషిస్తాడో, ముళ్ళనలాగే పోషిస్తాడు; పావనులకెలా ఫలాల్నిస్తాడో, పాపులకలాగే ఫలాల్నిస్తాడు; గోవునెలా కాచుకుంటాడో, కుక్కనూ అలాగే కాచుకుంటాడు; దేవతలకెలా తోవ చూపుతాడో, దానవుల కలాగే తోవచూపుతాడు; కులజుడిని ఎలా కరుణిస్తాడో, కులహీనునీ అలాగే కరుణిస్తాడు. అందుకే దృష్టిభేదం లేని ఆ దయామయుడిని అన్నమాచార్య **'నీవు సర్వసముడవు...నీవు దేవదేవుడవు'** అని కీర్తిస్తున్నాడు. దోషదర్శనం లేకుండా, దయాదృష్టితో మనస్సులో దాచుకోమంటున్నాడు. అపారమైన ఆ భగవంతుడి కృపావృష్టి అందరిపై సరిసమానంగా అనవరతం వర్షిస్తూనే ఉంటుంది. అయితే మన మనోపాత్రత, పవిత్రతే ఆ ప్రేమామృత స్వీకరణకు అర్హత! అందుకే "భగవంతుడు మన సొంత సంపద వంటివాడు. నువ్వు ఎక్కడున్నా మనస్ఫూర్తిగా ఆయనను ప్రార్థించు. ఆయనను ఎవరు మనసారా వేడుకుంటారో వారికి ఆయన సొంతమవుతాడు" అంటారు దివ్యజనని శ్రీశారదాదేవి.

గుణదోషాలేలా?...

ఒకరిపై ప్రేమ, మరొకరిపై పగ పెంచుకునేంతటి సంకుచిత స్వభావి కాదు పరమాత్మ. పిల్లల విషయంలో తల్లితండ్రులు చూపే ప్రేమకు కోటిరెట్లు ఆయన మనపై ప్రేమను చూపుతాడు. పైగా గుణదోషాలేవీ పట్టించుకోకుండా మనందరినీ కడుపులో పెట్టుకొని కాపాడుకుంటాడు. ఆ పెద్దమనస్సునే ఈ పదకవితాపితామహుడు ఆ పరంధాముడికి గుర్తుచేస్తూ...

నీవు సర్వసముడవు, నీవు దేవదేవుడవు
ఈవల గుణదోషాలెంచనిక నేలా? అని అత్యంత చనువుతో ఆలపిస్తున్నాడు. ఉపాయాలు అడుగంటినప్పుడు, సహాయకులు వదిలివేసినప్పుడు, ఆశలుడిగినప్పుడు ఆ భగవంతుడి నుంచే సహాయం అందుతుందని ఎందరో భక్తులు నిరూపించారు. అందుకు చేసే స్తుతి, ఉపాసన, ప్రార్థన గుడ్డినమ్మకాలు కావు; అధికసత్యాలు; అవే సత్యాలు. ఈ ప్రార్థన కేవలం వాక్ ప్రతాపం కాదు. దీనికి మూలం హృదయం. అందువల్ల హృదయాన్ని నిర్మలం చేసుకుంటే మనం ఆ అంతర్యామితో అనుబంధాన్ని దృఢతరం చేసుకోగలం. ఈ ప్రార్థనకు జిహ్వతో పనిలేదు. అది స్వభావానికి సంబంధించినది. ఇలా ప్రార్థించే ప్రియభక్తుల నుద్దేశించే భగవాన్ శ్రీకృష్ణుడు (భగవద్గీత– 9.29)...

సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః।
యే భజంతి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్॥

'నేను సర్వభూతముల యందు సమదృష్టి కలిగి ఉంటాను. నా కొకడు ఇష్టుడు కానీ, ఒకడయిష్టుడు కానీ లేడు. ఎవరు భక్తితో ఆరాధిస్తారో వారి యందు నేను, నా యందు వారు నెలకొని ఉంటార'ని స్పష్టం చేస్తాడు.

వెన్నెలకేమి హాని...

భగవంతుడు ఈ భువిపై ఏ అవతారంలో ఆగమించినా ఉచ్చనీచాలు చూడకుండా అందరితోనూ కడు ఉదారతతో వ్యవహరిస్తాడు. ఉదాహరణకు భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస తమ దగ్గరకు వచ్చిన సచ్ఛీలురనూ, నీతిబాహ్యులనూ ఒకేలా

(మిగతా 34వ పేజీలో...)

ఇదుపగంధాన్నిగానీ, పటికనుగానీ అరగదీసి మడ్డినీటిలో కలిపితే ఆ నీరు పరిశుద్ధమవుతుంది. అలాగే, మానవుని మనస్సనే మడ్డినీటిని వివేక వైరాగ్యాలనే ద్రావణాలు శుద్ధి చేస్తాయి. - శ్రీరామకృష్ణులు



పరమపదానికి రాజమార్గం

– స్వామి సర్వగతానంద

సత్యవాక్కు : భగవద్గీతలో శ్రీకృష్ణుడు వాచిక తపస్సును గురించి వివరిస్తూ "ఇతరులకు భయాన్ని, కష్టాన్ని కలిగించనిది; వినడానికి ఇంపుగా ఉండి సుఖాన్ని చేకూర్చే సత్యవాక్కు; వేదాభ్యాసము – వాచిక తపస్సు" అని అంటాడు.

'ప్రియమైన సత్యవాక్కులనే పలకాలి. సత్యమైనా అప్రియము చెప్పకూడదు' అని మను ధర్మశాస్త్రం చెబుతుంది.

పతంజలి యోగ సూత్రాలకు వ్యాసులవారు వ్రాసిన భాష్యంలో సత్యవాక్కుకు ఈ క్రింది నిబంధనలు సూచించారు.

1) మనం దర్శించినవి, విన్నవి మరియు హేతుబద్ధమైన వాక్కులు.

2) మోసపూరితం కాని అర్థవంతమైన మాటలు.

3) ప్రయోజనకరమైనవి, హానిరహితమైనవి అయిన పలుకులు.

ఈ నిబంధనలన్నీ పాటించడం అంత సులభం కాదని మనకు స్పష్టమవుతుంది. కాబట్టి ప్రతి ఒక్కరూ సంభాషించేటప్పుడు చాలా జాగ్రత్త వహించాలి. శ్రీరామకృష్ణులు సరదా కోసం అబద్ధం చెప్పడాన్ని సైతం అంగీకరించేవారు కాదు. ఒకసారి వారి ప్రియ శిష్యుడైన రాఖాల్‌ను కూడా ఈ విషయమై నిలదీసారు.

అప్పుడప్పుడు భయం, పొరపాటు, దురాశల వల్ల అబద్ధం చెబుతాం. మనస్సు ఆందోళనగా, గాబరాగా ఉన్నప్పుడు మన సంభాషణ అదుపు తప్పి అర్థరహితంగా మాట్లాడుతుంటాం. అందుకే సత్యవంతమైన మాటలు మాట్లాడటానికి ఎంతో జాగరూకత, సావధానత, ఆత్మసంయమనం అవసరం. అందుకే అవసరమైనప్పుడు మాత్రమే మాట్లాడటం, అవసరమైన మేరకే మాట్లాడటం బుద్ధిమంతుల లక్షణం. 'నిశ్శబ్దాన్ని ప్రేమించే మౌని మాత్రమే సురక్షితంగా మాట్లాడగలడు' అనేది ఒక నానుడి.

సర్వదా సత్యాన్నే అంటిపెట్టుకుని ఉండటం అంత సులభం కాదు. కనీసం ఇతరులను మోసం చేయడం, అబద్ధపు సాక్ష్యాలు చెప్పడం, నకిలీ దస్తావేజులు సృష్టించడం వంటి పనులు చేయరాదు. సత్యవాక్కు గురించి వ్యాసమహర్షి చెప్పిన రెండవ నిబంధన ఇదే. ఇదే హితమైన

సత్యపాలన...

నైతికప్రవర్తనకు ఆధారం. మహాభారత యుద్ధ సమయంలో యుధిష్ఠిరుడు చేసిన వ్యాఖ్య 'అశ్వత్థామ హతః కుంజరః' అన్నది బయటకు నిజాన్ని సూచించినప్పటికీ అది ద్రోణాచార్యుని మోసగించడానికి వాడబడింది. కాబట్టి అది అసత్యం కింద పరిగణించబడింది. అదేవిధంగా ఎవరైనా ఒక శ్రోతకు అస్పష్టమైన భాషలో తెలియజేయబడిన వ్యాఖ్యలను సత్యంగా పరిగణించలేము.

సత్యం – మానవ సంక్షేమం: 'సత్య సంధత'కు వ్యాస మహర్షి నిర్దేశించిన మూడవ నిబంధన ఇది – "మన

లోకహితం

సత్యమార్గం ఇతరులకు ఎలాంటి కీడూ చేయరాదు". 'వాస్తవాలకు అనుగుణంగా మాట్లాడటమే సత్యం కాకపోవచ్చు, అదేవిధంగా వాస్తవాలకు విరుద్ధంగా మాట్లాడటం అసత్యం కాకపోవచ్చు' అని కూడా చెప్పబడింది. కానీ సర్వజీవులకు మిక్కిలి హితాన్ని చేకూర్చే వాదమే సత్యవాదం.

సత్యాన్ని గురించిన మరొక గొప్ప చిక్కేమిటంటే అది తరచుగా చేదుగా అనిపిస్తుంది. సృష్టిలోని ప్రతిజీవికి వ్యాధి, ముసలితనం, మృత్యువు తప్పవు అనే కఠోరసత్యం కటువైనదే. అలాగే ప్రపంచంలో అన్యాయం, స్వలాభం, అసమానతలు ఉన్నాయనేది కొరుకుడుపడని వాస్తవం. ఏ వ్యక్తి అయినా ప్రవర్తనలో లోపాలు, వ్యక్తిత్వంలో దోషాలు, నడవడికలో పొరపాట్లు లేకుండా ఉండడు అనేది జీర్ణించుకోలేని పచ్చి నిజం. సత్యనిష్ఠను పాటించే వ్యక్తి జీవితం ఎంతో ప్రయాసతో కూడినదేకాక తరచూ ఇతరులను సైతం ఇబ్బందులకు గురిచేస్తుంది. ప్రతిజ్ఞ పూనడం, ప్రమాణాలను నిలబెట్టుకోవడం, నియమాలకు బద్ధులై జీవించడం -వీటన్నింటిలో బాహ్య, అంతర్గత పోరాటాలు అనివార్యం. స్వీయ క్రమశిక్షణలో భాగమైన సత్యవ్రత ఆచరణ ప్రశంసనీయమైనదే. ఇతరుల అభిప్రాయంతో విభేదించినప్పుడు, అధిక సంఖ్యాకుల ప్రయోజనాలను దెబ్బ తీస్తుందనుకున్నప్పుడు ఆ మార్గం నుండి ఒకింత సడలింపు కావాలని మనస్సు ఆలోచిస్తుంది. సరిగ్గా ఇక్కడే సమున్నత శీలం, జీవకోటి పట్ల కారుణ్యం – ఈ గుణాలను సత్యంతో సమన్వయం చేయాలి. శీలం కూడా సత్యంతో సమానమైన మహోన్నత సుగుణ భూషణం. మంచి నడవడి కలవాడే ఇతరుల భావోద్వేగాలను, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యవహరిస్తాడు. దీన్ని ఒక దృష్టాంతం ద్వారా అర్థం చేసుకునే ప్రయత్నం చేద్దాం.

కైకేయి దశరథుణ్ణి రెండు వరాలను కోరింది. పాపం ఆ రాజు కపటోపాయంలో చిక్కుకున్నాడు. అతడు రెండు వరాలు ఇస్తానని ప్రమాణంచేసి ఉన్నాడు. కాబట్టి తన మాటలు వెనకకు తీసుకోలేడు. అతడు మోసగింపబడ్డానని తెలుసుకుని కూడా వాగ్దానభంగం చేయక ఆడిన మాటకు కట్టుబడి తన ప్రియమైన రాముడిని, ఆ తర్వాత తన ప్రాణాలనే విడిచిపెట్టాడు.

దశరథుని చర్య న్యాయసమ్మతమేనా? వ్యక్తిపరంగా చూస్తే దశరథుని మహోన్నత త్యాగం ప్రశంసించతగినది. అయినా సమాజపరంగా దాన్ని న్యాయసమ్మతమని చెప్పలేము. మంథర, కైకేయిల తంత్రానికి లొంగిపోయిన దశరథుడు రఘువంశం పట్ల, ప్రజల పట్ల అన్యాయంగా ప్రవర్తించినట్లు తోస్తుంది.

దశరథుని నుండి రెండవ వరంగా కైకేయి పొందిన రాజ్యాన్ని నిరాకరించడం ద్వారా భరతుడు తండ్రి ఆజ్ఞను ఉల్లంఘించాడు. జరిగిన కపట నాటకాన్ని అర్థం చేసుకుని రాముణ్ణి వెనుకకు తీసుకురావడం ద్వారా పరిస్థితిని చక్కదిద్దాలని ప్రయత్నించాడు భరతుడు. కానీ రాముడు తిరిగి అయోధ్యకు వెళ్ళడానికి అంగీకరించలేదు. రాజ్యానికి తిరిగి వెళితే దీన్ని ఓ నెపంగా తీసుకుని భావితరాలవారు ఋజుమార్గం నుండి తప్పుకోవడానికి ప్రయత్నిస్తారనేది రాముడి ఉద్దేశం. భరతుడు కూడా ఈ విషయాన్ని అర్థం చేసుకున్నాడు.

ప్రతి నిబంధనకు సడలింపు కూడా ఉంటుంది. సత్యమార్గం ఇందుకు మినహాయింపు కాదు. ప్రత్యేకించి పిల్లలకు నైతిక విలువలు బోధించడానికి ఎన్నో నీతికథలు చెబుతుంటారు. సమున్నత సనాతన ధర్మాలను విశదపరచడానికి పలుమార్లు సత్యాన్ని అతిక్రమించడం సైతం కొనియాడబడటం మన పురాణేతిహాసాలలో చూసి ఉన్నాం. మహాభారతంలో శ్రీకృష్ణుని పెక్కు వ్యాఖ్యలు, అనేక లీలలు సత్యపరిధిలోనికి రానివే. అయినప్పటికీ లోక కల్యాణం కొరకు భగవంతుడు సలిపిన లీలావిలాసమది. ❖

(వచ్చే సంచికలో... సత్యపాలన గురించి మరిన్ని విశేషాలు)

తెలుగు సేత: బ్రహ్మచారి శ్యామ్

(స్వామి సర్వగతానంద – భగవాన్ శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష సన్న్యాస శిష్యులైన స్వామి అఖండానందజీ మహరాజ్ శిష్యులు)

విశ్వాసమే గొప్పధనం, ధర్మాన్ని అనుసరించి జీవించడం శాంతిదాయకం. సర్వ రుచులలో సత్యవాక్కు అమిత రుచికరం. ప్రజ్ఞతో కూడిన జీవితం ఉత్తమోత్తమం. *- భగవాన్ బుద్ధుడు.*



సంధి వందనం

– శ్రీమతి భమిడిపాటి బాలాత్రిపురసుందరి

మంచి పని చెయ్యాలనుకున్నా భగవంతుని అనుగ్రహం ఉండాలి! మనిషి మరవకూడని విషయాలు రెండున్నాయి. ఒకటి మృత్యువు, రెండవది భగవన్నామ స్మరణ. రెండింటికీ సంబంధం ఉందా? ఉంది! పుట్టిన ప్రతి జీవి గిట్టక మానదు. మరణకాలంలో ఎటువంటి స్మరణ చేస్తూ జీవిస్తాడో...అదే స్మరణ అతని జీవితాన్ని అనుసరిస్తూ వస్తుంది. కాబట్టి మరణ సమయంలో భగవన్నామ స్మరణ చేస్తే తరువాత జన్మలో దాని ఫలితాన్ని పొందుతాడు.

యం యం వాపి స్మరన్ భావం త్యజత్యంతే కళేబరమ్ ।
తం తమేవైతి కౌంతేయ సదా తద్భావ భావితః ॥ *(భ.గీ–8.6)*

'ఎవడెవడు ఏయే దేవతా భావాన్ని చింతన చేస్తూ శరీరాన్ని విడుస్తున్నాడో, అతడు ఆయా దేవతా భావాన్నే పొందుతున్నాడు' అని శ్రీకృష్ణుడు వివరించాడు.

మృత్యువుకి, భగవన్నామస్మరణకి గల సంబంధం ఏమిటి? ఒక వ్యక్తి యోగిపుంగవుణ్ణి వెతుక్కుంటూ వెళ్ళాడు. స్వామీ! భగవన్నామస్మరణ చేద్దామంటే ఏకాగ్రత కుదరట్లేదు, ఏదైనా ఉపదేశం చెయ్యండి! అన్నాడు. ఆ మాట విని యోగి "నాయనా! ఆ ఏకాగ్రత గురించి తర్వాత ఆలోచిద్దాముగాని, రాబోయే వారంలో ఇదే రోజు నీకు మృత్యువు రాబోతోంది. దాని సంగతి ముందు చూడు" అన్నాడు.

ఆ వ్యక్తి భయంతో "స్వామీ సమయం చాలా తక్కువ ఉంది. వెంటనే ఏదైనా మంత్రాన్ని ఉపదేశించండి!" అని ఆయన కాళ్ళమీద పడ్డాడు. ఆ యోగి రామనామ మంత్రాన్ని ఉపదేశించాడు. వారం రోజులు గడచిపోయాయి. కానీ ఆ వ్యక్తికి మృత్యువు రాలేదు. సమయం గడచిపోయిందన్న విషయం కూడా అతడికి తెలియలేదు.

యోగి ఆ వ్యక్తి దగ్గరకు వెళ్ళి "నాయనా! మంత్రోపదేశం తీసుకున్నాక ఏం పనులు చేశావు? జరిగిన విశేషాలు ఏమిటి?"అని అడిగాడు. అతడు యోగికి నమస్కరించి "స్వామీ! నాకు ఎక్కడ ఏం జరుగుతుందో తెలియలేదు. నేను కూడా రామనామస్మరణ చేసుకుంటూ దేన్నీ పట్టించుకోలేదు!" అన్నాడు. "నాయనా! మృత్యువు ఎప్పుడు వస్తుందో తెలియదు. కానీ ఎప్పుడో ఒకప్పుడు వస్తుంది అని తెలుసు కనుక, నిరంతరం భగవన్నామ స్మరణ చెయ్యాలి. చెయ్యగా చెయ్యగా ఏకాగ్రత అదే కుదురుతుంది!" అని చెప్పి ఆ యోగి వెళ్ళిపోయాడు.

జన్మ జన్మల ప్రయత్నం వల్లనే మరణ కాలంలో కూడా భగవన్నామం ఉచ్చరించగలం. జీవితానికీ, మరణానికీ మధ్య ఎన్ని సంధ్యలు గడచినా అసలు సంధి కాలం మరణ కాలమే! సంధ్యావందన రహస్యం ఇదే! పెద్దలు ఏది చెప్పినా ఆచరించి తీరాల్సిందే! మనిషికి రోజుకు రెండు సంధ్యలుంటాయి. సంధి సమయంలో వందనం చెయ్యడమే సంధి వందనం! ఉదయ సంధ్య అంటే రాత్రి గడచింది అని, సాయం సంధ్య అంటే పగలు గడచి రాత్రి రాబోతోంది అని. ఆ సంధి కాలంలో భగవంతుడికి నమస్కారం చెయ్యాలి. దానివల్ల జీవిత సంధ్యలో కూడా వందనం చెయ్యాలన్న భావం నిలబడి ఉంటుంది. సంధ్యాకాలంలో పంచభూతాల్లో ఉన్న ఆకర్షణశక్తి మనిషిని దైవ మార్గం వైపు నడిపిస్తుందనీ, అందువల్లే సంధి వందనం మంచిదనీ చెప్తారు.

మరణ సమయంలో మనస్సులో ఏది నిలబడుతుంది అనేదానికి ఉదాహరణగా... బంగారం అమ్మే వ్యాపారి ఉండేవాడు. అతడు ఒకసారి జబ్బు పడ్డాడు. భగవన్నామస్మరణ అంటే తెలియదు. తెలిసినా చేసుకునేందుకు అతనికి సమయం చాలదు. వైద్యుడు వచ్చి ఉష్ణోగ్రత చూసి నూట ఐదు ఉందన్నాడు. అంత జ్వరంలోనూ ఆ వ్యాపారికి ఆ మాట వినిపించింది. "మనం కొన్నది అరవైరూపాయలకే! నూట ఐదు ఉంటే దాన్ని అమ్మేయండిరా! నేను పోతే పోయాను, లాభం పోగొట్టు కోకండిరా" అంటూ అరిచాడు. ధర పెరిగింది కనుక లాభం పోతుందన్న ఆరాటం. ఎందుకంటే రాత్రీ పగలూ అతడికి అదే ఆలోచన కాబట్టి! అంత ఏకాగ్రత భగవన్నామస్మరణలో ఉంటే మరణ సమయంలో కూడా భగవంతుడే గుర్తుకు వస్తాడు.

పాపం చేసేటప్పుడు మనం చేస్తున్నది పాపమని తెలిసి కూడా నవ్వుతూ సంతోషంగా చేస్తున్నాం. ఆ పాపఫలాన్ని అనుభవించే టప్పుడు ఏడుస్తూ అనుభవిస్తున్నాం. ఈ సంధి వందనం గురించి తెలుసుకుంటే నిరంతర భగవన్నామస్మరణ మన ప్రమేయం లేకుండానే మరణ సమయంలో కూడా దానంతటదే జరుగుతుంది. ❖

చిలుక చెప్పిన పాఠం

– కె. కౌండిన్య తిలక్

ఒక అరణ్యంలో పుష్కలమైన ఫలపుష్పాదులతో నిండిన ఓ మహావృక్షం ఉండేది. ఆ చెట్టుతొర్రలో ఓ పక్షి ఆ మానునే ఆధారంగా చేసుకొని నివసిస్తుంది. వేటగాళ్ళ దాడులను తట్టుకుంటూ, ఆ చెట్టు గూటిలోనే రక్షణ పొందుతూ ఉంటుంది. ఎక్కువగా ఆ మాను ఫలాలనే తింటూ ఆకలి తీర్చుకుంటూ ఉంటుంది. అలా ఆ పక్షికి ఆ వృక్షంతో తెలియని అనుబంధం పెనవేసుకుపోతుంది. ఆ చెట్టుతో పాటే వసంతంలో ఆనందంగా, గ్రీష్మంలో నిబ్బరంగా ఆ చిలుకా కాలం గడపసాగింది.

ఇలా ఉండగా ఒకరోజు ఓ వేటగాడు ఆ అరణ్యంలోకి ప్రవేశించాడు. విషం పూసిన బాణాలు ప్రయోగిస్తూ ఆ అడవిలో మృగాలను వేటాడుతూ ఉన్నాడు. ఓ జింకను చంపేందుకు వేసిన విషపూరితమైన ఓ బాణం పొరపాటున, చక్కని ఫలపుష్పాదులతో శోభాయమానంగా ఉన్న ఆ చెట్టుకు గుచ్చుకుంటుంది. ఆ విష ప్రభావానికి వెంటనే ఆ వృక్షం ఆకులూ, పండ్లూ అన్నీ రాలిపోయి, మోడుబారిపోతుంది. ఉదయమంతా ఎక్కడెక్కడో ఎగిరి, సాయంకాలానికి తను ఆశ్రయం పొందిన ఆ చెట్టు వద్దకు వచ్చిన పక్షికి ఆ మాను అలా మోడుబారిపోవటం బాధ కలిగిస్తుంది. చుట్టు పక్కల ఎన్ని చెట్లున్నా, అది మాత్రం ఎండిన ఆ వృక్షాన్నే నమ్ముకొని ఉండసాగింది. ఎప్పటికైనా ఆ మాను మారాకు వేయకపోతుందా? అన్న నమ్మకంతో, ఎక్కడికీ ఎగిరిపోకుండా ఆ తొర్రలోనే నివసిస్తూ, ఆహారాదులు లేక అది కూడా కృశించిపోసాగింది.

ఆ పక్షిని స్వర్గంలోంచి దేవేంద్రుడు గమనించి ఆ చిలుక ఎందుకు ఆ చెట్టును విడిచిపెట్టటం లేదో తెలుసుకుందామని, బ్రాహ్మణ వేషంలో ఆ చిలుక దగ్గరికి వచ్చి 'నువ్వు పక్కనే ఇన్ని మంచి చెట్లుండగా ఈ ఎండిపోయిన చెట్టునే ఆశ్రయించుకొని ఉన్నావెందుకు? అని ప్రశ్నిస్తాడు.

అప్పుడు ఆ చిలుక తన పూర్వజన్మ తపశ్శక్తితో బ్రాహ్మణ వేషంలో వచ్చిన ఇంద్రుణ్ణి గుర్తుపట్టి, ఆయనకు నమస్కరిస్తూ...

అనయం పండు చుండునెడ నాశ్రయ మొప్పిన నిల్చి,
యెండి పోయినతఱి బాసి పోక తగ వెట్లు కృతఘ్నత గాదె
యివ్విధంబనిమిషనాథ!

'శచీపతీ! ఈ వృక్షం ఫలపుష్పాదులతో నిండి ఉన్నప్పుడు దీనిని ఆశ్రయించి బతికిన నేను, ఈనాడు చెట్టును ఈ దుఃస్థితిలో విడిచిపెట్టి వేరొకచోటికి వెళ్ళిపోవడం కృతఘ్నత కదా!' అని అంటుంది.

చిలుక కృతజ్ఞతాభావానికి ఇంద్రుడు సంతోషించి 'నీకేమి వరం కావాలి?' అని అడుగుతాడు. అప్పుడు ఆ చిలుక 'దేవేంద్రా! ఈ వృక్షాన్ని మళ్ళీ జీవించేట్లు చేసి, పూర్వవైభవాన్ని ప్రసాదించు!' అని కోరుతుంది.

అప్పుడు ఇంద్రుడు చిలుక హృదయవైశాల్యానికీ, ప్రత్యుపకారబుద్ధికీ మెచ్చి ఆ వృక్షం మీద అమృతం చల్లుతాడు. వెంటనే ఆ మాను యథాపూర్వంగా పత్రపుష్ప ఫలాదులతో నిండి మనోహరంగా మారిపోతుంది.

నీడనిచ్చినందుకు ఆ చిన్నపక్షే చెట్టుపై అంత కృతజ్ఞత చూపినప్పుడు, మనకు ఎన్నో రీతుల్లో సాయపడుతున్న సాటిమానవుల ఎడల మనం ఎంత కృతజ్ఞతా భావంతో మసలుకోవాలి!

'ఆశ్రయభూతులైనవారిపట్ల ఆశ్రితులు ఏ విధంగా కృతజ్ఞతాభావంతో మసలుకోవాలో తెలుపమ'ని ధర్మరాజు అడిగిన ప్రశ్నకు సమాధానంగా భీష్ముడు మహాభారతం, అనుశాసనిక పర్వం, ప్రథమాశ్వాసంలో వివరించిన కథ ఇది. ❖



ఎలాంటి ఘోర పాపకార్యం చేసినవారికైనా నిష్కృతి ఉంది. కానీ ఉపకారికి అపకారం తలపెట్టేవారికీ, చేసిన మేలు మరచినవారికీ మాత్రం నిష్కృతి లేదు. *- తిరుక్కురళ్*

పరిప్రశ్న

– స్వామి భూతేశానంద

(రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు)

రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు-స్వామి భూతేశానందజీ మహరాజ్ (1901-1998) భక్తుల ఆధ్యాత్మిక సందేహాలకు సరళమైన రీతిలో ఇచ్చిన సమాధానాలను 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకుల ప్రయోజనార్థం 2013 జూలై సంచిక నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

భక్తుడు: మనలో భయం కలిగినప్పుడు ఏం చేయాలి?

స్వామీజీ: మనోబలహీనతయే మన భయానికి కారణం.

ఒకసారి నేను (స్వామి భూతేశానంద) ఇంకొక స్వామీజీతో కలసి గంగోత్రి వెళ్ళాను. గంగోత్రిని చేరుకోవడానికి హిమాలయ పర్వత శ్రేణుల మధ్య నడుస్తూ మా ప్రయాణం కొనసాగుతుంది. చీకటి పడేలోపు గంగోత్రికి వెళ్ళే దారిలో ఉన్న కోట్లి కుటియాకు చేరుకోవాలి. కానీ మంచుకొండల మధ్య నడక చాలా కష్టతరమైంది. నాతో పయనిస్తున్న స్వామీజీ వేగంగా నడుచుకుంటూ ముందుకు వెళ్ళిపోయారు. నేను మాత్రం వెనుకబడ్డాను. అందువల్ల మార్గమధ్యంలోనే చీకటిపడింది. అంతా అంధకారమయం అవ్వడం వల్ల ఒక్క అడుగు కూడా ముందుకు వేసే పరిస్థితి లేదు. అప్పుడు నన్ను భయం ఆవరించింది. నా శరీరం వణకడం ప్రారంభించింది. శరీరమంతా చెమటలతో తడిసిపోయింది. ఆ హిమాలయ అరణ్య ప్రాంతంలో క్రూరమృగాలు సంచరిస్తాయని గుర్తొచ్చి నాలో భయం ఇంకా అధికమైంది. ధైర్యం చేసి నడక ప్రారంభిద్దామంటే ఒక్క అడుగు తడబడినా లోయలో పడిపోయే ప్రమాదముంది.



ఇలాంటి నిస్సహాయ పరిస్థితుల్లో 'భయపడడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు. మనస్సును దృఢపరచుకొని పరిస్థితులను అధిగమించాలి' అని సంకల్పించుకున్నాను. అలా అనుకున్న వెంటనే నాలోని భయం పోయింది. ఎప్పుడైతే మనస్సు నిశ్చలమైందో అప్పుడు నా చేతికర్ర సహాయంతో నడవాలనే ఆలోచన నాలో మెదిలింది. వెంటనే నా చేతిలో ఉన్న కర్రతో నేలను తడుతూ ఒక్కొక్క అడుగు వేస్తూ ముందుకు నడవడం ప్రారంభించాను. అలా నడుస్తున్నప్పుడు దారిలో క్రూరమృగాలు నా ముందు నుండి వెళ్ళడం గమనించాను. ఆ కర్ర సాయంతో రాత్రంతా నడుచుకుంటూ తెల్లవారేసరికి కోట్లి కుటియాకు చేరాను.

మనల్ని భయం ఆవరించినప్పుడు మన మనస్సు అలజడికి గురై పరిస్థితులను ఎదుర్కొనే శక్తిని కోల్పోతుంది. కాబట్టి మనస్సు దృఢంగా ఉన్నప్పుడే సమస్యలను ఎదుర్కోవడానికి సమయోచితంగా ఆలోచించగలం.

మనస్సు దృఢంగా ఉండడం ఎలా సాధ్యం? 'సదా భగవంతుణ్ణి స్మరిస్తూ ఉంటే భయాలు, అనర్థాలు మన దరికి చేరవు' అని మాతృమూర్తి శారదాదేవి అనేవారు.

భగవంతుని ఉనికిని మరచిపోవడం వల్ల మనలో భయం కలుగుతుంది. భగవంతుడు మనతోనే ఉన్నాడనీ, మనల్ని సదా రక్షిస్తున్నాడనీ భావించినప్పుడు మనకు ఎలాంటి భయం కలగదు.

తల్లి ఒడిలో ఓ బాలుడు నిద్రపోతున్నాడు. హఠాత్తుగా ఆ బాలుడు ఏడవడం ప్రారంభించాడు. ఎందుకంటే అతడు ఒక అరణ్యమార్గం ద్వారా నడుస్తున్నట్లు, అప్పుడొక సింహం వచ్చి తనను చంపబోయినట్లు కలగన్నాడు. అందువల్ల నిద్రపోతున్న ఆ బాలుడు భయంతో గగ్గోలు పెట్టాడు. ఏడుస్తున్న బాలుణ్ణి తల్లి తట్టి లేపింది. నిద్ర నుండి మేల్కొన్న ఆ బాలుడు సింహం ఏది? అని అడిగాడు. తల్లి ఒడిలో క్షేమంగా ఉన్నానన్న విషయాన్ని తెలుసుకున్న అతడిలో భయం పోయింది.

మనం కూడా ఆ జగన్మాత ఒడిలో సురక్షితంగా ఉన్నామని తెలియక, మన అజ్ఞానం వల్ల బాధలను అనుభవిస్తున్నాం. ఎప్పుడైతే ఆ జగన్మాత మనల్ని రక్షిస్తూ ఉందనీ, ఆ తల్లి ఒడిలో క్షేమంగా ఉన్నామనీ గ్రహించగలుగుతామో అప్పుడు మనలో ఎలాంటి భయం కలగదు. అందుకు 'మనం భగవంతుని బిడ్డలం; భగవంతుని సంరక్షణలో ఉన్న మనకు ఎలాంటి ఆపదలు సంభవించవు' అనే భావన మన మనస్సులో సుస్థిరమవ్వాలి. అందుకు నిరంతర అభ్యాసం అవసరం. ❖

'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక చందాను
ఆన్‌లైన్ **http://rkmath.org/srkp** ద్వారా చెల్లించవచ్చును.

ధీరవాణి

– స్వామి వివేకానంద

ఆత్మశక్తిని జాగృతం చేయాలి!



మన దేశంలో మంచిని మెచ్చుకొనే లక్షణం లేదు. ఆచరణశీలత అణుమాత్రం కూడ ఈ దేశంలో కానరాదు. ఈ దేశంలో చెయ్యాల్సినవి ఎన్నో ఉన్నాయి. కానీ సాధన సంపత్తిలేదు. మనకు బుద్ధి ఉంది, కానీ చేతులు లేవు. మనకు వేదాంత సిద్ధాంతాలున్నాయి, కానీ వాటిని అనుష్ఠానంలోకి తెచ్చే శక్తిలేదు. మన గ్రంథాలలో సర్వసమత్వ సిద్ధాంతం ఉంది, కానీ క్రియలో భేదాలను బ్రహ్మాండంగా పాటిస్తాం! భారతదేశంలోనే మహోత్కృష్టమైన నిష్కామకర్మ బోధింపబడింది. కానీ ఆచరణలో మనం ఘోరమైన క్రూరులం, హృదయరహితులం.

ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నుండే మనం పని సాగించాలి. మరోమార్గం లేదు. మంచి చెడులను గురించి విమర్శించేశక్తి ప్రతివ్యక్తిలోను ఉంటుంది. కానీ దుఃఖాలకూ, పొరపాట్లకూ, భ్రాంతులకూ నిలయమైన సంస్కార సముద్రతరంగాల తాకిడిని ఖాతరుచెయ్యక, ఒక చేత్తో కన్నీటిని తుడుస్తూ, రెండవ చేత్తో మోక్షమార్గాన్ని చూపగలవాడే ధీరుడు.

విశాలహృదయులైన స్త్రీ పురుషులు వందల మంది ముందుకొచ్చి పేదరికం, అజ్ఞానం అనే సుడిగుండంలోపడి నానాటికీ కుంగి కృశించిపోతున్న లక్షలాది స్వదేశస్థుల నిమిత్తం, వారి సంక్షేమం నిమిత్తం తమ సర్వశక్తిని ధారపోసి పనిచేసినప్పుడు మాత్రమే మన జాతి జాగృతం అవుతుంది. సత్సంకల్పం, నిష్కాపట్యం, అఖండప్రేమ, అనురాగం అనేవి లోకాన్ని జయిస్తాయని నాకు అనుభూతమైంది. ఈ సుగుణాలున్న ఒక్కవ్యక్తి లక్షలాది వంచకుల, పశుప్రాయుల కపటోపాయాలను వమ్ముచెయ్యగలడు.

యూరప్‌లో అత్యంత పేదవారికి సైతం కల్పించబడుతున్న సదుపాయాలను, విద్యావకాశాలను గమనిస్తే, మన పేదల స్థితి నా మనోనేత్రాలముందు ప్రత్యక్షమై, నా కళ్ళవెంట అశ్రువులు కురిసాయి. ఈ వ్యత్యాసం ఎందుకు కలిగింది? విద్య, విద్య ఒక్క విద్యవల్లే అని నాకు తెలియవచ్చింది. విద్యవల్ల ఆత్మవిశ్వాసం కలుగుతుంది, ఆత్మవిశ్వాసంతో వారిలో అంతర్గతంగా ఉన్న బ్రహ్మం మేల్కొంటుంది.

మన బాలురు నేరుస్తున్న విద్య నిరాశాజనకమైంది. పాఠశాలలో బాలుడు నేర్చుకొనేది శూన్యం. వాడి చిత్తసంస్కారం పూర్తిగా ధ్వంసమౌతుంది. ఫలితం శ్రద్ధావిహీనత లేక అశ్రద్ధ. వేదవేదాంతాల కన్నింటికి కీలకం శ్రద్ధ. నచికేతుణ్ణి యముడి ముందు ముఖాముఖి నిలిచి ప్రశ్నింపచేసిన శ్రద్ధ! శ్రద్ధవల్ల ఈ లోకం చలిస్తోంది. అలాంటి శ్రద్ధ ప్రస్తుతం నశిస్తోంది!

'అజ్ఞశ్చాశ్రద్ధ ధానశ్చ సంశయాత్మా వినశ్యతి' –అజ్ఞుడు, శ్రద్ధావిహీనుడు, సంశయాత్ముడు వినాశం పాలవుతాడు. కాబట్టి మనం వినాశనానికి సమీపంలో ఉన్నాం. విద్యావ్యాప్తే దీనికి నివారణోపాయం. అన్నింటికంటే ముఖ్యమైంది ఆత్మజ్ఞానం. ఆత్మజ్ఞానం అనగానే జడలు, దండం, కమండలం ధరించి కొండకోనల్లోకి వెళ్ళడం అని నా అభిప్రాయం కాదు. ఇక నా ఉద్దేశమేమిటి? సంసార బంధాలను ఛేదించి మోక్షాన్ని ప్రసాదింపచేసే జ్ఞానం, ఐహికమైన భౌతిక సంపదలను కలుగచెయ్యడం లేదా? నిస్సందేహంగా అది కలుగచేస్తుంది. మోక్షం, విరాగం, త్యాగం – అనేవన్నీ మహోత్తమ ఆదర్శాలు.

జీవాత్మలో అఖండశక్తి ఉంది. ద్వైతి, విశిష్టాద్వైతి, అద్వైతి, శైవ, వైష్ణవ, శాక్త తుదకు బౌద్ధ, జైనులు – ఇలా భారతదేశంలో ఆవిర్భవించిన ఏ సంప్రదాయానికి చెందినవారైనా ఈ విషయంలో ఒకే అభిప్రాయం కలిగి ఉన్నారు. వ్యక్తీకరణలోని భేదం మాత్రమేగానీ, పిపీలికాది బ్రహ్మపర్యంతం అందరిలోనూ ఒకే ఆత్మ వెలస్తోంది. ఆ శక్తిని జాగృతం చెయ్యాల్సివుంది. ❖

క్రోధం లక్ష్మినీ, అసూయ ధర్మాన్నీ, కామం సిగ్గునీ, వృద్ధాప్యం సౌందర్యాన్నీ, మృత్యువు ప్రాణాన్నీ, నీచుల సాంగత్యం మంచిభావాల్నీ, దురభిమానం సర్వస్వాన్నీ నశింపజేస్తాయి. - విదురనీతి

జ్ఞానదీప దర్శనం

– డాక్టర్ అపర్ణా శ్రీనివాస్

అసురసంహారం జరిగిన సందర్భంగా, ఆనందోత్సాహాలతో జరుపుకునే పండుగల్లో దీపావళి ఒకటి. 'దీపావళి' అంటేనే దేదీప్యమానంగా వెలిగే దీపాల వరుస అని అర్థం. దట్టంగా అలుముకుని ఉన్న అమావాస్యపు చీకటిని దీపప్రజ్వలనం చేత పారద్రోలుతూ, వెలుగుల పండుగగా దీపావళిని జరుపుకుంటున్నాము. అనాదిగా ఇప్పటి వరకు దీపావళి పండుగలు

వస్తూనే ఉన్నాయి. మనం వెలిగించే దీపాలు బయటి చీకటిని పారద్రోలుతున్నాయి కానీ హృదయంలో ఉన్న అజ్ఞానమనే అమావాస్యపు చీకటిని తొలగించలేకపోతున్నాయి. ప్రపంచంలో జీవులనుభవించే బాధలన్నింటికీ ఈ అజ్ఞానమే మూలకారణమై ఉన్నది. అజ్ఞానమనే ఈ గాఢాంధకారం ఎన్నెన్నో జన్మల నుండి హృదయంలో ఘనీభవించి ఉన్నందునే, జన్మపరంపరలు, సంసారపు యాతనలు కలుగుతున్నాయి. అందుచేత, నిరంతర శాంతిని అపేక్షించువారు దీనిపై దృష్టిని సారించవలసివుంటుంది.

అయితే దీనిని తొలగించుకోనందున నష్టం ఏమిటి అనే ప్రశ్న వస్తే, ఎంతటి గొప్పవారైనా, ఈ అజ్ఞానం కలిగి ఉన్నందున, వారి జీవితాలను అంధకారబంధురం చేసుకున్న వైనాలు మనకు ఎన్నో కనిపిస్తాయి. ఉదాహరణగా ఒకటి చూద్దాం. హనుమంతుడు లంకాదహనం గావించినపుడు, లంకాపట్టణ మంతా ఆ అగ్నిజ్వాలలచే ప్రకాశవంతంగా నిలిచినా, ఇంతటి ప్రకాశమూ రావణుని హృదయమందలి చీకటిని తొలగించలేకపోయింది, అది అంతరంగా కరడు గట్టిన ఆ అజ్ఞానాన్ని కదపలేకపోయింది. రావణుడు బ్రహ్మదేవుని వంశంలో జన్మించినా, ఎంతటి గొప్ప పండితుడైనా, దుర్భేద్యరీతిలో లంకాపట్టణ నిర్మాణం గావించినా, నవగ్రహాలనే శాసించగల ఆధిపత్యం సంపాదించినా, సాక్షాత్ కుబేరుని అన్నగా కలిగి ఉన్నా, కుంభకర్ణుడనే అతి బలశాలిని తమ్ముడిగా కలిగి ఉన్నా, ఇంద్రుని జయించగల ప్రతిభాశాలి కుమారుడు ఇంద్రజిత్తుని కలిగి ఉన్నా మనోమాలిన్యం తొలగనందున, చిత్తశుద్ధి లేనందున, చివరకు తన జీవితాన్ని నిష్ఫలం గావించుకున్నాడు. అందుచేత, అజ్ఞానపు తిమిరాన్ని పారద్రోలగల జ్ఞానజ్యోతిని కనుగొనుట మనకు ఆవశ్యకమై ఉన్నది.

ప్రకాశవంతుడైన భగవంతుని ఉనికి కనుగొన్నపుడు మాత్రమే ఈ అజ్ఞానపు చీకటి తొలగిపోతుంది, కనుక ప్రయత్న పూర్వకంగా దానికై కృషి చేయాలి. మన చిత్తంలో గల దోషాలను తొలగించుకుని, హృదయాన్ని సత్త్వగుణమయం చేసుకునే ప్రయత్నాన్ని చేయడం అనేది మన మీదే ఆధారపడి ఉంది. భగవంతుడు ఉంటే ఎందుకు కనిపించడంలేదనే నాస్తిక వాదంతో ప్రయోజనం ఏమీ చేకూరదు. మన హృదయమంతా అహంకారమనే నరకాసురుడు నిండి ఉంటే భగవద్దర్శనం ఎలా సంభవమవుతుంది? ఈ అహంకారాన్ని పరిపూర్ణంగా నిర్మూలించుకునేవరకూ మనలోనే ఉన్న నరకుడు విజృంభిస్తూనే ఉంటాడు.

సర్వగం సచ్చిదానందం జ్ఞాన చక్షుర్నిరీక్ష్యతే।
అజ్ఞాన చక్షుర్నే క్షేత భాస్వంతం భానుమంధవత్॥

'సర్వవ్యాపకమై ఉన్న సచ్చిదానంద పరబ్రహ్మాన్ని జ్ఞాననేత్రం మాత్రమే చూడగలదు. ప్రకాశించే సూర్యుని అంధుడు చూడజాలనట్లు అజ్ఞాననేత్రం ఆ పరబ్రహ్మాన్ని దర్శించలేదు'.

అందుచేత అహంకారమనే నరకుని నశింపజేసినపుడే, మనం ఆత్మానందమనే దీపావళిని జరుపుకున్న వాళ్ళమవుతాము.

అయితే మన కర్తవ్యం ఏమిటి అని ఆలోచించేముందు, ఒక సాధారణ విషయాన్ని పరిశీలిద్దాం. ఒక దీపాన్ని వెలిగించాలంటే, ప్రమిదను ఒక స్థలంలో, వత్తిని ఇంకొక స్థలంలో, తైలాన్ని మరొక స్థలంలో ఉంచితే, ఆ దీపాన్ని వెలిగించడం ఎంత మాత్రమూ సాధ్యం కాదు కదా! అదే విధంగా, మన మనస్సుని ఒక చోట నిలిపి, వాక్కుతో మరొకటి పలుకుతూ, కర్మలో ఇంకొకటి ఆచరిస్తే జ్ఞానదీపాన్ని ఎంత మాత్రమూ వెలిగించలేము. మన త్రికరణాలు ఏకమైనప్పుడే జ్ఞానదీప ప్రజ్వలనం గురించి యోచించే అర్హత కలుగుతుంది.

ఇంక, దీపావళినాడు భగవదారాధనం, విశేషంగా లక్ష్మీపూజ చేయాలని శాస్త్రవచనం. సంధ్యాసమయంలో దీపాలను వెలిగించి, అందు లక్ష్మిని ఆహ్వానించి, లక్ష్మీపూజ చేయడం పరిపాటి. లక్ష్మీదేవి రూపాన్ని గమనిస్తే, ఆ సిరుల తల్లి కమలాసనియై,

ఒకచేత కనకవృష్టిని కురిపిస్తూ, మరొకచేత కమలాన్ని ధరించి ఉంటుంది. అందుకే ఆ తల్లిని 'కమలాయై నమః' అని పూజిస్తాము. ఇంతేకాక, సాధారణంగా దేవతాస్తుతుల్లో కూడా, రూపవర్ణనం చేసినపుడు ఈ పద్మం యొక్క ప్రస్తావన కనిపిస్తూ ఉంటుంది (పాదపద్మాలు, హస్తపద్మాలు, పద్మనేత్రద్వయం...), అసలు ఈ తామరపుష్పం పాశస్త్యం ఏమిటి?

తామరపూవు సత్యానికి, పవిత్రతకు, సుందరత్వానికి ప్రతీక. అంతేకాక మన హృదయానికి కూడా ప్రతీకగా నిలుస్తుంది. మానవుని హృదయం తామరమొగ్గ వలె ఉండునని, ధ్యానంచేత అది వికసించునని, అందు పరమాత్ముని యోగులు సర్వదా గాంచుదురని మహాత్ములు తెలిపి ఉన్నారు. తామరపుష్పానికి మరొక విశేష లక్షణం ఉంది; తామరపూవు ఉదయించే సూర్యుని రాకతో వికసించి, రాత్రికి ముడుచుకునిపోతుంది.

మన హృదయం అనే తామర వికసించేందుకు జ్ఞానసూర్యుడు ఆవశ్యక మని కమలం మనకు ప్రబోధిస్తోంది. అందుచేతనే శ్రీమహాలక్ష్మి పంకజాసనియై, మానవుని పరిపూర్ణతకు గుర్తు తామరపుష్పం అని చేత సంకేతంగా ధరించి ఉన్నది. సమస్త ఐశ్వర్యాలకు అధిష్ఠానదేవత అయిన ఆ శ్రీమహాలక్ష్మిని, దీపావళి సందర్భంగా మనలోని అజ్ఞానపు తిమిరాన్ని పారద్రోలగలశక్తిని ప్రసాదించమని ప్రార్థిస్తూ అర్చించాలి.

అర్చనలో భాగంగా పలురకాలైన సుందరపుష్పాలను, పరిమళభరిత కుసుమాలను సమర్పిస్తూ ఉంటాము. దీనిని 'బాహ్యపూజ' అని అంటారు, ఇది తప్పక చేయవలసినదే. అయితే దీనితో పాటుగా భగవంతునికి ప్రియాన్ని చేకూర్చే పుష్పాలను మన పూజలో భాగంగా చేసుకుంటే, మన సాధన పరిపూర్ణమై జ్ఞానజ్యోతిని దర్శించగలం. మన మహర్షులు భగవత్ప్రీతికరములైన ఈ పుష్పాలతో ఆరాధించి, వారు తరించడమేకాక, మనపై ఉన్న కరుణచే మనకు కూడా అవి ఏమిటో తెలియజేసారు.

అహింసా ప్రథమం పుష్పం పుష్పమింద్రియ నిగ్రహః
సర్వభూతదయా పుష్పం క్షమాపుష్పం విశేషతః
శాంతి పుష్పం తపః పుష్పం ధ్యానపుష్పం తథైవచ
సత్యమష్ట విధం పుష్పం విష్ణోఃప్రీతికరం భవేత్

అహింసాపుష్పం - అహింస అంటే మన మనోవాక్కాయ ములచే ఇతరులకు ఎట్టి బాధను కలుగజేయకుండుట. హింస అంటే శారీరకంగా బాధించడమే కాక, మానసికంగా ఇతరులను నొప్పించినా, దూషించినా, అదంతా హింస కిందకే వస్తుంది. అలాకాక పరులకు హితం కలిగే ఆలోచనలను చేస్తూ, ఆ విధంగా ప్రవర్తించిన, అది అహింసయే అవుతుంది. సముద్రం ఏవిధంగా తనలోనికి ప్రవేశించేవాటిని బయటకు నెట్టివేస్తూ, తనను తాను నిర్మలంగా ఉంచుకుంటుందో, అదేవిధంగా సాధకులు మనస్సునందుగాని, మాటయందుగాని, చేతలోగాని హింసను నిలవనీయరాదు. వంటిమీద చీమ పాకితే దులుపుకున్నట్లుగా, మనస్సుయందు చెడు సంకల్పం ప్రవేశించగానే దులిపివేయడాన్ని అభ్యసించాలి.

ఇంద్రియనిగ్రహపుష్పం - ఇంద్రియాలను, భగవంతుని సేవయందు, ధ్యానమందు మాత్రమే వినియోగించినపుడు, అవి మనకు స్వాధీనమగును.

సర్వభూతదయాపుష్పం - పరమాత్ముడు సర్వవ్యాపకుడు గాన సర్వప్రాణులయందు ఉన్నాడనే భావనను కలిగి, తదనుగుణంగా వర్తించడంచేత ఈ పుష్పం వికసితమవుతుంది.

క్షమాపుష్పం- క్షమ అంటే ఓర్పు, సహనం. అన్ని విధాలా సమర్థతను కలిగి ఉన్నా, ఓర్పును వహించి ఉండటం ఈ పుష్ప లక్షణం. ఈ లక్షణం చేతనే పోతన, రామదాసు, తుకారామ్ వంటి భక్తులెందరో తరించారు.

శాంతిపుష్పం - మనస్సుని, బుద్ధిని ఇతరత్రా పోనీయక, నిశ్చలంగా ఉంచడమే ఈ పుష్పప్రత్యేకత. దీనిని స్వంతం చేసుకుని రాముని ఆరాధించిన త్యాగయ్య అందుకనే 'శాంతము లేక సౌఖ్యము లేదు' అని తెలియజేసారు.

తపోపుష్పం - మన ఇష్టదైవాన్ని హృదయమందు నిలుపుకుని, ఏకాగ్ర మనస్సుతో ఆయన కొరకు తపించడమే ఈ పుష్ప పరమార్థం. ఈ పుష్పాన్ని సమర్పించినంతనే ఆ పరమాత్ముడు మన ఎదుట నిలుచును అని ఎందరో మహనీయులు తెలియజేసారు.

ధ్యానపుష్పం - పై ఆరింటిని సముపార్జించినవారి యందు మాత్రమే ఏడవదైన 'ధ్యానపుష్పం' వికసిస్తుంది. ఇష్టదైవ స్వరూపాన్ని, నామాన్ని ఎడతెగని తైలధారవలె హృదయమందు నిలుపుకోవడం చేత, ఇది భవారణ్యాన్ని దహించగల ప్రజ్వలితాగ్నిగా వింతైన శోభను కలిగి ఉంటుంది.

సత్యపుష్పం - ఎల్లప్పుడూ సత్యాన్ని మాత్రమే పలకవలెను. అప్రియమైన సత్యాన్ని పలకరాదని మన పెద్దలు తెలియజేసారు.

భగవంతునికి అత్యంత ప్రీతిపాత్రమైన ఈ ఎనిమిది పుష్పాలచే భగవదారాధనం చేయాలని సంకల్పించిననాడు బాహ్యంగా వెలిగించే దీపాలు మన అంతరంగంలో కూడా మిణుకుమనడం ఆరంభిస్తాయి. బాహ్యదీపాలు ఆ జ్ఞానదీపానికి ప్రతీకలుగా భావించి, అంతరంగమందు జ్ఞానదీపదర్శనం చేయడమే దీపావళి పరమార్థం. ఈ పరమార్థాన్ని గుర్తించిన నాడు మన జీవితాలు కాంతిమంతమవుతాయి. ❖

వేయి సంవత్సరాలుగా అంధకారబంధురమైన గదిలో దీపాన్ని వెలిగించగానే ఆ గది ప్రకాశించినట్లు, జ్ఞానతేజం యుగాల పర్యంతంగా ఉన్న అజ్ఞానాంధకారాన్ని నశింపజేస్తుంది. - శ్రీరామకృష్ణులు

రోజూ తనదగ్గరకు వచ్చే మిత్రుడు ఆ రోజు ఇంకా రాలేదు. రాక్షసరాజు మథనపడుతున్నాడు. తన సందేహం నిజం కాలేదు కదా! మనసు ఏదో కీడును శంకించింది. వెంటనే భటులను పంపించి మిత్రుడికేమైందో తెలుసుకొని రమ్మన్నాడు. రాజు సందేహం నిజమైంది. సహాయం పొందిన వ్యక్తి నమ్మకద్రోహం చేశాడు. కృతఘ్నుడిగా మారి సహాయం అందించిన హస్తాన్నే తెగనరికాడు. భటులు తెచ్చిన మిత్రుడి శరీర శకలాలకు అంత్యక్రియలు చేసి ఆ నమ్మకద్రోహిని వెంటనే వెతికి పట్టుకురమ్మని అనుచరులను పంపించాడు. వారు తక్షణమే రాజాజ్ఞను నెరవేర్చారు. వాని ముఖం చూడటానికి కూడా రాజు ఇష్టపడక ఈ కృతఘ్నుని చంపి వండుకు తినమని భటులకు చెప్పాడు. తాము ఆ శరీరాన్ని తినలేమని భటులు కరవాలములతో ఖండ ఖండాలుగా తునిమి కుక్కలకు వేశారు. కుక్కలు కూడా ఆ ఖండిత శరీరాన్ని తినటానికి ఇష్టపడలేదు. ఆ శరీరం కులవిహిత ధర్మం విసర్జించి, కర్తవ్యాకర్తవ్య వివేచన విహీనుడై, సహాయం చేసిన జీవినే తెగటార్చిన గౌతముడనే పతిత బ్రాహ్మణుడిది. తన మిత్రుడైన రాక్షసరాజు దగ్గరకు సహాయం కొరకు పంపి అపార ధనరాశినిప్పించి చివరకు గౌతముడి దురాశకు బలైన జీవి నాడీజంఘుడనే కొంగ.

గృహస్థ జీవితంలో ఉండి ధనాతురచిత్తుడై ఒక వర్తక సమూహంతో కలిసి విదేశాలకు పయనమవుతాడు గౌతముడు. ఒక అడవిగుండా వెళుతున్నప్పుడు ఒకానొక మత్తగజం వారిపై విరుచుకు పడటంతో అందరూ తలొక్కదిక్కుకుపరుగెత్తుతారు. ప్రాణాలు అరచేతిన పట్టుకొని నాడీజంఘుడున్న ఆ వటవృక్ష ఛాయలోకి వస్తాడు గౌతముడు. కొంగ గౌతముడిని అతిథిగా భావించి, సకల మర్యాదలు చేసి ఇంకా అతనికి సహాయం చేయనేర్చి తన చిరకాల మిత్రుడైన విరూపాక్షుడనే రాక్షసరాజు దగ్గరకు పంపుతుంది. సహాయం కోసం వచ్చిన ఆ వ్యక్తిని విరూపాక్షుడు తేరిపారా చూశాడు. నమ్మదగ్గ వ్యక్తి అనిపించలేదు. ఐనా నాడీజంఘుడిమీది గౌరవంతో ధనమిచ్చి పంపించాడు. తిరుగు ప్రయాణంలో గౌతముడు దుష్టబుద్ధితో తనకు ఆతిథ్యం ఇచ్చి, మిత్రుడి ద్వారా ధనసహాయం అందించిన నాడీజంఘుడిని చంపి మాంసాన్ని మూటకడతాడు. నాడీజంఘుడు ప్రతినిత్యం ఉదయం విరూపాక్షుడి దగ్గరకు వెళ్ళి రాజధర్మాలు బోధించేవాడు. మిత్రుడు ఆ రోజు తనదగ్గరకు రాకపోవడంతో రాజుకు అనుమానమొచ్చి భృత్యులను పంపించి జరిగిన విషయాన్ని తెలుసుకొని దుస్తరవ్యథను అనుభవిస్తాడు. ఐతే నాడీజంఘుడి దేహశల్యాలకు ఉచితరీతిన ప్రేతసంస్కారాలు నిర్వహించి తన పురికి చేరుకున్నంతలోనే దేవేంద్రుడు ప్రత్యక్షమవుతాడు. తన ప్రియమిత్రుడిని తిరిగి బ్రతికించమని ఇంద్రుడిని ప్రాధేయపడతాడు విరూపాక్ష మహీజాని. అప్పుడు ఇంద్రుడు 'నీవు నీ నెచ్చెలి అంత్యక్రియలు నిర్వహించేసమయంలో సమీపంలో కామధేనువు లేగదూడకు పాలిస్తున్నది. ఆ సమయంలో పెనుగాలి వీయటం వలన కొంచెం పాలనురుగు ఆ చితిపై పడటంతో నీ అనుంగు మిత్రుడు పునరుజ్జీవితుడయ్యాడు. నీ దగ్గరకు ఇదిగో వస్తున్నాడు' అనడంతోనే నాడీజంఘుడక్కడ ప్రత్యక్షమయ్యాడు. దయాసింధువైన ఆ బకరాజం తనవలన బ్రాహ్మణుడు యమయాతనకు గురయ్యాడని తెలుసుకొని ఆ ఘోరబంధనం నుంచి విముక్తి కలిగించి గౌతముడిని అనుగ్రహించమని శచీపతిని ప్రార్థిస్తాడు. పరోపకార పారీణత, అపకారికి ఉపకారం అంటే ఇదే కదా! మహాభారతంలో శాంతిపర్వంలో భీష్మపితామహుడు ధర్మరాజుకు ధర్మోపదేశం చేస్తూ బోధించిన అనేకానేక కథలలో ఇది ఒకటి.

ఇస్తూనే ఉందాం!

– స్వామి శితికంఠానంద

కథ చెప్పే సందేశం: పశుపక్ష్యాదులు కూడా ఉపకారికి అపకారాన్ని తలపెట్టవు. మిత్రద్రోహానికి పాల్పడవు. పొందిన సహాయానికి అవి మనిషికన్నా ఇంకా ఎక్కువ కృతజ్ఞతను ప్రకటిస్తాయి. ఒక అపరిచిత వ్యక్తి తనకు ఒక పూట ఆహారాన్ని అందించినా కుక్క వెంటనే తోక ఊపి, శరీరాన్ని కదుపుతూ, కళ్ళతో తన సంతోషాన్ని వ్యక్తపరుస్తుంది. నీవు మహాత్ముడవు అని మాటలు లేని తన భాషలో తెలుపుతుంది. తన విశ్వాసాన్ని ప్రకటిస్తుంది. సృష్టిలో సూర్యచంద్రులు, పంచభూతాలు అన్నీకూడా మనిషి నుంచి ఏమీ ఆశించకుండా మనిషికి ఉపకరిస్తూనే ఉన్నాయి. వృక్షాలు మనిషినుంచి ఏమీ ఆశించకుండా నిరంతరం ఇవ్వడంలోనే మునిగి ఉన్నాయి. ఇవ్వడంలోనే ఆనందాన్ని ఆస్వాదిస్తూ ఉన్నాయి. మనం కూడా వీటినుంచి కొంచెం నేర్చుకొని నిరంతరం ఇవ్వడంలోనే ఆనందాన్ని అనుభవించాలి.

నాడీజంఘుడు కేవలం ఆతిథ్యం ఇచ్చి సంతృప్తి పడలేదు. కొత్తగా మిత్రుడైన భూసురునికి చిరకాల నేస్తం ద్వారా సహాయాన్ని అందించటానికి ప్రయత్నించాడు. ఆ నూతన మిత్రుడు నమ్మదగ్గవాడా? కాదా? అని కూడా విశ్లేషించలేదు. పరిపాలనలో ఉండటం వల్ల, లోకపోకడలు తెలిసిన వాడవటం వల్ల విరూపాక్షుడికి గౌతముడిని చూడగానే సందేహం వచ్చింది కానీ సహాయాన్ని అందించమని పెద్దమనస్సుతో బ్రాహ్మణుడిని తనదగ్గరకు పంపిన ప్రియమిత్రుడు నాడీజంఘుడి మీద ఉన్న గౌరవం వలన, తనకు కలిగిన శంకను ప్రక్కనపెట్టి గౌతముడికి ధనసంపత్తిని అందించాడు. పరిస్థితుల ప్రభావం వల్ల, బలహీనతలవల్ల జీవి లోభానికి, దురాశకు గురై అధర్మ మార్గంలో చరించవచ్చు. కానీ మహాత్ములు, దయాళువులు వీరు-వారు అని చూడకుండా సర్వప్రాణికోటికి ఉపకారం చేస్తూనే ఉంటారు.

'తప్యతే లోకతాపేన సాధవః ప్రాయశో జనాః। పరమారాధనం తద్ధి పురుషస్య అఖిలాత్మనః॥ - సాధువులకు లోకుల కష్టాలు బాధను కలిగిస్తాయి. వారి కష్టాలను తొలగించడమే అఖిలాత్ముడైన భగవంతుడి పరమారాధనగా భావిస్తారు'. ఇలాంటి సాధు పురుషులు ప్రతిఫలాన్ని ఆశించకుండా నిరంతరం ఇవ్వడంపైనే దృష్టికలిగి ఉంటారు.

దీనుల సేవే దైవారాధన : ఇవ్వడం అనగానే మనందరికీ వస్తుసంపద, ధనం మాత్రమే గుర్తొస్తున్నాయి. మనం కేవలం వస్తువులనే ఇవ్వవలసిన అవసరం లేదు. ప్రతిమనిషికీ తోటివాడికి ఇవ్వటానికి భగవంతుడు ఎంతో సంపదనిచ్చాడు. ధనమొక్కటే సంపదకాదు. మనం మన ప్రేమను ఇతరులకు పంచవచ్చు. మంచి ఆలోచనలను చేయవచ్చు. ఒక మంచి మాటద్వారా ఇంకో మనిషిని సంతోషపరచవచ్చు. ఇది మన ఆరోగ్యానికి కూడా ఎంతో లాభకారి. నిశ్శబ్దంగా లోకకల్యాణం కోసం దైవాన్ని ప్రార్థించే వ్యక్తి మానవాళికి

అత్యున్నత మిత్రుడు. విధాత సృష్టిలో మనం ఇంతకన్నా మిన్నగా ప్రపంచానికి సహాయం చేసే మార్గంలేదు. కానీ ప్రతిమనిషీ సహాయం చేయడానికి తనదగ్గర ఏముంది అని అనుకుంటూ ఉంటాడు. కృత్రిమ దారిద్ర్యాన్ని అనుభవిస్తూంటాడు. సకారాత్మక భావాలు, చక్కని భావోద్వేగాలు చాలు. వీటిని పెంపొందించుకోవడం మన చేతిలోని పనియే కదా!

భగవంతుడు తన సంపత్తినుంచి మనకు ఎంతో ఇస్తున్నాడు! మనం పీల్చే గాలి, త్రాగే నీరు, తినే ఆహారం.. ఒకటేమిటి మనం ఉపయోగించుకునే ప్రతిదీ దైవానుగ్రహ ఫలమే. సృష్టిలోని ప్రతి జీవి ప్రకృతినుంచి తనకు కావలసినంత మాత్రమే తీసుకుంటున్నది. ప్రకృతి అంతా నిరంతరం ఇవ్వడమే వ్రతంగా నడుస్తున్నది. అందుకనే స్వామి వివేకానంద "ప్రపంచంలో ఎప్పుడూ ఇచ్చేవాడుగా ఉండు. ప్రతీదీ ఇస్తూనే ఉండు. ప్రేమనివ్వు, సహాయం చేయి, సేవ చేయి, నీవు ఇవ్వగలిగిన ఏ కొద్దిదైనా ఇవ్వు, కానీ ప్రతిఫలాపేక్ష లేకుండా ఇవ్వు. 'ఇదిస్తే అదిస్తాను, ఇవ్వడం వల్ల నాకేమొస్తుంది' ఇలాంటి భావాలకు దూరంగా ఉండు. ఎలా భగవంతుడు ఏమీ ఆశించకుండా మనకు ఎంతో ఇస్తున్నాడో అలా నీ దగ్గర ఉన్న వాటిని ఇస్తూ ఉండు" అంటారు.

సృష్టి నియమాలను ఉల్లంఘిస్తున్నాం : 'ప్రకృతితో మనం విభేదిస్తూ రావడం మన దుఃఖానికి, జీవన సమతుల్యం దెబ్బతినటానికి ప్రధాన హేతువైనది. మనం ఈ రోజు పూర్తిగా ఒక యాంత్రిక జీవితాన్ని సృష్టించుకొని, ప్రకృతి తన వర్తన ద్వారా నిరంతరం అందిస్తున్న పాఠాలను స్వీకరించడం లేదు. అవసరానికి మించి కూడబెట్టడం, అవసరానికి మించిన వినియోగం, నిరంతరం తోటివ్యక్తి అనుకరణ, ప్రక్కవారితో పోల్చుకొని తనను తాను కించపరచుకోవడం... ఇదే మనతర మనిషి జీవన విధానం. దయ, సేవాతత్పరత, జీవితంపై సరియైన అవగాహన, ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్న ప్రజానీకానికి సహాయపడటం... ఇవి మన ఔన్నత్యాన్ని ప్రకటించటానికి ఉపకరించే కొలబద్దలు.

భగవంతుడు ఎందుకు ఇన్ని వ్యత్యాసాలు సృజించాడు? అందరికీ ఒకే స్థాయి జీవనాన్ని ఏర్పరచి ఉండవలసింది అని మనం అనుకోవచ్చు. అందరూ ఒకేరకంగా ఉంటే ఇక హృదయ వికాసానికి అవకాశం ఎక్కడ? అనుకంపన, జాలి, కరుణ, ఆర్ద్రత, ప్రేమ, సేవ లాంటి హృదయ కుసుమం విచ్చుకొని మానవతా పరిమళాలను వెదజల్లటానికి ఉపకరించే గుణాలు పెంపొందించుకోవడానికి ఆస్కారం ఎక్కడ? మనిషి మరమనిషి అయిపోతాడు. కొన్ని పాశ్చాత్య దేశాలలో ఇప్పటికే అయిపోయారు. అందుకనే అన్నీ ఉన్నా వారికి సదా ఏదో వెలితి. అక్కడ రోజురోజుకు పెచ్చరిల్లుతున్న మానసిక అనారోగ్యానికి కారణం పూర్తిగా జడపదార్థాలైన యంత్రాలతో తాదాత్మ్యం చెంది మనిషి తాను ఒక చైతన్యం కల జీవిని అని మరచిపోవడమే.

సృష్టి అంటేనే తారతమ్యత, అసదృశ్యం. ప్రకృతి అంటేనే భిన్నత్వం. విధాత సృష్టిలోని వైవిధ్యాన్ని ఆస్వాదించడం నేర్చుకోవాలి. అది అభిరుచులలో, ఆర్థిక స్థాయిలో, ఆశయాలను ఎంచుకోవడంలో, ఆదర్శాలను స్వీకరించడంలో, వృత్తి-ప్రవృత్తులను నిర్ణయించుకోవడంలో, విజ్ఞాన స్థాయిలో, అలవాట్లలో, సంస్కృతీపరమైన అవగాహనలో..ఎందులోనైనా కావచ్చు. భిన్నత్వంలో ఉన్న ప్రత్యేకతను గుర్తిస్తూ, ఉన్నత-నిమ్న భావాలు లేకుండా దర్శించగలిగితే, మనసు ఏకత్వాన్ని సిద్ధించుకుంటుంది. పరమశాంతిని పొందుతుంది. ❖

దీనులనూ, హీనులనూ, బలహీనులనూ, దుఃఖితులనూ చూసి స్పందించే హృదయం ఉండాలి. దీనులలో దీనదయాళువైన భగవంతుణ్ణి దర్శిస్తూ సేవ చేయాలి. అదే భగవదారాధన. - ఆర్యధర్మ

దిశను బట్టే దశ

– బ్రహ్మచారి రవి

కొందరు యువతీ యువకుల అభిప్రాయాలు, లక్ష్యాలు ఇట్టే మారిపోతుంటాయి. మేనేజర్ల భవిష్యత్తు అద్భుతంగా ఉంటుందని వినగానే ఎం.బి.ఎ. చేయాలన్న సంకల్పం ఏర్పడుతుంది. మరో రోజు దేశంలో అత్యున్నతమైన సివిల్ సర్వీసెస్‌ను మించింది లేదని చదవగానే తామూ కలెక్టర్లము కావాలని కలలుగంటారు. ఇంకోరోజు వ్యాపారవేత్తలమైతే మరొకరిపై ఆధారపడనవసరం లేదనుకుంటారు. ఇలా రోజుకో లక్ష్యాన్ని ఏర్పరచుకుంటూ, స్థిరమైన గమ్యమంటూ లేకపోవడం వల్ల సంకల్పశక్తిని, సమయాన్ని వృథాచేస్తుంటారు. చివరికి ఏమీ సాధించలేక డీలాపడిపోతారు.

సంకల్పబలం: మనం ఏది సంకల్పిస్తే అదే జరుగుతుంది, జయించాలన్న సంకల్పం బలంగా ఉంటే విజయం సిద్ధిస్తుంది. విజయం అంటే ఏమిటి? మనం సంకల్పించిన లక్ష్యాలను, స్వప్నాలను సాకారం చేసుకోవడమే విజయం. ప్రపంచ ప్రసిద్ధులైనవారందరూ తాము కోరుకున్నది సంకల్పబలంతో సాధించారు. అయితే, వారంతా అపూర్వ మేధావులూ కాదు, ఆగర్భ శ్రీమంతులూ కాదు. నిజానికి వారందరూ సామాన్యులే!

ఈ సృష్టికి మూలం కూడా భగవంతుని సంకల్పమే అన్న విషయాన్ని మనం గుర్తుంచుకోవాలి. అందుకే స్వామీజీ సంకల్పబలం గురించి తెలియజేస్తూ...

"The will is stronger than anything else. Everything must go down before the will, for, that comes from God and God himself; the pure and a strong will is omnipotent - సంకల్పశక్తి తక్కిన శక్తులన్నింటి కంటే బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని వద్ద నుండే వస్తుంది కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవాల్సిందే. పవిత్రము, దృఢము అయిన సంకల్పం సర్వశక్తివంతమైనది" అంటారు.

సాకార సాక్ష్యం: ఐజక్ న్యూటన్ ఎప్పుడూ ఏవో ప్రయోగాలు చేసుకుంటూ, సిద్ధాంతాలు రాసుకుంటూ ఉండేవాడు. ఐజక్ అంటే స్కూల్ హెడ్ మాస్టర్‌కు సదభిప్రాయం ఉండేది. కానీ వార్షిక పరీక్షల్లో ఐజక్‌కు వచ్చిన మార్కులు చూశాక ఆ అభిప్రాయం ఆవిరైపోయింది. గదికి పిలిచి అక్షింతలు వేశాడు. ఎనభైమంది ఉన్న తరగతిలో ఆఖరు నుండి రెండో స్థానంలో నిలిచాడు ఐజక్.

తరువాత తనలో తాను చాలాసేపు మథనపడి ఎలాగైనాసరే వచ్చే పరీక్షల్లో తరగతిలో మొదటి స్థానాన్ని పొందాలని దృఢంగా సంకల్పించాడు. అప్పటినుంచి తరగతి పుస్తకాల మీద పూర్తి శ్రద్ధ చూపించి ఆ తరువాత సంవత్సరం పరీక్షల్లో మొదటి స్థానాన్ని సాధించాడు. కాలం గిర్రున తిరిగింది. బి.ఎ. ఫైనల్ పరీక్షలు రాయాల్సిన సమయం వచ్చింది. అప్పుడు కూడా ఆయన మంచి మార్కులతో ఉత్తీర్ణుడవ్వాలని సంకల్పించాడు. మొత్తం 25 మంది మహామహులు రాసిన ఆ పరీక్షల్లో రెండో స్థానంలో నిలిచాడు.

అయితే చిన్నప్పటినుంచి చలనమన్నా, చలనానికి ఆధారభూతమైన కాలమన్నా ఐజక్‌కి ఓ ప్రత్యేకమైన ఆకర్షణ ఉండేది. ఈ విశ్వానికి సంబంధించిన ఎన్నో ఆలోచనలు ఆయన్ను తికమకపెడుతూ ఉండేవి. తాత్కాలికంగా కొంత సమయాన్ని పరీక్షలకు కేటాయించినా మిగతా సమయాన్నంతా తన పరిశోధనల్లో, ప్రయోగాల్లో గడిపేవాడు. వేళకు భోజనం, నిద్ర అనే ధ్యాసలేకుండా మూడు నెలలపాటు పరిశ్రమించి 'పరిభ్రమించే వస్తువుల చలనాలు' అనే వ్యాసాన్ని రాశారు. తరువాత 1684లో వైజ్ఞానిక చరిత్రలోనే తలమానికమైన 'ప్రిన్సిపియా మేథమాటికా (ప్రకృతి తత్త్వాన్ని వర్ణించే గణిత సూత్రాలు)' అనే గ్రంథాన్ని రచించారు. పద్దెనిమిది నెలలపాటు అహోరాత్రులు సాగిన మహోగ్రకృషి ఫలితమిది. ప్రిన్సిపియానే కాకుండా ఆయన రచించిన ఎన్నో సిద్ధాంతాలు ప్రస్తుత శాస్త్రవేత్తలకు ప్రామాణికంగా మారాయి.

అందుకే స్వామీజీ 'I want iron wills and hearts that do not know how to quake – చలించని దృఢసంకల్పులు, ధీర హృదయులు నాకు కావాలి' అంటారు.

అలాంటి దృఢసంకల్పులే జీవితంలో ఏదైనా సాధించగలరు. న్యూటన్ పరీక్షలు అనే నెపంతో తన దృఢసంకల్పాన్ని ఏమాత్రం చెక్కుచెదరనీయకుండా కృషితో, పట్టుదలతో తను అనుకున్న దాన్ని సాధించారు. ప్రపంచ వైజ్ఞానిక చరిత్రలో ఒక మహా శాస్త్రవేత్తగా నిలిచిపోయారు.

మనం ముందుగా బాగా ఆలోచించి లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలి. ఆ లక్ష్యాన్ని సాధించడం కోసం ఎటువంటి అవాంతరాలు ఎదురైనా దారిమళ్ళకుండా ఏకనిష్ఠతో దృఢసంకల్పులమై ప్రయత్నించాలి. అప్పుడే విజయశిఖరాలను అందుకోగలం. ❖

జీవనోద్యానంలో
మానవతా పరిమళాలు

శ్రేష్ఠ పాలకుడు

ప్రియదర్శిగా పేరుగాంచిన అశోక సామ్రాట్టు జన్మదినోత్సవం జరుగుతోంది. ఆ సందర్భంగా ఆయన 'మీలో ఉత్తమోత్తముడైన ప్రజానాయకుడికి మంచి బహుమానం ఉంటుంది' అని ప్రకటించాడు. సామంతులందరూ బహుమతి కోసం పోటీపడ్డారు.

ముందుగా దక్షిణ ప్రాంతాధికారి ఇలా చెప్పాడు: 'ఈసారి నా కోశాగారంలో గత సంవత్సరం కంటే ఆదాయం మూడు రెట్లు పెరిగింది'.

ఉత్తరప్రాంత సామంతరాజు ఇలా చెప్పాడు: 'గత ఏడాది కంటే నేను నా పాలనా ప్రాంతంలో బంగారాన్ని మూడు రెట్లు పెంచాను'.

తూర్పు ప్రాంతాధికారి సమాధానమిలా వచ్చింది: 'మా ప్రాంతంలో తీవ్రవాదులనందరినీ అణచివేసాను. ఇక అక్కడ ఎవరికీ కన్నెత్తి చూసే ధైర్యం కూడా లేదు.'

పశ్చిమ ప్రాంతపు శాసకుడు గర్వంగా ఇలా చెప్పాడు: 'నేను నా సేవకులందరి వేతనాల్ని తగ్గించి వేసాను. ప్రజల మీద పడే పన్నుల సంఖ్యను పెంచాను. దీంతో మా ప్రాంత ఆదాయం బాగా పెరిగింది'.

ఇలాగే మిగిలిన ప్రాంత సామంతులు కూడా తమ తమ గొప్పలు చెప్పుకున్నారు. చివరగా మగధ సామంతరాజు వంతు వచ్చింది. ఆ రాజు వినయంగా సామ్రాట్టుతో ఇలా అన్నాడు: 'మహారాజా! నన్ను క్షమించండి. ఈ ఏడు నా ప్రాంతంలో గతేడాది వచ్చిన ఆదాయంలో సగం ఆదాయమే వచ్చింది'.

'ఎందుకలా?' అని అశోకుడు ప్రశ్నించాడు. 'ఈ ఏడాది రాజ సేవకులందరికి కొత్తగా కొన్ని సౌకర్యాలు కల్పించాను. అందువలన వాళ్ళు మరింత శ్రద్ధగా, నిజాయతీగా శ్రమపడతారు. సాధారణ పౌరులకు పన్నులలో కొన్ని వెసులుబాట్లు కలిగించాను. ఏడాది చివరికి వారి కోసం మరిన్ని ధర్మసత్రాలు, వైద్యశాలలు, పాఠశాలలు ప్రారంభించాలనే ఆలోచన కూడా ఉంది' అన్నాడు మగధ రాజు.

అశోక సామ్రాట్టు ఎంతో ఆదరంగా అతడి దగ్గరకు వెళ్ళి ఇలా అభినందించాడు: "నాకు కావాల్సింది ప్రజల రక్తంతో బంగారపు రాశులు ప్రోది చేసేవారు కాదు, ప్రజల సుఖ సౌఖ్యాల విషయం లోతుగా ఆలోచించే ప్రజాపాలకులే! కాబట్టి ఈ ఏడాది సర్వశ్రేష్ఠుడైన ప్రజా నాయకుడివి నువ్వే!" ❖

ఏది విలువైన రాయి?

ఒకసారి మహారాణా రణజీత్‌సింహ దర్బారులోకి ఒక మహాత్ముడు వచ్చాడు. మహారాణా ఆయనకి సకలోపచారాలు చేసి తన ధనాగారంలోకి తీసుకుని వెళ్ళాడు. అక్కడెన్నో విలువైన రత్నాలు, వజ్రాలు, ముత్యాలు ఉన్నాయి.

'ఈ రాళ్ళ వలన మీకెంత ఆదాయం వస్తుంది?' అని అడిగాడు మహాత్ముడు. 'వీటి వలన ఆదాయం ఏమిటి? వీటిని రక్షించడానికి నాకెంతో డబ్బు ఖర్చు అవుతూ ఉంటుంది' అన్నాడు మహారాణా.

'మరి ఇవి విలువైనవి ఎలా అవుతాయి. నా దగ్గర వీటన్నింటికీ మించిన విలువైన రాయి ఉంది' అన్నాడు మహాత్ముడు. 'అయితే అది నాకు తప్పక చూపవలసినదే' అన్నాడు మహారాణా. మహాత్ముడు ఓ గ్రామంలో ఉన్న ఒక కుటీరం లోపలికి తీసుకువెళ్ళాడు. అక్కడ ఒక ముసలమ్మ తిరగలి రాయితో పిండి విసురుతోంది.

'మహారాజా! ఇదీ విలువైన రాయి అంటే. మీదగ్గరున్న రాళ్ళన్నీ అలా పడి ఉన్నాయి. ఈ రాయి మాత్రం ప్రతిరోజూ చకచకా తిరుగుతూ పిండి విసురుతోంది. ఆ పిండిని అమ్ముకొని ఈ ముసలామె బతుకుతోంది. కాబట్టి మీ ధనాగారంలో పడి ఉన్న రాళ్ళన్నిటి కంటే ముసలమ్మకు బతుకుతెరువు చూపిస్తున్న ఈ రాయే ఎంతో విలువైనది' అన్నాడు మహాత్ముడు. ❖

అనువాదం: డాక్టర్ వై.సరోజా నిర్మల (రామకృష్ణ సంఘం - హిందీ మాసపత్రిక 'వివేకజ్యోతి' నుండి)

వేడుకల వేళ

- బి. సైదులు

మయుడనే విశ్వకర్మ మనోహరమైన మందిరాన్ని నిర్మించి పాండవులకు బహుమానంగా ఇచ్చాడు. ఆ గృహప్రవేశ వేడుకను ధర్మరాజు అంగరంగ వైభవంగా ఏర్పాటు చేశాడు. వివిధ దేవతాపూజలు చేయించి, వేలకొద్ది అతిథులను ఆహ్వానించి ఘనంగా ఉత్సవాన్ని నిర్వహించాడు. ఆ తరువాత శ్రీకృష్ణుడి సారథ్యంలో రాజసూయ యాగాన్ని కూడా తలపెట్టాడు. ఈ కార్యక్రమాలన్నింటికీ యుధిష్ఠిరుడు కౌరవులను, కర్ణుడిని, శకునిని, శిశుపాలుడిని తదితరులను కూడా ఆహ్వానించాడు.

వేడుకల్లో భాగంగా పాండవులు భీష్మ పితామహుడి సూచన మేరకు శ్రీకృష్ణుడికి అగ్రపూజను చేయతలపెట్టారు. అయితే దీనికి శిశుపాలుడు అభ్యంతరం చెబుతూ శ్రీకృష్ణుని అవహేళన చేయటమే కాకుండా, భీష్మాచార్యుల దగ్గర నుంచి పెద్దలందరినీ దూషించాడు. ప్రశాంతంగా సాగుతున్న కార్యక్రమంలో రసాభాస సృష్టించాడు. ధర్మరాజు ఎంత నచ్చచెబుతున్నా వినకుండా, వేడుక మధ్యలోనే మందిరం నుంచి తన మిత్ర రాజులను తీసుకొని బయటకు వెళ్ళిపోయి, కాలుదువ్వే దాకా వచ్చాడు.

మరోవైపు దుర్యోధనుడు అక్కడి విశేషాలను, పాండవుల ఉత్సాహాన్ని చూస్తూ ఆనందించటం మాని, అసూయతో రగిలిపోయాడు. అదే అలజడితో ఏదో ఆలోచించుకుంటూ, ఆ మందిరంలో నీళ్ళున్న చోట తెలియక, కాలుజారి పడ్డాడు. ఎదురుగా తలుపులున్నట్లు తెలియక వేగంగా నడిచి నుదుటికి చిన్న దెబ్బ తగిలించుకొని నవ్వులపాలయ్యాడు. అలా మనస్సులో పుట్టిన కోపాన్ని, అసూయను ఏదో విధంగా దిగమింగుకొని స్వగృహానికి వెళ్ళిపోయాడు. ఇంటికి చేరినప్పటి నుంచి ఇక అతనికి నిద్దర పట్టలేదు. పాండవుల వైభవాన్ని, ఐశ్వర్యాదులను తలచుకొని అసూయతో రగిలిపోతూ ఆహారం సహించక, నిద్ర పట్టక చింతాక్రాంతుడైపోయాడు. ఇలా మనలో కూడా ఎందరో వేడుకల వేళ ఆ శిశుపాలుడిని, సుయోధనుడిని తలపిస్తూ, నిశ్చలంగా ఉన్న మనస్సును అలజడిపాలు చేసుకుంటారు. అసలు అలాంటప్పుడు వేడుకలకు వెళ్ళడం ఎందుకు? వెళ్ళి మథనపడటం ఎందుకు?

వినోదాలు...వివాదాలు : సామాజిక సంబంధాల పేరుతో మనం ఎన్నో విందులూ వినోదాల్లో పాల్గొంటూ ఉంటాం. కానీ అక్కడ మనస్ఫూర్తిగా ఎంత ఆనందిస్తున్నామన్నది ఎవరికి వారు ప్రశ్నించుకోవలసిందే! అందుకే చాలా చోట్ల మనుషుల మానసిక వికారాలన్నీ అక్కడే బయటపడుతూ ఉంటాయి. వినోదాలు కాస్తా వివాదాలకు, విరోధాలకు దారి తీస్తూ ఉంటాయి. మనలో చాలామందికి సామూహిక సమాగమాల్లో (మాస్ గెట్ టుగెదర్) ఎలా మసలుకోవాలో తెలియదు. సమూహ సంస్కారం(గ్రూప్ కల్చర్) తక్కువ. అందుకే ఆహ్లాదం కోసం వెళ్ళిన వేడుకల్లో ఎక్కువసార్లు అపశ్రుతులు దొర్లుతూ ఉంటాయి. వెళ్ళిన కారణం మరచి విషయాలు ఎక్కడికో దారితీస్తూ ఉంటాయి.

ఇదే ఉద్దేశంతో మహాభారతం శాంతిపర్వంలో బోధ్యుడనే మహర్షి '**బహూనాం కలహో నిత్యం ద్వయోః సంకథనం ధ్రువమ్**- చాలా మంది ఒకచోట కలిస్తే నిత్యమూ కలహమే! ఇద్దరు ఒక చోట కలిస్తే అనవసర ప్రసంగాలు అనివార్యం' అని అంటాడు. ఆత్మీయతలను వ్యక్తం చేసుకోవటానికి వేదికలుగా ఉపయోగపడాల్సిన వేడుకలను చాలా మంది తమ దర్పాలను, డాంబికాలను, సిరిసంపదలను ప్రదర్శించుకోవటానికే పరిమితం చేసుకుంటూ ఉంటారు. లేదా పంతాలకూ, పట్టింపులకూ, పోలికలకూ, ఎత్తిపొడుపులకూ, అరమరికలూ అలకలకూ ఆజ్యం పోసుకొని అంతరాలను పెంచుకుంటూ ఉంటారు.

ఆత్మీయతలకు ఆనవాళ్ళు...: ఆత్మీయతలకు ఆనవాళ్ళుగా, అనుబంధాలను ఇనుమడింప చేయటంలో కుటుంబవేడుకలు, సన్నిహితుల సమాగమాలు హర్షించదగ్గవే! కానీ చాలా చోట్ల ఈ కుటుంబ వేడుకలు ఆత్మీయతలకు బదులుగా కేవలం తమ ఆడంబరాలు, ఆర్భాటాల ప్రదర్శనకే పరిమితమైపోతున్నాయి.

నలుగురు తమ ఏర్పాట్ల గురించి ఎంత గొప్పగా చెప్పుకుంటే, తమ కార్యక్రమాలు అంత విజయవంతమయ్యాయని చాలామంది భ్రమపడుతూ ఉంటారు. ఇలాంటి ప్రచార, పటాటోపాల కోసం చేసుకునే కుటుంబ కార్యక్రమాలు కృత్రిమంగానే ఉంటాయి కానీ, సహజత్వంతో శోభించవు. మనపై ప్రేమాభిమానాలతో వచ్చి మనసారా దీవించగలిగే వారు పదిమంది హాజరైనా చాలు, మన వేడుక నిండుతనాన్ని సంతరించుకుంటుంది.

'భారతరత్న' అబ్దుల్‌కలామ్ శాస్త్రవేత్తగా ఊపిరిసలపలేనంత పరిశోధనల్లో నిమగ్నమై ఉన్నప్పుడు తన అన్న కూతురు జమీలా వివాహం నిశ్చయమైంది. ఒక యోగిలా తన వృత్తికి అంకితమయ్యే కలామ్ దాదాపు ఇలాంటి వేడుకలకు చాలా దూరంగా ఉండేవారు. కానీ తన ఉన్నతికి, ఉద్ధతికి కారణమైన అన్నయ్య, తన ఆదరణతో ఎదిగిన జమీలా అభ్యర్థనను కాదనలేక వెళ్ళాలనుకున్నారు. కానీ ఆ రోజే దేశరక్షణకు సంబంధించి, అతిముఖ్యమైన సమావేశానికి ఆయన ప్రాతినిధ్యం వహించాల్సి వచ్చి, ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు.

ఆ రోజు కలామ్ మిస్సైల్ నమూనాను విజయవంతంగా సిద్ధం చేసి అందరి అభినందనలు అందుకున్నారు. అనంతరం ఆయన మనస్సులోని వెలితిని ఉన్నతాధికారులు గుర్తించి, ఆగమేఘాల మీద ప్రయాణ ఏర్పాట్లను చేశారు. ఆ సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ కలామ్ "ముహూర్తానికి కొన్ని గంటల సమయమే ఉండటంతో ఢిల్లీ నుంచి తమిళనాడులోని రామేశ్వరం చేరుకోవటం అసాధ్యమే అనుకున్నాను. కానీ అనూహ్యంగా దైవికమైన సంకల్పంతో హఠాత్తుగా కేంద్రమంత్రి, ఉన్నతాధికారులు నా విషయంలో జోక్యం చేసుకున్నారు. హుటాహుటిన హెలీకాప్టర్ సిద్ధం చేసి రామేశ్వరం చేరేట్లు ఏర్పాటు చేశారు. నేను రాననే నిర్ధరించుకొని, నిరాశతో ఉన్న జమీలా ఆ వేడుకలో నన్ను చూసి ఆనందబాష్పాలతో కాళ్ళపై పడిపోయింది. నేను జమీలాను ఓ తండ్రి హృదయంతో ఆశీర్వదించాను" అన్నారు. ఇలా ఆశీపూర్వకమైన మన ఆగమనం కోసం మనసారా నిరీక్షించే వారి వేడుకల్లో పాల్గొనటం వల్ల, మానవీయ సంబంధాలు పటిష్ఠమవుతాయనటంలో సందేహం లేదు.

మర్యాదలు...మన్ననలు : వేడుకల సమయాలలో నిర్వాహకుల చిన్నచిన్న పొరపాట్లను పెద్ద మనస్సుతో అర్థం చేసుకోవాలి. కానీ మనలో చాలామందికి మర్యాదలను వేలెత్తి చూపటం పెద్ద దురలవాటు. అభిమానంతో వెళ్ళాలే తప్ప ఏదీ ఆశించి వెళ్ళకూడదు. ఒకసారి భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంసను బ్రహ్మసమాజ సభ్యుడైన కాశీశ్వర మిత్ర ఇంట్లో ఒక వేడుకకు ఆహ్వానిస్తారు. రవీంద్రనాథ్ టాగూరు తదితరులు కూడా హాజరవుతారు. అయితే ఆ ఇంటి యజమానులు ఏర్పాట్లలోపడి శ్రీరామకృష్ణులను అంతగా పట్టించుకోరు. భోజనాదుల ఏర్పాట్లలో కూడా నిర్లక్ష్యం వహిస్తారు. అప్పుడు గురుదేవుల శిష్యులు కినుకతో 'మహాశయా పదండి దక్షిణేశ్వరానికి వెళ్ళిపోదాం! ఇంటికి ఆహ్వానించి ఎంత నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారో చూడండి!' అంటారు. అప్పుడు శ్రీరామకృష్ణులు ఎంతో దయతో 'ఇంతమంది హాజరైన ఉత్సవంలో, అందరిపై ప్రత్యేక శ్రద్ధ చూపటం ఎలా కుదురుతుంది! ఏదో తెలియక తప్పులు దొర్లుతుంటాయి. వచ్చిన వాళ్ళమే సర్దుకుపోవాలి' అంటూ వాళ్ళు వడ్డించిన అల్పాహారమే భుజించి, ఆ ఇంటివారిని సంతృప్తిపరచి వెనుతిరుగుతారు. ఏ వేడుకలోనైనా మనం ఇంత విశాలహృదయంతో ఉండటానికి ప్రయత్నించాలి. అందుకే ఓ పాశ్చాత్య మేధావి...

"If everyone is happy with you then surely you have made many compromises in your surroundings. If you are happy with everyone, surely you have ignored many faults of others – నీతో అందరూ ఆనందంగా, ఆహ్లాదంగా

ఉన్నారంటే నువ్వు చాలా విషయాలలో సర్దుకుపోయావని అర్థం. అలాగే నువ్వు అందరితో సంతోషంగా ఉన్నావంటే ఇతరుల పొరపాట్లను మన్నించావని అర్థం" అని అంటారు.

ఏ సందర్భంలోనైనా మనం మన తోటివారితో, మన పరిసరాలతో ఆనందంగా, ఆహ్లాదంగా ఉండాలంటే సర్దుకుపోవడం, పొరపాట్లను పెద్దమనస్సుతో మన్నించడం అలవాటు చేసుకోవాలి. అప్పుడే వేడుకలు ఆత్మీయతానురాగాలకు వేదికలుగా నిలుస్తాయి. ❖

మండుతున్న బొగ్గును పట్టుకున్నప్పుడు చేయి కాలుతుంది. చల్లగా ఉందని పట్టుకుంటే చేయి నల్లబడుతుంది. అదేవిధంగా దుర్గుణాలున్నవారితో ఎలా వ్యవహరించినా ముప్పే. - హితోపదేశం

మంచిని చెప్పే పోటీ

– ఎం. రాంబాబు

ఓ మహానగరంలో మధ్యతరగతి వాళ్ళు నివసించే కాలనీ అది! ఎక్కువ మంది చిన్నారులతో కళకళలాడే ఆ కాలనీలో ఓ సారి పెద్ద సమస్య వచ్చి పడింది. తరచూ ఏదో ఒక కారణంతో పిల్లలు వాళ్ళలో వాళ్ళు తగువులాడుకోవడం, చిన్నచిన్న వాటికి ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకోవడం ఎక్కువైంది. దీంతో సాయంత్రం అయ్యేసరికి ఆ పిల్లల వ్యవహారం పెద్దలకు తలనొప్పిగా తయారైంది. వారం రోజుల్లో వేసవి సెలవులు కూడా రాబోతున్నాయి! ఇక అప్పుడు వారి ఆగడాలను ఎలా తట్టుకోవాలో! అని ఆందోళన పడుతూ, ఆ సమస్యను ఎలా పరిష్కరించుకోవాలో తెలియక, పెద్దలందరూ కలసి అదే కాలనీలో ఉండే ఓ ప్రముఖ రచయితను ఆశ్రయించారు. ఆయన ఓ ఆదివారం నాడు పెద్దలను, పిల్లలను అందరినీ పిలిచి ఓ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆ కాలనీ పిల్లలందరికీ ఓ పోటీని నిర్వహిస్తున్నామనీ, గెలిచిన వారికి విలువైన బహుమతులు ప్రదానం చేస్తామనీ ప్రకటించారు. బాలబాలికలందరూ ఆ పోటీకి అంగీకరించారు. రోజూ సాయంత్రం నిర్వహించే ఆ పోటీ, వేసవి సెలవులు ప్రారంభమయ్యే నాటి నుంచి ఆరంభమవుతుందని ఆ రచయిత ప్రకటించారు. అసలు ఆ పోటీ ఏంటి అంకుల్! అని పిల్లలందరూ ఒక్కసారిగా ప్రశ్నించారు.

అప్పుడు ఆ రచయిత ఆ పోటీ విధివిధానాలను వివరించారు. పోటీలో పాల్గొనేవారు తమతోటి బాలబాలికల్లో నచ్చిన మంచి లక్షణాలను గురించి మాత్రమే ప్రసంగించాలి. ఎదుటివారిలోని మంచి గుణాలను అభినందిస్తూ ఎవరు ఎక్కువ సేపు మాట్లాడతారో వారికి ప్రథమ బహుమతిని ప్రకటిస్తారు. ఈ పోటీ నిబంధన అటు పెద్దలకు, ఇటు పిల్లలకు ఆసక్తిగా అనిపించింది. ఇక ఆ రోజు నుంచి పిల్లల ధోరణే మారిపోయింది. తమ తోటి పిల్లల్లోని మంచి లక్షణాలేంటో గమనించడం, వాటిని ఓ కాగితంపై రాసుకొని కంఠతా పట్టడంలో ఎవరికి వారు నిమగ్నమైపోయారు. వారం రోజులు కాగానే పోటీ ప్రారంభమైంది. సహజంగానే ఎంతో ఉత్సాహవంతులు, నిష్కల్మషులు అయిన చిన్నారులు ఒకరిని మించి మరొకరు మాట్లాడారు. అప్పటి వరకు ఎదుటివాళ్ళలో వాళ్ళు గమనించని ఎన్నో సద్గుణాలను తరచి, తరచి చూడటం అలవాటు చేసుకున్నారు. శత్రుత్వం అన్న మాటే మరిచారు.

ఒకరి గురించి మరొకరు అంత సుహృద్భావంతో మాట్లాడుతూంటే, ఇన్నాళ్ళూ ఒకరితో మరొకరు పోట్లాడుకుంది వీళ్ళేనా! అని ముక్కున వేలేసుకోవడం పెద్దల వంతయింది. కొన్ని సందర్భాల్లో పిల్లలు వేదికపై తమ సహవాసుల సుగుణాలను ప్రస్తావిస్తూ, ఉద్వేగపడడం పెద్దలకూ కళ్ళు చెమ్మగిల్లేలా చేశాయి. ఆ పోటీలు ఆరంభమైనప్పటి నుంచి తమ పిల్లల్లో వచ్చిన మార్పుకు వాళ్ళందరూ ఆశ్చర్యపోయారు. ఆ రచయితను అభినందనలతో, కృతజ్ఞతలతో ముంచెత్తడమే కాక, తమకూ అలాంటి పోటీని నిర్వహించమని పట్టుబట్టారు.

ఆ తరువాత ఆ రచయిత మందహాసంతో పెద్దలతో ఓ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి తన మనస్సులో మాటను వాళ్ళతో ఇలా పంచుకున్నారు:

"చిన్నారుల మానసిక ప్రవర్తనకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పెద్దలుగా మనమే ప్రధాన కారణం. వాళ్ళలో సానుకూల భావనలకు, సామరస్యానికి బీజం వేయాల్సిన మనమే, ఎన్నోసార్లు పక్కవారి దోషాల గురించి చర్చిస్తూ ఉంటాం. ఏ కాస్త అవకాశం దొరికినా, పొరుగువారి పొరపాట్లపై చెవులు కొరుక్కుంటూ ఉంటాం. మన ముందే, మన చుట్టే తిరిగే పిల్లలు మన వారసులుగా ఆ స్వభావాన్నే పుణికిపుచ్చుకుంటారు. తోటిమిత్రుల్లో తప్పులు ఎన్నుతూ, వాగ్వాదాలతో, ఘర్షణలతో తమ బాల్యానికి శ్రీకారం చుడుతూ ఉంటారు"

ఈ సందర్భంగా ఆ రచయిత "ఎదుటివారిలోని ఆవగింజంత మంచినైనా పర్వతమంతగా భావించి చూడాలి; ఎదుటివారిలోని పర్వతమంత దోషాన్నైనా ఆవగింజంతగా భావించుకొని సర్దుకుపోవాలి" అన్న స్వామి వివేకానంద మాటల్ని గుర్తుచేశారు. ❖

నవంబర్ 14, బాలల దినోత్సవం

ఆత్మాభిమానం

–స్వామి రంగనాథానంద

(రామకృష్ణసంఘం 13వ సర్వాధ్యక్షులు)

ఒకసారి చండీఘర్ దగ్గర అమృత్‌సర్‌లోని ఓ వైద్య కళాశాలలో ప్రసంగించడానికి నేను (స్వామి రంగనాథానంద) వెళ్ళాను. ఆ కళాశాల ప్రధానాచార్యుడు ఓ పంజాబీ! అతనిది ఎవరికీ తలవంచని మనస్తత్వం! స్వతంత్రభావాలకు, ఋజువర్తనకు, ఆత్మగౌరవానికి ఆయన పెట్టింది పేరు. విలువలకు కట్టుబడి, ఏ ప్రలోభాలకూ లొంగకుండా తన వృత్తిని నిర్వర్తిస్తూ ఉన్నారు. ఉన్నతాధికారులు ఎంత ఒత్తిడి తెచ్చినా, తన బాధ్యతల విషయంలో నిక్కచ్చిగా వ్యవహరిస్తూ ఉంటారని అక్కడి సిబ్బంది అనుకోవడం నేను విన్నాను. అలా అని ఆయన అహంభావంగా వ్యవహరించడం కూడా కనిపించలేదు. అదే వ్యక్తి నాకు కాబూల్‌లో కూడా తారసపడ్డారు. అక్కడ భారత ప్రభుత్వ విరాళాలతో నిర్వహిస్తున్న పిల్లల ఆసుపత్రికి ఆయన ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. కాబూల్‌లో నేను వైద్యులను, ఇతర సిబ్బందిని ఉద్దేశించి వివిధ కార్యక్రమాల్లో ప్రసంగించాను. ఆయన వాటన్నింటికీ ఎంతో ఆసక్తిగా హాజరయ్యారు.

ఆ తరువాత నేను కాబూల్ నుంచి తిరిగి వస్తున్నప్పుడు ఆయన నన్ను వ్యక్తిగతంగా కలుసుకొని 'స్వామీజీ! నేను మీ ప్రసంగాలకు ఎంతో ఆకర్షితుడినయ్యాను. అంత సులువుగా ఎవరికీ తలవంచని మనస్తత్వం నాది. నా ఆత్మాభిమానాన్ని చంపుకొని ఏ పనీ చేయలేను. నేను ఎక్కడా రాజీపడకుండానే నా ఉద్యోగబాధ్యతలను నిర్వహిస్తున్నాను. నా అంతరాత్మ అంగీకరించక నేను ఇప్పటి వరకు ఎవరికీ పాదాభివందనం కూడా చేయలేదు. కానీ మీరు అనుమతిస్తే, నేను మీకు ప్రణామం చేయాలనుకుంటున్నాను' అన్నారు. వెంటనే నేను 'ఇది నీ వ్యక్తిత్వానికి, ఆత్మాభిమానానికి సంబంధించిన విషయం! దీనిలో ఎవరి బలవంతమూ లేదు! నీ అంతరాత్మ ప్రబోధాన్నే ఎప్పుడూ పరిగణనలోకి తీసుకోవాలి. ఏదీ ఎవరి కోసమో చేయాల్సిన అవసరం లేదు. ఆత్మగౌరవం అత్యున్నతమైన గుణం' అంటూ అతని భుజాన్ని తట్టాను.ఆయన ఎంతో సంతోషిస్తూ నాకు వీడ్కోలు పలికారు.

మనలో చాలామందికి ఆత్మాభిమానాని(*self-respect*)కి, అహంకారాని(egotism)కి తేడా తెలియదు. ఆత్మాభిమానం పేరుతో అహంకారంగా ప్రవర్తిస్తూ ఉంటారు. లేదా అణకువ, నమ్రత పేరుతో ఆత్మన్యూనతతో తమను తాము దిగజార్చుకుంటూ ఉంటారు. రెండూ హర్షణీయం కాదు. ఇతరులకు సముచితమైన గౌరవాన్ని ఇస్తూ, మన ఆత్మాభిమానానికి భంగం కలగకుండా నడచుకోవడం ఆదర్శమైన వ్యక్తిత్వానికి చిహ్నం. మన గౌరవాన్ని నిలబెట్టుకుంటూనే, పక్కవారిని గౌరవించడం అలవాటు చేసుకోవాలి. "Don't demean yourself, while you respect somebody else – ఎదుటివారిని గౌరవించే ప్రక్రియలో నిన్ను నీవు తక్కువ చేసుకోవద్దు".

కానీ మనలో చాలామందిలో ఈ దురలవాటు పాలు ఎక్కువ! అతి వినయంతో మనసులో లేని నమ్రతను నలుగురి ముందు ప్రదర్శిస్తూ ఉంటారు. ఇది ఓ రకమైన బలహీనత, ఆత్మన్యూనత. ఉదాహరణకు కొందరు గృహస్థులను చూస్తూ ఉంటాం! వాళ్ళు సన్న్యాసులతో మాట్లాడుతూ ఉన్నప్పుడు 'స్వామీజీ! మేం ఏపాటివాళ్ళం! మేం సంసారులం. మీరంటే మహాత్ములు! మీరెక్కడ! మేమెక్కడ!' అంటూ తమను తాము తక్కువగా ప్రస్తావించుకుంటూ ఉంటారు. ఇది ఎన్నటికీ మంచిదికాదు. The householder and the sannyasin have both a high status in society. సమాజంలో సర్వసంగ పరిత్యాగి అయిన సన్న్యాసికి ఎంత హోదా ఉందో, కుటుంబ వ్యవహారాలను సమర్థంగా నిర్వహించే గృహస్థులకూ అంతే హోదా ఉంది. సమాజంలో గృహస్థ, సన్న్యాస ధర్మాలకు ప్రతినిధులుగా ఇద్దరూ ముఖ్యులే!

Let everybody be raised in his or her own self-respect. Then only we can have healthy human society. ఇతరుల ఆత్మాభిమానానికి భంగం కలిగించకుండా, తమ ఆత్మాభిమానాన్నీ కోల్పోకుండా ఎవరికివారు ఎదగాలి. అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యపడుతుంది. ❖

తెలుగు సేత : ఆర్. కృష్ణ

అణకువ గడ్డిపరక లాంటిది. తీవ్రమైన తుపాను సైతం దాన్ని కదిలించలేదు. గర్వం ఖర్జూరం చెట్టు లాంటిది. పెనుగాలులు వీచినప్పుడు అది కుప్పకూలిపోతుంది. - హితోపదేశం

రామకృష్ణ మిషన్ క్షయరోగ వైద్యశాల

(రామకృష్ణ మిషన్, బేలూరు మఠం, పశ్చిమ బెంగాల్ అనుబంధ శాఖాకేంద్రం)

పోస్టు: శానిటోరియం, రాంచీ-835221, జార్ఖండ్. ఫోన్: 09431170005 Email: rkmtbs@gmail.com

విరాళాలకై విన్నపం

రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీ జిల్లాలో గ్రామీణ ప్రాంతంలో క్షయరోగుల సేవల నిమిత్తం 285 ఎకరాల్లో వైద్యశాల నిర్వహించబడుతోంది. క్షయవ్యాధితో తీవ్రంగా బాధపడుతున్న రోగులకు సేవలందించే సదాశయంతో, దేశంలో వెనుకబడిన ప్రాంతాల్లో ఒకటైన రాంచీలో ఈ ఆరోగ్యనిలయాన్ని ఆరంభించడం జరిగింది. రామకృష్ణ సంఘ వరిష్ఠ సాధువులైన శ్రీమత్ స్వామి వేదాంతానందజీ, శ్రీమత్ స్వామి ఆత్మస్థానందజీ తదితరుల పర్యవేక్షణలో రూపుదిద్దుకున్న ఈ క్షయవైద్యశాలను 1951లో భారత తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ ప్రారంభించడం విశేషం. అప్పటి నుంచి దాదాపు ఆరు దశాబ్దాలుగా స్థానిక నిరుపేద క్షయ రోగులకు ఈ కేంద్రం అవిశ్రాంతంగా వైద్య, ఆరోగ్యసేవలందిస్తూ ఉంది. ఈ నేపథ్యంలో గత సంవత్సరం నుంచి కేవలం క్షయ రోగులకే కాకుండా, ఈ రామకృష్ణ వైద్యశాలలో ఇతర వ్యాధులకు సంబంధించిన వైద్యసేవలను కూడా అందించడం జరుగుతోంది. అయితే పెరుగుతున్న రోగులు, వైద్యసేవల అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ కేంద్రాన్ని పూర్తిస్థాయి వైద్యశాలగా విస్తరింప చేయాలని రామకృష్ణ మిషన్ నిర్ణయించింది.

మా ప్రాజెక్టులు...:

1) క్షయ రోగులకు 150 పడకల ఆసుపత్రి (నిర్వహణ ఖర్చు సంవత్సరానికి **3 కోట్ల రూపాయలు**)

2) సాధారణ రోగులకు 50 పడకల ఆసుపత్రి (నిర్వహణ ఖర్చు సంవత్సరానికి **కోటి రూపాయలు**)

3) అధునాతన వైద్యసేవలకు సంబంధించిన వైద్య పరికరాల కొనుగోలు, ఆధునిక సాంకేతిక సౌకర్యాల కల్పన (అంచనా వ్యయం దాదాపు **10 కోట్ల రూపాయలు**)

సాధారణ వైద్యంతో పాటు శ్వాసకోశ, నేత్ర, దంత, చర్మ, గర్భిణీ వైద్యవిభాగాలకు తోడు ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్, రేడియాలజీ, పాథాలజీ, ఫిజియోథెరపీ, నేచురోపతి, ఆయుర్వేద తదితర విభాగాలలో కూడా ఆధునిక వైద్యసదుపాయాలు అనివార్యమవుతున్నాయి. అదే విధంగా ఈ వైద్యనిలయంలో ప్రత్యేక వైద్య నిపుణులను, శస్త్రచికిత్సల్లో కూడా నూతన సాంకేతిక సౌలభ్యాలను పరిచయం చేయాలని నిశ్చయించాము.

వైద్యశాల ఆధునికీకరణ...అభివృద్ధి (అంచనా వ్యయం సుమారు **20 కోట్ల రూపాయలు**)

1) 50 పడకల ఆసుపత్రి నూతన భవనసముదాయం.

ఈ భవనంలో క్షయరోగులతో పాటు సాధారణ రోగులకు కూడా వైద్యసేవలందిస్తున్నాం. అయితే రోగుల రద్దీ దృష్ట్యా భవనాన్ని ఆధునికీకరిస్తూ, విస్తరించాలని నిర్ణయించాం. సాధారణ రోగులకు ప్రత్యేక విభాగం; స్థానిక వైద్యాధికారికి, ఇతర సిబ్బందికి వసతిగృహాలు; పురాతన భవనాల పునరుద్ధరణ, ఆధునికీకరణ, జలవనరుల పునరుద్ధరణ, ప్రహరీగోడ, రహదారుల నిర్మాణం.

సంచార వైద్యశాల

రాంచీ జిల్లాతో పాటు స్థానికంగా 600 గ్రామాల్లో కూడా వైద్యసేవలను విస్తరిస్తున్నాము. ఇందులో భాగంగా ఇప్పటికే సంచార వైద్యశాలను వారానికి మూడురోజులు నడుపుతూ ఉచితంగా సేవలందిస్తూ ఉన్నాం. అయితే ఈ శిబిరాల సంఖ్యను పెంచేందుకు పూర్తి సౌకర్యాలతో కూడిన అంబులెన్స్ అవసరమవుతోంది.

వైద్యం, మందుల ఖర్చులు నానాటికీ పెరుగుతున్న దృష్ట్యా 2006 నుంచి లోటు బడ్జెట్‌తోనే ఈ వైద్యశాలను నిర్వహించడం జరుగుతోంది. ప్రభుత్వం నుంచి అందుతున్న ఆర్థికసాయంతో ఈ సేవల నిర్వహణ భారమవుతోంది. వైద్యశాలను నిరాటంకంగా కొనసాగించేందుకు **50 కోట్ల రూపాయల శాశ్వతనిధిని** ఏర్పాటు చేయాల్సి ఉంది.

ఈ నేపథ్యంలో సౌజన్యమూర్తుల ఆర్థిక సాయాన్ని అర్థిస్తున్నాము. ఉదారులైన దాతల చేయూతతో ఈ వైద్యసేవలను నిరాటంకంగా నిర్వహించగలమని విశ్వసిస్తున్నాము. 'నిరుపేదలు, నిరక్షరాస్యులు, అజ్ఞానులు, వ్యాధిపీడితులు–వీళ్ళే మన ప్రత్యక్ష దైవాలు; వీరిని సేవించడమే అత్యున్నతమైన మతం' అన్న స్వామి వివేకానంద బోధనలను అనుసరించి, ఎందరో సహృదయులు ముందుకు వస్తారని ఆశిస్తున్నాము.

మీ విరాళాలను Ramakrishna Mission TB Sanatorium పేరున చెక్కు/డి.డి. తీసి Ramakrishna Mission TB Sanatorium, P.O. Sanatorium, Tupudana, Ranchi - 835 221, Jharkhand చిరునామాకు పంపాల్సిందిగా మనవి.

మీరిచ్చే విరాళాలకు ఆదాయపు పన్ను చట్టంలోని 80జి సెక్షన్ కింద ఆదాయపు పన్ను మినహాయింపు లభిస్తుంది.

ఈ బృహత్ సేవా యజ్ఞానికి మీవంతు ఆర్థిక సహాయాన్ని అందించి, భగవాన్ శ్రీరామకృష్ణుల కృపకు పాత్రులు కాగలరని ఆశిస్తున్నాం.

రోగినారాయణ సేవలో
స్వామి బుద్ధదేవానంద
కార్యదర్శి

Advt.,

(1884 – 1967)

ముందుకు సాగిపో!

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ, ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ - వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం, ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

4-2-1964

ప్రియమైన రిషిబాబు!*

ఈ జీవితం ఏమిటి? ఇది ఎందుకు సృష్టించబడింది? దీనిని ఎవరు సృష్టించారు? ఈ మూడు విషయాలను నీవు సుస్పష్టంగా అర్థం చేసుకొనకపోతే గొప్ప కష్టాల్లో పడిపోతావు. ప్రపంచం యొక్క కోపతాపాలను నీవు ఇంకా చూడలేదు. ఇక్కడ సుఖదుఃఖాలు రెండూ పడుగుపేకల్లా నేయబడి ఉంటాయి. నీవు అత్యంత జాగరూకతతోను, తారతమ్యాన్ని గ్రహించగలిగే విధంగాను ముందుకు పోకపోతే ఎలాంటి కష్టభూయిష్ఠమైన రోజుల్ని ఎదుర్కొనవలసి వస్తుందో నీకు కొంచెం కూడా అవగాహన కాదు. చిక్కులతో కూడిన ఈ మార్గం నుండి బయటపడాలనుకొనే దృఢచిత్తులకు భగవంతుడెప్పుడూ సహాయపడతాడు. "యోగక్షేమం వహామ్యహం - నా గురించి చింతన చేసినవారి యోగక్షేమాలను నేనే చూసుకుంటాను' అని గీతలో పరమాత్మ చెప్పలేదా!

ఈ ప్రపంచం అనాదిగా ఇలాగే సాగుతోంది. ప్రపంచాధినేత ఈ విశ్వాన్ని ఒక క్రీడగా సృష్టించాడు. ఎక్కడ ఏది అవసరమో అది జరిగే తీరుతుంది. ఈ ప్రపంచంలోని సమస్యలను గురించి నువ్వు బుర్రబద్దలు కొట్టుకోదలిస్తే నీ శారీరక, మానసిక బలాన్ని వృద్ధిచేసుకొని దృఢపడాలి. అప్పుడు నీవు నీ జీవితమంతా, అవసరమైతే అనేక జన్మల పర్యంతం ఈ ప్రపంచక్రీడలో నిలదొక్కుకోగలవు. అనేక దెబ్బలు తిన్నాక నీకు అర్థమయ్యేది ఏమిటో తెలుసా? ఈ కుక్కతోక వంకరను సరిచేసే మార్గం ఎక్కడా లేదని. ప్రపంచ చాలకునికి అన్నీ తెలుసు. అతడు సర్వశక్తిమంతుడు. ఆయన వ్యవహారంలో తలదూర్చడం పిచ్చితనమే అవుతుంది. రాముడు, కృష్ణుడు తమ రక్తాన్ని ఎంతోధారపోసికూడా ఈ కుక్కతోక వంకరను సరిచేయలేకపోయారు. ఆ తర్వాత బుద్ధుడు, శంకరుడు, రామానుజుడు, గౌరాంగుడు వారి జీవితాలను అర్పణ చేశారు. అయినాసరే ప్రపంచం వెనుకటివలెనే ఉంది చూశావా!

చూడు నాయనా! నీవు ఆరోగ్యంగా ఉన్నప్పుడు ప్రపంచం యావత్తు సంతోషంగా ఉందని భావిస్తావు. అదే నీవు అనారోగ్యంతో ఉన్నప్పుడు ప్రపంచమంతా దుఃఖభూయిష్ఠంగా తోస్తుంది. శ్రీరామకృష్ణులు ప్రపంచాన్ని శుద్ధచైతన్య స్వరూపంగా చూసేవారు. ఘోరమైన పాపాత్ములు అని మనం భావించే వారిని ఆయన నారాయణ స్వరూపులుగా కాంచేవారు.

కనుక ఈ ప్రపంచాన్ని మనం మంచి చెడులకు అతీతంగా చూడవచ్చును. జీవుడు తన శరీరము, మనస్సు, బుద్ధి ద్వారా ఈ ప్రపంచాన్ని చూసే రీతి ఉంటుంది. కనుక మన విధి ఏమిటంటే నిరంతర భగవత్ చింతన ద్వారా మన శరీరాన్ని, మనస్సును, బుద్ధిని పవిత్రీకరించుకోవాలి. దీనిని స్పష్టంగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించు తండ్రీ!

ప్రేమాశీస్సులతో
స్వామి ప్రేమేశానంద

తెలుగు సేత: కె. త్రివిక్రమరావు

(*హృషీకేశ్ మిత్రా స్వామి ప్రేమేశానంద మహరాజ్ ఆశీస్సులు పొందిన ఒక గృహస్థ భక్తుడు)

ఇతరులు మనల్ని అర్థం చేసుకోలేకపోవడం మనకు సంబంధించిన విషయం కాదు. మనం ఎదుటివారిని అర్థం చేసుకోలేకపోవడం మాత్రం మనకు సంబంధించిన విషయమే! - కన్ఫ్యూషియస్

(...15వ పేజీ తరువాయి)

ఆదరించేవారు. ఆ పరంపరలో ఓసారి సమాజం పతితగా ముద్రవేసి వెలివేసిన ఓ భక్తురాలు వారి వద్దకు వస్తుంది. గురుదేవులు ఆమెపై ఆశీపూర్వకంగా ప్రేమాదరణలు ప్రదర్శించటం చూసి, ఓ శిష్యుడు అభ్యంతరం చెబుతాడు. అప్పుడు అక్కడే ఉన్న శ్రీరామకృష్ణుల మరో ఆంతరంగిక శిష్యుడు "మద్గురు శ్రీజగద్గురు అయిన గురుదేవులు వచ్చింది కేవలం మన కోసమేనా? ఆయన అందరి కోసమూ అరుదెంచారు. నిజానికి వారి అవతార ఉద్దేశం పతితుల ఉద్ధరణే!" అంటాడు.

ఇలా ధర్మసంస్థాపనలో భాగంగా ఆ దేవదేవుడు దిగివచ్చి, దిక్కులేనివారికి దిక్కై, దారి తప్పిన వారికి మార్గదర్శియై నిలుస్తాడు. ఆ విశాలహృదయుని విశేష దయాదృష్టిని వేంకటేశ్వరుడి సేవాగ్రగణ్యుడు వెన్నెలతో పోలుస్తున్నాడు.



పూవులపై గాసీ పోరి ముండ్లపై గాసిని
ఆవల వెన్నెలకేమి హాని వచ్చీనా
పావనుల నటు గాచి పాపపుంజమైన నన్ను
గావగా నీ కృపకును కడమయ్యీనా॥

'పూలపైన కాసే వెన్నెల ముళ్ళపైనా కాస్తుంది. అంత మాత్రాన వెన్నెల విలువేమీ తగ్గిపోదు. పవిత్రాత్ములనే గాచిన నీవు పాపపుంజమైన నన్ను గాచితే నీ కృపకు లోటేమీ కలగదు' అని అంటున్నాడు. 'కడమ' అంటే లోపమని భావం.

గాలికి పాపమా...

సర్వులతో సమదృష్టితో మెలగుతూ, భక్తుడి భావాన్ని బట్టి భగవంతుడు తన అనుబంధాన్ని పెనవేసుకుంటాడు. ఇదే విషయాన్ని కపిల మహర్షిగా అవతరించినప్పుడు భగవానుడు తల్లి దేవహూతితో విస్పష్టం చేస్తూ...

సమతన్ స్నేహముచే సుతత్వమును, విశ్వాసంబుచేతన్ సఖి
త్వము,జాలన్ హితవృత్తి చేతను సుహృత్త్వంబున్,సుమంత్రోపదే
శముచేతన్ నిజదేశికుం డనగ నిచ్చల్ పూజ్యుడౌ నిష్టదై
వమునై వారికి కాలచక్రభయముల్ వారింపుదుం...

'సర్వసముడనైన నేను స్నేహం వల్ల కుమారుని వలెనూ, విశ్వాసం వల్ల చెలికాని వలెనూ, హితం చేకూర్చటం వల్ల ఆత్మీయుని వలెనూ, మంత్రం ఉపదేశించటం వల్ల ఆచార్యుని వలెనూ ఉంటూ వారికి నిత్యమూ పూజింపదగిన ఇష్టదైవాన్నై, కాలచక్రం వల్ల భయం కలుగకుండా వారిని కాపాడుతూ ఉంటాన'ని అభయమిస్తున్నాడు.

ఇలా భక్తసులభుడై మసలుకునే భాగవతప్రియుడి కరుణను స్వచ్ఛతగా, స్వేచ్ఛగా వ్యాపించే సమీరంతో పోలుస్తున్నాడు ఈ పదకవితాపితామహుడు.

గోవు మీద విసరీ కుక్క మీద విసరీని
పావనపు గాలికిని పాపమంటీనా
దేవతల రక్షించి దీనుడనైన నాకు
దోవచూపి రక్షించితే దోసమయ్యీనా॥

సాధుగోవుపై వీచే గాలే, సాధారణ శునకం పైనా వీస్తుందని అంత మాత్రాన గాలికి పాపమంటదు కదా! అలాగే సురలను సంరక్షించే నీవు, సామాన్యుడనైన నన్ను సంరక్షిస్తే దోషమంటుతుందా? అంటదు కదా! అని విన్నవించుకుంటున్నాడు.

ఆ దేవదేవుడు దిక్కే నీవని వచ్చిన ధ్రువుడిని తారగా నిలిపి చిరస్థానాన్నిచ్చినట్లే కళంకితుడైనా, కడసారి కొడుకు పేరుతో యాదృచ్ఛికంగా తనను పిలిచినందుకు అజామిళుడిని నరకబాధ నుంచి తప్పించాడు. తన సమత్వాన్ని చాటుకున్నాడు.

వరములిచ్చి గావవే...

భగవదంశతో ఈ భువిపై నడయాడిన మహానుభావుడు చైతన్య మహాప్రభువు! వారు ఒకసారి పూరి వెళతారు. అక్కడ జగన్నాథుడి ఆలయసమీపంలో నిమ్నజాతికి చెందిన ఒక శిష్యుడిని ప్రేమతో ఆలింగనం చేసుకోబోతారు. కానీ అతడు భయంతో ముడుచుకుపోతాడు. 'స్వామీ నేను హీన జాతివాణ్ణి; మీరు సాక్షాత్తూ పరమాత్మ స్వరూపులు. నన్ను మీరు తాకకూడదు' అంటాడు. అప్పుడు శ్రీచైతన్యులు 'ఏమిటి నీ ఉద్దేశం? నీ స్పర్శతో నేనే పునీతం అవుతాను' అంటూ మనసారా హృదయానికి హత్తుకుంటారు. ఇలా అవతారమూర్తులు భక్తిని తప్ప జాతిభేదాలను పరిగణనలోకి తీసుకోరు. అన్ని జీవుల్లోనూ తమ అంశనే చూసుకుంటారు. అలాంటి కలియుగ దైవమైన ఆ కోనేటిరాయుడిని వరాలిచ్చి తనను ఆదుకోమంటూ....

కులజుని యింట నుండీ కులహీనుని యింటనుండీ
యిలలో నెండకు నేమి హీనమయ్యీనా
వలసి శ్రీవేంకటాద్రి వరములు యిచ్చి నాలో
నిలిచి వరములిచ్చి నేడు గావవే॥ అంటున్నాడు తాళ్ళపాక అన్నమయ్య. ఇలా భగవంతుడి ముందు సర్వశరణ్య భావంతో మనల్ని మనం సమర్పించుకున్నప్పుడు, సకల పాపాలకు ఆయన క్షమాభిక్ష ప్రసాదిస్తాడు. మనం మారి తన వైపు మరలుతామేమోనని కడవరకు ఆయన నిరీక్షిస్తూనే ఉంటాడు. అలా ఎప్పటికైనా, పశ్చాత్తాప భావనతో మనస్సులో పెల్లుబికే భక్తికి, ఆవేదనకు భగవానుడు సులువుగా కరిగిపోతాడు. ఎంతటి దుష్టకర్మలనైనా దూదిపింజల్లా తన కరుణాకటాక్ష కిరణాలతో దహించివేస్తాడు. అయితే ఇలా అన్నమయ్యలా మన మనస్సు కూడా సంపూర్ణ విశ్వాసంతో పరమాత్మను ప్రాధేయపడాలి. ❖

ఒక కథ చెబుతా...

సత్యనిష్ఠ ప్రభావం

ఒక ఊళ్ళో ఒక తల్లీ, తనయుడూ జీవిస్తూ ఉండేవారు. తన కుమారుడు ఇతర ప్రాంతాలకు వెళ్ళి వ్యాపారంలోని మెలకువలు నేర్చుకోవాలని ఆశించింది. అందుకు ఆమె తన ఊళ్ళో నుండి వ్యాపార నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్ళే వ్యాపారులతో తన కుమారుణ్ణి పంపించాలనుకుంది. ఆమె అభ్యర్థనను వ్యాపారులు అంగీకరించారు.

వ్యాపారబృందం బయలుదేరడానికి ముందురోజు ఆమె తన కుమారుడితో “నాయనా! నా వద్ద పది బంగారు కాసులు ఉన్నాయి. వాటిని నీ చొక్కా రెండు చేతుల మడతల్లో ఉంచి, కుట్టి పదిలపరిచాను. ఈ బంగారు కాసులను పెట్టుబడిగా చేసుకొని వ్యాపారం ప్రారంభించు. ప్రాణం పోయినాసరే నువ్వు అబద్ధం మాత్రం చెప్పకూడదు! నువ్వు అబద్ధం చెప్పావని తెలిసిన మరుక్షణమే నేను ప్రాణం విడుస్తాను” అని చెప్పింది.

అతడు తల్లి ఆశీస్సులు తీసుకొని వ్యాపారబృందంతో బయల్దేరాడు. వ్యాపారబృందం అరణ్య మార్గం ద్వారా వెళుతుండగా ఒక బందిపోటు దొంగల గుంపు వారిని చుట్టుముట్టింది. వ్యాపారుల వద్దనున్న వస్తువులను, ధనాన్ని దొంగలు దోచుకున్నారు. ఈ పిల్లవాడు మాత్రం ఏడ్వనారంభించాడు. అది గమనించిన దొంగల నాయకుడు తక్కిన దొంగలతో, ‘ఒరేయ్! ఈ పిల్లవాడి నుండి మీరు ఏదైనా దోచుకొని ఉంటే, దాన్ని తిరిగి ఇచ్చెయ్యండి’ అని చెప్పాడు.

నాయకుని మాటలు విన్న ఆ దొంగలు, ‘మేమెవ్వరమూ ఈ పిల్లవాడి నుండి ఏదీ దోచుకోలేదు’ అని చెప్పారు. అది విని దొంగల నాయకుడు పిల్లవాణ్ణి పిలిచి ‘మరి నువ్వు ఎందుకు ఏడుస్తున్నావు?’ అని ఆశ్చర్యపోతూ అడిగాడు. అందుకు ఆ పిల్లవాడు ఏడుస్తూనే ‘అయ్యా! నా వద్ద పది బంగారు కాసులు ఉన్నాయి. ఈ విషయం నేను చెప్పినా వీళ్ళు నమ్మడం లేదు. నేను అబద్ధం చెబుతున్నానని వీళ్ళంటున్నారు’ అని చెప్పాడు.

ఆ పిల్లవాడి మాటలు విన్న దొంగల నాయకుడు ‘దొంగలు అడిగితే నా వద్ద ఏమీ లేదని అంటారు గానీ నా వద్ద బంగారు కాసులు ఉన్నాయని ఎవరైనా చెబుతారా?’ అని అన్నాడు.

అప్పుడు ఆ పిల్లవాడు “నేను బయలుదేరేముందు ‘నువ్వు ప్రాణం పోయినాసరే అబద్ధం చెప్పకూడదు. నువ్వు అబద్ధం చెప్పావని తెలిసిన మరుక్షణమే నేను ప్రాణం విడుస్తాను’ అని మా అమ్మ చెప్పింది. ఈ పది బంగారు కాసుల కోసం నేను అబద్ధం చెప్పి మా అమ్మను పోగొట్టుకోలేను” అని ఏడుస్తూ బదులిచ్చాడు.

పిల్లవాడి పలుకులు విన్న దొంగల నాయకుడు కన్నీళ్ళ పర్యంతమై “నాయనా! మా అమ్మ కూడా తరచూ, నువ్వు ఈ దొంగవృత్తిని విడిచిపెట్టు! దొంగతనం చేసి నువ్వు సంపాదించే ఈ పాపపు సొమ్ము ద్వారా లభించే తిండిని నేను ససేమిరా తినను!” అని చెప్పేది. కానీ నేను ఏనాడూ ఆమె మాటను పాటించలేదు” అన్నాడు.

ఇలా చెప్పి ఆ దొంగల నాయకుడు వ్యాపారుల నుండి దోచుకున్న ధనాన్ని, వస్తువులను తిరిగి ఇచ్చేయమని దొంగలను ఆజ్ఞాపించాడు. నాయకుని ఆజ్ఞమేరకు దొంగలు తాము

దోచుకున్న ధనాన్ని, వస్తువులను వ్యాపారులకు తిరిగి ఇచ్చివేశారు. పిల్లవాడి సత్యనిష్ఠ ప్రభావం ఆ దొంగలలో అనుకోని పరివర్తన తీసుకువచ్చింది. నాటి నుండి ఆ బందిపోటు దొంగలు చోరవృత్తికి స్వస్తి పలికి, కష్టపడి పనిచేస్తూ గౌరవప్రదంగా జీవించసాగారు.

నీతి: 1. తల్లితండ్రులు పిల్లలకు బాల్యం నుండే హితవచనాలను బోధించాలి.

2. సత్యనిష్ఠ ప్రభావం దుర్మార్గుల్లో కూడా పరివర్తన తీసుకువస్తుంది.

– కె. సాయి శంకర్, 7వ తరగతి
బి.పి.ఎమ్.ఎమ్. ఉన్నత పాఠశాల
కొత్త అగ్రహారం, విజయనగరం.

ఒక కథ చెబుతా... ‘శ్రీరామకృష్ణ ప్రభ’ మాసపత్రిక ఉన్నత పాఠశాల విద్యార్థులలో వ్యాసరచన ప్రతిభను ప్రోత్సహించడం కోసం, సద్భావాలను పెంపొందించడం కోసం ‘ఒక కథ చెబుతా...’ శీర్షికను ప్రారంభించింది. ఈ శీర్షికలో ప్రచురించడానికి విద్యార్థుల నుండి నీతి కథలు, వ్యక్తిత్వవికాస కథలు, స్ఫూర్తిదాయక కథలు, ఆధ్యాత్మిక కథలను ఆహ్వానిస్తోంది. వ్యాసాలను చక్కని దస్తూరీతో సరళభాషలో రాసి, మీ పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను జతపరచి పంపించండి. మీ పూర్తి చిరునామాను పొందుపరచండి. ఎంపికైన కథలకు బహుమతి లభిస్తుంది.

వ్యాసాలను పంపించాల్సిన చిరునామా : సంపాదకులు, శ్రీరామకృష్ణ ప్రభ, రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాద్–500 029. E-mail : sriramakrishnaprabha@gmail.com

- స్వామి పరిజ్ఞేయానంద

మననశీలుడే ముని!



అర్జునుడు స్థితప్రజ్ఞుని లక్షణాలను గురించి భగవాన్ శ్రీకృష్ణుణ్ణి అడిగిన రెండవ ప్రశ్న... **స్థితధీః కిం ప్రభాషేత** – స్థితప్రజ్ఞుడు ఎలా మాట్లాడతాడు?' ఈ ప్రశ్న బాహ్యార్థాన్ని స్వీకరించినట్లయితే స్థితప్రజ్ఞుడు మాట్లాడే తీరేమిటి? అతడు ఎంత మృదువుగా, ఎంత మధురంగా, ఎంత సరళంగా మాట్లాడతాడనే భావం గోచరమవుతుంది.

సాధారణంగా అన్ని పరిస్థితులు మనకు సానుకూలంగా ఉంటే మనం ప్రశాంతంగా ఉంటాం; అన్నీ మనం అనుకున్నట్లు జరిగితే సంతోషంగా ఉంటాం; అందరూ మనకు సహకరిస్తే మృదువుగా వ్యవహరిస్తాం; అందరూ మనతో సామరస్యంగా మెలిగితే మధురంగా మాట్లాడతాం. అర్జునుడు అడిగిన రెండవ ప్రశ్న బాహ్యార్థం ప్రకారమైతే మనమంతా స్థితప్రజ్ఞులమే! పరమహంసలమే! కానీ కష్టాలు చుట్టుముట్టినప్పుడు ఎలా ప్రవర్తిస్తాం? నిందాస్తుతుల మధ్య ఎలా ప్రతిస్పందిస్తాం? సుఖదుఃఖాలలో ఎలా వ్యవహరిస్తాం? సాధారణ వ్యక్తికీ, స్థితప్రజ్ఞునికీ మధ్య విభజనరేఖ ఇదే!

విపత్కర, విషమ పరిస్థితుల్లోనూ; సుఖసంతోషాల్లోనూ స్థితప్రజ్ఞుని మానసికస్థితి, వ్యవహారశైలి ఎలా ఉంటుందన్నదే అర్జునుడు అడిగిన ప్రశ్నలోని అంతరార్థం. అందుకు భగవానుడు సమాధానమిస్తూ....

దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః ।
వీతరాగ భయ క్రోధః స్థితధీర్మునిరుచ్య తే ॥ *(భ.గీ -2.56)*

'కష్టాలకు కలత చెందనివాడూ, సుఖాల పట్ల ఆసక్తి లేనివాడూ; రాగం, భయం, క్రోధం లేనివాడూ అయిన మునిని స్థితప్రజ్ఞుడంటారు' అని వివరించాడు.

కష్టాలు కలిగినప్పుడు క్రుంగిపోవడం, సుఖాలు వచ్చినప్పుడు పొంగిపోవడం సాధారణ వ్యక్తిత్వాన్ని సూచిస్తుంది. ఈ రెండు పరిస్థితుల్లోనూ ఉద్వేగం చెందకుండా, నిశ్చలస్థితిని కలిగి ఉండగలగడం అసాధారణ వ్యక్తిత్వానికి తార్కాణం. అలాంటి అసాధారణ నిశ్చల స్థితిని చేరుకోవడానికి అవరోధాలేమిటో విశ్లేషించి, పరిష్కారమార్గాలను అన్వేషించి వాటిని అధిగమించడానికి నిరంతరం ప్రయత్నించే మననశీలుడే ముని అని భగవానుడి బోధనలోని అంతరార్థం.

కష్టాలు కలిగినప్పుడు కన్నీటి కడలిలో మునిగిపోవడానికీ, సుఖాలు వచ్చినప్పుడు సంతోషసాగరంలో తేలిపోవడానికీ రాగం, భయం, క్రోధాలే కారణం. ఎలాగంటే, మనకు ప్రియమైన వ్యక్తులపట్ల, విషయాలపట్ల అనురాగాన్ని పెంచుకుంటాం. అందువల్ల మన సుఖ సంతోషాలకు కారణాలైనవి మనకు దూరమైనప్పుడు దుఃఖానికి లోనవుతాం; ప్రియమైన వాటిని కోల్పోతామేమోననే ఆందోళనవల్ల భయానికి గురవుతాం; అలాగే మనకు అభిలషణీయమైనవి లభించకుండా అవరోధాలేర్పడినప్పుడు కోపోద్రిక్తులమవుతాం.

మనలాగే స్థితప్రజ్ఞుడూ ఈ లోకంలో జీవిస్తాడు; మనలాగే వ్యక్తులతో వ్యవహరిస్తాడు; మనలాగే అన్ని పరిస్థితులనూ ఎదుర్కొంటాడు. కానీ అతడు రాగభయక్రోధాలకు అతీతంగా ఎలా ఉండగలుగుతాడు? అతడు జీవనసాగరంలో నిరంతరం వచ్చిపోయే సుఖదుఃఖాలనే తరంగాలకు చలించకుండా సాక్షీభావంతో జీవిస్తాడు. ఈ ద్వంద్వావస్థలతో తాదాత్మ్యం చెందకుండా ఏకత్వభావంతో జీవించేవాడిలో శోకమోహాలు, రాగభయక్రోధాలు జనించవు. అందుకే ఈశావాస్యోపనిషత్తు 'తత్ర కో మోహః కః శోక ఏకత్వమనుపశ్యతః – ఏకత్వానుభూతి పొందినవానికి మోహమెక్కడ? శోకమెక్కడ?' అని అంటోంది.

రాగభయక్రోధాలకు వ్యక్తులూ, వస్తువులూ కారణం కాదు. ఆయా విషయాలపట్ల మనం ఏర్పరచుకున్న అభిమానం,

మమకారమే కారణం. అందుకు ఈ ప్రపంచంలో అందరితోనూ, అన్నిటి మధ్య ఉంటూ నిస్సంగభావంతో జీవించడం ఎలాగో భగవానుడు సూచిస్తూ...

యః సర్వత్రానభిస్నేహః తత్త త్ప్రాప్య శుభాశుభమ్ ।
నాభినన్దతి న ద్వేష్టి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ *(భ.గీ – 2.57)*

'ఎవడికి దేనిమీదా అనుబంధం ఉండదో, ఎవడు శుభం కలిగినప్పుడు అభినందించడో, అశుభం కలిగినప్పుడు ద్వేషించడో అతడే స్థితప్రజ్ఞుడు' అని అంటాడు.

మనం ఈ ప్రపంచంలో జీవిస్తున్నప్పుడు వ్యక్తుల పట్ల, వస్తువుల పట్ల అనుబంధం ఏర్పడడం సహజం. కానీ ఆ అనుబంధం దృఢంగా మారినప్పుడే సుఖదుఃఖాలకు, రాగద్వేషాలకు ప్రభావితులమవుతాం. అందుకే భగవానుడు 'సర్వత్ర అనభిస్నేహః – దేనియందూ తీవ్రమైన అనుబంధాన్ని ఏర్పరచుకోకూడదు' అని హెచ్చరించాడు.

భగవాన్ శ్రీరామకృష్ణులు కోల్‌కతా దక్షిణేశ్వరాలయంలో సుమారు ముప్ఫై ఏళ్ళ పాటు ఒకే గదిలో నివసించారు. కొన్ని కారణాల వల్ల హఠాత్తుగా అక్కడ నుండి వెళ్ళిపోవాల్సిందిగా శ్రీరామకృష్ణులకు సమాచారం అందింది. వెంటనే ఆయన గదిని విడిచి వెళ్ళిపోసాగారు. విషయం తెలిసిన ఆలయ యజమాని శ్రీరామకృష్ణుల వద్దకు పరుగున వెళ్ళి తిరిగి రమ్మని ప్రాధేయపడ్డాడు. ఆయన వెంటనే తన గదికి తిరిగి వచ్చారు. శ్రీరామకృష్ణులు ముప్ఫై ఏళ్ళుగా నివసిస్తున్న గదిని వదిలి వెళ్ళిపొమ్మన్నప్పుడు దుఃఖించనూలేదు, తిరిగి రమ్మన్నప్పుడు సంతోషించనూలేదు.

అయితే, అలాంటి నిస్సంగత్వంతో వ్యవహరించడం మనలాంటి వారికి అంత సులభమైన విషయంకాదని వేరే చెప్పనవసరం లేదు. కానీ ఈ ప్రపంచంలో సుఖదుఃఖాలు, నిందాస్తుతులు, శుభాశుభాలు అత్యంత సహజమనే సత్యాన్ని నిరంతరం మననం చేయాలి. ఈ సత్యాన్ని మననం చేసినప్పుడే భగవానుడు సూచించిన మునిగా పరివర్తన చెందుతాం.

మనకు ఏదైనా శుభం చేకూరితే భగవంతుని అనుగ్రహంగా భావిస్తాం. అశుభం కలిగితే మాత్రం భగవంతుణ్ణి నిందిస్తాం. కానీ అశుభాలను కూడా భగవంతుని అనుగ్రహంగా భావించిన మహాత్ములు ఎందరో ఉన్నారు. అలాంటివారిలో సూఫీయోగిని రబియా జీవితం ఎంతో స్ఫూర్తిదాయకం.

రబియా ఓ పూరి గుడిసెలో నివసిస్తుండేది. ఒకరోజు రాత్రి తినడానికి ఏమీ లేనందువల్ల నీళ్ళుతాగి నిద్రపోదామని అనుకొంది. ఇంతలో జోరుగా గాలివీయడంతో దీపం ఆరిపోయింది. ఆ చీకటిలో చేయి తగిలి నీళ్ళకుండ కిందపడి పగిలిపోయింది. ఆ రాత్రి ఆకలితో అలా నిద్రపోతుండగా పెనుగాలి తాకిడికి గుడిసె పైకప్పు ఎగిరిపోయింది. భోరున వర్షం కురుస్తుంది.

అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో మనమే ఉంటే ఎంత దుఃఖిస్తామో, భగవంతుణ్ణి ఎంత నిందిస్తామో కదా! మనలాగే రబియా కూడా కలతచెంది, తనకు కలిగిన కష్టాలకు భగవంతుణ్ణి నిందించి ఉంటే వందల సంవత్సరాల తరువాత కూడా ఆమెను స్మరించుకునే వాళ్ళం కాము. ఇంతకీ, రబియా భగవంతుణ్ణి ఏమని ప్రార్థించింది? "ఓ భగవంతుడా! తినడానికి ఏమీ లేకుండా చేసావు. వెలుగుతున్న దీపాన్ని ఆర్పేసి చీకటిలో అలమటించేలా చేసావు. నీళ్ళకుండను పగిలిపోయేలా చేసి, కనీసం దాహాన్ని కూడా తీర్చుకోకుండా చేసావు. నేను కష్టాలను అనుభవించడం నీ అభీష్టమైతే అలాగే చేయు స్వామీ! నీడనిచ్చే గుడిసెను కూడా ఎగరేసుకు పోయి, దేనిపట్లా బంధాన్ని ఏర్పరచు కోకూడదని గుర్తుచేసావా తండ్రీ!" అని ప్రార్థించింది.

> **మనిషి తనలోని అహంకారాన్నీ, మమకారాన్నీ ఎంత తగ్గించుకుంటే భగవంతుని పట్ల శరణాగతి భావం అంత అధికమవుతుంది.**

రబియా ప్రార్థనా విధానాన్ని మనం కూడా ఏ కొంచెమైనా అభ్యసించగలిగితే శుభాశుభాలూ ఆ భగవంతుని సంకల్పానుసారమే సంభవిస్తున్నాయనీ; మనం ఏర్పరచుకున్న ప్రాపంచిక బంధాలను త్రుంచివేస్తున్నాడనీ గ్రహించగలుగుతాం. అలాంటి స్థితికి చేరుకున్నప్పుడు సుఖాలలో ఉత్తేజంగానీ, దుఃఖాలలో ఉద్వేగంగానీ కలుగవు. రాగభయక్రోధాలు తలెత్తవు. దేనియందూ తీవ్రమైన మమకారం ఏర్పడదు.

అందుకే ఒక యోగి "The more a man dies to himself, the more he begins to live in God - మనిషి తనలోని అహంకారాన్ని ఎంత తగ్గించుకుంటే అంత ఎక్కువ భగవంతునితో జీవిస్తాడు" అంటాడు. అందువల్ల మనం ఇప్పుడు చేయాల్సిన సాధన నిరంతరం భగవచ్చింతనలో జీవించడాన్ని అలవరచుకోవడమే! అలాంటి సాధకుడే నిజమైన ముని!! ❖

మనిషికి కోపం ఉంటే శత్రువులు అక్కర్లేదు. దుర్మార్గులతో స్నేహం ఉంటే విష జంతువులు అక్కర్లేదు. ఓర్పు ఉంటే ఏ కవచమూ అక్కర్లేదు. మంచి మిత్రులుంటే ఔషధం అక్కర్లేదు. *- భర్తృహరి*

అసామాన్య త్యాగశీలి

చిత్ర కథ : రాజమాత   చిత్రాలు : శంకర్   అనుసృజన : స్వామి జ్ఞానదానంద

1

అది 19వ శతాబ్దపు ఉత్తరార్ధం. శివగంగ రాజ్యాన్ని పాలిస్తున్న పెద్ద మరుదు, ఆయన తమ్ముడు చిన్న మరుదు ఇద్దరూ దైవభక్తిలోనూ, దేశభక్తిలోనూ సాటిలేనివారు. కాళయార్ శివాలయ ధర్మకర్తలుగా వారు వ్యవహరించేవారు.








5
వచ్చే పౌర్ణమి తిథి ఆ రథయాత్రకు దివ్యంగా ఉంది, రాజా!
తమ్ముడూ! మన ఆచారిగారు చెప్పినట్లే తొలిపరీక్షార్థ రథయాత్రకు తగిన ఏర్పాట్లు చెయ్యి.
6
పరీక్షార్థ రథయాత్ర రోజు.
రాజా! ఈ రథయాత్ర సమయంలో రథంలో రాజు ఎక్కి ఊరేగింపుగా రావడం సంప్రదాయం. మీరు రథాన్ని అధిరోహించండి.
ఎవరూ ఊహించని రీతిలో, అందరూ విభ్రమం చెందే విధంగా ఆచారి, రాజును సమీపించి...
7
రాజా! ఒక విన్నపం. ఈ పరీక్షార్థ రథయాత్ర సమయంలో తాత్కాలికంగా నన్ను రాజుగా ప్రకటించి రథంలో ఊరేగి రావడానికి అనుమతించండి.
ఆచారిగారూ, ఇదేం కోరిక! రాజుగారి స్థానంలో మీరా?
8
కుప్పముత్తు ఆచారికి ఇలాంటి దురాశా...?
ఆచారి రథంలో ఎక్కి రాజుగారి స్థానంలో కూర్చోవడమా? ఇది అమర్యాద, అవమానకరం.
రాజుగారే రథంలో రావాలి.
9
ఆచారిగారి కోర్కెకు వెనుక ఏదో కారణం ఉంటుంది. ఆయన కోరిక మేరకే చేద్దాం. రథం బయల్దేరి ఆలయం వద్దకు వచ్చే వరకు ఆచారిగారిని రాజుగా ప్రకటిస్తున్నాను.

10

రథం వీథుల్లో ఊరేగుతూ వస్తూ ఆలయం వద్ద ఆగుతున్నప్పుడు హఠాత్తుగా కుప్పముత్తు ఆచారి రథం నుండి కింద పడ్డాడు. ఆయన మీద నుండి రథ చక్రాలు వెళ్ళాయి.





ఎవడి హృదయం పరిపూర్ణ వికాసం పొంది సమత్వం కలిగి ఉంటుందో అతడే నిజంగా ధన్యాత్ముడు. అలాంటి వ్యక్తి ఎక్కడున్నా, ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా ప్రశంసార్హంగా వర్తిస్తాడు. అతడు దైవం పట్ల వినిర్మల భక్తివిశ్వాసపూర్ణుడై ఉంటాడు. అతడు కర్మలను అత్యంత దక్షతతో నిర్వహిస్తాడు. బంధుమిత్రుల పట్ల ప్రేమానురాగాలతో మెలగుతాడు. పరోపకారానికి సదా సంసిద్ధుడై ఉంటాడు.

– భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస



వికాస మంత్రాలు



- స్వామి పార్థసఖానంద

మనకున్న అన్ని దుర్గుణాల్లోనూ అహంకారాన్ని వదిలించుకోవడం చాలా కష్టం. ఒకవేళ దాన్ని చంపేసినా, నేను గొప్ప నిరహంకారిని అని విర్రవీగే అవకాశం ఉంది!



జీవితంలో ఎవరైనా చేయదగ్గ గొప్ప పని.. ఏదైనా సాధించడం. అది వీలు కాకపోయినా ఫరవాలేదు. చాలా మంది వల్ల కాని ఇంకో గొప్ప పని ఉంది. అది... 'కష్టపడి ఏదైనా సాధించిన వారిని మనస్ఫూర్తిగా అభినందించడం'

అదృష్ట దేవత అనూహ్యమైంది. దానికై నోరెళ్ళ బెట్టుకుని ఎదురు చూసే వారు ఆమెకి నచ్చరు.కానీ ఆమెను అసలు పట్టించుకోకుండా తమ పనిలో తాము మునిగిపోయిన వారంటే ఆమెకు అత్యంత ఇష్టం. సహజంగా ఆమె వారినే వరిస్తుంది.

నవ్వు నాలుగు విధాల చేటా?, పరి పరి విధాల మేలా? ఈ విషయాన్ని పక్కన పెడితే, నవ్వు తెప్పించే మంచి సామెత మరోటుంది... నవ్వు నవ్వించు, కానీ నవ్వుల పాలు కాకుండా జీవించు!

నేటి యువతీ యువకులు వారి ఆరోగ్యాన్ని, అందాన్ని కాపాడుకోవడానికి ఏమైనా చేస్తారు... తొందరగా పడుకుని, ఉదయమే లేవడం, వ్యాయామం చేయడం, నియంత్రణతో జీవించడం తప్ప!

వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ వార్షికోత్సవాలు

హైదరాబాద్ రామకృష్ణ మఠం అనుబంధ సంస్థ 'వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్' పదహారు సంవత్సరాలు పూర్తిచేసుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని 2015 సెప్టెంబర్ 10వ తేదీ నుండి 13వ తేదీ వరకు యువజన సమ్మేళనాలను నిర్వహించింది.

ఈ నాలుగు రోజులపాటు జరిగిన వార్షికోత్సవాల్లో ఇస్రో చైర్మన్ డాక్టర్ ఏ.ఎస్.కిరణ్ కుమార్, బెంగుళూరు; ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ టి.జి.కె.మూర్తి, బెంగుళూరు; హైదరాబాద్ మెట్రో మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ఎన్.వి.ఎస్.రెడ్డి; శ్రీమతి పూనమ్ మాలకొండయ్య ఐ.ఏ.ఎస్; శ్రీసాయి ప్రసాద్ విశ్వనాథన్, హైదరాబాద్; శ్రీ వి. శ్రీనివాస్, ముంబై; హైదరాబాద్ రామకృష్ణ మఠాధ్యక్షులు స్వామి జ్ఞానదానందజీ; కోయంబత్తూర్ రామకృష్ణ మిషన్ విద్యాలయ కార్యదర్శి స్వామి అభిరామానందజీ; హ్యూమన్ ఎక్సలెన్స్ సంచాలకులు స్వామి బోధమయానందజీ పాల్గొని ప్రసంగించారు.

ఈ సదస్సుల్లో పాల్గొన్న 4,000 మంది విద్యార్థినీ విద్యార్థులకు స్వామి వివేకానంద సాహిత్యాన్ని ఉచితంగా పంపిణీ చేశారు. స్వామి వివేకానంద జీవితం - సందేశంపై యువజాగృతి వేదిక విద్యార్థులు, బాలవికాస కేంద్ర విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ❖

విద్యార్థుల వికాసానికి 'వివేక వాహిని'

విజయవాడ రామకృష్ణ మిషన్ 2015 ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ఒంగోలు, చీరాల, కావలి, మాచర్ల, రెంటచింతల, నెల్లూరు, యెండగండి, భీమవరం, సూర్యాపేట శ్రీరామకృష్ణ సేవా సమితుల ఆధ్వర్యంలో ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, పశ్చిమ గోదావరి, నల్గొండ జిల్లాల్లోని 54 విద్యాసంస్థల్లో వ్యక్తిత్వవికాస సదస్సులను నిర్వహించింది. ఈ సదస్సుల్లో స్వామి స్వసంవేద్యానంద, స్వామి సేవ్యానంద, స్వామి సన్నివాసానంద పాల్గొని విద్యార్థులకు స్ఫూర్తిదాయక సందేశాలను ఇచ్చారు.

ఈ సదస్సుల్లో సుమారు 18,000 మంది విద్యార్థులు పాల్గొని 1,45,000 రూపాయల విలువ చేసే శ్రీరామకృష్ణ-వివేకానంద సాహిత్య గ్రంథాలను కొనుగోలు చేసారు. 1,42,000 రూపాయల విలువ చేసే స్వామి వివేకానంద సాహిత్యం, లామినేషన్ చిత్రాలను విద్యార్థులకు మరియు విద్యాసంస్థలకు ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమాలలో భాగంగా స్వామి వివేకానంద జీవిత సందేశాలను బోధించే 'చలనచిత్రం' ప్రదర్శించడం జరిగింది. నివేదిక : స్వామి సేవ్యానంద

గమనిక: విజయవాడ రామకృష్ణ మిషన్, **2015 నవంబర్ 13,14,15వ తేదీల్లో** విద్యార్థుల సదస్సు, యువజన సదస్సు, ఉపాధ్యాయుల సదస్సులను నిర్వహించనున్నది. పూర్తి వివరాలకు 0866-2570799, 08645-272248,272656 ఫోన్ నంబర్లలో సంప్రతించండి.

Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust
and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020
and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**

రామకృష్ణ - వివేకానంద భావ ప్రచార పరిషత్

24వ వార్షిక భక్త సమ్మేళనం, సత్తుపల్లి, (ఖమ్మం జిల్లా) తేదీలు: 2016 జనవరి 8,9,10

సమ్మేళన ప్రాంగణం : శ్రీవేంకటేశ్వర (మలిరెడ్డి) ఫంక్షన్‌హాల్, సత్తుపల్లి

ఖమ్మం జిల్లాలోని శ్రీరామకృష్ణ సేవాసమితుల ఆధ్వర్యంలో రామకృష్ణ-వివేకానంద భావ ప్రచార పరిషత్ 24వ వార్షిక భక్త సమ్మేళనాన్ని **సత్తుపల్లిలో 2016 జనవరి 8,9,10** తేదీల్లో నిర్వహించనున్నది.

- ఈ భక్త సమ్మేళనంలో పాల్గొనే భక్తులు, వ్యక్తిగతంగా కానీ, సమితుల ద్వారా కానీ **రూ.200/-** ప్రతినిధి రుసుము చెల్లించవలెను. ఈ రుసుమును **1-12-2015** తేదీ లోగా **శ్రీరామకృష్ణ సేవాసమితి, సత్తుపల్లి** పేరున ఎమ్.ఓ/డి.డి.ల ద్వారా క్రింద సూచించిన చిరునామాకు పంపవలెను. గడువు తేదీ 1-12-2015 తర్వాత నమోదు చేసుకొనే భక్తులు ప్రతినిధి రుసుము రూ.300/- చెల్లించాలి.
- ప్రతినిధులకు భోజన, వసతి సౌకర్యాలు 2016 జనవరి 8వ తేదీ శుక్రవారం ఉదయం నుండి జనవరి 10వ తేదీ ఆదివారం సాయంత్రం వరకు ఏర్పాటు చేయబడును.
- ప్రతినిధులకు సాధారణ వసతి సౌకర్యములు మాత్రమే ఏర్పాటు చేయబడును. ప్రత్యేక సదుపాయాలు కావాల్సినవారు హోటల్ నందు గదులు స్వయముగా రిజర్వు చేసుకొనగలరు.
- ఈ బృహత్ కార్యక్రమానికి సుమారు రూ.20 లక్షలు వ్యయం అవుతుందని అంచనా. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి భక్తులు, శ్రేయోభిలాషులు, అభిమానులు యావన్మందీ పాల్గొని ధన, వస్తురూపేణ తమవంతు సహాయ సహకారములు అందించి భగవాన్ శ్రీరామకృష్ణుల కృపకు పాత్రులు కాగలరు.
- ఈ భక్తసమ్మేళనం సందర్భంగా ఒక స్మారక సంచికను విడుదల చేయనున్నాము. ఆ సంచికలో ప్రకటనలు ఇచ్చి ప్రోత్సహించాల్సిందిగా కోరుచున్నాము. ప్రకటన వివరాలతో కూడిన సి.డి.ని డాక్టర్ పన్నాల శ్యామసుందర మూర్తి, 13-3-20, గుంటూరువారి తోట, 2వ లేన్, గుంటూరు-522001 అనే చిరునామాకు పంపగలరు. (సెల్:9866175274, pannala.syam@gmail.com)

ప్రకటనల ట్యారిఫ్ వివరాలు :

	పూర్తి పేజీ	అర పేజీ	పావు పేజీ
కలర్	6,000	4,000	2,000
బ్లాక్ & వైట్	4,000	2,000	1,500
2,3 కవరు పేజీలు	15,000	-	-
4వ కవరు పేజీ	20,000	-	-

- పై కార్యక్రమాలకు విరాళములు, ప్రతినిధి రుసుములు, ప్రకటనల రుసుములను శ్రీరామకృష్ణ సేవాసమితి, సత్తుపల్లి పేరున ఎమ్.ఓ. / డి.డి.ల ద్వారా **శ్రీరామకృష్ణ సేవాసమితి, విద్యానగర్ రోడ్, సత్తుపల్లి - 507 303, ఖమ్మం జిల్లా** చిరునామాకు పంపవలెను. **చెక్కులు స్వీకరించబడవు.**
- విరాళాలను ఆన్‌లైన్ ద్వారా కూడా పంపవచ్చు. అకౌంట్ వివరాలు: **శ్రీరామకృష్ణ సేవాసమితి, సత్తుపల్లి అకౌంట్ నెం. 52136280259, ఎస్.బి.హెచ్, సత్తుపల్లి (IFSC - SBHY0020370).**

మీ అమూల్య సహాయ, సహకారములతో ఈ బృహత్తర కార్యక్రమమును విజయవంతం చేయ ప్రార్థన.

నిర్వాహక కార్యదర్శి
24వ వార్షిక భక్తసమ్మేళనం, సత్తుపల్లి

పూర్తి వివరాలకు:

శ్రీరామకృష్ణ సేవా సమితి, సత్తుపల్లి
సెల్ నంబర్లు: 94400 20237, 96660 09090, 99890 82478

Vol.72-11, Sri Ramakrishna Prabha (Telugu Monthly) November 2015, Regd. with the Registrar of Newspaper for India Under No.1120/57. Postal Registration No. HD-1071/2013-15. Licensed to Post Under WPP : AP/CPMG/HC-13/WPP/2015-16. Date of Publication : 16 October 2015

భాగీరథీ తీరాన భవతారిణి

రాణీరాస్మణి కాశీయాత్రకు వెళదామని అన్ని ఏర్పాట్లూ చేసుకుంది. యాత్రకు బయలుదేరే ముందురోజు రాత్రి జగజ్జనని ఆమెకు కలలో కనిపించి 'నువ్వు వారణాసి వెళ్ళనవసరం లేదు. గంగాతీరంలో మందిరాన్ని నిర్మించి, నా విగ్రహాన్ని ప్రతిష్ఠించు. ఆ విగ్రహంలో నేను నిరంతరం కొలువై ఉంటాను' అని చెప్పింది. వెంటనే రాస్మణి తన కాశీయాత్రను రద్దు చేసుకొని దక్షిణేశ్వరంలో గంగాతీరాన ఓ సుందర మందిరాన్ని నిర్మించింది.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం జరిపించడం కొంత ఆలస్యం కావడం వల్ల ఒకరోజు కాళీమాత రాస్మణికి కలలో కనిపించి 'నన్ను ఇలా ఎంతకాలం పెట్టెలో బంధించి ఉంచుతావు? శీఘ్రంగా ప్రతిష్ఠాపన చేయి' అని ఆదేశించింది. వెంటనే రాస్మణి వెళ్ళి పెట్టెను తెరచి చూడగా కాళీమాత విగ్రహం చెమటలతో తడిసిపోయి ఉంది. అప్పుడు రాస్మణి వెంటనే శుభ ముహూర్తాన్ని నిర్ణయించి 1855 మే 31వ తేదీన కాళీమాత విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని ఘనంగా జరిపించింది.

శ్రీరామకృష్ణులకు సుమారు ముప్ఫై ఏళ్ళపాటు సాధనాక్షేత్రంగా, లీలాక్షేత్రంగా విరాజిల్లిన ఆ మహాపుణ్య క్షేత్రమే కోల్‌కతాలోని 'దక్షిణేశ్వర కాళికాలయం'. శ్రీరామకృష్ణులచే ఆరాధనలు అందుకొని, ఆయనతో ముఖాముఖి సంభాషించి, ఎన్నో అద్భుత లీలల్ని ప్రదర్శించి నేటికీ సజీవమూర్తిగా ఆరాధనలందుకుంటున్న ఆ జగన్మాతయే 'భవతారిణీ కాళీమాత'.❖

(2015 నవంబర్ 10న 'కాళీపూజ')

With Best Compliments From

పక్యాల భాస్కర రావు, మేనేజింగ్ డైరక్టర్ & **పక్యాల గిరిజ,** డైరక్టర్

SVISS LABSS LIMITED

(Manufacturers of Active Pharmaceutical Ingredients and Intermediates)

Regd. Off. & Fact. : Plot No.88 & 89, Phase - II,
SIPCOT Industrial Complex, Ranipet - 632 403, Tamil Nadu.
Phone : 04172 - 244820, 651507, Tele Fax : 04172 - 244820
E-mail : rao@svisslabss.net Web Site : www.svisslabss.net

TÜV CERT DIN EN ISO 9001 : 2000 Certificate : 01 100 058568

SVISS LABSS కంపెనీ వారు 'శ్రీరామకృష్ణ ప్రభ' మాసపత్రికను 2,000 పాఠశాలలకు స్పాన్సర్ చేశారు.